ఆర్షవిద్యా తరంగాలు - 09

# ఛాందోగ్యోపనిషత్తు

## స్వామి పరమార్థానంద



తత్త్వమసి

స్వామి పరమార్థానంద బోధనల స్ఫూర్తితో

వారి ఆశీస్సులతో

తెలుగు సేత - మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ

First edition - Year 2019 1000 copies

For Copies
K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019

Mobile: 9849092368

Email: raghavkasturi@gmail.com
for softcopy www.telugubhakti.com

Title - CHANDOGYOPANISHAD

Sanskrit Support - Sri Desu Chaitanya Krishna

DTP - Smt. Syamala Sripathi, 9966383661

Printed at
Sai Sri Printers
8-3-945 # 21 Pancom Business Centre,
Ameerpet Hyderabad --500073
e-mail : saisriprinters@yahoo.com
Ph.No.040-23730222,Cell:9985530222

Price Rs. 300

# కృతజ్ఞతలు

**ఛాందోగ్యోపనిషత్తు** పుస్తక ప్రచురణ అనే ఈ బ్రహ్మయజ్ఞానికి
ఇతోధికంగా సహకరించిన వారు –

దయాసత్సంగ్ సభ్యులు
అపర్ణాసరోవర్ సభ్యులు
అపర్ణా సైబర్ కమ్యూన్ సీనియర్ సిటిజన్స్ వేదాంతాగ్రూప్
శ్రీ మూల్పూరి విష్ణు ప్రసాదు గారు
శ్రీ దంతులూరి శ్రీనివాసరాజు గారు
శ్రీమతి దేవరకొండ అరుణా యశోద గారు
శ్రీమతి శ్రీ స్నిగ్ధ, శ్రీ కుందన్ కుమార్ గార్లు
శ్రీ ప్రభాకర్ గారు
శ్రీ వి. ప్రకాశరావుగారు
శ్రీ మొగిలి వేంకట సుబ్బయ్య శెట్టి గారు
శ్రీమతి గంటి సుభద్ర గారు
శ్రీమతి టి కామేశ్వరి గారు
శ్రీమతి మీనాక్షి గారు
శ్రీమతి యమున గారు
శ్రీమతి గంగాయమ్మ గారు
శ్రీమతి సాయిలక్ష్మి గారు
శ్రీమతి నరసమ్మ గారు

శ్రీమతి చలసాని రాజ్యలక్ష్మి గారు మరియు శ్రీమతి కావలిపురపు సూర్యకుమారి గారు అద్వైత వేదాంత తరగతుల నిర్వహణ వారి గృహములలో జరిగే సదుపాయాన్ని కల్పించారు.

వీరందరికి జ్ఞానప్రాప్తి, బ్రహ్మనిష్ఠ కలగాలని ఈశ్వరుని వేడుకుంటున్నాము.

– రాఘవరావు, రాజ్యశ్రీ

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | కృతజ్ఞతలు | 03 |
| 2. | ఉపదేశవాక్యం | 05 |
| 3. | జీవిత పరమార్థం బోధించే పరమార్థానంద స్వామి | 07 |
| 4. | ఇదేమన్నా బ్రహ్మవిద్యా? | 09 |
| 5. | దయాసత్సంగ్ సభ్యుల స్పందన | 12 |
| 6. | ఛాందోగ్యోపనిషత్తు ఉపోద్ఘాతం | 15 |
| 7. | శాంతి పాఠం | 17 |
| 8. | అధ్యాయం - 1 | 19 |
| 9. | అధ్యాయం - 2 | 66 |
| 10. | అధ్యాయం - 3 | 94 |
| 11. | అధ్యాయం - 4 | 139 |
| 12. | అధ్యాయం - 5 | 173 |
| 13. | అధ్యాయం - 6 | 215 |
| 14. | షడ్లింగ విచారణ | 317 |
| 15. | ప్రమాణం ప్రమాం జనయతి | 320 |
| 16. | అధ్యాయం - 7 | 323 |
| 17. | అధ్యాయం - 8 | 424 |
| 18. | అలవోకగా అద్వైతం | 540 |

# ఉపదేశవాక్యం

వేదాలకు చివరిభాగంలో, వానికి తలమానికముగా ఉన్నవి ఉపనిషత్తులు. నాలుగువేదాలకు చివరి భాగమున గల అనేక ఉపనిషత్తులలో 108 ముఖ్యమైనవి కాగా వానిలో అత్యంత ప్రధానమైనవి మొదటి పది ఉపనిషత్తులు. ఈ పది ఉపనిషత్తులలో ఇంకా ప్రధానమైనవి నాలుగువేదాలకు సంబంధించిన నాలుగు ఉపనిషత్తులు. ఈ నాలుగు ఉపనిషత్తులు నాలుగు మహా వాక్యాలను బోధిస్తున్నాయి.

సామవేదానికి సంబంధించిన ఛాందోగ్యోపనిషత్తులో ఉపదేశవాక్యముగా చెప్పబడే "తత్త్వమసి" అనే మహావాక్యాన్ని అరుణి అనే ఋషి తన కుమారుడైన 'శ్వేతకేతు' వుకి బోధించారు.

గురువులు తమ శిష్యులకు 'అదే నీవు అయి ఉన్నావు' (తత్ త్వమ్ అసి) అనే వాక్యాన్ని ఉపదేశ వాక్యముగా బోధిస్తారు. ఈ ఉపదేశవాక్యాన్ని బోధించే సామవేదసారమైన ఛాందోగ్యోపనిషత్తులో 8 అధ్యాయా లున్నాయి. అందులో మొదటి ఐదు అధ్యాయాలు ఉపాసనను ప్రధానముగా బోధించగా మిగిలిన అధ్యాయాలు వేదాంతాన్ని ప్రతిపాదించాయి.

స్వామి పరమార్థానందగారి బోధనలకు ప్రభావితులైన హైదరాబాదు నివాసి శ్రీ రాఘవరావు దంపతులు పెద్దదైన ఈ ఛాందోగ్యోపనిషత్తును మూలమంత్రముతో పాటు కొద్దిపాటి వ్యాఖ్యానముతో అచ్చువేస్తున్నందులకు అభినందనలు. స్వామి పరమార్థానందగారి పాదపద్మములకు ప్రణామములు.

ఈ పుస్తకాన్ని శ్రద్ధగా అచ్చువేయిస్తున్న దాతలమీద, అనువాదకులమీద ఛాందోగ్యోపనిషత్తులోని ఋషుల ఆశీర్వాదములు ఉండాలని తలంచుచున్నాను.

వేదాంతాన్ని శ్రవణం చేయాలంటేనే ఎంతో పుణ్యం ఉండి ఉండాలి. అటువంటిది శ్రవణం చేయడమే గాక ఆ ఉపనిషత్తు బోధనలకు ప్రభావితమై, ఆ జ్ఞానాన్ని మరికొంతమందికి అందించాలనే తపనతో పుస్తక ముద్రణకు ముందుకు వచ్చినందులకు శ్రీయుత రాఘవరావు, రాజ్యశ్రీ గార్లను హృదయ పూర్వకముగా అభినందిస్తున్నాను.

**స్వామి సత్యాత్మానంద,**
**చిన్మయమిషన్, ఒంగోలు.**

# జీవిత పరమార్థం బోధించే పరమార్థానంద స్వామి

**యద్యప్యస్మా ఇమామద్భిః పరిగృహీతాం ధనస్య పూర్ణాం**
**దద్యాదేతదేవ తతో భూయ ఇత్యేతదేవ తతో భూయ ఇతి॥**

**ఛాందోగ్యం 3-11-6**

శ్రద్ధలేని వ్యక్తి, ఒకవేళ చుట్టూ సముద్రం ఉండి, ధనంతో నిండి ఉన్న ఈ భూమండలాన్ని గురువుకు ఇచ్చినా, అతనికి బ్రహ్మవిద్యను బోధించకూడదు. ఎందుకంటే ఈ విద్యే దానికంటే గొప్పది.

ఇది శ్రద్ధలేని వ్యక్తి గురించి! శ్రద్ధ ఉన్నవాళ్ళు నేర్చుకోవాలంటే పరమార్థానంద స్వామీజీని మించిన గురువు మీకు ఎక్కడా దొరకరని నేను నొక్కివక్కాణించి చెపుతున్నాను. మేము ఉపనిషత్తులను బోధిస్తూ, వాటిని పుస్తకరూపంలో (ఇప్పటికి 9 వచ్చాయి) మీ ముందుకు తీసుకు రాగలుగుతున్నామంటే దానికి కారణం అనన్యగురువు, శ్రోత్రియ బ్రహ్మ నిష్ఠ అయిన **పరమార్థానంద స్వామీజీ** మాకు గురువుగా లభించటమే.

మావారూ, నేనూ గత 15 సంవత్సరాలుగా స్వామీజీ శిష్యులం. ఆయన బోధించిన భగవద్గీత,ఉపనిషత్తులు, ప్రకరణ గ్రంథాలు, బ్రహ్మసూత్రాలు, ఆయన చెప్పిన వరుసక్రమంలో విన్నాము; ఇద్దరమూ మూడు సత్సంగాలలో చెపుతున్నాము. మా వారు భగవద్గీత భాష్యం ఒకచోట, భగవద్గీత మూలం మరో చోట చెపుతున్నారు. ఆయన ఎందరో చెప్పిన భగవద్గీత ప్రసంగాలు విన్నారు కానీ ఈ గురువు చెప్పినంత క్రమపద్ధతిలో, ఒక క్లాసురూమ్ టీచింగ్‌లా ఏదీ లేదు. ఇది విని మీరు భగవద్గీత మీద పరీక్ష రాయవచ్చు.

స్వామీజీ చెన్నైలో అనేక ప్రాంతాల్లో ప్రతిరోజూ, పొద్దున్న, సాయంకాలం – ఉపనిషత్తులు, భగవద్గీత బోధిస్తూ ఉంటారు. అవన్నీ క్యాసెట్ల

రూపంలోను, ఆన్‌లైన్‌లోనూ దొరుకుతాయి. ఆయన గొప్పతనం ఏమిటంటే ఒక్కొక్క ఉపనిషత్తు రెండు,మూడుసార్లు చెప్పారు. ఆర్ష అవినాష్ బృందం ఆయన బోధించినవన్నిటికీ ఒక వెబ్‌సైట్‌లో అక్షర రూపం ఇచ్చారు. ఆయన బోధను యధాతథంగా దింపారు. క్లాసు 1,2,3 అంటూ. దానిపేరు http://arshaavinash.in వాళ్ళకు ఈ సందర్భంలో నా జోహార్లు.

మా దగ్గర స్వామీజీ చెప్పిన క్యాసెట్లు వేరే ఉన్నాయి. విషయం ఒక్కటే అయినా స్వామీజీ రెండింటిలోనూ అద్భుతంగా చెప్పారు. ఒకదానిమించి ఒకటి ఉన్నాయి. ఒకే ఉపనిషత్తు మీద రెండురకాలు బోధలు ఉన్నా కొత్తగా విన్నట్టే ఉంటుంది. ఇందులో కొన్ని అంశాలు హత్తుకుపోయేలా ఉంటే, రెండోదాంట్లో ఇంకొన్ని ముగ్ధులను చేస్తాయి. అసలు స్వామీజీ బోధను విన్న కొద్దీ వినాలనిపిస్తుంది. అంతకంతకూ ఆయన మీద ఆరాధనా భావం పెరిగిపోతుంది.

ఉదాహరణకు కార్యకారణ సంబంధం లాంటి కాన్సెప్టును కాని, ఆత్మను అనుభవించలేము అనే అంశాన్ని కాని ఎన్ని రకాలుగా చెపుతారో నేను చెప్పలేను. ఒక్కొక్క ఉపనిషత్తులో, ఒక్కొక్కసారి అదే అంశాన్ని అనేక కోణాల్లోంచి చెపుతారు – మనం ఎలా ఆనంద స్వరూపులమో, ఎలా శుద్ధ చైతన్యాన్ని అనుభవించలేమో, ఎలా కార్యమంతటా కారణం ఉందో. ఈ ఉపనిషత్తు ఆసాంతం చదివితే మీరే ఒప్పుకుంటారు స్వామీజీ ఎంత అద్భుతంగా చెప్పారో! అద్భుతం చాలా చిన్నమాట! ఇంతకన్నా ఇంకోపదం నాకు దొరకటం లేదు. నిజంగా స్వామీజీ ప్రతిభను ఏమని పొగడను?

**నమో నమః శ్రీ గురుపాదుకాభ్యామ్**

**మద్దూరి రాజ్యశ్రీ**

# ఇదేమన్నా బ్రహ్మవిద్యా?

**ఇదేమన్నా బ్రహ్మవిద్యా?** ఈ నానుడి మనలో బాగా ఉంది. ఎవరన్నా ఏదన్నా నేర్చుకోవటం కష్టంగా ఉంది అంటే, ఇదేమన్నా బ్రహ్మవిద్య అంత కష్టమా, దీన్ని తేలిగ్గా తెలుసుకోవచ్చు అంటారు.

కాని నన్నడిగితే బ్రహ్మవిద్యే తేలిగ్గా తెలుసుకోవచ్చు. అదేదో కష్టమనే భయాన్ని,మనకు అది వంటపట్టనంత ఎత్తులో ఉందనే అపోహను చిన్నప్పటి నుంచి మనలో నూరిపోశారు. కాని అది సత్యదూరం.

ఉపనిషత్తు తనంతట తాను తన జ్ఞానాన్ని మనకు రుద్దదు. కాని **'మే ఐ హెల్ప్ యూ?'** అనే బోర్డు పుచ్చుకుని ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. మనం ఇష్టపడితే మనం ఉన్నస్థాయికి అది దిగివచ్చి, అక్కడ్నుంచి మనల్ని తట్టి లేపి, ఉన్నతశిఖరాలకు తీసుకువెళ్తుంది.

మామూలుగా, జీవితం అంటే మరణించేదాకా లేచామా, తిన్నామా, పడుకున్నామా అన్నట్టు ఉండకూడదు అంటాము. ఇవి మనకు చాలా సుపరిచితమైన పదాలు. ఈ నాలుగు పదాలనే తీసుకుని ఉపనిషత్తు వేదాంత సారాన్ని బోధించింది. ఎంత అద్భుతం! బ్రహ్మ అంటే ఏమిటో వీటిల్లోనే కాచి వడబోసింది. ఉపనిషత్తు తీసుకున్న పదాల వరుసక్రమం– పడుకున్నామా, తిన్నామా, త్రాగామా, మరణించామా! వాటికి వాడిన పదాలు **స్వపితి, అశనాయా, ఉదన్య, ప్రయత.** వీటిలో మొదటి మూడు పదాల గారడీతో ఒక మహావాక్యాన్ని చాలా చక్కగా వివరించింది.

**తత్త్వమసి – మహావాక్యం**

అంతేకాదు, ఆ మహావాక్యాన్ని మనకు తెలిసిన, మనం అనుభవిస్తున్న, మనం చూస్తున్న రోజువారీ ఉదాహరణలతో ఎనిమిదిసార్లు వివరించింది. ఉదాహరణకు ఉప్పు కణికెను నీటిలో వేస్తే అది నీటిలో కరిగిపోతుంది. అది కరిగిపోయాక కంటితో చూడలేము, స్పర్శతో తెలియదు. కాని రుచి చూస్తే తెలుస్తుంది. అలాగే బ్రహ్మ ప్రత్యక్ష ప్రమాణాలకు అందనంత మాత్రాన

లేడనేయకూడదు. బ్రహ్మను ఉపనిషత్తు అనే శాస్త్రం ద్వారానే తెలుసుకోగలము.

బ్రహ్మవిద్యకు ఛాందోగ్యోపనిషత్తు చాలా ముఖ్యమైనది. అందులోనూ ఆరవ అధ్యాయం ఇంకా ముఖ్యమైనది. అందులోనూ ఎనిమిదవ ఖండం మరీ మరీ ముఖ్యమైనది. ఎందుకంటే దానిలో **తత్త్వమసి** అనే గొప్ప మహావాక్యం ఉంది.

అందువల్ల చాలామంది ఛాందోగ్యోపనిషత్తును అధ్యయనం చేసినా సాధారణంగా 6,7,8 అధ్యాయాలనే అధ్యయనం చేస్తారు.

నేను కూడా ముందు మా సత్సంగ సభ్యులకు ఇవే చెపుదామనుకుని కూడా, మధ్యలోంచి ఎలా మొదలుపెడతాను, ముందు ఏం చెప్పిందో నేనైనా తెలుసుకుందామనుకుని మా గురువుగారైన పరమార్థానంద స్వామీజీ ప్రసంగం వినటం మొదలుపెట్టాను. 1-5 అధ్యాయాల్లో లెక్కలేనన్ని ఉపాసనలు ఉన్నాయి.

స్వతహాగా నేను ప్రకృతిని ఆరాధిస్తాను. సూర్యోదయం అంటే చాలా ఇష్టం. నేను మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ఎమ్మే ఇంగ్లీషు లిటరేచర్ చేశాను. ఆ కాలేజీ మెరీనాబీచ్ రోడ్డు మీద ఉంది. మా క్లాసునుంచి నున్నటి తారురోడ్డు, మెత్తటి ఇసుక, ఎగసిపడే అలలు, రంగురంగులుగా కనబడే సముద్రం, దానిపైన మేఘాలతో కూడిన ఆకాశం కనబడేవి. ఒక కన్నుతో ఆ సౌందర్యాన్ని ఆరాధిస్తూ రెండుచెవులతో వర్డ్స్‌వర్త్, కాలరిడ్జ్‌ల లాంటి కవులు ప్రకృతిని వర్ణించిన తీరుతెన్నులను ఆస్వాదిస్తూ ఉండేదాన్ని.

ఉపనిషత్తులకు రానంతవరకూ ప్రకృతి అందాలను చూసి మైమరచేదాన్ని, ఆరాధించేదాన్ని. కాని దాని విలువ నాకు తెలియదు.

**ఈశావాస్యమిదగ్ం సర్వం**

ఈ జగత్తంతా ఈశ్వరుడు నిండి ఉన్నాడు అని నేర్చుకుని ఎంతో ఆనందించాను. ఛాందోగ్యోపనిషత్తులో ప్రకృతిలోని ఏ ఒక్క అందాన్నీ వదలలేదు. ఇంకా అద్భుతం ఏమిటంటే, ఆ అందాలను ఆస్వాదించటం కాదు. వాటిమీద ఉపాసన చేయమంటుంది.

ఉదాహరణకు వర్షం మీద ఉపాసన(2-15)

పంచ విధ సామ ఉపాసనలు అనేకం వస్తాయి. అందులో వర్షం మీద ఉపాసన ఒకటి. దీన్ని **వైరూప సామఉపాసన** అంటారు. ఇది వర్షాన్ని ఐదు దశల్లో వర్ణిస్తుంది. 1. చెదురుమదురుగా ఏర్పడిన మేఘాలు 2. వర్షం కురవటానికి సిద్ధంగా ఉన్న మేఘాలు 3. కురుస్తున్నవాన; 4. ఉరుములు, మెరుపులు 5.వర్షం ఆగిపోవటం. ఈ ఐదు దశలను ఐదు ప్రతీకల మీద ఉపాసన చేయాలి. అది వింటే అమోఘం అనిపించింది. నా ఆనందాన్ని మా శిష్యులతో పంచుకోవాలని రెండు సత్సంగాలలోనూ మొదటి అధ్యాయం నుంచీ చెప్పటం ప్రారంభించాను.

మీరు నమ్మరు! ఇప్పుడు చెప్పిన ఈ వర్ణన చెప్పినరోజు,మేము కారులో ఇంటికి తిరిగివస్తుంటే (గంట ప్రయాణం) ఈ ఐదు దశలనూ చూశాము. మా శిష్యులు కూడా కొంతమంది చూశామన్నారు. ఈ ఆనందాన్ని నేను సత్యవ్రతానంద స్వామినితో ఉత్సాహంగా పంచుకుంటే అవిడ చెప్పారు, 'అవును, అలా జరుగుతుంది. అది ఋషుల ఆశీర్వచన. నేను చెప్పినప్పుడు కూడా అలాగే జరిగింది,' అన్నారు. ఋషులు ఆశీర్వదించారంటే మా జన్మ ధన్యమై పోయిందనుకున్నాను! అంతకన్నా అద్భుతం ఇంకేం జరగాలి?

**నమః పరమ ఋషిభ్యోనమః పరమ ఋషిభ్యః**

**మద్దూరి రాజ్యశ్రీ**

ఈ సందర్భంలో కొన్ని విషయాలు చెప్పాలి -

వేదాంతం సులువుగా అర్థమవటానికి సరళమైన భాషలో రాయటం జరిగింది. కొన్ని చోట్ల పదాలకు నిఘంటువులో అర్థం కాకుండా లక్ష్యార్థం వస్తుంది. అధ్యాయాలు 6 నుంచి 8 వరుకు మంత్రాలను విడమర్చి చెప్పటం జరిగింది.

# దయాసత్సంగ్ సభ్యుల స్పందన

**సదాశివ సమారంభం శంకరాచార్య మధ్యమాం।**
**అస్మదాచార్య పర్యంతం, వందే గురుపరంపరాం ॥**
**హరిః ఓం శ్రీ గురుభ్యోనమః హరిః ఓమ్**

మా గురువులైన శ్రీ కస్తూరి రాఘవరావు గారు, శ్రీమతి రాజ్యశ్రీ దంపతులకు దయాసత్సంగ్ సభ్యుల సాష్టాంగ దండప్రణామములు. మాలో ఒకరైన శ్రీ రాజ్యలక్ష్మి గారింట్లో మాకు జ్ఞానబోధను చేస్తూ **'మోక్షం సిద్ధవస్తువు, సాధ్య వస్తువు కాదు. మోక్షం ఇక్కడే, ఇప్పుడే,'** అంటూ మాకు తరచి తరచి బోధిస్తున్నారు. మేము ఏమీ తెలియనివారమైనా వీరి బోధనా పద్ధతి అంటే వీరు చెప్పే విధానం, వివరణ, అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు, చాలా సరళంగా, సమగ్రంగా ఉంది.

వీరు స్వామి విద్యాప్రకాశానందగిరి ఉపన్యాసాలు, స్వామి చిన్మయానంద గీతోపన్యాసాలు, కుందన్‌బాగ్‌లో ఉపనిషత్ క్లాసులు, స్వామి పరమార్థానందగారు బోధించిన ఉపనిషత్‌లు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలు పది సంవత్సరాలు అధ్యయనం చేశారు. స్వామిని ఆత్మలీనానంద సరస్వతి గారి వద్ద ఐతరేయం,బృహదారణ్యం, బ్రహ్మసూత్రాలు, చతుస్సూత్రి శ్రవణం చేశారు. ఋషికేశ్‌లో పూజ్య స్వామి దయానంద సరస్వతీ వారి వేదాంత ప్రసంగాలు శ్రవణం చేసేవారు. పరమార్థానందస్వామీజీ వీరికి మూల గురువర్యులు.

మా పూర్వ పుణ్యఫలమో అనునట్లు మాకు ఈ సత్సంగం, చాలా అరుదైన గురువులు లభించటం మా అదృష్టం.

మాకు సత్సంగం అంటే ఏమిటో, దానివలన ప్రయోజనం ఏమిటో తెలిపినది ప్రప్రథమంగా **'రమామణి'** అమ్మగారు. వారు పూజ్యశ్రీ దయానంద సరస్వతీ స్వామి వారి వద్ద 15 సం॥లు అకుంఠిత దీక్షతో భగవద్గీత,

ఉపనిషత్తులు, వివేకచూడామణి, అపరోక్షానుభూతి, దృగ్ద ృశ్య వివేకము, దశశ్లోకీ మొదలైన క్లాసులకు వెళ్ళి అధ్యయనం చేశారు. వారు ఉన్నంతవరకు నిర్విరామ కృషి చేస్తూ, మాకు బోధ చేస్తూ మా అందరిలో బీజం నాటారు. అనంతరం బీజం సజీవంగా ఉంటూ ఫలపుష్ప భరితమై సుగంధాలనిచ్చేలా మమ్మల్ని తీర్చిదిద్దడానికి మా అదృష్టఫలంగా 5 సం॥ల నుండి శ్రీ రాఘవరావు గారు, శ్రీమతి రాజ్యశ్రీ దంపతులు నిరంతరాయంగా ఉపనిషత్తులు, భగవద్గీత చాలా సరళంగా, సమగ్రంగా వివరిస్తూ బోధ చేస్తున్నారు. నోట్సులు టైపు చేయించి, ఉపనిషత్తులు ప్రచురించి ఇస్తున్నారు. మాకు 9 ఉపనిషత్తులు, తత్త్వబోధ, పురుషసూక్తం, రుద్రం, శ్రీసూక్తం, దక్షిణామూర్తి స్తోత్రం, దృక్‌దృశ్య వివేకం, అపరోక్షానుభూతి బోధించారు. ఇప్పుడు ఛాందోగ్యోపనిషత్తు పుస్తకరూపంలో అందచేస్తున్నారు.

## ఛాందోగ్యోపనిషత్తు

సనాతన ధర్మానికి వేదములు మూలము. అవి 1. ఋగ్వేదము. 2. యజుర్వేదము 3. సామవేదము 4. అథర్వణవేదము. వేదముల సారమే వేదాంతములగు ఉపనిషత్తులు. ఉపనిషత్తులన్నింటిలో 10 ఉపనిషత్తులకు శ్రీ శంకరాచార్యులు భాష్యం వ్రాశారు. అవి

**ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః**
**ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా ॥**

ఉపనిషత్తులు గురుశిష్యుల సంవాద రూపంలో ఉంటాయి. వీటిలో 9వది ఛాందోగ్యోపనిషత్తు. సామవేదములోనిది. ఛాందోగాః అంటే సామవేదం గానం చేసే మహర్షులు. ఋగ్వేదం, యజుర్వేదం పఠిస్తారు. సామవేదం గానం చేస్తారు. ఉపనిషత్తులలో ఛాందోగ్యము, బృహదారణ్యకమూ పరిమాణంలోనే కాక గుణంలో కూడా చాలా గొప్పవి. ఈ రెండు ఉపనిషత్తులకీ సారభూతమైన రెండు మహావాక్యాలు ఉన్నాయి. అవి **1. తత్త్వమసి 2. అహం బ్రహ్మాస్మి.** ఇందులో తత్త్వమసి ఉపదేశవాక్యము. అహంబ్రహ్మాస్మి అనుభవవాక్యము.

ఛాందోగ్యోపనిషత్తులో 8 అధ్యాయాలు, వాటిలో అనేక ఖండాలు ఉన్నాయి.

| | | |
|---|---|---|
| 1–5 అధ్యాయాలు | – | ఉపాసనలు |
| 6–8 అధ్యాయాలు | – | వేదాంత బోధ |
| 6వ అధ్యాయం | – | తత్త్వమసి మహావాక్యం |

అందువలన 6వ అధ్యాయంను **తద్విద్యా అధ్యాయము** అంటారు. ఉపనిషత్తు ఉద్దేశ్యం ఆత్మజ్ఞానం బోధించుట. కాని ఇందులో 5 అధ్యాయాలు ఉపాసనలు. అవి బ్రహ్మవిద్యకు సోపానాలు. చివరి 3 అధ్యాయాలలో దానికి లక్ష్యమైన ఆత్మజ్ఞానం చెప్పబడింది.

ఉద్దాలకుడనే మహర్షి తన కుమారుడు శ్వేతకేతుకు చేసిన ఉపదేశమే 'తత్త్వమసి' మహావాక్యం. 8 సార్లు మనలో ఏర్పడే 8 సందేహాలను తొలగిస్తూ అన్ని మార్లూ **"తత్త్వమసి శ్వేతకేతో"** అని ఉపదేశిస్తాడు తండ్రి. అంటే అది నీవేనని, నీవంటే జీవుడు, అది అంటే బ్రహ్మం. ఈ జీవుడు దేవుడిలా పరిపూర్ణుడే కాని, జగత్తులాగా అచేతనుడు కాడు. జీవుడే ఉపదేశానికి అధికారి. అందువలన శ్వేతకేతుని నెపంగా చేసుకుని మనలాంటి జీవకోటికి బ్రహ్మవిద్యను చాటి చెబుతున్నది ఉపనిషత్తు. ఇది 6వ అధ్యాయంలో చెప్పబడింది. 7వ అధ్యాయం కూడా బ్రహ్మవిద్య గురించి చెబుతుంది. సనత్‌కుమారుడు గురువు. నారద మహర్షి శిష్యుడు. నామం నుంచి ప్రాణం వరకు 15 ఉపాసనలు, ప్రాణం కన్నా సత్యమైనది ఆత్మ అని చెబుతాడు.

చివరిదైన 8వ అధ్యాయం ఇంద్రప్రజాపతి సంవాద ప్రక్రియ. అన్ని విధాలుగా వర్ణించుట వలన తత్త్వమసి వాక్యార్థం సాధకుడి చిత్తంలో హత్తుకుపోతుంది. ఇది మహావాక్యమూ, అవాంతర వాక్యమూ అనే ద్వివిధ ప్రక్రియతో సాధించుట ఈ ఛాందోగ్యోపనిషత్తు విశిష్టత.

ఈ అమూల్యమైన, విశిష్టమైన జ్ఞానబోధ (ఆత్మవిద్య) వివరణను మరింత మందికి బోధ చేసే శక్తిని, ఆయురారోగ్య ఐశ్వర్యములను మా గురువులిద్దరికీ ప్రసాదించాలని ఆ పరమేశ్వరుని పార్థిస్తున్నాము.

**గంటి సుభద్ర**

**దయా సత్సంగ్ సభ్యుల తరుపున**

# ॥ ఛాందోగ్యోపనిషత్తు ॥

## ఉపోద్ఘాతం

**ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః।**
**ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా॥**

శంకరాచార్యుల వారు ముఖ్యంగా ఈ పది ఉపనిషత్తులకూ భాష్యం రాశారు. వీటిల్లో ఒకటి ఛాందోగ్యోపనిషత్తు.

ఛాందోగ్యోపనిషత్తును ఎందుకు అధ్యయనం చేయాలి?

1. తత్త్వమసి అనే మహావాక్యం ఛాందోగ్య ఉపనిషత్తుకు చెందినది.
2. బ్రహ్మసూత్రాల్లో అనేక సందర్భాలలో ఛాందోగ్య ఉపనిషత్తు మంత్రాలను విశ్లేషించారు వేదవ్యాసులు. బ్రహ్మసూత్రాలు అర్థం కావాలంటే ఛాందోగ్యం తెలిసి ఉండాలి. బ్రహ్మసూత్రాలంటే ఉపనిషత్తులలో ఉన్న వాక్యాలను విశ్లేషించేవి.
3. శంకరాచార్యులు తన భాష్యాలలో అనేకచోట్ల ఛాందోగ్య మంత్రాలను తరచు పేర్కొన్నారు.

**ఉపనిషత్తు:-** ఉపనిషత్తుకు అనేక పేర్లు ఉన్నాయి. ఆత్మవిద్య, బ్రహ్మవిద్య, వేదాంతం, జ్ఞానకాండ. ఉప ని అంటే ఆత్మవిద్య లేదా బ్రహ్మవిద్య. షద్ అంటే సంసారాన్ని నాశనం చేసేది. సంసారం అంటే జీవితంలోని సమస్యలు. ఉపనిషత్తు అంటే బ్రహ్మజ్ఞానం వల్ల సంసారమనే దుఃఖాన్ని నాశనం చేసేది. వేద అంతభాగంలో వస్తుంది కాబట్టి వేదాంతం అంటారు. ఆత్మ గురించి, బ్రహ్మ గురించి చెపుతుంది కాబట్టి ఆత్మ విద్య, బ్రహ్మ విద్య అంటారు. అజ్ఞాన నివృత్తి చేస్తుంది కనుక జ్ఞానకాండ అంటారు. ఇందులో కర్మ, ఉపాసనలు లేవు. కేవలం జ్ఞానం.

**ఛాందోగ్య-** ఈ పదం **ఛందోగః** నుంచి వచ్చింది. ఛందస్‌కి అనేక అర్థాలున్నాయి. అవి - వేదం, వేదమంత్రాలు, ఛందస్సు కూడా.

**యశ్ఛందసామృషభో విశ్వరూపః ఛందోభ్యో అమృతాస్సంభభూవ**

శ్రోత్రియుడంటే ఛందస్సు అధ్యయనం చేసినవాడు. ఇక్కడ ఛంద

అంటే వేదం. అందువల్ల శ్రోత్రియుడంటే వేదాధ్యయనం చేసినవాడు.

ఛందోగః లో గః అంటే గానం చేసేవాడు. **ఛందః గాయతి ఇతి ఛందోగః** వేదాన్ని పాడేవాడు. సామవేది ఒక్కడే వేదాన్ని పాడతాడు. అందువల్ల ఛందోగః అంటే సామవేది. సామవేదానికి చెందిన వ్యక్తి. ఋగ్వేదంలో పాడరు. దాన్ని పఠిస్తారు. అలాగే యజుర్వేదాన్ని పఠిస్తారు. కాని సామవేదాన్ని గానం చేస్తారు.

సామ అంటే సమభావం. సమత్వం అంటే శ్రుతి, భావ, రాగ, తాళాలలో సమత్వం ఉంటే దాన్ని సామ అంటారు. ఈ ఉపనిషత్తు సామవేదానికి సంబంధించినది. సామవేదం అంటే వేదం పేరు. సామవేది అంటే సామగానం చేసే వ్యక్తి, సామవేదం అధ్యయనం చేసినవాడు.

దశరథుని పుత్రుడు దాశరథి అయినట్టుగా ఛందోగానికి చెందినది కాబట్టి ఇది ఛాందోగ్య ఉపనిషత్తు అయింది.

# ॥ ఛాందోగ్యోపనిషత్తు ॥

## శాంతిపాఠం

ఒక్కొక్క వేదానికి ఒక్కొక్క శాంతిపాఠం ఉంటుంది. కేనోపనిషత్తు, ఛాందోగ్యోపనిషత్తు, సామవేదానికి చెందనవి. వాటి శాంతి పాఠము –

**ఓం ఆప్యాయన్తు మమాంగాని వాక్ప్రాణశ్చక్షుః శ్రోత్రమథో బలమింద్రియాణి చ సర్వాణి। సర్వం బ్రహ్మోపనిషదం మాऽహం బ్రహ్మ నిరాకుర్యాం। మా మా బ్రహ్మ నిరాకరోదనిరాకరణమస్త్వనిరాకరణం మేऽస్తు। తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సన్తు తే మయి సన్తు॥**

**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

వేదాంత పఠనం దిగ్విజయంగా సాగటానికి దైవానుగ్రహం కోసం గురు శిష్యులు చేసే ప్రార్థన ఇది.

ఇందులో శిష్యుడు మూడు అంశాలు కోరుతున్నాడు.

**1. కార్యకరణ సంఘాత యోగ్యతాసిద్ధి –** స్థూల, సూక్ష్మ శరీరాల ఆరోగ్యం బాగుండాలి. కళ్లు, చెవులు, వాక్కు బాగా పనిచేయాలి. మనసు కుదురుగా ఉండాలి. బుద్ధి పదునుగా పని చేయాలి. మేధాశక్తి ఉండాలి.

**2. శ్రద్ధా సిద్ధి –** బ్రహ్మజ్ఞానం విలక్షణమైన జ్ఞానం. ఇది తక్కిన ప్రమాణాలకు అందదు. ప్రత్యక్ష ప్రమాణాలకు అందదు. అనుమాన ప్రమాణాలకు అందదు.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం।**
**తథాऽరసం నిత్యమగన్ధవచ్చయత్॥** **కఠ 1-3-15**

కంటితో చూడలేము. వాక్కుతో చెప్పలేము. అంటే అసలు అటువంటి బ్రహ్మ ఉన్నాడా లేదా అన్న అనుమానం వచ్చే ప్రమాదం ఉంది. బ్రహ్మను ఒక్క ఉపనిషత్తు ద్వారానే అర్థం చేసుకోగలము. అందుకని బ్రహ్మ అంత తేలిగ్గా అర్థం కాకపోయినా, ఉన్నాడా లేడా అన్న అనుమానం రాకుండా, జ్ఞానం కలిగేవరకూ నాకు ఉపనిషత్తు మీద, గురువు మీద, నీ మీద శ్రద్ధ ఉండేలా చేయి.

**తవ తత్త్వం న జానామి కీదృశోఽసి మహేశ్వర!**
**యాదృశోఽసి మహాదేవ తాదృశాయ నమో నమః**

ఎంత అద్భుతమైన శ్లోకం! 'ఓ దేవా! నువ్వు ఎవరో నాకు తెలియదు. నువ్వు, స్త్రీవో, పురుషుడవో కూడా తెలియదు. ఎక్కడుంటావో తెలియదు. నీ తత్త్వమసలే తెలియదు. నీ తత్త్వం నాకు తెలియకపోయినా ఫర్వాలేదు. నాకు నిన్ను నిరాకరించటం ఇష్టం లేదు. నీకు నా నమస్కారాలు. అనువైన సమయం ఆసన్నమైనప్పుడు నీ తత్త్వం తెలుసుకునేలా చేయి.' ఇదే అర్థం ఇందులో కూడా.

**3. సాధన చతుష్టయ సంపత్తి సిద్ధి –** శిష్యుని తర్వాతి ప్రార్థన తన అధికారిత్వం గురించి. ఉపనిషత్తుని నేర్చుకోవటానికి అతను సిద్ధంగా ఉన్నా, గురువు దొరికినా, తనకు అర్హత ఉందో లేదో! అందుకని శిష్యుడు ఆ భారం కూడా భగవానుని మీద వేశాడు. 'నాకు అవసరమైన అధికారిత్వం కూడా నువ్వే ఇవ్వు.' ఎంత అందమైన ప్రార్థన. సాధన చతుష్టయ సంపత్తి అంటే వివేకం, వైరాగ్యం, శమాది షట్క సంపత్తి, ముముక్షత్వం.

**శాంతిః శాంతిః శాంతిః –** మూడు రకాల విఘ్నాలు కలగకుండా ఉండేలా చేయమని ప్రార్థన. ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధిదైవికం – అంటే వరుసగా తనవల్ల కలిగే ఆటంకాలు, తోటివారి నుంచి కలిగే విఘ్నాలు, దైవం నుంచి వచ్చే వాన,తుఫానులాంటి ఆటంకాలు – ఉపనిషత్తు నేర్చుకునే కాసేపు కలుగకుండు గాక అని అర్థం.

# ॥ ఛాందోగ్యోపనిషత్తు ॥

# అధ్యాయం - 1

ఛాందోగ్యోపనిషత్తు తైత్తిరీయోపనిషత్తు కన్నా నాలుగు రెట్లు పెద్దది. ఇందులో ఎనిమిది అధ్యాయాలున్నాయి. ఒక్కొక్క అధ్యాయంలో అనేక ఖండాలున్నాయి.

1-5 అధ్యాయాలు కేవలం ఉపాసనల గురించినవి.

6-8 అధ్యాయాలలో వేదాంత బోధ వస్తుంది.

6 - **తత్త్వమసి** మహా వాక్యం వస్తుంది కాబట్టి దాన్ని **తద్విద్యా అధ్యాయం** అంటారు.

ఉపనిషత్తు యొక్క ప్రాథమిక ఉద్దేశం ఆత్మజ్ఞానం బోధించటం. మరి అలాంటప్పుడు ఛాందోగ్యంలో ఐదు అధ్యాయాలు ఉపాసనకు ఎందుకు కేటాయించబడ్డాయి? ఉపాసనలు బ్రహ్మవిద్య పొందటానికి తోడ్పడతాయి అంటారు శంకరాచార్యులు.

ఉపాసనకు **రెండు ఫలశ్రుతులు** ఉంటాయి.

**1. సకామ ఉపాసన -** ఉపాసనలను ఏదైనా కోరిక కోరి చేస్తే దాన్ని సకామ ఉపాసన అంటారు. సకామ ఉపాసనలో లౌకిక ఫలాలు, ఆరోగ్యం, పశు సంపద కలుగుతాయి.

**2. నిష్కామ ఉపాసన -** ఈ ఉపాసనలను ఏ కోరికా కోరకుండా కూడా చేయవచ్చు. దానిని నిష్కామ ఉపాసన అంటారు. నిష్కామంగా చేస్తే చిత్త సంస్కారం, చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత, చిత్త వైశాల్యం పెరుగుతాయి. రాగద్వేషాలను, కామక్రోధాలను పారద్రోలటానికి వీలవుతుంది. ఉపాసనను సహకారి సాధనలంటారు. బ్రహ్మవిద్య పొందటానికి అది సాక్షాత్ సాధనలోకి రాదు కాని, చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత పెంచి, ముముక్షుత్వానికి దోహదపడుతుంది.

తైత్తిరీయోపనిషత్తులో కూడా శీక్షావల్లీలోనూ, భృగువల్లీలోనూ అనేక ఉపాసనలు వస్తాయి.

**ఉపాసనా విధానాలు –** ఉపాసనలు రెండు రకాలు. కర్మాంగ ఉపాసన, స్వతంత్ర ఉపాసన.

**1. కర్మాంగ ఉపాసన –** కర్మాంగ ఉపాసనలో కర్మ లేదా యజ్ఞాలు అంగి, ఉపాసన అంగం అవుతాయి. అంటే ఉపాసన కర్మలో ఒక భాగంగా వస్తుంది. స్వతంత్రంగా చేయలేము దీనిని. దీని వలన కలిగే ఫలమేమిటి? స్వతంత్రంగా చేయము కాబట్టి ఫలం ప్రత్యక్షంగా ఉండదు కాని కర్మతో కలిపి చేయటం వల్ల ఫలం అధికంగా ఉంటుంది. కేవల కర్మకొచ్చే ఫలం కన్నా కర్మ ఉపాసనల సముచ్చయం చేస్తే (కలిపితే) ఫలం అధికంగానూ, ఉన్నతంగానూ ఉంటుంది.

ఉదాహరణకు విష్ణు సహస్రనామ పారాయణం చేస్తే కొంత ఫలం వస్తుంది. దానిముందున్న ధ్యాన శ్లోకాన్ని ధ్యానం చేస్తే ఫలం అధికంగా ఉంటుంది.

**క్షీరోదన్వత్ప్రదేశే శుచిమణి విలసత్ సైకతే మౌక్తికానామ్**
**మాలాక్లుప్తాసనస్థః స్ఫటికమణినిభైర్మౌక్తికైర్మండితాంగః।**
**శుభ్రైరభ్రైరదభ్రైరుపరి విరచితైర్ ముక్తపీయూషవర్షైః।**
**ఆనన్దీ నః పునీయాదరినలిన గదాశంఖపాణిర్ముకున్దః॥**

మనం అది కూడా గడగడా చదివేస్తాము. అలా చదవకుండా, అందులో వర్ణించిన విష్ణురూపాన్ని మనసులో ధ్యానించుకుని ముందుకు సాగాలి.

**2. స్వతంత్ర ఉపాసన –** ఈ ఉపాసన కర్మకు భాగం కాదు. ఇది అంగీ ఉపాసన. స్వతంత్రంగా చేసే ఉపాసన. ఉపాసన చేయాలంటే మొదట్లో ఏకాగ్రత చూపటం కష్టం. మనసు ఎంతసేపూ బాహ్యంగా పరుగులు తీస్తుంది. దాన్ని అంతర్ముఖం చేయటానికి కొంత శ్రమ అవసరం. అందుకని శాస్త్రం ఉపాసనను ముందు కర్మాంగ ఉపాసనగా చెప్పి, క్రమేపీ స్వతంత్ర ఉపాసనకు రమ్మంటుంది.

అందుకే గృహస్థాశ్రమంలో కర్మకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. గృహస్థుకు బోలెడు బాధ్యతలు ఉంటాయి. వాటిని వెన్నంటి అనేక చింతలు ఉంటాయి. అందుకని పూర్తి ఏకాగ్రత కుదరదు. అదే వానప్రస్థ ఆశ్రమానికి వచ్చేసరికి బాధ్యతలు తగ్గుతాయి. అలాగే కర్మలు తగ్గుతాయి కాబట్టి ఉపాసనకు ఎక్కువ కాలం వెచ్చించవచ్చు. సన్యాసంలో కర్మ లేదు,

ఉపాసన లేదు. కేవలం జ్ఞానమే. మనం వానప్రస్థం, సన్యాసం నిజంగా స్వీకరించనవసరం లేదు. కాని కర్మాంగ ఉపాసనలుచేసి స్వతంత్ర ఉపాసనలు చేసేలా మానసికంగా ఎదగాలి. ఛాందోగ్యంలో మొదట్లో కర్మాంగ ఉపాసనల గురించి వస్తుంది.

**ఉపాసనా అంగాలు–** ఏ ఉపాసనకన్నా మూడు అంశాలు ఉండాలి.

1. ఉపాసకుడు– ధ్యానం చేసే వ్యక్తి.
2. ఉపాసనం – ధ్యానం చేసే వస్తువు.
3. ఆలంబనం – ధ్యానం చేయటానికి వాడే ప్రతీక.

ఈ ఆలంబనలు రెండు రకాలు. ఎ). సంపదఉపాసన, బి). అధ్యాస ఉపాసన.

**ఎ) సంపద ఉపాసన –** ఇందులో ఒక మామూలు వస్తువు మీద ఒక ఉన్నత తత్త్వాన్ని ఊహించుకోవటం. నికృష్ట వస్తువు మీద ఉత్కృష్ట బుద్ధి పెట్టటం– ఇక్కడ ఊహకు ప్రాధాన్యం ఇవ్వటం జరుగుతుంది.

ఉదాహరణకు పూజ చేసేటప్పుడు షోడశ ఉపచారాలు చేస్తాము. అందులో ఆభరణార్థం అక్షతాన్ సమర్పయామి అని అక్షతలు వేస్తాము. అప్పుడు అక్షతలను ఆభరణంగా చూడము. మెడలో వేయము. ఆభరణంగా ఊహిస్తాము అంతే. అలాగే మామూలుగా పెట్టే శ్రాద్ధాన్ని గయా శ్రాద్ధంగా ఊహించుకుంటాము. ఇది ఆరోపప్రధానం.

**బి) అధ్యాస ఉపాసన:–** దీన్నే ప్రతీక ఉపాసన అని కూడా అంటారు. ఇది అధిష్ఠాన ప్రధానంగా ఉంటుంది. ఒక ప్రతీక మీద ఒక దేవతను ఆవాహనం చేయటం. ఉదాహరణకు ఒక ఆలయంలో ఒక విగ్రహంలో ఒక దేవతామూర్తిని ఆవాహనం చేస్తాం. దేవతామూర్తిని విగ్రహంలో ప్రతిష్ఠించాక, ఇంక దాన్ని విగ్రహంగా చూడము. దేవతగానే అంటే చేతన తత్త్వంగానే చూస్తాము. ఆ విగ్రహాన్ని దైవంగా చూసి నైవేద్యం పెట్టటం, నిద్రపుచ్చటం, కళ్యాణం చేయటం వంటి అనేక సేవలు చేస్తాము. ఇక్కడ ప్రతీకనే దేవతగా చూస్తాము. ఇది అధ్యాస ప్రధానం.

ఛాందోగ్యంలో ప్రతీక ఉపాసనలే ఎక్కువగా ఉన్నాయి. ఆ ప్రతీక కూడా ఎక్కువగా వేదమంత్రాలే ఉన్నాయి. ఎందుకు? ఉపాసనకు వచ్చే ముందు బ్రహ్మచారి వేదాలను కంఠతా పడతాడు కాబట్టి అతను నిరంతరం

వేద మంత్రాలతో పెనవేసుకుని ఉంటాడు. ఇక్కడ ఛాందోగ్య ఉపనిషత్తు సామవేదానికి చెందింది కాబట్టి సామ మంత్రాలను ఆలంబనగా తీసుకుంది. ఇది అప్పటి కాలమాన పరిస్థితుల దృష్ట్యా చెప్పబడింది. సామ మంత్రంలోని అవయవాలను భక్తి అంటారు.

కొన్ని ఉపాసనలకు 5 అవయవాలను ప్రతీకలుగా తీసుకుంది. వాటిని **పంచవిధ సామ ఉపాసన** అంటారు. కొన్ని ఉపాసనలకు 7 అవయవాలను ప్రతీకలుగా తీసుకుంది. వాటిని **సప్తవిధ సామ ఉపాసన** అంటారు. ఒక్కొక్క భక్తి మీద ఒక్కొక్క దేవతను ఉపాసన చేస్తారు. రెండు రకాల ఉపాసనలూ రెండో అధ్యాయంలో ఎక్కువగా వస్తాయి.

మొదటి అధ్యాయంలో ఒక అవయవాన్ని తీసుకుంది. దాన్ని ఉద్గీథ భక్తి అంటారు. ఇది చాలా ముఖ్యమైనది. పదం ఓంకారం – ఓం. ఓంకారాన్ని ఉద్గీథ అంటారు. ఉద్గీథ అంటే సామవేదంలో ఓంకారం. అందువల్ల ఉద్గీథ ఉపాసన అంటే ఓంకార ఉపాసన. కాని వేరే వేదాల్లో ఓంకార ఉపాసన వచ్చినప్పుడు దాన్ని ఉద్గీథ ఉపాసన అనకూడదు. ఒక్క సామవేదంలోనే అనాలి. సామవేదానికి చెందిన ఉపనిషత్తులు (పేరున్నవి) ఛాందోగ్యం, కేన. అందుకని ఛాందోగ్య ఉపనిషత్తులో ఉద్గీథ ఉపాసన అన్నారు. మొదటి అధ్యాయంలో 13 ఖండాలున్నాయి. వాటిలో ఎక్కువగా ఉద్గీథ ఉపాసన గురించి వస్తాయి.

### ప్రథమః ఖణ్డః (1)

**మంత్రం-1: ఓమిత్యేతదక్షరముద్గీథముపాసీత । ఓమితి హ్యుద్గాయతి తస్యోపవ్యాఖ్యానమ్ ॥ 1 ॥ ఏషాం భూతానాం పృథివీ రసః పృథివ్యా ఆపో రసః అపామోషధయో రస ఓషధీనాం పురుషో రసః పురుషస్య వాగ్రసో వాచ ఋగ్రస ఋచస్సామ రసస్సామ్న ఉద్గీథో రసః ॥ 2 ॥ స ఏష రసానాగ్ం రసతమః పరమః పరార్ధ్యోఽష్టమోయదుద్గీథః ॥ 3 ॥ కతమా కతమర్క్కతమత్కతమత్సామ కతమః కతమ ఉద్గీథ ఇతి విమృష్టం భవతి ॥ 4 ॥ వాగేవర్క్ప్రాణః సామోమిత్యేతదక్షరముద్గీథః । తద్వా ఏతన్మిథునం యద్వాక్చ ప్రాణశ్చర్క్చ సామ చ ॥ 5 ॥ తదేతన్మిథునమోమిత్యేతస్మిన్నక్షరే సగ్ంసృజ్యతే। యదా వై మిథునౌ సమాగచ్ఛత ఆపయతో వై తావన్యోన్యస్య**

**కామమ్ ॥ 6 ॥ ఆపయితా హ వై కామానాం భవతి య ఏతదేవం విద్వానక్షరముద్గీథముపాస్తే ॥ 7 ॥ తద్వా ఏతదనుజ్ఞాక్షరమ్। యద్ధి కించానుజానాత్యోమిత్యేవ తదాహైషో ఏవ సమృద్ధిర్యదనుజ్ఞా సమర్ధయితా హ వై కామానాం భవతి య ఏతదేవం విద్వానక్షరముద్గీథముపాస్తే ॥ 8 ॥ తేనేయం త్రయీ విద్యా వర్తతే। ఓమిత్యాశ్రావయత్యోమితి శగ్ంసత్యోమిత్యుద్గాయత్యేతస్యైవాక్షరస్యాపచిత్యై। మహిమ్నా రసేన ॥ 9 ॥ తేనోభౌ కురుతో యశ్చైతదేవం వేద యశ్చ న వేద । నానా తు విద్యా చావిద్యా చ యదేవ విద్యయా కరోతి శ్రద్ధయోపనిషదా తదేవ వీర్యవత్తరం భవతీతి ఖల్వేతస్యైవాక్షరస్యోపవ్యాఖ్యానం భవతి ॥ 10 ॥**

**గుణవిశిష్ట ఉద్గీథ ఉపాసన:**

**మంత్రం 1** – 'ఓం' పదం మీద ఉపాసన చేయాలి. ఓం పదం యొక్క అర్థం మీద కాదు. శబ్దం మీద ఉపాసన చేయాలి. 'ఇతి' అన్నమాట ఈ విషయాన్ని సూచిస్తుంది.

ఉద్గీథ పేరు ఎలా వచ్చింది? సామవేదంలో ఓం అని పాడినప్పుడు గొంతు బాగా పైకి లేస్తుంది. ఉద్+గాయతి = ఉద్గీథ. ఉద్గీత అనకూడదు.

ఈ ఉద్గీథ ఉపాసన ఎటువంటి ఉపాసన? ప్రతీక ఉపాసన. ఇంతకుముందు చూసాము ప్రతీక ఉపాసనలో ప్రతీకకే ప్రాముఖ్యం ఇస్తామని. అలాగే ఇక్కడ అనేక విధాలుగా ఓంకారానికే ప్రాధాన్యమిస్తాము. మొదటి ఖండంలో **గుణ విశిష్ట ఓంకార ఉపాసన** వస్తుంది. ఇందులో మూడు గుణాలను పేర్కొంది ఉపనిషత్తు.

**మంత్రాలు 2,3 – ఎ) రసతమత్వ గుణ విశిష్ట ఓంకార ఉపాసన** – ఓంకారాన్ని అన్నిటి సారంగా వర్ణిస్తుంది ఉపనిషత్తు. రసం అంటే సారం. రసతమం అంటే రసాలన్నింటిలోకి శ్రేష్ఠం అని అర్థం. ఎలా? దీన్ని 8 దశల్లో చూపిస్తున్నది ఉపనిషత్తు. ఉపనిషత్తు అన్నిటి సారం తీసుకుంటూ వచ్చి చివరికి ఓంకారానికి వస్తుంది.

1. పృథివీ – అన్ని జీవాల రసం. అన్ని జీవాలకు పృథివీ సృష్టి, స్థితి, లయ కారణం.
2. ఆపః – నీరు పృథివీ రసం.

| | | |
|---|---|---|
| 3. ఓషధయః | – | చెట్లు నీటి రసం. |
| 4. పురుషః | – | పురుషుడు ఓషధుల రసం. అతను తినే సమాహారం చెట్లనుంచే వస్తాయి. |
| 5. వాక్ | – | ఛాందోగ్యం ప్రకారం వాక్కు పురుషుని రసం. మనిషి శక్తి అతని వాక్కులో ఉంది. జంతువుకూ, మనిషికీ మధ్య అదే తేడా. వాక్కు ద్వారా అనేక వ్యవహారాలను నడుపుతాడు. వాక్కు ద్వారా జ్ఞానం తరతరాలకు అందుతుంది. |
| 6. ఋచః | – | ఋగ్వేదం వాక్కు రసం. వాక్కు ఎన్నో శబ్దాలను చేయగలదు. వాటి రసమంతా వేదంలో ఉంది. |
| 7. సామ | – | సామవేదం ఋగ్వేదం రసం. సామవేదంలోని మంత్రాలన్నీ ఋగ్వేదం నుంచి తీసుకోబడినవి. ప్రత్యేకత ఏమిటంటే దానికి గానం కలిసింది. |
| 8. ఉద్గీథః | – | ఉద్గీథ సామవేదం రసం. రసానాం రసః; దీన్ని సారతమః అనీ, సారిష్ఠ అనీ అంటారు. |

**స ఏష రసానాగ్ం రసతమః పరమః పరార్థ్యోఽ ష్టమో యదుద్గీథః**

**మంత్రాలు 4-7 బి) ఆప్తిగుణ విశిష్ట ఓంకార ఉపాసన:-** ఆప్తి అంటే కోరికలు. కోరికలు తీర్చే గుణమున్న ఓంకారాన్ని ఉపాసన చేయటం. వేదంలో వచ్చే ఉపాసనల్లో బాగా కల్పనా శక్తి నిండి ఉంటుంది. జ్ఞానం పొందాలంటే పదునైన బుద్ధి ఉండాలి. సాధారణంగా బుద్ధి పదునుగా ఉండే వ్యక్తికి తార్కిక బుద్ధి ఉంటుంది. అతను కల్పనా శక్తిని ఒప్పుకోడు. అందువల్ల అతను కల్పనాశక్తితో కూడిన కవిత్వాన్ని ఇష్టపడడు. కాని మన ఋషులకు ఇటు కల్పనాశక్తీ, అటు పదునైన బుద్ధీ ఉన్నాయి.

ఇక్కడ ఓంకార ఉపాసన కోరికలను తీరుస్తుంది అంటున్నది ఉపనిషత్తు. ఎలా?

**ఋగ్ సామ మిథున సంసర్గ స్థానం –** ఓంకారం కళ్యాణమండపం అంటున్నది ఉపనిషత్తు. కళ్యాణమండపంలో ఇద్దరు వ్యక్తులు ఒకటవుతారు. మిథున సంసర్గం జరుగుతుంది. ఓంకారం విషయానికొస్తే ఓంకారం ఋగ్వేదం

నుంచి స్వీకరించబడింది. సామవేదంలో గానం చేయబడింది. అంటే ఓంకారం ఋగ్‌సామ మిథున సంసర్గ స్థానం అయింది. వాక్కే ఋక్కు, ప్రాణమే సామ. ఈ రెండూ మిథునం అంటే జంట. ఋగ్ సామ వేదాలకు చెందిన ఓంకారాన్ని, కోరికలు తీరటానికి చేసే అనేక పెద్ద యాగాల్లో గానం చేస్తారు. అందువల్ల ఓంకార ఉపాసన కోరికలు తీరుస్తుంది.

**మంత్రం 8:– సి) సమృద్ధి గుణ విశిష్ట ఉద్గీథ ఉపాసన:–** ఇంకొక గొప్ప కల్పనాశక్తి. ఓంకారం సమృద్ధికి కారణం. ఎలా? ఓంకారానికి అనేక అర్థాలున్నాయి. అందులో ఒకటి అనుజ్ఞ లేదా అనుకృతి.

**ఓమిత్యేతదనుకృతి హ స్మ వా అప్యోశ్రావయేత్యాశ్రావయన్తి।**
**– శీక్షావల్లీ**

అనుకృతి అంటే అంగీకారం చెప్పటం. దేనికైనా అంగీకారం ఎవరు చెప్తారు? అన్నీ సమృద్ధిగా ఉన్నవాడు చెప్తాడు. ఏదైనా దానం చేస్తావా? ఏదైనా సహాయం చేస్తావా? ఏదైనా అర్థం కానిది చెప్తావా? ఏదైతే సమృద్ధిగా ఉందో, అది ఉన్న వ్యక్తి లేదనకుండా దానం చేయగలడు. జ్ఞానం సమృద్ధిగా ఉన్నవాడు, ఏ సందేహం అడిగినా, తడుముకోకుండా బదులు చెప్పగలడు. అందువల్ల సమృద్ధి గుణ విశిష్ట ఉద్గీథ ఉపాసన చేసిన వ్యక్తికి అన్నీ సమృద్ధిగా ఉంటాయి. బుద్ధి పదునెక్కుతుంది.

**మంత్రాలు 9,10 :–** ఈ మంత్రాల్లో ఓంకారాన్ని కీర్తిస్తున్నది ఉపనిషత్తు. దానితోపాటు ఒక విలువను కూడా పేర్కొంటున్నది.

**ఓమితి బ్రహ్మ । ఓమితీదగ్ం సర్వమ్। ఓమిత్యేతదనుకృతి హ స్మ వా అప్యోశ్రావయేత్యాశ్రావయన్తి । ఓమితి సామాని గాయన్తి। ఓగ్ం శోమితి శస్త్రాణి శగ్ంసన్తి। ఓమిత్యధ్వర్యుః ప్రతిగరం ప్రతిగృణాతి।**
**– శీక్షావల్లీ**

ఓంకారం ఒక విశిష్టమైన మంత్రం. అన్ని సందర్భాలలోనూ అంటే కర్మకాండలో, ఉపాసన కాండలో, జ్ఞానకాండలో కూడా ఉపయోగిస్తారు. బ్రహ్మచారి వేదాధ్యయనం చేసే ముందు కూడా ఓంకారంతో మొదలు పెడతాడు.

ఛాందోగ్య ఉపనిషత్తులోని మొదటి ఖండంలో మూడు గుణాలను

పేర్కొంది. రసతమత్వ గుణ విశిష్ట ఉద్గీథ, ఆప్తి గుణ విశిష్ట ఉద్గీథ, సమృద్ధి గుణ విశిష్ట ఉద్గీథ.

ఇక్కడ ఉపనిషత్తు దానికి ఒక విలువను జోడిస్తున్నది. ఏదైనా యజ్ఞం చేసేటప్పుడు దాని అర్థం తెలుసుకోకుండా చేయవచ్చు. దానికి కూడా ఫలితం ఉంటుంది. కాని అర్థం తెలుసుకుని చేస్తే ఫలితం ఇంకా ఎక్కువగా ఉంటుంది అంటున్నది ఉపనిషత్తు. యజ్ఞం అసలు చేయకుండా ఉండేదానికన్నా, అర్థం తెలుసుకుని చేస్తే కలిగే ఫలితం ఇంకా మేలు. అందుకని పైస్థాయికి ఎదగమంటున్నది ఉపనిషత్తు. ఉద్గీథకున్న మూడు విశిష్ట గుణాలనూ– రసతమం, ఆప్తిగుణం, సమృద్ధిగుణం – తెలుసుకుని ఉపాసన చేయమంటున్నది.

**యదేవ విద్యయా కరోతి శ్రద్ధయోపనిషదా తదేవ వీర్యవత్తరం భవతి–** అంతేకాదు శ్రద్ధగా కూడా చేయాలి. కర్మకాండలో ఎందుకు చేయాలన్న తర్కం ఉండదు. ఇది చేస్తే ఈ ఫలితం ఉంటుంది అని వస్తుంది అంతే. అందుకని ఆ ఫలితం వస్తుందన్న నమ్మకంతో శ్రద్ధగా చేయాలి. ఒక రోగానికి మందు సరిగా పనిచేయాలంటే వైద్యుని మీద శ్రద్ధ ఉండాలి.

**శ్రద్ధయోపనిషదా (కరోతి) –** ఉపనిషదా అంటే ఉపాసన. ఉపాసన ఫలవంతం కావాలంటే మూడు నియమాలు పాటించాలి. దాని గురించిన జ్ఞానం, శ్రద్ధ, కర్మ ఉపాసన సముచ్చయం.

**తదేవ వీర్యవత్తరం భవతి –** ఈ పద ప్రయోగం వల్ల ఒక విషయం చెప్పకనే చెప్పినట్టవుతుంది. అర్థం తెలియకుండా చేసినా కూడా ఫలితం ఉంది. అది వృథాపోదు. కాకపోతే అర్థం తెలిసి చేస్తే ఫలితం మరింత ఎక్కువ ఉంటుంది. శంకరాచార్యులు ఈ పదాలను తరచు చెప్తుంటారు.

## ద్వితీయః ఖణ్డః (2)

**దేవాసురా హ వై యత్ర సంయేతిర ఉభయే ప్రాజాపత్యాస్తద్ధ దేవా ఉద్గీథమాజహ్రుః। అనేనైతానభిభవిష్యామ ఇతి ॥ 1 ॥ తే హ నాసిక్యం ప్రాణముద్గీథముపాసాంచక్రిరే తగ్ంహాసురాః పాప్మనా వివిధుస్తస్మాత్తేనోభయం జిఘ్రతి సురభి చ దుర్గన్ధి చ పాప్మనా హ్యేష విద్ధః ॥ 2 ॥ అథ హ వాచముద్గీథముపాసాంచక్రిరే। తాగ్ంహాసురాః పాప్మనా**

వివిధుస్తస్మాత్తయోభయం వదతి సత్యం చానృతం చ పాప్మనా హ్యేషా విద్ధా ॥3॥ అథ హ చక్షురుద్గీథ ముపాసాంచక్రిరే తద్ధాసురాః పాప్మనా వివిధుస్తస్మాత్తేనోభయం పశ్యతి దర్శనీయం చాదర్శనీయం చ పాప్మనా హ్యేతద్విద్ధమ్ ॥4॥ అథ హ శ్రోత్రముద్గీథముపాసాంచక్రిరే। తద్ధాసురాః పాప్మనా వివిధుస్తస్మాత్తేనోభయగ్ం శృణోతి శ్రవణీయం చాశ్రవణీయం చ పాప్మనా హ్యేతద్విద్ధమ్ ॥ 5 ॥ అథ హ మన ఉద్గీథముపాసాంచక్రిరే। తద్ధాసురాః పాప్మనా వివిధుస్తస్మాత్తేనోభయగ్ం సంకల్పయతే సంకల్పనీయం చాసంకల్పనీయం చ పాప్మనా హ్యేతద్విద్ధమ్ ॥ 6 ॥ అథ హ య ఏవాయం ముఖ్యః ప్రాణస్తముద్గీథముపాసాంచక్రిరే। తగ్ం హాసురా ఋత్వా విదధ్వంసుః।యథాఽశ్మానమాఖణమృత్వా విధ్వగ్ంసేత ॥ 7 ॥ ఏవం యథాఽశ్మానమాఖణమృత్వా విధ్వగ్ంసత ఏవగ్ం హైవ సవిధగ్ంసతే। య ఏవంవిది పాపం కామయతే యశ్చైనమభిదాసతి స ఏషోఽశ్మాఽఽఖణః ॥8॥ నైవైతేన సురభి న దుర్గన్ధి విజానాత్యపహతపాప్మా హ్యేషః। తేన యదశ్నాతి యత్పిబతి తేనేతరాన్ప్రాణానవతి । ఏతము ఏవాన్తతోఽవిత్త్వోత్క్రామతి వ్యాదదాత్యేవాన్తత ఇతి ॥ 9 ॥ తగ్ం హాంగిరా ఉద్గీథముపా సాంచక్ర ఏతము ఏవాంగిరసం మన్యన్తేఽంగానాం యద్రసః ॥ 10 ॥ తేన తగ్ం హ బృహస్పతిరుద్గీథముపాసాంచక్ర ఏతము ఏవ బృహస్పతిం మన్యన్తే వాగ్ఘి బృహతీ తస్యా ఏష పతిః ॥ 11 ॥ తేన తగ్ం హాయాస్య ఉద్గీథముపా సాంచక్ర ఏతము ఏవాయాస్యం మన్యంత ఆస్యాద్యదయతే ॥ 12 ॥తేన తగ్ం హ బకో దాల్భ్యో విదాంచకార । స హ నైమిషీయానాముద్గాతా బభూవ స హ స్మైభ్యః కామానాగాయతి ॥ 13 ॥ ఆగాతా హ వై కామానాం భవతి య ఏతదేవం విద్వానక్షరముద్గీథముపాస్త ఇత్యధ్యాత్మమ్ ॥ 14 ॥

**మంత్రం 1-7 ప్రాణ ప్రతీక రూపేణ ఉద్గీథ ఉపాసన –** మొదటి ఖండంలో గుణ విశిష్ట ఉద్గీథ ఉపాసన చూసాము. ఇప్పుడు ప్రాణ దృష్ట్యా ఉద్గీథ ఉపాసన. ఉద్గీథ అనే ప్రతీక మీద ప్రాణశక్తిని ఆవాహన చేసి, ఉద్గీథను ఉపాసన చేస్తాము. చూడటానికి ప్రాణ ఉపాసనలా కనిపించినా, ప్రత్యక్షంగా ప్రాణాన్ని ఉపాసన చేయము. అలా చేస్తే అది సంపద ఉపాసన అవుతుంది.

ఇది ప్రతీక ఉపాసన. ప్రతీక ఉపాసనలో ప్రాణశక్తిని ఉద్గీథ మీద ఆవాహన చేసి, తర్వాత ఉద్గీథ ఉపాసన చేస్తాము. ప్రతీక ఉపాసనలో ప్రత్యేకత ఏమిటంటే మనం ఉపాసన చేసేది ప్రతీకను. దేవతను ప్రతిష్ఠ చేస్తాం అందులో. అందువల్ల దీన్ని ప్రాణప్రతీక రూపేణ ఉద్గీథ ఉపాసన అన్నారు.

ఉదాహరణకు ఆలయంలో అభిషేకం విగ్రహానికి చేస్తామా? దైవానికి చేస్తామా? విగ్రహం దైవానికి ప్రతీక. దైవాన్ని ప్రతిష్ఠ చేసిన విగ్రహానికి పూజ చేస్తాము. అలాగే ప్రాణాన్ని ప్రతిష్ఠ చేసిన ఉద్గీథ మీద ఉపాసన చేస్తాము.

ప్రాణాన్నే ఎందుకు ప్రతిష్ఠ చేయాలి? వేరే ఏదైనా చేయవచ్చు కదా? ఎందుకంటే ప్రాణం శుద్ధం. తక్కిన అంగాలన్నీ శుద్ధ అశుద్ధాల మిశ్రమాలే.

| | | |
|---|---|---|
| జ్ఞానేంద్రియాలు | – | మంచి విషయాలూ, చెడు విషయాలూ చూస్తాయి. |
| కర్మేంద్రియాలు | – | మంచి పనులూ, చెడు పనులూ చేస్తాయి. |
| మనసు | – | మంచి ఆలోచనలూ, చెడు ఆలోచనలూ చేస్తుంది. |
| బుద్ధి | – | సాత్వికం, రాజసం, తామసం గుణాలు ఉంటాయి. |
| కర్మ | – | సాత్వికం, రాజసం, తామసం కర్మలయి ఉంటాయి. |

ఈ అంగాల పనుల స్థాయీ భేదాలను బట్టి ఒక వ్యక్తి స్వభావాన్ని అంచనా వేస్తాము. మంచి లక్షణాలు ఎక్కువ ఉంటే మంచి వ్యక్తనీ, చెడు లక్షణాలు ఎక్కువ ఉంటే చెడ్డ వ్యక్తనీ అంటాము. కాని అతను మంచి వ్యక్తయినా సరే, చెడ్డ వ్యక్తయినా సరే, అతనిలోని ప్రాణశక్తిలో ఈ స్థాయీ భేదాలు ఉండవు. సాత్విక, రాజసిక బేధాలు ఉండవు. ప్రాణశక్తి శుద్ధంగా ఉంటుంది. శుద్ధ ప్రాణం వల్ల అతను శుద్ధం అవుతాడు.

ప్రాణం కున్న ఇంకో విశిష్ఠ గుణం – **సర్వంభరత్వం** – అన్ని కరణాలనూ భరిస్తుంది. ప్రాణంకున్న ఈ శుద్ధత్వం, సర్వంభరత్వం లక్షణాలను నిరూపించటానికి ఉపనిషత్తు ఒకటి నుంచి ఏడవ మంత్రాల వరకూ ఒక ఆఖ్యాయికని ఇస్తోంది. అఖ్యాయిక అంటే కథ.

ఇది దేవాసురుల మధ్య జరిగిన యుద్ధం గురించిన కథ.

సాధారణంగా దేవాసురులు అంటే దేవతలు, రాక్షసులు. కాని ఇక్కడ విషయం ఆధ్యాత్మం. అంటే వ్యక్తికి సంబంధించినది. అందుకని శంకరాచార్యులు దేవతలను శుద్ధ ఇంద్రియ వృత్తులుగానూ, అసురులను అశుద్ధ వృత్తులుగానూ తీసుకోవాలంటారు. వృత్తి అంటే సాధారణ అర్థం ఆలోచన. కాని ఇక్కడ కర్మలు. సాత్విక వృత్తులను దేవతలుగానూ, రాజస, తామస వృత్తులను అసురులుగానూ పేర్కొన్నారు.

ఇంద్రియ భోగాలలో రమించేవాళ్ళను అసురులనీ, సాత్విక గుణాలున్న వారిని దేవతలనీ అంటారు. రాగద్వేషాలు కలిగి ఉండటం ఆసురీ గుణమైతే, ధర్మాధర్మాలను బట్టి జీవనం గడిపే వ్యక్తిలో దైవీసంపత్తి ఎక్కువగా ఉంటుంది. రెండు గుణాలూ ఒక వ్యక్తి పిల్లలే. దేవాసురులు ఇద్దరూ ప్రజాపతి పిల్లలే.

ఒక మహానుభావుడు అన్నాడు, 'కృతయుగంలో దేవాసురులు వేర్వేరు లోకాల్లో ఉన్నారు. త్రేతాయుగంలో ఒకే లోకంలో వేర్వేరు దేశాల్లో ఉన్నారు. రాముడు అయోధ్యలో, రావణాసురుడు లంకలో ఉన్నారు. ద్వాపరయుగంలో ఒకే వంశంలో ఉన్నారు. కృష్ణుడు-కంసుడు; పాండవులు – కౌరవులు. అదే కలియుగానికి వచ్చేసరికి ఒకే వ్యక్తిలో ఉన్నారు.

దేవాసురులు ఒకే వ్యక్తిలో ఉండేసరికి, నిరంతర ఘర్షణ సాగుతూ ఉంటుంది. మహాభారత సంగ్రామమే జరుగుతుంది. పొద్దున్న లేవగానే వార్తాపత్రిక చదవాలా, విష్ణుసహస్రనామం చదవాలా అన్న ఘర్షణ కొంతమందిలో. వార్తాపత్రిక చదవటానికి మొగ్గుచూపితే ఆసురీ సంపత్తి గెలిచినట్టు. విష్ణుసహస్రనామం చదివితే దైవీసంపత్తి గెలిచినట్టు. ఆమాటకొస్తే ఆ ఘర్షణ స్థాయి దాటి రావాలి మనం. దైవీసంపత్తిని నెలకొల్పాలి.

ఇప్పుడు కథలోకి వస్తే, ఒకసారి వ్యక్తిలోని దేవతలు ఉద్గీథ ఉపాసన చేయాలనుకున్నారు. ఎందుకు? దానివల్ల అన్ని అంగాలు శుద్ధంగా ఉంటాయి, చెడువైపుకు పోవు అని ఆశించారు. ఒక్కొక్క అంగానికీ ఒక్కొక్క అధిష్ఠాన దేవత ఉంది కదా! ఉదాహరణకు కంటికి అధిష్ఠాన దేవత సూర్యుడు. కన్ను చెడు చూడకుండా ఉండేందుకు, కంటికి అధిష్ఠాన దేవతకు ఉద్గీథ ఉపాసన చేస్తున్నారు. కాని ఉపాసన చేస్తుండగానే, అసురులు వస్తున్నారు. కంటి దేవతను అసురులు దాడి చేయడం వల్ల కన్ను అశుద్ధం

అవుతోంది. అలా అన్ని ఇంద్రియాలు అశుద్ధం అవుతున్నాయి. అన్ని ఇంద్రియాలూ అశుద్ధం అవుతున్నాయని ఎలా చెప్పగలము? కళ్ళు మంగళకరమైనవీ, అమంగళకరమైనవీ చూస్తున్నాయి.

**జిఘ్రతి సురభి చ దుర్గన్ధి చ**
**వదతి సత్యం చానృతం చ**
**పశ్యతి దర్శనీయం చాదర్శనీయం చ**
**శృణోతి శ్రవణీయం చాశ్రవణీయం చ**
**సంకల్పయతే సంకల్పనీయం చాసంకల్పనీయం చ**

**వదతి –** వాక్కు (కర్మేంద్రియాలు), **జిఘ్రతి, పశ్యతి, శృణోతి–** ముక్కు, కళ్ళు, చెవులు (జ్ఞానేంద్రియాలు), **సంకల్పయతి –** మనసు (అంతఃకరణాలు). సూక్ష్మ శరీరంలో ఉన్న పంచ కర్మేంద్రియాలు, పంచ జ్ఞానేంద్రియాలు, నాలుగు అంతఃకరణాలు అసురుల చేతిలో ఓడిపోయాయి, అశుద్ధం అయ్యాయి. అన్నింటిలోకి అశుద్ధమైనది మనసు. మన మనసుని ఎవరూ చదవలేకపోవటం ఒక వరం. ఇంకొకరి మనసు విప్పి చూడటానికి ఎందుకు ప్రయత్నిస్తారు? అలా మనసుని తెరవాలని చూడటం కాలుష్యంతో నిండిన పెట్టెను తెరవటంలాంటిది అంటారు చిన్మయానంద స్వామి. దేవుడు, ఆ విషయం తెలిసే, దానికొక మూతను పెట్టారు. ఒక మహాత్మునికి, ఒక పాపాత్మునికి మధ్య భేదం పైన చెప్పిన కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, అంతఃకరణాలను ఉపయోగించే తీరువల్ల తెలుస్తుంది.

**మంత్రం–7:–** ఇవన్నీ వాటి అధిష్ఠాన దేవతల ఉపాసనల్లో ఓడిపోయాక ప్రాణ ఉపాసన చేశారు. ముఖ్యప్రాణం మీద ఉపాసన చేశారు. అంటే పంచప్రాణాల మీద ఉద్గీథ ఉపాసన చేశారు. ఉపాసన చేస్తుంటే అసురులు వచ్చి ప్రాణం మీద దండెత్తారు. ప్రాణాన్ని నాశనం చేసేబదులు, వాళ్ళే నాశనమయ్యారు. ప్రాణం శుద్ధంగానే కొనసాగింది. ఇది వర్ణించటానికి ఉపనిషత్తు అందమైన ఉదాహరణనిస్తున్నది. ఒక రాయిని నాశనం చేయటానికి మట్టిగడ్డని విసిరితే, మట్టిగడ్డే విరుగుతుంది. కాని రాయి చెక్కుచెదరదు. అలాగే అసురులు ప్రాణాన్ని ఏమీ చేయలేకపోయారు.

ఈ కథ వల్ల శుద్ధం, అశుద్ధం అన్నవి జ్ఞానేంద్రియాలకు,

కర్మేంద్రియాలకు, అంతఃకరణకే చెందుతాయి కాని ప్రాణానికి చెందవు అని తెలుస్తుంది. ప్రాణం శుద్ధం. ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో గాని, జీర్ణక్రియలో గాని శుద్ధం, అశుద్ధం అన్నవి ఉండవు.

**మంత్రాలు 8,9:-** ప్రాణస్తుతి, ప్రాణ ఉపాసనా ఫలం. ముందు తొమ్మిదవ మంత్రం చూద్దాము.

**మంత్రం 9:-** ప్రాణస్తుతి. ప్రాణం గొప్పతనం ఏమిటి? రెండు లక్షణాలను ముందే పేర్కొన్నాము. శుద్ధత్వం. సర్వంభరత్వం. శుద్ధత్వం ఎలాగో ఇప్పుడే చూశాము. శుద్ధత్వం వల్ల శక్తివంతమైనది. శక్తివంతమైనదవటం వల్ల తక్కిన కరణాలకు ఆధారం. సర్వ అంగాలను భరిస్తుంది. ఎలా? పంచప్రాణాల విధులు చూస్తే తెలుస్తుంది- ప్రాణం ద్వారా ఆహార, పానీయాలను తీసుకుంటుంది.

| | |
|---|---|
| ప్రాణం | - శ్వాసక్రియ |
| అపానం | - విసర్జన క్రియ |
| సమానం | - జీర్ణక్రియ |
| వ్యానం | - రక్తప్రసరణ క్రియ |
| ఉదానం | - తిరోగమన క్రియ |

పంచవిధ ప్రాణశక్తి వల్లే ఇంద్రియాలు పనిచేస్తాయి. విరోచనాలు పట్టుకుంటే కర్మేంద్రియాలు సరిగ్గా పనిచేయవు. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు వాడినా వాడకపోయినా శ్వాసక్రియ ఒక్కటే శరీరాన్ని సవ్యంగా నడిపిస్తుంది. ఎప్పుడైతే ప్రాణశక్తి సరిగ్గా పనిచేయదో, అప్పుడే ప్రాణం పోయింది అంటాము. అందువల్ల ప్రాణం సర్వంభరత్వం అయింది.

**మంత్రం 8 - ఫలం -** ప్రాణ దృష్ట్యా ఉద్గీథ ఉపాసన చేసిన వ్యక్తిని అసురులు దండెత్తరు.

**యథా యథా ఉపాస్తే, తదేవ భవతి**

ఏ ఉపాసన చేస్తే, దానికి తగ్గ ఫలం వస్తుంది. ప్రాణం మీద దండెత్తిన అసురులు నాశనమయ్యారు కాబట్టి, ప్రాణ ఉపాసన చేసిన వ్యక్తి మీద దండెత్తే అసురులు కూడా నాశనమవుతారు. ఇంకోఫలం శుద్ధత్వం.

మామూలుగా అందరూ బాధపడే విషయం - మేము మంచిగా ఉందామన్నా, చుట్టూ ఉన్నవాళ్ళు మంచిగా ఉండనివ్వరు. దాన్ని

ఎదుర్కోవటానికి ఒకటే మార్గం – ఉపాసన లేదా ప్రార్థన చేయటం. ఉపాసకుడిని దుష్టశక్తులు ఏవీ ఏమీ చేయలేవు. అందుకే రోజువారీ పూజలను, ఉపాసనలను నియమించింది శాస్త్రం – అవి ఒక కవచంలా పనిచేస్తాయి.

**మంత్రాలు 10-14 – గుణత్రయ విశిష్ట ప్రాణదృష్ట్యా ఉద్గీథ ఉపాసన:-** ఇందులో కూడా ఉద్గీథ మీద ప్రాణ ఉపాసనే వస్తుంది. కాకపోతే ఇక్కడ మూడు వేరే గుణాలు వర్ణించబడ్డాయి. అవి– అంగిరస, బృహస్పతి, ఆయాస్య.

**మంత్రం 10 –** అంగిరసః – అంగిరస ఋషి ప్రాణ ఉపాసన చేయటం వల్ల అంగిరస గుణం, అంగాలన్నింటికీ రసం కాబట్టి అంగిరసం. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, అంతఃకరణాలకు ప్రాణమే సారభూతం కదా.

**మంత్రం 11–** బృహస్పతిః – బృహస్పతి ఋషి ప్రాణ ఉపాసన చేయటం వల్ల బృహస్పతి గుణం; బృహస్పతిని వాక్పతి, వాచస్పతి అని కూడ అంటారు. ప్రాణశక్తి వల్లే వాక్కు శక్తివంతంగా ఉంటుంది. అందుకే ప్రాణం పోయేటప్పుడు మాట సరిగా రాదు.

**మంత్రం 12 –** ఆయాస్యః – ఆయాస్యః ఋషి ప్రాణ ఉపాసన చేయటం వల్ల ఆయాస్య గుణం; ప్రాణం నోరు నుంచి, ముక్కు నుంచి పోతుంది.

ఆ విధంగా అంగిరస, బృహస్పతి, ఆయాస్య గుణత్రయ విశిష్ఠ ప్రాణ దృష్ట్యా ఉద్గీథఉపాసన చేయాలి.

**మంత్రాలు 13,14:–** ఫలం– కామప్రాప్తి – కోరినది తీరుతుంది. ఉపనిషత్తు ఈ ఫలం కలుగుతుందని చెప్పటానికి ఉదాహరణగా ఒక ఋషి పేరు చెపుతున్నది. ఆయన పేరు బకః దాల్భ్యః (ఒకే ఋషి). ఆయన కోరికలు ఉపాసన ద్వారా తీర్చుకున్నట్టుగా మనం కూడా ముందు చెప్పిన గుణద్వయ విశిష్ఠ ఉద్గీథ ఉపాసన చేసినా, ఇప్పటి గుణత్రయ విశిష్ఠ ఉద్గీథ ఉపాసన చేసినా కోరికలు తీరుతాయి.

ఇత్యధ్యాత్మమ్ – ప్రాణం వ్యష్టికి చెందినది కాబట్టి దేవాసురులను వ్యష్టిలోని సానుకూల, ప్రతికూల శక్తులుగా వర్ణించటం జరిగింది. అదే ఆధిదైవ ఉపాసన అయితే, సమష్టిపరంగా దేవతలు, రాక్షసులుగా వర్ణించటం జరుగుతుంది.

## తృతీయః ఖణ్డః(3)

అథాధిదైవతం య ఏవాసౌ తపతి తముద్గీథముపాసీత।ఉద్యన్వా ఏష ప్రజాభ్య ఉద్గాయతి । ఉద్యగ్ంస్తమో భయమపహన్త్యపహన్తా హ వై భయస్య తమసో భవతి య ఏవం వేద ॥ 1 ॥ సమాన ఉ ఏవాయం చాసౌ చోష్ణోఽయముష్ణోఽసౌ। స్వర ఇతీమమాచక్షతే స్వర ఇతి ప్రత్యాస్వర ఇత్యముం తస్మాద్వా ఏతమిమమముం చోద్గీథముపాసీత ॥ 2 ॥ అథ ఖలు వ్యానమేవోద్గీథముపాసీత। యద్వై ప్రాణితి స ప్రాణో యదపానితి సోఽపానః । అథ యః ప్రాణాపానయోస్సంధిస్స వ్యానః యోవ్యానస్సా వాక్ । తస్మాదప్రాణన్ననపానన్వాచమభివ్యాహరతి ॥ 3 ॥ యా వాక్సర్క్ తస్మాదప్రాణన్నన పానన్నృచమభివ్యాహరతి యఋక్తత్సామ తస్మాదప్రాణన్నసపానన్సామ గాయతి యత్సామ స ఉద్గీథస్తస్మాద ప్రాణన్ననపానన్నుద్గాయతి ॥ 4 ॥ అతో యాన్యన్యాని వీర్యవన్తి కర్మాణి యథాఽగ్నేర్మన్థనమాజేస్సరణం దృఢస్య ధనుష ఆయమనమప్రాణన్ననపానగ్ంస్తాని కరోత్యేతస్య హేతోర్వ్యానమేవోద్గీథముపాసీత ॥ 5 ॥

అథ ఖలూద్గీథాక్షరాణ్యుపాసీత।ఉద్గీథ ఇతి ప్రాణ ఏవోత్।ప్రాణేన హ్యుత్తిష్ఠతి వాగ్గీర్వాచో హ గిర ఇత్యాచక్షతేఽన్నం థమన్నే హీదగ్ం సర్వగ్ం స్థితమ్ ॥ 6 ॥ ద్యౌరేవోదన్తరిక్షం గీః పృథివీ థమాదిత్య ఏవోద్వాయుర్గీరగ్నిస్థగ్ం సామవేద ఏవోద్యజుర్వేదో గీరృగ్వేదస్థమ్। దుగ్ధేఽస్మై వాగ్దోహం యో వాచో దోహోఽన్నవానన్నాదో భవతి య ఏతాన్యేవం విద్వానుద్గీథాక్షరా ణ్యుపాస్త ఉద్గీథ ఇతి ॥ 7॥అథ ఖల్వాశీః సమృద్ధిరుపసరణా నీత్యుపాసీత । యేన సామ్నా స్తోష్యన్స్యాత్తత్సామోపధావేత్ ॥8 ॥ యస్యామృచి తామృచం యదార్షేయం తమృషిం యాం దేవతామభిష్టోష్యన్స్యాత్తాం దేవతాముపధావేత్ ॥ 9 ॥ యేనచ్ఛన్దసా స్తోష్యన్స్యాత్తచ్ఛన్ద ఉపాధావేద్యేన స్తోమేన స్తోష్యమాణః స్స్యాత్తగ్ం స్తోమముపధావేత్ ॥ 10 ॥

యాం దిశమభిష్టోష్యన్స్యాత్తాం దిశముపధావేత్ ॥ 11 ॥ ఆత్మానమన్తత ఉపసృత్య స్తువీత కామం ధ్యాయన్నప్రమత్తోఽభ్యాశో హ యదస్మై స కామస్సమృద్ధ్యేత యత్కామః స్తువీతేతి యత్కామః స్తువీతేతి ॥ 12 ॥

ఇది కూడా ఉద్గీథ ఉపాసనే. ఉద్గీథ మీద అధిదైవం, ఆధ్యాత్మం ఉపాసనలు రెండూ వస్తాయి. ఈ ఖండంలో 5 ఉపాసనలు వస్తాయి.

**మంత్రం 1–సూర్య ఉపాసన –** సూర్య ఉపాసన ఎందుకో ఉపనిషత్తు కారణం చెపుతున్నది. సూర్యునికీ, ఉద్గీథకీ కొన్ని అంశాలు సమానంగా ఉన్నాయి.

**ఎ) ఉదయం–** సూర్యుడు ఆకాశంలో ఉదయించినట్టుగా, సామగానంలో ఉద్గీథను హెచ్చుస్థాయిలో గానం చేయటం జరుగుతుంది.

**బి) సమృద్ధి –** సూర్యుడు సమృద్ధిని కలుగజేస్తాడు. వాన సమృద్ధిగా కురవటం వల్ల పంటలు బాగా పండుతాయి కాని ఆ వానకు కారణం సూర్యుడే కదా. అలాగే సామఘోష కూడా సమృద్ధిని కలుగజేస్తుంది. సూర్యునిలాగే వానకురిసేలా చేస్తుంది. వర్షాలు కురవటానికి చేసే యజ్ఞాల్లో వేద ఘోష ఉంటుంది. అందుకే వేద పారాయణం అనే బదులు వేదఘోష అంటారు. సామగానం ఇంకా ఎక్కువ శబ్దం కలిగి ఉంటుంది. శబ్దం ఎంత హెచ్చుస్థాయిలో ఉంటే, అంత ఎక్కువగా వాన కురుస్తుంది.

**సి) భయ నాశకం –** సూర్యుడు చీకటిని పారద్రోలుతాడు. చీకటి భయహేతువు. సూర్యుడు భయహేతువు అయిన చీకటిని పారద్రోలటం ద్వారా భయాన్ని నాశనం చేస్తాడు. ఉద్గీథ కూడా మనసుని శుద్ధి చేసి, ఆత్మజ్ఞానం పొందటానికి సంసిద్ధులను చేస్తుంది. ఆత్మజ్ఞానం పొందితే జ్ఞానమనే వెలుగు, అజ్ఞానమనే చీకటిని పారద్రోలుతుంది.

**ఆనందం బ్రహ్మణో విద్వాన్। న బిభేతి కదాచనేతి। బ్రహ్మానందవల్లీ**

**ఫలం –** అజ్ఞానం తొలగి, వేదాంతం అర్థం అవుతుంది.

**మంత్రం 2 – సూర్య, ప్రాణ, ఉభయ ఉపాసన –** అధిదైవం+ అధ్యాత్మం రెండూ కలిసిన ఉపాసన. ఎందుకు రెండూ కలిసిన ఉపాసన? ఉపనిషత్తు కారణం చెపుతున్నది. వాటి రెండింటి లక్షణాలూ ఒకటే.

**ఎ) ఉష్ణం:–** ప్రాణశక్తి వల్ల వ్యష్టికి ఉండాల్సిన వేడి ఉంటే, సూర్యశక్తి వల్ల జీవరాశులకు శక్తి అందుతుంది.

**బి) స్వరం –** ప్రాణం, సూర్యుడు– రెండూ కొంతకాలమయ్యాక నిష్క్రమిస్తాయి. కాకపోతే ఇందులో కొంత తేడా ఉంది. సూర్యుడు సాయంకాలం అస్తమించినా, మర్నాడు పొద్దున్నే మళ్ళీ వస్తాడు. ప్రాణం వెళితే ఇంక మళ్ళీ రావటం లేదు.

ఫలం:- ఉపనిషత్తు గాని, శంకరాచార్యులు గానీ చెప్పలేదు. కాని ఉపాసనా సూత్రం ప్రకారం ఫలం తీసుకోవచ్చు.

**యథా యథా ఉపాస్తే, తదేవ భవతి**

ప్రాణశక్తి మీద ఉపాసన కాబట్టి ఆయుఃప్రమాణం పెరుగుతుంది.

**మంత్రాలు 3-5:- వ్యాన ఉపాసన** :- పంచ ప్రాణాలలో ఒకటైన వ్యానని ఉద్గీథ మీద ప్రతిష్ఠించి, ఉద్గీథ ఉపాసన చేయాలి. వ్యాన ఉపాసన ఎందుకు?

ప్రాణవాయువుని **ప్రాగ్గమనవాన్ వాయుః** అంటారు – (నిశ్వాస)

అపానవాయువుని **అధోగమనవాన్ వాయుః** అంటారు – (ఉచ్ఛ్వాస)

ఇక్కడ వ్యానని ప్రాణ, అపానలకు సంధిగా వర్ణిస్తున్నది. యోగ శాస్త్రంలో ప్రాణాయామం చేసేటప్పుడు రేచకం, పూరకం, కుంభకం అన్న పదాలు వాడతారు. గాలి వదలటం రేచకం, గాలి లోపలకు పీల్చటం పూరకం, పీల్చినగాలిని ఉంచటం కుంభకం. వ్యానశక్తి ప్రాణ, అపానల మధ్యది కాబట్టి పూరకం, రేచకాల మధ్యదయిన కుంభకం వ్యానశక్తి. ఈ వ్యానశక్తి లేదా కుంభకం మన కార్యకలాపాలకు కారణం.

**ఎ) వాక్కు –** మాట్లాడేటప్పుడు వ్యక్తి ఉచ్ఛ్వాస, నిశ్వాసలు చేయలేదు అని చెపుతున్నది ఉపనిషత్తు. ఆగకుండా మాట్లాడే వ్యక్తిని ఊపిరి తీసుకోకుండా మాట్లాడుతున్నాడు అంటాము. దీని వెనుక కుంభక శక్తి ఉందన్నమాట. వేదపారాయణం కుంభక శక్తి వల్లే జరుగుతుంది. ఉద్గీథ గానం కుంభక శక్తి వల్లే జరుగుతుంది.

**యాన్యన్యాని వీర్యవన్తి కర్మాణి –** ఏ కర్మ చేసినా వ్యానశక్తి కావాలి. ఉపనిషత్తు మరికొన్ని ఉదాహరణలను ఇస్తున్నది.

**అగ్నేర్మన్థనమాజేస్సరణం దృఢస్య ధనుష ఆయమనమ్** – అగ్ని కోసం ఆరణి మథనం చేసేటప్పుడూ, పరుగుపందెంలో పాల్గొనేటప్పుడూ, ధనస్సును లాగి ఎక్కుపెట్టేటప్పుడూ, కుంభకశక్తి లేదా వ్యానశక్తి వాడటం జరుగుతుంది. అరణి మథనం, ధనుస్సు ఎక్కుపెట్టడం చేతులతో చేసే పనులు. పరుగు పందెం కాళ్ళతో చేసే పనులు. అన్నింటికీ వ్యానశక్తి మూలం.

**ఫలం –** వీర్యవత్వం– బలం బాగుంటుంది. శ్వాసపీల్చటంలో సమస్య ఉండదు.

**మంత్రాలు 6, 7:- ఉద్గీథ అక్షర ఉపాసన** – ఉద్గీథ పదంలోని ఒక్కొక్క

అక్షరం మీద ఒక్కొక్క దేవతను ఆవాహన చేయటం– ఉద్గీథ పదంలో మూడు అక్షరాలు ఉన్నాయి. ఉత్+గీః+థమ్. మూడు అక్షరాలను మూడు ప్రతీకలుగా భావించి,వాటిమీద ముగ్గురు దేవతలను ఆవాహన చేయాలి. అలా మూడు జతల దేవతలు మొత్తం వెరసి (3×3=9) 9 మంది దేవతలు.

శీక్షావల్లిలో అలాగే వ్యాహృతుల మీద ఉపాసన గురించి చూస్తాము.

**భూరితి వా అయం లోకః । భువ ఇత్యన్తరిక్షమ్। సువరిత్యసౌ లోకః। మహ ఇత్యాదిత్యః। ఆదిత్యేన వా వ సర్వే లోకా మహీయంతే।**

భూ,భువ, సువ వ్యాహృతుల మీద భూలోక, భువర్లోక, సువర్లోకాలను ఆవాహన చేస్తాము. అట్లా అక్కడ కూడా నాలుగు జతల ఉపాసనలు చూస్తాము. పద్ధతి ఒకటే కాకపోతే ప్రతీకలు, వాటిమీద ఆవాహన చేసే దేవతలు మారతారు.

| **సంఖ్య** | **ఉత్** | **గీః** | **థమ్** |
|---|---|---|---|
| | **(ఉన్నతస్థాయి)** | **(మధ్యమస్థాయి)** | **(అధిష్ఠానం)** |
| 1. | ప్రాణం | వాక్కు | అన్నం |
| 2. | సువర్లోకం | భువర్లోకం | భూలోకం |
| 3. | ఆదిత్యుడు | వాయువు | అగ్ని |
| 4. | సామవేదం | యజుర్వేదం | ఋగ్వేదం |

ఉదాహరణకు సామవేదం హెచ్చుస్థాయిలో ఉంటుంది. యజుర్వేదం మధ్యమస్థాయిలో ఉంటుంది. ఋగ్వేదం సామవేదానికి అధిష్ఠానం.

**ఫలం –** స్వర్గలోక ఫలం లేదా పైన చెప్పిన దేవతల దీవెనలు కలుగుతాయి.

**మంత్రాలు 8–12 – కామపూర్తి ఉపాసన:–** ఇది ఉద్గీథ ఉపాసన కాదు. కొంచెం వేరేగా ఉంటుంది. యజ్ఞాలు చేసేటప్పుడు అనేక ఫలాల కోసం అనేకమంది దేవతలను ఆవాహన చేస్తూ, సామగానం చేస్తారు. ఏ ఫలానికి ఏ సామగానం చేయాలి? ఇది కోరిక తీరటానికి చేసేది కాబట్టి దీన్ని కామపూర్తి ఉపాసన అంటారు. దానికి తగ్గ మంత్రాలను గానం చేసేటప్పుడు 9 అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి. అప్పుడే పూర్తి ఫలం కలుగుతుంది. అవి–

**ఎ) సామ –** అతను గానం చేయబోయే మొదటి మంత్రం.

**బి) స్తోమ –** ప్రతి సామ మంత్రంతో కొన్ని సామ మంత్రాలు కలిసి గానం చేయాలి. అవి 5,10,13,21 అలా ఎన్నన్నా ఉండవచ్చు. ఉదాహరణకు

**పార్థాయ ప్రతిబోధితాం** గీత ప్రార్థనశ్లోకం. అది సామ. దానితోపాటు ఉన్న తక్కిన ధ్యానశ్లోకాలను స్తోమ అంటారు. సామ మొదలుపెట్టగానే తక్కినవి మనసులో సిద్ధం చేసుకోవాలి.

**సి) ఋగ్ మంత్రం –** ప్రతి సామ మంత్రానికీ ఆధారంగా ఒక ఋగ్ మంత్రం ఉంటుంది. గాయత్రీ సామ మంత్రానికి ఆధారంగా ఒక ఋగ్ మంత్రం ఉంటుంది.

**డి)ఇ)ఎఫ్) ఋషి, ఛందస్సు, దేవతా –** గాయత్రీ మంత్రానికి సావిత్రి ఋషి, గాయత్రీ ఛందస్సు, సవితా దేవతా.

**జి) దిక్ –** ఆ దేవత ఉండే దిక్కు.

**హెచ్) ఉపాసకుడు (ఆత్మానాం) –** ఉపాసన చేసే వ్యక్తి.

**ఐ) కామం –** కోరిక. ఏ కోరికతో చేస్తున్నారో తలచుకుని చేస్తే ఆ కోరిక తీరుతుంది. నిష్కామంగా చేస్తే చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత కలుగుతాయి.

### చతుర్థః ఖణ్డః (4)

**ఓమిత్యేతదక్షరముద్గీథముపాసీతోమితి హ్యుద్గాయతి తస్యోప వ్యాఖ్యానమ్ ॥ 1 ॥ దేవా వై మృత్యోర్బిభ్యతః॥ త్రయీం విద్యాం ప్రావిశగ్ంస్తే ఛన్దోభిరచ్ఛాదయన్యదేభిరచ్ఛాదయగ్ంస్తచ్ఛన్దసాం ఛన్దస్త్వమ్ ॥ 2 ॥ తాను తత్ర మృత్యుర్యథా మత్స్యముదకే పరిపశ్యేదేవం పర్యపశ్యత్।ఋచి సామ్ని యజుషి ॥ తే ను విత్త్వోర్ధ్వా ఋచః సామ్నో యజుషస్స్వరమేవ ప్రావిశన్ ॥ 3 ॥ యదా వా ఋచమాప్నో త్యోమి త్యే వాతిస్వరత్యేవగ్ం సామైవం యజురేష ఉ స్వరో యదేతదక్షరమేతద మృతమభయం తత్ప్రవిశ్య దేవా అమృతా అభయా అభవన్ ॥ 4 ॥ స య ఏతదేవం విద్వానక్షరం ప్రణౌత్యేతదేవాక్షరగ్ం స్వరమమృతమభయం ప్రవిశతి తత్ప్రవిశ్య యదమృతా దేవాస్తదమృతో భవతి ॥ 5 ॥**

**మంత్రాలు 1– 5 – అమృత అభయ గుణ విశిష్ట ఓంకార ఉపాసన –** ఈ ఖండంలో ఒకటే ఉపాసన. అది ఓంకార ఉపాసన. ఇక్కడ దీనికి ప్రత్యేకమైన పేరు ఉంది. అది స్వరం. అందువల్ల దీన్ని అమృత అభయ గుణ విశిష్ట స్వర ఉపాసన అంటారు. ఓంకారాన్ని ఉద్గీథ అనీ, స్వరం అనీ,

ప్రణవం అనీ అంటారు. కాకపోతే ఉద్గీథ పేరు మాత్రం ఒక్క సామవేదానికే పరిమితం అవుతుంది.

ఈ ఉపాసన గురించి ఒక కథ చెపుతున్నది ఉపనిషత్తు. ఒకసారి దేవతలు మృత్యువంటే భయపడ్డారట. మృత్యుభయం అంతటా ఉంటుంది.

దేవతలు మృత్యుభయాన్ని తొలగించుకోవటానికి, మూడు వేదాల రక్షణ కోరారు. అవి వాళ్ళను రక్షిస్తున్నాయి. అందుకే వేదాలను ఛందస్సు అని కూడా అంటారు **ఛద్** అంటే కవచం. **ఛాదయతి ఇతి ఛందః.** ఎలా కవచం?

శంకరాచార్యులు రెండు రకాలుగా రక్షిస్తాయని అంటున్నారు. వేద మంత్రాలను రెండు రకాలుగా పఠిస్తారు. ఒకటి, యజ్ఞాలు చేసేటప్పుడు వాటికి తగ్గ వేద మంత్రాలను చదువుతారు. వాటిని పఠించటం వల్ల పుణ్యం కలిగి, ఈశ్వర అనుగ్రహం కలుగుతుంది. అలా వేదాలు రక్షణ ఏర్పరుస్తాయి.

రెండోది, ఆ పెద్ద యజ్ఞాలు చేసేటప్పుడు మధ్యలో కొంత ఖాళీ సమయం ఉంటుంది. ఉదాహరణకు రుద్రాభిషేకం 11సార్లు చేసేటప్పుడు అభిషేకానికి కావాల్సినవి తయారుచేసేటప్పుడు మధ్యలో కొంత విరామం ఏర్పడుతుంది. అప్పుడు ఏం చేయాలి? శాస్త్రం వేద మంత్రాలు చదవాలి అంటున్నది. అవి కూడా ఆ యజ్ఞానికి లేదా ఆ పూజకు పఠించని మంత్రాలు పఠించాలి. ఎందుకు? ఖాళీ ఉంటే చాలు ఏవేవో ముచ్చట్లు దొర్లుతాయి. ఆలోచన ప్రాపంచిక విషయాల మీదకు పోతుంది. ఒక చెడు ఆలోచన మృత్యువుతో  సమానం.

కొన్ని పెద్ద యజ్ఞాలు చేసేటప్పుడు అలసిపోతారు. అందుకని మధ్యలో లేచి, కాళ్ళు స్వాధీనంలోకి రావటానికి నడుస్తారు. అలాంటప్పుడు విద్వత్ సదస్సును ప్రోత్సహిస్తారు. భాగవతం కూడా చెప్తారు. అలా యజ్ఞాల మధ్యలో చదివే వేదమంత్రాలు కూడా రక్షిస్తాయి. అలా దేవతలు చేశారు– కాని అది కూడా పూర్తి రక్షణనివ్వదు.

ఉపనిషత్తు దానికి అందమైన ఉదాహరణనిస్తున్నది. ఆట్టే లోతులేని నీటిలో ఉన్న చేప తను సురక్షితంగా ఉన్నాననుకుంటుంది. కాని, జాలరి కంట తేలిగ్గా పడి, అతని వలలో చిక్కుతుంది. నీరు వేదాలు, చేపలు దేవతలు, జాలరి మృత్యువు. అంటే వాళ్ళకి మృత్యుభయం పూర్తిగా తొలగలేదు.

**కర్మకాండేన అమృతత్వం న భవతి**

కర్మకాండ వల్ల శాశ్వతత్వం పొందలేరు అని నిరూపించటానికి ఈ కథ. అప్పుడు దేవతలు ఏం చేశారు?అట్టే లోతు లేని నీరు లాంటి కర్మకాండని వదిలి, ఓంకార ఉపాసన అనే సముద్రానికి వచ్చారు.

**అమృత అభయ గుణ విశిష్ట ఓంకార ఉపాసన**

మృత్యువు అశాశ్వతానికీ, భయానికీ చిహ్నం. దేవతలు అమృతం, అభయం కోరారు. మృత్యుభయం తొలగాలనుకున్నారంటే క్రమముక్తి కోరారని అర్థం. పునరపి జననం, పునరపి మరణం పొందకుండా, ఉపాసన ద్వారా బ్రహ్మలోకం వెళ్ళి అక్కడినుంచి క్రమముక్తి పొందుతారు. అలా అమృతం, అభయం పొందుతారు.

**ఫలం –** ఎవరైతే ఓంకార ఉపాసన చేస్తారో వాళ్ళు అమృతం, అభయం పొందుతారు. చీకట్లో వెళ్ళేటప్పుడు రామనామం జపిస్తే భయం ఉండదని గాంధీ చెప్పారు. అలా మరణ భయం తొలగాలంటే ఓంకారం జపించాలి.

ఒక విషయం మిగిలిపోయింది. ఈ ఉపాసనను స్వరం అంటారని చూసాము. స్వరతి అంటే ఉచ్చారయతి సర్వే – వేదపారాయణం చేసేటప్పుడు అందరూ గట్టిగా ఓంకారం చేస్తారు.

**ఓమితి బ్రాహ్మణః ప్రవక్ష్యన్నాహ బ్రహ్మోపాప్నవానీతి – శీక్షావల్లీ**

**పంచమః ఖణ్డః (5)**

**అథ ఖలు య ఉద్గీథస్స ప్రణవో యః ప్రణవస్స ఉద్గీథ ఇత్యసౌ వా ఆదిత్య ఉద్గీథ ఏష ప్రణవః ఓమితి హ్యేష స్వరన్నేతి ॥ 1 ॥ ఏతము ఏవాహమభ్యగాసిషం తస్మాన్మమ త్వమేకోఽసీతి హ కౌషీతకిః పుత్రమువాచ రశ్మీగ్ంస్త్వం పర్యావర్తయాద్బహవో వై తే భవిష్యన్తీత్యధిదైవతమ్ ॥ 2 ॥ అథాధ్యాత్మం య ఏవాయం ముఖ్యః ప్రాణస్తముద్గీథముపాసీతోమితి హ్యేష స్వరన్నేతి ॥ 3 ॥ ఏతము ఏవాహమభ్యగాసిషం తస్మాన్మమ త్వమేకోఽసీతి హ కౌషీతకిః పుత్రమువాచ ప్రాణాగ్ంస్త్వం భూమానమభిగాయతాద్బహవో వై మే భవిష్యన్తేతి॥ 4 ॥అథ ఖలు య ఉద్గీథస్స ప్రణవో యః ప్రణవస్స ఉద్గీథః ఇతి హోతృషదనాద్ధైవాపి దురుద్గీతమనుసమాహరతీత్యను సమాహరతీతి ॥5॥**

ఇక్కడ మూడు ఉపాసనలు చూస్తాము. 1. ఆదిత్య దృష్ట్యా ఉద్గీథ ఉపాసన. 2. ప్రాణ దృష్ట్యా ఉద్గీథ ఉపాసన. 3. ఉద్గీథ ప్రణవ ఐక్య ఉపాసన. ఈ మూడింటిలో మొదటి రెండూ– ఆదిత్య, ప్రాణ ఉపాసనలు ముందే చూశాము. కాని ఇక్కడ వేరే విధంగా చూస్తాము. ముందు ఖండంలో ఆదిత్యను ఒక పూర్తి దేవతగా చూశాము.

**మంత్రాలు 1,2:–** ఇక్కడ **ఆదిత్య బహురశ్మి దృష్ట్యా ఉద్గీథోపాసన(ఉద్గీథ + ఉపాసన)** చూస్తాము. అనేక కిరణాలున్న ఆదిత్యను ఉపాసన చేస్తాము. అలా చేయటం వల్ల కలిగే ఫలం ఏమిటి? ఆ ఫలాన్ని కౌశీతకీ తన పుత్రునికి సలహా ఇవ్వటం ద్వారా చూస్తాము.

కౌశీతకీ తన పుత్రునికి తాను ఆదిత్య ఉపాసన చేయటం వల్ల తనకు ఒక్కడే పుత్రుడు కలిగాడనీ, అందువల్ల అతనిని ఆదిత్య బహురశ్మి దృష్ట్యా ఉద్గీథ ఉపాసన చేయమనీ, అప్పుడు అతనికి అనేకమంది పుత్రులు కలుగుతారనీ సలహా ఇస్తాడు. పూర్వకాలం ఎక్కువమంది సంతానం ఉండాలని కోరుకునేవారు. అలాగే దీవించేవారు కూడా.

ఇది అధి దైవ ఉపాసన.

**మంత్రాలు 3,4:– పంచవృత్తిరూప ప్రాణ దృష్ట్యా ఉద్గీథ ఉపాసన:–** ఇది ఆధ్యాత్మ ఉపాసన. ఆదిత్య ఉపాసన లాగే ఇది కూడా. ముందు ఖండంలో ఆదిత్యని ఒక్కటిగా ఉపాసన చేస్తే, ఇక్కడ అనేక కిరణాలున్న ఆదిత్యగా ఉపాసన చేస్తాము. అలాగే ముందు ఖండంలో ప్రాణాన్ని ఒక్కటిగా ఉపాసన చేస్తే, ఇక్కడ పంచప్రాణాలుగా ఉపాసన చేస్తాము. వృత్తి అంటే మామూలుగా ఆలోచన. ఇక్కడ విధులు.

| | | |
|---|---|---|
| ప్రాణం | – | శ్వాసక్రియ |
| అపానం | – | విసర్జనక్రియ |
| వ్యానం | – | రక్తప్రసరణ క్రియ |
| సమానం | – | జీర్ణక్రియ |
| ఉదానం | – | తిరోగమన క్రియ |

కౌశీతకీ ఏకప్రాణ ఉపాసన చేయటం వల్ల ఒక పుత్రుడు పుట్టాడు. అందువల్ల ప్రాణ ఉపాసన పంచవృత్తులు ఉన్నట్లుగా లేదా అనేక వృత్తులు ఉన్నట్లుగా చెబుతారు.

**ఫలం–** ఈ రెండు ఉపాసనలకూ బహుపుత్ర లాభం.

**మంత్రం–5 :– ఉద్గీథ ప్రణవ ఐక్య ఉపాసన:–** ఉద్గీథ అంటే ఓంకారం. ప్రణవ అర్థం కూడా ఓంకారమే. అందువల్ల ఇది ప్రణవ ప్రణవ ఐక్యంగా కనబడుతుంది. ఉద్గీథ అంటే సామవేదంలో గానం చేసే ఓంకారం. ప్రణవ అంటే తక్కిన వేదాలలో ధ్యానం చేసే ఓంకారం. ఇక్కడ ప్రణవ అంటే ఋగ్వేదం తీసుకోవాలి. ఋగ్వేద ఋత్విక్కులను హోతా అనీ, సామవేద ఋత్విక్కులను ఉద్గాత అనీ అంటారు. ఇక్కడ ఉపాసన ఉద్గీథ ప్రణవ ఐక్య ఉపాసన; హోతా, ఉద్గాతల ఐక్య ఉపాసన, యజ్ఞంలో ఒక భాగంగా చేస్తారు ఈ ఉపాసనని. అందుకే ఇందులో వచ్చే ఉపాసనలు చాలామటుకు కర్మాంగ ఉపాసనలు.

**ఫలం–** సామవేద ఋత్విక్కు తప్పుగా గానం చేసినా, ఋగ్వేద ఋత్విక్కు సరిగ్గా చేస్తే ఆ లోటు భర్తీ అవుతుంది. హోతా కూడా తప్పు చేస్తే చేయగలిగిందేమీ లేదు. ఇద్దరు కలిసి చేస్తున్నప్పుడు ఒకళ్ళు తప్పు చేసినా రెండోవాళ్ళు సరిగ్గా చేస్తే ఆ లోపం తెలియదు. అందుకే హోతా చేసే కర్మ సవ్యంగా ఉంటే సామగానంలో పొరపాటు దొర్లినా ఫరవాలేదు. సామవేదంలో పొరపాటు దొర్లే అవకాశాలు ఎక్కువ. యజుర్వేదమే సరిగ్గా చెప్పలేము. అలాంటిది సామవేదాన్ని సప్తస్వరాలతో గానం చేయాలంటే ఇంకా కష్టం. అందుకే సామవేద ఋత్విక్కు సామగానం చేసేముందు ఉద్గీథ ప్రణవ ఐక్య ఉపాసన చేయాలి.

## షష్ఠః ఖణ్డః (6)

**ఇయమేవర్గగ్నిస్సామ తదేతదేతస్యామృచ్యధ్యూఢగ్ం సామ తస్మాదృచ్యధ్యూఢగ్ం సామ గీయతే ఇయమేవ సాఽగ్నిరమస్తత్సామ ॥ 1 ॥ అన్తరిక్షమేవర్గ్వాయుస్సామ తదేతదేతస్యామృచ్యధ్యూఢగ్ం సామ తస్మాదృచ్యధ్యూఢగ్ం సామ గీయతేఽన్తరిక్షమేవ సా వాయురమస్తత్సామ ॥ 2 ॥ ద్యౌరేవర్గాదిత్య స్సామ తదేతదేతస్యామృచ్యధ్యూఢగ్ం సామ తస్మాదృచ్యధ్యూఢగ్ం సామ గీయతే ద్యౌరేవ సాఽఽదిత్యోఽమస్తత్సామ ॥ 3 ॥ నక్షత్రాణ్యేవర్క్ చంద్రమాః సామ తదేతదేతస్యామృచ్యధ్యూఢగ్ం సామ తస్మాదృచ్యధ్యూఢగ్ం సామ గీయతే నక్షత్రాణ్యేవ సా చంద్రమా అమస్తత్సామ ॥ 4 ॥ అథ యదేతదాదిత్యస్య శుక్లం భాస్సైవర్గథ యన్నీలం పరః కృష్ణం**

**తత్సామ తదేతదేతస్యామృచ్యధ్యూఢగ్ం సామ తస్మాదృచ్యధ్యూఢగ్ం సామ గీయతే ॥ 5 ॥ అథ యదేవైతదాదిత్యస్య శుక్లం భాస్సైవ సా౽థ యన్నీలం పరః కృష్ణం తదమస్తత్సామాథ య ఏషో౽న్తరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే హిరణ్యశ్మశ్రుర్హిరణ్యకేశ ఆప్రణఖాత్సర్వ ఏవ సువర్ణః ॥ 6 ॥ తస్య యథా కప్యాసం పుణ్డరీకమేవమక్షిణీ తస్యోదితి నామ। స ఏష సర్వేభ్యః పాప్మభ్య ఉదిత ఉదేతి హ వై సర్వేభ్యః పాప్మభ్యో య ఏవం వేద ॥ 7 ॥ తస్యర్క్చ సామ చ గేష్ణౌ తస్మాదుద్గీథస్తస్మాత్త్వేవోద్గాతైతస్య హి గాతా। స ఏష యే చాముష్మాత్పరాంచో లోకాస్తేషాంచేష్టే దేవకామానాం చేత్యధిదైవతమ్ ॥8॥**

**విశేష గుణ సంపన్న పరమేశ్వర ఉపాసన:-** ఇది కర్మాంగ ఉపాసన. ఈ ఉపాసనలో ఒక అంగ ఉపాసనతోపాటు 5 అంగ ఉపాసనలు కలిపి చేయాలి. అంగ ఉపాసన దానంతట అది ఫలం ఇవ్వదు. అంగీ ఉపాసనతో దీన్ని జతచేస్తే ఫలం ఎక్కువగా ఉంటుంది.

ఈ అంగీ ఉపాసన పేరు విశేషగుణ సంపన్న పరమేశ్వర ఉపాసన. అనేక విశిష్ఠ గుణాలున్న ఈశ్వరుని మీద ఉపాసన ఇది.

**మంత్రాలు 1-6** (6లో సగం వరకూ):- **అంగ ఉపాసన.** ఒకదానితో ఒకటి సంబంధం ఉన్న జంటలు తీసుకోబడ్డాయి. అంటే ఒకటి ఆశ్రయం. ఇంకోటి ఆశ్రయి. ఇలా ఐదు జతల దేవతలు తీసుకోబడ్డాయి.

| **ఆశ్రయం** | **ఆశ్రయి** |
|---|---|
| 1. పృథివీ | అగ్ని |
| 2. అంతరిక్షం | వాయువు |
| 3. ద్యౌ (స్వర్గం) | సూర్యుడు |
| 4. నక్షత్రాలు | చంద్రుడు |
| 5. శుక్లభా (సూర్యునిలో కాంతివంతమైన ప్రదేశం) | కృష్ణభా (సూర్యునిలో నల్లని చుక్క) |

ఈ ఐదు జతల దేవతలను, రెండు జతల ఆలంబనాల మీద ఉపాసన చేయాలి.

**ఆలంబన జత 1 –** ఋగ్వేదం–సామవేదం– అవి కూడా ఆశ్రయం– ఆశ్రయీ. సామవేద మంత్రాలు ఋగ్వేదంలోంచి గ్రహించబడ్డవే. కాకపోతే వాటిని సామవేదంలో గానం చేస్తారు.

ఆలంబన జత 2:– సామ అంటే సా+అమ. ఈ రెండూ కలవకపోతే సామ లేదు. సా ఆశ్రయం, అమ ఆశ్రయి. ఈ రెండింటి మీదా పైన ఉదహరించిన ఐదు జతల దేవతలనూ ఆవాహన చేయాలి.

| **అంగ ఉపాసన 1** | | **అంగ ఉపాసన 2** | |
|---|---|---|---|
| **ఋగ్వేదం** | **సామవేదం** | **సా +** | **అమ** |
| 1. పృథివీ | అగ్ని | పృథివీ | అగ్ని |
| 2. అంతరిక్షం | వాయువు | అంతరిక్షం | వాయువు |
| 3. ద్యౌః(స్వర్గం) | ఆదిత్యుడు | ద్యౌః(స్వర్గం) | సూర్యుడు |
| 4. నక్షత్రాలు | చంద్రుడు | నక్షత్రాలు | చంద్రుడు |
| 5. శుక్లభా | కృష్ణభా | శుక్లభా | కృష్ణభా |

**మంత్రాలు 6 (మధ్యనుంచి)–8:– అంగీ ఉపాసన.** ముందు చెప్పినట్టుగా ఇది విశేష గుణ సంపన్న పరమేశ్వర ఉపాసన. ఇది శాస్త్రంలో చాలా ముఖ్యమయిన ఉపాసన. శంకరాచార్యులు దీన్ని తరచూ పేర్కొంటారు. బ్రహ్మసూత్రాల్లో (1–1–20,21) ఈ ఉపాసనను ప్రత్యేకంగా విశ్లేషించారు.

ఇది పరమేశ్వర ఉపాసన. పరమేశ్వరుడంటే ఎవరు? నిర్గుణం బ్రహ్మ మీద ఉపాసన ఉండదు ఎన్నడూ. ఎందుకు?

**ఉపాసక రూపత్వాత్ ఉపాస్యం న భవతి**

నిర్గుణం బ్రహ్మ ఎన్నటికీ ఉపాసన చేయబడే వస్తువు కాదు. ఎందుకంటే అది ఉపాసన చేసే ఉపాసకుడు కాబట్టి.

పూజ చేసే నువ్వు బ్రహ్మవి ఎప్పటికీ, పూజింపబడే దేవత కాదు ఎన్నటికీ. అందువల్ల ఉపాసన అంటే సగుణ బ్రహ్మ మీదే. అది ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. సగుణ బ్రహ్మ ఉపాసనలో కూడా రెండు రకాల ఉపాసనలు ఉన్నాయి. దేవతా ఉపాసనా, ఈశ్వర ఉపాసన.

దేవతలకూ, ఈశ్వరునికీ మధ్య తేడా ఏమిటి? దేవత ఈశ్వరుడు కాదు.

**ఎ. జీవ –** దేవతలు జీవాల్లో ఉన్నతస్థాయిలో ఉన్నారు.

**ఉత్కృష్ట జీవః ఏవ దేవతా**

వాళ్ళు చేసిన ప్రత్యేక సాధన వల్ల లేదా కర్మ ఉపాసన విశేషం వల్ల దేవతలు అయ్యారు. మనకన్నా ఉన్నతస్థాయిలో ఉన్నారు కాబట్టి వాళ్ళను ఉపాసన చేస్తాము.

**బి. సంసారి –** దేవతల్లో కూడా రాగద్వేషాలు ఉంటాయి. ఎవరైనా తపస్సు చేస్తుంటే ఇంద్రుడు బెదిరిపోవటం చూస్తూనే ఉంటాము. వాళ్ళకు దానంతట అదే మోక్షం రాదు. వాళ్ళకి కూడా, మనలాగే, జ్ఞానం వల్లే మోక్షం కలుగుతుంది.

**సి. రూపం –** దేవతలకు కూడా ప్రత్యేక రూపం ఉంటుంది. వాళ్ళు సర్వవ్యాపులు కారు. మనకన్నా కొన్ని అదనపు శక్తులు ఉంటాయి. వాళ్ళమీద చేసే పూజలో వాళ్ళ వాహనం, వాళ్ళ రూపం, వాళ్ళుండే దిక్కు లాంటి వివరాలు వస్తాయి.

**డి.అల్పజ్ఞులు –** దేవతలు కూడా మనలాగే అల్పజ్ఞులు. ఈశ్వరునిలాగా సర్వజ్ఞులు కారు. కాకపోతే మనుష్యులకన్నా జ్ఞానశక్తి, క్రియాశక్తి వాళ్ళలో అధికంగా ఉంటాయి. అరుదుగా మనలోనూ అలాంటి శక్తులు ఎక్కువగా ఉన్నవారు లేకపోలేదు.

**ఇ. శుద్ధం –** దేవతలు ఈశ్వరునిలా పూర్తిగా శుద్ధం కాదు.

**యఫ్. కాలపరిమితి –** దేవతలు అమరులు కారు. వాళ్ళకు కూడా జీవితకాలం ఉంటుంది. కాకపోతే మనుష్యులకన్నా చాలా ఎక్కువ కాలం ఉంటుంది.

చాలా ఉపాసనలు దేవతలకు చేసే ఉపాసనలు ఉంటాయి. కాని ఈ ఉపాసన ఈశ్వరునికి చేసే ఉపాసన. ఈశ్వరుడెవరు? మాయా విశిష్ట బ్రహ్మ. మాయ + బ్రహ్మ = ఈశ్వరుడు. బ్రహ్మకు రూపం లేదు.

**అశబ్దమస్పర్శమరూపమవ్యం।**

**తథాఽరసం నిత్యమగన్ధవచ్చయత్।।  కఠ 1-3-15**

మాయకు రూపం లేదు. జగత్తు మాయలో బీజరూపంలో ఉంటుంది.

**పరోక్షం న తు ప్రత్యక్షం**

మాయ నుంచి సత్వ, రజ, తమో గుణాలున్న జగత్తు వస్తుంది. రూపంలేని మాయ నుంచి అనేక నామరూపాలు వస్తాయి.

**అప్రత్యక్షం బ్రహ్మ + అప్రత్యక్షం మాయ = అప్రత్యక్షమైన ఈశ్వరుడు.**

ఈశ్వరుడు నిర్గుణబ్రహ్మ అయితే ఉపాసన ఎలా చేయాలి? ఈశ్వరుని మీద ఉపాసన కోసం శాస్త్రమే కొన్ని గుణాలను ఆపాదిస్తుంది. అలా విశిష్ట గుణ సంపన్న పరమేశ్వరుడయ్యాడు. ఉపాసకుడు ఒక రూపాన్ని ఉపాసన చేయటం కోసం, ఈశ్వరుడు రామునిగా, కృష్ణునిగా అవతారాలెత్తాడు. (జన్మనెత్తాడు అనకూడదు) రామునిది అవతారం, మనది పుట్టుక. దేవతలది కూడా పుట్టుకే. దీన్ని విశిష్ట గుణ సంపన్న పరమేశ్వర ఉపాసన అంటారు.

ఇంకోరకం ఉపాసనను ప్రతీక ఉపాసన అంటారు. రూపం లేని ఈశ్వరుడిని రూపం ఉన్న ప్రతీక మీద ఆవాహన చేయాలి. ఉదాహరణ ఓంకారం, సాలిగ్రామం, శివలింగం.

కాని ఇక్కడ ప్రతీక ఉపాసన కాదు. విశిష్ట గుణ సంపన్న పరమేశ్వర ఉపాసన చేయాలి. పరమేశ్వరుడు ఒక స్థానానికే అంకితమవకపోయినా, ఉపాసన కోసం ఒక స్థానం కల్పిస్తాము. ఈ ఖండంలో కల్పించిన స్థానం సూర్యమండలం. ఇది అధిదైవ ఉపాసన. తరువాతి ఖండంలో (ఖండం–7లో) కల్పించిన స్థానం దక్షిణ అక్షి (కుడికన్ను). దీన్ని ఆధ్యాత్మ ఉపాసన అంటారు.

అధిదైవ పరమేశ్వర ఉపాసనలో పరమేశ్వరుని విశిష్ఠ గుణాలు –

**ఎ. హిరణ్మయం:–** శరీరం అంతటా బంగారురంగులో ఉంటాడు. కేశాలు, మీసం, గడ్డం, అంతా కూడా బంగారు వర్ణం. అందుకే ఈ ఉపాసనను **హిరణ్మయ పురుష ఉపాసన** అని శాస్త్రంలో తరచు పేర్కొంటారు. బంగారు రంగు ఎందుకు? ఆదిత్య మండలం కాబట్టి. ఇక్కడ కూడా కల్పన తోడయ్యింది. బంగారురంగు సూర్యకిరణాలను కేశాలుగానూ, కిందికి దిగివచ్చే కిరణాలను మీసం, గడ్డాలుగానూ అభివర్ణించటం జరిగింది.

**బి. కప్యాసం పుణ్డరీకమేవమక్షిణీ –** కళ్ళు కలువరేకుల్లాగా కాంతివంతంగా ఉన్నాయి. కలువ పువ్వును కోతి వెనుకభాగంతో పోల్చటం జరిగింది. కపి+ఆసం = కప్యాసం; కోతి పృష్ఠభాగం. కోతి పృష్ఠభాగానికి ఉన్న ఎఱ్ఱరంగుతో ఈశ్వరుని కళ్ళను పోల్చటం హీనోపమానం (హీనమైన పోలిక) అన్నారు కొందరు భాష్యకారులు. దీనికి ఇంకో అర్థం సూర్యునిచే ప్రకాశింపబడుతున్న కలువ అన్నారు శ్రీరామానుజాచార్యులు వారు.

శ్రీ శంకరాచార్యులవారు, మరికొందరు భాష్యకారులు ఇది హీనోపమానం కాదని, ఉపమిత ఉపమానం అనీ తేల్చారు. పోలిక ప్రత్యక్షంగా

దేవునికి కాదు. దేవుని కళ్ళు కలువపువ్వులా ఉన్నాయి. కలువపువ్వు కోతి పృష్ఠంలా ఉంది అని అర్థం, అంటే పోలికకి పోలికే కాని ప్రత్యక్ష పోలిక కాదని బ్రహ్మసూత్రాల్లో నిరూపించారు. బ్రహ్మసూత్రాల్లో వాదోపవాదాలు ఎలా ఉంటాయి అన్నదానికి ఇదొక మచ్చుతునక.

**సి. ఉత్‌నామత్వం –** అన్ని పాపాలకు అతీతుడు. పాపాతీతుడు.

**డి. ఋగ్‌సామగౌష్ణత్వం –** గౌష్ణం అంటే వెదురు కర్ర మధ్యలో ఉన్న కణుపులు. తుది అర్థం ఒక భాగం. ఋగ్, సామ వేదాలు పరమేశ్వరునిలో అంగాలు. ఇక్కడ మనం ఈ ఖండం మొదట్లో చూసిన అంగ ఉపాసనలను గుర్తు తెచ్చుకోవాలి. ఋగ్వేదం, సామవేదాలను; సా, ఆమలను ఆలంబనలుగా తీసుకుని వాటి మీద ఐదు జతల దేవతలను ఆవాహనం చేస్తాము. అవి వరుసగా పృథివీ– అగ్ని; అంతరిక్షం– వాయువు; స్వర్గం–ఆదిత్య; నక్షత్రాలు–చంద్రుడు; శుక్లభా– కృష్ణభా; దీనివల్ల ఋగ్వేదం, సామవేదాలు మాత్రమే కాదు, పృథివీ, అంతరిక్షం అన్నీ పరమేశ్వరునిలో భాగాలు. కాబట్టి అందువల్ల విశ్వరూపత్వం, సర్వాత్మత్వం అర్థాలు వస్తాయి. **ఇ. ఉద్గీథత్వం –** ఇంతవరకూ ఏమన్నాం? ఉద్గీథ అంటే సామవేదంలో గానం చేసే ఓంకారం అన్నాము. కాని ఇక్కడ ఉద్గీథ అంటే పరమేశ్వరుడే. ఎందుకు? ఉద్గీథ అసలు అర్థం తీసుకుంటే హెచ్చుస్థాయిలో ఉన్నది అని అర్థం. ఇక్కడ పరమేశ్వరుని హెచ్చుస్థాయిలో కొలుస్తున్నామని అర్థం.

**యఫ్. ఊర్ధ్వలోక కామ ఈశత్వం –** స్వర్గలోకాలలోని కోరికలకు అధిపతి. అధో లోక కామ ఈశ్వతం లేదా? ఉంది. అది తర్వాత ఖండంలో చేసే ఆధ్యాత్మ ఉపాసనకు వస్తుంది.

**ఫలం –** ఫలం ఈ ఖండంలో రాదు. రెండు ఉపాసనలూ కలిపి తరువాత ఖండంలో వస్తుంది. కాని ఈశ్వరుని పాపాతీతుడుగా కొలుస్తున్నాం కాబట్టి అన్ని పాపాలు పోతాయి. ఊర్ధ్వలోక పరమేశ్వరునిగా కొలుస్తున్నాం కాబట్టి ఊర్ధ్వలోక ప్రాప్తి కలుగుతుంది. (మోక్షం కలుగదు)

ఈ విశిష్ట గుణ సంపన్న పరమేశ్వర ఉపాసన అంగీ ఉపాసన. రెండు జతల ఆలంబనల మీద ఐదేసి జతల దేవతలను కొలిచే అంగ ఉపాసన దీనితో కలిపి చేయాలి. పృథివీ, అగ్ని లాంటి దేవతలున్నారు కాబట్టి స్థానం ఆదిత్య మండలం కాబట్టి దీన్ని అధిదైవ ఉపాసన అని అంటారు.

## సప్తమః ఖణ్డః (7)

**అథాధ్యాత్మం వాగేవర్క్ప్రాణస్సామతదేతదేతస్యామృచ్యధ్యూఢగ్ం సామ తస్మాదృచ్యధ్యూఢగ్ం సామ గీయతే। వాగేవ సా ప్రాణోఽమస్తత్సామ ॥1॥ చక్షురేవర్గాత్మా సామ తదేతదేతస్యామృచ్యధ్యూఢగ్ం సామ తస్మాదృచ్యధ్యూఢగ్ం సామ గీయతే । చక్షురేవ సాఽత్మాఽమస్తత్సామ ॥2॥ శ్రోత్రమేవర్ఙ్మనస్సామ తదేతదేతస్యామృచ్యధ్యూఢగ్ం సామ తస్మాదృచ్యధ్యూఢగ్ం సామ గీయతే । శ్రోత్రమేవ సా మనోఽమస్తత్సామ ॥3 ॥ అథ యదేతదక్ష్ణశ్శుక్లం భాః సైవర్గథ యన్నీలం పరః కృష్ణం తత్సామ తదేతదేతస్యామృచ్యధ్యూఢగ్ం సామ। తస్మాదృచ్యధ్యూఢగ్ం సామ గీయతే। అథ యదేవైతదక్ష్ణశ్శుక్లం భా సైవ సాథ యన్నీలం పరః కృష్ణం తదమస్తత్సామ ॥4॥ అథ య ఏషోఽన్తరక్షిణి పురుషో దృశ్యతే సైవర్క్తత్సామ తదుక్థం తద్యజుస్తద్బ్రహ్మ। తస్యైతస్య తదేవ రూపం యదముష్య రూపం యావముష్య గేష్ణౌ తౌ గేష్ణౌ యన్నామ తన్నామ ॥5॥ స ఏష యే చైతస్మాదర్వాంచో లోకాస్తేషాం చేష్టే మనుష్యకామానాం చేతి। తద్య ఇమే వీణాయాం గాయన్త్యేతం తే గాయన్తి తస్మాత్తే ధనసనయః ॥6॥ అథ య ఏతదేవం విద్వాన్సామ గాయత్యుభౌ స గాయతి। సోఽమునైవ స ఏష యే చాముష్మాత్పరాంచో లోకాస్తాగ్ంశ్చాప్నోతి దేవకామాగ్ంశ్చ ॥7॥ అథానేనైవ యే చైతస్మాదర్వాంచో లోకాస్తాగ్ంశ్చాప్నోతి మనుష్యకామాగ్ంశ్చ తస్మాదు హైవంవిదుద్గాతా బ్రూయాత్ ॥8॥ కం తే కామమాగాయానీత్యేష హ్యేవ కామాగానస్యేష్టే య ఏవం విద్వాన్సామ గాయతి సామ గాయతి ॥9॥**

ఇక్కడ కూడా ఒక అంగీ, కొన్ని అంగ ఉపాసనలు కలిపి చేస్తాము. దీన్ని కూడా **విశిష్ట గుణ సంపన్న పరమేశ్వర ఉపాసన** అంటాము అంగీ ఉపాసనపరంగా. కాకపోతే పరమేశ్వరుని కొలవటానికి తీసుకున్న స్థానాలు మారుతాయి. అక్కడ ఆదిత్య మండలం తీసుకుంటే, ఇక్కడ దక్షిణ అక్షి (కుడికన్ను) తీసుకుంటాము. కన్ను తీసుకున్నాము కాబట్టి దీన్ని **ఆధ్యాత్మ ఉపాసన** అంటారు.

అంగ ఉపాసన విషయంలో ఆలంబనల్లో మార్పులేదు. రెండు జతల ఆలంబనలు తీసుకుంటాము. అవి ఋగ్, సామ; సా+ అమ.

వాటిమీద కొలిచే దేవతలు మారుతారు.

**మంత్రాలు 1-4 - అంగ ఉపాసన**

| ఋగ్ | సామ | సా + | అమ |
|---|---|---|---|
| 1. వాక్కు | ప్రాణం | వాక్కు | ప్రాణం |
| 2. చక్షువు | ఆత్మ(జాగృద్ పురుష) | చక్షువు | ఆత్మ (జాగృద్ పురుష) |
| 3. శ్రోత్రం | మనసు | శ్రోత్రం | మనస్సు |
| 4. శుక్లభా | కృష్ణభా | శుక్లభా | కృష్ణభా |

ప్రాణశక్తి లేకపోతే మాట్లాడలేము. కన్ను లేకపోతే చూడలేము; శ్రుతిని చెవులతో వినకపోతే, మనసులో జ్ఞానం ఏర్పడదు. శుక్లభా అంటే కంటిలోని తెల్లభాగం, కృష్ణభా అంటే కంటిలోని నల్లగుడ్డు.రెండూ కలిపితేనే కన్ను ప్రత్యక్ష ప్రమాణం అవుతుంది.

**మంత్రాలు 5,6:-** అంగీ ఉపాసన. పరమేశ్వరుడే ఉపాస్య దేవత. విశేష గుణ సంపన్న పరమేశ్వరుడు. ఏమిటా గుణాలు? చాలామటుకు ముందు మంత్రంలో వర్ణించిన గుణాలే వస్తాయి.

**ఎ.హిరణ్మయం**

**బి. కప్యాసం పుణ్డరీకమేవమక్షిణి**

**సి. ఉత్‌నామత్వం**

**డి. ఋగ్‌సామగౌష్ణత్వం**

**ఇ. ఉద్గీథత్వం**

ఇంతవరకూ అవే గుణాలు ఇక్కడ కూడా చెప్పబడ్డాయి.

**యఫ్. అధోలోక కామ ఈశత్వం:-** అంతకు ముందు ఊర్ధ్వలోక కామ ఈశ్వతం, ఇప్పుడు అధోలోక కామ ఈశత్వం.

**జి. ఐశ్వర్య వత్వం-** ఇది అదనపు గుణం. ఐశ్వర్యానికి అధిపతి. ఈ గుణాన్ని ఉపనిషత్తు ప్రత్యక్షంగా చెప్పదు. ఎవరైనా గాయకుడు వీణాగానంతో పరమేశ్వరుని కీర్తిస్తే అతను ఐశ్వర్యవంతుడవుతాడు అంటున్నది. అంటే పరమేశ్వరుడు ఐశ్వర్యవంతుడు కాబట్టి ఐశ్వర్యాన్ని ఇస్తాడు.

ఆధిదైవ ఉపాసనకూ, ఆధ్యాత్మ ఉపాసనకూ మధ్య ఉన్న తేడాల్లో స్థానం ఒకటి గుర్తుంచుకోవాలి. ఆధిదైవ ఉపాసనలో స్థానం ఆదిత్య మండలం అయితే, ఆధ్యాత్మ ఉపాసనలో స్థానం దక్షిణ అక్షి. ఈ రెండు ఉపాసనలనూ

అంటే ఆధిదైవ విశిష్ట గుణ సంపన్న పరమేశ్వర ఉపాసనా, అధ్యాత్మ విశిష్ట గుణ సంపన్న పరమేశ్వర ఉపాసనా కలిపి చేయాలని శంకరుల వారు బ్రహ్మసూత్రాల్లో విశ్లేషించారు. అంతరధికరణం (1-1-20,21)లో ఈ వివరణ కనిపిస్తుంది.

**మంత్రాలు 7-9 ఫలం:-** యథా యథా ఉపాస్తే తదేవ భవతి

పాపాతీతుడు - పాపానికి అతీతునిగా కొలిస్తే మనం కూడా అంతఃకరణ శుద్ధి పొంది పాపాలకు అతీతంగా అవుతాము.

ఊర్ధ్వ అధోలోక ఈశ్వరుడు:- జీవించి ఉండగా అధోలోకానికి అధిపతి అయి, మరణించాక ఊర్ధ్వలోక అధిపతి అవుతాము.

కామ ఈశత్వం- ఇహలోక, పరలోక కోరికలు తీరుతాయి. స్వర్గలోకప్రాప్తి కలుగుతుంది. ఇవన్నీ సకామ ఉపాసన ఫలాలు.

నిష్కామ ఉపాసన- ఈ ఉపాసనను నిష్కామంగా చేస్తే చిత్తశుద్ధి, చిత్త సంస్కారం, చిత్త ఏకాగ్రత, చిత్త వైశాల్యం కలుగుతాయి.

**అష్టమః ఖణ్డః (8)**

**త్రయో హోద్గీథే కుశలా బభూవుః శిలకశ్శాలావత్యశ్చైకితాయనో దాల్భ్యః ప్రవాహణో జైవలిరితి తే హోచురుద్గీథే వై కుశలాస్స్మో హన్తోద్గీథే కథాం వదామ ఇతి ॥1॥ తథేతి హ సముపవివిశుస్స హ ప్రవాహణో జైవలిరువాచ భగవన్తావగ్రే వదతాం బ్రాహ్మణయోర్వదతోర్వాచగ్ం శ్రోష్యామీతి॥2॥ స హ శిలకశ్శాలావత్యశ్చైకితాయనం దాల్భ్యమువాచ హన్త త్వా పృచ్ఛానీతి పృచ్ఛేతి హోవాచ ॥3॥ కా సామ్నో గతిరితి స్వర ఇతి హోవాచ స్వరస్య కా గతిరితి ప్రాణ ఇతి హోవాచ। ప్రాణస్య కా గతిరిత్యన్నమితి హోవాచాన్నస్య కా గతిరిత్యాప ఇతి హోవాచ ॥4॥ అపాం కా గతిరిత్యసౌ లోక ఇతి హోవాచాముష్య లోకస్య కా గతిరితి న స్వర్గం లోకమతినయేదితి హోవాచ స్వర్గం వయం లోకగ్ం సామాభిసగ్ం స్థాపయామ స్స్వర్గసగ్ంస్తావగ్ం హి సామేతి ॥5॥ తగ్ంహ శిలకశ్శాలావత్యశ్చైకితాయనం దాల్భ్యమువాచాప్రతిష్ఠితం వై కిల తే దాల్భ్య సామ యస్త్వేతర్హి బ్రూయాన్మూర్ధా తే విపతిష్యతీతి మూర్ధా తే విపతేదితి ॥6॥ హన్తాహమేతద్భగవతో వేదానీతి విద్ధీతి హోవాచాముష్య లోకస్య కా గతిరిత్యయం లోక ఇతి హోవాచాస్య లోకస్య కా గతిరితి న ప్రతిష్ఠాం**

**లోకమతినయేదితి హోవాచ ప్రతిష్ఠాం వయం లోకగ్ం సామాభిసగ్ం స్థాపయామః ప్రతిష్ఠాసగ్ం స్తావగ్ం హి సామేతి ॥7॥ తగ్ం హ ప్రవాహణో జైవలిరువాచాన్తవద్వై కిల తే శాలావత్య సామ యస్త్వేతర్హి బ్రూయాన్మూర్ధా తే విపతిష్యతీతి మూర్ధా తే విపతేదితి హన్తాహమేతద్భగవతో వేదానీతి విద్ధీతి హోవాచ॥8॥**

**పరోవరీయత్వ గుణ విశిష్ట పరమేశ్వర ఉపాసన** – ఇది కూడా పరమేశ్వర ఉపాసనే. ముందు రెండు ఖండాల్లో విశేష గుణ సంపన్న పరమేశ్వర ఉపాసన చూశాము. ఆధిదైవపరంగా, ఆధ్యాత్మికంగా. ఇప్పుడు పరోవరీయత్వ గుణ విశిష్ట పరమేశ్వర ఉపాసన చూస్తాము.

ఈ ఉపాసనలో ఒక్కటే గుణాన్ని కీర్తిస్తాము. అది పరోవరీయత్వం. దేవ దేవోత్తమలాంటి పదం ఇది. పర అంటే శ్రేష్ఠం. వరీయాన్ అంటే శ్రేష్ఠమైన వాటికన్నా శ్రేష్ఠమైనది. ఈ ఉపాసనకు మొదటి ఖండాల్లో చూసినట్టుగా ఆలంబన ఉద్గీథ. అంటే ఉద్గీథ మీద పరోవరీయ పరమేశ్వరుని ఆవాహన చేసి, ఉద్గీథ ఉపాసన చేయాలి. ఎందుకు? పరమేశ్వరుడు అవ్యక్తం కాబట్టి, రూపమున్న ఓంకారాన్ని ఆలంబనగా తీసుకుంటాము. అందుకని ఈ ఉపాసన పూర్తి పేరు – పరోవరీయత్వ గుణ విశిష్ట పరమేశ్వర దృష్ట్యా ఉద్గీథ ఉపాసన.

ఉపనిషత్తు పరోవరీయ గుణం ఉన్న పరమేశ్వరుడని ప్రత్యక్షంగా చెప్పేసి ఉండవచ్చు. కాని ఈ అంశాన్ని కొనియాడటానికి, ఒక సుదీర్ఘమైన మార్గం తీసుకుంది. దీనికొక కథను జత చేసింది.

ముగ్గురు విద్యార్థులు ఒకచోట కలుసుకుంటారు. వాళ్ళ పేరు శిలకుడు, దాల్భ్యుడు, ప్రవాహణుడు. మొదటి ఇద్దరూ బ్రాహ్మణులు. ప్రవాహణుడు క్షత్రియుడు. వాళ్ళు ఉద్గీథ గురించి చర్చిద్దామనుకుంటారు. ఉద్గీథ యొక్క ఆశ్రయ విచారణ చేద్దామనుకున్నారు. పరమ ఆధారం ఎవరు? మొదట శిలకుడు దాల్భ్యుడిని ప్రశ్నిస్తే అతను కొంతమేరకు వెళ్తాడు. దాని తర్వాత శిలకుడు ఇంకొంచెం ముందుకు వెళ్తాడు. అంతవరకూ ప్రేక్షకుడిగా ఉన్న క్షత్రియుడు, ఉద్గీథ అంతిమ ఆశ్రయం ఏమిటో చెప్తాడు. బృహదారణ్యకంలో కూడా క్షత్రియుడైన జనకునికి బ్రాహ్మణులకన్నా ఎక్కువ

తెలుసు. కాని వాళ్ళు బ్రాహ్మణుల ముందు వినయంగానే ఉంటారు.
**మంత్రాలు 1-5** – శిలకుని ప్రశ్నలకు దాల్భ్యుని సమాధానాలు –
సామానికి గతి (ఆశ్రయం) ఏమిటి? సామ అంటే ఉద్గీథ
స్వరం– స్వరం అంటే శబ్దం. సరియైన శబ్దం లేకపోతే ఉద్గీథ గానం చేయలేము.
స్వరానికి గతి ఏమిటి?
ప్రాణం – (వాయువు). ప్రాణశక్తి బాగా లేకపోతే మంచి స్వరం ఉండదు. అందుకే శ్వాసకోశ సమస్యలున్నవాళ్ళు పాడలేరు.
ప్రాణానికి గతి ఏమిటి?
అన్నం – అన్నం తింటేనే ప్రాణశక్తి వస్తుంది.
అన్నంకి గతి ఏమిటి?
జలములు – వర్షాలు కురవకపోతే అన్నం లేదు.
వర్షానికి గతి ఏమిటి?
అసౌలోకం – స్వర్గలోకం. మేఘాలు వర్షానికి అధారం.
స్వర్గలోకానికి గతి ఏమిటి?
దాల్భ్యునికి అంతవరకే తెలుసు.
**మంత్రాలు 6,7** – ఇప్పుడు వీళ్ళ స్థానాలు మారుతాయి. శిలకుడు నువ్వు పూర్తిగా చెప్పలేదు అంటాడు. స్వర్గలోకం కూడా శాశ్వతం కాదు అంటాడు.

**క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి** – **గీత**

**మూర్ధాతే విపతిష్యతి** – తప్పు చెప్తే నీ తల పగిలిపోతుంది అంటాడు.
(ఈ మాట ఈ ఉపనిషత్తులో పదే పదే వస్తుంది.) ఇప్పుడు దాల్భ్యుడు అడుగుతుంటే, శిలకుడు జవాబులు చెప్తాడు.
స్వర్గలోకానికి ఆధారం ఏమిటి?
అయం లోకం – భూలోకం. భూలోకంలో యజ్ఞాలు చేసి ఇంద్రాది దేవతలకు ఇచ్చే ఆహుతులే స్వర్గలోకానికి ఆధారం. భూలోకాన్ని ప్రతిష్ఠాలోకం అంటారు.
భూలోకానికి ఆధారం ఏమిటి?
శిలకునికి అంతవరకే తెలుసు. భూలోకమే పరమ ఆశ్రయం అంటాడు.
మంత్రం 8 – అప్పుడు ప్రవాహణుడు అందుకుని శిలకునికి కూడా తెలియదు అంటాడు.
ఉద్గీథకి పరమ ఆశ్రయం, సర్వాధారం పరమేశ్వరుడు. స్వర్గలోకం, భూలోకాలు

పరిచ్ఛిన్నలోకాలు అంటే అశాశ్వతాలు. పరిచ్ఛిన్న లోకం సర్వాధారం కాదు. అందుకని ఇవి తప్పు జవాబులనీ, అలా తప్పు జవాబు చెప్తే మీ తల పగులుతుందనీ చెప్తాడు. అప్పుడు ఇద్దరూ భయపడిపోయి, వాళ్ళు బ్రాహ్మణులయినా క్షత్రియుని జవాబు చెప్పమని కోరతారు. ప్రవాహణుడు చెప్పే జవాబు తరువాత వచ్చే ఖండంలో వస్తుంది.

**నవమః ఖణ్డః (9)**

**అస్య లోకస్య కా గతిరిత్యాకాశ ఇతి హెూవాచ సర్వాణి హ వా ఇమాని భూతాన్యాకాశాదేవ సముత్పద్యన్త ఆకాశం ప్రత్యస్తం యన్త్యాకాశో హ్యేవైభ్యో జ్యాయానాకాశః పరాయణమ్ ॥1॥స ఏష పరోవరీయానుద్గీథస్స ఏషోఽనన్తః పరోవరీయో హాస్య భవతి పరోవరీయసో హ లోకాన్ జయతి య ఏతదేవం విద్వాన్పరోవరీయాగ్ంసముద్గీథముపాస్తే ॥2॥ తగ్ం హైతమతిధన్వా శౌనక ఉదరశాణ్డిల్యాయోక్త్వోవాచ యావత్త ఏనం ప్రజాయాముద్గీథం వేదిష్యన్తే పరోవరీయో హైభ్యస్తావదస్మింల్లోకే జీవనం భవిష్యతి ॥3॥ తథాఽముష్మింల్లోకే లోక ఇతి॥ స య ఏతదేవం విద్వానుపాస్తే పరోవరీయ ఏవ హాస్యాస్మింల్లోకే జీవనం భవతి తథాఽముష్మింల్లోకే లోక ఇతి లోకే లోక ఇతి ॥4॥**

**మంత్రం-1** – భూలోకానికి గతి ఏమిటి?
ముందు ఖండంలో భూలోకం గతి అనే అంశం దగ్గర ఆగింది. అందుకని ఈ ఖండంలో అక్కడ్నుంచీ కొనసాగింది.

ఆకాశం సర్వాధారం

ఇక్కడ కొన్ని ముఖ్యాంశాలు గమనించాలి.

ఇక్కడ ఆకాశం అంటే పరమేశ్వరుడు. శాస్త్రం తరచు ఆకాశం పదాన్ని పరమేశ్వరుడు అనే అర్థం వచ్చేలా వాడుతుంది. ఆకాశాన్ని పరమేశ్వరుడని ఎలా చెప్తుంది?

**ఆకాశవత్ సర్వగతః అసంగః ఏకః ఇతి పరమేశ్వరః.**

ఇది కాశ్ అనే ధాతువు నుంచి వచ్చింది. **ప్రకాశతే ఇతి ఆకాశః.** అంతటా ప్రకాశించేది అని అర్థం. సర్వగత చైతన్యం. బ్రహ్మ సూత్రంలో

ఆకాశాన్ని ఆకాశాధికరణం (1-1-22) లో విశ్లేషించారు. అక్కడ ఆకాశం అర్థాన్ని విశ్లేషించి, శంకరాచార్యులు ఆకాశం = బ్రహ్మ అని నిరూపిస్తారు.

**ఆకాశస్తల్లింగాత్**

ఆకాశాన్ని ఎందుకు పరమేశ్వరునితో పోల్చారు? శంకరాచార్యులు, పరమేశ్వరుని వర్ణించే గుణాలన్నీ ఇక్కడ ఆకాశానికి ఉపయోగించారు అంటున్నారు. అవి

**సర్వాణి హ వా ఇమాని భూతాన్యాకాశాదేవ సముత్పద్యన్తే -** ఈ జగత్తు ఆకాశం నుంచే పుట్టి, ఆకాశంలో లయం చెందుతుంది.

**యతోవా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవాని**
**జీవన్తి।యత్ ప్రయన్త్యభిసంవిశంన్తి। - తైత్తిరీయం**

శాస్త్రం ద్వారా పరమేశ్వరుడే జగత్తుకు కారణం అని మనకు తెలుసు. ఉపనిషత్తు ఇక్కడ ఆకాశం జగత్కారణం అంటోంది. ఈ రెండు వాక్యాలను కలిపితే ఆకాశం = పరమేశ్వరుడు - జగత్కారణ దృష్ట్యా. ఇక్కడ మనం గుర్తుంచుకోవాల్సిన చివరి అర్థం ఆకాశం జగత్కారణం; కారణం అంతిమ అధిష్టానం.

**మంత్రం 2 - పరోవరీయం -** శ్రేష్ఠమైనది, అనంతమైనది ఇక్కడ పరమేశ్వరుడంటే నిర్గుణ బ్రహ్మ కాదు. మాయా విశిష్ట బ్రహ్మ.

దీనితో సంవాదం అయిపోయింది. చివరికి ఆకాశం లేదా పరమేశ్వరుడు ఉద్గీథకు సర్వాధారం. సంవాదం ఉద్గీథతో మొదలయింది. ఉద్గీథకు చివరి ఆశ్రయం పరమేశ్వరుడు. అందువల్ల ఉద్గీథ ఆలంబనం మీద పరమేశ్వరుని ఆవాహన చేసి ఉపాసన చేయాలి. ఈ ఉపాసన పేరు- ఉద్గీథ ఆలంబనే పరోవరీయత్వ గుణ విశిష్ఠ పరమేశ్వర ఉపాసన.

**మంత్రాలు - 2,3,4:- ఫలశృతి-** అంతకు ముందు చూసిన సూత్రం వర్తిస్తుంది.

**యథా యథా ఉపాస్తే తదేవ భవతి**

ఉపాసన పరోవరీయ పరమేశ్వరుని మీద కాబట్టి మనం కూడా శ్రేష్ఠమైన వాళ్లలో శ్రేష్ఠమైన వాళ్ళమవుతాం. ఈ లోకంలోనే కాదు, మరణానంతరం వెళ్ళే ఊర్ధ్వలోకాల్లో కూడా. ఆ లోకాల్లో జీవన విధానం శ్రేష్ఠంగా ఉంటుంది.

## ఖండాలు - 10, 11

ఇక్కడ ఉపాసన సామ మంత్ర అవయవాల మీద. సామ మంత్రాలను ఒక పద్ధతి ప్రకారం 5 అవయవాలుగానూ, ఇంకో పద్ధతి ప్రకారం 7 అవయవాలుగానూ విభజించటం జరిగింది. వీటి గురించి మరింత వివరంగా రెండవ అధ్యాయంలో వస్తుంది. సామ మంత్ర అవయవాలను లేదా భాగాలను 'భక్తి' అంటారు.

భక్తి పదానికి సందర్భాన్ని బట్టి అర్థం మారుతూ వస్తుంది. భగవద్గీతలో భక్తి అంటే దాని వాచ్యార్థం భక్తి అనే వస్తుంది. తర్కశాస్త్రంలో, మీమాంస శాస్త్రాల్లో శక్తి, భక్తి అనే పదాలు వాడతారు. శక్తి అంటే ఒక పదం యొక్క వాచ్యార్థం, భక్తి అంటే లక్ష్యార్థం. కాని ఇక్కడ ఈ రెండూ కాకుండా మూడో అర్థం తీసుకోవాలి. సామ మంత్ర అవయవాన్ని భక్తి అంటున్నారు.

5 అవయవాలున్న సామ మంత్రం - పంచ విధ సామ ఉపాసన

7 అవయవాలున్న సామ మంత్రం - సప్త విధ సామ ఉపాసన

వీటి పేర్లు తర్వాత అధ్యాయంలో వస్తాయి. ప్రస్తుతం మూడు భక్తి పేర్లు తలచుకుంటే చాలు. అవి ప్రస్తావ, ఉద్గీథ, ప్రతిహార; ఈ మూడూ వరుసగా ప్రాణ ఉపాసన, ఆదిత్య ఉపాసన, అన్న ఉపాసనలకు ఆలంబనాలు.

| **ఆలంబనం** | **ఉపాసన** |
|---|---|
| ప్రస్తావ భక్తి | ప్రాణ ఉపాసన |
| ఉద్గీథ భక్తి | ఆదిత్య ఉపాసన |
| ప్రతిహార భక్తి | అన్న ఉపాసన |

బ్రహ్మసూత్రాల్లో శంకరాచార్యులు ప్రాణ అధికరణంలో (1-1-23) ప్రాణం = పరమేశ్వరుడు అని నిరూపిస్తారు. ఉపాసన ఖండం - 11లో మొదలవుతుంది కాని ఖండం-10లో అఖ్యాయిక (కథ) వస్తుంది. అఖ్యాయిక ఉపాసనకు దారితీస్తుంది. ఈ కథ ద్వారా కొన్ని విలువలను అందచేయటం జరుగుతుంది. ఆ సందర్భంలో వచ్చినప్పుడు చూద్దాము వాటిని.

కథలో ముఖ్య వ్యక్తి ఉషస్తి అనే పేరున్న ఒక ఋషి. అందుకే ఈ కథను ఉషస్తి ఉపాఖ్యానం అంటారు.

**దశమః ఖణ్డః (10)**

**మటచీహతేషు కురుష్వాటిక్యా సహ జాయయోషస్తిర్హ చాక్రాయణ ఇభ్యగ్రామే ప్రద్రాణక ఉవాస ॥1॥ స హేభ్యం కుల్మాషాన్ఖాదన్తం విభిక్షే తగ్ం హోవాచ । నేతోఽన్యే విద్యన్తే యచ్చ యే మ ఇమ ఉపనిహితా ఇతి ॥2॥ ఏతేషాం మే దేహీతి హోవాచ తానస్మై ప్రదదౌ హన్తానుపా నమిత్యుచ్ఛిష్టం వై మే పీతగ్ం స్యాదితి హోవాచ ॥3॥ న స్విదేతేఽప్యుచ్ఛిష్టా ఇతి న వా అజీవిష్యమిమానఖాదన్నితి హోవాచ కామో మ ఉదకపానయమితి ॥4॥ స హ ఖాదిత్వాఽతిశేషాన్ జాయాయా ఆజహార। సాఽగ్ర ఏవ సుభిక్షా బభూవ। తాన్ప్రతిగృహ్య నిదధౌ ॥5॥ సహ ప్రాత స్సంజిహాన ఉవాచ యద్బతాన్నస్య లభేమహి లభేమహి ధనమాత్రామ్। రాజాఽసౌ యక్ష్యతే స మా సర్వైరార్త్విజ్యైర్వృణీతేతి ॥6॥ తం జాయోవాచ హన్త పత ఇమ ఏవ కుల్మాషా ఇతి తాన్ఖాదిత్వాఽముం యజ్ఞం వితతమేయాయ ॥7॥ తత్రోద్గాతృనాస్తావే స్తోష్యమాణానుపోపవివేశ స హ ప్రస్తోతారమువాచ ॥8॥ ప్రస్తోతర్యా దేవతా ప్రస్తావమన్వాయత్తా తాం చేదవిద్వాన్ప్రస్తోష్యసి మూర్ధా తే విపతిష్యతీతి ॥9॥ ఏవమేవోద్గాతారమువాచోద్గాతర్యా దేవతోద్గీథమన్వాయత్తా తాం చేదవిద్వానుద్గాస్యసి మూర్ధా తే విపతీష్యతీతి ॥10॥ ఏవమేవ ప్రతిహర్తారమువాచ ప్రతిహర్తర్యా దేవతా ప్రతిహారమన్వాయత్తా తాం చేదవిద్వాన్ప్రతిహరిష్యసి మూర్ధా తే విపతిష్యతీతి తే హ సమారతాస్తూష్ణీమాసాఞ్చక్రిరే ॥11॥**

**మంత్రాలు 1-8:-** ఒకప్పుడు, ఉషస్తి పేరు గల ఒక ఋషి ఉండేవాడు. అతనికొక భార్య ఉన్నది. ఆమె పనులు చాకచక్యంగా చేయగల దిట్ట. ఉషస్తికి ఇంకోపేరు కూడా ఉంది. అది చాక్రాయణుడు. ఒకసారి ఉషస్తి ఉన్న కురుదేశము అనే ఊరులో తుఫాను వచ్చి అంతా కొట్టుకుపోయింది. కరువు వచ్చింది. ఆహారం లేక ఉషస్తి దయనీయ పరిస్థితిలో ఉన్నాడు.

ఇభ్య అనే ఊరిలో భిక్షాటనకు బయలుదేరాడు. అక్కడ ఒక మావటీవాడు కుల్మాషా తింటున్నాడు. కుల్మాషా అంటే అలచందలు, తక్కువరకమైన చిక్కుడు గింజలు. ఈ ఋషి అతన్ని భిక్ష అడిగితే అతను, తాను తక్కువ జాతికి చెందినవాడిననీ, పైగా తను తింటున్నదే ఉందనీ,

దాన్ని తను ఎంగిలి చేశాననీ చెప్పాడు. ఆకలికి ఎటువంటి నియమాలూ లేవని ఉషస్తి చెబితే తను తింటున్నది ఇచ్చాడు. కుల్మాషాతోపాటు, తను తాగుతున్న నీళ్ళు కూడా ఇచ్చాడు. ఋషి ఆ నీళ్ళు ఎంగిలివనీ, తాను తాగననీ అన్నాడు. మావటి ఆశ్చర్యపోయాడు. కుల్మాషా విషయంలో అడ్డురాని ఎంగిలి ఇప్పుడు అడ్డు వచ్చిందా?

దీనికి ఉషస్తి ఇలా జవాబు చెప్పాడు. ఆహారం విషయంగా అది వేరే ఎక్కడా దొరకకపోవటం వల్ల, గత్యంతరం లేని పరిస్థితిలో తీసుకోవాల్సి వచ్చింది. కాని నీరు తనకు అవసరం లేదు. దానికోసం నియమం తప్పనవసరం లేదు. దీనివల్ల మనకు చెప్పిన సూక్ష్మం ఇది –

**అసాధారణ పరిస్థితుల్లోనే నియమాన్ని సడలించవచ్చు కాని, సాధారణ పరిస్థితుల్లో కాదు.** ఉదాహరణకు జ్వరం వస్తే స్నానం చేయ నవసరం లేదు అంటుంది శాస్త్రం. నిజానికి చేయకూడదు కూడా. అలాగని ప్రతిరోజూ స్నానం ఎగ్గొడతాననకూడదు.

ఉషస్తి ఆ కుల్మాషాను తను కొంత తిని, భార్యకు కొంత తీసుకువెళ్ళాడు. ఆవిడకి మంచి ఆహారమే దొరికింది. ఉషస్తి భార్య ఆ కుల్మాషాను పారేయకుండా దాచింది. మర్నాడు పొద్దున్న లేచాక, ఉషష్తి తన భార్యతో తనకు ఏదైనా ఆహారం పెడితే, అక్కడ ఊర్లో జరుగుతున్న పెద్ద యజ్ఞానికి వెళ్ళి సంభావన తీసుకువస్తానన్నాడు. కుల్మాషా తప్ప ఏమీ లేదంది భార్య. అసలే ఎంగిలి భోజనం. ఆపై ముందురోజు వదిలేసిన అన్నం. ఎంగిలిని ఉచ్ఛిష్టం అనీ, ముందురోజు భోజనాన్ని పర్యుషితం అనీ అంటారు. రెండో దోషం చేశాడు. పర్యుషిత భోజనం చేసి వెళ్ళాడు.

ఈ కథంతా మనకు ఎందుకు చెపుతున్నది ఉపనిషత్తు? ఉషస్తి చేసిన ఉపాసన గురించి చెబితే చాలదా? ఒక కారణం ఇందాక మనం చూసిందే. అసాధారణ పరిస్థితుల్లో నియమాన్ని ఉల్లంఘించినా తప్పులేదు. ఉషస్తి ఉచ్ఛిష్టం తిన్నాడు. పర్యుషిత భోజనం చేశాడు.

సంధ్యావందనంలో కూడా ప్రాయశ్చిత్త మంత్రాలు ఉన్నాయి. మనకి ఎన్నో ప్రాయశ్చిత్త మంత్రాలు ఉన్నాయి. అలాగని కావాలని నియమాన్ని ఉల్లంఘించి ప్రాయశ్చిత్త మంత్రాలు చదువుతాను అనకూడదు. అది కావాలని ఎవరినో దెబ్బవేసి, క్షమాపణ కోరినట్టు ఉంటుంది.

ఉషస్తి ఆ మిగిలిన కుల్మాషా తిని యజ్ఞానికి వెళ్ళాడు. అక్కడ మూడు వేదాలకు చెందిన ముగ్గురు ఋత్విక్కులు ఉన్నారు.

ప్రస్తావ భక్తి మీద పాడే ప్రస్తోత

ఉద్గీథ భక్తి మీద పాడే ఉద్గాత

ప్రతిహార భక్తి మీద పాడే ప్రతిహర్త

**మంత్రాలు 9-11:-** ముగ్గురినీ మీరు పాడబోయే దేవతలు ఎవరో తెలుసా అని ఒకరి తరువాత ఒకరిని ప్రశ్నించాడు. 'నువ్వు ప్రస్తావ భక్తి పాడబోతున్నావు. ఆ దేవత ఎవరు? తెలిశాకే పాడాలి,' అన్నాడు. తెలియకపోతే తల బద్దలవుతుందని కూడా చెప్పాడు. ప్రస్తోత తక్కిన వాళ్ళని చూశాడు. ఉషస్తి ఉద్గాతని, ప్రతిహర్తనీ కూడా అదే ప్రశ్న వేశాడు. ముగ్గురికీ వాళ్ళ భక్తికి చెందిన దేవత ఎవరో తెలియదు. తెలియకుండా పఠించి వాళ్ళ తలబద్దలుకొట్టుకోవటం ఇష్టం లేదు. అందుకని వాళ్ళు యజ్ఞం ఆపేసి నిశ్శబ్దంగా కూర్చున్నారు. ఇప్పుడు అనుజ్ఞ యజమాని నుంచి రావాలి. ఈ ఖండం తరువాత ఖండంలో రాబోయే బోధకు బాట వేసింది.

**ఏకాదశః ఖణ్డః (11)**

**అథ హైనం యజమాన ఉవాచ భగవన్తం వా అహం వివిదిషాణీత్యుషస్తిరస్మి చాక్రాయణ ఇతి హోవాచ ॥1॥ స హోవాచ భగవన్తం వా అహమేభిస్సర్వైరార్త్విజ్యైః పర్యైషిషం భగవతో వా అహమ విత్త్వాన్యానవృషి ॥2॥ భగవాగ్ంస్త్వేవ మే సర్వైరార్త్విజ్యైరితి తథేతి। అథ తర్హ్యేత ఏవ సమతిసృష్టాః స్తువతాం యావత్త్వేభ్యో ధనం దద్యాస్తావన్మమ దద్యా ఇతి తథేతి హ యజమాన ఉవాచ ॥3॥ అథ హైనం ప్రస్తోతోపససాద ప్రస్తోతర్యా దేవతా ప్రస్తావమన్వాయత్తా తాం చేదవిద్వాన్ప్రస్తోష్యసి మూర్ధా తే విపతిష్యతీతి మా భగవానవోచత్కతమా సా దేవతేతి॥4॥ ప్రాణ ఇతి హోవాచ సర్వాణి హ వా ఇమాని భూతాని ప్రాణమేవాభిసంవిశన్తి ప్రాణమభ్యుజ్జిహతే। సైషా దేవతా ప్రస్తావమన్వాయత్తా। తాం చేదవిద్వా న్ప్రాస్తోష్యో మూర్ధా తే వ్యపతిష్యత్తథోక్తస్య మయేతి ॥5॥ అథ హైనముద్గాతో పససాదోర్గాతర్యా దేవతోద్గీథమన్వాయత్తా తాం చేదవిద్వానుద్గాస్యసి ముర్ధా తే విపతిష్యతీతి మా భగవానవోచత్కతమా సా దేవతేతి ॥6॥ ఆదిత్య ఇతి హోవాచ సర్వాణి హ వా ఇమాని భూతాన్యాదిత్యముచ్చైః సన్తం గాయన్తి సైషా దేవతోద్గీథమన్వాయత్తా తాం**

**చేదవిద్వానుదగాస్యో మూర్ధా తే వ్యపతిష్యత్తథోక్తస్యమయేతి ॥7॥ అథ హైనం ప్రతిహర్తోపససాద ప్రతిహర్తర్యాదేవతా ప్రతిహారమన్వాయత్తా తాం చేదవిద్వాన్ప్రతిహరిష్యసి మూర్ధా తే విపతిష్యతీతి మా భగవానవోచత్కతమా సా దేవతేతి ॥8॥ అన్నమితి హెూవాచ సర్వాణి హ వా ఇమాని భూతాన్యన్నమేవ ప్రతిహరమాణాని జీవన్తి సైషాదేవతా ప్రతిహారమన్వాయత్తా తాం చేదవిద్వాన్ప్రతిహరిష్యో మూర్ధా తే వ్యపతిష్యత్తథోక్తస్య మయేతి తథోక్తస్య మయేతి ॥9॥**

**మంత్రాలు 1-3 :-** కథ కొనసాగుతున్నది. ఇక్కడ పరిస్థితి చూసి యజమాని పరుగెత్తుకు వచ్చాడు. మీరు ఎవరు? ఇక్కడ ఇలా కల్లోలం సృష్టించారెందుకు అన్నాడు. ఉషస్తి తన పరంపర అయిన చాక్రాయణ పేరు చెప్పుకున్నాడు. ఉషస్తి సామవేదంలో ఆరితేరిన వ్యక్తిగా పేరు ప్రఖ్యాతులు పొందాడు. యజమాని కూడా ఉషస్తి ఖ్యాతి గురించి విని ఉన్నాడు. నిజానికి అతన్నే ముఖ్య హెూతాగా పెట్టుకుందామనుకున్నాడు కాని అతను కరువు కాటకాల వల్ల ఎక్కడున్నాడో తెలియలేదు. ఇప్పుడు 'మీరే వచ్చారు కాబట్టి మీరే యజ్ఞాన్ని నడిపించండి,' అని కోరుకున్నాడు. ఉషస్తి అందుకు ఒప్పుకుని వాళ్ళ స్థానాలు తాను మార్చననీ, వాళ్ళ విధులను వాళ్ళను నిర్వర్తించనీయమనీ చెప్పాడు. తను ధనం కోసం వచ్చాడు కదా అందుకని వాళ్ళకిచ్చినంత దక్షిణ తనక్కూడా ఇవ్వాలని కోరాడు. యజమాని సంతోషంగా ఒప్పుకున్నాడు. తథాస్తు అన్నాడు.
**మంత్రాలు 4,5:- కతమా సా దేవతా -** ప్రస్తోత అడుగుతాడు. ప్రస్తోత మనిషి పేరు కాదు. ప్రస్తావ భక్తి పాడేవాడు. తను పాడే దేవత గురించి తెలియకపోతే, తన తల బద్దలవుతుందన్నాడు కదా, ఆ దేవత ఎవరు? తేలిగ్గా ఆ దేవత ఎవరు అని అడిగి ఉండవచ్చు. కాని అది ఉపనిషత్తు ప్రత్యేకత. ఉషస్తి చెప్పిన మాటలన్నీ తిరిగి చెప్పి, తను గానం చేసే ముందు, ఆ దేవత పేరు చెప్పమన్నాడు.
**ఐదవ మంత్రం - ప్రాణ ఇతిహెూవాచ-** ప్రస్తావ భక్తి దేవత - ప్రాణం. ప్రాణం విశిష్టత ఏమిటి? ప్రాణం జగత్కారణం.
**సర్వాణి హ వా ఇమాని భూతాని ప్రాణమేవాభిసంవిశన్తి ప్రాణమభ్యుజ్జిహతే** అభిసంవిశన్తి అంటే లయకారణం. ఉజ్జిహ అంటే సృష్టికారణం. సృష్టి,

లయ కారణాలే కాదు స్థితి కారణం కూడా. అందుకని ప్రాణమే సృష్టి, స్థితి లయ కారణం అని చెప్పి,ఆ ప్రశ్న అడిగిన ప్రస్తోతాని మెచ్చుకున్నాడు ఉషస్తి. అతను తనకు తెలియని విషయం తెలుసుకోవాలనుకున్నాడంటేనే అతనికి గర్వం లేదని తెలుస్తోంది.

ఈ మంత్రాన్ని వివరంగా బ్రహ్మసూత్రాల్లో విశ్లేషించారు. అందులో శంకరాచార్యుల వారు ప్రాణం = పరమేశ్వరుడు అంటే “మాయా విశిష్ఠం చైతన్యం” అని నిరూపించారు.

**అత ఏవ ప్రాణః - ప్రాణాధికరణమ్ 1-1-23**

ఎందుకు ఇలా అన్వయించారు శంకరుల వారు? దానికి జవాబు తథా అనుగమాత్ అనే పదాలలో ఉంది. ఇక్కడ ప్రాణాన్ని దేవతగా పేర్కొన్నాక సర్వసృష్టి (స్థితి), లయ కారణంగా చూపించింది ఉపనిషత్తు. విడిగా చూస్తే ప్రాణం కూడా కార్యమే.

**ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేన్ద్రియాణి చ-ముండక 2 -1 -3**

సర్వ సృష్టి, స్థితి లయ కారణం బ్రహ్మ కాబట్టి, ఇక్కడ ప్రాణాన్ని సర్వసృష్టి స్థితి లయ కారణంగా వివరించారు కాబట్టి ప్రాణం = బ్రహ్మ = మాయా విశిష్ఠం చైతన్యం అని తీసుకోవాలి.

**మంత్రాలు 6,7** - ఇందాకటి మంత్రాల లాగే సాగుతుంది. 6లో ఉద్గాథ ప్రశ్నిస్తే 7లో ఉషస్తి జవాబిచ్చాడు.

**కతమా సా దేవతా**? ఉద్గీథ దేవత ఎవరు?

**ఆదిత్య ఇతి హోవాచ** - ఆదిత్య దేవత

ఆదిత్య విశిష్ఠత ఏమిటి?

**సర్వాణి హ వా ఇమాని భూతాన్యాదిత్యముచ్చైఃసన్తం గాయన్తి** - అందరూ సూర్యదేవుడు గొప్పవాడని కీర్తిస్తున్నారు. ఎత్తుగా ఉన్నాడు అనటంలో నిజంగా ఎత్తులో ఉన్నాడు అనీ, విశిష్ఠతలో కూడా ఎత్తైన స్థానంలో ఉన్నాడనీ అర్థం వస్తుంది. సంధ్యావందనంలో ఆదిత్యస్తుతి వస్తుంది.

ఉద్గీత దేవత ఆదిత్య అని చెప్పి అంతకు ముందు ఋత్విక్కును మెచ్చుకున్నట్టే ఇతన్ని కూడా మెచ్చుకున్నాడు ఉషస్తి.

**మంత్రాలు 8,9:-** ఇందాకటి మంత్రాలలాగే సాగుతుంది. 8లో ప్రతిహర్త ప్రశ్నిస్తే 9లో ఉషస్తి జవాబిచ్చాడు.

**కతమా సా దేవతా?** ప్రతిహార దేవత ఎవరు?

**అన్నమితి హెూవాచ –** అన్నదేవత.

అన్నం విశిష్టత ఏమిటి?

**సర్వాణి హ వా ఇమాని భూతాన్యన్నమేవ ప్రతిహరమాణాని జీవన్తి**

అన్నం వల్లనే అన్ని ప్రాణులు జీవిస్తున్నాయి.

**అన్నాద్వై ప్రజాః ప్రజాయంతే। యాః కాశ్చ పృథివీగ్ంశ్రితాః అథో అన్నేనైవ జీవంతి। అథైనదపియంత్యన్తతః అన్నగ్ం హి భూతానాం జ్యేష్ఠమ్॥ తస్మాత్సర్వౌషదముచ్యతే – బ్రహ్మానందవల్లీ**

**ప్రతిహార దేవత అన్నం** అని చెప్పి నువ్వు అడిగింది మంచిదయింది అని మెచ్చుకున్నాడు.

10,11 ఖండాలు కలిపి ఒక్కటిగా పరిగణించాలి. ఈ రెండింటి సారాంశం మూడు భక్తులకు ముగ్గురు దేవతలు ఉన్నారు. ఆయా దేవతలను, ఆయా ఆలంబనల మీద ఆవాహన చేసి ఉపాసన చేయాలన్నది ఈ ఖండాల సారాంశం. ఇది ప్రత్యక్షంగా చెప్పలేదు.

| **దేవత** | **ఆలంబనం** |
|---|---|
| ప్రాణం | ప్రస్తావ |
| ఆదిత్య | ఉద్గీథ |
| అన్నదేవత | ప్రతిహార |

ఇక్కడ ప్రాణం = పరమేశ్వరుడు అంటే మాయా విశిష్ఠం చైతన్యం అని గుర్తుంచుకోవాలి.

**ఫలం:–** ఇది కూడా ప్రత్యక్షంగా చెప్పలేదు. శంకరాచార్యులు తన భాష్యంలో చెప్తున్నారు. మరణానంతరం ప్రాణ ఉపాసన చేసిన వ్యక్తికి ప్రాణప్రాప్తి, ఆదిత్య ఉపాసన చేసిన వ్యక్తికి ఆదిత్య ప్రాప్తి, అన్న ఉపాసన చేసిన వ్యక్తికి విరాట్ ప్రాప్తి కలుగుతుంది. ఇహలోక ఫలం– కర్మ సమృద్ధి, కేవల కర్మ చేసిన దానికన్నా కర్మ ఉపాసన సముచ్చయం చేస్తే ఫలం ఎక్కువగా ఉంటుందని మొదటి ఖండంలోనే చూశాము – వీరవత్తయా భవతి.

ఈ సూత్రం అన్ని సందర్భాల్లోనూ వర్తిస్తుంది. విష్ణుసహస్రనామం చదివేటప్పుడు దానితో పాటు ధ్యానశ్లోకం కూడా గడగడా చదివేస్తాము.

అలా కాకుండా, ఆ ధ్యానశ్లోకంలో ఉన్న విష్ణుమూర్తి వర్ణనను మనసులో నిలుపుకుని పారాయణం చేస్తే ఫలం అధికంగా ఉంటుంది అని చూశాము.

**ద్వాదశః ఖణ్డః (12)**

**అథాతశ్శౌవ ఉద్గీథస్తద్ధ బకో దాల్భ్యో గ్లావో వా మైత్రేయ స్స్వాధ్యాయముద్వవ్రాజ ॥1॥ తస్మై శ్వా శ్వేతః ప్రాదుర్బభూవ తమన్యే శ్వాన ఉపసమేత్యోచురన్నం నో భగవానాగాయత్వశనాయామ వా ఇతి ॥2॥ తాన్హోవాచేహైవ మా ప్రాతరుపసమీయాతేతి తద్ధ బకో దాల్భ్యో గ్లావో వా మైత్రేయః ప్రతిపాలయాఞ్చకార ॥3॥ తే హ యథైవేదం బహిష్పవమానేన స్తోష్యమాణాస్సగ్ంరబ్ధా స్సర్పన్తీత్యేవమాససృపుస్తే హ సముపవిశ్య హిం చక్రుః ॥4॥ ఓమ్ 3 మదా 3 మోం 3 పిబమోం 3 దేవో వరుణః ప్రజాపతిస్సవితా2న్నమిహా 2 హరత్। అన్నపతే 3 న్నమిహా 2 హరా 2 హరో 3 మితి ॥5॥**

**శౌవ ఉద్గీథ:–** ఇదొక ప్రత్యేకమైన మంత్రం. ఉత్సుకతను రేకెత్తించే మంత్రం. శ్వ అంటే శునకం లేదా కుక్క . శౌవ ఉద్గీథ అంటే కుక్క చెప్పిన సామ మంత్రం. ఇంతవరకూ ఉద్గీథ అంటే సామ అవయవ భూత ఓంకారం అని చూశాము. కాని ఇక్కడ ఉద్గీథ అంటే సామ మంత్రం అని తీసుకోవాలి. కాబట్టి శౌవ ఉద్గీథ అంటే కుక్క చెప్పిన సామ మంత్రం. కుక్కలు అంటే మామూలు కుక్కలు కాదు. "ఋషులు" అంటున్నారు శంకరుల వారు. సామ వేద శిష్యుడిని దీవించటానికి కుక్క రూపంలో వచ్చిన ఋషులుగా తీసుకోవాలి. దీనికి ఇంకో భాష్యం శునకరూపంలో వచ్చిన ప్రాణ దేవత.

ఈ సామ మంత్రంలో అన్న సమృద్ధి కోసం చేసే ప్రార్థన వస్తుంది. ముందు ఖండాల్లో ఉషస్తి అనే ఋషి కరువు కాటకాలను ఎదుర్కోవటం, అన్నం కోసం రెండు నియమాలను ఉల్లంఘించి ఎంగిలి భోజనం చేయటం, మిగిలిపోయిన అన్నం తినటం చూశాము. అందుకని అలాంటి దుస్థితి ఏర్పడకుండా ఉండటానికి శాస్త్రమే ప్రార్థననిస్తున్నది. అన్నం సమృద్ధిగా దొరుకుగాక, నేను హితవుగా తినగలుగుగాక. ఇదీ ఈ ప్రార్థన సారాంశం.

ఈ మంత్రంలో బకుడు అనే శిష్యుడు ఉన్నాడు. అతనికి దాల్భ్యుడు, గ్లావుడు, మైత్రేయుడు అన్న పేర్లు కూడా ఉన్నాయి. అన్నిపేర్లూ ఒకరివే అని ఎలా తెలుసు? వాటి తర్వాత వచ్చిన క్రియాపదం– **వవ్రాజ– ఏకవచనం.** అతను సామవేద అధ్యయనానికి వెళుతుంటే దోవలో తెల్లకుక్క కనబడింది.

**నమః శ్వభ్యః శ్వపతిభ్యశ్చవో నమః – రుద్రం**

కుక్కకు, కుక్క యజమానికి నమస్కారం

ఈ తెల్లకుక్క ఋషి లేదా ప్రాణదేవత అని చూశాము. ఎందుకు వచ్చింది? బకుడు చేసే సామగానం చూసి తృప్తి చెంది వచ్చింది. అతను నిల్చుని ఆ తెల్లని శునకాన్ని చూస్తుంటే కొన్ని కుక్కపిల్లలు (ఋషులు) వచ్చి ఇలా కోరాయి. 'ఓ దేవా! మాకు అన్నం సమృద్ధిగా దొరకటానికి వీలుగా ఒక సామ మంత్రం పాడు. మాకు చాలా ఆకలిగా ఉంది,' అన్నాయి. తెల్లకుక్క, 'ఇది అనువైన సమయం కాదు. రేపొద్దున్న ఇక్కడికే రండి, అప్పుడు పాడతాను' అంది.

శంకరాచార్యులు దీన్నించి ఒక విశ్లేషణ ఇస్తున్నారు. సామ మంత్రం ఎప్పుడు పడితే అప్పుడు పాడకూడదనీ, పొద్దున్నపూటే పాడాలన్న విధిని సూచిస్తున్నది శాస్త్రం. ఎందుకు? ఇక్కడ ఆవాహన చేసే దేవతల్లో సూర్యదేవత ముఖ్యం. సూర్యుడు పదానికి ఒక అర్థం అన్నదాత. ఇంకోపేరు – వాజినీ.

**వాజినీవ సమృద్ధమస్మి**

వర్షం కదా అన్నం సమృద్ధిగా పండటానికి కారణం అనవచ్చు. కాని వర్షం కురవటానికి కారణం సూర్యుడే కదా.

**తపామ్యహమహం వర్షం నిగృహ్ణామ్యుత్సృజామి చ గీత–9 –19**

నేనే సముద్రంనుంచి నీరుని గ్రహించి, వర్షంగా కురిపిస్తాను.

అందువల్ల తూర్పువైపు తిరిగి సామ మంత్రం పఠించాలి. సూర్యుడు తూర్పు దిక్కులో ఎప్పుడు ఉంటాడు? పొద్దున్న సమయంలో.

ఈ విషయం విన్న బకుడు మర్నాడు పొద్దున్న అక్కడికి మళ్ళీ వెళ్ళాడు. అప్పుడు గురుశిష్యులైన కుక్కలు వృత్తాకారంలో తిరుగుతూ సామ మంత్రాన్ని గానం చేస్తున్నాయి. దానికి వృత్తంలో తిరగాలి.

**ఓం ఆదామ** – మాకు అన్నం సమృద్ధిగా ఉండాలి.
మేము అన్నం హితవుగా తినగలగాలి.
అంటే ఆహారం సమృద్ధిగా ఉండాలి. దానికి తగ్గ ఆకలి కూడా ఉండాలి.
**ఓం పిబామ** – మాకు నీళ్ళు సమృద్ధిగా దొరకాలి.

మన హిందువుల మీద ఒక అపప్రద ఉంది. మనం ఎంతసేపూ పరలోక సుఖాలు కోరతాము కాని ఇహలోక సుఖాలను కోరము అని. ఈ మంత్రం దాన్ని ఖండిస్తుంది. బాగా తిను, బాగా తాగు, కాని దానిలోనే మునిగి తేలకు అంటాము మనము.

**వరుణః ప్రజాపతిస్సవితా** – ముగ్గురు దేవతలను ప్రార్థిస్తున్నారు.

వరుణదేవుడు వర్షాన్ని కురిపిస్తాడు. ప్రజాపతి పంటలను పండిస్తాడు; సవితా అంటే సూర్యదేవుడు. వర్షానికి, ఉత్పత్తికి వెనుకనున్న శక్తి.

**అన్నమిహ ఆహరః** – మీరంతా అన్నాన్ని తీసుకురండి గాక.

**అన్నపతే అన్నమిహ** – సామవేద పద్ధతిలో అన్నం సమృద్ధిగా దొరకటానికి చేసే రోజువారీ ప్రార్థన ఇది. ఫలం – అన్న సమృద్ధి.

### త్రయోదశః ఖణ్డః (13)

**అయం వావ లోకో హా ఉకారో వాయుర్హాఇకారశ్చన్ద్రమా అథకారః। ఆత్మేహకారోఽగ్నిరీకారః ॥1॥ ఆదిత్య ఊకారో నిహవ ఏకారో విశ్వేదేవా ఔహోయికారః ప్రజాపతిర్హింకారః ప్రాణ స్స్వరోఽన్నం యా వాగ్విరాట్ ॥2॥ అనిరుక్తస్త్రయోదశః స్తోభః సఞ్చరో హుంకారః ॥3॥ దుగ్ధేఽస్మై వాగ్దోహం యో వాచో దోహోఽన్నవానన్నాదో భవతి య ఏతామేవగ్ం సామ్నాముపనిషదం వేదోపనిషదం వేద ॥4॥**

**స్తోభ ఉపాసన** :– ఇది ఇంకొక ఉపాసన. కాకపోతే ఇక్కడ ఆలంబనం మారుతుంది. ఇంతవరకూ అధికశాతం ఉపాసనలు ఉద్గీథ మీద చూశాము. ఉద్గీథ అంటే సామ అవయవ భూత ఓంకారం అన్నది మర్చిపోకూడదు.

ఇక్కడ ఆలంబనం సామ మంత్రంలో ఇంకో అవయవం. దీన్ని స్తోభ అంటారు. ఇది సామవేదంలోనే కనబడే సాంకేతిక పదం. కొన్ని శబ్దచిహ్నాలు అవి. వాటికి ప్రత్యేకంగా అర్థమంటూ ఏదీ ఉండదు. కేవలం

సామగానంలో వాడతారు అంతే. ఉదాహరణకు తైత్తిరీయంలో హ, వై అనే అక్షరాలు – కఠలో వా అనే అక్షరం.

సామవేదంలో ఇలాంటి అక్షరాలకు పేరు స్తోభ. మనకు వినటానికి వింతగా ఉన్నా, సామ వేద శిష్యులకు అవి అర్థవంతంగా ఉంటాయి. ఉదాహరణకు ఇప్పుడు దేవుళ్ళను అనేక రూపాలుగా చూపుతున్నారు. ఒక్క వినాయకుడినే పంచముఖ వినాయకుడనీ, నర్తన వినాయకుడనీ రకరకాలుగా చిత్రిస్తారు. వేదాలు మాత్రమే ప్రాచుర్యంలో ఉన్న సమయంలో వైదిక మంత్రాలనే ఆలంబనలుగా వాడేవారు.

**పృథివీ పూర్వరూపమ్। ద్యౌరుత్తరరూపమ్ । ఆకాశస్సంధిః।**
**వాయుస్సం ధానమ్। – శీక్షావల్లీ**

అందుకని ఈ అక్షరాలు ఏమిటి అనుకోకుండా, వాటి మీద అగౌరవం చూపకుండా, అక్షరాలను ˆర్తుకు తెచ్చుకోవాలి. మనకి అవసరం లేనంతమాత్రాన అవి తక్కువ స్థాయివి కావు. 1–3 మంత్రాల్లో 13 దేవతలను, వాటిని ఆవాహన చేసే ఆలంబనలను (ఇక్కడ స్తోభలను) చూస్తాము.

| **మంత్రం** | **దేవత** | **ఆలంబన** |
|---|---|---|
| 1 | పృథివీదేవత | హాఉకారము |
| | వాయువు | హాఇకారము |
| | చంద్రుడు | అథకారము |
| | ఆత్మ | ఇహకారము |
| | అగ్ని | ఈకారము |
| 2 | ఆదిత్యుడు | ఊకారము |
| | ఆహ్వానము | ఏకారము |
| | విశ్వేదేవతలు | ఔహోయికారము |
| | ప్రజాపతి | హింకారము |
| | ప్రాణము | స్వరము |
| | అన్నం | యా |
| | విరాట్ | వాక్ |
| 3. | అనిరుక్తం | హుంకారము / సంచరము |

అనిరుక్తం అంటే అనిర్వచనీయం. సంచరము అంటే సంచరించు.

అనిరుక్తం మాయా సహిత ఈశ్వరుని సూచిస్తుంది. ఈశ్వరుడు అనిర్వచనీయం,అరూపం. ఈశ్వరుడు అవ్యవహారి కాబట్టి కర్మఫలం అంటదు. తద్వారా వచ్చే రూపం ఉండదు. ఈశ్వరుడు రూపం తీసుకున్నా దాన్ని అవతారం అంటారని చూశాము. అందుకే తరచు ఈశ్వరుడిని ఎలా నిర్వచించాలో తెలియదు.

ఫలం:- **1.సూనృతా వాక్-** అతని మాట శుద్ధంగా ఉంటుంది. అందువల్ల అతని మాట మంగళకరంగా, నలుగురు మెచ్చేలా, ఆప్యాయంగా ఉంటుంది.

**2. అన్నవానన్నాదో భవతి -** అన్నం సమృద్ధిగా దొరుకుతుంది. అన్నం హితవుగా తింటారు.

# అధ్యాయం - 1 సారాంశం

అనేక ఉపాసనలు చెప్పబడ్డాయి.
అన్నింటిలోనూ ఆలంబనం సామ మంత్ర అవయవం.
ఎక్కువగా ఉద్గీథ అవయవం వస్తుంది.
ఉద్గీథ అంటే సామ అవయవ భూత ఓంకారం.
చివర్లో ఉద్గీథ బదులు స్తోభ ఉపాసన వస్తుంది.
ఒక ఖండంలో మాత్రం ఆధిదైవ ఉపాసనలో హిరణ్మయ ఉపాసన,
ఆధ్యాత్మిక ఉపాసనలో అక్షి పురుష ఉపాసనలు వస్తాయి.
రెండింటినీ కలిపి ఒకటే ఉపాసనగా చేయాలి.

# ॥ ఛాందోగ్యోపనిషత్తు ॥

# అధ్యాయం - 2

### ప్రథమః ఖణ్డః (1)

**ఓమ్। సమస్తస్య ఖలు సామ్నః ఉపాసనగ్ం సాధు ॥ యత్ఖలు సాధు తత్సామేత్యాచక్షతే యదసాధు తదసామేతి ॥1॥ తదుతాప్యాహుః స్సామ్నైనముపాగాదితి సాధునైనముపాగాదిత్యేవ తదాహురసామ్నై నముపాగాదిత్య సాధునైనముపాగాదిత్యేవ తదాహుః ॥2॥ అథోతాప్యాహుః స్సామ నో బతేతి యత్సాధు భవతి సాధు బతేత్యేవ తదాహురసామ నో బతేతి యదసాధు భవత్యసాధు బతేత్యేవ తదాహుః ॥3॥ స య ఏతదేవం విద్వాన్సాధు సామేత్యుపాస్తేऽభ్యాశో హ యదేనగ్ం సాధవో ధర్మా ఆ చ గచ్ఛేయురుప చ నమేయుః ॥4॥**

**సామ్నసాధురూపేణ ఉపాసన:**

**మంత్రం -1 :-** అంతకు ముందు ఒక అవయవం మీద ఉపాసనలు చూశాము. ఇప్పుడు సమస్త సామ అవయవాల మీద ఉపాసనలు చూస్తాము. అవయవ,అవయవి ఉపాసనల్లో ఏది గొప్ప? ఏదో ఒక దాని మీద చేసేకన్నా, మొత్తంమీద చేసే ఉపాసనే గొప్ప కదా! అందుకే ఈ ఉపాసనను సాధు ఉపాసన అంది. మొత్తం మంత్రాలను తీసుకుంటేనే అది సామ అవుతుంది. సామ అంటే మంచిది. సామకు అనేక అర్థాలున్నాయని శంకరుల వారు వివరిస్తున్నారు.

**సమత్వాత్ సామ –** సమత్వం ఉన్నది. అందమైనది. ఒక లయ ఉన్నది. అందుకే అది సామగానం అయింది.

ఇద్దరి మధ్య సంధి కుదిర్చేటప్పుడు సామ దాన భేద దండోపాయాలు అంటారు. మొదటి స్థాయి సామదే. సమానం చేస్తుంది.

**యత్ఖలు సాధు తత్సామేత్యాచక్షతే యదసాధు తదసామేతి –** సమస్త మంత్రాలు

తీసుకుంటే, సామ మంత్రం సాధు మంత్రం అయింది. ఏది మంచిదయితే అది సామ. ఏది చెడు అయితే అది అసామ.

**మంత్రం 2 – స్సామ్నైనముపాగాత్ –** ఒక వ్యక్తి ఉన్నతమైన ఉద్దేశ్యంతో వచ్చినప్పుడు అని అర్థం. ఇక్కడ సామ్నా క్రియావిశేషణంగా, చెడు తలపుతో వచ్చినప్పుడు సాధునైన పాగాత్ అంటారు.(క్రియావిశేషణం అంటే క్రియని గురించి తెలిపేది)

**మంత్రం 3 – సామ నో బతేతి –** ఎవరికైనా మంచి జరిగితే మాకు సామ కలిగింది అంటారు. ఇక్కడ సామ విశేషణంగా వచ్చింది. (విశేషణం అంటే నామవాచకం గురించి తెలిపేది)

దీనివల్ల సామ అంటే మంచిది అని అర్థం. అందువల్ల సామ వేదాన్ని సాధు రూపంలో ఉపాసన చేయవచ్చు. దాన్ని సామ్న సాధురూపేణ ఉపాసన అంటారు.

**మంత్రం 4 –** అన్ని మంచి లక్షణాలూ మనకి వస్తాయి. మనస్సు సమభావంతో ఆలోచిస్తుంది.

ఇది ఉపోద్ఘాత ఉపాసన. ఇంకా తక్కిన ఖండాల్లో సంపూర్ణ ఉపాసనలు వస్తాయి.

**ద్వితీయః ఖణ్డః (2)**

**లోకేషు పంచవిధగ్ం సామోపాసీత॥ పృథివీ హింకారః। అగ్నిః ప్రస్తావోఽన్తరిక్షముద్గీథ ఆదిత్యః ప్రతిహారో ద్యౌర్నిధనమిత్యూర్ధ్వేషు ॥1॥ అథావృత్తేషు ద్యౌర్హింకార ఆదిత్యః ప్రస్తావోఽన్తరిక్షముద్గీథోఽగ్నిః ప్రతిహారః పృథివీ నిధనమ్ ॥2॥ కల్పన్తే హాస్మై లోకా ఊర్ధ్వాశ్చావృత్తాశ్చ య ఏతదేవం విద్వాంల్లోకేషు పంచవిధం సామోపాస్తే ॥3॥**

మొదటి అధ్యాయంలో ఎక్కువగా ఉద్గీథ మీద ఉపాసనలు చూశాము. ఈ అధ్యాయంలో ఐదు అవయవాల మీద లేదా ఏడు అవయవాల మీద ఉపాసనలు చూస్తామని, ఒక్కొక్క అవయవాన్ని భక్తి అంటారనీ, ఐదు అవయవాల మీద ఉపాసనను పంచవిధ సామ ఉపాసన అంటారనీ, ఏడు అవయవాల మీద ఉపాసనని సప్తవిధ సామ ఉపాసన అంటారనీ చూశాము.

తైత్తరీయం ఒకసారి గుర్తుతెచ్చుకుంటే ఇది అర్థమవటం

తేలికవుతుంది. అక్కడ నాలుగు ఆలంబనలు తీసుకున్నాం. పూర్వరూపం, ఉత్తరరూపం,సంధి, సంధానం. వీటి మీద అధిలోకం, అధిజ్యోతిషం, అధి విద్య, అధి ప్రజ, అధ్యాత్మం అనే ఐదురకాలు ఉపాసనలు చేసాము.

**అథాధిలోకమ్। పృథివీ పూర్వరూపమ్। ద్యౌరుత్తర రూపమ్।**
**ఆకాశస్సంధిః। వాయుస్సంధానమ్ ఇత్యధిలోకమ్॥ – శీక్షావల్లీ**

తర్వాత ఆ దేవతలను పక్కనపెట్టి, అవే ఆలంబనల మీద అధి జ్యోతిషం ఉపాసన చేశాము. ఇప్పుడు కూడా అదే పద్ధతి.

ఇక్కడ తీసుకున్న ఆలంబనాలు ఐదు. అవి వరుసగా – హింకారము, ప్రస్తావము, ఉద్గీథము, ప్రతిహారము, నిధనము. ఆలంబనలు మారవు. వాటి మీదే ఒకదాని తర్వాత మరొక దేవతల సమూహాలను ఆవాహనం చేస్తాము. అలా వరుసగా ఆరు ఉపాసనలు వస్తాయి.

**అధిలోక ఉపాసన.** లోకాలమీద ఉపాసన. ఇది ఆరోహణక్రమంలో, అవరోహణక్రమంలో కూడా చేయాలి. ఆరోహణ క్రమాన్ని ఊర్ధ్వేషు అనీ, అవరోహణ క్రమాన్ని ఆవృత్తేషు అనీ అంటారు. ద్యౌ అంటే స్వర్గలోకం. పృథివీ, అగ్ని, అంతరిక్షం, ఆదిత్యుడు, స్వర్గలోకం – ఈ ఐదింటి మీద ఇదే వరుసలో ఉపాసన చేస్తే అది ఆరోహణ క్రమం. చివరినుంచి వస్తే అది అవరోహణ క్రమం. అంటే స్వర్గలోకం, ఆదిత్యుడు, అంతరిక్షం, అగ్ని, పృథివీలమీద ఉపాసన చేయాలి.

**ఫలం –** ఈ ఉపాసన చేసిన వాళ్ళు ఆయా లోకాల్లో సుఖాలను అనుభవిస్తారు.

**తృతీయః ఖణ్డః (3)**

**వృష్టౌ పంచవిధగ్ం సామోపాసీత పురోవాతో హింకారో మేఘో జాయతే స ప్రస్తావో వర్షతి స ఉద్గీథో విద్యోతతే స్తనయతి స ప్రతిహారః ॥1॥ ఉద్గృహ్ణాతి తన్నిధనమ్ వర్షతి హాస్మై వర్షయతి హ య ఏతదేవం విద్వాన్వృష్టౌ పంచవిధగ్ం సామోపాస్తే ॥2॥**

**అధివృష్టి ఉపాసన.** వర్షం కురిసేముందు నుంచి ముగిసే స్థాయి వరకూ ఉంది. పురోవాత అంటే వర్షం కురిసేముందు వీచేగాలి, తర్వాత మేఘాలు, వర్షం కురవటం, వర్షంతోపాటు వచ్చే  ఉరుములు, మెరుపులు, వర్షం ఆగిపోవటం. ఉద్గృహ్ణాతి అంటే ఆగిపోవటం. ఈ దశలను వరుసగా ఐదు

ఆలంబనల మీద ఉపాసన చేయాలి.
**ఫలం – విద్వాన్ –** ఈ సాధకుడు ఎక్కడ ఉంటే అక్కడ అతని కోసమన్నా సమృద్ధిగా వర్షం కురుస్తుంది.

**చతుర్థః ఖణ్డః (4)**

**సర్వాస్వప్సు పంచవిధగ్ం సామోపాసీత మేఘో యత్సంప్లవతే స హింకారో యద్వర్షతి స ప్రస్తావో యాః ప్రాచ్యస్స్యన్దన్తే స ఉద్గీథో యాః ప్రతీచ్యస్స ప్రతిహారస్సముద్రో నిధనమ్ ॥1॥ న హాప్సు ప్రైత్యప్సుమాన్భవతి య ఏతదేవం విద్వాన్సర్వాస్వప్సు పంచవిధగ్ం సామోపాస్తే ॥2॥**

**అధ్యపు ఉపాసన.** (అధి+అప్) అనేక రకాల నీటి మీద ఉపాసన. వర్షపు నీరు ఉన్న మేఘాలు, కురుస్తున్న వర్షం,కురిశాక తూర్పువైపు (ప్రాచ్య) ప్రవహించే నదులు, పడమరవైపు (ప్రతీచ్య) ప్రవహించే నదులు, సముద్రం.
**ఫలం:– అప్సుమాన్భభవతి –** జలగండం ఉండదు. నీరు కూడా సమృద్ధిగా దొరుకుతుంది.

**పంచమః ఖణ్డః (5)**

**ఋతుషు పంచవిధగ్ం సామోపాసీత వసన్తో హింకారో గ్రీష్మః ప్రస్తావో వర్షా ఉద్గీథశ్శరత్ప్రతిహారో హేమన్తో నిధనమ్ ॥1॥ కల్పన్తే హాస్మా ఋతవ ఋతుమాన్భవతి య ఏతదేవం విద్వానృతుషు పంచవిధగ్ం సామోపాస్తే ॥2॥**

**ఋతు ఉపాసన.** మామూలుగా ఆరు ఋతువులు ఉన్నాయి. కాని ఒక్కొక్కచోట వాటిని ఐదు ఋతువులుగానే పేర్కొంటారు. అవి వసంత ఋతువు, గ్రీష్మఋతువు, వర్షఋతువు,శరదృతువు, హేమంతఋతువు. వదిలేసినది శిశిర ఋతువు. హేమంత, శిశిర ఋతువులను కలిపి ఆంగ్లంలో వింటర్ అంటారు. ఇంగ్లీషు ఋతువులు నాలుగే స్ప్రింగ్, సమ్మర్, ఆటమ్, వింటర్. వర్షఋతువు లేదు అందులో.
**ఫలం – ఋతుమాన్భవతి–** ఈ ఋతువుల మీద ఉపాసన చేసిన వ్యక్తికి ఆయా ఋతువులలో దొరికే వస్తువులు సమృద్ధిగా దొరుకుతాయి.

**షష్ఠః ఖణ్డః (6)**

**పశుషు పంచవిధగ్ం సామోపాసీతాజా హింకారో౽వయః ప్రస్తావో గావ ఉద్గీథో౽శ్వాః ప్రతిహారః పురుషో నిధనమ్ ॥1॥ భవన్తి హాస్య పశవః పశుమాన్భవతి య ఏతదేవం విద్వాన్పశుషు పంచవిధగ్ం సామోపాస్తే ॥2॥**

**పశు ఉపాసన.** మచ్చిక చేసుకున్న జంతువులు మేక (అజా), గొర్రె (అవయ), ఆవు (గోవు), గుఱ్ఱం (అశ్వ), మనిషి (పురుష) వరుసగా వచ్చే పేర్లు. ఆవును ఉద్గీథ మీద ఆవాహన చేయాలి. ఉద్గీథ ఉత్కృష్ట అవయవం, ఆవు ఉత్కృష్ట పశువు. పశువుల సంఖ్యలో మనిషిని కూడా కలిపారు. మనిషిని జంతువుల్లో శ్రేష్ఠమైనవాడు అంటారు కదా, అందుకని. శాస్త్రం కుక్కని చేర్చలేదు ఈ పట్టికలో. కుక్క అంటే అంతమంచి అభిప్రాయం లేదు. భోజనం చేస్తుండగా కుక్క వస్తే తినకూడదని వస్తుంది శాస్త్రంలో. ఇప్పటి పరిస్థితి వేరు.

**ఫలం:- పశుమాన్భవతి-** సమృద్ధిగా పశుసంపద ఉంటుంది.

**ఆవహన్తీ వితన్వానా । కుర్వాణాచీరమాత్మనః । వాసాగ్ంసి మమ గవశ్చ। అన్న పానే చ సర్వదా। తతో మే శ్రియమావహా। లోమశాం పశుభిస్సహ స్వాహా । - శీక్షావల్లీ**

**సప్తమ ఖణ్డః (7)**

**ప్రాణేషు పంచవిధగ్ం పరోవరీయస్సామోపాసీత ప్రాణో హింకారో వాక్ప్రస్తావశ్చక్షురుద్గీథశ్శ్రోత్రం ప్రతిహారో మనో నిధనం పరోవరీయాగ్ంసి వా ఏతాని ॥1॥ పరోవరీయో హాస్య భవతి పరోవరీయసో హ లోకాన్ జయతి య ఏతదేవం విద్వాన్ప్రాణేషు పఞ్చవిధం పరోవరీయస్సామోపాస్త ఇతి తు పఞ్చవిధస్య ॥2॥**

**ప్రాణ విషయ ఉపాసన.** ప్రాణ ఉపాసన అంటే కేవలం పంచప్రాణాలే కాదు. అన్ని అంగాలనూ తీసుకోవాలి.

| | | |
|---|---|---|
| ప్రాణ | - | పంచప్రాణాలు |
| వాక్ | - | పంచ కర్మేంద్రియాలు |
| చక్షుశ్రోత్రం | - | పంచ జ్ఞానేంద్రియాలు |
| మనః | - | నాలుగు అంతఃకరణలు |

సూక్ష్మశరీరంలోని ఈ పందొమ్మిది అంగాలకూ ప్రాణశక్తే ఆధారం. ప్రాణం వల్లే అవి వాటి విధులను నిర్వర్తిస్తున్నాయి. అందుకే ఈ ఉపాసనను ప్రాణ విషయ ఉపాసన అన్నారు. అన్నీ ప్రాణశక్తి మీద ఆధారపడినా వాటి శక్తి ఎడమనుండి కుడికి చూస్తే, ఒకదాన్ని మించి రెండోదాని శక్తి ఎక్కువ. అంటే ప్రాణశక్తి కన్నా, వాక్‌శక్తి ఎక్కువ; అలా చివరికి మనశ్శక్తి అన్నిటికన్నా ఎక్కువ. అందుకని దీన్ని పరోవరీయం అన్నారు. ఎందుకు ఒకదానికన్నా ఒకటి ఎక్కువ అన్నదానికి ఉపనిషత్తు కారణం చూపలేదు కాని శంకరాచార్యులు విశ్లేషించారు. వాటి పరిధి ఒకదానికన్నా ఒకటి ఎక్కువ. మనసు పరిధి ప్రాణం పరిధి కన్నా ఎంతో ఎక్కువ.

**ఫలం –** పరోవరీయ ఉపాసన వల్ల ఫలం కూడా పరోవరీయం. ఇహలోకంలో అన్నింటిలోనూ శ్రేష్ఠంగా ఉంటాడు. పరలోకంలో అన్నిటికన్నా శ్రేష్ఠమైన లోకంలో ఉంటాడు.

**ఇతి తు పఞ్చవిధస్య –** దీనితో పంచ అవయవ సామ ఉపాసన తాత్కాలికంగా ఆగింది. (ఇదంతా పుట 92లో ఒక పట్టికలో చూడవచ్చు.) తర్వాత మూడు మంత్రాల్లో సప్త అవయవ సామ ఉపాసన వస్తుంది.

**ఉద్దేశ్యం –** ఇలా పంచ అవయవ లేదా సప్త అవయవ ఉపాసనలు చెప్పటంలో ఉపనిషత్తు లక్ష్యం ఏమిటి? ఈ ఉపాసనల వల్ల చిత్తశుద్ధి, చిత్త నైశ్చల్యం, చిత్త వైశాల్యం వస్తాయి ఎలాగూ. అవి కాక ఇంకోఉద్దేశం కూడా ఉంది. వీటిని ఉపాసన చేసినా చేయకపోయినా, ప్రకృతిలో ఉన్న అనేక శక్తుల గురించి ఇలా వివరంగా తెలుసుకోవటం వల్ల ప్రకృతి గురించిన అవగాహన బాగా పెరుగుతుంది. ఉదాహరణకు వానలో ఇన్ని దశలు, నీటిలో ఇన్ని రూపాలు మామూలుగా మనం తలచుకోము.

ఇంకోకారణం సాధకుడు సామ వేదం నేర్చుకుంటాడు. కాబట్టి అతనికి సామ మంత్రాల మీద గౌరవం ఉంటుంది. అతనికి గౌరవం ఉన్న ఆ మంత్రాల మీద ఋతువులను గాని, వర్షాన్ని గానీ, నీటిని గానీ ఆవాహన చేయటం వల్ల వాటి మీద గౌరవం పెరుగుతుంది. నిజానికి ఇవి విరాట్ ఉపాసన కిందకు వస్తాయి. దేన్నీ అగౌరవంగా చూడకూడదని నేర్చుకుంటాడు.

**భూః పాదౌ యస్య నాభిర్వియదసురనిలశ్చంద్రసూర్యౌచ నేత్రే**
**కర్ణావాసాశ్శిరోద్యౌర్ముఖమపి దహనో యస్యవాస్తేయమబ్ధిః।**

భూమిని విష్ణుపాదాలు గానూ, సూర్యచంద్రులను విష్ణుమూర్తి కళ్ళుగానూ చూస్తే సర్వం విష్ణుమయం జగత్ అని తెలుసుకుంటాము. అలా పురాణాల్లో విశ్వరూప ఉపాసన ఉంటుంది. వేదాల్లో విరాట్ ఉపాసన ఉన్నా కూడా ఎక్కువగా ఇలా మంత్ర ఉపాసన ఉంటుంది. విశ్వరూప దర్శనానికి ఇదొక పద్ధతి.

**అష్టమః ఖణ్డః (8)**

**అథ సప్తవిధస్య వాచి సప్తవిధగ్ం సామోపాసీత యత్కిం చ వాచో హుమితి స హింకారో యత్ప్రేతి స ప్రస్తావో యదేతి స ఆదిః ॥1॥ యదుదితి స ఉద్గీథో యత్ప్రతీతి స ప్రతిహారో యదుపేతి స ఉపద్రవో యన్నీతి తన్నిధనమ్ ॥2॥ దుగ్ధేఽస్మై వాగ్దోహం యో వాచో దోహోఽన్నవానన్నాదో భవతి య ఏవం విద్వాన్వాచి సప్తవిధగ్ం సామోపాస్తే ॥3॥**

**అథ సప్త విధస్య–** ఇక్కడ్నుంచీ 10వ ఖండం వరకు సప్త విధ సామ ఉపాసన. పంచభక్తులు మళ్ళీ ఒకసారి చూద్దాం. హింకారము, ప్రస్తావము, ఉద్గీథము, ప్రతిహారము, నిధనము. సప్త భక్తుల్లో ఈ ఐదూ ఉండగా, ఇంకో రెండు కలుస్తాయి. అవి ఆది, ఉపద్రవము. కాకపోతే ఈ రెండూ చివర్లో కలవవు.

**ఆది–** ప్రస్తావము, ఉద్గీథము మధ్యలోనూ, ఉపద్రవము – ప్రతిహారము, నిధనము మధ్యలోనూ కలుస్తాయి. ఇప్పుడు అన్నీ కలిపి వరుసక్రమం చూస్తే – హింకారము, ప్రస్తావము, ఆది, ఉద్గీథము, ప్రతిహారము, ఉపద్రవము, నిధనము.

**వాక్ విషయ సప్త విధ సామ ఉపాసన.** ఒక్క హింకారమునకు తప్ప తక్కిన ఆలంబనలకు వాటి మొదటి అక్షరాలు వచ్చాయి. ప్రస్తావముకు ప్ర, ఆదికి ఆ, ఉద్గీథకి ఉత్, ప్రతిహారముకి ప్రతి (ప్ర ముందే ఉంది కాబట్టి) ఉపద్రవముకి ఉప, నిధనమునకు ని అక్షరాలు ఆవాహన చేయవలసిన దేవతలు. హింకారమునకు హుమ్ దేవతని ఆవాహన చేయాలి. ఈ ఉపాసన చేసిన వాళ్ళ వాక్కు మంగళకరంగా ఉంటుంది. దాన్ని సూనృతా వాక్ అంటారు. వాళ్ళకి ఏ పనైనా తేలిగ్గా అయిపోతుంది.

**లక్ష్మీర్వసతి జిహ్వాగ్రే। జిహ్వాగ్రే మిత్ర బాంధవాః।**
**బంధనం చైవ జిహ్వాగ్రే। జిహ్వాగ్రే మరణం ధ్రువం॥**

మాట వల్లే లక్ష్మీదేవి పలుకుతుంది. మాట వల్లే మరణం కూడా కోరి తెచ్చుకుంటాం.

**నవమః ఖణ్డః (9)**

**అథ ఖల్వముమాదిత్యగ్ం సప్తవిధగ్ం సామోపాసీత॥ సర్వదా సమస్తేన సామ మాం ప్రతి మాం ప్రతీతి సర్వేణ సమస్తేన సామ ॥1॥ తస్మిన్నిమాని సర్వాణి భూతాన్యన్వాయత్తానీతి విద్యాత్॥ తస్య యత్పురోదయాత్స హింకారస్తదస్య పశవో-న్వాయత్తాస్మాత్తే హింకుర్వన్తి హింకారభాజినో హ్యేతస్య సామ్నః ॥2॥ అథ యత్ప్రథమోదితే స ప్రస్తావస్తదస్య మనుష్యా అన్వాయత్తాస్తస్మాత్తే ప్రస్తుతికామాః ప్రశగ్ంసాకామాః ప్రస్తావభాజినో హ్యేతస్య సామ్నః ॥3॥ అథ యత్సంగవవేలాయాగ్ం స ఆదిస్తదస్య వయాగ్ంస్యన్వాయత్తాని తస్మాత్తాన్యన్తరిక్షేఽనారమ్బణా న్యాదాయాత్మానం పరిపతంత్యాదిభాజీని హ్యేతస్య సామ్నః ॥4॥ అథ యత్సం ప్రతి మధ్యన్దినే స ఉద్గీథస్తదస్య దేవా అన్వాయత్తాస్తస్మాత్తే సత్తమాః ప్రాజాపత్యానాముద్గీథభాజినో హ్యేతస్య సామ్నః॥5॥ అథ యదూర్ధ్వం మధ్యన్దినాత్ప్రాగపరాహ్ణాత్స ప్రతిహారస్తదస్య గర్భా అన్వాయత్తాస్తస్మాత్తే ప్రతిహృతా నావపద్యన్తే ప్రతిహారభాజినో హ్యేతస్య సామ్నః ॥6॥ అథ యదూర్ధ్వమపరాహ్ణాత్ప్రాగస్తమయాత్స ఉపద్రవస్తదస్యారణ్యా అన్వాయత్తాస్తస్మాత్తే పురుషం దృష్ట్వా కక్షగ్ం శ్వభ్రిత్యుపద్రవన్త్యుపద్రవభాజినో హ్యేతస్య సామ్నః ॥7॥ అథ యత్ప్రథమాస్తమితే తన్నిధనం తదస్య పితరోఽన్వాయత్తాస్తస్మాత్తాన్నిదధతి నిధనభాజినో హ్యేతస్య సామ్న ఏవం ఖల్వముమాదిత్యగ్ం సప్తవిధగ్ం సామోపాస్తే ॥8॥**

**ఆదిత్య విషయ సప్త విధ సామ ఉపాసన.**

**మంత్రం 1:** ఇందులో సూర్యభగవానుని స్తుతి వస్తుంది. సూర్యుడిని సామ అంటుంది ఉపనిషత్తు. దానికి రెండు కారణాలు:-

ఎ) అందరికీ సమంగా కాంతిని పంచుతాడు. బి) సూర్యుడిని ఎవరు చూస్తే వాళ్ళకు సూర్యుడు తమనే చూస్తున్నాడు అనిపిస్తుంది.

సప్తవిధ సామ ఉపాసనలో సూర్యభగవానుని సప్త దశలు (ఒక్కరోజులో) ఆవాహన చేస్తూ, దానితోపాటుగా ఏ జీవికి ఏ దశ ఇష్టమో కూడా చెపుతున్నది. (అదంతా పుట 93లో ఒక పట్టికలో చూడవచ్చు.)

**ఫలం:–** చెప్పలేదు. ఉపాసన సూత్రం ప్రకారం, సూర్యభగవానుని ప్రార్థించటం వల్ల, సూర్య అనుగ్రహం సమృద్ధిగా ఉంటుంది.

**దశమ ఖణ్డః (10)**

**అథ ఖల్వాత్మసమ్మితమతిమృత్యు సప్తవిధగ్ం సామోపాసీత హింకార ఇతి త్ర్యక్షరం ప్రస్తావ ఇతి త్ర్యక్షరమ్ తత్సమమ్ ॥1॥ ఆదిరితి ద్వ్యక్షరం ప్రతిహార ఇతి చతురక్షరం తత ఇహైకం తత్సమమ్ ॥2॥ ఉద్గీథ ఇతి త్ర్యక్షరముపద్రవ ఇతి చతురక్షరం త్రిభిస్త్రిభిస్సమం భవత్యక్షరమతిశిష్యతే॥ త్ర్యక్షరం తత్సమమ్ ॥3॥ నిధనమితి త్ర్యక్షరం తత్సమమేవ భవతి॥ తాని హ వా ఏతాని ద్వావిగ్ంశతిరక్షరాణి ॥4॥ ఏకవిగ్ంశత్యాఽఽదిత్యమాప్నోత్యేకవిగ్ంశో వా ఇతోఽసావాదిత్యో ద్వావిగ్ంశేన పరమాదిత్యాజ్జయతి॥తన్నాకం తద్విశోకమ్ ॥5॥ ఆప్నోతి హాదిత్యస్య జయంపరో హాస్యాదిత్యజయాజ్జయో భవతి య ఏతదేవం విద్వానాత్మసమ్మితమతిమృత్యు సప్తవిధగ్ం సామోపాస్తే సామోపాస్తే ॥6॥**

**ఆత్మ సమ్మిత ఉపాసన.** ఎందుకు ఆత్మ సమ్మితం పేరు వచ్చింది? సమ్మితం అంటే సమ్యక్ మితం సమ్మితం. సమానంగా కొలవటం. ఆత్మ అంటే తనకి తాను. ఆత్మ సమ్మితం అంటే ఏడు భక్తులు తమలోతాము సమానంగా విభజించుకున్నాయని అర్థం. ఏడు భక్తుల పదాల సంఖ్య కూడితే 22 వస్తాయి. వాటిని మూడేసి అక్షరాల చొప్పున విభజించితే ఒకటి మిగులుతుంది. ఆ ఒక్కటీ మూడు అక్షరాలున్న ఒక పదం కింద లెక్క. అది ఈ క్రింది విధంగా జరుగుతుంది.

**హింకార ప్రస్తావ ఆది ప్రతిహార ఉద్గీథ ఉపద్రవ నిధనమ్**

**హింకార ప్రస్తావ ఆదిప్ర తిహార ఉద్గీథ ఉపద్ర నిధనమ్ వ**

ఆదికి రెండే అక్షరాలున్నాయి కాబట్టి 'ప్ర'ని దానితో కలిపాము. ఉపద్రవలోని 'వ' అక్షరం చివరికి తెచ్చాము. వ కూడా ఒక భక్తి. అలా 8 భక్తుల మీద ఆత్మ సమ్మిత ఉపాసన. దీన్ని త్ర్యక్షర త్వేన ఉపాసన అని కూడా అంటారు.

త్య్రక్షరం అంటే మూడు అక్షరాలు.
**ఫలం–** మృత్యు అతిక్రమణ లేదా మృత్యు తరణం లేదా అమృతత్వం. ఉపాసన ప్రత్యక్షంగా అమృతత్వాన్ని ఇవ్వదు. పరంపరగా ఇస్తుంది. అంటే ఉపాసన వల్ల చిత్తశుద్ధి కలిగి దాని తర్వాత గురుప్రాప్తి, తద్వారా జ్ఞానప్రాప్తి కలిగి అమృతత్వం లభిస్తుంది.

ఇక్కడ ఉపనిషత్తు ఒక ఆసక్తికరమైన తర్కం ఉపయోగిస్తున్నది. సూర్య భగవానుని 21 సంఖ్యతో సూచిస్తారు. 12 నెలలు + 5 ఋతువులు+ 3 లోకాలు = 20

(హేమంత, శిశిర ఋతువు కలిపి ఒకటే ఋతువు. భూలోక, భువర్లోక, సువర్లోక కలిపి 3 లోకాలు)

సూర్యభగవానుడు వీటికన్నా పైన ఉన్నాడు. అందుకని ఆయనకు 21 సంఖ్య ఇవ్వబడింది. సూర్యభగవానుడిని మృత్యుదేవతకు ప్రతీకగా భావిస్తారు. ఎందుకు? సూర్యుడు కాలతత్వాన్ని సూచిస్తాడు కాబట్టి. ఉత్తరాయణం, దక్షిణాయనం, పగలు, రాత్రి లాంటి కాలవిభజన సూర్యుని వల్లే వస్తుంది కదా.

ఇప్పుడు, మృత్యువును సూచించే సూర్యుని సంఖ్య 21. ఆత్మసమ్మిత ఉపాసనలోని అక్షరాల సంఖ్య 22. అంటే సూర్యునికన్నా ఎక్కువ. అందువల్ల ఈ ఉపాసకుడు మృత్యువును అధిగమిస్తాడు. ఇదీ వేదశాస్త్రం వాడే తర్కం. అందువల్ల దీన్ని **"అతి మృత్యు ఉపాసన"** అని కూడా అంటారు.

పరమార్థానంద స్వామీజీ దీనికి ఇంకో తర్కం జోడించారు. ఇక్కడ అక్షరాలను సమం అన్నారు. శాస్త్రంలో ఎప్పుడూ బ్రహ్మను సమం అంటారు.

**సర్వేషు భూతేషు సమం తిష్ఠన్తి.** అందువల్ల సమం ఉపాసన చేస్తే సమం బ్రహ్మను పొందుతాడు అంటే అమృతత్వాన్ని పొందుతాడు.
**సప్త విధగ్ం సామోపాస్తే సామోపాస్తే –** రెండుసార్లు చెప్పటం వల్ల సప్త విధ సామ ఉపాసన ఇక్కడితో ముగిసిందని అర్థం.

### ఖండాలు 11-21

మళ్ళీ పంచవిధ సామ ఉపాసనలు అనేకం వస్తాయి. ముందు చెప్పిన పంచ విధ సామ ఉపాసనలకూ,ఇప్పటి ఉపాసనలకూ మధ్య రెండు తేడాలు ఉన్నాయి.

ఎ) ఆ ఉపాసనలకు పేర్లు లేవు. ఇప్పుడు పేర్లు ఉన్నాయి. బి) ఒక్కొక్క ఉపాసనతో ఒక్కొక్క వ్రతం జత చేయబడింది. భృగువల్లీలో ఉపాసనలతో పాటు వ్రతాలు జత చేయబడినట్లుగా.

ఈ ఉపాసనలకు మళ్ళీ హింకారము, ప్రస్తావము, ఉద్గీత, ప్రతిహారము, నిధనములను ఆలంబనలుగా తీసుకోవాలి. ఈ పదకొండు ఉపాసనలకూ దేనికి దానికి ఫలం ప్రత్యేకంగా ఇవ్వటమే కాకుండా, అన్నింటికీ కలిపి సమంగా కొన్ని ఫలాలను ఇచ్చింది ఉపనిషత్తు. ముందు అవేమిటో చూద్దాం.

**సర్వమాయురేతి జ్యోగ్జీవతి మహాన్ప్రజయా పశుభిర్భవతి మహాన్కీర్త్యా।**

ఈ మాటలు అన్నింటిలోనూ వస్తాయి.

| | | |
|---|---|---|
| **సర్వమాయురేతి** | **–** | **ఆయుష్షు పెరుగుతుంది.** |
| **జ్యోగ్జీవతి** | **–** | **ప్రకాశవంతమైన జీవితం గడుపుతాడు.** |
| **మహాన్** | **–** | **మహానుభావుడవుతాడు** |
| **ప్రజయా** | **–** | **సంతతి కలుగుతుంది** |
| **పశుభిర్భవతి** | **–** | **పశు సంపద కలుగుతుంది.** |
| **మహాన్కీర్త్యా** | **–** | **కీర్తిమంతుడవుతాడు** |

**ఏకాదశః ఖణ్డః (11)**

**మనో హింకారో వాక్ప్రస్తావశ్చక్షురుద్గీథశ్శ్రోత్రం ప్రతిహారః ప్రాణో నిధనమేతద్గాయత్రం ప్రాణేషు ప్రోతమ్ ॥1॥ స య ఏవమేతద్గాయత్రం ప్రాణేషు ప్రోతం వేద ప్రాణీ భవతి సర్వమాయురేతి జ్యోగ్జీవతి మహాన్ప్రజయా పశుభిర్భవతి మహాన్కీర్త్యా మహామనాస్స్యాత్తద్వ్రతమ్ ॥2॥**

**గాయత్ర సామ ఉపాసన.** ఈ పేరుకీ ఉపాసనకీ సంబంధం లేదు. విషయం – ప్రాణం. అంతకుముందు చూసినట్టుగా ప్రాణం అంటే పంచప్రాణాలు కాకుండా సూక్ష్మ శరీరంలోని 19 అంగాలు వస్తాయి.

**మనసు –** నాలుగు అంతఃకరణలు, **వాక్కు –** పంచకర్మేంద్రియాలు, **చక్షుశ్శ్రోత్రం –** పంచ జ్ఞానేంద్రియాలు, **ప్రాణం –** పంచప్రాణాలు.

**ఫలం – ప్రాణీభవతి –** అన్ని అంగాలు ఏ అనారోగ్యం లేకుండా చక్కగా పనిచేస్తాయి. **వ్రతం –** మహామనాస్స్యాత్– ఉదారగుణం కలవాడై ఉండాలి.

## ద్వాదశః ఖణ్డః (12)

**అభిమన్థతి స హింకారో ధూమో జాయతే స ప్రస్తావో జ్వలతి స ఉద్గీథోఽఙ్గారా భవన్తి స ప్రతిహార ఉపశామ్యతి తన్నిధనగ్ం సగ్ంశామ్యతి తన్నిధనమేతద్రథన్తరమగ్నౌ ప్రోతమ్ ॥1॥ సయ ఏవమేతద్రథన్తరమగ్నౌ ప్రోతం వేద బ్రహ్మవర్చస్యన్నాదో భవతి సర్వమాయురేతి జ్యోగ్జీవతి మహాన్ప్రజయా పశుభిర్భవతి మహాన్కీర్త్యా న ప్రత్యఙ్జగ్నిమాచామేన్న నిష్ఠీవేత్తద్వ్రతమ్ ॥2॥**

**రథన్తరసామ ఉపాసన.** ఇక్కడ విషయం అగ్ని. **అభిమన్థతి –** అగ్ని మథనం, **ధూమోజాయతే–** పొగరావటం; **జ్వలతి –** మంటలు రేగటం; **అంగారాభవన్తి–** ఆహుతులు వేస్తున్నప్పటి జ్వాల. **ఉపశ్యామతి–** సద్దుమణుగుతున్న జ్వాల.
**ఫలం:– బ్రహ్మవర్చస్యన్నాదో భవతి –** బ్రహ్మవర్చస్సు పొందుతాడు. అన్నం సమృద్ధిగా పొందుతాడు. హితవుగా తినే ఆరోగ్యం ఉంటుంది.
**వ్రతం– పత్యఙ్జగ్నిమాచామి–** అగ్ని ఎదురుగా కూర్చుని ఆచమనం చేయకూడదు.
**న నిష్ఠీవేత్–** అగ్ని ఎదురుగా ఉమ్మకూడదు.

## త్రయోదశః ఖణ్డః (13)

**ఉపమన్త్రయతే స హింకారో జ్ఞపయతే స ప్రస్తావః స్త్రియా సహశేతే స ఉద్గీథః ప్రతి స్త్రీం సహ శేతే స ప్రతిహారః కాలం గచ్ఛతి తన్నిధనం పారం గచ్ఛతి తన్నిధనమేతద్వామదేవ్యం మిథునే ప్రోతమ్ ॥1॥ స య ఏవమేతద్వామదేవ్యం మిథునే ప్రోతం వేద మిథునీ భవతి మిథునాన్మిథునా త్ప్రజాయతే సర్వమాయురేతి జ్యోగ్జీవతి మహాన్ప్రజయా పశుభిర్భవతి మహాన్కీర్త్యా న కాంచన పరిహరేత్తద్వ్రతమ్ ॥2॥**

**వామదేవ్యసామ ఉపాసన.** విషయం మైథునం. స్త్రీపురుష సంయోగం. దీన్ని బట్టి వైదిక కాలంలో ప్రతిదీ దైవకార్యంగా చూసేవారని తెలుస్తోంది. **ఉపమన్త్రం–** ఇద్దరికీ అంగీకారం ఉండాలి. **జ్ఞపయతే–** ఇద్దరూ ఆనందంగా ఉండాలి. **స్త్రియా సహశేతే –** భర్త భార్యని సమీపించాలి. **ప్రతిస్త్రీం సహశేతే –** భార్య సహకరించాలి; **కాలం గచ్ఛతి, పారం గచ్ఛతి –** సంయోగం అవసానం అంటే సంయోగం ముగించటం.

**ఫలం - మిథునీ భవతి-** భార్యాభర్తలు అన్యోన్యంగా ఉంటారు.
**మిథునాత్ప్రజాయతే-** మంచి పిల్లలు పుడతారు.
**వ్రతం - న కాంచన పరిహారేత్-** భార్యను తిరస్కరించకూడదు.

**చతుర్దశః ఖణ్డః (14)**

**ఉద్యన్హింకార ఉదితః ప్రస్తావో మధ్యన్దిన ఉద్గీథోఽపరాహ్ణః ప్రతిహారోఽస్తం యన్నిధనమేతద్బృహదాదిత్యే ప్రోతమ్ ॥1॥ స య ఏవమేతద్బృహదాదిత్యే ప్రోతం వేద తేజస్వ్యన్నాదో భవతి సర్వమాయురేతి జ్యోగ్జీవతి మహాన్ప్రజయా పశుభిర్భవతి మహాన్కీర్త్యా తపన్తం న నిన్దేత్తద్వ్రతమ్॥2॥**

**బృహత్ సామ ఉపాసన.** విషయం- ఆదిత్యుడు. **ఉద్యన్-** ఉదయిస్తున్న సూర్యుడు; **ఉదిత -**ఉదయించిన సూర్యుడు; **మధ్యన్దినం -** మిట్టమధ్యాహ్నం; **అపరాహ్ణం-** మధ్యాహ్నం; **అస్తం-** అస్తమిస్తున్న సూర్యుడు.
**ఫలం- తేజస్వ్యన్నాదో భవతి-** ముందు ఖండంలో (12) బ్రహ్మవర్చసు పొందుతాడు అని వచ్చింది. ఇక్కడ తేజస్సు కలవాడు అవుతాడు.
**వ్రతం- తపన్తం న నిన్దేత్-** చాలా ముఖ్యమిది. సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు; చెలరేగిపోతున్నాడు అని తిట్టకూడదు.

**పంచదశః ఖణ్డః (15)**

**అభ్రాణి సంప్లవన్తే స హింకారో మేఘో జాయతే స ప్రస్తావో వర్షతి స ఉద్గీథో విద్యోతతే స్తనయతి స ప్రతిహార ఉద్గృహ్ణాతి తన్నిధనమేతద్వైరూపం పర్జన్యే ప్రోతమ్ ॥1॥ సయ ఏవమేతద్వైరూపం పర్జన్యే ప్రోతం వేద విరూపాగ్ంశ్చ సురూపాగ్ంశ్చ పశూనవరున్ధే సర్వమాయురేతి జ్యోగ్జీవతి మహాన్ప్రజయా పశుభిర్భవతి మహాన్కీర్త్యా వర్షన్తం న నిన్దేత్తద్వ్రతమ్ ॥2॥**

**వైరూప సామ ఉపాసన.** విషయం - వర్షం. **అభ్రాణి సంప్లవన్తే-** చెదురుమదురుగా ఏర్పడిన మేఘాలు; **మేఘోజాయతే-** వర్షం కురవటానికి సిద్ధంగా ఉన్న మేఘాలు; **వర్షతి -** కురుస్తున్న వాన; **విద్యోతతే స్తనయతి-** మెరుపులు, ఉరుములు; **ఉద్గృహ్ణాతి -** వర్షం ఆగిపోవటం.
**ఫలం - పశూనవరున్ధే-** ఈ ఫలం వింతగా ఉంది. పశుసంపద బాగా

ఉంటుంది. అది కూడా ఎలాంటి పశువులు? **విరూపాగ్ంశ్చ సరూపాగ్ంశ్చ–** వివిధ రూపాలున్న, మంచి రూపాలున్న పశువులు.
**వ్రతం – వర్షన్తం న నిన్దేత్ –** వానను విమర్శించకూడదు.

**షోడశః ఖణ్డః (16)**

**వసన్తో హిఙ్కారో గ్రీష్మః ప్రస్తావో వర్షా ఉద్గీథశ్శరత్ప్రతిహారో హేమన్తో నిధనమేతద్వైరాజమృతుషు ప్రోతమ్ ॥1॥ స య ఏవమేతద్వైరాజమృతుషు ప్రోతం వేద విరాజతి ప్రజయా పశుభిర్బ్రహ్మవర్చసేన సర్వమాయురేతి జ్యోగ్జీవతి మహాన్ప్రజయా పశుభిర్భవతి మహాన్కీర్త్యర్తూన్న నిన్దేత్తద్వ్రతమ్॥2॥**

**వైరాజ సామ ఉపాసన.** ముందు వైరూప సామ ఉపాసన. విషయం– ఋతువులు; వసంత ఋతువు, గ్రీష్మఋతువు, వర్షఋతువు, శరదృతువు, హేమంత ఋతువులు. హేమంత ఋతువులో శిశిర ఋతువును కూడా కలుపుకోవాలి. రెండూ కలిపి చలికాలం కిందకి వస్తాయి.
**ఫలం – విరాజతి –** ఏ కాలానికి తగ్గ వస్తువులు ఆ కాలంలో అతనికి సమృద్ధిగా దొరుకుతాయి.
**వ్రతం – ఋతూన్న నిన్దేత్–** ఋతువులను నిందించకూడదు. సంతోషంగా ఆస్వాదించాలి.

**సప్తదశః ఖణ్డః (17)**

**పృథివీ హింకారోఽన్తరిక్షం ప్రస్తావో ద్యౌరుద్గీథో దిశః ప్రతిహారస్సముద్రో నిధనమేతాశ్శక్వర్యో లోకేషు ప్రోతాః ॥1॥ స య ఏవమేతాశ్శక్వర్యో లోకేషు ప్రోతా వేద లోకీ భవతి సర్వమాయురేతి జ్యోగ్జీవతి మహాన్ప్రజయా పశుభిర్భవతి మహాన్కీర్త్యా లోకాన్న నిన్దేత్తద్వ్రతమ్ ॥2॥**

**శక్వరీ సామ ఉపాసన.** విషయం–లోకాలు; అవి పృథివీ, అంతరిక్షం, స్వర్గలోకం, దిక్కులు (తక్కిన లోకాలు), సముద్రం. మొదటి మూడింటినీ మామూలుగా భూలోక, భువర్లోక, సువర్లోకాలు అంటారు.
**ఫలం – లోకీ భవతి–** ఆయా లోకాలకు చెందిన సుఖాలను అనుభవిస్తాడు.
**వ్రతం– లోకాన్న నిన్దేత్–** లోకాలను నిందించకూడదు.

### అష్టాదశః ఖండః(18)

**అజా హింకారోఽ వయః ప్రస్తావో గావ ఉద్గీథోఽ శ్వాః ప్రతిహారః పురుషో నిధనమేతా రేవత్యః పశుషు ప్రోతాః ॥1॥ స య ఏవమేతా రేవత్యః పశుషు ప్రోతా వేద పశుమాన్భవతి సర్వమాయురేతి జ్యోగ్జీవతి మహాన్ప్రజయా పశుభిర్భవతి మహాన్కీర్త్యా పశూన్న నిన్దేత్తద్వ్రతమ్ ॥2॥**

**రేవతీసామ ఉపాసన.** విషయం– పశువులు; అవి **అజా** (మేక), **అవయ**(గొర్రె); **గావ**(ఆవు), **అశ్వా** (గుఱ్ఱం), **పురుష–** మనిషి; అన్నీ మచ్చిక చేసుకున్న జంతువులు.

**ఫలం– పశుభిర్భవతి –** పశు సంపదను సమృద్ధిగా పొందుతాడు.

**వ్రతం– పశూన్న నిన్దేత్–** పశువులను నిందించకూడదు.

### ఏకోనవింశః ఖణ్డః (19)

**లోమ హిఙ్కారస్త్వక్ప్రస్తావో మాగ్ంసముద్గీథోఽ స్థి ప్రతిహారో మజ్జా నిధనమేతద్యజ్ఞాయజ్ఞీయమంగేషు ప్రోతమ్ ।71॥ స య ఏవమేతద్యజ్ఞాయజ్ఞీయమంగేషు ప్రోతం వేదాంగీభవతి నాంగేన విహూర్ఛతి సర్వమాయురేతి జ్యోగ్జీవతి మహాన్ప్రజయా పశుభిర్భవతి మహాన్కీర్త్యా సంవత్సరం మజ్జ్ఞో నాశ్నీయాత్తద్వ్రతమ్ మజ్జ్ఞో నాశ్నీయాదితి వా ॥2॥**

**యజ్ఞాయజ్ఞీయ సామ ఉపాసన. విషయం –** శరీర అవయవాలు. **లోమ –** అంటే శరీరం మీద వెంట్రుకలు; వెంట్రుకలున్న స్థానం బట్టి వాటి పేరు మారుతూ ఉంటుంది. శిరస్సు మీద ఉంటే కేశాలు; మొహం మీద ఉంటే శ్మశ్రు, శరీరం మీద ఉంటే లోమ. (లోమని రోమగా తీసుకోవాలి. సంస్కృతంలో ల,రల మధ్య భేదం లేదు.) **త్వక్ –** చర్మం; **మాంసం –** మాంసము; **అస్థి –** ఎముకలు; **మజ్జా –** మూలుగు;

ఈ ఉపాసనను బట్టి శరీరాన్ని కించపరచకూడదని తెలుస్తోంది. శరీరానికి ప్రాముఖ్యతనిచ్చి; దాని గురించి అతిగా తాపత్రయపడ్డా ఉపనిషత్తు ఖండిస్తుంది. అలాగని నిర్లక్ష్యం చేసినా దాన్ని గౌరవించమంటుంది. ఆ విధంగా శాస్త్రం సమభావాన్ని నెలకొల్పుతుంది.

**ఫలం – అంగీ భవతి –** శరీర అంగాలన్నీ ఆరోగ్యకరంగా ఉంటాయి.

**వ్రతం – మజ్జో నాశ్నీయాత్ –** మాంసం తినకూడదు. ఎన్నాళ్ళు? ముందు సంవత్సరకాలం అని చెప్పి తర్వాత జీవితాంతం అంటుంది ఉపనిషత్తు. ముందే జీవితాంతం అంటే ఏదైనా సరే చెడు అలవాటుని మానటం కష్టం.

**వింశః ఖణ్డః (20)**

**అగ్నిర్హింకారో వాయుః ప్రస్తావ ఆదిత్య ఉద్గీథో నక్షత్రాణి ప్రతిహారశ్చన్ద్రమా నిధనమేతద్రాజనం దేవతాసు ప్రోతమ్ ॥1॥ స య ఏవమేతద్రాజనం దేవతాసు ప్రోతం వేదైతాసామేవ దేవతానాగ్ం సలోకతాగ్ం సార్ష్టి తాగ్ం సాయుజ్యం గచ్ఛతి సర్వమాయురేతి జ్యోగ్జీవతి మహాన్ప్రజయా పశభిర్భవతి మహాన్కీర్త్యా బ్రాహ్మణాన్న నిన్దేత్తద్వ్రతమ్ ॥2॥**

**రాజస సామ ఉపాసన.** విషయం – దేవతలు. వాళ్ళు అగ్ని, వాయువు, ఆదిత్యుడు, నక్షత్రాలు, చంద్రుడు.

**ఫలం – సార్ష్టితాగ్ం సాయుజ్యం గచ్ఛతి –** ఆయా లోకాల దేవతలతో ఐక్యం చెందుతాడు.

**వ్రతం– బ్రాహ్మణాన్న నిన్దేత్ –** బ్రాహ్మణుడిని నిందించకూడదు. ముందు ఉపాసనలలో ఏ విషయానికి తగ్గట్టుగా ఆ వ్రతం వచ్చింది. కాని ఇక్కడ దేవతలను నిందించకూడదు అనకుండా బ్రాహ్మణుడిని నిందించకూడదు అన్నది. ఎందుకు? బ్రాహ్మణాః దేవతాః తుల్య– బ్రాహ్మణుడు దేవతలతో సమానం. బ్రాహ్మణుడిని భూమీమ్మీద దేవత (భౌమ దేవత) అంటారు. బ్రాహ్మణుడు అంటే గుణ బ్రాహ్మణుడని అర్థం తీసుకోవాలి. జాతి బ్రాహ్మణుడు, కర్మ బ్రాహ్మణుడు కాదు.

**ఏకవింశః ఖణ్డః (21)**

**త్రయీ విద్యా హింకారస్త్రయ ఇమే లోకాః ప్రస్తావో౽గ్నిర్వాయురాదిత్యస్స ఉద్గీథో నక్షత్రాణి వయాగ్ంసి మరీచయస్స ప్రతిహారస్సర్పా గన్ధర్వాః పితరస్తన్నిధనమేతత్సామ సర్వస్మిన్ప్రోతమ్ ॥1॥ స య ఏవమేతత్సామ సర్వస్మిన్ప్రోతం వేద సర్వగ్ం హ భవతి ॥2॥ తదేష శ్లోకో యాని పంచధా త్రీణి త్రీణి తేభ్యో న జ్యాయః పరమన్యదస్తి ॥3॥ యస్తద్వేద స వేద సర్వగ్ం సర్వా దిశో బలిమస్మై హరన్తి సర్వమస్మీత్యుపాసీత తద్వ్రతం తద్వ్రతమ్ ॥4॥**

**సర్వ సామ ఉపాసన** – చివరిది. అత్యంత ఉన్నతమైనది. ఈ ఉపాసనకు పేరు చెప్పలేదు. విషయం– సర్వ విషయ ఉపాసన. అందుకని **సర్వ సామ ఉపాసన అనవచ్చు.** ఇక్కడ ప్రత్యేకత ఏమిటంటే ఒక్కొక్క ఆలంబనం మీద మూడేసి వస్తువులను ఆవాహన చేయాలి.

**మొదటిది త్రయీ విద్యా** – మూడు వేదాలు – సామవేదం, ఋగ్వేదం, యజుర్వేదం.

**త్రయ ఇమేలోకాః** – మూడు లోకాలు – భూలోక, భువర్లోక, సువర్లోకాలు; **అగ్నిర్వాయురాదిత్య** – ముఖ్య దేవతలు – అగ్ని, వాయువు, ఆదిత్యుడు.

**నక్షత్రాణి వయాగ్ంసి మరీచియః** – నక్షత్రాలు, పక్షులు, సూర్యరశ్మి;

**సర్పా, గన్ధర్వాః పితరః**– సర్పాలు, గంధర్వులు, పితృదేవతలు; వీటన్నిటినీ వరుసగా పంచభక్తుల మీద ఆవాహనం చేయాలి.

ఒక్కముక్కలో చెప్పాలంటే అన్ని రకాల అంశాలనూ ఉపాసన చేయాలి.

**ఫలం– సర్వగ్ం హ భవతి**– అన్నీ తానే అవుతాడు. ఇది అన్నిటికన్నా ఉన్నతమైన ఉపాసన కాబట్టి అన్ని వైపుల నుంచి గౌరవాన్ని పొందుతాడు. అంటే అతను హిరణ్యగర్భ అవుతాడు.

**వ్రతం – సర్వమస్మీత్యుపాసీత** – ప్రతిదానిలో తనని తాను ఊహించుకోవాలి. అహం బ్రహ్మాస్మి అన్న భావన రావాలి. బ్రహ్మజ్ఞానం పొందాక అహం బ్రహ్మాస్మి అన్న జ్ఞానం వస్తుంది. కాని ఇక్కడ ఉన్నదంతా తానే అని ఊహించుకోవాలి. అందువల్ల నేర్చుకోబోయే జ్ఞానానికి ముందు చేసే సాధనలాంటిది.

**తద్వ్రతం తద్వ్రతమ్** – ఇలా రెండు సార్లు చెప్పటం వల్ల ఈ పంచవిధ సామ ఉపాసనలు ముగిశాయి అని అర్థం.

## ద్వావింశః ఖణ్డః (22)

**వినర్ది సామ్నో వృణే పశవ్యమిత్యగ్నేరుద్గీథోనిరుక్తః ప్రజాపతేర్నిరుక్తస్సోమస్య మృదు శ్లక్ష్ణం వాయోః శ్లక్ష్ణం బలవదిన్ద్రస్య క్రౌంచం బృహస్పతేరపధ్వాన్తం వరుణస్య తాన్సర్వానేవోపసేవేత వారుణం త్వేవ వర్జయేత్ ॥1॥ అమృతత్వం దేవేభ్య ఆగాయానీత్యాగాయేత్స్వధాం పితృభ్య ఆశాం మనుష్యేభ్యస్తృణోదకం పశుభ్యస్స్వర్గం లోకం యజమానాయాన్నమాత్మన ఆగాయానీత్యేతాని మనసా ధ్యాయన్నప్రమత్తః స్తువీత ॥2॥ సర్వే స్వరా ఇంద్రస్యాత్మానస్సర్వ ఊష్మాణః ప్రజాపతేరాత్మానస్సర్వే**

**స్పర్శా మృత్యోరాత్మానస్తం యది స్వరేషూపాలభేతేన్ద్రగ్ం శరణం ప్రపన్నోఽ భూవం స త్వా ప్రతివక్ష్యతీత్యేనం బ్రూయాత్ ॥3॥ అథ యద్యేనమూ ష్మసూపాలభేత ప్రజాపతిగ్ం శరణం ప్రపన్నోఽ భూవం స త్వా ప్రతి పేక్ష్యతీత్యేనం బ్రూయాదథ యద్యేనగ్ం స్మర్శేషూపాలభేత మృత్యుగ్ం శరణం ప్రపన్నోఽ భూవం స త్వా ప్రతిధక్ష్యతీత్యేనం బ్రూయాత్ ॥4॥ సర్వే స్వరా ఘోషవన్తో బలవన్తో వక్తవ్యా ఇంద్రే బలం దదానీతి సర్వ ఊష్మాణోఽ గ్రస్తా అనిరస్తా వివృతా వక్తవ్యాః ప్రజాపతేరాత్మానం పరిదదానీతి సర్వే స్పర్శా లేశేనానభినిహితా వక్తవ్యా మృత్యోరాత్మానం పరిహరాణీతి ॥5॥**

ఈ ఖండంలో కొన్ని చెదురుమదురు భావాలు.

**మంత్రం -1- గాన విశేష విజ్ఞానం.** సామవేదంలో రకరకాల స్థాయీ బేధాలున్నాయని ఉపనిషత్తు చెపుతున్నది. సంగీతం గానం చేసేవారు రకరకాల హావభావాలు ప్రదర్శిస్తారు. కొంతమంది చెయ్యి తిప్పితే,కొంతమంది మొహం చిట్లిస్తారు. మరికొంతమందిలో ఉచ్చారణ శుద్ధి ఉంటుంది. కొంతమంది పదాలను విరచటంలో ప్రత్యేకత చూపుతారు.

ఇక్కడ ఉపనిషత్తు రకరకాల గానాలను, వాటిని ఇష్టపడేవారినీ ఇస్తున్నది.

| **గానం పేరు** | **అర్థం** | **ఇష్టపడేవారు** |
|---|---|---|
| **వినర్దిసామ్న** | **రొద ఎక్కువ** | **పశువులు** |
| **ఉద్గీథ** | **హెచ్చుస్థాయి** | **అగ్నిదేవత** |
| **అనిరుక్త** | **అస్పష్టం** | **ప్రజాపతి** |
| **నిరుక్త** | **స్పష్ట ఉచ్చారణ** | **సోమ** |
| **మృదు శ్లక్ష్ణం** | **మృదువుగా, ఉన్నతంగా** | **వాయుదేవత** |
| **శ్లక్ష్ణం బలవత్** | **అందంగా, బలంగా** | **ఇంద్రుడు** |
| **క్రౌంచం** | **కీచు గొంతు** | **బృహస్పతి** |
| **అపధ్వాన్తం** | **పగిలిన కంచుధ్వని** | **వరుణుడు** |

**వారుణం త్వేవ వర్జయేత్ –** పగిలిన కంచుధ్వని, లోగొంతుతో పాడకూడదు.

**మంత్రం–2 – లోకాస్సమస్తాః సుఖినోభవను** ఇంకో చెదురుమదురు ఆలోచన. మనం ప్రార్థన చేసేటప్పుడు లోకాసమస్తా సుఖినోభవన్తు అంటాము. ఎవరికే

కోరికలు ఉంటే అవి తీరి సుఖంగా ఉండుగాక అని దాని అర్థం.

| **వ్యక్తులు** | **ఇష్టాలు** |
|---|---|
| దేవతలు | అమృతం |
| పితృదేవతలు | స్వధా |
| మనుష్యులు | ఆశ |
| పశువులు | ఆహారం,నీరు |
| యజమాని | స్వర్గలోకం |
| ఆత్మన (నాకు) | అన్నం |

ఒకమ్మాయి పెళ్ళి కుదిరితే ఒక్కొక్కరు ఏ అంశం చూస్తారో తమాషాగా ఈ పద్యంలో వస్తుంది.

| | | |
|---|---|---|
| కన్యారూపం వరయత్ | – | పెళ్ళికూతురు అందం చూస్తుంది. |
| మాతా విత్తం, పితా శృతం | – | తల్లి ఐశ్వర్యం చూస్తే, తండ్రి కీర్తి చూస్తాడు. |
| బాంధవాః కులమిచ్ఛంతి | – | బంధువులు కుటుంబ వివరాలు చూస్తారు. |
| మృష్టాన్నం ఇతరే జనా | – | తక్కిన వాళ్ళు విందు భోజనం చూస్తారు. |

అలా ఇక్కడ ఈ మంత్రంలో మనం అన్నం సమృద్ధిగా దొరకాలని కోరుకుంటాము.

**మంత్రాలు – 3,4,5 – అక్షరాలకు అధిష్ఠాన దేవతలు –** అక్షరాలను మూడుగా విభజిస్తారు. ఒక్కొక్కదాన్నీ ఒక్కొక్క దేవత రక్షిస్తుంది.

| | | | |
|---|---|---|---|
| స్వరాః | అచ్చులు | – | ఇంద్రుడు |
| స్పర్శాః | హల్లులు | – | మృత్యుదేవత |
| ఊష్మాణః | శ,ష,స | – | ప్రజాపతి |

పాట పాడేముందు ఈ ముగ్గురు దేవతలను కొలిచి పాడతారు. గాయకుడిని ఎవరైనా మీరు అచ్చులు సరిగా పలకలేదంటే, ఇంద్రుడు అతనికి జవాబిస్తాడు. శ,ష,సలు సరిగా పలకలేదంటే ప్రజాపతి, హల్లులు సరిగా పలకలేదంటే మృత్యుదేవత వాళ్ళ పని పడతారు.

దీనివెనుక ఉన్న ఉద్దేశం పాడేముందు ప్రార్థన చేస్తే పొరపాట్లు దొర్లవని. ఈ అక్షరాలను ఎలా పలకాలో చెపుతున్నది ఉపనిషత్తు.

స్వరాః – ఘోషవన్తో బలం బలవంతో వక్తవ్యాః – బలంగా
ఊష్మాణః– అగ్రస్తా అనిరస్తా వివృతా – దేనికది స్పష్టంగా.
స్పర్శాః – లేశేనానభినిహితా – మృదువుగా,
సరిగా,అన్నీ స్పష్టంగా పలకాలి.

## త్రయోవింశః ఖణ్డః (23)

**త్రయో ధర్మస్కన్ధా॥ యజ్ఞోఽధ్యయనం దానమితి ప్రథమస్తప ఏవ ద్వితీయో బ్రహ్మచార్యా చార్యకులవాసీ తృతీయోఽత్యన్తమాచార్యకులేఽ వసాదయన్సర్వ ఏతే పుణ్యలోకా భవన్తి బ్రహ్మసగ్ంస్థోఽమృతత్వమేతి ॥1॥ ప్రజాపతిర్లోకానభ్యతపత్తేభ్యోఽభితప్తేభ్యస్త్రయీ విద్యా సంప్రాస్రవత్తామభ్యతపత్తస్యా అభితప్తాయా ఏతాన్యక్షరాణి సంప్రాస్రవన్త భూర్భువస్స్వరితి ॥2॥ తాన్యభ్యతపత్తేభ్యోఽభితప్తేభ్య ఓఙ్కారస్సంప్రాస్రవత్॥ తద్యథా శంకునా సర్వాణి పర్ణాని సంతృణ్ణాన్యేవమోంకారేణ సర్వా వాక్సంతృణ్ణోంకార ఏవేదగ్ం సర్వమోఙ్కార ఏవేదగ్ం సర్వమ్॥3॥**

**బ్రహ్మఉపాసన.** ఇది చాలా ముఖ్యమైన ఖండం. ఓంకార ఉపాసన గురించి చెపుతున్నది ఉపనిషత్తు. శంకరాచార్యులు తన భాష్యంలో దీన్ని చాలా వివరంగా చర్చిస్తారు.

ఇంతకుముందు అధ్యాయంలో ఓంకారాన్ని ఉద్గీథ రూపంలో చూశాము. ఓంకారానికీ, ఉద్గీథకూ మధ్య ఉన్న తేడా ఏమిటి?

1. ఉద్గీథ అంటే ఓంకారం కానీ, ఓంకారం ఉద్గీథ కాదు. సామవేదంలో తప్ప, తక్కిన వేదాల్లో ఓంకారాన్ని ఓంకారమనే అంటారు. కాని ఒక్కసామ వేదంలోనే దీన్ని ఉద్గీథ అంటారు. దాన్ని హెచ్చుస్థాయిలో సామగానం చేస్తారు కాబట్టి ఆ పేరు వచ్చింది.
2. ఉద్గీథ సామ మంత్రంలో ఒక భాగం. ఇంతవరకూ చూసిన పంచభక్తుల్లో, సప్త భక్తుల్లో ఉద్గీథ ఒక భక్తి అని చూశాము. అందుకని ఇది స్వతంత్రం కాదు.
3. ఉద్గీథ సామ అవయవం కాబట్టి ఇది స్వతంత్రంగా చేసే ఉపాసన కాదు.

దీన్ని కర్మ అంగ ఉపాసన అంటారు. కర్మతో కలిపి చేయాలి.
ఓంకారం– ఓంకారం ఉద్గీథ కాదు. సామ మంత్రంలో భాగం కాదు. కర్మలో భాగం కాదు. దీన్ని స్వతంత్రంగా ఉపాసన చేయవచ్చు. ఇది అంగ ఉపాసన కాదు. అంగీ ఉపాసన. అన్ని ఉపాసనలకన్నా శ్రేష్ఠమైనది. ఓంకారం గురించి అన్ని ఉపనిషత్తుల్లోనూ వస్తుంది.

| | |
|---|---|
| **ఏతదాలమ్బనం శ్రేష్ఠమేతదాలమ్బనం పరమ్‌బ్రహ్మవర్చస్వ్యన్నాదో భవతి** | **– కఠ 1-2-17** |
| **ప్రణవో ధనుః** | **– ముండక 2-2-4** |
| **ఓమితి బ్రహ్మ ఓమితీదగ్ం సర్వమ్** | **– శీక్షావల్లీ** |
| **ఓమిత్యేతదక్షరమిదం సర్వం** | **– మాండూక్య 1-1** |

ఇక్కడ ఓంకారం మీద ఏ దేవతను ఆవాహనం చేస్తున్నారు? మామూలు దేవత కాదు పరబ్రహ్మ. అందువల్ల ఓంకారం బ్రహ్మప్రతీకం. పరబ్రహ్మ నిర్గుణం కాబట్టి, నిర్గుణం బ్రహ్మ మీద ఉపాసన చేయలేము కాబట్టి, సగుణ ఓంకారం మీద ఆవాహన చేస్తాము. అందుకని ఇది బ్రహ్మ ఉపాసనతో సమానం. ఈ ఉపాసనను ఓంకార ఉపాసన అనీ, ప్రతీక ఉపాసన అనీ, బ్రహ్మ ఉపాసన అనీ అనవచ్చు.

**ఫలం–** క్రమముక్తి. ఓంకార ఉపాసన వల్ల ఇక్కడే, ఇప్పుడే జీవన్ముక్తి కలగదు. సాధకుడు ఉపాసనా ఫలంగా బ్రహ్మలోకం వెళ్ళి,అక్కడ బ్రహ్మ విచారణ చేసి, ఆత్మజ్ఞానం పొంది, ముక్తిని పొందుతాడు. దీన్ని క్రమముక్తి అంటారు. అందుకని దీన్ని **క్రమముక్తి సాధన భూత ఓంకార ప్రతీక బ్రహ్మ ఉపాసన** అంటారు.

**మంత్రం-1:–** ఇది ఉపోద్ఘాత మంత్రం. మూడు ఆశ్రమాలకూ మూడు భిన్న ధర్మాలున్నాయి.

| **సంఖ్య** | **ఆశ్రమం** | **ధర్మం** |
|---|---|---|
| 1. | గృహస్థం | యజ్ఞం, అధ్యయనం, దానం |
| 2. | వానప్రస్థం | తపస్సు |
| 3. | బ్రహ్మచర్యం | గురుకుల వాసం |

యజ్ఞం – ఒక దేవతను పూజిస్తూ ఆహుతులను అగ్నిలో సమర్పించటం. ఈ రోజుల్లో యజ్ఞాలు లేవు కాబట్టి నిత్యపూజలు.

అధ్యయనం – శాస్త్రం పఠించటం. ఇప్పుడు దీనికి బదులు పూజలు చేయటం. దానం – ధర్మం చేయటం. దానం వేరూ, దక్షిణ వేరూ. దక్షిణ అంటే యజ్ఞశాలలో, యజ్ఞంలో ఒక భాగంగా ఇచ్చేది. దీన్ని అంతర్వేది అంటారు. దానం అంటే యజ్ఞశాల బయట ధర్మం చేసేది. దీన్ని బహిర్వేది అంటారు. ఈ మూడూ గృహస్థుచేయాలి.

తపస్సు – తపస్సుకు అనేక అర్థాలున్నాయి. **కష్ట సహిష్ణుత్వం తపః –** అనేక శారీరక, మానసిక నిగ్రహాలను తపస్సు అంటారు. ఇంద్రియాలు కోరిన వాటిని ఇష్టపూర్వకంగా ఇవ్వకుండా ఉండగలిగే ఆత్మ సంయమనం. బలవంతంగా చేసేది కాదు. ఇష్టంగా చేసేది. ఉపవాసం, మౌనం కూడా తపస్సులోకి వస్తాయి.

కర్మకూ, తపస్సుకూ మధ్య తేడా ఏమిటంటే, కర్మకు బాహ్య వస్తువులు కావాలి. తపస్సు అంతర్గతంగా, మనసుతో చేసేది– అందుకే వానప్రస్థాశ్రమానికి ఈ ధర్మం.

**తపః శ్రద్ధే యే హ్యుపవసన్త్యరణ్యే – ముండక 1 – 2– 11**

గురుకుల వాసం– ఆచార్యుని దగ్గరే ఉంటూ, అతనికి శుశ్రూష చేస్తూ విద్యనభ్యసించాలి. ఇది బ్రహ్మచారి ధర్మం.

ఉపనిషత్తు గృహస్థుని ప్రథమం గానూ, వానప్రస్థాన్ని ద్వితీయం గానూ, బ్రహ్మచర్యాన్ని తృతీయం గానూ పేర్కొంది. శంకరాచార్యుల వారు ఇక్కడ విశ్లేషణ ఇస్తున్నారు. ఇది అసలైన వరుస క్రమం కాదు. ఇక్కడ ప్రథమ అంటే మొదటిది అని కాకుండా, ఒకటి అని తీసుకోవాలి.

బ్రహ్మచర్యం– రెండురకాల బ్రహ్మచర్యం ఉంటుంది.

ఉపకుర్వాణ బ్రహ్మచర్యం– వేదాంత విద్య నేర్చుకోవటానికి తోడ్పడే బ్రహ్మచర్యం. గృహస్థాశ్రమంలోకి అడుగుపెట్టే ముందు దశ.

నైష్ఠిక బ్రహ్మచర్యం– జీవితాంతం బ్రహ్మచారిగానే ఉండిపోవటం. ఉదాహరణకు భీష్ముడు, హనుమంతుడు.

దీని ఉద్దేశం ఇది. ఒక వ్యక్తి ఉపకుర్వాణ బ్రహ్మచారిగా చేరి వేదాంత విద్యనభ్యసించి, అది పూర్తి అయ్యాక సమావర్తనం కర్మ చేస్తాడు. అప్పుడు అతను మూడు ఆశ్రమాల్లో – గృహస్థు, వానప్రస్థం, సన్యాసి – ఏదైనా తీసుకోవచ్చు. ఇవి కాక నాలుగవ మార్గం కూడా ఉంది. అది గురువుతో

గురుకులంలోనే ఉండిపోవచ్చు. అలాంటప్పుడు నైష్ఠిక బ్రహ్మచర్య వ్రతం చేయాలి. మరణపర్యంతం నిష్ఠగా ఉంటానని దీక్ష తీసుకోవటం అది. గురువుకు నిస్వార్థ సేవ చేయాలి.

**ఫలం– సర్వఏతే పుణ్యలోకా భవన్తి –** మూడు ఆశ్రమాలకు చెందిన వాళ్ళు వాళ్ళ ధర్మాలను నిర్వర్తించటం వల్ల పుణ్యలోకాలకు వెళ్తారు.

**బ్రహ్మసగ్ం స్థోఽమృతత్వమేతి –** శంకరుల వారు ఈ వాక్యాన్ని తరచు వాడుతుంటారు. ఇది తక్కిన మూడు ధర్మాలనుంచి భిన్నంగా ఉంది. అవి పుణ్యలోకాలకు మాత్రమే తీసుకువెళ్తాయి. కాని బ్రహ్మనిష్ఠలో ఉన్న జ్ఞాని అమృతత్వం పొందుతాడు.

జ్ఞాని ఏ ఆశ్రమానికి చెందినవాడు? ఉపనిషత్తు దీనికి జవాబు చెప్పలేదు. అందుకని శంకరుల వారు తన భాష్యంలో దీనిమీద రెండు వాదనలు చేస్తారు. వేద పూర్వభాగం మీద మీమాంస చేసే పూర్వపక్షి ఏ ఆశ్రమం కన్నా చెందవచ్చు అంటాడు. కాని శంకరాచార్యులు పారిశేష న్యాయ దృష్ట్యా సన్యాసాశ్రమానికి చెందినవాడు అని నిర్ధారిస్తారు. మూడు ఆశ్రమాలకూ మూడు ధర్మాలు చెప్పి వదిలింది కాబట్టి మిగిలింది సన్యాసాశ్రమం కాబట్టి దాన్ని పారిశేష న్యాయం అంటారు. ఆ విధంగా జ్ఞాని సన్యాసాశ్రమానికి చెందినవాడు అంటారు శంకరులవారు.

ఇంకో అర్థం కూడా చెప్తారు శంకరులవారు. ఈ అధ్యాయం మొత్తం ఓంకార ఉపాసన ప్రకరణం. అలాంటప్పుడు– హఠాత్తుగా బ్రహ్మజ్ఞానం మధ్యలో చోటు చేసుకోలేదు కాబట్టి ఇక్కడ బ్రహ్మ అంటే ఓంకారం అని అర్థం తీసుకోవాలి. బ్రహ్మకున్న అనేక అర్థాల్లో ఓంకారం అర్థం ఒకటి.

**భూరితివా ఋచః । భువ ఇతి సామాని। సువరితి యజూగ్ంషి।**
**మహా ఇతి బ్రహ్మ బ్రహ్మణా వావ సర్వే వేదా మహీయన్తే – శీక్షావల్లీ**

మహ ఇతి బ్రహ్మలో బ్రహ్మ అంటే ఓంకారం. అందుకని ఓంకార ఉపాసన నిష్ఠలో ఉన్న ఉపాసకుడు అమృతత్వం పొందుతాడు. ఇక్కడ అమృతత్వం అంటే క్రమముక్తి అని తీసుకోవాలని అంతకుముందు కూడా చూశాము.

**మంత్రాలు 2,3 –** ఓంకార స్తుతి, ఓంకారాన్ని అన్నిటిసారంగా కీర్తించింది ఉపనిషత్తు. దాన్ని ఒక సంఘటన ద్వారా చూపించింది. ఒకసారి బ్రహ్మదేవునికి మూడు లోకాల సారం ఏమిటో తెలుసుకోవాలనిపించింది.

దానికోసం తపస్సు చేశాడు.

మూడు లోకాలు – భూలోక, భువర్లోక, సువర్లోకాల సారం – మూడు వేదాలు

మూడు వేదాలు – ఋగ్వేద, సామవేద, యజుర్వేదాల సారం – మూడు వ్యాహ్రుతులు

మూడు వ్యాహ్రుతులు – భూః భువః సువఃల సారం – మూడు మాత్రలు

మూడు మాత్రలు – అకార, ఉకార, మకారాలను కలిపితే– ఓంకారం

ఇప్పుడు వెనక్కి వెళితే ఓంకారంలో అకార, ఉకార, మకార మాత్రలు మూడు వ్యాహ్రుతుల సారం. భూఃభువఃసువః అనే మూడు వ్యాహ్రుతులు మూడు వేదాల సారం. ఋగ్వేద, సామవేద యజుర్వేదాలనే మూడు వేదాలు భూలోక, భువర్లోక, సువర్లోకాల సారం. అందువల్ల ఓంకారం సారానికి, సారానికి, సారానికి సారం. అలా ఓంకారం సారం కాబట్టి అన్ని లోకాల్లోనూ అంతటా వ్యాపించింది.

**ఓమితి బ్రహ్మ। ఓమితీదగ్ం సర్వమ్ ।** – **శీక్షావల్లీ**

**చతుర్వింశః ఖణ్డః(24)**

**బ్రహ్మవాదినో వదన్తి యద్వసూనాం ప్రాతస్సవనగ్ం రుద్రాణాం మాధ్యన్దినగ్ం సవనమాదిత్యానాం చ విశ్వేషాం చ దేవానాం తృతీయసవనమ్ ॥1॥ క్వ తర్హి యజమానస్య లోక ఇతి స యస్తం న విద్యాత్కథం కుర్యాదథ విద్యాన్కుర్యాత్ ॥2॥ పురా ప్రాతరనువాకస్యోపాకరణాజ్జఘనేన గార్హపత్య స్యోదఙ్ముఖ ఉపవిశ్య స వాసవగ్ం సామాభిగాయతి ॥3॥ లో 3 కద్వార మపావా 3 ర్ణూ 3 3 పశ్యేమ త్వా వయగ్ం రా 3 3 3 3 3 హు 3 మ్ ఆ 3 3 జ్యా 3 యో 3 ఆ 3 2 1 1 1 ఇతి॥4॥ అథ జుహోతి నమోఽగ్నయే పృథివీక్షితే లోకక్షితే లోకం మే యజమానాయ విన్దైష వై యజమానస్య లోక ఏతాఽస్మి ॥5॥ అత్ర యజమానః పరస్తాదా యుషస్స్వాహాఽపజహి పరిఘమిత్యుక్త్వోత్తిష్ఠతి తస్మై వసవః ప్రాతస్సవనగ్ం సంప్రయచ్ఛన్తి ॥6॥ పురా మాధ్యన్దినస్య సవనస్యోపా కరణాజ్జఘనేనాగ్నీధ్ర స్యోదఙ్ముఖ ఉపవిశ్య స రౌద్రగ్ం సామాభిగాయతి ॥7॥ లో 3 కద్వారమపావా 3 ర్ణూ 3 3 పశ్యేమ త్వా వయం వైరా 3 3 3 3 3 హు 3 మ్ ఆ 3 3 జ్యా 3 యో 3 ఆ 3 2 1 1 1 ఇతి ॥8॥ అథ జుహోతి నమో వాయవేఽన్తరిక్షక్షితే**

**లోకక్షితే లోకం మే యజమానాయ విన్దైష వై యజమానస్య లోక ఏతాఽస్మి ॥9॥ అత్ర యజమానః పరస్తాదాయుషస్స్వాహాఽపజహి పరిఘమి త్యుక్త్వోత్తిష్ఠతి తస్మై రుద్రా మాధ్యన్దినగ్ం సవనగ్ం సంప్రయచ్ఛన్తి ॥10॥ పురా తృతీయసవనస్యోపాకరణాజ్జఘనేనాహవనీయస్యోదఙ్ముఖ ఉపవిశ్య స ఆదిత్యగ్ం స వైశ్వదేవగ్ం సామాభిగాయతి ॥11॥ లో 3 కద్వార మపావా 3 ర్ణూ 3 3 పశ్యేమ త్వా వయగ్ం స్వారా 3 3 3 3 3 హు3మ్ ఆ 3 3 జ్యా 3 యో 3 ఆ 3 2 1 1 1 ఇతి ॥12॥ ఆదిత్యమథ వైశ్వదేవం లో 3 కద్వారమపావార్ణూ 3 3 పశ్యేమ త్వా వయగ్ం సామ్రా 3 3 3 3 3 హు 3 మ్ ఆ 3 3 జ్యా 3 యో 3 ఆ 3 2 1 1 ఇతి ॥13॥ అథ జుహోతి నమ ఆదిత్యేభ్యశ్చ విశ్వేభ్యశ్చ దేవేభ్యో దివిక్షిద్భ్యో లోకక్షిద్భ్యో లోకం మే యజమానాయ విన్దత ॥14॥ ఏష వై యజమానస్య లోక ఏతాఽస్మ్యత్ర యజమానః పరస్తాదాయుషస్స్వాహాఽపహత పరిఘమిత్యు క్త్వోత్తిష్ఠతి॥15॥ తస్మా ఆదిత్యాశ్చ విశ్వే చ దేవాస్తృతీయసవనగ్ం సంప్రయచ్ఛన్త్యేష హ వై యజ్ఞస్య మాత్రాం వేద య ఏవం వేద య ఏవం వేద ॥16॥**

**మంత్రం-1:-** కొన్ని కర్మలు చెప్పబడ్డాయి. ఆ కర్మలతో పాటు సామగానం చేయాలి. అందుకని ఆ కర్మలను గురించిన జ్ఞానం ఉంటే వాటి ఫలితం ఎక్కువగా ఉంటుందని గురువు చెప్తున్నాడు.

**మంత్రాలు 2-16:- మూడు కర్మలు- ప్రాతస్సవనం, మాధ్యన్దినం; తృతీయ సవనం-** పొద్దున్న, మధ్యాహ్నం, సాయంత్రం చేసే కర్మలు

ఆరు అంశాలు - సమయం, అగ్ని, అధిష్ఠానదేవత, ఆహుతి దేవతలు, ప్రార్థన, ఫలం.

| **సమయం** | **అగ్ని** | **అధిష్ఠానదేవత** | **ఆహుతిదేవత** | **ప్రార్థన** | **ఫలం** |
|---|---|---|---|---|---|
| ఉదయం | గార్హపత్యాగ్ని | వసువు | అగ్ని | పృథివీలోకద్వారం | భూలోక ప్రాప్తి |
| మధ్యాహ్నం | దక్షిణాగ్ని | రుద్రుడు | వాయువు | అంతరిక్షలోకద్వారం | భువర్లోక ప్రాప్తి |
| సాయంత్రం | ఆహవనీయ | ఆదిత్యుడు, విశ్వేదేవతలు | ఆదిత్యుడు, విశ్వేదేవతలు | స్వర్గలోకద్వారం | సువర్లోక ప్రాప్తి |

ప్రార్థన – లోకద్వారం తెరచి  ఉంచమని చేసే ప్రార్థన
**య ఏవం వేద య ఏవం వేద–** ఇక్కడితో ఈ కర్మ, ఈ ఖండం, ఈ అధ్యాయం ముగిశాయనిఅర్థం.

# అధ్యాయం – 2 సారాంశం

మొదటి అధ్యాయంలో సామ అవయవాల్లో ఒకటైన ఉద్గీథ ఉపాసన గురించి వివరంగా వచ్చింది.

## సామ మంత్ర అవయవ భూత ఉద్గీథ ఉపాసన

రెండవ అధ్యాయంలో సామ అవయవాల్లో కొన్ని చోట్ల 5, కొన్ని చోట్ల 7 అవయవాలను తీసుకుని, వాటి మీద ఎలా ఉపాసనలు చేయాలో వచ్చింది. అవయవాలను భక్తి అంటారు. అందువల్ల వాటిని పంచ విధ  సామ ఉపాసన, సప్త విధ సామ ఉపాసన అంటారు.

రెండు అధ్యాయాల్లోని ఉపాసనలను కర్మాంగ ఉపాసనలు అంటారు. ఇవి స్వతంత్ర ఉపాసనలు కావు. పరతంత్ర ఉపాసనలు. స్వతంత్రంగా ఫలాన్నివ్వలేవు. కాని కర్మ ఫలాన్ని పెంచుతాయి.

**కర్మ సమృద్ధిః  ఏవ ఫలం**
**యదేవ విద్యయా కరోతి శ్రద్ధయా ఉపనిషదా తదేవ వీర్యవత్తరం భవతి** **– అధ్యాయం 1**

కర్మ ఉపాసన సముచ్చయం చేస్తే కర్మ ఫలం పెరుగుతుంది. వీటిలో అనేక ఉపాసనలను వ్యాసాచార్యులవారు బ్రహ్మసూత్రాల్లో వివరంగా విశ్లేషించారు. అందుకే ఈ అధ్యాయంలో కేవలం ఉపాసనల గురించే ఉన్నా కూడా శంకరాచార్యుల వారు వీటి మీద వివరంగా భాష్యం రాశారు.

# పంచ విధ సామ ఉపాసనలు 1

| ఖండం | హింకారము | ప్రస్తావము | ఉద్గీథ | ప్రతిహారము | నిధనము | ఉపాసన అంశం | ఫలం |
|---|---|---|---|---|---|---|---|
| 2. | పృథివీ | అగ్ని | అంతరిక్షం | ఆదిత్యుడు | స్వర్గలోకం | లోకాలు -ఊర్ధ్వేషు | అన్నిలోకాల సుఖాలు |
| 2. | స్వర్గలోకం | ఆదిత్యుడు | అంతరిక్షం | అగ్ని | పృథివీ | లోకాలు -ఆవృత్తేషు | అన్నిలోకాల సుఖాలు |
| 3. | గాలి | మేఘము | వర్షము | మెరుపులు | వర్షం ఆగటం | వర్షము | సమృద్ధిగా వర్షాలు |
| 4. | మేఘము | వర్షము | తూర్పు వైపు | పడమర వైపు | సముద్రం | జలములు | సమృద్ధిగా నీరు |
| 5. | వసంతం | గ్రీష్మం | వర్షఋతువు | శరదృతువు | హేమంతం | ఋతువులు | సమృద్ధిగా అన్నిఋతువులు |
| 6. | మేక | గొర్రె | గోవు | గుర్రం | మనిషి | పశువులు | సమృద్ధిగా పశువులు |
| 7. | ప్రాణం | వాక్కు | కన్ను | చెవి | మనసు | ప్రాణవిషయం | సమృద్ధిగా అన్ని శక్తులు |

# ఆదిత్య సామోపాసన - నవమ ఖండం

| మంత్రం | దశ | భక్తి | జీవి | వివరణ |
|---|---|---|---|---|
| 2. | సూర్యోదయం ముందు | హింకారము | పశువు | మచ్చిక చేయబడ్డ పశువులు హింకారం చేస్తాయి. |
| 3. | సూర్యోదయం | ప్రస్తావము | మనిషి | ప్రస్తావము అంటే మెప్పు. మనిషికి మెప్పు ఇష్టం. |
| | అవగానే | | | |
| 4. | సూర్యకిరణాలు పృథివిని తాకినప్పుడు | ఆది | పక్షులు | ఆది అంటే ఎత్తటం. పక్షులు తమను తాము ఎత్తుకుని ఆకాశంలో ఎగురుతాయి. |
| 5. | మిట్టమధ్యాహ్నం | ఉద్గీథము | దేవతలు | ఉద్గీథము అంటే పై స్థాయి. సూర్యుడు, దేవతలు కూడా పై స్థాయిలోనే ఉన్నారు. |
| 6. | మధ్యాహ్నం | ప్రతిహారము | గర్భస్థ శిశువు | ప్రతిహారము అంటే పట్టుకోవటం. గర్భంలో శిశువును క్రింద పడకుండా పట్టుకున్నట్టు |
| 7. | సాయంకాలం | ఉపద్రవము | జంతువులు | అరణ్యంలో ఉన్న జంతువులు అవి ఉపద్రవం తేవు. ఉపద్రవతి– మనిషి నుంచి పారిపోతాయి. |
| 8. | అస్తమయం అవగానే | నిధనము | పితృ దేవతలు | నిధనము అంటే ముగింపు. మరణించిన పితృ దేవతలు. |

# ॥ ఛాందోగ్యోపనిషత్తు ॥

# అధ్యాయం - 3

ఈ అధ్యాయంలో కూడా అనేక ఉపాసనలు వస్తాయి. జ్ఞానం పొందాలంటే బుద్ధి పదునుగా ఉండాలి. ఉపాసన గురించి నేర్చుకోవాలంటే కల్పనాశక్తి ఎక్కువగా ఉండాలి. ఇక్కడ స్వతంత్ర ఉపాసనలు చూస్తాము.

**ప్రథమ ఖణ్డః (1)**

**ఓం । అసౌ వా ఆదిత్యో దేవమధు। తస్య ద్యౌరేవ తిరశ్చీనవగ్ంశోఽన్తరిక్షమపూపో మరీచయః పుత్రాః ॥1॥ తస్య యే ప్రాంచో రశ్మయస్తా ఏవాస్య ప్రాచ్యో మధునాద్యః । ఋచ ఏవ మధుకృత ఋగ్వేద ఏవ పుష్పమ్। తా అమృతా ఆపస్తా వా ఏతా ఋచః ॥ 2 ॥ ఏతమృగ్వేదమభ్యతపగ్ꣳ్। తస్యాభితప్తస్య యశస్తేజ ఇన్ద్రియం వీర్యమన్నాద్యగ్ం రసోఽజాయత ॥3॥ తద్వ్యక్షరత్తదాదిత్యమభితోఽశ్రయత్తద్వా ఏతద్యదేతదాదిత్యస్య రోహితగ్ం రూపమ్ ॥4॥**

**ద్వితీయ ఖణ్డః (2)**

**అథ యేఽస్య దక్షిణా రశ్మయస్తా ఏవాస్య దక్షిణా మధునాడ్యో యజూగ్ంష్యేవ మధుకృతో యజుర్వేద ఏవ పుష్పం తా అమృతా ఆపః ॥1॥ తాని వా ఏతాని యజూగ్ంష్యేతం యజుర్వేదమభ్యత పగ్ంస్తస్యాభితప్తస్య యశస్తేజ ఇన్ద్రియం వీర్యమన్నాద్యగ్ం రసోఽజాయత ॥2॥ తద్వ్యక్షరత్తదాదిత్యమభితోఽశ్రయత్తద్వా ఏతద్యదేతదాదిత్యస్య శుక్లగ్ం రూపమ్ ॥ 3 ॥**

**తృతీయ ఖణ్డః (3)**

**అథ యేఽస్య ప్రత్యంచో రశ్మయస్తా ఏవాస్య ప్రతీచ్యో మధునాద్యః సామాన్యేవ మధుకృతః సామవేద ఏవ పుష్పం తా అమృతా ఆపః ॥ 1 ॥ తాని వా ఏతాని సామాన్యేతగ్ం సామవేదమభ్యతపగ్ం స్తస్యాభితప్తస్య యశస్తేజ ఇన్ద్రియం వీర్యమన్నాద్యగ్ం రసోఽజాయత ॥2॥**

తద్యృక్షరత్తదాదిత్యమభితోఽ శ్రయత్తద్వా ఏతద్యదేతదాదిత్యస్య కృష్ణగ్ం రూపమ్॥3॥

**చతుర్థః ఖణ్డః (4)**

అథ యేఽస్యోదంచో రశ్మయస్తా ఏవాస్యోదీచ్యో మధునాడ్యోఽథర్వాంగిరస ఏవ మధుకృత ఇతిహాస పురాణం పుష్పం తా అమృతా ఆపః ॥1॥ తే వా ఏతేఽథర్వాంగిరస ఏతదితిహాస పురాణమభ్యతపగ్ం స్తస్యాభితప్తస్య యశస్తేజ ఇన్ద్రియం వీర్యమన్నాద్యగ్ం రసోఽజాయత ॥2॥ తద్యృక్షరత్తదాదిత్యమభితోఽ శ్రయత్తద్వా ఏతద్యదేతదాదిత్యస్య పరం కృష్ణగ్ం రూపమ్ ॥ 3 ॥

**పంచమ ఖణ్డః (5)**

అథ యేఽస్యోర్ధ్వా రశ్మయస్తా ఏవాస్యోర్ధ్వా మధునాడ్యో గుహ్యా ఏవాదేశా మధుకృతో బ్రహ్మైవ పుష్పం తా అమృతా ఆపః॥1॥ తే వా ఏతే గుహ్యా ఆదేశా ఏతద్బ్రహ్మాభ్యతపగ్ంస్తస్యాభితప్తస్య యశస్తేజ ఇన్ద్రియం వీర్యమన్నాద్యగ్ం రసోఽజాయత ॥2॥ తద్యృక్షరత్తదాదిత్యమభితోఽ శ్రయత్తద్వా ఏతద్యదేతదాదిత్యస్య మధ్యే క్షోభత ఇవ ॥3 ॥ తే వా ఏతే రసానాగ్ం రసాః। వేదా హి రసాస్తేషామేతే రసాః। తాని వా ఏతాన్యమృతానామమృతాని వేదా హ్యమృతాస్తేషామేతాన్యమృతాని ॥ 4 ॥

**ఖండాలు 1-5 ఆదిత్య మీద ఉపాసన.** ఆదిత్యని దేవమధువుతో పోల్చింది ఉపనిషత్తు. తేనె రుచి నాణ్యతలో స్థాయీబేధాలున్నట్టు సూర్యునిలో బయటకు కనబడే రంగు నుండి అత్యంత లోపలి భాగం వరకు, ఐదు స్థాయిలను తీసుకుంది.

అసలు తేనెతో ఎందుకు పోల్చింది అన్నది మొదటి ప్రశ్న. శాస్త్రంలో కర్మకాండ, ఉపాసనకాండ, జ్ఞానకాండల్లో - కర్మఫలాన్ని మధువుతో పోలుస్తుంది. ఎందుకు? భోగవిషయత్వాత్. ఎలా తేనె రుచిని ఒక్కొక్కరు ఒక్కొక్కలా ఆస్వాదిస్తారో, అలా కర్మఫలాన్ని ఒక్కొక్కరూ ఒక్కొక్కలా అనుభవిస్తారు. మనుష్యులు కర్మలను చేస్తారు. వాళ్ళు చేసిన కర్మలకు తగ్గ ఫలాలను పొందుతారు. వాటిని మరణం తర్వాత స్వర్గలోకాల్లో అనుభవిస్తారు. సూర్యునిలో ఉన్న అనేక స్థాయిలలో ఈ కర్మఫలాలను పోల్చారు.

**అసౌ వా ఆదిత్యో దేవ మధు-** ఆదిత్యను దేవమధువుతో పోల్చింది.

తేనెతో పోల్చగానే అనేక ప్రశ్నలు ఉదయిస్తాయి. తేనె తుట్టె ఏది? అది దేని మీద ఉంది? అందులో మధునాడులు ఏవి?

ద్యౌరేవ - స్వర్గం - తేనె పట్టు ఉండే బొంగు.

అంతరిక్షం- భువర్లోకం - తేనెపట్టు

మరీచయ - కిరణాలు - మధునాడి (మధువు నిలిచిన కణాలు)

మధువుని నింపుకున్న మధునాడి ఐదు దిక్కులకీ ఉంది. వాటిని అన్నివైపులా ప్రసరించే సూర్యకిరణాలతో పోల్చింది. తేనెటీగ పువ్వు నుంచి సరాసరి మధువుని గ్రోలదు. పువ్వులోని మకరందాన్ని గ్రోలి, దాన్ని తేనెగా మలుస్తుందని శాస్త్రం చెపుతున్నది.

అట్లాగే కర్మ నుంచి కర్మఫలం వెంటనే పుట్టదు. దానికి మధ్యస్థాయి ఒకటి ఉంది. దాన్ని అదృష్టం అనీ, అపూర్వం అనీ, పుణ్యం అనీ అంటారు. దానివల్ల కర్మ ఫలం వస్తుంది.

| | | |
|---|---|---|
| తేనెటీగ | కృతం | వేదమంత్రాలు |
| పువ్వులు | పుష్పాణి | కర్మలు |
| రసం | పుష్పరసం | ఆహుతులు |
| తేనె | మధునాడి | సూర్యరశ్మి |
| రుచి | కర్మఫలం | సూర్యుని రూపం |

అన్నిరకాల పువ్వుల నుంచి తేనె వచ్చినట్టుగా,అన్నిరకాల కర్మల నుంచి కర్మఫలం వస్తుంది. ఇవి అన్నింటికీ ఒకటే.

**యశస్తేజ ఇన్ద్రియం వీర్యమన్నాద్యగ్ం రసోఽ జాయత -** యశస్సు- కీర్తి; తేజస్సు-దేహకాంతి; ఇన్ద్రియం- ఇంద్రియ సామర్థ్యం; వీర్యం -శక్తి; అన్నాద్యం - సమృద్ధిగా అన్నం దొరుకుతాయి. కాకపోతే మధువు కణాల లోపలికి వెళ్ళిన కొద్దీ స్థాయీ బేధాలున్నట్లు వీటిలో కూడా సూర్యుని లోపల పొరకి వెళ్ళిన కొద్దీ ఫలం అధికంగా ఉంటుంది.

| ఖండం | కృతం | పుష్పాలు | పుష్పరసం | మధునాడి | రూపం |
|---|---|---|---|---|---|
| 1. | ఋగ్మంత్రము | ఋగ్కర్మ | ఋగ్వేద ఆహుతులు | తూర్పు | ఎరుపు |
| 2. | యజుర్మంత్రము | యజుర్కర్మ | యజుర్వేద ఆహుతులు | దక్షిణం | తెలుపు |
| 3. | సామ మంత్రం | సామవేద కర్మ | సామవేద ఆహుతులు | పడమర | నలుపు |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 4. | అథర్వణ మంత్రం | అథర్వణ వేదకర్మ | కథలు వినటం | ఉత్తరం | మరింత నలుపు |
| 5. | ఉపాసన | ఓంకారం | ఓంకార ధ్యానం | ఊర్ధ్వం | మధ్యభాగం |

వివరణ:- ముందే చూసినట్టుగా సూర్యుడిని అత్యంత బాహ్యంగా కనబడే రూపం నుంచి లోపలి వరకూ ఐదుగా విభజించింది ఉపనిషత్తు. రోహితం అంటే సూర్యోదయం లేదా సూర్యాస్తమయం. అప్పుడు కనబడే ఎర్రరంగు. తర్వాత వరుసగా తెల్లరంగు, నల్లరంగు, మరింత నల్లరంగు, అత్యంత మధ్యభాగం. కర్మఫలం వరుసగా లోపలికి ప్రసరించిన కొద్దీ అధికంగా ఉంటుంది.

అలాగే మధునాడిలో సూర్యకిరణాలు ప్రసరించే ఐదు దిక్కులు తీసుకుంది. అవి వరుసగా తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరం, ఊర్ధ్వభాగం

ఉన్నవి నాలుగు వేదాలైనా అథర్వణవేదంలో యజ్ఞాలు ఉండవు. అందుకే కొన్నిచోట్ల మూడు వేదాలనే పేర్కొంటుంది శాస్త్రం. ఇక్కడ కృతం (తేనెటీగ) వేదమంత్రాలు; పుష్పాలు ఆ యా వేదకర్మలు; పుష్పరసాలు ఆ యా వేదానికి చెందిన ఆహుతులు.

మరి అథర్వణవేద కర్మ అంటే ఏమిటి? దాన్ని పారిప్లవః అంటారు. పూర్వకాలం యజ్ఞాలు కొన్నిరోజులపాటు సాగేవి. రోజంతా హెూమం చేయలేరు కదా! అప్పుడప్పుడు కొంత విశ్రాంతి తీసుకోవాల్సి వస్తుంది. కాని కర్మ పూర్తిగా అవలేదు కాబట్టి, లౌకిక వ్యవహారాల్లో తలదూర్చటం కాని, పోసుకోలు కబుర్లు చెప్పుకోవటం కాని చేయకూడదు. అందుకని మంచి విలువలను బోధించే కథలు, ఇతిహాసాలు చెప్పేవారు ఋషులు. దీని ఉద్దేశ్యం ఉన్నతమైన విషయాలను, ధర్మాలను, విలువలను నేర్చుకోవటం. దీన్ని అథర్వణ కర్మ అనవచ్చు. దీనికి ఆహుతులు ఆ కథలను వినటం.

**గుహ్యా ఆదేశ** -ఐదో స్థాయిలో తేనెటీగ ఉపాసనను గుహ్యా ఆదేశ అంది. ఎందుకంటే ఉపాసనకి ఉపదేశం కావాలి. అందుకే దాన్ని రహస్య ఉపాసన అన్నది. దీనికి పువ్వు బ్రహ్మ అంటే ఓంకారం, ఆహుతి ఓంకార ధ్యానం; ఫలం యశస్సు, తేజస్సు, ఇంద్రియ సామర్థ్యం, వీర్యం, అన్నాద్యం - అవే, కాని ఉపాసన ఫలం కాబట్టి ముందువాటికన్నా అత్యంత శ్రేష్ఠం.

**మంత్రం -4, ఖండం-5** ఇందులో కర్మఫలాలను రసానాం రసః అంది ఉపనిషత్తు. వేదాలూ, కర్మలూ రసం.ఆ రసం నుంచి వచ్చాయి కాబట్టి,

కర్మఫలాలు రసాలకు రసం. వేదాలు అమృతం అయితే, కర్మఫలం అమృతానాం అమృతం. కర్మ, ఉపాసన చేసిన వ్యక్తులు స్వర్గానికి వెళ్ళి కర్మఫలాలను అనుభవిస్తారు.

**షష్ఠః ఖణ్డః (6)**

**తద్యత్ప్రథమమమృతం తద్వసవ ఉపజీవన్త్యగ్నినా ముఖేన। న వై దేవా అశ్నన్తి న పిబన్తి ఏతదేవామృతం దృష్ట్వా తృప్యన్తి ॥1 ॥త ఏతదేవ రూపమభిసంవిశన్త్యేతస్మాద్రూపాదుద్యన్తి ॥2 ॥ స య ఏతదేవమమృతం వేద వసూనామేవైకో భూత్వాఽగ్నినైవ ముఖేనైతదేవామృతం దృష్ట్వా తృప్యతి స ఏతదేవ రూపమభిసంవిశత్యేతస్మాద్రూపాదుదేతి ॥3॥ స యావదాదిత్యః పురస్తాదుదేతా పశ్చాదస్తమేతా వసూనామేవ తావదాధిపత్యగ్ం స్వారాజ్యం పర్యేతా ॥4॥**

**సప్తమ ఖణ్డః (7)**

**అథ యద్ద్వితీయమమృతం తద్రుద్రా ఉపజీవన్తీన్ద్రేణ ముఖేన న వై దేవా అశ్నన్తి నపిబన్త్యేతదేవామృతం దృష్ట్వా తృప్యన్తి ॥ 1 ॥ త ఏతదేవ రూపమభిసంవిశన్త్యేతస్మాద్రూపాదుద్యన్తి ॥2॥ సయ ఏతదేవమమృతం వేద రుద్రాణామేవైకో భూత్వేన్ద్రేణైవ ముఖేనైతదేవామృతం దృష్ట్వా తృప్యతి స ఏతదేవ రూపమభిసంవిశత్యేతస్మాద్రూపాదుదేతి ॥3॥ సయావదాదిత్యః పురస్తాదుదేతా పశ్చాదస్తమేతా ద్విస్తావద్దక్షిణత ఉదేతోత్తరతోఽస్తమేతా రుద్రాణామేవ తావదాధిపత్యగ్ం స్వారాజ్యం పర్యేతా ॥ 4 ॥**

**అష్టమ ఖణ్డః (8)**

**అథ యత్త్రృతీయమమృతం తదాదిత్యా ఉపజీవన్తి వరుణేన ముఖేన న వై దేవా అశ్నన్తి న పిబన్త్యేతదేవామృతం దృష్ట్వా తృప్యన్తి ॥1॥ త ఏతదేవ రూపమభిసంవిశన్త్యేతస్మాద్రూపాదుద్యన్తి ॥2॥ స య ఏతదేవమమృతం వేదాదిత్యానా మేవైకో భూత్వా వరుణేనైవ ముఖేనైతదేవామృతం దృష్ట్వా తృప్యతి స ఏతదేవ రూపమభిసంవిశత్యేతస్మా ద్రూపాదుదేతి ॥3॥ స యావదాదిత్యో దక్షిణత ఉదేతోత్తరతోఽస్తమేతా ద్విస్తావత్పశ్చాదుదేతా పురస్తాదస్తమేతాఽఽదిత్యానామేవ తావదాధిపత్యగ్ం స్వారాజ్యం పర్యేతా ॥4॥**

**నవమః ఖణ్డః (9)**

**అథ యచ్చతుర్థమమృతం తన్మరుత ఉపజీవన్తి సోమేన ముఖేన వై**

**దేవా అశ్నన్తి న పిబన్త్యేతదేవామృతం దృష్ట్వా తృప్యన్తి ॥1॥ త ఏతదేవ రూపమభిసంవిశన్త్యేతాస్మాద్రూపాదుద్యన్తి ॥2॥ స య ఏతదేవమమృతం వేద మరుతామేవైకో భూత్వా సోమేనైవ ముఖేనైతదేవామృతం దృష్ట్వా తృప్యతి స ఏతదేవ రూపమభిసంవిశత్యేతస్మాద్రూపాదుదేతి ॥3॥ స యావదాదిత్యః పశ్చాదుదేతా పురస్తాదస్తమేతా ద్విస్తావదుత్తరత ఉదేతా దక్షిణో–స్తమేతా మరుతామేవ తావదాధిపత్యగ్ం స్వారాజ్యం పర్యేతా ॥4॥**

**దశమః ఖణ్డః (10)**

**అథ యత్పంచమమమృతం తత్సాధ్యా ఉపజీవన్తి బ్రహ్మణా ముఖేన న వై దేవా అశ్నన్తి న పిబన్త్యేతదేవామృతం దృష్ట్వా తృప్యన్తి ॥1॥ త ఏతదేవ రూపమభిసంవిశన్త్యేతస్మాద్రూపాదుద్యన్తి ॥2॥ స య ఏతదేవమమృతం వేద సాధ్యానామేవైకో భూత్వా బ్రహ్మణైవ ముఖేనైతదేవామృతం దృష్ట్వా తృప్యతి స ఏతదేవ రూపమభిసంవిశత్యే తస్మాద్రూపాదుదేతి ॥3॥ స యావదాదిత్య ఉత్తరత ఉదేతా దక్షిణతోఽస్తమేతా ద్విస్తావదూర్ధ్వఉదేతాఽర్వాజస్తమేతా సాధ్యానామేవ తావదాధిపత్యగ్ం స్వారాజ్యం పర్యేతా ॥4॥ః**

**ఖండాలు 6–10** ఈ ఐదు రకాల కర్మఫలాలను అనుభవించే ఐదు రకాల భోక్తలను వర్ణిస్తున్నది ఉపనిషత్తు – ఖండం 6 నుండి ఖండం 10 వరకు.

ఈ ఐదుగురు భోక్తలు వరుసగా వసువు, రుద్రదేవత, ఆదిత్యదేవత, మరుత దేవత. సాధ్యదేవతలు.

**ముఖేన –** కర్మఫలాన్ని పంచటానికి ఒక నేత ఉండాలి. మామూలుగా ముఖం అంటే మొహం లేదా నోరు. కాని ఇక్కడ నాయకుడు. ఈ ఐదుగురు భోక్తలను తీసుకువెళ్ళే నాయకులు వరుసగా అగ్ని, ఇంద్రుడు, వరుణుడు, సోమదేవత, బ్రహ్మ (హిరణ్యగర్భ). వాళ్ళు ఆయా లోకాలకు తీసుకువెళ్తారు. ప్రథమ భోక్తని ఇంద్రుడు ఇంద్రలోకానికి, రెండవభోక్తని యమధర్మరాజు యమపురికి తీసుకువెళ్తాడని కూడా వస్తుంది.

మొదటి నాలుగు లోకాల్లో సూర్యోదయం, అస్తమయం నాలుగు దిశలకూ మారుతూ ఉంటుంది. ఐదో లోకంలో సూర్యుడు ఉదయించడు. అస్తమించడు.

కర్మఫల కాలపరిమితి ఒక్కొక్క లోకానికీ రెండేసి రెట్లు పెరుగుతూ

వస్తుంది. మొదటి లోకంలో భూలోకం ఉన్నంతవరకూ, రెండవలోకంలో దానికి రెండు రెట్లు, అలా ఐదో లోకంలో ముందులోకానికి రెండు రెట్లు.

(ఇదంతా **138** పుటలోని పట్టికలో ఒక్కసారిగా చూడవచ్చు.)

**న అశ్నన్తి నపిబన్తి –** ఈ లోకాల్లో భోక్త ఏమీ తినడు, తాగడు– మరి ఎలా అనుభవిస్తాడు? దర్శనమాత్రేన.

**దృష్ట్వా తృప్యన్తి –** కేవలం చూసినంత మాత్రానే అనుభవిస్తాడు. దర్శనం అంటే ఒక చూడటం మాత్రమే తీసుకోకూడదు. పంచేంద్రియాల ద్వారా కలిగే అనుభవాలన్నీ అనుభవిస్తాడు. ఎంతవరకు? ఆ లోకంలో అతని ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకు.

ఇది పంచ ఆత్మక మధువిద్యా ఉపాసన– ఉపాసకుడు ముందు చెప్పిన ఐదు అంశాలు (కృతం + పుష్పాలు + పుష్పరసం + మధునాడి+ రూపం), వాటితో పాటు భక్తికి కలిగిన కర్మఫలం గురించీ ఉపాసన చేస్తే ఆ ఫలం తను పొందుతాడు. ఉదాహరణకు వసు ఉపాసన చేస్తే వసువు అవుతాడు. ప్రథమ మధు ఉపాసన ఫలం – అగ్ని లోకానికి వెళ్తాడు. ఐదవ భోక్త బ్రహ్మలోకానికి వెళ్తాడు. అక్కడ్నుంచి క్రమముక్తి పొందుతాడు. సూర్యోదయం, అస్తమయం లేని లోకం అది.

### ఏకాదశ ఖణ్డః (11)

**అథ తత ఊర్ధ్వ ఉదేత్య నైవోదేతా నాస్తమేతైకల ఏవ మధ్యే స్థాతా। తదేష శ్లోకః ॥1॥ న వై తత్ర న నిమ్లోచ నోదియాయ కదాచన। దేవాస్తేనాహగ్ం సత్యేన మా విరాధిషి బ్రహ్మణేతి ॥2॥ న హ వా అస్మా ఉదేతి న నిమ్లోచతి సకృద్దివా హైవాస్మై భవతి య ఏతామేవం బ్రహ్మోపనిషదం వేద ॥3॥ తద్ధైతద్బ్రహ్మా ప్రజాపతయ ఉవాచ ప్రజాపతిర్మనవే మనుః ప్రజాభ్యః।తద్ధైతదుద్దాలకాయారుణయే జ్యేష్ఠాయ పుత్రాయ పితా బ్రహ్మ ప్రోవాచ ॥4॥ ఇదం వావ తజ్జ్యేష్ఠాయ పుత్రాయ పితా బ్రహ్మ ప్రబ్రూయాత్ప్రణాయ్యాయ వాఽన్తేవాసినే ॥5॥ నాన్యస్మై కస్మైచన। యద్యప్యస్మా ఇమామద్భిః పరిగృహీతాం ధనస్య పూర్ణాం దద్యాదేతదేవ తతో భూయ ఇత్యేతదేవ తతో భూయ ఇతి ॥6॥**

**సమష్టి సూర్య ఉపాసన** ఖండాలు 1-10లో మధు విద్య పోలికతో సూర్య ఉపాసన వచ్చింది. దానికి ముగింపుగా ఇప్పుడు సమష్టి సూర్య ఉపాసన చూస్తాము. ఇందులో సూర్యుడిని అనేకంగా చూడము, ఏకంగా చూస్తాము. అది కూడా మనకి భిన్నంగా చూడము. **అభేద ఉపాసన** చేస్తాము. దీన్ని **అహంగ్రహ ఉపాసన** అంటారు. అహం అంటే నేను. గ్రహ అంటే గ్రహణం (చూడటం). నేనుగా చూడటం.

**సూర్యదేవతా రూపః అహం అస్మి.**

ఏ ఉపాసన చేసినా మొదట భేద ఉపాసనతో మొదలుపెట్టి, తర్వాత అభేద దృష్టితో చూస్తాము. ఉదాహరణకి లలితా సహస్రనామం తీసుకుంటే-

**అరుణాం కరుణా తరంగితాక్షీం ధృతపాశాంకుశ పుష్పబాణ చాపామ్।**
**అణిమాదిభిరావృతాం మయూఖైరహమిత్యేవ విభావయే భవానీమ్॥**

(అహం+ఇత్యేవ) నేనే ఆ భవానిని. ఇక్కడ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. నేనే ఆ భవానిని అనటం అహం బ్రహ్మాస్మి అన్న జ్ఞానం కలిగి అనటం లేదు. ఉపాసన వేరు, జ్ఞానం వేరు. ఉపాసనలో అభేద భావన ఊహించుకుంటాము. జ్ఞానంలో అభేదభావన ఎందుకు కలగాలో అర్థం చేసుకుంటాము. అలా అర్థం చేసుకున్నాక చేసే ధ్యానాన్ని నిధిధ్యాసనం అంటారు. ఇప్పుడు చేసేది అహంగ్రహ ఉపాసన. ఉపాసన మోక్షాన్ని ప్రత్యక్షంగా ఇవ్వదు. క్రమముక్తి మాత్రమే ఇస్తుంది. కాని జ్ఞానం అక్రమముక్తి అంటే జీవన్ముక్తి ఇస్తుంది. జీవన్ముక్తి అంటే ఇక్కడే, ఇప్పుడే మోక్షాన్ని ఇస్తుంది. మరణించాక విదేహముక్తి ఇస్తుంది. ఇంక పునర్జన్మ ఉండదు.

ఇప్పుడు ఈ ఖండానికి వస్తే ఇది క్రమముక్తి ఫలక అభేద ఉపాసనని సూచిస్తున్నది. ఇంత ప్రత్యక్షంగా ఉపనిషత్తు చెప్పదు. అందుకే ఛాందోగ్యోపనిషత్తుని శంకరభాష్యం లేనిదే (దాన్ని వివరించే గురువులు పరమార్థానంద స్వామీజీ లేనిదే) అర్థం చేసుకోవటం కష్టం. ఇది చాలా సూక్ష్మమైన ఉపనిషత్తు. అక్కడక్కడా అసంపూర్ణంగా ఉన్నట్టు అనిపిస్తుంది. అందుకే ఉపనిషత్తులను స్వంతంగా నేర్చుకోకూడదు అంటారు.

**మంత్రం-1 -** ముందు చూసినట్టుగా ఉపాసన గురించి చెప్పకుండా ఫలం గురించి చెపుతున్నది ఉపనిషత్తు. ఫలం ఏమిటి? క్రమముక్తి. క్రమముక్తి అంటే ఉపాసన ద్వారా బ్రహ్మలోకం వెళ్ళి, బ్రహ్మద్వారా అహంబ్రహ్మాస్మి

అన్న జ్ఞానం పొంది, అక్కడ మోక్షం పొందటం. అంటే ఇంక పునర్జన్మ ఉండదు. ముక్తి అంటే వేరేలోకానికి వెళ్ళటం కాదు. ఇది సరిగ్గా అర్థం చేసుకోవాలి. శుక్లగతి ద్వారా బ్రహ్మలోకానికి వెళ్ళటం మోక్షం అనుకుంటే, బ్రహ్మలోకంలో అనేసరికి దానికి లోకపరిమితి, కాలపరిమితి వస్తుంది. అందుకని లోకానికి వెళ్ళటం మోక్షం కాదు.

ఇప్పుడు మంత్రంలోకి వద్దాము. ఇంతవరకు సూర్యుడు అనేక దిక్కులలో ఉదయించటం, అస్తమించటం చూశాము. ఇప్పుడు ఉదయించడు, అస్తమించడు అంటున్నది ఉపనిషత్తు.

**నైవోదేతా నాస్తమేతైకల** – ఉదయించడు, అస్తమించడు– లోకాలన్నింటికీ అతీతంగా ఉన్నాడు కాబట్టి సూర్యోదయం లేదు, అస్తమయం లేదు. శంకరాచార్యులు దీనికి ఒక కారణం చెప్తున్నారు. ఉపాసకుడు అహంగ్రహ ఉపాసన చేస్తున్నాడు. అహం రూపేణ సర్వదేవతా అస్తి. సూర్యుడు బాహ్య ఆకాశంలో లేడు. హృదయ ఆకాశంలో ఉన్నాడు. శాశ్వతంగా తన హృదయాకాశంలో ఉన్నాడు కాబట్టి అతనికి సూర్యోదయం, సూర్యాస్తమయం లేవు.

**హృదాకాశే చిదాదిత్యః సదాభాసి నిరంతరమ్।**
**ఉదయ అస్తమయమ్ నస్తః। కథం సంధ్యామ్ ఉపాస్మహే॥**

సూర్యుడు అనే చైతన్యం ఎప్పుడూ ప్రకాశిస్తుంటే సంధ్యాకాలం ఏది? అందుకే సంధ్యావందనం చేయటం లేదు అన్నాడట ఒక జ్ఞాని. సంధ్య సంధి స్నానం.

**అథతత ఊర్ధ్వ ఉదేత్య.... మధ్యేస్థాతా** – దాని తర్వాత ఊర్ధ్వలోకంలో సూర్యుడు ఉదయం, అస్తమయం లేకుండా, మధ్యలో ఉండిపోతాడు.

**యతద్రృశ్యతే భాస్వాన్**
**స తేషాం ఉదయః స్మృతః**
**తిరోభావంచ యత్ర ఏతి**
**తదేవ అస్తమనం బృవేత్**

ఎవరు సూర్యుడు ఉదయిస్తున్నట్టు చూస్తాడో, ఎవరు సూర్యుడు అస్తమిస్తున్నట్టు చూస్తాడో అతనికి సూర్యోదయం, సూర్యాస్తమయం ఉన్నాయని అర్థం.

**నైవ అస్తమనం అర్క స్య**
**న ఉదయః సర్వదా సతః**
**ఉదయ అస్తమనేనామ**
**దర్శనా దర్శనే రవేః**

సూర్యుడు ఉదయించడు, అస్తమించడు, ఉదయం, అస్తమయం అనే పేర్లు చూసే వాని నుంచి వచ్చాయి.

**మంత్రం-2 :- నవై తత్ర న నిమ్లోచ నోదియాయ కదాచన-** తత్ర అంటే ముక్తి. ముక్తిలో ఉదయం లేదు. అస్తమయం లేదు. ఈ మంత్రం అర్థం ఏమిటంటే మనం సూర్యుడిని విడిగా వస్తువుగా చూస్తే ఆయన్ని సూర్యాస్తమయం,సూర్యోదయం అనే కాలంతో కొలుస్తాము. నిజానికి సూర్యునిలో ఉదయం, అస్తమయం లేదు. అలాగే ఆత్మ విషయానికొస్తే ఆత్మని అర్థం చేసుకోకుండా అనాత్మలో రమిస్తే జనన, మరణాలు ఉన్నాయి. ఉదయం, అస్తమయాలు అనాత్మపరంగా జనన, మరణాలు. నిజానికి ఆత్మకు జననమరణాలు లేవు.

భూమితో లయం చెంది సూర్యుడిని విడిగా చూస్తే ఉదయాస్తమయాలు ఉన్నాయి. సూర్యునితో లయం చెందితే అవి లేవు. అక్కడ ఉదయాస్తమయాలు లేవు అని ఉపాసకుడు అన్నట్టు. ఉపాసకుడు కాలపరిమితి లేదు అంటే ఎవరూ తేలిగ్గా నమ్మరు. ఉదయ, అస్తమయాలు లేవు, జనన మరణాలు లేవు, శాశ్వతానందం పొందుతాము, రాగద్వేషాల నుంచి శాశ్వతంగా ముక్తి పొందుతాము అంటే ఎవరూ తొందరగా నమ్మరు. **మా విరాదిషి బ్రాహ్మణా -** అందుకని ఉపాసకుడు అంటున్నాడు, ఓ దేవా నిన్ను సాక్షిగా పెట్టుకుని, నేను ఈ మాట సత్యంగా పలుకుతున్నాను. ఆ సత్యం వల్ల నేను బ్రహ్మ స్వరూపంతో విరోధం పొందకుండు గాక. దీని సారాంశం ఒక్కమాటలో చెప్పాలంటే - ముక్తిలో దేశకాలాలు ఉండవు. దేశకాల అతీతం మోక్షం.

**మంత్రం - 3:-** ఉపాసకుడు సూర్యునితో ఐక్యం చెందుతాడు. బ్రహ్మ అవుతాడు. **హైవాస్మై సకృద్దివా భవతి -** అతనికి కేవలం పగలే ఉంటుంది. రాత్రి ఉండదు. అంటే ఆనందమే ఉంటుంది. కాని దుఃఖం ఉండదు. రాత్రి దుఃఖానికి ప్రతీక.అంటే శాశ్వతానందం పొందుతాడు.

**మంత్రాలు 4-6** - ఉపాసన స్తుతి. దీన్ని బ్రహ్మోపనిషదం అంటారు. బ్రహ్మ+ఉపనిషదం = వేద రహస్యం. దీన్ని సూర్య అభేద ఉపాసన అనీ, మధువిద్య అని కూడా అనవచ్చు.దీని ఫలం ఏమిటి?

ఏకం పరంపరా ప్రాప్తం. తరతరాలుగా అందరూ క్రమముక్తి పొందుతారు. బ్రహ్మ ఈ ఉపాసనను ప్రజాపతి (విరాట్)కి, ప్రజాపతి మనువుకి, మనువు ప్రజలకు చెప్పాడు. అరుణ ఋషి తన జ్యేష్ఠపుత్రుడైన ఉద్దాలక ఆరుణికి చెప్పాడు. ఈ విద్యను జేష్ఠపుత్రునకు గాని అంతేవాసికి గాని చెప్పాలి. జ్యేష్ఠపుత్రుడు అంటే పెద్దకొడుకు. అంతేవాసి అంటే గురువు దగ్గర ఉండే శిష్యుడు. వీళ్ళయితే శ్రద్ధగా వింటారు.

**బ్రహ్మ ప్రబ్రూయాత్** - ఇక్కడ బ్రహ్మ అంటే వేద రహస్యం.

**నాఽన్యస్మై కస్మైచన** - శ్రద్ధ లేకపోతే శాస్త్రాన్ని గౌరవించకపోవచ్చు. అందుకని శ్రద్ధ లేనివానికి చెప్పకూడదు.

**ఇమామద్భిః పరిగృహీతాం ధనస్య పూర్ణాం దద్యాత్** - శ్రద్ధలేని వ్యక్తి, చుట్టూ సముద్రం ఉండి, ధనంతో కూడిన మొత్తం జగత్తుని దానం చేసినా కూడా, అతనికి ఛాందోగ్యోపనిషత్తు బోధించకూడదు. అంటే శ్రద్ధ ఉండి తీరాలన్నది నియమం. ఎందుకు? మొత్తం జగత్తుకన్నా విలువైనది ఈ ఉపాసన.

**ద్వాదశః ఖణ్డః (12)**

**గాయత్రీ వా ఇదగ్ం సర్వం భూతం యదిదం కించ వాగ్వై గాయత్రీ వాగ్వా ఇదగ్ం సర్వం భూతం గాయతి చ త్రాయతే చ ॥1॥ యా వై సా గాయత్రీయం వావ సా యేయం పృథివీ। అస్యాగ్ం హీదగ్ం సర్వం భూతం ప్రతిష్ఠితమేతామేవ నాతిశీయతే ॥2॥ యావై సా పృథివీయం వావ సా యదిదమస్మిన్పురుషే శరీరమ్। అస్మిన్హీమే ప్రాణాః ప్రతిష్ఠితా ఏతదేవ నాతిశీయన్తే ॥3॥ యద్వైతత్పురుషే శరీరమిదం వావ తద్యదిదమస్మిన్నన్తః పురుషే హృదయమ్। అస్మిన్హీమే ప్రాణాః ప్రతిష్ఠితా ఏతదేవ నాతిశీయన్తే॥4॥ సైషా చతుష్పదా షడ్విదా గాయత్రీ తదేతదృచాఽభ్యనూక్తమ్ ॥5॥ తావానస్య మహిమా తతో జ్యాయాగ్ంశ్చ పూరుషః । పాదోఽస్య సర్వా భూతాని త్రిపాదస్యామృతం దివీతి ॥6॥ యద్వైతద్బ్రహ్మేతీదం వావ తద్యోఽయం బహిర్ధా పురుషాదాకాశో యో వై స బహిర్ధా పురుషాదాకాశః ॥7॥ అయం వావ స యోఽయమన్తః పురుష ఆకాశో యో వై సోఽన్తః పురుష ఆకాశః॥8॥**

**అయం వావ స యోఽ యమన్తర్హృదయ ఆకాశస్తదేతత్పూర్ణమప్రవర్తి పూర్ణామప్రవర్తినీగ్ం శ్రియం లభతే య ఏవం వేద ॥9॥**

**మంత్రాలు 1-4 - బ్రహ్మరూపేణ గాయత్రీ ఉపాసన.** ఇంకో ఉపాసన ఇది. ఇక్కడ బ్రహ్మ అంటే సచ్చిదానంద బ్రహ్మ. బ్రహ్మతత్త్వం అర్థం చేసుకోగలిగినదే అయినా, అందరూ అర్థం చేసుకోలేరు. ఎందుకంటే బ్రహ్మ ఎన్నటికీ ఉపాస్య వస్తువు కాదు. అందుకని ప్రత్యక్షంగా బ్రహ్మ ఉపాసన లేదు. ఉ పాసన చేయాలంటే ఉపాసకుడు ఉండాలి. ఉపాసన చేసే వస్తువు (ఉపాస్య వస్తువు) ఉండాలి. ఆ ఉపాస్య వస్తువు ఉపాసకునికి భిన్నంగా ఉండాలి. సగుణబ్రహ్మలో ద్వైతభావన ఉంది కాని, నిర్గుణబ్రహ్మ అవ్యవహారి. ద్వైత భావన లేదు.

అహం బ్రహ్మాస్మి అనే మహావాక్యాన్ని అర్థం చేసుకుని నేను బ్రహ్మను అని స్వీకరించగలగాలి. అందుకే నిర్గుణబ్రహ్మ గురించి చెప్పినప్పుడు, బ్రహ్మ లక్షణాలు చెప్పేదానికన్నా బ్రహ్మ శరీరం కాదు. ఇంద్రియాలు కాదు. మనసు కాదు అని ఏది కాదో అది చెపుతూ వస్తుంది.

**నేదం యదిదముపాసతే - కేన 1 - 5**

నువ్వు ఉపాసన చేసేదేదీ బ్రహ్మ కాదు. నువ్వు వస్తువుగా చూసి కొలిచేది బ్రహ్మకాదు. ఇన్నాళ్ళు మన విద్య ఎలా ఉంది? దేని గురించైనా నేర్చుకోగానే, దాన్ని చూడటానికి లేదా ఊహించుకోవటానికి ప్రయత్నిస్తాము. ఏనుగు అని వినగానే ఏనుగు రూపాన్ని ఊహించుకుంటాము. అలా సాగింది మన విధానం. అందుకే బ్రహ్మగురించి వినగానే ఆయన్ని బయట వెతకటానికి ప్రయత్నిస్తాము. బ్రహ్మ బయట దొరికే వస్తువు కాదు అనగానే లోపల వెతకటానికి చూస్తాము. అంతర్గతంగా ఒక వెలుగు కనపడితే.అది బ్రహ్మ అనుకుంటాము. కనపడేదీ, అనుభవంలోకి వచ్చేదీ వస్తువు. అది బ్రహ్మ కాదు. బ్రహ్మని చూడలేము అని చెప్పినా, నేను బ్రహ్మను చూడాలి అనీ, బ్రహ్మానందం అనుభవంలోకి వచ్చేది కాదు అని చెప్పినా, నేను అనుభవించాలి అనీ కోరే మధ్యమ అధికారీ శిష్యునికి, ఉపనిషత్తు ఒక మార్గాన్ని చూపుతున్నది.

ఒక వస్తువు మీద బ్రహ్మను ఆవాహనం చేయిస్తుంది. దీన్ని ప్రతీక ఉపాసన అంటారు. సగుణ ప్రతీక మీద నిర్గుణ బ్రహ్మని ఆవాహన

చేయటమన్నమాట. దీన్ని అధ్యారోపం అంటారు. తమాషా ఏమిటంటే నిజానికి నిర్గుణబ్రహ్మ మీద సగుణ బ్రహ్మని ఆరోపిస్తాము. అసలు అధ్యారోపం అంటే అది. కాని ఇక్కడ ఉపాసన సౌలభ్యం కోసం దీనికి వ్యతిరేకంగా చేస్తున్నాము అంటే సగుణ ప్రతీక మీద నిర్గుణబ్రహ్మ ఆవాహన చేస్తాము.

ఉదాహరణకు ఓంకారాన్ని ప్రతీకగా తీసుకుని, దానిమీద నిర్గుణ బ్రహ్మను ఆవాహన చేస్తాము. దేవాలయాల్లో చేసేది అదే. నిర్గుణ బ్రహ్మను ఒక శిలారూపం మీద ఆవాహన చేస్తాము.

**నిర్లేపానిర్మలా నిత్యా నిరాకారా నిరాకులా।**
**నిర్గుణా నిష్కలా శాంతా నిష్కామా నిరపప్లవా॥ లలితాసహస్ర నామం**

లలితాదేవిగా కొలుస్తూ నిర్గుణా, నిరాకారా అంటున్నాం. అంటే నిర్గుణబ్రహ్మను లలిత మీద కొలుస్తున్నాము.

ఇక్కడ ఈ ఖండంలో గాయత్రిని ప్రతీకగా తీసుకుంది ఉపనిషత్తు.

గాయత్రి అంటే గాయత్రీ మంత్రం కాదు. గాయత్రీ ఛందస్సు. అసలు గాయత్రీ మంత్రం పేరు సావిత్రి. ఎందుకు? సవితా (సూర్య) దేవతను కొలిచే మంత్రం అది. గాయత్రి పేరు ఎందుకు? గాయత్రి ఛందస్సులో ఉంది కాబట్టి. అలా ఇంకా ఎన్నో ఉన్నాయి.

**తత్పురుషాయ విద్మహే**
**నారాయణాయ విద్మహే**

గాయత్రిని ప్రతీకగా తీసుకుంది. సాధారణంగా ప్రతీక ఉన్నతంగా ఉంటుంది. అప్పుడు మనసు సహజంగా దానివైపు ఆకర్షింపబడుతుంది. గాయత్రి ఎందుకంటే అది అందరికీ బాగా తెలుసు.

గాయత్రి అంటే మామూలుగా 8 అక్షరాల చొప్పున 3 పాదాలుంటాయి.

**తత్సవితుర్వరేణ్యం**
**భర్గోదేవస్య ధీమహీ**
**ధీయో యోనః ప్రచోదయాత్**

**ఓం భూః భువః సువః** – ఈ అక్షరాలు గాయత్రి ఛందస్సులోనివి కావు. ఇవి జపం కోసం కలుపబడ్డాయి.

అలా 8×3 = 24 అక్షరాలు ఉంటాయి. కాని ఇక్కడ గాయత్రిని 6×4=24గా తీసుకుంది. 6 అక్షరాల చొప్పున 4 పాదాలుగా తీసుకుంది.

**మంత్రం-5 - సైషా చతుష్పదా షడ్విధా గాయత్రీ -** ఎందుకు నాలుగు పాదాలుగా తీసుకుంది? బ్రహ్మను చతుష్పాద బ్రహ్మ అంటారు.

**సర్వం హ్యేతద్ బ్రహ్మ అయమాత్మా సోఽ యమాత్మా చతుష్పాత్**
**- మాండూక్య 2**

అంతటా బ్రహ్మ ఉన్నాడు కాబట్టి, గాయత్రి అంతటా ఉన్నట్టు తీసుకుంటాం. **గాయత్రి వా ఇదగ్ంం సర్వమ్.** అంతా బ్రహ్మ, బ్రహ్మను గాయత్రి మీద ఆవాహన చేస్తున్నాము కాబట్టి అంతా గాయత్రి. నిజంగా చూస్తే గాయత్రి కేవలం ఒక మంత్రం. అలాగే శివలింగాన్ని సర్వజ్ఞ అంటాము. నిజంగా చూస్తే లింగాకారంలో ఉన్న రాయి జడం. అంతా కాదు కదా, ఏమీ తెలుసుకోలేదు. కాని రాయి జడమని, పరిచ్ఛిన్నమనీ తెలిసినా కూడా, దానిమీద శివుడిని ఆవాహన చేశాము కాబట్టి, శివలింగాన్ని దైవంగా కొలుస్తున్నాము. అలాగే గాయత్రి పరిమితమైనదే అయినా, బ్రహ్మను ఆవాహన చేసిన గాయత్రి సర్వాత్మకం కాబట్టి, గాయత్రి కూడా సర్వాత్మకం. అందుకే దీన్ని సర్వాత్మక రూపేణ **గాయత్రీ ఉపాసన** అంటారు.

**మంత్రాలు 6-9:-** మొత్తం జగత్తుకు బ్రహ్మ ఆధారం అయినట్టుగా చతుష్పాద గాయత్రిని మొత్తం జగత్తుకి ఆధారంగా చూపించటానికి ఉపనిషత్తు ఒక కల్పన చేసింది. గాయత్రి ఛందస్సులోని ఒక్కొక్కపాదం ఒక్కొక్క రూపంలో ఆధారం అయింది.

| | | |
|---|---|---|
| 1. వాగ్ రూపేణ | - | మాటలు సమస్త సంబంధాలకు ఆధారం. |
| 2. పృథివీ రూపేణ | - | పృథివి సమస్త జీవకోటికి ఆధారం. |
| 3. శరీరరూపేణ | - | శరీరం సమస్త అంగాలకు ఆధారం. |
| 4. హృదయరూపేణ | - | హృదయం నాలుగు అంతఃకరణలకు, పంచప్రాణాలకు ఆధారం. |

ఆధారం ఎక్కడినుండి ఎక్కడికి చెప్పబడిందో చూశారా? సమష్టి నుంచి వ్యష్టి దాకా వచ్చింది. శాస్త్రం ప్రకారం సుషుప్తిలో అన్ని అంగాలు హృదయంలో లయమవుతాయి.

**మంత్రం - 6** బ్రహ్మగా గాయత్రి స్తుతి. ఋగ్మంత్రం ద్వారా చేస్తున్నది ఉపనిషత్తు.

**ఏతావానస్య మహిమా అతో జ్యాయాగ్శ్చ పూరుషః**
**పాదోఽస్య విశ్వాభూతాని త్రిపాదస్యామృతం దివి**
**- పురుషసూక్తం**

ఇంచుమించుగా ఇవే పదాలు. ఏతావాన్ బదులు తావాన్ ఉంది. జగత్తులో కనిపించేవి కనిపించనివి అన్నీ బ్రహ్మ మహిమ.

**యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా**
**తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్ గీత 10-41**

బ్రహ్మలోకం వరకూ ఏ మహిమ చూసినా, నా తేజస్సు యొక్క అంశమే. అంటే జగత్తులో కనపడే మహిమ మాత్రమేనా దేవుని మహిమ అని అడుగుతున్నది ఉపనిషత్తు. కనబడే జగత్తంతా, సగుణమహిమ. దేవుని మహిమ అంతకన్నా ఎక్కువ ఉంది అంటున్నది ఉపనిషత్తు.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం।**
**తథాఽరసం నిత్యమగన్ధవచ్చయత్॥ కఠ 1-3-15**

అది నిర్వికల్ప, నిర్గుణబ్రహ్మ. అంటే బ్రహ్మ రెండుగా ఉంది.

సగుణ బ్రహ్మ, నిర్గుణబ్రహ్మ. ఈ రెండింటిలో ఏది ఎక్కువ అంటే మనం సహజంగా సగుణ బ్రహ్మ అనే అంటాము. కాని వేదాంతం సగుణ బ్రహ్మ అనిత్యం అనీ, మిథ్య అనీ, దుఃఖ హేతువు అనీ; నిర్గుణ బ్రహ్మ నిత్యం అనీ, శాశ్వతం అనీ, ఆనంద హేతువు అనీ చెపుతున్నది.

**తతో జ్యాయాగ్ంశ్చ పూరుషః -** జ్యాయ అంటే ఉన్నతం. నిర్గుణబ్రహ్మ శ్రేష్ఠమైనదని, దాని నాణ్యత గురించి చెప్పాక, ఉపనిషత్తు దాని పరిమాణం కూడా ఎక్కువే అని చెప్తోంది.

**సర్వాభూతాని -** అన్ని వస్తువులు,జీవాలు; **పాదోస్య-** సగుణ బ్రహ్మ ఒక పాదం; **త్రిపాద స్యామృతం దివి -** నిర్గుణబ్రహ్మ మూడుపాదాలు. దివి అంటే వాచ్యార్థం స్వర్గం. ఇక్కడ సగుణానికి అతీతం. సగుణ బ్రహ్మ ఒక వంతు, నిర్గుణబ్రహ్మ మూడు వంతులు ఉంది.

ఇక్కడ ఒక విషయం గ్రహించాలి. సగుణబ్రహ్మ, నిర్గుణబ్రహ్మ అనగానే బ్రహ్మకు రెండుభాగాలు ఉన్నట్లు కనిపిస్తుంది. నిజానికి బ్రహ్మకి భాగాలు లేవు. బ్రహ్మ నిరవయవం. మరి అయితే ఎందుకు భాగాలుగా వాడటం? జగత్ మిథ్య, బ్రహ్మ సత్యం అని నిరూపించటానికి.

**అంశః ఇవ న తు యదార్థా అంశః**

మిథ్య, సత్యంలో ఒక భాగం కాలేదు. ఉదాహరణకు నా దగ్గర రు. 1000/-ఉన్నాయి, అందులో 900 రూపాయలు బ్యాంకులోను, 100 రూపాయలు కలలోను ఉన్నాయి అనగలమా? అనలేము.

అలాంటి నిత్య, నిరవయవ, సర్వాత్మక బ్రహ్మను గాయత్రి మీద ఆవాహన చేయాలి.

ఇక్కడితో ఋగ్వేద మంత్రం అయిపోయింది.

**మంత్రాలు 7-9** గాయత్రీ ఉపాసన కొనసాగుతున్నది. గాయత్రీ ఉపాసనకు హృదయాన్ని స్థానంగా చూపించాలనుకుంటున్నది ఉపనిషత్తు. హృదయం ఎందుకు? దానికి కారణం అర్థం చేసుకునేముందు, వేదాంతంలో మనం నేర్చుకున్న ఒక విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి.

మొత్తం జగత్తుకు బ్రహ్మ ఆధారం. జగత్తుని మూడు భాగాలుగా విభజించింది శాస్త్రం. అవి స్థూల ప్రపంచం, సూక్ష్మప్రపంచం, కారణ ప్రపంచం. మూడు ప్రపంచాలకూ అధిష్టాన దేవతగా బ్రహ్మను మూడు పేర్లతో వ్యవహరిస్తారు.

| | | |
|---|---|---|
| స్థూలప్రపంచం | - | విరాట్ |
| సూక్ష్మప్రపంచం | - | హిరణ్యగర్భ |
| కారణప్రపంచం | - | ఈశ్వరుడు |

ప్రళయ కాలంలో స్థూల ప్రపంచం, సూక్ష్మ ప్రపంచంలోనూ, సూక్ష్మ ప్రపంచం కారణ ప్రపంచంలోనూ లయమవుతాయి. అంటే విరాట్ హిరణ్య గర్భలో, హిరణ్యగర్భ ఈశ్వరునిలో లయమవుతారు. ఈశ్వరునిలో ప్రపంచం అవ్యక్త రూపంలో లేదా బీజరూపంలో ఉంటుంది. మళ్ళీ సృష్టి జరిగినప్పుడు వ్యక్తరూపంలో బయటకి వస్తాయి. ఇది ప్రక్రియ.

మనం ప్రళయకాలాన్ని అనుభవించలేము. ప్రళయం ఎప్పుడు వస్తుందో తెలియదు. ఒకవేళ వచ్చినా మనం కూడా లయమవుతాము కాబట్టి ఆ అనుభవం తెలియదు. అది తెలుసుకోవటానికి వ్యష్టిపరంగా ఒక నమూనా ఉంది. వ్యష్టిపరంగా మనకి మూడు అవస్థలు ఉన్నాయి. జాగ్రదావస్థ, స్వప్నావస్థ, సుషుప్తి అవస్థ.

**జాగ్రదావస్థ:–** జాగ్రదావస్థలో స్థూల ప్రపంచాన్ని చూస్తాము. అంటే విరాట్‌ని అనుభవిస్తున్నాము.

**స్వప్నావస్థ:–** స్వప్నావస్థలో స్థూలప్రపంచం లయం చెందుతుంది. నిజంగా స్థూల ప్రపంచం లయమయితే అది ప్రళయం అవుతుంది. మనకు చెందినంతవరకూ మనం నిద్రపోయినప్పుడు, ఇంద్రియాలు పనిచేయవు కాబట్టి, స్థూల ప్రపంచం లయమవుతుంది. అంటే విరాట్‌ని అనుభవించలేము. కాని స్వప్న ప్రపంచం ఉంది. దానిలో సూక్ష్మప్రపంచ అధిష్టానం అయిన హిరణ్యగర్భుని అనుభవిస్తాము.

**సుషుప్తి అవస్థ:–** ఇందులో స్థూల ప్రపంచంతోపాటు, సూక్ష్మ ప్రపంచం కూడా లయమవుతుంది. రెండూ లయమయితే ఏం ఉంది? ఏమీ లేదు అనకూడదు. ప్రపంచమంతా బీజరూపంలో ఉంది. బీజరూపంలో ఉందని చెప్పటానికి ఏమిటి నిదర్శనం? మనం లేచి కళ్ళు తెరవగానే, మొత్తం ప్రపంచం మళ్ళీ కళ్ళ ముందుకు వస్తుంది. అందుకని ఈశ్వరుని అనుభవించటానికి ప్రళయం రానవసరం లేదు. ప్రతిరోజూ ఈశ్వరునిలో లయమవు తూనే ఉన్నాము.

మూడు పేర్లతో వ్యవహరిస్తున్న ఈ బ్రహ్మ చైతన్యాన్ని మూడు రకాల ఆకాశంతో పోల్చింది శాస్త్రం – బహిరాకాశం, శరీర ఆకాశం, హృదయ ఆకాశం. జాగ్రద్ ప్రపంచం బహిరాకాశంలో ఉంది కాబట్టి, దాన్ని విరాట్‌తో పోల్చవచ్చు. స్వప్న ప్రపంచం మీలో ఉందా, బయట ఉందా? స్వప్న ప్రపంచం మీలోనే ఉంది. అంటే శరీర ఆకాశం స్వప్న ప్రపంచానికి ఆధారం. హిరణ్యగర్భ స్వప్న ప్రపంచానికి ఆధారం,శరీర ఆకాశం స్వప్న ప్రపంచానికి ఆధారం కాబట్టి శరీర అకాశాన్ని హిరణ్యగర్భతో పోల్చవచ్చు. సుషుప్తిలో, మన ఇంద్రియాలు, మనసుతో సహా హృదయంలో లయం చెందుతాయి. కారణ ప్రపంచం హృదయాకాశంలో ఉంది. హృదయాకాశం కారణ ప్రపంచానికి ఆధారం. ఈశ్వరుడు కారణ ప్రపంచానికి ఆధారం. అందువల్ల హృదయాకాశాన్ని ఈశ్వరునితో పోల్చవచ్చు.

| | |
|---|---|
| బహిరాకాశం | విరాట్ |
| శరీరాకాశం | హిరణ్యగర్భ |
| హృదయాకాశం | ఈశ్వరుడు |

ఈ మూడింటిలో దేనిమీద ఉపాసన చేయాలి? ఈశ్వరుడు మాత్రమే శుద్ధం అంటున్నారు శంకరాచార్యులు. ఎందుకు? మిగతా రెండూ దుఃఖమిశ్రితం. జాగ్రద్ ప్రపంచంలో సుఖం, దుఃఖం రెండూ ఉన్నాయని తెలుస్తూనే ఉంది. అందుకని బహిరాకాశాన్ని తీసుకోము. స్వప్న ప్రపంచంలో దుఃఖం ఉంది. మన కలలు, మన వాసనలని బట్టే వస్తాయి. మనం చదివేదంతా దుఃఖభూయిష్టమైనది కాబట్టి చెడు కలలు వస్తాయి. కాని సుషుప్తిలో శుద్ధ ఆనందం ఉంది. కాబట్టి కారణ ప్రపంచానికి ఆధారమైన ఈశ్వరధ్యానం చేయాలి. ఎక్కడ? **హృదయే**. హృదయకోశంలో ఈశ్వరుడు ఉన్నాడు. అందుకే దాన్ని దహరాకాశ ఉపాసన అని కూడా అంటారు.

**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి     గీత 18 -61**

బ్రహ్మ విరాట్ రూపంలో బహిరాకాశంలో, హిరణ్యగర్భ రూపంలో శరీరాకాశంలో, ఈశ్వరరూపంలో హృదయాకాశంలో ఉన్నాడు. అందుకని గాయత్రి ఉపాసన హృదయంలో చేయాలి. గాయత్రీ చదివినప్పుడు, ఆ గాయత్రి ప్రపంచానికి ఆధారమైన బ్రహ్మ అని గుర్తుంచుకోవాలి.

ఫలశ్రుతి – ఈశ్వరుడు హృదయాకాశంలో ఉన్నాడు అనగానే, ఈశ్వరుని పరిచ్ఛిన్నగా భావించకూడదు. అందుకని ఉపనిషత్తు చెపుతున్నది – ఈశ్వరుడు సర్వవ్యాపకం అయినా, ఆయన హృదయంలో దొరుకుతాడు అని. విద్యుచ్ఛక్తి అంతటా ఉన్నా, ఒకచోట వెలిగినట్టుగా అర్థం చేసుకోవాలి. హృదయం ఈశ్వరునికి ఉపలబ్ధి స్థానం.

**పూర్ణమప్రవర్తినీగ్ం శ్రియం లభతే –** పూర్ణం అంటే సర్వవ్యాపకం. హృదయ ఆకాశంలో ఉన్న బ్రహ్మ పరిచ్ఛిన్నం కాదు. సర్వవ్యాపకం. అంతేకాదు, అప్రవత్తి. అంటే నిత్యం, నాశరహితం. ఇక్కడ మార్పులేదు అని అర్థం. ఈ ఉపాసన ఫలంగా బోలెడు ఐశ్వర్యం వస్తుంది. ఎలాంటి ఐశ్వర్యం? నిత్యం! వస్తుంది కాని వెళ్ళదు. ఇది ఇహలోక ఫలం. పరలోక ఫలం క్రమముక్తి. బ్రహ్మలోకానికి వెళ్ళి అక్కడ్నుంచి మోక్షం పొందుతాడు.

శంకరాచార్యులు ఈ భాగాన్ని తరచు వాడుతుంటారు, హృదయాకాశం గురించి చెప్పటానికి. శాస్త్రంలో అనేకచోట్ల హృదయాకాశం గురించి వస్తుంది కాని, వివరాలు రావు.

అక్కడ శంకరాచార్యులు ఈ భాగం గురించి చెప్తారు. ఎందుకంటే

ఇది హృదయాకాశాన్ని బ్రహ్మగా వర్ణిస్తున్నది. మాయాసహిత బ్రహ్మలో ప్రళయంలో స్థూల సూక్ష్మ ప్రపంచాలు లయమయినట్టుగా సుషుప్తిలో హృదయాకాశంలో స్థూల,సూక్ష్మ ప్రపంచాలతో వ్యవహారం నడిపే పరికరాలు లయమవుతాయి. మళ్ళీ జాగ్రద్, స్వప్నావస్థలలో బయటకి వస్తాయి.

గాయత్రీ బ్రహ్మ ఉపాసన హృదయంలో చేయాలి. ఈ ఉపాసన ప్రఖ్యాతి చెందినది. ఎందుకంటే ఇది గాయత్రి ఉపాసకే కాదు, ఆత్మజ్ఞానానికి కూడా తోడ్పడుతుంది.

**యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్। బ్రహ్మానంద వల్లీ**
**హిరణ్మయే పరే కోశే విరజం, బ్రహ్మ నిష్కలమ్ -ముండక 2-2-10**

కాకపోతే ఉపాసనకీ, జ్ఞానానికీ ఉన్న తేడా - ఉపాసనలో ఊహించుకుంటాము. జ్ఞానంలో అర్థం చేసుకుంటాము.

**త్రయోదశః ఖణ్డః (13)**

**తస్య హ వా ఏతస్య హృదయస్య పంచ దేవసుషయస్స యోఽ ఽస్య ప్రాఙ్సుషిస్స ప్రాణస్తచ్చక్షు స్స ఆదిత్యస్తదేతత్తేజోఽ న్నాద్యమిత్యుపాసీత తేజస్వ్యన్నాదో భవతి య ఏవం వేద ॥1॥ అథ యోఽ స్య దక్షిణస్సుషిస్స వ్యానస్తచ్ఛ్రోత్రగ్ంస చన్ద్రమాస్తదేతచ్ఛ్రీశ్చ యశశ్చేత్యుపాసీత శ్రీమాన్యశస్వీ భవతి య ఏవం వేద ॥2॥ అథయోఽ స్య ప్రత్యఙ్సుషిస్సోఽ పానస్సా వాక్సోఽ గ్నిస్తదేతద్బ్రహ్మవర్చ సమన్నాద్యమిత్యుపాసీత బ్రహ్మవర్చస్వ్యన్నాదో భవతి య ఏవం వేద ॥3॥ అథ యోఽ స్యోదఙ్ సుషీ స్స సమానస్తన్మనస్స పర్జన్యస్తదేతత్కీర్తిశ్చ వ్యుష్టిశ్చేత్యుపాసీత కీర్తిమాన్వ్యుష్టి మాన్భవతి య ఏవం వేద ॥4॥ అథ యోఽ స్యోర్ధ్వః సుషిస్స ఉదానస్స వాయుస్స ఆకాశస్తదేతదోజశ్చ మహశ్చేత్యుపాసీతౌజస్వీ మహస్వాన్భవతి య ఏవం వేద ॥5॥ తే వా ఏతే పఞ్చ బ్రహ్మపురుషాస్స్వర్గస్య లోకస్య ద్వారపాస్స య ఏతానేవం పఞ్చ బ్రహ్మపురుషోస్స్వర్గస్య లోకస్య ద్వారపాన్వేదాస్య కులే వీరో జాయతే ప్రతిపద్యతే స్వర్గం లోకం య ఏతానేవం పఞ్చ బ్రహ్మపురుషాన్స్వర్గస్య లోకస్య ద్వారపాన్వేద ॥6॥ అథ యదతః పరో దివో జ్యోతిర్దీప్యతే విశ్వతః పృష్ఠేషు సర్వతః పృష్ఠేష్వ నుత్తమేషూత్తమేషు లోకేష్విదం వావ తద్యదిదమస్మిన్నన్తః పురుషే జ్యోతిః ॥7॥ తస్యైషా దృష్టిర్యత్రైతదస్మిఞ్ఛరీరే సగ్ంస్పర్శేనోష్ణిమానం విజానాతి। తస్యైషా శ్రుతిర్యత్రైతత్కర్ణావపిగృహ్య**

**నినదమివ నదథురివాగ్నేరివ జ్వలత ఉపశృణోతి తదేతద్దృష్టం చ శ్రుతం చేత్యుపాసీత। చక్షుష్యశ్శ్రుతో భవతి య ఏవం వేద య ఏవం వేద ॥8॥**

**పంచద్వారక ఉపాసన:** ఇంకో అందమైన ఉపాసన. కాల్పనిక ఉపాసన. ముందు ఖండంలో హృదయాకాశం= బ్రహ్మ అని చూశాము. బ్రహ్మ అంటే మాయాసహిత బ్రహ్మలేదా కారణరూప బ్రహ్మ. మాయా సహిత బ్రహ్మను ఈశ్వరుడు అంటారు. సమష్టి స్థూల శరీర విశిష్ఠం విరాట్, సమష్టి సూక్ష్మశరీర విశిష్ఠం హిరణ్యగర్భ, కారణ శరీర విశిష్ఠం ఈశ్వరుడు.

అందువల్ల హృదయం ఈశ్వర స్థానం అవుతుంది.

**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి గీత 18 -61**

అందువల్ల హృదయాన్ని స్వర్గలోకం అంటారు. స్వర్గలోకం అంటే బ్రహ్మలోకం. శాస్త్రం ప్రకారం మనం ప్రతిరోజూ ఈశ్వరలోకానికి వెళుతున్నాము. అందుకే ముక్తిని పొందుతున్నాము సుషుప్తిలో.

**హృదయాకాశ ఉపాసన ఫలం:-** ఈశ్వర ప్రాప్తి లేదా బ్రహ్మలోక ప్రాప్తి. దీన్ని ముందు ఖండంలోనే చూశాము. దానికీ దీనికీ సంబంధం తీసుకురావటానికి మళ్ళీ అది చెప్పటం జరిగింది. ప్రతిలోకానికీ ద్వారం కావాలి. ఇల్లుకట్టి తలుపులు లేకపోతే ఎలా? బ్రహ్మలోకానికి కూడా పంచద్వారాలు ఉన్నాయి.

**యత్ర యత్ర ద్వారం తత్ర తత్ర ద్వారపాలకః**

ముఖ్యమైన ప్రదేశానికి ఒక్క ద్వారపాలకుడు చాలడు. అందుకని ఒక్కొక్క ద్వారానికి ముగ్గురు దేవతలు ఉన్నారు.

**పంచదేవ సుషిః-** ఉపనిషత్తు ద్వారానికి ఒక ప్రత్యేకమైన పదం వాడుతున్నది. సుషిః అంటే ఈశ్వరప్రాప్తి ద్వారం. హృదయంలో కూడా పంచద్వారాలు ఉన్నట్టుగా ఊహించుకోబోతున్నాము. ఎందుకంటే హృదయం ఈశ్వరలోకం. ఇక్కడ స్వర్గలోకంగా పిలవబడుతున్నది. ఒక్కొక్క ద్వారపాలకుడు ఒక్కొక్క దేవత.

**రాజ పాలకేన రాజదృష్టిః సమ్యక్ భవతి।**

రాజ పాలకుడు తెలిస్తే, రాజుతో పని తేలిగ్గా అవుతుంది. వాళ్ళకు దక్షిణలిస్తే, ఈశ్వరుని దగ్గరకు వెళ్ళినప్పుడు వాళ్ళు ప్రతిబంధకాలు సృష్టించరు.

**ఈశ్వర ప్రాప్తి విషయే ప్రతిబంధాన్ న కుర్వన్తి**

**పంచద్వార పాలక ఉపాసన/ బ్రహ్మపురుష ఉపాసన**

| మంత్రం | ద్వారం | ద్వారపాలకులు | ఉపాసన విధానం | ఫలం |
|---|---|---|---|---|
| 1 | తూర్పు | ప్రాణం,చక్షువు, ఆదిత్యుడు | తేజస్సు, అన్నాద్యం | తేజస్వీభవతి అన్నాదోభవతి |
| 2. | దక్షిణం | వ్యానం,శ్రోత్రం, చంద్రుడు | శ్రీ, యశస్సు | శ్రీమాన్ భవతి యశస్వీభవతి |
| 3. | పడమర | అపానం,వాక్కు, అగ్ని | బ్రహ్మవర్చస్సు, అన్నాద్యం | బ్రహ్మవర్చసీ భవతి అన్నాదో భవతి |
| 4. | ఉత్తరం | సమానం, మనసు, మేఘం | కీర్తి, వృష్టి | కీర్తిమాన్ భవతి వృష్టిమాన్ భవతి |
| 5. | ఊర్ధ్వం | ఉదానం,వాయువు, ఆకాశం | ఓజస్సు,మహత్తు | ఓజస్వీ భవతి మహస్వాన్ భవతి |

**మంత్రం 6:- అస్యకులే వీరో జాయతే-** ఈ ఫలాలే కాకుండా ఇంకో ఫలం చెపుతున్నది ఉపనిషత్తు. అతని కులంలో పుత్రులు వీరులుగా పుడతారు. వీరులు అంటే వీరత్వం ఒకటే కాదు, మంచి విలువలతో ఉంటారు అని అర్థం.

శంకరాచార్యులు ఇంకో విషయం చెపుతున్నారు ఇక్కడ. ఈ పంచ ద్వారపాలక ఉపాసన స్వతంత్ర ఉపాసన కాదు. ఇది గాయత్రీ బ్రహ్మ ఉపాసనలో ఒక భాగం.

**మంత్రాలు 7-8:-** ఇంకో ఉపాసన. ఇది స్వతంత్ర ఉపాసన. ఇది కూడా బ్రహ్మ ఉపాసనే. **జ్యోతిరూపేణ ఉపాసన.** జ్యోతి అంటే ప్రకాశం. ఎటువంటి ప్రకాశం? చైతన్యజ్యోతి లేదా సర్వగత చైతన్యం. ఉపాసన కోసం ఆ బ్రహ్మని ఒక ప్రతీక మీద ఆవాహన చేయాలి. ఇక్కడ తీసుకునే ప్రతీక ఏమిటి? శరీరంలో ఉష్ణోగ్రత ఉంది. అది ఆంతరజ్యోతి వల్ల ఉంది. సర్వగత జ్యోతి ఉపాసనకి ఈ ఆంతరజ్యోతి ఆలంబన.

**ఆంతరజ్యోతి రూపేణ సర్వగత బ్రహ్మజ్యోతి ఉపాసన**

ముందు ఉపనిషత్తు బ్రహ్మజ్యోతి వర్ణన చేస్తున్నది. బ్రహ్మజ్యోతి అన్ని లోకాలకు అతీతంగా ఉంది. సగుణ సృష్టికి అతీతంగా నిర్గుణ

చైతన్యరూపంలో బ్రహ్మ ఉంది. ఈ సర్వగత జ్యోతి ఎక్కడ అందుబాటులో ఉంది?

**అస్మిన్ శరీరే –** శరీరంలో ఉన్న ఆంతరజ్యోతిని ఎలా గుర్తించాలి? రెండు పరీక్షలు చెపుతున్నది ఉపనిషత్తు.

**1. స్పర్శేనోష్ణిమానం విజానాతి–** ఉష్ణరూపేన అనుభూయతే– ముట్టుకుంటే శరీరంలోని వేడి తెలుస్తుంది.

**2. శృతిః –** చెవులు మూసుకుంటే, లోపల హెూరు వినిపిస్తుంది. ఆ శబ్దాన్ని ఓంకారం అంటారు కొందరు. అనాహత రూపమంటారు కొందరు. ఆ శబ్దం ఎలా ఉంటుందో చెప్పటానికి మూడు ఉదాహరణలనిస్తున్నది ఉపనిషత్తు.

**ఎ) నినదమివ –** పరుగెడుతున్న రథం చప్పుడులాగా ఉంటుంది. ఇప్పటి కాలమాన పరిస్థితుల దృష్ట్యా రైలు పరుగెడుతున్న చప్పుడుతో పోల్చవచ్చు.

**బి) నదథురివ –** ఎద్దు అరిచే అరుపు.

**సి) ఆగ్నేరివ జ్వలత –** మండుతున్న అగ్ని చేసే శబ్దం.

**దృష్టం చ శ్రుతం చ –** అందువల్ల ఎవరైనా ఈశ్వరుని చూశావా అంటే స్పర్శ ద్వారా తెలుసుకున్నాను. శబ్దం ద్వారా తెలుసుకున్నాను అని చెప్పవచ్చు. అందువల్ల ఈ ఉపాసనను **ఆంతరజ్యోతిః దృష్టశ్రుత రూపేణ బ్రహ్మణ ఉపాసన** అనవచ్చు.

## చతుర్దశః ఖణ్డః (14)

**సర్వం ఖల్విదం బ్రహ్మ। తజ్జలాన్। ఇతి శాన్త ఉపాసీత। అథ ఖలు క్రతుమయః పురుషో యథాక్రతురస్మింల్లోకే పురుషో భవతి తథేతః ప్రేత్య భవతి స క్రతుం కుర్వీత ॥1॥ మనోమయః ప్రాణ శరీరో భారూపస్సత్యసంకల్ప ఆకాశాత్మా సర్వకర్మా సర్వకామస్సర్వగన్ధస్సర్వ రసస్సర్వమిదభ్యాత్తః। అవాక్యనాదరః ॥2॥ ఏష మ ఆత్మాఽ న్తర్హ్ృదయేఽ ణీయాన్వ్రీహేర్వా యవాద్వా సర్షపాద్వా శ్యామాకాద్వా శ్యామాకతణ్డులాద్వా। ఏష మ ఆత్మాఽ న్తర్హృదయే జ్యాయాన్పృథివ్యా జ్యాయానన్తరిక్షాజ్జ్యాయాన్దివో లోకేభ్యః ॥3॥ సర్వకర్మా సర్వకామస్సర్వగన్ధస్సర్వరసస్సర్వమిదమభ్యాత్తో ఽ వాక్యనాదర ఏష మ ఆత్మాన్తఽ ర్హృదయ ఏతద్బ్రహ్మైతమితః ప్రేత్యాభిసమ్భవితాఽ స్మీతి యస్య స్యాదద్ధా న విచికిత్సాఽ స్తీతి హ స్మాహ శాణ్డిల్యశ్శాణ్డిల్యః ॥4॥**

**శాండిల్య విద్య –** ఇది అత్యంత ముఖ్యమైన ఉపాసన. దీని గురించి శంకరులవారు చెపుతుంటారు. ఈ ఉపాసనను శాండిల్య విద్య అంటారు. శాండిల్య ఒక ఋషి పేరు. ఈ ఉపాసనను కనుగొన్నది ఈ ఋషి. విద్య అంటే ఇక్కడ ఉపాసన. అందువల్ల శాండిల్య విద్య అంటే శాండిల్య ఋషి చెప్పిన ఉపాసన.

ఇక్కడ కూడా సగుణ బ్రహ్మ ఉపాసన. అందువల్ల బ్రహ్మ ఉపాసన అన్నప్పుడల్లా సాధారణంగా సగుణ బ్రహ్మ ఉపాసన లేదా మాయాసహిత బ్రహ్మ ఉపాసన లేదా ఈశ్వర ఉపాసన అని అర్థం చేసుకోవాలి. ఇక్కడ ఈ ఈశ్వర ఉపాసన ఒక ఆలంబనం మీద చేయటం లేదు. ఆలంబనం మీద చేస్తే దాన్ని ప్రతీక ఉపాసన అంటారు.

ఇక్కడ ఈశ్వర ఉపాసన సర్వగుణ విశిష్ఠ ఈశ్వరుని మీద ఉపాసన.

అనంత కళ్యాణ గుణ గుణైక నిలయః

దీన్ని విభూతియోగంతో పోల్చవచ్చు.

**యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా।**

**తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్॥గీత 10 – 41**

ఈ ఉపాసన విశిష్టాద్వైతులకు చాలా అనుకూలంగా ఉంటుంది. విశిష్టాద్వైతం నిర్గుణబ్రహ్మను అంగీకరించదు. బ్రహ్మ సర్వగుణ విశిష్ఠుడు అంటుంది. అందుకే అనంత కళ్యాణగుణం అంటుంది. మరి అలా అయితే ఉపనిషత్తు నిర్గుణబ్రహ్మ గురించి ఎందుకు మాట్లాడుతుంది అంటే వాళ్ళ జవాబు ప్రత్యేకంగా ఉంటుంది. నిర్గుణ బ్రహ్మ అంటే దుష్టగుణం లేని బ్రహ్మ. నిర్గుణం= దుర్గుణం లేనిది అంటారు. దానికి ప్రమాణంగా విశిష్టాద్వైతులు శాండిల్య విద్యని చూపిస్తారు.

ఇప్పుడు మంత్రం చూద్దాము.

**మంత్రం 1:– సర్వం ఖల్విదం బ్రహ్మ – అంతా బ్రహ్మే.** ఏమిటి కారణం? ఉపనిషత్తే కారణం ఇస్తున్నది. బ్రహ్మే జగత్తురూపంలో ఉన్నాడు. ఎలాగైతే అలకు సముద్రం సృష్టి,స్థితి, లయ కారణమో అలా జగత్తుకి సృష్టి,స్థితి, లయ కారణం బ్రహ్మే.

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. మనం జగత్తు మిథ్య అన్న

విషయం పట్టించుకోవటం లేదు. జగత్తు మిథ్య అని చెప్తే అది జ్ఞానం అయిపోతుంది. ఇక్కడ మనం జ్ఞానం గురించి పట్టించుకోవడం లేదు. మనకు కావాల్సింది విరాట్ ఉపాసన. అందుకని ఉపనిషత్తు ఉన్నదంతా బ్రహ్మే అంటున్నది.

**భూః పాదౌ యస్య నాభిర్వియదసురనిలశ్చంద్రసూర్యౌ చ నేత్రే।**
**కర్ణావాసాశ్శిరో ద్యౌర్ముఖమపి దహనో యస్య వాస్తేయమబ్ధిః॥**

**తజ్జలాన్ –** ఈ కారణం వల్ల బ్రహ్మకు ఒక అద్భుతమైన పేరు ఇచ్చింది. అది తజ్జలాన్.

**తస్మాత్ జాయతే ఇతి తజ్జం.** బ్రహ్మనుంచే అన్నీపుట్టాయి. తజ్జం. జ్జం అంటే పుట్టాయి.

**తస్మిన్ లీయతే ఇది తల్లం.** అన్నీ అందులో లయమవుతాయి. తల్లం అంటే లయం.

**తేన అనితి –** అనితి అంటే స్థితి కారణం. దాన్ని తద్య అంటారు. తిష్టతి అని అర్థం. బ్రహ్మే స్థితి కారణం.

**తజ్జం, తల్లం, తదన్= తజ్జంచ, తల్లంచ, తదన్చ = తజ్జలాన్**

**తత్ (జ+ల+అన్)= జ= సృష్టి, ల= లయ, అన్= స్థితి, తజ్జలాన్.** అందువల్ల ప్రపంచం తజ్జలాన్.

**ఇతి శాన్తః ఉపాసీత** = తజ్జలాన్= మొత్తం జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయకారణం మీ మనసులోకి రావాలి. శాన్తః – జగత్కారణం బ్రహ్మ గురించి ఉపాసన చేయాలంటే తాత్కాలికంగా మీ చిన్న కుటుంబ సమస్యలు, రాగద్వేషాలు మర్చిపోవాలి.

ఉపాసన ఉద్దేశ్యమే అది. వ్యష్టిగా మర్చిపోయి, సమష్టి సృష్టి గురించి ఉపాసన చేయాలి. శాంతః అంటే రాగద్వేషాలను వదిలేయాలి కాసేపైనా. ఉపాసన ఉద్దేశ్యం – ఇది చాలా ముఖ్యం. ఇందులో ప్రతి పదమూ ముఖ్యమే. ఒక వ్యక్తి ఎలా అనుకుంటే, అలా అవుతాడు. అతని నమ్మకం ఎలా ఉంటే, అతని భవిష్యత్తు అలా ఉంటుంది.

**సత్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత।**
**శ్రద్ధామయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధః స ఏవ సః॥**
**– గీత 17- 3**

గీతలో శ్రద్ధ పదం వాడితే, ఇక్కడ క్రతు పదం వాడింది ఉపనిషత్తు.

క్రతు అంటే నమ్మకం. నాకు ధనం ముఖ్యమనుకోండి. నేను డబ్బుకోసం నా స్వంత అన్నదమ్ములతోనే పోట్లాడవచ్చు కూడా.

**సర్వేగుణాః కాఞ్చన మాశ్రయంతి**

ఈశ్వరుని మీద నమ్మకం ఉంటే, భగవంతుడు మాత్రమే ముఖ్యం. అప్పుడు అతను కూడా దైవసమానుడు అవుతాడు. ఉపాసన నియమం చెపుతున్నది –

**యథా క్రతురస్మింల్లోకే పురుషో భవతి। తథేతః ప్రేత్య భవతి॥**

సంకల్పం ఎలా ఉంటే, అలా ఫలం వస్తుంది.

**యం యం వాऽపి స్మరన్ భావం త్యజత్యంతే కలేవరం**

**తం తమేవైతి కౌన్తేయ సదా తద్భావభావితః॥**

**తస్మాత్ సర్వేషు కాలేషు మామనుస్మర యుద్ధ్య చ – గీత 8 – 6**

నా గురించి నిరంతరం తలచుకోవటం వల్ల నన్ను పొందుతావు.

**ప్రేత్య భవతి:–** మరణానంతరం బ్రహ్మలోకం వెళతాడు. దీన్ని క్రమముక్తి అంటారు.

**మంత్రం–2:–** ఈశ్వరుని స్తుతి. ఈశ్వర అంటే మాయాసహిత బ్రహ్మ అని మర్చిపోకూడదు.

**మనోమయః –** వ్యష్టి మనసులన్నీ సమష్టి మనసుకి చెందినవి.

**ప్రాణశరీరః –** అన్ని స్థూల శరీరాలూ ఈశ్వరుని స్థూల ప్రపంచం. అన్ని సూక్ష్మ శరీరాలూ ఈశ్వరుని సూక్ష్మ ప్రపంచం.

**భారూపః –** చైతన్య స్వరూపః – సగుణ బ్రహ్మలో చైతన్యం ఉందా లేదా? నిర్గుణ బ్రహ్మలో చైతన్యం మాత్రమే ఉంది. సగుణ బ్రహ్మలో చైతన్యం + రూపం ఉంది. భారూప అంటే చైతన్య స్వరూపం.

**సత్య సంకల్పః –** సంకల్పాలు ఎప్పుడూ సత్యమైనవి. మన సంకల్పాలు అన్నీ నెరవేరవు. ఈశ్వర సంకల్పాలు ఎప్పుడూ నెరవేరుతాయి.

**ఆకాశాత్మా–** రెండు అర్థాలు ఉన్నాయి దీనికి. ఆత్మ అంటే శరీరం. అందువల్ల ఆకాశాత్మ అంటే ఆకాశమే శరీరంగా ఉన్న బ్రహ్మ.

విరాట్ వర్ణన, హిరణ్యగర్భ వర్ణన కూడా ఈశ్వరునికి వర్తిస్తాయి. అందుకని ఒకరికి చెప్పిన వర్ణన ఇంకొకరికి వాడవచ్చు.

రెండో అర్థం– ఆకాశా ఇవ ఆత్మా శరీరం. ఆకాశం లాగా రూపం లేనిది.
**సర్వకర్మా–** అన్ని కర్మలూ ఆయనకే చెందుతాయి. అన్ని శరీరాలూ ఆయనకే చెందినప్పుడు కర్మలు కూడా ఆయనకే చెందుతాయి కదా. మాట్లాడే శక్తి కూడా ఈశ్వరునిదే.

**సర్వకామః–** అన్ని కోరికలూ ఆయనకే చెందుతాయి.

**సర్వగన్ధః –** అన్ని వాసనలూ ఆయనకే చెందుతాయి.

**సర్వరసః –** అన్ని రుచులు ఆయనకే చెందుతాయి.

**సర్వమిదభ్యాత్తః –** అభ్యాత్తః అంటే సర్వవ్యాపకం. ఒక్కముక్కలో చెప్పాలంటే ఈశ్వరుడు సర్వవ్యాపకం.

ఇక్కడ శంకరాచార్యులు ఒక విషయం కలుపుతున్నారు. సర్వ కర్మా సర్వ కామస్సర్వగన్ధ స్సర్వరసః అన్నప్పుడు అన్నీ మంచివి తీసుకోవాలి.

**పుణ్యోగంధ పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ। గీత 7 – 9**

చెడు వాసనలన్నీ అవిద్య వల్ల జీవుడు సృష్టించుకున్నాడు. అన్నీ ఉన్నతమైనవి తీసుకోవాలి.

**ధర్మా విరుద్ధో భూతేషు కామోఽ స్మి భరతర్షభ। గీత 7 – 11**

సర్వ శుభకామ, సర్వ శుభ రసః,సర్వశుభ గంధః తీసుకోవాలి.

అందుకే వైష్ణవులు అనంతకళ్యాణ గుణ పరమాత్మ అంటారు.

**అవాక్యనాదరః –** ఇక్కడ నిశ్శబ్దంగా నిర్గుణ స్వరూపం కూడా సూచించబడింది. అవాకీ అంటే వాగింద్రియం లేనివాడు. వ్యావహారిక దృష్ట్యా అన్నీ ఉన్నవాడు, పారమార్థిక దృష్ట్యా వీటన్నింటికీ అతీతుడు.

ఆ విధంగా నిర్గుణ, సగుణ రెండూ చెప్పబడ్డాయి.

**నీరాగా రాగమథనీ నిర్మదా మదనాశినీ।**
**నిశ్చింతా నిరహంకారా నిర్మోహా మోహనాశినీ॥**

అంటే నిర్గుణ, సగుణ గుణాలు రెండూ వస్తాయి ఏ సహస్రనామం చూసినా.

**అవాకీ –** వాక్ ఇంద్రియం లేనివాడు. ఇక్కడ వాక్ అంటే అదొక్కటే కాదు.సర్వేంద్రియాలు లేనివాడు అని అర్థం.

**ఆనాదరః –** శాంత స్వరూపుడని అర్థం.

**శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశమ్।**
**విశ్వాధారం గగన సదృశం మేఘవర్ణం శుభాఙ్గమ్॥**

ఇక్కడ ఆకాశ ఆత్మ, అక్కడ గగన సదృశం.ఎన్నో ఈశ్వర ఉపాసనలు ఈ ఖండం మీదే ఆధారపడి ఉన్నాయి.

**మంత్రం-3:-** ఇవన్నీ తరచు చూసే మంత్రాలు. బ్రహ్మసూత్రాల్లో వీటిమీద బాగా విశ్లేషణ జరిగింది.

**ఏషమ ఆత్మా -** ఈశ్వరుడే నా స్వరూపం. ఎక్కడ ఉన్నాడు?

**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి గీత 18 -61**

ఈశ్వరుడు హృదయంలో ఉన్నాడు. ఎలా ఉన్నాడు? ప్రాజ్ఞరూపంలో ఉన్నాడు. సమష్టిలో ఈశ్వరునికి వ్యష్టిలో సమానం ఎవరు? ప్రాజ్ఞ. స్వభావం ఏమిటి? చాలా సూక్ష్మంగా ఉన్నాడు. ఆ సూక్ష్మ గుణం చూపించటానికి కొన్ని ఉదాహరణలు ఇచ్చింది ఉపనిషత్తు.

**వ్రీహి, యవ, సర్షప, శ్యామాకా, శ్యామాకతణ్డుల -** అనేక సూక్ష్మమైన ధాన్యాలు ఇవే చిన్నవి అంటే ఈశ్వరుడు వాటికన్నా సూక్ష్మం. అణోఃఅణీయాన్ - అంటే ఈశ్వరుడు అంత చిన్నవాడా?

**ఏషమ ఆత్మాఽంతర్హృదయే-** నా హృదయంలో ఒక చిన్న స్థలాన్ని ఆక్రమించుకున్నాడు ఈ ఈశ్వరుడు నిజానికి.

**జ్యాయాన్పృథివ్యా జ్యాయానన్తరిక్షాజ్యాయాన్దివో లోకేభ్యః -** ఆయన పృథివికన్నా పెద్ద; అంటే భూలోకం కన్నా పెద్ద; భువర్లోకం కన్నా పెద్ద; సువర్లోకం కన్నా పెద్ద; అసలు 14 లోకాలకన్నా పరిణామంలో పెద్ద.

**అణోరణీయాన్మహతో మహీయాన్ - కఠ 1-2-20**

కొన్ని వర్ణనలు సగుణ బ్రహ్మకు, కొన్ని నిర్గుణ బ్రహ్మకు వర్తిస్తాయి. కాబట్టి ఇది సగుణ,నిర్గుణ బ్రహ్మ వర్ణన.

**ఏషః మ ఆత్మా -** ఈశ్వరుడు నా ఆత్మసారం అనటం వల్ల, దానిమీద వాదనలు కూడా ఉన్నాయి. ఈశ్వరుడు జీవుడు కాదు. ఈశ్వరుడు వేరు, జీవుడు వేరు అని ఒక వాదన. ఇది ఉపాసన కాండం. దీన్ని పట్టించు కోనవసరం లేదు.

**మంత్రం-4 -** ఇందులో మొదటి భాగం ముందు మంత్రంలో చూశాము. ఈశ్వరుడు **సర్వకర్మా, సర్వకామ... ఆత్మాన్తరహృదయే** దాకా. మరయితే

మళ్ళీ ఎందుకు చెపుతున్నది? పునరుక్తి దోషం రాదా? శంకారాచార్యులు, ఇలా మళ్ళీ చెప్పటంలో ఒక ప్రత్యేక ఉద్దేశం ఉంది అంటున్నారు. ముందు వర్ణనలో సగుణ, నిర్గుణ రూపాల కలగలిసిన వర్ణన చూశాము. ఇప్పుడు ఉపాసనలో సగుణ కలపాలా వద్దా? తటస్థ లక్షణం చెప్పేటట్లయితే గుణాలు వదిలేయాలి. అందుకని వదలాలా వద్దా అన్న ప్రశ్న ఉదయిస్తుంది. శంకరాచార్యులు, ఉపనిషత్తు గుణాలను కలపాలని ఆశిస్తున్నది అంటున్నారు.

ముందు తటస్థ లక్షణం, స్వరూప లక్షణం అంటే ఏమిటో చూద్దాము.
**స్వరూప లక్షణం – మహాబాహు దేవదత్తం.** పెద్ద భుజాలున్న దేవదత్తుడు.
**తటస్థ లక్షణం – ఆసనస్థం దేవదత్తం.** కుర్చీలో కూర్చున్న దేవదత్తుడు.

ఇప్పుడు దేవదత్తుని పిలవండి అంటే ఏ లక్షణం ఉంచి, ఏ లక్షణం వదులుతాము? పెద్ద భుజాలు అతని స్వరూపం. దాన్ని వదలలేదు. కుర్చీలో కూర్చున్న దేవదత్తుడు కుర్చీతో సహా రాడు. అంటే తటస్థ లక్షణం వదిలి స్వరూప లక్షణం మాత్రమే తీసుకోవాలి.

కాని ఇక్కడ తటస్థ లక్షణం వదలవద్దు అని చెప్పటానికే ఉపనిషత్తు సర్వకర్మ, సర్వకామ,సర్వగన్ధః లాంటి లక్షణాలను మళ్ళీ చెపుతున్నది. ఇది జ్ఞానకాండ కాదు. బ్రహ్మ స్వరూపం తెలుసుకోవటం లేదు. బ్రహ్మ ఉపాసన చేస్తున్నాము. అందుకని సర్వగుణ విశిష్ఠ ఈశ్వర ఉపాసన చేయాలి. సర్వగుణాలు వర్ణించేది సగుణ బ్రహ్మకే.

ఇంకో వాదన కూడా చెప్పవచ్చు. ఫలంలో మరణానంతరం క్రమముక్తి వస్తుంది అంటున్నది ఉపనిషత్తు. క్రమముక్తి ఎవరికి వస్తుంది? సగుణ ఉపాసన చేసిన వ్యక్తికి. అతను బ్రహ్మలోకానికి వెళ్ళి, అక్కడ్నుంచి క్రమముక్తి పొందుతాడు. కాకపోతే ఈ ఫలం ఈ ఉపాసన మీద ఏమాత్రం సంశయం లేకుండా శ్రద్ధ ఉన్నవానికే వస్తుంది. ఈ ఉపాసనను శాండిల్య చెప్పాడు కాబట్టి ఇది శాండిల్య విద్య.

### పఞ్చదశః ఖణ్డః (15)

**అన్తరిక్షోదరః కోశో భూమిబుధ్నో న జీర్యతి దిశో హ్యస్య స్రక్తయో ద్యౌరస్యోత్తరం బిలగ్ంస ఏష కోశో వసుధానస్తస్మిన్విశ్వమిదగ్ం శ్రితమ్ ॥1॥ తస్య ప్రాచీ దిగ్జుహూర్నామ సహమానానామ దక్షిణా రాజ్ఞీ నామ ప్రతీచీ సుభూతానామోదీచీ తాసాం వాయుర్వత్సస్స య ఏతమేవం వాయుం**

**దిశాం వత్సం వేద న పుత్రరోదగ్ం రోదితి। సోఽ హమేతమేవం వాయుం దిశాం వత్సం వేద మా పుత్రరోదగ్ం రుదమ్ ॥2॥ అరిష్టం కోశం ప్రపద్యేమునాఽ మునాఽ మునా ప్రాణం ప్రపద్యేఽ మునాఽ మునాఽ మునా భూః ప్రపద్యేఽ మునా ఽ మునా ఽ మునా భువః ప్రపద్యే ఽ మునా ఽ మునా మునా స్వః ప్రపద్యేఽ మునా ఽ మునా ఽ మునా ॥3॥ స యదవోచం ప్రాణం ప్రపద్య ఇతి ప్రాణో వా ఇదగ్ం సర్వం భూతం యదిదం కించ తమేవ తత్ప్రాపత్సి॥4॥ అథ యదవోచం భూః ప్రపద్య ఇతి పృథివీం ప్రపద్యేఽ న్తరిక్షం ప్రపద్యే దివం ప్రపద్య ఇత్యేవ తదవోచమ్ ॥5॥ అథ యదవోచం భువః ప్రపద్య ఇత్యగ్నిం ప్రపద్యే వాయుం ప్రపద్య ఆదిత్యం ప్రపద్య ఇత్యేవ తదవోచమ్ ॥6॥ అథ యదవోచగ్ం స్వః ప్రపద్య ఇత్ర్యృ గ్వేదం ప్రపద్యే యజుర్వేదం ప్రపద్యే సామవేదం ప్రపద్య ఇత్యేవ తదవోచం తదవోచమ్ ॥7॥**

ఇందులో రెండు భాగాలున్నాయి. 1,2 మంత్రాలు ప్రధాన ఉపాసన గురించి చెప్తే, 3-7 మంత్రాలు ఉపాసనతో కలిపి చేయాల్సిన జపాన్ని చెప్తున్నాయి. ఉపాసన అంగీ,జపం అంగం. ఉపాసన ముఖ్యం, జపం అముఖ్యం అవుతాయి.

**మంత్రాలు 1-2:- కోశ రూపేణ విరాట్ ఉపాసన -** ఈ ఉపాసన విరాట్ ఉపాసన. ఎటువంటి విరాట్? కోశరూపంలో ఉన్న విరాట్. కోశం అంటే నిధి ఉన్న భాండాగారం. దీని ఫలం ప్రత్యేకంగా ఉంది. పుత్ర మరణ అభావ- పుత్రుని మృత్యుదోషం ఉండదు. ఎవరైనా ఎప్పుడో అప్పుడు మరణించాల్సిందే. కానీ తల్లిదండ్రుల కళ్ళముందే పుత్రులు మరణిస్తే, ఆ పుత్రశోకం భరించలేనిది. అది తప్పించటానికి ఈ ఉపాసన. అందుకని ఇక్కడ సకామ ఉపాసన గురించి చెపుతున్నది అని తీసుకోవాలి. నిష్కామ ఉపాసన చేస్తే చిత్తశుద్ధి, చిత్త వైశాల్యం, చిత్త ఏకాగ్రత కలుగుతాయి.

అంతులేని సంపద ఉన్న ఒక కుండని ఊహించుకోండి. ఆ కుండకు అడుగుభాగం భూమి, లోపలిస్థలం భువర్లోకం. కుండ మూతి భాగం సువర్లోకం. ఎంత వెడల్పుగా ఉంది కుండ? పది దిక్కులకూ వ్యాపించి ఉంది. అది ఖాళీగా ఉందా? అంతులేని నిధులతో నిండి ఉంది. ఈ కుండని

విరాట్ అనుకుంటే విరాట్ అనే కుండలో జగత్తులోని నిధులన్నీ నిండి ఉన్నాయి. ఈ విరాట్ కుండ జీవికి ఇవ్వబడింది. ఎందుకు? కర్మఫల భోగార్థం – కర్మఫలాన్ని అనుభవించటానికి.

ఉదాహరణకు చిన్న బాబు ఉన్న ఇంట్లో బోలెడు బొమ్మలుంటాయి కదా. తల్లి ఏం చేస్తుంది? ఆ బొమ్మలన్నీ ఒక పెద్ద బుట్టలో వేసి, ఆ బాబు ముందు వేస్తుంది. అతను ఆడుకున్నంతసేపు ఆడుకుని, ఆకలి వేసినప్పుడు, ఆ బొమ్మల్ని బుట్టలో వేసి, తల్లి దగ్గరకి వెళతాడు. ఇప్పుడు మనకు జగత్తు అనే బొమ్మల బుట్ట ఉంది. దానితో ఆడుకుని, ముముక్షుత్వం (ఆకలి వేసినప్పుడు) కలిగినప్పుడు, మోక్షం కోరుతూ ఉపాసన చేయాలి.

**వసుధానః –** జీవులందరూ విరాట్ అనే కుండలో ఉన్న జగత్తు అనే బొమ్మలతో ఆడుకుంటున్నారు. అటువంటి విరాట్ ఉపాసన చేయాలి. జగత్తుని వర్ణించటానికి నాలుగు దిక్కులు తీసుకుని, వాటికి పేర్లు పెట్టింది ఉపనిషత్తు. శంకరాచార్యులు చాలా వివరణ ఇచ్చారు ఈ పేర్ల వెనుక కారణాలకి.

**జుహూర్నామ–**తూర్పు దిక్కు– యజ్ఞంలో వాడే ఐదు గరిటెలకు ఐదు పేర్లు ఉన్నాయి. వాటిలో ఒక దాని పేరు జుహూ. యజ్ఞాలు ఎక్కువగా తూర్పుకు తిరిగి చేస్తారు. అందుకని యజ్ఞంలో వాడే జుహూని చూడగానే తూర్పుదిక్కు గుర్తురావాలి.

**సహమానా నామ –** దక్షిణ దిక్కు. అది యమధర్మరాజు స్థానం. యమధర్మరాజు పని ఏమిటి? జన్మ మృత్యుజరా దుఃఖాలనివ్వటం. యమ ధర్మరాజు పని బాధించటం. సహమాన అంటే బాధను అనుభవించటం.

**రాజ్ఞీ నామ –** పడమర దిక్కు. ముఖ్యదేవతా స్థానం. వరుణ దేవుడు. శక్తివంతమైన దేవత. పడమర దిక్కుకి యజమాని. అందుకే సంధ్యావందనంలో వరుణదేవుని స్తుతి వస్తుంది. నేను రోజంతా ఎన్నో చెడ్డ పనులు చేశాను. జూదం కూడా ఆడాను. నన్ను క్షమించు అని దాని సారాంశం (అంటే మళ్ళీ కొత్తగా మర్నాడు పాపాలు మొదలుపెట్టమని కాదు దాని అర్థం).

**సుభూతా నామ–** ఉత్తరదిక్కు– కుబేర స్థానం. సుభూతి అంటే ఐశ్వర్యానికి రాజైన కుబేరుడు. సుభూత్ అంటే ఐశ్వర్యం.

ఇలా అన్ని దిక్కులకూ అధిపతి అయిన విరాట్ ఉపాసన చేయటం వల్ల లాభం ఏమిటంటే, ఏదైనా పోయినా మనం బాధపడకూడదు. ఆయన ఇచ్చిన నిధులతో ఆడుకున్నాము. ఆయనే తిరిగి తీసేసుకున్నాడు అంతే.

**ఫలం–** పుత్రశోకం ఉండదు. వాయువు నాలుగు దిక్కులకూ పుత్రుడు. ఒక దిక్కునుంచి ఇంకో దిక్కుకు వీస్తాడు. ఇంకోటి వాయువు ప్రాణానికి ఆధారం. ప్రాణం జీవితానికి ఆధారం. అందువల్ల ప్రాణి ప్రాణానికి (పుత్రుని ప్రాణానికి) ఢోకా ఉండదు.

**మంత్రాలు 3–7:–** ఇంతకు ముందు చెప్పిన ఉపాసనతో కలిపి చేయాల్సిన జపం వీటిలో వస్తుంది. సకామ ఉపాసన అని చూశాము. పుత్రునికి దీర్ఘాయుష్షు కోరుతూ చేసే జపం ఇది.

**ప్రపద్యే –** శరణాగతిని కోరుతున్నాను. ఎవరి నుంచి? కోశరూప రూప విరాట్ శోకాన్ని ఇవ్వకూడదని.

శరణాగతి ఒక్క విరాట్ నుంచే కాదు. ఐదుగురి నుంచి కోరుతున్నాను.

**విరాట్, ప్రాణం, భూః, భువః, సువః.**

భూః, భువః, సువః అంటే మామూలుగా మనం చూసే భూలోక, భువర్లోక, సువర్లోకాలు కావు. ఆ మూడు లోకాలూ ఒక్క భూపదంలోనే వచ్చేస్తాయి.

**భూః** – భూలోక, భువర్లోక, సువర్లోకాలు– మూడు లోకాలు

**భువః** – అగ్ని, వాయువు, ఆదిత్యుడు – ముగ్గురు దేవతలు

**సువః** – ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం – మూడు వేదాలు

విరాట్, ప్రాణం, మూడు లోకాలు,ముగ్గురు దేవతలు, మూడు వేదాల నుంచి రక్షణ కోరుకుంటున్నాము. ఎవరికి?

**అమునా –** అమునా అంటే ఖాళీ. అక్కడ మన పుత్రుల పేర్లు మనం నింపుకోవాలి. ఉదాహరణకు మీ పుత్రుని పేరు కృష్ణ అయితే (అన్నింటికీ శర్మ కలుపుకోవాలి) కృష్ణ శర్మనా ప్రపద్యే అని మూడుసార్లు పఠించాలి.అతని కోసం మీరు చేస్తున్నారు కాబట్టి ఫలం బలంగా ఉండటానికి మూడుసార్లు పేరు పఠిస్తారు. పుత్రునికి దీర్ఘాయుష్షు కావాలని చేసే జపం ఇది.

**తదవోచమ్ –** విరాట్ ఉపాసనతో కలిపి ఈ జపాన్ని చేయాలి.

## ఖండాలు 16,17

**పురుష యజ్ఞకల్పన.** ఖండాలు 16,17లలో పురుష యజ్ఞకల్పన గురించి వస్తుంది. పురుష అంటే ఆత్మ కాదు. శరీరం. శరీరాన్ని కార్యకరణ సంఘాతం అంటారు. దీనికి ఫలం పురుషస్య దీర్ఘాయుష్య ప్రాప్తి. ఖండం15లో పుత్రునికి దీర్ఘాయుష్య ప్రాప్తి కోసం ప్రార్థన. పిల్లలు ప్రయోజకులయి బాగా పేరు ప్రఖ్యాతులు పొందితే, వాళ్ళ కీర్తిప్రతిష్ఠలు చూసి మురిసిపోవటానికి పెద్దలు కూడా దీర్ఘాయుష్షుతో ఉండాలని కోరుకుంటారంటారు.

### షోడశ ఖణ్డః (16)

**పురుషో వావ యజ్ఞః। తస్య యాని చతుర్విగ్ంశతి వర్షాణి తత్ప్రాతస్సవనం। చతుర్విగ్ంశత్యక్షరా గాయత్రీ గాయత్రం ప్రాతస్సవనం తదస్య వసవోఽన్వాయత్తాః। ప్రాణా వావ వసవ ఏతే హీదగ్ం సర్వం వాసయన్తి ॥1॥ తం చేదేతస్మిన్వయసి కించిదుపతపేత్స బ్రూయాత్ప్రాణా వసవ ఇదం మే ప్రాతస్సవనం మాధ్యన్దినగ్ం సవనమనుసన్తనుతేతి మాఽహం ప్రాణానాం వసూనాం మధ్యే యజ్ఞో విలోప్సీయేత్యుద్ధైవ తత ఏత్యగదో హ భవతి॥2॥ అథ యాని చతుశ్చత్వారిగ్ంశద్వర్షాణి తన్మాధ్యన్దినగ్ం సవనం చతుశ్చత్వారిగ్ంశదక్షరా త్రిష్టుప్త్రైష్టుభం మాధ్యన్దినగ్ం సవనం తదస్య రుద్రా అన్వాయత్తాః ప్రాణా వావ రుద్రా ఏతే హీదగ్ం సర్వగ్ం రోదయన్తి ॥3॥ తం చేదేతస్మిన్వయసి కించిదుపతపేత్స బ్రూయాత్ప్రాణా రుద్రా ఇదం మే మాధ్యన్దినగ్ం సవనం తృతీయసవనమనుసన్తనుతేతి మాఽహం ప్రాణానాగ్ం రుద్రాణాం మధ్యే యజ్ఞో విలోప్సీయేత్యుద్ధైవ తత ఏత్యగదో హభవతి॥4॥ అథ యాన్యష్టాచత్వారిగ్ంశద్వర్షాణి తత్తృతీయసవనమష్టాచత్వారిగ్ం శదక్షరా జగతీ జాగతం తృతీయ సవనం తదస్యాదిత్యా అన్వాయత్తాః ప్రాణావావాదిత్యా ఏతే హీదగ్ం సర్వమాదదతే ॥5॥ తం చేదేతస్మిన్వయసి కించిదుపతపేత్స బ్రూయాత్ప్రాణా ఆదిత్యా ఇదం మే తృతీయసవన మాయురనుసన్తనుతేతి మాఽహం ప్రాణానామాదిత్యానాం మధ్యే యజ్ఞో విలోప్సీయేత్యుద్ధైవ తత ఏత్యగదో హ భవతి। ॥6॥ ఏతద్ధ స్మ వై తద్విద్వానాహ మహిదాస ఐతరేయస్స కిం మ ఏతదుపతపసి యోఽహమనేన ప్రేష్యామీతి సహ షోడశం వర్షశతమజీవత్ప్ర హ షోడశం వర్షశతం జీవతి య ఏవం వేద ॥7॥**

ఈ ఖండం మొత్తం జీవితాన్ని ఒక యజ్ఞంలాగా ఎలా చూడాలో చెపుతున్నది. జీవితాన్ని మూడు భాగాలుగా విభజించింది ఉపనిషత్తు. ఎందుకంటే వైదిక జీవితం గడిపే ప్రతివ్యక్తి నిత్యపూజలు మూడుసార్లు చేయాలి.మూడు సంధ్యల్లో మూడు ప్రార్థనలు చేయాలి. వాటిని ప్రాతఃసంధ్య, మాధ్యందిన సంధ్య, సాయంసంధ్య అంటారు. ఆయా సంధ్యల్లో చేసే ప్రార్థనను సవనం అంటారు.అంటే ప్రాతః సవనం, మాధ్యందిన సవనం, సాయం సవనం అంటారు. ఉదాహరణకు సంధ్యావందనం ఈ మూడు సంధ్యల్లోనూ చేయాలి. అవి చేసేముందు స్నానం చేయాలి.అందుకని దాన్ని త్రిషవణ స్నానం అంటారు.

ఉపనిషత్తు జీవితాన్ని మూడు సవనాలతో పోల్చి, వాటిని ఒక్కొక్క ఛందస్సుతో పోల్చింది. ఆ ఛందస్సుకు ఉన్న అక్షరాల సంఖ్య సంవత్సరాల సంఖ్య అవుతుంది. ఒక్కొక్క ఛందస్సుకు ఒక్కొక్క అధిష్ఠాన దేవత ఉంటుంది. ఈ మూడు ఛందస్సులు సంధ్యావందనంలో వస్తాయి.

**పురుష యజ్ఞ కల్పన**

| జీవితకాలం | సం॥ | సవనం | చంధస్సు | సంఖ్యలు | దేవత |
|---|---|---|---|---|---|
| 1-24 | 24 | ప్రాతఃసవనం | గాయత్రీ | 24 | వసువు |
| 25-68 | 44 | మాధ్యందినం | త్రిష్టుప్ | 44 | రుద్రుడు |
| 69-116 | 48 | సాయం | జగతీ | 48 | ఆదిత్యుడు |

ఇటువంటి కల్పన చేయటం వల్ల జీవితం మీద ఒక పవిత్ర భావన ఏర్పడుతుంది.

ఒక్కో ఛందస్సుకు ఆయా దేవతలు ఎందుకు అన్నది ఉపనిషత్తు చెప్పలేదు కాని శంకరాచార్యులు వివరణ ఇచ్చారు. జీవితానికి షడ్వికారాలు ఉన్నాయి. అవి అస్తి, జాయతే, వర్థతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి.

1-24 సంవత్సరాల్లో అస్తి, జాయతే, వర్థతే- ఈ సంవత్సరాల్లో ఉత్సాహంతో ఉరకలు వేస్తుంటాము. వసువు అలా ఉరకలు వేయిస్తుంటాడు.

**వాసయతి ఇతి వసుః**

25-68 సంవత్సరాల్లో విపరిణమతే - అపక్షీయతే - ఈ సంవత్సరాల్లో మార్పులు ఏర్పడి,ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తూ వస్తుంది. నడుము నెప్పి, కీళ్ళనొప్పులు, మధుమేహం, రక్తపోటు లాంటి వ్యాధులు

నెమ్మదిగా చోటు చేసుకుంటాయి. రుద్రుడు ఏడిపిస్తాడు.

**రోదయతి ఇతి రుద్రః**

69–116 సంవత్సరాల్లో వినశ్యతి. మృత్యువుని సమీపిస్తాము. అన్నీ సర్దుకుని ప్రయాణం అయినట్టుగా, అంతిమ ప్రయాణానికి సిద్ధం కావాలి. ఆదిత్యుడు తన సమీపానికి పిలుస్తాడు.

**ఆదత్తే స్వసమీపం ఇతి ఆదిత్యః**

శాస్త్రం ప్రకారం మనిషి పరిపూర్ణ ఆయుర్దాయం 116 సంవత్సరాలు. అందుకని ఈ 116 సంవత్సరాల జీవిత యజ్ఞం నిర్విఘ్నంగా కొనసాగాలంటే ఆయా దేవతలకు ప్రార్ధన చేయాలి.

**మా విలోప్సీయ –** ఏ వయస్సులో ఆరోగ్య సమస్య వస్తే ఆ వయస్సులోని అధిష్టాన దేవతకు ప్రార్ధన చేసి, నా యజ్ఞానికి ఆటంకం రానీయకు అని కోరాలి.

**అనుసంతనుత –** తర్వాత దశకి తీసుకువెళ్ళు అని వసువుకు, రుద్రునికి పూజ చేయాలి, ఆయా దశల్లో చివరిదశలో ఆదిత్యకు నన్ను ఈ యజ్ఞాన్ని సక్రమంగా నిర్వర్తించేలా చేయమని ప్రార్థించాలి. ఆరోగ్యం అన్నది భోగం కోసం కాదు, యజ్ఞం కోసం. మరిన్ని వివరాలు తరువాతి ఖండంలో చూస్తాము. అందుకని దీర్ఘాయుష్య ప్రాప్తి కోసం ప్రార్ధన చేయాలి.

**మంత్రం 6 – ఫలశ్రుతి–** ఐతరేయ మహిదాస ఋషి ఉదాహరణ ద్వారా వస్తుంది. తనకెప్పుడు ఆరోగ్య సమస్య వచ్చినా ఈ ఋషి ఆయా దేవతలకు ప్రార్థన చేశాడట. అఘద అంటే మందు. ఈ ప్రార్థనే గొప్ప మందు.

**స కిం మ ఏతదుపతపసి –** అనారోగ్యానికి సవాలు విసిరాడట, నన్నేం చేయగలరు మీరు అని.

**షోడశం వర్షశతం –** షోడశ అంటే 16, శతం అంటే 100; షోడశం వర్షశతం అంటే 1600 అనకూడదు. 116 సంవత్సరాలు జీవించాడు అతను.

116 సంఖ్య అంత ముఖ్యమైనది కాబట్టే మనవాళ్ళు డబ్బు కానుకగా ఇవ్వాలంటే, 116, 1116 అలా ఇస్తారు. ఈ ఉపాసన మహిదాసుని 116 సంవత్సరాలు జీవింపచేస్తే, వారికి ఎవరు చేస్తే కూడా దీర్ఘాయుష్షు కలుగుతుంది.

## సప్తదశః ఖణ్డః (17)

**స యదశిశిషతి యత్పిపాసతి యన్న రమతే తా అస్య దీక్షాః ॥1॥ అథ యదశ్నాతి యత్పిబతి యద్రమతే తదుపసదైరేతి ॥2॥ అథ యద్ధసతి యజ్జక్షతి యన్మైథునం చరతి స్తుతశస్త్రైరేవ తదేతి ॥3॥ అథ యత్తపో దానమార్జవమహిగ్ంసా సత్యవచనమితి తా అస్య దక్షిణాః ॥4॥ తస్మాదాహు స్సోష్యత్యసోష్టేతి పునరుత్పాదనమేవాస్య తన్మరణమేవాస్యావభృథః ॥5॥ తద్ధైతద్ఘోర ఆంగిరసః కృష్ణాయ దేవకీపుత్రాయోక్త్వోవాచాఽపిపాస ఏవ స బభూవ। సోఽన్తవేలాయామేతత్త్రయం ప్రతిపద్యేత। అక్షితమస్యచ్యుతమసి ప్రాణశగ్ంశితమసీతి తత్రైతే ద్వే ఋచౌ భవతః ॥6॥ ఆదిత్ప్రత్నస్య రేతసః ఉద్వయం తమసస్పరిజ్యోతిః పశ్యన్త ఉత్తరగ్ం స్వః పశ్యన్త ఉత్తరం దేవం దేవత్రా సూర్యమగన్మజ్యోతిరుత్తమమితి జ్యోతిరుత్తమమితి ॥7॥**

పురుష యజ్ఞ కల్పనలో రెండో భాగం. ఎందుకు జీవితాన్ని యజ్ఞంతో పోల్చిందో చెప్పటానికి కొన్ని వివరాలనిస్తున్నది ఉపనిషత్తు. ఏవైనా రెండు వస్తువులను ఒకదానితో ఒకటి పోల్చినప్పుడు రెండింటికీ మధ్య కొన్ని సమాన లక్షణాలు ఉండాలి. ఇక్కడ ఐదు లక్షణాలు పేర్కొన్నది.

**మంత్రం-1:- అస్య దీక్షా:-** ఒక యజ్ఞం చేయాలంటే కొన్ని కఠిన నియమాలు పాటించాల్సి ఉంటుంది.

**యదశిశిషతి** - ఆకలి అనుకోకూడదు.

**యత్పిపాసతి** - దాహం అనుకోకూడదు;

**యన్నరమత** - ఆరోగ్యం గురించి బాధపడకూడదు. యజ్ఞం చేసే మొదటిరోజు దీక్ష తీసుకోవాలి. మొదట కొన్ని రోజులు అన్నపానీయాలు తీసుకోకూడదు. నేలమీద పడుకోవాలి. అగ్నిహోమం ఎదురుగుండా గంటలకొద్దీ కూర్చోవాలి. వేడి అని బాధపడకూడదు. యజ్ఞశాల నుంచి బయటకు వెళ్ళకూడదు. ఏ నియమం తీసుకున్నా అసౌకర్యమే కలుగుతుంది శరీరానికి. ఆలస్యంగా లేచే అలవాటున్న వ్యక్తి పొద్దున్నే లేవాలంటే అవస్థే.

కాని యజ్ఞం చేసే వ్యక్తి తను ఇష్టపూర్వకంగా చేస్తున్నాడు కాబట్టి ఈ అవస్థలను ఇష్టంగా భరిస్తాడు. **కష్ట సహిష్ణుత్వం తపః.** కష్టాన్ని ఓర్చుకోవటం తపస్సు. ఉదాహరణకు ఉపవాసం చేసేరోజు, ఆ ఉపవాసానికి అలవాటు

పడిపోతే, ఆకలి వేయదు. అదే అనుకోకుండా తిండి దొరక్కుండా మాడాల్సిన రోజు చాలా అవస్థపడిపోతాము.

ఇప్పుడు ఇలా జీవితాన్ని యజ్ఞంగా పోల్చటం నేర్చుకున్నాక, ఏ ప్రయాణంలోనో తిండి దొరక్కపోతే బాధపడకుండా దాన్ని ఉపవాసంగా భావించుకోవాలి. అలాగే ఎండాకాలంలో తాపాన్ని భరించలేనప్పుడు దాన్ని తపస్సుగా తీసుకోవాలి. అలాగని ఏసీ వేసుకోవద్దు. ఫ్యాను కింద కూర్చోవద్దు అనదు శాస్త్రం. అవేవీ లేని పరిస్థితి వస్తే, తిట్టుకోకుండా దీక్షాకాలంగా, తపస్సుగా భావించగలగాలి. అంటే జీవితంలో బాధామయ రోజులు, దీక్షాకాలంతో సమానం.

**మంత్రం-2 -యదశ్నాతి యత్పిబతి యద్రమతే-** యజ్ఞంలో మొదటి రోజు లేదా రోజులు కష్టంగా ఉంటాయి కాని, తర్వాతరోజుల్ని ఉపసత్ దినాని అనీ, ఆ హెూమాన్ని ఉపసత్ హెూమా అనీ అంటారు. అంటే ఆ రోజుల్లో అన్న పానీయాల నియమ విషయాలలో కొంచెం సడలింపు ఉంటుంది. ఎంతైనా పాలు త్రాగవచ్చు. అందుకని దీన్ని పయోవ్రతం అని కూడా అంటారు.

అలాగే మన జీవితంలో కొన్ని రోజులు ఆడుతూ, పాడుతూ సాగుతాయి. బాగా తిని, తాగి ఆనందంతో కేరింతలు కొడతాము. అలాంటి రోజులని **ఉపసత్ వ్రతం** రోజులు అనుకోవాలి. ఎంత అందమైన కల్పనో చూడండి!

**మంత్రం 3:- స్తుతశస్త్రం-** యజ్ఞం చేసేటప్పుడు దేవతలను స్తుతిస్తాము. ఆ ప్రార్థనరెండు రకాలుగా ఉంటుంది. సామవేదాన్ని గానం చేస్తారు. దాన్ని స్తుతి అంటారు. ఋగ్వేదాన్ని పఠిస్తారు. దాన్ని శస్త్రం అంటారు. వేదపఠనం ఒంటరిగా చేయరు. కొంతమంది కలిసి చేస్తారు. అందుకే దాన్ని వేదఘోష అంటారు. సందడిగా ఉంటుంది. ఈ దశలో నవ్వుతారు, తింటారు, నలుగురితో కలుస్తారు.

జీవితంలో కూడా కొన్ని ఆనందకర సన్నివేశాలు ఉంటాయి. స్నేహితులు, బంధువులు అందరూ కలిసి ఆనందంగా వేడుకలు జరుపుకుంటారు. ఆ రోజులని స్తుతశస్త్రంతో పోల్చవచ్చు.

**మంత్రం-4:-** ఏ యజ్ఞం చేసినా బ్రాహ్మణులకు దక్షిణ ఇవ్వకుండా యజ్ఞం

పూర్తికాదు. దానం వేరు, దక్షిణ వేరు. యజ్ఞంలో ఇచ్చేదాన్ని దక్షిణ అంటారు. దానం అంటే యజ్ఞం బయట చేసేది.

దక్షిణ ఇచ్చేటప్పుడు కొంత సొమ్ము నష్టపోయినట్టు వ్యావహారికంగా అనిపించినా, నిజానికి అది పుణ్యాన్ని తెస్తుంది. లౌకిక బ్యాంకులో డబ్బు తగ్గుతుంది. ఆధ్యాత్మిక బ్యాంకులో పుణ్యం ప్రోగవుతుంది.

జీవితంలో కూడా మంచి విలువలను పాటించాలి. వాటిని పాటించటం కష్టంగా అనిపించినా, అవి మన అదృష్ట ఫలాన్ని పెంచుతాయి. ఇక్కడ కొన్ని విలువలను చెప్పింది ఉపనిషత్తు. అవి తపస్సు, దానం, ఆర్జవం (ఋజువర్తనం), అహింస, సత్యవచనం. వీటిని దక్షిణతో పోల్చింది.

**మంత్రం 5:- మరణమేవాస్యావభృథః -** యజ్ఞం అంతా చేసి ముగిశాక, ముఖ్య బ్రాహ్మణుడు యాగశాలని దగ్ధం చేసి, వెనక్కి తిరిగి చూడకుండా అక్కడ్నుంచి వెళ్ళి- సమీపంలో ఉన్న నదిలోనో, సెలయేరులోనో స్నానం చేయాలి. ఆ స్నానాన్ని అవభృథః అంటారు.

ఒక వ్యక్తి జీవిత కాలమంతా ఒక యజ్ఞంలాగా గడిపాక, అతను మరణించినప్పుడు అతనికి అంతిమ స్నానం చేయిస్తారు. అందుకని మరణమే అవభృథ స్నానం.

జీవితాన్ని యజ్ఞంతో పోల్చటానికి ఐదు కారణాలు చెప్పాక ఉపనిషత్తు ఒక అద్భుతమైన వ్యాకరణ కారణం కూడా చెపుతున్నది.

**ధాతువు సు-** ధాతువు సు నుంచి **సునోతి** పదం వచ్చింది. సునోతి అంటే సోమయాగం చేయటం. సోమ అనే తీగ నుంచి సోమరసాన్ని తీయటం. సోమరసాన్ని తీయటాన్ని సవనం అంటారు. సవనం సోమ యజ్ఞానికి తీస్తారు కాబట్టి సవనం అంటే సోమయాగం.

**ధాతువు సూ -** సూ నుంచి **సూయతే** పదం వస్తుంది. సూయతే అంటే జన్మనివ్వటం. ప్రసవః అంటే మనిషికి జన్మనివ్వటం.

**సనోష్యతి -** సునోతి, సూయతే - రెండుపదాలకు భవిష్యకాలంలో పదం ఒకటే. అది **సనోష్యతి-** యజ్ఞం చేస్తారు. మనిషికి జన్మనిస్తారు అని రెండు అర్థాలు వస్తాయి. అందువల్ల సోష్యతి పదాన్ని యజ్ఞానికీ, మనిషి జన్మకీ సమానంగా వాడుతారు కాబట్టి యజ్ఞం = మనిషి

**అసోష్ట - సునోతి, సూయతే** రెండుపదాలకూ భూతకాలంలో పదం ఒకటే.

అది అసోష్ట. యజ్ఞం చేశారు.మనిషి పుట్టాడు. అందువల్ల అసోష్ట పదాన్ని యజ్ఞానికీ, మనిషి జన్మకీ సమానంగా వాడుతారు కాబట్టి మళ్ళీ

యజ్ఞం = మనిషి.

**ఫలం –** దీర్ఘాయుష్షు కలుగుతుంది. జీవితం మీద పూజ్యభావం ఏర్పడి, విలువలకి ప్రాముఖ్యత ఇస్తారు.

**మంత్రం–6:–** ఈ జ్ఞానాన్ని ఎవరు పొందారు? గురువు ఘోర అంగిరస నుంచి దేవకీపుత్రుడైన శ్రీకృష్ణభగవానుడు పొందాడు. కృష్ణుడు నేర్చుకోవటమేమిటి? అప్పుడు ఘోర అంగీరసుడు ఉన్నాడా లాంటి ప్రశ్నల్లోకి వెళ్ళకూడదు. ఇది ప్రమాణం అని తెలుసుకుని, నేర్చుకోవటం ముఖ్యం.

జీవితమంతా ఒక యజ్ఞంలాగా జీవించాక, మరణకాలంలో ఏం చేయాలి?

**అక్షితమస్యచ్యుతమసి ప్రాణశగ్ంశితమసి –**

**అక్షితమసి –** ఓ దేవా నీవు క్షర రహితుడవు.

**అచ్యుతమసి –** ఓ దేవా నీవు నాశన రహితుడవు.

**ప్రాణసంశితం –** ఓ దేవా నీవు సూక్ష్మప్రాణ రూపంలో ఉన్నావు.

దేవుడిని ప్రాణతత్త్వంగా కొలుస్తున్నాము. జీవితమంతా ఒక యజ్ఞంలాగా గడిపినప్పుడు, మన అంతిమ లక్ష్యం భగవానుడే అవాలి కదా!

ఈ భాగాన్ని చూపించే రెండు ఋగ్ మంత్రాలను చెపుతున్నది ఉపనిషత్తు. సూర్యభగవానుడిని చూస్తూ సంధ్యావందనంలో చేసే ప్రార్థనలాంటిది ఇది కూడా.

నా నూరేళ్ళ జీవితంలో నేనేం చేయాలి?

| | | |
|---|---|---|
| **పశ్యేమ శరదశ్శతం** | – | నేను చైతన్య బ్రహ్మకు ప్రతీక అయిన సూర్యభగవానుని చూడుగాక. |
| **జీవేమ శరదశ్శతం** | – | నేను నూరేళ్ళు జీవించుగాక. |
| **నందామ శరదశ్శతం** | – | నేను నూరేళ్ళూ ఆనందించు గాక. |
| **మోదామ శరదశ్శతం** | – | నేను నూరేళ్ళూ సంతోషం పొందు గాక. |
| **భవామ శరదశ్శతం** | – | నేను నూరేళ్ళూ హాయిగా జీవించు గాక. |
| **శ్రుణుయామ శరదశ్శతం** | – | నేను నూరేళ్ళూ మంచి విషయాలు వింటాను గాక. |

**ప్రభవామ శరదశ్శతం** - నేను నూరేళ్ళూ చెడు విషయాల గురించి మాట్లాడకుండు గాక.
**అది లేశ్యామ శరదశ్శతం** - నూరేళ్ళూ కామక్రోథాలు నన్ను జయించకుండు గాక.
**సూర్యమగన్మజ్యోతి** - నేను సూర్యుడిని పొందుగాక.

సూర్యుడిని చూస్తూ చేసే ప్రార్థన అంటే అక్షరాలా సూర్యునికేసే చూస్తూ ఉండాలని కాదు. బ్రహ్మతత్త్వం లేదా ఈశ్వర తత్త్వాన్ని సూర్యుని ద్వారా నిరంతరం తలుచుకుంటూ ఉండాలి.

**తస్మాత్ సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ - గీత 8 -7**

ఇది సంధ్యావందనం సారాంశం. ఇక్కడ ఋగ్మంత్రంలో అదే అర్థం ఇంకో రూపంలో.

**మంత్రం-7:-** ఇక్కడ ఋగ్ మంత్రంలోని మొదటి పాదమే ఉంది. తక్కిన రెండు పాదాలూ మనం కలుపుకోవాలి.

**ఆదిత్ప్రత్నస్య రేతసః**
**జ్యోతిః పశ్యన్తి వాసరం**
**పరోయదిధ్యతే దివి**

**రేతసః** అంటే జగత్కారణం బ్రహ్మ లేదా ఈశ్వరుదు. **దివి** అంటే మామూలుగా స్వర్గం. ఇక్కడ స్వర్గానికి అతీతంగా ఉన్నాదు. **పశ్యన్తి** అంటే తెలివైనవాళ్ళు నిరంతరం చూస్తారు. ఎవరిని? నిర్గుణ బ్రహ్మ అనే అనుకోనవసరం లేదు. సగుణ బ్రహ్మకూడా తీసుకోవచ్చు. తెలివైన వారు అంటే జీవితాన్ని ఒక యజ్ఞంలాగా భావించేవాళ్ళు.

ఇంకో ఋగ్ మంత్రం. దీని సారాంశం కూడా ఇదే.

**జ్యోతిరుత్తమం** - చైతన్యం ఉత్తమమైన జ్యోతిస్వరూపం.
**దేవం దేవత్రా** - దేవతలలోనూ
**స్వః** - నాలోనూఉంది.

**స యశ్చాయం పురుషే యశ్చాసావాదిత్యే స ఏకః। - తైత్తిరీయం**

**సూర్యమగన్మ -** ఆ జ్యోతి స్వరూపాన్ని నిరంతరం చూడటం వల్ల (దాని గురించి ఉపాసన చేయటం వల్ల) నేను బ్రహ్మను అవుగాక. అవుగాక అంటే అహం బ్రహ్మస్మి అని తెలుసుకోవాలి గాక.

ఈ మంత్రాలకూ జీవితాన్ని యజ్ఞంలాగా చేయటానికీ ఏమిటి సంబంధం? నిరంతరం దేవుడిని తలచుకోవటం అంటే జీవితాన్ని యజ్ఞంలాగా చేయటం.

**సంపదో నైవ సంపదః విపదో నైవ విపదః।**
**విపద్ విస్మరణం విష్ణోః సంపద్ సంస్మరణం హరేః॥**

సంపద అంటే ఐశ్వర్యం. విపత్తు అంటే పేదరికం.కాని శాస్త్రం ప్రకారం అది కాదు అర్థం. విష్ణుమూర్తిని మర్చిపోవటం విపత్తు. విష్ణుమూర్తిని నిరంతరం తలచుకోవటం సంపద.

అందుకని సూర్యభగవానుడిని నేను గుర్తుంచుకుని, నా జీవితాన్ని యజ్ఞంలా మలచుకునేలా చేయి.

**అష్టాదశః ఖణ్డః (18)**

**మనో బ్రహ్మేత్యుపాసీతేత్యధ్యాత్మమథాధిదైవతమాకాశో బ్రహ్మేత్యుభయమాదిష్టం భవత్యధ్యాత్మం చాధిదైవతం చ ॥1॥ తదేతచ్చతుష్పాద్బ్రహ్మ। వాక్పాదః ప్రాణః పాదశ్చక్షుః పాదశ్శ్రోత్రం పాద ఇత్యధ్యాత్మమ్। అథాధిదైవతమగ్నిః పాదో వాయుః పాద ఆదిత్యః పాదో దిశః పాద ఇత్యుభయమేవాదిష్టం భవత్యధ్యాత్మం చైవాధిదైవతం చ ॥2॥ వాగేవ బ్రహ్మణశ్చతుర్థః పాదస్సోఽగ్నినా జ్యోతిషా భాతి చ తపతి చ। భాతి చ తపతి చ కీర్త్యా యశసా బ్రహ్మవర్చసేన య ఏవం వేద ॥3॥ ప్రాణ ఏవ బ్రహ్మణశ్చతుర్థః పాదః స వాయునా జ్యోతిషా భాతి చ తపతి చ। భాతి చ తపతి చ కీర్త్యా యశసా బ్రహ్మవర్చసేన య ఏవం వేద ॥4॥ చక్షురేవ బ్రహ్మణశ్చతుర్థః పాదః స ఆదిత్యేన జ్యోతిషా భాతి చ తపతి చ భాతి చ తపతి చ కీర్త్యా యశసా బ్రహ్మవర్చసేన య ఏవం వేద ॥5॥ శ్రోత్రమేవ బ్రహ్మణశ్చతుర్థః పాదః స దిగ్భిర్జ్యోతిషా భాతి చ తపతి చ। భాతి చ తపతి చ కీర్త్యా యశసా బ్రహ్మవర్చసేన య ఏవం వేద య ఏవం వేద ॥6॥**

**ఖండాలు 18,19:-** మళ్ళీ బ్రహ్మ ఉపాసనే. ఇది ప్రతీక బ్రహ్మ ఉపాసన. ఇంతకు ముందు చూసినట్టుగా మన ఆలయాల్లో చేసేది ప్రతీక ఉపాసన. బ్రహ్మ కనబడదు. ప్రతీక కనిపిస్తుంది. అందుకని కనపడే ప్రతీక మీద బ్రహ్మను ఆవాహన చేసి, దాని తర్వాత నుంచి ప్రతీకకి పూజ చేస్తాము ఆలయాల్లో. పూజ, అభిషేకం, అలంకారం అన్నీ రాతి విగ్రహానికి చేస్తాము.

ప్రతీక ఉపాసనలు రెండు చెపుతున్నది ఉపనిషత్తు.

**ఆధ్యాత్మ బ్రహ్మ ప్రతీక ఉపాసన**

**ఆధిదైవ బ్రహ్మ ప్రతీక ఉపాసన**

ఈ రెండింటిలో ప్రతీక మారుతుంది కాని బ్రహ్మ ఒకటే.

**మంత్రం-1 –** ఈ మంత్రం ఈ రెండు ఉపాసనలను పరిచయం చేస్తున్నది.

**మనోబ్రహ్మేత్యుపాసీతేతి** –ఇది ఆధ్యాత్మ ఉపాసన. మనసుమీద బ్రహ్మను ఆవాహన చేస్తాము. దానివల్ల మనసుని గౌరవించటం నేర్చుకుంటాము. మనసు రాగద్వేషాలతో నిండి ఉండవచ్చుగాక, దానిమీద బ్రహ్మను ఆవాహన చేయటం వల్ల నికృష్ఠ వస్తువు కాస్తా ఉత్కృష్ఠబ్రహ్మ అవుతుంది. రాయి జడం, అది నన్ను దీవించలేదు అని తెలిసి కూడా దానికి ఎందుకు మొక్కుతాము? ఆ రాయిలో భగవంతుడిని ఆవాహన చేశాము కాబట్టి.

**ఆకాశో బ్రహ్మేతి ఉపాసీత –** ఇది ఆధి దైవ ఉపాసన. ఇక్కడ ఆకాశం అని అన్నా, ఖండం – 19లో ఆకాశంలో ఉన్న సూర్యుడిని బ్రహ్మగా ఉపాసన చేయమని చెప్తోంది.

**మంత్రం-2 –** ఆధ్యాత్మ. ఆధిదైవ ఉపాసనల గురించిన వివరణ వస్తుంది ఈ మంత్రంలో. బ్రహ్మను చతుష్పాద బ్రహ్మ అంటారు తరచు. ఈ ఉపనిషత్తులోనే గాయత్రీ బ్రహ్మ ఉపాసన చూసినప్పుడు ఈ పదం వచ్చింది. మాండూక్య ఉపనిషత్తులో కూడా వస్తుంది.

| ఉపాసన | పాదాలు |
|---|---|
| **ఆధ్యాత్మ ఉపాసన** | వాక్కు, ప్రాణం, శ్రోత్రం, చక్షువు |
| **ఆధిదైవ ఉపాసన** | అగ్ని, వాయు, దిశ, ఆదిత్య |

ఆధ్యాత్మ ఉపాసన వ్యష్టిపరంగా కాబట్టి, వ్యష్టిలోని నాలుగు ముఖ్య అంగాలను తీసుకుంది. ఆధిదైవ సమష్టిపరంగా కాబట్టి, సమష్టిలోని నాలుగు ముఖ్య దేవతలను తీసుకుంది. అంతేకాదు వ్యష్టిపరంగా ఉన్న అంగాలకు సమష్టిపరంగా ఉన్న దేవతలు అధిష్టాన దేవతలని తత్త్వబోధలో చూశాము. అంటే వాక్కుకి అగ్ని; ప్రాణానికి వాయువు; శ్రోత్రానికి దిశలు; చక్షువుకి ఆదిత్య అధిష్టాన దేవతలు.

**మంత్రాలు 3-6 -** ఇదే భావాన్ని విపులంగా చెపుతాయి. ఉపాసన ఫలం కూడా వస్తుంది. ఒకే బ్రహ్మను రెండు స్థాయిల్లో చూపిస్తున్నది ఉపనిషత్తు. వ్యష్టిపరంగా నాలుగు పాదాలు, సమష్టిపరంగా నాలుగు పాదాలు చూశాము. సమష్టి దేవతల దీవెనల వల్ల వ్యష్టి పనిచేస్తుంది.

**భాతి చ తపతి చ -**అగ్ని వల్ల వాక్కు ప్రకాశిస్తుంది అంటే పనిచేస్తుంది. వాయువు వల్ల ప్రాణం, ఆదిత్య వల్ల చక్షువు, దిశ వల్ల శ్రోత్రం ప్రకాశిస్తున్నాయి. పనిచేస్తున్నాయి. తైత్తిరీయ ఉపనిషత్తులో పాంక్త బ్రహ్మ ఉపాసనలో ఇదే విషయం చూశాము. అంటే వ్యష్టి సమష్టి వల్ల ఎలా పనిచేస్తున్నదో చూశాము.

**ఫలం - కీర్త్యా యశసా బ్రహ్మవర్చసేన-** బాగా పేరు పొందుతాడు. కీర్తి, యశస్సు రెండూ ఒకటే అర్థం అయినా దానికి చిన్న వ్యత్యాసం ఉంది. కీర్తి అంటే మనం లేనప్పుడు పొగడటం. యశస్సు అంటే మన ఎదురుగా పొగడటం. ఎదురుగా ఉండగా పొగడ్త అందరం పొందుతాము కాని మనం ఎదురుగా లేనప్పుడు కూడా పొగడ్త పొందటం గొప్ప విషయం. బ్రహ్మవర్చస్సు అంటే తేజస్సు.

## ఏకోనవింశః ఖణ్డః (19)

**ఆదిత్యో బ్రహ్మేత్యాదేశస్తస్యోపవ్యాఖ్యానమసదేవేదమగ్ర ఆసీత్। తత్సదాసీత్తత్సమభవత్తదాణ్డం నిరవర్తత తత్సంవత్సరస్య మాత్రామశయత తన్నిరభిద్యత తే ఆణ్డకపాలే రజతం చ సువర్ణం చాభవతామ్ ॥1॥ తద్యద్రజతగ్ం సేయం పృథివీ యత్సువర్ణగ్ం సా ద్యౌర్యజ్జరాయు తే పర్వతా యదుల్బగ్ం స మేఘో నీహారో యా ధమనయస్తా నద్యోయద్వాస్తే యముదకగ్ం స సముద్రః ॥2॥ అథ యత్తదజాయత సోఽసావాదిత్యస్తం జాయమానం ఘోషా ఉలూలవోఽనూదతిష్ఠన్సర్వాణి చ భూతాని సర్వే చ కామాః। తస్మాత్తస్యోదయం ప్రతి ప్రత్యాయనం ప్రతి ఘోషా ఉలూలవోఽనూతిదష్ఠన్తి సర్వాణి చ భూతాని సర్వే చ కామాః ॥3॥ స య ఏతమేవం విద్వానాదిత్యం బ్రహ్మేత్యుపాస్తే అభ్యాశో హ యదేనగ్ం సాధవో ఘోషా ఆ చ గచ్ఛేయురుప చ నిమ్రే దేరన్నిమ్రే దేరన్ ॥4॥**

**ఆధిదైవ బ్రహ్మ ఉపాసన**

**మంత్రం 1–** ముందు ఖండంలో కూడా ఆధ్యాత్మ ఉపాసనతో కలిపి ఆధిదైవ బ్రహ్మ ఉపాసన గురించి చెప్పింది ఉపనిషత్తు. ఇప్పుడు ఆధిదైవ బ్రహ్మ ఉపాసన గురించి చూస్తాము. ప్రతీక ఉపాసన గురించి చెప్పటానికి శంకరులవారు, తక్కిన ఆచార్యులు కూడా, 18,19 ఖండాల గురించి తరచు చెప్తుంటారు. ఇది ప్రతీక బ్రహ్మ ఉపాసన పేరుతో ప్రఖ్యాతి చెందింది.

**ఆదిత్య ప్రతీకే బ్రహ్మ ఉపాసన –** ఈ ఉపాసన పేరు ఆదిత్య ప్రతీకే బ్రహ్మ ఉపాసన. ఇది స్వతంత్ర ఆది దైవ ఉపాసన.

సూర్యోదయాన్ని ఒక అద్భుతరూపంలో ఉహిస్తోంది ఉపనిషత్తు. బ్రహ్మాండం నుంచి బయటకి వచ్చే మొట్టమొదటి అంశం సూర్యుడు.

బ్రహ్మాండం నుంచి సూర్యుడు బయటకు రావటాన్ని అండం నుంచి ఒక పక్షి బయటకి రావటంతో పోలుస్తుంది. అది నాలుగు దశల్లో జరుగుతుంది.

**అసదేవేదమగ్ర ఆసీత్ –** అవ్యక్తం దశ; **సదాసీత్ –** వ్యక్తమవబోతున్న దశ; **తత్సమభవత్ –** చిన్న అంకురం స్థాయిలో బయటకి రావటం.

**ఆణ్డ కపాలే –** పూర్తిస్థాయిలో బయటకు రావటం.

**మంత్రం 2:–** బ్రహ్మాండ ఉత్పత్తి జరిగేటప్పుడు కూడా అండంతో బ్రహ్మాండాన్ని పోల్చి, మరికొన్ని వివరాలు ఇస్తున్నది ఉపనిషత్తు.

| **అండం** | **బ్రహ్మాండం** |
|---|---|
| చిప్ప | ద్యులోకం – సూర్యకిరణాల వల్ల స్వర్ణమయంగా ఉంది. |
| క్రిందభాగం | పృథివీ |
| పక్షి ధమనలు | నదులు, సముద్రాలు |
| బాహ్యరూపం | స్థూల ప్రపంచం. |
| అంతరఃరూపం | సూక్ష్మప్రపంచం – మంచు బిందువులు, మేఘాలు |
| పగిలినపెంకులు | పర్వతాలు |

ఒక్కముక్కలో చెప్పాలంటే అండంలోంచి పక్షి వస్తే, బ్రహ్మాండం పగిలితే సూర్యుడు బయటకి వస్తాడు. ఇక్కడ సూర్యస్తుతి జరుగుతున్నది. సూర్యుడు ప్రథమపుత్రుడుగా కీర్తించబడుతున్నాడు.

**మంత్రం 3 – ఘోషా ఉలూలవ –** ప్రథమ పుత్రుడు పుడితే చాలా సందడి, కోలాహలం ఉన్నట్టే, సూర్యుడు బయటకి రాగానే, ఊర్లో, జీవితంలో సందడి మొదలవుతుంది. కోరికలన్నీ పుట్టుకువస్తాయి.
**మంత్రం 4 – ఫలం:– ఆ చ గచ్ఛేయురుప చ నిమ్రే దేరన్। ఆగచ్ఛేయుః** అంటే మంచి శబ్దాలే వింటారు.

**భద్రం కర్ణేభిః శ్రుణుయామ దేవాః – శాంతిపాఠం.**

కొంతమంది ఎంతసేపూ చెడు మాటలే మాట్లాడుతారు. ఎంతసేపూ ఎదుటివారిని కించపరుస్తారు. కాని ఈ ఉపాసనలు చేసినవారి చెవిన అలాంటి మాటలు పడవు. సాధు ఘోష వింటారు. నిమ్రేదేరన్ అంటే ఆనందం. ఆనందంగా ఉంటారు.

ఉపచనిమ్రేదేరన్ని మ్రేదరన్ అని మళ్ళీ చెప్పటం వల్ల ఈ ఖండం ముగిసింది, ఈ మూడవ అధ్యాయం కూడా ముగిసింది అని అర్థం.

## అధ్యాయం 3 సారాంశం

ఈ అధ్యాయంలో ఉపాసనలు వచ్చాయి. అందులో కొన్ని –
మధువిద్యా ఉపాసన
సూర్య ఉపాసన
బ్రహ్మరూపేణ గాయత్రీ ఉపాసన
ఆంతరజ్యోతి రూపేణ బ్రహ్మ ఉపాసన

## పంచ ఆత్మక మధువిద్యా ఉపాసన

| ఖండం | భోక్త | నేత | లోకం | సూర్యగతి | ఫలం కాలపరిమితి |
|---|---|---|---|---|---|
| 6 | వసుదేవత | అగ్ని | అగ్నిలోకం | తూర్పున ఉదయిస్తాడు<br>పడమర అస్తమిస్తాడు | భూలోకం ఉన్నంతవరకు |
| 7 | రుద్రదేవత | ఇంద్రుడు | ఇంద్రలోకం | దక్షిణాన ఉదయిస్తాడు<br>ఉత్తరాన అస్తమిస్తాడు | భూలోకానికి రెట్టింపుకాలం |
| 8 | ఆదిత్యదేవత | వరుణుడు | వరుణలోకం | పడమర ఉదయిస్తాడు<br>తూర్పున అస్తమిస్తాడు | రెండవలోకానికి రెండురెట్లు |
| 9 | మరుతదేవత | సోమదేవత | సోమలోకం | ఉత్తరాన ఉదయిస్తాడు<br>దక్షిణాన అస్తమిస్తాడు | మూడవలోకానికి రెండురెట్లు |
| 10 | సాధ్యదేవత | బ్రహ్మ<br>ఓంకారం/<br>హిరణ్యగర్భ | బ్రహ్మలోకం | సూర్యుడు ఉదయించడు<br>అస్తమించడు | నాలుగవలోకానికి రెండురెట్లు |

# ॥ ఛాందోగ్యోపనిషత్తు ॥

# అధ్యాయం - 4

### ప్రథమ ఖణ్డః (1)

ఓమ్। జానశ్రుతిర్హ పౌత్రాయణశ్శ్రద్ధాదేయో బహుదాయీ బహుపాక్య ఆస। స హ సర్వత అవసథాన్మాపయాంచక్రే సర్వత ఏవ మేఽ త్స్యన్తీతి ॥1॥ అథ హ హగ్ంసా నిశాయామతిపేతుస్తద్ధైవగ్ం హగ్ంసో హగ్ంసమభ్యువాద హెూ హెూ ఽయి భల్లాక్ష భల్లాక్ష జానశ్రుతేః పౌత్రాయణస్య సమందివా జ్యోతిరాతతం తన్మా ప్రస్రాంక్షీస్తత్వా మా ప్రధాక్షీరితి ॥2॥ తముహ పరః ప్రత్యువాచ కమ్వర ఏనమేతత్సన్తగ్ం సయుగ్వానమివ రైక్వమాత్థేతి। యో ను కథగ్ం సయుగ్వా రైక్వ ఇతి ॥3॥ యథా కృతాయ విజితాయాధరేయాస్సంయన్త్యేవమేనగ్ం సర్వం తదభిసమేతి। యత్కించ ప్రజాస్సాధు కుర్వన్తి యస్తద్వేద యత్సవేద స మయైతదుక్త ఇతి ॥4॥ తదు హ జానశ్రుతిః పౌత్రాయణ ఉపశుశ్రావ। స హ సంజిహాన ఏవ క్షత్తారమువాచాంగారే హ సయుగ్వానమివ రైక్వమాత్థేతి యోనుకథగ్ం సయుగ్వా రైక్వ ఇతి ॥5॥ యథా కృతాయ విజితాయా ధరేయాస్సంయన్త్యేవమేనగ్ం సర్వం తదభిసమేతి యత్కించ ప్రజాస్సాధు కుర్వన్తి యస్తద్వేద యత్స వేద స మయైతదుక్త ఇతి ॥6॥ స హ క్షత్తాఽన్విష్య నావిదమితి ప్రత్యేయాయ తగ్ం హెూవాచ యత్రారే బ్రాహ్మణస్యాన్వేషణా తదేనమృచ్ఛేతి ॥7॥ సోఽధస్తాచ్ఛకటస్య పామానం కషమాణముపోపవివేశ తగ్ం హాభ్యువాద త్వం ను భగవస్సయుగ్వా రైక్వ ఇత్యహగ్ం హ్యరా 3 ఇతి హ ప్రతిజజ్ఞే సహ క్షత్తాఽ విదమితి ప్రత్యేయాయ॥8॥

సంవర్గ ఉపాసన

**మంత్రాలు 1-4 –** ఇవి ఒక ప్రముఖ ఉపాసన గురించి చెప్తాయి. దీన్ని **సంవర్గ విద్య లేదా సంవర్గ ఉపాసన** అంటారు. విద్య అంటే ఉపాసన. **హిరణ్యగర్భ లేదా సూత్రాత్మ ఉపాసన** అని కూడా అంటారు. సంవర్గ అంటే

అన్నింటినీ తనలో లయం చేసుకునేది. ఆధిదైవపరంగా, అధ్యాత్మపరంగా హిరణ్యగర్భ అన్నింటినీ తనలో లయం చేసుకునేట్టు చేసే ఉపాసన. ఉపాసన గురించి చెప్పేముందు 1-3 మంత్రాలలో ఒక కథ చెపుతున్నది ఉపనిషత్తు. దాని ఉద్దేశ్యం గురుశిష్యులను పరిచయం చేసి, కొన్ని అర్హతలను ఎత్తిచూపటం.

ఈ కథలో శిష్యుడు జానశ్రుతి, గురువు రైక్వా. జానశ్రుతి గొప్పరాజైనా కూడా, విద్య నేర్చుకోవటానికి తానే స్వయంగా గురువు వద్దకు వెళ్తాడు. ఇది రాజు అణకువ స్వభావాన్ని తెలుపుతుంది.

**విద్య కోరువానికి సుఖము ఎక్కడిది,**
**సుఖము కోరువానికి విద్య ఎక్కడిది?**

ఈ విలువ కూడా అర్థం చేసుకోవాలి. ఇక్కడ చెప్పిన కథ ఎంతవరకు నిజమన్నది జిజ్ఞాసుకి అనవసరం. అది చారిత్రాత్మక విషయాలను నేర్చుకునేవాళ్ళు చూసుకుంటారు.

**శ్రద్ధాదేయో బహుదాయీ బహుపాక్య-** ఈ విశేషణలతో జానశ్రుతిని పరిచయం చేస్తున్నది ఉపనిషత్తు. శ్రద్ధ-అతనికి శాస్త్రం మీద శ్రద్ధ ఉంది; బహుదాయి- దానకర్త; బహుపాక్య- అన్నదాత. అనేక ఇళ్ళను కట్టించాడు. ఉన్నతమైన రాజు జానశ్రుతికి చిత్తశుద్ధి ఉంది. అందువల్ల అతనికి ఉపాసన నేర్చుకునేందుకు (జ్ఞానం పొందేటందుకు కాదు) అర్హత ఉంది.

**మంత్రాలు - 2, 3** - ఒకరోజు అతను తన రాజసౌధంలోని పైభాగంలో విశ్రాంతి తీసుకుంటూండగా, కొన్ని హంసలు ఎగురుతూ మాట్లాడుకుంటున్నాయి. ఒక హంస ఇంకో హంసను భల్లాక్ష అని పిలుస్తూ, జానశ్రుతికి మరీ దగ్గరగా ఎగరకు, అతని తేజస్సనే కాంతికి నువ్వు మాడగలవు జాగ్రత్త అంటుంది. భల్లాక్ష అంటే మందదృష్టి ఉన్నట్టు అర్థం.వెంటనే ఇంకో హంస అడ్డుపడి, ఎందుకు అంత తక్కువ వ్యక్తిని కీర్తిస్తావు?ఏం అతను రైక్వుడంతటి గొప్పవాడా అంది. ఆ రైక్వుడు ఎవరని ఆశ్చర్యపోయాడు రాజు. రై క్వా, మన కాబోయే గురువు. ఎక్కడున్నాడు? ఒక బండి కింద ఉన్నాడు. భల్లాక్ష అడిగింది రైక్వుడు ఎవరు అని.

**మంత్రం-4 - యథాకృతాయ విజితాయాథరేయాః -** ఈ వాక్యం అర్థం అతను హిరణ్యగర్భ ఉపాసకుడు. ఎటువంటి ఉపాసన? అభేద ఉపాసన లేదా అహంగ్రహ ఉపాసన.

**అహం హిరణ్యగర్భ అస్తి**

నేను హిరణ్యగర్భ అని అబేధ ఉపాసన చేయటం వల్ల హిరణ్యగర్భతో సమానమవుతాడు. హిరణ్యగర్భ ఎవరో మర్చిపోకూడదు. హిరణ్యగర్భ అంటే సమష్టి సూక్ష్మ శరీర ఉపహిత చైతన్యం. సమష్టి మనసు + సమష్టి ఇంద్రియాలకు అధిష్టానం.

**ఆప్నోతి స్వారాజ్యమ్। ఆప్నోతి మనసస్పతిమ్। వాక్పతిశ్చక్షుష్పతి శ్రోత్రపతిర్విజ్ఞానపతిః। శీక్షావల్లీ**

సమష్టి ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి అన్నీ ఆయనే. సమష్టిలో వ్యష్టి కూడా వస్తుంది. హిరణ్యగర్భ ఉపాసన చేసిన వ్యక్తి ప్రపంచంలో అన్నింటినీ గెలుస్తాడు అన్నది అర్థం. కాని ఉపనిషత్తు దీన్ని జూదంలోని పాచికలతో పోల్చి వివరిస్తున్నది. శంకరాచార్యులు ఈ వాక్యాన్ని తరచు చెప్తుంటారు తన భాష్యంలో.

జూదంలో వాడే పాచికలు పొడుగ్గా ఉండి, నాలుగు వైపులు కలిగి ఉంటాయి. నాలుగువైపులా ఒకటి నుంచి నాలుగు వరకూ నాలుగు అంకెలు ఉంటాయి. వాటికి జూదంలో పేర్లు ఉన్నాయి. ఒకవైపుని అయ అంటారు. 1 - కల్యయ (కలి+అయ); 2- ద్వాపర్య (దాపర+అయ); 3- త్రేతాయ (త్రేత+అయ); 4-కృతాయ (కృత+అయ)

ఇందులో ప్రత్యేకత ఏమిటంటే పాచికలు విసిరినప్పుడు ఒక వ్యక్తికి 4 (కృతాయ) పడితే దాన్ని 4గా మాత్రమే తీసుకోరు. తక్కినమూడూ కలిపి దశ అంగాలు అంటారు. (4+3+2+1=10)

అలాగే త్రేతాయకి 3+2+1=6; ద్వాపరకి 2+1=3 కలికి 1. త్రేత వస్తే కృత రాదు. ఇదీ లెక్క. ఇక్కడ కృతాయ ఒక్కటే తీసుకుంది. కృతాయ వస్తే ఎలా తక్కిన అన్ని సంఖ్యలూ కూడా అందులో ఇమిడిపోతాయో, అలాగే హిరణ్యగర్భ ఉపాసన చేస్తే తక్కిన అన్ని యజ్ఞాలూ చేసినంత ఫలం. ఉదాహరణకు పుత్రకామేష్టి యజ్ఞం చేస్తే దాని ఫలం మాత్రమే వస్తుంది. దీనికి అలా కాదు.

కృత=10=హిరణ్యగర్భ (ఇది ఎలాగో తర్వాత వచ్చే మంత్రాల్లో చూస్తాము) రైక్వుడు హిరణ్యగర్భ ఉపాసన చేయటం వల్ల అంత గొప్పవాడయ్యాడు. ఒక మానవుడు చేసిన పుణ్యం కూడా అతనికే వెళు తుంది, అతను సమష్టి ప్రపంచం కాబట్టి. అలాంటప్పుడు జానశ్రుతి తేజస్సు గొప్పదని ఎలా చెప్పగలవు అని ఆ హంస ఉద్దేశ్యం.

మామూలుగా అయితే ఎవరైనా అలాంటి సందర్భంలో ఈర్ష్యతో రగిలిపోవటమో, కోపంతో మండిపడటమో చేస్తారు. కాని జానశ్రుతి దానికి భిన్నంగా ఆలోచించాడు. అటువంటి గొప్పవ్యక్తి ఉంటే, నేను అతన్నుంచి నేర్చుకోవాలి అనుకున్నాడు.

**మంత్రాలు-5,6 –** జానశ్రుతికి ఆ రైక్వుడు ఎవరోచూడాలని వెంటనే అనిపించింది. అంత గొప్ప ఉపాసకుడు. ఒక బండికింద ఉండకూడదు. అతన్ని గౌరవించాలి. అతని నుంచి విద్య నేర్చుకోవాలి అనుకున్నాడు అతని రక్షక భటుడి దగ్గరకు వచ్చి, రైక్వుడు ఎవరో తెలుసా అని అడిగాడు. హంసలు చెప్పిన మాటలు మళ్ళీ అతను చెప్పి, రైక్వుని గురించి అడిగాడు.

**మంత్రాలు : 7,8 –** రక్షక భటుడు తనకు తెలియదని, వెళ్ళి కనుక్కుంటాననీ, వెళ్ళాడు కాని తెలుసుకోలేకపోయాడు. రాజు దగ్గరకి వచ్చి అదే మాట చెపితే, వెళ్ళి బ్రాహ్మణులు ఎక్కడ ఉంటారో అక్కడ వెతకమని చెప్పాడురాజు. పరోక్షంగా బ్రాహ్మణులు రాజ ప్రాకారాల్లో ఉండరని,మామూలు జీవనం గడుపుతారనీ చెపుతున్నాడు. శాస్త్రం ప్రకారం బ్రాహ్మణుడు అర్థకామాల వెంట పరుగులు తీయకూడదు. అప్పుడు మళ్ళీ వెతికితే, బండికింద కనపడతాడు.

**పామానం కషమాణం –** అతను ఉన్న ప్రదేశం మురికిగా ఉందని కాదు, హెచ్చులకు పోకుండా సాధారణంగా ఉందని అర్థం. మీరేనా రైక్వుడు అని అడిగితే అవునని చెప్పాడు.

### ద్వితీయ ఖణ్డః (2)

**తదు హ జానశ్రుతిః పౌత్రాయణః షట్శతాని గవాం నిష్కమశ్వ తరీరథం తదాదాయ ప్రతిచక్రమే తగ్ం హాభ్యువాద ॥1॥ రైక్వేమాని షట్శతాని గవామయం నిష్కోఽ యమశ్వతరీరథో ను మ ఏతాం భగవో దేవతాగ్ం శాధి యాం దేవతాముపాస్స ఇతి ॥2॥ తము హ పరః ప్రత్యువాచాహ**

**హారేత్వా శూద్ర తవైవ సహ గోభిరస్త్వితి। తదు హ పునరేవ జానశ్రుతిః పౌత్రాయణస్సహస్రం గవాం నిష్కమశ్వతరీరథం దుహితరం తదాదాయ ప్రతిచక్రమే ॥3॥ తగ్ం హాభ్యువాద రైక్వేదగ్ం సహస్రం గవామయం నిష్కోఽయమశ్వతరీరథ ఇయం జాయాఽయం గ్రామో యస్మిన్నాస్సేఽన్వేవ మా భగవశ్శాధీతి ॥4॥ తస్యా హ ముఖముపోద్గృహ్ణన్నువాచాఽజహారేమాశ్శూద్రానేనైవ ముఖేనాలాపయిష్యథా ఇతి తే హైతే రైక్వపర్ణా నామ మహావృషేషు యత్రాస్మా ఉవాస తస్మై హోవాచ ॥5॥**

**మంత్రాలు 1-5 -** జానశ్రుతి రైక్వుని దగ్గరకి వెళ్ళాడు, హిరణ్యగర్భ ఉపాసన నేర్చుకోవటానికి. బోలెడు గురుదక్షిణ తీసుకువెళ్ళాడు. రాజు, దైవం, గురువుల దగ్గరికి వెళ్ళేటప్పుడు ఉత్తచేతులతో వెళ్ళకూడదంటారు. ఇక్కడ రాజే గురువు దగ్గరకి గురుదక్షిణ తీసుకువెళ్ళాడు. ఆరు వందల గోవులను, హారాన్ని, రథాన్ని తీసుకువెళ్ళాడు. కాని వాటికి లొంగక రైక్వుడు అతన్ని వెనక్కి పంపాడు. అప్పుడు రాజు మళ్ళీరెండోసారి ఇంకొంచెం ఎక్కువ గురుదక్షిణతో పాటు, తన కుమార్తెని కూడా తీసుకువెళ్ళి, కుమార్తెనిచ్చి వివాహం చేస్తానన్నాడు. రైక్వుడు సన్యాసి కాదు.బ్రహ్మచారి. అతను ఉన్న ప్రదేశాన్ని కూడా దానం చేసి దాన్ని **రైక్వపర్ణ గ్రామం** అని పిలుస్తానన్నాడు. అప్పుడు రైక్వుడు అతనికి ఉపదేశం చేయటానికి ఒప్పుకున్నాడు. ఇంతే కథ.

కథ ద్వారా మనం గ్రహించవలసినవి కొన్ని అంశాలు ఉన్నాయి. ముందుగా కథకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వకూడదు. ఇస్తే హంసలు మాట్లాడుకోవటం ఏమిటి? అది రాజు అర్థం చేసుకోవటం ఏమిటి లాంటి అర్థం లేని అనుమానాలు వస్తాయి.అలాగని పూర్తిగా కొట్టి పారేయనూకూడదు. కథ నుంచి నేర్చుకోవాల్సిన కొన్ని మంచి అంశాలను గ్రహించాలి. అవి-

1. శిష్యునికి ఉండాల్సిన అణకువ, శ్రద్ధ గురించి ముందే చూశాము.
2. రాజే స్వయంగా గురువు దగ్గరకి వెళ్ళాడు.కాని గురువుని తన దగ్గరకు పిలిపించలేదు.
3. గురు దక్షిణ తీసుకువెళ్ళాడు.

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్ - ముండక 1-2-12**
సమిథలు తీసుకుని గురువు వద్దకి వెళ్ళాలి.

రైక్వుడు ముందు ఉపదేశం చేయటానికి ఒప్పుకోకుండా, రాజకుమార్తెను, మరింత గురుదక్షిణను ఇచ్చాక, ఒప్పుకున్నాడు. కాబట్టి రైక్వుడు సంపదలకు ఆశపడ్డాడు అనకూడదు. ఇది శాస్త్రాన్ని తప్పుగా అర్థం చేసుకోవటమే అవుతుంది. అలా తప్పుగా అర్థం చేసుకుంటే, శాస్త్రం మీద శ్రద్ధ ఏర్పడదు. శాస్త్రం చెప్పే అద్భుత బోధని పొందలేము. అందుకని ఎప్పుడూ సానుకూలంగా తీసుకోవాలి. దీనివల్ల కూడా రెండు అంశాలు తెలుస్తాయి.

4. ఏ ఉపనిషత్తు చూసినా, శిష్యుడు అడిగిన వెంటనే గురువు బోధ చేయడు. అతనిలో ఎంతమాత్రం శ్రద్ధ ఉందో, అతను ఎంత మేరకు అధికారో తెలుసుకుని కానీ చెప్పడు. కఠలో నచికేతుడు అడిగితే యమధర్మరాజు అతనికి పరీక్ష పెట్టి, అందులో గెలిచాకే బోధ చేస్తాడు.

5. జానశ్రుతి శ్రద్ధ తెలుస్తున్నది. అతను తన రాజ్యం మొత్తం ఇవ్వటానికి కూడా సిద్ధపడ్డట్టు తెలుస్తున్నది. రెండోసారి కూడా ఒప్పుకోకపోతే, అదే చేసి ఉండేవాడు. అర్థకామాలు కాదు ముఖ్యం. సంస్కృతి ముఖ్యం అని తెలుస్తున్నది. విద్యమీద శ్రద్ధ ముఖ్యం అనీ, దాని కోసం అహంకారాన్ని తగ్గించుకోవాలనీ తెలుస్తున్నది.

**తస్మైహోవాచ –** గురువు చెప్పటానికి ఒప్పుకుని, అతనికి ఉపదేశం చేశాడు.

**తృతీయ ఖణ్డః (3)**

**వాయుర్వావ సంవర్గః। యదా వా అగ్నిరుద్వాయతి వాయు మేవాప్యేతి। యదా సూర్యోఽస్తమేతి వాయుమేవాప్యేతి యదా చన్ద్రోఽస్తమేతి వాయుమేవాప్యేతి ॥1॥ యదాఽఽప ఉచ్ఛుష్యన్తి వాయుమేవాపియన్తి వాయుర్హ్యేవైతాన్సర్వాన్సంవృంక్త ఇత్యధిదైవతమ్ ॥2॥ అథాధ్యాత్మం ప్రాణో వావ సంవర్గస్సయదా స్వపితి ప్రాణమేవ వాగప్యేతి ప్రాణం చక్షుః ప్రాణగ్ం శ్రోత్రం ప్రాణం మనః ప్రాణో హ్యేవైతాన్సర్వాన్సంవృంక్తే ఇతి ॥3॥ తౌ వా ఏతౌ ద్వౌ సంవర్గౌ వాయురేవ దేవేషు ప్రాణః ప్రాణేషు ॥4॥ అథ హ శౌనకం చ కాపేయమభిప్రతారిణం చ కాక్షసేనిం పరివిష్యమాణౌ బ్రహ్మచారీ బిభిక్షే తస్మా ఉ హ న దదతుః ॥5॥ స హోవాచ మహాత్మనశ్చతురో దేవ**

**ఏకః కస్స జగార భువనస్య గోపాస్తం కాపేయ నాభిపశ్యన్తి మర్త్యా అభిప్రతారిన్బహుధా వసన్తం యస్మై వా ఏతదన్నం తస్మా ఏతన్న దత్తమితి ॥6॥ తదు హ శౌనకః కాపేయః ప్రతిమన్వానః ప్రత్యేయాయ ఆత్మా దేవానాం జనితా ప్రజానాగ్ం హిరణ్యదగ్ంష్ట్రో బభసోఽనసూరిర్మహాన్తమస్య మహిమానమాహురనద్యమానో యదనన్నమత్తీతి వై వయం బ్రహ్మచారిన్నేదముపాస్మహే దత్తాస్మై భిక్షామితి ॥7॥ తస్మా ఉ హ దదుస్తే వా ఏతే పంచాన్యే పంచాన్యే దశసన్తస్తత్కృతం। తస్మాత్సర్వాసు దిక్ష్వన్నమేవ దశకృతగ్ం సైషా విరాడన్నాదీ తయేదగ్ం సర్వం దృష్టగ్ం సర్వమస్యేదం దృష్టం భవత్యన్నాదో భవతి య ఏవం వేద య ఏవం వేద ॥8॥**

**ఖండం–3 మంత్రాలు 1–4 – సంవర్గ విద్య –** ఖండం–2లో గురుశిష్యులని పరిచయం చేసింది ఉపనిషత్తు. ఇప్పుడు సంవర్గ విద్య నేర్పిస్తాడు గురువు.

**సంవర్జనాత్ సంవర్గః**

సమష్టిపరంగా, వ్యష్టిపరంగా హిరణ్యగర్భలో అన్నీ ఎలా లయమవుతాయో చూపించే ఉపాసన ఇది.

హిరణ్యగర్భని సమష్టిలో వాయురూపంలో కొలుస్తాము.

**నమో బ్రహ్మణే। నమస్తే వాయో। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి**

**– శాంతిపాఠం**

వాయువు అంటే హిరణ్యగర్భ. సమష్టిపరంగా లయం చేసేది వాయువు. అన్నింటినీ లయం చేస్తాడు అని చెప్పటానికి నాలుగు దేవతలను తీసుకుంది ఉపనిషత్తు. అవి–

అగ్ని, సూర్యుడు, చంద్రుడు, జలము (ఆపః)

వాయువు ఎలా లయం చేస్తాడు అనేది రకరకాలుగా చెప్పవచ్చు.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః ఆకాశాద్వాయుః।**
**వాయోరగ్నిః అగ్నేరాపః అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః।**
**ఓషధీభ్యోఽన్నమ్। అన్నాత్పురుషః।**

సృష్టిప్రకరణం చెప్పేటప్పుడు ఆత్మ నుంచి ఆకాశం, ఆకాశం నుంచి వాయువు, వాయువు నుంచి అగ్ని, అగ్ని నుంచి జలం, జలం నుంచి పృథివీ ఇలా చెప్పుకొచ్చింది తైత్తిరీయ ఉపనిషత్తు. ప్రళయకాలంలో వెనుకనుంచి

ఒకదానిలో ఒకటి లయమవుతాయి. అంటే పృథివి జలంలో, జలం అగ్నిలో, అగ్ని వాయువులో కలుస్తాయి. ఇక్కడితో ఆపుతాము. ఆకాశం దాకా వెళ్ళము. ఇప్పుడు – అలా వాయువులో అన్నీ లయమవుతాయి.

కాని ఇక్కడ, ఛాందోగ్య మంత్రంలో, ఉపనిషత్తు వేరే కోణంలో చెపుతున్నది.

అగ్ని వాయువు వీస్తే చల్లారుతుంది.

సూర్యచంద్రులు వాయువు వల్లే అస్తమిస్తున్నారు. అస్తమిస్తున్నారు అంటే వాయువులో లయమవుతున్నట్లు అర్థం.

నీరు వాయువు వల్లే ఇంకిపోతుంది.

అందువల్ల వాయువులో అగ్ని, సూర్యుడు, చంద్రుడు, జలం అన్నీ లయమవుతున్నాయి. వాయుర్వావ సంవర్గః – **ఇది ఆధిదైవ ఉపాసన.**

ఆధ్యాత్మ స్థాయిలో **ప్రాణోవావ సంవర్గః.** ప్రాణశక్తిలో అన్నీ లయమవుతాయి. అధ్యాత్మ స్థాయిలో 4 శక్తులు – వాక్కు, చక్షువు, మనసు, శ్రోతం. ముందే చూసినట్టుగా –

| | |
|---|---|
| వాక్కు | – పంచ కర్మేంద్రియాలు |
| చక్షు, శ్రోతం | – పంచ జ్ఞానేంద్రియాలు |
| మనసు | – నాలుగు అంతఃకరణలు |

మొత్తం సూక్ష్మ ప్రపంచానికి ఇవి ప్రతీకలు.

సమష్టి సూక్ష్మ ప్రపంచానికి అధిష్టాన దేవత వాయువు అయితే, వ్యష్టి సూక్ష్మ శరీరానికి అథిష్టాన దేవత ప్రాణం. ప్రాణశక్తి లేకపోతే ఇవేవీ పనిచేయవు. అదికాక సుషుప్తిలో ఈ నాలుగు పనిచేయవు. కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, మనసు ఏవీ పనిచేయవు. అన్నీ లయమవుతాయి. ఎందులో లయమవుతాయి? అన్నీ లయమయినప్పుడు, ఏది మేలుకుని ఉందో అందులో లయమవుతాయి.

మనసు కూడా లయమవుతుంది సుషుప్తిలో. మేలుకుని ఉన్నది ప్రాణశక్తి మాత్రమే. కాబట్టి వ్యష్టిలో అన్ని అంగాలనీ లయం చేసేది ప్రాణశక్తి.

లయం చేసేదాన్ని అత్తా అనీ, లయమయ్యేదాన్ని అన్నం అనీ అంటారు.

ఆధిదైవపరంగా అత్తా, అన్నం కలిపి 5, ఆధ్యాత్మపరంగా అత్తా, అన్నం కలిపి ఐదు, మొత్తం 10 అంశాలు ఉన్నాయి హిరణ్యగర్భకి.
5+5 =10

**వాయువు , అగ్ని, సూర్యుడు, చంద్రుడు, జలం- ఆధిదైవం**
**ప్రాణం, వాక్కు, చక్షువు, మనసు, శ్రోతం - ఆధ్యాత్మం**
**తౌ వా ఏతౌ ద్వౌ సంవర్గౌ వాయురేవ దేవేషు ప్రాణః ప్రాణేషు -** సంవర్గ విద్య రెండుగా వాయురూపంలో, ప్రాణరూపంలో వచ్చింది.

**మంత్రాలు 5-8 -** హిరణ్యగర్భ గుణస్తుతి కొనసాగించటానికి ఉపనిషత్తు ఇంకో సంఘటన చెపుతున్నది. ఎందుకు? ఉపాసనలో కూడా గుణ విశిష్ట ఉపాసన చేయాలి.

ఇద్దరు బ్రహ్మచారులు కలిసి భోజనం చేస్తున్నారు. వాళ్ళు శౌనకుడు అనే బ్రాహ్మణుడు, కాక్షసేని అనే క్షత్రియుడు. వాళ్ళు తింటుండగా భిక్షాందేహి అని మూడో బ్రహ్మచారి వచ్చాడు. అతన్ని ఒక మామూలు వ్యక్తిగా వాళ్ళు భావించి, అతన్ని పరీక్షించటానికి భిక్ష వేయటానికి నిరాకరించారు. కొత్తగా వచ్చిన బ్రహ్మచారి ఎదురు వీళ్ళను పరీక్షించదలచుకున్నాడు. అతను నాలుగు గుణాలు వర్ణించి ఇవి ఎవరివి అన్నాడు.

**మంత్రం 6 - దేవః కః?** ఈ దేవుడు ఎవరు? నాలుగు లక్షణాలు చెప్పాడు. అవి -

1.గ్రసితా 2. గోపా 3. భువనస్య4. దుర్విఘ్నేయ - గ్రసితా అంటే అన్నింటినీ లయం చేసే వ్యక్తి, గోపా అంటే సంరక్షుడు; భువనస్య అంటే అనేక రూపాలున్నవాడు; దుర్విఘ్నేయ- తేలిగ్గా గుర్తించబడని వాడు- అక్కడితో ఆగకుండా ఇంకో తమాషా వాక్యం అన్నాడు. వాళ్ళు అతనికి భిక్ష వేయకపోవటం వల్ల ఈ నాలుగు లక్షణాలున్న దేవతకు నిరాకరిస్తున్నారన్నాడు.

ఈ నాలుగు గుణాలూ హిరణ్యగర్భకి ఉన్నాయి.

**గ్రసితా -** సంవర్గరూపేణ సర్వం గ్రసతి - సర్వాన్ని తినేస్తుంది.

**గోపా -** సమష్టి ప్రాణ రూపేణ సర్వస్య రక్షితా- సమష్టి సూక్ష్మప్రపంచం వ్యష్టి సూక్ష్మ ప్రపంచాన్ని రక్షిస్తుంది.

**భువనస్య** - సూక్ష్మ శరీరం, స్థూల శరీరం ఏ ఆకారంలో ఉంటే ఆ రూపం ధరిస్తుంది.

**స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుషవిధతామ్। అన్వయం పురుష విధః - బ్రహ్మానందవల్లీ**

ఇంకోవిధంగా చూస్తే అనేక శక్తుల రూపంలో పనిచేస్తుంది.

**నాభిపశ్యన్తి -** దుర్విఘ్నేయం - వ్యష్టి గురించే ఆలోచిస్తే, సమష్టిని అర్థం చేసుకోలేము. మన రాష్ట్రానికే మన దృష్టి పరిమితమైతే, దేశాన్ని అర్థం చేసుకోలేము.

ఈ వివరణ వల్ల నాలుగు గుణాలున్న వ్యక్తి హిరణ్యగర్భ.

1. హిరణ్యగర్భే అందరిలోనూ ఉన్నాడు. ఆ వ్యక్తిలోనూ ఉన్నాడు.
2. వచ్చిన వ్యక్తి హిరణ్యగర్భ మీద అహంగ్రహ ఉపాసన చేస్తున్నాడు.

హిరణ్యగర్భ ఉపాసన చేస్తే అతనే హిరణ్యగర్భ అవుతాడని చూశాము. కాబట్టి హిరణ్యగర్భకు నిరాకరించినట్టు అవుతుంది.

అందువల్ల నన్ను మామూలు వ్యక్తిగా భావించకండి అని చెప్పి అతను వెళ్ళిపోతుంటే, అతని గొప్పతనం గ్రహించిన వీళ్ళిద్దరూ అతని వెంట పరిగెట్టారు. అతని ప్రశ్నకు హిరణ్యగర్భ అని జవాబు అని చెప్పి, వాళ్ళు ఇంకో 7 గుణాలు చెప్పారు.

**మంత్రం-7 -** శౌనకుడు, కాక్షసేనుడు చెప్పిన 7 గుణాలు ఇవి-

| | |
|---|---|
| 1. ఆత్మా | - వ్యష్టికి అధిష్ఠానం సమష్టి |
| 2. జనితా | - సృష్టికర్త |
| 3. అనసూరి | - సమష్టి బుద్ధి |
| 4. మహిమానం | - సర్వ విభూతిమాన్ |
| 5. బభస | - భక్షణశాలి, నిరంతరం తినేవాడు (సంవర్గ) |
| 6. హిరణ్యదంష్ట్ర | - బంగారు దంతాలు ఉన్నవాడు. |
| 7. అనద్యమాన | - ఎవరి చేత తినబడని వాడు. |

**మంత్రం -8 -** ఉపనిషత్తు ఇంకో గుణాన్ని వివరిస్తున్నది. పూర్తిగా కల్పనతో కూడినది ఇది.

కొంచెం వెనక్కి వెళితే,హిరణ్యగర్భలో పది దేవతలు ఉన్నారని చూశాము.

ఆధిదైవం - వాయువు, అగ్ని, సూర్యుడు, చంద్రుడు, జలము

ఆధ్యాత్మం – ప్రాణం, వాక్కు, చక్షువు, మనసు, శ్రోతం

వాయువు, ప్రాణాలను అత్తృరూప దేవతలనీ, తక్కిన 8 దేవతలని అన్న రూప దేవతలనీ అంటారని చూశాం. హిరణ్యగర్భ అత్తృ, అన్నరూప దేవత.

ఇప్పుడు ఇంకా వెనక్కి వెళితే

కృతం = 10 = హిరణ్యగర్భ అని చూశాము.

**కృతాయ విజితాయా ధరేయా–** పాచికలు వేసినప్పుడు కృతాయ (4) పడితే దాన్ని 10 సంఖ్యగా తీసుకుంటారని చూశాము. అలాగే హిరణ్యగర్భలో కూడా అత్తృరూప దేవతలు2+ అన్నరూప దేవతలు 8 కలిపితే 10 వస్తుంది.కృతం తక్కిన అన్ని సంఖ్యలను తనలో లయం చేసుకున్నట్టుగా, హిరణ్యగర్భయొక్క అత్తృరూప దేవతలు తమలో అన్నరూప దేవతలను లయం చేసుకుంటాయి. అందువల్ల హిరణ్యగర్భని కృతంతో పోల్చవచ్చు.

ఇప్పుడు అన్నరూపానికి ఇంకో పోలిక చెప్పాలి. ఉపనిషత్తు విరాట్ ఛందస్సుని తీసుకుంది పోలికగా. విరాట్ ఛందస్సుకి 10 అక్షరాలు ఉన్నాయి.

**అన్నాద్వై ప్రజాః ప్రజాయన్తే – బ్రహ్మానందవల్లీ**

సమష్టి అన్నం విరాట్. అన్నమయం విశ్వ. ఆ విధంగా హిరణ్యగర్భ 10 దేవతలు దశాక్షర అన్నరూప విరాట్ అన్నమాట. హిరణ్యగర్భ అన్న రూపం నిరూపించబడింది. మొత్తం హిరణ్యగర్భ ఉపాసన చేస్తే అది సంవర్గ విద్య అవుతుంది అని ఉపనిషత్తు చెపుతున్నది.

ఫలం – అత్తృ అన్న ఉపాసన చేసిన ఉపాసకునికి అన్నవాన్ అన్నాదో భవతి. అన్నం సమృద్ధిగా దొరుకుతుంది. ఇష్టంగా తినగలుగుతాడు. పరలోక ఫలం – హిరణ్యగర్భ ప్రాప్తి.

ఈ ఖండం ప్రాశస్త్యం – సంవర్గ విద్య గురించి చెప్పినందుకు ఈ ఖండం బాగా పేరు పొందింది. రైక్వా, జానశ్రుతుల కథ బాగా ప్రాచుర్యం పొందింది. బ్రహ్మసూత్రాల్లో అపశూద్రాధికరణం (1–3–34)లో దీన్ని వివరంగా చర్చించారు.

**హారే త్వా శూద్ర –** రైక్వుడు జానశ్రుతిని శూద్రా అన్నాడు. అందువల్ల జానశ్రుతి క్షత్రియుడా, శూద్రుడా అన్న మీమాంస రేగింది. శంకరాచార్యులు

జానశ్రుతి క్షత్రియుడే అని నిరూపించి, శూద్రా అని ఎందుకన్నాడంటే అతను రైక్వుని గురించి విన్నాక, కలత చెందాడు కాబట్టి అని వివరించారు.

**చతుర్థ ఖణ్డః (4)**

**సత్యకామో హ జాబాలో జబాలాం మాతరమామన్త్రయాఞ్చక్రే బ్రహ్మచర్యం భవతి వివత్స్యామి కింగోత్రో న్వహమస్మీతి ॥1॥ సా హైనము వాచ నాహమేతద్వేద తాత యద్గోత్రస్త్వమసి। బహ్వహం చరన్తీ పరిచారిణీ యౌవనే త్వామలభే సాఽహమేతన్న వేద యద్గోత్రస్త్వమసి జబాలా తు నామాహమస్మి సత్యకామో నామ త్వమసి స సత్యకామ ఏవ జాబాలో బ్రవీథా ఇతి ॥2॥ స హ హారిద్రుమతం గౌతమమేత్యోవాచ బ్రహ్మచర్యం భగవతి వత్స్యామ్యుపేయాం భగవన్తమితి ॥3॥ తగ్ం హోవాచ కింగోత్రో ను సోమ్యాసీతి స హోవాచ నాహమేతద్వేద భో యద్గోత్రోఽహమస్మ్యపృచ్ఛం మాతరగ్ం సా మా ప్రత్యబ్రవీద్బహ్వహం చరన్తీ పరిచారిణీ యౌవనే త్వామలభే సాహమేతన్న వేద యద్గోత్రస్త్వమసి జబాలా తు నామాహమస్మి సత్యకామో నామ త్వమసీతి సోఽహగ్ం సత్యకామో జాబాలోఽస్మి భో ఇతి ॥4॥ తగ్ంహోవాచ నైతదబ్రాహ్మణో వివక్తుమర్హతి సమిధగ్ం సోమ్యాహరోప త్వా నేష్యే న సత్యాదగా ఇతి తముపనీయ కృశానామబలానాం చతుశ్శతా గా నిరాకృత్యోవాచేమాః సోమ్యానుసంవ్రజేతి। తా అభిప్రస్థాపయన్నువాచ నాసహస్రేణావర్తేయమితి స హ వర్షగణం ప్రోవాస తా యదా సహస్రగ్ం సంపేదుః ॥5॥**

**చతుష్పాదగుణ విశిష్టబ్రహ్మ ఉపాసన –** ముందు ఖండంతో రైక్వా జానశ్రుతుల సంవాద రూపంలో సంవర్గ విద్య గురించి వచ్చింది. ఇప్పుడు ఖండాలు 4–9 ఇంకో ఉపాసన వస్తుంది. చతుష్పాద గుణ విశిష్ట బ్రహ్మ ఉపాసన దీని పేరు. ఒక్కొక్క పాదానికి 4 భాగాలున్నాయి. **చతుష్కల విశిష్ఠ చతుష్పాద బ్రహ్మ ఉపాసన** అని కూడా అనవచ్చు. ఇది కూడా గురుశిష్యుల సంవాద రూపంలో నడుస్తుంది. శిష్యుడు బాగా ప్రసిద్ధి చెందిన సత్యకామ జాబాల. గురువు హరిద్రుముడు. మళ్ళీ ఒక చిన్న కథ వస్తుంది. ఈ ఖండాలను **సత్యకామ జాబాలోపాఖ్యానం** అంటారు.

సత్యకామ జాబాల చిన్న పిల్లవాడు. అతను వేదాలను నేర్చు

కోవాలనుకున్నాడు. తండ్రి చనిపోయాడు. తల్లి పేరు జబల. 'నేను గురువు వద్దకు వెళ్తాను. నా గోత్రమేమిటి' అని అడిగాడు. తల్లి తనకు తెలియదనీ, తనకు సపర్యలతోనే కాలం గడిచిపోయేదనీ, భర్త చిన్న వయసులోనే చనిపోయాడనీ చెప్పింది. అదే విషయం పోయి గురువుకు చెప్తే, గురువు అతను సత్యం చెప్పినందుకు అతన్ని మెచ్చుకుని అతనికి విద్య నేర్పుతానన్నాడు.

**మంత్రం – 5 :– నైతదబ్రాహ్మణో వివక్తుమర్హతి –** సత్యం పలికాడు కాబట్టి అతను ఉన్నతమైన కుటుంబానికి చెందినవాడై ఉండాలని అంటే బ్రాహ్మణుడై ఉండాలని అన్నాడు. బ్రాహ్మణుడంటే గుణ బ్రాహ్మణునిగా తీసుకోవాలి.

సత్యకాముని తల్లి తనకు గోత్రం తెలియదన్నందుకు కొంతమంది ఆవిడ మంచిది కాదని, సత్యకాముని పుట్టుక మంచిది కాదనీ వక్రభాష్యం చేస్తారు. కాని శంకరాచార్యులు ఇందులో వ్యతిరేకార్థం తీయకూడదనీ, భర్తకు సేవచేయటంలో అంకితమైపోయిందనీ అంటారు. శంకరాచార్యులు రాసిన భాష్యానికి ఆనందగిరి వివరణ రాశారు. దాన్ని టీకా అని, రాసిన ఆనందగిరిని టీకాకారులనీ అంటారు.

**పరిచార చిత్తవశాత్, లజ్జావశాత్ తానపృష్టవతి** అన్నారు ఆనందగిరి. సేవ చేయటంలో లీనమైపోవటం వల్ల, సిగ్గు వల్ల, దుఃఖం వల్ల గోత్రం పట్టించుకోలేదు తప్ప ఆమె శీలవతి కాదనకూడదు అంటారు ఆయన.

కథలో గ్రహించాల్సిన విషయాలు సత్యకామ సత్యం చెప్పిన విధానం, ఆ తర్వాత అతను చూపిన శ్రద్ధ, తపస్సు, గురుభక్తి. గురువు అతని సత్యవాక్కుకి మెచ్చి ఉపనయనం చేసి, నీకు విద్య నేర్పుతాను కాని ముందు వెళ్ళి ఈ ఆవులను మేపుకు రమ్మని పంపుతాడు. దాంట్లో గురువు మాట మీద శ్రద్ధ కనపడుతుంది. అతను మొక్కుబడిగా తీసుకువెళ్ళకుండా ఆ ఆవులు వెయ్యి అయ్యేదాకా తిరిగిరానన్న కఠిన నిర్ణయం తీసుకుని వెళ్ళాడు. దానివల్ల అతని తపస్సు తెలుస్తుంది.

**పంచమ ఖణ్డః (5)**

**అథ హైనమృషభోఽభ్యువాద సత్యకామ 3 ఇతి భగవ ఇతి హ ప్రతిశుశ్రావ ప్రాప్తాస్సోమ్య సహస్రగ్ం స్మః ప్రాపయ న ఆచార్యకులమ్ ॥1॥ బ్రహ్మణశ్చ తే పాదం బ్రవాణీతి। బ్రవీతు మే భగవానితి తస్మై హోవాచ**

**ప్రాచీ దిక్కలా ప్రతీచీ దిక్కలా దక్షిణా దిక్కలోదీచీ దిక్కలైష వై సోమ్య చతుష్కలః పాదో్బ్రహ్మణః ప్రకాశవాన్నామ ॥2॥ స య ఏతమేవం విద్వాగ్ంశ్చతుష్కలం పాదం బ్రహ్మణః ప్రకాశవానిత్యుపాస్తే ప్రకాశవానస్మింల్లోకే భవతి ప్రకాశవతో హ లోకాన్ జయతి య ఏతమేవం విద్వాగ్ంశ్చతుష్కలం పాదం బ్రహ్మణః ప్రకాశవానిత్యుపాస్తే ॥3॥**

అలా ఎన్నాళ్ళో ఆవులు మేత మేసేటట్టు చూసేవాడు. సాయంకాలం అయ్యేసరికి ఒకచోట కట్టి, తన నిత్యకర్మ చేసుకునే వాడు. అలా ఒక సాయంకాలం చేస్తుండగా ఒక ఎద్దు వచ్చి, 'ఇప్పుడు మేము వెయ్యి అయ్యాము. మమ్మల్ని ఇంటికి తీసుకువెళ్ళవచ్చు,' అని చెప్పింది. ఎద్దు ఎలా మాట్లాడగలదు? శంకరాచార్యులు మాట్లాడింది ఎద్దు కాదనీ, అతని శ్రద్ధ, తపస్సు, బ్రహ్మచర్యం వల్ల దేవతలు అతన్ని మెచ్చి ఎద్దు ద్వారా మాట్లాడారని చెప్తారు. ఇక్కడ మాట్లాడింది వాయుదేవత.

దీని ఉద్దేశ్యం గురుభక్తి ఉంటే, ఆచార్యుడు ఎదురుగా ఉన్నా లేకపోయినా కూడా, దేవుడు ఏదో రూపంలో దీవిస్తాడు అని. వాయుదేవత నీ సేవకి మెచ్చి నీకు చతుష్పాద బ్రహ్మ ఉపాసనలో ప్రథమ పాదం నేర్పుతానని అంది. పాదం అంటే నాలుగో వంతు. ప్రథమపాదంలో 4 భాగాలు ఉన్నాయి. అందుకని చతుష్పాద పాదం అంటారు. సత్యకామ తాను సిద్ధమే అన్నాడు. వాయువు నాలుగు దిక్కుల గురించీ అంటే తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిశలు చెప్పి దానికి పేరు ప్రకాశవాన్ నామం అంది. ఆ ఉపాసన చేసిన వ్యక్తి ఇక్కడ పేరు పొందుతాడు. పరలోకంలో ప్రకాశించే లోకాలకు అంటే స్వర్గలోకాలకు వెళ్తాడు.

### షష్ఠః ఖణ్డః (6)

**అగ్నిష్టే పాదం వక్తేతి స హ శ్వోభూతే గా అభిప్రస్థాపయాఞ్చకార తా యత్రాభిసాయం బభూవుస్తత్రాగ్ని ముపసమాధాయ గా ఉపరుధ్య సమిధమాధాయ పశ్చాదగ్నేః ప్రాఙ్ఙుపోపవివేశ ॥1॥ తమగ్నిరభ్యువాద సత్యకామ 3 ఇతి భగవ ఇతి హ ప్రతిశుశ్రావ ॥2॥ బ్రహ్మణ స్సోమ్య తే పాదం బ్రవాణీతి బ్రవీతు మే భగవానితి తస్మై హోవాచ పృథివీ కలాఽన్తరిక్షం కలా ద్యౌః కలా సముద్రః కలైష వై సోమ్య చతుష్కలః పాదో బ్రహ్మణోఽనన్తవాన్నామ ॥3॥ స య ఏతమేవం విద్వాగ్ంశ్చతుష్కలం పాదం బ్రహ్మణోఽ**

**నన్తవానిత్యుపాస్తేఽ నన్తవానస్మింల్లోకే భవత్యనన్తవతో హ లోకాన్‌జయతి య ఏతమేవం విద్వాగ్ంశ్చతుష్కలం పాదం బ్రహ్మణోఽ నన్తవానిత్యుపాస్తే ॥4॥**

రెండో పాదం అగ్ని చెప్తుందంది వాయువు. ఉపనిషత్తు అతని దినచర్యని మళ్ళీ చెప్తుంది. సత్యకామ ఆవులను గురుకులం వైపుగా తోలుకు వచ్చి, అవి మేతమేశాక, సాయంకాలం వాటిని కట్టేసి, తను సంధ్యావందనం, సమిధ దానం చేసి అగ్నికి ఎదురుగా కూర్చుంటే అగ్ని దేవత వచ్చి రెండోపాదం గురించి చెప్పింది. అవి భూలోక, భువర్లోక, సువర్లోకాలు,సముద్రం. దానికి పేరు అనంతవాన్. ఫలం కూడా అనంతంగా ఉంటుంది.

**సప్తమ ఖణ్డః (7)**

**హగ్ంసస్తే పాదం వక్తేతి స హ శ్వోభూతే గా అభిప్రస్థాపయాఞ్చకార తా యత్రాభిసాయం బభూవుస్తత్రాగ్ని ముపసమాధాయ గా ఉపరుధ్య సమిధమాధాయ పశ్చాదగ్నేః ప్రాఙ్ఉపోపవివేశ ॥1॥ తగ్ం హగ్ంస ఉపనిపత్యాభ్యువాద సత్యకామ 3 ఇతి భగవ ఇతి హ ప్రతిశుశ్రావ ॥2॥ బ్రహ్మణః సోమ్య తే పాదం బ్రవాణీతి బ్రవీతు మే భగవానితి తస్మై హోవాచాగ్నిః కలా సూర్యః కలా చన్ద్రః కలా విద్యుత్కలైష వై సోమ్య చతుష్కలః పాదో బ్రహ్మణో జ్యోతిష్మాన్నామ ॥3॥ స య ఏతమేవం విద్వాగ్ంశ్చతుష్కలం పాదం బ్రహ్మణో జ్యోతిష్మానిత్యుపాస్తే జ్యోతిష్మానస్మింల్లోకే భవతి జ్యోతిష్మతో హ లోకాన్ జ్జయతి య ఏతమేవం విద్వాగ్ంశ్చతుష్కలం పాదం బ్రహ్మణో జ్యోతిష్మానిత్యుపాస్తే ॥4॥**

మూడోపాదం హంస చెప్తుందంది అగ్ని. హంస అంటే సూర్యదేవతగా తీసుకోవాలంటారు శంకరులవారు. హంతీ గచ్ఛతి ఇతి హంసః సూర్యదేవత ఎలా వచ్చింది? ఉపనిషత్తు చెప్పలేదు. బహుశా ఇంకో ఆవు రూపంలో అయి ఉండవచ్చు. సూర్యుడు చెప్పిన నాలుగు కలలు – అగ్ని, సూర్యుడు, చంద్రుడు, విద్యుత్తు. అన్నీ జ్యోతులు కాబట్టి దీని పేరు జ్యోతిష్మాన్. ఈ ఉపాసకుడు పేరు ప్రఖ్యాతులు పొంది జీవితంలో వెలుగు వెలుగుతాడు.

**అష్టమ ఖణ్డః (8)**

**మద్గుష్టే పాదం వక్తేతి స హ శ్వోభూతే గా అభిప్రస్థాపయాఞ్చకార తా యత్రాభిసాయం బభూవుస్తత్రాగ్నిముపసమాధాయ గా ఉపరుధ్య సమిధనూధాయ పశ్చాదగ్నేః ప్రాఙుపోపవివేశ ॥1॥ తం మద్గురుపనిపత్యాభ్యువాద సత్యకామ 3 ఇతి భగవ ఇతి హం ప్రతిశుశ్రావ ॥2॥ బ్రహ్మణస్సోమ్య తే పాదం బ్రవాణీతి బ్రవీతు మే భగవానితి తస్మై హోవాచ ప్రాణః కలా చక్షుః కలా శ్రోత్రం కలా మనః కలైష వై సోమ్య చతుష్కలః పాదో బ్రహ్మణ ఆయతనవాన్నామ ॥3॥ స య ఏతమేవం విద్వాగ్ంశ్చతుష్కలం పాదం బ్రహ్మణ ఆయతనవానిత్యుపాన్తే ఆయతన వానస్మింల్లోకే భవత్యాయతనవతో హ లోకాఞ్జయతి య ఏతమేవం విద్వాగ్ంశ్చతుష్కలం పాదం బ్రహ్మణ ఆయతనవానిత్యుపాస్తే ॥4॥**

నాలుగోపాదం మద్గుః చెప్తుందంటుంది హంస. మద్గుః అంటే అసలు అర్థం జలపక్షి. కాని తక్కిన మూడు పాదాలు దేవతలు చెప్పాయి కాబట్టి ఈ మద్గుఃని కూడా దేవతగా తీసుకోవాలంటారు శంకరులవారు. ఏ దేవత? ప్రాణదేవత! ఏ విధంగా? శంకరుల వారు మద్గుః అంటే నీరని ఒకచోట అర్థం వస్తుందనీ, ఇంకోచోట ప్రాణం అంటే మద్గుః అని అర్థం వస్తుందనీ, అందువల్ల మద్గుః = ఆపః = ప్రాణ అని తీసుకోవాలంటారు. ఏరూపంలో వచ్చి చెప్పిందన్నది మనం ఊహించుకోవాలి.

ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది. ఇంతవరకూ చెప్పిన కలలు, బాహ్యప్రపంచానికి చెందినవి. ఇందులో నాలుగు ఆధ్యాత్మానికి చెందినవి. అవి – ప్రాణం, చక్షువు, శ్రోత్రం, మనసు. వీటికి పేరు ఆయతనవాన్. ఆయతనం అంటే ఆధారం. అంటే మన జీవితం ఈ నాలుగు కలల వల్ల నడుస్తున్నది. ముందే చూసినట్టుగా ఇవి పంచ జ్ఞానేంద్రియాలను, పంచ కర్మేంద్రియాలను, పంచ ప్రాణాలను, నాలుగు అంతఃకరణాలను సూచిస్తాయి. వీటివల్లే జీవితం నడుస్తుంది. కాని ఇవేవీ నావి కావు. నేను నడపటం లేదు.

**ఈశ్వర వ్యతిరిక్తం నాస్తి –** ఈ చతుష్పాద బ్రహ్మ ఉపాసన ఉద్దేశం ఈశ్వరునికి భిన్నంగా ఏమీ లేదు. ఆధిదైవమూ ఈశ్వరుడే, అధ్యాత్మమూ

ఈశ్వరుడే. ఆధ్యాత్మం చెప్పకపోతే ఈశ్వరుడు బయటే ఉన్నాడు అనుకుంటాము. గీతలో విరాట్ ఉపాసనకి ఆధారం ఈ ఉపాసనే. తైత్తిరీయంలో పాంక్త ఉపాసన ఉద్దేశ్యం కూడా ఇదే. సమష్టిపరంగా, వ్యష్టిపరంగా ఐదేసి చెప్తుంది అందులో. ఇక్కడ నాలుగేసి చూస్తామంతే.

సత్యకామ జాబాల ఎన్నాళ్ళో ఈ ఉపాసన చేసి, గురుకులానికి ఆవులను తోలుకుని వెళ్ళాడు.

## నవమః ఖణ్డః(9)

**ప్రాప హాచార్యకులం తమాచార్యోఽభ్యువాద సత్యకామ3 ఇతి భగవ ఇతి హ ప్రతిశుశ్రావ ॥1॥ బ్రహ్మవిదివ వై సోమ్యభాసి కో ను త్వాఽను శశాసేతి। అన్యే మనుష్యేభ్య ఇతి హ ప్రతిజజ్ఞే భగవాగ్ంస్త్వేవ మే కామే బ్రూయాత్ ॥2॥ శ్రుతగ్ంహ్యేవ మే భగవద్దృశేభ్య ఆచార్యాద్ధైవ విద్యా విదితా సాధిష్ఠం ప్రాపతీతి। తస్మై హైతదేవోవాచాత్ర హ న కించన వీయాయేతి వీయాయేతి ॥3॥**

కొన్నాళ్ళు ఈ ఉపాసన చేశాక, జాబాల గురుకులానికి వెళ్ళాడు. ఆచార్యుడు హరిద్రుముడు అతని ముఖంలో బ్రహ్మవర్చస్సు చూశాడు.

**బ్రహ్మవిదివ వై భాసి–** బ్రహ్మ విద్య నేర్చుకున్నట్టు, నీ ముఖం ప్రకాశవంతంగా ఉంది. బ్రహ్మ విద్య అంటే నిర్గుణ బ్రహ్మజ్ఞానం కాదు. సగుణ బ్రహ్మ ఉపాసన అని మర్చిపోకూడదు. గురువుకెలా తెలిసింది? శిష్యుని రూపంలో ప్రశాంతత, ప్రసన్నత గోచరిస్తున్నాయి. 'ఎవరు నేర్పారు నీకు?' అని అడిగాడు.

**అన్యేమనుష్యేభ్య –** మనుష్యులు కాని వాళ్ళు నేర్పారు. కాని వాళ్ళు అలా వచ్చి, ఇలా చెప్పి, అలా మాయమయ్యారు. నేను సరిగ్గా నేర్చుకోలేదు. గురుశుశ్రూష చేసి నేర్చుకోలేదు కాబట్టి ఓ గురువా! నేను మళ్ళీ మీ ద్వారా నేర్చుకోవాలి అన్నాడు.

**ఆచార్యాద్ధైవ విద్యా విదితా సాధిష్ఠం ప్రాపతి –**

చాలా అందమైన వాక్యం. చాలా ముఖ్యమైనది కూడా. ఏ జ్ఞానమైనా గురుముఖతా నేర్చుకుంటేనే, అది కూడా శ్రద్ధగా నేర్చుకుంటేనే అది

రాణిస్తుంది. లౌకిక జ్ఞానం విషయంలో కొంత సడలింపు ఉండవచ్చేమో కాని, ఆధ్యాత్మిక విషయంలో గురువు ఉండితీరాలి. స్వంతంగా చదివి నేర్చుకుంటే, వచ్చేది కేవలం పరిజ్ఞానమే. ఛాందోగ్యభాష్యం కూడా ఇంగ్లీషులోకి అనువదించబడింది. అది చదవవచ్చు కాని శాస్త్రం దీవెన కావాలంటే మాత్రం గురువు ద్వారానే పొందాలి. అందుకని గురువుని మళ్ళీ చెప్పమన్నాడు.

**న కించన వీయాయ–** గురువు హరిద్రుముడు ఒక్కటి కూడా వదలకుండా చతుష్కల విశిష్ట చతుష్పాద బ్రహ్మ ఉపాసన బోధ మళ్ళీ చేశాడు. దీన్ని **సత్యకామ జాబాల ఉపాఖ్యానం** అని కూడా అంటారు.

**యస్యదేవే పరాభక్తిః యథాదేవే తథా గురౌ**
**తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశంతే మహాత్మన –**
**శ్వేతాశ్వతర ఉపనిషత్తు 6 – 23**

దేవుని మీద ఉన్న శ్రద్ధ గురువు మీద ఉంటే తేలిగ్గా అర్థమవుతుంది. అంతేకాదు, గురువు చెప్పని అంశం కూడా తడుతుందని ఎవరో వ్యాఖ్యానం చేశారు. అందువల్ల మంచి గురువు ఉండి, ఆ గురువు మీద శ్రద్ధ ఉంటే పూర్ణఫలం కలుగుతుంది.

**దశమః ఖణ్డః (10)**

**ఉపకోసలో హ వై కామలాయనస్సత్యకామే జాబాలే బ్రహ్మచర్యమువాస తస్య హ ద్వాదశ వర్షాణ్యగ్నీన్పరిచచార స హ స్మాన్యాన న్తేవాసినస్సమావర్తయగ్ంస్తగ్ం హ స్మైవ న సమావర్తయతి ॥1॥ తం జాయోవాచ తప్తో బ్రహ్మచారీ కుశలమగ్నీన్పరిచచారీన్మా త్వాఽగ్నయః పరిప్రవో చన్ప్రబ్రూహ్యస్మా ఇతి తస్మై హాప్రోచ్యైవ ప్రవాసాఞ్చక్రే ॥2॥ సహ వ్యాధినాఽనశితుం దధ్రే తమాచార్యజాయోవాచ బ్రహ్మచారిన్నశాన కింను నాశ్నాసీతి స హోవాచ బహవ ఇమేఽస్మిన్పురుషే కామా నానాత్యయా వ్యాధిభిః ప్రతిపూర్ణోఽస్మి నాశిష్యామీతి ॥3॥ అథ హాగ్నయస్సమూదిరే తప్తో బ్రహ్మచారీ కుశలం నః పర్యచారీద్ధన్తాఽస్మై ప్రబ్రవామేతి తస్మై హోచుః ప్రాణో బ్రహ్మ కం బ్రహ్మ ఖం బ్రహ్మేతి ॥4॥ స హోవాచ విజానామ్యహం యత్ప్రాణో బ్రహ్మ కం చ తు ఖం చ న విజానామీతి। తే హోచుర్యద్వావ కం తదేవ ఖం యదేవ ఖం తదేవ కమితి। ప్రాణం చ హాస్మై తదాకాశం చోచుః ॥5॥**

**ఉపకోసల విద్య –** ఖండాలు 10–15లో ఉపకోసల విద్య గురించి చెప్తుంది ఉపనిషత్తు. ఉపకోసలుడు అనే విద్యార్థి నేర్చుకున్న ఉపాసన కాబట్టి దీన్ని ఉపకోసల విద్య అంటారు. గురువు జాబాల. ముందు ఖండంలో శిష్యునిగా చూసినతనే. అప్పటి శిష్యుడే, ఇప్పటి గురువయ్యాడు. అలాగే కొనసాగుతుంది గురుశిష్య పరంపర.

**నారాయణం పద్మభువం వశిష్ఠం। శక్తిం చ తత్పుత్ర పరాశరం చ**

**మంత్రాలు 1,2 –**ఇది కూడా కథ రూపంలో వస్తుంది. – ముందు కథ.

ఉపకోసల సత్యకామ జాబాలుని ఆశ్రమానికి వస్తాడు. ఆశ్రమం అంటే సన్యాసులే ఉండాలని లేదు. పూర్వం గృహస్థులు కూడా ఆశ్రమాలలో ఉండేవారు. జాబాలునికి భార్య కూడా ఉంది. ఉపకోసలుడు 12 సంవత్సరాలు సత్యకామ దగ్గర విద్యనభ్యసించాడు. 12 సంవత్సరాలు విద్యనభ్యసించాక బ్రహ్మచర్యవ్రతం ముగిసిందనటానికి సూచనగా సమావర్తయం అని చేస్తారు. ఇప్పటి స్నాతకోత్సవం (కాన్వొకేషన్) లాంటిది అది. దాని తర్వాత బ్రహ్మచారి గృహస్థుగానో, సన్యాసిగానో మారవచ్చు.

గురువు తక్కిన బ్రహ్మచారులందరికీ సమావర్తయం చేశాడు కాని ఉపకోసలునికి చేయలేదు. అతను గురువు పిలుస్తాడని ఆశగా ఎదురుచూశాడు. గురుపత్ని కూడా అతని మీద జాలిపడి గురువుతో అతని తరుఫున మాట్లాడింది. అతను నిష్ఠగా మూడు అగ్నులకు పూజ చేశాడని చెప్పింది. కాని గురువు ఆ మాటలను పట్టించుకోకుండా బయట ఊరుకు వెళ్ళిపోయాడు.

**మంత్రం – 3 సహ వ్యాధినాఽనశితుం దధ్రే –** మనసు కలత చెందిన ఉపకోసలుడు సత్యాగ్రహం చేశాడు. గురుపత్ని ఎందుకు తినడం లేదు అని అడిగింది.

**కామా నానాత్యయాఽవ్యాధిభిః ప్రతిపూర్ణోఽస్మి –** తనకు అనేక కోరికలున్నాయని చెప్పాడు. వాటిని ఇంకా ఉన్నతమైన విషయాలు నేర్చుకోవాలన్న ఉన్నతమైన కోరికలున్నట్టుగా అర్థం చేసుకోవాలి. మనసు కలత చెందింది.

**మంత్రాలు – 4,5:–** అతని చేత సేవలు పొందిన మూడు అగ్నులు అతని మీద జాలిపడి, అతనికి ఈ క్రింది భాగాన్ని బోధ చేశాయి. సత్యకామ

శిష్యునికి బోధ చేయకుండా వెళ్ళిపోయాడంటే అందులో దురాలోచన ఏమీ లేదు. తనకు గురువు మీద శ్రద్ధ ఉన్నందువల్ల తనకెలా దేవతలు చతుష్పాద బ్రహ్మ ఉపాసన నేర్పాయో అతనికీ అతని భక్తి వల్ల అలాగే జరుగుతుందన్న నమ్మకంతో వెళ్ళాడు అనుకోవాలి. అతని నమ్మకం వమ్ము కాలేదు. అతను ఆశించినట్టే మూడు అగ్నులు ఉపకోసలునికి విద్య నేర్పించాయి. అవి ఏమి నేర్పించాయో తెలుసుకునే ముందు ఒకసారి ఆ మూడు అగ్నుల గురించీ గుర్తు చేసుకుందాము.

1. గార్హపత్య అగ్ని:– గృహపతికి సంబంధించింది కాబట్టి దాన్ని గార్హపత్య అగ్ని అంటారు. వివాహం తరువాత గృహస్థు ఈ అగ్నిని వెలిగిస్తాడు. అది ఇంక నిత్యాగ్నిగా వెలుగుతూనే ఉండాలి. రెండు సందర్భాలలోనే ఆ అగ్నిని ఆర్పుతారు. గృహస్థు సన్యాసం స్వీకరించినప్పుడు లేదా అతను మరణించినప్పుడు. అతను మరణించినప్పుడు ఆ అగ్నితోనే అతని దహన సంస్కారం చేస్తారు. సన్యాసి మరణించినప్పుడు కాల్చరు. ఎందుకంటే అతను కర్మలు చేయడు కాబట్టి, గార్హపత్యాగ్ని ఉండదు. కాల్చటం ద్వారా గృహస్థుని సంస్కరిస్తారు. సన్యాసి జ్ఞానాగ్నితో సంస్కరించబడుతాడు కాబట్టి అతనికి అవసరం లేదు.

2. ఆహవనీయాగ్ని– దీన్ని నిత్యకర్మలకు వాడతారు. గార్హపత్య అగ్నిలోంచి తీసుకుని, కర్మ అయిపోయాక మళ్ళీ అందులో కలుపుతారు.

3. దక్షిణాగ్ని – దక్షిణం వైపు ఉంటుంది కాబట్టి దక్షిణాగ్ని అంటారు. అందులో పచనం కాని అన్నం వేస్తారు. అందుకని అన్వాహార్యపచనాగ్ని అని కూడా అంటారు. ఈ మూడు అగ్నులూ తమలో తాము చర్చించుకుని, ఇతను మామూలు బ్రహ్మచారి కాదనీ, ఇతనికి నేర్పించాలనీ నిశ్చయించుకుంటాయి. తప్త అంటే నేర్చుకోవాలనే తపన ఉంది అనీ, కలత చెందాడు అనీ వస్తుంది అర్థం.

మూడు అగ్నులూ కలసి ఉపకోసలునికి రెండు ఉపాసనలు నేర్పాయి.

1. హిరణ్యగర్భ ఉపాసన – సమష్టి సూక్ష్మ శరీరంతో కూడిన చైతన్యం.

2. ఈశ్వర ఉపాసన – సమష్టి కారణ శరీరంతో కూడిన చైతన్యం లేదా మాయాసహిత చైతన్యం.

ఇంకో విధంగా చెప్పాలంటే కార్య బ్రహ్మ (హిరణ్యగర్భ), కారణ బ్రహ్మ (ఈశ్వరుడు).

**మంత్రం-4:- హిరణ్యగర్భ ఉపాసన** :- ఈ మంత్రంలో ప్రాణోబ్రహ్మ అన్న పదం వాడింది ఉపనిషత్తు. వ్యష్టి శరీరంలో చూస్తే ప్రాణం. సమష్టిపరంగా చూస్తే సమష్టి ప్రాణం వాయువు, హిరణ్యగర్భ. ఇదంతా తత్త్వబోధలో వస్తుంది. వ్యష్టి ప్రాణానికి ఆధారం సమష్టి ప్రాణం. దీని వల్ల చిత్త విశాలత ఏర్పడుతుంది. నేను సమష్టిలో ఒక భాగాన్ని అని తెలుస్తుంది.

కార్యం బ్రహ్మ ఎందుకు? హిరణ్యగర్భ ఈశ్వరుని నుంచి పుట్టాడు, అతను జ్యేష్ఠపుత్రుడు.

**బ్రహ్మో దేవానాం ప్రథమః సంబభూవ - ముండకం**

**ఈశ్వర ఉపాసన - కం బ్రహ్మ ఖం బ్రహ్మ** - శంకరుల వారు తరచు ఈ మంత్రాన్ని చెపుతూ ఉంటారు. కారణబ్రహ్మను చెప్పటానికి కం బ్రహ్మ ఖం బ్రహ్మ అంది ఉపనిషత్తు. రెండు విశేషణాలు ఎందుకు వాడింది? దానికి ఒక కారణం ఉంది అంటున్నారు శంకరుల వారు. కం అంటే సుఖం. ఖం అంటే ఆకాశం.

**ఖం వాయుర్జ్యోతి ఆపః పృథివీ విశ్వస్య ధారిణీ-ముండకం**

కం అంటే సుఖం అని చూశాము కదా- సుఖాన్ని విషయ సుఖంగా వర్ణిస్తారు.మంచి కాఫీ తాగినా, చక్కటి సంగీతం విన్నా అది విషయ సుఖంలోకి వస్తుంది. కాని విషయ సుఖం పరిచ్ఛిన్నం. శాశ్వతం కాదు. అందుకని కేవలం కం బ్రహ్మ వాడితే బ్రహ్మానందం కూడా పరిచ్ఛిన్నం,శాశ్వతం కాదు అనుకునే ప్రమాదముంది. ఖం బ్రహ్మ కలపటం వల్ల ఆకాశం లాగా ఆ ఆనందం అపరిచ్ఛిన్నం అని తెలుస్తుంది.

ఖం అంటే ఆకాశం అని చూశాము కదా! కేవలం ఖం బ్రహ్మ వాడితే ఏమవుతుంది? ఆకాశం అంటే పంచభూతాల్లో ఒకటైనది. పంచభూతాలు జడం. అందువల్ల ఆకాశం జడం. అందువల్ల బ్రహ్మకూడా జడం అనుకునే ప్రమాదం ఉంది. కం బ్రహ్మ కలపటం వల్ల చేతనత్వం కలపటమవుతుంది. ఆనందం చేతనం.ఖంతో కలిసి అపరిచ్ఛిన్న సుఖం.

కం బ్రహ్మ ఖం బ్రహ్మ అనటం వల్ల అపరిచ్ఛిన్న బ్రహ్మానందం అని తెలుస్తున్నది. ఆకాశం అంటే భూతాకాశం కాదు. చిదాకాశం.

**మంత్రం - 5 -** ఉపకోసలునికి ఈ నిర్వచనం స్పష్టంగా అర్థమవలేదు. కం అంటే తెలుసు. ఖం అంటే తెలుసు అతనికి. కం అంటే పరిచ్ఛిన్నం. ఖం అంటే జడ ఆకాశం. అందుకని పరిచ్ఛిన్నం బ్రహ్మ ఎలా అయింది, జడాకాశం బ్రహ్మ ఎలా అయింది అని అడిగాడు.

**యద్వావ కం తదేవ ఖం యదేవ ఖం తదేవ కం -** పరిచ్ఛిన్న ఆనందం ఆకాశం పదంతో కలిసి అపరిచ్ఛిన్నం అయింది. జడమైన ఆకాశం చైతన్యమైన ఆనందంతో కలిసి చిదాకాశమైందని అగ్నులు చెప్పాయి.

**ప్రాణం చ హాస్మై తదాకాశం చోచుః**

ఉపనిషత్తు ఈ విద్యని ఇలా ముగిస్తున్నది. ప్రాణో బ్రహ్మ, కం బ్రహ్మ ఖం బ్రహ్మ ఉపాసన ఇది.

### ఏకాదశ ఖణ్డః (11)

**అథ హైనం గార్హపత్యోఽనుశశాస పృథివ్యగ్నిరన్నమాదిత్య ఇతి। య ఏష ఆదిత్యే పురుషో దృశ్యతే సోఽహమస్మి స ఏవాహమస్మీతి ॥1॥ స య ఏతమేవం విద్వానుపాస్తేఽపహతే పాపకృత్యాం లోకీభవతి సర్వమాయురేతి జ్యోగ్జీవతి నాస్యావరపురుషాః క్షీయన్తే ఉపవయం తం భుఞ్జామోస్మిగ్ంశ్చ లోకేఽముష్మిగ్ంశ్చ య ఏతమేవం విద్వానుపాస్తే ॥2॥**

**అంగ ఉపాసనలు -**

**మంత్రం -1:-** ఇక్కడ్నుంచీ ఒక్కొక్క అగ్నీ తన గురించి ఒక్కొక్క ఉపాసన చెప్పింది. ఇంతకు ముందు చెప్పినది **హిరణ్యగర్భ సముచ్ఛిత ఈశ్వర ఉపాసన.** దీనినే **కార్యబ్రహ్మ సముచ్ఛిత కారణబ్రహ్మ ఉపాసన** అని కూడా అంటారు. దీన్ని అంగీ ఉపాసన అంటారు. ఇప్పుడు రాబోయేవి అంగ ఉపాసనలు. వాటిని అంగీ ఉపాసనతో కలిపి చేయాలి.

**గార్హపత్య అగ్ని విద్య -** నాకు నాలుగు అంగాలు ఉన్నాయి. అవి పృథివీ, అగ్ని, అన్నం, ఆదిత్యుడు. వాటిని సూర్యదేవత మీద ఉపాసన చేయాలి. **ఏష ఆదిత్యేపురుషః.**

**మంత్రం-2 -** ఇప్పుడు చెప్పేమూడు అంగ ఉపాసనలకూ ఫలం ఒకటే.

**పాపకృత్యాం** - పాపాల నుంచి విడివడతాడు.

**లోకీభవతి -** ఊర్ధ్వలోకాలకు వెళతాడు.

**సర్వమాయురేతి–** అతనికే కాదు, అతని తరువాత తరం వాళ్ళకు కూడా దీర్ఘాయుష్షు ఉంటుంది.
**జ్యోగ్జీవతి–** ప్రకాశవంతమైన జీవితం గడుపుతాడు. ఎవరూ అతనిని విమర్శించరు, అందరూ పొగుడుతారు. ఎంతవరకు దీర్ఘాయుష్షు?
**ఉపవయం తం భుఞ్జామః –** ఎప్పటికీ అంటే ఇహలోకంలో, పరలోకంలో కూడా మేము రక్షిస్తాము. మామూలుగా భుఞ్జామ అంటే తినటం కాని ఇక్కడ భుం అంటే రక్షించటం. మేము రక్షిస్తాము అని అర్థం. ఒక్కముక్కలో చెప్పాలంటే, **యోగక్షేమం వహామ్యహం.**

**ద్వాదశః ఖణ్డః (12)**

**అథ హైనమన్వాహార్యపచనోఽనుశశాసాపో దిశో నక్షత్రాణి చన్ద్రమా ఇతి। య ఏష చన్ద్రమసి పురుషో దృశ్యతే సోఽహమస్మి స ఏవాహమస్మీతి ॥1॥ స య ఏతమేవం విద్వానుపాస్తేఽపహతే పాపకృత్యాం లోకే భవతి సర్వమాయురేతి జ్యోగ్జీవతి నాస్యావరపురుషాః క్షీయన్త ఉపవయం తం భుఞ్జామోఽస్మిగ్ంశ్చ లోకేఽముష్మిగ్ంశ్చ య ఏతమేవం విద్వానుపాస్తే ॥2॥**

**దక్షిణాగ్ని విద్య –** దక్షిణాగ్ని చెప్పింది. దీన్నే అన్వాహార్యపచనాగ్ని అని కూడా అంటారని చూశాము. దానికి నాలుగు అంగాలు – జలములు, దిక్కులు, నక్షత్రాలు, చంద్రుడు – **ఏష చన్ద్రమసి పురుషః.** చంద్రుని మీద ఉపాసన. ఫలం ఇందాకటిదే.

**త్రయోదశః ఖణ్డః (13)**

**అథ హైనమాహవనీయోఽనుశశాస ప్రాణ ఆకాశో ద్యౌర్విద్యుదితి। య ఏష విద్యుతి పురుషో దృశ్యతే సోఽహమస్మి స ఏవాహమస్మీతి ॥1॥ సయ ఏతమేవం విద్వానుపాస్తేఽపహతే పాపకృత్యాం లోకీ భవతి సర్వమాయురేతి జ్యోగ్జీవతి నాస్యావరపురుషాః క్షీయన్త ఉపవయం తం భుఞ్జామోఽస్మిగ్ంశ్చ లోకేఽముష్మిగ్ంశ్చ ఏతమేవం విద్వానుపాస్తే ॥2॥**

**ఆహవనీయాగ్ని విద్య –** ఆవహనీయాగ్ని చెప్పింది – దానికి నాలుగు అంగాలు– ప్రాణం, ఆకాశం, స్వర్గం, మెరుపు. ఇవన్నీ అగ్ని దేవతలు కాబట్టి

ఉపాసన కూడా ప్రకాశరూపమైన మెరుపు మీద చేయాలి. **ఏష విద్యుతి పురుషః** ఫలం ఇందాకటిదే.

**చతుర్దశ ఖణ్డః (14)**

**తే హోచురుపకోసలైషా సోమ్య తే ఽస్మద్విద్యాఽఽత్మ విద్యాచాఽఽచార్యస్తు తే గతిం వక్తేత్యాజగామ హాస్యాచార్యస్తమాచార్యోఽభ్యువాదోపకోసలా 3 ఇతి ॥1॥ భగవ ఇతీ హ ప్రతిశుశ్రావ బ్రహ్మవిద ఇవ సోమ్య తే ముఖం భాతి కా ను త్వాఽనుశశాసేతి కో ను మాఽనుశిష్యాద్భో ఇతీహాపేవ నిహ్నుతే ఇమే నూనమీదృశా అన్యాదృశా ఇతి హాగ్నీనభ్యూదే కిం ను సోమ్య కిల తేఽవోచన్నితి ॥2॥ ఇదమితి హ ప్రతిజజ్ఞే లోకాన్వావ కిల సోమ్య తేఽవోచన్నహం తు తే తద్వక్ష్యామి। యథా పుష్కరపలాశా ఆపో నశ్లిష్యన్త ఏవమేవం విది పాపం కర్మ న శ్లిష్యత ఇతి। బ్రవీతు మే భగవానితి తస్మై హోవాచ ॥3॥**

**అస్మద్విద్యాఽఽత్మ విద్యా** – మూడు అగ్నులు ఉపకోసలునితో చెప్పాయి ఇలా – మేము మా ప్రత్యేక ఉపాసనతో పాటు నీకు ఆత్మవిద్య కూడా బోధించాము. ఉపాసనకాండలో ఉన్నంతవరకూ ఒక విషయం మర్చిపోకూడదు. ఇక్కడ ఆత్మ విద్య అంటే నిర్గుణ ఆత్మ జ్ఞానం కాదు. ఆత్మవిద్య అంటే సగుణ బ్రహ్మ ఉపాసన. మాయాసహిత సగుణ కారణ బ్రహ్మ ఉపాసన.

**ప్రాణో బ్రహ్మ; కం బ్రహ్మ ఖం బ్రహ్మ**– అంగీ ఉపాసనలు.

ఆదిత్యపురుష ఉపాసన, చంద్ర పురుష ఉపాసన, విద్యుత్ పురుష ఉపాసనలు – అంగ ఉపాసన.

మేము ఈ ఐదు ఉపాసనలూ చెప్పాము కాని, ఫలం చెప్పలేదు. అంటే బ్రహ్మ ఉపాసన చేసిన వ్యక్తి ఏ గతి ద్వారా ఏ లోకానికి వెళ్తాడో చెప్పలేదు. అది నీ గురువు చెప్తాడు అంటాయి.

**మంత్రం–2:–** అనుకున్నట్టుగానే గురువు వెనక్కివచ్చాడు. ఉపకోసలుని మొహం బ్రహ్మవర్చస్సుతో వెలిగిపోవటం చూశాడు. తన కథ గుర్తుకు వచ్చి ఉంటుంది.

**బ్రహ్మవిద ఇవ సోమ్య తే ముఖం భాతి**– నీ ముఖం తేజోవంతంగా ఉంది.

నీకు ఎవరు బోధ చేశారు? అని అడిగాడు.
**కోఽనుమాను శిష్యాద్భో** – నాకెవరు చెప్తారు అన్నాడు శిష్యుడు. అబద్ధం చెప్పినట్టుగా కనపడినా, వెంటనే ఆ విషయాన్ని కప్పిపుచ్చటానికి, అగ్నులవైపు చూస్తూ మీ ముందు ఒకలా, మీరు లేనప్పుడు మరోలా ఉన్నాయి అన్నాడు.
**ఈదృశా అన్యాదృశా** – అంటే పరోక్షంగా మీరు లేనప్పుడు అవి నాకు విద్య నేర్పించాయని చెప్పినట్టయింది. ఏం చెప్పాయని గురువు అడిగితే, ఆ విద్యనంతా చెప్పి, గతి గురించి చెప్పలేదు, మీరు చెప్పండని కోరాడు.

సత్యకామ జాబాల, ఈశ్వర ఉపాసన గురించి ఆ అగ్నులు చెప్పినదానితో తాను తృప్తి చెందలేదనీ, దాన్ని తాను మరింత మెరుగ్గా చెప్తాననీ చెప్పాడు.
**గుణ విశిష్ట ఈశ్వర ఉపాసనను** చెప్తానన్నాడు. దాని గొప్పతనం ఏమిటి?
**లోకాన్వావ కిల సోమ్యతే ఽవోచన్నహం తు తే తద్వక్ష్యామి** – ఊర్ధ్వలోకాలకు వెళ్తావు. తను పాపనాశక ఈశ్వర ఉపాసన చెప్తానన్నాడు.
**యథా పుష్కరపలాశా అపో నశ్లిష్యన్త** – తామరాకు మీద నీటిబొట్టు తామరాకుని తడపనట్టుగా – ఈ ఉపాసన చేస్తే పాపఫలం అంటుకోదు. గురువు గుణవిశిష్ట బ్రహ్మ ఉపాసన, దాని ఫలం తర్వాతి ఖండంలో చెప్పాడు.

### పఞ్చదశ ఖణ్డః (15)

**య ఏషోఽక్షిణి పురుషో దృశ్యత ఏష ఆత్మేతి హోవా చైతదమృతమభయమేతద్బ్రహ్మేతి తద్యద్యప్యస్మిన్సర్పిర్వోదకం వా సిఞ్చతి వర్త్మనీ ఏవ గచ్ఛతి ॥1॥ ఏతగ్ం సంయద్వామ ఇత్యాచక్షత ఏతగ్ం హి సర్వాణి వామాన్యభిసంయన్తి సర్వాణ్యేనం వామాన్యభిసంయన్తి య ఏవం వేద ॥2॥ ఏష ఉ ఏవ వామనీరేష హి సర్వాణి వామాని నయతి। సర్వాణి వామాని నయతి య ఏవం వేద ॥3॥ ఏష ఉ ఏవ భామనీరేష హి సర్వేషు లోకేషు భాతి సర్వేషు లోకేషు భాతి య ఏవం వేద ॥4॥ అథ యదుచైవా స్మిఞ్ఛవ్యం కుర్వన్తి యది చ నార్చిషమేవాభిసమ్భవన్త్యర్చిషోఽహరహ్న అపూర్యమాణపక్షమాపూర్యమాణపక్షాద్యాన్షడుందఙ్ఙేతి మాసాగ్ం స్తాన్మాసేభ్యస్సంవత్సరగ్ం సంవత్సరాదాదిత్యమాదిత్యాచ్చన్ద్రమసం చన్ద్రనసో విద్యుతం తత్పురుషోఽమానవః సేతాన్బ్రహ్మ గమయత్యేష దేవపథో బ్రహ్మపథ ఏతేన ప్రతిపద్యమానా ఇమం మానవమావర్తం నావర్తన్తే నావర్తన్తే ॥5॥**

**గుణ విశిష్ట కారణ బ్రహ్మ లేదా ఈశ్వర ఉపాసన.** ఇది చాలా ప్రఖ్యాతి చెందిన ఉపాసన. ఇది ఉపకోసల విద్యగా కూడా పేరు పొందింది. కారణం బ్రహ్మ అయిన ఈశ్వరుడిని కన్ను వెనుక నున్న చైతన్యంగా ఉపాసన చేయాలి.

కన్ను మీద ఉపాసన కాబట్టి దీన్ని **అక్షి పురుష ఉపాసన** అని కూడా అంటారు. దీన్ని వివరంగా బ్రహ్మసూత్రాల్లో విశ్లేషిస్తారు.

కన్ను మీదే ఎందుకు? గురువే కారణం చెప్తున్నాడు. కంటిమీద నీరు పోస్తే, అది కంటి మీంచి జారిపోతుంది. కన్నుకి తడి అంటదు. అంటే కన్ను అసంగ స్వరూపం. ఇక్కడ నీరు బదులు సర్పి అంటున్నాడు గురువు. సర్పి అంటే కరిగిన వెన్న. కేవలం ఒక స్థానం అయిన అక్షే (కన్నే) అసంగం అయితే స్థానీ అయిన అసంగ పురుషుని గురించి వేరే చెప్పాలా? దాన్ని కౌముతిక న్యాయం అంటారు.

**కౌముతిక న్యాయం - కిం ఉత** నుంచి వచ్చింది. ఆ గుడి ప్రాకారమే పవిత్రంగా ఉంటుంది అంటే ఇంక గర్భగుడిలో ఉన్న దేవుని గురించి చెప్పేదేముంది?

ఫలం- కంటిని నీరు అంటనట్టుగా, పాపపుణ్యాలు అంటవు. ఒక కష్టం వచ్చినట్టుగా కూడా ఎవరికీ తెలియదు. ఇలా వచ్చి అలా వెళ్ళిపోతుంది.

ఈశ్వరుని 5 గుణాలు- **అమృతం, అభయం, సంయద్వామ, వామనీ, భామనీ-** అమృతం- నిత్యత్వం; అభయం- భయం లేకపోవటం; సంయద్వామ- మంగళకరమైనవి ఉన్న దేవుడు; వామనీ- మంగళకరమైనవి ఇచ్చే దేవుడు; భామనీ- చైతన్యప్రదాత.

ఫలం- ఐదు గుణాల్లో ఏ గుణం మీద ఉపాసన చేస్తే ఆ ఫలం వస్తుంది. ఉదాహరణకు నేను సంయద్వామ ఉపాసన చేస్తే నాలో మంగళకరమైనవి ఉంటాయి.

**అగ్నిర్జ్యోతిరహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్।**
**తత్ర ప్రయాతా గచ్ఛంతి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః॥ గీత 8- 24**

ఇందులో శుక్లగతి లోని మరికొన్ని దేవతల గురించి వస్తుంది. శాస్త్రం ప్రకారం మరణకర్మ చేసి తీరాలి. దాన్ని అంత్యేష్టి కర్మ అంటారు.

ఒక వ్యక్తి తాను జీవించి ఉన్నంతవరకూ అన్ని కర్మలూ అతనే చేస్తాడు. కాని అంత్యేష్టి అతనికి వేరే ఎవరో చేయాలి.

అంత్యేష్టి కర్మ చేస్తే ఆ సంస్కారం జీవాత్మను శుద్ధి చేస్తుంది. సంస్కరించబడ్డ జీవాత్మ ఉన్నత లోకాలకు వెళ్తుంది.

ఇక్కడ ఈ ఉపాసనను స్తుతించటానికి, ఉపనిషత్తు ఒక ఆసక్తికరమైన విషయం చెపుతున్నది. ఈ ఉపాసన ఎంత గొప్పదంటే, ఈ ఉపాసకుడు మరణించాక అతనికి అంత్యేష్టి సంస్కారం చేయకపోయినా ఫర్వాలేదు అంటుంది. శంకరాచార్యులు, ఇలాంటి వాక్యాలను తీసుకుని, అన్ని సందర్భాలలో వాడకూడదు అంటారు. ఉదాహరణకు నిత్యపూజలో ఏదైనా లేకపోతే దానిబదులు అక్షతాన్ సమర్పయామి అని వస్తుంది కదా. అందుకని ఆ వస్తువులు కొనగలిగినా కొనకుండా వాటిబదులు అక్షతలు వేయకూడదు. ఉపనిషత్తు అలా ఎందుకు చెప్పింది? అంత్యేష్టిని నిందించటానికి కాదు, ఉపాసనను స్తుతించటానికి.

**ఉపాసన స్తుత్యర్థం, నతు అంత్యేష్టి నింద్యార్థం**

శుక్లగతిలో తీసుకువెళ్ళే దేవతలు

అర్చి దేవత (జ్యోతి)

అర్చి దేవత నుంచి అహర్దేవత (పగలు)

అహర్దేవత నుంచి శుక్లపక్షదేవత

శుక్లపక్షదేవత నుంచి ఉత్తరాయణదేవత

ఉత్తరాయణదేవత నుంచి సంవత్సరదేవత

సంవత్సరదేవత నుంచి ఆదిత్యదేవత

ఆదిత్యదేవత నుంచి చంద్రదేవత

చంద్రదేవత నుంచి విద్యుద్దేవత

విద్యుద్దేవత నుంచి తత్పురుష అమానవ పురుషః (మనిషికన్నా ఉన్నతమైన దేవత) బ్రహ్మలోకానికి తీసుకువెళ్తుంది.

**ఏతాన్బ్రహ్మ గమయత్యేష దేవపథో బ్రహ్మపథః** – శుక్లగతికి ఇందులో రెండు పేర్లు వస్తున్నాయి. దేవపథం, బ్రహ్మపథం. తైత్తిరీయంలో ఇంద్రయోని అని వస్తుంది.

**ఇమం మానవమావర్తం నావర్తన్తే** – అక్కడ క్రమముక్తి పొందుతాడు. జనన

మరణాల వృత్తంలో పడదు. అమృతం, అభయం బ్రహ్మ అవుతాడు. దీనితో ఉపకోసల విద్య అయిపోయింది. ఇందులో 6 ఉపాసనలు వస్తాయి. 4 అంగ ఉపాసనలు, 2 అంగీ ఉపాసనలు వస్తాయి.

**ఉపకోసల విద్య అంగీ ఉపాసనల పేర్లు –**

**1. ప్రాణోబ్రహ్మ – హిరణ్యగర్భ ఉపాసన.**

**2. కం బ్రహ్మ ఖం బ్రహ్మ – ఈశ్వర ఉపాసన.**

**షోడశః ఖణ్డః (16)**

**ఏష హ వై యజ్ఞో యోఽయం పవత ఏష హ యన్నిదగ్ం సర్వం పునాతి। యదేష యన్నిదగ్ం సర్వం పునాతి తస్మాదేష ఏవ యజ్ఞస్తస్య మనశ్చ వాగ్వర్తనీ ॥1॥ తయోరన్యతరాం మనసా సగ్ంస్కరోతి బ్రహ్మా వాచాహోతాఽధ్వర్యురుద్గాతాఽన్యతరామ్। సయత్రోపాకృతే ప్రాతరనువాకే పురా పరిధానీయాయా బ్రహ్మా వ్యవవదతి ॥2॥ అన్యతరామేవ వర్తనీగ్ం సగ్ంస్కరోతి హీయతేఽన్యతరా స యథైకపాద్వ్రజన్రథో వైకేన చక్రేణ వర్తమానో రిష్యత్యేవమస్య యజ్ఞో రిష్యతి యజ్ఞగ్ం రిష్యన్తం యజమానోఽనురిష్యతి స ఇష్ట్వా పాపీయాన్ భవతి ॥3॥ అథ యత్రోపాకృతే ప్రాతరనువాకే న పురా పరిధానీయాయా బ్రహ్మా వ్యవవదత్యుభే ఏవ వర్తనీ సగ్ంస్కుర్వన్తి న హీయతేఽన్యతరా ॥4॥ స యథోభయపాద్వ్రజన్రథో వోభాభ్యాం చక్రాభ్యాం వర్తమానః ప్రతితిష్ఠత్యేవమస్య యజ్ఞః ప్రతితిష్ఠతి యజ్ఞం ప్రతితిష్ఠన్తం యజమానోఽనుప్రతితిష్ఠతి స ఇష్ట్వా శ్రేయాన్భవతి ॥5॥**

16,17 ఖండాల్లో ఏదైనా యజ్ఞం చేసేటప్పుడు ఏవైనా దోషాలు కలిగితే ఎలా ప్రాయశ్చిత్తం చేయాలో వస్తుంది.

**యజ్ఞ సాద్గుణ్యసంపాదనార్థం ప్రాయశ్చిత్తం**

**మంత్రం-1 –** ప్రాయశ్చిత్తం చెప్పేముందు యజ్ఞాన్ని వాయువుతో పోల్చింది ఉపనిషత్తు. ఎందుకు?

**పునాతి, చలతి –** పునాతి అంటే శుద్ధి చేస్తుంది. వాయువు శుద్ధి చేస్తుంది. యజ్ఞం యజమానిని శుద్ధి చేస్తుంది. వాయువు ఒకచోటి నుంచి ఇంకోచోటికి కదులుతుంది. యజ్ఞం యజమానిని ఒక లోకం నుంచి ఇంకోలోకానికి తీసుకువెళుతుంది.

**మనశ్చ వాగ్వవర్తనీ** - ఇక్కడ కూడా ఋషుల రూపకల్పన చూస్తాము. యజ్ఞాన్ని రెండు చక్రాలున్న రథంతో పోల్చారు. రెండు చక్రాలు మనసు, వాక్కు. అదెలాగో అర్థం చేసుకునేముందు యజ్ఞం గురించి కొంచెం తెలుసుకోవాలి. ఏ యజ్ఞానికన్నా నాలుగు వేదాలకు చెందిన ఋత్విక్కులు ఉంటారు. వాళ్ళకు వేరే పేర్లు ఉంటాయి.

| | | |
|---|---|---|
| 1. హోతా | -ఋగ్వేద బ్రాహ్మణుడు | - ఋగ్వేద మంత్రాలు పఠించాలి. |
| 2. అధ్వర్యు | -యజుర్వేద బ్రాహ్మణుడు | - ఆహుతులు సమర్పించాలి. |
| 3. ఉద్గాత | -సామవేద బ్రాహ్మణుడు | - దేవతలను ఆహ్వానిస్తూ సామగానం చేయాలి. |
| 4. బ్రహ్మ | -అథర్వణవేద బ్రాహ్మణుడు | -పై ముగ్గురిపనీ జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. వేదాలన్నీ తెలిసి ఉండాలి. |

మొదటి ముగ్గురి -హోతా, అధ్వర్యు, ఉద్గాతల - పని వాక్కు ప్రధానం. వాళ్ళు పఠించటం మానకూడదు. చివరి బ్రాహ్మణుడు అయిన బ్రహ్మ పని మనసు ప్రధానం. అతను మాట్లాడితే, తక్కినవాళ్ళని సరిగా గమనించలేడు. అందుకని అతను నిశ్శబ్దంగా ఉండాలి. అప్రమత్తంగాఉండాలి. ఒక్కమాటలో చెప్పాలంటే మొదటి ముగ్గురు మంత్రం ఆపకూడదు. ఆఖరి బ్రాహ్మణుడు నోరు విప్పకూడదు. వాక్కు ప్రధానం ఒకరిది. మనసు ప్రధానం ఇంకొకరిది. ఇదీ పరిస్థితి. ఈ ఖండంలో బ్రహ్మ పొరపాటు చేస్తే ప్రాయశ్చిత్తం ఏమిటో వస్తుంది. అది చూద్దాము.

**మంత్రం-2** - మనసు ప్రధానంగా పనిచేయాల్సిన బ్రహ్మ మాట్లాడితే- **వ్యవవదతి**- యజ్ఞం పరిపూర్ణం కాదు.

**మంత్రం-3** - ఎందుకు పరిపూర్ణం కాదు? ఇందాక చూశాం యజ్ఞాన్ని రెండు చక్రాలున్న రథంతో పోల్చారనీ, ఆ రెండు చక్రాలూ వాక్కు, మనసనీను. మనసనే ఒక చక్రం సరిగ్గా పనిచేయకపోతే, రథం గమ్యాన్ని చేరగలదా? **స ఇష్ట్వా పాపీయాన్ భవతి-** గమ్యాన్ని చేరకపోయినా కొంత నయం. కాని చెడు చేస్తే కష్టం. యజ్ఞంచేసే యజమానికి పాపం కలుగుతుంది.

**మంత్రం-4 - అథబ్రహ్మా వ్యవవదతి-** బ్రహ్మ మాట్లాడకుండా ఉంటే, రెండు చక్రాలూ సవ్యంగా ఉంటాయి.
**మంత్రం-5 - యజ్ఞః ప్రతితిష్ఠతి-** రెండు చక్రాలూ సవ్యంగా ఉండటంవల్ల, రథం ముందుకు సాగినట్టుగా యజ్ఞం సవ్యంగా సాగిపోతుంది.
**స ఇష్ట్వా శ్రేయాన్భవతి -** యజమానికి అతను చేసిన యజ్ఞం మంచి ఫలితాన్నిస్తుంది.

## సప్తదశ ఖణ్డః (17)

**ప్రజాపతిర్లోకానభ్యతపత్తేషాం తప్యమానానాగ్ం రసాన్ప్రావృహత్। అగ్నిం పృథివ్యా వాయుమన్తరిక్షాదాదిత్యం దివః ॥1॥ స ఏతాస్తిస్రో దేవతా అభ్యతపత్తాసాం తప్యమానానాగ్ం రసాన్ప్రావృహదగ్నేరృచో వాయోర్యజూగ్ంషి సామాన్యాదిత్యాత్ ॥2॥ స ఏతాం త్రయీం విద్యామభ్యతపత్తస్యాస్తప్యమానాయా రసాన్ప్రావృహద్భూరిత్యృగ్భ్యో భువరితి యజుర్భ్యస్స్వరితి సామభ్యః ॥3॥ తద్యదృక్తో రిష్యేద్భూస్స్వాహేతి గార్హపత్యే జుహుయాత్। ఋచామేవ తద్రసేన వీర్యేణర్చాం యజ్ఞస్య విరిష్టగ్ం సన్దధాతి ॥4॥ అథ యది యజుష్టో రిష్యేద్భువ స్స్వాహేతి దక్షిణాగ్నౌ జుహుయాద్యజుషామేవ తద్రసేన యజుషాం వీర్యేణ యజుషాం యజ్ఞస్య విరిష్టగ్ం సందధాతి ॥5॥ అథ యది సామతో రిష్యేత్స్వస్స్వాహేత్యాహవనీయే జుహుయాత్సామ్నామేవ తద్రసేన సామ్నాం వీర్యేణ సామ్నాం యజ్ఞస్య విరిష్టగ్ం సందధాతి ॥6॥ తద్యథా లవణేన సువర్ణగ్ం సన్దధ్యాత్సువర్ణేన రజతగ్ం రజతేన త్రపు త్రపుణా సీసగ్ం సీసేన లోహం లోహేన దారు దారు చర్మణా ॥7॥ ఏవమేషాం లోకానామాసాం దేవతానామస్యాస్త్రయ్యా విద్యాయా వీర్యేణ యజ్ఞస్య విరిష్టగ్ం సన్దధాతి భేషజకృతో హ వా ఏష యజ్ఞో యత్రైవంవిద్బ్రహ్మా భవతి ॥8॥ ఏష హ వా ఉదక్ప్రవణో యజ్ఞో యత్రైవం విద్బ్రహ్మా భవత్యేవంవిదగ్ం హ వా ఏషా బ్రహ్మాణమనుగాథా యతో యత ఆవర్తతే తత్తద్గచ్ఛతి ॥9॥ మానవో బ్రహ్మైవైక ఋత్విక్కురూనశ్వాభిరక్షత్యేవం విద్ధ వై బ్రహ్మా యజ్ఞం యజమానగ్ం సర్వాగ్ంశ్చర్త్విజోఽభిరక్షతి। తస్మాదేవంవిదమేవ బ్రహ్మాణం కుర్వీత నానేవంవిదం నానేవంవిదమ్॥10॥**

ఇప్పుడు వాక్కులో లోపం వస్తే ఎలా ప్రాయశ్చిత్తం చేయాలో చెపుతున్నది. మూడు వేదాలకు చెందిన ముగ్గురు బ్రాహ్మణులు ఉంటారు కాబట్టి, మూడు రకాల పొరపాట్లు దొర్లవచ్చు. వాటికి ప్రాయశ్చిత్తాలుకూడా మూడు రకాలు. అవి 3 వ్యాహృతిహోమాలు.

ఆ వ్యాహృతి హోమాలు ఏమిటో చెప్పేముందు ఉపనిషత్తు వాటిని స్తుతిస్తున్నది. అవి ఎంత శక్తివంతమైనవో చెపుతున్నది. వ్యాహృతికి రెండు అర్థాలున్నాయి.

**బ్రహ్మణా వ్యాహృతా ఉచ్ఛరితా ఇతి వ్యాహృతిః**

బ్రహ్మదేవుడు మొట్టమొదట ఉచ్చరించిన పదాలు వ్యాహృతులు.

**వ్యాహరతి సర్వాన్ దోషాన్ ఇతి వ్యాహృతిః**

అన్ని దోషాలను పోగొడుతుంది.

ఈ వ్యాహృతులు ఎలా వచ్చాయో చెపుతున్నది ఉపనిషత్తు.

బ్రహ్మదేవుడు ఒకసారి మూడు లోకాల సారం ఏమిటో తెలుసుకోవాలనుకుని తపస్సు చేశాడు. ఆ లోకాలు– భూలోక, భువర్లోక, సువర్లోకాలు. వాటి సారంగా మూడు దేవతలు వచ్చాయి. అగ్ని,వాయువు, ఆదిత్య. వాటి సారంగా మూడు వేదాలు వచ్చాయి.ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, వాటి సారంగా మూడు వ్యాహృతులు వచ్చాయి. భూః, భువః సువః. మూడు వ్యాహృతుల సారంగా మూడు మంత్రాలు వచ్చాయి. అ, ఉ, మ అవి కలిపి ఓంకారం అయింది. అందుకే గాయత్రీ మంత్రం చదివేముందు ఓం భూః భువః సువః అని చదువుతారు.

**మూడు వ్యాహృతులు**

| **మంత్రం** | **విషయం** | **వివరాలు** | **సారం** |
|---|---|---|---|
| 1. | మూడు లోకాలు | భూలోకం, భువర్లోకం, సువర్లోకం | మూడు దేవతలు |
| 2. | మూడు దేవతలు | అగ్ని, వాయువు, ఆదిత్య | మూడు వేదాలు |
| 3. | మూడు వేదాలు | ఋగ్వేదం,యజుర్వేదం,సామవేదం | మూడు వ్యాహృతులు |

4. మూడు వ్యాహృతులు భూః భువః సువః మూడు మాత్రలు

మూడు మాత్రలు అ, ఉ, మ ఓం కారం

ఇక్కడ మనకు వ్యాహృతులు కావాలి కాబట్టి ఉపనిషత్తు ఇక్కడితో ఆపింది. అ,ఉ,మలు తైత్తిరీయ ఉపనిషత్తులో వస్తాయి. ఇప్పుడు ఒక్కొక్క మంత్రంలో ఒక్కొక్క ప్రాయశ్చిత్తం వస్తుంది.

ఇక్కడ యజ్ఞం కాబట్టి భూః భువః సువః వ్యాహృతులను ఆయా అగ్నుల ముందు పఠించాలి. సాధారణంగా యజ్ఞాల్లో ఈ మూడు ప్రాయశ్చిత్తాలూ చేస్తారు. ఒకవేళ పొరపాట్లు జరిగినా సమస్య ఉండదు. సంధ్యావందనంలో కూడా ప్రాయశ్చిత్త మంత్రం వస్తుంది.

**మంత్రం-7:-** తప్పులు వచ్చాయని యజ్ఞాన్ని పూర్తిగా మానివేయలేరు కదా! మామూలు వస్తువులు అశుద్ధం అయితే,వాటిని వేరే వాటితో శుద్ధం చేస్తాము. అలాంటివి కొన్ని ఉదాహరణలు ఇస్తున్నది ఉపనిషత్తు.

**లవణేన సువర్ణగ్ం సన్దధ్యాత్-** లవణం అంటే మామూలుగా ఉప్పు. ఇక్కడ ప్రత్యేకమైన ఉప్పు. బంగారాన్ని లవణంతో శుద్ధి చేస్తాము.

**సువర్ణేన రజతగ్ం -** బంగారంతో వెండిని; **రజతేన త్రపు -** వెండితో తగరాన్ని; త్రపుణా **సీసగ్ం -** తగరంతో సీసాన్ని; **సీసేన లోహం -** సీసంతో ఇనుమును; **లోహేన దారు -** ఇనుముతో కట్టెను; **దారుచర్మణా -** కట్టెతో చర్మాన్ని బాగు చేస్తారు.

**మంత్రం -8 -** ఇక్కడ ఉద్దేశం వస్తువులు పాడయితే వాటిని పారేయకుండా బాగు చేసి వాడుకుంటున్నాం.

**ఏవమేషాం లోకానాం -** వ్యాహృతి వాడితే మూడు వేదాలను, మూడు దేవతలను, మూడు లోకాలను తలచుకున్నంత పుణ్యం. వేదాలను త్రయీ విద్యా అంది ఉపనిషత్తు.

**భేషజకృతో హ వా ఏష యజ్ఞః -** ప్రాయశ్చిత్తం చేసిన యజ్ఞం బాగుపడుతుంది. పూర్ణఫలం ఇస్తుంది.

**యత్రైవం విద్బ్రహ్మా భవతి -** బ్రహ్మకు బాగా తెలిస్తే, యజ్ఞానికి ప్రాయశ్చిత్తం చేయాల్సిన అవసరం లేకుండా బాగా జరుగుతుంది.

**మంత్రం- 9 -** బ్రహ్మస్తుతి. మిగతా ఋత్విక్కులు ఎలా ఉన్నా, బ్రహ్మ నిశ్శబ్దంగా, అప్రమత్తంగా ఉంటే యజ్ఞం పరిపూర్ణమవుతుంది.

**ఉదక్ప్రవణ** - ఉత్తరం వైపు ప్రయాణం చేస్తాడు యజమాని. వాయువు ప్రయాణించినట్టుగా, యజమాని ఉత్తరంవైపు ప్రయాణిస్తాడు. అంటే ఊర్ధ్వలోకాలకు వెళ్తాడు.

**బ్రహ్మాణమనుగాథా** - బ్రహ్మను మెచ్చుకుంటూ పాట ఇది.

**యతోయత ఆవర్తతే తత్తద్గచ్ఛతి** - ఎక్కడెక్కడ సమస్య ఉంటే, అక్కడికి బ్రహ్మ పరిగెత్తుకు వెళ్ళి సహాయం చేస్తాడు. బ్రహ్మను స్తుతిస్తూ ఒక ఉదాహరణ. తన మీద ఉన్న సైనికుడిని అశ్వం రక్షించినట్టుగా, బ్రహ్మ తన మౌనం ద్వారా యజమానిని రక్షిస్తాడు. **మానవో బ్రహ్మ** అంటే మౌనంగా ఉన్న బ్రహ్మ అని అర్థం.

ఇదంతా ఉపాసనకాండ అయినప్పుడు ఉన్నట్టుండి యజ్ఞం తీరుతెన్నులు, దాని ప్రాయశ్చిత్తం గురించి ఎందుకు చెప్పింది ఉపనిషత్తు? దానికి శంకరుల వారు ఇలా జవాబు చెప్తున్నారు. ఎలాగైతే యజ్ఞంలో బ్రహ్మ మౌనంగా ఉండాలో అలాగే ఉపాసకుడు కూడా మౌనంగా ఉండాలి. గలగలా మాట్లాడకూడదు.

**తత్రాపి మౌనం ఆపేక్షితం అత్రాపి యజ్ఞే బ్రహ్మనః మౌనీ ఆపేక్షితం**

అందువల్ల మౌనంగా ఉండాలన్న విషయం ఎత్తి చూపటానికి యజ్ఞం గురించి చెప్పింది.

**మంత్రం 10 - నానేవం విదం నానేవం విదమ్** - ఇక్కడితో ఖండం - 17, అధ్యాయం -4 ముగిశాయి.

# అధ్యాయం - 4 సారాంశం

ఇందులో మూడు కథలు చూశాము.

| | | ఖండాలు |
|---|---|---|
| రైక్వోపాఖ్యానం | - | 1-3 |
| సత్యకామోపాఖ్యానం | - | 4-9 |
| ఉపకోసలోపాఖ్యానం | - | 10-15 |
| యజ్ఞం+ ప్రాయశ్చిత్తం | - | 16-17 |

# ॥ ఛాందోగ్యోపనిషత్తు ॥

# అధ్యాయం - 5

ఈ అధ్యాయంలో చెప్పిన ఉపాసనలు చాలా ముఖ్యమైనవీ, ప్రసిద్ధి పొందినవీ. బ్రహ్మసూత్రాల్లో వీటిని విపులంగా చర్చించటం జరిగింది. ఇందులో మూడు ఉపాసనలను చెపుతున్నది ఉపనిషత్తు. అవి- ప్రాణ ఉపాసన, పంచాగ్ని ఉపాసన, వైశ్వానర ఉపాసన. ఉపాసనను విద్య అని కూడా అంటారని చూశాం.

### ప్రథమః ఖణ్డః (1)

**ఓమ్। యో హ వై జ్యేష్ఠం చ శ్రేష్ఠం చ వేద జ్యేష్ఠశ్చ హ వై శ్రేష్ఠశ్చ భవతి। ప్రాణో వావ జ్యేష్ఠశ్చ శ్రేష్ఠశ్చ ॥1॥ యో హ వై వసిష్ఠం వేద వసిష్ఠో హ స్వానాం భవతి। వాగ్వావ వసిష్ఠః ॥2॥ యో హ వై ప్రతిష్ఠాం వేద ప్రతి హ తిష్ఠత్యస్మిగ్ంశ్చ లోకేఽముష్మిగ్ంశ్చ। చక్షుర్వావ ప్రతిష్ఠా ॥3॥ యో హ వై సమ్పదం వేద సగ్ంహాస్మై కామాః పద్యన్తే దైవాశ్చ మానుషాశ్చ। శ్రోత్రం వావ సమ్పత్ ॥4॥ యో హ వా ఆయతనం వేదాయతనగ్ం హ స్వానాం భవతి। మనో హ వా ఆయతనమ్ ॥5॥ అథ హ ప్రాణా అహగ్ం శ్రేయసి వ్యూదిరేఽహగ్ం శ్రేయానస్మ్యహగ్ం శ్రేయానస్మీతి॥6॥ తే హ ప్రాణాః ప్రజాపతిం పితరమేత్యోచుర్భగవన్కో నః శ్రేష్ఠ ఇతి తాన్హోవాచ యస్మిన్వ ఉత్క్రాన్తే శరీరం పాపిష్ఠతరమివ దృశ్యేత స వః శ్రేష్ఠ ఇతి ॥7॥ సా హ వాగుచ్చక్రామ సా సంవత్సరం ప్రోష్య పర్యేత్యోవాచ కథమశకతర్తే మజ్జీవితుమితి। యథా కలా అవదన్తః। ప్రాణన్తః ప్రాణేన పశ్యన్తశ్చక్షుషా। శృణ్వన్తః శ్రోత్రేణ ధ్యాయన్తో మనసైవమితి ప్రవివేశ హ వాక్ ॥8॥ చక్షుర్హోచ్చక్రామ తత్సంవత్సరం ప్రోష్య పర్యేత్యోవాచ కథమశకతర్తే మజ్జీవితుమితి యథాఽన్ధా అపశ్యన్తః ప్రాణన్తః ప్రాణేన వదన్తో వాచా శృణ్వన్తశ్శ్రోత్రేణ ధ్యాయన్తో మనసైవమితి ప్రవివేశ హ చక్షుః ॥9॥ శ్రోత్రగ్ం హోచ్చక్రామ తత్సంవత్సరం ప్రోష్య పర్యేత్యోవాచ కథమశకతర్తే మజ్జీవితుమితి యథా బధిరా అశృణ్వన్తః ప్రాణన్తః ప్రాణేన వదన్తో వాచా పశ్యన్తశ్చక్షుషా**

**ధ్యాయన్తో మనసైవమితి ప్రవివేశ హ శ్రోత్రమ్ ॥10॥ మనో హోచ్చక్రామ తత్సంవత్సరం ప్రోష్య పర్యేత్యోవాచ కథమశకతర్తే మజ్జీవితుమితి యథా బాలా అమనసః ప్రాణన్తః ప్రాణేన వదన్తో వాచా పశ్యన్తశ్చక్షుషా శృణ్వన్తః శ్రోత్రేణైవమితి ప్రవివేశ హ మనః ॥11॥ అథ హ ప్రాణ ఉచ్చక్రమిషన్స యథా సుహయః పడ్వీశశంకూన్సం ఖిదేదేవ మితరా న్ప్రాణాన్సమఖిదత్। తగ్ం హాభిసమేత్యోచుర్భగవన్నేధి త్వం నః శ్రేష్ఠోఽసి మోత్క్రమీరితి ॥12॥ అథ హైనం వాగువాచ యదహం వసిష్ఠోస్మి త్వం తద్వసిష్ఠోఽసీత్యథ హైనం చక్షురువాచ యదహం ప్రతిష్ఠాస్మి। త్వం తత్ప్రతిష్ఠాఽసీతి ॥13॥ అథహైనగ్ం శ్రోత్రమువాచ యదహగ్ం సమ్పదస్మి త్వం తత్సమ్పదసీత్యథ హైనం మన ఉవాచ యదహమాయతనమస్మి త్వం తదాయతనమసీతి ॥14॥ న వై వాచో న చక్షూగ్ంషి న శ్రోత్రాణి న మనాగ్ంసీత్యాచక్షతే। ప్రాణా ఇత్యేవాచక్షతే ప్రాణో హ్యేవైతాని సర్వాణి భవతి ॥15॥**

**గుణ విశిష్ఠ ప్రాణ ఉపాసన**–ఖండాలు 1,2లలో ప్రాణ ఉపాసన లేదా ప్రాణ విద్య గురించి వస్తుంది. ప్రాణం అంటే సమష్టిప్రాణం లేదా ప్రాణశక్తి రూపంలో హిరణ్యగర్భ ఉపాసన అని వేరే సందర్భాలలో కూడా చూశాము. ఇక్కడ గుణ విశిష్ఠ ప్రాణ ఉపాసన చూస్తాము. అంటే ప్రాణానికి కొన్ని గుణాలను ఆపాదిస్తున్నది ఉపనిషత్తు.

మొత్తం 6 గుణాలు – **జ్యేష్ఠత్వం** – మొదట పుట్టటం; **శ్రేష్ఠత్వం**– గొప్పతనం; **వసిష్ఠత్వం**– ఐశ్వర్యం ఉండటం; **ప్రతిష్ఠాత్వం**– అందరికీ ఆధారంగా ఉండటం; **సంపదత్వం** – కామ్య విషయాలకు చెందిన సంపద ఉండటం; **ఆయతనత్వం** – అందరికీ నివాసంగా ఉండటం. ఈ ఆరు గుణాలూ ఉన్న హిరణ్యగర్భ ఉపాసన చేయాలి. కాని ఈ విషయాన్ని ఉపనిషత్తు తన స్వంత బాణిలో చెప్పుకొస్తున్నది.

**మంత్రాలు 1-5** ఈ 6 గుణాలూ ప్రాణానికి ముందే లేవుట. రెండే ఉన్నాయిట. **జ్యేష్ఠం చ శ్రేష్ఠం చ**. తక్కిన నాలుగూ, తక్కిన నాలుగు అంగాలకు చెందిన గుణాలు. ప్రాణానికి రెండు గుణాలుండటమేమిటి, తమకు ఒక్కటే ఉండటమేమిటి అని ఈర్ష్య పడ్డాయిట తక్కిన అంగాలు. వాటిలో ఏది గోప్పో వాటంతట అవి తేల్చుకోలేక, తమలో ఎవరు గొప్పో చెప్పమని

బ్రహ్మ దగ్గరకు వెళ్ళాయి. బ్రహ్మ ఒక కిటుకు చెప్పాడు.'మీలో ఒకరొకరూ, ఒక ఏడాది పాటు వ్యష్టిలోంచి బయటకు వెళ్ళండి, ఎవరు లేకపోతే కష్టమో, వాళ్ళు గొప్ప,' అన్నాడు. ఒక్కొక్కటీ బయటకు వెళ్ళినా ఏమవలేదు కానీ, ప్రాణం వెళ్ళబోతుంటేనే అన్నింటికీ కష్టమయి, ప్రాణాన్ని వెళ్ళవద్దని బ్రతిమాలుకుని ఆపటమే కాకుండా, వాటికున్న గుణాలను కూడా ప్రాణానికి ధారపోశాయి.ఆ విధంగా ప్రాణానికి ఆరు గుణాలు వచ్చాయి.

**మంత్రం 1 – యోహ వై జ్యేష్ఠం చ శ్రేష్ఠం చ –** ప్రాణం జ్యేష్ఠం, శ్రేష్ఠం ఎందుకు? శంకరాచార్యులు దానికి వివరణ ఇస్తారు. ఒక జీవి తల్లి కడుపులో పడ్డప్పుడు అతనిలో ముందు ఏర్పడే అంగం ప్రాణం. అందుకే ఒక జీవి ప్రాణం పోసుకుంది అంటారు. కళ్ళు, చెవులు, వాక్కు, మనసు తర్వాత ఏర్పడుతాయి. అందుకే పాపాయి ప్రాణం సరిగ్గా ఉందా లేదా చూస్తారు నెల నెలా. ఆ విధంగా ప్రాణం జ్యేష్ఠం. మొట్టమొట రూపుదిద్దుకున్నది.

శ్రేష్ఠం – కథలో ఇందాక చూసినట్టుగా, అన్నీ బయటకు వెళ్ళినా ఏమీ కాలేదు కానీ, ప్రాణం వెళ్ళబోతుంటేనే ఇబ్బంది అయ్యింది.

ఈ ప్రాణ ఉపాసన చేసిన వాళ్ళు, వాళ్ళు కూడా జ్యేష్ఠులు, శ్రేష్ఠులు అవుతారు. అంటే అందరిచేతా కీర్తించబడుతారు.

**మంత్రం–2: వసిష్ఠం వేద– వాగ్వావ వసిష్ఠః–** వాక్కు ఉపాసన చేసిన వాళ్ళు ఐశ్వర్యవంతులు అవుతారు. వసు అంటే ఐశ్వర్యం. అందుకే పృథివీని వసుంధర అంటారు.

**లక్ష్మీర్వసతి జిహ్వాగ్రే**
**జిహ్వాగ్రే మిత్ర బాంధవాః।**
**బంధనం చైవ జిహ్వాగ్రే**
**జిహ్వాగ్రే మరణం ధృవం॥**

వాక్కు వల్లే ఐశ్వర్యాన్ని పొందవచ్చు. కోరి మరణం తెచ్చుకోవచ్చు. అందువల్ల వాక్కు మీద ఉపాసన చేసినవాళ్ళకు ఐశ్వర్యం వస్తుంది. కాని శంకరుల వారు, వాక్కు, కన్ను, చెవి, మనసుల మీద చేసే ఉపాసనలను అర్థవాదం కింద తీసుకోమంటున్నారు. అంటే వాటికున్న గుణాన్ని స్తుతించటానికి చెప్పినవి. ఎలాగో అవి ప్రాణానికి ధారపోస్తాయి తర్వాత.

**మంత్రం–3: ప్రతిష్ఠాం వేద– చక్షుర్వావ ప్రతిష్ఠా–** కన్ను మీద ఉపాసన

చేసిన వాళ్ళు, ప్రతిష్ఠను పొందుతారు. ఎందుకు? కన్నే ప్రతిష్ఠ. నడిచేదారి సమంగా ఉందా, ఎగుడుదిగుడుగా ఉందా అన్నది కంటిచూపు ద్వారా తెలుసుకుని, మనిషి స్థిరంగా నడవగలడు. అందువల్ల కన్ను ప్రతిష్ఠ. అంటే స్థిరత్వాన్ని ఇచ్చేది.

**మంత్రం-4: సమ్పదం వేద- శ్రోత్రం వావ సమ్పత్ -** చెవి మీద ఉపాసన చేసిన వాళ్ళు సంపదలను పొందుతారు. ఎందుకు? చెవే సంపద. అంతకు ముందు వాక్కు వల్ల సంపద వస్తుందన్నాము. ఇక్కడ సంపదని కామ్యవిషయ సంపద అనవచ్చు. ఎలా? వేదాలను శ్రుతి అంటారని తెలుసు. చెవితో వేదాలను విని, ఆ జ్ఞానముతో కర్మలు చేస్తాము మనము. ఆ కర్మల వల్ల కోరికలు తీరి, ఇహలోక, పరలోక సుఖాలు కలుగుతాయి.

**మంత్రం-5: ఆయతనం వేద- మనో హ వా ఆయతనమ్-** మనసు మీద ఉపాసన చేసిన వాళ్ళు, తన వాళ్ళకు ఆశ్రయమవుతారు. ఎలా? మనసే ఆయతనం. మనసు మన ఆలోచనలకు, వాసనలకు, అనుభవాలకు నివాసస్థలం, ఆశ్రయం, ఆయతనం. అందుకని ఆశ్రయమిచ్చే మనసుకి ఉపాసన చేస్తే, అతనే ఇతరులకి ఆశ్రయమవుతాడు. కాని,ముందు ముందు, ఈ అంగాలన్నీ తమ శక్తులను ప్రాణానికి ధారపోస్తాయి. అందుకని వీటి ఉపాసనలు వీటి గుణాలను కీర్తించటానికి చెప్పబడ్డాయి.

**మంత్రాలు 6-7-**ఈ అంగాలన్నీ ప్రాణం మీద ఈర్ష్యతో భగ్గుమన్నాయి. ప్రాణానికి రెండు గుణాలు ఉన్నాయి. అందులోనూ మంచి గుణాలు. తమకేమో ఒక్కటే ఉంది. ఈ ఇంద్రియాలు తమలో తాము చర్చించుకుని, సమస్య తేలక ప్రజాపతి దగ్గరకు తీర్పుకి వెళ్ళాయి.

**భగవన్కో న శ్రేష్ఠ-** మాలో ఎవరు గొప్ప?

'మీలో ఎవరు బయటకి వెళ్ళినప్పుడు శరీరం అశుచి నిలయంగా అవుతుందో వారు గొప్ప,' అన్నాడు ప్రజాపతి. అశుచి నిలయం అంటే శవంగా అవుతుంది అని అర్థం.

**మంత్రం-8:** ఇక్కడనుంచీ ఒక్కొక్క ఇంద్రియం ఏడాదిపాటు బయటకి వెళ్లి వస్తుంది. అది లేకపోయినా జీవి మనుగడలో ఏ సమస్యా లేదని తెలుసుకుంటుంది. 8 నుంచి 11 వరకూ ఇదే విషయం వివరంగా చెప్తుంది ఉపనిషత్తు. అదే ఉపనిషత్తు ప్రత్యేకత. పదే పదే చెప్పటానికి వెనుకాడదు.

**యథాకలా అవదన్తః –** ఈ మంత్రంలో వాక్కు బయటకి వెళ్ళి వచ్చింది. ఎలాగైతే మూగవారు మాట్లాడకుండా జీవిస్తారో అలా జీవించాము అన్నాయి తక్కిన ఇంద్రియాలు. ప్రాణశక్తితో ప్రాణ వ్యాపారాలను చేస్తూ, కంటితో చూస్తూ, చెవితో వింటూ, మనసుతో సంకల్పిస్తూ జీవించారు. దీనివల్ల తాను గొప్ప కాదని వాగింద్రియము తెలుసుకుని మళ్ళీ తన పనిలో పడింది.

**మంత్రం–9:** ఇప్పుడు కన్ను వంతు. కన్ను వెళ్ళి వచ్చినా మార్పు లేదు. **యథాஉన్ధా అపశ్యన్తః –**గుడ్డివాడు చూడలేకపోయినా ఎలా తక్కినవాటి వల్ల జీవించగలడో, అలా జీవించాయి.

**మంత్రం–10**: ఇప్పుడు చెవి వంతు. **యథాబధిరా అశృణ్వన్తః –** చెవిటివాడు వినలేకపోయినా, ఎలా తక్కిన వాటి వల్ల జీవించగలడో, అలా జీవించాయి.

**మంత్రం–11:** మనసు పైకి వెళ్ళింది. **యథాబాలా అమనసః –** మంచి ఉదాహరణ. మనిషి ఒక్కడే బుద్ధిజీవి. అతను పురుషార్థాలనే లక్ష్యాలకోసం పాటుపడతాడని చూశాము. మనసు లేని ఈ మనిషి చిన్న పిల్లవాడిలాగా లక్ష్యాలు లేకుండా కాలం గడుపుతాడు.

**మంత్రం–12:** ప్రాణం పైకి లేవబోయింది. ఇంతవరకూ ఒక్కొక్కటీ వెళ్ళివచ్చాయి. **'ఉచ్చక్రామ'** అనే పదం వాడింది ఉపనిషత్తు అవి వెళ్ళాయి అని చెప్పటానికి. ఇక్కడ **'ఉచ్చక్రమిషన్సః'** లేవబోయింది, వెళ్ళలేదు.

**యథా సుహయః పడ్వీశశంకూన్సంఖిదేదేవ మితరాన్ప్రాణాన్సమఖిదత్** ఎలాగైతే మంచి గుఱ్ఱం కాళ్ళను కట్టివేసే కీలలను పెకలించి వేస్తుందో, అలా ఈ ప్రాణం తక్కిన ఇంద్రియాలను కూడా పెకలించి వేసింది. ప్రాణశక్తి అంత గొప్పది. అందుకే మరణకాలంలో, ప్రాణశక్తి క్షీణిస్తున్నప్పుడు మాట పడిపోతుంది. ఆహారం జీర్ణం కాదు, చెవి వినబడదు, కన్ను కనబడదు.

తక్కిన ఇంద్రియాలన్నీ ప్రాణాన్ని సమీపించి వేడుకున్నాయి–

**త్వం నః శ్రేష్ఠోஉసి మో త్క్రమీరితి–** నీవే మాలో శ్రేష్ఠం. నువ్వు వెళ్ళవద్దు అన్నాయి. మాకు ఉన్న గుణాలు నీ వల్లనే ప్రకాశిస్తున్నాయి. నీకు మేము మా శక్తిని ధారపోస్తాము అని కీర్తించాయి.

**మంత్రాలు– 13,14–**వాక్కు తన వసిష్ఠత్వాన్నీ, కన్ను తన ప్రతిష్ఠత్వాన్నీ, చెవి తన సంపదత్వాన్నీ, మనసు తన ఆయతనత్వాన్నీ ధారపోసాయి. ప్రాణానికి

ముందు రెండు గుణాలు ఉన్నాయి అని చూశాము. జ్యేష్ఠత్వం, శ్రేష్ఠత్వం వెరసి ఆరుగుణాలయ్యాయి ప్రాణానికి. అవి–

**జ్యేష్ఠత్వం, శ్రేష్ఠత్వం,వసిష్ఠత్వం, ప్రతిష్ఠత్వం, సంపదత్వం, ఆయతనత్వం – షడ్గుణాలంకృతః ప్రాణః॥**

**మంత్రం 15 –** ఇంద్రియాలు మా పేర్లు కూడా నీకు ధారపోస్తున్నాము. మమ్మల్ని వాక్కు, కన్ను, చెవులు, మనసు అని చెప్పరు. ప్రాణాలు అనే చెప్తారు. ఎందుకంటే నువ్వు లేనిదే మాకు శక్తి లేదు అని కీర్తించాయి.

వేదాంతశాస్త్రంలో ప్రాణం అంటే పంచప్రాణాలు అని అర్థం వస్తుంది. దశ ఇంద్రియాలు అని కూడా వస్తుంది. దానికి మూల కారణం ఇక్కడ తెలుస్తున్నది మనకు. తేడా ఎలా తెలుసుకోవటం? ముఖ్యప్రాణం అంటే పంచప్రాణాలు. అముఖ్య లేదా గౌణ ప్రాణం అంటే ఇంద్రియాలు.

**సప్త ప్రాణా ప్రభవన్తి తస్మాత్**
**సప్తార్చిషః సమిధః సప్త హోమాః – ముండక 2 – 1 –8**

ఇక్కడితో ప్రాణస్తుతి ముగిసింది.

**ద్వితీయః ఖణ్డః (2)**

**స హోవాచ కిం మేఽన్నం భవిష్యతీతి। యత్కిఞ్చిదిదమాశ్వభ్య ఆశకునిభ్య ఇతి హోచుః॥ తద్వా ఏతదనస్యాన్నమనో హ వై నామ ప్రత్యక్షం న హ వా ఏవంవిది కించనానన్నం భవతీతి ॥1॥ స హోవాచ కిం మే వాసో భవిష్యతీత్యాప ఇతి హోచుస్తస్మాద్వా ఏతదశిష్యన్తః పురస్తాచ్చోపరిష్టాచ్చాద్భిః పరిదధతి లమ్భుకో హ వాసో భవత్యనగ్నో హ భవతి ॥2॥ తద్ధైతత్సత్యకామో జాబాలో గోశ్రుతయే వైయాఘ్రపద్యాయోక్త్వోవాచ। యద్యప్యేనచ్ఛుష్కాయ స్థాణవే బ్రూయాజ్జాయేరన్నేవాస్మిఞ్ఛాఖాః ప్రరోహేయుః పలాశానీతి ॥3॥ అథ యది మహజ్జిగమిషేదమావాస్యాయాం దీక్షిత్వా పౌర్ణమాస్యాగ్ం రాత్రౌ సర్వౌషధస్య మన్థం దధిమధునోరుపమథ్య జ్యేష్ఠాయ శ్రేష్ఠాయ స్వాహేత్యగ్నావాజ్యస్య హుత్వా మన్థే సమ్పాతమవనయేత్ ॥4॥ వసిష్ఠాయ స్వాహేత్యగ్నావాజ్యస్య హుత్వా మన్థే సమ్పాతమవనయేత్ప్రతిష్ఠాయై స్వాహేత్యగ్నావాజ్యస్య హుత్వా మన్థే సమ్పాతమవనయేత్సంపదే స్వాహేత్యగ్నావాజ్యస్య హుత్వా మన్థే సమ్పాతమవనయేదాయతనాయ స్వాహేత్యగ్నావాజ్యస్య హుత్వా మన్థే**

**సమ్పాతమవనయేత్ ॥5॥ అథ ప్రతిసృప్యాంజలౌ మన్థమాధాయ జపత్యమో నామాసి।అమా హి తే సర్వమిదమ్। స హి జ్యేష్ఠశ్శ్రేష్ఠః। రాజాఽధిపతిస్స మా జ్యైష్ఠ్యగ్ం శ్రైష్ఠ్యగ్ం రాజ్యమాధిపత్యం గమయత్వహమేవేదగ్ం సర్వమసానీతి ॥6॥ అథ ఖల్వేతయర్చా పచ్ఛ ఆచామతి। తత్సవితుర్వృణీమహ ఇత్యాచామతి। వయం దేవస్య భోజనమిత్యాచామతి శ్రేష్ఠగ్ం సర్వధాతమమిత్యాచామతి। తురం భగస్య ధీమహీతి సర్వం పిబతి ॥7॥ నిర్ణిజ్య కగ్ంసం చమసం వా పశ్చాదగ్నేస్సంవిశతి చర్మణి వా స్థణ్డిలే వా వాచంయమోఽప్రసాహః। స యది స్త్రియం పశ్యేత్సమృద్ధం కర్మేతి విద్యాత్ ॥8॥ తదేష శ్లోకో యదా కర్మసు కామ్యేషు స్త్రియగ్ం స్వప్నేషు పశ్యతి సమృద్ధిం తత్ర జానీయాత్తస్మిన్స్వప్ననిదర్శనే తస్మిన్స్వప్ననిదర్శనే॥9॥**

మొదటి ఖండంలో గుణ విశిష్ట ప్రాణం గురించి చెప్తే, రెండవ ఖండంలో ప్రాణ విద్య, అంగకర్మ గురించి చెపుతుంది. అంటే ఉపాసన ఎందుకు చేయాలి, ప్రాణ ఉపాసన ఎలా చేయాలి వస్తాయి వరుసగా. ముందు ఖండంలో తక్కిన ఇంద్రియాలు వాటి శక్తిని ప్రాణానికి ధారపోయటం చూశాము.

**మంత్రం 1 –** ఇంకా ఇంద్రియాలకూ, ప్రాణానికీ మధ్య సంవాదం కొనసాగుతున్నది.

**కిం మేఽన్నం భవిష్యతి –** నాకు ఆహారం ఏమిటి?

**యత్కిఞ్చిదిదమాశ్వభ్య ఆశకునిభ్యః –** కుక్కల నుంచి, పక్షుల నుంచి మొదలుపెట్టి సకల ప్రాణుల ఆహారమూ నీదే అని ఇంద్రియాలు చెప్పాయి. సర్వమూ ప్రాణ దేవతకు అన్నమే అనే అవగాహన కలగటం కోసమే శ్రుతి ఈ కథను చెప్పటంలోని ఉద్దేశం. అందుకే ఆహారాన్ని చూపిస్తూ **'ప్రాణాయ స్వాహా'** అంటాము.

అన్నము అనేది ప్రాణానికి ఇంకో ప్రత్యక్షనామం. జగత్తులోని ప్రాణులు ఏ ఆహారాన్ని తింటే, అది ప్రాణానికి ఆహారమవుతుంది. అన్నము అంటే చేష్ట. ప్రాణాన్ని మనం కళ్ళారా చూడలేము కాని ఒక వ్యక్తి హుషారుగా ఉంటే అతనిలో ప్రాణశక్తి ఎక్కువగా ఉందనుకుంటాము.

ఫలం– సర్వ అన్నం ప్రాణాన్నం ఇతి దృష్టి. ఏ విధమైన ఆహారాన్ని చులకనగా చూడదు.

**అన్నం న నింద్యాత్ తద్వ్రతం –** **తైత్తిరీయం**

అన్నాన్ని నిందించరాదు.

**కించనానన్నం భవతి–** ఈ విధంగా ప్రాణ ఉపాసన చేసిన వ్యక్తికి ఆహారం కానిది ఏదీ ఉండదు. మామూలుగా శాస్త్రం ప్రకారం కొన్ని తినకూడదు. నిషేధింపబడినవి తింటే పాపం చుట్టుకుంటుంది; కాని తప్పని పరిస్థితిలో నిషేధింపబడినది తినాల్సివస్తే అప్పుడు పాపం అంటదు.

(ఈ విషయం ఉషస్తి విషయంలో చూశాము)

ఇలాంటి ప్రత్యేక సందర్భాలలో జాగ్రత్తగా ఉండాలి. ఎవరినైనా కొడితే క్షమాపణ కోరాలి అని చెపితే దాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. అనుకోకుండా కొట్టటం సంభవిస్తే, క్షమాపణ కోరాలి. అంతేగానీ, తీరికగా కూర్చుని ఎవరినో కొట్టేసి, క్షమాపణ కోరమని కాదు అర్థం. అలాగే ప్రాణ ఉపాసన చేస్తే, ఏది పడితే అది తినమనీ కాదు అర్థం. దేన్నీ చులకనగా చూడకూడదనీ, అనుకోని పరిస్థితిలో నిషేధింపబడిన అన్నం తిన్నా ఫర్వాలేదనీ అర్థం.

**మంత్రం–2: కిం మే వాసో భవిష్యతి** – 'నాకు వస్త్రం ఏది?' అని అడిగింది ప్రాణం. ఎవరికైనా కావాల్సింది మూడు– ఆహారం, వస్త్రం, ఇల్లు. ఆహారం ఇప్పుడే చూశాము. ప్రాణానికి ఇల్లు శరీరం. సూక్ష్మశరీరంలోని ప్రాణం స్థూలశరీరంలో ఉంటే జీవించి ఉన్నదని అంటాం.

**ఆపః–** జలములని ఇంద్రియాలు చెప్పాయి. అందుకే తినేముందు, ఆచమనం చేయటం ద్వారా ప్రాణానికి వస్త్రాన్ని ఏర్పరుస్తున్నాము. తినకముందు– **అమృతోపస్తరణమసి–** అమృతరూప జలాన్ని నీకు అంగవస్త్రంగా ఇస్తున్నాము. తిన్నాక – **అమృతాపిధానమసి–** అమృతరూప జలాన్ని నీకు ఉత్తరీయంగా ఇస్తున్నాము.

**ఫలం– లమ్భుకో హ వాసో భవతి–** ఈ ఉపాసన చేసిన వ్యక్తికి వస్త్రానికి లోటు ఉండదు. కాని ఇందులో ఒక షరతు ఉంది మీమాంస శాస్త్రం ప్రకారం. ఇది ప్రాణ విద్య (ఉపాసన) అంగకర్మ అని ముందే చూశాము. అందుకని ప్రాణ ఉపాసనతో జోడించి దీన్ని చేస్తేనే ఫలం.

**మంత్రం -3:** ఈ ఖండంలో ప్రాణ ఉపాసన స్తుతి గురు,శిష్యుల సంవాదం రూపంలో వస్తుంది. జాబాల అనే గురువు, గోశ్రుతి అనే శిష్యునికి బోధించాడు. గోశ్రుతి వ్యాఘ్రపదుని పుత్రుడు. అందుకే గోశ్రుతిని వైయాఘ్రపదుడు అనికూడా అంటారు.

**శుష్కాయ స్థాణవే బ్రూయాత్-** ఈ ప్రాణ స్తుతిని ఎండిన మోడు కోసం చెపితే, అది మళ్ళీ చిగురించి, కొత్త కొమ్మలు పుట్టుకొస్తాయి. వినటానికి వింతగా ఉన్నా, అది నిజమేనని మన విజ్ఞానశాస్త్రం కూడా నిరూపిస్తున్నది. ఒక శాస్త్రజ్ఞుడు ఎండిపోతున్న చెట్టుతో తీయగా మాట్లాడితే, అది నెమ్మదిగా చిగురించి, మళ్ళీ జీవం పోసుకుందని ఒక వ్యాసంలో రాశాడు. తనని సమీపిస్తున్న వ్యక్తి ప్రేమగా వస్తున్నాడా, హాని చేయటానికి వస్తున్నాడా అనే విషయం కనిపెట్టగలవట చెట్లు.

**మంత్రాలు 4,5:** ప్రాణ విద్య అంగకర్మ- దీన్ని అధికృత అధికారిత్వం అంటారు. బియ్యే చదివితేనే ఏమ్మేకి వెళ్ళగలిగినట్లుగా, ప్రాణ ఉపాసన చేస్తేనే ప్రాణ విద్య అంగకర్మ చేయాలి.

ఈ మంత్రాల్లో కర్మకాండ అనుభవం ఎలా ఉంటుందో కొంచెం రుచి చూస్తాము. వేదాంతంలో తరచు కర్మకాండ అనే పదం వింటుంటాము. ఇక్కడ చెప్పిన ఒక్క అంగకర్మ గురించి వింటేనే కర్మకాండ ఎంత కష్టమో తెలుస్తుంది. దీని పేరు మంథకర్మ.

ఉపాసకుడు, అమావాస్య రోజు దీక్ష పూని, పూర్ణిమ రాత్రి పెరుగు, తేనెలలో ధాన్యముల పిండిని పిష్ఠముగా చేసి, జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు అయిన ప్రాణదేవతకు అర్పితమగు గాక అని అగ్నిలో అర్పించాలి. మిగిలిన నేతిబొట్లను పిష్ఠముపైవేయాలి. దీన్ని ఆహుతీశేషం అంటారు. ప్రాణదేవత 6 గుణాలను చెప్తూ అర్పించాలి.

**జ్యేష్ఠాయ శ్రేష్ఠాయ స్వాహా**
**వసిష్ఠాయస్వాహా**
**ప్రతిష్ఠాయ స్వాహా**
**సంపదే స్వాహా**
**ఆయతనాయ స్వాహా**

అలా ఒక్కొక్కసారి మిగిలిన నేతిబొట్లను పిష్ఠముపై వేయాలి.

ఈ ఆహుతీ శేషాన్ని వాడాలి. దానికి కూడా మంత్రం ఉంది.

**మంత్రం 6-7:** ఈ మంథశేషం ఎలా తీసుకోవాలో వస్తుంది. అగ్నికి వెనక్కి జరిగి, మంథశేషాన్ని దోసిలిలో ఉంచుకుని ఇలా జపించాలి.

నువ్వు **అమః** అనే పేరు గలదానవు. జ్యేష్ఠత్వాన్ని, శ్రేష్ఠత్వాన్ని, ప్రకాశత్వాన్ని, ఆధిపత్యాన్ని ఉన్నదానవు. వీటిని నాకు కలుగజేయి.

**సర్వమసాని-** నేను ఈ సర్వం అగుదును గాక.

ఇది తినటం కూడా ఎలా పడితే అలా తినకూడదు. అగ్నికి వెనకకి జరగాలి. గబగబా తినకూడదు. నిల్చుని తినకూడదు. దానికి కూడా మంత్రం జపిస్తూ, నాలుగు పాదాలుగా జపించి, నాలుగు ముద్దలుగా తినాలి.

**తత్సవితుర్వృణీమహ**
**వయం దేవస్య భోజనమ్**
**శ్రేష్ఠగ్ం సర్వాధాతమ్**
**తురం భగస్య ధీమహి**

అంతా పూర్తి చేసాక ఏం చేయాలి? పడుకోవాలి.

**పశ్చాదగ్నేః** :- అగ్నికి దూరంగా పడమర దిక్కున పడుకోవాలి. తలని ఉత్తరం దిక్కున పెట్టుకోవాలి.

**స్థణ్డిలే** - యాగభూమిలో, చర్మం మీద పడుకోవాలి.

**స యది స్త్రియం పశ్యేత్సమృద్ధం కర్మేతి విద్యాత్-** అతని యజ్ఞం ఫలితాన్ని ఇస్తుందా లేదా అన్నది అతనికొచ్చే కలని బట్టి తెలుస్తుంది. అతను కలలో స్త్రీని చూస్తే అది విజయవంతమైనట్టు లెఖ్ఖ. ఆనందగిరి ఆ స్త్రీ ఉత్తమ స్త్రీ అని రాస్తారు.

**మంత్రం-8: యదా కర్మసు కామ్యేషు స్త్రియగ్ం స్వప్నేషు పశ్యతి** - దీని గురించి ఋగ్మంత్రం  ఉంది కామ్య కర్మ చేసిన రాత్రి స్త్రీని కలలో చూస్తే అతని కర్మ సుసంపన్నమైనదని అర్థం. ఈ కల వాసనాజన్యం కాదు. అలాగైతే అది అతని బలహీనతకు చిహ్నం. ఇక్కడ అతను యజ్ఞం చేశాడు, ప్రాణ ఉపాసన చేశాడు. స్త్రీని గురించి ఆలోచన లేదు. అందువల్ల ఇది వాసనాజన్యం కాదు. కర్మఫలం. అందుకని **తత్ర జానీయాత్తస్మిన్స్వప్న నిదర్శనే.**

కొన్ని విషయాలు గమనించాలి ఇందులో. ఈ యజ్ఞం చేయటానికి కూడా ప్రత్యేక సమయం ఉంది. అమావాస్య రోజు దీక్ష తీసుకుని, పౌర్ణమి

రోజు చేయాలి. అతని మనసు, వాక్కు అతని ఆధీనంలో ఉండాలి. అందుకని స్వప్నం అతని బలహీనత వల్ల కాదు, కర్మ ఫలం అని వచ్చింది.

**ఫలం–** అతను ప్రాణానికి ఉన్న గుణాల మీద ఉపాసన చేస్తాడు కాబట్టి ఆ గుణాలు అతనికీ వస్తాయి. శ్రేష్ఠత్వం, జ్యేష్ఠత్వం, వసిష్ఠత్వం వగైరా.

మంథకర్మ స్వతంత్ర కర్మ కాదు. దీన్ని ఉపాసనతో కలిపి చేయాలి.

స్వప్న స్త్రీ దర్శనం కర్మకాండలో ఏదో సందర్భంలో ఉంది. శంకరాచార్యులు దీన్ని వేదాంతంలో ఒక ముఖ్యమైన ప్రమాణంగా మార్చుకున్నారు. వేదాంతంలో ఒక క్లిష్టమైన ప్రశ్న ఉదయిస్తుంది. వేదాంతం ప్రకారం శరీరం, జగత్తు మిథ్య కదా. పూర్వపక్షి వేదాంతం కూడా మిథ్యా అని అడుగుతాడు. పూర్వపక్షి అంటే వేదపూర్వ భాగాన్ని నమ్మేవాడు. సిద్ధాంతి అద్వైత సిద్ధాంతి లేదా వేదాంతి అవును, మిథ్యే అంటాడు. పూర్వపక్షి బ్రహ్మ సత్యమా, మిథ్యా అంటాడు. బ్రహ్మ సత్యమే అంటాడు వేదాంతి.

అప్పుడు పూర్వపక్షి ఒక వాదన లేవదీస్తాడు. వేదాంతం ప్రమాణం, దాన్నేమో నువ్వు మిథ్య అంటున్నావు. బ్రహ్మను, వేదాంతం నిరూపిస్తుంది. కాని అది మిథ్య. మిథ్య వేదాంతం సత్యం బ్రహ్మను ఎలా నిరూపిస్తుంది?

దానికి శంకరాచార్యులు అనేక తార్కిక జవాబులు ఇస్తారు. ఇక్కడ ఈ సందర్భంలో ఈ విషయం ఎత్తటానికి కారణం, శంకరుల వారు ఈ స్వప్న స్త్రీ దర్శనం మంత్రాన్ని ఉదహరిస్తారు, తన వాదనను బలపరచు కోవటానికి. స్వప్నం మిథ్య, కాని దీని ద్వారా సత్యం కర్మ సుసంపన్నమైనదని తెలుస్తుంది అంటున్నారు. మిథ్యా స్వప్నం సత్యం కర్మఫలం ఇవ్వగా లేనిది, మిథ్యా వేదాంతం సత్యం బ్రహ్మను గురించి చెప్పలేదా?

## తృతీయః ఖణ్డః (3)

**శ్వేతకేతుర్హారుణేయః పంచాలానాగ్ం సమితిమేయాయ తగ్ం హ ప్రవాహణో జైవలిరువాచ కుమారాను త్వాఽ శిషత్పితేత్యను హి భగవ ఇతి ॥1॥ వేత్థ యదితోఽ ధి ప్రజాః ప్రయన్తీతి న భగవ ఇతి। వేత్థ యథా పునరావర్తన్త 3 ఇతి న భగవ ఇతి। వేత్థ పథోర్దేవయానస్య పితృయాణస్య చ వ్యావర్తనా 3 ఇతి న భగవ ఇతి ॥2॥ వేత్థ యథాఽ సౌ లోకో న సంపూర్యత 3 ఇతి న భగవ ఇతి। వేత్థ యథా పంచమ్యామాహుతావాపః పురుషవచసో భవన్తీతి నైవ భగవ ఇతి ॥3॥ అథ ను కిమనుశిష్టోఽ వోచథా యో హీమాని న**

**విద్యాత్కథగ్ం సోఽనుశిష్టో బ్రవీతేతి స హాయస్తః పితురర్ధమేయాయ తగ్ం హోవాచా ననుశిష్య వావ కిల మా భగవానబ్రవీదను త్వాఽశిషమితి ॥4॥ పంచ మా రాజన్యబన్ధుః ప్రశ్నానప్రాక్షీత్తేషాం నైకఞ్చనాశకం వివిక్తుమితి స హోవాచ యథా మా త్వం తదైతానవదో యథాఽహమేషాం నైకఞ్చన వేద। యద్యహమిమానవేదిష్యం కథం తే నావక్ష్యమితి ॥5॥ స హ గౌతమో రాజ్ఞోఽర్ధమేయాయ తస్మై హ ప్రాప్తాయార్హాఞ్చకార స హ ప్రాత స్సభాగ ఉదేయాయ తగ్ం హోవాచ మానుషస్య భగవన్గౌతమ విత్తస్య వరం వృణీథా ఇతి। స హోవాచ తవైవ రాజన్మానుషం విత్తం యామేవ కుమారస్యాన్తే వాచమభాషథాస్తామేవ మే బ్రూహీతి స హ కృచ్ఛ్రీ బభూవ ॥6॥ తగ్ం హ చిరం వసేత్యాజ్ఞాపయాఞ్చకార। తగ్ం హోవాచ యథా మా త్వం గౌతమావదో యథేయం న ప్రాక్త్వత్తః పురా విద్యా బ్రాహ్మణాన్గచ్ఛతి తస్మాదు సర్వేషు లోకేషు క్షత్రస్యైవ ప్రశాసనమభూదితి తస్మై హోవాచ ॥7॥**

**పంచాగ్ని విద్య –** ఇది చాలా ప్రఖ్యాతి చెందిన ఉపాసన. గురుశిష్యుల సంవాదం ద్వారా ఈ ఉపాసన చెప్పబడుతుంది. దీని ఉద్దేశం ప్రతి ఒక్క ఉపాసనా గురువు ద్వారా నేర్చుకోవాలి. అప్పుడే దాని ఫలం అధికంగా ఉంటుంది. అందుకే మంత్రోపదేశం చేయించుకోవాలి.

**మంత్రం 1 –** ఒక కథ వస్తుంది. దీన్ని ఆఖ్యాయిక అంటారు. గౌతముని పుత్రుడు, అరుణి మనవడు అయిన శ్వేతకేతు ఒకసారి పాంచాల రాజు కొలువుకు వెళ్ళాడు. రాజు పేరు ప్రవాహనజైవలి. శ్వేతకేతు అప్పటికే తండ్రి ద్వారా చాలానే నేర్చుకున్నాడు. అందుకని జ్ఞానం ఉందన్న అహంకారంతో వెళ్ళాడు రాజు దగ్గరకి. ప్రవాహన జైవలి గొప్ప జ్ఞాని. పూర్వం రాజులు కూడా విద్య నేర్పేవారు. నీకు నీ తండ్రి విద్యాబుద్ధులు నేర్పాడా అని అడిగాడు. శ్వేతకేతు గర్వంగా తనకు అంతా వచ్చు అన్నాడు. అప్పుడు రాజు అతనిని ఐదు ప్రశ్నలు అడిగాడు.

**మంత్రం–2** 1. **వేత్థ యథితోఽధి ప్రజాః ప్రయన్తి –**ఈ లోకం నుంచి జీవులు పైకి ఎక్కడికి వెళ్తారో తెలుసా?

2. **వేత్థ యథా పునరావర్తంత** – ఎలా తిరిగి వస్తారో తెలుసా?

3. **వేత్థ పథోర్దేవయానస్య పితృయాణస్య చ వ్యావర్తనా?** – శుక్లగతి, కృష్ణగతి

ఎక్కడ విడిపోతాయో తెలుసా?

**మంత్రం 3 - 4. వేత్థ యథాஉసౌ లోకో న సంపూర్యత? -** ఎందుకు స్వర్గలోకం నిండిపోవటం లేదో తెలుసా?

5. **వేత్త యథా పంచమ్యామాహుతావాపః పురుషవచసో భవంతి? -** ఐదవ ఆహుతి తర్వాత జల శరీరం పురుష శరీరం ఎలా పొందుతుందో తెలుసా?

**న భగవ -** ప్రతి ప్రశ్న తర్వాత నాకు తెలియదు అని చెప్పాడు శ్వేతకేతు.

**మంత్రాలు 4,5** శ్వేతకేతు జవాబు చెప్పలేకపోతే నువ్వు అంతా నేర్చుకున్నానన్నావు కదా, ఏం నేర్చుకున్నావు అన్నాడు రాజు. ఆ మాటలకు అవమానం చెందిన శ్వేతకేతు తండ్రి దగ్గరకు వెళ్ళి మీరు నాకు ఏమీ శిక్షణ ఇవ్వకుండానే ఇచ్చానన్నారు అని అడిగాడు. రాజు అడిగిన ప్రశ్నలను తిరిగి అడిగాడని ఊహించుకోవాలి. తండ్రి నిజాయితీగా తనకు కూడా తెలియదని ఒప్పుకున్నాడు. ఇద్దరూ కలిసి రాజు దగ్గరకి జవాబులు తెలుసుకోవటానికి వెళ్ళారు.

**మంత్రాలు 6,7 -** గౌతముడు, శ్వేతకేతు రాజు దగ్గరకి వెళ్ళారు. రాజు లేచి వచ్చి గౌతముని సాదరపూర్వకంగా ఆహ్వానించి, పూజ చేసి, మీకెంత ధనం కావాలంటే అంత కోరుకోమన్నాడు.

బ్రాహ్మణులు వేదపఠనం, పాఠనం చేయాలి; వేదం వాళ్ళు చదవాలి. ఇతరులకు చెప్పాలి. యజ్ఞం చేయాలి, యజ్ఞం చేయించాలి; దానం ఇవ్వాలి, తీసుకోవాలి. వాళ్ళు చేసే యజ్ఞాలకు కాని, పాఠనంకి కాని డబ్బులు అడుగకూడదు. దక్షిణ ఎంత ఇస్తే అంత తీసుకోవాలి. సంఘశ్రేయస్సు కోసం చేసే పెద్ద యాగాలకు రాజునుంచే డబ్బు తీసుకోవాలి. ఈ డబ్బుని మానుషం విత్తం అంటారు. ఉపాసన, యజ్ఞాలు, వైదిక జ్ఞానాన్ని దైవం విత్తం అంటారు. సంఘానికి బ్రాహ్మణుడు దైవం విత్తం ఇస్తాడు వేద పఠనం, పాఠనం ద్వారా, వైదిక కర్మల ద్వారా. శాస్త్రం ప్రకారం బ్రాహ్మణునికి మాత్రమే వేదం బోధించే అధికారం ఉంది. క్షత్రియుడు, వైశ్యుడు నేర్చుకోగలరు కాని వాళ్ళు బోధించలేరు. దానికి బదులుగా బ్రాహ్మణునికి అవసరమైన మానుషం విత్తాన్ని రాజు ఇవ్వాలి.

గౌతముడు 'నేను మానుషం విత్తం కోసం రాలేదు. దైవం విత్తం కోసం వచ్చాను. మీరు ఐదు ప్రశ్నలు అడిగారు. వాటి జవాబులు

తెలుసుకోవాలని వచ్చాను,' అన్నాడు. దీనివల్ల శాస్త్ర నియమం ఉల్లంఘించబడుతుంది. రాజుకి ధర్మసంకటం వచ్చింది. విద్య నేర్చుకునే ముందు గురువుకు పాదపూజ చేయాలి. క్షత్రియుడైన రాజుకి బ్రాహ్మణుడైన గౌతముడు పాదపూజ చేయాలంటే, బ్రాహ్మణుడు ఎలా భావించినా, క్షత్రియునికి ఇబ్బందిగా ఉంటుంది. కాని నేర్చుకుని తీరాలంటే వినయంగా ఉండాలి శిష్యుడు.

రాజు వారిని తనతో ఒక సంవత్సర కాలం ఉండమని కోరాడు. రాజు దగ్గర ఉండాలంటే, శిష్యునిలా ఉండి, అతనికి సేవ చేయాలి. కాని అతను ఇబ్బంది పడకుండా ఉండటానికి రాజే అతన్ని సముదాయించాడు. ఈ విద్యను ఇంతకుముందు బ్రాహ్మణులు నేర్చుకోలేదనీ, క్షత్రియపరంపరగా వచ్చిందనీ చెప్పాడు. బ్రాహ్మణుడైన గౌతముడు నేర్చుకుంటే, పంచాగ్ని విద్య నేర్చుకున్న మొట్టమొదటి బ్రాహ్మణుడవుతాడు.

ఇక్కడితో కథ ముగిసింది. ఖండాలు 4-10 లో ఐదు ప్రశ్నలకూ జవాబులు వస్తాయి.

**చతుర్థః ఖణ్డః (4)**

**అసౌ వావ లోకో గౌతమాగ్నిస్తస్యాదిత్య ఏవ సమిద్రశ్మయో ధూమోఽహరర్చిశ్చన్ద్రమా అఙ్గారా నక్షత్రాణి విస్ఫులిఙ్గాః ॥1॥ తస్మిన్నేతస్మిన్నగ్నౌ దేవా శ్రద్ధాం జుహ్వతి తస్యా ఆహుతేస్సోమో రాజా సమ్భవతి ॥2॥**

**పఞ్చమః ఖణ్డః (5)**

**పర్జన్యో వావ గౌతమాగ్నిస్తస్య వాయురేవ సమిదభ్రం ధూమో విద్యుదర్చిరశనిరఙ్గారా హ్రాదనయో విస్ఫులిఙ్గాః ॥1॥ తస్మిన్నేతస్మిన్నగ్నౌ దేవాస్సోమగ్ం రాజానం జుహ్వతి తస్యా ఆహుతేర్వర్షగ్ం సమ్భవతి ॥2॥**

**షష్ఠః ఖణ్డః (6)**

**పృథివీ వావ గౌతమాగ్నిస్తస్యాస్సంవత్సర ఏవ సమిదాకాశో ధూమో రాత్రిరర్చిర్దిశోఽఙ్గారా అవాన్తరదిశో విస్ఫులిఙ్గాః ॥1॥ తస్మిన్నేతస్మిన్నగ్నౌ దేవా వర్షం జుహ్వతి తస్యా ఆహుతేరన్నగ్ం సమ్భవతి ॥2॥**

**సప్తమః ఖణ్డః (7)**

**పురుషో వావ గౌతమాగ్నిస్తస్య వాగేవ సమిత్ప్రాణో ధూమో జిహ్వాఽ**

**ర్చిశ్చక్షురంగారాశ్శ్రోత్రం విస్ఫులిఙ్గాః ॥1॥ తస్మిన్నేతస్మిన్నగ్నౌ దేవా అన్నం జుహ్వతి తస్యా ఆహుతే రేతస్సమ్భవతి ॥2॥**

**అష్టమః ఖణ్డః (8)**

**యోషా వావ గౌతమాగ్నిస్తస్యా ఉపస్థ ఏవ సమిద్యదుపమన్త్రయతే ధూమో యోనిరర్చిర్యదన్తః కరోతి తేఽంగారా అభినన్దా విస్ఫులిఙ్గాః ॥1॥ తస్మిన్నేతస్మిన్నగ్నౌ దేవా రేతో జుహ్వతి తస్యా ఆహుతేర్గర్భస్సమ్భవతి ॥2॥**

రాజు ఐదవ ప్రశ్నకు ముందు జవాబు చెప్పాడు. అది ముందు తెలుసుకుంటే, తక్కినవి తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు.

5వ ప్రశ్న:- ఐదవ ఆహుతి తర్వాత జల శరీరం పురుష శరీరం ఎలా పొందుతుందో తెలుసా?

**ముఖ్య హెచ్చరిక:-** ఈ ప్రశ్న సారాంశం మరణం తర్వాత జీవి ప్రయాణం, పునర్జన్మ గురించి.దానికి జవాబు చూసేముందు ఒక విషయం గ్రహించాలి. ఉపనిషత్తు ఉద్దేశం మరణం తర్వాత జీవితం గురించిన వివరాలు చెప్పటం కాదు. పంచాగ్ని విద్య చెప్పింది ఉపాసన కోసం. రెండో ఉద్దేశం వైరాగ్యం సృష్టించటం కోసం. ఎలా? జీవుడు పునరపి జననం, పునరపి మరణం పొందుతూ సంసారంలో పడి కొట్టుమిట్టాడుతుంటాడని అర్థమవుతుంది దీని ద్వారా.

శ్రుతి అందుకే మరణం తర్వాత ప్రయాణం గురించిన పూర్తి వివరాలు ఇవ్వలేదు. మరణం తర్వాత ఏమవుతుంది అనేది పూర్తిగా ఊహాజనితమైన చర్చే. అయినా, ఫర్వాలేదు. ఎందుకంటే వేదాంతం మరణం తర్వాత జీవితాన్ని నమ్మమని చెప్పటం లేదు. వేదాంతం ప్రస్తుత జీవితంలోని సంసారం గురించి, ప్రస్తుత జీవితంలో మోక్షం ఎలా పొందాలి అనే దాని గురించి చెపుతుంది. ఇది బాగా గుర్తుంచుకోవాలి. జీవన సంసారం గురించి జీవన్ముక్తి గురించి చెపుతుంది. ఇచ్చిన వివరాలన్నీ ఉపాసన కోసం ఇవ్వబడ్డాయి. అవి నిజమా, కాదా అన్నది పట్టించుకోకూడదు. ఒకవేళ నిరూపించుకోవాలని చూసినా, వేరే మార్గమేమీ లేదు. శ్రుతి మీరు ఉత్తరంవైపుకు వెళ్తారు అంటే, మనం దాన్ని నిరూపించగలమా? శాస్త్రమే ప్రమాణం అని దయానంద స్వామీజీ ఎప్పుడూ చెప్తారు. శ్రుతి ఏ వివరాలిస్తే

వాటిని స్వీకరించాలి. మిగతావి మనకు తెలిసే మార్గం లేదు అనే విషయం మనం గ్రహించాలి. దీన్ని స్టాచ్యూటరీ వార్నింగ్ కింద తీసుకోవాలి.

**పంచాగ్ని విద్య:-** మరణం తర్వాత ఏమవుతుంది అనేది ప్రశ్న. ఇక్కడ ఉపనిషత్తు వేదపరంగా జీవనం నడిపిన వ్యక్తి గురించి చెపుతుంది. అతని జీవిత కాలంలో అనేక యజ్ఞాలు చేసి, అగ్నిహోత్రంలో ఆహుతులు వేయటం వల్ల ఎంతో అపూర్వం (పుణ్యం) పొందుతాడు. ఇన్నాళ్ళూ అతను ఆహుతులు వేశాడు. అతని మరణానంతరం అతని శరీరాన్ని అగ్నికి ఆహుతిగా వేస్తారు. అందుకే ఆ కర్మని దహన సంస్కారం అంటారు.

ఎప్పుడైతే శరీరాన్ని అగ్నికి ఆహుతి చేస్తారో అప్పుడే అగ్ని దేవత ఇంకో స్థూల శరీరాన్ని ఇస్తుంది. అది జీవునితో కలిసి ప్రయాణం చేస్తుంది. మనకు కనబడటం లేదు అంటే అది పేరుకే స్థూల శరీరం. దీన్ని అపు లేదా **జలీయ శరీరం అంటారు.** ఇది ఐదు దశల్లో ప్రయాణం చేస్తుంది. ఒక్కొక్క దశలో స్థూల శరీర పరిమాణం పెరుగుతూ వస్తుంది. ఒక్కొక్క దశనీ అగ్నితో పోలుస్తారు. అందుకే ఇది పంచాగ్ని విద్య అయింది.

మన సాంప్రదాయంలో ఇదొక అద్భుతమైన సిద్ధాంతం. అగ్నిలో ఏది వేసినా అది పునీతమవుతుంది. నిక్కృష్ఠ వస్తువు ఉత్కృష్ఠ వస్తువుగా మారుతుంది. మనం తినే ఆహారం విషయమే తీసుకోండి! మనం తినే వస్తువు అగ్నిలో వండబడి రుచికరమైన ఆహారంగా మారుతుంది. మనం తిన్నాక, వైశ్వానర అగ్నిలో వండబడి, మనకి శక్తిగా మారుతుంది. అలా జల శరీరం మారే ఒక్కొక్క దశనీ అగ్నిగా వ్యవహరించింది శాస్త్రం. నిజంగా అగ్నిలేదు. దాన్ని లక్ష్యార్థంగా తీసుకోవాలి.

స్థూల శరీరాన్ని అగ్నికి ఆహుతి ఇస్తే, అగ్ని ఇంకో స్థూల శరీరం ఇస్తుంది. ఇది వింటే మనలో అనేక సందేహాలు రేకెత్తుతాయి.

అంటే అగ్నికి ఆహుతి ఇవ్వకపోతే ఇంకో స్థూల శరీరం రాదా?

ఒకవేళ మరణించిన వ్యక్తి శరీరం దహన సంస్కారానికి అందుబాటులో లేకపోతే రాదా?

జీవితకాలంలో అగ్నికి ఆహుతులు వేయకపోతే అగ్ని దేవత అతనికి ఇంకో శరీరం ఇస్తుందా, ఇవ్వదా?

ఇప్పుడు మనం ఏ విషయం చూస్తున్నాము? యజ్ఞయాగాదులు

క్రమం తప్పకుండా, నిష్ఠగా చేసిన వైదిక పురుషుని గురించి చూస్తున్నాము. ప్రత్యేకంగా ఈ కర్మ చేసిన వ్యక్తి గురించి. ఇది చెప్పటంలోని ఉద్దేశం– పంచాగ్ని విద్య ఉపాసన చెప్పటం. అగ్ని తత్త్వం ఉత్తమం, అగ్ని పునీతుడిని చేస్తుంది అని చెప్పటానికి. ఇంకో ప్రయోజనం కూడా ఉంది. ఈ దశలు చూస్తే మనలో వైరాగ్యం పుడుతుంది. వైరాగ్యం పుట్టించటానికి ఈ విద్య.

**పంచాగ్ని విద్య**

| **ఖండం** | **దశ** | **శరీరం** | **తర్వాతి దశ** | **అగ్ని** |
|---|---|---|---|---|
| 4 | 1 | జలీయ శరీరం | సోమశరీరం | స్వర్గదేవత |
| 5 | 2 | సోమ శరీరం | వృష్టిశరీరం | మేఘదేవత |
| 6 | 3 | వృష్టి శరీరం | అన్నశరీరం | పృథివీ దేవత |
| 7 | 4 | అన్న శరీరం | రేతశ్శరీరం | పురుషుడు (పురుష బీజం) |
| 8 | 5 | రేతశ్శరీరం | మనుష్యశరీరం | స్త్రీ |

వివరణ:– వానలో ఎన్నో జీవాలున్నాయి. కాని మనకు తెలియటం లేదు. ఎందుకు? సూక్ష్మభూత స్థూల శరీరం కాబట్టి. అన్న శరీరం నుంచి రేతశ్శరీరం వస్తుంది అని చెపుతున్నది. ఇక్కడ మనిషి పుట్టుక గురించే చర్చ. చెట్లు, జంతువుల విషయం లెక్కలోకి రాదు. అమీబా తనని తానే విభజించు కుంటుంది. చెట్టు కొమ్మ నుంచి ఇంకో చెట్టు వస్తుంది. మనిషి పుట్టుకలో కూడా వైదిక పరంపరనే చెపుతున్నది. ఎందుకంటే పంచాగ్ని విద్య ఉపాసన గురించి చెపుతున్నది కాబట్టి.

అన్న శరీరం రేతస్సుగా మారుతుంది. రేతస్సు అంటే పురుష బీజం. అది నాలుగవ అగ్ని. ఇక్కడ పురుషుడు అగ్ని. అగ్ని ఎందుకంటే పురుషునికి అన్నాన్ని రేతస్సుగా మార్చే ప్రత్యేకశక్తి ఉంది కాబట్టి. ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. పురుషుడు జీవుడిని సృష్టించడు. రేతస్సును కూడా సృష్టించడు. అన్నశ్శరీరాన్ని రేతశ్శరీరంగా మారుస్తాడు అంతే. శాస్త్రం ప్రకారం పురుషుడిలో కూడా జీవుడు ఉంటాడు కాని అతను జీవుడికి పుట్టుకనివ్వలేడు. ఆఖరిదశ స్త్రీద్వారానే జరగాలి.

ఐదవ అగ్ని రేత శ్శరీర జీవాన్ని మనుష్యశరీరంగా మార్చాలి. పిల్లల్ని కనటం కూడా ఆహుతి లాంటిదే. రేతస శరీరయుక్త జీవుని స్త్రీ అనే అగ్నిలో

వేస్తారు. దీని నుంచి ఇంకో విషయం గ్రహించాలి మనం. పురుషబీజం స్త్రీలో ప్రవేశిస్తున్నప్పుడే, అందులో జీవుడు ఉన్నాడు. కొంతమంది గర్భస్థ శిశువు 3,4 నెలల వరకు మాంస పిండం మాత్రమే, అందులో ప్రాణం ఉండదు అనుకుంటారు. అది పొరపాటు. ఆ సమయంలో రూపురేఖలు ఏర్పడవు కాని ప్రాణం ఉంటుంది. అందుకే అబార్షన్ చేయించటం భ్రూణ హత్య అవుతుంది.

## నవమః ఖణ్డః (9)

**ఇతి తు పంచమ్యామాహుతావాపః పురుషవచసో భవన్తీతి। స ఉల్బావృతో గర్భో దశ వా నవ వా మాసానన్తశ్శయిత్వా యావద్వాఽథ జాయతే ॥1॥ స జాతో యావదాయుషం జీవతి తం ప్రేతం దిష్టమితోఽగ్నయ ఏవ హరన్తి యత ఏవేతో యతస్సంభూతో భవతి ॥2॥**

**మంత్రం 1 – ఇతి తు పంచమ్యామాహుతావాపః పురుషవచసో భవన్తీతి।** ఈ విధంగా జలీయ శరీరం, పంచమ అగ్ని వల్ల మనుష్య శరీరంగా మారుతుంది. గర్భం అంటే తల్లి గర్భము అనీ వస్తుంది; గర్భస్థ శిశువు అనీ అర్థం వస్తుంది. ఇక్కడ గర్భస్థ శిశువుగా తీసుకోవాలి. **స ఉల్బావృత –** గర్భ చర్మంతో చుట్టబడి, గర్భంలో పదిగాని, తొమ్మిది గాని మాసాలు లోపల శయనించి తర్వాత పుడుతుంది.

శంకరాచార్యులు, ఈ వివరాలు ఎందుకు ఇస్తున్నది ఉపనిషత్తు అనే ప్రశ్న వేసి, దానికి జవాబిస్తున్నారు. వైరాగ్యాన్ని కలిగించటానికి ఇస్తున్నది. తల్లి మలమూత్రాదులతో పాటు వాతం– పిత్తం–శ్లేష్మం–రక్తం మొదలైన ధాతువులతో నిండి ఉన్న గర్భంలో ఉండి, అశుచి అయిన చర్మంతో చుట్టబడి ఉంటుంది శిశువు. ఇటువంటి స్థితిలో గంట కూడా ఉండలేము. కాని ఇటువంటి స్థితిలో పది గాని, తొమ్మిది గాని మాసాలు ఉంటాడని చెప్పటం వల్ల వైరాగ్యం సిద్ధిస్తుంది. ఇది కాక జఠరాగ్ని ఉంటుంది.

**యావద్వాఽథ జాయతే –** ముందో, వెనుకో పుడతాడు. ఉపనిషత్తు అన్నీ ఆలోచించింది. తొమ్మిది, పది నెలల కన్నా ముందో వెనుకో పుడతాడు.

**మంత్రం 2 – యావదాయుషం జీవతి–** ప్రారబ్ధ కర్మ ఉన్నన్నాళ్లు జీవిస్తాడు. **తం ప్రేతం దిష్టం–** మరణకాలంలో, అతనికి శరీరాన్ని ఏ అగ్ని ఇచ్చిందో,

అదే అగ్ని అతని శరీరాన్ని కోరుతుంది. నీకు శరీరాన్ని అప్పు ఇచ్చాను అంతే, నాకు తిరిగి ఇయ్యి అంటుంది.
**యత ఏవేతో** – ఎందులోంచి వెళ్ళిందో,
**యతస్సంభూత** – ఎందులోంచి వచ్చిందో,
**ఇతోఽ అగ్నయ ఏవ హరన్తి**– అందులోకి వెళుతుంది. దీనితో అగ్ని పని ముగిసిందా? లేదు. అగ్నిదేవత ఇంకో శరీరంతో సిద్ధంగా ఉంది, బట్టల బీరువాలో అనేక బట్టలున్నట్టుగా. అందువల్ల ఆత్మ జ్ఞానం పొందకపోతే జననమరణ వృత్తం నిరంతరంగా కొనసాగుతూనే ఉంటుంది. అందుకే ఆత్మ జ్ఞానం బోధించే ఆరవ అధ్యాయం ముఖ్యమైన అధ్యాయం.
**ఫలం:–** ఇక్కడ సందర్భం పంచాగ్ని విద్య ఉపాసన. అనేక ఫలాలున్నా కనబడే ఫలం– శరీర అభిమానం పోతుంది. శరీరం అగ్ని నుంచి వచ్చింది, అగ్నికి ఆహుతి అవుతుంది. మళ్లీ ఆ అగ్నే తన కర్మ ఫలాన్ని అనుసరించి జల శరీరం ఇస్తుంది అని తెలుసుకోవడం వల్ల శరీర అభిమానం పోవటమే కాక, మరణభయం కూడా పోతుంది. దీనివల్ల ఆత్మ జ్ఞానానికి సిద్ధమవుతాడు ఉపాసకుడు.

ఇక్కడితో పంచాగ్ని విద్య ముగిసింది.ఐదవ ప్రశ్నకి జవాబు ముగిసింది.

### దశమః ఖణ్డః (10)

**తద్య ఇత్థం విదుః యే చేమేఽ రణ్యే శ్రద్ధా తప ఇత్యుపాసతే ఽ ర్చిషమభిసమ్భవన్త్యర్చిషోఽ హరహ్న ఆపూర్యమాణపక్షమా పూర్యమా ణపక్షాద్యాన్షడుదఙ్జేతి మాసాగ్ంస్తాన్ ॥1॥ మాసేభ్యస్సంవత్సరగ్ం సంవత్సరాదాదిత్యమాదిత్యాచ్చన్ద్రమసం చన్ద్రమసో విద్యుతం తత్పురుషోఽ మానవస్స ఏనాన్బ్రహ్మ గమయత్యేష దేవయానః పన్థా ఇతి ॥2॥ అథ య ఇమే గ్రామ ఇష్టాపూర్తే దత్తమిత్యుపాసతే తే ధూమమభిసమ్భవన్తి ధూమాద్రాత్రిగ్ం రాత్రేరపరపక్షమపరపక్షాద్యాన్షడ్దక్షిణైతి మాసాగ్ంస్తాన్నైతే సంవత్సరమభిప్రాప్నువన్తి ॥3॥ మాసేభ్యః పితృలోకం పితృలోకాదాకాశమాకాశాచ్చన్ద్రమసమ్ ఏష సోమో రాజా తద్దేవానామన్నం తం దేవా భక్షయన్తి ॥4॥ తస్మిన్యావత్సమ్పాతముషిత్వాఽ థైతమేవాధ్వానం పునర్నివర్తన్తే॥ యథైతమాకాశమాశాద్వాయుం వాయుర్భూత్వా ధూమో భవతి**

**ధూమో భూత్వాஉ భ్రం భవతి ॥5॥ అభ్రం భూత్వా మేఘో భవతి మేఘో భూత్వా ప్రవర్షతి త ఇహ వ్రీహియవా ఓషధివనస్పతయస్తిలమాషా ఇతి జాయన్తే। అతో వై ఖలు దుర్నిష్ప్రపతరమ్। యో యో హ్యన్నమత్తి యో రేతస్సిఞ్చతి తద్భూయ ఏవ భవతి ॥6॥ తద్య ఇహ రమణీయచరణా అభ్యాశో హ యత్తే రమణీయాం యోనిమాపద్యేరన్బ్రాహ్మణయోనిం వా క్షత్రియయోనిం వా వైశ్యయోనిం వాஉ థ య ఇహ కపూయచరణా అభ్యాశో హ యత్తే కపూయాం యోనిమాపద్యేరన్శ్వయోనిం వా సూకరయోనిం వా చన్డాలయోనిం వా ॥7॥ అథైతయోః పథోర్న కతరేణ చ న తానీమాని క్షుద్రాణ్యసకృదావర్తీని భూతాని భవన్తి జాయస్వ మ్రియస్వేత్యేతత్తృతీయగ్ం స్థానం తేనాసౌ లోకో న సంపూర్యతే। తస్మాజ్జుగుప్సేత తదేష శ్లోకః ॥8॥ స్తేనో హిరణ్యస్య సురాం పిబగ్ంశ్చ గురోస్తల్పమావసన్బ్రహ్మహా చైతే పతన్తి చత్వారః పంచమశ్చాచరగ్ంస్తైరితి ॥9॥ అథ హ య ఏతానేవం పంచాగ్నీన్వేద న సహ తైరప్యాచరన్పాప్మనా లిప్యతే శుద్ధః పూతః పుణ్యలోకో భవతి య ఏవం వేద య ఏవం వేద ॥10॥**

**ఖండం–10 –** ఇందులో ఒకటోప్రశ్నకు, మూడో ప్రశ్నకు సమాధానాలు వస్తాయి. జవాబులు వరుసక్రమంలో లేవు. ముందు ఐదవ ప్రశ్నకు జవాబు వచ్చింది. అది ముందు తెలిస్తే, తక్కినవి అర్థం చేసుకోవటం తేలిక. ముందు, ప్రశ్నలు మళ్లీ ఒకసారి చూద్దాము.

ప్రశ్న 1:– ఈ లోకం నుంచి జీవులు పైకి ఎక్కడికి వెళ్తారో తెలుసా?

ప్రశ్న 3:– శుక్లగతి, కృష్ణగతి ఎక్కడ విడిపోతాయో తెలుసా?

మూడవ ప్రశ్నలో మనకి మొదటి ప్రశ్నకి కొంచెం జవాబు వస్తుంది. జీవులు రెండు మార్గాల ద్వారా పైకి వెళ్తాయి. వాటిని శుక్లగతి, కృష్ణగతి అంటారు. శుక్లగతిని దేవయాన మార్గం అనీ, కృష్ణగతిని పితృయాన మార్గం అనీ కూడా అంటారు. శుక్లగతిని ఉత్తరాయణ గతి అని, కృష్ణగతిని దక్షిణాయన గతి అని కూడా అంటారు.

**అగ్నిర్జ్యోతిరహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్।**
**తత్ర ప్రయాతా గచ్ఛంతి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః॥ గీత 8 – 24**

ఆ మార్గాలకు ఆయా దేవతలు అధిష్ఠాన దేవతలు. అంతేకాదు

వాళ్ళు జీవిని ఒక స్థానం నుంచి ఇంకో చోటుకు తీసుకువెళతారు కూడా. అందుకే వాళ్ళకు ఆదివాహికులు అని ప్రత్యేకమైన పేరు కూడా ఉంది.

శుక్లగతి, కృష్ణగతి ఎక్కడ విడిపోతాయన్న ప్రశ్నకు ఆయా గతుల్లో వెళ్ళగలిగే అర్హత ఎవరికి ఉందో కూడా చెపుతున్నది ఉపనిషత్తు.

**మంత్రం 1:తద్య ఇత్థం విదుః** – పంచాగ్ని ఉపాసన లేదా వేరే ఏదైనా ఉపాసన చేసిన వ్యక్తి. పంచాగ్ని ఉపాసనే ఎందుకు పేర్కొంది? ఇక్కడ ప్రస్తుతం దాని గురించిన చర్చ ఉంది కాబట్టి, ఈ పంచాగ్ని ఉపాసన చేసిన గృహస్థుల గురించి చెపుతున్నది.

గృహస్థు నిత్య,నైమిత్తిక కర్మలు తప్పనిసరిగా చేయాలి. మీమాంసలో నిత్యకర్మలు అంటే రోజూ చేసే పని కాదు. ఎప్పుడే కర్మలు చేయాలో అవి చేయాలి. గృహస్థు రెండు విధాలుగా చేయవచ్చు. కేవల కర్మ చేయవచ్చు, లేదా కర్మ, ఉపాసనల సముచ్చయం (రెండూ కలిపి) చేయవచ్చు. గృహస్తు కర్మలు చేసి తీరాలి. ఉపాసన చేస్తే చేయవచ్చు, లేదా లేదు. గృహస్థు కేవల కర్మ చేస్తే పితృయాన మార్గం ద్వారా వెళతాడు. కర్మ, ఉపాసనల సముచ్చయం చేస్తే దేవయాన మార్గం ద్వారా వెళతాడు.

**యే చేమేఽ రణ్యే** – వానప్రస్థ ఆశ్రమానికి చెందిన వ్యక్తులు. వానప్రస్థం ఉపాసన ప్రధానం. గృహస్థాశ్రమం కర్మ ప్రధానం. వానప్రస్థంలో కర్మ చాలా తక్కువ ఉంటుంది. యజ్ఞోపవీతం ఉంటుంది కాబట్టి కర్మలు పూర్తిగా మానటానికి లేదు. అరణ్యే అంటే వానప్రస్థాన్ని ప్రస్తావిస్తున్నది.

**సన్యాసాశ్రమం** – సన్యాసాశ్రమం జ్ఞానప్రధానంగా ఉంటుంది. కాని కొంత ఉపాసన కూడా చేయవచ్చు. అతను కూడా వస్తాడు ఇందులో. శంకరాచార్యులు నైష్ఠిక బ్రహ్మచారి కూడా వీళ్ళ తెగలోకి వస్తారంటారు.

**శ్రద్ధా తప ఇత్యుపాసతే**– కష్ట సహిష్ణుత్వం తపః అంటారు. అనేక అంశాలు అందులో వస్తాయి. అంటే ఒక నియంత్రణ ఉండాలి. అది కూడా ఎలా చేయాలి? శ్రద్ధగా. అంతేకాదు ఉపాసన కూడా చేయాలి.ఇప్పుడు మార్గం–

**తే అర్చిషమభిసమ్భవన్తి–అర్చిః** అంటే వాచ్యార్థం జ్యోతి. ఇక్కడ దేవత. అందుకే ఈ మార్గాన్ని అర్చిరాది మార్గం అని కూడా అంటారు.

**అర్చిషోఽ హర్** – అర్చి దేవత నుంచి పగటి దేవతను;

**అహరహ్న ఆపూర్యమాణ పక్షం**– పగటి దేవత నుంచి శుక్లపక్ష దేవతను;

**అపూర్వ మాణపక్షాద్యాన్షడుదఙ్జేతి మాసాగ్ంస్తాన్** – శుక్ల పక్ష దేవత నుంచి ఆరు మాసాలను (ఉత్తరాయణ దేవత);

**మంత్రం 2 – మాసేభ్య స్సంవత్సరగ్ం–** ఉత్తరాయణ దేవత నుంచి సంవత్సర దేవతను;

**సంవత్సరాదాదిత్య** – సంవత్సర దేవత నుంచి ఆదిత్యుని,

**ఆదిత్యా చ్చన్ద్రమసం** – ఆదిత్యుని నుంచి చంద్రుని,

**చన్ద్రమసో విద్యుతం** – చంద్రుని నుంచి విద్యుద్దేవతను చేరుతారు.

**తత్పురుషోఽ మానవస్స ఏనాన్బ్రహ్మ గమయతి** – విద్యుద్దేవత నుంచి అమానవ పురుషుడు వచ్చి బ్రహ్మలోకానికి తీసుకువెళ్తాడు.

**ఏష దేవయానః పంథా** – ఇది శుక్లగతి.

**బ్రహ్మగమయతి–** అంటే సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ కాదు. నిర్గుణం బ్రహ్మ కాదు. సర్వవ్యాపకమైన నిర్గుణ బ్రహ్మను బ్రహ్మలోకానికి పరిమితం చేయలేము. అక్కడ బ్రహ్మలోకంలో సాధకుడు ఆనందంలో ఓలలాడుతూ ఉండవచ్చు, లేదా బ్రహ్మద్వారా బ్రహ్మజ్ఞానం పొంది తర్వాత ప్రళయం వచ్చినప్పుడు విదేహముక్తి పొందుతాడు. ఇదే విషయం 4–15–5లో కూడా వచ్చింది. క్రమముక్తి పొందవచ్చు. బ్రహ్మజ్ఞానం పొందకపోతే మళ్ళీ జన్మనెత్తక తప్పదు.

**ఆబ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తినోఽ ర్జున – గీత 8 – 16**

**మంత్రాలు – 3 , 4** ఇప్పుడు గ్రామంలో ఉన్న గృహస్థ గురించి– అంతకు ముందు 'అరణ్యే' అన్న పదం వచ్చింది. ఇప్పుడు 'గ్రామ'. అరణ్యే ఉపాసకులను సూచిస్తే 'గ్రామ' కేవల కర్మిష్ఠుల గురించి చెపుతున్నది. కర్మలు మూడు రకాలు – ఇష్టం, పూర్తం, దత్తం.

**ఇష్టం** – **ఇష్టమగ్నిహోత్రాది వైదికం కర్మ**
అగ్నిహోత్రం, వైశ్వదేవం వంటి వైదిక కర్మలు

**పూర్తం** – **పూర్తం వాపీకూపతడాగారామాది కరణమ్**
దిగుడు బావులు, నూతులు, చెరువులు త్రవ్వించటం– సత్రాలను కట్టించటం. చలివేంద్రాలను పెట్టించటం లాంటి సేవాకార్యాలు.

**దత్తం** – **బహిర్వేది యథా శక్త్యర్థిభ్యో ద్రవ్య సంవిభాగో దత్తమ్**

యజ్ఞంలో కాకుండా విడిగా, శక్తిని మించకుండా
యోగ్యులైన వారికి ధనాన్ని పంచిపెట్టటం.

**ఇత్యుపాసతే** - ఇక్కడ ఇష్టం, పూర్తం, దత్తం చేసేవాడు అని అర్థం.

మనుష్యుల్లో నాలుగు రకాలు ఉన్నారు- జ్ఞాని, ఉపాసకుడు, కర్మిష్ఠుడు, ఇవేవీ కానివాడు- వేదాంత పరిభాషలో కర్మిష్ఠుడు, ఇవేవీ కానివాడికన్నా ఉన్నతస్థాయిలో ఉంటాడు కాని, జ్ఞాని, ఉపాసకుల కన్నా తక్కవస్థాయికే చెందుతాడు. ఊరంతా అతన్ని ఎంత కొనియాడినా, అతను ఎన్ని పుణ్యకార్యాలు చేసినా అతను శుక్లగతిలో వెళ్ళలేడు. బ్రహ్మలోకాన్ని చేరలేడు. అతను కృష్ణగతి ద్వారా వెళతాడు.

అతని మార్గం ఇలా ఉంటుంది-

**తే ధూమ మభిసమ్భవన్తి** - వీరు ధూమ దేవతను పొందుతారు;

**ధూమాద్రాత్రిగ్ం** - ధూమం నుంచి రాత్రిని;

**రాత్రేరపరపక్షం** - రాత్రి నుంచి కృష్ణపక్షాన్ని;

**అపర పక్షాద్యాన్షడ్దక్షిణైతి మాసాగ్ం స్తాన్** - కృష్ణ పక్షం నుంచి దక్షిణాయనాన్ని పొందుతారు.

**నై తే సంవత్సరమభిప్రాప్నువంతి** - వీరు సంవత్సర దేవతను పొందరు

ఇక్కడ కృష్ణపక్ష, శుక్లపక్ష మార్గాలు విడివడతాయి.

**మాసేభ్యః పితృలోకం** - మాసాల నుంచి పితృలోకాన్ని;

**పితృలోకాదాకాశమ్** - పితృలోకం నుంచి ఆకాశాన్ని;

**ఆకాశాచ్చన్ద్రమసమ్** - ఆకాశం నుంచి చంద్రుని (పొందుతారు)

**ఏష సోమో రాజా** - ఈ చంద్రుడు ఓషధులకు ప్రభువు.

**తద్దేవానామన్నం తం దేవా భక్షయన్తి** - ఇక్కడ వ్యాచ్యార్థం తీసుకుంటే వారిని దేవతలు భక్షిస్తారు అని వస్తుంది. కాని లక్ష్యార్థం ప్రకారం దేవతలు వారిని ఉపయోగించుకుంటారు అని అర్థం తీసుకోవాలి. అంటే దేవతలకు వారు సేవ చేస్తే, దేవతలు వాళ్ళకి ప్రతిఫలంగా రంభ ఊర్వశుల నృత్యాలను తిలకించే అవకాశం లాంటివి ఇస్తారు.

**టూకీగా–** దీనితో 1, 3 ప్రశ్నకు జవాబులు వచ్చేశాయి. ప్రశ్న–1 – రెండు మార్గాలు – శుక్లగతి, కృష్ణగతి. శుక్లగతి ద్వారా చివరికి బ్రహ్మలోకం చేరుకుంటే, కృష్ణగతి ద్వారా చంద్రలోకం చేరుకుంటారు. ప్రశ్న –3 – ఈ రెండు మార్గాలు సంవత్సర దేవత దగ్గర విడిపోతాయి.

**మంత్రాలు 5–7:** ఈ మంత్రంలో రెండవ ప్రశ్నకు జవాబు వస్తుంది.

ప్రశ్న –2 ఎలా తిరిగి వస్తారో తెలుసా?

యథేతం – విడిగా అడగనవసరం లేదు. ఎలా వెళ్ళారో అలా తిరిగి వస్తారు అంటున్నది ఉపనిషత్తు.

**తస్మిన్యావత్సమ్పాత ముషిత్వా –** **సంపాతం** అంటే పుణ్యకర్మ. జీవికి సుఖ దుఃఖాలను ఇవ్వటానికి అతని ముందుకు వస్తుంది పుణ్యకర్మ. యావత్సంపాతం అంటే పుణ్యకర్మ మొత్తం ఉన్నంతవరకూ పుణ్యలోకాల్లో ఉంటాడు. **తస్మిన్యావత్సమ్పాత ముషిత్వా** అనే ఈ మాటలను శంకరాచార్యులువారు తరచు వాడతారు.

**తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం**
**క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి।** **గీత 9 –21**

**అథైతమేవాధ్వానం పునర్నివర్తన్తే –** కర్మ క్షయమయ్యే వరకూ పుణ్యలోకాల్లో ఉండి, తర్వాత తిరిగి వస్తాడు. ఎలా?

**యథేతం** – వెళ్ళిన తోవలోనే వస్తాడు. అంటే ఆకాశం, ఆకాశం నుంచి వాయువు, వాయువు నుంచి ధూమం, ధూమం నుంచి మేఘం, మేఘం నుంచి పృథివిలో ధాన్యం, యవలు, మొక్కలు, చెట్ల రూపంలో పుడతాడు. అంటే చెట్లలో కూడా జీవుడు ఉంటాడు. మరి చెట్లను కోస్తే ఈ జీవికి బాధ కలుగుతుందా? కలుగదు. ఎందుకంటే జీవి, మానవశరీరం పొందాకే కర్మఫలాన్ని అనుభవించగలడు. అంతవరకు ప్రయాణం చేయగలడు కాని, అనుభవించ లేడు. ఇంతవరకూ ప్రయాణం కూడా సాఫీగా సాగుతుంది.

**దుర్నిష్ప్రపతరమ్** – దాని తర్వాత నుంచి ప్రయాణం చాలా కష్టంగా ఉంటుంది. జీవి పురుషునిలో ప్రవేశించడం చాలా అరుదు. ఎందుకు? శంకరాచార్యులు అనేక కారణాలు ఇస్తారు.

**రేతస్సిఞ్చతి** – జీవి అన్నం ద్వారా పురుషునిలో ప్రవేశించాలి. అన్నం తినబడాలి, అది కూడా పురుషుడు తినాలి. పురుషునిలో జీవి అది రేతస్సుగా

మారాలి. స్త్రీలు, వృద్ధులు, బ్రహ్మచారులు, పిల్లలు, సన్యాసులు తింటే జీవి పుట్టలేదు. రేతస్సును విడిచే పురుషుడు తినాలి. ఆ రేతస్సును స్త్రీలో వదలాలి.
**తద్భూయ ఏవ భవతి** – స్త్రీలో ప్రవేశించి శిశువుగా పుట్టినప్పుడు, ఆ తల్లిదండ్రుల ఆకారాన్ని పోలి ఉంటుంది కాని మరియొక జాతికి చెందదు.
**విశేషం:–** మన శరీరం ఉన్నతమైనదా, నీచమైనదా అన్నది పూర్వజన్మలో మన పుణ్యకర్మని బట్టి ఉంటుంది. పుట్టుక ఆకస్మికంగా జరిగేది కాదు. పుట్టుక అనుకోకుండా జరిగింది అన్నమాటను శాస్త్రం ఒప్పుకోదు.
**తద్య ఇహ రమణీయచరణా–** అంటే సదాచారవంతుడు;
**తద్యోని –**ఉత్తమ జన్మను; **అభ్యాశో హ** – శీఘ్రముగానే పొందుతాడు.

ఉత్తమ జన్మ అంటే బ్రాహ్మణుడుగా గాని, క్షత్రియుడుగా గాని, వైశ్యుడుగా గాని జన్మిస్తాడు. వీళ్ళను ద్విజులు అంటారు. వీళ్ళకు ఉపనయనం జరుగుతుంది. వేదాలను అధ్యయనం చేసి, జ్ఞానమార్గంలోకి వెళ్ళి మోక్షం పొందే అవకాశం ఉంది.
**అథ య ఇహ కపూయచరణా** – ఎవరైతే దురాచారపరులో వారు;
**అభ్యాశో హ యత్తే కపూయాం యోనిమాపద్యేరన్** – శీఘ్రంగా దుష్టయోనిలో పుడతారు.
**శ్వయోనిం వా సూకర యోనిం వా ఛన్డాలయోనిం వా–** వారు కుక్కగా గాని, పందిగా గాని, ఛండాలుడిగా గాని పుడతారు. ఛండాలుడంటే అవైదిక పురుషుడు. అతను వేదాలను నమ్మడు.

**టూకీగా** – దీనితో రెండవ ప్రశ్నకు జవాబు ముగిసింది. ఎలా తిరిగి వస్తారో తెలుసా? వెళ్ళిన మార్గంలోనే తిరిగివస్తారు.
**మంత్రం 8లో** నాలుగవ ప్రశ్నకు జవాబు వస్తుంది.
ఎందుకు స్వర్గలోకం నిండిపోవటం లేదో తెలుసా?
**అథైతయోః పథోర్న కతరేణ చ న తానీమాని క్షుద్రాణి** – శుక్లగతి, కృష్ణగతి కాకుండా మూడో మార్గం ఉంది – ఏమీ చేయనివారు, ఇతరులకు హాని చేసేవారు అథోగతి ద్వారా వెళ్తారు. వాళ్ళు అల్పప్రాణులుగా పుడతారు. దోమలు, ఈగలు, క్రిమికీటకాదులుగా పుడతారు.
**జాయస్వమ్రియస్వేతి** – పుడతారు, వెంటనే మరణిస్తారు. అలా అనేకసార్లు పుట్టి, మరణిస్తుంటారు కొందరు జీవులు.

**తత్తృతీయగ్ం స్థానం తేనాసౌ లోకో న సంపూర్యతే–** ఇది మూడవస్థానం. ఇటువంటి జీవులు ఎక్కువ ఉండటం వల్ల స్వర్గలోకం నిండటం లేదు.
**మంత్రం–9**: పంచ మహాపాతకం గురించి చెపుతున్నది ఉపనిషత్తు.
**స్తేనో హిరణ్యస్య** – బంగారాన్ని దొంగిలించినవాడు;
**సురాం పిబన్** – మద్యాన్ని త్రాగేవాడు;
**గురోస్తల్పమావసన్** – గురువును కించపరిచేవాడు;
**బ్రహ్మ హా చైతే పతన్తి** – బ్రహ్మహత్యను చేసినవాడు;
**పంచమశ్చ చారగ్ం స్తైరితి–** పై వాళ్ళతో కలిసి తిరిగేవాడు.
**మంత్రం–10: పాప్మనా లిప్యతే** – దానికి విరుద్ధంగా ఎవరైతే పంచాగ్ని ఉపాసన చేస్తాడో అతడు వారితో కలిసి తిరిగినా కూడా అతనికి పాపం అంటదు.
**శుద్ధః పూతః పుణ్యలోకో భవతి–** ఎవరైతే ఈ విధంగా ఉపాసిస్తారో అతడు శుద్ధుడు, పవిత్రుడు అయి, పుణ్యలోకాలకు వెళ్తాడు. ఈ విధంగా పంచాగ్ని విద్య ఫలం వచ్చింది.

**టూకీగా** – స్వర్గం ఎందుకు నిండటం లేదో తెలుసా అనే నాలుగో ప్రశ్నకు జవాబు– అథోలోకానికి వెళ్ళే జీవులు ఎక్కువ ఉంటారు. వాళ్ళు పుడుతూ, వెంటనే మరణిస్తూ ఉంటారు.

ఈ ఐదు ప్రశ్నల్లో మొదటిది, ఐదవది ముఖ్యమైనవి. మొదటిది కూడా శుక్లగతి, కృష్ణగతిల గురించి వేరేచోట నేర్చుకుంటాము. అందుకని పంచాగ్ని విద్య గురించి ముఖ్యంగా తెలుసుకోవాలి. పంచాగ్ని విద్యకు రెండు ఫలాలు చూశాము.

**ఇహలోక ఫలం–** మహాపాపితో కలిసి తిరిగినా పాపం అంటదు.

**పరలోక ఫలం–** బ్రహ్మలోక ప్రాప్తి, క్రమముక్తి.

## ఏకాదశః ఖణ్డః (11)

**ప్రాచీనశాల ఔపమన్యవస్సత్యయజ్ఞః పౌలుషిరిన్ద్రద్యుమ్నో భాల్లవేయో జనశ్శార్కరాక్ష్యో బుడిల ఆశ్వతరాశ్విస్తే హైతే మహాశాలా మహాశ్రోత్రియాస్సమేత్య మీమాగ్ంసాం చక్రుః కో న ఆత్మా కిం బ్రహ్మేతి ॥1॥ తే హ సమ్పాదయాఞ్చక్రురుద్దాలకో వై భగవన్తోఽ యమారుణిస్సమ్ప్రతీమమాత్మానం వైశ్వానరమధ్యేతి తగ్ం హన్తాభ్యాగ**

**చ్ఛామేతి తగ్ం హోభ్యాజగ్ముః ॥2॥ స హ సమ్పాదయాఞ్చకార ప్రక్ష్యన్తి మామిమే మహాశాలా మహాశ్రోత్రియాస్తేభ్యో న సర్వమివ ప్రతిపత్స్యే హన్తాహమన్యమభ్యనుశాసానీతి॥3॥ తాన్హోవాచాశ్వపతిర్వై భగవన్తోఽయం కైకేయస్సమ్ప్రతీమమాత్మానం వైశ్వానరమధ్యేతి తగ్ం హోతాభ్యాగచ్ఛామేతి తగ్ం హోభ్యాజగ్ముః ॥4॥ తేభ్యో హ ప్రాప్తేభ్యః పృథగర్హాణి కారయాంచకార స హ ప్రాతస్సంజిహాన ఉవాచ న మే స్తేనో జనపదే న కదర్యో న మద్యపో నానాహితాగ్నిర్నావిద్వాన్న స్వైరీ స్వైరిణీ కుతః యక్ష్యమాణో వై భగవన్తోఽహమస్మి యావదేకైకస్మా ఋత్విజే ధనం దాస్యామి తావద్భగవద్భ్యో దాస్యామి వసన్తు భగవన్త ఇతి ॥5॥ తే హోచుర్యేన హైవార్థేన పురుషశ్చరేత్తగ్ం హైవ వదేదాత్మానమేవేమం వైశ్వానరగ్ం సమ్ప్రత్యధ్యేషి తమేవ నో బ్రూహీతి ॥6॥ తాన్హోవాచ ప్రాతర్వః ప్రతివక్తాఽస్మీతి తే హ సమిత్పాణయః పూర్వాహ్ణే ప్రతిచక్రమిరే తాన్హానుపనీయైవైతదువాచ ॥7॥**

**విశ్వవిరాట్ ఐక్య ఉపాసన –**ఇంకొక క్షత్రియుడు గురువు అవుతాడు, బ్రాహ్మణులు శిష్యులు అవుతారు. ఇదీ ఇందులో విశేషం. క్షత్రియుడు అశ్వపతి లేదా కేకయరాజు. కైకేయికి తండ్రి ఆయన. ప్రశ్నోపనిషత్తులో లాగా ఇక్కడ కూడా ఆరుగురు శిష్యులు ఉంటారు. వాళ్ళ పేర్లు చెప్పేబదులు అశ్వపతి శిష్యషట్క సంవాదం అనవచ్చు దీనిని. ఖండం 11 నుంచి 24 వరకు సంభాషణ రూపంలో ఉంటుంది. అంశం విరాట్ ఉపాసన. దీన్నే **వైశ్వానర విద్య** అంటారు. ఇది అంగీ ఉపాసన. దీనితో పాటు ఒక అంగ కర్మ కూడా ఉంది. అది ప్రాణాగ్నిహోత్రం. ఈ ఉపాసనను ఒక ఆఖ్యాయిక (కథ) ద్వారా చెపుతున్నది ఉపనిషత్తు.

**మంత్రం –1:** ఈ కథ ద్వారా కొన్ని ముఖ్యమైన అంశాలను చెప్పకనే చెపుతుంది. శిష్యుల పేర్లు –

**ప్రాచీన శాల ఔపమన్యవః। సత్యయజ్ఞో పౌలుషిః। ఇంద్రద్యుమ్నో భాల్లవేయః। జనశ్శార్కరాక్ష్యః। బుడిలో ఆశ్వతరాశ్విః।**

రెండు పేర్లు ఎందుకు? ఒకటి వాళ్ళ పేరు, ఇంకోటి వంశం పేరు. ఉదాహరణకు, **ప్రాచీన శాల ఔపమన్యవః** అంటే ఉపమన్యుని పుత్రుడు ప్రాచీనశాలుడు.

**మహాశాలా మహాశ్రోత్రియాః –** వీళ్ళు మామూలు మనుష్యులు కారు. మహా సంపన్నులు. అందువల్ల మహా దాతలు కూడా.
**శౌనకోహ వై మహాశాలోఽంగిరసం విధివదుపసన్నః పప్రచ్ఛ। – ముండక**
**సమేత్య మీమాగ్ంసాం చక్రుః –** వాళ్ళు ఒకచోట చేరి చర్చలు చేసుకున్నారు.
**కో న ఆత్మా కిం బ్రహ్మేతి –** సమష్టి బ్రహ్మకు సమానమైన వ్యష్టి ఆత్మ ఏది? ఉపాసనలో బ్రహ్మ అన్నప్పుడల్లా నిర్గుణబ్రహ్మను కాకుండా, సగుణ బ్రహ్మను తీసుకోవాలి. అందువల్ల వ్యష్టిపరంగా విశ్వ, సమష్టిపరంగా విరాట్‌ల గురించిన చర్చ ఇది. అంటే ఇది **విశ్వ విరాట్ ఐక్య ఉపాసన** అవుతుంది. వాళ్ళ చర్చలో వాళ్ళకు సమాధానం దొరకలేదు. అప్పుడు గురువు దగ్గరకి వెళ్ళారు. గురువు పేరు ఆరుణి. ఆయననే ఉద్దాలకుడు, గౌతముడు అని కూడా అంటారు.
**మంత్రం-2-**మాకు  విరాట్ గురించి చెప్పగలరా అని అడిగారు. ఆరుణి తనకు కూడా పూర్తిగా తెలియదని చెప్పాడు.
**మంత్రాలు 2 – 5 –**వాళ్ళని కైకయ రాజు దగ్గరకు వెళ్ళమని గౌతముడు చెప్పాడు. తాను కూడా వారితో కలిసి కైకయ రాజైన అశ్వపతి దగ్గరకు వెళ్ళాడు. ఆ విధంగా శిష్యులు ఆరుగురు అయ్యారు.

వచ్చిన బ్రాహ్మణులను, రాజు సాదరంగా ఆహ్వానించి, వాళ్ళకు విడివిడిగా సత్కారములు చేయించాడు. ఆ రోజు విశ్రాంతి తీసుకోమని మర్నాడు ఏం కావాలో అడిగాడు. ఎవరైనా రాగానే ఎందుకు వచ్చారని అడుగకూడదు.

రాజు వారికి దక్షిణనిచ్చాడు. బ్రాహ్మణులు క్షత్రియుల నుంచి దానాన్ని స్వీకరిస్తారు. కాని ఈ బ్రాహ్మణులు స్వీకరించలేదు. రాజు బాధపడ్డాడు. ఎందుకంటే రాజ్యంలో పాపాలు చెలరేగుతుంటే, ఆ పాపం రాజుకు అంటుకుంటుంది. అటువంటి పాపపు రాజు నుంచి దానం స్వీకరించకూడదు. వారు స్వీకరించకపోయేసరికి, తనలో వాళ్ళు ఖచ్చితంగా దోషం చూస్తున్నారని భావించి, తన రాజ్యం గురించి ఇలా చెప్పాడు.

| | |
|---|---|
| **న మే స్తేనో జనపదే** | – నా రాజ్యంలో దొంగలు లేరు. |
| **న కదర్యః** | – దానము చేయనివాడు లేదు. |
| **న మద్యపః** | – మద్యమును త్రాగువాడు లేదు. |
| **నానాహితాగ్నిః** | – వైదిక కర్మలు చేయనివాడు లేదు. |

**నావిద్వాన్** – ఉపాసన చేయని వాడు లేదు.
**నస్వైరీ** – పరస్త్రీ వ్యామోహం ఉన్నవాడు లేదు.
**స్వైరిణీ కుతః** – పరస్త్రీ వ్యామోహం లేనప్పుడు, చెడు నడవడికల స్త్రీ సంభవమే కాదు.

ఇవన్నీ తన గురించి గొప్పలు చెప్పటానికి చెప్పలేదు. తను దానం ఇచ్చేందుకు అర్హుడనని చూపుకోవటానికి చెప్పాడు. అప్పుడు కూడా వాళ్ళు స్వీకరించలేదు. తను ఇచ్చింది చాలలేదేమో అనుకున్న రాజు, తాను యజ్ఞం చేయబోతున్నానని, ఋత్విక్కులకు ఇవ్వబోయేటంత ధనం వాళ్ళకూ ఇస్తాననీ చెప్తాడు.

**వసన్తు భగవన్త** – దయజేసి పూజ్యనీయులైన మీరు ఉండండి.

**మంత్రం-6** – శిష్యులు ఆరుగురూ ఇట్లా చెప్పారు.

**యేన హైవార్థేన పురుషశ్చరేత్తగ్ం హైవ వదేత్** – ఏ ప్రయోజనం కోసం వెళతారో ఆ విషయం మాత్రమే చెప్పాలి. మనం నేర్చుకోవాల్సిన మరో మంచి నియమం.

**వైశ్వానరగ్ం సమ్ప్రత్యధ్యేషి**– వైశ్వానర విద్య నీకు తెలుసు. అది మాకు చెప్పు అన్నారు.

**మంత్రం 7** – గురువుకు విద్య తెలిస్తే చెప్పననకూడదు. కాని ఉత్తమజాతి బ్రాహ్మణులకు తను గురువెలా అవగలడు? అందుకని రేపు రండి అన్నాడు. కొంతమంది మర్నాడు తిరిగి వెళ్ళరు. కాని ఈ శిష్యులు వెళ్ళారు. రాజు మామూలు ఆచార నియమాలు పాటించకుండానే, అంటే వారికి ఉపనయనం చేయించకుండానే, విద్యను బోధించాడు.

ప్రత్యేక అంశాలు:– ఇందులో కథగాని, శిష్యుల పేర్లు గాని నిజమవవచ్చు. కాకపోవచ్చు. కాని వీటి ద్వారా కొన్ని విషయాలు గ్రహించాలి మనము.

1. గురు స్తుతి – విద్య గురువు ద్వారానే నేర్చుకోవాలి.
2. విద్య మహిమ – విద్య మామూలు విద్య కాదు.
3. శిష్య లక్షణం – అభిమాన త్యాగం, వినయం, అమానిత్వం.

శిష్యులు మహా శాల, మహా శ్రోత్రియ అయినా, ఇంకో గురువు దగ్గర నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలి. జిజ్ఞాస బలంగా ఉంటే అహం

పక్కన పెడతారు. తాను రాజైనా కూడా, తానే గురువు దగ్గరకు వెళ్ళాలి.

4. గురు లక్షణం - జిజ్ఞాస ఉన్న శిష్యునికి బోధించాలి.

**ఖండాలు 12-17**

ఆరు చిన్న ఖండాలు. గురువు విద్య బోధించే ముందు, ఒక్కొక్క శిష్యుడిని విరాట్ గురించి అతనికి ఉన్న అవగాహన ఏమిటో తెలుసుకున్నాడు ముందు. వాళ్ళు చెప్పిన సమాధానం విని, అది మెచ్చుకుని, దానివల్ల కలిగే మంచి ఫలం చెప్పి, కాని తన దగ్గరకు రాకపోయుంటే, ఏ నష్టం జరిగేదో చెప్పాడు.

ఇది విశ్వవిరాట్ ఐక్య ఉపాసన. విరాట్‌ని నా శరీరంలో ఊహించుకోవాలి. అంటే జీవ ఈశ్వర ఐక్య ఉపాసన. ఇది సగుణ ఈశ్వర ఉపాసన అని మర్చిపోకూడదు. ఐక్యం కూడా జ్ఞానం వల్ల కాదు, ఊహించుకోవటం వల్ల. స్థూల శరీరం స్థూల ప్రపంచంతో ఎన్నటికీ సమానం కాలేదు. రెండింటిలోని చైతన్యం ఒకటే అని తెలుసుకుంటే అది జ్ఞానం. రెండూ ఒకటే అని ఊహించుకుంటే అది ఉపాసన.

**ద్వాదశః ఖణ్డః (12)**

**ఔపమన్యవ కం త్వమాత్మానముపాస్స ఇతి। దివమేవ భగవో రాజన్నితి హోవాచైష వై సుతేజా ఆత్మా వైశ్వానరో యం త్వమాత్మానముపాస్సే తస్మాత్తవ సుతం ప్రసుతమాసుతం కులే దృశ్యతే ॥1॥ అత్స్యన్నం పశ్యసి ప్రియమత్యన్నం పశ్యతి ప్రియం భవత్యస్య బ్రహ్మవర్చసం కులే య ఏతమేవమాత్మానం వైశ్వానరముపాస్తే మూర్ధా త్వేష ఆత్మాన ఇతి హోవాచ మూర్ధాతే వ్యపతిష్యద్యన్మాం నాగమిష్య ఇతి ॥2॥**

**మంత్రం-1 - ఔపమన్యవ కం త్వమాత్మానముపాస్సే -** మొదటి శిష్యుని రాజు ప్రశ్నించాడు. ఆ శిష్యుని పేరు ఔపమన్యుడు. నువ్వు ఏ ఆత్మను ఉపాసిస్తున్నావు?

**దివమేవ భగవో రాజన్ -** పూజనీయుడైన ఓ రాజా, నేను ద్యులోకాన్ని విరాట్‌గా పూజిస్తున్నాను అన్నాడు. అతని ఇంకోపేరు ప్రాచీన శాలుడు.

అశ్వపతి జవాబుతో గురులక్షణం తెలుస్తుంది. శిష్యుడు చెప్పినదాన్ని వెంటనే తప్పు అనకూడదు. అలాగని సరియైనదనీ చెప్పకూడదు.

**సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్.** సత్యాన్ని ప్రియంగా చెప్పాలి.
**సుతేజా ఆత్మా వైశ్వానరః :–** నువ్వు ఆత్మగా ఉపాసిస్తున్న ద్యులోకం సుతేజాగా పేరు పొందింది. దాన్ని ఉపాసించటం వల్ల నీకు ఫలం కలుగుతుంది.
**తస్మాత్తవ సుతం ప్రసుతమాసుతం కులే దృశ్యతే–** ఫలం ఇప్పటికే పొందావు. సుతం, ప్రసుతం, ఆసుతం మూడూ సోమరసాలే. వేర్వేరు యజ్ఞాల్లో వేర్వేరు సోమరసాలు వాడతారు.

ఆ సోమ రసాన్ని కూడా విభిన్న పద్ధతుల్లో తీస్తారు. తెచ్చే విధం కూడా భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు –

**అరుణాయః ఏక హాయస్య పింగాక్ష్య –** ఎర్రరంగులో ఉండి, ఒక సంవత్సరం వయసు ఉన్న, పసుపు కళ్ళు ఉన్న దూడను సోమలత ఉన్నవానికి ఇచ్చి, దాన్ని తెచ్చుకోవాలి. రసం తీసేటప్పుడు కూడా మంత్రం ఉంటుంది.
**ఫలం –** నీ వంశంలో సోమరసాలు వస్తాయి అని గురువు చెప్పాడు. అంటే నీ వంశంలో యజ్ఞయాగాదులు చేసే ఐశ్వర్యం ఉంటుంది.
**మంత్రం–2 –**మరికొన్ని ఫలాలు పొందావని చెప్పాడు.
**అత్స్యన్నం–** మంచి జీర్ణశక్తి ఉండి, మంచి ఆహారాన్ని భుజించావు.
**పశ్యతి ప్రియం–** ఇష్టమైనవి చూశావు.
**అస్యకులే బ్రహ్మవర్చసం భవతి –** ఈ ఉపాసన ఎవరు చేస్తారో, వారి కులంలో బ్రహ్మవర్చస్సు ఉంటుంది. బ్రహ్మవర్చసులో బ్రహ్మ అంటే వేదం, వర్చస్సు అంటే కాంతి. వేదజన్య కాంతి పొందుతాడు అని అర్థం.
**మూర్ధాతే వ్యపతిష్యత్ –** ఇప్పుడు విమర్శిస్తున్నాడు. నువ్వు కేవలం తలనే వైశ్వానరుడిగా భావిస్తున్నావు. అంగాన్ని అంగిగా పొరపడుతున్నావు. అదృష్టం బాగుండి నా దగ్గరకు వచ్చావు. లేకపోతే నీ తల నేలగూలి యుండేది.

ఈ బెదిరింపును అక్షరాలా తీసుకోకూడదు. నువ్వు చేస్తున్న ఉపాసన అసంపూర్ణం అని చెప్పాడు అంటే అంగ ఉపాసన నింద, అంగి ఉపాసన స్తుతికోసం చేశాడు.–

**త్రయోదశః ఖణ్డః (13)**

**అథ హొవాచ సత్యయజ్ఞం పౌలుషిం ప్రాచీనయోగ్య కం త్వమాత్మానముపాస్స ఇత్యాదిత్యమేవ భగవో రాజన్నితి హొవాచైష వై**

**విశ్వరూప ఆత్మా వైశ్వానరో యం త్వమాత్మానముపాస్సే తస్మాత్తవ బహు విశ్వరూపం కులే దృశ్యతే ॥1॥ ప్రవృత్తోశ్వతరీరథో దాసీనిష్కోఽ త్స్యన్నం పశ్యసి ప్రియమత్త్యన్నం పశ్యతి ప్రియం భవత్యస్య బ్రహ్మవర్చసం కులే య ఏతమేవమాత్మానం వైశ్వానరముపాస్తే చక్షుష్ట్వేతదాత్మన ఇతి హోవాచా న్ధోఽ భవిష్యో యన్మాం నాగమిష్య ఇతి ॥2॥**

**మంత్రం 1 :** ఇప్పుడు రెండవ శిష్యుడిని అడిగాడు గురువు. ఆ శిష్యుని పేరు సత్యయజ్ఞం పౌలుషి. అతని ఇంకోపేరు ప్రాచీనయోగ్యుడు.
**ఆదిత్యమేవ భగవోరాజన్ –** ఆదిత్యుడిని ఉపాసిస్తున్నాను.
**విశ్వరూప ఆత్మా వైశ్వానరః –** ఆదిత్యుని విశ్వరూపుడు అని అంటారు అని గురువు చెప్పాడు. విశ్వరూపం అంటే గీతలో కృష్ణుడు చూపిన విశ్వరూపం కాదు. వివిధ రూపాలు (రంగులు) ఉన్న ఆదిత్యుడు.
**ఫలం:– తస్మాత్తవ బహు విశ్వరూపం కులే దృశ్యతే–** నీ వంశంలో అనేకమైన, అనేక రూపాలున్న సాధనాలు ఉన్నాయి. అవికాక,
**మంత్రం 2:ప్రవృత్తోశ్వతరీరథః –** రెండు కంచర గాడిదలున్న రథం,
**దాసీనిష్కః:–** దాసీలు, వారికి ఇవ్వటానికి సమృద్ధిగా ధనం,
**తత్స్యన్నం పశ్యసి ప్రియమత్త్యన్నం పశ్యతి ప్రియం భవత్యస్య బ్రహ్మవర్చసం కులే –** ఇవి ఇంకా అన్నింటికీ వస్తాయి. ఎవరైతే ఈ ఉపాసన చేస్తారో, అతను సమృద్ధిగా అన్నం తింటాడు, మంచివి చూస్తాడు. అందరికీ బ్రహ్మవర్చస్సు ఉంటుంది.
**చక్షుష్ట్వేతదాత్మ న ఇతి హోవాచాన్ధోఽ భవిష్యో యన్మాం నాగమిష్య –** ఈ వైశ్వానరుడు ఆత్మకు కన్ను. నువ్వు నా దగ్గరకి రాకపోయి ఉంటే, నువ్వు గ్రుడ్డివాడివి అయి ఉండేవాడివి.

### చతుర్దశ ఖణ్డః (14)

**అథ హోవాచేన్ద్రద్యుమ్నం భాల్లవేయం వైయాఘ్రపద్య కం త్వమాత్మానముపాస్స ఇతి వాయుమేవ భగవో రాజన్నితి హోవాచైష వై పృథగ్వర్త్మాఽ ఽ త్మా వైశ్వానరో యం త్వమాత్మానముపాస్సే తస్మాత్త్వాం పృథగ్వలయ ఆయన్తి పృథగ్రథశ్రేణయోఽ నుయన్తి ॥1॥ అత్స్యన్నం పశ్యసి ప్రియమత్త్యన్నం పశ్యతి ప్రియం భవత్యస్య బ్రహ్మవర్చసం కులే య**

**ఏతమేవమాత్మానం వైశ్వానరముపాస్తే ప్రాణస్త్వేష ఆత్మన ఇతి హోవాచ ప్రాణస్త ఉదక్రమిష్యద్యన్మాం నాగమిష్య ఇతి ॥2॥**

మూడవ శిష్యుడు ఇంద్రద్యుమ్న భల్లవేయుడు. ఇంకో పేరు వైయాఘ్రపద్యుడు.
**వాయుమేవ భగవో రాజన్–** నేను వాయువుని పూజిస్తున్నాను.
**పృథగ్వర్త్మాఽఽత్మా –** అనేక మార్గాలు కలదిగా ప్రసిద్ధి పొందింది.
**ఫలం:– పృథగ్గ్రశ్రేణయోఽనుయన్తి –** వస్త్ర, అన్న ధనాది రూపాలైన అనేక వస్తువులు, అనేక రథాలు నీకు వచ్చాయి.
**మంత్రం2 –ప్రాణస్త ఉదక్రమిష్యత్–** ఈ వైశ్వానరుడు ఆత్మకు ప్రాణశక్తి. నువ్వు నా వద్దకు రాకపోయుంటే నీ ప్రాణం పోయి ఉండేది.

**పంచదశః ఖణ్డః (15)**

**అథ హోవాచ జనగ్ం శార్కరాక్ష్య కం త్వమాత్మానముపాస్స ఇత్యాకాశమేవ భగవో రాజన్నితి హోవాచైష వై బహుల ఆత్మా వైశ్వానరో యం త్మమాత్మానముపాస్సే తస్మాత్త్వం బహులోఽసి ప్రజయా చ ధనేన చ ॥1॥ అత్స్యన్నం పశ్యసి ప్రియమత్త్యన్నం పశ్యతి ప్రియం భవిత్యస్య బ్రహ్మవర్చసం కులే య ఏతమేవమాత్మానం వైశ్వానరముపాస్తే సందేహస్త్వేష ఆత్మన ఇతి హోవాచ సందేహస్తే వ్యశీర్యద్యన్మాం నాగమిష్య ఇతి ॥2॥**

**మంత్రం 1:** నాల్గవ శిష్యుడు జనం శార్కరాక్ష్యుడు.
**ఆకాశమేవ భగవోరాజన్–** ఆకాశాన్ని వైశ్వానరుడిగా ఉపాసిస్తున్నాను.
**బహుల ఆత్మా వైశ్వానరః –** ఇది బహుళమని ప్రసిద్ధి పొందింది.
**ఫలం– తస్మాత్త్వం బహులోఽసి ప్రజయా చ ధనేన చ–** నీకు సమృద్ధిగా సంతానం, ధనం ఉంది.
**మంత్రం2 – వ్యశీర్యద్యన్మాం నాగమిష్య –** ఈ వైశ్వానరుడు ఆత్మకు మధ్యభాగము.

నువ్వు నాదగ్గరకి రాకపోయుంటే నీ శరీర మధ్యభాగం నష్టమై ఉండేది.

## షోడశ ఖణ్డః (16)

**అత హొవాచ బుడిలమాశ్వతరాశ్విం వైయాఘ్రపద్య కం త్వమాత్మానముపాస్స ఇత్యప ఏవ భగవో రాజన్నితి హొవాచైష వై రయిరాత్మా వైశ్వానరో యం త్వమాత్మానముపాస్సే తస్మాత్త్వగ్ం రయిమాన్పుష్టిమానసి ॥1॥ అత్స్యన్నం పశ్యసి ప్రియమత్త్యన్నం పశ్యతి ప్రియం భవత్యస్య బ్రహ్మవర్చసం కులే య ఏతమేవమాత్మానం వైశ్వానరముపాస్తే బస్తిస్త్వేష ఆత్మన ఇతి హొవాచ బస్తిస్తే వ్యభేత్స్యద్యన్మాం నాగమిష్య ఇతి ॥2॥**

**మంత్రం 1:**ఐదవ శిష్యుడు బుడిల మాశ్వతరాశ్వి
**ఆప ఏవ భగవో రాజన్ –** నీరునే వైశ్వానరుడిగా ఉపాసిస్తున్నాను.
**రయిరాత్మా వైశ్వానరః –** అది రయిగా ప్రసిద్ధి చెందింది.
**ఫలం– రయిమాన్పుష్టిమాన్ –** సంపన్నుడవు, పుష్టిగలవాడవు అయ్యావు. ఎందుకంటే నీరు నుంచి పంటలు, పంటల నుంచి ధనమూ వస్తాయి. శరీరపుష్టికి ఆహారం సమృద్ధిగా దొరకటమే కారణం.
**మంత్రం 2:– బస్తిస్తే వ్యభేత్స్యద్యన్మాం నాగమిష్య –** ఈ వైశ్వానరుడు ఆత్మకు మూత్రాశయం. నువ్వు నా దగ్గరకు రాకపోయుంటే, నీ మూత్రాశయం పగిలి ఉండేది.

## సప్తదశః ఖణ్డః (17)

**అథ హొవాచోద్దాలకమారుణిం గౌతమ కం త్వమత్మానాముపాస్స ఇతి పృథివీమేవ భగవో రాజన్నితి హొవాచైష వై ప్రతిష్ఠాఽ ఽ త్మా వైశ్వానరో యం త్వమాత్మానముపాస్సే తస్మాత్త్వం ప్రతిష్ఠితోఽ సి ప్రజయా చ పశు భిశ్చ ॥1॥ అత్స్యన్నం పశ్యసి ప్రియమత్త్యన్నం పశ్యతి చ భవత్యస్య బ్రహ్మవర్చసం కులే య ఏతమేవమాత్మానం వైశ్వానరముపాస్తే పాదౌ త్వేతావాత్మన ఇతి హొవాచ పాదౌ తే వ్యమ్లాస్యేతాం యన్మాం నాగమిష్య ఇతి ॥2॥**

**మంత్రం 1:**ఆరవ శిష్యుడు ఉద్దాలక ఆరుణి. అతని ఇంకో పేరు గౌతముడు.
**పృథివీమేవ భగవో రాజన్–** పృథివిని వైశ్వానరుడిగా ఉపాసిస్తున్నాను.
**ప్రతిష్ఠాత్మా వైశ్వానరః –** అది ప్రతిష్ఠగా ప్రసిద్ధి చెందింది.

**ఫలం– తస్మాత్త్వం ప్రతిష్ఠితోఽసి ప్రజయా చ పశుభిశ్చ –** నీకు పేరు ప్రతిష్ఠలతో పాటు సమృద్ధిగా సంతానం, పశువులు ఉన్నారు.

**మంత్రం2: పాదౌ తే వ్యమ్లాస్యేతాం –** ఈ వైశ్వానరుడు ఆత్మకు రెండు పాదాలు. నువ్వు నా దగ్గరకు రాకపోయుంటే నీ పాదాలు శిథిలమై ఉండేవి.

**విశ్లేషణ:–** ఈ ఆరుగురు వైశ్వానరుని ఒక్కొక్క అంగంగా మాత్రమే చూస్తున్నారు. ఏనుగుని గుడ్డివారు ఒక్కొక్క అంశమే చూసి, ఆ అంగమే ఏనుగు అని అనుకొన్న కథ తెలిసిందే. ఈ ఆరుగురి ఉపాసనల్లో పంచ భూతాల్లో నాలుగు వచ్చేశాయి. ఆకాశం, వాయువు, నీరు, పృథివి; ఇవి కాక స్వర్గలోకం, సూర్యుడు వచ్చాయి. అగ్ని మిగిలింది. దాన్ని గురువు చెప్పాడు. ఇవి సమష్టిపరంగా చెప్పబడ్డాయి. ఇవి వ్యష్టిలో కొన్ని అవయవాలకు అధిష్ఠాన దేవతలు. అందుకే గురువు వ్యష్టిలో ఆయా అంగాలు దెబ్బతింటాయని చెప్పాడు. వ్యష్టిలో పై నుంచి కిందకి వర్ణన రూపంలో వచ్చాయి అవి. అవి వరుసగా – తల, కన్ను, ప్రాణం, శరీర మధ్యభాగం, మూత్రాశయం, పాదాలు.

### అష్టాదశః ఖణ్డః (18)

**తాన్హోవాచైతే వై ఖలు యూయం పృథగివేమమాత్మానం వైశ్వానరం విద్వాగ్ంసోఽన్నమత్థ యస్త్వేతమేవం ప్రాదేశమాత్రమభివిమానమాత్మానం వైశ్వానరముపాస్తే స సర్వేషు లోకేషు సర్వేషు భూతేషు సర్వేష్వాత్మస్వన్నమత్తి ॥1॥ తస్య హ వా ఏతస్యాత్మనో వైశ్వానరస్య మూర్ధైవ సుతేజాశ్చక్షుర్విశ్వరూపః ప్రాణః పృథగ్వర్త్మాఽఽత్మా సన్దేహో బహులో బస్తిరేవ రయిః పృథివ్యేవ పాదౌ। ఉర ఏవ వేదిర్లోమాని బర్హిర్హృదయం గార్హపత్యో మనోఽన్వాహార్యపచన ఆస్యమాహవనీయః ॥2॥**

**మంత్రం–1:** ఇంతవరకూ గురువు, ఒక్కొక్క శిష్యుని ఉపాసనా తీరుని తెలుసుకుని, అతని ఉపాసనా ఫలం చెప్పి, దానివల్ల కలిగే దోషం కూడా చెప్పాడు. అంటే వాళ్ళు పూర్తిగా, సరిగ్గానూ లేరు. పూర్తిగా తప్పుగానూ లేదు.

**పృథగివేమమాత్మానం వైశ్వానరం –** మీరు ఈ వైశ్వానర ఆత్మను వేర్వేరు

భాగాలుగా విభజించి ఉపాసిస్తున్నారు.

**యస్త్వేతమేవం ప్రాదేశమాత్రమ్ సర్వేషు లోకేషు సర్వేషు భూతేషు, సర్వేష్వాత్మస్వన్నమత్తి** – ఎవరైతే ఈ వైశ్వానర ఆత్మను నేనుగా ఉపాసిస్తారో, అతను అన్ని లోకాల్లో, అన్ని ప్రాణుల్లో అన్ని రూపాల్లో ఆహారాన్ని భుజిస్తాడు.

అంటే తను అన్ని జీవరాశులను ఒకటిగా భావిస్తాడు. అవి తింటే తాను ఆనందిస్తాడు.

**మంత్రం-2:** ఈ మంత్రాల్లో విరాట్, విశ్వ ఐక్య ఉపాసన వస్తుంది. విరాట్‌లోని ఒక్కొక్క అంగం, నాలోని ఒక్కొక్క అంగానికి అధిష్ఠాన దేవత. ఇది తైత్తిరీయంలో చూసిన పాంక్త బ్రహ్మ ఉపాసనకు దగ్గరగా ఉంది. అందులో ఆధ్యాత్మపాంక్తం, ఆధిభూత పాంక్తం కలిసివస్తాయి.

**మూర్ధేవ సుతేజ** – సుతేజమైన ద్యులోకం తల; **చక్షుర్విశ్వరూపః** – విశ్వరూపుడైన సూర్యుడు చూపు; **ప్రాణః పృథగ్వర్త్మాఽఽత్మా** – అనేక మార్గాలు గల వాయువు ప్రాణం; **సన్దేహో బహులో బస్తిరేవ రయిః** – నీరు మూత్రాశయం; **పృథివ్యేవ పాదౌ** – పృథివియే పాదాలు.

ఇక్కడివరకూ శిష్యుల జవాబులు వచ్చాయి. తర్వాత వచ్చే మంత్రంలో గురువు మరికొన్ని చెప్పాడు.

**మంత్రం-3 : ఉర ఏవ వేది** – వక్షఃస్థలం యజ్ఞవేది; **లోమాని బర్హిః** – రోమాలు దర్భలు; **హృదయం గార్హపత్యః** – హృదయం గార్హపత్యాగ్ని; **మనోఽన్వాహార్యపచన** – మనసు దక్షిణాగ్ని; **ఆస్యమాహవనీయః** – నోరు ఆవహనీయాగ్ని. అగ్ని ఒకటే. భిన్న యజ్ఞాలకు భిన్న విధాల్లో అగ్నిని వాడుతారు. శ్రౌతకర్మకు వాడే అగ్ని వేరు. ఉపనయనానికి వాడే అగ్ని వేరు; ఒక్కముక్కలో ఈ మూడు అగ్నులూ విరాట్. ఇదే భావన ముండకలో–

**అగ్నిర్మూర్ధా చక్షుషీ చన్ద్ర సూర్యౌ**
**దిశః శ్రోత్రే వాగ్వివృత్తాశ్చ వేదాః**
**వాయుః ప్రాణో హృదయం విశ్వమస్య**
**పద్భ్యాం పృథివీ హ్యేష సర్వభూతాన్తరాత్మా॥ ముండక 2-1-4**

విష్ణు సహస్రనామంలో కూడా చిన్న తేడాతో

**భూః పాదౌ యస్య నాభిర్వియదసురనిలశ్చంద్రసూర్యౌ చ నేత్రే।**
**కర్ణావాశాశ్శిరో ద్యౌర్ముఖమపి దహనో యస్య వాస్తేయ మబ్ధిః।**

దీనితో వైశ్వానర ఉపాసన ముగిసింది.

**ఖండాలు 19-24**

వీటిలో ఉపాసన అంగకర్మ వస్తుంది. సాధారణంగా ప్రతి ఉపాసనకు ఒక దృక్పథం లేదా, ఒక వ్రతం చెపుతుంది ఉపనిషత్తు.

**అన్నం న నిన్ద్యాత్ - తైత్తిరీయం**

విరాట్ ఉపాసకుడు అన్నాన్ని నిందించకూడదు.

ఇక్కడ అంగకర్మ చూస్తాం, వైశ్వానర ఉపాసనకు. అతను తినే విధానాన్ని మార్చుకోవాలి. తను తినే ఆహారాన్ని ముందు వైశ్వానర అగ్నికి నివేదించాలి. ఎలా? ప్రాణాయ స్వాహా, అపానాయ స్వాహా లాగా. దీన్ని ప్రాణాగ్ని హోత్రం అంటారు. పంచప్రాణాలకు మనం తినే ప్రథమ ముద్దలను నైవేద్యంగా అర్పించాలి.

**ఏకోనవింశః ఖణ్డః (19)**

**తద్యద్భక్తం ప్రథమమాగచ్ఛేత్తద్ధోమీయగ్ం స యాం ప్రథమామాహుతిం జుహుయాత్తాం జుహుయాత్ప్రాణాయ స్వాహేతి ప్రాణస్తృప్యతి ॥1॥ ప్రాణే తృప్యతి చక్షుస్తృప్యతి చక్షుషి తృప్యత్యాదిత్య స్తృప్యత్యాది త్యే తృప్యతి ద్యౌస్తృప్యతి దివి తృప్యన్త్యాం యత్కించ ద్యౌశ్చాదిత్యశ్చా ధితిష్ఠతస్తత్తృప్యతి తస్యాను తృప్తిం తృప్యతి ప్రజయా పశుభిరన్నాద్యేన తేజసా బ్రహ్మవర్చసేనేతి॥2॥**

భోక్త మొట్టమొదటి ఆహారాన్ని ప్రాణాయ స్వాహా అని తీసుకోవాలి. అప్పుడది హోమద్రవ్యంగా అవుతుంది. అలా చేయటం వల్ల ఆహారాన్ని తనకు మాత్రమే తీసుకోకుండా, సమష్టికోసం తీసుకుంటున్న భావన కలుగుతుంది. ఆ హోమంతో ప్రాణం తృప్తి చెందుతుంది. ప్రాణం తృప్తి చెందితే కన్ను, కన్ను తృప్తి చెందితే ఆదిత్యుడు, ఆదిత్యుడు తృప్తి చెందితే ద్యులోకం, ద్యులోకం తృప్తి చెందితే ఆదిత్యలోకంలో ఉన్నవారంతా తృప్తి చెందుతారు.

**తస్యాను తృప్తిం తృప్యతి** - భోక్త కూడా తృప్తి చెందుతాడు.

**ఫలం-** సంతానం, పశువులు, సమృద్ధిగా ఆహారం, చక్కని జీర్ణశక్తి, శరీరకాంతి, బ్రహ్మవర్చస్సులను పొందుతాడు.

## వింశః ఖణ్డః (20)

**అథ యాం ద్వితీయాం జుహుయాత్తాం జుహుయాద్వ్యానాయ స్వాహేతి వ్యానస్తృప్యతి ॥1॥ వ్యానే తృప్యతి శ్రోత్రం తృప్యతి శ్రోత్రేతృప్యతి చన్ద్రమాస్తృప్యతి చన్ద్రమసి తృప్యతి దిశస్తృప్యన్తి దిక్షు తృప్యన్తీషు యత్కించ దిశశ్చ చన్ద్రమాశ్చాధితిష్ఠన్తి తత్తృప్యతి తస్యానుతృప్తిం తృప్యతి ప్రజయా పశుభిరన్నాద్యేన తేజసా బ్రహ్మవర్చసేనేతి ॥2॥**

భోక్త రెండవ ముద్దని వ్యానాయ స్వాహా అని తీసుకోవాలి. ఆ హోమం వల్ల వ్యానం తృప్తి చెందుతుంది. వ్యానం తృప్తి చెందితే చంద్రుడు, చంద్రుడు తృప్తి చెందితే దిక్కులు, దిక్కులు తృప్తి చెందితే దిక్కులు, చంద్రుడు అధిష్టించి ఉన్న పర్వాల్లో అందరూ తృప్తి చెందుతారు. భోక్త కూడా తృప్తి చెందుతాడు.

ఫలం– పైన చెప్పినట్టుగా సంతానం, పశువులు, సమృద్ధిగా ఆహారం, చక్కని జీర్ణశక్తి, శరీరకాంతి, బ్రహ్మవర్చస్సులను పొందుతాడు.

## ఏకవింశః ఖణ్డః (21)

**అథ యాం తృతీయాం జుహుయాత్తాం జుహుయాదపానాయ స్వాహేత్యపానస్తృప్యతి ॥1॥ అపానే తృప్యతి వాక్తృప్యతి వాచితృప్యన్త్యామగ్నిస్తృప్యత్యగ్నౌ తృప్యతి పృథివీ తృప్యతి పృథివ్యాం తృప్యన్త్యాం యత్కిం చ పృథివీ చాగ్నిశ్చాధితిష్ఠతస్తత్తృప్యతి తస్యానుతృప్తిం తృప్యతి ప్రజయా పశుభిరన్నాద్యేన తేజసా బ్రహ్మవర్చసేనేతి ॥2॥**

భోక్త మూడో ముద్దని అపానాయ స్వాహా అని తీసుకోవాలి. ఆ హోమం వల్ల అపానం తృప్తి చెందుతుంది. అపానం తృప్తి చెందితే వాగింద్రియం, వాగింద్రియం తృప్తి చెందితే అగ్ని, అగ్ని తృప్తి చెందితే పృథివీ, పృథివీ తృప్తి చెందితే పృథివీ, అగ్ని అధిష్టించి ఉన్న పర్వాల్లో అందరూ తృప్తి చెందుతారు. భోక్త కూడా తృప్తి చెందుతాడు.

ఫలం– పైన చెప్పినట్టుగా సంతానం, పశువులు, సమృద్ధిగా ఆహారం, చక్కని జీర్ణశక్తి, శరీరకాంతి, బ్రహ్మవర్చస్సులను పొందుతాడు.

**ద్వావింశః ఖణ్డః (22)**

**అథ యాం చతుర్థీం జుహుయాత్తాం జుహుయాత్సమానాయ స్వాహేతి సమానస్తృప్యతి ।71॥ సమానే తృప్యతి మనస్తృప్యతి మనసి తృప్యతి పర్జన్యస్తృప్యతి పర్జన్యే తృప్యతి విద్యుత్తృప్యతి విద్యుతి తృప్యన్త్యాం యత్కించ విద్యుచ్చ పర్జన్యశ్చాధితిష్ఠతస్తత్తృప్యతి తస్యానుతృప్తిం తృప్యతి ప్రజయా పశు భిరన్నాద్యేన తేజసా బ్రహ్మవర్చసేనేతి ॥2॥**

భోక్త నాలుగో ముద్దని సమానాయ స్వాహా అని తీసుకోవాలి. ఆ హోమం వల్ల సమానం తృప్తి చెందుతుంది. సమానం తృప్తి చెందితే మనసు, మనసు తృప్తి చెందితే పర్జన్యుడు, పర్జన్యుడు తృప్తి చెందితే విద్యుత్తు, విద్యుత్తు తృప్తి చెందితే, విద్యుత్తు, పర్జన్యుడు అధిష్టించి ఉన్న పర్వాల్లో అందరూ తృప్తి చెందుతారు. భోక్త కూడా తృప్తి చెందుతాడు.
ఫలం– పైన చెప్పినట్టుగా సంతానం, పశువులు, సమృద్ధిగా ఆహారం, చక్కని జీర్ణశక్తి, శరీరకాంతి, బ్రహ్మవర్చస్సులను పొందుతాడు.

**త్రయోవింశః ఖణ్డః (23)**

**అథ యాం పంచమీం జుహుయాత్తాం జుహుయాదుదానాయ స్వాహేత్యుదానస్తృప్యతి ॥1॥ ఉదానే తృప్యతి త్వక్తృప్యతి త్వచి తృప్యన్త్యాం వాయుస్తృప్యతి వాయౌ తృప్యత్యాకాశస్తృప్యత్యాకాశే తృప్యతి యత్కించ వాయుశ్చాకాశశ్చాధితిష్ఠతస్తత్తృప్యతి తస్యానుతృప్తిం తృప్యతి ప్రజయా పశు భిరన్నాద్యేన తేజసా బ్రహ్మవర్చసేనేతి ॥2॥**

భోక్త ఐదో ముద్దని ఉదానాయ స్వాహా అని తీసుకోవాలి. ఆ హోమం వల్ల ఉదానం తృప్తి చెందుతుంది. ఉదానం తృప్తి చెందితే త్వగింద్రియం, త్వగింద్రియం తృప్తి చెందితే, వాయువు, వాయువు తృప్తి చెందితే ఆకాశం, ఆకాశం తృప్తి చెందితే, వాయువు, ఆకాశం అధిష్టించి ఉన్న పర్వాల్లో ఉన్న అందరూ తృప్తి చెందుతారు. భోక్త కూడా తృప్తి చెందుతాడు.
**ఫలం –** పైన చెప్పినట్టుగా సంతానం, పశువులు, సమృద్ధిగా ఆహారం, చక్కని జీర్ణశక్తి, శరీరకాంతి, బ్రహ్మవర్చస్సులను పొందుతాడు.

ఈ ఉపాసనను **ప్రాణాగ్నిహోత్రం** అంటారు. ప్రతిరోజూ మనం తినేటప్పుడు ఈ ప్రాణాగ్నిహోత్రం చేయాలి. ప్రాణం అంటే పంచప్రాణాలు వస్తాయి. దీని ద్వారా ఆహారం వ్యష్టి నుంచి దేవతకు వెళ్ళి, దేవత ద్వారా అన్ని జీవరాశులకూ వెళ్తుంది.

ఎందుకు దీన్ని పంచ ప్రాణ అగ్నిహోత్రం అంటారు? విరాట్ ఉపాసనలో నోరు ఆహవనీయాగ్నిగా, హృదయం గార్హపత్య అగ్ని, మనసు దక్షిణాగ్నిగా ఉపాసన చేయబడ్డాయి. అగ్నిహోత్ర యజ్ఞం ఆహవనీయాగ్నిలో చేయాలి. ఇక్కడ నోరుని ఆహవనీయాగ్నిగా చూపింది. అందువల్ల ఆహవనీయాగ్నిలో వేసిన ఆహారం ఏమవుతుంది? అగ్నిహోత్రం అవుతుంది. దీని వెనుకనున్న తర్కం అది.

**ముఖస్య ఆహవనీయేన ఉపాసిత్వాత్ ముఖే యత్ భూయతే తత్ అగ్నిహోమా భవతి.**

ఈ విరాట్ ఉపాసన వల్ల నోటిలోకి తీసుకున్న ఏ ఆహారం అయినా అది విరాట్‌కి పెట్టినట్టు, విరాట్ ద్వారా మొత్తం మానవాళికి పెట్టినట్టు.

**చతుర్వింశః ఖణ్డః (24)**

**స య ఇదమవిద్వానగ్నిహోత్రం జుహోతి యథాఽంగారా నపోహ్య భస్మని జుహుయాత్తాదృక్తత్స్యాత్ ॥1॥ అథ య ఏతదేవం విద్వానగ్నిహోత్రం జుహోతి తస్య సర్వేషు భూతేషు సర్వేష్వాత్మసు హుతం భవతి ॥2॥ తద్యథేషీకాతూలమగ్నౌ ప్రోతం ప్రదూయేతైవగ్ం హాస్య సర్వే పాప్మానః ప్రదూయన్తే య ఏతదేవం విద్వానగ్నిహోత్రం జుహోతి ॥3॥ తస్మాదు హైవంవిద్యద్యపి చణ్డాలాయోచ్ఛిష్టం ప్రయచ్ఛేదాత్మని హైవాస్య తద్వైశ్వానరే హుతగ్ం స్యాదితి తదేష శ్లోకః ॥4॥ యథేహ క్షుధితా బాలా మాతరం పర్యుపాసత ఏవగ్ం సర్వాణి భూతాన్యగ్నిహోత్రముపాసత ఇత్యగ్నిహోత్రముపాసత ఇతి ॥5॥**

**మంత్రం-1 : వైశ్వానర ఉపాసన స్తుతి.** వైశ్వానర అంటే విరాట్. ఈ ప్రాణాగ్నిహోత్రం చేసే విరాట్ ఉపాసకుడు ఉంటే, అతను నిత్యాగ్నిహోత్రం చేసి ఉపాసన చేయని వానికన్నా ఎన్నోరెట్లు అధికుడు. అంటే రెండో వ్యక్తి నిత్యాగ్నిహోత్ర కర్మ చేస్తాడు కాని ఉపాసన చేయడు.

మొదటి వ్యక్తి అగ్నిహోత్ర కర్మ చేయదు కాని తినేముందు ఆహారాన్ని ప్రాణాగ్నిహోత్రంగా చేస్తాడు. అది విరాట్‌ఉపాసనతో కూడినది. ఉపాసకుని ప్రాణాగ్నిహోత్రం, అనుపాసకుని (ఉపాసన చేయని) కర్మిష్ఠ కర్మకన్నా అధికం. అంతేకాదు, నిత్యాగ్నిహోత్రం మాత్రమే చేసి, విరాట్ ఉపాసన చేయకపోతే లాభం లేదు అంటున్నది శ్రుతి.

**యథాఽ ంగారానపోహ్య భస్మని జుహుయాత్ –** విరాట్ ఉపాసన చేయకుండా, అగ్నిహోత్రం చేస్తే, మండే కట్టెలను పక్కకు తప్పించి, బూడిదలో హోమం చేసినట్టు అవుతుంది. కాని శంకరాచార్యులు దానికి ఒక మాట కలుపుతారు. నిత్యాగ్నిహోత్రం వృథాకాదు. దానికి కూడా ఫలం ఉంది. కాకపోతే ఉపాసన కూడా జత కలిపితే, ఫలం అధికంగా ఉంటుంది.

**అన్యస్తుత్యర్థం అన్యనిందా నిందాయాం తాత్పర్యం నాస్తి**

ఒకదాన్ని పొగడటం తప్ప, ఇంకోదాన్ని నిందించటం కాదు ఇక్కడ.

**మంత్రం2:** ఉపాసకుడు ప్రాణాగ్నిహోత్రం వల్ల అందరికీ పరోక్షంగా ఆహారాన్ని అందిస్తున్నాడు. వాళ్ళు తృప్తి చెందుతారు.

**సర్వేషు లోకేషు –** అన్ని లోకాల్లో;

**సర్వేషు భూతేషు –** అన్ని జీవరాశులు;

**సర్వేష్వాత్మసు –** అన్ని కరణాలు

తృప్తి చెందుతారు. అలాంటి ఒక్క మంచి వ్యక్తి ఉన్న సంఘం మొత్తం బాగుపడుతుంది.

**మంత్రం 3**: ఇందులో ఫలం వస్తుంది. సర్వపాప నాశనం జరుగుతుంది. ఈ ఉపాసన, ప్రాణాగ్నిహోత్రం చేయటం వల్ల అన్ని పాపాలు తొలగిపోతాయి. దీనికి ఒక ఉదాహరణ ఇచ్చింది శ్రుతి. నిప్పులో వేయబడ్డ గడ్డిపోచ వెంటనే కాలిపోయినట్టుగా, అతని పాపాలన్నీ ఈ ప్రాణాగ్నిహోత్రంలో కాలిపోతాయి.

**మంత్రం 4:** ఇంకో ఫలం కూడా చెపుతున్నది. కొత్తపాపాలు కూడా అంటవు. దుస్సంగం వల్ల వచ్చే కొత్త పాపాలు అంటవు. ఇంతకు ముందు పంచాగ్ని విద్య గురించి చూసినప్పుడు, పంచమహా పాతకాలలో దుస్సంగత్వం ఐదో మహాపాతకంగా చూశాము. పంచాగ్ని విద్య ఉపాసకునికి ఈ పాపం అంటదని కూడా చూశాము. అలాగే ఇక్కడ కూడా అలాంటి ఫలం చెపుతున్నది. ఛండాలునితో ఆహారం పంచుకుంటే మామూలుగా దాన్ని

అశౌచం అంటారు. దుస్సంగ దోషం అంటారు. కాని ఇక్కడ ఆ దోషం అంటదు. అతనికి జీవరాసులన్నీ విరాటే. అందుకని అతనికి ఎదుటివ్యక్తి ఛండాలునిగా అనిపించదు.

**తద్వైశ్వానరే హుతగ్ంస్యాత్ -** అది వైశ్వానర ఉపాసన చేసినట్టు. దాని గురించి ఒక ఋగ్మంత్రం ఉంది.

**మంత్రం 5:** ఈ జగత్తు మొత్తం ఈ ఉపాసకుని మీద ఆధారపడి ఉంది. ఎలా? ఆకలిగొన్న పిల్లలు తల్లిచుట్టూ చేరి, అన్నం కోసం ఎలా అడుగుతారో, అలా అందరూ విరాట్‌మీద ఆధారపడతారు. విరాట్ ఎవరు? ఈ ఉపాసకుడు. ఎందుకంటే విరాట్, ఉపాసకుడు భిన్నం కాదు. అందుకని జీవరాసులన్నీ విరాట్‌మీద ఆధారపడతాయి అంటే, విరాట్‌కీ ఉపాసకునికీ మధ్య భేదం లేనందువల్ల, ఈ ఉపాసకుని మీద ఆధారపడతాయి.

**అగ్నిహోత్రముపాసత-** ఇక్కడ అగ్నిహోత్రం అంటే ప్రాణాగ్నిహోత్రం. అగ్నిహోత్రం అంటే అగ్నిహోత్రి అని అర్థం. ఇతని మీద ఆధారపడతాయి అంటే అక్షరాలా ఆధారపడతాయి అని కాదు. అతను నిస్వార్థంగా ఉండి, తక్కినవాళ్ళను నిస్వార్థపరులనుగా మార్చుతాడు.

ఇక్కడితో ప్రాణాగ్నిహోత్రంతో కూడిన వైశ్వానర ఉపాసన ముగిసింది. దీనివల్ల మనం నేర్చుకునే పాఠం అన్నం తినేముందు మంత్రం పఠించి తినాలి.

# అధ్యాయం -5 సారాంశం

ఇందులో మూడు ఉపాసనలు చూశాము.

| ఉపాసనలు | **ఖండాలు** |
|---|---|
| ప్రాణ ఉపాసన | 1, 2 |
| పంచాగ్ని ఉపాసన | 3-10 |
| వైశ్వానర ఉపాసన | 11-24 |

# ॥ ఛాందోగ్యోపనిషత్తు ॥

# అధ్యాయం - 6

ఛాందోగ్యోపనిషత్తులో మొత్తం ఎనిమిది అధ్యాయాలున్నాయి. 1-5 అధ్యాయాల్లో ఎన్నో ఉపాసనలువస్తాయి.జ్ఞానం గురించి అణువంత కూడా ఉండదు. అందులోనూ కొన్ని ఉపాసనలను వైదిక ఉపాసనలంటారు. అవి ప్రకృతి మీద, వైశ్వానరుని మీద, మంత్రాల మీద, వ్యాహృతుల మీద ఉంటాయి. అవి ఇప్పటి ఉపాసనలకు భిన్నంగా ఉంటాయి. ఇప్పుడుచేసే ఉపాసనలు శివుడిమీదో, కృష్ణుడిమీదో ఉంటాయి.

జ్ఞానం గురించి కొంతైనా లేకపోతే, 1-5 అధ్యాయాలు ఎందుకు చెప్పినట్టు? దానికి మూడు కారణాలు ఉన్నాయి.

1. ఈ అధ్యాయాల్లోంచి అనేక మంత్రాలకు బ్రహ్మసూత్రాల్లో విశ్లేషణ ఉంటుంది. ఈ ఐదు అధ్యాయాలూ చదవకపోతే బ్రహ్మసూత్రాల్లో అధికభాగం అర్థం కాదు.

2. ఉపాసనకూడా క్రమముక్తికి దారితీస్తుంది. ఉపాసకుడు, ఉపాసనాఫలంగా బ్రహ్మలోకానికి వెళ్ళి, అక్కడ బ్రహ్మదగ్గర జ్ఞానం పొంది, అక్కడ క్రమముక్తి పొందుతాడు.

3. ఉపాసనల వల్ల చిత్త ఏకాగ్రత,చిత్త విశాలత ఏర్పడుతుంది. దానివల్ల జ్ఞానయోగ్యతా ప్రాప్తి కలుగుతుంది. కర్మకాండ,ఉపాసనకాండలను అపరావిద్య అనీ, జ్ఞానకాండను పరావిద్య అనీ అంటారు.

**పరావిద్యకు రానిదే అపరావిద్య అసంపూర్ణం**
**అపరావిద్య లేనిదే పరావిద్య అసంభవం**

ఆరవ అధ్యాయంలో జ్ఞానబోధ ఉంటుంది. ఇందులో అణువంత కూడా ఉపాసన ఉండదు. ఏడు,ఎనిమిది అధ్యాయాల్లో జ్ఞానం+ ఉపాసన గురించి ఉంటుంది. టూకీగా చూస్తే -

1-5 అధ్యాయాలు - సగుణ ఈశ్వర ఉపాసన- జ్ఞానయోగ్యతా ప్రాప్తర్థ్యం
6-8 అధ్యాయాలు - నిర్గుణబ్రహ్మజ్ఞానం

నిర్గుణబ్రహ్మజ్ఞానానికి ఒక్కొక్క అధ్యాయంలో ఒక్కొక్కపేరు వస్తుంది. సత్‌చిత్ ఆనందబ్రహ్మలోని సత్ అంశాన్ని ఆరవ అధ్యాయం, ఆనంద అంశాన్ని ఏడవ అధ్యాయం, చిత్ అంశాన్ని ఎనిమిదవ అధ్యాయం బోధిస్తాయి. ఆరవ అధ్యాయం సత్ గురించి చెపుతుంది కాబట్టి దీన్ని **సద్విద్యా ప్రకరణం** అంటారు. ఏడవ అధ్యాయం భూమవిద్యను బోధిస్తుంది. భూమ అంటే పూర్ణం అంటే ఆనందం. అందుకని దీన్ని **భూమవిద్యా ప్రకరణం** అని కూడా అంటారు. అలాగే ఎనిమిదవ అధ్యాయం తురీయం గురించి చెప్తుంది. అందుకని దీన్ని **తురీయవిద్యా ప్రకరణం** అనీ, బ్రహ్మ చెపుతారు కాబట్టి ప్రజాపతి ప్రకరణం అనీ అంటారు.

**6 – సద్విద్యా ప్రకరణం**

**7 – భూమవిద్యా ప్రకరణం**

**8 – తురీయవిద్యా ప్రకరణం / ప్రజాపతివిద్యా ప్రకరణం**

ఉపనిషత్తులన్నింటిలోకీ ఛాందోగ్యోపనిషత్ చాలా ముఖ్యమైనది. అందులోనూ ఆరవ అధ్యాయం ఇంకా ముఖ్యమైనది. దానికి కారణాలు అనేకం –

1. ఈ అధ్యాయంలోనే జ్ఞానబోధ మొదలవుతుంది.
2. ఈ అధ్యాయంలో ఉపాసన గురించి ఏమాత్రం ఉండదు.
3. ఎంతో ముఖ్యమైన మహావాక్యం ఈ అధ్యాయంలోనే వస్తుంది. అదికూడా తొమ్మిదిసార్లు. తత్త్వమసి అన్నది మహావాక్యం. మహావాక్యం అంటే –

**జీవ ఈశ్వర ఐక్య బోధకవాక్యం**

**లేదా అఖండార్థ బోధక వాక్యం**

యజుర్వేదాన్ని రెండూ కలిపి ఒకటిగా తీసుకుంటే, నాలుగు వేదాల కిందకి వస్తాయి. వాటికి నాలుగు ప్రముఖ మహావాక్యాలున్నాయి.

| **వేదం** | **ఉపనిషత్తు** | **మహావాక్యం** |
|---|---|---|
| ఋగ్వేదం | ఐతరేయం | ప్రజ్ఞానం బ్రహ్మ |
| సామవేదం | ఛాందోగ్యం | తత్త్వమసి |
| అధర్వణవేదం | మాండూక్యం | అయమాత్మ బ్రహ్మ |
| యజుర్వేదం | బృహదారణ్యకం | అహం బ్రహ్మాస్మి |

ఇవికాక జీవ, ఈశ్వర ఐక్యాన్ని చూపించే ఏ వాక్యం తీసుకున్నా మహావాక్యమే.

అలాంటివి ఒక్కొక్క ఉపనిషత్తులో ఎన్నో వస్తాయి.
4. మీమాంస శాస్త్రంలో ఈ అధ్యాయాన్ని ఉదాహరణగా తీసుకుంటారు. ఏదైనా దేనిగురించి చెప్తోంది అని నిర్ణయించటానికి మీమాంస శాస్త్రంలో షడ్లింగాలు ఉంటాయి.

**ఉపక్రమోపసంహారో అభ్యాస: అపూర్వతా ఫలం అర్థవాదోపత్తీచ లింగం తాత్పర్య నిర్ణయే॥**

**ఉపక్రమోపసంహారం** – ఏ విషయంలో మొదలవుతుందో, దానితోనే ముగుస్తుంది.

**అభ్యాసం** – చెప్పదలచుకున్న విషయాన్ని పదే పదే చెప్పడం. ఈ అధ్యాయంలో తత్త్వమసి శ్వేతకేతో అన్న వాక్యం 9సార్లు వస్తుంది.

| | | |
|---|---|---|
| **అపూర్వత** | – | విషయం కొత్తదిగా ఉండాలి. |
| **ఫలం** | – | దానివల్ల కలిగే ప్రయోజనం ఉండాలి. |
| **అర్థవాదం** | – | దాని గురించి గొప్పగా ఉండాలి. |
| **ఉపపత్తి** | – | దాని గురించి వాడే ఉపమానాలు ఉండాలి. |

**లింగం తాత్పర్యనిర్ణయే** – వీటివల్ల అందులోని తాత్పర్యం ఏమిటో నిర్ణయించవచ్చు.

## అధ్యాయం – 6 వివరాలు

| | | |
|---|---|---|
| ఖండం 1 | – | గురుశిష్యులని పరిచయం చేస్తుంది. |
| ఖండం 2– 7 | – | తత్త్వమసిలో తత్ పద విచారం |
| ఖండం 8 | – | తత్త్వమసిలో త్వం పద విచారం |
| ఖండం 9– 7 | – | తత్త్వమసిలో అసి పద విచారం |

ప్రథమః ఖణ్డః (1)

**ఓం। శ్వేతకేతుర్హారుణేయ ఆస తగ్ంహ పితోవాచ శ్వేతకేతో వస బ్రహ్మచర్యం। న వై సోమ్యాస్మత్కులీనోఽ ననూచ్య బ్రహ్మబంధురివ భవతీతి ॥1॥ స హ ద్వాదశవర్ష ఉపేత్య చతుర్విగ్ంశతివర్షః సర్వాన్వేదానధీత్య మహామనా అనూచానమానీ స్తబ్ధ ఏయాయ తగ్ం హ పితోవాచ శ్వేతకేతో యన్ను సోమ్యేదం మహామనా అనూచానమానీ స్తబ్ధోఽ స్యుత**

**తమాదేశమప్రాక్షః ॥2॥ యేనాశ్రుతగ్ం శ్రుతం భవత్యమతం మతమవిజ్ఞాతం విజ్ఞాతమితి కథం ను భగవః స ఆదేశో భవతీతి ॥3॥ యథాసోమ్యైకేన మృత్పిణ్డేన సర్వం మృణ్మయం విజ్ఞాతగ్ం స్యాద్వాచాఽఽరమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్ ॥4॥ యథా సోమ్యైకేన లోహమణినా సర్వం లోహమయం విజ్ఞాతగ్ం స్యాద్వాచాఽఽరమ్భణం వికారో నామధేయం లోహమిత్యేవ సత్యమ్ ॥5॥ యథా సోమ్యైకేన నఖనికృన్తనేన సర్వం కార్ష్ణాయసం విజ్ఞాతగ్ం స్యాద్వాచాఽఽమ్భణం వికారో నామధేయం కృష్ణాయసమిత్యేవ సత్యమేవగ్ం సోమ్య స ఆదేశోభవతీతి ॥6॥** న వై నూనం **భగవన్తస్త ఏతదవేదిషుర్యద్ధ్యేతదవేదిష్యన్ కథం మే నావక్ష్యన్నితి భగవాగ్ంస్త్వేవ మే తద్బ్రవీత్వితి తథా సోమ్యేతి హోవాచ ॥7॥**

**మంత్రం - 1**-ఈ ఖండాన్ని ఆఖ్యాయిక అంటారు. అంటే కథ. ఈ కథ ద్వారా గురు,శిష్యులను పరిచయం చేస్తున్నది ఉపనిషత్తు. ఈ కథ ద్వారా కొన్ని అంశాలను గ్రహించాలి.

గురువు లక్షణాలు, శిష్యుని లక్షణాలు, విద్య గొప్పదనం తెలుస్తాయి. అంతేకాదు వేదాంతం గురువు ద్వారానే నేర్చుకోవాలని నొక్కి చెపుతున్నది. ఎందుకంటే వేదాంతం అర్థంకాకపోయినా ఫర్వాలేదుకాని అపార్థం చేసుకోకూడదు.

**శ్వేతకేతుర్హారుణేయ ఆస** - ఒకప్పుడు ఆరుణి పుత్రుడైన శ్వేతకేతు ఉన్నాడు. అరుణుడి పుత్రుడు ఆరుణి. అరుణుడి మనుమడు ఆరుణేయ.

**తగ్ంహ పితోవాచ** - తండ్రి అతనితో ఇలా చెప్పాడు. తండ్రి ఆరుణి. అతని ఇంకోపేరు ఉద్దాలకుడు. ఆ పేరు ఇక్కడ రాదు. తర్వాత వస్తుంది.

**శ్వేతకేతో వస బ్రహ్మచర్యం** - బ్రహ్మచర్యం అంటే ఇప్పటి బ్రహ్మచారి అర్థంకాదు. వేదాన్ని పఠించేవాడన్నమాట. గురుకుల వాసం ఎందుకు వెళుతున్నారు? తనే చెప్పవచ్చు కదా? తండ్రి చెప్పితే దాన్ని నియమాధ్యయనం అంటారు. అది ఇంకా శ్రేష్ఠం. కాని తండ్రికి కుదరకపోయుండవచ్చని అర్థం చేసుకోవాలి.

**నవై సోమ్యాస్మత్కులీనోఽ ననూచ్య - సోమ్య** అంటే సౌమ్యుడా అని అర్థం. మన కుటుంబంలో వేదాలు చదవకుండా ఎవరూ లేరు. అనూచ్య అంటే

నేర్చుకోవటం.అననూచ్య అంటే నేర్చుకోకుండా అని అర్థం.
**బ్రహ్మబంధురివ భవతి –** వేదాలు చదివిన వానిని బ్రాహ్మణుడు అంటారు. చదవని వాడిని పేరుకు మాత్రమే బ్రాహ్మణుడంటారు. దానికి వాడే పదం బ్రహ్మ బంధువు. మా తాత యాగం చేశాడు అని గొప్పలు చెప్పుకున్నట్టు ఉంటుంది. ఇంతవరకూ మన కుటుంబంలో ఎవరికీ అలాంటి పేరు రాలేదు. అందుకని నువ్వు కూడా నేర్చుకో అన్నాడు తండ్రి.
**మంత్రం–2–** శ్వేతకేతు వెళ్ళటానికి నిర్ణయించుకున్నాడు.
**సహద్వాదశవర్ష ఉపేత్య –** అతనికి పన్నెండేళ్ళ వయసప్పుడు వెళ్ళాడు.
**చతుర్విగ్ంశతవర్షః –** అతనికి ఇరవైనాలుగేళ్ళు వచ్చేవరకూ నేర్చుకున్నాడు.
**సర్వాన్వేదానధీత్య–** వేదాలు, వేదాంగాలు నేర్చుకున్నాడు. అప్పుడేమయింది? ఏమవకూడదో అది అయింది. విద్యాగర్వం వచ్చింది. తక్కిన గర్వాలను విద్యవల్ల తొలగించవచ్చు. విద్యే గర్వం కలిగిస్తే దాన్ని తొలగించటం కష్టం.
**మహామనా –** తను గొప్ప పండితుడననుకున్నాడు. సమస్య ఏమిటి?
**అనూచానమానీ –** అనువచ్ ధాతువు నుంచి వచ్చింది ఇది – అనువచ్ అంటే నేర్చుకోవటం. అనువాకం అనే పదం కూడా దీని నుంచే వచ్చింది.తైత్తిరీయంలో పేరాలని అనువాకం అంటారు. మామూలు నేర్చుకోవటం కాదు, వేద, వేదాంగాలు నేర్చుకోవటం.ఇతను వేద వేదాంగాలు నేర్చుకుని, అనువచన సమర్థుడయ్యాడు.అంటే శ్రోత్రియు డయ్యాడు. తను గొప్ప పండితుడినీ, అనువచన సమర్థుడినీ అయ్యానని అతను అనుకున్నాడు.
**స్తబ్ధ –** అణకువ లేకపోవటం. అప్రణత అయ్యాడు. ఎవరికీ నమస్కారం చేయకుండా, నిటారుగా నిల్చుంటాడు.
**ఏయామ్ –** వచ్చాడు
**తగ్ం హ పితోవాచ –** అతనితో తండ్రి ఇలా అన్నాడు.
**శ్వేతకేతో యన్ను సోమ్యేదం –** ఓ శ్వేతకేతూ, ఇదేమిటి?
**మహామనా అనూచానమానీఽ స్తబ్ధోసి –** ఉపనిషత్తు ఏ పదాలు వాడిందో అవే పదాలు తండ్రి వాడాడు. అంటే కొడుక్కు గర్వం వచ్చిందనీ, అది తగ్గించాలి అనీ గ్రహించాడు. ఓ శ్వేతకేతూ,నువ్వు మహా మనస్కుడివి, అనూచానమానివి, స్తబ్ధుడివి అయి ఉన్నావు.
**ఉత తమాదేశమప్రాక్షః –** ఇంతకీ నువ్వు ఆ ఉపదేశం గురించి అడిగావా

అని అడిగాడు. అంటే పరావిద్య గురించి అడిగావా అని అర్థం.

**కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి – ముండక**

ఏ ఒక్కటి తెలుసుకుంటే సర్వం తెలిసినట్టవుతుందో అది తెలుసా?

**మంత్రం – 3 –** దీన్ని ఇంకో విధంగా అడిగాడు ఉద్ధాలకుడు ఇందులో

**యేనాశ్రుతగ్ం శ్రుతం భవత్యమతం మతమవిజ్ఞాతం విజ్ఞాతమితి**

**యేన –** ఆ జ్ఞానం (పొందితే)

**అశ్రుతం శ్రుతం –** విననిది విన్నట్టుగా;

**అమతం మతం –** ఆలోచించనిది ఆలోచించినట్టుగా;

**అవిజ్ఞాతంవిజ్ఞాతం –** తెలియనిది తెలిసినట్టుగా;

**భవతి** – అనిపిస్తుంది.

శ్వేతకేతు నమ్మలేకపోయాడు. అదెలా సాధ్యం?

**ఏక జ్ఞానేన ఏక జ్ఞానమేవ**

**ఏక జ్ఞానేన ద్వయ జ్ఞానమపి న భవతి**

ఒకటి నేర్చుకుంటే ఒకటే వస్తుంది. ఎకనామిక్స్ నేర్చుకుంటే ఎకనామిక్స్ వస్తుంది, ఫిజిక్స్ రాదు కదా!

**కథం ను భగవః స ఆదేశో భవతీతి –** అటువంటి ఆదేశం ఎలా ఉంటుంది అన్నాడు శ్వేతకేతు. దీన్ని ఇంగ్లీషులో రిటారికల్ క్వొశ్చెన్ అంటారు. ఎలా ఉంటుంది అంటే ఉండదు అని అర్థం. ఆదేశః అంటే ఉపదేశం అని అర్థం. ఇక్కడ తండ్రిని భగవన్ అని సంబోధిస్తున్నాడు. అంటే అతనికి గర్వం వచ్చినా, తనకి తెలియని విషయం ఉందనేసరికి, అతనిలోని మంచి శిష్యుడు బయటకు వచ్చాడు.

**మంత్రం – 4–** అలాంటి విద్య ఉందని నిరూపిస్తున్నాడు ఉద్ధాలకుడు.

**ఏక విజ్ఞానేన సర్వ విజ్ఞానం భవతి –** ఒక్కటి తెలిస్తే అన్నీ తెలుస్తాయి. ఎలా?

**ఏక కారణ విజ్ఞానేన సర్వకార్యవిజ్ఞానం భవతి –**ఒక్క కారణం గురించి తెలిస్తే, అన్ని కార్యాలూ తెలిసినట్టే.

కారణం రెండు రకాలు – నిమిత్తకారణం,ఉపాదాన కారణం.

**నిమిత్తకారణం –** ఏదైనా వస్తువును తయారుచేసే వ్యక్తి నిమిత్త కారణం. కుండకు నిమిత్త కారణం కుమ్మరి. దీన్ని ఇంగ్లీషులో ఇంటిలిజెంట్ కాజ్ అంటారు.

**ఉపాదాన కారణం-** ఏదైనా వస్తువును తయారు చేయటానికి వాడే ముడిపదార్థాన్ని ఉపాదాన కారణం అంటారు. దీన్ని ఇంగ్లీషులో మెటీరియల్ కాజ్ అంటారు. పూజ్యస్వామీజీ నిమిత్త, ఉపాదాన కారణాలను మేకర్ అండ్ మెటీరియల్ అంటారు.

ఇక్కడ కారణం అంటే ఉపాదాన కారణమే. నిమిత్త కారణం కాదు.

ఒకటే ఉపాదాన కారణం.వివిధ నామరూపాలతో అనేక కార్యాలుగా మారుతుంది. ఈ నామరూపాలను విశ్లేషణ చేస్తే, అన్నింటిలోనూ ఉన్నది ఒకటే వస్తువనీ, నామరూపాలు పై పై తేడాలేననీ తెలుస్తుంది. నామరూపాలే వస్తువైతే, వాటికి విడిగా ఉనికి ఉంటుంది. కాని వాటికి కారణం లేనిదే విడిగా ఉనికి లేదు కాబట్టి, కారణం తెలిస్తే, కార్యం తెలిసినట్టే. కారణం ఏకం, కార్యం అనేకం.

నామరూపాలను అధ్యయనం చేస్తే అది అపరావిద్య, కారణాన్ని అధ్యయనం చేస్తే అది పరావిద్య. కాని మట్టి గురించి తెలిస్తే మట్టి ప్రపంచమే తెలుస్తుంది.బంగారం గురించి తెలియదు. అందుకని ఈ కారణాలన్నింటికీ మూలకారణమేదో దాని గురించి తెలుసుకోవాలి. మట్టి,బంగారం, నీరు లాంటి కారణాలు అపేక్షిక కారణం.

ఆపేక్షిక కారణ జ్ఞానేన సర్వం జ్ఞాతం న భవతి.

కాని మూల కారణం తెలిస్తే, అన్నీ తెలుస్తాయి.

మూలకారణ జ్ఞానేన సర్వం జ్ఞాతం భవతి.

మూల కారణం ఏమిటి? బ్రహ్మ. అందువల్ల

**బ్రహ్మజ్ఞానేన సర్వజ్ఞ భవతి**

అది అర్థమవటానికి మూడు ఉదాహరణలు ఇస్తున్నాడు గురువు. ఈ వివరంతో ఇప్పుడు మంత్రంలోకి వెళదాము.

**యథాసోమ్యైకేన మృత్పిణ్డేన సర్వం మృణ్మయం విజ్ఞాతగ్ం స్యాత్ -**

మృత్పిండేన అంటే మట్టిముద్ద. మట్టి కారణం. కుండ కార్యం. సర్వం మృణ్మయం అంటే మట్టితో చేసిన ప్రతి ఒక్క వస్తువూ. మట్టి తెలిస్తే కుండ ఎలా తెలుస్తుంది? కుండ అనేది కొత్త పదార్థం కాదు. ఉన్న వస్తువుకి ఇవ్వబడిన కొత్త పేరు. మట్టి,కుండ - రెండూ తీసుకోండి. నాకు రెండు వస్తువులు చూపించమంటే ఉన్నాయా? రెండూ మట్టే. ఒకదానికి

నామరూపాలు ఉన్నాయి. ఒకదానికి లేదు.
**వాచా౽౽రమ్భణం వికారో నామధేయం –** ఈ వాక్యం అక్షరలక్షలు పలికే వాక్యం. శాస్త్రంలో అనేకసార్లు, అనేక సందర్భాలలో దీన్ని చెపుతూ ఉంటారు. ఈ వాక్యం ద్వారా రెండు విషయాలు స్పష్టమవుతున్నాయి.
1.కార్యం పదార్థం కాదు. 2.పదార్థం కొత్తగా సృష్టింపబడలేదు.

కార్యం ఏమిటి? నామం. వికారం అంటే ఇక్కడ కార్యం. షడ్వికారాలు కావు. అందువల్ల కార్యం అంటే ఒక నామధేయం మాత్రమే. నామధేయం అంటే నామమే. బ్రహ్మసూత్రాల్లో **ఆరంభణాధికరణం** ఉంది. దాంట్లో కార్యమిథ్యాత్వం నిరూపణ వస్తుంది.

నిజానికి మనకు నామకరణం చేసేటప్పుడు కూడా ముందు **వేదోసి** (బృహదారణ్యకం) అని పేరు పెడతారట. వేద+అసి = వేదోసి. వేదకి ఒక అర్థం బ్రహ్మ. అందువల్ల నువ్వు బ్రహ్మవి అని అర్థం. **సదస్య సద్ గుహ్యం ఏవ నామ భవతి –** అది నీ రహస్యనామం. కాని పెట్టిన తండ్రీ మర్చిపోతాడు. పెట్టించుకున్న పుత్రునికీ తెలియదు.
**వాచా౽౽రమ్భణం –** వాగ్ ఇంద్రియంతో కొత్తపేరు వస్తుంది కార్యానికి.

కాని కార్యానికీ, మట్టికీ బేధం లేదు.

కారణ అభిన్న కార్య అభావాత్ కారణ జ్ఞానేన కార్యజ్ఞానం భవతి
**మృత్తికేత్యేవ సత్యం –** మట్టి మాత్రమే సత్యం. కుండ మిథ్య.

ఏక సత్యజ్ఞానేన అనేక మిథ్యాజ్ఞానం భవతి
మిథ్యా వస్తునః సత్య అధిష్ఠానత్వాత్

తక్కిన సిద్ధాంతులు శంకరాచార్యులతో వాదిస్తారు. మట్టి సత్యం వరకూ బాగానే ఉంది,కుండ అసత్యం అని ఎందుకన్నావు, శ్రుతి చెప్పనది చెపితే **శ్రుతహాని అశ్రుతకల్పనాదోషః** అవుతుంది అంటారు. అంటే శంకరాచార్యులు, మీరు సరిగా చూడండి, మృత్తికా ఏవ సత్యం అంది అంటారు. ఏవ అంటే మాత్రమే. మృత్తికా ఏవ అంటే మట్టి మాత్రమే సత్యం. అంటే ఏమిటి అర్థం? వేరే ఏదీ సత్యం కాదు. కారణం ఏవ సత్యం, కార్యం మిథ్య.

అందువల్ల వాదన ఇలా వస్తుంది. కారణంకి వ్యతిరిక్తంగా కార్యం లేదు. కార్యం మిథ్య వల్ల, కారణం సత్యం. తస్మాత్ కారణజ్ఞానేన కార్యవిజ్ఞానం

భవతి. ఇదే భావన, 5,6 మంత్రాల్లో కూడా.

**మంత్రం-5- యథాసోమ్యైకేన లోహమణినా సర్వం లోహమయం విజ్ఞాతగ్ం స్యాత్ -** ఏ విధంగా బంగారం ముద్ద ఒక్కదానిని గురించి తెలుసుకుంటే, బంగారంతో తయారయ్యే సర్వం తెలిసినట్టు అవుతుందో -

**వాచాఽ ఽ రమ్భణం వికారో నామధేయం-** బంగారంతో తయారయ్యే ఆభరణాలు కార్యం. అవి వాక్కుతో మొదలవుతాయి.

**లోహమిత్యేవ సత్యమ్-** ఆభరణాలు మిథ్య, బంగారం మాత్రమే సత్యం.

**మంత్రం - 6- యథాసోమ్యైకేన నఖ నికృన్తనేన సర్వం కార్ష్ణాయసం విజ్ఞాతగ్ం స్యాత్ -** ఓ సౌమ్యుడా! ఏవిధంగా గోళ్ళ కత్తెరని తయారుచేసిన ఇనుము గురించి తెలుసుకుంటే, ఇనుముతో చేసిన వస్తువులన్నీ తెలిసినట్టు అవుతాయో-

**వాచాఽ ఽ రమ్భణం వికారో నామధేయం -** ఇనుముతో తయారయే వస్తువులు కార్యం.అవి వాక్కుతో మొదలవుతాయి.

**కృష్ణాయనమిత్యేవ సత్యమ్-** వస్తువులు మిథ్య, ఇనుము మాత్రమే సత్యం.

**ఏవగ్ం సోమ్య స ఆదేశో భవతీతి -** ఈ విధంగా సౌమ్యుడా, ఈ ఉపదేశం చేయవచ్చు. అంటే ఒక కారణ జ్ఞానం ద్వారా సర్వజ్ఞానం సాధ్యమవుతుంది.

**మంత్రం - 7- న వై నూనం భగవన్తస్త ఏతదవేదిషుః -** తనను రక్షించుకోవటానికి మా గురువుకు కూడా ఈ విషయం తెలిసి ఉండదు (న ఆవేదిషు) అంటున్నాడు. దానికి కారణం కూడా చెపుతున్నాడు.

**యద్ధ్యేతదవేదిష్యన్ కథం మే నావక్ష్యన్నితి -** ఒకవేళ తెలిసి ఉండి ఉంటే, నాకు ఎట్లా చెప్పకుండా ఉండేవారు?

దీనిమీద ఇంకా చర్చ చేయదు ఉపనిషత్తు. కాని ఈ విషయం విన్నాక, శ్వేతకేతుకి గర్వం తగ్గటమే కాక,తనకు తెలియని విషయం తెలుసుకోవాలన్న ఉత్సాహం కూడా కలుగుతుంది.

**భగవాగ్ంస్త్వేవ మే తద్బ్రవీత్వితి -** అందుకే తండ్రి ముందు తగ్గి, తండ్రిని గురువుగా స్వీకరిస్తున్నాడు.భగవాన్ అన్న పదం దీనికి సంకేతం. ఉపనిషత్తులలో గురువున్ భగవాన్ అనీ, శిష్యుడిని సోమ్య అని వ్యవహరిస్తుంటారు. అందుకని భగవాన్, అదేదో మీరే చెప్పండి నాకు అని శిష్యుని స్థాయిలో అడిగాడు.

**తథా సోమ్యేతి హోవాచ –** అలాగే సౌమ్యుడా అని తండ్రి చెప్పాడు. తథాస్తు అన్నట్టన్నమాట.

ఇక్కడితో బోధకు సందర్భం తయారయింది. ఈ ఆఖ్యాయిక ద్వారా ఉపనిషత్తు కొన్ని విషయాలను చెప్పకనే చెపుతున్నది.

1.ఆత్మవిద్యను గురువు ద్వారానే నేర్చుకోవాలి.

2. ఉపనిషత్తులలో బోధ గురుశిష్యుల సంవాదంగా సాగుతుంది.

**ద్వితీయః ఖణ్డః (2)**

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్। తద్ధైక ఆహురసదేవేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్। తస్మాదసతః సజ్జాయేత ॥1॥ కుతస్తు ఖలు సోమ్యైవగ్ంస్యాదితి హోవాచ కథమసతః సజ్జాయేతేతి సత్త్వేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్ ॥2॥ తదైక్షత। బహు స్యాం ప్రజాయేయేతి। తత్తేజోఽసృజత। తత్తేజ ఐక్షత బహు స్యాం ప్రజాయేయేతి తదపోఽసృజత। తస్మాద్యత్ర క్వ చ శోచతి స్వేదతే వా పురుషస్తేజస ఏవ తదధ్యాపో జాయన్తే ॥3॥ తా ఆప ఐక్షన్త బహ్వ్యః స్యామ్ ప్రజాయేమహీతి తా అన్నమసృజన్త తస్మాద్యత్ర క్వ చ వర్షతి తదేవ భూయిష్ఠమన్నం భవత్యద్భ్య ఏవ తదధ్యన్నాద్యం జాయతే ॥4॥**

ఇక్కడ్నుంచి బోధ మొదలవుతుంది. తత్త్వమసి శ్వేతకేతో లోని తత్ పద విచారం ఖండాలు 2–7 వరకూ సాగుతుంది.మంత్రాలలోకి వెళ్ళేముందు కార్యకారణ సంబంధం గురించి 5 అంశాలు తెలుసుకుందాము.

**1.అవస్థాభేదం –** ఒక మట్టిముద్దను, ఒక కుండను పక్కపక్కన చూశారనుకోండి. రెండింటిలోనూ సమానంగా ఉన్నది ఏమిటి? మట్టి.మరి అయితే ఒకదాన్ని మట్టి అనీ, ఇంకోదాన్ని కుండ అనీ ఎందుకంటున్నాము? ఎందుకంటే, వాటి అవస్థల్లో భేదం ఉంది. ఒకటి రూపుదిద్దుకోలేదు. ఇంకోటి రూపుదిద్దుకుంది.

కారణం = మట్టి, కార్యం = కుండ

**2. నామరూపం –** మట్టి ముద్దలోనూ, కుండలోనూ కూడా మట్టే కాకుండా, ఇంకోటి కూడా సమానంగా ఉంది. ఏమిటది? నామరూపం. మట్టిలో కూడా నామరూపం ఉంది.కుండలో కూడా కుండ నామరూపం ఉంది. కాకపోతే

కుండలో ఆ నామరూపం తెలుస్తున్నది.మట్టిలో తెలియటం లేదు. అంటే కుండలో వ్యక్తరూపంలో ఉంది. మట్టిలో అవ్యక్తరూపంలో ఉంది. కుండ కార్యం, మట్టి కారణం అని ముందే చూశాము కదా. అందువల్ల

కారణం = మట్టి + అవ్యక్త నామరూపం.

కార్యం = మట్టి + వ్యక్త నామరూపం.

అవ్యక్త నామరూపాన్ని అవ్యాకృత నామరూపం అని కూడా అంటారు.

రెండింటిలోనూ సమానంగా ఉన్నది మట్టి. అవస్థాభేదం ఎందుకు వచ్చిందంటే నామరూపాల వల్ల.

**3. వ్యవహారభేదం –** రెండింటిలోనూ మట్టి + నామరూపాలు ఉంటే, ఒకదాన్నిచూసి మట్టి అనీ, ఇంకోదాన్నిచూసి కుండ అనీ ఎందుకంటున్నాము? ఎందుకంటే వాటిలో వ్యవహారభేదం ఉంది. కుండ రూపుదిద్దుకున్నాక అది వ్యవహారానికి పనికివస్తుంది. అదులో నీళ్ళు పట్టుకుని, వాడుకోవచ్చు. చూడటానికి ఆకర్షణీయంగా ఉంటుంది. అందువల్ల అది ఎందులోంచి వచ్చిందో ఆ విషయం మర్చిపోయి కుండ అంటున్నాము. మట్టి కుండ అని కూడా అనము. నిజానికి అది కూడా తప్పే.

మట్టికుండ అనేసరికి కుండ సత్యం. దాని ఉనికికి కారణమైన మట్టి విశేషణం అయింది. అందుకని దాన్ని కుండగా కనపడుతున్న మట్టి అనాలి. వ్యక్తనామరూపం, ప్రత్యక్ష గోచరం. వ్యవహార ప్రధానం అవుతుంది. అదే మట్టి విషయానికి వచ్చేసరికి అది వ్యవహారానికి పనికిరాదు. ఉదాహరణకి ఎవరైనా వెన్న అడిగితే, వెన్న ఉంటే ఇస్తాము లేకపోతే లేదు. అంతేకాని పాలలో ఉంది, పాలు తీసుకువెళ్ళండి అంటామా? అందులో వెన్న లేనట్టే భావిస్తాము. అంటే కారణావస్థలో ముడిసరుకునే చూస్తాము. కార్యావస్థలో ముడి సరుకుని మర్చిపోతున్నాము. అందువల్ల–

కారణం = వస్తు ప్రధానం

కార్యం = నామరూప ప్రధానం

**4. బ్రహ్మసత్యం, జగత్ మిథ్య –**మట్టిలో నామరూపాలు అవ్యక్తరూపంలో ఉన్నాయి. నామరూపాలు వ్యక్తమయ్యేసరికి మట్టిని మర్చిపోతున్నాము అన్నాము కదా ఇప్పుడొక ప్రశ్న. నామరూపాలు మట్టిలో ఒక భాగమా,దానికి భిన్నంగా ఉన్నాయా? నామరూపాలు అందులో ఒక భాగంగా అన్నా

ఉండాలి. భిన్నంగా అన్నా ఉండాలి. కాని ఉపనిషత్తు రెండూ కాదు అంది.
**ఎ) పరిచ్ఛిన్నత్వదోషః –** భిన్నంగా ఉంది అనుకుంటే ఏకత్వం ఉండదు. అది ద్వైతం అవుతుంది. అప్పుడు ఉన్నది ఒకటే బ్రహ్మ. బ్రహ్మ అద్వితీయం అనలేము.
అద్వితీయత్వ భంగః స్యాత్ – శ్రుతి అద్వైతాన్ని పదే పదే నొక్కి చెప్తుంది.

అంతేకాకుండా, బ్రహ్మ నిర్వచనం ఏమిటి? బృహత్త్వమత్వాత్ బ్రహ్మ. అపరిచ్ఛిన్నం అని అర్థం. అపరిచ్ఛిన్నానికి మళ్ళీ ఇంకోటి కలపలేము. అందుకని నామరూపాలు బ్రహ్మకు భిన్నంగా ఉంటే **పరిచ్ఛిన్నత్వ దోషం** అంటుతుంది.
**బి) సవికారత్వ దోషః –** పోనీ దీనిలో ఒక భాగంగా ఉండనీ ఏమయింది అనుకుంటే అది కూడా సమస్యే అవుతుంది.

**అంగ వికారే అంగి వికారః**
**ఏకదేశ వికారే ఏకదేశి వికారః**

నా చెయ్యికి ఏదైనా సమస్య వస్తే మొత్తం శరీరానికి వచ్చినట్టు అవుతుంది. అప్పుడు అంగానికివచ్చే వికారాలని అంగీకి కూడా అంగీకరించాల్సి ఉంటుంది. వికారం అంగీకరిస్తే, బ్రహ్మకు కూడా షడ్వికారాలను ఆపాదించాల్సి ఉంటుంది. అప్పుడు బ్రహ్మ కూడా సంసారి అవుతాడు. అది కూడా మామూలు సంసారి కాదు, మహా సంసారి అవుతాడు. అవనీ,అయితే ఏం అంటే, బ్రహ్మే మహా సంసారి అయితే మనని ఎలా కాపాడుతాడు? అందుకని బ్రహ్మలో నామరూపాలు భాగం అనుకుంటే బ్రహ్మకు,సవికారత్వ దోషం అంటుతుంది.

అందుకని నామరూపాలు ఒక భాగమూ కాదు,భిన్నంగానూ లేవు. అది మిథ్య. మన నీడలాగా అవి కూడా మిథ్య. **సత్, అసత్భ్యాం అనిర్వచనీయం మిథ్య.**

నీడ ఉందా, లేదా? కనిపిస్తోంది కాబట్టి ఉంది,కాని నీడ మీంచి ఆటో వెళితే నీడకి ఏమన్నా అవుతుందా?అవదు.అందుకని అది ఉండీ లేనట్టే.

భిన్న అభిన్నత్వం అనిర్వచనీయం. అందువల్ల –
కారణం = శుద్ధసత్ + మిథ్య, అవ్యక్తనామరూపాలు
కార్యం = శుద్ధసత్ + మిథ్య, వ్యక్త నామరూపాలు

కార్యం దగ్గరకి వచ్చేసరికి శుద్ధ సత్ మర్చిపోకూడదు. మిథ్యని సత్యం అనకూడదు. అందువల్ల అది శుద్ధ సత్ + మిథ్య, వ్యక్త నామరూపాలు అవుతుంది. అంటే కారణం, కార్యంలో తేడా నామరూపాల స్థాయిలోనే ఉంది.

5. **సత్ బ్రహ్మ అస్తి –** సృష్టి పూర్వం ఏం ఉంది? శుద్ధ సత్ మాత్రమే ఉంది. కాని సత్ వ్యవహార అగోచరం అయ్యేసరికి సత్ కూడా లేదనుకుంటాము. మన అలవాటు ఏమిటి? వ్యవహారానికి అందనిది ఏదీ లేదనే!

**యత్ర యత్ర వ్యవహార గోచరత్వం తత్ర తత్ర అస్తిత్వమితి**

అందుకని సృష్టికి ముందు సత్ లేదు, అసతే ఉంది అని ఒక వాదన. కాని అది నిజం కాదు. సృష్టికి ముందు సత్ అవ్యక్తనామరూపాలతో ఉంది.

కారణం = సత్

ఈ నేపథ్యంతో అసలు బోధలోకి వెళదాము.

**మంత్రం – 1– సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్ –** గురువు తన బోధను మొదలుపెడుతున్నాడు. హే సోమ్య అని అతన్ని సంబోధిస్తున్నాడు.

**సత్ ఏవ ఆసీత్ –** సత్ మాత్రమే ఉంది. బ్రహ్మను అనేకరకాల పేర్లతో వ్యవహరిస్తాయి ఉపనిషత్తులు.

| | |
|---|---|
| అక్షరం బ్రహ్మ | – ముండకం |
| సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ | – తైత్తిరీయం |
| తురీయం బ్రహ్మ | – మాండూక్యం |
| సత్ బ్రహ్మ | – ఛాందోగ్యం |

ఈ సత్ బ్రహ్మ మాత్రమే ఉంది. ఎప్పుడు?

**ఇదం అగ్రే–** ఈ ప్రత్యక్ష గోచరంగా లేదా వ్యవహార గోచరంగా ఉన్న ఈ జగత్తుకు ముందు. అంటే బ్రహ్మలో జగత్తు అవ్యక్తరూపంలో ఉంది. సృష్టికి ముందు బ్రహ్మ ఉంది అంటే, సృష్టి తర్వాత లేదా? వాక్యం సరిగ్గా చదవాలి. సృష్టికి ముందు సత్ మాత్రమే ఉంది. సదేవ అంటే సత్+ఏవ అంటే సత్ మాత్రమే. అంటే శుద్ధ చైతన్యం ఉంది. అంటే సత్+ అవ్యక్త నామరూపాలు ఉన్నాయి. అంతకుముందు అవ్యవహారంగా ఉన్న సత్ ఇప్పుడు వ్యవహారానికి అనుకూలంగా ఉంది.

**ఏకమేవాద్వితీయమ్**– ఉన్నది ఒకటే సత్, ఇంకోటి లేదు.

ఏకమ్,ఏవ, అద్వితీయమ్ మూడు పదాలు. ఈ మూడు పదాలూ అన్నిరకాల భేదాలనూ కొట్టివేస్తున్నాయి. భేదాలు మూడు రకాలు.విజాతీయ, సజాతీయ, స్వగత భేదాలు.

**విజాతీయ భేదం** – రెండు భిన్న జాతుల మధ్య భేదాలు. ఉదా: వృక్షం,మనిషి.

**సజాతీయ భేదం** – ఒకే జాతిలో ఉన్న భేదం. ఉదా:వృక్షాల్లో అనేక రకాలు– మామిడి చెట్టు, కొబ్బరిచెట్టు వగైరా.

**స్వగత భేదం** – ఒకే చెట్టులో భిన్న అంశాలు. ఉదా: వేరు, కొమ్మలు, ఆకులు, పువ్వులు వగైరా.

బ్రహ్మ విషయానికి వస్తే –

**ఏకం** – ఉన్నది ఒకటే బ్రహ్మ. అనేక బ్రహ్మలు లేరు. అందుకని స్వజాతీయ భేదం లేదు.

**ఏవ** – బ్రహ్మ నిర్గుణ బ్రహ్మ కాబట్టి అంగాలు లేవు. అందుకని స్వగత భేదం లేదు.

**అద్వితీయం**– బ్రహ్మకాక రెండో వస్తువు లేదు. అందుకని విజాతీయ భేదం లేదు.

**విజాతీయ, సజాతీయ, స్వగత భేదరహితం బ్రహ్మ**

సృష్టికి ముందు సత్ మాత్రమే ఉంది. అవ్యక్త నామరూపాలతో కూడిన సత్ మాత్రమే ఉంది. అవ్యక్త నామరూపాలను మాయ అంటారు.

**బ్రహ్మ+మాయ = ఈశ్వరుడు**

కాని కొంతమంది ఈ శుద్ధ సత్తాని అర్థం చేసుకోలేరు. ఎందుకంటే అది ప్రమాణ అగోచరం. అంటే ఇంద్రియ అగోచరం. అందుకే సుషుప్తిలో నామరూపాలన్నీ లయమయిపోయినప్పుడు, మనకు ఏదీ తెలియదు. నేను,నువ్వు, ప్రపంచం అన్న తేడాలేమీ తెలియవు. అందువల్ల కొందరు సుషుప్తిలో ఏమీ తెలియటం లేదు కాబట్టి, మిగిలింది శూన్యం కాబట్టి,సృష్టికి ముందు ఏమీ లేదు లేదా శూన్యమే ఉంది అంటారు. దాన్ని అసత్ అంటారు.

**తద్ధైక ఆహురసదేవేదమగ్ర ఆసీత్** – కొంతమంది సృష్టికిపూర్వం అసత్తే ఉంది అంటారు.

**ఏకమేవాద్వితీయమ్** –అసత్ ఒకటే ఉంది. ఇంకోటి లేదు.

**తస్మాదసతఃసజ్జాయేత** – అందుకని అసత్ నుంచి సత్ వచ్చింది.

ఎవరు చెప్తున్నారు ఇది? ఉపనిషత్తు వాదన కాదు. ఉపనిషత్తు పూర్వపక్షుల వాదన చెపుతున్నది. ఇందులో సత్ అంటే సృష్టి.

గురువు ఉద్దాలకుడు ఈ వాదనను ఖండిస్తున్నాడు. అదెలా సాధ్యం అంటున్నాడు.

**మంత్రం – 2– కుతస్తు ఖలు సోమ్యైవగ్ంస్యాదితి హోవాచ** – గురువు ఉద్దాలకుడు,శ్వేతకేతుని ఉద్దేశించి చెప్తున్నాడు. హే సోమ్య, ఇదెలా సాధ్యం?

కుతః అంటే కస్మాత్ప్రమాణం? అంటే వాళ్ళకి ఏం ప్రమాణం ఉంది? వాళ్ళ వాదన ఏమిటి?

**అసతఃసజ్జాయేతేతి** – అసత్తు నుంచి సృష్టి వచ్చింది. దానికి కథం కలిపాడు గురువు. అంటే అసత్తు నుంచి ఎలా సృష్టి వస్తుంది అని అడుగుతున్నాడు. అంటే దానికి జవాబు చెప్పమని కాదు అర్థం, అది అసాధ్యం అని. లేనిదాని నుంచి ఉన్నది ఎలా వస్తుంది? అది అసాధ్యం అని చెప్పటానికి అనేక కారణాలున్నాయి. ఇప్పుడు ఒకటి,రెండు కారణాలు చూద్దాము.

1.మనకు వెన్న కావాలనుకోండి, పెరుగును చిలుకుతామా, నీళ్ళను చిలుకుతామా? పెరుగు చిలుకుతాము. పెరుగుకే ఎందుకు వెళతాము? ఎందుకంటే అందులో అవ్యక్త రూపంలో వెన్న ఉంది. అంటేమనం ఉన్న వెన్నని తీస్తున్నామా లేని వెన్నని తీస్తున్నామా? ఉన్న వెన్ననే.

2. అలాగే నూనె కావాలంటే నూనెగింజల నుంచి ప్రయత్నిస్తాము. కాని మట్టి నుంచి ప్రయత్నించము కదా! ఎందుకంటే నూనె గింజలలో నూనె అవ్యక్త రూపంలో ఉంది.

అంటే మనం ఏదైనా ఉత్పత్తిచేయాలంటే, అది ఎందులో అవ్యక్తరూపంలో ఉందో దాని దగ్గరకు వెళతాము. అంటే మన అనుభవం ప్రకారం అవ్యక్తరూపానికే వ్యక్తరూపం ఇవ్వగలము.

ఒకవేళ, అలా శూన్యం నుంచి వస్తువులు వచ్చేస్తాయంటే, మనం బజారెళ్ళి వస్తువులు కొననవసరం లేదు. శూన్యం నుంచి భవంతులు లేపవచ్చు. శూన్యం నుంచి అన్నం వండవచ్చు. కాని అలా అవటం లేదే! అందువల్ల మన అనుభవం ప్రకారం చూసినా, తర్కప్రధానంగా చూసినా

శూన్యం నుంచి ఏదీ రాదు. ఏదైనా అవ్యక్తరూపంలోఉంటేనే వ్యక్తమవుతుంది.
**సత్త్వేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్ –** అందుకని గురువు మళ్ళీ నొక్కి వక్కాణిస్తున్నాడు. సృష్టికి ముందు సత్తే ఉంది. జీవాలు,జగత్ అవ్యక్తరూపంలో సత్‌లో ఉన్నాయి.

**ఏకమేవాద్వితీయమ్ –** ఉన్నది ఒకటే సత్.

**మంత్రం –3 –** అనాదిగా ఉన్న జీవుడు, అనాదిగా ఉన్న జగత్తు శుద్ధసత్‌లో అవ్యక్త నామరూపాలతో ఉన్నాయని చూశాము. అందువల్ల సృష్టి జరిగినప్పుడు, అవి వ్యక్తమయ్యాయి.

సృష్టి అనుకోకుండా జరిగిందా లేదా దాని వెనుక ఏదైనా నియతి ఉందా? అనుకోకుండా జరుగలేదు. జడవస్తువు దానంతట అది కలిసిపోయి ఒక ప్రణాళికతో కూడిన జగత్తు అవలేదు. దాని వెనుక ఎంతోజ్ఞానం కావాలి. ఒక ఇల్లు కట్టాలంటేనే ఇటుకలను ఒక పద్ధతిలో పేర్చాలి. కిటికీలను అమర్చాలి. ఎన్నో వివరాలు గమనించాలి. అందుకని సృష్టి వెనుక నిమిత్తకారణంగా ఈశ్వరుడు ఉన్నాడు. ఈశ్వరుడు అంటే బ్రహ్మ + మాయ. ఈశ్వరుని సంకల్పం వల్ల జరిగింది.

ఈశ్వరుడు ఎలా సంకల్పం చేసాడు? ఆయన రాగద్వేషాలు చూపాడా? ఇష్టాయిష్టాలు చూపాడా? లేదు. కర్మసిద్ధాంతం ఉంది. ఒక జీవికి పశు శరీరం ఇవ్వాలా, మనిషి శరీరం ఇవ్వాలా అన్నది అతను అంతకుముందు చేసుకున్న కర్మఫలాన్ని బట్టి ఉంటుంది. అందుకని ఈశ్వరుని సంకల్పాన్ని సామాన్య కారణం అనీ, జీవుని కర్మను విశేషకారణం అనీ అంటారు. అందువల్ల **మాయాసహిత బ్రహ్మ, అవ్యక్త నామరూప సహిత సత్ –** ఇంకో మాటలో చెప్పాలంటే ఈశ్వరుడు – సృష్టి ఎలా చేయాలో ఒకసారి సంకల్పించుకున్నాడు.

ఏ పని చేయటానికన్నా ముందు మనసులో ఒక ఆలోచన వస్తుంది. తర్వాత దానికి మనసులో ప్రణాళిక వేస్తాము. ఆ తర్వాత ఆచరణలో పెడతాము. ఈశ్వరుని విషయంలో కూడా అదే చూస్తాము.

> **సో౽కామయత। బహుస్యాం ప్రజాయేయేతి। స తపో౽తప్యత। స తపస్తప్త్వా। ఇదగ్ం సర్వ మసృజత। యదిదం కిఞ్చ। తత్ సృష్ట్వా। తదేవాను ప్రావిశత్। తదనుప్రవిశ్య। సచ్చ త్యచ్చాభవత్। నిరుక్తం చా౽**

**నిరుక్తం చ। నిలయనం చాఽ నిలయనం చ। విజ్ఞానం చాఽ విజ్ఞానం చ। సత్యం చాఽ నృతం చ సత్యమభవత్। – తైత్తిరీయం బ్రహ్మానందవల్లీ**

**తదైక్షత** – తత్ ఎవరు? మాయాసహిత బ్రహ్మలేదా ఈశ్వరుడు. మాయ అంటే అవ్యక్తనామరూపాలు. మాయను ప్రకృతి, శక్తి అని కూడా అంటారు. మాయ, ప్రకృతి, శక్తి అవ్యక్తనామరూపాలు– అన్నీ పర్యాయపదాలే. అందుకని సృష్టికి ముందు ఎవరున్నారు అంటే బ్రహ్మ+ మాయ ఉన్నారు.

బ్రహ్మ+మాయ ఉన్నారు అంటే ఏకమేవ అద్వితీయం ఎలా అవుతుంది? మాయ బ్రహ్మకు భిన్నంగా ఉందా; బ్రహ్మలో భాగంగా ఉందా? మాయ భిన్నంగా ఉంది అంటే ద్వైతం అవుతుంది. అప్పుడు ఉన్నది ఒకటే బ్రహ్మ అనలేము. పోనీ మాయ బ్రహ్మలో ఒక భాగం అందామా? అప్పుడు ఒకటే అవుతుంది కదా! అది కూడా కుదరదు. ఎందుకంటే మాయ బ్రహ్మలో ఒక భాగం అంటే స్వగత బేధం వస్తుంది. అంతేకాదు మాయ అవ్యక్తనామరూపాల నుంచి వ్యక్తనామరూపాలుగా ప్రకటితమయ్యేటప్పుడు, మాయ మార్పుకు లోనవుతుంది. మాయ బ్రహ్మలో ఒక భాగమైతే బ్రహ్మ కూడా మార్పుకు లోనవ్వాలి. అందుకని మాయ భిన్నంగా ఉంది అన్నా సమస్యే. భిన్నంగా లేదు అన్నా సమస్యే! దీనికి అద్వైత వేదాంతి చెప్పే సమాధానం– 'అనిర్వచనీయం'. భిన్న అభిన్నత్వాభ్యామ్ అనిర్వచనీయం. వివేక చూడామణిలో శంకరుల వారు, మాయను అద్భుతంగా వర్ణిస్తారు.

**సన్నాప్యసన్నాప్యుభయాత్మిక నో భిన్నప్యభిన్నాప్యుచ్ఛాయాత్మికనో**
**సంగప్యనంగ హ్యుభయాత్మకానో మహాభూతా నిర్వచనీయ రూపా॥**
**– పంచదశి 1091**

పంచదశిలో ఈ చర్చ వస్తుంది. మాయకూ బ్రహ్మకూ మధ్య ఉన్న సంబంధం ఎటువంటిది? ఒక వ్యక్తికీ, అద్దంలో అతని ప్రతిబింబానికీ మధ్య ఉన్న అనుబంధం లాంటిది. అద్దంలో కనిపిస్తున్న మీ ప్రతిబింబం భిన్నంగా ఉంది అంటే, మీరు అద్దం పక్కన లేకపోయినా మీ ప్రతిబింబం అద్దంలో ఉండాలి. లేదే! పోనీ ఒక భాగం అనుకుంటే ప్రతిబింబానికేదైనా అయితే మీక్కూడా అవాలి. లేదే! ప్రతిబింబం నాశనమయినా, మీకేం అవటం లేదు.

అందువల్ల ప్రతిబింబం మీలో ఒక భాగమూ కాదు. మీకు భిన్నమూ కాదు. సత్య,మిథ్య సంబంధం. ప్రతిబింబం అనుభవం మీకు తెలుస్తున్నది,

కాని అది మీరున్నంత సత్యంకాదు. మాయ కూడా అంతే. అది తక్కువస్థాయి సత్యం. దాన్ని మిథ్య అంటారు.సత్యం కానిది,సత్యంలో ఒక భాగం కాలేదు, సత్యానికి భిన్నంగా కూడా ఉండలేదు.

అందువల్ల సృష్టికి ముందు సత్యం బ్రహ్మ, మిథ్య మాయ ఉన్నాయి. అందువల్ల ద్వైతం లేదు. అంతేకాదు మాయలో మార్పు జరిగినా, బ్రహ్మలో మార్పుండదు, ప్రతిబింబంలో మార్పులు మిమ్మల్ని ఏమీ చేయనట్టుగా. అందువల్ల సృష్టికి ముందు మాయాసహిత బ్రహ్మ లేదా ఈశ్వరుడే ఉన్నాడు. ఆ ఈశ్వరుడు సంకల్పం చేశాడు. జగత్తు మొత్తం, 14 లోకాలు.అనేక జీవులు – అన్నీ,అందరూ అవ్యక్త స్థితిలో ఉన్నారు. సంకల్పం చేశాక ఏం చేశాడు?

**బహుస్యామ్–** నేను అనేకంగా అవుతాను అనుకున్నాడు. నేను అనేక భోక్తృజీవాలు, విశాలమైన భోగ్య ప్రపంచంగా అవుతాను అనుకున్నాడు. మనం మన మనస్సు సహాయంతో స్వప్న ప్రపంచాన్ని సృష్టిస్తాము. ఈశ్వరుడు, మాయ సహాయంతో జాగ్రద్ ప్రపంచాన్ని సృష్టిస్తాడు. మనలో ఉన్న వాసనల వల్ల స్వప్న జీవాలు, స్వప్న సుఖం, స్వప్న దుఃఖాలు సృష్టిస్తాము.

ఈశ్వరుని మనస్సు మాయ. వాసనలు మన సంచితకర్మలు. **ప్రజాయేయేతి–** నేను పుడతాను,నేను అనేకం అవుతాను. ఎవరనుకున్నారు? ఈశ్వరుడు. నాస్వప్న ప్రపంచాన్ని అనుభవించేదెవరు? నేనే! నేనే స్వప్నాన్ని సృష్టిస్తాను. నేనే అందులోకి ప్రవేశిస్తాను. అలాగే ఈశ్వరుడు సృష్టించి, అందులోకి నేనే వెళతాను అనుకున్నాడు.

తర్వాత భగవంతుడు ఏం చేశాడు? జగత్తును సృష్టించాలంటే దానికి ముడిసరుకు కావాలి. ఈ జగత్తును భౌతిక ప్రపంచం అంటారు.భౌతికం అంటే పంచభూతాలనుంచి సృష్టించబడిందని అర్థం. అందుకని సృష్టిచేయాలంటే ముందు పంచభూతాలను సృష్టించాలి.

**మహాభూతాన్యహంకారో బుద్ధిరవ్యక్తమేవ చ**
**ఇంద్రియాణి దశైకం చ పంచ చేంద్రియగోచరాః గీత 13–5**

ఛాందోగ్యోపనిషత్తు, ఈ అధ్యాయంలో పంచభూతాల సృష్టి చెప్పకుండా, మూడు భూతాల గురించే చెప్పింది. ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, భూమి– ఈ ఐదూ కలిసి పంచభూతాలు. ఇక్కడ ఆకాశం,

వాయువులని వదిలేసింది.ఎందుకంటే అవి అమూర్తం. కంటికి కనబడవు. అగ్నినుంచి మూర్తం.కంటికి తెలుస్తాయి.

ఉదాహరణకు ఈ గదిలో ఏమున్నాయని అడిగితే మీరు అన్నీ చెప్తారు కానీ ఆకాశం,వాయువు గురించి చెప్పరు. వాటి గురించి చెప్పకపోయినా అవి ఉన్నాయి.అలాగే ఉపనిషత్తు కూడా ఆకాశం, వాయువులను వదిలేసి, అగ్ని,జలం, పృథివీల గురించే చెప్పింది. అందుకు అది అగ్ని అన్నప్పుడల్లా మనం ఆకాశవాయు సహిత అగ్నిః అని కలుపుకోవాలి.

**తత్తేజోఽసృజత - తత్** అంటే ఏమిటి? మాయాసహిత బ్రహ్మ లేదా ఈశ్వరుడు. తేజః అంటే అగ్ని. అసృజత అంటే సృష్టించాడు. ఈశ్వరుడు అగ్నిని సృష్టించాడు.

ఇక్కడ ఈ వర్ణన ద్వారా ఒక ముఖ్యమైన విషయం తెలుసు కుంటాము. ఏమిటది? ఈశ్వరుడు నిమిత్తకారణం,ఉపాదాన కారణం కూడా. తదైక్షత – పదం నుంచి నిమిత్త కారణం అని తెలుస్తోంది. కుమ్మరి కుండ చేసేటప్పుడు ఊహించుకున్నట్లుగా ఈశ్వరుడు మనసులో ఊహించుకున్నాడు.

**బహుస్యాం ప్రజాయేయేతి –** పదం నుంచి ఈశ్వరుడు ఉపాదాన కారణం కూడా అని తెలుస్తోంది. నేను అనేకంగా అవుదును గాక అనుకున్నాడు. అందుకని ఈశ్వరుడే ముడిసరుకు కూడా. ఈశ్వరుడే ముడి సరుకు కూడా అని ఎందుకంటున్నాము? ఈశ్వరుడు తప్ప సృష్టికి ముందు వేరే ఏమీ లేదు కాబట్టి. అందువల్ల ఈ జగత్తుకు బ్రహ్మ నిమిత్త,ఉపాదాన కారణం.

**తత్తేజ ఐక్షత్ –**ఇప్పుడు అగ్ని తత్త్వం తరువాతి భూతాన్ని ఉత్పత్తి చేయాలి. ఏమిటది? జలతత్వం.

**ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః। ఆకాశాద్వాయుః।**
**వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథ్వీ। – తైత్తిరీయం**

**బహుస్యాం ప్రజాయేయేతి.** అగ్ని నేను అనేకంగా అవుదును గాక అనుకుంది.

బ్రహ్మకంటే మాయాశక్తి ఉంది. అందుకని అనుకున్నాడు. మరి అగ్ని ఎలా అనుకుంది? అగ్ని జడం కదా! బ్రహ్మ, బహుస్యాం ప్రజాయేయేతి అనుకున్నాడన్న విషయం గుర్తు తెచ్చుకోవాలి. బ్రహ్మ అగ్నిని సృష్టించి ఊరుకోలేదు. అగ్నిలో ప్రవేశించాడు. కాబట్టి అగ్ని అంటే అగ్నిసహితం

బ్రహ్మ లేదా బ్రహ్మసహితం అగ్ని అనుకోవాలి.

**తదపోఽసృజత –** అగ్ని జల తత్త్వాన్ని సృష్టించింది.

మహాభూత సృష్టి గురించి చూస్తున్నాము కదా, ఇవి స్థూల భూతాలా, సూక్ష్మభూతాలా?తత్త్వబోధ లో వీటి గురించి వివరంగా వస్తుంది. ముందు సూక్ష్మభూతాల సృష్టి జరుగుతుంది. దాని తర్వాతే స్థూల భూతాల సృష్టి. కాబట్టి అగ్ని ముందు, జలం ముందూ సూక్ష్మ అగ్ని,సూక్ష్మ జలం అని కలుపుకోవాలి.

అగ్నినుంచి నీరు ఎలా పుడుతుంది? దానికి ఉపనిషత్తు రెండు ఉదాహరణలు ఇస్తున్నది.

**తస్మాద్యత్ర క్వ చ శోచతి –** మనసు బాధపడితే, దాన్ని మనస్తాపం అంటారు. తాపం అంటే వేడి.అంటే మనసు వేడెక్కితే (బాధతో మండితే) అది కన్నీటి రూపంలో బయటకు వస్తుంది. ఆ కన్నీరే నీరు. అందువల్ల అగ్నిరాపః. అదే విషయాన్ని ఇంగ్లీషులో కూడా ఇంకోవిధంగా చెప్తారు. ఎవరన్నా బాధపడకపోతే ఏమంటాం? 'హీ ఈజ్ కూల్' అంటాం. బాధపడకపోవటం చల్లదనం అయితే, బాధపడటం వేడెక్కటమే కదా! వేడినుంచి (బాధ నుంచి) కన్నీరు వస్తుంది. ఇది చాలకపోతే ఇంకో ఉదాహరణ ఇస్తానంటున్నది ఉపనిషత్తు.

**స్వేదతే వా పురుషః –** ఎండాకాలంలో శరీరం వేడెక్కితే ఏమవుతుంది? చెమటలు కారుతాయి. కొంతమందికయితే, చెమటలు ధారగా కారతాయి. చెమట ఏమిటి? నీరే! వేడి ఏమిటి? అగ్ని. అంటే అగ్ని నుంచి నీరు వచ్చింది.

**తేజస ఏవ తదధ్యాపో జాయన్తే –** అగ్ని నుంచి నీరు వచ్చింది.

**మంత్రం – 4– తా ఆప ఐక్షన్త–** ఇప్పుడు, జల తత్త్వం నుంచి పృథివీ రావాలి. దాని ముందు నీరు సంకల్పం చేసింది. నీరు జడం కదా, నీరెలా సంకల్పం చేసింది? ఇందాక అగ్నికి చెప్పిన వివరణే దీనికీ వర్తిస్తుంది. నీటి సహిత ఈశ్వరుడు లేదా ఈశ్వర సహిత నీరు అంటే చిదాభాస సహిత నీరు. ఏమని సంకల్పించింది?

**బహ్వ్యఃస్యామ ప్రజాయేమహీతి –** నేను పృథ్వీతత్త్వంగా అవుదును గాక! అనుకున్నాక ఏం చేసింది?

**తా అన్నమసృజన్త –** అన్నాన్ని సృష్టించింది. అన్నం అంటే వాచ్యార్థం ఆహారం.

కాని ఈ సందర్భంలో పృథివీ తత్త్వం.ఎందుకు? అన్నం పృథివీ నుంచి పుట్టింది.జలం నుంచి పృథివీ ఎలా పుట్టింది?
**తస్మాద్యత్ర క్వ చ వర్షతి** – వానలు ఎక్కడ సమృద్ధిగా కురిస్తే–
**తదేవ భూయిష్ఠమన్నం భవతి–** అక్కడ అన్నం సమృద్ధిగా పండుతుంది. అన్నం అంటే పృథివీ అని ఇప్పుడే చూశాము.
**అద్భ్య ఏవ** – జలతత్వం నుంచే–
**తదధ్యాన్నాద్యం జాయతే** – అన్నం పుట్టింది.

ఈ విధంగా అగ్ని,జలం, పృథివీ అనే భూతత్రయాలు పుట్టాయి. ఈ మూడూ సూక్ష్మభూతాలని మర్చిపోకూడదు. ఈ మూడింటికీ కలిపి ఒక పేరుంది. దాన్ని తేజోబన్న సృష్టి అంటారు.

తేజో = తేజః (అగ్ని); ఆపః = నీరు; పృథివీ = అన్నం

అంటే తేజః అప్ అన్నం. తేజః + అప్ +అన్నం = తేజోబన్నం.

**తేజోఽబన్న భూత త్రయం సృష్టమ్.** దీనితో సూక్ష్మభూత సృష్టి అయింది. తర్వాత ఏమిటి? తర్వాత వచ్చే మంత్రంలో చూద్దాం.

### తృతీయః ఖణ్డః (3)

**తేషాం ఖల్వేషాం భూతానాం త్రీణ్యేవ బీజాని భవన్తి అణ్డజం జీవజముద్భిజ్జమితి ॥1॥ సేయం దేవతైక్షత హన్తాహమిమాస్తిస్రో దేవతా అనేన జీవేనాత్మనాఽనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణీతి ॥2॥ తాసాం త్రివృతం త్రివృతమేకైకాం కరవాణీతి। సేయం దేవతేమాస్తిస్రో దేవతా అనేనైవ జీవేనాత్మానాఽనుప్రవిశ్య నామరూపే వ్యాకరోత్ ॥3॥ తాసాం త్రివృతం త్రివృతమేకైకామకరోత్। యథా తు ఖలు సోమ్యేమాస్తిస్రో దేవతాస్త్రివృత్త్రివృదేకైకా భవతి తన్మే విజానీహీతి ॥4॥**

**మంత్రం–1–** సూక్ష్మభూతాల సృష్టి తర్వాత, ఈశ్వరుడు సృష్టి ప్రకరణంలో చివరి అంశాన్ని దర్శిస్తున్నాడు. మనం ఇంకా మధ్యభాగంలోనే ఉన్నాము కాని భగవంతుడు మధ్యలో బ్రేక్ తీసుకుని, సమష్టి స్థూల ప్రపంచం ఎలా ఉంటుందో దర్శిస్తున్నాడు ముందే.స్థూల ప్రపంచంలో ఉండబోయే మూడురకాల జీవులను దర్శిస్తున్నాడు. ఏమిటవి? ఈ మంత్రం రాబోయే స్థూల ప్రపంచం యొక్క దర్శనం. గుర్తుంచుకోండి.

అది ఇంకా రాలేదు. ఇంకా సంకల్పంలోనే ఉంది.

**తేషాం ఖల్వేషాం భూతానాం-** భూతానాం అంటే ఇంతకుముందు సృష్టించబడిన సూక్ష్మభూతాలు కాదు. రాబోయే స్థూలభూతాలు కూడా కాదు. అవి అన్ని జీవరాశులూ. ఈ జీవరాశులన్నింటి సృష్టికి కారణం ఏమిటి?

**త్రీణ్యేవ బీజాని భవన్తి -** మూడే ప్రాథమిక కారణాలున్నాయి.

వాటి పుట్టుక తీరుని బట్టి మూడు తెగలుగా అభివర్ణించవచ్చు. ఏమిటవి?

**అణ్డజం జీవజముద్భిజ్జమితి**

1. అండజం:- అండం అంటే గ్రుడ్డు. జం అంటే పుట్టటం. గుడ్డునుంచి పుట్టిన జీవులన్నీ. పక్షులు,పాములు మొదలైనవి.

2. జీవజం- జీవి నుంచి పుట్టినవి అంటే తల్లి యోనినుంచి పుట్టిన జీవులన్నీ. మనుష్యులు, పశువులు.

3. ఉద్భిజం:- ఉద్భిజం అంటే నేలను చీల్చుకుని పుట్టినవన్నీ. చెట్లు.

మామూలుగా శాస్త్రంలో నాలుగు రకాలు చెప్తారు. స్వేదజం కూడా ఉంది. అంటే చెమట నుండి పుట్టిన జీవులు. క్రిమికీటకాదులు. వీటిని ఇక్కడ అండజంలో కలిపేసుకోవచ్చు.

అలా ఈ మూడూ అంటే అండజం, జీవజం,ఉద్భిజం అనే మూడు పదాలు అన్ని రకాల జీవరాశులనూ సూచిస్తున్నాయి.

ఈశ్వరుడు ఇలా సంకల్పం చేశాడు, 'నేను ఇప్పుడు సృష్టిచేయాలి. దానికి నేనేం చేయాలి? ప్రస్తుతం సూక్ష్మభూతాలనే సృష్టించాను. వాటి నుండి జగత్తు మొత్తాన్ని సృష్టించాలి.' అంటే ప్రణాళిక ఉంది. ముడిసరుకు ఉంది. అది వ్యక్తమవాలి.

**తేషాం భూతానాం-** ఈ పదాన్ని పట్టుకుని భాష్యకారులు వివరిస్తున్నారు. తేషాం భూతానాం అంటే ఈ జీవరాశులు 'ఈ' అన్న పదాన్ని ఎప్పుడు వాడతాము? మన ఎదురుగా ఆ వస్తువు ఉంటే. ఈ జీవరాశులు ఇంకా పుట్టలేదు కదా. మరి ఈశ్వరుడు ఈ అని ఎందుకన్నాడు? ఎందుకంటే, అవి అవ్యక్తరూపంలో మాయలో ఉన్నాయి. కారణ శరీరంలో ఉన్నాయి. కారణశరీర ప్రతిబింబిత చైతన్యాన్ని ప్రాజ్ఞ అంటారు. ఇంకా ముందుకు వెళ్ళేముందు ఒకసారి ప్రతిబింబ చైతన్యాల పేర్లు చూద్దాము. తత్త్వబోధలో వివరంగా వస్తుంది. చైతన్యం వ్యష్టిపరంగా,సమష్టిపరంగా ఆరు పేర్లతో

ప్రతిబింబిత మవుతుంది. చైతన్యాన్ని బింబ చైతన్యం లేదా ఒరిజినల్ కాన్షస్‌నెస్ అనీ, చిదాభాసని ప్రతిబింబ చైతన్యం లేదా రిఫ్లెక్టెడ్ కాన్షస్‌నెస్ అనీ అంటారు.

| **చైతన్యం –** | | **బ్రహ్మ** | |
|---|---|---|---|
| **వ్యష్టి** | | **సమష్టి** | |
| కారణశరీరం | – ప్రాజ్ఞ | కారణప్రపంచం | – ఈశ్వరుడు |
| సూక్ష్మశరీరం | – తైజస | సూక్ష్మప్రపంచం | – హిరణ్యగర్భ |
| స్థూలశరీరం | – విశ్వ | స్థూలప్రపంచం | – విరాట్ |

కారణ శరీరం, కారణ ప్రపంచం అవ్యక్తరూపంలోనే ఉంటాయి. అందుకని ఈశ్వరుడు అవ్యక్తరూపంలో ఉన్న కారణశరీరాలను దర్శించాడు.

**మంత్రం–2–** ఉపనిషత్తు సృష్టిని ఒక వరుసక్రమంలో, వివరంగా చెప్పటం లేదు. మధ్యలో కొన్ని దశలని వదిలివేస్తోంది. తత్త్వబోధని ఆధారంగా తీసుకుని మనం వాటిని పూరించుకోవాలి. ఆరు దశల్లో సృష్టి అవుతుంది.

సూక్ష్మభూతాలు
సూక్ష్మ ప్రపంచం, సూక్ష్మ శరీరాలు
స్థూలభూతాలు
స్థూల ప్రపంచం, స్థూల శరీరాలు

ఇంతవరకూ సూక్ష్మభూతాల సృష్టి చూశాము. అదికూడా ఇక్కడ ప్రత్యేకంగా మూడు భూతాల గురించే చెప్పిందని కూడా చూశాము. సూక్ష్మశరీరాలు,సూక్ష్మ ప్రపంచం గురించి చెప్పలేదు. అది మనం పూరించుకోవాలి. సూక్ష్మ ప్రపంచం, సూక్ష్మశరీరాలు సృష్టించాక, నేను వీటిల్లో ప్రతిబింబ చైతన్యంగా ప్రవేశించాలి అనుకున్నాడు. కారణ ప్రపంచంలో ప్రతిబింబ చైతన్యం పేరు ఏమిటి? ఈశ్వరుడు. కారణ శరీరంలో, ప్రాజ్ఞ. సూక్ష్మప్రపంచంలో ప్రతిబింబ చైతన్యం పేరు హిరణ్యగర్భ. సూక్ష్మశరీరాల్లో ప్రతిబింబ చైతన్యం–తైజస. ఈశ్వరుడు సంకల్పమాత్రం చేతనే వీటిలో అనుప్రవేశం చేశాడు. తైజస వ్యష్టిపరంగా కాబట్టి అనేకం. హిరణ్యగర్భ సమష్టిపరంగా కాబట్టి ఒకటే హిరణ్యగర్భ. హిరణ్యగర్భలు అనకూడదు. జీవాత్మగా ఈ పేర్లతో అనుప్రవేశం చేశాడు.

తైజస రూపంలో సూక్ష్మశరీరం, హిరణ్యగర్భ రూపంలో సూక్ష్మ ప్రపంచం ఉంటే చాలదు. వ్యవహారం నడపాలంటే స్థూలశరీరం ఉండాలి.

స్థూల శరీరం మాత్రం ఉంటే చాలదు, స్థూల ప్రపంచం ఉండాలి. స్థూలశరీరంలో ప్రతిబింబ చైతన్యం కూడా ఉండాలి.

**అనుప్రవిశ్య** –అందుకని ఈశ్వరుడు అందులో ప్రవేశిస్తాను అనుకున్నాడు. **నామరూపే వ్యాకరవాణీతి** – నామరూప వ్యాకరణం అంటే స్థూలశరీరాలు, స్థూలప్రపంచం ఉద్భవించటం. వాటిలో చిదాభాస లేదా ప్రతిబింబ చైతన్యం విశ్వ, స్థూల ప్రపంచంలో ప్రతిబింబ చైతన్యం విరాట్ అని ఇంతకుముందే చూశాము. వ్యాకరణం అంటే విస్తరించటం. అలా ప్రాజ్ఞనుంచి తైజసకు, తైజస నుంచి విశ్వకూ విస్తరించాడు. అలాగే ప్రపంచ పరంగా చూస్తే ఈశ్వరుని నుంచి హిరణ్యగర్భకూ, హిరణ్యగర్భనుంచి విరాట్‌కూ విస్తరించాడు. సృష్టి అంతా పూర్తిగా జరిగాకే, వ్యవహారం జరుగుతుంది.

**సర్వాణి రూపాణి విచిత్య ధీరః**
**నామాని కృత్వాఽభివదన్ యదాస్తే॥ – పురుషసూక్తం**

ధీరా అంటే భగవంతుడు. నామాని కృత్వా నామ,రూపాలు సృష్టించింది ఆయనే.దాని తర్వాత ఏం చేస్తున్నాడు? **అభివదన్ యదాస్తే** –వ్యవహారం నడుపుతున్నాడు. అందుకని నామరూపే వ్యాకరవాణి. ఈ విధంగా సంకల్పించాడు. తర్వాత ఏంచేశాడు?

**మంత్రం–3–** ఇంకా సంకల్పం దశలోనే ఉంది. ఇంతవరకూ ఏం చూశాం? సూక్ష్మభూతాలు, సూక్ష్మ శరీరాలు, సూక్ష్మప్రపంచం,తైజస, హిరణ్యగర్భ. దాని తర్వాత చివరిదశగా స్థూల శరీరం,స్థూల ప్రపంచం,విశ్వ,విరాట్‌ని సృష్టించాలని అనుకున్నాడని చూశాము. కాని సూక్ష్మభూతాల నుంచి స్థూల ప్రపంచం డైరెక్ట్‌గా సృష్టింపబడదు. సూక్ష్మభూతాలు సూక్ష్మప్రపంచాన్ని సూక్ష్మశరీరాలని సృష్టించ గలవు. అందుకని భగవంతుడు ఏమనుకున్నాడు? 'నేను సూక్ష్మభూతాలను,స్థూలభూతాలుగా మార్చాలి.' అదెలా చేయాలి?

తత్త్వబోధలో వివరంగా వస్తుంది. కాకపోతే అక్కడ పంచసూక్ష్మభూతాల నుంచి పంచ స్థూలభూతాల సృష్టి వస్తుంది. దీన్ని పంచీకరణం అంటారు. ఉదాహరణకు సూక్ష్మభూతాల నుంచి స్థూల అగ్ని తయారుచేయాలనుకోండి. దానికి ఎనిమిది కప్పులు కొలత తీసుకుందాం. అందులో నాలుగు కప్పులు అగ్నివేయాలి. మిగతా నాలుగు కప్పులకూ, ఒక్కొక్క కప్పు ఒక్కొక్క భూతం వేయాలి.

8 = 4 అగ్ని + 1 వాయువు+ 1 ఆకాశం+ 1 నీరు + 1 పృథివీ.

ఇప్పుడు ఇక్కడ మూడు భూతాల సృష్టే వచ్చింది కాబట్టి దీన్ని త్రివృత్తీకరణం అంటారు. మూడు కలుపుతాము. ఇక్కడ స్థూల అగ్ని తయారుచేయాలనుకోండి. ఇప్పుడు నాలుగు కప్పుల కొలత తీసుకుందాం. రెండు కప్పులు అగ్ని,ఒక కప్పు జలం,ఒక కప్పు పృథివీ కలపాలి. అంటే

4 = 2 అగ్ని+ 1 జలం+ 1పృథివీ.

సూక్ష్మ అగ్నిని తన్మాత్ర (అది మాత్రమే) అంటారు. అలాగే తక్కినవి కూడా. స్థూల అగ్నిలో మూడూ ఉంటే అగ్ని అని ఎలా పిలుస్తాము? ఎందుకంటే అగ్ని తత్త్వం 50%,తక్కిన రెండూ 25% ఉంటాయి.

**తాసాం త్రివృతం త్రివృతమేకైకాం కరవాణీతి –** ఈశ్వరుడు అనుకున్నాడు. ఇంకా ఇదంతా ఈశ్వరుని సంకల్పమే.

**తాసాం –**ఈ సూక్ష్మభూతాలను ఏకైకాం– ఒక్కొక్కదాన్నీ; త్రివృతం త్రివృతమ్ **కరవాణి –** మూడు భూతాల కలయికగా చేస్తాను. ఎలా అన్నది ఇప్పుడు చూశాము. ఒకదానిలో అది 50% తక్కిన రెండూ చెరో 25% . కరవాణి **ఇతి –** చేస్తాను అని అనుకున్నాడు. ఇంకా సృష్టించలేదు. తర్వాత ఏం చేశాడు?

**సేయం దేవతేమాస్తిస్రో దేవతా –** ఇయం దేవతా అంటే ఈ సత్ దేవత అంటే ఈశ్వరుడు. **ఇమాః తిస్రో దేవతా–** ఇక్కడ దేవత పదం మళ్ళీ భూతాలకు వర్తిస్తుంది. ఆ దేవత, ఈ మూడు సూక్ష్మ భూతాల్లోకి ప్రవేశం చేశాడు. ఏ రూపంలో? తైజస, హిరణ్యగర్భ రూపంలో. సూక్ష్మభూతాల్లో అంటే సూక్ష్మ ప్రపంచం, సూక్ష్మశరీరాలను కూడా కలుపుకోవాలి. **అనుప్రవిశ్య –** ప్రతిబింబ చైతన్యంగా అనుప్రవేశం చేశాడు.

**నామరూపే వ్యాకరోత్ –** చివరిగా సృష్టి చేశాడు అని మనం కలుపుకోవాలి. స్థూలభూతాలను సృష్టించాడు అని ఉంది. మనం వాటితోపాటు స్థూల శరీరాలను,స్థూల ప్రపంచాన్ని, విశ్వ,విరాట్‌లను – అన్నింటినీ సృష్టించాడు అని పూరించుకోవాలి.

**మంత్రం–4–** తైజస, హిరణ్యగర్భగా అయ్యాక, ఈశ్వరుడు ఏం చేశాడు? ముందు మంత్రంలో సంకల్పం ముగిసింది. ఇందులో దాన్ని ఆచరణలో పెట్టటం చూస్తాము.

**తాసాం త్రివృతం త్రివృతమేకైకానామకరోత్ –** సంస్కృత క్రియాపదంలో కూడా తేడా తెలుస్తుంది. అంతకుముందు కరవాణి ఉంది. కరవాణి అంటే చేస్తాను అని అంటే అది సంకల్పం. ఇప్పుడు అకరోత్–అకరోత్ అంటే, తను ఏం చేద్దామనుకున్నాడో, అది చేశాడు. ఏం చేశాడు?

**ఏకైకాం త్రివృత్ త్రివృతమేకైకానామకరోత్–** ఒక్కొక్క స్థూలభూతాన్ని మూడేసి సూక్ష్మభూతాలను కలిపి చేశాడు. గురువు – హే సోమ్య అని మధ్య మధ్యలో అతన్ని పిలుస్తూ, అతను వినేలాగా చేస్తున్నాడు. ఒక్కొక్కటి అలా మూడు భూతాల కలయికగా అయింది.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. ఉపనిషత్తు భూతాలను దేవతలుగా వ్యవహరిస్తున్నది. ఎందుకు? ఎందుకంటే అగ్ని తత్త్వం, జలతత్త్వం, పృథివీతత్త్వంలో ఈశ్వరుడు అనుప్రవేశం చేశాడు కాబట్టి. సూర్యనమస్కారంలో కూడా మనం జడమైన సూర్యునికి నమస్కారం చేయము. చిదాభాస విరాట్ తత్త్వానికి చేస్తున్నాము అంటే చేతన సూర్యదేవతకు చేస్తున్నాము. అందుకే అంతకు ముందు అగ్ని సంకల్పం చేసింది, జలం సంకల్పం చేసింది అని వచ్చింది. జడమైన అగ్ని, జడమైన జలం సంకల్పం చేయలేవు.అగ్ని దేవత, జలదేవత చేశాయి.

**త్రివృత్త్రివృదేకైకా భవతి –** ఏకైకా అంటే ఒక్కొక్కటీ. ఒక్కొక్కటీ మూడింటి కలయిక అయింది. దాని తర్వాత స్థూల ప్రపంచం, స్థూల శరీరాలు సృష్టించబడ్డాయని కలుపుకోవాలని ఇంతకు ముందే చూశాము.

**ప్రత్యేక విశ్లేషణ –** సృష్టి గురించి సంకల్పం చేశాడు. సృష్టి చేశాడు అన్నప్పుడు ఈశ్వరుడు అన్నపదం వాడుతున్నాము. బ్రహ్మ+మాయ = ఈశ్వరుడు అని కూడా చూశాము. ఇక్కడ బ్రహ్మ, మాయల గురించి మరికాస్త వివరంగా చూద్దాము.

శుద్ధబ్రహ్మ కార్యకారణ విలక్షణం. మాయాశక్తి లేకుండా బ్రహ్మ కారణం అవలేదు. అందుకని మాయతో కలిస్తేనే బ్రహ్మకు కారణం హెూదా వస్తుంది. అందువల్ల బ్రహ్మ మాయమీద, మాయ బ్రహ్మమీద ఆధారపడి ఉన్నాయి సృష్టి విషయంలో.

ఒకదాని మీద ఒకటి ఆధారపడి ఉన్నాయి అంటే, ఒక సందేహం వస్తుంది. రెండూ ఒకదానిమీద ఒకటి ఆధారపడితే బ్రహ్మను సత్యం అని

ఎలా అంటాము? సత్యం అంటే దేనిమీదా ఆధారపడనిది అనీ, మిథ్య అంటే ఇంకోదాని మీద ఆధారపడినదనీ నిర్వచిస్తాము. దాన్ని బట్టి, బ్రహ్మ స్వతంత్రం కాబట్టి సత్యం, మాయ పరతంత్రం కాబట్టి మిథ్య అంటాము. ఇప్పుడు ఒకదాని మీద ఒకటి ఆధారపడ్డాయి అన్నా కూడా ఎలా పొసగుతుంది? దీన్ని చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

బ్రహ్మ, మాయ ఒకదాని మీదొకటి ఆధారపడ్డాయి. ఎప్పుడు? సృష్టి చేయటానికి. సృష్టి కారణ దృష్ట్యా ఆధారం కాని ఉనికి విషయానికి వచ్చేసరికి మాయ లేకుండా శుద్ధ సత్ ఉంది కాని బ్రహ్మ లేకుండా మాయకు ఉనికి లేదు. మాయ ఉనికి బ్రహ్మ మీదే ఆధారపడి ఉంది. అంటే ఉనికి పరంగా బ్రహ్మ సత్యం, మాయ మిథ్య. బ్రహ్మపరంగా కేవలం సృష్టికే బ్రహ్మ మాయాశక్తిని వినియోగిస్తుంది. కాని మాయ విషయానికొచ్చేసరికి మాయ సృష్టి చేయటానికి బ్రహ్మమీద ఆధారపడుతుంది. ఉనికికీ ఆధారపడుతుంది.

అందువల్ల బ్రహ్మ, మాయ రెండు భిన్న వస్తువులు కావు. ద్వైతం లేదు. మాయ అంటే మాయాశక్తి. ఒక నాట్యాచారి వచ్చాడంటే, ఆయనా, ఆయన నాట్యకౌశలం వచ్చారు అంటామా? లేదే! అది ఆయనలో అవ్యక్తరూపంలో ఉంది. అవసరమైనప్పుడు వ్యక్తమవుతుంది. మాయను మిథ్యగా తీసుకోవాలి. కాని రెండో వస్తువుగా తీసుకోకూడదు. అద్దంలో మన ప్రతిబింబాన్ని రెండో వస్తువుగా చూస్తామా? చూడము కదా! అలాగే ఇది కూడా.

పారమార్థిక సత్యం బ్రహ్మ, వ్యావహారిక సత్యం మాయ ఉన్నాయి ముందు. ఈ మాయలో రెండు విభాగాలున్నాయి. ఒకటి కారణ శరీరం, మరొకటి కారణ ప్రపంచం. బ్రహ్మ ప్రతిబింబ చైతన్యంగా రెండింటిలోనూ భాసిల్లుతున్నది. ప్రాజ్ఞగా కారణ శరీరంలోనూ, ఈశ్వరునిగా కారణ ప్రపంచంలోనూ భాసిల్లుతున్నది.

దాని తర్వాత మాయ సూక్ష్మభూతాలుగా, సూక్ష్మశరీరాలుగా, సూక్ష్మ ప్రపంచంగా వ్యక్తమయింది. వాటిలో చిదాభాసగా లేదా ప్రతిబింబ చైతన్యంగా బ్రహ్మ అనుప్రవేశం చేసింది. సూక్ష్మశరీరంలోని చిదాభాసని తైజస అనీ, సూక్ష్మప్రపంచంలోని చిదాభాసని హిరణ్యగర్భ అనీ అంటారు.

వ్యవహారం నడపటానికి స్థూలశరీరం, స్థూల ప్రపంచం కావాలి.

వాటిని సృష్టించటానికి ముందు స్థూలభూతాలను సృష్టించాలి. అందుకని ఈశ్వరుడు స్థూలభూతాలను,స్థూల శరీరాలను, స్థూల ప్రపంచాన్ని సృష్టించి వాటిలో అనుప్రవేశం చేశాడు. విశ్వగా స్థూలశరీరంలోనూ, విరాట్‌గా స్థూలప్రపంచంలోనూ భాసిల్లుతున్నాడు.

**మంత్రం-4- అకరోత్ -** అకరోత్ దగ్గర మొదటి మంత్రంలోని అండజం, జీవజం, ఉద్భిజం ఇక్కడ కలుపుకోవాలి.అక్కడ సంకల్పించాడు అని చూశాము. ఇక్కడ అకరోత్ దగ్గర ఆచరణలో పెట్టాడు అని అర్థం చేసుకున్నాము. ఈ మూడు తెగలుగా స్థూలప్రపంచాన్ని సృష్టించాడన్న మాట.

**యథా -** ఇదంతా ఎలా జరిగిందో నేను వివరిస్తాను.

**తన్మే విజానీహీతి-** నేను వివరిస్తుండగా నువ్వు అర్థం చేసుకో. ఆ విచారణ ఏమిటో ముందు మంత్రాలలో వస్తుంది.

**చతుర్థః ఖణ్డః (4)**

**యదగ్నే రోహితగ్ం రూపం తేజసస్తద్రూపం యచ్ఛుక్లం తదపాం యత్కృష్ణం తదన్నస్యాపాగాదగ్నేరగ్నిత్వమ్। వాచాऽऽరమ్భణం వికారో నామధేయం త్రీణి రూపాణీత్యేవ సత్యమ్ ॥1॥ యదాదిత్యస్య రోహితగ్ం రూపం తేజసస్తద్రూపం యచ్ఛుక్లం తదపాం యత్కృష్ణం తదన్నస్యాపాగాదాదిత్యాదాదిత్యత్వం వాచారऽऽమ్భణం వికారో నామధేయం త్రీణి రూపాణీత్యేవ సత్యమ్ ॥2॥ యచ్చన్ద్రమసో రోహితం రూపం తేజసస్తద్రూపం యచ్ఛుక్లం తదపాం యత్కృష్ణం తదన్నస్యాపాగాచ్చన్ద్రాచ్చన్ద్రతం వాచారऽऽమ్భణం వికారో నామధేయం త్రీణి రూపాణీత్యేవ సత్యమ్ ॥3॥ యద్విద్యుతో రోహితగ్ం రూపం తేజసస్తద్రూపం యచ్ఛుక్లం త దపాం యత్కృష్ణం తదన్నస్యాపాగా ద్విద్యుతో విద్యుత్త్వం వాచారऽऽమ్భణం వికారో నామధేయం త్రీణి రూపాణీత్యేవ సత్యమ్ ॥4॥ ఏతద్ధస్మ వై తద్వి ద్వాగ్ంస ఆహుః పూర్వే మహాశాలా మహాశ్రోత్రియా న నోऽద్య కశ్చనాశ్రుతమమతమవిజ్ఞాతముదాహరిష్యతీతి। హ్యేభ్యో విదాఞ్చక్రుః ॥5॥ యదు రోహితమివాభూదితి తేజసస్తద్రూపమితి తద్విదాఞ్చక్రుః యదు శుక్లమివాభూదిత్యపాగ్ం రూపమితి తద్విదాఞ్చక్రుర్యదు కృష్ణమివాభూదిత్యన్నస్య రూపమితి తద్విదాఞ్చక్రుః ॥6॥ యదవిజ్ఞాతమివాభూదిత్యేతాసామేవ దేవతానాగ్ం సమాస ఇతి తద్విదాఞ్చక్రుః యథా**

**ను ఖలు సోమ్యేమాస్తిస్రో దేవతాః పురుషం ప్రాప్య త్రివృత్త్రివృదేకైకా భవతి తన్మే విజానీహీతి ॥7॥**

**బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య; జీవో బ్రహ్మైవ నా పరః.**

శంకరులవారు ఇది ఒక అద్భుతమైన శ్లోకంలో చెప్పారు. బ్రహ్మ మాత్రమే సత్యం. జగత్తు మిథ్య. జీవుడైన 'నేను' బ్రహ్మకు భిన్నంగా లేను. ఇదీ వేదాంతసారం.

**కార్యేహి కారణం పశ్యేత్ పశ్చాత్ కార్యం విసర్జయేత్**
**కారణత్వం తతో గచ్ఛేత్ అవశిష్టం భవేన్మునిః – అపరోక్షానుభూతి**

వేదాంతసారాన్ని అరనిముషంలో కాచివడబోశారు.

**కార్యేహి కారణం పశ్యేత్ –** అన్ని కార్యాల్లో, ఉదాహరణకు ఆభరణాల్లో– కారణం చూడండి. ఆభరణాల సారం బంగారం అని తెలిశాక ఏముంది? ఆభరణాలను కొట్టివేస్తాము. అవి

**వాచారఌ ఌ మ్భణం వికారో నామధేయం** అవుతాయి. అంతే.

**పశ్చాత్ కార్యం విసర్జయేత్ –** అందుకని ఎప్పుడైతే కారణదర్శనం అవుతుందో, అప్పుడే కార్యనిషేధం జరుగుతుంది.

**కారణత్వం తతో గచ్ఛేత్ –** ఆభరణాన్ని కార్యంగా కొట్టిపారేశాక, బంగారానికి కారణత్వం పోతుంది.

**అవశిష్టం భవేన్మునిః –** బంగారానికి కారణత్వం పోయాక, ఏం మిగిలిందీ? కార్యకారణ విలక్షణ బంగారం మిగిలింది. కార్యకారణ విలక్షణ బంగారాన్ని దర్శించటమే జీవన్ముక్తి. కాకపోతే బంగారంతో ఆగకూడదు. ఆభరణాల స్థానంలో జగత్తుని, బంగారం స్థానంలో బ్రహ్మను పెట్టి, చివరికి కార్యకారణ విలక్షణ బ్రహ్మదర్శనం చేయాలి.

ఇది చేయటానికి ఉపనిషత్తు పూర్తి స్థూల భూత, భౌతిక ప్రపంచం తీసుకోకుండా నాలుగే ఉదాహరణలు తీసుకుంది. దీన్ని స్థాలీపులాక న్యాయం అంటారు. స్థాలీ అంటే గిన్నె; పులాక అంటే మెతుకు. స్థాలీపులాక న్యాయం అంటే స్థాలీపులాక సామెత. కుక్కర్‌లో కాకుండా, విడిగా గిన్నెలో అన్నం వండేటప్పుడు అది ఉడికిందా లేదా అని చూడటానికి ఏం చేస్తాము? ఒక్క మెతుకు పట్టుకుని చూస్తాము. ఇక్కడ గిన్నె జగత్తు. మెతుకులు నాలుగు.

అగ్ని, ఆదిత్యుడు, చంద్రుడు, విద్యుత్తు. వీటన్నింటిలోనూ మూడు రంగులు చూస్తాము. ఆ రంగులు ఏమిటి? ఎరుపు, తెలుపు, నలుపు. అవి మూడు సూక్ష్మభూతాలకు సంకేతం. అవే సత్యం.

ముందు మంత్రంలో టూకీగా చెప్పి వదిలేసిన స్థూలభూత సృష్టి, స్థూల భౌతిక సృష్టి గురించి చెప్తున్నాడు గురువు ఇందులో. స్థూలభూతాలు అంటే అగ్ని, జలం, పృథివీ, స్థూల భౌతికాలు అంటే ఈ స్థూల భూతాల మేలు కలయికతో ఏర్పడిన స్థూలశరీరం, స్థూలప్రపంచం. మన శరీరంలో ఈ మూడు భూతాలు ఉన్నాయి.స్థూలభూతాలు,స్థూల భౌతికాలూ సూక్ష్మ భూతాలనుంచి సృష్టించబడ్డాయి. అందువల్ల సూక్ష్మభూతాలు కారణం, స్థూలభూతాలు కార్యం అని నిరూపిస్తున్నాడు గురువు.

సూక్ష్మభూతాలకు ప్రత్యేకమైన రంగులు ఉన్నాయి. సూక్ష్మ అగ్ని ఎరుపురంగులో, సూక్ష్మనీరు తెలుపురంగులో, సూక్ష్మపృథివీ నలుపు రంగులో ఉంటాయి. స్థూలభూతం మూడింటి మేలుకలయిక కాబట్టి ఒక్కొక్క దాంట్లోనూ మూడు రంగులూ తెలుస్తాయి. స్థూలభూతాల్లోనే కాదు, వాటితో తయారైన స్థూలప్రపంచంలో కూడా. ఆ విషయాన్ని ఇక్కడ నాలుగు ఉదాహరణల ద్వారా నిరూపిస్తున్నాడు గురువు.

**మంత్రం-1 - యదగ్నే రోహితగ్ం రూపం -** ముందు స్థూల అగ్నిని తీసుకున్నాడు. ఒక మంటని తీసుకుంటే అది అగ్నితత్త్వం అవుతుంది. అందులో మూడు సూక్ష్మభూతాలూ ఉన్నాయి. ఎందుకంటే స్థూల అగ్ని ఈ మూడింటి మేలు కలయిక కదా! ఎలా ఉన్నాయి? అగ్నిలో కనబడే రోహితం అంటే ఎఱ్ఱని రంగు-

**తేజసస్తద్రూపం -** సూక్ష్మ అగ్ని యొక్క ఎఱ్ఱని రంగు.

**యచ్ఛుక్లం తదపాం -** మంటలోపలి భాగంలో కొంత మేరకు తెల్లగా ఉంటుంది. తెల్లగా ఏది ఉంటే అది ఆపః అంటే జలతత్త్వం.

జాగ్రత్తగా చూడండి - స్థూల అగ్నిలో సూక్ష్మజలతత్త్వం, సూక్ష్మ అగ్నితత్త్వం, సూక్ష్మపృథివీ తత్త్వంఉంటాయి అని కలుపుకుంటే అది అర్థమవుతుంది.

**యత్కృష్ణం తదన్నస్య -** మంటలో కూడా. జాగ్రత్తగా చూస్తే వత్తుకి దగ్గరగా కొంతమేరకు నల్లగా ఉంటుంది. అది సూక్ష్మ పృథివీతత్త్వం ఉంది.

తదన్నస్య- ఈ అధ్యాయంలో అన్నం అంటే పృథీవీ అనే విషయం మర్చిపోకూడదు. నల్లభాగం ఏదుందో అది సూక్ష్మపృథివీ తత్త్వం.

**అపాగాదగ్నే రగ్నిత్వమ్-** అందువల్ల అసలు స్థూల అగ్ని అనేదే లేదు. ఈ మూడు సూక్ష్మభూతాలకు భిన్నంగా స్థూల అగ్ని లేదు. ఎందుకు? స్థూల అగ్ని కార్యం, సూక్ష్మభూతాలు కారణం. కారణంకి భిన్నంగా కార్యంకి ఉనికి లేదు. ఇక్కడ్నుంచి బోధ దిశ మారుతున్నది. ఇంతవరకూ అధ్యారోపం చూశాము. ఇప్పుడు అపవాదం చూస్తాము. దీన్ని అధ్యారోప అపవాద పద్ధతి అంటారు. ముందు అదేమిటో చూద్దాము.

1. ముందు కుండను చూపిస్తాము. కుండ కార్యం అయింది.

2. ప్రతి కార్యానికి వెనుక ఒక కారణం ఉంటుంది. కుండకు కారణం మట్టి అయింది.

ఇది అధ్యారోపం -

3. కుండకు ఆధారం ఏమిటి? మట్టి. మట్టి లేకుండా కుండకు విడిగా ఉనికి లేదు. కుండకు ముందూ, కుండ ఉన్నప్పుడూ, కుండ పగిలిపోయాకా - మూడు కాలాల్లోనూ ఉన్నది మట్టే. మూడు కాలాల్లోనూ ఉండేది సత్యం, కుండ మిథ్య. అందుకని కుండని కొట్టిపారేస్తున్నాము.

4. కుండని కొట్టిపారేస్తే, కార్యం లేదు. కార్యం లేకపోతే కారణత్వం లేదు. (కారణం లేదనకూడదు). కుండ ఉంటేనే మట్టికి కారణత్వ హెూదా ఉంటుంది. కుండ లేకపోతే, మట్టి ఉంటుంది కాని కారణత్వ హెూదా ఉండదు.

అప్పుడు మట్టి కార్యకారణ విలక్షణం మట్టి అవుతుంది. దీని అధ్యారోప అపవాదం అంటాము. కుండని అంగీకరించటం అధ్యారోపం, కొట్టి వేయటం అపవాదం. అద్వైత బోధలో ఇది చాలా ముఖ్యమైన అంశం. దీన్ని సాంప్రదాయం అంటారు.

**అధ్యారోపోవాదాభ్యాం నిష్ప్రపంచం ప్రపంచ్యతే।**
**శిష్యానామ్ సుఖబోధార్థం తత్త్వ జ్ఞానైః కల్పిత క్రమః ॥**

క్రమః అంటే బోధనాపద్ధతి.

ఇదే పద్ధతిని జగత్తు, బ్రహ్మకు అన్వయించాలి.

1.ముందు జగత్తుని చూపిస్తాము. జగత్తు కార్యం అయింది.
2. జగత్తనే కార్యానికి బ్రహ్మ కారణం.
ఇది అధ్యారోపం.
3. బ్రహ్మలేకుండా జగత్తుకి విడిగా ఉనికి లేదు. బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య. అందుకని జగత్తును కొట్టివేస్తాము.
4. జగత్తనే కార్యం లేకపోతే బ్రహ్మకు కారణత్వం లేదు.
ఇది అపవాదం.

అప్పుడు బ్రహ్మ కార్యకారణ విలక్షణం బ్రహ్మ అవుతాడు. ఈ విషయాన్నే వివేకచూడామణిలో చక్కగా వర్ణిస్తారు శంకరులవారు.

**ఏకమేవ సద్ అనేక కారణం తరనిరాస్య కారణం ।**
**కార్యకారణ విలక్షణం స్వయం బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని ॥**

బ్రహ్మను కార్యకారణ విలక్షణం అని చెప్పాక, 'ఆ బ్రహ్మవి నువ్వే,' అంటుంది ఉపనిషత్తు. **ఐతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో.** ఆ కార్యకారణ విలక్షణ బ్రహ్మ ఎక్కడుంది? సాక్షి చైతన్యమైన నువ్వే అది.

కార్యాన్ని పరిచయం చేయటం అధ్యారోపం, కార్యాన్ని కొట్టివేయటం అపవాదం అని చూశాము కదా! ఉపనిషత్తు అపవాదం లోకి నిశ్శబ్దంగా వెళ్ళిపోతున్నది. అందుకే దాని గురించి ఇంతగా తెలుసుకోవాల్సి వచ్చింది. **ఆపాదగ్నేరగ్నిత్వమ్ –** అగ్ని అగ్నిత్వం అంటే ఏమిటి? స్థూల అగ్నికున్న స్థూల అగ్ని హోదా మాయమవుతుంది.కుండకి కుండ హోదా పోయి, మట్టే మిగిలినట్టుగా, అగ్నికి అగ్నితత్త్వం మాయమవుతుంది. మాయ మవుతుంది అంటే కంటి ముందు నుంచి అని కాదు. నా ఎఱుకలో. స్థూల అగ్ని అని విడిగా ఏదీ లేదు అని నాకు అర్థమయింది. మరి ఏం ఉంది? కారణం మాత్రమే ఉంది.

**వాచాఽ ఽ రమ్భణం వికారో నామధేయం–** స్థూల అగ్ని, తక్కిన భూతాల నామధేయాలు తప్ప ఏమీ కావు. పేరుకి మాత్రమే ఉన్నాయి అవి. **'నామ్‌కే వాస్తే'** అంటాము హిందీలో. మీ వాక్కు మీదనే ఉన్నాయి. ఆరంభణం– ఆలంబనం. ఆలంబనం అంటే వస్తువు. వాచః అంటే వాక్కు, మీ నాలుక. అందువల్ల కుండ ఏమిటి? మీ నాలుకకు వస్తువు. అంటే? అది కేవలం

మీ నాలుకలోనే ఉంది. కుండ అన్న పేరులో వస్తువేమీ లేదు. ఎందుకు? ఎందుకంటే అది వికారః. వికారః అంటే కార్యం, ఒక ఉత్పత్తి. వాచారంభణం నామధేయాన్ని మిథ్యగా అభివర్ణించవచ్చు. ఉపనిషత్తు 'మిథ్య' అన్న పదాన్ని వాడలేదు. కాని ఇది మిథ్యకి సమానమైన పదం.

**త్రీణిరూపాణీత్యేవ సత్యమ్ –** స్థూలభూతాలన్నీ మిథ్య అయితే, ఏమిటి సత్యం? వాటి కారణం సత్యం. వీటికి కారణం ఏమిటి? సూక్ష్మభూతాలు. త్రీణి రూపాణి అంటే వాచ్యార్థం మూడు రంగులు. ఆ మూడు రంగులేమిటి? ఎరుపు, తెలుపు, నలుపు. అవి వేటిని సూచిస్తాయి? వరుసగా సూక్ష్మ అగ్ని, సూక్ష్మ జలం, సూక్ష్మ పృథివీని సూచిస్తాయి. అందువల్ల త్రీణిరూపాణీత్యేవ సత్యం అంటే మూడు సూక్ష్మభూతాలే సత్యం.

దీన్నించి మనం ఇంకొంచెం వెనక్కి వెళ్ళాలి. ఈ మూడు సూక్ష్మభూతాలు కూడా మూలకారణం కాదు. స్థూలభూతాల పరంగా చూస్తే కారణం గాని, అవి కూడా కార్యాలే. అంటే అవి కూడా మిథ్యే. అంటే అవి కూడా వికారో నామధేయం. మరి ఏమిటి సత్యం? వాటి మూలకారణం. ఏమిటది? సత్ బ్రహ్మ- సత్‌బ్రహ్మకు మూలకారణమేమిటి? దానికి మూలకారణం వేరే లేదు.సత్ బ్రహ్మే మూలకారణం.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్**

**మంత్రం-2-** ముందు మంత్రంలో అగ్నిని స్థూలభూతాలకు ప్రతీకగా తీసుకున్నాడు గురువు. ఎందుకంటే స్థూలభూతాలలో అది ఒకటి కాబట్టి. ఇప్పుడు స్థూలభౌతిక ప్రపంచం నుంచి కొన్ని ఉదాహరణలు. ఈ మంత్రంలో తీసుకున్నది ఆదిత్యుడిని లేదా సూర్యుడిని.

సూర్యుడిని తీసుకున్నా, మూడు రంగులని గమనించవచ్చు.

ఈ ఖండం రంగులతో మురిపిస్తున్నది.

**యదాదిత్యస్య రోహితగ్ం రూపం తేజసస్తద్రూపం-** ఆదిత్యుడు ఉదయిస్తున్నప్పుడు కనిపించే ఎర్రని రంగేదైతే ఉందో, అది తేజస్సు (అగ్ని) రూపం. అగ్ని అంటే సూక్ష్మ అగ్ని అని మర్చిపోకూడదు.

**యచ్ఛుక్లం తదపాం –** తెల్లని రూపం ఏదైతే ఉందో అది నీరుని సూచిస్తుంది.

**యత్కృష్ణం తదన్నస్యాపాగాత్ –** సూర్యునిలో ఉన్న నల్లని చుక్కలు సూక్ష్మపృథివీని సూచిస్తాయి. అన్నం అంటే పృథివీ అని మర్చిపోకూడదు.

ఇంతవరకూ అధ్యారోపం అంటే సూర్యుడిని ఒక కార్యంగా స్వీకరించటం. ఇప్పుడు అంత పెద్ద సూర్యుడిని లేడనటం. మన ఋషులు ఎంత మేధావులో చూడండి! మొత్తం జగత్తునే, జ్ఞానపరంగా చూస్తే, మిథ్యగా చూపించగలిగారు. ఇప్పుడు కుండకు కుండ తత్త్వాన్ని కొట్టివేసినట్టుగా, సూర్యునికి సూర్యతత్త్వాన్ని కొట్టి వేస్తున్నాము. **ఆపాగాత్** అది మాయమవుతుంది. అయితే, సూర్యుడేమిటి? **వాచాఽరమ్భణం వికారో నామధేయం.** సూర్యుడు కేవలం మిథ్య నామరూపాలు మాత్రమే.

దీన్నించి ఇంకొంచెం వెనక్కి వెళ్ళాలి. ముందు మంత్రంలోలాగానే. మూడు సూక్ష్మభూతాలు కూడా కార్యమే. బ్రహ్మకూ, వాటికీ మధ్యలో ఆకాశం, వాయువు ఉన్నాయి. కాని ఇక్కడ ఛాందోగ్యం వాటిని చెప్పలేదు. అందుకని మనం పెద్ద గెంతు గెంతి సూక్ష్మభూతాలకు కారణం బ్రహ్మ అని చెప్పాలి. **'సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్'** తో దీన్ని కలుపుకోవాలి. బ్రహ్మసత్యం, జగత్ మిథ్య. ఏక కారణ జ్ఞానేన సర్వ కార్య జ్ఞానం భవతి.

ఉద్దాలకుడు అడిగిన ప్రశ్నకు జవాబు వచ్చేసింది.

**మంత్రం - 3-** ఇంతకుముందు మంత్రంలో భావమే, ఇంచుమించు అవే పదాలే. అందువల్ల చంద్రుడిలో కనిపిస్తున్న ఎరుపు, తెలుపు, నలుపు రంగులు మూడు సూక్ష్మభూతాలకు చిహ్నాలు. అవి కారణం, చంద్రుడు కార్యం. ఇంతవరకూ అధ్యారోపం. చంద్రుడు కార్యం కాబట్టి చంద్రుడికి చంద్రతత్త్వం లేదు. ఇది అపవాదం. చంద్రుడేమిటి?

**వాచాఽఽరమ్భణం వికారో నామధేయం** అంటే మిథ్య.

**త్రీణిరూపాణీత్యేవ సత్యమ్-** మూడు సూక్ష్మభూతాలే సత్యం. ముందు చూసినట్టుగా -

**బ్రహ్మసత్యం, జగత్ మిథ్య**

**ఏక కారణ జ్ఞానేన సర్వకార్యజ్ఞానం భవతి**

**మంత్రం-4-** మళ్ళీ ఇందులో కూడా అవే పదాలు, అదే భావన. విద్యుత్తులో కూడా మూడు భూతాల్లో ఉన్న ఎరుపు, తెలుపు, నలుపు రంగులే ఉన్నాయి. విద్యుత్తు కార్యం, మూడు భూతాలు కారణం. ఇంకా వెనక్కి వెళితే **బ్రహ్మసత్యం, జగత్ మిథ్య, ఏకకారణ జ్ఞానేన సర్వకార్యజ్ఞానం భవతి. బ్రహ్మ విజ్ఞానేన, సర్వవిజ్ఞానం భవతి.**

ఏక విజ్ఞానం ఏమిటంటే బ్రహ్మ విజ్ఞానం. ఈ జ్ఞానాన్ని ఎవరు పొందితే వాళ్ళు సర్వజ్ఞులు అవుతారు.

**ఏతద్ధస్మవై తద్విద్వాగ్ంస ఆహుః –** విద్వాంసులు అంటే జ్ఞానులు. వాళ్ళు ఏం తెలుసుకుంటారు? **ఏ తద్ధస్మవైతద్ –** ఇంతవరకూ ఏం చర్చించామో అది. అంటే ఏమిటి? బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య; బ్రహ్మ కారణం, జగత్ కార్యం. బ్రహ్మ వస్తువు. జగత్ మిథ్యానామరూపం. **ఆహుః –** ఈ సత్యం తెలిసినవాళ్ళు గర్వంగా చెప్తారు. ఎవరు వాళ్ళు?

**పూర్వే మహాశాలాః –** గొప్ప గృహస్థులు. సన్యాసులు అనటం లేదు ఉద్ధాలకుడు. ఎందుకంటే తనే ఒక గృహస్థు. గృహస్థుల్లో కూడా జ్ఞానులుంటారని చెప్తున్నాడు. శాల అంటే యాగశాల. మరియు పాకశాల. యాగశాలలో యజ్ఞాలు చేస్తారు. పాకశాలలో భారీ ఎత్తున వంటలు చేస్తారు. యజ్ఞాలు చేస్తే అన్నదానాలు కూడా చేయాలి. అందువల్ల శాలాః అంటే యాగశాల, పాకశాల ఉన్నవాళ్ళు అని అర్థం. అవి ఉండేది గృహస్థుకే కాని సన్యాసికి కాదు. సన్యాసి భిక్షాటన చేసి జీవిస్తాడు కదా.

**శౌనకో హ వై మహాశాలా – ముండక**

**మహాశ్రోత్రియాః –** వీళ్ళు గొప్ప గృహస్థులే కాదు. గొప్ప విద్వాంసులు కూడా. శ్రుతిని విన్నవారు. శ్రుతి అంటే వేద పూర్వభాగం, అంతభాగం రెండూ వస్తాయి. అందువల్ల వాళ్ళకు 'బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య' అన్న జ్ఞానం ఉంది. అందుకని ఏది అడిగినా మాకు సృష్టిలో అంతా తెలుసు అంటారు. అమెరికా ఏమిటి? బ్రహ్మ+నామరూపాలు! నయగారా జలపాతాలు ఏమిటి? బ్రహ్మ+నామరూపాలు! మానస సరోవరం ఏమిటి? బ్రహ్మ+ నామరూపాలు. జ్ఞాని 'అవన్నీ పంచభూతాలనుంచి వచ్చినవే. కూర్పు, చేర్పు తేడా ఉండవచ్చు కాని,' అంటాడు.

అందుకని ఛాందోగ్య ఉపనిషత్తు వంటబడితే, ఎవరన్నా ఫలానాది చూశావా అంటే, మీరు, 'నేను చూడలేదు కాని, నాకు తెలుసు,' అని ఘంటా భజాయించి మరీ చెప్పగలరు. అవన్నీ ఒకటే బ్రహ్మలో ఉన్న అనేక నామరూపాలు మాత్రమే.

**కశ్చనః –** ఈ విద్వాంసులు ఏం చేస్తారంటే, మా కుటుంబంలో –

**అశ్రుతమమతమవిజ్ఞాతమ్ –** విననిది, ఆలోచించనిది, తెలియనిది లేదు

అంటారు. రెండు వ్యతిరేక వాక్యాలు. అంటే అన్నీ తెలుసు. ప్రశ్న అలాగే మొదలయింది.

**యేనాశ్రుతగ్ం శ్రుతం భవత్యమతం మతమవిజ్ఞాతం విజ్ఞాతమితి**

ఏ ఒక్కటి తెలుసుకుంటే అన్నీ తెలిసినట్టు అవుతుందో, దాని గురించి తెలుసుకున్నావా అని ఉద్ధాలకుడు శ్వేతకేతుని అడిగాడు. ఇప్పుడు మూడు రంగుల గురించి (మూడుభూతాల గురించి) తెలుసుకుంటే, అన్నీ తెలుసుకున్నట్టవుతుందని చెప్తున్నాడు.

న ఉదాహరిష్యతి– ఏదీ తెలియదు అని చెప్పరు.

**మంత్రం–5– హ్యేభ్యో విదాఞ్చక్రుః –** వాళ్ళు ఈ మూడింటి నుంచి అన్నీ తెలుసుకున్నారు.

అన్నింటిలోనూ ఈ మూడు రంగులే ఉంటాయి. ఏమిటవి– ఎరుపు, తెలుపు, నలుపు. అవి దేనికి చిహ్నం? సూక్ష్మభూతాలు. అవి దేని నుంచి వచ్చాయి? బ్రహ్మనుంచి. అందుకని వాటి గురించి తెలిస్తే బ్రహ్మ గురించి తెలిసినట్లే. అందుకే విదాఞ్చక్రుః

అంతేకాదు, ఈ విషయం వాళ్ళు ఇంకా వివరిస్తున్నారు. ఏ వస్తువుని చూసినా,వాటి రంగులను చూడండి. ఆ రంగుల నుంచి భూతత్రయాన్ని చూడవచ్చు అంటున్నారు.

**మంత్రం–6– యదు రోహితమివాభూదితి–** ఏది ఎర్రరంగులాగా కనపడితే, అక్కడ–

**తేజసస్తద్రూపమితి–** అది సూక్ష్మ అగ్నిని సూచిస్తుంది అని;

**తద్విదాఞ్చక్రుః –** వారు (ఆ గృహస్థులు) తెలుసుకున్నారు.

**యదు శుక్లమివాభూదిత్యపాగ్ం రూపమితి తద్విదాఞ్చక్రుః –** ఏది తెల్లని రంగులాగా కనపడుతుందో, అది సూక్ష్మజలరూపమని వారు తెలుసుకున్నారు.

**యదు కృష్ణమివాభూదిత్యన్నస్య రూపమితి తద్విదాఞ్చక్రుః –** ఏది నల్లని రంగులాగా కనపడుతుందో, అది సూక్ష్మ పృథివీ రూపమని వారు తెలుసుకున్నారు.

బాగానే ఉంది. రంగులు తెలిసినప్పుడు చెప్తారు. సరే, రంగులు స్పష్టంగా తెలియకపోతే ఏం చేస్తారు?అప్పుడు కూడా అవి ఈ మూడు రంగుల మేలు కలయిక అని చెప్తాము అంటారు వాళ్ళు.

ఎందుకంటే అవి మూడు సూక్ష్మభూతాల మేలు కలయిక కదా. అదే అర్థం ఈ క్రింది మంత్రంలో.

**మంత్రం-7- యదవిజ్ఞాత మివాభూత్ -** ఏ వస్తువులైతే ఏ రంగో తెలియకుండా ఉన్నప్పుడు-

**తత్యేతాసామేవ దేవతానాగ్ం సమాస ఇతి -** దేవతలంటే సూక్ష్మభూతాలు. ముందునుంచి సూక్ష్మభూతాలను దేవతలుగా వ్యవహరించుకుంటూ వస్తున్నది ఉపనిషత్తు. ఏతాసామ్ ఏవ దేవతానాం అంటే ఈ మూడు సూక్ష్మభూతాల (అగ్ని, జలం, పృథివీ); సమానః- మేలు కలయిక. ఇంద్రధనస్సును ఏడు రంగులలో అభివర్ణించినా, నిజానికి మూడే ప్రాథమిక రంగులు ఉన్నాయంటారు. తక్కినవన్నీ రెండు రంగులు కలిపితే వచ్చే రంగులు.

**తద్విదాఞ్చక్రుః -** అని వాళ్ళు తెలుసుకున్నారు.

ఇంతవరకూ గురువు ఆది భౌతికం అంటే సమష్టి ప్రపంచం గురించి మాట్లాడాడు. ఇప్పుడు ఆధ్యాత్మికం గురించి చెప్తాను విను అంటున్నాడు తన శిష్యుడైన శ్వేతకేతుతో.ఎందుకంటే ఆది భౌతిక ప్రపంచం, ఆధ్యాత్మిక ప్రపంచం రెండూ ఈ మూడు భూతాలనుంచే సృష్టించబడ్డాయి. అవి బ్రహ్మనుంచి సృష్టించబడ్డాయి. ఆ విషయం తర్వాత వచ్చే ఖండంలో రాబోతుంది. ఇక్కడ ఉపోద్ఘాతం ఇస్తున్నాడు.

**హే సోమ్య-** శిష్యుడిని పలకరించి, అతను శ్రద్ధగా వినేలా చేస్తున్నాడు.

**ఇమాస్తిస్రోదేవతాః -** ఈ మూడు దేవతలు. ఇక్కడ స్థూలభూతాల గురించి చెప్తున్నారు. ఇంతకు ముందు మంత్రం వరకూ సూక్ష్మభూతాల గురించి చెప్పాడు. ఇప్పుడు స్థూలభూతాలు

**పురుషం ప్రాప్య -** అవి మనుష్య శరీరంలో అన్నరూపంలో ప్రవేశిస్తాయి. అంటే మనం భూతత్రయాన్ని తింటున్నాము. పృథివీని తింటున్నామన్నమాట. అట్లాగే మట్టిరూపంలో తింటామని కాదు అర్థం. అన్నరూపంలో వెళ్ళి దేహేంద్రియ మనోబుద్ధులను ఏర్పరుస్తాయి. పురుషం అంటే పురుషుడే కాదు. మానవశరీరం, జీవశరీరం కూడా. ప్రాప్య - ప్రవేశిస్తాయి. ఎలా ప్రవేశిస్తాయి? ఘన, ద్రవ పదార్థాలతో కూడిన ఆహారంగా.

**త్రివృత్త్రివృదేకైకా భవతి -** ఏకైకా అంటే ఒక్కొక్క స్థూలభూతం, శరీరంలో మూడు పేటలుగా మారుతాయి.

ఒక్కొక్క స్థూలభూతం, శరీరంలో మూడేసి పేటలవుతాయి.

**తన్మే విజానీహీతి–** ఈ విభాజ్యం ఎలా జరుగుతుందో, నేను చెప్తుండగా, అర్థం చేసుకో.

ఇది తెలుసుకోవటం వల్ల లాభం ఏమిటి? ఎప్పుడైతే ఈ శరీరం మూడు స్థూలభూతాలనుంచి సృష్టించబడింది అని తెలుసుకుంటామో, అప్పుడే ఈ శరీరం కార్యం అయింది.

శరీరం కార్యం, స్థూలభూతాలు కారణం.

స్థూలభూతాలు కార్యం, సూక్ష్మభూతాలు కారణం.

సూక్ష్మభూతాలు కార్యం, బ్రహ్మ కారణం.

**కార్యం – వాచాఽఽరమ్భణం వికారో నామధేయం.** దానికి విడిగా ఉనికి లేదు.

అందువల్ల బ్రహ్మ సత్యం. జగత్ మిథ్య.

**ఏక కారణ విజ్ఞానేన, సర్వకార్య విజ్ఞానం భవతి.**

**పంచమః ఖణ్డః (5)**

**అన్నమశితం త్రేధా విధీయతే తస్య యః స్థవిష్ఠో ధాతుస్తత్పురీషం భవతి యో మధ్యమస్తన్మాగ్ంసం యోఽణిష్ఠస్తన్మనః ॥1॥ ఆపః పీతాస్త్రేధా విధీయన్తే తాసాం యః స్థవిష్ఠో ధాతుస్తన్మూత్రం భవతి యో మధ్యమస్తల్లోహితం యోఽణిష్ఠస్స ప్రాణః ॥2॥ తేజోఽశితం త్రేధా విధీయతే తస్య యః స్థవిష్ఠో ధాతుస్తదస్థి భవతి యో మధ్యమస్స మజ్జాయోఽణిష్ఠస్సా వాక్ ॥3॥ అన్నమయగ్ం హి సోమ్య మన ఆపోమయః ప్రాణస్తేజోమయీ వాగితి। భూయ ఏవ మా భగవాన్విజ్ఞాపయత్వితి। తథా సోమ్యేతి హోవాచ ॥4॥**

**మంత్రం–1–** ఇప్పుడు మనం తినే, తాగే వస్తువుల ద్వారా స్థూలభూతాల గురించి తెలుసుకుంటాము.

**అన్నమశితం–** అశితం అంటే తిన్న. అశితం అన్నం అంటే తిన్న అన్నం. ఈ అధ్యాయంలో ఉన్నంతవరకూ అన్నం అంటే పృథివీ తత్త్వం అన్న విషయం మర్చిపోకూడదు. ఇక్కడ **స్థూల పృథివీ తత్త్వం.**

**త్రేధావిధీయతే–** మనం తిన్న అన్నం, మూడు భాగాలుగా విభజించబడుతుంది లోపల. ఏమిటవి? స్థూలభాగం, మధ్యభాగం, సూక్ష్మభాగం.

వాటికి పేర్లు వరుసగా – స్థవిష్ఠః, మధ్యమః, అణిష్టః.

**తస్య యః స్థవిష్ఠో ధాతుస్తత్పురీషం భవతి –** అత్యంత స్థూలభాగం పురీషం(మలం) అవుతుంది. పురుషం కాదు పురీషం. వృధాగా పోతుంది.

**యో మధ్యమస్తన్మాగ్ంసం –** ఏది మధ్యభాగమో అది మాంసం అవుతుంది. మాంసం అంటే స్థూలశరీరానికి దోహదం చేస్తుంది.

**యోఽ ణిష్ఠస్తన్మనః –** ఏది అత్యంత సూక్ష్మమో అది మనస్సు అవుతుంది. మనసులో రేగే సత్వరజస్తమోగుణాలను అది ప్రేరేపిస్తుంది.

**మంత్రం–2 ఆపః పీతాస్త్రేధా విధీయన్తే –** ఇంతకు ముందు తిన్న అన్నం ఎలా మూడు భాగాలుగా విభజింపబడుతుందో చూశాము. ఇప్పుడు తాగిన నీరు ఎలా మూడుగా విభజించబడుతుందో చూస్తాము.

**తాసాం యః స్థవిష్ఠోధాతుస్తన్మూత్రం భవతి–** వాటిలో అత్యంత స్థూలమైన భాగం మూత్రంగా పోతుంది.

**యో మధ్యమస్తల్లోహితం–** ఏది మధ్య భాగమో అది రక్తంగా మారుతుంది. రోహితం అంటే ఎరుపు. అంటే ఎఱ్ఱరంగులో ఉన్న రక్తంగా తీసుకోవాలి.

**యోఽ ణిష్ఠస్య ప్రాణః–**ఏది అత్యంత సూక్ష్మభాగమో అది ప్రాణశక్తి అవుతుంది.

ఇక్కడిదాకా పృథివీ తత్త్వం,నీటితత్త్వం వచ్చాయి. ఇప్పుడు అగ్నితత్త్వం.

**మంత్రం–3– తేజోఽ శితం త్రేధా విధీయతే –** తీసుకున్న అగ్ని మూడుగా విభజించబడుతుంది. అగ్ని ఏమిటి, తినటం ఏమిటి అంటే నెయ్యి, నూనె. అవి ఎలా అగ్ని అయ్యాయి అంటే వాటికి కాలే తత్త్వం ఉంది.

**తస్య యః స్థవిష్ఠో ధాతుస్తదస్థి భవతి –** వాటిలో అత్యంత స్థూలభాగం, ఎముక అవుతుంది. అన్నం, నీరు సంగతులు వచ్చినప్పుడు వాటి స్థూలభాగం వృథాగా పోతుందని చూశాము. ఇక్కడ మూడూ ఉపయోగపడేవే. అస్థి అంటే ఎముక(బోన్).

**యో మధ్యమస్స మజ్జా–** ఏది మధ్యభాగమో అది మూలుగు(బోన్‌మారో) అవుతుంది.

**యోఽ ణిష్ఠస్సా వాక్–** అత్యంత సూక్ష్మభాగం వాక్కు అవుతుంది.

పూర్వం వేదపారాయణం చేసేవాళ్ళకు, నెయ్యి ఆహారంలో ముఖ్యభాగంగా ఉండాలనేవారు. అందుకే నేతిని నేతిజారలతో వడ్డించేవారు. వాక్కుకు శక్తినిస్తుంది నెయ్యి.

వీటివల్ల తేలిన విషయమేమిటి? వచ్చే వాక్యం అక్షరలక్షలు పలికే వాక్యం.

**అన్నమయగ్ం హి సోమ్య మన ఆపోమయః ప్రాణస్తేజోమయీ వాగితి**

**సోమ్య – హే సోమ్యా అన్నమయగ్ం హి మనః –** మనసు అన్నం నుంచి పుట్టింది. అన్నమయం అంటే అన్నమయకోశమూ  కాదు, అన్నమూ కాదు. పృథివీ అని మర్చిపోకూడదు.

| | | |
|---|---|---|
| మనస్సు కార్యం | – | పృథివీ కారణం |
| ప్రాణం కార్యం | – | జలం కారణం |
| వాక్కు కార్యం | – | అగ్ని కారణం |

మనస్సు జడమా, చేతనమా? మనస్సు జడమే. ఎందుకంటే మనస్సు కార్యం, పృథివీ కారణం అయింది. కాకపోతే మనసుకు చైతన్యాన్ని ప్రతిబింబింపచేసే శక్తి ఉంది. మనస్సు జడమే అని నిరూపించటానికి ఈ వాక్యమే మనకు ఆధారం. అందుకే దీన్ని అక్షరలక్షలు పలికే వాక్యం అన్నారు.

అలాగే ప్రాణమే ఆత్మ అనే అపోహ ఉంది. ప్రాణం ఉంటే, మనిషిలో చైతన్యం ఉంటుంది. ప్రాణం పోతే మనిషిలో చైతన్యం ఉండదు కాబట్టి ప్రాణమే ఆత్మ అనుకుంటారు. కాని ఇక్కడ ఉపనిషత్తు చెపుతున్నది అపోమయః ప్రాణ అని.

**న ప్రాణేన నాపానేన మర్త్యో జీవతి కశ్చన**

ప్రాణం శరీరానికి జీవం ఇవ్వదు. మరేది ఇస్తుంది?

**ఇతరేణ తు జీవన్తి యస్మిన్నేతావుపాశ్రితౌ కఠ 2-2-5**

ఇంకేదో అంటే ఆత్మ, ఇస్తుంది జీవం. ఆత్మ మాత్రమే ఇస్తుంది. మరి ప్రాణం గొప్పదనం ఏమిటి? అది ఆత్మనుంచి జీవాన్ని అరువు తెచ్చుకుని, శరీరానికి ఇస్తుంది. ప్రాణం కూడా జడమే.

**తేజోమయీ వాగితి–** అలాగే వాగింద్రియం కూడా కార్యమే. మూడింటిలోనూ మయ అన్న పదం, అవి కార్యం అని సూచిస్తుంది.

సంస్కృతంలో ప్రతి పదానికి మూడు లింగాలు ఉంటాయి. అవి పురుషలింగం, స్త్రీలింగం, నపుంసకలింగం.

మయకి వరుసగా మయః, మయీ, మయమ్.

**అన్నమయమ్, ఆపోమయః, తేజోమయీ** అని మూడు లింగాల ప్రయోగాలూ వచ్చాయి. ఎందుకంటే మనసు నపుంసక లింగం. అందుకని - మయమ్ వచ్చింది. ప్రాణం పురుషలింగం- అందుకని మయః వచ్చింది. వాక్కు స్త్రీలింగం - అందుకని మయీ వచ్చింది.

ఇదంతా విన్నాక, శ్వేతకేతు, 'నాకు బాగా అర్థమయింది, కాని, ఇంకొంచెం వివరంగా చెప్పండి. నాకు అర్థమయింది కాని పూర్తిగా అర్థమవలేదు' అన్నాడు. అసలేమీ అర్థం కాలేదు అన్నా ఇంకా చెప్పినా వృథాశ్రమ. అంతా అర్థమయింది అన్నా ఇంకా చెప్పటం అనవసరం. అందుకని ఇలా చెప్పాడు.

**భగవన్ -** ఏ ఉపనిషత్తులో చూసినా, గురువును భగవాన్ అని శిష్యుడు, శిష్యుని సోమ్య అని గురువూ సంబోధిస్తారు.

**భూయ ఏవమా విజ్ఞాపయత్వితి -** ఓ భగవాన్, నాకు ఇంకాస్త వివరంగా చెప్పండి అన్నాడు.

**తథాసోమ్యేతి హోవాచ -** ఓ సోమ్యా అలాగే చెప్తాను అన్నాడు గురువు. అంటే తథాస్తు అన్నట్టన్నమాట.

**షష్ఠః ఖణ్డః (6)**

**ధధ్నస్సోమ్య మధ్యమానస్య యోఽ ణిమా స ఊర్ధ్వస్సముదీషతి తత్సర్పిర్భవతి ॥1॥ ఏవమేవ ఖలు సోమ్యాన్నస్యాశ్యమానస్య యోఽ ణిమా స ఊర్ధ్వస్సముదీషతి తన్మనో భవతి ॥2॥ అపాగ్ం సోమ్య పీయమానాం యోఽ ణిమా స ఊర్ధ్వ స్సముదీషతి స ప్రాణోభవతి ॥3॥ తేజస స్సోమ్యాశ్యమానస్య యోఽ ణిమా స ఊర్ధ్వస్సముదీషతి సా వాగ్భవతి ॥4॥ అన్నమయగ్ంహి సోమ్య మన ఆపోమయః ప్రాణస్తేజోమయీ వాగితి। భూయ ఏవ మా భగవాన్విజ్ఞాపయత్వితి తథా సోమ్యేతి హోవాచ ॥5॥**

**మంత్రం -1-** మనం తీసుకునే ఆహారానికీ, సూక్ష్మశరీరానికీ మధ్య ఉన్న సంబంధం అంత స్పష్టంగా రాలేదు. అందుకని ఉద్దాలకుడు దాని గురించి ఒక ఉదాహరణ ఇవ్వాలనుకున్నాడు. ముందు ఖండాల్లో ఆహారానికీ, స్థూలశరీరాలకూ మధ్య ఉన్న సంబంధం గురించి వచ్చింది. కాని ఈ ఖండం సూక్ష్మశరీరానికి ప్రాముఖ్యత నిచ్చింది.

**దధ్నస్సోమ్య మథ్యమానస్య –** ఇక్కడ తీసుకున్న ఉదాహరణ– పెరుగుని చిలకడం. దధి అంటే పెరుగు. దాన్ని చిలుకుతున్నప్పుడు,

**యోఽణిమాస ఊర్ధ్వస్సముదీషతి–** యః అణిమా అంటే అందులో అత్యంత సూక్ష్మమైన, అత్యంత ముఖ్యమైన భాగం. సః ఊర్ధ్వస్సముదీషతి– అది వెన్నలో పైకి తేలుతుంది.

**తత్సర్పిర్భవతి –** అది నెయ్యి అవుతుంది. పెరుగులో వెన్న ఉన్నట్లు కనపడదు. కాని దాన్ని చిలకటం ద్వారా అది పైకి తేలుతుంది. అంతేకాదు, వెన్నని కాని, దాన్ని కరిగించాక వచ్చిన నెయ్యిని కాని రుచిచూస్తే అది పెరుగునుంచి వచ్చినట్టే తెలియదు. పెరుగు రుచి దీనిదాకా రాదు. వెన్నకి అద్భుతమైన రుచి ఉంది. అలాగే మనం తినే ఆహారానికీ, మన సూక్ష్మశరీరానికీ మధ్య ఉన్న సంబంధం స్పష్టంగా తెలియదు. దాన్ని కూడా చిలకాలి. వెన్న విషయంలో బాహ్యంగా చిలికితే, సూక్ష్మశరీర విషయంలో అంతర్గతంగా చిలకాలి. ఇప్పటివరకూ దృష్టాంతం చూశాము. ఇప్పుడు ద్రాష్టాంతం చూద్దాము.

**మంత్రం – 2 – ఏవమేవ ఖలుసోమ్యాన్నస్యాశ్యమానస్య –** ఓ సోమ్య, అదే విధంగా మనం తిన్న అన్నం మన కడుపులో చిలకబడుతుంది. ఆహారం లోపలికి తీసుకోగానే పెరుగు చిలికినట్టుగా చిలికే తతంగం మెదలవుతుంది. ఆ మాటకొస్తే తినకముందే కొన్ని రసాయనాలు విడుదల అవుతాయి. నోరూరించే రుచులు అంటాము. ఎదురుకుండా రుచికరమైన పదార్థం కనబడితే, తినకుండానే నోట్లో లాలాజలం ఊరుతుంది. అలాగే పక్కింట్లో బజ్జీలో, గారెలో వేగుతున్న వాసనను గాలి మోసుకొస్తే కూడా ఇక్కడ చిలికే కార్యక్రమం మొదలవుతుంది. ఎంత అద్భుతం భగవాన్ సృష్టి! తిన్నాక పొట్టలోని అగ్ని, కవ్వంలాగా ఆహారాన్ని చిలుకుతుంది. ఇక్కడ వెన్న ఏమిటి? మనసు! ఆహారం నుంచి సృష్టించబడ్డ అపురూపమైన భాగం.

**యోఽణిమా స ఊర్ధ్వస్సముదీషతి తన్మనో భవతి–** చిలకగా వచ్చిన వెన్న పైకి తేలినట్టుగా, చిలకగా వచ్చిన మనస్సు కూడా పైకి వస్తుంది. పొట్టకన్నా పైభాగంలోనే ఉంది కదా మనస్సు. శాస్త్రం ప్రకారం మనస్సు హృదయంలో ఉంటుంది. దానికి అత్యంత సూక్ష్మభాగం వెళుతుంది.

**తన్మనో భవతి–** భవతి అంటే మనస్సుని ఉత్పత్తి చేయదు. దానికి శక్తినిస్తుంది అని అర్థం చేసుకోవాలి. ఉత్పత్తి చేస్తుంది అని అర్థం తీసుకుంటే, అన్నం

తినకముందు, మనస్సు లేనట్టు అవుతుంది. అందుకే **మనః ఉపచినోతి** అంటారు. అంటే మనస్సును వర్ధిల్లజేస్తుంది అని అర్థం. మనస్సు పూర్వజన్మల నుంచి తీసుకురాబడుతుంది. ఆ విధంగా ఆహారం సూక్ష్మశరీరానికి దోహదం చేస్తుంది

**మంత్రం-3-** రెండో మంత్రం పృథివీతత్త్వం గురించి మాట్లాడితే, మూడో మంత్రం జలతత్త్వం గురించి మాట్లాడుతుంది. మనం త్రాగిన నీరు, ప్రాణానికి శక్తినిస్తుంది. అందుకే నీళ్ళు బాగా తాగండి అంటారు.

ఇందాకటి మంత్రంలో లాగే వస్తుంది అర్థం ఇందులో కూడా.

**అపాగ్ం సోమ్య పీయమానాం యో౽ణిమా స ఊర్ధ్వస్యముదీషతి-** ఓ సోమ్యా! తాగిన నీరు యొక్క సూక్ష్మమైన ధాతువు ఏది ఉందో, అది పైకి తేలుతుంది.

**సప్రాణో భవతి-** అది ప్రాణం అవుతుంది.

**మంత్రం-4-** ఇందాకటి మంత్రాల అర్థమే ఇందులో కూడా.

**తేజసస్సోమ్యాశ్యమానస్య యో౽ణిమా స ఊర్ధ్వస్సముదీషతి-** తీసుకున్న తేజస్సు లోని సూక్ష్మమైన ధాతువు ఏది ఉందో అది పైకి తేలుతుంది. తేజస్సు అంటే మనం తీసుకునే నూనె, నెయ్యి అని చూశాము.

**సా వాగ్భవతి-** అది వాక్కు అవుతుంది.

వీటివల్ల తెలిసింది ఏమిటి?

**అన్నమయగ్ం హి సోమ్య మన ఆపోమయః ప్రాణస్తేజోమయీ వాగితి**

ఈ మంత్రం అక్షరలక్షలు పలికే వాక్యం అని ఇంతకుముందు కూడా చూశాము. అందుకే ఇది ఐదో ఖండం నుంచి అక్షరాలా అలాగే తీసుకురాబడింది. దీని సారాంశం ఏమిటి? మనస్సు, ప్రాణం, వాక్కు వరుసగా పృథివీతత్త్వం, జలతత్త్వం, అగ్నితత్త్వాల నుంచి వచ్చిన కార్యాలు.

అందువల్ల సూక్ష్మశరీరం కూడా భౌతికం, భూతకార్యం. దీన్నించి మనం అంతకు ముందు చూసిన దశలు విసుగనుకోకుండా చూడాలి.

శరీరం కార్యం, స్థూలభూతాలు కారణం.

స్థూలభూతాలు కార్యం, సూక్ష్మభూతాలు కారణం.

సూక్ష్మభూతాలు కార్యం, బ్రహ్మ కారణం.

**కార్యం – వాచాఽఽరమ్భణం వికారో నామధేయం.** దానికి విడిగా ఉనికి లేదు..

అందువల్ల బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య.

**ఏక కారణ విజ్ఞానేన, సర్వకార్య విజ్ఞానమ్ భవతి**

**భూయ ఏవ మా భగవాన్–** ఇంత విన్నా శ్వేతకేతుకి తృప్తిగా లేదు. ఇంకా చెప్పండి భగవాన్ అన్నాడు.

**తథాసోమ్యేతి హోవాచ –** తథాస్తు అన్నాడు గురువు.

**సప్తమః ఖణ్డః (7)**

**షోడశకలస్సోమ్య పురుషః పంచదశాహాని మాశీః కామమపః పిబాపోమయః ప్రాణో న పిబతో విచ్ఛేత్స్యత ఇతి ॥1॥ స హ పంచదశాహాని నాశాథ హైనముపససాద కిం బ్రవీమి భో ఇత్యృచస్సోమ్య యజూగ్ంషి సామానీతి స హోవాచ న వై మా ప్రతిభాన్తి భో ఇతి ॥2॥ తగ్ం హోవాచ యథా సోమ్య మహతోఽభ్యాహితస్యైకోఽఙ్గారః ఖద్యోతమాత్రః పరిశిష్టస్స్యాత్తేన తతోఽపి న బహు దహేదేవగ్ం సోమ్య తే షోడశానాం కలానామేకా కలాఽతిశిష్టా స్యాత్తయైతర్హి వేదాన్నానుభవస్యశానాథ మే విజ్ఞాస్యసీతి ॥3॥ స హాశాథహైనముపససాద తగ్ం హ యత్కిఞ్చ పప్రచ్ఛ సర్వగ్ం హ ప్రతిపేదే ॥4॥ తగ్ం హోవాచ యథా సోమ్య మహతోఽభ్యాహితస్యైకమఙ్గారం ఖద్యోతమాత్రం పరిశిష్టం తం తృణైరుపసమాధాయ ప్రాజ్వలయేత్తేన తతోఽపి బహు దహేత్ ॥5॥ ఏవగ్ం సోమ్య తే షోడశానాం కలానామేకా కలాఽతిశిష్టాఽభూత్సాఽన్నేనోపసమాహితా ప్రాజ్వాలీత్తయైతర్హి వేదాననుభవసి॥ అన్నమయగ్ం హి సోమ్య మన అపోమయః ప్రాణస్తేజోమయీ వాగితి తద్ధాస్య విజజ్ఞావితి విజజ్ఞావితి ॥6॥**

5,6,7 ఖండాల సారాంశం ఒకటే.

**అన్నమయగ్ం హి సోమ్య మన ఆపోమయః ప్రాణస్తేజోమయీ వాగితి**

ఇదే భావాన్ని ఒక ప్రయోగం ద్వారా చూపించబోతున్నాడు గురువు. ముఖ్యంగా మొదటిభాగం మీద దృష్టిపెడుతున్నాడు. అన్నం మనస్సుని వర్ధిల్లజేస్తుంది అనే అంశం మీద. అందువల్ల మనస్సు అన్నం యొక్క కార్యం అవుతుంది. పౌష్టికాహారం తీసుకుంటే మనస్సు వృద్ధి చెందుతుంది.

తీసుకోకపోతే తగ్గుతుంది. మనస్సుకూ, అన్నానికీ ఉన్న కార్య-కారణ సంబంధాన్ని ఈ ఖండం ప్రత్యేకంగా చూపుతుంది. దీనివల్ల మనస్సు గురించి ఉన్న కొన్ని అపోహలు తొలగుతాయి. అవి-

1. విజ్ఞానశాస్త్రం మెదడుకి భిన్నంగా మనస్సు ఉందంటే ఒప్పుకోదు. శరీరం పడిపోయాక, మనస్సు ప్రయాణం చేస్తుందని కూడా ఒప్పుకోదు.

2. బౌద్ధమతంలో మనస్సుని చేతన ఆత్మ అనుకుంటారు.

3. న్యాయ వైశేషికులు మనస్సుని అణుపదార్థంగా అనుకుంటారు. అది జడం, నిత్యం, అణుపదార్థం అంటారు.

ఈ ప్రయోగం ద్వారా వీటన్నింటినీ ఖండించవచ్చు. దీని ద్వారా చెప్పబడే భాగాలు ఇవి-

1. మనస్సు పాంచభౌతిక పదార్థం. అందువల్ల అది జడం. చేతనం కాదు.

2. మనశ్శక్తి పెరుగుతూ, తరుగుతూ వస్తుంది. అందువల్ల దీనికి చావు,పుట్టుకలు ఉన్నాయి. అందువల్ల అది జడం, అనిత్యం. అందువల్ల అది ఆత్మకాదు.

ఈ ప్రయోగాన్ని గురువు శిష్యుని మీద చేస్తున్నాడు.

**మంత్రం-1- షోడశకలస్సోమ్య పురుషః -** ఓ సోమ్యా! అని అతన్ని సంబోధిస్తున్నాడు. పురుషః అంటే ఇక్కడ ఒక మనిషి. పురుషః అంటే ఆత్మ అని కొన్ని సందర్భాలలో అర్థం వస్తుంది. కాని ఇక్కడ అర్థం ఒక వ్యక్తి. అతనిలో షోడశకళలు ఉంటాయి. (సంస్కృతంలో 'ళ' ఉండదు 'ల' వాడుతారు). మనస్సు యొక్క శక్తిని 16 కళలుగా విభజించవచ్చు. వాటికి శక్తి దేన్నించి వస్తుంది? అన్నం నుంచి.

**పంచదశాహాని మాశీః -** 15 రోజులు అన్నం తినకుండా ఉండిచూడు. పంచదశ అంటే 15 రోజులు. **అహానిమాశీః -** అన్నం తినకుండా ఉండు. **కామమపః పిబా -** కాని ఒక సడలింపు చేశాడు. నీకు కావాల్సినంత నీరు త్రాగు. కామం అంటే నీకు కావాల్సినంత. ఎందుకు? అంతకు ముందు చూసిన వాక్యంలో భాగం చెప్తున్నాడు మళ్ళీ.

**ఆపోమయః ప్రాణః –** నీరు ప్రాణాన్ని వృద్ధి చేస్తుంది కాబట్టి, నీరు త్రాగితే ప్రాణానికి ప్రమాదం ఉండదు.

**నపిబతో విచ్ఛేత్స్యత ఇతి –** నీళ్ళు త్రాగితే ప్రాణానికి ప్రమాదం ఉండదు. అంటే అర్థం ఏమిటి? నీళ్ళు త్రాగనివానికి ప్రాణం పోతుంది అని.

**అన్నమయగ్ం హి సోమ్య మనః** అని చూశాము కదా! అందుకని 15 రోజులు అన్నం తినకుండా ఉండటం వల్ల మనసుకు ఉన్న పదహారు కళలు రోజుకి ఒక కళ చొప్పున క్షీణిస్తూ వస్తుంది. పదహారవ రోజున ఒక కళ మాత్రమే మిగులుతుంది. అది కూడ నీరు త్రాగుతాడు కాబట్టి. ఆ కళే ప్రాణం.

**మంత్రం–2– స హ పంచదశాహానినాశ –** అతను పదిహేను రోజులు తినకుండా ఉన్నాడు. అహనినాశ అంటే తినకుండా ఉన్నాడు. తర్వాత ఏం చేశాడు?

**అథహైనముపససాద –** దాని తర్వాత తండ్రి దగ్గరకు వెళ్ళాడు. ఏనమ్ అంటే గురువు దగ్గరకు, ఉపససాద అంటే వెళ్లాడు.

**కిం బ్రవీమి భో ఇతి** – భో అంటే భగవాన్. ఏం చెప్పను అని అడిగాడు. గురువు ఏది అడిగితే అది అప్పచెప్పాలి.

**ఋచస్సోమ్య యజూగ్ంషి సామానీతి** – గురువు చెప్పాడు, ఓ సోమ్యా! ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం చెప్పు అన్నాడు. శిష్యుడు తన మనస్సులోకి తొంగిచూశాడు. కంప్యూటర్‌లో ఒక్కోసారి అన్నీ మాయమయిపోయినట్టుగా అన్నీ మాయమయి పోయాయి.

**సహోవాచ–** అతను గురువుతో చెప్పాడు. ఏమని?

**న వై మా ప్రతిభాన్తి భో ఇతి–** ఓ భగవాన్, నాకు అవి స్ఫురించటమే లేదు అని చెప్పాడు. అవి అంత తేలిగ్గా మర్చిపోయే అవకాశం లేదు. పూర్వం వేదాలను అనేక వందలసార్లు వల్లె వేస్తూనే ఉంటారు. అంటే అవి లోతుగా మనస్సులో పాతుకునే ఉంటాయి. అయినా అతను చెప్పలేకపోయాడు. అంటే ఏమిటి కారణం? అన్నమయగ్ం హి సోమ్య మనః. కారణనాశే, కార్యనాశః. అన్నం అనే కారణం లేకపోయేసరికి, మనస్సనే కార్యం బలహీనమైంది. కాని ప్రాణం నిలబడి ఉంది. ఎందుకు? **అపోమయః ప్రాణః –** నీరు కావాల్సినంత త్రాగమన్నాడు కదా. అది త్రాగి ఉంటాడు. ఇప్పుడు

గురువు ఏం చేశాడు? అన్వయ వ్యతిరేక న్యాయం ప్రయోగించాడు.

**అన్వయ వ్యతిరేక న్యాయం-**
**యత్ సత్వే తత్ సత్వం**
**యదభావే తదభావం**

ఏది ఉంటే ఒకటి ఉండి, ఏది లేకపోతే అది ఉండదో, అది కారణం అవుతుంది. దీన్ని అన్వయ వ్యతిరేక పద్ధతి అంటారు. ఉదాహరణకు నీళ్ళలో పంచదార కలిపితే నీళ్ళు తీయగా ఉంటాయి. పంచదార లేకపోతే తీయగా ఉండవు. అందువల్ల పంచదారే నీటి తీయదనానికి కారణమవుతుంది.

ఉద్ధాలకుడు చేసిన ప్రయోగంలో ముందు వ్యతిరేక న్యాయం చూశాము. ఏమిటది? అన్న అభావే, మేధాశక్తి అభావః. అన్నం లేకపోతే, మేధాశక్తి లేదు. ఇప్పుడు అన్వయపద్ధతిని చూడబోతున్నాము. రాబోయే మంత్రంలో మళ్ళీ 15 రోజులు అన్నం తిని రమ్మన్నాడు.

**మంత్రం-3- తగ్ం హోవాచ-** తం అంటే శ్వేతకేతుతో, ఉవాచ, తండ్రి లేదా గురువు చెప్పాడు. ఏమని? ఒక ఉదాహరణ ఇస్తున్నాడు. ఏమిటది? జ్వలిస్తున్న ఒక పెద్ద మంట ఉందనుకో. దాని కాంతి, వేడి అంతటా వ్యాపిస్తుంది. దాని తర్వాత మంట అంతా తగ్గిపోయి ఒక్క మండే బొగ్గు మిగిలిందనుకో. దానికి తనని తాను ప్రకటించుకునే శక్తి తప్ప, వేరేవాటిని ప్రకాశింపజేసే శక్తి ఉండదు.

**యథాసోమ్య మహతోఽభ్యాహితస్య -** అభ్యాహితం అంటే బాగా ప్రజ్వరిల్లజేయబడిన అగ్ని. అందువల్ల అది మహతః అయింది. మహతః, అభ్యాహితమ్ పదాలు పెద్ద మంటను సూచిస్తాయి.

**ఏకోఽంగారః -** అంతపెద్ద జ్వాల తగ్గిపోయాక, ఒక్క బొగ్గు మాత్రమే మండుతున్నది. అది ఎంత ఉంది?

**ఖద్యోతమాత్రః -** మిణుగురు పురుగు అంత ఉంది. మిణుగురు పురుగు ఉదాహరణ చక్కగా సరిపోతుంది. ఆ పురుగు కాంతి తన ఉనికిని సూచించేటంతమాత్రమే ఉంటుంది కాని చుట్టూ ఉన్న వస్తువులను అది ప్రకాశింపజేయలేదు. అదే విధంగా అంతకుముందు ఉన్న అఖండ జ్ఞాపకశక్తి కాస్తా మిణుగురు పురుగంత శక్తికి తగ్గిపోయింది. ఎంత చిన్నదంటే, దేన్నీ ప్రకాశింపజేయలేకపోతున్నది. 'నేనున్నాను' అని మాత్రమే

సూచించ గలుగుతుంది. అందుకే మనస్సును అగ్నితో పోల్చారు.

**పరిశిష్ఠస్స్యాత్–** మిగిలింది– అంత పెద్ద అగ్నిలో మండుతున్న ఒక్కటే బొగ్గ మిగిలి ఉంది.

**తేన తతోఽపి న బహు దహేత్–** ఆ చిన్న కాంతితో తనను తప్ప, తక్కిన వాటిని ప్రకాశింపజేసే శక్తి ఉండదు. అంతేకాదు, వేరేవాటిని దహించే శక్తి కూడా ఉండదు. దానిమీద ఒక కాగితం ముక్క పెట్టినా దాన్ని ఈ చిన్న మంట కాల్చలేదు. కాల్చలేకపోగా, అదే ఆరిపోతుంది. ఇంతవరకూ ఉదాహరణ.

**ఏవగ్ంసోమ్య–** ఓ సోమ్యా! అదే విధంగా, నువ్వు ప్రయోగం చేయక ముందు జ్వలించే అగ్నిలా ఉన్నావు. అదంతా ఏమయింది?

**తే షోడశానం కలానామ్–** నీకున్న 16 కళల్లో 15 పోయాయి. ఎందుకు? నువ్వు ఉపవాసం ఉండటం వల్ల. ఇప్పుడు ఏం మిగిలి ఉంది?

**ఏకా కలాఽతిశిష్టా స్యాత్ –** ఒకటే మిగిలి ఉంది. అతని జ్ఞాపకశక్తి అంతా హరించుకు పోయి, ఒక్కటి మాత్రం మిగిలి ఉంది. ఏమిటది? తన తండ్రి తనకొక ప్రయోగం ఇచ్చాడన్న విషయం. అది మాత్రం గుర్తుందని ఏమిటి నిదర్శనం? తండ్రి దగ్గరకి తిరిగివచ్చాడుగా!కాని ఋగ్వేద, యజుర్వేద, సామవేదాలు గుర్తులేవు. పూర్వం అన్నీ కంఠతా పట్టే వాళ్ళు కదా!

ఇప్పటికీ అలా కంఠతా పట్టి చెప్పగలిగిన వాళ్ళు లేకపోలేదు. ఒక అబ్బాయి, బ్రహ్మసూత్రాలు మొత్తం, శంకరభాష్యంతో సహా అప్పజెప్పగలడట. సూత్రాలే 555 ఉన్నాయి. వాటిని భాష్యంతో సహా అంటే చాలాకష్టం. 4-3-24 అని అడగండి. ఆ సూత్రాన్ని భాష్యంతో సహా చెప్తాడు. అలా ఇంకో అబ్బాయి భగవద్గీతలోని 700 శ్లోకాలు ముందునుంచి వెనక్కి, వెనుకనుంచి ముందుకీ చెప్పగలడు. కాని చాలామంది ఇవాళ ఏ రోజు అన్నా కంప్యూటర్‌లోనో, సెల్‌లోనో చూస్తారు. మన ఒక శక్తిని వాడకపోతే అది అంతరించిపోతుంది. జ్ఞాపకశక్తిని వాడకపోతే, అది అంతరించిపోతుంది. అది ప్రకృతినియమం.

ఈ విషయం పక్కన పెడితే, శ్వేతకేతు పరిస్థితి ఏమిటి? ఒకటే కళ మిగిలిఉంది అతనిలో.

**తయైతర్హివేదాన్నానుభవసి –** అంత తక్కువ మేధాశక్తితో నేర్చుకున్నవి

గుర్తుంచుకోలేకపోయావు. న అనుభవసి– గుర్తు తెచ్చుకోలేకపోయావు. కాని బెంగపడకు. మేధాశక్తి పూర్తిగా పోలేదు. అది అవ్యక్తరూపంలో ఉంది. మళ్ళీ మనస్సుని పోషిస్తే, నీ మేధాశక్తి నీకు తిరిగి వస్తుంది. ఇప్పుడు అన్వయ పద్ధతి ఉపయోగించబోతున్నాడు అని చూశాము.

**అశానాథ మే విజ్ఞాస్యసీతి–** ఇప్పుడు అన్నం తినిరా. నా ఆజ్ఞని పాటించి, నా సూచనలను ఆచరణలో పెట్టాక, నీ జ్ఞాపకశక్తి తిరిగివచ్చినట్టు నీకే తెలుస్తుంది. అశాన అంటే తిను; అథమే విజ్ఞాస్యసి – తర్వాత నా ఉపదేశాన్ని తెలుసుకోగలుగుతావు.

**మంత్రం–4– సహాశా –** సహ ఆశ అంటే అన్నం తిన్నాడు.

**అథ హైనముపససాద–** అన్నం తిన్నాక (పదిహేనురోజుల తర్వాత) తండ్రి దగ్గరకు తిరిగి వచ్చాడు. ఉద్ధాలకుడు ఏం చేశాడు? ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం చెప్పమన్నాడు. అతనేం చెప్పాడు?

**తగ్ం హ యత్కిఞ్చ పప్రచ్ఛ సర్వగ్ం హ ప్రతిపేదే –** తండ్రి ఏది అడిగితే, అది అప్పజెప్ప గలిగాడు. అంటే అన్వయ పద్ధతి పని చేసింది. అన్నం తిన్నాడు. మేధాశక్తి తిరిగి వచ్చింది.

**అన్న అభావే మేధా అభావః**

**అన్న భావే మేధా భావః**

**తస్మాత్ అన్నమయగ్ం హి (సోమ్య) మనః –** అందువల్ల మనస్సుకి కారణం అన్నమే.

**మంత్రం–5– తగ్ం హెూ వాచ యథాసోమ్య మహతోఽభ్యాహిత స్యైకమఙ్గారం ఖద్యోతమాత్రం పరిశిష్టం–** ఇప్పుడు గురువు తను ఇచ్చిన ఉదాహరణతో కలుపుతున్నాడు. ఇంతకుముందు ఏం చూశాం? పెద్ద జ్వాల ఆగిపోయి, ఒక్క బొగ్గు మాత్రం మండుతోంది. దాని మంట తగ్గినా, అది పూర్తిగా ఆరిపోలేదు. అంత చిన్న బొగ్గునుంచి మళ్ళీ అగ్నిని ప్రజ్వలింప జేయవచ్చు. ఎలా?

**తం తృణైరుపసమాధాయ –** దాన్ని నూనెతో కాకుండా, చిన్న సమిధలతో పెద్దది చేయాలి.

**ప్రాజ్వలయేత్–** దాన్ని మళ్ళీ ప్రజ్వలింపచేయవచ్చు. ఎప్పుడైతే అది మళ్ళీపెద్ద జ్వాలగా అవుతుందో అప్పుడు అది తనను తాను ప్రకాశింప జేసుకోవటమే

కాక, చుట్టూ ఉన్నవాటిని కూడా ప్రకాశింపజేయగలదు.
**తేన తతోఽపి బహు దహేత్–** అందువల్ల అది తనకంటే పెద్దదానిని కూడా దహింపజేయగలదు. అదే జరిగింది నీ విషయంలో కూడా.
**మంత్రం–6– ఏవగ్ం సోమ్యతే షోడశానాం కలానామేకా కలాఽతిశిష్టాఽభూత్ –** అక్షరాలా అలాగే నీకున్న 16 కళలలో కూడా ఒక్క కళ మాత్రం మిగిలి ఉంది. అందువల్ల నీ మేథాశక్తి 1/16కి పడిపోయింది. దాని తర్వాత ఏమయింది?
**సాఽన్నేనోపసమాహితా ప్రాజ్వాలీ–** అగ్ని విషయంలో ఎండుగడ్డి వాడాలి. ఇక్కడ అన్నం, అందువల్ల అన్నంతో ప్రజ్వలింపజేశావు.
**తయైతర్హివేదాననుభవసి –** అన్నంతో ప్రజ్వలింపజేయటం వల్ల నీ జ్ఞాపకశక్తి తిరిగివచ్చింది.

దీనివల్ల నిరూపించబడిన విషయం ఏమిటి? మన అక్షరలక్షల వాక్యం వస్తుంది.
**అన్నమయగ్ం హి సోమ్య మన ఆపోమయః ప్రాణస్తేజోమయీ వాగితి**

ఈ ప్రయోగం ద్వారా అన్నం మనస్సుకూ, నీరు ప్రాణంకూ శక్తినిస్తాయని నిరూపించబడింది. తేజస్సు వాక్కుకు శక్తినిస్తుందని కలుపుకోవాలి. దీని ద్వారా అంతకుముందు చూసిన దశలు మళ్ళీ ఒక్కసారి గుర్తుచేసుకుందాం. అన్నం అంటే పృథివీ అని మర్చిపోకూడదు.

దీనితో ఉద్ధాలకుడు అధ్యారోప అపవాదాన్ని ముగిస్తున్నాడు. శ్వేతకేతు స్పందన ఏమిటి?
**తద్ధస్య విజజ్ఞావితి విజజ్ఞావితి –** తండ్రి బోధను శ్వేతకేతు బాగా తెలుసుకున్నాడు. బాగా తెలుసుకున్నాడు. దీనితో వేదాంతబోధలో మొదటిభాగం ముగిసింది. ఏమిటది? 'బ్రహ్మ సత్యం. జగత్ మిథ్య; దాని తర్వాత ఏం అర్థం చేసుకోవాలి? **జీవో బ్రహ్మైవ నాపరః**

ఎనిమిదవఖండం నుంచి తత్త్వమసి మహావాక్యం మొదలవుతుంది.

**అష్టమః ఖణ్డః (8)**

**ఉద్దాలకో హారుణిశ్శ్వేతకేతుం పుత్రమువాచ స్వప్నాన్తం మే సోమ్య విజానీహీతి॥ యత్రైతత్పురుష స్స్వపితి నామ సతా సోమ్య తదా సమ్పన్నో భవతి స్వమపితో భవతి తస్మాదేనగ్ం స్వపితీత్యాచక్షతే స్వగ్ం హ్యపీతో భవతి**

**॥1॥ స యథా శకునిస్సూత్రేణ ప్రబద్ధో దిశం దిశం పతిత్వాఽన్యత్రాయతనమలబ్ధ్వా బన్ధనమేవోపశ్రయత ఏవమేవ ఖలు సోమ్య తన్మనో దిశం దిశం పతిత్వాఽన్యత్రాయతనమలబ్ధ్వా ప్రాణమేవోపశ్రయతే ప్రాణబన్ధనగ్ం హి సోమ్య మన ఇతి ॥2॥ అశనాపిపాసే మే సోమ్య విజానీహీతి యత్రైతత్పురుషోఽశిశిషతి నామాప ఏవ తదశితం నయన్తే తద్యథాగోనాయోఽశ్వనాయః పురుషనాయ ఇత్యేవం తదప ఆచక్షతేఽశనాయేతి తత్రైతచ్ఛుఙ్గ ముత్పతితగ్ం సోమ్య విజానీహి నేదమమూలం భవిష్యతీతి ॥3॥ తస్యక్వ మూలగ్ం స్యాదన్యత్రాన్నాత్॥ ఏవమేవ ఖలు సోమ్యాన్నేన శుఙ్గేనాపో మూలమన్విచ్ఛాద్భిస్సోమ్య శుఙ్గేన తేజో మూలమన్విచ్ఛ తేజసా సోమ్య శుంగేన సన్మూలమన్విచ్ఛ॥ సన్మూలాస్సోమ్యేమాస్సర్వాః ప్రజాస్సదాయతనాస్సత్ప్రతిష్ఠాః ॥4॥ అథ యత్రైతత్పురుషః పిపాసతి నామ తేజ ఏవ తత్పీతం నయతే తద్యథా గోనాయోఽశ్వనాయః పురుషనాయ ఇత్యేవం తత్తేజ అచష్ట ఉదన్యేతి తత్రైతదేవ శుఙ్గముత్పితితగ్ం సోమ్య విజానీహి నేదమమూలం భవిష్యతీతి ॥5॥ తస్య క్వ మూలగ్ం స్యాదన్యత్రాద్భ్యోఽద్భిస్సోమ్య శుఙ్గేన తేజో మూలమన్విచ్ఛ తేజసా సోమ్య శుఙ్గేన సన్మూలమన్విచ్ఛ సన్మూలాస్సోమ్యేమాస్సర్వాః ప్రజాస్సదాయతనాస్సత్ప్రతిష్ఠా యథా ను ఖలు సోమ్యేమాస్తిస్రో దేవతాః పురుషం ప్రాప్య త్రివృత్త్రివృదేకైకా భవతి తదుక్తం పురస్తాదేవ భవతి॥ అస్య సోమ్య పురుషస్య ప్రయతో వాఙ్మనసి సమ్పద్యతే మనః ప్రాణే ప్రాణస్తేజసి తేజః పరస్యాం దేవతాయామ్ ॥6॥ స య ఏషోఽణిమైతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో ఇతి భూయ ఏవ మా భగవాన్ విజ్ఞాపయత్వితి తథా సోమ్యేతి హోవాచ ॥7॥**

2–7 ఖండాల్లో తత్ పద విచారం అయింది. సత్‌బ్రహ్మ జగత్‌కారణం కాబట్టి

**సత్‌బ్రహ్మ విజ్ఞానేన సర్వ విజ్ఞానం భవతి**

అని తెలుసుకున్నాం. ఇప్పుడు–

**కథం తత్ బ్రహ్మవిజ్ఞానం భవతి?**

**ఆత్మవిజ్ఞానేన బ్రహ్మవిజ్ఞానం భవతి**

ఆ బ్రహ్మజ్ఞానం పొందటం ఎలా అంటే ఆత్మజ్ఞానం పొందితే, బ్రహ్మజ్ఞానం పొందినట్లే.

**త్వం పద విజ్ఞానేన తత్ పదార్థ విజ్ఞానం భవతి**

ఇప్పుడు గురువు బాధ్యత జీవాత్మ, పరమాత్మల ఐక్యం నిరూపించాలి.

8వ ఖండం జీవస్వరూప విచారాన్ని, 9-16 ఖండాలు జీవాత్మ, పరమాత్మ ఐక్యాన్ని బోధిస్తాయి. అంటే త్వం పద విచారం, అసి పద విచారం వస్తాయి.

దశోపనిషత్తులలో ఛాందోగ్యోపనిషత్తు, బృహదారణ్యక ఉపనిషత్తులు ప్రత్యేకమైనవి. అవి చాలా పెద్ద ఉపనిషత్తులే కాక, వాటిల్లో కొన్నిచోట్ల కొంత భాగం ప్రత్యేకంగా, భిన్నంగా ఉంటాయి. అలా వేరే ఉపనిషత్తులో చూడము. ఆ ప్రత్యేకత ఏమిటి? అవి కొన్ని సంస్కృత పదాలను తీసుకుని వాటికి నిఘంటువులో ఉన్న సాధారణ అర్థం కాకుండా, వ్యాకరణపరంగా వచ్చే విశ్లేషణ కాకుండా, ప్రత్యేక నిర్వచనం, ప్రత్యేక అర్థం ఇస్తుంది. దీని ద్వారా అది చెప్పదలచుకున్న ప్రత్యేకభావాన్ని అందచేస్తుంది. ఇటువంటి భాగాన్ని నిర్వచన భాగం అనవచ్చు.

దీన్ని తెలుగులో పదాలగారడీ అంటారు. సామాన్య నిర్వచనాన్ని వదిలేసి, విశేష నిర్వచనం ఇస్తుంది. ఛాందోగ్యంలో ఆ ప్రయోగం ఆరో అధ్యాయంలో, ఎనిమిదో ఖండంలో వస్తే, బృహదారణ్యకంలో శాకల్య బ్రాహ్మణం అనే ఖండంలో వస్తుంది. ఈ పదాల గారడీ అన్ని భాషల్లోనూ ఉంటుంది. ఉదాహరణకు ఇంగ్లీషులో అవుట్ స్టాండింగ్ స్టూడెంట్ పదం తీసుకుందాం. ఒకబ్బాయి తను అవుట్‌స్టాండింగ్ స్టూడెంట్‌నని గొప్పగా చెప్పుకుంటాడు. అదెలా సాధ్యం, నువ్వెప్పుడూ అన్ని సబ్జెక్టులలో ఫెయిల్ అవుతూ ఉంటావు కదా!' అని ఎవరో అడిగారు. 'అవును, అందుకే అన్నాను. ప్రతి టీచరు నన్ను స్టాండ్ అవుట్(బయటనిల్చో) అంటుంది. అలా అవుట్‌స్టాండింగ్ స్టూడెంట్‌నయ్యాను' అన్నాడు. అవుట్‌స్టాండింగ్ అంటే అసలు చాలా తెలివైన విద్యార్థి అని అర్థం.

ఇక్కడ ఉపనిషత్తు అలా మూడు పదాలను తీసుకుంది. అవి స్వపితి, అశనాయా, ఉదన్య. ఈ ఖండంలో ఒక్కొక్క మంత్రంలో ఒక్కొక్క పదాన్ని ప్రత్యేకంగా విశేష నిర్వచనంతో వివరిస్తుంది.

మాములుగా, జీవితం అంటే మరణించేదాకా లేచామా, తిన్నామా, పడుకున్నామా అన్నట్టు ఉండకూడదు అంటాము. ఇవి మనకు చాలా సుపరిచితమైన పదాలు. ఈ నాలుగు పదాలనే తీసుకుని ఉపనిషత్తు వేదాంతసారం బోధించింది. ఎంత అద్భుతం! బ్రహ్మ అంటే ఏమిటో వీటిల్లోనే కాచి వడబోసింది. ఉపనిషత్తు తీసుకున్న పదాలు, వాటి వరుసక్రమం– పడుకున్నామా, తిన్నామా, త్రాగామా, మరణించామా!

మొదటి మంత్రంలో ఐక్యం రెండు పద్ధతుల్లో చూపిస్తున్నది.

1. సుషుప్తి విచారణ 2. స్వపితి నామ నిర్వచనం.

సుషుప్తి విచారణ ద్వారా ఒక వ్యక్తి సుషుప్తిలో శుద్ధసత్‌లో లయమవుతాడని తెలుస్తుంది. శుద్ధసత్ అంటే జగత్‌కారణం అయిన బ్రహ్మలో.

స్వపితి నామ నిర్వచనం ద్వారా ఒక వ్యక్తి నిద్రలో తన స్వస్వరూపంలో లయమవుతాడని తెలుస్తుంది. రెండూ రెండు సమాంతర అంశాలు. ఇప్పుడు ఈ రెండింటినీ కలిపితే మనకి వచ్చే దశలు చూద్దాము.

| | | |
|---|---|---|
| **సత్** | = | స్వస్వరూపం |
| **స్వస్వరూపం** | = | సత్ |
| **జీవస్వరూపం** | = | సత్ స్వరూపం |

అందువల్ల జీవ స్వరూప జ్ఞానేన బ్రహ్మ స్వరూప జ్ఞానం భవతి.

**బ్రహ్మ స్వరూప జ్ఞానేన సర్వజ్ఞానం భవతి**

**తస్మాత్ జీవస్వరూప జ్ఞానేన సర్వజ్ఞానం భవతి**

ఈ నేపథ్యంతో మంత్రంలోకి వెళదాము.

**ఉద్దాలకోహారుణిశ్వేతకేతుం పుత్రమువాచ–** గురువే తన బోధని కొనసాగిస్తున్నాడు. ఎందుకంటే బోధ పూర్తికాలేదు కాబట్టి. ఉపనిషత్తు మళ్ళీ ఒకసారి వాళ్ళ పేర్లను, వాళ్ళ అనుబంధాన్ని పరిచయం చేస్తున్నది.

అరుణుని పుత్రుడైన (ఆరుణి) ఉద్దాలకుడు. తన పుత్రుడు, శిష్యుడు అయిన శ్వేతకేతువుతో అన్నాడు.

**స్వప్నాన్తం మే సోమ్య విజానీహితి –** ఓ సోమ్య, నేను చెపుతుండగా సుషుప్తి గురించి తెలుసుకో. మే అంటే **మమ వచనాత్–** నా బోధనుంచి తెలుసుకో. స్వప్నాంతం అంటే సుషుప్తి ఎలా అయింది? జాగ్రదావస్థ, స్వప్నంలో ముగుస్తుంది. స్వప్నావస్థ సుషుప్తిలో ముగుస్తుంది.

**స్వప్నస్య అంతః యస్మిన్ స్థానే తదస్థానం స్వప్నాంతం**

సుషుప్తిలోకి వెళ్ళటం తేలిక. సుషుప్తిని అర్థం చేసుకోవటం కష్టం. అది ఎందుకు అర్థం చేసుకోవాలి? కార్యం ఎప్పుడూ కారణంలో లయమవుతుంది. కుండ మట్టిలో లయమవుతుంది. అందువల్ల ఒక కార్యం ఎందులో లయమయితే, అది దాని అధిష్ఠాన కారణం. అదీ సూత్రం. అందువల్ల జీవి స్వస్వరూపం అర్థం చేసుకోవాలంటే, జీవి ఎందులో లయమవుతుందో చూడాలి. జీవి జాగ్రదావస్థలో లయమవదు. అప్పుడు ఇంద్రియాలు, మనస్సు పూర్తిగా పనిచేస్తుంటాయి. స్వప్నావస్థలో లయమవదు. అప్పుడు ఇంద్రియాలు పడుకున్నా, మనస్సు పనిచేస్తుంటుంది. సుషుప్తిలోనే జీవి లయమవుతుంది. అందుకని సుషుప్తిలో ఎందులో లయమవుతుందో చూడాలి. జీవి సత్‌బ్రహ్మలో లయమవుతుందని గురువు చెపుతున్నాడు. ఇప్పుడు మంత్రం చూద్దాం.
**యత్రైతత్పురుషః స్వపితినామ –** ఏ కాలంలో అయితే ఒక వ్యక్తి నిద్రిస్తున్నాడో,
**సతా సోమ్య తదా సమ్పన్నో భవతి –** అతను శుద్ధసత్‌లో లయమవుతున్నాడు. జాగ్రదావస్థలో స్థూలశరీరంతో, స్వప్నావస్థలో సూక్ష్మశరీరంతో లయమవుతాడు. కాని సుషుప్తికి వచ్చేసరికి ఇంద్రియాలు లయమవుతాయి. మనస్సు లయమవుతుంది. రాగద్వేషాలు లయమవుతాయి. కర్తృత్వ భోక్తృత్వ భావాలు ఉండవు. మనోబుద్ధి చిత్త అహంకారాలు ఉండవు. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, అంతఃకరణం, కర్తృత్వం, భోక్తృత్వం, ప్రమాతృత్వం అన్నీ లయమవుతాయి.

చిదాభాస కూడా లయం అవుతుంది. అంటే చైతన్యం కూడా (లయమవదు కాని) ప్రకటితమవదు. ఎందుకంటే దాన్ని ప్రతిబింబింపచేసే మనస్సు లయమవుతుంది. అతనిలో చైతన్యం లేదు అనకూడదు, చైతన్యం ప్రకటితమవదు.

ఆనందం కూడా పూర్తిగా ప్రకటితమవదు. సుషుప్తిలో కలిగే ఆనందం లేచాకే తెలుస్తుంది. సుషుప్తిలో ఉండగా తెలియదు. ఇంకా మిగిలేది శుద్ధసత్ మాత్రమే సత్ కూడా నేను ఉన్నాను అని చెప్పదు. ఏదీ లేనప్పుడు సత్ మాత్రమే ఉందని చెప్పటం ఎందుకు? ప్రళయంలో, అంటే సృష్టికి ముందు–
**సదేవసోమ్యేదమగ్ర ఆసీత్ –**సజాతీయ, విజాతీయ, స్వగతబేధరహిత సత్

మాత్రమే ఉంది. పైగా సత్ కూడా లేదంటే జాగ్రత్, స్వప్నావస్థలు రాలేవు. అసత్ నుంచి సత్ రాలేదు.

**రాహుగ్రస్తదివాకరేందుసదృసో మాయాసమాచ్ఛాదనాత్।**
**సన్మాత్రాః కరణోఽ పసంహరణతో యోఽ భూత్సుషుప్తః పుమాన్॥**
**– దక్షిణామూర్తి స్తోత్రం**

సన్మాత్రః అంటే శుద్ధసత్. నేను నిద్రలో ఎందులో లయమయ్యాను? శుద్ధసత్‌లో. అది నా స్వస్వరూపం. అప్పుడు నేను ఉన్నానని ఎలా చెప్పగలను? సుషుప్తిలో నేను లేకపోతే, లేచాక 'నేను బాగా నిద్రపోయాను,' అని చెప్పలేను. నేను బాగా నిద్రపోయాను అని చెప్పగలుగుతున్నానంటేనే, నా జీవత్వం తెలియకుండా, నేను ఉన్నట్లు అర్థం.

**తదా సమ్పన్నో భవతి –** తదా అంటే శుద్ధసత్. దాన్ని బ్రహ్మ అంటారు. అంటే సత్‌బ్రహ్మ.

**స్వమపితో భవతి –** స్వమ్ అంటే స్వరూపం. తన స్వరూపంలో లయం అవుతున్నాడు. దీనివల్ల చాలా ముఖ్యమైన విషయం చెపుతున్నది ఉపనిషత్తు. సుషుప్తిలో అనుభవించే స్వరూపమే మన స్వస్వరూపం. సుషుప్తిది స్వస్వరూపం అయితే, జాగ్రద్, స్వప్నావస్థలలోది ఏమిటి? దాన్ని ఆగంతుక రూపం అంటారు. మనం తల్లిగా, భార్యగా, ధరించే పాత్రలు మన అసలు స్వరూపం కాదు! కాని మనం సుషుప్తిలోది తాత్కాలికం, జాగ్రదావస్థలోది శాశ్వతం అనుకుంటున్నాము.

ఈ స్థూల శరీరం పుట్టుకతో వచ్చింది మానవజీవితం. దాని మరణంతో ముగుస్తుంది మానవ అనుభవం. అందువల్ల వ్యక్తిగా మన జీవితం రాకపోకలకు గురయ్యే తాత్కాలికమైన స్వభావం. నేను ఎవరు? నేనొక ఆధ్యాత్మిక జీవిని. నేను శద్ధసత్‌ని. మనిషి పుట్టుక ముందూ, మనిషి పుట్టుక తర్వాత కూడా ఉంటాను.

ఇంకో విధంగా చూసినా కూడా, జాగ్రదావస్థలో ఆనందం లేదు, స్వప్నావస్థలో ఆనందం లేదు. సుషుప్తిలో మాత్రమే సంపూర్ణ ఆనందం కలుగుతుంది. అందువల్ల సుషుప్తి మన అసలు స్వరూపం అయితే, సుషుప్తిలో కలిగే ఆనందం మన అసలు స్వరూపం అవాలి. స్వమ్ అంటే **స్వరూపం అపితః** అంటే లయమవటం. **స్వమపితో భవతి** అంటే స్వస్వరూపంలో

లయమవటం. మన స్వరూపంలో లయమవటం వల్ల సుషుప్తికి ఒక పేరు వచ్చింది. అది స్వపితి.

ఇప్పుడు స్వపితి పద నిర్వచనం ద్వారా ఇదే విషయం చెబుతున్నది. **తస్మాదేనగ్ం స్వపితీత్యాచక్షతే –** అందువల్ల ఆ వ్యక్తిని నిద్రపోతున్నాడు అంటారు. స్వపితి అన్న పదం అసలు స్వప్ ధాతువునుంచి వచ్చింది. దాని అర్థం నిద్రపోతున్నాడు. కాని ముందే చెప్పినట్టుగా, ఇక్కడ ఉపనిషత్తు పదాలగారడీ చేసి దాని గౌణ అర్థం తీసుకుంది.

**స్వపితి = స్వ + అపితి**

**స్వమ్ అపీతోభవతి ఇతి స్వపితి.**

స్వమ్ అంటే స్వరూపం. అపీతోభవతి అంటే లయమవటం. అంటే స్వస్వరూపంలో లయమవటం అని ఇప్పుడే చూశాము. అందుకని ఇటువంటి వాడిని (నిద్రపోతున్నవాడిని) స్వపితిః అంటారు. సుషుప్తిలో ఉండేది శుద్ధసత్ మాత్రమే అన్నాం. స్వపితిలో స్వస్వరూపంలో లయం అవుతుంది అంటున్నాం. కాబట్టి–

సుషుప్తి = స్వపితి
సత్‌బ్రహ్మ = స్వస్వరూపం
స్వస్వరూపం = సత్‌బ్రహ్మ
జీవస్వరూపం = బ్రహ్మస్వరూపం

అందువల్ల జీవ స్వరూప జ్ఞానేన బ్రహ్మ స్వరూప జ్ఞానం భవతి

**బ్రహ్మస్వరూప జ్ఞానేన సర్వజ్ఞానం భవతి**

**తస్మాత్ జీవ స్వరూపజ్ఞానేన సర్వజ్ఞానం భవతి**

**మంత్రం–2–** జీవాత్మ సుషుప్తిలో స్వస్వరూపంలో లయమవుతుందనీ, అది ఆనంద స్వరూపమనీ చూశాము. కాని ఆ విషయం తెలియక, శాంతి, భద్రత, ఆనందాల కోసం బాహ్యప్రపంచం వెంట పరుగులు తీస్తున్నాము. జీవ వేషం వేసుకుని, అంటే దేహేంద్రియ మనోబుద్ధులే నేను అనుకుని కర్తృత్వ, భోకృత్వ బాధ్యతలు నెత్తిన వేసుకుని పరుగులు తీస్తున్నాము. అవి బయట దొరకవని తెలిశాక, జీవి ఏం చేస్తున్నది? వెనక్కి తన స్వరూపానికి వచ్చి అందులో లయమవుతున్నది. అదే సత్ స్వరూపం. ఈ విషయం ఒక అందమైన ఉదాహరణతో ఇచ్చింది ఉపనిషత్తు.

ఒక రాటకు దారంతో కట్టబడిన పక్షి దిక్కుదిక్కుకూ ఎగిరి, ఎక్కడా ఆశ్రయం దొరకక, కట్టబడిన రాటకే తిరిగివస్తుంది.

**స యథా శకునిః –** శకుని అంటే మనకు తెలిసిన మహాభారతంలోని శకుని కాదు. ఒక పక్షి.

**సూత్రేణ ప్రబద్ధః –** ఒక రాటకు కట్టబడి ఉన్నది.

**దిశం దిశం పతిత్వా–** దిక్కు, దిక్కుకూ ఎగిరి,

**అన్యత్రాయనమలబ్ధ్వా–** వేరే ఆశ్రయం ఏదీ దొరకక,

**బన్ధనమేవోపశ్రయతి–** ఏ రాటకైతే కట్టబడి ఉందో, దానికే తిరిగి వస్తుంది. సముద్రం దగ్గర ఉన్న ఒక ఓడలో ఒక కాకి వాలి ఉంది. దానికి తెలియ నప్పుడు ఓడ సముద్రంలోకి వచ్చేసింది. తర్వాత తెలిసి, ఒడ్డుకి వెళదామని ఎంత దూరం ఎగిరినా నేల కనపడక, తిరిగి ఓడదగ్గరికే వస్తుంది. దీన్ని **సముద్రగర్భస్థ కాకన్యాయః** అంటారు.

అలాగే మనిషి జాగ్రదావస్థలో అనేక సుఖాల వెంట పరుగులు తీసి, చివరికి తనకి ఆశ్రయమైన సత్‌బ్రహ్మ దగ్గరికే (సుషుప్తిలో) వస్తాడు.

**ఏవమేవ ఖలుసోమ్య –** ఓ సోమ్య! అదే విధంగా

**తన్మనో దిశం దిశం పతిత్వా–** జీవాత్మ దిక్కు దిక్కుకూ పరుగెత్తి– ఇక్కడ మనసు అంటే జీవాత్మ లేదా చిదాభాస.

**అన్యత్రాయతనమలబ్ధ్వా–** వేరే ఆశ్రయం దొరకక చిత్ దగ్గరికే వస్తుంది. చిత్తే చిధాభాస స్వస్వరూపం.

**ప్రాణమేవోపశ్రయతే–** ఇక్కడ ప్రాణం అంటే ఆత్మ. ఎలాంటి ప్రయోగాలు చేస్తోందో చూడండి– ప్రాణం అంటే కేనోపనిషత్తులోని ప్రాణస్య ప్రాణః – ఎందుకు ప్రాణం దగ్గరికి వచ్చింది?

**ప్రాణబన్ధనగ్ం హి సోమ్య మన ఇతి –** ఎందుకంటే చిదాభాస చిత్‌తో ముడిపడి ఉంది.

ఉదాహరణకు అద్దం తీసుకోండి. అద్దంలో మీ మొహం ప్రతిబింబిస్తుంది. ఇప్పుడు ప్రతిబింబం రెండింటితో అనుబంధం పెంచుకోవచ్చు. మీ అసలు మొహంతో, లేదా అద్దంతో.

అలాగే చిదాభాస కూడా రెండింటితో అనుబంధం పెంచుకోవచ్చు.

దేహేంద్రియ మనోబుద్ధులతో, లేదా సత్‌తో. దేంతో పెంచుకుంటున్నదో వేరే చెప్పాలా?

అందుకని ఉపనిషత్తు చెపుతున్నది– జీవాత్మ పరమాత్మతోనే ముడిపడి ఉందని. బంధనం అంటే అనుబంధం. ప్రాణః అంటే చిత్, మనః అంటే చిదాభాస. చిదాభాస చిత్‌తో కలిసినది. అందుకని అహం బ్రహ్మోస్మి అనుకోవాలి.కాని, అహం జీవోస్మి అనుకోకూడదు.

**మంత్రం–3** – బ్రహ్మ గురించి ఉపనిషత్తు ఎంత మామూలు విషయాలు తీసుకుందో చూడండి. ముందేమో నిద్ర గురించి చెప్పింది. ఇప్పుడు ఆకలి, దాహం గురించి చెప్పబోతున్నది. ఈ మూడు అనుభవాలు నాకు అవలేదని ఎవరు చెప్పలేరు కదా! అందుకని తెలిసిన మామూలు విషయాలలోంచి తెలియని అసాధారణ విషయంలోకి వెళుతున్నది.

ముందు మంత్రంలో స్వపితి తీసుకుని, దానికి విశేష అర్థం ఇచ్చినట్టుగా, ఇక్కడ అశనాయ పదం తీసుకుని దానికి విశేష అర్థం ఇస్తున్నది. అశనాయ పదం అశ్ ధాతువు నుంచి వచ్చింది. అశ్ అంటే తినటం. అశనాయ అంటే అశితుమ్ ఇచ్ఛ – అంటే తినాలనే ఆశ. తినాలని ఎప్పుడనిపిస్తుంది? ఆకలి వేస్తే, ఆకలి ఎప్పుడు వేస్తుంది? తిన్నదంతా అరిగిపోయినప్పుడు. తిన్నది ఎప్పుడు అరిగిపోతుంది? జీర్ణకోశరసాలు అన్నాన్ని జీర్ణించి శరీరం అంతటికీ అందచేసినప్పుడు. అందుకని ఉపనిషత్తు అశనాయ అన్న పదాన్ని అశ+నాయ చేసింది. అశ అంటే అశితమ్ అన్నం. అంటే తిన్న అన్నం.నయ అంటే **నయతి ఇతి నాయాః** అంటే తీసుకువెళ్ళేది. ఇప్పుడు మొత్తం కలిపి చూస్తే అశనాయ అంటే అశితం అన్నం నయతి ఇతి అశనాయ. అశనాయ అంటే అసలు అర్థం ఆకలి. కాని విశేష అర్థం – తిన్న అన్నాన్ని శరీరానికి తీసుకుపోయే జీర్ణకోశరసాలు.

ఉదాహరణకు డబ్బే సర్వస్వం అంటాము. అంటే డబ్బునే తినగలమా? డబ్బు అన్నింటికీ మూలకారణం. అలాగే ఆకలి అనే కార్యానికి జీర్ణకోశరసాలు కారణం. అందుకని ఉపనిషత్తు ఆకలి అర్థాన్ని తీసుకోకుండా, ఆకలిని కలుగచేసే జీర్ణకోశ రసాలని అర్థం తీసుకుంది.

ఎందుకు ఇలా చేసింది? ఎందుకంటే, దీనివల్ల శరీరానికి పోషణ ఇచ్చేది అన్నమే అని తెలియటానికి. అప్పుడు శరీరం కార్యం అవుతుంది.

అన్నం కారణం అవుతుంది. తిన్న అన్నం మూడుగా విభజింపబడి, శరీరానికి దోహదం చేస్తుందని ఈ అధ్యాయంలోనే అంతకుముందు చూశాము.

**అన్నమశితమ్ త్రేధా విధీయతే 6-5-1**

అక్కడ కూడా శరీరం కార్యం, అన్నం కారణం అని చూశాము. అదే అర్థాన్ని అశనాయా పదం ద్వారా చెపుతున్నది. ఇప్పుడు ఈ నేపథ్యంతో మంత్రంలోకి వెళదాము.

**అశనాపిపాసే మే సోమ్య విజానీహీతి–** ఓ సోమ్యా! నా నుంచి రెండు అనుభవాల గురించి తెలుసుకో.అశనా(య) అంటే ఆకలి; పిపాస అంటే దాహం.

**యత్రైతత్పురుషోఽ శిశిషతి నామ–** ఒక వ్యక్తికి ఆకలి వేస్తే అతన్ని అశిశిషతి అంటాము. అశితుమ్ ఇష్టతి అశిశిషతి. అశితుమ్ ఇష్టతి అంటే అన్నం తినాలనే కోరిక. నాకు ఆకలి వేస్తోంది అంటే ఏమిటి అర్థం? నాకు అన్నం తినాలనే కోరిక ఉంది. తినాలనే కోరిక ఉంది. తిన్నాడు. తిన్నాక ఏమవుతుంది?

**ఆప ఏవ తదశితం నయన్తే–** తిన్న అన్నాన్ని శరీరం జీర్ణించాలి. దానికి కొన్ని జీర్ణరసాలు ఉన్నాయి. ఉపనిషత్తు 'ఆప' పదం వాడింది. ఆపః అసలు అర్థం నీరు. కాని ఇక్కడ నీరు కాదు. ద్రవరూపంలో ఉన్న జీర్ణకోశరసాలు. ఈ రసాలు అన్నాన్ని జీర్ణించి, అనేక పోషక పదార్థాలుగా చేసి, శరీరం అంతటికీ చేరవేస్తాయి. అందుకని ఈ రసాలను అశనాయ అంటున్నది ఉపనిషత్తు. ముందే చూసినట్టుగా అసలు అర్థం ఆకలి. కాని ఇక్కడ ఆకలిని కలుగచేసే రసాలు. ఇవి శరీరానికి జీర్ణించిన అన్నాన్ని కొరియర్ సర్వీస్‌లాగా చేరవేస్తాయి. నాయ పదాలు వచ్చే కొన్ని పదాలను ఉదాహరణగా ఇచ్చింది ఉపనిషత్తు.

**తద్యథాగోనాయోఽ శ్వనాయః; పురుషనాయః –** గోవులను తోలేవాడు గోనాయుడు, గుఱ్ఱాలను తోలేవాడు అశ్వనాయుడు, మనుష్యులను నడిపించేవాడు (తోలేవాడు అనకూడదు) నాయకుడు, పురుషనాయుడు అయినట్టుగా–

**ఇత్యేవం తదప ఆచక్షతేఽ శనాయేతి–** ఈ విధంగా అన్నాన్ని తీసుకువెళ్ళే 'ఆప'ను(రసాలను) అశనాయ అని అంటారు.

**తత్రైతచ్ఛుఙ్గముత్పతితగ్ం సోమ్య విజానీహి–** ఓ సోమ్యా! దీన్ని బట్టి శరీరం కార్యం అని తెలుసుకో. శుంగం అంటే కార్యం. ఏది కార్యం? శరీరం. ఉత్పత్తిం అంటే పుట్టింది అని అర్థం. శరీరం కార్యం అయితే, అన్నం కారణం. ఎందుకంటే తిన్న అన్నాన్ని శరీరానికంతటికీ తీసుకు వెళుతుంది అని చూశాము కదా!

**నేదమమూలం భవిష్యతీతి –** అందుకని ఇది కారణం లేనిది కాదు. ఇదమ్ అంటే ఈ శరీరం. కార్యంగా చెప్పబడిన ఈ శరీరం; న అమూలం భవిష్యతి– మూలం (కారణం) లేకుండా పుట్టలేదు. ఈ అధ్యాయంలో అన్నం అన్నప్పుడల్లా పృథివీతత్త్వం అనుకోవాలని చూశాము. ఇప్పుడు దీన్నించి అసలు మూలకారణానికి వెనక్కి వెళతాము.

**మంత్రం 4 – తస్య క్వ మూలగ్ం స్యాత్–** ఈ శరీరానికి మూలం ఏమిటి? **అన్యత్రాన్నాత్ –** అన్నం కాకుండా వేరే ఏ కారణం కాగలదు?

అంటే శరీరానికి అన్నమే కారణం. ఆశనాయ నిర్వచనం ద్వారా ఈ జవాబుకు వచ్చాము. శరీరం నుంచి అన్నానికి వెళ్ళాలి. కుండనుంచి మట్టికి వెళ్ళాలి అంటే ఏమిటి అర్థం? మట్టినుంచే కుండ పుట్టింది. మట్టిలోనే కలుస్తుంది. మట్టికి భిన్నంగా కుండ లేదు అని అర్థం చేసుకోవాలి. అలాగే శరీరం నుంచి అన్నానికి వెళ్ళాలి అంటే శరీరం అన్నం నుంచి పుట్టింది. అన్నమే స్థితి కారణం. అన్నంలోనే లయమవుతుంది. అన్నానికి భిన్నంగా శరీరం లేదు. అంటే శరీరం నుంచి అన్నానికి ఎప్పుడైతే దృష్టి మరల్చామో, అప్పుడే శరీరం వాచాఽ ఽ రమ్భణం వికారో నామధేయం అవుతుంది. అలా వెనక్కి మూల కారణంలోకి వెళ్ళాలి.

**ఏవమేవఖలుసోమ్య –** ఓ సోమ్యా, ఇదే విధంగా –

**అన్నేన శుఙ్గేనాపో మూలమన్విచ్ఛ –** శుంగం అంటే కార్యం, మూలం అంటే కారణం. అన్విచ్ఛ –అన్వేషించు. అందువల్ల అన్నమనే కార్యానికి, నీరనే కారణాన్ని అన్వేషించు.

**అద్భిస్సోమ్యశుఙ్గేన తేజోమూలమన్విచ్ఛ –** నీరనే కార్యానికి, అగ్ని అనే కారణాన్ని అన్వేషించు.

**తేజసా సోమ్య శుఙ్గేన సన్మూలమన్విచ్ఛ –** అగ్ని అనే కార్యానికీ, సత్ అనే కారణాన్ని అన్వేషించు. తైత్తిరీయ ఉపనిషత్తులో ఉండి ఉంటే, ఇంకో రెండు

కారణాలు వస్తాయి. అగ్నికి కారణం వాయువు,వాయువుకు కారణం ఆకాశం. ఆకాశానికి కారణం సత్‌బ్రహ్మ. ఇక్కడ ఆ రెండింటినీ మనస్సులోనే ఊహించుకుని అగ్ని నుంచి సరాసరి పెద్ద గెంతు గెంతి సత్ బ్రహ్మకు వెళ్లిపోవాలి.

సత్ అనే కారణానికి కారణం ఏమిటి? అదే శుద్ధసత్. దానికి ఇంకో కారణం లేదు.

**సన్మూలాస్సోమ్యేమాస్సర్వాః ప్రజాస్సదాయతనాస్సత్ప్రతిష్ఠాః**

ఆ సత్ బ్రహ్మే సృష్టి,స్థితి,లయ కారకుడు.

**సన్మూలా ఇమా స్సర్వాః ప్రజా–** సత్తే సృష్టికారణం.

**సదాయతనాః –** సత్తే స్థితి కారణం

**సత్ప్రతిష్ఠా –** సత్తే లయకారణం.

ఇదంతా దశలవారీగా చూస్తే –

శరీరం కార్యం, అన్నం (పృథివీ) కారణం

అన్నం కార్యం, జలం కారణం.

జలం కార్యం, అగ్ని కారణం.

అగ్ని కార్యం, సత్‌బ్రహ్మ కారణం.

**కార్యం – వాచాఽ ఽ రమ్భణం వికారో నామధేయం.** దానికి విడిగా ఉనికి లేదు.

**కారణం –** సత్‌బ్రహ్మే సృష్టిస్థితిలయకారణం.

అందువల్ల బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య.

**మంత్రం–5 –** ఇప్పుడు పదాల గారడీలో మూడో పదం చూస్తున్నాము.

అది ఉదన్య. ఉదన్యకి పర్యాయపదం పిపాస. పాతుం ఇచ్ఛా పిపాస. రెండింటి అర్థం దాహం. అందుకని ఇక్కడ ఉపనిషత్తు దాహానికి పిపాస పదం తీసుకోకుండా ఉదన్య పదం తీసుకుంది.

**ఉదకం పాతుమ్ ఇచ్ఛా ఉదన్య–**దీని సామాన్య అర్థం దాహం. కాని స్వపితి, అశనాయ పదాలతో గారడీ చేసినట్టుగా ఇక్కడ కూడా గారడీ చేసింది ఉపనిషత్తు. ఉదన్య అంటే అగ్ని తత్త్వం అంటుంది. ఎలాగైతే అశనాయలో జీర్ణకోశరసాలు అని చెప్పామో అలాగే ఇక్కడ ఉదన్య అంటే వైశ్వానర అగ్ని లేదా జఠరాగ్ని. ఉదన్య అంటే సామాన్య అర్థం దాహం అని చూశాము

కదా. దాహం ఎందుకు వేస్తుంది? లోపల నీరు ఎండిపోయినప్పుడు. నీరు ఎప్పుడు ఎండిపోతుంది? వైశ్వానర అగ్ని దహించివేసినప్పుడు. అందుకని వైశ్వానర అగ్ని కారణం. దాహం కార్యం. వైశ్వానర అగ్నిని విశేష అర్థంగా తీసుకుంది ఉపనిషత్తు.

ఉదన్యని ఉద+న్యగా విడదీస్తే ఉద అంటే ఉదకం. న్య అంటే నయతి. అందువల్ల ఉదన్య అంటే ఉదకం నయతి ఇతి ఉదన్య. ఉదకనాయని తగ్గిస్తే ఉదన్య అయింది.

దీనివల్ల గ్రహించాల్సింది ఏమిటి? శరీరం అనే కార్యానికి జలం కారణం. అంతకుముందు ఏమన్నాం? శరీరం అనే కార్యానికి పృథివీ కారణం. ఇప్పుడు జలం కూడా కారణం అంటున్నాము. దీన్నుంచి వరుసగా వెనక్కి అన్వేషిస్తూ వెళితే సత్‌బ్రహ్మకు వెళతాము. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**అథ యత్రైతత్పురుషః పిపాసతినామ–** అప్పుడు, ఎవరైతే నీరు త్రాగగోరుచున్నాడు అన్నపేరు కలవాడు అవుతాడో, అప్పుడు

**తేజ ఏవ తత్పీతం నయతే–** వైశ్వానర అగ్ని ఆ నీటిని అన్ని భాగాలకూ తీసుకువెళుతుంది. తేజ అంటే వైశ్వానర అగ్ని; తత్పీతం అంటే తాగిన నీరు.

**తద్యథాగోనాయోఽశ్వనాయః పురుషనాయ ఇతి –** ఇంతకుముందు చూసినట్టే గోవులను తోలేవాడు గోనాయుడు, గుఱ్ఱాలను తోలేవాడు అశ్వనాయుడు, మనుష్యులను నడిపించేవాడు పురుషనాయుడు అయినట్టుగా–

**ఏవం తత్తేజ ఆచష్ట ఉదన్యేతి–** అదే విధంగా ఉదకాన్ని తీసుకువెళ్ళి వైశ్వానర అగ్ని ఉదకనాయ అయింది. అదే ఉదన్య.

**తత్రైతదేవ శుంగ మత్పతితగ్ం సోమ్య విజానీహి–** ఓ సోమ్య, దీన్ని బట్టి శరీరం కార్యం అని తెలుసుకో.

**మంత్రం – 6 – తస్య క్వ మూలగ్ం స్యాదన్యత్రాద్భ్యోఽద్భిస్సోమ్యశుంగేన తేజో మూలమన్విచ్ఛ తేజసాసోమ్య శుఙ్గేన సన్మూలమన్విచ్ఛ సన్మూలాస్సోమ్యేమాస్సర్వాః ప్రజాస్సదాయతనాస్సత్ప్రతిష్ఠాః**

ఇదంతా 4వ మంత్రంలో చూశాము. దాన్ని దశలవారీగా కూడా చూశాం. ఇక్కడ జలం నుంచి చూస్తాము.

జలం కార్యం, అగ్ని కారణం.

అగ్ని కార్యం, సత్‌బ్రహ్మ కారణం.

**కార్యం–** వాచాఽ ఽ రమ్భణం వికారో నామధేయం. దానికి విడిగా ఉనికి లేదు.

**కారణం–** బ్రహ్మ సృష్టి స్థితి లయ కారణం.

కాబట్టి బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య.

**సన్మూలా సోస్మ్యేమాస్సర్వాః ప్రజాస్సదాయతనాస్సత్ప్రతిష్ఠాః**

ఇది కూడా అక్షరలక్షలు విలువ చేసే వాక్యం. దీన్ని కూడా మర్చిపోకూడదు.

ఈ పదాల గారడీ అర్థమయిందో లేదోనని ఉపనిషత్తుకు బెంగపట్టుకుంది. అందుకని, అంతకుముందు చెప్పిన సందేశం ఇప్పుడు వస్తున్నది అని చెపుతున్నది. ఏమిటా సందేశం? మనం ముందు చూసిన దశల చివరి దశ. శరీరానికి మూలకారణం సత్‌బ్రహ్మ. ఏమని చెప్పింది?

**యథాను ఖలు సోమ్యేమాస్తిస్రో దేవతాః పురుషం ప్రాప్య**
**త్రివృత్త్రివృదేకైకా భవతి తన్మే విజానీహీతి 4–7**

అక్కడేమో తన్మే విజానీహితి అంది. నేను చెప్పగా తెలుసుకో అంది. ఇక్కడ కూడా అవే మాటలు వాడి–

**తదుక్తం పురస్తాదేవ భవతి–** ఈ విషయం ముందే చెప్పానంది. మనం పృథివీ, జల, అగ్ని తత్త్వాలను అన్నం, నీరు, నూనె, నెయ్యి రూపాలలో తీసుకుంటామనీ, అవి లోపలికి వెళ్ళాక మూడుగా విభజించబడి మనకి శక్తినిస్తాయనీ చూశాము. దాని ద్వారా శరీరం ఈ మూడు భూతాల కార్యం అని కూడా చూసాము.

ఇప్పుడు అదే మంత్రంతో ఉపనిషత్తు ఇంకో భావాన్ని చెపుతున్నది. పురస్తాదేవ భవతితో ఒక భాగం అయిపోయినట్టుగా అనుకోవాలి.

**మంత్రం – 6 –** ఇప్పుడు మరణం గురించి చెప్పబోతున్నది. ముందేమో సుషుప్తి గురించి చూశాము. నిద్రలో, బ్రహ్మలో లయమవుతామని చూశాము. ఇప్పుడు మరణంలో కూడా బ్రహ్మలో లయమవుతామని చెపుతున్నది. తర్వాత ప్రళయంలో కూడా లయమవుతామని వస్తుంది. అందువల్ల బ్రహ్మ చివరి లయ కారకుడు. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**అస్య సోమ్య పురుషస్య ప్రయతో వాఙ్మనసి సంపద్యతే మనః ప్రాణే ప్రాణస్తేజసి తేజః పరస్యాం దేవతాయామ్**

సోమ్య – ఓ సోమ్యా; అస్య పురుషస్య ప్రయతః – ప్రయతః అంటే ప్రయాణం చేసేవాడు– మరణకాలంలో ఏమవుతుంది?
వాఙ్మనసి సంపద్యతే– మరణించేటప్పుడు ఇంద్రియాలు మనసులో లయమవుతాయి. వాక్కు కర్మేంద్రియానికి సంకేతం. అన్ని ఇంద్రియాలూ అని తీసుకోవాలి. సంపద్యతే అంటే లయమవుతాయి. గడగడ మాట్లాడే వ్యక్తి కూడా మరణకాలంలో చెప్పాలనుకున్నది చెప్పలేకపోతాడు. శక్తి క్షీణిస్తుంది. నోరు మెదుపుతాడు కాని మాట బయటకు రాదు. తర్వాత ఏమవుతుంది?

మనః ప్రాణే – మనస్సు ప్రాణంలో లయమవుతుంది. అంతవరకూ వాక్కుతో చెప్పలేకపోయినా మనస్సులో అనేక ఆలోచనలు ఉంటాయి. ఒక్కోసారి ఆ నిస్సహాయ స్థితిలో కళ్ళవెంట నీరు కారుతుంది. తర్వాత మనస్సు కూడా పనిచేయటం ఆగిపోతుంది. అంటే మనస్సు ప్రాణంలో లయమవుతుంది. అంటే ఇంకా ప్రాణం ఉంది. అలా ఎన్నాళ్ళు ఉంటుంది? ప్రారబ్ధ కర్మ ముగిసేదాకా.

మనం కర్తగా ఏ పని చేయలేనప్పుడు, సంఘానికి కానీ, కుటుంబ సభ్యులకు గానీ ఏమీ ఉపయోగం లేనప్పుడు ఎందుకు ఇలా నిస్సహాయంగా మంచం మీద అవస్థ పడాలి? ఎన్నాళ్ళు ఇలా అవస్థ పడాలి, పెట్టాలి? ఇటువంటి సందేహాలు రావటం సహజం. కాని మనం కేవలం కర్తలమే కాదు. భోక్తలం కూడా. మనం అప్పుడు కర్మ చేసినా చేయకపోయినా అంతకుముందు చేసిన కర్మల ఫలం అనుభవించక తప్పదు. మనమే కాదు మనచుట్టూ ఉన్నవాళ్ళకు కూడా తప్పదు. వాళ్ళ ప్రారబ్ధకర్మ వల్ల వాళ్ళు మనకు సేవ చేయాల్సి ఉంటుంది. అందుకని మనం పిల్లలకు భారంగా ఉన్నామంటే అది కర్మసిద్ధాంతం వల్ల. దాని గురించి బెంగపడి లాభం లేదు. దాన్ని కాదనలేము. అందుకని కర్త, భోక్త ప్రారబ్ధకర్మ ముగిసేదాకా, ప్రాణం కొనసాగుతుంది.

**ప్రాణస్తేజసి–** తర్వాత ప్రాణం కూడా వెళ్ళటం మొదలుపెడుతుంది. తక్కిన ప్రాణాలు శక్తిని కోల్పోతాయి. ఉదానం తీసుకువెళుతుంది కాబట్టి అది ఒక్కటే శక్తివంతంగా ఉంటుంది. శరీరంలో ప్రాణం ఉందా లేదా చూడటానికి ఒళ్ళు ముట్టుకుని చూస్తాము. ప్రాణం పోయాక, శరీరం చల్లగా అయిపోతుంది.

అంటే అగ్నితత్త్వం పోతుంది. శరీరంలో ఉష్ణం అగ్నితత్త్వం. తేజస్సు బ్రహ్మలో లయమవుతుంది. తేజస్సును జీవాత్మగా తీసుకోవాలి. జీవాత్మ పరమాత్మలో లయమవుతుంది. ప్రతి దశలోనూ సంపద్యతే కలుపుకోవాలి. సంపద్యతే అంటే లయమవుతుంది.

అజ్ఞాని జీవుడు, జ్ఞాని జీవుడు ఇద్దరూ బ్రహ్మలో లయమవుతారు. కాకపోతే అజ్ఞాని జీవునికి సంచితకర్మలు దగ్ధమవవు. అందుకని అతనికి పునర్జన్మ ఉంటుంది. అజ్ఞాని ప్రయాణం, జ్ఞాని ప్రయాణం, లయం - వీటన్నింటి గురించి వివరంగా బ్రహ్మసూత్రాల్లో వస్తుంది. జ్ఞానికి పునర్జన్మ ఉండదు. బ్రహ్మ ఐక్యం ఇద్దరికీ అవుతుంది కాని అది తాత్కాలికమా, ఆద్యంతిక ఐక్యమా అన్నది తేడా ఉంటుంది.

**మంత్రం - 7 -** ఇంతవరకూ జగత్తు సత్‌బ్రహ్మ నుంచి వచ్చిందని చూశాము.

**కార్య - కారణ సంబంధం**

1. కార్యం = కారణం+ నామరూపాలు

2. కారణం = కార్యాలన్నింటికి ఆత్మ. అంటే వాటి అధిష్ఠానం. వాటి సారం.

3. కారణం వాటి అధిష్ఠానం అంటే కారణం లేకుండా కార్యానికి విడిగా ఉనికి లేదు. అందువల్ల కారణం సత్యం, కార్యం మిథ్య.

4. కారణమే అన్ని కార్యాలలోనూ ఉంది.

5. అందువల్ల కారణ జ్ఞానంవల్ల సర్వకార్యవిజ్ఞానం వస్తుంది. ఏకజ్ఞః సర్వజ్ఞః భవేత్

ఇప్పుడు కార్యం పదాన్ని జగత్తుతోనూ, కారణ పదాన్ని బ్రహ్మతోనూ మార్చి చూద్దాము.

1. జగత్తు = సత్‌బ్రహ్మ + నామరూపాలు.

2. సత్ జగత్తంతటికీ ఆత్మ. సత్‌బ్రహ్మ అధిష్ఠానం. సత్‌బ్రహ్మ సారం. మనం మట్టికుండ అంటున్నాము.కుండను సత్యం చేసి మట్టిని దానికి విశేషణంగా వాడుతున్నాము. నిజానికి కుండగా ఉన్న మట్టి అనాలి. అలాగే ఉనికి ఉన్న జగత్తు అంటున్నాము. జగత్తును సత్యం చేసి, ఉనికిని దానికి విశేషణంగా వాడుతున్నాము. నిజానికి జగత్తుగా ఉన్న ఉనికి అనాలి. అందువల్ల జగత్తుకు ఆత్మ బ్రహ్మ.

అంటే జగత్తు అధిష్ఠానం బ్రహ్మ.

3. బ్రహ్మ జగత్తుకు అధిష్ఠానం అంటే బ్రహ్మ లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు. అందువల్ల బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య.

4. బ్రహ్మే జగత్తంతా అనేక నామరూపాలతో ఉంది. ఉదాహరణకు భూలోక సత్తా, భువర్లోక సత్తాగా ఉంది.

5. అందువల్ల సత్ విజ్ఞానేన సర్వ విజ్ఞానం భవతి.

అలా అయితే సత్ విజ్ఞానం పొందటం ఎలా?

ఈ ప్రశ్నలో అర్థం లేదు. బ్రహ్మను ఎప్పుడు అనుభవించటం లేదు? సర్వదా బ్రహ్మ అనుభవం ఉంది. అన్నివేళలా, అన్ని చోట్లా బ్రహ్మ అనుభవం ఉంది. నిజానికి వేదాంతం మనకు సవాలు విసురుతున్నది. సరే బ్రహ్మను చూస్తానంటున్నావు కదా, బ్రహ్మను తప్పించుకోవటానికి ప్రయత్నం చేయి. బ్రహ్మను తప్పించుకోవాలంటే ఉనికి లేని వస్తువులను అనుభవించాలి. నామరూపాలు మారుతాయి కాని ఉనికి ఉంటుంది. ఇంగ్లీషులో బుక్ ఈజ్, టేబుల్ ఈజ్, పెన్ ఈజ్ అని చెపుతూ వస్తాము. పేర్లు మారాయి కాని ఈజ్, ఈజ్, ఈజ్ ఉంటూనే వస్తుంది. ఈజ్‌నెస్ మారదు. ఆ ఈజ్‌నెస్సే బ్రహ్మ. అందువల్ల బ్రహ్మను అన్ని వేళలా అన్నిచోట్లా అనుభవిస్తూనే ఉన్నాము. నిర్గుణబ్రహ్మను చూడటం ఎలా?

అయినా మనకు తృప్తి లేదు. నేను అనుభవిస్తున్నది నామరూపాలతో ఉన్న బ్రహ్మను. సగుణ బ్రహ్మను. నాకు శుద్ధ చైతన్యాన్ని, నిర్గుణబ్రహ్మను అనుభవించాలని ఉంది. నిర్గుణ, నిరుపాధిక, నిర్విశేష బ్రహ్మను చూడాలని ఉంది. కనీసం కొంచెంగానన్నా చూడాలి.

**తత్త్వమసి**

నిర్గుణబ్రహ్మను వస్తువుగా చూడలేము. అనుభవం నామరూపాలతో అవుతుంది.

జగత్= సత్‌బ్రహ్మ+నామరూపాలు

సత్‌బ్రహ్మ= జగత్–నామరూపాలు

సత్‌బ్రహ్మను చూడాలంటే నామరూపాలు తీసేయాలి. ఎలా తీయాలి? నామరూపాల జగత్తును ఇంద్రియాలనే ప్రమాణంతో చూస్తాము. ఇంద్రియాలనే ప్రమాణాలను తీసేయాలి. ఎన్నో లైట్లు వెలుగుతున్న గదిని

చీకటిగా చూడాలనుకున్నారనుకోండి. ఏం చేస్తారు? దానికి రెండు పద్ధతులు ఉన్నాయి. ఒకటి ఒక్కోలైటూ ఆర్పుకుంటూ రావటం. ఇంకోటి మీరే కళ్ళు మూసుకోవటం. అప్పుడు చీకటి మిగులుతుంది. చీకటి నాకు తెలియటం లేదే? అయితే చూడు, చూడాలంటే కళ్ళు తెరవాలి. కళ్ళు తెరిస్తే చీకటిని చూడలేము.

అలాగే నిర్గుణ బ్రహ్మను చూడాలంటే ప్రమాణాలు వాడలేము. అందుకే అశబ్దం, అస్పర్శం, అరూపం అన్నారు. నిర్గుణబ్రహ్మను ఎన్నటికీ అనుభవించలేము. ప్రమాణం వాడితే అది సగుణం బ్రహ్మ అవుతుంది. ప్రమేయరూపం వస్తుంది.

అసలు నిర్గుణ బ్రహ్మ ఉందా?

నిర్గుణ బ్రహ్మను చూడలేమంటే అసలు నిర్గుణ బ్రహ్మ ఉందా? లేక తరతరాలుగా చెపుతున్న అబద్ధమా? సర్వప్రమాణ అగోచరం అయితే అసత్ అనచ్చు కదా అంటారేమో. సత్ బ్రహ్మను అనుభవించటానికి ఎన్నడూ ప్రయత్నించలేము. ఎందుకంటే సత్‌బ్రహ్మను అనుభవించే నువ్వే శుద్ధ చైతన్యానివి. ఏదైనా తెలుసుకోవాలి అనుకుంటే నువ్వు (ప్రమాతా) చిత్+నామరూపం అవుతావు. నువ్వు అనుభవించే వస్తువు సత్+నామరూపం అవుతుంది.

చిత్+నామరూపం = ప్రమాతా

సత్+నామరూపం = ప్రమేయం

ప్రమాతా, ప్రమేయాలలోంచి నామరూపాలు తీసేస్తే ఏం మిగిలింది? శుద్ధచిత్, శుద్ధసత్తా. సత్తే చిత్ , చిత్తే సత్తా. ప్రమాతా, ప్రమేయాల తేడా తెలియదు. తెలుసుకునే వ్యక్తి, తెలియబడే వస్తువుల మధ్య తేడా లేదు.

**సత్త్వమేవ త్వం, త్వమేవ సత్**

అప్పుడు **ఆత్మజ్ఞానేన సర్వజ్ఞః భవతి**

అప్పుడు జ్ఞాని సర్వజ్ఞుడు అవుతాడు. ఆత్మజ్ఞానం వల్ల సర్వజ్ఞానం కలుగుతుంది కాబట్టి సర్వజ్ఞుడు అవుతాడు. ఇప్పుడు సత్‌కి చెప్పిన ఐదు అంశాలు చిత్‌కు వర్తిస్తాయి.

1. జగత్తు= చిత్+ నామరూపాలు.
2. చిత్ జగత్తంతటికీ ఆత్మ.

3. చిత్ సత్యం, జగత్ మిథ్య.

4. చిత్తే జగత్తంతా అనేక నామరూపాలుతో ఉంది.

5. **చిత్‌విజ్ఞానేన సర్వ విజ్ఞానం భవతి.**

ఇప్పుడు మంత్రం చూద్దాము.

**సయ ఏషోఽ ణిమా –** సత్ అణువుకన్నా సూక్ష్మమైనది.

**అవిషయత్వాత్, అప్రమేయత్వాత్, సర్వప్రమాణ అగోచరత్వాత్ ఐతదాత్మ్యమిదగ్ం సర్వం–** సత్తే అన్నిటికీ ఆత్మ.

తత్ సత్యం – అదే సత్యం.

స ఆత్మా – ఆ సత్తే జగత్తులో నామరూపాలుగా వ్యక్తమవుతున్నది.

**తత్త్వమసి శ్వేతకేతో–** ఆ సత్తా నువ్వే శ్వేతకేతు. సత్తే చిత్, చిత్తే సత్. తత్ ఏవ చిత్ భవతి, చిత్ ఏవ తత్ భవతి.

ఇదంతా, ఎందుకు వచ్చింది? ఈ అధ్యాయం మొదట్లో వచ్చిన ప్రశ్నను మర్చిపోకూడదు.

**యేనాశ్రుతగ్ం శ్రుతం భవత్యమతం మతమవిజ్ఞాతం విజ్ఞాతమితి**

ఏ ఒక్కటి తెలుసుకుంటే సర్వం తెలుసుకున్నట్టవుతుంది? దానికి ఉద్ధాలకుడు చెప్పిన జవాబు.

**ఏక కారణ విజ్ఞానేన – సర్వ విజ్ఞానం భవతి**

తర్వాత బ్రహ్మను కారణంగా నిరూపించాడు. అప్పుడు–

**బ్రహ్మ విజ్ఞానేన, సర్వ విజ్ఞానం భవతి**

ఇప్పుడు ఆ బ్రహ్మవు నువ్వే అంటున్నాడు. అంటే

**ఆత్మ విజ్ఞానేన సర్వ విజ్ఞానం భవతి**

తత్త్వమసిలో బ్రహ్మను కారణంగా నిరూపించటం ద్వారా తత్ పద విచారం ముగుస్తుంది. ఆత్మను బ్రహ్మగా నిరూపించటం ద్వారా త్వం పద విచారం ముగుస్తుంది. అసి అంటే ఐక్యం చెప్పకనే చెప్పినట్టయింది. ఆత్మ = బ్రహ్మ అంటే అసి వచ్చేస్తుంది. ఇక్కడితో బోధ ముగిసినట్టే.

కాని, శ్వేతకేతు ఇంతటితో తృప్తిపడలేదు.

**భూయ ఏవ మా భగవాన్ విజ్ఞాపయత్వితి –** ఇంకా చెప్పండి అన్నాడు.

**తథాసోమ్యేతి హోవాచ–** అలాగే చెప్తాను అన్నాడు గురువు.

**నవమః ఖణ్డః (9)**

**యథా సోమ్య మధు మధుకృతో నిస్తిష్ఠన్తి నానాఽత్యయానాం వృక్షాణాగ్ం రసాన్ సమవహారమేకతాగ్ం రసం గమయన్తి ॥1॥ తే యథా తత్ర న వివేకం లభన్తేఽముష్యాహం వృక్షస్య రసోఽస్మ్యముష్యాహం వృక్షస్య రసోఽస్మీత్యేవమేవ ఖలు సోమ్యేమాస్సర్వాః ప్రజాస్సతి సమ్పద్య న విదుస్సతి సమ్పద్యామహ ఇతి ॥2॥ త ఇహ వ్యాఘ్రో వా సిగ్ంహో వా వృకో వా వరాహో వా కీటో వా పతఙ్గో వా దగ్ంశో వా మశకో వా యద్యద్భవన్తి తదాభవన్తి ॥3॥ స య ఏషోఽణిమైతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో ఇతి భూయ ఏవ మా భగవాన్ విజ్ఞాపయత్వితి తథా సోమ్యేతి హోవాచ ॥4॥**

ఎనిమిదో ఖండంతో శ్రవణం భాగం అయిపోయింది. తొమ్మిది నుంచి మననం భాగం మొదలవుతుంది. మనసులో ఉన్న సందేహాలు లేదా శంకలు తీరుతాయి దీనిద్వారా. 8 సందేహాలకు వరుసగా జవాబులు వస్తాయి.

ఎనిమిదో ఖండంలో చెప్పిన బోధ నుంచి, ఒక సందేహం రావచ్చు. దానికి జవాబు ఇది. సుషుప్తిలో జీవి బ్రహ్మలో లయమవుతాడు అని చెప్పాడు. మొదటి మంత్రంలోనే వస్తుంది.

**యత్రైతత్పురుష స్స్వపితి నామ సతా సోమ్య తదా సంపన్నో భవతి** – అంటే నిద్రలో సత్‌బ్రహ్మతో లయమవుతాడు. అద్వైత అనుభవం పొందుతాడు. అప్పుడు తన జీవత్వాన్ని కోల్పోతాడు. ప్రళయం లాంటిదే ఇది కూడా. కాకపోతే ప్రళయంలో అన్ని జీవాలు లయమవుతాయి. సుషుప్తిలో ఒక్క జీవి మాత్రమే లయమవుతుంది. జీవి ఎందులో లయమవుతుంది? తన కారణంలో! కుండ మట్టిలో లయమవుతుంది. జీవి బ్రహ్మలో లయమవుతాడు. ఏమాత్రం ఆధ్యాత్మిక సాధన చేయకుండా, కర్మ, ఉపాసన, శ్రవణ, మననాలు చేయకుండా సాధనచతుష్టయ సంపన్నుడవకుండా లయమవుతాడు. జీవబ్రహ్మ ఐక్యం పొంది అద్వైత అనుభవం పొందుతాడు. ఈ అద్వైత అనుభవం కోసం ధ్యానం చేస్తారు కొంతమంది. కాని

**అహరహర్ బ్రహ్మ గమయతి**

**1. సుషుప్తిలో బ్రహ్మలో లయమవుతుంటే నాకెందుకు తెలియటం లేదు?**

రోజూ బ్రహ్మలో లయమవుతున్నాము. ఇప్పుడు సందేహమేమిటి? ఎవరూ నేను బ్రహ్మలో ఐక్యం అయ్యాను తెలుసా అని అనటం లేదు ఎందుకు? దానికి జవాబు, ఒక దృష్టాంతంతో సహా, వస్తున్నది ఈ అధ్యాయంలో. అది మధు దృషాంతం.

జీవి బ్రహ్మ ఐక్యాన్ని సుషుప్తిలో కాని, సమాధిలో కాని తెలుసుకోలేడు. ఎందుకు? జీవత్వాన్ని కోల్పోయే, బ్రహ్మలో లయమవుతాడు. జీవత్వం ఉంటే పరిమితి ఉన్న వ్యక్తి అవుతాడు. పరిమితి ఉన్న జీవి, అనంతమైన బ్రహ్మలో కలవలేడు. అందువల్ల జీవత్వాన్ని వదిలివేయాలి. జీవత్వం అంటే కర్తా, భోక్తా, ప్రమాతా అనే మూడు అంశాలు.

వ్యష్టిగా మన కర్తృత్వ, భోక్తృత్వ, ప్రమాతృత్వాలలో వ్యత్యాసం ఉంటుంది. నిద్రలో ఈ మూడు పోతాయి. ప్రమాతా ఉండడు. నేనే లేనప్పుడు ఇతరులను కూడా తెలుసుకోలేను. ప్రమాతృప్రమేయ భేదం ఉండదు. అలాంటప్పుడు ప్రమ (జ్ఞానం) ఎలా సాధ్యం? అంటే ప్రమాత కూడా లయమవుతాడు కాబట్టి తెలియదు. అదీ జవాబు.

**మంత్రం-1- యథా సోమ్య-** సోమ్య అనే పదాన్ని వదలటం లేదు గురువు. **మధు మధుకృతో నిస్తిష్ఠన్తి-** మధుకృతో అంటే తేనెటీగలు. మధునిస్తిష్ఠన్తి అంటే మధువును తయారు చేస్తాయి. అవి అనేక పూలనుంచి సేకరిస్తాయి. వాటికి రకరకాల రుచులు ఉంటాయి. పువ్వుల్లో తేనెకు ప్రత్యేకత ఎంతవరకూ ఉంటుంది? వాటిని సేకరించి ఒకచోట కలపనంతవరకూ ఉంటుంది.

**నానాఽ త్యయానాం వృక్షాణాగ్ం -** నానాఽ త్యయానాం అంటే భిన్న దిక్కుల్లో ఉన్న అనేక పువ్వుల నుంచి సేకరించిన తేనె; వృక్షాణం- చెట్లు.

తేనెటీగల మీద పరిశోధనలు చేసేవాళ్ళుంటారు. ఒక తేనెటీగ, ఎక్కడైనా మంచి తేనె ఉన్న పువ్వును చూస్తే, ఆ విషయం వెనక్కి వచ్చి తక్కిన తేనెటీగలకు తెలియజేస్తుందిట. మనం ఏదైనా చెప్పాలంటే గుర్తులు చెప్తాము. అవి ఎలా చెప్తాయి? అది ఒక ప్రత్యేకమైన నృత్యం చేస్తుందిట. అది చేసే నాట్యం బట్టి, పెట్టే భంగిమలను బట్టి, ఎటు ఉందో, ఎంత దూరంలో ఉందో తెలుసుకుంటాయిట. నిజంగా అదొక అద్భుతమైన సంకేతం!

**రసాన్ సమవహారమ్-** రసం అంటే తేనె. నిజానికి తేనెటీగ పువ్వు నుంచి

వెంటనే తేనె తీయలేదు. అది పువ్వు రసం పీల్చినప్పుడు, అది తేనెటీగ కడుపులోకి వెళ్ళి, కొన్ని రసాయన మార్పులు చెంది, తేనెగా బయటకి వస్తుంది. సమవహారమ్ అంటే ప్రోగు చేస్తాయి. ప్రోగు చేశాక ఏం చేస్తాయి? **ఏకతాగ్ం రసం గమయన్తి –** భిన్న పుష్పాల నుంచి సేకరించిన తేనెను ఒకచోట కలుపుతుంది. వాటిని ఒకదాంట్లో కలిపే వరకూ, వాటి భిన్నత్వం ఉంటుంది. కలిశాక తేడా తెలియదు. మనమంతా తేనెలాంటి వాళ్ళం. మేలుకుని ఉన్నంతసేపు అనేక భేదాలను పాటిస్తాము. వర్ణభేదం, జాతిభేదం, కులభేదం వగైరా. కాని పడుకున్నాక, భేదాలు తొలగిపోతాయి. జీవత్వమే ఉండదని చూశాము కదా. నేను బ్రహ్మతో లయమయ్యానని ఎలా తెలుస్తుంది? తెలియదు.

**మంత్రం-2 – తే యథా తత్ర న వివేకం లభన్తే –** వివేకం అంటే నేను ఫలానా చెట్టునుంచి వచ్చాను అనే భేదం తెలియదు. ఉపనిషత్తు కవితాధోరణితో చెపుతున్నది. తేనెకు జీవం ఉన్నట్టుగా ఊహించు కుంటున్నది.

**అముష్యాహం వృక్షస్య రసోఽస్మ్యముష్యాహం వృక్షస్య రసోఽస్మి –** నేను ఈ చెట్టునుంచి వచ్చిన తేనెను, నేను ఈ చెట్టు నుంచి వచ్చిన తేనెను అని అవి అంతకుముందు చెపుతుండేవి. దాన్ని అభివాదయం అంటారు. అభివాదయం అంటే గోత్రనామాలు, ఋషి పరంపర చెప్పుకోవటం. పూర్వం తనను తాను పరిచయం చేసుకుంటూ, ఇవి చెప్పేవారు. ఇప్పుడు ఎవరూ అలా చెప్పటం లేదు.

అలా ప్రతి తేనె అభివాదయం చేసేది. కాని అది ఒకసారి అన్నింటితో కలిసిపోయాక –ఏకతాగ్ం రసం గమయతి – ఆ భిన్నత్వం పోతుంది. అభివాదయం పోవటం మోక్షం.

> **యత్ తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్ అచక్షుః శ్రోత్రం తదపాణిపాదమ్ – ముండక 1-1-6**

అగోత్రం! గోత్రం లేదు. ఈ చెట్టుకు చెందిన దాన్ని అనే వివేకం ఉండదు. **ఏవమేవ ఖలు సోమ్య –** ఈ విధంగా సుషుప్తిలో కూడా, మనం బ్రహ్మలో లయమవుతాము.

అందుకే ఎవరైనా నేను నిర్వికల్ప సమాధిలో బ్రహ్మలో లయ మయ్యాను అని చెపితే, అది తార్కికంగా నిజం కాదు. ఏదో అనుభవం జరిగి ఉంటుంది. అది కాదనలేము. కాని అది అద్వైత అనుభవం కాదు. జీవత్వం తెలుస్తుండగా, అద్వైత అనుభవం జరిగేది కాదు. అద్వైతం అసలు అనుభవంలోకి రాదు. దాన్ని అర్థం చేసుకోవాలి అంతే. జాగ్రదావస్థలో ఉంటూ, జీవత్వం మిథ్య అని అర్థం చేసుకోవాలి అంతే. అద్వైత అనుభవం విడిగా ఉండదు. అద్వైత జ్ఞానం ఉంటుంది. ఆ జ్ఞానం ఎప్పుడు కలుగుతుంది? సమాధిలో కాదు, సుషుప్తిలో కాదు, జాగ్రదావస్థలో. 'నేను ఎప్పటికీ అద్వైతాన్నే. ఈ నామరూపాలున్న నాకు విడిగా ఉనికి లేదు. నామరూపాలు మిథ్య' అని తెలుసుకోవాలి.

**వాచాఽ ఽ రమ్భణం వికారో నామధేయం మృత్తికా ఇత్యేవ సత్యం**

**ఇమాస్సర్వాః ప్రజాః –** ఈ జీవాలన్నీ కూడా;

**సతిసమ్పద్య న విదుః –** నిద్రకు ఇంకో పర్యాయపదం సత్ సంపత్తిః సతి సంపద్య అంటే బ్రహ్మలో లయమవుతున్నాడు. న విదుః బ్రహ్మలో కలిసిన నేను ఫలానా అని తెలియదు. ఏమిటి తెలియదో అది వాళ్ళు చెప్తున్నట్టుగా ఉంది.

**సతి సంపద్యామిహ ఇతి–** నేను బ్రహ్మలో లయమవుతున్నాను అనే జ్ఞానం వాళ్ళు పొందలేరు కాబట్టి చెప్పలేరు.

**సుషుప్తిలో బ్రహ్మలో లయమవుతున్నామంటే, అది మోక్షమా?**

మోక్షమంటే బ్రహ్మ ఐక్యం అంటున్నాము కదా! బ్రహ్మ ఐక్యం మోక్షం, విదేహముక్తి అంటే మర్నాడు లేవరా? కాని జీవాలు మర్నాడు లేస్తున్నాయి కదా! దానికి జవాబు– కారణశరీరం, జ్ఞానం వల్ల దగ్ధం అవలేదు. స్థూల సూక్ష్మ శరీరాలు వ్యవహారం నడపటం లేదు, కాబట్టి లయమయినట్టుగా ఉన్నాయి. వ్యవహారం నడపటం లేదు కాని, జీవత్వం అవ్యక్తరూపంలో ఉంటుంది. ఎలా తెలుసు? రాముడు రామునిగానే లేస్తాడు. లక్ష్మణుడు లక్ష్మణునిగానే లేస్తాడు. అవ్యక్తరూపాన్ని కారణ శరీరం అంటాము.

సుషుప్తిలో ఉన్నది నా అసలు స్వరూపం. జీవత్వం నేను వేసుకున్న వేషం. కాని మనమేమనుకుంటున్నాం? జాగ్రద్ వేషం నా అసలు స్వరూపం, నిద్ర వేషం అనుకుంటున్నాము. ఎప్పుడైతే నా అసలు స్వరూపం శుద్ధసత్తా,

సర్వవ్యాపకమైన బ్రహ్మను అని తెలుస్తుందో, అప్పుడు మిగతాదంతా నేను వేసుకున్న వేషంగా తెలుస్తుంది. కాని కారణశరీరం అనే విత్తనం ఉంది. దాన్నుంచి మళ్ళీ జీవి వస్తాడు. ఒక చెట్టుకొమ్మ కొట్టేసినా, మళ్ళీ పెరిగినట్టుగా, ఇవాళ నిద్రపోయినా, మళ్ళీ రేపు లేస్తాడు. ఏ జీవి ఎలా నిద్రపోతే అలాగే మళ్లీ వెనక్కి వస్తుంది.

**మంత్రం - 3- త ఇహ వ్యాఘ్రో వా సిగ్ంహో వా వృకో వా వరాహో వా కీటో వా పతఙ్గోవా దగ్ం శో వా మశకోవా యద్యద్భవన్తి తదా భవన్తి**

యద్యత్ భవన్తి -పూర్వం ఏ జీవి అయితే,
తత్ ఆభవన్తి- మళ్ళీ వచ్చి అదే అవుతుంది.

ఉపనిషత్తు అవేవో సూచించటానికి ఒక పట్టిక ఇచ్చింది.

వ్యాఘ్రం- పులి, సిగ్ంహః - సింహం, వృకః - తోడేలు; వరాహః - వరాహం, కీటః- కీటకం, పతంగః-పక్షి, దగ్ంశ- అడవి ఈగ, మశక- దోమ.

నిద్రలో సింహం నుంచి దోమ వరకూ అన్నీ ఒకటే. అన్నీ బ్రహ్మలో లయమవుతున్నాయి. ఆ బ్రహ్మ ఎవరు? దానికి జవాబు క్రింది మంత్రంలో.

**మంత్రం-4-**ఈ విధంగా ఉద్దాలకుడు, మనకొచ్చే సందేహాలను తీరుస్తున్నాయి. మనం నిద్రలో శుద్ధసత్తాలో లయమవుతున్నాయి. నిద్రలో ప్రమాతృత్వం ఉండదు. కరణాలను ఉపసంహరిస్తాము. అన్ని ప్రమాణాలు లయం చెందుతాయి. అందుకే లేచాక బ్రహ్మతో ఐక్యం చెందినట్టు తెలియదు. నాకేమీ తెలియలేదు' అని తెలుస్తుంది అంతే.

ఇది ముందు అధ్యాయంలో చూసిన మంత్రమే. ఎనిమిదిసార్లు ఇదే మంత్రం వస్తుంది. దీని సారాంశం బ్రహ్మ శుద్ధ సత్తా. అదే జగత్తంతటికీ ఆత్మ. అది నువ్వే.

ఇంకా చెప్పు అని శ్వేతకేతు అడిగితే, సరే చెప్తాను అంటాడు.

## దశమః ఖణ్డః (10)

**ఇమాస్సోమ్య నద్యః పురస్తాత్ప్రాచ్యస్స్యన్దన్తే పశ్చాత్ప్రతీచ్యస్తాస్సముద్రాత్సముద్రమేవాపియన్తి స సముద్ర ఏవ భవతి తా యథా తత్ర న విదురియమహమస్మీయమహమస్మీతి ॥1॥ ఏవమేవ ఖలు సోమ్యేమాస్సర్వాః ప్రజాస్సత ఆగమ్య న విదుస్సత ఆగచ్ఛామహ ఇతి త ఇహ వ్యాఘ్రో వా**

**సిగ్ంహో వా వృకో వా వరాహో వా కీటో వా పతంగో వా దగ్ంశో వా మశకో వా యద్యద్భవన్తి తదా భవన్తి॥2॥ స య ఏషోఽ ణిమైతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో ఇతి భూయ ఏవ మా భగవాన్ విజ్ఞాపయత్వితి తథా సోమ్యేతి హోవాచ ॥3॥**

**2. సుషుప్తిలో లయం తెలియకపోయినా, లేచాక ఎందుకు తెలియటం లేదు?**

ఈ ప్రశ్నకు జవాబు ఈ ఖండంలో వస్తుంది. ముందు ఖండంలో సుషుప్తిలో బ్రహ్మలో లయమవుతుంటే నాకెందుకు తెలియటం లేదు ప్రశ్న వేశాము. దానికి జవాబు – ప్రమాత లయమవుతాడు. అందుకని తెలియదు.

సుషుప్తిలో ప్రమాత లయమవుతాడు కాబట్టి తెలియదు. సరే బాగానే ఉంది. కాని లేచాక, ప్రమాత కూడా లేస్తాడు కదా. అప్పుడెందుకు 'నేను బ్రహ్మలో లయమయ్యాను,' అని చెప్పలేకపోతున్నాడు? నిద్రలో నా జీవత్వం లేదు, కాని లేచాక ఉంది కదా!

దానికి జవాబు ఇందులో ఒక దృష్టాంతం ద్వారా వస్తుంది. అది నదీ దృష్టాంతం. ఏమిటా జవాబు? చాలా తేలిక. నిద్రలేచాక బ్రహ్మలో లయమయినట్టు గుర్తు తెచ్చుకోలేము. ఎందుకంటే మనకు తెలిసినదాన్నే గుర్తు తెచ్చుకోగలము. బ్రహ్మలో లయమయ్యానని తెలిస్తే కదా, గుర్తు తెచ్చుకునే అవకాశం ఉండేది. నిద్రలో అజ్ఞానంలో ఉన్నాము.

**సుషుప్తౌ సుఖమహమస్వాప్తం న కించిదవేదిషం**

అందుకని ఒక్క ముక్కలో చెప్పాలంటే, **నిద్రపోతున్న వ్యక్తికి తెలియదు, లేచిన వ్యక్తి గుర్తు తెచ్చుకోలేడు.** మొదటి భాగానికి తేనె ఉదాహరణ. రెండవ భాగానికి నది ఉదాహరణ.

**మంత్రం – 1** **సోమ్య –** గురువు ఈ పదాన్ని వదలటం లేదు;

**ఇమా నద్యః పురస్తాత్ప్రాచ్యస్స్యన్దన్తే –** తూర్పువైపు ప్రవహించే నదులు, తూర్పున ఉన్న బంగాళాఖాతంతో లయమవటానికి అటు వైపు ప్రవహిస్తాయి.

**పశ్చాత్ప్రతీచ్యస్తాస్సముద్రాత్–** పడమర వైపు ప్రవహించే నదులు, పడమరవైపున్న సముద్రంలో లయమవటానికి అటువైపు ప్రవహిస్తాయి.

**సముద్రమేవాపియన్తి –** తూర్పువైపు ప్రవహించినా, పశ్చిమం వైపు

ప్రవహించినా చివరకు సముద్రంలోనే కలుస్తాయి. కలవగానే వాటి భిన్నత్వం పోతుంది. గంగ, యమున అనే తేడాలు తెలియవు. మళ్ళీ వానాకాలంలో సముద్రపు నీరు మేఘాలలోకి వెళ్ళి, వానగా కురిసి మళ్ళీ గంగ, యమునా లాంటి నదులుగా పుడతాయి. మళ్ళీ సముద్రంలో కలుస్తాయి. పునరపి జననం, పునరపి మరణం. నదులు జీవాత్మ. సముద్రం పరమాత్మ!

ఇది కూడా కవితాధోరణిలో సాగుతున్నది. నదులకు రెండు విషయాలు తెలియవు! సముద్రంలో కలిశాక, వాటి భిన్నత్వం తెలియదు. నేను గంగను, నేను యమునను అని తెలుసుకోలేవు.

2.మళ్ళీ పుట్టాక, నేను సముద్రంలో లయం చెంది సముద్రం నుంచి వచ్చాను అనీ తెలుసుకోలేవు.అంటే లయమూ తెలియదు. పుట్టుకా తెలియదు.

**సముద్రాత్సముద్రమేవా౽పియన్తి –** సముద్రం నుంచి వచ్చి, సముద్రంలోనే లయమవుతున్నాయి.

**న సముద్ర ఏవ భవతి –** సముద్రమే అవుతున్నాయి. ఏమిటి సమస్య?

**తా యథా తత్ర న విదుః –** వాటికి జ్ఞానం లేదు. ఏ జ్ఞానం?

**ఇయమహమస్మీయమహమస్మీతి–** సముద్రంలో కలిశాక, నేను గంగ, నేను యమున అనే జ్ఞానం లేదు. దీనికి ఇంకో వాక్యం కలుపుకోవాలి. సముద్రంలో కలిసినప్పుడు, నేను గంగను, నేను యమునను అనే జ్ఞానం లేదు. మళ్ళీ నదులుగా పుట్టాక, 'మేము సముద్రం నుంచి వచ్చాము. సముద్రంలో లయమవుతాము' అనే జ్ఞాపకం లేదు. జ్ఞానం లేదు. జ్ఞాపకం లేదు. అలాగే జీవికి నేను బ్రహ్మలో లయమవుతున్నాను అనే జ్ఞానం లేదు. బ్రహ్మ నుంచి వచ్చాను అనే జ్ఞాపకమూ లేదు. అది తర్వాత వచ్చే మంత్రంలో వస్తుంది. మొదటి మంత్రం దృష్టాంతం, రెండో మంత్రం ద్రాష్టాంతం.

**మంత్రం–2–ఏవమేవఖలుసోమ్య–** నది ఉదాహరణను జీవాత్మకు వర్తిస్తున్నాడు. ఇదే విధంగా సోమ్య:

**ఇమాస్సర్వాఃప్రజా –** అందరు మనుష్యులూ అద్వైత అనుభవాన్ని పొందుతున్నారు. మనమేమో నిర్వికల్ప సమాధిలో అద్వైత అనుభవం పొందాలని అవస్థపడుతున్నాము కాని ఈశ్వరుడు సహజమైన నిర్వికల్ప సమాధిని ఇచ్చాడు. బ్రహ్మలో లయం అవుతున్నాం, మళ్ళీ బ్రహ్మ నుంచి వస్తున్నాము. కాని మనకు అది తెలియదు. నిజానికి మనకు రెండు

అనుభవాలూ ఇచ్చాడు దేవుడు. జాగ్రద్, స్వప్నావస్థల్లో ద్వైత అనుభవాన్ని ఇచ్చాడు. సుషుప్తిలో అద్వైత అనుభవాన్ని ఇచ్చాడు. మన సమస్య అనుభవం లేకపోవటం కాదు. ఏ అనుభవం మన స్వస్వరూపమో తెలియకపోవటం. ఏది సహజం, ఏది వేషం?

రీడర్స్ డైజెస్ట్‌లో ఎప్పుడో ఒక వ్యాసం వచ్చింది. అందులో ఏదో యుద్ధంలో ఒక గూఢచారి అనుభవం గురించి వస్తుంది. అతను ఎన్నో సంవత్సరాలు గూఢచారిగా ఉండిపోయాడు. తన అసలు పేరేమిటో, తనెవరో ఎవరికీ చెప్పకుండా కాలం గడిపేశాడు. దానివల్ల దాదాపుగా తనే తన నిజరూపం కోల్పోయాడు. మళ్ళీ తన అసలు పేరులోకి, అసలు వ్యక్తిత్వంలోకి రావటానికి అతనికి చాలా కాలం పట్టింది. అతను తన వేషంలో ఉండిపోయాడు. దాన్ని విపరీత భావన అంటారు. అలా మనం కూడా మన వేషంలో ఉండిపోతున్నాము.

అసలు 'నేను' ఎవరు? బ్రహ్మను! కాని నేనేం చేశాను? వేషం వేసుకున్నాను! అమ్మ, అక్క, చెల్లి లాంటి రకరకాల వేషాలు; ఏది వేషమో, ఏది నిజమో తెలుసుకోలేకుండా ఉన్నాను!

**సత ఆగమ్య –** సకల ప్రాణులూ, గ్రీన్‌రూమ్ నుంచి వస్తాయి. ఏమిటా గ్రీన్‌రూమ్? సుషుప్తి! ఎందుకంటే నిద్రలో మనం అద్వైత బ్రహ్మ స్వరూపంలో ఉంటాము. అక్కడ్నుంచి ఈ జీవితమనే నాటకం ఆడటానికి వస్తాము.

**నవిదుస్సత ఆగచ్ఛామహ ఇతి –** కాని మనం బ్రహ్మ అనే గ్రీన్ రూమ్ నుంచి వచ్చామని తెలియదు. ఇది నాటకం అనీ తెలియదు. మన స్వరూపం బ్రహ్మ. ఇది వేషం. ఇది బ్రహ్మ ఆడించే వేషం. అందుకే బ్రహ్మను (కపట) నాటక సూత్రధారి అంటారు. దానికి కథ మన ప్రారబ్ధం. వాయిద్యాలు వాయించే వాళ్ళు పాటను వాళ్ళ ముందు పెట్టుకుంటారు. అలా మన ప్రారబ్ధాన్ని చూస్తూ భగవానుడు ఆడిస్తే, మనం నవ్వుతున్నాం, ఏడుస్తున్నాం. కాని ఇదంతా నాటకం అని తెలియటం లేదు.

రామ, రావణ పాత్రధారులు గ్రీన్‌రూమ్‌లో ఆడుతూ, పాడుతూ కబుర్లు చెప్పుకుంటారు. మంచి స్నేహితులుగా కష్టం, సుఖం పంచుకుంటారు. కాని స్టేజి మీదకు వచ్చేసరికి రావణాసురుడు, రాముడిని ఉగ్రంగా చూస్తాడు. ఎందుకు ఈ మార్పు? వాళ్ళకు నిజమేదో, వాళ్ళ వేషమేదో తెలుసు. కాని

మనకు సత్ ఆగమ్య న విదుః– సత్ నుంచి వస్తున్నామని తెలియదు.దానికి ఉదాహరణగా మళ్ళీ ఇంతకుముందు చెప్పిన జంతువుల పేర్లన్నీ చెపుతున్నది. పులి, సింహం, తోడేలు, వరాహం, కీటకం, పక్షి, అడవి ఈగ, దోమ.

**యద్యద్భవన్తి తదా భవన్తి–** ఆ జంతువుల ఏవిగా నిద్రపోతాయో, అవే రూపంలో మేల్కొంటాయి.

అంతకుముందు **సత్ సమ్పద్య న విదుః –** సత్‌లో లయమయినట్టు తెలియదు.

ఇప్పుడు **సత ఆగమ్య న విదుః–** సత్ నుంచి వచ్చినట్టు తెలియదు.

**మంత్రం–3–** ఇది ప్రతి ఖండానికీ వస్తుంది. దీని సారాంశం బ్రహ్మ శుద్ధ సత్తా, అదే జగత్తతంటికీ ఆత్మ. అది నువ్వే.

**ఏకాదశః ఖణ్డః (11)**

**అస్య సోమ్య మహతో వృక్షస్య యో మూలేఽభ్యాహన్యాజ్జీవన్ స్రవేద్యో మధ్యేఽభ్యాహన్యా జ్జీవన్ స్రవేద్యోఽగ్రేఽభ్యాహన్యాజ్జీవన్ స్రవేత్స ఏష జీవేనాత్మనాఽనుప్రభూతః పేపీయమానో మోదమానస్తిష్ఠతి ॥1॥ అస్య యదేకాం శాఖాం జీవో జహాత్యథ సా శుష్యతి ద్వితీయాం జహాత్యథ సా శు ష్యతి తృతీయాం జహాత్యథ సా శుష్యతి సర్వం జహాతి సర్వశ్శుష్యతి ॥2॥ ఏవమేవ ఖలు సోమ్య విద్ధీతి హెూవాచ జీవాపేతం వావ కిలేదం మ్రియతే న జీవో మ్రియత ఇతి స య ఏషోఽణి మైతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో ఇతి భూయ ఏవ మా భగవాన్ విజ్ఞాపయత్వితి తథా సోమ్యేతి హెూవాచ ॥3॥**

**3. మరణించాక జీవాత్మ ఉంటుందంటే, నాకు ఎందుకు తెలియటం లేదు?**

ఈ ప్రశ్నకు జవాబు ఈ ఖండంలో వృక్ష దృష్టాంతం ద్వారా వస్తుంది.

మనం చైతన్యం గురించి 5 లక్షణాలు చెప్పుకుంటాము.అందులో ఇప్పుడు మనకు అవసరమైనవి చూద్దాము.

1. చైతన్యం శరీరంలో ఒక భాగం కాని లక్షణం కాని కాదు.
2. శరీరం నాశనమయినా, చైతన్యం నాశనమవదు. శరీరం పతనం చెందాక కూడా చైతన్యం ఉంటుంది.
3. చైతన్యం ఉన్నా కనబడదు. ఎందుకంటే దాన్ని ప్రతిబింబింపజేసే

శరీరం లేదు కాబట్టి. అంత మాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

మరణించాక చైతన్యం (జీవాత్మ ఉంటుందంటే) నాకు ఎందుకు తెలియటం లేదు? ఇదీ ప్రశ్న.

మరణానికి దగ్గరగా ఉన్న అనుభవం సుషుప్తి. నిద్రలో నేను ఉన్నాను. కాని నిద్రలో ఉండగా 'నేను ఉన్నాను', అని నేను చెప్పను, చెప్పలేను. లేచాక చెప్పగలను. కాని ఇప్పుడు మనం మాట్లాడేది నిద్ర గురించి. నిద్రలో కర్త, ప్రమాత ఉండరు కదా! కర్త, ప్రమాత కావాలంటే స్థూలశరీరం కావాలి. అలాగే మరణించటం అంటే స్థూలశరీర మాధ్యమం ఉండదు. అందుకని మాధ్యమం లేకపోతే చైతన్యం ఉన్నట్టు తెలియదు.

మరణంకు సమీప ఉదాహరణ సుషుప్తి అయితే, పునర్జన్మకు సమీప ఉదాహరణ స్వప్నం. స్వప్నంలో నేను జాగ్రద్ ప్రపంచం నుంచి విడివడతాను. ఆ ప్రపంచం వేరు. ఆ శరీరం వేరు. నేను జాగ్రద్ శరీరాన్ని వదిలి,స్వప్న శరీరాన్ని ధరిస్తాను. అలాగే మరణం తర్వాత ఈ శరీరాన్ని వదిలి, ఈ వాసనలతోనే ఇంకో శరీరాన్ని ధరించి, వ్యవహారాలు నడిపిస్తాను. ఇదే పునర్జన్మ.

పునర్జన్మకు నిదర్శనం ఈ దృష్టాంతం. ఇది వృక్ష దృష్టాంతం. తమాషా ఏమిటంటే ఛాందోగ్యోపనిషత్తు మన చుట్టూ ఉన్న చిన్న చిన్న విషయాలే తీసుకుని, పెద్ద బోధ చేస్తున్నది. ఇంతకుముందు తేనె, నదుల గురించి చెప్పింది. ఇప్పుడు పెద్ద చెట్టును తీసుకుంది.

చెట్లను స్థావరంగా వర్ణించినా, వాటిలో చెట్టు అంతటా వ్యాపించి జీవం ఉంటుంది. స్థావరం అంటే కదలిక లేనిది. వాటికి కూడా ఒక స్థూల శరీరం ఉంది. కష్టసుఖాలు వాటికీ తెలుస్తాయి. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**మంత్రం - 1-అస్య సోమ్య మహతో వృక్షస్య-** ఓ సోమ్య, ఈ పెద్ద చెట్టు వైపు చూడు. (ఆశ్రమం దగ్గరే ఉన్నట్టుగా ఊహించుకోవాలి).

**యో మూలేఽభ్యాహన్యాత్-** మూలం అంటే కింద భాగంలో, అభ్యాహన్యా అంటే కొట్టు. గొడ్డలితోనో, పెద్ద రాయితోనో అనుకోవచ్చు.

జీవన్ స్రవేత్- ఏమవుతుంది? దాంట్లో జీవం ఉందని తెలుస్తుంది, ఎందుకంటే దాన్నించి రసం కారుతుంది. జీవన్ అంటే జీవం.

**మధ్యేఽ భ్యాహన్యా జ్జీవన్‌స్రవేత్–** మధ్యభాగంలో కొట్టినా కూడ, రసం కారుతుంది.

**అగ్రేఽ భ్యాహన్యాజ్జీవన్ స్రవేత్–** ఆ చెట్టులో జీవం ఉందని నీకు ఇంకా నిదర్శనం కావాలా? అయితే పైభాగంలో కూడా కొట్టు. రసం కారుతుంది.

దీన్నిబట్టి ఏం తెలుస్తుంది? జీవాత్మ చెట్టు అంతటా ఉంది. కొమ్మ కొమ్మలోనూ, ప్రతి ఆకులోనూ, అంతటా ఉంది.

**స ఏష జీవేనాత్మనః –** దానిలో ఉన్న జీవాత్మ వల్ల చెట్టులో చైతన్యం ఉంది.

**అనుప్రభూతః –** అంతే కాదు ఇందులో కనపడకుండా జీవ తత్త్వం ఉంది. జీవతత్త్వం అంటే చైతన్య తత్త్వం. అందులో జీవం ఉంది కాబట్టి–

**పేపీయమానః –** భూమి నుంచి నీటిని త్రాగుతున్నాయి. అంతేకాదు,

**మోదమానస్తిష్ఠతి–** చెట్లకు నీళ్ళు పోస్తే, అవి చిరునవ్వు చిందిస్తూ సంతోషంగా ఉంటాయిట.

**మంత్రం–2–** ఆ పెద్ద చెట్టును గమనిస్తూ ఉంటే, కొంతకాలమయ్యాక దానిలోంచి కొన్నికొమ్మలు ఎండిపోయి పడిపోతాయి. అంటే వాటిలో జీవం ఉండదు. వాటిని కోస్తే రసం కారదు. ఎందుకు అవి ఎండిపోయాయి? ఆ కొమ్మల ప్రారబ్ధకర్మ ముగిసిపోయింది. చెట్టులోని భాగాలకు కూడా జీవ సంబంధం ఉంటుంది. చెట్టులో ఒక కొమ్మ ఎండిపోయిందంటే ఆ కొమ్మలో ఉన్న జీవం ఏమవుతుంది? దీన్ని ఆలోచించమంటున్నది ఉపనిషత్తు.

కొమ్మ ఎండిపోయి పడిపోయింది. కాని జీవాత్మ మరణించలేదు. ఎందుకంటే జీవి చెట్టులో మిగతా భాగాలు అంతా వ్యాపించి వాటికి చైతన్యం అందచేస్తున్నది. అందుకని జీవాత్మ మరణించలేదు. కేవలం ఆ కొమ్మకు చైతన్యాన్ని అందచేయటం లేదు. ఏమిటి నిదర్శనం? ఇంతకుముందు చెప్పినట్టుగా వేరే ఏదైనా భాగంలో కొట్టి చూస్తే రసం కారుతుంది. అలా కొంత కాలమయ్యాక ఇంకో కొమ్మ రాలుతుంది. **కొమ్మ మరణం, జీవాత్మ మరణం కాదు.** అయితే ఏమని చెప్పాలి? కొమ్మ మరణించిందంటే, ఆ భాగానికి జీవాత్మ చైతన్యాన్ని అందించటం లేదు.

ఈ ఉదాహరణ వల్ల మనకు మరణం గురించి కొత్త నిర్వచనం వస్తున్నది. కొమ్మ మరణిస్తే జీవాత్మ మరణించినట్టు కాదు. **కొమ్మ మరణిస్తే, జీవాత్మ ఆ కొమ్మను విడిచిపెట్టినట్టు.** మూడు కొమ్మల గురించి వస్తుంది.

**అస్య యదేకాం శాఖాం జీవో జహాత్యథ సా శుష్యతి** – ఈ చెట్టు కొమ్మల్లో ఒకదాన్ని జీవుడు విడిచిపెట్టే పక్షంలో ఆ కొమ్మ ఎండిపోతుంది.
**ద్వితీయం జహాత్యథ సా శుష్యతి**– రెండో కొమ్మను విడిచిపెడితే, అది ఎండిపోతుంది.
**తృతీయాం జహాత్యథ సా శుష్యతి**– మూడో దానిని కూడా విడిచిపెడితే, అదీ ఎండిపోతుంది.
**సర్వం జహాతి సర్వశ్శుష్యతి**– దీన్నే చెట్టు మొత్తానికి వర్తిస్తే, చెట్టు మరణిస్తే, జీవుడు మరణించాడు అనకూడదు. జీవుడు చెట్టును విడిచిపెట్టాడు అనాలి.
**మంత్రం–3**–చెట్టు దృష్టాంతం చూశాక, దాన్ని మనిషి శరీరానికి అన్వయించుకోవాలి. మనకు కొమ్మలు లేవు కాని అనేక శరీర అంగాలు ఉన్నాయి. జుట్టు రాలినా, పళ్ళు ఊడినా, కంటి చూపు ఆనకపోయినా, వినికిడి శక్తి తగ్గినా జీవుడు పోలేదు. జీవుడు ఆయాభాగాలను విడిచిపెట్టాడు.
**ఏవమేవఖలుసోమ్యవిద్ధీతి హెూవాచ– ఓ సోమ్య!** ఈ విధంగా తెలుసుకో.
**జీవాపేతం వావ కిలేదం మ్రియతే న జీవో మ్రియత ఇతి** – ఇదం అంటే స్థూలశరీరం.అక్కడ చెట్టు, ఇక్కడ శరీరం. జీవ అపేతం. జీవునిచే విడిచిపెట్టబడిన ఈ శరీరం; జీవుడు శరీరాన్ని ఎప్పుడు విడిచిపెడతాడు? ప్రారబ్ధకర్మ ముగియగానే! కొన్ని భాగాలకు ముందు ముగియటం వల్ల ఆయా భాగాలు పనిచేయవు.
ఇదం శరీరం మ్రియతే జీవో న మ్రియతే – శరీరం పడిపోయినా, జీవుడు మరణించడు. అందుకని శరీరం మరణించింది అనాలి కాని, జీవుడు మరణించాడు అనకూడదు. జీవుడు శరీరాన్ని విడిచిపెట్టాడు అనాలి. జీవుడు అనాది. అందువల్ల నువ్వు శరీరానివి కాదు, శరీరానికి చైతన్యాన్ని ఇస్తున్నావు. నీ స్వరూపమేమిటి?

**ఐతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో**

నిజానికి జీవుడు విదేహ ముక్తి పొందేంతవరకూ అనాది, అనంతం. భగవంతుడు కొత్తగా దేన్నీ సృష్టించటం లేదు. అలా కొత్తగా సృష్టించాల్సి వస్తే, అతనికి ఎటువంటి **కర్మను** ఇవ్వాలి? కర్మను బట్టే స్థూలశరీరం వస్తుందని చూశాము కదా! అందుకని భగవంతుడు తనకు తోచినట్టు సృష్టించి, తనకు తోచినట్టు పుణ్యపాపాలు ఇస్తే అతనికి **వైషమ్యనైర్ఘ్యణ్యదోషం**

అంటుకుంటుంది. కర్మ అనాది కాబట్టి జీవుడు అనాది. జీవుడు అనాది కాబట్టి సృష్టి అనాది. అందువల్ల ఈశ్వరుడు, జీవుడు, జగత్తు, కర్మ, సృష్టి, అవిద్య– అన్నీ అనాది.

ఇందాక దేవుని పరంగా చూశాము. ఇప్పుడు జీవునిపరంగా చూద్దాము. మరణం అప్పుడు జీవుడు కూడా మరణించాడు అనుకుందాము. అప్పుడు అతని సంచితకర్మలు అలాగే మిగిలిపోతాయి. వాటిని ఎవరికి ఇవ్వాలి? ఇంకోజీవిని సృష్టించి, ఇదుగో నువ్వు ఆ జీవి సంచిత కర్మలు అనుభవించు అని అనగలడా? అలా చేస్తే అది **అకృత అభాగ్యమదోషం** అవుతుంది. అంటే చేయని తప్పులకు శిక్ష అనుభవించటం అవుతుంది.

ఇంకో సమస్య కూడా ఉంటుంది. పైన చేయని తప్పుకు శిక్ష అనుభవిస్తాడు అంటున్నాము. ఇప్పుడు కొందరు తప్పులు చేశారు కాని వాటి శిక్షను అనుభవించకుండానే మరణించారు. అంటే వాళ్ళు కర్త అయ్యారు కాని భోక్త అవలేరు. అప్పుడు అది **కృతహానదోషం** అవుతుంది. అంటే చేసిన తప్పులను తప్పించుకున్నారు.

ఒకచోట తప్పు చేయకుండా శిక్ష అనుభవిస్తే, ఇంకోచోట చేసిన తప్పుకు శిక్ష అనుభవించకుండా తప్పించుకుంటారు. రెంటినీ కలిపి **కృతహాన అకృత అభ్యాగమదోషం** అంటారు. అటువంటి అక్రమం ఉంటుందా?

**న జీవో మ్రియతేऽ కృతహాన అకృత అభ్యాగమ దోష ప్రసంగాత్** శరీరం మరణించినా జీవుడు మరణించడు.

ఇక్కడ అప్రస్తుతం అయినా, దీనికి సంబంధించిన విషయం కాబట్టి, ఇంకో విషయం కూడా చూద్దాము. జ్ఞాని విదేహముక్తి పొందుతాడు. అతను మళ్ళీ పుట్టడు అని చూశాము. అలా అయితే, తర్వాతి సృష్టికి ఒక జీవి తగ్గుతాడు. **భగవానుడు అతనిబదులుగా ఇంకో జీవిని సృష్టిస్తాడా?** సృష్టించడు. ఎందుకంటే, జీవి పుట్టుక అతని కర్మను బట్టే ఉంటుందని ఇప్పుడే చూశాము కదా! కొత్తగా సృష్టిస్తే అతనికి ఏ కర్మ ఇవ్వాలి? అందుకని అతని లోటు అలాగే ఉంటుంది.

అలా అయితే, ఒక్కొక్క సృష్టిలోనూ కొంతమంది విదేహముక్తి పొందుతూ వస్తారు కదా! చివరికి ఇంక భగవానుడు సృష్టించటానికి ఎవరూ ఉండరేమో? అప్పుడు భగవానుడు కూడా ఉండడేమో! జీవులు ఉంటేనే

కదా, భగవానునికి ఉనికి! అలాంటి సందర్భమే రాదు. సృష్టి అనంతం. అనంతం–1= అనంతం. అందుకని భగవానునికి చేతినిండా పని ఉంటూనే ఉంటుంది. ఆయనకి పని ఉండనుకోవటం అర్థం లేని ఆలోచన.

**ద్వాదశః ఖణ్డః (12)**

**న్యగ్రోధఫలమత ఆహరేతీదం భగవ ఇతి భిన్ద్ధీతి భిన్నం భగవ ఇతి కిమత్ర పశ్యసీత్యణ్వ్య ఇవేమా ధానా భగవ ఇత్యాసామఙ్గైకాం భిన్ద్ధీతి భిన్నా భగవ ఇతి కిమత్ర పశ్యసీతి న కిఞ్చన భగవ ఇతి ॥1॥ తగ్ం హోవాచ యం వై సోమ్యైతమణిమానం న నిభాలయస ఏతస్య వై సోమ్యైషోఽణిమ్న ఏవం మహాన్న్యగ్రోధస్తిష్ఠతి శ్రద్ధత్స్వ సోమ్యేతి॥2॥ స య ఏషోఽణిమైతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో ఇతి భూయ ఏవ మా భగవాన్ విజ్ఞాపయత్వితి తథా సోమ్యేతి హోవాచ ॥3॥**

**4. ఇంద్రియ అగోచరమైన కారణం, ఇంద్రియగోచరమైన కార్యాన్ని ఎలా ఉత్పత్తి చేయగలదు?**

ఈ ప్రశ్నకు జవాబు ఈ ఖండంలో న్యగ్రోధ దృష్టాంతం ద్వారా వస్తుంది.

కార్యకారణ సంబంధం చూస్తే రెండు రకాలు ఉంటాయి.

1. కారణం కంటికి కనపడుతుంది. స్పర్శకు తెలుస్తుంది. కార్యం తెలియదు. ఉదాహరణకు మట్టి, కుండ తీసుకోండి.

ఇందులో కారణం తెలుస్తున్నది. కార్యం తెలియటం లేదు.

ఎ) కుండను పట్టుకుంటే ఎక్కడ చూసినా మట్టే ఉంది. కార్యం కేవలం నామరూపాలే.

బి) బరువు తూస్తే ఆ బరువు కుండదా, మట్టిదా? నిస్సందేహంగా మట్టిదే.

2. కారణం కంటికి కనబడదు. స్పర్శకు తెలియదు. కార్యం తెలుస్తుంది.

వాయురూపంలో ఉన్న హైడ్రోజన్, ఆక్సిజన్ కలిపి ద్రవరూపమైన నీరుగా, ఘనరూపమైన మంచుగా మారుతాయి. ఇక్కడ కారణం కంటికి కనబడటం లేదు. స్పర్శకు తెలియటం లేదు.

సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ– శుద్ధచైతన్యం– కారణం బ్రహ్మ తెలుస్తుందా?

**యత్ తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్ అచక్షుః శ్రోత్రం తదపాణిపాదమ్ - ముండక 1-1-6**

**ప్రమాణ అగోచరం -** ప్రమాణాలకందని బ్రహ్మ ఇంత విశాల జగత్తును ఎలా సృష్టించగలదు! దానికి ఉద్దాలకుడు ఒక పెద్ద మర్రి వృక్షాన్ని ఉదాహరణగా తీసుకున్నాడు. మర్రిచెట్టు గింజ తెరిచి చూస్తే దానిలో ఏమీ కనబడదు. కాని దానిలో పెద్ద మర్రి చెట్టు దాగి ఉంది. కంటికి కనబడే, స్పర్శను తెలిపే ఒక మహా వృక్షం వస్తుంది. అదీ ఉదాహరణ. మర్రిచెట్టు వీరి దరిదాపుల్లో ఉన్నట్టుగా ఊహించుకోవాలి. ఇప్పుడు మంత్రం చూద్దాం.
**న్యగ్రోధ ఫలమత ఆహరేతి-** ఉద్దాలకుడు శ్వేతకేతుకు చెపుతున్నాడు. ఈ మర్రిచెట్టు నుంచి ఒక మర్రి పండును తీసుకురా అని. ఫలం అంటే పండు; అత- చెట్టు నుంచి; ఆ హర- తీసుకురా. న్యగ్రోధ అంటే మర్రిచెట్టు. శ్వేతకేతు ఏం చేస్తాడు?
**ఇదం భగవ ఇతి-** ఇదుగో భగవాన్. ఇతి సంభాషణను సూచిస్తుంది.
**భింద్ధీతి -** భింద్ధి అంటే పండును పగులగొట్టు.
**భిన్నం భగవ ఇతి -** ఇదుగో భగవాన్ పగులగొట్టాను.
**కిమత్ర పశ్యసీతి -** దీంట్లో ఏం చూస్తున్నావు? గురువు ప్రశ్న
**అణ్వ్య ఇవేమా ధానా భగవ ఇతి -** అణువుల లాంటి చిన్న గింజలు ఉన్నాయి. ధానా అంటే చిన్న గింజలు.
**ఆ సామఙ్గైకాం భింద్ధీతి -** అంగ అంటే సోమ్యకు ఇంకో పదం. ఏకాం భింద్ధీతి - ఒక గింజను పగులగొట్టు.
**భిన్నా భగవ ఇతి-** గురువు ఏం చెబితే అది చేస్తున్నాడు. ఇలాంటి శిష్యుడిని యథోక్తకారి శిష్యః అంటారు. పగులగొట్టాను భగవాన్ అన్నాడు.
**కిమత్ర పశ్యసీతి -** దీంట్లో ఏం చూస్తున్నావు?
**న కిఞ్చన భగవ ఇతి -** ఏమీ కనబడటం లేదు భగవాన్.
**తద్ధైక ఆహురసదేవేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయం తస్మాదసతస్సజ్జాయత**

సృష్టికి ముందు అసత్తే ఉంది. అది ఒకటి మాత్రమే రెండవది లేనిది. ఆ అసత్ నుంచి సద్రూపమైన, ఇంద్రియ గోచరమైన జగత్తు పుట్టింది. ఆ వాదనను బలపరుస్తున్నట్టుగా ఇప్పుడు అనిపిస్తుంది. కాని దాన్ని అప్పుడు సనత్కుమారుడు ఖండించాడు. ఇప్పుడు ఉదాహరణ ద్వారా ఖండిస్తున్నాడు.

కంటికి కనబడనంత మాత్రాన ఈ గింజలో ఏమీ లేదని కొట్టి పారేయలేము. అందులో ఈ మహా వృక్షం అవ్యక్తరూపంలో ఉందని, తర్కపరంగా ఆలోచించి,అర్థం చేసుకోవాలి. అంత చిన్న గింజ నుంచి ఏం వస్తుందని, ఒక పెద్ద రాయిని పాతిపెట్టి నీళ్ళు పోస్తే, చెట్టు వస్తుందా? ఎన్నేళ్ళైనా రాదు. శ్రమ దండుగ, నీరు వృధా అవటం తప్ప. అదే ఇంత చిన్న గింజను పాతిపెడితే పెద్ద మర్రి చెట్టు వస్తుంది. అలా ఒక చిన్న చెర్రీ గింజను ఒక చిన్న కుర్రవాడు పాతిపెడితే, అది ఎలా పెద్ద చెర్రీ వృక్షమయిందో, ఆ కుర్రవాని భావాలేమిటో దశలవారీగా చాలా చక్కగా వర్ణిస్తాడు రచయిత 'ది చెర్రీ ట్రీ' అనే కథలో.

**మంత్రం-2- తగ్ం హోవాచ-** తండ్రి చెపుతున్నాడు

**యం వై సోమ్యైతమణిమానం న నిభాలయస- ఓ సోమ్య,** అవ్యక్త రూపంలోనున్న మర్రిచెట్టును నువ్వు చూడలేకపోతున్నావు. న నిభాలయస అంటే చూడలేపోతున్నావు. ఇంద్రియ అగోచరం. కాని దాని గొప్పదనం చూశావా? అంత చిన్న చుక్కలాంటి దాన్నించి, ఇంత మహా వృక్షంగా వెలిగిపోతున్న మర్రిచెట్టు వచ్చింది.

**ఏతస్య వై సోమ్యైషోఽ ణిమ్న ఏవం మహాన్న్యగ్రోధస్తిష్ఠతి-** ఇంత చిన్న చుక్క నుంచి వచ్చిన కార్యం ఈ చెట్టు. దాన్ని ఏవం మహాన్న్యగ్రోథోతిష్టతి అన్నాడు. కంటికి కనబడే, పెద్ద వృక్షం.

**శ్రద్ధత్స్వ సోమ్యేతి-** నమ్మశక్యం కానిదిగా ఉంది కదూ! అయినా నమ్మకం పెంచుకో!

అతిసూక్ష్మంగా ఉన్న గింజ మహా వృక్షానికి కారణమయింది.అలాగే **కంటికి కనబడని బ్రహ్మ ఎంతో విశాలమైన జగత్తుకు కారణమయింది.**

**మంత్రం-3-** ఆ సూక్ష్మమైన బ్రహ్మ జగత్తంతా నిండి ఉంది. అది నువ్వే.

## త్రయోదశః ఖణ్డః (13)

**లవణమేతదుదకేఽ వధాయాథ మా ప్రాతరుపసీదథా ఇతి స తథా చకార తగ్ం హోవాచ తద్దోషా లవణముదకేఽ వాధా అఙ్గ తదాహరేతి తద్ధావమృశ్య న వివేద ॥1॥ యథా విలీనమేవాఙ్గా స్యాన్తాదాచామేతి కథమితి లవణమితి మధ్యాదాచామేతి కథమితి లవణమిత్యన్తాదాచామేతి కథమితి**

**లవణమిత్యభిప్రాస్యైతదథ మోపసీదథా ఇతి తద్ధ తథా చకార తచ్ఛశ్వత్సంవర్తతే తగ్ం హెూవాచాత్ర వావ కిల సత్సోమ్య న నిభాలయసేఽ త్రైవ కిలేతి ॥2॥ స య ఏషోఽ ణిమైతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో ఇతి భూయ ఏవ మా భగవాన్ విజ్ఞాపయత్వితి తథా సోమ్యేతి హెూవాచ ॥3॥**

**5.బ్రహ్మ జగత్తంతా నిండి ఉంటే- నాకెందుకు కనబడటం లేదు లేదా తెలియటం లేదు?**

ఈ ప్రశ్నకు జవాబు ఈ ఖండంలో లవణ దృష్టాంతం ద్వారా వస్తుంది. కార్యమంతటా కారణం ఉంది. నిజమే.

బంగారు ఆభరణంలో బంగారాన్ని చూడగలుగుతున్నాము, మట్టి కుండ అంతటా మట్టిని చూడగలుగుతున్నాము. కాని మరి బ్రహ్మను ఎందుకు చూడలేకున్నాములేదా తెలుసుకోలేకున్నాము? జగత్తు కార్యమైతే కార్యమంతటా కారణ బ్రహ్మ ఉంటే తెలియాలి కదా!

బ్రహ్మ తెలియనంత మాత్రాన బ్రహ్మలేదు, ఉన్నదంతా అసత్తే అనకూడదు. బ్రహ్మ తెలియటం లేదు అంటే బ్రహ్మను తెలుసుకునే ప్రమాణం వాడటం లేదు అని అర్థం.

**బ్రహ్మ అభావాత్ న అదర్శనం పరంతు;**
**ప్రమాణ అభావాత్ ఏవ అదర్శనమ్.**

అందువల్ల, సరియైన ప్రమాణాన్ని వాడాలి.మనకు తెలిసిన ఐదు ప్రమాణాలు బ్రహ్మను తెలుసుకోవటానికి పనిచేయవు. ఏమిటవి? ప్రత్యక్ష, అనుమాన, ఉపమాన, అర్థాపత్తి, అనుపలబ్ధి ప్రమాణాలు. ఇవి కాక ఆరో ప్రమాణం ఉంది. దాన్ని శబ్దప్రమాణం అంటారు. **దాన్ని గురుశాస్త్ర ఉపదేశ ప్రమాణం** అని కూడా అంటారు. ఒక ప్రమాణానికి అందనిది, ఇంకో ప్రమాణానికి అందుతుందని నిరూపించబోతున్నాడు ఉద్దాలకుడు. ఒక చిన్న ప్రయోగం చేయిస్తాడు ఉద్దాలకుడు. దీన్ని **లవణదృష్టాంతం** అంటారు. చాలా చిన్న ప్రయోగం. ఖర్చులేని వ్యవహారం. కేవలం ఒక గ్లాసు, ఒక పెద్ద ఉప్పు కణిక, కొంచెం నీళ్ళు అంతే. దీంట్లోంచి వేదాంతసారం ఔపోసన పడుతున్నాడు.

ముందురోజు రాత్రి ఉప్పు కణికెనిచ్చి నీళ్ళలో పోసి, మర్నాడు పొద్దున్న తన దగ్గరకు తీసుకు రమ్మన్నాడు. అలాగే చేశాడు శ్వేతకేతు. అప్పుడా ఉప్పును తీసివేయమంటాడు. అది కంటికి కనపడదు. చేతితో తడిమిచూస్తాడు. స్పర్శకు అందదు. అంటే రెండు ఇంద్రియాల శక్తులకు అందలేదు. చూపు, స్పర్శ. చక్షుప్రమాణంకు, త్వక్ ప్రమాణంకు అందలేదు. అయితే మూడు చోట్ల నుంచి తాగి చూడమంటాడు. అంతా ఉప్పగా ఉంటుంది. అంటే రుచికి అందింది. అందువల్ల ఒక ప్రమాణంకు అందనంత మాత్రాన లేదనకూడదు. పై ఉదాహరణ తీసుకుంటే, జగత్తు నీరు. ఉప్పు బ్రహ్మ! నీరంతటా ఉప్పు తెలిసినట్టు, జగత్తనే నీరు అంతటా బ్రహ్మ అనే ఉప్పు కరిగి, సర్వవ్యాపకమైంది.

**ఇందుఁ గలఁ డందు లేఁడని**
**సందేహము వలదు చక్రి సర్వోపగతుం**
**డెందెందు వెదకి చూచిన**
**నందందే గలడు దానవాగ్రణి! వింటే**

అలాగే బ్రహ్మ ఇంద్రియ ప్రమాణంకు అందనంతమాత్రాన లేదనేయకూడదు.

**బ్రహ్మణః ఔపనిషదత్వం-** అంటే బ్రహ్మను ఉపనిషద్ శాస్త్రం ద్వారానే తెలుసుకోగలము.

**ఉపనిషద్ ప్రమాణ మాత్ర అవగమ్యత్వమ్**

ఉపనిషత్తు చెపుతుంది. ప్రతి వస్తువులోనూ ఉంది, కాని నువ్వు గ్రహించటం లేదు అని. ది మైక్ ఈజ్, ది బుక్ ఈజ్, ది పెన్ ఈజ్ అనే పట్టికలో ఈజ్ ఈజ్ ఈజ్ ఏమిటి? ఉనికి. ఆ ఉనికిని మనం పట్టించు కోవటం లేదు. ఆ శుద్ధ సత్తాయే నీటిలో ఉప్పులా కరిగిన బ్రహ్మ. నీలో సత్ రూపంగానే కాదు, చిత్ రూపంలో కూడా ఉంది.

**శాస్త్ర ప్రమాణాత్ ఏవ బ్రహ్మజ్ఞానం**

ఇప్పుడు మంత్రం చూద్దాము.

**మంత్రం-1- లవణమే తదుదకేஉ ధాయా-** ఈ ఉప్పు కణికను నీళ్ళలో వెయ్యి.

**అథమా ప్రాతరుపసీదథా ఇతి –** దాని తర్వాత పొద్దున్న నా దగ్గరకు రా;
**స హ తథా చకార–** శ్వేతకేతు అలాగే చేశాడు.

మర్నాడు పొద్దున శ్వేతకేతు వచ్చినట్టు అర్థం చేసుకోవాలి.

**తగ్ంహోవాచ–** ఉద్దాలకుడు అతనితో అన్నాడు.

**తద్దోషా లవణముదకేవాధా –** నువ్వు నిన్న రాత్రి నీళ్ళలో ఏ ఉప్పు కణికను వేసావో;

**అఙ్గ తదాహరేతి –** అదే ఉప్పు కణికను తీసుకురా. అంగ అంటే సోమ్యలాంటి పదమే. తద్ ఆహర ఇతి– అదే ఉప్పుకణికెను తీసుకురా.

**తద్ధావమృశ్య న వివేద–** చేత్తో తడిమిచూస్తే, ఆ ఉప్పు కణిక దొరకలేదు.

స్పర్శకు తెలియలేదు అంటే త్వగింద్రియానికి దొరకలేదు. కంటికి కనపడటం లేదు కాబట్టి చక్షురింద్రియానికి కూడా అందటం లేదు. కన్ను బలమైన ప్రమాణమే అయినా దాని శక్తి పరిమితమైనదే. అంటే రంగు,రూపులను మాత్రమే అది చూడగలదు. ఇప్పుడు ఉప్పు త్వగ్ ఇంద్రియ అగోచరం చక్షురింద్రియ అగోచరం అయింది.

రెండు ప్రమాణాలు వాడినా వస్తువు కనపడలేదు. ఇప్పుడు నాకు రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి, ఇంకో ప్రమాణం ఉపయోగించి చూడటం; రెండు, అసలు ఉప్పు లేదని వాదించటం. ప్రమాణానికున్న పరిమితిని తెలుసుకోకుండా, నేను ప్రమేయాన్నే లేదనేస్తున్నాను. అలా ప్రమేయాన్ని లేదనటాన్ని నాస్తిక బుద్ధి అంటారు.

**అశ్రద్ధ ధానాః పురుషా ధర్మస్యాస్య పరంతప।**
**అప్రాప్య మాం నివర్తంతే మృత్యుసంసారవర్మని గీత – 9– 3**

ఇంద్రియ ప్రమాణాలు కాక, వేరే ప్రమాణం ఉందని తెలియనివారు, అపౌరుషేయ ప్రమాణం అయిన శ్రుతి ప్రమాణానికి రారు. శ్రుతి ప్రమాణానికి రాకుండా బ్రహ్మ లేదు అనేస్తారు. కాని శ్వేతకేతుకు శ్రద్ధ ఉంది. అందుకని తండ్రి అతన్ని ఇంకో ప్రమాణం వాడి చూడమంటున్నాడు. ఏమిటది? నాలుక.

**యథావిలీనమేవాఙ్గా స్యాన్తాదాచామేతి –** ఓ ప్రియతమా, ఆచమనం చేసినట్టుగా, కొంచెం నీరు, ఉప్పు కరిగిన నీటిని తాగి చూడు.

**కథమితి –** ఎలా ఉంది? తండ్రి ప్రశ్న.

**లవణమితి–** ఉప్పగా ఉంది. కుమారుని జవాబు.

**సర్వం ఖల్విదం లవణం**

**జ్ఞానికి- సర్వం ఖల్విదం బ్రహ్మ!**

అంటే బ్రహ్మను ఉప్పు నీరు తాగినట్టు తాగి చూడాలా అనకూడదు. ఇక్కడ విషయం ఒక ప్రమాణంకి అందకపోతే, ఇంకో ప్రమాణంకు అందుతుంది.

పైన మాత్రమే ఉప్పగా ఉందా?

**మధ్యాదాచామేతి కథమితి లవణమితి-** మధ్యలో కూడా ఉప్పగా ఉంది.

**అన్తాదాచామేతి కథమితి లవణమితి-** చివరి భాగంలో కూడా ఉప్పగా ఉంది. దీన్ని ఆధారంగా చేసుకుని ఉద్దాలకుడు బోధ చేయబోతున్నాడు.

**అభిప్రాస్యైతదథ మోపసీదథా ఇతి-** దాని తర్వాత నీళ్ళు పారేసి నా దగ్గరకు రా. శ్వేతకేతు యథోక్తకారీ శిష్యః అని చూశాము. అంటే గురువు చెప్పింది చెప్పినట్టుగా ఎదురు ప్రశ్నించకుండా చేసే శిష్యుడు. అలాగే నీళ్ళు పారబోశాడు.

**తద్ధ తథా చకార తచ్ఛశ్వత్సంవర్తతే-** ఈ వాక్యాన్ని ఉపనిషత్తు చెపుతున్నది. ఉప్పు నీటిలో అంతసేపూ ఉంది- అంతసేపూ ఉంటే ప్రయోగం జరిగినంతసేపూ ఉంది. స్పర్శ ద్వారా తెలియలేదు. వాగింద్రియం వాడినప్పుడు తెలిసింది.

**తగ్ం హోవాచ -** ఇది దృష్టిలో పెట్టుకుని శ్వేతకేతుతో ఉద్దాలకుడు అన్నాడు.

**అత్ర వావకిల సత్సోమ్య అత్రైవకిలేతి:-** శుద్ధబ్రహ్మ, ఉనికి రూపంలో సృష్టి అంతటా ఉంది. కనబడని ఉప్పు, కనబడే నీరంతటా ఉన్నట్టే, కనబడని బ్రహ్మ, కనపడే సృష్టి అంతా ఉంది. అత్ర అంటే ఈ జగత్తులో. మరి ఏమిటి సమస్య?

**న నిభాలయసే-** తెలుసుకోలేకపోతున్నావు- సృష్టి అంతటా బ్రహ్మ ఉన్నా ఎందుకు తెలుసుకోలేక పోతున్నావు? ఉనికిని తెలిపే ప్రమాణం కాక, వేరే ప్రమాణాలు వాడుతున్నావు. పంచప్రమాణాలు, అనాత్మకు చెందిన శబ్ద,స్పర్శ,రూప,రస గంధాలను మాత్రమే తెలుపుతాయి.

అందువల్ల బ్రహ్మను త్రోసి రాబుచ్చకు. లౌకిక ప్రమాణం పరిమితి తెలుసుకో. అవి అనాత్మనే చూపగలవు.

సృష్టి మొత్తం లయమయితే శుద్ధ సత్తా ఎలా ఉంటుంది?

**అహరహర్ బ్రహ్మ గమయతి**

ఆ అనుభవం రోజూ పొందుతూనే ఉన్నాము. నిద్రలో శబ్ద స్పర్శ రూప రస గంధాలు ఉండవు. ప్రమాణాలు, ప్రమేయాలు పనిచేయవు. నేను మాత్రమే ఉంటాను. ఎలా ఉంటాను? త్రిపుటి రహిత సత్తాగా; ప్రమాతా, ప్రమాణం, ప్రమేయాలనే బేధాలు ఏవి లేకుండా ఉంటాను.

**మంత్రం-3-** శుద్ధ సత్తా ఎక్కడ ఉంది? **తత్ త్వం అసి శ్వేతకేతో.** అది నువ్వే. శుద్ధసత్తాగా నేను ఎక్కడ ఉన్నాను? నేను సర్వవ్యాపకం.

**మయ్యేవ సకలం జాతం మయి ప్రతిష్ఠితమ్।**
**మయి సర్వం లయం యాతి - కైవల్యం**

**చతుర్దశ ఖణ్డః (14)**

**యథా సోమ్య పురుషం గన్ధారేభ్యోఽభినద్ధాక్షమానీయ తం తతోఽతిజనే విసృజేత్స యథా తత్ర ప్రాఙ్ వోదఙ్ వాఽధరాఙ్ వా ప్రత్యఙ్ వా ప్రధ్మాయీతాభినద్ధాక్ష ఆనీతోఽభినద్ధాక్షో విసృష్టః॥1॥ తస్య యథాఽభినహనం ప్రముచ్య ప్రబ్రూయాదేతాం దిశం గన్ధారా ఏతాం దిశం వ్రజేతి స గ్రామాద్గ్రామం పృచ్ఛన్ పణ్డితో మేధావీ గన్ధారానేవోపసంపద్యేత॥ ఏవమేవేహాచార్యవాన్ పురుషో వేద తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యేఽథ సమ్పత్స్య ఇతి ॥2॥ స య ఏషోఽణిమైతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో ఇతి భూయ ఏవ మా భగవాన్ విజ్ఞాపయత్వితి తథా సోమ్యేతి హోవాచ ॥3॥**

**6. శాస్త్ర ప్రమాణం చెప్పి ఊరుకోకుండా గురువుకు ఎందుకు ప్రాముఖ్యతనిచ్చింది?**

ఈ ప్రశ్నకు గంధార పురుష దృష్టాంతం ద్వారా జవాబు వస్తుంది.

ముందు ఖండంలో బ్రహ్మను శాస్త్ర ప్రమాణం ద్వారానే తెలుసుకోగలమన్నాము. అందుకే బ్రహ్మను ఔపనిషదమ్ అన్నారు.

**సర్వమ్ బ్రహ్మోపనిషదమ్। మాహమ్ బ్రహ్మ నిరాకుర్యాత్ మామా బ్రహ్మనిరాకరోత్ - శాంతి పాఠం**

గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలను కలిసి ప్రస్థాన త్రయం అంటారు. వాటినే అందరూ చదివినా, అనేకరకాలుగా అర్థం చేసుకున్నారు అనేకమంది. మనకు ఆరు ఆస్తిక దర్శనాలు, ఆరు నాస్తిక దర్శనాలు ఉన్నాయి. నాస్తిక దార్శనికులు వేదాలనే నమ్మరు. ఆస్తిక దార్శనికులు నమ్ముతారు కాని విభిన్నంగా చూస్తారు. అందువల్ల మనం స్వంతంగా చదివితే అర్థం కాదు. బ్రహ్మను నిరాకరించే అవకాశం ఉండవచ్చు. అందువల్ల గురువు ద్వారా నేర్చుకోవాలి. ఆ గురువు కూడా తన గురువు నుంచి నేర్చుకుని ఉండాలి. గురువుకూ, శాస్త్రానికీ అంత అవినాభావ సంబంధం ఉంది. అందుకే గురుశాస్త్ర ఉపదేశం అంటారు.

**శ్రద్ధ - శాస్త్రస్య గురువాక్యస్య సత్య బుద్ధి**

**ఆత్మావా అరే దష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యో మైత్రేయీ**

**- బృహదారణ్యకం**

ఆత్మ గురించి విని తెలుసుకోవాలి. విని అంటే ఎవరో చెపితేనే కదా వినేది. గురుశాస్త్ర అవినాభావ సంబంధంకు ఈ ఉదాహరణ చూడండి. ఆడియో క్యాసెట్టు, క్యాసెట్టు ప్లేయరు తీసుకోండి. మీ దగ్గర కేవలం ఆడియో క్యాసెట్టు ఉంటే లాభం లేదు. ప్లేయరులో పెడితేనే అది పాడుతుంది. సరే క్యాసెట్టు పారేసి, ప్లేయరు పెట్టుకుంటాను అన్నా లాభం లేదు. అందులో ఏదైనా క్యాసెట్టును పెడితేనే అది పాట ఇస్తుంది. అంటే మీరు ఒక పాట వినాలంటే క్యాసెట్టూ కావాలి. దాన్ని ప్లే చేసే ప్లేయరూ కావాలి. ఇందులో శాస్త్రం క్యాసెట్టు, గురువు ప్లేయరు.

**ఇతి శుశ్రుమ పూర్వేషామ్ యే నస్తద్ వ్యాచచక్షిరే - కేన 1-4**

ప్రతి గురువుకూ ఒక గురువుంటాడు. ఆది గురువెవరు? భగవాన్! గురువే శాస్త్రాన్ని చెప్పగలడు కాబట్టి గురువుకు ప్రాముఖ్యత నిచ్చింది. దీన్ని గంధార దేశ దృష్టాంతం ద్వారా చెప్పింది. గంధార దేశం అంటే ఇప్పటి ఆఫ్ఘనిస్తాన్.

గంధార దేశానికి చెందిన ఒక వ్యక్తిని దోచుకుని, అతనికి కళ్ళకు గంతలు కట్టి, నిర్జనమైన అడవిలో వదిలేస్తారు కొందరు దొంగలు. అతను రక్షించండి, కాపాడండి అని గట్టిగా అరుస్తాడు. ఎన్ని జన్మలలోనో చేసుకున్న పుణ్యం వల్ల అటువైపు వెళ్తున్న అతను వచ్చి కళ్ళకు గంతలు విప్పి ఇటు వెళ్ళు అని ఒకవైపు చూపిస్తాడు. గురువు శ్రుతి చెప్పాడు. (ఇతను దోవ

ఎటో విన్నాడు) తర్వాత యుక్తి (ఆలోచనాశక్తి) ఉపయోగించి ప్రయాణం సాగించాడు. అనుభవం కలగలిపి చివరికి ఇంటికి వచ్చాడు.

ఇప్పుడు ద్రాష్టాంతం. అతనిలాగే ఆత్మ,పరమాత్మ, బ్రహ్మ అయిన మనకు అజ్ఞానమనే గంతలు కట్టబడి ఉన్నాయి. పుణ్యపాపాలనే తస్కరులు (దొంగలు) మనను పంచకోశం లేదా శరీరత్రయం అనే అడవిలో తెచ్చి కట్టిపడేశారు. దేహొూదరణ్యేప్రవేశితః

**అహమ్ అముష్య పుత్రో మమ ఏతే బాంధవాః.**

నేను ఫలానా వారి పుత్రుడను. వీరు నా బంధువులు అంటూ వ్యామోహం పెంచుకుని సంసారంలో కూరుకుపోతాము. దీనికి పరిహారంగా అనేక పూజలు చేసి, అలసిపోయి, గురువు సహాయం కోరతాము. ఏదో కొంత పుణ్యం చేసుకోవటం వల్ల గురువు దొరుకుతాడు.గురువు ఉప దేశం చేస్తాడు. కాని అది చాలదు. శిష్యుడు గా మనం శ్రుతి, యుక్తి, అనుభవం జోడిస్తే, చివరకు మోక్షమనే ఇల్లు చేరుకుంటాము.

**స్థూల సూక్ష్మ కారణ శరీరాద్ వ్యతిరిక్తః**
**పంచ కోశ అతీతః సన్ అవస్థాత్రయసాక్షి**
**సచ్చిదానంద స్వరూపః సన్ యత్ తిష్ఠతి స ఆత్మా॥ - తత్త్వబోధ**

**మంత్రం- 1- యథా సోమ్య పురుషం గన్ధారేభ్యః -** ఓ సోమ్యా, గాంధార దేశానికి చెందిన ఒక పురుషుని,

**అభినద్ధాక్షమానీయ -** కళ్ళకు గంతలు కట్టి;

**తం తతోఽతిజనే విసృజేత్ -** జన సంచారం లేని చోట విడిచిపెట్టారు. తనకు తానుగా ఏమీ చేయలేనప్పుడు, ఎక్కడినుంచో సహాయం కావాలి.

**స యథా తత్ర ప్రధ్మాయీతా -** అక్కడ, ఆ ప్రదేశంలో గట్టిగా అరిచాడు. ఎటువైపు?

**ప్రాఙ్ వోదఙ్వాఽధ రాఙ్వా ప్రత్యఙ్వా -** వరుసగా తూర్పు వైపు కాని, ఉత్తరం వైపు కాని, దక్షిణం వైపు కాని, పడమర వైపు కాని తిరిగి అరిచాడు. ఎటునుంచి గురువు వస్తాడో తెలియదు కనుక అన్ని వైపులా తిరిగి అరిచాడు. ఏమని?

**అభినద్ధాక్ష ఆనీతః -** నేనిక్కడకు కళ్ళకు గంతలు కట్టబడి తీసుకురాబడ్డాను;

**అభినద్ధాక్షో విసృష్టః-** అంతే కాదు, కళ్ళకు గంతలు కట్టబడి

విడిచిపెట్టబడ్డాను. ప్రతి సంసారికీ అలాగే కళ్ళకు గంతలు కట్టబడ్డట్టే ఉంటుంది.నిజంగా గంతలు కట్టనవసరం లేదు. తనే అజ్ఞానంతో కట్టేసుకుంటాడు. కథ కొనసాగుతుంది రెండో మంత్రంలో.

**మంత్రం-2 - తస్య యథాఽభినహనం ప్రముచ్య-** ఎవరో గురువు వచ్చాడు. కథలో గురువు అంటే ఎవరో పరోపకారి పాపన్న. కళ్ళకు గంతలు కట్టబడిన వానికి పుణ్యకాలం బాగుందన్నమాట. అందుకని ఎవరో వచ్చి గంతలు విప్పుతారు.

**ప్రబ్రూయాత్ -** అతనితో చెప్పాడు. ఏమని?

**ఏతా దిశం గన్ధారా ఏతాం దిశం వ్రజేతి-** ఈ దిక్కులో గంధార దేశం ఉంది, ఇటువైపు వెళ్ళు అన్నాడు.

**స గ్రామాద్గ్రామం పృచ్ఛన్-** దోవలో అనేక గ్రామాలు తగిలాయి. అక్కడ వాళ్ళను ద్రోవ అడుగుతూ వెళ్లాడు. అంటే తనకు కొంత తెలిసినా, వాళ్ళను అడిగి, అది సరియైన దిశేనని నిర్ధారించుకున్నాడు.

ప్రయాణంలో రెండు అంశాలు ఉంటాయి. వెళ్ళవలసిన దిక్కుగా వెళ్ళాలి. వెళ్ళవలసినంత దూరమూ వెళ్ళాలి. ఉదాహరణకు మీరు ఢిల్లీ వెళ్ళాలనుకోండి.రామేశ్వరం వైపు వెళ్ళే రైలు ఎక్కితే లాభం లేదు. అలాగని ఢిల్లీ రైలు ఎక్కి మధ్యలో నాగపూర్‌లో దిగిపోయినా లాభం లేదు.

అలాగే వేదాంత జ్ఞానం పొందటానికి చేసే ప్రయాణంలో- మొదటి అడుగు శ్రవణ, మనన, నిధి ధ్యాసనలు చేయాలి. రెండో అడుగు కావాల్సినంత మేరకు చేయాలి. సరియైన మార్గంలో వెళ్తున్నానా లేదా అనే సందేహం వచ్చినప్పుడు గురువుతో కాని, శాస్త్రంతో కాని తీర్చుకోవాలి.

**అన్నం బ్రహ్మేతి వ్యజానాత్ ... పునరేవ వరుణం పితరముపససార**
**- భృగువల్లీ, తైత్తిరీయం**

భృగుని విచారణ చేయమని గురువైన తండ్రి చెపితే, మధ్యమధ్యలో తండ్రి దగ్గరకు వచ్చి తన సరియైన మార్గంలో వెళ్తున్నాడో లేదో చూసుకుంటూ వచ్చాడు. అలా చేస్తే గమ్యం చేరతాడు.

**పణ్డితో మేధావీ-** ఇక్కడ రెండు లక్షణాలు పేర్కొంది ఉపనిషత్తు. పండితుడంటే గురువు దగ్గర శాస్త్ర శ్రవణం చేసినవాడు. మేధావీ అంటే మధ్యలో ఏవైనా తార్కికంగా సందేహాలు వస్తే తీర్చుకోగలవాడు. నాకు గురువు చెప్పలేదు

అనకుండా, తను తార్కికంగా ఆలోచించగలిగేవాడు. ఈ రెండు లక్షణాలూ ఉండాలి మంచి శిష్యుడికి.

**గన్ధారానేవోపసంపద్యేత** – గంధర దేశం చేరుకున్నాడు.

ఇక్కడ గంధార దేశం ఏమిటి?– అహం బ్రహ్మ అస్మి. అది నా స్వరూపం. దృష్టాంతంలో ప్రయాణం బాహ్యంగా సాగింది. ద్రాష్టాంతంలో ప్రయాణం అంతర్గతంగా సాగుతుంది. నిజంగా ప్రయాణం ఉండదు.

**ఏవమేవేహాచార్యవాన్ పురుషోవేద** – అదే విధంగా, ఈ సంసారమనే లోకంలో గురుశాస్త్ర ఉపదేశం ఉన్న వ్యక్తి బ్రహ్మను చేరుకుంటాడు. వేద అంటే తెలుసుకుంటాడు.

**ఆచార్యవాన్ పురుషో వేద** – అక్షరలక్షల వాక్యం – ఆచార్యుడు ఉన్న పురుషుడు జ్ఞానం పొందుతాడు. జ్ఞానం పొందాక ఏమవుతుంది?

**తస్య తావదేవచిరం యావన్న విమోక్ష్యే** – ప్రారబ్ధకర్మ ముగిసేవరకూ శరీరమనే అడవి నుంచి విడివడడు. కాని జ్ఞానం పొందినందువల్ల ప్రారబ్ధకర్మ ఫలం బాధించదు.

ఉదాహరణకు నక్షత్రాలు పగలు ఉన్నాయా, లేవా అంటే పగలు కూడా ఉన్నాయి కాని, సూర్యుని కాంతి ముందు అవి వెలవెలబోతున్నాయి. అలాగే జ్ఞాని పారమార్థిక సత్యానికి ఎదిగినప్పుడు, వ్యావహారిక సత్యం మిథ్య అవుతుంది. దీన్నే జీవన్ముక్తి అంటారు. యావత్ న విమోక్ష్యతే– ప్రారబ్ధకర్మ ముగిసేవరకు వరకూ జీవన్ముక్తి పొందుతాడు.

**అథ సమ్పత్స్య ఇతి** – దాని తర్వాత, అంటే ప్రారబ్ధకర్మ అయిపోయాక, విదేహముక్తి పొందుతాడు.

**మంత్రం– 3–** ఆచార్యుడు, శాస్త్రం చెప్పిన సత్యం వేరే ఏదో కాదు. జగత్ కారణమైన సత్ బ్రహ్మ గురించే. అది నువ్వే. తత్త్వమసి శ్వేతకేతో.

### పంచదశః ఖణ్డః (15)

**పురుషగ్ంసోమ్యోతోపతాపినం జ్ఞాతయః పర్యుపాసతే జానాసి మాం జానాసి మామితి। తస్య యావన్న వాఙ్మనసి సమ్పద్యతే మనః ప్రాణే ప్రాణస్తేజసి తేజః పరస్యాం దేవతాయాం తావజ్జానాతి॥1॥ అథయదాఽస్య వాఙ్మనసి సమ్పద్యతే మనః ప్రాణే ప్రాణస్తేజసి తేజః పరస్యాం దేవతాయామథ న జానాతి ॥2॥ స య ఏషోఽణిమైతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స**

**ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో ఇతి భూయ ఏవ మా భగవాన్ విజ్ఞాపయత్వితి తథా సోమ్యేతి హోవాచ ॥3॥**

**7. జ్ఞానికీ, అజ్ఞానికీ మరణకాలంలో ప్రాణం పోయే క్రమం ఒకటేనా?**

ఈ ప్రశ్నకు జవాబు మరణ దృష్టాంతం ద్వారాఇస్తున్నది ఉపనిషత్తు ఈ ఖండంలో. ఇద్దరికీ ప్రాణం పోయే తీరు ఒక్కటే. కాకపోతే అజ్ఞానికి పునర్జన్మ ఉంటుంది. జ్ఞానికి ఉండదు.

**అస్య సోమ్య పురుషస్య ప్రయతో వాఙ్మనసి సంపద్యతే మనఃప్రాణే ప్రాణస్తేజసి తేజః పరస్యాం దేవతాయామ్ 6-8-6**

ఇవే పదాలు మళ్ళీ ఇప్పుడు 15-1-2లో చూస్తాము. అది అజ్ఞాని జీవ మరణం గురించి అయితే, ఇది జ్ఞాని జీవ మరణం గురించి. ఏమిటా క్రమం? వాక్కు మనస్సులో, మనస్సు ప్రాణంలో, ప్రాణం తేజస్సులో, తేజస్సు పరబ్రహ్మలో లయమవుతాయి. కాని అజ్ఞాని విషయంలో ప్రారబ్ధకర్మ మాత్రమే ముగిసిపోతుంది. సంచిత కర్మ ఇంకా ఉంటుంది. అందుకని అందులో కొంత మళ్ళీ ప్రారబ్ధకర్మగా మారి, 'లే, 'లే' అని లేపి ఇంకో శరీరంలో తోస్తుంది.

**తే బ్రహ్మ లోకేషు పరాంతకాలె పరామృతాః పరిముచ్యంతి సర్వే –**

అందుకే అజ్ఞాని మరణాన్ని అంతకాలం అని జ్ఞాని మరణాన్ని పరాంతకాలం అనీ అంటారు. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**మంత్రం-1- పురుషగ్ం సోమ్యోతోపతాపినం-** ఉపతాపినం పురుషః అంటే తీవ్రమైన రోగంతో మరణశయ్య మీద ఉన్న రోగిని.

**జ్ఞాతయః పర్యుపాసతే-** బంధువులు చుట్టూ చేరి సేవలు చేస్తూ ఉంటారు.

**జానాసి మాం జానాసి మామితి –** అంతేకాదు, నన్ను గుర్తు పట్టావా, నన్ను గుర్తుపట్టావా అని ప్రశ్నలు వేస్తారు. ఫలానా వ్యక్తిని వచ్చాను, కళ్ళు తెరిచి చూడు అని అడుగుతూ ఉంటారు. ఒక్కోసారి కళ్ళు తెరిచి చూస్తారు. ఒక్కోసారి అదీ చేయలేరు. ఒక్కోసారి మాట్లాడుతారు. ఒక్కోసారి మాట్లాడలేరు.

అతను ఏదైనా జవాబు ఎప్పుడివ్వగలడంటే, అతని అంగాలు లయమవనంత వరకూ అంటున్నది ఉపనిషత్తు. ఏమిటవి?

**తస్య యావన్న వాఙ్మనసి సమ్పద్యతే-** అతని వాక్కు మనస్సులో

లయమవనంతవరకూ, ఏదో ఒకటి చెప్పగలుగుతాడు.
**మనః ప్రాణే–** మనస్సు ప్రాణంలో లయమవనంత వరకూ మనస్సు అనేక విషయాల గురించి ఆలోచిస్తుంది.
**ప్రాణస్తేజసి –** తేజస్సులో కలవనంతవరకూ.
**తేజః పరస్యాం దేవతాయాం తావజ్జానాతి –** తేజస్సు పరబ్రహ్మలో లయమవనంతవరకూ గుర్తు పట్టగలడు.
**మంత్రం– 2–** ఈ మంత్రాలన్నీ బ్రహ్మసూత్రాల్లో వివరంగా చర్చించబడ్డాయి. తేజస్సు ఎందుకు వచ్చింది? ఈ ఉపనిషత్తులో సృష్టిక్రమం వచ్చినప్పుడు ఆకాశం, వాయువు రాకుండా, మొదటి సృష్టిగా అగ్ని వచ్చింది. ప్రళయంలో వ్యతిరేక దిశలో లయం అవుతాయి అన్నీ. అందుకే అన్నీ అగ్నిలో లయమయితే, అగ్ని బ్రహ్మలో లయమవుతుంది.
**అథయథాఽస్య వాజ్మనసి సమ్పద్యతే మనః ప్రాణే ప్రాణస్తేజసి తేజః పరస్యాం దేవతాయామథ న జానాతి –** తర్వాత ఎప్పుడైతే వాక్కు మనస్సులో, మనస్సు ప్రాణంలో, ప్రాణం తేజస్సులో, తేజస్సు బ్రహ్మలో లయమవుతాయో అప్పుడు అతను ఎవరినీ గుర్తుపట్టలేడు. అప్పుడు వైద్యుడు అతను మరణించాడని చెపుతాడు.

మరణం నిర్వచనం ఏమిటి? శుద్ధ సత్తా అవ్యక్తరూపంలోకి మారటం. గుర్తుంచుకోండి, శుద్ధ సత్తా వెళ్లిపోయింది అనకూడదు. సూక్ష్మశరీరం స్థూల శరీరాన్ని వదిలి వెళ్లిపోయింది. లేదా బ్రహ్మలో లయమయింది. ఆ బ్రహ్మే నీ అసలు స్వరూపం. ఇది జ్ఞాని మరణం గురించి అని తెలుసు. అథ సమ్పత్స్య అన్నది ముందు ఖండంలోంచి ఇక్కడికి తెచ్చుకోవాలి. దీని అర్థం జ్ఞాని ప్రారబ్ధకర్మ ముగిసి, మరణించాక అతను సత్‌లో లయమయి, విదేహ ముక్తి పొందుతాడు.

అజ్ఞాని మళ్లీ పుడతాడు. జ్ఞాని విదేహ ముక్తి పొందుతాడు.

ఇదీ సారాంశం–

**మంత్రం–3–** పరబ్రహ్మలో లయమవుతాడు అంటే అది వేరే ఏదో కాదు. అది నువ్వే. తత్త్వమసి శ్వేతకేతో.

**షోడశ ఖణ్డః (16)**

**పురుషగ్ం సోమ్యోత హస్తగృహీతమానయన్త్యపహార్షీత్ స్తేయమకార్షీత్పరశుమస్మై తపతేతి స యది తస్య కర్తా భవతి తత ఏవానృతమాత్మానం కురుతే సోఽనృతాభిసన్ధోఽనృతేనాత్మానమన్తర్ధాయ పరశుం తప్తం ప్రతిగృహ్ణాతి దహ్యతేఽథ హన్యతే ॥1॥ అథ యది తస్యాకర్తా భవతి తత ఏవ సత్యమాత్మానం కురుతే స సత్యాభిసన్ధస్సత్యేనాత్మానమన్తర్ధాయ పరశుం తప్తం ప్రతిగృహ్ణాతి స న దహ్యతేఽథ ముచ్యతే ॥2॥ స యథా తత్ర నాదాహ్యేతైతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో ఇతి తద్ధాస్య విజజ్ఞావితి విజజ్ఞావితి ॥3॥**

**8. అద్వైతం సత్యమా, ద్వైతం సత్యమా?**

ఈ ప్రశ్నకు జవాబు ఈ ఖండంలో వస్తుంది. దీనికి ఒక ఉదాహరణ వస్తుంది. దాన్ని తస్కర దృష్టాంతం అనీ లేదా తప్త పరశు దృష్టాంతం అనీ అంటారు.

అద్వైతమే సత్యం.

**తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో**

అద్వైత బ్రహ్మ సత్యం. మరి ద్వైత ప్రపంచం మాటేమిటి?

**వాచాఽఽరమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్**

ద్వైత ప్రపంచం లేదా కార్యం మిథ్య. అద్వైతాన్ని పట్టుకున్న అతను మోక్షాన్ని పొందుతాడు. ద్వైతాన్ని పట్టుకున్న అతను బంధంలో పడతాడు. ఉపాస్య- ఉపాసక ద్వైతం అయినా కూడా అందులో భక్తి భావన ఉన్నా కూడా అది బంధమే అవుతుంది. ద్వైత భక్తి అద్వైతానికి సోపానం అవాలి. దాస-ఈశ్వర భావనలోనే శాశ్వతంగా ఉండిపోతానంటే అతను సంసారచక్రంలో తిరుగు తుంటాడు. ఇదీ ఖండంలోని దృష్టాంతం భావన.

ఇప్పుడు దృష్టాంతం చూద్దాము.

ఒక దొంగను భటులు ఒక రాజుగారి దగ్గరకు తీసుకువెళ్ళారు. అతను దొంగతనం చేశాడని భటులు, చేయలేదని దొంగ అన్నాడు. వేడిచేసిన పరశువును తీసుకురండి. అతను దొంగతనం చేయకపోతే, అతను దాన్ని పట్టుకున్నా చేయి కాలదు అని రాజు అంటాడు. (గమనిక:- ఈ సాహసాన్ని ఇప్పుడు మీరు చేయకండి, ఇది ఎప్పటిదో కథ) అతను నిజం చెపితే

ఆ నిజమే అతనికి కవచంగా పనిచేస్తుంది అంటాడు. అతని చేయి కాలకపోతే, అతను విముక్తుడవుతాడు. అదే అబద్ధం చెపితే, చేయి కాలటమే కాకుండా, కారాగారంలో వేయబడుతాడు.

ఇప్పుడు ద్రాష్టాంతం చూద్దాము. అలాగే ఎవరైనా అహం జీవోస్మి అని భావించి, అందులో ఉంటే అది అసత్యం! అందువల్ల ప్రపంచం - **తప్త పరశు** - కాలిన పరశువులాగా అతన్ని దహించి వేస్తుంది.

**ఆధ్యాత్మిక, ఆది భౌతిక, ఆది దైవిక తాపత్రయాలు**

ఈ మూడు అతన్ని ఇప్పుడు దహించివేయటమే కాదు. తర్వాత కూడా దహిస్తున్నాయి - కాలటం సంసారం, జైలులో పడటం పునర్జన్మ.

**పునరపి జననం పునరపి మరణం.**

దాని బదులుగా నేను, 'అహం బ్రహ్మ అస్మి' అని అర్థం చేసుకుని ఆ నిష్ఠలో ఉంటే ఇక్కడ తాపత్రయాలు నన్ను దహించకుండా జీవన్ముక్తి పొందుతాను. మరణించాక పునరపి జననం పునరపి మరణం చక్రంలో చిక్కుకోకుండా, విదేహముక్తి పొందుతాను.

అందుకని మీ చేతిలో ఉంది. **అహం జీవ అస్మి** అంటారా, **అహం బ్రహ్మ అస్మి** అంటారా? ఇప్పుడు మంత్రం చూద్దాము.

**మంత్రం-1- పురుషగ్ం సోమ్యోత హస్తగృహీతమానయన్తి** - చేయి పట్టుకుని ఒక మనిషిని ఒక భటుడు తీసుకువస్తున్నాడు. ఎందుకు?

**అపహార్షీత్ స్తేయమకార్షీ-** ఎవరిదో తీసేసుకున్నాడు. ఎలా? దొంగతనంగా.

**పరశుమస్మై తపతేతి-** కాలిన పరశువును ఇక్కడికి తీసుకురండి అని రాజు అన్నాడు. దొంగ ఆ పరశువును చేతితో పట్టుకోవాలి.

**స యది తస్య కర్తాభవతి** - ఒకవేళ అతను నిజంగా దొంగతనం చేసి, నేను దొంగిలించలేదు అని చెపితే, అతను అసత్యాన్ని పట్టుకున్నట్టు అవుతుంది.

**తత ఏవానృతమాత్మానం కురుతే** - ఆత్మానం అంటే తనకు తాను. తనకు తాను అబద్ధాన్ని స్వీకరిస్తే, అతనికి రక్షణ ఉండదు.

**సోఽ నృతాభిసన్ధః** - అతను అసత్యవాది అవుతాడు.

**అనృతేనాత్మానమన్తర్ధాయ** - తననూ, తన చేతినీ అబద్ధంతో కప్పుకుంటున్నాడు. (అబద్ధం అనే వస్తువు లేదు. అబద్ధం చెప్తున్నాడు అని)

**పరశుం తప్తం ప్రతిగృహ్ణాతి-** కాలిన పరశువును తన చేతిలోకి తీసుకుంటున్నాడు. దాని పర్యవసారం ఏమిటి?

**స దహ్యతేఽ థ హన్యతే -** చేయి కాలుతుంది. అంతేకాదు, రాజు శిక్షిస్తాడు కూడా. హన్యతే అంటే మరణశిక్ష విధిస్తాడు. కాని మరణశిక్ష అనే తీసుకోనవసరం లేదు. కారాగృహంలో వేస్తాడు అనుకోవచ్చు.

**మంత్రం-2-** పై మంత్రానికి పూర్తి వ్యతిరేక మంత్రం. అందుకని తేలిగ్గానే దీని భావాన్ని గ్రహించగలము.

**అథ -** దాని బదులు;

**యది తస్యాకర్తాభవతి -** అతను అతని మీద మోపబడిన నేరం చేయకపోయి ఉంటే ఏమవుతుంది? నేను దొంగతనం చేయలేదు అన్న వాక్యం సత్యం అవుతుంది.

**తత ఏవ సత్యమాత్మానం కురుతే -** తను సత్యాన్ని స్వీకరిస్తే, అతనికి రక్షణ ఉంటుంది.

**స సత్యాభిసన్ధః -** అతను సత్యవాది అవుతాడు;

**సత్యేనాత్మానమన్తర్ధాయ -** తననూ, తన చేతినీ సత్యంతో కప్పుకుంటున్నాడు.

**పరశుం తప్తం ప్రతిగృహ్ణాతి -** కాలిన పరశువును తన చేతిలోకి తీసుకుంటున్నాడు. దాని పర్యవసానం ఏమిటి?

**న దహ్యతేఽ థ ముచ్యతే-**చేయి కాలదు. అంతేకాదు, విడిచిపెడతాడు కూడా. ఇప్పుడు ద్రాష్టాంతాన్ని మూడో మంత్రంలో చెపుతున్నది.

**మంత్రం-3- స యథా తత్ర నాదాహ్యేత -** ఎలాగైతే సత్యసంధుడు కాలిన పరశువును పట్టుకున్నా కాల్చబడలేదో, అలాగే జ్ఞాని జగత్తనే తప్త పరశుని పట్టుకున్నా కాల్చబడడు.

త్రిపుటి భావన నుంచి ద్విపుటి భావనలోకి రావాలి. త్రిపుటి భావనలో నేను, జగత్తు, ఈశ్వరుడు మూడు భిన్నంగా వున్నాయి. నన్ను జగత్తు బాధిస్తుంటే, ఈశ్వరునితో మొరబెట్టుకుంటాను. దానివల్ల నేను అనృత అభిసంధః అవుతున్నాను. అంటే అసత్యాన్ని పట్టుకుంటున్నాను. నిజానికి నేను ఏమిటి?

**తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో** నేను బాధాతప్తమైన జీవాత్మను కాదు, అంతర్యామి అయిన పరమాత్మను.

అందుకని నేను త్రిపుటి భావనలో ఉన్నంతవరకూ సంసార తాపాలు నన్ను బాధిస్తూనే ఉంటాయి. ఈశ్వరునికి మొరపెట్టుకుంటూనే ఉంటాను. ఈశ్వరుడు కూడా నా బాధలు తీరుస్తూనే ఉంటాడు. కాని ఇది ఒకరోజు వ్యవహారం కాదు. అనుదినం ప్రారబ్ధకర్మతో చేసే యుద్ధం. మరణంతో కూడా మన కష్టాలకు చరమగీతం పాడలేము. కనీసం ఇప్పుడు మనుష్యజన్మను ఎత్తాను. తర్వాత ఎలా పుడతానో, ఆ ఈశ్వరునికే ఎరుక. పాపం ఆ ఈశ్వరునికి మన మీద కొండంత జాలి ఉన్నా మనం జన్మజన్మలుగా మోసుకొచ్చిన కొండంత సంచిత కర్మలకు తగ్గ కర్మఫలం ఆయన ఇవ్వక తప్పదు. మనం అనుభవించకా తప్పదు.

ఇది తప్పించుకోవాలంటే సంచిత కర్మలను దగ్ధం చేసుకోవాలి. ఎలా? జ్ఞానం పొంది, ద్విపుటి భావనలోకి రావాలి. ద్విపుటి భావన అంటే ఏమిటి? నేను జీవిని కాదు. నేను కర్తా, భోక్తా, ప్రమాతాను కాదు. నాకు అహంకార, మమకారాలు లేవు. నేను ఆత్మను, తక్కిన జగత్తంతా అనాత్మ. నేను అసంగ, అకర్త, అభోక్త స్వరూపాన్ని. ఈ జ్ఞానంతో నేను మిథ్యా ప్రపంచంలో వ్యవహరిస్తాను. వేదాంత సారంలోని ఐదవ సూత్రాన్ని గుర్తు పెట్టుకుంటాను.

> **నా అసలు స్వరూపాన్ని నేను మర్చిపోయి, నా జీవితాన్ని భారంగా చేసుకుంటున్నాను. నా స్వరూప నిష్ఠలో ఉండి, జీవితాన్ని ఒక ఆటగా మలచుకుంటాను.**

ఈ జగత్తంతా విశ్వరూప ఈశ్వర దర్శనం. ఇందులో ఏం జరిగినా నేను చలించను. స యథా తత్ర న దహ్యేతే. అది నన్ను దహించలేదు. **స యథ తత్ర నాదాహ్యేత** – ఆ వ్యక్తి ఎలాగైతే కాల్చబడడో– ఈ వాక్యాన్ని ఉపనిషత్తు పూర్తి చేయదు. అలాగే జ్ఞాని కాల్చబడడు అని అర్థం చేసుకోవాలి. సత్యసంధః అయిన జ్ఞాని అహం బ్రహ్మ అస్మి అనే సత్య దర్శనం చేయటం వల్ల ఇహలోక సంసారం నుంచీ, పరలోక సంసారం నుంచీ విముక్తి పొందుతాడు. జీవన్ముక్తీ, తర్వాత విదేహముక్తీ పొందుతాడు.

దీని తర్వాత మహా వాక్యంలోకి వస్తున్నది.

**ఐతదాత్మ్యమిదగ్ం సర్వం** – సత్తే అన్నిటికీ ఆత్మ.
**తత్ సత్యం** – అదే సత్యం.

**స ఆత్మా** - అదే జగత్తంతా అనేక నామరూపాలుగా ఉంది.

**తత్త్వమసి శ్వేతకేతో** - ఆ సత్తా నువ్వే శ్వేతకేతు.

**తత్త్వమసి** లో **అసి** వర్తమాన కాలంకు చెందిన క్రియ. నువ్వు ఆ బ్రహ్మవు. నువ్వు బ్రహ్మ అవటానికి ఏమీ సాధన చేయనవసరం లేదు. అయితే ఏ సాధన చేయాలి? (ఏం ప్రశ్న?) నేను బ్రహ్మను అవటానికి ఏమీ సాధన చేయనవసరం లేదు. నేను బ్రహ్మను అవటానికిసాధన చేయనక్ఖరలేదు అనే నిజాన్ని నిరంతరం గుర్తుంచుకోవటమే సాధన.

ఉపనిషత్తు ఎలా మొదలయిందో, అలా ముగుస్తున్నది.

**స దేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్ 6-2-1**

మొదట ఉన్నది సత్ మాత్రమే. అది అద్వితీయం అంటే అద్వైతమ్.

**ఐతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో**

తత్ సత్యం అంటే మొదట ఏ అద్వైతం గురించి చెప్పబడిందో, ఆ అద్వైతమే సత్యం. అది నువ్వే.

ఇక్కడితో బోధ ముగిసింది. ఉపనిషత్తు శ్వేతకేతుని స్తుతిస్తున్నది.

**తద్ధాస్య విజజ్ఞావితి విజజ్ఞావితి -** గురువు ఉద్ధాలకుడు చేసిన; తత్ అంటే ఆబోధను; విజజ్ఞౌ అర్థం చేసుకున్నాడు. ఎవరు? శ్వేతకేతు అని మనం కలుపుకోవాలి. దీన్ని అపరోక్షజ్ఞానం అంటారు.

అపరోక్షజ్ఞానం శ్రవణంలోనే వస్తుందా లేక తర్వాత నిదిధ్యాసనంలో లేదా సమాధిలో వస్తుందా?

**శ్రవణాత్ అపరోక్షజ్ఞానం వా ధ్యానాత్ అపరోక్ష జ్ఞానం వా?**

నిదిధ్యాసనం జ్ఞానం పొందటానికి కాదు. నిదిధ్యాసనం మనలో కొన్ని సంవత్సరాలుగా అలవాటుగా జీర్ణించుకుపోయిన త్రిపుటి భావనను పారద్రోలటానికి. ఈ క్రింది భావనతో లేవాలి.

**ప్రాతః స్మరామి హృది సంస్ఫురదాత్మతత్త్వమ్**
**సచ్చిత్ సుఖమ్ పరమహంస గతిం తురీయం।**
**యత్ స్వప్న జాగర సుషుప్తి మవైతి నిత్యం**
**తద్బ్రహ్మ నిష్కలమహమ్ న చ భూతసంగః॥**

ఈ భావన పెంపొందించుకోవటానికి నిదిధ్యాసనం చేయాలి.

# అధ్యాయం - 6 సారాంశం

**1-7 ఖండాలు:-** తత్ పద విచారణ చేస్తాయి.

సృష్టి మూడు భూతాల నుంచి వచ్చింది. అవి అగ్ని, జలం, పృథివీ. ఆ మూడు భూతాలకు మూడు రంగులు ఉన్నాయి. అవి వరుసగా ఎరుపు, తెలుపు, నలుపు.

సృష్టిలో ఏ కార్యాన్ని చూసినా అది ఈ మూడు రంగుల మిశ్రమమే. ఉదా:- సూర్యుడు.

అందువల్ల కార్యం నుంచి కారణంకు వెళితే-
కార్యం- వాచాఽఽ రమ్భణం వికారో నామధేయం
కారణం- సత్‌బ్రహ్మ సృష్టిస్థితి లయ కారణం.
కాబట్టి బ్రహ్మవిజ్ఞానేన సర్వవిజ్ఞానం భవతి.

**8వ ఖండం -** త్వం పద విచారణ చేస్తుంది.

సత్ అణువుకన్నా సూక్ష్మమైనది.
సత్తే అన్నిటికీ ఆత్మ.
అదే సత్యం.
ఆ సత్తే జగత్తంతా అనేక నామరూపాలుగా ఉంది.
ఆ సత్తా నువ్వే శ్వేతకేతు. **తత్త్వమసి**
ఇప్పుడు ఆ బ్రహ్మవు నువ్వే అంటే-
**ఆత్మ విజ్ఞానేన సర్వవిజ్ఞానం భవతి**

**9-16 ఖండాలు:-** అసి పద విచారణ చేస్తాయి.

మన నిజ జీవితంలో రోజూ చూసే వాటినుంచి తత్త్వమసి మహావాక్యాన్ని 8 సార్లు వివరించి అనేక సందేహాలను తొలగిస్తుంది ఉపనిషత్తు. ఎనిమిది అంశాలు -

మధు దృష్టాంతం
నదీ దృష్టాంతం
వృక్ష దృష్టాంతం
న్యగ్రోథ దృష్టాంతం
లవణ దృష్టాంతం
గంధార పురుష దృష్టాంతం
మరణ దృష్టాంతం
తస్కర దృష్టాంతం

ఈ అధ్యాయం ఎలా మొదలయిందో అలా ముగిసింది.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్**

మొదట ఉన్నది సత్ మాత్రమే. అది అద్వితీయం

**ఐతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో**

తత్ సత్యం అంటే మొదట ఏ అద్వైతం గురించి చెప్పబడిందో, ఆ అద్వైతమే సత్యం. అది నువ్వే.

# షడ్లింగ విచారణ

ఈ అధ్యాయాన్ని **సద్విద్యా ప్రకరణం** అంటారు. వేదాంతసారాన్ని నిర్ణయించటానికి, శాస్త్రం ఈ ఆరో అధ్యాయాన్ని ప్రతీకగా తీసుకుంటుంది.

జీవాత్మ పరమాత్మతో ఎన్నటికీ ఐక్యం కాలేదు. జీవాత్మ అణుపరమాణంలో ఉంది. పరమాత్మ విభు పరమాణంలో ఉన్నాడు. జీవాత్మ పరమాత్మలో ఒక అంశం మాత్రమే. అందుకని జీవాత్మ పరమాత్మకు దాసోహం అనాలి. నేను దాసునిగా పరమాత్మను కొలిచి, వైకుంఠంకి వెళ్లటమే మోక్షం. ఇది ఒక వాదన. అద్వైతం జీవాత్మ పరమాత్మ ఐక్యాన్ని సూచిస్తుంది. ఏది సరియైన వాదన అనే ప్రశ్న ఉదయించినప్పుడు, షడ్లింగ విచారణ అనే పద్ధతి ఉంది వేదాంతంలో.

**ఉపక్రమోఽ పసంహారౌ అభ్యాసాపూర్వతా ఫలం**
**అర్థవాదోప పత్తీచ లింగం తాత్పర్య నిర్ణయేత్**

ఆరు అంశాలను బట్టి తాత్పర్యాన్ని నిర్ణయిస్తారు. వాటిని ఒక్కొక్కటిగా చూద్దాము.

**1. ఉపక్రమ ఉపసంహారం:–** ఎలా మొదలైతే అలా ముగియాలి.
**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్**

మొదట ఉన్నది సత్ మాత్రమే. అది అద్వితీయం అంటే అద్వైతమ్
**ఐతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో**

తత్ సత్యం అంటే మొదట ఏ అద్వైతం గురించి చెప్పబడిందో, ఆ అద్వైతమే సత్యం. అద్వైతం సత్యం అంటే ద్వైతం మిథ్య అని చెప్పకనే చెప్పింది.

అందువల్ల ఎలా మొదలైందో అలా ముగిసింది.

**2. అభ్యాసం:–** ఏదైనా పదే పదే చెప్పబడితే, దాన్ని అభ్యాసం అంటారు. **ఐతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో**

ఉన్న 16 ఖండాల్లో 9 ఖండాల్లో పై వాక్యాన్ని పదే పదే చెప్పింది. అంటే జీవాత్మ పరమాత్మ ఐక్యాన్ని ఉపనిషత్తు ప్రత్యేకంగా ఎత్తి చూపుతున్నది.

**3. అపూర్వతా:–** ప్రత్యేకత. తక్కిన ప్రమాణాల ద్వారా మనకు

ముందే తెలిసిన విషయాన్ని చెప్పకూడదు. తక్కిన ప్రమాణాలకందని విషయాన్ని చెప్పాలి. అద్వైతం అపూర్వమా, ద్వైతం అపూర్వమా? ద్వైత భావన మనకు ముందే తెలుసు. నేను వేరు, ఆ కుర్చీ వేరు. నేను దాసుడిని అని కూడా శాస్త్రం చెప్పనవసరం లేదు. నేను నాకు సహాయం చేయాల్సిన వారికి దాసుడినే! తత్త్వమసి బోధ ఉపనిషత్తుకే చెందింది. ఏ వైజ్ఞానిక శాస్త్రంలోనూ పొందలేము.

జీవ ఈశ్వర ఐక్యం బోధ ఉపనిషత్తే చెప్పగలదు, వేరే ప్రమాణాలకు అందదని, ఈ అధ్యాయమే మనకు లవణ దృష్టాంతం (13వ ఖండం) ద్వారా చెప్పింది. గంధార దృష్టాంతం (14వ ఖండం) గురుశాస్త్ర ఉపదేశమే దీనికి మార్గం అని చెప్పింది.

**4. ఫలం:–** ఇది నేర్చుకుంటే కలిగే లాభం. జీవన్ముక్తి, విదేహముక్తి. మరణదృష్టాంతం (15వ ఖండం)లో వస్తుంది ఈ విషయం. ముక్తి దేనికి? శరీరానికి కాదు, మనస్సుకు కాదు. చైతన్యమనే నేను దేశకాల వస్తు పరిమితుల నుంచి స్వతంత్ర్యం పొందుతాను. ఈ ముక్తి అద్వైతంలో. ద్వైతంలో పునరపి జననం, పునరపి మరణం.

**5. అర్థవాదం:–** స్తుతి. ద్వైతభావన అనేక చోట్ల విమర్శించబడింది. అద్వైత జ్ఞానం స్తుతించబడింది.

**ఏక విజ్ఞానేన సర్వ విజ్ఞానం భవతి**

ఒక్క కారణ విజ్ఞానం పొందితే సర్వ కార్య విజ్ఞానం పొందుతాము.

**6. ఉపపత్తి:–** బోధను సమర్థించే తర్కం లేదా వాదన. కారణం మాత్రమే సత్యం, కార్యం మిథ్య. కార్యం నామరూపాలు మాత్రమే అనేది బోధ. దానికి తర్కం ఏమిటి? మూడు ఉదాహరణలు చూపించాడు గురువు. మట్టి–కుండ; బంగారం–ఆభరణాలు; ఇనుము– గోళ్ళకత్తెర; కుండలో ఉన్నదంతా మట్టే అని తెలిస్తే, మట్టిముద్దను ఒక్కదానిని తెలుసుకుంటే, మట్టితో తయారయ్యేవన్నీ తెలిసినట్టు అవుతాయి.

**ఏకేన మృత్పిండేన సర్వం మృన్మయం విజ్ఞాతగ్ం స్యాద్వాచా౨ ౨రమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్ 6-1-4**

ఈ ఆరు అంగాలు చదివితే, దీనిదే కాదు, ఉపనిషత్తులన్నింటి సారమూ అద్వైతమే అని తెలుస్తుంది. అంత మాత్రాన ద్వైతాన్ని, విశిష్టాద్వైతాన్ని త్రోసిపుచ్చనవసరం లేదు. వాటిని అద్వైతానికి చేర్చే సోపానాలుగా చూడాలి.

**దేహబుద్ధ్యాతు దాసోహం జీవబుద్ధ్యాఽ త్వదంశకః।**
**ఆత్మబుద్ధ్యా త్వమేవాహం ఇతి మే నిశ్చితః మతిః॥**

మూడూ సిద్ధాంతాలూ ఒక్క శ్లోకంలో వచ్చేశాయి.

**దేహ బుద్ధ్యాతు దాసోహం –** శరీరపరంగా చూస్తే, ఓ దేవా, నేను నీ దాసుడిని. నేను ఈ గదిలోనే వ్యాపించలేను. సర్వవ్యాపకుడిని ఎలా అవుతాను? చిన్నగాలి మార్పు వస్తే గొంతు పట్టేస్తుంది. దేహ బుద్ధి నుంచి నాకేం ముక్తి ఉంది?

**తవ దాసోహం తవ దాసోహం తవ దాసోహం దాశరథే**

**జీవబుద్ధ్యాఽ త్వదంశకః –** చిదాభాసగా చూస్తే, నేను ఎన్నటికీ చిత్‌కు సమానం కాలేను. చిదాభాస చిత్ మీద ఆధారపడాల్సిందే. ప్రతిబింబ చైతన్యం బింబ చైతన్యం మీద ఆధారపడాలి. అందువల్ల చిదాభాస దృష్ట్యా నేను చిత్‌లో ఒక అంశను మాత్రమే.

**ఆత్మబుద్ధ్యా త్వమేవాహం –** అదే ఆత్మదృష్టితో చూస్తే సాక్షి చైతన్యం అనే నేను, బింబ చైతన్యాన్ని. నేను దాసుడినీ కాను. అంశాన్నీ కాను. బింబ చైతన్యం బ్రహ్మలో ఒక భాగం కాదు. అదే బ్రహ్మ.

**ఆత్మదృష్ట్యా, బింబ చైతన్యం దృష్ట్యా, సాక్షి దృష్ట్యా, త్వం ఏవ అహం ఇతి మే నిశ్చిత మతిః.**

ఈ నిజం తెలిశాక, దాసభావనతో మొదలుపెట్టాలి. కర్మయోగంలో ఉండేది దాసభావనే. శంకరాచార్యులే కర్మయోగం గురించి చెప్తూ, స్వామి భృత్య న్యాయం ప్రకారం నేను దాసుడిని అనుకోవాలి అంటారు. తర్వాత దాన్నుంచి ఎదిగి నేను మిథ్యా శరీరాన్ని కాదు. మిథ్యా చిదాభాసను కాదు; నేను అద్వైత ఆత్మను అని గ్రహించాలి. ఇప్పుడే ఆ భావనకు సిద్ధంగా లేకపోతే, కొంచెం సమయం తీసుకోండి. ఫర్వాలేదు. అద్వైతం వల్ల మోక్షం వస్తుందని గ్రహిస్తే త్వరగా వస్తారు.

# ప్రమాణం ప్రమాం జనయతి

ప్రమాణాల గురించి, ముఖ్యంగా వేద ప్రమాణం గురించి కొన్ని ప్రాథమిక నియమాలు అర్థం చేసుకోవాలి.

**1. వేదం / వేదాంతం ఒక ప్రమాణం –** వేదాన్ని శబ్ద ప్రమాణం అంటారు. ప్రత్యక్ష ప్రమాణం, అనుమాన ప్రమాణాలకెంత విలువనిస్తామో వేదానికి అంత విలువనిస్తాము. ఒక గులాబీపువ్వును చూపించి, ఇది గుమ్మడికాయ అని ఎవరైనా చెపితే, ససేమిరా ఒప్పుకోము, ఎందుకు? ప్రత్యక్షప్రమాణానికి అంతవిలువనిస్తాము. అలాగే వేదం తత్త్వమసి అని చెపితే, అంత ఖచ్చితంగానూ నమ్మాలి.

**2. దేని పరిధి దానిదే –** ఒక్కొక్క ప్రమాణానికీ కొంత పరిధి ఉంటుంది. ఉదాహరణకు ప్రత్యక్ష ప్రమాణంలో కన్ను ఒక ప్రమాణం. అది రంగు,రూపును మాత్రమే చూపగలదు. శబ్దాన్నో, స్పర్శనో చూపలేదు.

**3. దేని శక్తి దానిదే –** ఒక ప్రమాణం చూపిన దాన్ని, ఇంకో ప్రమాణంతో నిరూపించనూ లేము, కాదననూ లేము. దేని పరిధి దానిదే అన్నప్పుడు దేని శక్తి దానిదే అవుతుంది. గులాబీపువ్వును చూపిస్తే, అది గులాబీ పువ్వో, గుమ్మడికాయో కన్నే చెప్పాలి. నా చెవులు శక్తివంతమైనవైనా, అవి చెప్పలేవు. చెవులు అది గులాబీపువ్వు అవుననీ చెప్పలేవు, కాదనీ చెప్పలేవు. అవి శబ్దాన్ని మాత్రమే గుర్తించగలదు.

**4. దేని విలువ దానిదే –** ఒక ప్రమాణం ఒకదాన్ని చెపితే, అది ఖచ్చితం. దానికి తిరుగులేదు. అది నమ్మితీరాలి.

**ప్రమాణం ప్రమాం జనయతి**

కన్ను అనే ప్రమాణం గులాబీపువ్వును చూపించి అది గులాబీ అని చెపితే అది తిరుగులేని సత్యం. సాక్షాత్తూ దేవుడే దిగి వచ్చి అది గుమ్మడికాయ అని చెప్పినా నమ్మము. ఆ ప్రమాణంకు అంత విలువ ఉంటుంది.

**వీటన్నింటినీ క్రోఢీకరిస్తే –** వేదాంతం చెప్పింది నమ్మాలి. వేదం తత్త్వమసి అంటే అహంబ్రహ్మ అస్మి అనగలగాలి. వేదం చెప్పినదాన్ని నిర్వికల్ప సమాధిలోనో, ధ్యానంలోనో అనుభవించి చూస్తాను అనకూడదు. దీనివల్ల

ధ్యానంకూ, నిర్వికల్ప సమాధికీ ఉన్న గొప్పదనాన్ని కించపరచటం లేదు. దానివల్ల వచ్చే సిద్ధులనూ కాదనటం లేదు. కాకపోతే ఈ ధ్యానం ద్వారా వేదాంతం చెప్పినదాన్ని అవునని కానీ, కాదనికానీ నిరూపించలేము. ఇది పుస్తక జ్ఞానం. దీనికి అనుభవం కావాలి అనుకుంటే పొరపాటే. ఎందుకు? వేదాంతం ఒక ప్రమాణం. కంటితో చూసే అనుభవం వేరే ప్రమాణం. ఒక ప్రమాణంతో ఇంకో ప్రమాణాన్ని నిరూపించలేమని, ఏ ప్రమాణం విలువ దానిదేననీ చూశాము కదా!

నేను చైతన్యాన్ని అనే వాక్యాన్ని నిరూపించలేము. నిరూపించ నవసరం లేదు కూడా.

**జ్ఞానం ఏవ సాక్షాత్కారః**
**జ్ఞానం ఏవ అనుభవః**

వేదాంతం చెప్పినదాన్ని అనుభవించాలని ఎందుకు అనుకుంటున్నాము? లౌకిక విషయంలో మన జ్ఞానం అలా ఉంది. మానస సరోవరం గురించి వింటే, ఆ జ్ఞానం పూర్తి కాదు. అక్కడికి వెళ్ళి ప్రత్యక్షంగా అనుభవిస్తేనే అది పూర్తి జ్ఞానం అవుతుంది. అందువల్ల లౌకిక జ్ఞానంలో రెండు దశలు ఉన్నాయి.

1. జ్ఞానం – ఒక విషయం గురించి విన్న సమాచారం.
2. సాక్షాత్కారం – ఆ విషయాన్ని ప్రత్యక్షంగా అనుభవించటం.

దీన్ని బట్టి, వేదాంతం కూడా కేవలం సమాచారం ఇస్తున్నది. మనం ప్రత్యక్షంగా అనుభవించాలి అనుకుంటాము. అది పొరపాటు. ప్రతి జనరల్ రూల్‌కు ఒక ఎక్సెప్షన్ ఉంటుంది. జనరల్ రూల్‌ని ఉత్సర్గ అనీ ఎక్సెప్షన్‌ని అపవాద అనీ అంటారు. పదాలు జ్ఞానమే కాదు, విజ్ఞానం కూడా ఇవ్వగలవు. ఎక్కడో దూరంగా ఉన్న వస్తువుని వర్ణించేటప్పుడు అనుభవం జత అవ్వాలి కాని, ప్రత్యక్ష విషయం గురించి చెప్పేటప్పుడు అదే అనుభవం.

**పరోక్ష విషయే శబ్ద జ్ఞానం పరోక్షం**
**అపరోక్ష విషయే శబ్దజ్ఞానం అపరోక్షం**

వాక్యాలు రెండు రకాలు– అవాంతర వాక్యం– మహా వాక్యం.
శాస్త్రం దీనికి కర్ణుడి ఉదాహరణ ఇస్తుంది.

1. అవాంతర వాక్యం– కుంతి తనకు ఇంకో పుత్రుడు ఉన్నాడని, అతని పుట్టుపూర్వోత్తరాలు చెప్తుంది. అది అవాంతర వాక్యం. అతనెవరో తెలుసుకోవాలనుకుంటాడు కర్ణుడు.

2. మహా వాక్యం– తత్త్వమసి అంటుంది. ఆ ఆరో పుత్రుడు నువ్వే అంటుంది. అహం న రాధేయ, పరంతు అహం కౌంతేయ అని తెలుసు కుంటాడు. ఇది మహా వాక్యం. ఇప్పుడింక అయితే ఆ ఆరోపుత్రుడెవరో చెప్పు అని అడుగనవసరం లేదు, సరిగ్గా వింటే.

**అవాంతర వాక్యః జ్ఞానం జనయతి**

**మహావాక్యః సాక్షాత్కారం / విజ్ఞానం జనయతి**

**సంశయం –** మహావాక్యం విన్నాక అనుభవం కోసం అడుగకూడదు. సంశయ నివృత్తి చేసుకోవచ్చు. నేనేమిటి కుంతీపుత్రుడిని ఏమిటి? ఇదేమీ యుద్ధనీతి కాదు కదా అని సంశయం కలగవచ్చు. అలాగే నాకు, నేనేమిటీ బ్రహ్మను ఏమిటీ అని సంశయం కలుగవచ్చు. అది నివృత్తి చేసుకోవచ్చు.

**విపర్యయం –** నిజం తెలిసినా, పాత భావనలు పోగొట్టుకోవటం అంత తేలిక కాదు. తను రాధేయుడు అన్న భావనను తేలిగ్గా వదల్చుకోలేదు. నేను జీవిని అన్న భావనను మనమూ తేలిగ్గా వదులుకోలేము.

అందువల్ల మనకు కావాల్సింది అనుభవం కాదు. మరింత అవగాహన. దానికోసం శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేస్తూనే ఉండాలి.

# ॥ ఛాందోగ్యోపనిషత్తు ॥

# అధ్యాయం - 7

ఏడవ అధ్యాయం కూడా బ్రహ్మవిద్య గురించే బోధిస్తుంది. ఆరవ అధ్యాయంలో బ్రహ్మను సత్‌బ్రహ్మ అంటే, ఇక్కడ భూమ అంటున్నది. భూమకు రెండు అర్థాలున్నాయి. రెండూ వస్తాయి ఇక్కడ.

1. అనంతం – అనంతమైనది. దేశకాల వస్తు పరిచ్ఛేదశూన్యం, అంటే దేశం, కాలం, వస్తువుల పరిమితులకతీతమైనది.
2. ఆనందం – ఆనందం. అందువల్ల ఇక్కడ ఆనందరూప బ్రహ్మ గురించి వస్తుంది.

ఆనందం బాహ్యంగా ఎక్కడో లేదు. 'ఆనందం నీ స్వరూపం' అని చెప్పబోతున్నది. ఉపనిషత్తు.**'అల్పే సుఖం నాస్తి,'** అని ధైర్యంగా చెపుతున్నది. అల్ప వస్తువులలో అంటే పరిమితి ఉన్న వస్తువులలో సుఖం లేదు. అయితే ఎందులో ఉంది? వేదాంతసారంలో రెండవ సూత్రం గుర్తుంచుకోండి.

**శాశ్వతమైన శాంతి, ఆనందం, భద్రతలు నా నుంచే వస్తున్నాయి.**

అంతేకాదు, ఆత్మానందం అనుభవంలోకి వచ్చే బాహ్యవస్తువు కాదు అని కూడా చెపుతున్నది. ఎందుకు అనుభవంలోకి రాదు? ఎందుకంటే అది అనుభవించే బాహ్య వస్తువు కాదు. అనుభవం కోరే 'నేనే' కాబట్టి. అందుకని ఆత్మానందం పొందటం ఎలా అని ఎన్నడూ అడుగకూడదు. అదేకాదు ఆత్మ అనుభవం పొందటం ఎలా, బ్రహ్మ అనుభవం పొందటం ఎలా అని కూడా అడుగకూడదు. ఎందుకు? ఆత్మ అన్నా, బ్రహ్మ అన్నా నేనే కాబట్టి. ఆత్మానందం బాహ్యంగా దొరికేది కాదు కాబట్టి. ఆనందం నా స్వరూపం కాబట్టి. ఇది చాలా బాగా అర్థం చేసుకోవాల్సిన ముఖ్యమైన పాఠం.

కాదు, కూడదు, ఆత్మానందం పొందితీరాలి అంటే, శాస్త్రం ఒకటే మార్గం ఉంది అంటున్నది. ఏమిటది? మీ అందమైన ముఖాన్ని మీకు చూసుకోవాలని ఉందనుకోండి. దాన్ని ప్రత్యక్షంగా చూడగలరా? లేరు.

కాకపోతే దాని ప్రతిబింబాన్ని అద్దంలో చూడగలరు. అది అక్షరాలా అసలు మొహం కాదు, ప్రతిబింబం మాత్రమే. మీ ముఖాన్ని ప్రతిబింబించే అద్దం ఉన్నంతవరకే, మీ ప్రతిబింబం ఉంటుంది. అందుకని ఒక విషయం మర్చిపోకూడదు. అద్దంలో మీ అందమైన ముఖాన్ని చూసుకుంటున్నప్పుడు, అది అద్దానికి చెందినది కాదు, మీకు చెందినది.

అలాగే నేను ఆత్మానందం అనుభవించాలంటే అసలు సిసలు ఆత్మానందాన్ని అనుభవించలేను. ఎందుకు? అర్థం లేని ప్రశ్న! అది నేనే కాబట్టి. అలాగైతే ప్రతిబింబిత ఆత్మానందాన్ని పొందటం ఎలా? జీవితంలో ఎప్పుడు, ఏ ఆనందాన్ని పొందుతున్నా, ఒక విషయం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. ఏమిటది? ఆ ఆనందం ఆ వస్తువులో లేదు, అది మీ నుంచి వస్తుంది. అద్దంలో కనిపిస్తున్న ప్రతిబింబం అద్దానికి చెందకుండా, మీకు చెందుతుందా, లేదా? అలాగే వస్తువులో కనిపిస్తున్న ప్రతిబింబం ఆ వస్తువుకు చెందకుండా, మీకు చెందుతుంది. ఈ తేలికైన సూత్రాన్ని గుర్తు పెట్టుకుంటే చాలు.

జ్ఞాని ఆత్మానందాన్ని ఎలా పొందుతాడు? అతనికేదో, ఎక్కడినుంచో ప్రత్యేకంగా ఆనందం వచ్చి ఒళ్ళో వాలుతుందనుకోకండి. జ్ఞాని ఆత్మానందాన్ని రెండు రకాలుగా పొందుతాడు.

1. ప్రారబ్ధం తెచ్చిన ఏ ఆనందాన్ని అనుభవిస్తున్నా, జ్ఞాని దాన్ని విషయానందం అనుకోడు. దానికి అతను మరోపేరు పెట్టుకుంటాడు. ఏమిటది? ఆత్మానందం. అది నా ప్రతిబింబం అనుకుంటాడు.

2. అనంతమైన ఆత్మానందాన్ని పొందాలని ఎదురుచూడడు. ఎందుకు? అది తన స్వరూపం అని తెలుసుకాబట్టి. సంగీతం ఆనందం కానీ, అన్నం ఆనందంకానీ, పుస్తకం ఆనందం కానీ, మనవడి ఆనందం కానీ – ఏ ఆనందం పొందినా అది ప్రతిబింబ ఆనందమే కాని బింబ ఆనందం కాదు. బింబ ఆనందం నేనే!

పంచదశిలో విద్యారణ్యుల వారు ఈ విషయం గురించే చెపుతారు. 'ఆత్మానందాన్ని అనుభవిస్తున్నారు ఎప్పుడూ,' అంటారు. వేదాంత అధ్యయనం వల్ల విషయానందాన్ని ఆత్మానందంగా మార్చి చూడగలగాలి. ఎటువంటి ఆత్మానందం? ప్రతిబింబిత ఆత్మానందం. విషయానందాన్ని ప్రతిబింబిత

ఆత్మానందంగా చూడటమే కాదు. అద్దంలో కనబడే ప్రతిబింబానికి మూలం ఏమిటి? దిక్కులు చూడకండి. మూలం మీ అసలైన మొహమే. అది బింబం. అద్దంలోది ప్రతిబింబం. బింబం ఉందని చెప్పటానికి ఆధారం ఏమిటి? బింబం లేనిదే ప్రతిబింబం ఎక్కడ్నుంచి వస్తుంది? అందుకని ప్రతిబింబిత మొహం ఉందంటేనే బింబ మొహం ఉన్నట్లు అర్థం. అందుకని ఏదైనా అనుభవిస్తున్నప్పుడల్లా, 'నేను బింబాన్ని, నేను అనుభవిస్తున్నది నా ప్రతిబింబాన్ని!' అని చెప్పుకుంటూ ఉండాలి. అలా ఆత్మ ఆనంద స్వరూపం, ఆనందానికి మూలం ఆత్మే. వేరే ఎందులోనూ ఆనందం లేదు.

ఒక స్వామీజీ చక్కగా వర్ణించారు. 'బజారులో ఏ తినుబండారం కొన్నా అందులో ఉన్న ఆహారదినుసులు ఏమిటో చెప్తుంది కాని, 'ఆనందం' అనే దినుసు కూడా ఉందని ఎందులోనన్నా ఉంటుందా?' ఆనందం 3% లేదా 30% లేదా 90% అని ఉంటుందా? ఉండదే! దీన్ని బట్టే తెలుస్తోంది, ఆనందం బాహ్యవస్తువులలో ఎందులోనూ దొరికేది కాదని. దానికి ఒకటే మూలం ఉంది. ఏమిటది? 'నేనే ఆనంద స్వరూపాన్ని.' బింబ ఆనందాన్ని అనుభవించాలని ఎదురు చూడకండి. నేను ఆనంద ఆత్మను అని ప్రకటించుకోవాలి. ఇదే భూమవిద్య అనే ఈ అధ్యాయంలో అంశం. ఈ నేపథ్యంతో అధ్యాయంలోకి అడుగుపెడదాము.

ఏడవ అధ్యాయంలో 26 ఖండాలు ఉన్నాయి. ఒక్కొక్క ఖండంలో కొన్ని మంత్రాలు ఉన్నాయి. మొదటి ఖండంలో గురుశిష్యులను పరిచయం చేస్తున్నది. బ్రహ్మ విద్య గురుశిష్యుల సంవాదం రూపంలో వస్తుంది. గురువు ఎవరు? సనత్కుమారుడు. ఈ అధ్యాయం చివరలో **తం స్కంద ఇత్యాచక్షతే** అని వస్తుంది. సనత్‌కుమారుడు సుబ్రహ్మణ్యస్వామి అవతారం. సుబ్రహ్మణ్యస్వామిని కుమారస్వామి అని అందుకే అంటారు. అందుకే సుబ్రహ్మణ్యస్వామిని జ్ఞానగురువుగా అభివర్ణిస్తారు. ఇందులో శిష్యుడు నారదమహర్షి.

**ప్రథమః ఖణ్డః (1)**

**ఓమ్। అధీహి భగవ ఇతి హోపససాద సనత్కుమారం నారదస్తగ్ం హోవాచ యద్వేత్థ తేన మోపసీద తతస్త ఊర్ధ్వం వక్ష్యామీతి ॥1॥ స హోవాచ ‹ TT> Ç Š u ộ y Ā ధ్యేమి యజుర్వేదగ్ం సామవేదమాథర్వణం చతుర్థమితిహాసపురాణం పంచమం వేదానాం వేదం పిత్ర్యగ్ం రాశిం దైవం**

**నిధిం వాకోవాక్యమేకాయనం దేవవిద్యాం బ్రహ్మవిద్యాం భూతవిద్యాం క్షత్రవిద్యాం నక్షత్రవిద్యాగ్ం సర్పదేవజనవిద్యామేతద్భగవోఽధ్యేమి ॥2॥ సోఽహం భగవో మన్త్రవిదేవాస్మి నాత్మవిచ్ఛ్రుతగ్ం హ్యేవ మే భగవద్దృశేభ్యస్తరతి శోకమాత్మవిదితి సోఽహం భగవశ్శోచామి తం మా భగవాఞ్ఛోకస్య పారం తారయత్వితి తగ్ం హోవాచ యద్వై కిఞ్చైతదధ్యగీష్ఠా నామైవైతత్ ॥3॥ నామ వా ఋగ్వేదో యజుర్వేదస్సామవేద ఆథర్వణశ్చతుర్థ ఇతిహాసపురాణః పఞ్చమో వేదానాం పిత్ర్యో రాశిర్దైవో నిధిర్వాకోవాక్యమేకాయనం దేవవిద్యా బ్రహ్మవిద్యా భూతవిద్యా క్షత్రవిద్యా నక్షత్రవిద్యా సర్పదేవజనవిద్యా నామైవైతన్నామోపాస్స్వేతి ॥4॥ స యో నామ బ్రహ్మేత్యుపాస్తే యావన్నామ్నో గతం తత్రాస్య యథాఽకామచారో భవతి యో నామ బ్రహ్మేత్యుపాస్తేఽస్తి భగవో నామ్నో భూయ ఇతి నామ్నో వావ భూయోఽస్తీతి తన్మే భగవాన్ బ్రవీత్వితి ॥5॥**

**మంత్రం-1 ఉపససాద -** నారదమహర్షి సనత్కుమారుని దగ్గరకు శాస్త్ర ప్రకారం వెళ్ళాడు.

**అధీహి భగవ ఇతి-** ఉపనిషత్తులో గురువును భగవాన్ అనీ, శిష్యుడిని సోమ్య అనీ సంబోధిస్తారని ముందే చూశాము. అలాగే నారదులవారు భగవాన్ అని సంబోధిస్తున్నాడు సనత్కుమారుని. అధీహి అంటే నాకు బోధించు అని అర్థం. ఆరో అధ్యాయంలో గురుశిష్యులు ఎవరు?

ఉద్దాలకుడు, శ్వేతకేతు- తండ్రీకొడుకులు. ఇక్కడ గురుశిష్యులు ఎవరు? సనత్కుమారుడు, నారదమహర్షి. ఇద్దరూ బ్రహ్మ మానసపుత్రులు.

**సనత్కుమారం నారదస్తగ్ం హోవాచ-** సనత్కుమారుడు నారదునితో ఇలా అన్నాడు.

**యద్వేత్థ-** నువ్వు ఏం నేర్చుకున్నావో ముందు అది చెప్పు. నీకు ఎంతవరకు తెలుసో తెలుసుకుని రా.

**తేన మోపసీద-** తెలుసుకుని నా దగ్గరకు రా. తేన అంటే నీకు ముందే తెలిసిన విషయాలు. ఉపసీద అంటే రా. అప్పుడేం చేస్తాడు అతను?

**తతస్త ఊర్ధ్వం వక్ష్యామీతి -** నీ గురించి అర్థమయ్యాక, దానికన్నా ఉన్నతస్థాయి విద్య చెప్తాను అని చెప్పాడు. ఉదాహరణకు శిష్యునికి గీత బాగా వస్తే,

గురువు ఉపనిషత్తులను బోధించవచ్చు. ఉపనిషత్తులు బాగా వస్తే బ్రహ్మసూత్రాలను బోధించవచ్చు. అందుకని ముందు అతను ఏ స్థాయిలో ఉన్నాడో తెలుసుకోవాలనుకున్నాడు గురువు.

**స హోవాచ –** అలాగే నారదులు వెనక్కి వెళ్ళి మళ్ళీ వచ్చినట్టుగా ఊహించుకోవాలి. ఇప్పుడు తనకు తెలిసిన విద్యల పట్టిక చదువుతున్నాడు. చాలా ఉంది అది.

**మంత్రం-2 ఏతద్భగవోఽ ధ్యేమి –** నాకు ఇవన్నీ తెలుసు అన్నాడు. ఏమిటవి? **ఋగ్వేదం భగవోఽ ధ్యేమి –** ఓ భగవాన్! నేను ఋగ్వేదాన్ని అధ్యయనం చేశాను; **యజుర్వేదం సామవేద మాథర్వణం చతుర్థమ్–** యజుర్వేదాన్ని, సామవేదాన్ని, నాల్గవ వేదమైన అథర్వణవేదాన్ని; **ఇతిహాస పురాణం పంచమమ్ –** పంచమ అంటే ఐదో వేదం. ఇతిహాస పురాణాలను పంచమవేదం అంటారు. ఇతిహాసాలంటే రామాయణ, మహాభారతాలు; పురాణాలంటే 18 పురాణాలు; **వేదానం వేదం–** వేదాలకు వేదమైన వ్యాకరణం. వ్యాకరణాలు రెండు ఉన్నాయి. లౌకిక వ్యాకరణం, వైదిక వ్యాకరణం. ఇక్కడ వైదిక వ్యాకరణం, **పిత్ర్యగ్ం–** పిత్ర్యం అంటే పితృదేవతలకు చేసే శ్రాద్ధకర్మలు; **రాశిం–** గణితశాస్త్రం; **దైవం–** దైవం అంటే భవిష్యవాణి, భవిష్యత్తును చెప్పగలిగే సామర్థ్యం; **నిధిం–** భూగర్భంలో దాగి ఉన్న నిధి నిక్షేపాలు ఎక్కడ ఉన్నాయో చెప్పగలిగే విద్య; **వాకోవాక్యం–** తర్కశాస్త్రం; **ఏకాయనం–** నీతి శాస్త్రం లేదా ధర్మశాస్త్రం; **దేవ విద్యాం–** నిరుక్తశాస్త్రం– వేదాల్లో వచ్చే పదాలు ఏ ధాతువునుంచి వచ్చాయో చెప్పే విద్య.

**బ్రహ్మవిద్య–** ఇక్కడ బ్రహ్మవిద్య అంటే అసలైన బ్రహ్మవిద్యగా తీసుకో కూడదు. అతనికే బ్రహ్మ విద్య తెలిస్తే ఇంక సనత్కుమారుని దగ్గరకు ఎందుకు వస్తాడు? అందుకని శంకరాచార్యులు బ్రహ్మవిద్య అంటే వేదాలకు సంబంధించిన అనేక అంశాల గురించిన జ్ఞానం అంటున్నారు, (శంకరాచార్యుల భాష్యం లేకపోతే ఉపనిషత్తులను అర్థం చేసుకోవడం కష్టం అని అందుకే అంటారు). ఆ అంశాలు ఏమిటి? శిక్ష, కల్పం, ఛందస్సు వగైరా. శిక్ష అంటే వేదమంత్రాల ఉచ్చారణ గురించి చెప్పేది; కల్పం అంటే యజ్ఞయాగాదుల ప్రక్రియ గురించి చెప్పేది, ఛందస్సు అంటే గాయత్రి, అనుష్టుప్, బృహతి లాంటి ఛందస్సుల గురించి చెప్పేది;

**భూతవిద్య –** మనను భయపెట్టే భూతాల గురించి కాదు, పంచభూతాల శాస్త్రం – ఫిజిక్స్, కెమిస్ట్రీ, మాథ్స్ లాంటివి. ఫిజిక్స్‌ను భౌతికశాస్త్రం అని అంటారు కదా; **క్షత్రవిద్య –** ధనుర్విద్య, **నక్షత్ర విద్యాగ్ం –** తిథినక్షత్రాలను ఉదయాస్తమయాలను, గ్రహణాలను గురించి చెప్పే జ్యోతిష్యశాస్త్రం.
**సర్ప –** సర్ప విద్య అంటే సర్పాల నుంచి తయారుచేసే మందుల గురించిన విద్య; **దేవ జన విద్యామ్–** లలితకళలు–నాట్యం, సంగీతం, వాద్యాల గురించిన విద్య.

ముందు మంత్రంలోకి వెళ్ళేముందు ఒక విషయం గమనించాలి. ఇతిహాస, పురాణాలు, ఛాందోగ్య ఉపనిషత్తు ఉన్నప్పటికే ఉన్నాయా అనే సందేహం కలుగుతుంది కొంతమందికి. ఉపనిషత్తులను చారిత్రాత్మకంగా కొలుస్తే ఇలాంటి సమస్యలు వస్తాయి. ఎందుకంటే వాసుదేవ కృష్ణ అనే పదం ఈ ఉపనిషత్తులోనే వస్తుంది. వాసుదేవ కృష్ణుడు ద్వాపరయుగానికి చెందిన వాడు; ఉపనిషత్తు అంతకన్నా ముందు కాలానికి చెందినది. అందుకని వాటి జోలికి పోకపోతే మంచిది. అందుకే కొంతమంది ఈ సమస్యను తప్పించటానికి ఇతిహాస, పురాణాలు వేదాల్లోని కథలుగా అభివర్ణిస్తారు. ఏది ఏమైనా ఇక్కడ తెలుసుకోవాల్సిన విషయం నారదులకు ఇవన్నీ తెలుసు.

**మంత్రం–3 సోஉ హం భగవో మన్త్రవిదేవాస్మి –** మంత్రవిద్ అంటే అన్మాతవిత్. నాకు అనాత్మ ప్రపంచమే తెలుసు. ఆత్మ గురించి తెలియదు. అనాత్మ జ్ఞానాన్ని అపరావిద్య అంటుంది ముండకోపనిషత్తు. అందుకని మంత్రవిత్ అపరావిద్య మాత్రమే వచ్చు. అయితే ఏమిటి?
**నాత్మవిత్ –** దాన్ని సరిగ్గా విడదీయాలి. న+ఆత్మవిత్– నాకు ఆత్మజ్ఞానం లేదు.
**శృతగ్ం హ్యేవ మే భగవద్దృశేభ్యః –** ఈ క్రింది వాక్యం మీలాంటి మహాత్ముల నుంచి విన్నాను. అది చాలా ముఖ్యమైన విషయం తరచు వినే వాక్యం. ఏమిటది?
**తరతి శోకమాత్మవిత్ –** ఆత్మవిత్ అంటే ఆత్మజ్ఞానం పొందిన వ్యక్తి.
**శోకం తరతి –** శోకమనే సముద్రాన్ని దాటుతాడు. ఆత్మజ్ఞానం పొందిన వ్యక్తి మాత్రమే దుఃఖ సాగరాన్ని దాటుతాడు.

నా పరిస్థితి ఏమిటి? నాకు అన్నీ తెలుసు, ఆత్మజ్ఞానం తప్ప. అందువల్ల నేను తెలివైన, బాధాతప్తజీవిని. తక్కినవాళ్ళు చదువుకోని, బాధాతప్తజీవులు. అదే తేడా. ఆత్మవిత్ ఏవ శోకం తరతి– ఆత్మజ్ఞానం మాత్రమే శోకాన్ని పోగొట్టుతుంది.

**సోఽహం భగవశ్శోచామి –** మామూలుగా సలహా కోసం వెళ్ళిన వాళ్ళు వాళ్ళ బాధలే గంటసేపు చెప్పుకుని, స్వామీజీ చెప్పే సలహా వినే టైమ్ లేక వెళ్ళిపోతుంటారు. కాని నారదమహర్షి తెలివైన వ్యక్తి. అందుకని తన పరిస్థితిని ఒక్క ముక్కలో చెప్పాడు. అహం శోచామి– నేను శోకంలో ఉన్నాను.

**తం మా భగవాఞ్ఛోకస్య పారం తారయతు–** ఓ భగవాన్, సనత్కుమారా, మీరే నన్ను శోకమనే సాగరం యొక్క ఆవల తీరానికి తీసుకువెళ్ళాలి. శోకం ఆవలి తీరానికి అంటే ఆనంద తీరానికి. మీరు తీసుకువెళ్ళండి. ఇంతవరకూ నారదుని మాటలు. నారదుడు ఆత్మ విద్య కోసం అడిగాడు. అనంతమైన దాని గురించిన జ్ఞానమే సంసార సాగరాన్ని లేదా శోక సముద్రాన్ని దాటించగలదు. ఆత్మ అంటే భూమ అని అర్థం చేసుకోవాలి. ఆత్మ పదానికి, అనేక అర్థాలున్నాయి. **'సర్వం ఆప్నోతి వ్యాప్నోతి ఇతి ఆత్మ'** ఒక అర్థం. అంటే సర్వవ్యాపకం ఆత్మ అన్నా భూమ అన్నా, బ్రహ్మ అన్నా ఒకటే అర్థం– అనంతం.

నారదుడు ఆత్మవిద్య కోసం అడిగాడు. సనత్కుమారుడు కూడా బోధచేద్దామనుకున్నాడు కాని, నారదుల వారిని ముందు సిద్ధం చేయాలనుకున్నాడు. అందుకని ముందు కొన్ని వరుస ప్రతీక ఉపాసనలు చెప్పుకొస్తున్నాడు. అసలు బ్రహ్మవిద్య 24వ ఖండంలో వస్తుంది. మొదటి పదిహేను ఖండాల్లో సనత్కుమారుడు 15 ప్రతీక ఉపాసనలు చెప్పాడు.

ప్రతీక ఉపాసన అంటే ఒక ఆలంబనం మీద దేనినైనా ఉపానస చేయటం. ఇక్కడ ఒక్కొక్క ప్రతీక మీద అనంతమైన బ్రహ్మను ఉపాసన చేయమంటున్నాడు.

పరిచ్ఛిన్న ప్రతీక మీద అపరిచ్ఛిన్న బ్రహ్మ దృష్టి ఇదీ విషయం. ఇప్పుడు సనత్కుమారుడు మాట్లాడుతాడు.

**తగ్ం హోవాచ –** ఈ మాటను ఉపనిషత్తు చెపుతున్నది. సనత్కుమారుడు బదులు చెప్పాడు. ఏమని?

**యద్వైకిఞ్చైతదధ్య గీష్ఠా నామై వైతత్ –** నీకు తెలిసిన విద్యలన్నీ నామమాత్రమే. అవి నామం తప్ప మరేమీ కాదు.అన్నీ పదాలు,పదాలు. 'పదాలు' అంటే ఏమిటి దాని అర్థం? ఆరో అధ్యాయంలో అక్షరలక్షలు విలువచేసే వాక్యం ఉందనుకున్నాము.

**వాచాఽఽరమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్ 1-1-4**

కారణం లేకుండా కార్యంకు విడిగా ఉనికి లేదు. అందుకని కార్యం కేవలం నామరూపాలున్న మిథ్యావస్తువు అయిపోతుంది. అందుకని మిథ్యా ప్రపంచమంతా కేవలం నామాలతో నిండి ఉంటుంది. అధ్యగీష్ఠా అంటే అధ్యయనం చేసినవి నామాలే. దీన్నుంచి సనత్కుమారుడు తన బోధను మొదలుపెట్టబోతున్నాడు.

**మంత్రం-4** నీకున్న జ్ఞానమంతా నామం మాత్రమే. అంటే అదంతా మిథ్య అని అర్థం. నామం మిథ్య అయినా, జగత్తంతా వ్యాపించి ఉంది కాబట్టి అది అనంతం. ఎందుకు? జగత్తులో ఏ మారుమూల వస్తువు ఉన్నా దానికొక పేరుంటుంది.సుదూరాతి సుదూరంగా ఉన్న నక్షత్రానికి కూడా పేరుంటుంది. అందుకని నామం జగత్తులో సర్వవ్యాపకం. అందుకని సనత్కుమారుడు ముందు నామం యొక్క గొప్పతనాన్ని వివరించి నామ ఉపాసన చేయమంటాడు. ఎందుకు?

మొదటి ప్రతీక నామం. నామం అంటే పదం.నామాన్ని ముందుగా ఎన్నుకోవటానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి, నామం సర్వవ్యాపకం, ఎందుకంటే అంతటా ఉన్న వస్తువులన్నింటికీ ఏదో ఒక నామం ఉంటుంది. అందుకని బ్రహ్మలాగా దాదాపుగా సర్వవ్యాపకం. నామం అంటే పదం అని తీసుకోవాలి. ప్రతి పదార్థంకూ ఒక పదం ఉంటుంది. అందుకే దాన్ని పదార్థం అన్నారు. పదస్య అర్థః, అంటే ఒక పదంతో సూచించబడిన ఒక వస్తువు. అందుకే ప్రతి పదార్థానికీ పద సంబంధం ఉంటుంది. అందుకని పదాన్నే బ్రహ్మగా భావించి ఉపాసన చేయి అన్నాడు. ఇదే నామ బ్రహ్మ ఉపాసన.

నామాన్ని ముందు ఎన్నుకోవటానికి ఇంకో కారణం కూడా ఉంది. నారదుల వారికి ఎన్నో శాస్త్రాలు కంఠతా వచ్చు. కేరళలో ఇప్పటికీ 'అక్షరశ్లోకం' అనే ఆట ఉంది. ఉదాహరణకు ఒక వ్యక్తి ఇది చెపితే –

**శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం।**
**ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే॥**

అందులోంచి మూడో భాగంలోని మొదటి అక్షరం తీసుకుని ఇంకో వ్యక్తి ఇంకో శ్లోకం చెప్పాలి. ప్రసన్నవదనం ధ్యాయేత్‌లోని మొదటి అక్షరం 'ప్ర'. బాగా ఆడగలిగిన వాళ్ళుంటే వాళ్ళు 'ప్ర' తోనే ఆడాలి. ఆడలేని వాళ్ళుంటే ప,పి,పు లాంటి దగ్గర అక్షరాలతో మొదలుపెట్టవచ్చు. ఎక్కువ సమయం ఇవ్వరు, ఎందులోనూ చూడకూడదు. ఇప్పటికీ రాష్ట్రస్థాయి పోటీలు, వాటికి ప్రైజులు ఉన్నాయి. ఇప్పుడు తక్కిన చోట్ల అది మాయమయిపోయి, సినిమాపాట అంత్యాక్షరి రాజ్యమేలుతున్నది.

ఇంతకీ చెప్పొచ్చింది అలా ఒక ప్రత్యేక అక్షరంతో మొదలు పెట్టాలంటే ఎన్ని శ్లోకాలు తెలియాలి? ఎంత జ్ఞాపకశక్తి ఉండాలి? ఆ శ్లోకాల పట్టికలోంచి అవసరమైన శ్లోకం ఏరగలగాలి. అన్ని శ్లోకాల్లోనూ ఉన్నదేమిటి? నామం! నారదుల వారి మనసునిండా ఉన్నదేమిటి? నామాలే నామాలు. అందుకని **మొదటి ఉపాసన నామ బ్రహ్మ ఉపాసన.**

**తన్నామోపాస్స్వేతి** – తత్‌నామ ఉపాస్సు (ఇతి) – అందువల్ల ముందుగా ఒక ఉపాసన గురించి చెపుతున్నాను నీకు. ఏమిటా ఉపాసన? నామబ్రహ్మ ఉపాసన. ఈ ఉపాసనలో నామాన్ని బ్రహ్మకు ఒక ప్రతీకగా లేదా ఆలంబనగా తీసుకోవాలి. దీన్ని ప్రతీక ఉపాసన అంటారు. ఉదాహరణకు శివ ఉపాసనకు శివలింగాన్ని, విష్ణు ఉపాసనకు సాలిగ్రామాన్ని ప్రతీకగా తీసుకుంటారు. ఇక్కడ బ్రహ్మ ఉపాసనకు నామాన్ని ప్రతీకగా తీసుకోమంటున్నాడు సనత్కుమారుడు. అలా ఇది మొదటి సాధన అవుతుంది.

అప్పుడు నారదుడు, 'నామం నిజంగా అనంతమా?' అంటాడు. సనత్కుమారుడు, 'కాదు, దానికన్నా కొంచెం పెద్దది ఇంకోటి ఉంది,' అని రెండోదాన్ని ప్రవేశపెడతాడు. నారదులవారు దీనికన్నా పెద్దది ఉందా అంటాడు మళ్ళీ. లేదు ఇంకోటి ఉందంటాడు.

తైత్తిరీయంలో ఇలాంటి సందర్భమే చూస్తాము. ముందు, 'అన్నమయమే ఆత్మ', అని తర్వాత కాదు, 'అన్యోంతర ఆత్మ ప్రాణమయః' అని వస్తుంది. అలా ఐదు దశలు దాటాక ఆనందమే ఆత్మ అని చెప్తాడు. అక్కడ ఐదు దశలే.

ఇక్కడ, భూమవిద్యలో 15 ప్రతీక ఉపాసనలు చూడబోతు న్నాము. అందుకని ఖండాలు 1–15లలో , పెరుగుతూ వస్తున్న ప్రతీకల పట్టికను చూస్తాము.

నామం నుంచి ప్రాణం వరకూ పదిహేను ఉపాసనలు **పంచదశ ఉపాసనాని**

**1. నామబ్రహ్మ ఉపాసన:–** మొదటి ప్రతీక ఉపాసన– నామ బ్రహ్మ ఉపాసన. నామం అంటే మొహానికి పెట్టుకునే నామం కాదు. నామం అంటే పదాలు, శబ్దబ్రహ్మ, 15వ ప్రతీక ప్రాణం. **నామాది ప్రాణాంత పంచదశ ఉపాసనాని–** నామంతో మొదలయి, ప్రాణం దాకా 15 ఉపాసనలు చూడబోతున్నాము. దీని ఉద్దేశం ఏమిటంటే నామం నుంచి ప్రాణంకు వెళ్ళేలోపు, శిష్యుని మనసు అంతకంతకూ విశాలమవుతుంది. అంతేకాదు మరింత సూక్ష్మదృష్టి పెరుగుతుంది. ఈ 15 దశలూ దాటాక, సనత్కుమారుడు అసలు బ్రహ్మ గురించి మాట్లాడుతాడు. ఏమిటాబ్రహ్మ? **ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్ (తైత్తిరీయం)** ఆ ఆనందబ్రహ్మను చూడబోతున్నాము.

ఇప్పుడు మొదటి ప్రతీక ఉపాసన.

**ఋగ్వేదో... దేవజనవిద్యా –** అంతకుముందు నారదుడు ఈ పట్టికను చదివాడు. గురువు అదంతా అక్షరం పొల్లుపోకుండా మళ్ళీ చెప్తున్నాడు. ఇవన్నీ కాలేజీ లైబ్రరీలో ఉండే పుస్తకాలు లాంటివి! ఇప్పుడు రాబోయే వాక్యం చూడండి. అది ముఖ్యం మనకు.

**నామైవైతత్–** అవన్నీ కేవలం నామమే! కాని నామం సర్వవ్యాపకం.

**తన్నామోపాస్వేతి –** అందువల్ల నువ్వు నామ బ్రహ్మ ఉపాసన చేయి.

మనం సరస్వతీ పూజ రోజున పుస్తకాలను పూజిస్తాము కదా! దానికి ఇదే ఆధారం! అంటే రామా, కృష్ణా లాంటి దేవుడి పదాలే కదు. అన్ని పదాలూ శబ్దబ్రహ్మ. అందుకని నామ ఉపాసన చేయి. దాని ఫలమేమిటి? తర్వాత వచ్చే మంత్రంలో వస్తుంది.

**మంత్రం–5** ప్రతి ఉపాసనకూ ఫలం రెండురకాలుగా ఉంటుంది. ఉపాసన చేసిన పద్ధతి మీద ఫలం ఆధారపడి ఉంటుంది. ఉపాసనారకాలు – సకామ ఉపాసన, నిష్కామ ఉపాసన. నిష్కామ ఉపాసన చేస్తే భూమ విద్య పొందటానికి కావాల్సిన అర్హతలు కలుగుతాయి.

**జ్ఞానయోగ్యతా ప్రాప్తిః –** నిష్కామ ఉపాసన ఫలం.

సకామ ఉపాసకులకు ఫలం ఏమిటి? అదే ఇక్కడ చెప్పబడుతున్నది. **స యో నామ బ్రహ్మేత్యుపాస్తే యావన్నామ్నో గతం తత్రాస్య యథా కామచారో భవతి–** ఎవరైతే నామ బ్రహ్మ ఉపాసన చేస్తారో, వారు ఏ ఆటంకం లేకుండా ఎక్కడికి కోరితే అక్కడికి వెళ్ళగలరు. ఎంతమేరకు? ఏ లోకాలలో నామం విస్తరిస్తే ఆ లోకాలకు వెళతారు.

అన్ని ఉపాసనలకూ సమానంగా అంశం ఆ ఉపాసన వ్యాపకత్వం. అందుకని,ఈ ఉపాసకుడు నామం యొక్క వ్యాప్తి ఎంత ఉంటే, అంత మేరకు యథేచ్ఛగా వెళ్లగలడు. అదీ ఫలం.

కాని వేదాంతులది నిష్కామ ఉపాసన కాబట్టి నిష్కామ ఫలం. ఇక్కడిదాకా సనత్కుమారుడు చెపుతాడు. ఇప్పుడు నారదుడు అడుగుతాడు, **భగవో నామ్నో భూయ ఇతి–** ఓ భగవాన్, నామం కన్నా విశాలమైనది ఏదైనా ఉందా?

**నామ్నో వావ భూయోఽస్తీతి–** నామం కన్నా పెద్దది ఉంది అంటాడు సనత్కుమారుడు.

**తన్మే భగవాన్ బ్రవీత్వితి–** అయితే, భగవాన్, దయచేసి అదేమిటో నాకు చెప్పండి. దీంతో ఈ ఖండం ముగిసింది. మొదటి ఉపాసనా ముగిసింది. ఏమిటది?

**1.** నామబ్రహ్మ ఉపాసన

### ద్వితీయః ఖణ్డః (2)

**వాగ్వావ నామ్నో భూయసీ। వాగ్వా ఋగ్వేదం విజ్ఞాపయతి యజుర్వేదగ్ం సామవేదమాథర్వణం చతుర్థమితిహాసపురాణం పంచమం వేదానాం వేదం పిత్ర్యగ్ం రాశిం దైవం నిధిం వాకోవాక్యమేకాయనం దేవవిద్యాం బ్రహ్మవిద్యాం భూతవిద్యాం క్షత్రవిద్యాం నక్షత్రవిద్యాగ్ం సర్పదేవజనవిద్యాం దివం చ పృథివీం చ వాయుఞ్చాకాశఞ్చాపశ్చ తేజశ్చ దేవాగ్ంశ్చ మనుష్యాగ్ంశ్చ పశూగ్ంశ్చ వయాగ్ంసి చ తృణవనస్పతీన్ శ్వాపదాన్యాకీటపతంగపిపీలికం ధర్మం చాధర్మం చ సత్యం చానృతం చ సాధు చాసాధు చ హృదయజ్ఞం చాహృదయజ్ఞం చ యద్వై వాఙ్నాభవిష్యన్న ధర్మో నాధర్మో వ్యజ్ఞాపయిష్యన్నసత్యం నానృతం న సాధు నాసాధు న**

**హృదయజ్ఞో నాహృదయజ్ఞో వాగేవైతత్సర్వం విజ్ఞాపయతి వాచముపాస్స్వేతి ॥1॥ స యో వాచం బ్రహ్మేత్యుపాస్తే యావద్వాచో గతం తత్రాస్య యథాకామచారో భవతి యో వాచం బ్రహ్మేత్యుపాస్తేఽస్తి భగవో వాచో భూయ ఇతి వాచో వావ భూయోఽస్తీతి తన్మే భగవాన్ బ్రవీత్వితి ॥2॥**

ఇందులో సనత్కుమారుడు రెండో ఉపాసనను ప్రవేశపెడుతున్నాడు. అత్యున్నతమైనది బ్రహ్మ. దానికి నిదానంగా వెళుతున్నాము మనము. మొదటి దాన్నుంచి ఇప్పుడు రెండోదానికి వెళుతున్నాము. రెండో ఉపాసన నామం కన్నా విస్తీర్ణమైనది. ఏమిటది? వాక్కు. వాక్బ్రహ్మ ఉపాసన. వాక్కు అంటే వాగింద్రియం. వాక్కుకీ, నామానికీ ఉన్న అనుబంధం ఏమిటి? అనుబంధం ఏమిటంటే, వాక్కు కారణం, పదాలు కార్యం. అవునా, కాదా? ఒక గంట నేను మాట్లాడితే, పదాలను ఉత్పత్తి చేసే నా వాక్కు కారణం. కార్యకారణాలలో ఏది విస్తీర్ణమైనది? కారణమే! కుండకన్నా మట్టి విస్తీర్ణమైనది, అల కన్నా నీరు విస్తీర్ణమైనది. కార్యం కన్నా కారణం మరింత విస్తీర్ణమైనది. నిజానికి కారణం యొక్క ఒక భాగానికే, ఒక ప్రత్యేకమైన నామరూపంతో అనుబంధం ఉంటుంది. అందుకని ఆ ఒక్క భాగాన్నే కారణం అంటారు. **కారణస్య ఏక శేషః కార్యం.**

**2. వాక్కు బ్రహ్మ ఉపాసన**

**మంత్రం 1– వాగ్వావ నామ్నో భూయసీ –** వాగింద్రియం నామాలకన్నా ఉన్నతమైనది. ఎందుకు? ప్రతిదశలో మనకు కారణం కూడా వస్తుంది. ఎందుకంటే వాగింద్రియం కారణం,వాక్కు (పదాలు) కార్యం. వాగింద్రియం నుంచే మాటలు వస్తాయి కాబట్టి కార్యం కన్నా విస్తారంగా ఉంటుంది కారణం.

వాగింద్రియం వల్లే మాటలు వస్తున్నాయి. ఒకవేళ మనుష్యులకు వాగింద్రియం లేదనుకోండి! అప్పుడేమిటి పరిస్థితి? స్కూళ్ళు, కాలేజీలు ఉండవు. లైబ్రరీలు ఉండవు. సిడీలు ఉండవు. అనేక వస్తువులు మాయమయిపోతాయి. వాగింద్రియం ఉండబట్టే కదా మనం ఉపనిషత్తులు చదవగలుగు తున్నాము.వాటిమీద శంకరాచార్యులు రాసిన భాష్యాలు చదవగలుగుతున్నాము. పుస్తకాలు అంటే ఏమిటి? మాట్లాడిన పలుకులకు

ప్రతీకలు అవి. శంకరాచార్యుని భాష్యం చదువుతుంటే, ఆయన మాటలు వింటున్నట్టే. అందుకని మనిషికున్న ప్రత్యేక శక్తుల్లో ముఖ్యమైనది వాగింద్రియం.

అందువల్ల వాగ్దేవి మీద ఉపాసన చేయి. అందుకే సరస్వతీ దేవికి అంత పెద్దపీట వేసింది మన సంప్రదాయం.

**వాగ్వావ నామ్నో భూయసీ-** వావ అంటే వత్తి పలకటం. వాక్కే నిశ్చయంగా నామాలకన్నా గొప్పది. అందుకే పదాలన్నీ మాయమయిపోయినా, వాటిని మళ్ళీ పుట్టించవచ్చు. ఎందుకు వాగింద్రియం గొప్ప? సనత్కుమారుడు దానికి కారణం చెపుతున్నాడు.

**వాగ్వా ఋగ్వేదం విజ్ఞాపయతి-** వాగింద్రియం మాత్రమే ఋగ్వేదాన్ని తెలియజేస్తుంది.

**యజుర్వేదగ్ం ... సర్వదేవజనవిద్యాం-** ఇంతవరకూ మొదటి మంత్రంలో వచ్చిన నామాలే. అక్కడితో ఆగకుండా గురువు మరికొన్ని నామాలను కలుపుతున్నాడు. అక్కడ్నుంచి చూద్దాము.

**దివంచ పృథివీం చ వాయుఞ్చాకాశ్చ తేజశ్చ -** దివంచ అంటే అనేక లోకాలు- భూ, భవ, సువర్లోకాలను. తర్వాత పంచభూతాలను;

**దేవాగ్ంశ్చ మనుష్యాగ్ంశ్చ పశూగ్ంశ్చ వయాగ్ంసి చ-** అంతేకాదు, ఈ లోకాలలో ఉన్న దేవతలను, మనుష్యులను, పశువులను, పక్షులను- వీటన్నింటికీ నామరూపాలున్నాయి. పక్షులను అధ్యయనం చేసే వ్యక్తి కొత్త పక్షిని చూస్తే - మనకు 1,321 రకాల పక్షులే తెలుసు, ఇది ఇంకో కొత్త జాతికి చెందింది అంటాడు. ఇవన్నీ ఎలా చెప్పగలుగుతున్నాము? వాగింద్రియం వల్ల. అంతేకాదు ఇంకా ఉన్నాయి;

**తృణవనస్పతీన్ శ్వాపదాన్యాకీటపతంగపిపీలికం-** తృణ - గడ్డి; వనస్పతి- చెట్లు, శ్వాపదానీ-క్రూర మృగాలు; కీట-చిన్న పురుగులు; పతంగ- రెక్కల పురుగులు; పిపీలికం- చీమలు. వీటన్నింటి గురించీ మనం మాట్లాడగలుగుతున్నాము. వీటన్నింటికీ వివిధ విభాగాలున్నాయి విజ్ఞానశాస్త్రంలో. ఇంకా వాటిమీద పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. బొద్దింకల మీద పిహెచ్‌డీలు పొందుతూనే ఉన్నారు. ఇదంతా దేనివల్ల సాధ్యం? వాక్కు వల్ల.

**ధర్మం చాధర్మం చ సత్యం చానృతం చ –** అంతేకాదు, కొన్ని అసాధారణమైన విషయాలు కూడా ఉన్నాయి. అవి ధర్మం గురించి అధర్మం గురించి, సత్యం గురించీ అసత్యం గురించీ.

**సాధు చాసాధు –** మంచి వాళ్ళు, చెడ్డవాళ్ళు.

**హృదయజ్ఞం చాహృదయజ్ఞం చ –** మనసుకు నచ్చే విధంగా, మనసుకి నచ్చని విధంగా. ఏదైనా కార్యక్రమం జరగగానే దాని గురించి వార్తాపత్రికలు హోరెత్తిస్తాయి. దేనివల్ల జరుగుతోంది అది? వాగింద్రియం వల్ల.

**వాగేవైతత్సర్వం విజ్ఞాపయతి –** ఈ పట్టికలో ఉన్నవాటన్నింటినీ దీనితో కలుపుకోవాలి. వాగింద్రియమే వీటన్నింటి గురించి మాట్లాడుతుంది. అంతేకాదు–

**యద్వై వాఙ్నాభవిష్యన్న –** నిజానికి మనం ఈ విషయం గురించి ఆలోచించము. ఒకవేళ వాక్కు లేకపోతే, సమస్య భయంకరంగా ఉండేది. ఒక శాస్త్రజ్ఞుడు కనుగొన్నది తన విద్యార్థులకు అందజేయలేపోతాడు. ఎవరికి వారే కొత్తగా, విడిగా నేర్చుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే, మనకున్న జ్ఞానాన్ని ఇంకొకరికి అందచేయలేము. ఇటువంటి పరిస్థితిని మనం ఎప్పుడన్నా ఊహించామా? వేదం గొప్పతనం అదే; మనం కలలోనన్నా ఊహించని విషయాలను వేదం ఊహించి, మన కళ్ళ ముందు ఉంచుతుంది. వాగింద్రియం లేకపోతే ఏమవుతుంది?

**న ధర్మో నాధర్మో వ్యజ్ఞాపయిష్యన్నసత్యంనానృతం న సాధు నాసాధు నహృదయజ్ఞో నాహృదయజ్ఞో –** పైన చెప్పిన వేటి గురించీ మనం మాట్లాడలేకపోతాం. ఉపనిషత్తు అన్నింటినీ మళ్ళీ చెపుతున్నది. సత్యం, అసత్యం గురించి. మంచి వాళ్ళు, చెడ్డవాళ్ళ గురించీ వగైరా.

**వ్యజ్ఞాపయిష్యన్న –** వాగింద్రియం లేకపోతే మాట్లాడలేకపోయి ఉండేవాళ్ళం.

**వాచముపాస్స్వేతి –** అందువల్ల నారదా వాగింద్రియాన్ని ఉపాసన చేయి. దాని ఫలశ్రుతి తర్వాత వచ్చే మంత్రంలో వస్తుంది.

**మంత్రం – 2** ప్రతి ఖండంలోని ఫలశ్రుతి ఒకటేగా ఉంటుంది. సకామ ఉపాసన అయితే అతను కోరుకున్న లోకాల్లో యథేచ్ఛగా తిరగగలుగుతాడు. నామం కన్నా వాగింద్రియం మరింత విశాలం కాబట్టి అతను మరింత

విశాలమైన లోకాల్లో యథేచ్ఛగా సంచరించగలుగుతాడు. నిష్కామ ఉపాసన ఫలం చెప్పలేదు. మనం కలుపుకోవాలి. అతను మూడో ఉపాసనకు సిద్ధమవుతాడు. నారదునికి సకామ ఉపాసన మీద కోరిక లేదు, అతను ఆత్మవిద్య కోసం వచ్చాడు. అందుకని

**అస్తి భగవో వాచో భూయ ఇతి** – ఓ భగవాన్, వాక్కుకన్నా గొప్పది ఉందా?

**వాచో వావ భూయోఽస్తీతి** – వాక్కు కంటే గొప్పది నిశ్చయంగా ఉంది.

**తన్మే భగవాన్ బ్రవీత్వితి** – ఓ భగవాన్, నాకు దాని గురించి చెప్పండి అంటాడు నారదుడు. ఇక్కడితో రెండవ ఖండం ముగిసింది. రెండవ ఉపాసన ముగిసింది. ఏమిటది?

**2.** వాక్కు బ్రహ్మ ఉపాసన

### తృతీయః ఖణ్డః (3)

**మనో వావ వాచో భూయో యథా వై ద్వే వాఽఽమలకే ద్వే వా కోలే ద్వౌ వాఽక్షౌ ముష్టిరనుభవత్యేవం వాచం చ నామ చ మనోఽనుభవతి స యదా మనసా మనస్యతి మన్త్రానధీయీయేత్యథాధీతే కర్మాణి కుర్వీయేత్యథ కురుతే పుత్రాగ్ంశ్చ పశూగ్ంశ్చేచ్ఛేయేత్యథేచ్ఛత ఇమం చ లోకమముంచేచ్ఛేయేత్యథేచ్ఛతే మనో హ్యాత్మా మనో హి లోకో మనో హి బ్రహ్మ మన ఉపాస్స్వేతి ॥1॥ స యో మనో బ్రహ్మేత్యుపాస్తే యావన్మనసో గతం తత్రాస్య యథాకామచారో భవతి యో మనో బ్రహ్మేత్యుపాస్తేఽస్తి భగవో మనసో భూయ ఇతి మనసో వావ భూయోఽస్తీతి తన్మే భగవాన్ బ్రవీత్వితి ॥2॥**

**3. మనో బ్రహ్మ ఉపాసన:–** అందుకని నామ బ్రహ్మ ఉపాసన అయ్యాక, వాక్బ్రహ్మ ఉపాసన చేయాలి. భూమ అంటే అంతకంతకూ విస్తీర్ణమైనది. ఇప్పుడు మూడో ఉపాసన. దాన్ని మనః అన్నాడు. సాధారణంగా మనః అంటే మనస్సు అని అర్థం.

కాని శంకరాచార్యులు దీనికి ప్రత్యేకమైన అర్థం ఇస్తున్నారు. మనః అంటే మనస్యనం అంటున్నారు. దీని అర్థం వివక్షాబుద్ధి అంటున్నారు. ఎందుకు? వాగింద్రియం కొన్ని మాటలు చెప్తోందంటే, దానంతట అది

మాట్లాడలేదు. వాగింద్రియం దానికి తోచినట్టు మాట్లాడుకుంటూ పోతే, అది మాట అవదు, ఏదో పిచ్చి మాటలు అవుతాయి. వాగింద్రియం ఏదో చెపుతున్నదంటే, నా మనసుకు ఏదో చెప్పాలనే కోరిక ఉండబట్టే, చెపుతున్నది. ఆ కోరికే మాటల రూపంలో బయటకు వస్తున్నది. ఎందుకంటే భావాలు భాషగా, భాష పదాలుగా మారుతున్నాయి. అందుకే కోరికతో కూడిన మనసు వాగింద్రియాన్ని ప్రేరేపిస్తే, అది పదాలను పలుకుతుంది. అంటే వాగింద్రియం దేనివల్ల పలుకుతుంది? మనస్యన శక్తి వల్ల. తేలిగ్గా చెప్పాలంటే కోరిక వల్ల.

కోరికకూ, వాక్కుకూ ఏమిటి సంబంధం? కార్యకారణ సంబంధం. ఏది కార్యం, ఏది కారణం? వాక్కు కార్యం, మనసు లేదా కోరిక కారణం. అలా మనసు కారణం అవటం వల్ల అది మరింత భూమ అవుతుంది, అంటే మరింత వ్యాపించి ఉంటుంది. అందువల్ల మనోబ్రహ్మ ఉపాసన చేయమంటున్నాడు.

ఈ మూడూ – నామం, వాక్కు, మనస్సు – తీసుకుంటే, నామం కార్యం, వాక్కు కారణం; వాక్కు కార్యం, మనస్సు కారణం. కార్యం కారణంలో ఇమిడి ఉంటుందని మీకు తెలుసు. అందుకని వాక్కు మనస్సులో ఇమిడి ఉంటుంది. అందువల్ల చివరికి నామం, వాక్కు రెండూ మనస్సులో, అంటే కారణంలో ఇమిడి ఉన్నాయి. తాతగారు అన్న పదంలో తండ్రి, కొడుకు కూడా ఇమిడి ఉన్నాయన్నమాట!

దీనికి ఉపనిషత్తు ఒక ఉదాహరణ కూడా ఇస్తున్నది. మీ చేతిలో రెండు పండ్లు ఇమిడినట్టుగా అంటున్నది. రెండు పండ్లు అంటే బొప్పాయి పండు లాంటి పెద్దవి కాదు. రెండు రేగిపండ్లు కాని, ఉసిరికాయలు కాని, అలా మనస్సులో వాక్కు, నామం ఇమిడిపోతాయిట. ఎంత ఊహాజనితమైన వివరణ!

అన్ని ఖండాలూ ఇలాగే ఎంతో ఊహాజనితంగానూ, కవితాధోరణిలోనూ ప్రశంసాధోరణిలోనూ సాగిపోతాయి. ఎంతో బాగుంటాయి. చదివి ఆనందించాల్సిన అందం ఉంది వాటిలో. మనం ఆ ఉపాసనలు చేస్తామా లేదా అన్నది వేరే విషయం. వాటిలోని కవితాధోరణిని ఆస్వాదించటానికైనా చదవాలి. ఇప్పుడు మంత్రం చూద్దాం.

**మంత్రం - 1 - మనోవావ వాచోభూయః-** మనస్సు నిశ్చయంగా వాగింద్రియం కంటే గొప్పది. ఎక్కువ మేరకు వ్యాపించి ఉన్నది. వాగింద్రియంతో పాటు నామం కూడా కలుపుకోవాలి. నిజానికి మనసులో ఎన్నో పదాలు ఉన్నాయి. అందులో కొన్నే వెలిబుచ్చుతాము మనము. మనస్సులో నామం, వాక్కు ఇమిడి ఉన్నాయి. దానికి మూడు ఉదాహరణలనిస్తున్నది ఉపనిషత్తు.

**యథా వై ద్వేవాఽఽమలకే-** రెండు ఉసిరికాయలు కాని; **ద్వేవాకోలే-** రెండు రేగుపళ్ళను గాని; **ద్వేవాక్షౌ -** అక్షౌ అంటే తాండ్ర పళ్ళను కాని; **ముష్టిరనుభవత్యేవం -** పిడికిలి ఎలా కప్పివేస్తుందో, **వాచం చ నామ చ మనోఽనుభవతి -** ఆ విధంగా మనసనే పిడికిలి వాక్కును, నామాన్ని కప్పివేస్తుంది. ఎటువంటి మనస్సు?

**స యదా మనసా మనస్యతి-** ఎప్పుడైతే ఒక వ్యక్తి తన మనస్సులో ఈ క్రింది పనులు చేయాలని అనుకుంటాడో అప్పుడే చేయగలడు. ఏమిటవి?

**మన్త్రానధీయీయేత్యథాధీతే -** వేదమంత్రాలను పఠించాలని అనుకుంటే, వేదాలను పఠిస్తాడు. ఛాందోగ్య ఉపనిషత్తు చదవాలన్న కోరిక ఉంటేనే, ఈ పుస్తకం చదవటం కుదురుతుంది. మీరు ఛాందోగ్యం చదివారంటే ఎందువల్ల? మీ కోరికవల్ల.

**కర్మాణి కుర్వీయ ఇతి -** ఈ పనులు చేయాలి అనే కోరికముందు పుడుతుంది.

**అథకురుతే -** తర్వాత వాటిని చేస్తారు.

**పుత్రాగ్ంశ్చ పశూగ్ంశ్చేచ్ఛేయేతి-** ఇచ్ఛేయ అంటే కోరిక. నేను పెళ్ళి చేసుకోవాలి, పిల్లలను కనాలి. జంతువులను పెంచుకోవాలి లాంటి వన్నీ ముందు కోరికతో మొదలవుతాయి.

**అథ ఇచ్ఛత-** కోరినవి తీరుతాయి.

**ఇమం చ లోకమముం చేచ్ఛేయేత్యథేచ్ఛతే-** వచ్చే జన్మలో నేను మళ్ళీ భూలోకంలోనే పుట్టాలి. లేదా వచ్చే జన్మలో స్వర్గలోకం పొందాలి. ఇవన్నీ కూడా కోరికలే. అందువల్ల మనస్సులో ఏ కోరిక ఉంటే, అది నెరవేరుతుంది. దీని గురించి ఆంగ్లంలో ఒక సామెత ఉంది. దాని సారాంశం-

నీ ఆలోచనలను గమనించు, అవి నీ మాటలుగా మారుతాయి.
నీ మాటలను గమనించు, అవి నీ చర్యలుగా మారుతాయి.
నీ చర్యలను గమనించు, అవి నీ అలవాట్లుగా మారుతాయి.
నీ అలవాట్లను గమనించు, అవి నీ నడవడికగా మారుతాయి.
నీ నడవడికను గమనించు, అది నీ భవిష్యత్తుగా మారుతుంది.

దీనంతటికీ ఆరంభం ఎక్కడ ఉంది? నీ ఆలోచనలో. అందుకే మనస్సనం చాలా శక్తివంతమైనది. అందుకని గుర్తుంచుకోండి. మీరు కట్టుకున్న మీ ఇంట్లో మీరు ఉన్నారంటే, ఇంత అందమైన ఇంటి వెనుక రూపురేఖలు తెలియని మీ కోరిక ఉంది. కొన్నేళ్ళ క్రితం మీ మనసులో వెలిసిన కోరికే, ఇంత పెద్ద ఆకారం దిద్దుకుని, మీ కలలను సాకారం చేస్తూ, మీ ముందు నిలుచుని ఉంది. కోరిక ఎక్కడ ఉంది? ప్రతి క్రియ వెనుకా ఉంది. అంటే సృష్టి అంతటా ఉంది. కోరికే సృష్టిగా రూపుదిద్దుకుంది. అందుకే అన్నాడు

**మనోహ్యాత్మా–** మనసే ఆత్మ. ఇక్కడ ఆత్మ అంటే కర్త అనే నేను. ఎందుకు? మనసు వల్లే నేను కర్తగా వ్యవహరించగలను. మనస్సు నాకు కర్తృత్వం ఇస్తుంది? ఏమిటి నిదర్శనం? సుషుప్తిలో మనసు లయం చెందినప్పుడు, నాలో కర్తృత్వ భావనలేదు. లేచాకే నేను కర్తా జీవాత్మను అవుతున్నాను. **మనోహిలోకః –**పూర్తిగా ఊహాజనితమైన ఆలోచన. కర్తే అనేక కర్మలు చేయటం ద్వారా భూలోక, భువర్లోక, స్వర్గలోక,మహర్లోకాల్లాంటి లోకాలను పొందుతాడు.

భగవంతుడు తీరికగా కూర్చుని జగత్తును ఎందుకు సృష్టించాడు? ఊరికే ఉండి ఉండవచ్చు కదా అనే ప్రశ్నలు తరచు వస్తుంటాయి. ఎందుకు సృష్టించాడంటే జీవికి కర్మఫలాన్ని ఇవ్వటానికి. జీవి సుఖదుఃఖాలనే కర్మఫలాలు అనుభవించాలి. జీవి ఎవరు?భోక్త. భోక్త ఎక్కడ్నుంచి వచ్చాడు? ఎందుకంటే, అతను కర్త అయ్యాడు కాబట్టి. కర్త ఉన్నాడు కాబట్టి, భోక్త వచ్చాడు. భోక్త అనుభవించాలి కాబట్టి, భోగ్య ప్రపంచం వచ్చింది. చివరికి సృష్టి ఎందువల్ల వచ్చింది? కర్తవల్ల. కర్త ఎందుకయ్యాడు? మనస్సు వల్ల. మళ్ళీ కారణాల తోరణాలు చూస్తే నా మనస్సులోని కోరిక వల్ల నేను కర్తనయ్యాను, కర్త వల్ల భోక్తనయ్యాను. నేను అనుభవించటానికి 14 లోకాలు వచ్చాయి. అంటే

మొత్తం భోగ్య ప్రపంచం వచ్చింది. మనసు చేసే గారడీ చూడండి! అందువల్ల మనో హి లోకః అన్నాడు సనత్కుమారుడు.

**మనో హి బ్రహ్మ –** మనస్సు 14 లోకాలకు విస్తరిస్తుంది. ఎందుకంటే, మనస్సులోని కోరిక 14 లోకాలుగా రూపుదిద్దుకుంది.మనసే లోకాలకు కారణం కాబట్టి, మనసే బ్రహ్మ. మనస్సు ఎంత దూరం వ్యాపించింది? 14 లోకాలకూ వ్యాపించింది. అందువల్ల మనస్సును బ్రహ్మగా ఊహించుకోవచ్చు.

**మనో హి బ్రహ్మ మన ఉపాస్స్వేతి –** అందువల్ల నారదా,మనో్బ్రహ్మ ఉపాసన చేయి. ఇది మూడో ఉపాసన. ఇది చేస్తే ఫలం ఏమిటి?

**మంత్రం–2** ప్రతి ఖండంలోనూ ఉపాసన ఫలం వస్తుంది. అన్నింటిలోనూ ఒకటేగా ఉంటుంది. ఉపాసకుడు ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్ళగలడు. ఎంతమేరకు? ఉపాసన ప్రతీక పరిధి ఎంత మేరకు ఉంటే అంతమేరకు వెళ్ళగలడు. నామ ఉపాసన కన్నా, వాక్ ఉపాసన పరిథి ఎక్కువ, వాక్ ఉపాసనకన్నా మనో ఉపాసన పరిధి ఇంకా ఎక్కువ.

ఫలశ్రుతి అయ్యాక, నారదుడు ఇంతకన్నా పెద్దది ఉందా అంటాడు. ఉంది అంటాడు గురువు. దాన్ని చెప్పమంటాడు నారదుడు. ఇక్కడితో మూడో ఉపాసన ముగిసింది.

**3. మనో బ్రహ్మ ఉపాసన**

**చతుర్థః ఖణ్డః (4)**

**సంకల్పో వావ మనసో భూయాన్యదా వై సంకల్పయతేఽథ మనస్య త్యథ వాచమీరయతి తాము నామ్నీరయతి నామ్ని మన్త్రా ఏకం భవన్తి మన్త్రేషు కర్మాణి ॥1॥ తాని హ వా ఏతాని సంకల్పైకాయనాని సంకల్పాత్మకాని సంకల్పే ప్రతిష్ఠితాని సమక్లృపతాం ద్యావాపృథివీ సమకల్పేతాం వాయుశ్చాకాశం చ సమకల్పన్తాపశ్చ తేజశ్చ తేషాగ్ం సంక్లృప్త్యై వర్షగ్ం సంకల్పతే వర్షస్య సంక్లృప్త్యా అన్నగ్ం సంకల్పతేఽన్నస్య సంక్లృప్త్యై ప్రాణాస్సంకల్పన్తే ప్రాణానాగ్ం సంక్లృప్త్యై మన్త్రా స్సంకల్పన్తే మన్త్రాణాగ్ం సంక్లృప్త్యై కర్మాణి సంకల్పన్తే కర్మాణాగ్ం సంక్లృప్త్యై లోకస్సంకల్పతే లోకస్య సంక్లృప్త్యై సర్వగ్ం సంకల్పతే స ఏష సంకల్పస్సంకల్పముపాస్స్వేతి ॥2॥ స యస్సంకల్పం బ్రహ్మేత్యుపాస్తే క్లప్తాన్ వై స లోకాన్ ధ్రువాన్ ధ్రువః ప్రతిష్ఠితాన్ ప్రతిష్ఠితోఽ**

**వ్యథమానానవ్య థమానోఽభిసిధ్యతి। యావత్సంకల్పస్య గతం తత్రాస్య యథాకామచారో భవతి యస్సంకల్పం బ్రహ్మేత్యుపాస్తేఽస్తి భగవస్సంకల్పాద్భూయ ఇతి సంకల్పాద్వావ భూయోఽస్తీతి తన్మే భగవాన్ బ్రవీత్వితి॥3॥**

**4. సంకల్ప బ్రహ్మ ఉపాసన**

**మంత్రం-1 సంకల్పో వావ మనసో భూయాన్-** బ్రహ్మకు తర్వాతి ప్రతీక సంకల్పం. సంకల్పానికి శంకరాచార్యులు సందర్భాన్ని బట్టి ప్రత్యేకమైన అర్థం ఇస్తున్నారు. కర్తవ్యా కర్తవ్య విషయ విభాగేన సమర్థనమ్ అంటే ఇది చేయ తగినది, ఇది చేయకూడనిది అనే భేదాన్ని సమర్థించే నిశ్చయాత్మక వృత్తి సంకల్పం.

సంకల్పం అంటే సాధారణ అర్థం కోరిక లేదా తలంపు. కాని మనసుకు కోరిక అనే అర్థం వచ్చింది కాబట్టి ఇక్కడ సంకల్పంకి వేరే అర్థం ఇవ్వాల్సి వచ్చింది.

**స యదా మనసా మనస్యతి మన్త్రానధీయీయేత్యథాధీతే కర్మాణి కుర్వీయేత్యథ కురుతే -** ఒక వ్యక్తి వేదాలు పఠించాలని మనస్సులో తలపోస్తాడు. అప్పుడు మంత్రాలను పఠిస్తాడు. ఎప్పుడు పనులను చేస్తానని తలపోస్తాడో అప్పుడు చేస్తాడు.

అందువల్ల సంకల్పానికి అర్థం నిశ్చయాత్మక వృత్తి. కర్తవ్యా కర్తవ్య విషయ విభాగేన సమర్థనమ్- కర్తవ్యం అంటే ఇది చేయతగిన పని; అకర్తవ్యం అంటే ఇది చేయకూడని పని. ఇతి విషయ విభాగేన- అని మంచి చెడు వివరించి చెప్పే నిశ్చయాత్మక వృత్తి. సంకల్పం అంటే సంయక్ కల్పనమ్. ఏది మంచి,ఏది చెడు సరిగ్గా నిర్ణయించేది. అందుకని అంతఃకరణం లేదా బుద్ధి అని తీసుకుందాము.

అందువల్ల ముందు బుద్ధి పని చేస్తుంది. ఏది మంచో, ఏది చెడో అది నిర్ణయిస్తుంది. అది నిర్ణయించాక మనస్సు మంచిదాన్ని కోరుతుంది. మంచి,చెడ్డల బేరీజు వేశాకే అది చేయాలన్న కోరిక పుడుతుంది. ఒకసారి ఒక పదం మంచిది కాదని సంకల్పం చెప్పితే, ఆ పదం వాడాలన్న కోరిక ఉండదు. అలాగే, అది మంచిదని తెలిస్తే మనసులో కోరిక పుడుతుంది.

అది వాక్కురూపంలో బయటకు వచ్చి సమంగా ఉచ్చరించబడుతుంది. ఇప్పుడు వెనక్కి వెళితే పదం వాక్కునుంచి పుట్టింది. వాక్కు తలంపు నుంచి పుట్టింది; తలంపు సంకల్పం నుంచి పుట్టింది.

**4. సంకల్ప బ్రహ్మ ఉపాసన** – అందుకని సనత్కుమారుడు సంకల్పం మనస్సు కంటే గొప్పది అని చెపుతున్నాడు. ఎందుకు? మనస్సు కార్యం అవుతుంది. సంకల్పం కారణం అవుతుంది.

**యదా వై సంకల్పయతే** – సంకల్పం ఎలా చెపితే, అలా మనస్సు తలపోస్తుంది. అందుకే చూడండి, ఒక్కోసారి నోటిదాకా వచ్చిన మాటను హఠాత్తుగా మింగేస్తాము. సంకల్పం మనస్సుకు చెపుతుందన్నమాట. అనవసరంగా నోరు జారకు, ప్రమాదంలో పడతావు అని.

**అథ మనస్యతి**– అలా మనస్సు తలపోస్తుంది.

**అథ వాచమీరయతి** – అపుడు మనస్సు వాగింద్రియాన్ని ప్రేరేపిస్తుంది.

**తాము నామ్నీరయతి** – వాగింద్రియం నామాన్ని ప్రేరేపిస్తుంది.

**నామ్ని మన్త్రా ఏకం భవన్తి**– నామం నుంచి వైదికమంత్రాలు పుట్టాయి. మంత్రాలంటే ఏమిటి? 'పదాలు' తప్ప ఏమీ కావు. ఏకం భవతి అంటే పదాలలో మంత్రాలు అంతర్గతంగా ఉన్నాయి. పదాలు అనంతం అని చూశాము కదా! ఆ అనంతమైన పదాలలో మంత్రాలు కూడా ఇమిడి ఉన్నాయి.

**మంత్రేషు కర్మాణి – (ఏకంభవన్తి)** మంత్రాల వల్లే వైదిక కర్మల గురించి తెలుసుకుంటున్నాము. సంధ్యావందనం లాంటి వైదిక కర్మలన్నీ మంత్రాల్లో ఉన్నాయి. ఇప్పుడు వెనక్కి వెళితే మంత్రాల్లో కర్మలు అంతర్గతంగా ఉన్నాయి; నామంలో మంత్రాలు; వాక్కులో నామం, మనసులో వాక్కు; సంకల్పంలో మనస్సు అంతర్గతంగా ఉన్నాయి. గిన్నెలో గిన్నెలు ఉన్నట్టుగా.

**మంత్రం–2** ఈ కార్యకారణ గొలుసులో, సంకల్పం మూలకారణం,తక్కినవన్నీ కార్యాలు అయ్యాయి. అందువల్ల తక్కిన కార్యాలకు, సంకల్పమే సృష్టి, స్థితి లయ కారణం అంటున్నది. తక్కిన కార్యాలంటే– మనస్సు, వాక్కు, నామం, మంత్రం, కర్మాణి, ఈ పరంపర అంతా సంకల్పం నుంచి పుట్టింది.

**తాని హ వా ఏతాని** – ఈ గొలుసులోని తక్కినవన్నీ;

**సంకల్పై కాయనాని**– ప్రళయంలో సంకల్పంలో కలిసిపోతాయి. అయనం

అంటే విలీనమయ్యే స్థానం. ఎలా చెప్పగలము? కారణంలోనే కార్యం లయమవుతుంది కాబట్టి.

**సంకల్పాత్మకాని–** సంకల్పం లయకారణం మాత్రమే కాదు, సృష్టి కారణం కూడా. సంకల్పం నుంచే అన్నీ వచ్చాయి. మీరు ఒక ఇల్లు కొనాలనుకుంటున్నారనుకోండి. ముందు మీ తాహతు ఏమిటో బేరీజు వేసుకోవాలి. నగరం నడిబొడ్డులో కొనగలరా, నగర శివార్లకు వెళ్ళాలా అనేది అంచనా వేసుకుని, ఒక నిశ్చయానికి వచ్చాక, ఒక కోరిక రూపుదిద్దుకుంటుంది.

**సంకల్పే ప్రతిష్ఠితాని –** ప్రతిష్ఠితా అంటే స్థితి కారణం. అంటే సంకల్పమే సృష్టి, స్థితి, లయ కారణం. కాకపోతే ఇక్కడ ముందు లయకారణం, తర్వాత సృష్టి, స్థితి కారణాలు వచ్చాయి.

ఇక్కడ్నుంచీ ఉపనిషత్తు కవితాధోరణిలో, ఊహాత్మకంగా చెప్పుకుపోతున్నది. ఎంత అద్భుతమో చూడండి. ప్రకృతిలో దేన్ని చూసినా, దానికి సంకల్పం ఉన్నట్టు అనిపిస్తున్నది. ఎందుకంటే ప్రతీది ఒక పద్ధతిలో పని చేస్తున్నది. సూర్యుడు, చంద్రుడు, గ్రహాలు, ఋతువులు, వానలు, నదులు, కొండలు అన్నింటికీ సంకల్పం ఉంది. వాటి సంకల్పం వల్లే ప్రకృతిలో ఒక పద్ధతి ఉంది. ఒకవేళ ఏదైనా తేడా వస్తే, ఎందువల్ల వస్తుంది? మనిషి వల్లే.

**సమక్లృపతాం ద్యావాపృథివీ–** ద్యావా అంటే ద్యులోకం, అంటే స్వర్గలోకం. ఒక్కముక్కలో చెప్పాలంటే ఊర్ధ్వలోకాలు. పృథివీ అంటే భూమి, అథో లోకాలు. సమక్లృపతాం – సంకల్పించాయి.

**భీషాఽస్మాద్వాతః పవతే। భీషోదేతి సూర్యః। భీషాఽ**
**స్మాదగ్నిశ్చేంద్రశ్చ। మృత్యుర్ధావతి పంచమ ఇతి॥ తైత్తిరీయం**

దయానంద స్వామీజీ చెప్తారు, 'సృష్టి మొత్తంలో ఒక పద్ధతి ఉంది. ఎక్కడ అన్నీ పద్ధతి ప్రకారం జరుగుతాయో, అక్కడ ఒక మేథాశక్తి పనిచేస్తున్నది. ఒక పద్ధతిలో జరిగిన మేలు కలియక చేసిన మేథాశక్తినే ఈశ్వరుడు అంటాము. చిదాభాస ఈశ్వరరూపంలో సమష్టి కారణ ప్రపంచాన్ని, హిరణ్యగర్భ రూపంలో సమష్టి సూక్ష్మప్రపంచాన్ని; విరాట్ రూపంలో సమష్టి స్థూల ప్రపంచాన్ని వ్యాపించి ఉంది. చిదాభాస వ్యాపించి ఉండటం వల్లే, మనం ప్రకృతిని జడంగా చూడము. సూర్యుడిని జడంగా

చూడము. సూర్యదేవతగా కొలుస్తాము. సంకల్పాన్ని సంకల్పశక్తిగా కొలుస్తాము.

**సమక్లపతాం వాయుశ్చాకాశం చ -** వాయువు, ఆకాశం కూడా సంకల్పించాయి. అంతేకాదు-

**సమకల్పన్తాపశ్చ తేజశ్చ-** జలములు, అగ్ని కూడా సంకల్పించాయి. జలములలో నదులు, సముద్రాలు అన్నీ వస్తాయి. అగ్నిలో సూర్యుడు, చంద్రుడు అన్నీ వస్తాయి. సమకల్పంతా అంటే అవి కూడా సంకల్పించాయి. అవి పద్ధతి ప్రకారం పనిచేస్తున్నాయని ఏమిటి నిదర్శనం? సకాలంలో వర్షాలు కురవటం, ఋతువులు సకాలంలో మారటం. ఋతువులు సక్రమంగా వస్తున్నాయో లేదో తెలిపేది వర్షాలే.

> **కాలే వర్షతు పర్జన్యః। పృథివీ సశ్యశాలినీ।**
> **దేశోయం క్షోభరహితః॥**
> **సజ్జనస్సంతు నిర్భయాః॥**

**తేషాగ్ం సంక్లృప్త్యై వర్షగ్ం సంకల్పతే-** పంచభూతాల సంకల్పనిమిత్తంగా వర్షం సంకల్పిస్తున్నది. అంటే అది కురవాల్సిన సమయంలో, కురవాల్సి నంతమేరకు కురుస్తున్నది. సంక్లృప్తై అంటే సంకల్ప నిమిత్తం. పంచభూతాల సంకల్ప నిమిత్తంగా; **వర్షగ్ం సంకల్పతే-** వర్షాకాలం పద్ధతిలో వస్తోంది. దానివల్ల ఏమవుతుంది?

**వర్షస్య సంక్ల ృప్త్యా అన్నగ్ం సంకల్పతే-** వర్షాలు అతివృష్టిగా కురిసినా, అనావృష్టిగా కురిసినా పంటలు సరిగా పండవు. మన ఆర్థికవ్యవస్థ వర్షాకాలం మీదే ఆధారపడి ఉంది. అందువల్ల వర్షం సంకల్పిస్తే, అన్నం సమృద్ధిగా కురుస్తుంది.

వీటన్నింటిలోనూ పదే పదే వస్తున్న పదం ఏమిటి? సంకల్పం. ఇప్పుడు చేయబోతున్న ఉపాసన- సంకల్ప బ్రహ్మ ఉపాసన. ఇందాక చూశాం కదా- కాలే వర్షతు పర్జన్యః పృథ్వీ సశ్యశాలినీ, దేశోయం క్షోభరహితః

**అన్నస్య సంక్ల ృప్త్యై** ప్రాణాస్సంకల్పన్తే- అన్నం సమృద్ధిగా ఉంటే, ఆకలి చావులు ఉండవు. **ప్రాణాస్సంకల్పంతే** అంటే పంచప్రాణాలు సరిగ్గా పనిచేస్తాయి. గొలుసు ఎలా సాగుతుందో చూశారా? ప్రాణం సరిగ్గా పని చేస్తే ఏమవుతుంది?

**ప్రాణానాగ్ం సంక్ళృప్త్యై మన్త్రా స్సంకల్పన్తే–** మంత్రం అంటే వేదాధ్యయనం, వేదపారాయణం. ఇవి చేయాలంటే ప్రాణశక్తి కావాలి. రుద్రం గుక్క తిప్పుకోకుండా చెప్పాలంటే ఎంతో శక్తి కావాలి. అందువల్ల పంచప్రాణాలు సంకల్పిస్తే మంత్రాలు చక్కగా చెప్పగలుగుతాము.

**మన్త్రాణాగ్ం సంక్ళప్త్యైకర్మాణి సంకల్పన్తే–** మంత్రాలు అంటే వేదాధ్యయనం అని చూశాము కదా. వేదాలను ధర్మశాస్త్రం అని కూడా అంటారు. మన కర్మలు ధర్మం మీదే ఆధారపడి ఉంటాయి. మన సాంప్రదాయం అంత పటిష్టంగా ఉండటానికి కారణం గురుకులవాసమే అని తేల్చారు పెద్దలు. శిష్యులు అంతేవాసిగా గురువు దగ్గర ఉండటం వల్ల విద్యతోపాటు మంచి నడవడిక కూడా నేర్చుకునేవారు. గురుకులవాసంలో పంచమహాయజ్ఞాలు చేసేవారు. అందువల్ల మంచి కర్మలు చేస్తారు.

**కర్మణాగ్ం సంక్ళప్త్యై లోకస్సంకల్పతే–** కర్మలు సంకల్పిస్తే అంటే ధర్మప్రకారం కర్మలు చేస్తే కర్మఫలం కూడా మంచిది వస్తుంది. లోకాలు అంటే కర్మఫలం. లోక్యతే అనుభూయతే ఇతి లోకః 14 లోకాలు కర్మఫలం అనుభవించటానికి సృష్టించబడ్డవే. కర్మ సరిగా చేస్తే, కర్మఫలం సరిగ్గా ఉంటుంది.

**లోకస్య సంక్ళృప్త్యై సర్వగ్ం సంకల్పతే–** కర్మఫలం సంకల్పిస్తే, సర్వం సంకల్పిస్తుంది. అంటే కర్మఫలం సత్యంగా ఉంటే, అంతా సవ్యంగా ఉంటుంది.

వీటన్నింటికీ మూలకారణం ఏమిటి? సంకల్పం. అందుకని ఉపనిషత్తు ఇలా ముగుస్తున్నది.

**స ఏష సంకల్ప–** అందువల్ల వీటన్నింటికీ కారణం సంకల్పమే. కారణమే కార్యరూపంలో వ్యక్తమవుతుంది. మన ముందు ఒక భవనం ఉంది అంటే, దాని వెనుక ఎవరిదో సంకల్పం ఉందన్నమాట.సంకల్పం నుంచి మనస్సు, మనస్సు నుంచి వాక్కు, వాక్కు నుంచి పదాలు వస్తాయని చూశాము. అందువల్ల సంకల్పమే ఈ జగత్తుగా రూపుదిద్దుకుంది. జగత్తంత విశాలమైనది సంకల్పం.

**సంకల్పముపాస్స్వేతి–** సంకల్పం మీద ఉపాసన చేయి. దేనిగా? బ్రహ్మగా. సంకల్పబ్రహ్మ ఉపాసన చేయి.

**మంత్రం–3** ఉపాసన ఫలం వస్తున్నది ఇందులో. ఉపాసనకు రెండు

ఫలాలుంటా యని చూశాము. సకామ ఉపాసన ఫలం, నిష్కామ ఉపాసన ఫలం.నిష్కామ ఉపాసన ఫలం అన్నిటికీ సమానంగా ఉంటుంది కాబట్టి, ఉపనిషత్తు అది చెప్పదు. జ్ఞానయోగ్యతా ప్రాప్తి కలిగి, భూమ విద్యకు మనసు సంసిద్ధంగా ఉంటుంది. ఈ 15 ఉపాసనల్లో అన్నింటికీ సమానంగా చిత్త ఏకాగ్రత, చిత్త వైశాల్యం, చిత్త విశాలత వస్తాయి.

సకామ ఉపాసన మారుతూ వస్తుంది.

**స లోకాన్ అభిసిధ్యతి –** మరణం తర్వాత అతను ఊర్ధ్వలోకాలకు వెళ్తాడు. ఆ లోకాల గురించి వివరణ ఉంది. ఎటువంటి లోకాలు?

**క్లప్తాన్ లోకాన్–** క్లప్తాన్ అంటే ఈశ్వర సంకల్పితాన్ లోకాన్ – ఈశ్వరుని సంకల్పం చేత సృష్టించబడిన లోకాలు. ఎందుకు? ఈశ్వరుడు కర్మఫలదాత. నేను చేసిన మంచి చెడు కర్మలకు మంచి, చెడు ఫలితాలను ఇచ్చేది ఈశ్వరుడు.

**ధ్రువాన్ (లోకాన్) –** కౢప్తాన్ మాత్రమే కాదు. అవి ధ్రువమైనవి కూడా. ధ్రువమైనవి అంటే మరింత నిత్యమైన లోకాలు.

**ప్రతిష్ఠితాన్ (లోకాన్) –** ఉపకరణ సంపన్నలోకాలు అంటే భోగసాధనలు నిండుగా ఉన్న లోకాలు. ఇప్పుడు అలా ఫర్నిచర్‌లో ఉన్న ఇళ్ళు అద్దెకిస్తున్నారు కదా! అలా అన్నీ ఉన్న లోకాలు.

**అవ్యథమానాన్ –** ఎటువంటి ఆటంకాలు లేని లోకాలు.

నాలుగు విశేషణాలు వాడింది లోకాలకు– **కౢప్తాన్, ధ్రువాన్, ప్రతిష్ఠితాన్, అవ్యథమానాన్.**

లోకాలన్నీ అద్భుతంగా ఉండి, నా దేహేంద్రియ మనోబుద్ధులు ఆరోగ్యకరంగా లేకపోతే ఎలా? నా ఉపకరణాలు కూడా ఆరోగ్యకరంగా ఉండాలి. అందుకే–

**ధ్రువాన్‌లోకాన్ ధ్రువః (సన్) –** ధ్రువః అంటే ఉపాసకుడు కూడా దీర్ఘకాలం ఉంటాడు. లోకం నిత్యంగా ఉండి, ఆ లోకానికి వెళ్ళే నేను నిత్యంగా ఉండకపోతే ఏమిటి లాభం? అందుకే ధ్రువాన్ లోకాన్ ధ్రువసన్ – రెండు సార్లు ధ్రువపదం చెప్పబడింది. మొదటి ధ్రువ లోకానికి, రెండోది ఉపాసకుడికి.

**ప్రతిష్ఠితాన్ ప్రతిష్ఠితః –** అలాగే భోగసాధనలు నిండుగా ఉన్న లోకాల్లో, నా ఉపకరణాలు కూడా బాగుండాలి. నా పంచ కర్మేంద్రియాలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచప్రాణాలు, నాలుగు అంతఃకరణాలు అన్నీ బాగుండాలి. **అవ్యథ మానావ్యథమాఽనోభిసిధ్యతి–** ఆ లోకాల్లో ఏమీ వ్యథలు లేవు. ఉపాసకునికి కూడా ఉండవు. ఆదిభౌతిక, ఆధ్యాత్మిక చింతలు లేవు. **అవ్యథ్యమానాన్‌లోకాన్ –** అభిసిధ్యతి అంటే ఉపాసకుడు, తన ఉపాసనా ఫలంగా పొందుతాడు. అందువల్ల ఇప్పుడు ఈ జన్మలో మనం హాయిగా, ఆరోగ్యంగా ఉన్నామంటే దానికి కారణం మనం గతంలోనో, గతజన్మలోనో పుణ్యం చేసుకున్నామన్న మాట. ఏదో ఉపాసన చేశామన్నమాట. అవి లేకపోతే, దేవుడిని నిందించి లాభం లేదు. మనమే ఉపాసన చేయలేదు. **యావత్సంకల్పస్య గతం తత్రాస్య యథాకామచారో భవతి–** అంతే కాదు, తాను కోరుకున్న లోకాల్లో యథేచ్ఛగా సంచరించవచ్చు. ఇది అంతకుముందు మంత్రాల్లో కూడా వచ్చింది. నారదునిలాగా త్రిలోక సంచారం చేయవచ్చు. యథాకామచారః – స్వేచ్ఛగా తిరగవచ్చు. ఎంతవరకు? యావత్సంకల్పస్య గతం– ఎంతవరకూ సంకల్పం యొక్క గతి (వ్యాప్తి) ఉంటుందో, అంతవరకూ తిరగవచ్చు.

మళ్ళీ అదే సంభాషణ. నారదుడు ఇంతకన్నా పెద్దది ఉందా అంటాడు. ఉంది అంటాడు గురువు. దాన్ని చెప్పమంటాడు నారదుడు.

ఇక్కడితో నాలుగో ఉపాసన ముగిసింది.

**4. సంకల్ప బ్రహ్మ ఉపాసన.**

**పంచమః ఖణ్డః (5)**

**చిత్తం వావ సంకల్పాద్భూయో యదా వై చేతయతేఽథ సంకల్పయతేఽథ మనస్యత్యథ వాచమీరయతి తాము నామ్నీరయతి నామ్ని మన్త్రా ఏకం భవన్తి మన్త్రేషు కర్మాణి ॥1॥ తాని హ వా ఏతాని చిత్తైకాయనాని చిత్తాత్మాని చిత్తే ప్రతిష్ఠితాని॥ తస్మాద్యద్యపి బహువిదచిత్తో భవతి నాయమస్తీత్యేవైనమాహుర్యదయం వేద యద్వా అయం విద్వాన్నేత్థమచిత్తస్స్యాదిత్యథ యద్యల్పవిచ్చిత్తవాన్ భవతి తస్మా ఏవోత శు శ్రూషన్తే చిత్తగ్ం హ్యేవైషామేకాయనం చిత్తమాత్మా చిత్తం ప్రతిష్ఠా చిత్తముపాస్స్వేతి ॥2॥ స యశ్చిత్తం బ్రహ్మేత్యుపాస్తే చిత్తాన్ వై స లోకాన్**

**ధ్రువాన్ ధ్రువః ప్రతిష్ఠితాన్ ప్రతిష్ఠితోఽవ్యథమానానవ్యథమానోఽభిసిధ్యతి యావచ్చిత్తస్య గతం తత్రాస్య యథాకామచారో భవతి యశ్చిత్తం బ్రహ్మేత్యుపాస్తేఽస్తి భగవశ్చిత్తాద్భూయ ఇతి చిత్తాద్వావ భూయోఽస్తీతి తన్మే భగవాన్ బ్రవీత్వితి ॥3॥**

**5. చిత్త బ్రహ్మ ఉపాసన**

**మంత్రం -1 చిత్తం వావ సంకల్పాద్భూయో-** చిత్తం సంకల్పం కంటే గొప్పది. శంకరాచార్యులు చిత్తం అంటే చేతయితృత్వం అంటారు. అంటే దేశ కాలముల, విషయముల సరియైన అవగాహన లేదా ప్రజ్ఞ. అందుకే బయట దేశాలకు వెళ్ళేటప్పుడు వాళ్ళ పద్ధతులు, వాళ్ళ సాంప్రదాయాలు తెలుసుకుని మెసలాలంటారు. మనదేశంలో చిన్నపిల్లలను చూస్తే, తెలియకపోయినా, వాళ్ళని ముద్దాడుతాము. కాని అమెరికాలాంటి దేశంలో వాళ్ళను ముట్టుకుంటేనే నేరం. అది తెలియకపోతే చిక్కుల్లో పడతాము. అందుకని చిత్తం అంటే దేశకాల పరిస్థితుల గురించిన పూర్తి అవగాహన.

**చిత్త బ్రహ్మ ఉపాసన –** ఈ చిత్తం సంకల్పానికి కారణం. వరుసగా సంకల్పం మనసుకు, మనసు వాక్కుకు, వాక్కు పదాలకు,పదాలు మంత్రాలకు, కర్మలకు కారణం. అందుకని చిత్తం ఈ పై నాలుగింటికీ కారణం. అందుకని దాని వ్యాప్తి ఇంకా ఎక్కువ.

**యదా వై చేతయతేఽథ సంకల్పయతేఽథ-** ఎప్పుడైతే మనిషి దేశకాల విషయాల యొక్క సరియైన అవగాహనను కలిగి ఉంటాడో, అప్పుడు సంకల్పిస్తాడు.

**మనస్యత్యథ, వాచమీరయతి-** అప్పుడు మనసు మాట్లాడాలని తలపోస్తుంది.

**తాము నామ్నీరయతి-** అది వాగింద్రియాన్ని ప్రేరేపించి నామం పలికేలా చేస్తుంది.

**నామ్ని మన్త్రా ఏకం భవన్తి మన్త్రేషు కర్మాణి-** నామంలో మంత్రాలు, కర్మలు అంతర్గత మవుతాయి. నామం నుంచి ఇంకో రెండు వచ్చాయి. మంత్రాలు, కర్మలు. అవి మన పట్టికలో లేవు. ఇప్పుడు చిత్తస్తుతి లేదా చిత్తమహిమ. చిత్త బ్రహ్మ ఉపాసనకు ఇది ప్రేరేపిస్తుంది.

**మంత్రం-2 తాని హ వా ఏతాని-** పై వర్ణన నుంచి ముందు నాలుగు

ప్రతీకలు. ఏతాని అంటే– నామం, వాక్కు, మనస్సు, సంకల్పం అనే ఈ నాలుగూ.

**చిత్తైకాయనాని –** వీటికి చిత్తం ఆశ్రయంగా ఉంది. అంటే చిత్తం వీటికి లయకారణం.

**చిత్తాత్మాని–** చిత్తమే సృష్టి కారణం.

**చిత్తే ప్రతిష్ఠితాని–** చిత్తమే స్థితి కారణం కూడా.

మూడూ కలిపితే, చిత్తే సృష్టి,స్థితి, లయ కారణం. వేటి సృష్టి,స్థితి, లయ కారణం? పై నాలుగింటికీ. నామం, వాక్కు, మనస్సు, సంకల్పాలకు. అందుకని చిత్తం సర్వకారణం. కారణత్వం వల్ల వీటికన్నా వ్యాప్తి చెందినది. అంతేకాదు ఎవరికైతే చిత్తం అనే విలువ ఉంటుందో అతన్ని జనులు పొగుడుతారు. లేనివాళ్ళను చులకనగా చూస్తారు.

**తస్మాత్ –** అందువల్ల, **యద్యపి బహువిదచిత్తో భవతి–** బహువిద అంటే అనేక శాస్త్రముల, విషయాల పరిజ్ఞానం ఉన్నవాడు అయినా.

**అచిత్తః స్యాత్–** ఒకవేళ అతనికి చిత్తం లేకపోతే;

**నాయమ స్త్రీత్యేవైన మాహుః –** అట్టివాడు ఉన్నా లేనివాడితో సమానం అని ఇతని గురించి అంటారు. చిత్తం అంటే దేశకాలపరిస్థితులను చక్కగా అంచనా వేసే ప్రజ్ఞ అని చూశాము. నలుగురిలో కలవటం ఎలాగో తెలియని వ్యక్తిని, సభలకు తీసుకెళ్ళటానికి జంకుతాము. అతనిలో పరిపక్వత లేదంటాము. అటువంటి వ్యక్తిని అయం న అస్తి ఇతి ఆహుః – అతను ఉన్నా లేనట్టే అంటారు. అంతేకాదు–

**యదయం వేద –** అలా ప్రజ్ఞ లేనివానికి ఏదైనా శాస్త్రం బాగా తెలిసినా కూడా ఆ జ్ఞానం కూడా లేనట్టే అంటారు. ఎందుకంటే శాస్త్రజ్ఞానం ఉన్నవానికి సమయస్ఫూర్తి ఉంటుంది. సందర్భానికి తగ్గ తెలివితేటలు లేకపోతే అతని జ్ఞానం వృధా. పూర్తి కాలేదు. యదయం వేదకు తదపి నాస్తి ఇతి ఆహుః అని కలుపుకోవాలి. అంటే ఆ వ్యక్తికి ఏం తెలిసినా, అది తెలియనట్టే అంటారు. ఎందుకు?

**యద్వా అయం విద్వాన్ –** ఒకవేళ ఈ వ్యక్తి నిజంగా విద్వాంసుడు అయి ఉంటే; **ఇత్థమ చిత్తస్స్యాత్ –** అతను చిత్తం లేనివాడై ఉండేవాడు కాదు. చిత్తం అంటే పరిపక్వత లేని వ్యక్తి. స్యాత్ ఇతి ఆహు। ఈ విధంగా జనులు

అంటారు. అందువల్ల చిత్తం ఒక మంచి విలువ.

**అథ యద్యల్ప విచ్చిత్తవాన్ భవతి–** పల్లెటూర్లలో కొందరు విద్యనభ్యసించి ఉండకపోవచ్చు. కాని వాళ్ళు జీవితాన్ని కాచివడబోయటం వల్ల, పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో వాళ్ళకు తెలుసు. అందువల్ల వాళ్ళకు లౌకిక విద్య లేకపోయినా –

**చిత్తవాన్ భవతి –** సమయానికి తగ్గ తెలివితేటలు ఉంటే,

**తస్మా ఏవోత శుశ్రూషన్తే–** అతని మాటలను జనులు వినగోరుతారు. చదువుండి, ప్రజ్ఞలేని వ్యక్తికన్నా, ప్రజ్ఞ ఉండి చదువులేని వ్యక్తినే ఇష్టపడతారు. ఇవన్నీ చిత్తం గురించిన స్తుతివాక్యాలు. అందువల్ల ఏమిటి మూలకారణం? చిత్తమే సర్వకారణం.

**చిత్తగ్ం హ్యేవైషామేకాయనం చిత్తమాత్మా చిత్తం ప్రతిష్ఠా –** చిత్తమే అయనం అంటే ఆధారం. చిత్తం ఆత్మా– అందువల్ల కారణం. కారణమే కార్యాలన్నింటికీ ఆధారం. ఈ సూత్రం వల్ల చిత్తం కారణం. అందువల్ల ఆత్మ. అందుకే చిత్తం సృష్టి,స్థితి, లయ కారణం.

**చిత్తముపాస్స్వేతి–** అందువల్ల చిత్తబ్రహ్మ ఉపాసన చేయి. బ్రహ్మ ఇతి కలుపుకోవాలి. అంటే బ్రహ్మగా ఉపాసన చేయి. దీని ఫలశ్రుతి తర్వాతి మంత్రంలో వస్తుంది.

**మంత్రం–3** చిత్త బ్రహ్మ ఉపాసన ఫలం. నిష్కామ ఉపాసన ఫలం ఒకటే అని చూశాము. అది భూమ విద్యాయోగ్యతా ప్రాప్తి.

సంకల్ప బ్రహ్మ ఉపాసనకు చెప్పిన ఫలమే, అవే మాటలే మళ్ళీ వచ్చాయి. ఎవరైతే చిత్తాన్ని బ్రహ్మగా ఉపాసన చేస్తాడో అతను నిత్యలోకాలకు వెళ్ళి నిత్యంగా ఉంటాడు. భోగసామాగ్రితో కూడినవాడై, భోగసామాగ్రి గల లోకాలను, వ్యథ లేకుండా వెళ్ళి వ్యథ లేని లోకాలను పొందుతాడు. ఎంతవరకు ప్రజ్ఞ యొక్క గతి (వ్యాప్తి) ఉంటుందో అంతవరకూ లోకాలలో అతను యథేచ్ఛగా తిరుగవచ్చు.

మళ్ళీ అదే సంభాషణ. నారదుడు ఇంతకన్నా పెద్దది ఉందా అంటాడు. గురువు ఉంది అంటాడు. దాన్ని చెప్పమంటాడు నారదుడు. ఇక్కడితో ఐదో ఉపాసన ముగిసింది.

**5. చిత్తబ్రహ్మ ఉపాసన**

**షష్ఠః ఖణ్డః (6)**

**ధ్యానం వావ చిత్తాద్భూయో ధ్యాయతీవ పృథివీ ధ్యాయతీవాన్తరిక్షం ధ్యాయతీవ ద్యౌర్ధ్యాయన్తీవాపో ధ్యాయన్తీవ పర్వతా ధ్యాయన్తీవ దేవమనుష్యాస్తస్మాద్య ఇహ మనుష్యాణాం మహత్తాం ప్రాప్నువన్తి ధ్యానపాదాగ్ంశా ఇవైవ తే భవన్త్యథ యేఽల్పాః కలహినః పిశునా ఉపవాదినస్తేఽథ యే ప్రభవో ధ్యానాపాదాగ్ంశా ఇవైవ తే భవన్తి ధ్యానముపాస్స్వేతి ॥1॥ స యో ధ్యానం బ్రహ్మేత్యుపాస్తే యావద్ధ్యానస్య గతం తత్రాస్య యథా కామచారో భవతి యో ధ్యానం బ్రహ్మేత్యుపాస్తేఽస్తి భగవో ధ్యానాద్భూయ ఇతి ధ్యానాద్వావ భూయోఽస్తీతి తన్మే భగవాన్ బ్రవీత్వితి॥2॥**

**6. ధ్యానబ్రహ్మఉపాసన**

**మంత్రం-1 ధ్యానం వావ చిత్తాద్భూయః-** ధ్యానం నిశ్చయంగా చిత్తం కంటే గొప్పది. ధ్యానం అంటే ఏకాగ్రత అని తీసుకోవాలి ఇక్కడ. ధ్యానం చేసేటప్పుడు ఒక్క వస్తువు మీదే మనసు నిలిపి ఉంచుతాము. ధ్యానం చిత్తానికి కారణం,చిత్తం కార్యం. ఎలా? చిత్తం అంటే ఏమన్నాం? దేశకాల పరిస్థితుల గురించి చక్కటి అవగాహన అన్నాం. పరిసరాలను ఎప్పుడు గమనించగలము? ఏకాగ్రత ఉంటేనే. దిక్కులు చూస్తూ నడిస్తే కింద పడ తాము. అలా ఏ పని చేసినా ఏకాగ్రత లేకపోతే, దాని గురించి సరిగ్గా తెలుసుకోలేము. ఒక ఉపనిషత్తు క్లాసు వినాలన్నా, ఇటువంటి సీరియస్ అంశం చదవాలన్నా ఏకాగ్రత అవసరం. లేకపోతే విషయం అర్థం కాదు.

ఉపనిషత్తు కవితాధోరణిలో పడిపోయింది. ప్రకృతిని సరిగ్గా గమనిస్తే, ప్రతిదీ ధ్యానం చేస్తున్నట్టుందిట. ఎంత అద్భుతమైన కల్పన! ప్రకృతి తమ నియమాలను సడలించటానికి ఇష్టం లేనట్టుగా ఉందిట.

**ధ్యాయతీవ పృథివీ -** పృథివీ అంటే భూలోకం ధ్యానం చేస్తున్నట్టుగా ఉంది.

**ధ్యాయతీవాంతరిక్షం -** అంతరిక్షం అంటే భువర్లోకం ధ్యానం చేస్తున్నట్టుగా ఉంది.

**ధ్యాయతీవద్యౌః -** ద్యౌ అంటే సువర్లోకం ధ్యానం చేస్తున్నట్టుగా ఉంది.

**ధ్యాయన్తీవాపో–** నీరు, సముద్రాలు ధ్యానం చేస్తున్నట్టుగా ఉన్నాయి.
**ధ్యాయన్తీవ పర్వతా–** పర్వతాలు ధ్యానం చేస్తున్నట్టుగా ఉన్నాయి. కొండ శిఖరాలకు వెళ్ళి చూస్తే, నిటారుగా నిల్చున్న కొండలు, ఎవరో యోగి ధ్యానం చేస్తున్నట్టుగా ఉంటాయి. ఇదొక ఊహా చిత్రం!
**ధ్యాయన్తీవ దేవమనుష్యాః –** దేవతలు, మనుష్యులు ధ్యానం చేస్తున్నట్టుగా ఉన్నారు అని ఒక అర్థం. లేదా ఇంద్రియ నిగ్రహం ఉన్న దేవతలతో సమానమైన మనుష్యులు అని ఇంకో అర్థం. వాళ్ళు కూడా ధ్యానం చేస్తున్నట్లుగా ఉన్నారు.

భజగోవిందంలో శంకారాచార్యులు అనేక సాధనలు చెప్పాక చివరి సాధనను అవధానంగా పేర్కొంటారు. అవధానం అంటే ఏకాగ్రత. దాన్నుంచే హిందీలో సావధాన్ అనే పదం వచ్చింది.

ఇంతవరకు కల్పన. ఇప్పుడు ధ్యానస్తుతి.

**తస్మాత్ –** అందువల్ల.ఎందువల్ల? ధ్యానం గొప్ప విలువ అవటం వల్ల, అదే తక్కిన ముందు విలువలకూ కారణం అవటం వల్ల–
**ఇహ మనుష్యాణం మహత్తాం ప్రాప్నువన్తి–** మనుష్యులలో ఎవరైతే గొప్పదనాన్ని పొందుతున్నారో, వారు నిశ్చయంగా ధ్యానం యొక్క ఫలితాన్ని పొందినట్లు ఉన్నారు. ఏ రంగంలో విజయం సాధించాలన్నా ఏకాగ్రత ముఖ్యం. క్రికెట్‌లో బంతి వేగంగా దూసుకొస్తున్నప్పుడు, ఒక్క క్షణం పక్కకు చూస్తే చాలు బంతి వెళ్ళి మూడు వికెట్లనూ పడవేస్తుంది.
**ధ్యానపాదాగ్ంశా–** ధ్యాన అపాద అంటే– ధ్యాన అనుష్టానం. ధ్యాన అనుష్ఠానం అంటే ధ్యాన సాధన. ఇక్కడ ధ్యాన అనుష్ఠాన ఫలం గురించి చెపుతున్నది.
**ఇవైవ తే భవన్తి–** అంశ అంటే ధాన్యఫలంలో ఒక చిన్న అంశాన్ని పొందినట్టు. మొత్తం ధ్యానఫలాన్ని పొందుతారు అనటం లేదు. ధ్యానఫలంలో ఒక చిన్న అంశాన్ని పొందినట్టు ఉన్నారు అంటున్నది.

ఇప్పుడు ధ్యానం లేనివారి పరిస్థితి గురించి చెపుతున్నది.

**అథ–** దానికి భిన్నంగా, అంటే ధ్యానరహితంగా ఉన్నవాళ్లు.
**యేఽల్పాః –** వాళ్ళు అల్పులుగా ఉన్నారు.
**కలహినః –** వాళ్ళు గొడవలు పెట్టుకుంటారు. ఎప్పుడొచ్చావు అని కుశలప్రశ్న అడిగినా, ఏదో ఒక గొడవ పెట్టుకుంటారు.

**అపిశునా–** తప్పుపట్టేవాళ్ళు– పరదోషాఉత్పాదకః – ఎదుటివారి దోషాలను గట్టిగా ఎత్తి చూపుతారు. వాళ్ళు అల్పులు.
**ఉపవాదినః–** వాళ్ళ భాష కూడా హీనంగా ఉంటుంది.
**తే (భవన్తి) –** తే అంటే ధ్యానం చేయని వాళ్ళు ఇలా ఉంటారు.
**అథ యే ప్రభవః –** మళ్ళీ తను ముందు మొదలుపెట్టిన అంశానికి వస్తున్నది ఉపనిషత్తు. ఈ గొప్పవాళ్ళు అంటే ధ్యానం చేసేవాళ్ళు.
**ధ్యానాపాదాగ్ంశా ఇవైవ తే భవన్తి–** వాళ్ళు నిశ్చయంగా ధ్యానం యొక్క ఫలం యొక్క ఒక అంశాన్ని పొందినట్టు ఉన్నారు.
**ధ్యానముపాస్స్వేతి–** అందువల్ల ధ్యానబ్రహ్మ ఉపాసన చేయి.

దీని ఫలశ్రుతి తర్వాత వచ్చే మంత్రంలో వస్తుంది.

**మంత్రం-2** ఇది కూడా అంతకుముందు మంత్రాలలో లాగే వస్తుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే కామచారత్వ ఫలం. యథేచ్ఛగా తిరిగే ఫలం. కాకపోతే ఏమిటి తేడా? ఉపాసనవ్యాప్తి పెరిగేకొద్దీ ఇతను తిరిగే లోకాలు పెరుగుతాయి. ఉదాహరణకు ముందు ఐదు లోకాలలో తిరిగితే, ఇప్పుడు పది లోకాలలో తిరుగుతాడు. అయినా నారదుడు తృప్తి చెందడు. ఇంకా గొప్పది ఉంటే చెప్పమంటాడు.

ఇక్కడితో ఆరో ఉపాసన ముగిసింది.

**6. ధ్యానబ్రహ్మ ఉపాసన**

**సప్తమః ఖణ్డః (7)**

**విజ్ఞానం వావ ధ్యానాద్భూయః॥ విజ్ఞానేన వా ఋగ్వేదం విజానాతి యజుర్వేదగ్ం సామవేద మాథర్వణం చతుర్థమితిహాసపురాణం పంచమం వేదానాం వేదం పిత్ర్యగ్ం రాశిం దైవం నిధిం వాకోవాక్యమేకాయనం దేవవిద్యాం బ్రహ్మవిద్యాం భూతవిద్యాం క్షత్రవిద్యాం నక్షత్రవిద్యాగ్ం సర్పదేవజన విద్యాం దివం చ పృథివీం చ వాయుం చాకాశం చాపశ్చ తేజశ్చ దేవాగ్ంశ్చ మనుష్యాగ్ంశ్చ పశూగ్ంశ్చ వయాగ్ంసి చ తృణవనస్పతీన్ శ్వాపదాన్యాకీటపతంగపిపీలికం ధర్మం చాధర్మం చ సత్యం చానృతం చ సాధు చాసాధు చ హృదయజ్ఞం చాహృదయజ్ఞం చాన్నం చ రసం చేమం చ లోకమముం చ విజ్ఞానేనైవ విజానాతి విజ్ఞానముపాస్స్వేతి ॥1॥ స యో విజ్ఞానం బ్రహ్మేత్యుపాస్తే విజ్ఞానవతో వై స లోకాన్ జ్ఞానవతోఽభిసిద్ధ్యతి**

**యావద్విజ్ఞానస్య గతం తత్రాస్య యథాకామచారో భవతి యో విజ్ఞానం బ్రహ్మేత్యుపాస్తేఽస్తి భగవో విజ్ఞానాద్భూయ ఇతి విజ్ఞానాద్వావ భూయోఽస్తీతి తన్మే భగవాన్ బ్రవీత్వితి ॥2॥**

**7. విజ్ఞానబ్రహ్మ ఉపాసన**

**మంత్రం-1 విజ్ఞానం వా వ ధ్యానాద్భూయః -** విజ్ఞానమే నిశ్చయంగా ధ్యానం కన్నా గొప్పది. విజ్ఞానం అంటే శాస్త్రార్థ విజ్ఞానం. ముఖ్యంగా ఉపాసనాకాండ శాస్త్రార్థ విజ్ఞానం. ఎందుకు? ఆ వేదాల్లోని ఉపాసన కాండలో అనేక ఉపాసనలు నిర్దేశించబడ్డాయి. ఇప్పుడు విజ్ఞానం అనే పదం ఎందుకు వచ్చిందో అర్థమయ్యే ఉంటుంది. దీనికి ముందు ఉపాసన ధ్యానం. ధ్యానం చేసి ఏకాగ్రత పెంచుకోవాలంటే, దానికన్నా ముందు ఏం కావాలి? ధ్యానం గురించిన జ్ఞానం. ఆ జ్ఞానం ఎక్కడ్నుంచి వస్తుంది? వేదాల నుంచి. అందువల్ల శాస్త్ర జ్ఞానం ధ్యానం చేయటానికి తోడ్పడుతుంది. ధ్యానం చేస్తే చిత్తం పెరుగుతుంది. చిత్తం వల్ల సంకల్పం వస్తుంది. సంకల్పం వల్ల కోరిక మనసులో పుడుతుంది. కోరిక వాక్కు ద్వారా బయటకు వస్తుంది. అది నామం అవుతుంది. అంటే ధ్యానం నుంచి నామం వరకూ ఒకదానికొకటి పెనవేసుకుని ఉన్నాయి. ఇప్పుడు వీటన్నింటికీ మూల కారణం విజ్ఞానం.

విజ్ఞానం వల్లే వీటన్నింటినీ తెలుసుకోగలమని ఒక పెద్ద పట్టిక ఇస్తున్నాడు సనత్కుమారుడు. ఇవన్నీ నారదుడు తనకేం వచ్చో చెప్పినప్పుడు చూశాము. దీని సారాంశం ఒక్కటే. లోకాల జ్ఞానం కాని, పశుపక్ష్యాదుల జ్ఞానం కాని, భౌతిక ప్రపంచ జ్ఞానం కాని అంటే లౌకిక విజ్ఞానం కాని, శాస్త్ర విజ్ఞానం కాని జ్ఞానం వల్లనే తెలుసుకుంటాము. అంతేకాదు-

**ధర్మం చాధర్మం చ సత్యం చానృతం చ సాధు చాసాధు చ-** ధర్మం, అధర్మంకూ సాధు అసాధువుకు మధ్య తేడా ఏమిటి. ధర్మం- అధర్మం శాస్త్రీయ దృష్టితో చూస్తే, సాధు-అసాధు లౌకిక దృష్టితో చూస్తాము. ఒకటి అదృష్టకోణంలో, ఇంకోటి దృష్ట కోణంలో చూస్తాము.

**హృదయజ్ఞం చాహృదయజ్ఞం చ -** హృదయానికి ప్రియ అప్రియమైనవి.

**అన్నం చ రసం చ -** అన్నం, పౌష్టికాహారం కూడా.

**ఇమం చ లోకమముం చ -** ఈ లోకం,పై లోకాలు కూడా; అన్నీ

**విజ్ఞానేనైవ విజానాతి–** విజ్ఞానం వల్లనే తెలుసుకోగలము.
**విజ్ఞానముపాస్స్వేతి–** అందువల్ల విజ్ఞానం బ్రహ్మ ఉపాసన చేయి.
ఫలం తర్వాత వచ్చే మంత్రంలో.

**మంత్రం – 2** ముందరి మంత్రాల లాగే. విజ్ఞానం,జ్ఞానం ఉన్న లోకాలకు వెళతాడు. అంటే విజ్ఞానం ఉన్న లోకాలకే కాదు, జ్ఞానం ఉన్న లోకాలకు కూడా వెళతాడు. అయితే విజ్ఞానానికీ, జ్ఞానానికీ మధ్య తేడా ఏమిటి? శాస్త్రీయ జ్ఞానం విజ్ఞానం అయితే, లౌకిక జ్ఞానం జ్ఞానం అవుతుంది.

లోకాలు జడమైనప్పుడు లోకాలకు జ్ఞానం, విజ్ఞానం ఎలా ఉంటాయి? అంటే ఆయా లోకాల్లో జ్ఞానం ఉన్నవాళ్ళు, విజ్ఞానం పొందిన వాళ్ళు ఉంటారు.

**యథాకామచారో భవతి –** ముందు చూసినట్టుగా యథేచ్ఛగా ఆయా లోకాల్లో తిరగవచ్చు. మళ్ళీ నారదుడు ఇంతకన్నా గొప్పది ఉందా అని అడిగి, దాని గురించి చెప్పమంటాడు.

ఇక్కడితో ఏడో ఉపాసన ముగిసింది.

**7.** విజ్ఞాన బ్రహ్మ ఉపాసన

**అష్టమః ఖణ్డః (8)**

**బలం వావ విజ్ఞానాద్భూయోఽపి హ శతం విజ్ఞానవతామేకో బలవానాకమ్పయతే। స యదా బలీ భవత్యథోత్థాతా భవత్యుత్తిష్ఠన్ పరిచరితా భవతి పరిచరన్నుపసత్తా భవత్యుపసీదన్ ద్రష్టా భవతి శ్రోతా భవతి మన్తా భవతి బోద్ధా భవతి కర్తా భవతి విజ్ఞాతా భవతి। బలేన వై పృథివీ తిష్ఠతి బలేనాన్తరిక్షం బలేన ద్యౌర్బలేన పర్వతా బలేన దేవమనుష్యా బలేన పశవశ్చ వయాగ్ంసి చ తృణవనస్పతయ శ్వాపదాన్యా కీటపతంగపిపీలికం బలేన లోకస్తిష్ఠతి బలముపాస్స్వేతి ॥1॥ స యో బలం బ్రహ్మేత్యుపాస్తే యావద్బలస్య గతం తత్రాస్య యథాకామచారో భవతి యో బలం బ్రహ్మేత్యుపాస్తేఽస్తి భగవో బలాద్భూయ ఇతి బలాద్వావ భూయోఽస్తీతి తన్మే భగవాన్ బ్రవీత్వితి॥2॥**

**8.** బలబ్రహ్మ ఉపాసన

**మంత్రం–1 బలం వా వ విజ్ఞానాద్భూయః –** బలం నిశ్చయంగా విజ్ఞానం

కంటే గొప్పది. బలం అంటే శక్తి. అన్ని స్థాయిల్లోనూ శక్తే. శారీరక శక్తి ఉంటేనే, మానసిక శక్తి ఉంటుంది. మానసిక శక్తి ఉంటే జ్ఞానశక్తి ఉంటుంది. అందుకే విజ్ఞానం కన్నా బలం గొప్పది. ఒక ఉపనిషత్తు క్లాసుకు వెళ్ళాలంటే శక్తి కావాలి; గంటసేపు ఏకాగ్రతతో వినాలంటే శక్తికావాలి. నేర్చుకున్నది గుర్తుండాలంటే శక్తి కావాలి. అందుకే విజ్ఞానానికి కారణం బలం.

ఆరో అధ్యాయంలో జరిగిన ప్రయోగం గుర్తుందా? గురువు పదిహేను రోజులు ఏమీ తినకుండా, నీళ్ళు మాత్రం తాగి రమ్మన్నాడు. అతనికున్న విజ్ఞానం అంతా బలం తగ్గటం వల్ల గుర్తురాలేదు. అందుకే **బలం వావ విజ్ఞానాద్భూయః** ఎలా నిరూపిస్తామది?

**అపి హ శతం విజ్ఞానవతామేకో బలవానాకమ్పయతే–** వందమంది విజ్ఞానవంతులు ఉన్నా కూడా, వాళ్ళందరినీ ఒక్క బలవంతుడు వణికిస్తాడు.

ఉదాహరణకు ఏనుగుకు ఏమీ విజ్ఞానం ఉండదు. అది వందమంది ఎదురొచ్చినా వాళ్ళను కేవలం తన తొండంతో ఎత్తి పారేయగలదు. అందుకని బలాన్ని నిర్లక్ష్యం చేయవద్దు. ఉపనిషత్తుకు సరదాగా ఉంది.

**స యదా బలీ భవతి –** బలి అంటే బలవంతుడు.

**అథోత్థాతాభవతి –** బలం ఉంటేనే అతను లేచి నిలబడగలడు.

అందుకే స్కూళ్ళల్లో స్టాండ్, సిట్ అని వ్యాయామాలు చేయిస్తారు.

**ఉత్తిష్ఠన్ పరిచరితా భవతి–** ముందు లేచి నిలబడగలిగే శక్తి కావాలి. లేచాక, పరిచరితా భవతి– గురువుకు పరిచర్యలు చేయగలుగుతాడు.

దీన్ని విజ్ఞానంతో కలుపుతున్నాడు. బలం ఉంటేనే లేచి నిలబడగలడు. లేచి నిలబడితేనే, ఎవరికన్నా సేవ జేయగలడు. ఎవరికి అంటే గురువుకు అని మనం కలుపుకోవాలి.

**పరిచరన్నుపసత్తాభవతి–** ఆచార్యునికి పరిచర్యలు చేస్తేనే అతనికి ప్రియశిష్యుడు అవుతాడు.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా।** **గీత 4–34**

**ఉపసీదన్ ద్రష్టాభవతి–** ప్రియశిష్యుడు అయితే ఆచార్యునిదగ్గరగా వెళ్ళగలుగుతాడు.

**శ్రోతాభవతి–** శాస్త్రశ్రవణం చేయగలుగుతాడు.

**మన్తాభవతి–** మననం చేయగలుగుతాడు.
**బోద్ధాభవతి –** జ్ఞానం పొందగలుగుతాడు.

ఇక్కడ శ్రవణం, మననం,జ్ఞానం అంటే ఆత్మవిద్య గురించి చెప్పటం లేదు. ఏ శాస్త్రం నేర్చుకోవాలన్నా దాన్ని శ్రద్ధగా వినాలి. విన్నదాన్ని విశ్లేషించుకోవాలి. అప్పుడు దాని గురించిన జ్ఞానం పొందుతాడు. దీనికంతటికీ మూలకారణం ఏమిటి? బలం! శాస్త్ర అధ్యయనం చేసిన వ్యక్తి, ఏదైనా కర్మ చేయగలుగుతాడు.

**కర్తా భవతి–** శాస్త్రీయ కర్మ అనుష్ఠాతా భవతి– అంటే గురువు దగ్గర విని, నేర్చుకున్న జ్ఞానాన్ని ఆచరణలో పెట్టగలడు.

**విజ్ఞాతా భవతి–** కర్మఫల భోక్తా భవతి. అంటే కర్మఫలాన్ని అనుభవించగలడు. అందుకే బలం చాలా గొప్పది. ఇది వ్యష్టిస్థాయిలోనే కాదు, సమష్టి స్థాయిలో కూడా.

**బలేన వై పృథివీ తిష్ఠతి–** ఎంత బలం లేకపోతే, పృథ్వీ తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరగగలుగుతుంది? అందువల్ల పృథ్వీ బలం వల్లే ఉంది.

**బలేన్తరిక్షం తిష్ఠతి–** అంతరిక్షం లేదా భువర్లోకం బలం వల్లే స్థిరంగా ఉంది.

**ద్యౌర్బలేన–** ద్యులోకం లేదా సువర్లోకం బలం వల్లే స్థిరంగా ఉంది.

**పర్వతా బలేన దేవ మనుష్యాబలేన–** పర్వతాలు, దేవతలు,మనుష్యులు బలం చేతనే నిలిచి ఉన్నారు.

**పశవశ్చ వయాగ్ంం చ –** పశువులు, పక్షులు

**తృణ వనస్పతయ శ్వాపదాన్యా కీటపతంగ పిపీలికం బలేన–** గడ్డి, చెట్టు, చేమలు, క్రూర మృగాలు, క్రిమికీటకాలు, ఎగిరే పురుగులు, చీమలవరకూ బలం వల్లనే నిలిచి ఉన్నాయి.

**బలేన లోకస్తిష్ఠతి–** ఒక్కముక్కలో చెప్పాలంటే లోకమంతా బలం చేతనే నిలిచి ఉంది. అందుకని ఏం చేయాలి?బలం మీద ఉపాసన చేయాలి.

**మంత్రం–2** ముందు చూసినట్టుగానే కామ చారత్వఫలం. యథేచ్ఛగా తిరిగే ఫలం. బలం యొక్క వ్యాప్తి ఎంతవరకు ఉంటుందో, అంతవరకు ఇతనికి యథేచ్ఛగా గతి ఉంటుంది.

ఇతను అంటే బల బ్రహ్మ ఉపాసన చేసిన వ్యక్తికి.

అయినా నారదుడు తృప్తి చెందడు. ఇంతకన్నా గొప్పది ఉందా అని అడిగి, దాని గురించి చెప్పమంటాడు.

ఇక్కడితో ఎనిమిదో ఉపాసన ముగిసింది.

**8. బలబ్రహ్మ ఉపాసన**

**నవమః ఖణ్డః (9)**

**అన్నం వావ బలాద్భూయః। యద్యపి దశ రాత్రీర్నాశ్నీయాద్యద్యు హ జీవేదథవాऽ ద్రష్టాऽశ్రోతాऽమన్తాऽబోద్ధాऽకర్తాऽవిజ్ఞాతా భవత్యథాన్నస్యాయై ద్రష్టా భవతి శ్రోతా భవతి మన్తా భవతి బోద్ధా భవతి కర్తా భవతి విజ్ఞాతా భవత్యన్నముపాస్స్వేతి ॥1॥ సయోऽన్నం బ్రహ్మేత్యుపాస్తేऽన్నవతో వై స లోకాన్ పానవతోऽభిసిధ్యతి యావదన్నస్య గతం తత్రాస్య యథాకామచారో భవతి యోऽన్నం బ్రహ్మేత్యుపాస్తేऽస్తి భగవోऽన్నాద్భూయ ఇత్యాన్నాద్వావ భూయోऽస్తీతి తన్మే భగవాన్ బ్రవీత్వితి॥2॥**

**9. అన్న బ్రహ్మ ఉపాసన**

**మంత్రం-1 అన్నం వావ బలాద్భూయః-** అన్నమే బలం కంటే నిశ్చయంగా గొప్పది. ఎందుకు? ఎందుకంటే బలం కార్యం, అన్నం- తిన్నఅన్నం- కారణం.

అన్నం బలానికి కారణం అని అన్వయ వ్యతిరేక పద్ధతి పాటిస్తే తెలుస్తుంది. ఒకరోజు తినకుండా ఉంటే ఆ రోజు నీరసంగా ఉంటుంది. మర్నాడు తింటే మళ్ళీ బలం వస్తుంది. ఆరో అధ్యాయంలో ఈ ప్రయోగం చూశాము కూడా. ఉద్ధాలకుడు శ్వేతకేతును పదిహేను రోజులు అన్నం తినకుండా ఉండి,తర్వాతి రోజు తన దగ్గరకు రమ్మన్నాడు. ఆ రోజు అతను వేదాల్లో ఏమీ అప్పచెప్పలేకపోయాడు. బాగా మండే అగ్ని చల్లారాక మిగిలిన ఒక మండే బొగ్గులాగా ఉన్నాడని చూశాము.

ఇక్కడ గురువు పది రోజులు తినకుండా ఉండి చూడమంటున్నారు. **యద్యపి దశరాత్రీర్నాశ్నీయాత్ -** ఎవరైనా పదిరోజులు (రాత్రి అంటే రోజులు అని తీసుకోవాలి). అన్నం తినకుండా ఉంటే.

**మ్రియతే–** (కలుపుకోవాలి) అతను మరణించవచ్చు. మరణించి తీరుతాడని కాదు. మరణించే అవకాశం ఉంది.

**యది ఉహ జీవేత్–** ఒకవేళ జీవించి ఉంటే, ఏమవుతుంది? అతను జీవించి ఉన్నవాడి కింద లెఖ్ఖలోకి రాడు అంటున్నది ఉపనిషత్తు. ఎందుకు?

అంతకుముందు ఖండంలో చెప్పిన పనులేవీ చేయలేదు. ఏమిటవి?

**సయదా బలీ భవత్యథోత్థాతా భవత్యుత్తిష్ఠన్ పరిచరితా భవతి పరిచరన్నుపసత్తా భవత్యుపసీదన్ ద్రష్టా భవతి శ్రోతా భవతి మంతా భవతి బోద్ధా భవతి కర్తా భవతి విజ్ఞాతా భవతి – ఖండం–8**

వీటన్నింటికీ 'అ', 'అ', 'అ' కలిసింది. ఇవేవీ చేయలేదు.ఏమిటవి?

**అద్రష్టాఽ శ్రోతాఽ మన్తాఽ ఽ బోద్ధాఽ కర్తాఽ విజ్ఞాతాభవతి –** సరిగ్గా చూడడు, సరిగ్గా వినలేడు.సరిగ్గా మననం చేయలేడు. సరిగ్గా అర్థం చేసుకోలేడు.సరిగ్గా కర్మలు చేయలేడు. సరిగ్గా కర్మఫల భోక్త అవలేడు. ఇదంతా గొలుసు వ్యవహారం.

ఇప్పుడు అతనికి పది రోజుల తర్వాత అన్నం పెడితే అతని పరిస్థితి ఏమిటి?

**అథన్నస్యాయై–** ఒకవేళ అన్నం తింటే;

**ద్రష్టా భవతి శ్రోతా భవతి మన్తా భవతి బోద్ధా భవతి కర్తా భవతి విజ్ఞాతా భవతి–** అప్పుడు ఇవన్నీ చేయగలుగుతాడు. చూడగలడు, వినగలడు, మననం చేయగలడు. జ్ఞానం పొందగలడు. కర్మ చేయగలడు. కర్మఫలభోక్తా అవగలడు. అందువల్ల

**అన్నేసతి బలం, అన్నే అసతి బల అభావః**

**తస్మాత్ అన్నం ఏవ బలస్యకారణం**

అందువల్ల బలానికి కారణం అన్నం. అందుకని–

**అన్నముపాస్స్వేతి–** ఓ నారదా! అన్న బ్రహ్మ ఉపాసన చేయి.

**మంత్రం–2** అన్నం బ్రహ్మ ఉపాసన ఫలం. ఇలా పదిహేను ఖండాల్లో చెప్పాలా, ఒక్క ఖండంలో చెప్పేయవచ్చు కదా అనిపిస్తుంది. కాని అది ఉపనిషత్తు పద్ధతి. అది అలా సంభాషణారూపంలో తీరిగ్గా ఒక్కొక్కటీ చెప్తుంది. మనమే ఓపికపట్టాలి. ఇందాక కూడా చూడండి, బలం ఉంటే ఏవేవి చేయవచ్చో

చెప్పింది, మళ్ళీ అన్నం లేకపోతే ఏం చేయలేమో, తింటే ఏం చేయగలమో వాటినే చెప్పి చూపిస్తుంది.

ఈ ఉపాసన చేసిన వ్యక్తి ఎక్కడికి వెళతాడు?

**అన్నవతో వై స లోకాన్ పానవతోఽభిసిధ్యతి-** సమృద్ధిగా అన్నం, జలం దొరికే లోకాలకు వెళతాడు. అన్నం ఉండి నీరు లేకపోతే ఏమిటి లాభం?

**యథాకామచారో భవతియోఽన్నం బ్రహ్మేత్యుపాస్తేఽస్తి-** ఫలం మిగతాదంతా అదే. యథేచ్ఛగా తిరిగే ఫలం. అన్నం యొక్క వ్యాప్తి ఎంతమేరకు ఉంటుందో, అంతమేరకు ఇతనికి యథేచ్ఛగా గతి ఉంటుంది. ఇతనికి అంటే అన్న బ్రహ్మ ఉపాసన చేసిన వ్యక్తికి.

అయినా నారదుడు తృప్తి చెందడు. ఇంతకన్నా గొప్పది ఉంది కదా అని అడిగి, దాని గురించి చెప్పమంటాడు.

ఇక్కడితో తొమ్మిదో ఖండం ముగిసింది.

**9. అన్న బ్రహ్మ ఉపాసన**

### దశమః ఖణ్డః (10)

**ఆపో వావాన్నాద్భూయస్తస్మాద్యదా సువృష్టిర్న భవతి వ్యాధీయన్తే ప్రాణా అన్నం కనీయో భవిష్యతీత్యథ యదా సువృష్టిర్భవత్యానన్దినః ప్రాణా భవన్త్యన్నం బహు భవిష్యతీత్యాప ఏవేమా మూర్తా యేయం పృథివీ యదన్తరిక్షం యద్ ద్యౌర్యత్పర్వతా యద్దేవమనుష్యా యత్పశవశ్చ వయాగ్ంసి చ తృణవనస్పతయః శ్వాపదాన్యాకీటపతంగపిపీలికమాప ఏవేమా మూర్తా అప ఉపాస్స్వేతి ॥1॥ సయోఽపో బ్రహ్మేత్యుపాస్త ఆప్నోతి సర్వాన్ కామాగ్ంస్త ృప్తిమాన్ భవతి యావదపాం గతం తత్రాస్య యథాకామచారో భవతి యోఽపో బ్రహ్మేత్యుపాస్తేఽస్తి భగవోఽద్భ్యో భూయ ఇత్యద్భ్యో వావ భూయోఽస్తీతి తన్మే భగవాన్బ్రవీత్వితి ॥2॥**

**10. జలబ్రహ్మ ఉపాసన**

**మంత్రం -1 ఆపో వావాన్నాద్భూయః -** జలములే నిశ్చయంగా అన్నం కంటే గొప్పవి. ఎందుకంటే వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే పంటలు బాగా పండుతాయి. ఇంతకుముందు చూసినట్టుగా-

**కాలే వర్షతు పర్జన్యః పృథివీ సశ్యశాలినీ**
**దేశోయం క్షోభరహితః సజ్జనాస్సంతు నిర్భయః**

**తస్మాత్–** అందువల్ల. 'ఎందువల్ల?' జలం కారణం, అన్నం కార్యం అవటం వల్ల.

**యదా సువృష్టిర్నభవతి–** ఎప్పుడైతే మంచి వర్షం పడదో,

**వ్యాధీయన్తే ప్రాణాః –** అప్పుడు జీవులందరూ కలత చెందుతారు.

**అన్నం కనీయో భవిష్యతీ తి–** అన్నం సమృద్ధిగా పండదని ఖంగారుపడతారు. కనీయః అంటే చాలా తక్కువ, అంటే అన్నానికి కరువు వస్తుంది.

**యదా సువృష్టిర్భవతి–** దాని బదులుగా. సమృద్ధిగా వర్షం కురుస్తే, మళ్ళీ అతి వృష్టి కాకుండా కావలసిన మేరకే కురుస్తే.

**ఆనన్దినః ప్రాణా భవన్తి–** జీవులందరూ ఆనందిస్తారు. ముఖ్యంగా రైతులు.

వాళ్ళ జీవితాలు వ్యవసాయం మీదే ఆధారపడి ఉంటాయి కదా! వాళ్ళ మీద మన జీవితం ఆధారపడి ఉంది. ఏమని అనుకుంటారు వాళ్ళు?

**అన్నం బహు భవిష్యతి –** సమృద్ధిగా పంటలు పండుతాయి అనుకుంటారు. అందుకని జలం ముఖ్యం. ఇది జీవరాశులపరంగా.

అంతేకాదు సమష్టిపరంగా సృష్టిలో ఉన్న ఘనపదార్థాలన్నీ జలం నుంచి వచ్చినవే.

**ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథ్వివ్యా ఓషధయః। ఓషధీభ్యోఽన్నమ్।అన్నాత్పురుషః।స వ ఏష పురుషోన్న రసమయః॥ – తైత్తిరీయం**

అందువల్ల మూర్త ప్రపంచంలోని ఘనపదార్థాలన్నీ నీటినుంచి వచ్చినవే. అంటే ద్రవరూపం నుంచి వచ్చినవే.

**ఆప ఏవేమా మూర్తా యేయం పృథివీ యదన్తరిక్షం... పిపీలికమ్ –** మూర్త ప్రపంచంలో వున్న ఈ పట్టికనంతా ఎనిమిదో ఖండంలో ఇదే వరుసలో బలం గురించి చెప్పినప్పుడు చూశాము. అంటే పృథివీ, అంతరిక్షం, ద్యులోకం, పర్వతాలు, దేవతలు, మనుష్యులు, పశువులు, పక్షులు, చెట్టుచేమలు, క్రూరమృగాలు, క్రిములు,రెక్కల పురుగులు, చీమలతో సహా అన్నీ.

**ఆప ఏవేమా మూర్తా–** అన్నీ రూపుదాల్చిన జలములే.

అందుకే సంధ్యావందనం చేసేటప్పుడు -

**ఆపో వా ఇదగ్ం సర్వమ్ విశ్వాభూతాన్యాపః ప్రాణవ ఆపః పశవ ఆపః అన్నమాపః అమృతమాపః సమ్మృద్ధాపః విరాడాపః ఛందాగ్ంస్యాపః జ్యోతిగ్ం స్యాపః యజూగ్ం స్యాపః సత్యం ఆపః సర్వదేవతాపః భూః భువః సువః, ఆపః** అని ఉద్ధరిణిలో నీరు తీసుకుని చెప్తారు. ఎంత బాగా చెప్పారో చూడండి!

**ఆప ఉపాస్స్వేతి-** అందువల్ల జలబ్రహ్మ ఉపాసన చేయి.

**మంత్రం-2 - సర్వాన్ కామాగ్ం స్తృప్తిమాన్ భవతి-** ఎవరైతే జలం మీద బ్రహ్మ ఉపాసన చేస్తాడో, అతను కోరినవన్నీ పొంది, తృప్తిగలవాడు అవుతాడు. ఎందుకంటే ముందు మంత్రంలో జలం వానరూపంలో మానవాళికి తృప్తినిస్తుందని వచ్చింది. ఎలా ఇస్తుంది? పంటలు సమృద్ధిగా ఇవ్వటం ద్వారా. జలం తృప్తిని కలుగజేస్తుంది. కాబట్టి, జలాన్ని ఉపాసించే వ్యక్తి తృప్తిని కలగజేసే లోకాలకు వెళ్ళి, తృప్తి పొందుతాడు. తక్కినదంతా మామూలే. జలం యొక్క వ్యాప్తి ఎంత మేరకు ఉంటుందో, అంతమేరకు ఇతనికి యథేచ్ఛగా గతి ఉంటుంది. ఇతనికి అంటే జలబ్రహ్మ ఉపాసన చేసిన వ్యక్తికి-

అయినా నారదుడు తృప్తి చెందడు. ఇంతకన్నా గొప్పది ఉందా అని అడిగి, దాని గురించి చెప్పమంటాడు.

ఇక్కడితో పదో ఉపాసన ముగిసింది.

**10. జలబ్రహ్మ ఉపాసన**

**ఏకాదశః ఖణ్డః (11)**

**తేజో వావాద్భ్యో భూయః॥ తద్వా ఏతద్వాయుమాగృహ్యాకాశమ భితపతి తదాఽఽహుర్నిశోచతి నితపతి వర్షిష్యతి వా ఇతి తేజ ఏవ తత్పూర్వం దర్శయిత్వాఽథాపస్సృజతే తదేతదూర్ధ్వాభిశ్చ తిరశ్చీభిశ్చ విద్యుద్భిరాహ్రాదాశ్చరన్తి తస్మాదాహుర్విద్యోతతే స్తనయతి వర్షిష్యతి వా ఇతి తేజ ఏవ తత్పూర్వం దర్శయిత్వాఽథాపస్సృజతే తేజ ఉపాస్స్వేతి ॥1॥ స యస్తేజో బ్రహ్మేత్యుపాస్తే తేజస్వీ వై స తేజస్వతో లోకాన్ భాస్వతోఽపహతతమస్కానభిసిద్ధ్యతి యావత్తేజసో గతం తత్రాస్య యథాకామచారో భవతి యస్తేజో బ్రహ్మేత్యుపాస్తేఽస్తి భగవస్తేజసో భూయ ఇతి తేజసో వావ భూయోఽస్తీతి తన్మే భగవాన్ బ్రవీత్వితి ॥2॥**

## 11. అగ్ని బ్రహ్మ ఉపాసన

**మంత్రం-1 తేజోవావాద్భ్యో భూయః –** తేజస్సు నిశ్చయంగా జలముకంటే గొప్పది. జలములు అన్నప్పుడు ముఖ్యంగా వర్షాన్ని దృష్టిలో పెట్టుకుని అన్నాం. వర్షం సూర్యుడు తన ప్రతాపంతో చెలరేగిపోతున్నప్పుడు వస్తుంది. సూర్యుని వేడి అగ్ని తత్త్వం. అలాగే వాన కురిసేముందు ఉరుములు, మెరుపులు వస్తాయి. మెరుపులు అగ్నితత్త్వం. అలా వానముందు అగ్ని తత్త్వాన్ని రెండు రకాలు. అందుకని అగ్ని కారణం,జలం కార్యం.

పంచభూతాల సృష్టిక్రమం చూస్తే.

**ఆకాశాద్వాయుః వాయోరగ్నిః, అగ్నేరాపః** వస్తుంది. అగ్నినుంచి నీరు వచ్చింది అని చెప్పింది తైత్తిరీయం. మన అనుభవం కూడా దానితో ఏకీభవిస్తుందని, దాని గురించి చెప్తున్నాడు సనత్కుమారుడు.

**తద్వా ఏతద్వాయుమాగృహ్యాకాశమభితపతి –** తత్ అంటే ఆ అగ్నితత్త్వం. వాయుమ్ ఆగృహ్య – వాయువును ఆశ్రయించి, ఆకాశమ్ అభితపతి– వాయువు ద్వారా, ఆకాశాన్నంతా వేడెక్కిస్తుంది. అది ప్రత్యక్షంగా ఆకాశాన్ని వేడెక్కించదు. ఆకాశమంతటా వ్యాపించి ఉన్న వాయువును తోడు తీసుకుని, వాతావరణాన్నంతా వేడెక్కిస్తుంది.

**తదాహుః –** మనుష్యులు దీని గురించే మాట్లాడుకుంటారు. సంభాషణ ఇలా మొదలవుతుంది.

**నిశోచతి –** బాగా వేడిగా ఉంది.

**నితపతి –** దానివల్ల బాగా ఉక్కగా ఉంది;

**వర్షిష్యతివా ఇతి –** ఖచ్చితంగా వాన పడబోతోంది అని అంటారు.

**తేజ ఏవ తత్పూర్వం దర్శయిత్వా –** అందువల్ల వాన కురిసేముందు అగ్ని తత్త్వమే ముందుగా తనను ప్రకటించుకుంటుంది.

**అథాపస్సృజతే –** తర్వాత వానను సృష్టిస్తుంది.

అంతేకాదు అగ్నితత్త్వమే మెరుపుల రూపంలో కనిపిస్తుంది.

**తదేతత్ –** అదే అగ్ని తత్త్వం. అంటే ఎండాకాలంలో వేడి రూపంలో ఏ అగ్ని తత్త్వమైతే ఉందో అదే అగ్ని తత్త్వం వానల ముందు కూడా వస్తుంది.

**ఊర్ధ్వాభిశ్చ తిరశ్చీభిశ్చ విద్యుద్భిః–** విద్యుత్ అంటే మెరుపు. ఎటువంటి మెరుపు? రెండురకాలు ఊర్ధ్వాభిః, అంటే నిలువుగీతల్లాగా మెరుపులు;

తిరశ్చీభి– అడ్డగీతల్లాగా మెరుపులు. మెరుపులు దేనికి ప్రతీక? అగ్ని తత్త్వానికి. అగ్ని కారణం. జలం కార్యం. ఈ విషయం మర్చిపోకూడదు.

**ఆహ్రాదాశ్చరన్తి –** ఆహ్రాదాః అంటే ఉరుముల చప్పుళ్ళు. ఆహ్లాదం కాదు. ఆహ్లాదం అంటే ఆనందం. ఇవి ఆహ్రాదం. ఉరుముల శబ్దం వినిపిస్తుంది.

**తస్మాదాహుః –** మళ్ళీ జనులు ఇలా అంటారు.

**విద్యోతతే –** మెరుపులు మెరుస్తున్నాయి;

**స్తనయతి–** ఉరుములు ఉరుముతున్నాయి;

**వర్షిష్యతి వా ఇతి–** ఖచ్చితంగా వర్షం కురవబోతోంది అంటారు. మళ్ళీ దీన్ని బట్టి అగ్ని కారణం. జలం కార్యం అని తెలుస్తున్నది.

**తేజ ఏవ తత్పూర్వం దర్శయిత్వా–** అందువల్ల వాన కురిసే ముందు అగ్ని తత్త్వమే ముందుగా తనను ప్రకటించుకుంటుంది.

**అథాపస్సృజతే–** తర్వాత వానను సృష్టిస్తుంది.

**తేజ ఉపాస్స్వేతి–** అందువల్ల అగ్ని బ్రహ్మ ఉపాసన చేయి.

సనత్కుమారుడు చెప్పే పదిహేను ఉపాసనలూ చూస్తే ప్రకృతి శక్తులన్నీ వచ్చేస్తున్నాయి ఇందులో. సమష్టిపరంగానే కాదు, వ్యష్టిపరంగా కూడా. వాక్కు, మనసు లాంటివి వ్యష్టిపరంగా. అంటే ఇది ఒక రకమైన విశ్వరూప ఉపాసన. ఈ విశ్వరూప ఉపాసనను కృష్ణునిలో చూస్తాము భగవద్గీతలో. ఇక్కడ ప్రకృతిలో చూస్తున్నాము.

**మంత్రం–2** అగ్ని బ్రహ్మ ఉపాసన ఫలం.

**తేజస్వీ (భవతి) –** మరణించాక అతను తేజస్సు పొందుతాడు;

**తేజస్వతో లోకాన్ భాస్వతోఽపహతతమస్కానభిసిద్ధ్యతి–** ప్రకాశవంతములైన లోకాలకు వెళతాడు. అపహత తమస్కాన్– తమః అంటే చీకటి; అపహతమ్ అంటే తొలగించబడిన; అపహత తమస్కాన్ అంటే చీకటి లేని లోకాలు, అంటే ప్రకాశవంతమైన లోకాలు.

తక్కినదంతా మామూలే. అగ్ని యొక్క వ్యాప్తి ఎంత మేరకు ఉంటుందో, అంతమేరకు ఇతనికి యథేచ్ఛగా గతి ఉంటుంది. ఇతనికి అంటే అగ్ని బ్రహ్మ ఉపాసన చేసిన వ్యక్తికి.

అయినా నారదుడు తృప్తి చెందడు. ఇంతకన్నా గొప్పది ఉందా అని అడిగి, దాని గురించి చెప్పమంటాడు.

ఇక్కడితో పదకొండో ఉపాసన ముగిసింది.

**11. అగ్ని బ్రహ్మ ఉపాసన**

**ద్వాదశః ఖణ్డః (12)**

**ఆకాశో వావ తేజసో భూయానాకాశే వై సూర్యచన్ద్రమసావుభౌ విద్యున్నక్షత్రాణ్యగ్నిరాకాశేనాహ్వయత్యాకాశేన శృణోత్యాకాశేన ప్రతిశృణోత్యాకాశే రమత ఆకాశే న రమత ఆకాశే జాయత ఆకాశమభిజాయత ఆకాశముపాస్స్వేతి ॥1॥ స య ఆకాశం బ్రహ్మేత్యుపాస్త ఆకాశవతో వై స లోకాన్ ప్రకాశవతోఽసమ్బాధానురుగాయవతోఽభిసిధ్యతి యావదాకాశస్య గతం తత్రాస్య యథాకామచారో భవతి య ఆకాశం బ్రహ్మేత్యుపాస్తేఽస్తి భగవ ఆకాశాద్భూయ ఇత్యాకాశాద్వావ భూయోఽస్తీతి తన్మే భగవాన్ బ్రవీత్వితి ॥2॥**

**12. ఆకాశబ్రహ్మ ఉపాసన**

**మంత్రం-1 ఆకాశో వావ తేజసోభూయః** – ఆకాశం నిశ్చయంగా తేజస్సు కంటే గొప్పది – సనత్కుమారుడు మధ్యలో వాయువును వదిలేసి ఆకాశానికి ఎందుకు వెళ్ళాడు? అగ్నితత్త్వం గురించి చెప్పినప్పుడు, అందులో వాయుతత్త్వం గురించి కూడా వచ్చింది.

**ఏతద్వాయుమాగృహ్యాకాశమభితపతి**

అగ్ని వాయువును ఆశ్రయించి, ఆకాశాన్ని వేడిగా చేస్తుంది. అందుకని అగ్నిని, వాయువును కలిపి ఒకటిగా తీసుకున్నాడు.

ఇంకో కారణం కూడా ఊహించవచ్చు. తర్వాత పదిహేనవ దశలో ప్రాణతత్త్వం వస్తుంది. ప్రాణతత్త్వం వాయువు యొక్క వ్యక్తరూపమే కదా! అందుకని కూడా ప్రాణాన్ని వదిలేసి ఉండవచ్చు. కారణం ఏదైనా ఇక్కడ చెప్పలేదు. ఆకాశం గొప్పది అనటానికి రెండు కారణాలు చెప్పవచ్చు.

ఒక కారణం మనం ఇంతవరకూ చూస్తు వస్తున్నదే. పృథివీకి కారణం నీరు అనీ, నీటికి కారణం అగ్ని అనీ, కారణం కార్యం కన్నా గొప్పది అనీ చూస్తూ వచ్చాము. అలాగే వీటన్నింటికీ కారణం ఆకాశం.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః ఆకాశాద్వాయుః।**

కాని ఇక్కడ సనత్కుమారుడు కారణత్వమనే ఈ కారణం చెప్పటం

లేదు. ఇంకో కారణం చెపుతున్నాడు. ఏమిటది? ఆకాశంలోనే అన్నీ ఉన్నాయి. అంటే ఆకాశం తనలో అన్నీ ఇముడ్చుకునే గిన్నెలాంటిది. గిన్నెలో పెట్టే వస్తువుకన్నా గిన్నె పెద్దదిగా ఉండాలి కదా! ఉదాహరణకు ఒక చిన్న కుండలో పెద్ద ఏనుగును పెట్టలేము. అందుకని ఆకాశంలోనే తక్కిన నాలుగు భూతాలు, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, గ్రహాలు, జీవులు అందరూ ఉన్నారు. ఆకాశంలో ఉండటమే కాదు, వాళ్ళ వ్యవహారం కూడా ఆకాశంలోనే నడుపుతున్నారు. అందుకని ఆకాశం సర్వవ్యాపకం.

**ఆకాశే వై సూర్యాచన్ద్రమసావుభౌ –** అగ్ని తత్త్వానికి ప్రతీకలైన సూర్య, చంద్రులిద్దరూ ఆకాశంలోనే ఉన్నారు.

**విద్యున్నక్షత్రాణ్యగ్నిః –** విద్యుత్తు, నక్షత్రాలు కూడా అగ్నితత్త్వమే. అగ్ని పంచభూతాల్లో ఒకటి. అన్నీ అగ్ని తత్త్వాలు ఎందుకు వచ్చాయి? ముందు ఉపాసన అగ్ని తత్త్వం మీద కాబట్టి.

అన్నీ ఆకాశంలో ఉండటమే కాదు. వ్యవహారాలు కూడా ఆకాశంలోనే జరుగుతాయి.

**ఆకాశేన ఆహ్వయతి–** ఆహ్వయతి అంటే ఒక వ్యక్తి ఇంకో వ్యక్తిని పిలుస్తున్నాడు. ఎక్కడ? ఆకాశంలో. ఆకాశం ద్వారా పిలుస్తున్నాడు.

**ఆకాశేన శృణోతి–** ఆకాశం ద్వారా వింటున్నాడు.

**ఆకాశేన ప్రతిశ్రుణోతి–** ఆకాశం ద్వారా తిరిగి వింటున్నాడు.

సంభాషణ ద్వారా జరిగే వ్యవహారం ఆకాశంలోనే జరుగుతున్నది.

**ఆకాశే రమత –** రమతే అంటే రమిస్తున్నాడు. ఆకాశంలో రమిస్తున్నాడు.

**ఆకాశే న రమత–** ఆకాశంలో దుఃఖిస్తున్నాడు.

ఆకాశమే ఆనందానికీ కారణం, దుఃఖానికీ కారణం.

**ఆకాశే జాయతే–** ఆకాశంలోనే అన్నీ పుడుతున్నాయి.

**ఆకాశామభిజాయత–** చిన్న మొలకలు, మొక్కలు మొదలైనవి ఆకాశాన్ని అభిముఖంగా చేసుకుని పుడుతున్నాయి, కాని, తల్లక్రిందులుగా (నేలలోనికి) కాదు. అంటే మొక్కలు ఆకాశంలో పుట్టటమే కాదు, ఆకాశంలోకి పెరుగుతాయి.

**ఆకాశముపాస్స్వేతి –** అందువల్ల ఆకాశ బ్రహ్మ ఉపాసన చేయి.

ఉపనిషత్తుల్లో బ్రహ్మ గురించి వర్ణించేటప్పుడు, బ్రహ్మతో

పోల్చగలిగినదేదైనా ఉంటే అది ఆకాశం అని వస్తుంది.

**అశబ్దమస్పర్శ మరూపమ**
**తథాఽ రసం నిత్యమగన్ధవచ్చయత్॥ కఠ 1-3-15**

బ్రహ్మ అశబ్దం, అస్పర్శం, అరూపం, అరసం అయితే అలాంటి బ్రహ్మ మీద ఎలా ఉపాసన చేయాలి అనే సందేహం కలుగుతుంది. వేదాంతం అడుగుతుంది, అయితే ఆకాశాన్ని ఎలా అర్థం చేసుకుంటావు అని. నాకు ఆకాశం కూడా అర్థం కాదు అనలేము. ఎందుకు? అర్థం కాని వస్తువు మన భాషలోకి రాదు. మనకు తెలియని విషయానికి నామం ఇవ్వము కదా. ఆకాశం అంటే శూన్యం కాదు. అది ఒక వస్తువు. ఆకాశం అంటే ఏమీ లేదు అని అన్నామనుకోండి. అంటే రెండు గోడల మధ్య ఏమీ లేనట్టా? రెండు గోడల మధ్య ఉన్న ఖాళీని ఆకాశం అంటాము. ఆకాశం లేదు అంటే ఖాళీ లేనట్టేగా! మరి వాటి మధ్య ఖాళీ లేకపోతే, రెండు గోడలూ పక్కపక్కన ఉండాలి! అందుకని, ఖాళీప్రదేశం అంటే అది శూన్యం అని కాదు అర్థం.

ఆకాశం అనేది ఒక సానుకూల ద్రవ్యం. ఆకాశాన్ని అర్థం చేసుకోవాలంటే మనస్సుకు సూక్ష్మబుద్ధి ఉండాలి. మనస్సుకు సూక్ష్మబుద్ధి ఉంటే, ఆకాశానికన్నా సూక్ష్మమైన (అర్థం చేసుకోవటంలో) చైతన్యాన్ని అర్థం చేసుకోవచ్చు. చైతన్యం మొదటి లక్షణం ఏమిటి? చైతన్యం శరీరంలో ఒక భాగం కాదు. దాని నుంచి ఉత్పత్తి చెందలేదు. దాని లక్షణం కూడా చైతన్యానికి లేదు. అదే నిర్వచనం శుద్ధ సత్తాకు కూడా. సత్ శరీరంలో ఒక భాగం కాదు. దాని నుంచి ఉత్పత్తి చెందలేదు. దాని లక్షణం కూడా సత్‌కు లేదు.

ఆకాశానికీ, బ్రహ్మకూ అనేక అంశాలు సమానంగా ఉన్నాయి.

1. రెండింటికీ రూపం లేదు
2. రెండూ సర్వవ్యాపకం
3. రెండూ అపరిచ్ఛిన్నం
4. రెండూ శుద్ధం
5. అన్నీ వాటిలో ఇమిడిపోతాయి

అందుకే ఆకాశ ఉపాసన అద్భుతమైన ఉపాసన. భగవంతుని గురించి అర్థం చేసుకోవాలంటే ముందు ఏకరూప ఉపాసన చేయాలనీ,

దాని తర్వాత అనేక రూప ఉపాసనకు రావాలనీ చెపుతాం. ఇప్పుడు దానికి అరూప ఆకాశ ఉపాసన కలుపుకోవచ్చు. ఇవి చేస్తే అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందటానికి మనస్సు సూక్ష్మతమం అయి, సిద్ధంగా ఉంటుంది.

చైతన్యానికీ, ఆకాశానికీ పోలికలుండటం వల్లనే చైతన్యాన్ని చిదాకాశం అని కూడా అంటారు. నటరాజుని అందుకే ఆకాశలింగం అనీ, చిదంబరం అనీ అంటారు. అలాగే ధ్యానంలో ఆలోచనలు లేకుండా చేస్తే మిగిలేది శూన్యం అనుకుంటాము. కాని అక్కడ ఉన్నది నువ్వే. నిరాకార చైతన్యం.

ఆకాశ ఉపాసన ఒక అద్భుతమైన ఉపాసన. చాలా అరుదుగా దీని గురించి వస్తుంది. ఇక్కడొక చోట చూస్తున్నాము. తైత్తిరీయంలో ఒక చోట వస్తుంది.

**సర్వమిత్యాకాశే, తత్ ప్రతిష్ఠేత్యుపాసీత। ప్రతిష్ఠావాన్ భవతి తన్మహ ఇత్యుపాసీత। మహాన్భవతి। తన్మన ఇత్యుపాసీత। మానవాన్ భవతి। తన్నమ ఇత్యుపాసీత। నమస్తేఽస్మై కామా. తద్బ్రహ్మేత్యుపాసీత। బ్రహ్మవాన్ భవతి। తద్బ్రహ్మణః పరిమర ఇత్యుపాసీత - భృగువల్లీ**

**తత్- తత్-తత్** అంతా ఆకాశ ఉపాసన గురించి!

ఎంత అందంగా చెప్పిందో చూడండి.

తైత్తిరీయంలోనే శీక్షావల్లీలో కూడా ఆకాశ శరీర బ్రహ్మ అని వస్తుంది.

**ఆకాశశరీరం బ్రహ్మ। సత్యాత్మ ప్రాణారామమ్ మన ఆనందమ్। శాంతి సమృద్ధమమృతమ్। ఇతి ప్రాచీనయోగ్యోపాస్వ**

బ్రహ్మకు శరీరం ఆకాశం. అందువల్ల ఆకాశ ఉపాసన గొప్పది. సనత్కుమారుడు కూడా చెపుతున్నాడు.

**ఆకాశముపాస్స్వేతి-** ఆకాశబ్రహ్మ ఉపాసన చేయి.

**మంత్రం-2** ఇంచుమించు అదే ఫలం. **యథా యథాఉపాస్తే, తదేవ భవతి.** సర్వవ్యాపక ఆకాశ ఉపాసన చేస్తే, అతను కూడా సర్వవ్యాపకమైన లోకాలకు వెళతాడు. లోకాల పేర్లు చెప్పలేదు కాని ఊర్ధ్వలోకాలు అవి. అవి ఎలా ఉంటాయి?

**ఆకాశ్వతో వై –** విశాలమైనవి; **స లోకాన్ ప్రకాశవతః –** ప్రకాశవంతమైనవి. **అసమ్బాధాన్ –** సంబాధం అంటే రద్దీ. అసంబాధాన్ అంటే రద్దీ లేని లోకాలు; ఆకాశం అన్నిటితో కలిసి ఉన్నా, దేనితోనూ సంగత్వం ఉండదు. అలాగే ఇతను కూడా సంగత్వం లేకుండా ఉంటాడు.

**ఉరుగాయవతః –** విస్తీర్ణమైన గతి ఉంటుంది. అంటే స్వేచ్ఛగా తిరగటానికి చాలా ప్రదేశం ఉంటుంది. తక్కినదంతా మామూలే.

ఆకాశం యొక్క వ్యాప్తి ఎంతమేరకు ఉంటుందో, అంత మేరకు అతనికి యథేచ్ఛగా గతి వుంటుంది. ఇతనికి అంటే ఆకాశబ్రహ్మ ఉపాసన చేసిన వ్యక్తికి.

అయినా నారదుడు తృప్తి చెందడు. ఇంతకన్నా గొప్పది ఉందా అని అడిగి, దాని గురించి చెప్పమంటాడు.

ఇక్కడితో పన్నెండో ఉపాసన ముగిసింది.

**12. ఆకాశబ్రహ్మ ఉపాసన**

**త్రయోదశః ఖణ్డః (13)**

**స్మరో వావాకాశాద్భూయస్తస్మాద్యద్యపి బహవ ఆసీరన్న స్మరన్తో నైవ తే కంచన శృణుయుర్న మన్వీరన్న విజానీరన్ యదా వావ తే స్మరేయురథ శృణుయురథ మన్వీరన్నథ విజానీరన్ స్మరేణ వై పుత్రాన్ విజానాతి స్మరేణ పశూన్ స్మరముపాస్స్వేతి ॥1॥ స యస్స్మరం బ్రహ్మేత్యుపాస్తే యావత్ స్మరస్య గతం తత్రాస్య యథాకామచారో భవతి యస్స్మరం బ్రహ్మేత్యుపాస్తేఽస్తి భగవస్స్మరాద్భూయ ఇతి స్మరాద్వావ భూయోఽస్తీతి తన్మే భగవాన్ బ్రవీత్వితి॥2॥**

**13. స్మరణ బ్రహ్మ ఉపాసన**

**మంత్రం-1 స్మరో వావాకాశాద్భూయః-** స్మరణం నిశ్చయంగా ఆకాశం కంటే గొప్పది. స్మరః అంటే స్మరణం లేదా స్మృతి లేదా జ్ఞాపకశక్తి. ఆకాశాన్ని, జ్ఞాపకశక్తిని ఎలా కలుపుతాము? అదృష్టవశాత్తూ, శంకరాచార్యులు అది ఎలా సాధ్యమో చెపుతున్నారు. ముందు ఖండంలో ఆకాశం గొప్పతనం గురించి వివరిస్తూ, గురువు ఏమన్నాడు? ఆకాశంలోనే అన్నీ ఉన్నాయి. ఆకాశంలోనే వ్యవహారాలు నడుస్తున్నాయి అన్నాడు. అంటే ఆకాశం అన్నింటినీ

తనలో ఇముడ్చుకుని, వ్యవహారాలకు ఆధారం అవుతోంది. అవునా? శంకరాచార్యులు ఏమంటున్నారంటే, వ్యవహారాలు నడపటానికి ముందు అక్కడ ఒక వస్తువు ఉందని గుర్తించి, దాని విలువ ఏమిటో గుర్తించాలి అని. అందువల్ల ఇప్పుడు నీటిని చూసినా, మనకు అది నీరు అని తెలియాలి. తర్వాత నీరు మన దాహాన్ని తీరుస్తుందని గుర్తు రావాలి. మనసుకు ఆ సామర్థ్యం ఉంటేనే, దాని విలువ గ్రహించి, దానితో వ్యవహారం నడుపగలుగుతాము.

ఎవరికైనా అమ్నీషియా అనే జబ్బు వస్తే భార్యా, పిల్లలను కూడా గుర్తుపట్టలేరు. 'ఎవరండీ మీరు?' అని స్వంత కొడుకునే అడుగుతారు. లేదా టిఫిన్ తిని కూడా, తనకెవరూ పెట్టలేదని గొడవపెడతారు. ఒక్కోసారి మాట కూడా రాదు. ఎదుటివారు చెప్పిన పదాలు అర్థం కావు. ఇందులోనే చూశాం కదా మనసు నుంచి వాక్కు, వాక్కు నుంచి పదాలు వస్తాయని. అవేవీ రావన్నమాట ఇక్కడ.

అందువల్ల,స్మరణం అంటే జ్ఞాపకశక్తి ఉంటేనే వ్యవహారం నడుపగలుగుతారు. అందువల్ల ప్రపంచం ఉనికి కూడా స్మరణం వల్లే ఉంది. స్మరణం లేకపోతే, ప్రపంచం ఉన్నా, అసలు లేనట్టే!

స్మరణం అనే ప్రాథమిక శక్తి వల్లే మనం ఒక వస్తువును 'ఇదీ' అని గుర్తుంచగలుగుతాము. గుర్తించినదాన్ని మనస్సులో నిక్షిప్తం చేస్తాము. ఉదాహరణకు మనం ఒక పెన్నును చూస్తే, అది పెన్ను అనీ, దానితో రాయవచ్చు అనీ అంతకుముందు మనలో నిక్షిప్తమై ఉన్న జ్ఞానం సహాయంతో దాన్ని వాడతాము అంటే దానితో రాస్తాము. పెన్నును చూసిన కన్ను ప్రత్యక్షప్రమాణం. అది దాని రూపురేఖలు చూపిస్తుంది కాని ఇది పెన్ను, దీనితో రాయవచ్చు అని చెప్పదు. అది మనస్సు చెప్పాలి.

అందుకే చూడండి, ఇదే పెన్నును మొదటిసారిగా ఒక చిన్న పాపాయికిచ్చి చూడండి! ఏం చేస్తుంది ఆ పాపాయి? టక్కున నోట్లో పెట్టుకుంటుంది! దానికి అది రాసే వస్తువు అని తెలియదు. పెన్నే కాదు ఏది ఇచ్చినా నోట్లో పెట్టుకుంటుంది. ఎందుకంటే అప్పటివరకూ తినటం ఒకటే తెలుసు. అదే మీకు ఛాందోగ్యోపనిషత్తు పుస్తకం, నోట్‌బుక్, పెన్ను ఇస్తే ఏవేవి ఎలా వాడాలో తెలుసు. ఎలా వాడాలి అని ఆలోచిస్తారా? లేదు. దాని

ఉపయోగం ఏమిటో తెలుసు. అలాగే భాష కూడా తెలుసు. అదే కొత్తచోటికి వెళితే, భాష రాకపోతే అవస్థపడతారా లేదా? అలాగే అమ్నీషియా వచ్చి ఏమీ గుర్తుండకపోతే, అలాగే అవస్థపడతాము. అందుకే ప్రపంచం ఉన్నా, లేనట్టే!

ఒక వస్తువు యొక్క ఉపయోగం, మన జ్ఞాపకశక్తి మీద ఆధారపడి ఉంది. ఉపయోగం తెలియకపోతే ఆ వస్తువు ఉండీ లేనట్టే కదా!

**కార్య అభావాత్, తత్వం ఏవ నాస్తి**

తత్త్వం అంటే దాని ఉనికి. అందువల్ల ఉనికి, ఉపయోగం మీద, ఉపయోగం మనం దాన్ని గుర్తించి వాడటం మీద, ఆ గుర్తించటం మనసు మీద ఆధారపడి ఉంది. అందువల్ల జ్ఞాపకశక్తే ప్రపంచానికి ఉనికినిస్తుంది. ఎంత అందమైన భావన? ఇదంతా ఉపనిషత్తు విడమర్చి చెప్పదు. ఉపనిషత్తు కేవలం ఆకాశం కన్నా స్మరణం గొప్పది అని చెప్పేసి ముందుకు సాగుతుంది. దానికి తర్కం ఈ విధంగా శంకరాచార్యులు ఇస్తారు. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**తస్మాత్–** స్మరణమే అన్ని వ్యవహారాలకూ మూల కారణం కనుక;

**యద్యపి బహవః ఆసీరన్ –** చాలా మంది ఒకచోట కలిసి కూర్చున్నా కూడా;

**న స్మరన్తః –** వాళ్ళలో ఎవరికి కూడా స్మరణ లేదు. వాళ్లెవరో వాళ్ళకే తెలియదు. భాష కూడా మర్చిపోయారు అనుకుందాం. అప్పుడు

**నైవ తే కంచన శృణుయుః –** వాళ్ళు ఏ శబ్దాన్ని కూడా వినరు.

**న మన్వీరన్ –** అలాగే దేనినీ సంకల్పించరు. సంకల్పించాల్సిన దానిని స్మరిస్తేనే సంకల్పించ గలరు.స్మరణము లేదు కనుక సంకల్పించరు.

**న విజానీరన్ –** అలాగే దేనినీ తెలుసుకోలేరు.

ఇప్పుడు దీనికి భిన్నంగా స్మరణం ఉంటే ఏం చేస్తారో, అవే పదాలతో చెపుతున్నది ఉపనిషత్తు.

**యదా వావ తే స్మరేయుః–** ఎప్పుడైతే వారు ఖచ్చితంగా స్మరిస్తారో,

**అథ శృణుయురథ మన్వీరన్నథ విజానీరన్–** అప్పుడు వింటారు, తర్వాత సంకల్పిస్తారు, తర్వాత తెలుసుకుంటారు.

**స్మరేణ వై పుత్రాన్ విజానాతి–** స్మరణం చేతనే వీళ్లు నా పుత్రులు అని తెలుసుకుంటారు.

**స్మరేణ పశూన్ –** స్మరణం చేత పశువులను (ఇవినావి అని) తెలుసుకుంటారు.

**స్మరముపాస్స్వేతి–** అందుకని స్మరణ బ్రహ్మ ఉపాసన చేయి. దీన్ని తత్త్వబోధ పరిభాషలో చిత్తం అంటారు.

**మంత్రం-2 ఫలం –** స్మరణం యొక్క వ్యాప్తి ఎంతమేరకు ఉంటుందో, అంతమేరకు అతనికి యథేచ్ఛగా గతి వుంటుంది. ఇతనికి అంటే స్మరణ బ్రహ్మ ఉపాసన చేసిన వ్యక్తికి.

అయినా నారదుడు తృప్తి చెందడు. ఇంతకన్నా గొప్పది ఉందా అని అడిగి, దాని గురించి చెప్పమంటాడు. పదమూడో ఉపాసన ముగిసింది.

**13. స్మరణ బ్రహ్మ ఉపాసన**

**చతుర్దశః ఖణ్డః (14)**

**ఆశా వావ స్మరాద్భూయస్యాశయేద్ధో వై స్మరో మన్త్రానధీతే కర్మాణి కురుతే పుత్రాగ్ంశ్చ పశూగ్ంశ్చేచ్ఛత ఇమం చ లోకామముం చేచ్ఛత ఆశాముపాస్స్వేతి ॥1॥ స య ఆశాం బ్రహ్మేత్యుపాస్తే ఆశయాఽస్య సర్వే కామాస్సమృధ్యన్త్యమోఘా హాస్యాశిషో భవన్తి యావదాశాయా గతం తత్రాస్య యథాకామచారో భవతి య ఆశాం బ్రహ్మేత్యుపాస్తేఽస్తి భగవ ఆశాయభూయ ఇత్యాశాయా వావ భూయోఽస్తీతి తన్మే భగవాన్ బ్రవీత్వితి॥2॥**

**14. ఆశ బ్రహ్మ ఉపాసన**

**మంత్రం-1 ఆశా వావ స్మరాద్భూయసీ –** ఆశ స్మరణం కంటే నిశ్చయంగా గొప్పది. ఆశ అంటే కామం, తృష్ణ, ఆకాంక్ష. ఆశ స్మరణం కంటే ఎందుకు గొప్పది? ఉపనిషత్తు చెప్పదు, శంకరాచార్యుల భాష్యం లేకపోతే ఉపనిషత్తులను అర్థం చేసుకోవటం కష్టం అని అందుకే అంటారు. ఎందుకంటే, అంతఃకరణంలో ఉండే ఆశ వల్లే మనిషి తను స్మరించదగిన దానిని స్మరిస్తాడు.

ఉదాహరణకు ఒక గంటసేపు ఉపనిషత్తు క్లాసు విన్న నలురురు శిష్యులను ఇవాళ ఏం చెప్పారు అంటే ఎవరికి వారు ఆ గంట క్లాసులో

వాళ్ళకు బాగా నచ్చినదానినే తిరిగి చెప్తారు. అందరూ ఒకటే అంశం చెప్పరు. అలాగే రోడ్డు మీద వెళ్తున్నప్పుడు, ఎవరికేది ఇష్టముంటే దాన్నే గమనిస్తారు. ఒకరు హోటలు చూస్తే, ఇంకోకరు సూపర్‌బజార్ చూస్తారు. అంతేకాదు మీకు నచ్చినదాన్నే, లేదా మీకు దేనిమీద ఆకాంక్ష ఉంటే దాన్నే గుర్తుంచుకుంటారు.

అందువల్ల ఆశ మీదే స్మరణం ఆధారపడి ఉంది. అందువల్ల ఆశ కారణం, స్మరణం కార్యం.

**ఆశయేద్ధో వై స్మరన్ –** ఆశతో వర్థిల్లజేయబడిన స్మరణమే.

**మంత్రానధీతే –** మంత్రాలను అధ్యయనం చేస్తుంది.

**కర్మాణి కురుతే–** కర్మలను చేస్తుంది.

**పుత్రాగ్ంశ్చ పశూగ్ం శ్చేచ్ఛతే –** పుత్రులను, పశువులను కూడా కోరుకుంటుంది.

**ఇమంచ లోకమముంచేచ్ఛతే–** ఈ లోకాన్ని, పరలోకాన్ని కూడా కోరుకుంటుంది.

**ఆశయేద్ధో–** ఇద్ధః– ఆశతో వర్థిల్లచేయటం.

జ్ఞాపకశక్తి అన్ని రంగాల్లో సమానంగా ఉండదు. దేని మీద ఆశ ఉంటుందో అందులోనే ఉంటుంది. ఉదాహరణకు విద్యార్థులకు సినిమా పాటలు గుర్తున్నంత బాగా పాఠ్యపుస్తకంలోని పాఠాలు గుర్తుండవు. ఇక్కడ కూడా ఒక గొలుసు కనబడుతోంది. చూశారా? ఆశ వల్ల స్మరణం కలుగుతుంది. స్మరణం వల్ల కొన్ని కర్మలు చేయగలుగుతున్నాడు. కర్మలు చేయటం వల్ల కొన్ని లక్ష్యాలను నెరవేర్చుకోగలుగుతున్నాడు. వెనక్కి వెళితే ఇదంతా ఆశ వల్ల. అందుకని ఇచ్ఛాశక్తి మీద ఉపాసన చేయాలి.

**ఆశాముపాస్స్వేతి –** ఆశ బ్రహ్మ ఉపాసన చేయి.

**మంత్రం–2** శాస్త్రంలో సాధారణంగా కామాన్ని మోక్షానికి శత్రువుగా అభివర్ణిస్తారు. కామాన్ని విలన్‌గా చూస్తారు.

**కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః।**
**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్॥ – గీత 3–37**

రజోగుణం నుంచి ఉత్పన్నమయ్యే కామమే అన్ని అనర్థాలకూ మూల కారణం.

**ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్। - గీత 2-55**

ఓ అర్జునా! మనస్సులోని కోరికలన్నీ పూర్తిగా తొలగిపోయిన వానిని స్థితప్రజ్ఞుడంటారు. అందుకని కామాన్ని ఒక రోగంగా, ఒక శత్రువుగా, ఒక సంసారబీజంగా, ఒక అవిద్యా కామ కర్మగా చూస్తారు.

కాని కామానికి ప్రతికూల దోషమే కాదు, ముఖ్యమైన సానుకూల లాభం కూడా ఉంది. అని గుర్తుంచుకోవాలి. కామాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. దానికి ఇంకో పేరు ఇచ్ఛాశక్తి. ఇది మనుష్యులకు మాత్రమే ఇచ్చిన అపురూపమైన వరం. ఇచ్ఛాశక్తి ఉంటేనే జ్ఞానశక్తి, క్రియాశక్తి పనిచేస్తాయి. ఏదైనా నేర్చుకోవాలన్న తపన లేకపోతే, మెదడు ఉండి ఏమిటి లాభం?

లౌకికవిద్య నేర్చుకోవాలన్నా, ఆధ్యాత్మ విద్య నేర్చుకోవాలన్నా కూడా ఇచ్ఛాశక్తి ఉండాలి.

**అథాతో బ్రహ్మజిజ్ఞాసా**

బ్రహ్మసూత్రాల్లో మొట్టమొదటి సూత్రం ఇది. ఇచ్ఛాశక్తి లేకపోతే జ్ఞానశక్తి, క్రియాశక్తి పనిచేయవు. శాస్త్రాలకు, వాటిలో చెప్పిన పురుషార్థాలకు విలువ ఉండదు. ధర్మార్థకామ మోక్షాల వెంట పరుగు లుండవు. అందుకని గుర్తుంచుకోండి. ఇచ్ఛ. దానంతట అది ఏమీ హాని చేయదు. కాని అది అవిద్యతో చేతులు కలిపితే, బంధకత్వం అయిపోతుంది. కేవలం ఇచ్ఛ ఉంటే దీవెన అవుతుంది. పంచదశలో విద్యారణ్యగారు అంటారు. అవిద్యతో అశుద్ధం కాని కోరికలు కోట్లు ఉండనీ, అవి సమాజానికి మేలు చేస్తాయి. శంకరాచార్యులు అన్ని భాష్యాలు ఎందుకు రాశారు? లోక సంరక్షణ కోసం, అది కూడా కోరికే. అందుకే ఆశ మీద ఉపాసన చాలా ముఖ్యమైన ఉపాసన.

ఆశను మనకున్న పవిత్రమైన, ఉన్నతమైన, ప్రత్యేకమైన కానుకగా చూస్తాము. మనకు ఇచ్ఛాశక్తిని ఇచ్చిన భగవంతునికి ఋణపడి ఉండాలి. అందుకని కామబ్రహ్మ ఉపాసన చేయాలి.

**అస్య సర్వే కామాస్సమృధ్యన్తి** -ఈ ఉపాసకుడు ఆశను ఉపాసించటం వల్ల, అతనికి అన్ని కోర్కెలు తీరుతాయి.

**మంత్రం 2 - అమోఘా హాస్యాశిషో భవన్తి-** అతని కోర్కెలన్నీ

అమోఘాలవుతాయి. అమోఘం అంటే ఆటంకాలు కలుగకుండా, అవి తీరుతాయి. ఇది ఇహలోకఫలం. పరలోకఫలం ఇంతకు ముందులాగా.

ఆశ యొక్క వ్యాప్తి ఎంతమేరకు ఉంటుందో, అంతమేరకు అతనికి యథేచ్ఛగా గతి ఉంటుంది. ఇతనికి అంటే ఆశబ్రహ్మ ఉపాసన చేసిన వ్యక్తికి.

అయినా నారదుడు తృప్తి చెందడు. ఇంతకన్నా గొప్పది ఉందా అని అడిగి, దాని గురించి చెప్పమంటాడు.

ఇక్కడితో పదునాల్గో ఉపాసన ముగిసింది.

**14. ఆశ బ్రహ్మ ఉపాసన**

**పంచదశః ఖణ్డః (15)**

**ప్రాణో వా ఆశాయా భూయాన్ యథా వా అరా నాభౌ సమర్పితా ఏవమస్మిన్ ప్రాణే సర్వగ్ం సమర్పితం। ప్రాణః ప్రాణేన యాతి ప్రాణః ప్రాణం దదాతి ప్రాణాయ దదాతి। ప్రాణో హ పితా ప్రాణో మాతా ప్రాణో భ్రాతా ప్రాణః స్వసా ప్రాణో ఆచార్యః ప్రాణో బ్రాహ్మణః ॥1॥ స యది పితరం వా మాతరం వా భ్రాతరం వా స్వసారం వాఽఽచార్యం వా బ్రాహ్మణం వా కించిద్భృశమివ ప్రత్యాహ ధిక్త్వాఽస్త్విత్యేవైనమాహుః పితృహా వై త్వమసి మాతృహా వై త్వమసి భ్రాతృహా వై త్వమసి స్వసృహా వై త్వమస్యాచార్యహా వై త్వమసి బ్రాహ్మణహా వై త్వమసీతి ॥2॥ అథ యద్యప్యేనానుత్క్రాన్తప్రాణాఞ్ఛూలేన స మాసం వ్యతిసన్దహేన్నైవైనంబ్రూయుః పితృహాఽసీతి న భ్రాతృహాఽసీతి న స్వసృహాఽసీతి నాచార్యహాఽసీతి న బ్రాహ్మణహాఽసీతి ॥3॥ ప్రాణోహ్యేవైతాని సర్వాణి భవతి స వా ఏష ఏవం పశ్యన్నేవం మన్వాన ఏవం విజానన్నతివాదీ భవతి తం చేద్బ్రూయురతిద్యసీత్యతివాద్యస్మీతి బ్రూయాన్నాపహ్నువీత ॥4॥**

**15. ప్రాణ బ్రహ్మ ఉపాసన**

**మంత్రం-1 ప్రాణో వా ఆశాయా భూయాన్ -** ప్రాణం నిశ్చయంగా ఆశ కంటే గొప్పది. బ్రహ్మ ఉపాసనకు ముందు వచ్చే చివరి ఉపాసన ఇది. సమష్టిస్థాయిలో హిరణ్యగర్భ బ్రహ్మ ఉపాసన, వ్యష్టి స్థాయిలో ప్రాణబ్రహ్మ ఉపాసన. వ్యష్టిగా ప్రాణం జీవశక్తి అయితే, సమష్టిపరంగా హిరణ్యగర్భ

ప్రాణశక్తి. అందుకే ఆశకన్నా గొప్పది. నిజానికి ఒక వ్యక్తి జీవించి ఉంటేనే కదా, ఆశ ఉండే అవకాశం ఉండేది.

బ్రహ్మసూత్రాల్లో అన్ని అంగాల్లోకి ఏది గొప్పదన్న చర్చ వస్తే, వ్యాసాచార్యుల వారు ప్రాణశక్తే ఇంద్రియాలకన్నా, కర్మేంద్రియాలకన్నా, అంతఃకరణాల కన్నా గొప్పదని నిరూపించారు. ప్రాణం వల్లే వాటన్నింటికీ కూడా జీవం ఉంది.

**యథా వా అరా నాభౌ సమర్పితా –** ఎలాగైతే ఒక చక్రం యొక్క ఇరుసుకు ఆకులు కలుపబడి ఉన్నాయో;

**ఏవమస్మిన్ ప్రాణే సర్వగ్ం సమర్పితం–** అదే విధంగా ఈ ప్రాణం మీదే సర్వం ఆధారపడి ఉంది.

ఇదే భావన వేరే ఉపనిషత్తులలో కూడా చూస్తాము.

**అరా ఇవ రథనాభౌ సంహతా యత్ర నాడ్యః**

**స ఏషో౽న్తశ్చరతే బహుధా జాయమానః। ముండక 2-2-6**

ఇరుసుతో ఆకులు కలిసిఉంటేనే బయట చక్రం తిరగగలదు. ఈశ్వరుని నుంచి హిరణ్యగర్భ, హిరణ్యగర్భ నుంచి విరాట్ ఉద్భవించారని చూశాము. అందువల్ల సూక్ష్మప్రపంచ అధిష్ఠానం అయిన హిరణ్యగర్భ స్థూల ప్రపంచానికి కారణం. అందుకని మొత్తం ప్రపంచం నామరూపాలు తప్ప దానికి విడిగా ఉనికి లేదు. సర్వం ప్రాణమయం జగత్తు. ఎందుకు? కారణత్వాత్. ప్రాణం దాని శక్తి వల్లే పనిచేయగలదు. కాని తక్కినవి ప్రాణం మీద ఆధారపడి ఉన్నాయి.

వ్యష్టిపరంగా చూడండి! సుషుప్తిలో ఏమవుతుంది?

జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి,అహంకారం, చిత్తం అన్నీ లయమవుతాయి. కాని ప్రాణశక్తి మాత్రం పనిచేస్తూనే ఉంటుంది. ఏమిటి నిదర్శనం? ప్రాణం ఆ పని చేయకపోతే, మనం మరణించినట్టు లెక్క. మర్నాడు పొద్దున్నే లేవలేము.

ప్రాణం కారణం, తక్కినవన్నీ కార్యం.

ఛాందోగ్యంలోనే అంతకుముందు అధ్యాయంలో ఒక కథ చూశాము. ఇలాగే ఏ అంగం గొప్పది అన్న చర్చ వస్తే, బ్రహ్మదేవుడు ఒక్కొక్క అంగాన్నీ ఒక ఏడాదిపాటు బయటకు వెళ్ళి చూడమన్నాడు. తక్కిన అన్ని అంగాలూ

వెళ్ళినా ఏమీ కాలేదు కానీ ప్రాణం వెళ్ళటానికి లేస్తేనే, తక్కిన అంగాలు నీరసించిపోయాయి. అవన్నీ ప్రాణాన్ని వెళ్ళవద్దని బ్రతిమాలుకుని, వాటికున్న శక్తి కూడా ప్రాణం వల్లే వస్తోందని గ్రహించి తమ శక్తిని, పేరుని కూడా ప్రాణానికే ధారపోశాయి. అందుకని ఇంద్రియాలను ప్రాణాలు అని, పంచప్రాణాలను ముఖ్యప్రాణాలనీ అంటారు. ఇదే కాదు, ఇంకా కొన్ని ప్రాణ ఉపాసనలు కూడా ఈ ఉపనిషత్తులోనే ఉన్నాయి. బృహదారణ్యకం, ప్రశ్నోపనిషత్తులో కూడా ప్రాణం గురించి కథలు వస్తాయి.

**ప్రాణః ప్రాణేన యాతి –** ప్రాణం తనంత తానుగా, స్వతంత్రంగా పనిచేస్తుంది.

**ప్రాణః ప్రాణం దదాతి ప్రాణాయ దదాతి–** ప్రాణమే ప్రాణాన్ని ఇస్తున్నది. ప్రాణమే తీసుకుంటుంది.

**ప్రాణోహ పితా ప్రాణో మాతా ప్రాణో భ్రాతా ప్రాణఃస్వసా ప్రాణో ఆచార్యః ప్రాణో బ్రాహ్మణః –** ప్రాణం తండ్రి; ప్రాణం తల్లి, ప్రాణం సోదరుడు, ప్రాణం సోదరి, ప్రాణం ఆచార్యుడు, ప్రాణం బ్రాహ్మణుడు.

**యావత్ పవనో నివసతి దేహే తావత్ పృచ్ఛతి కుశలం గేహే**
**గతవతి వాయే దేహ అపాయే భార్యా బిభయతి తస్మిన్ కాయే**

శరీరంలో ప్రాణం ఉన్నంతసేపే, ఆ శరీరానికి విలువ. ఎప్పుడైతే ప్రాణం పోతుందో, అప్పుడే భార్య కూడా శరీరాన్ని ఎంత తొందరగా పంపించాలా అని చూస్తుంది.

అన్వయ వ్యతిరేక న్యాయం ప్రయోగించి చూడండి. ప్రాణం ఉంటే, జీవిని ప్రేమిస్తున్నాము. ప్రాణం పోతే జీవిని కాయం అంటున్నాము. అంటే మనం ప్రేమించేది దేన్ని? ప్రాణాన్ని. ప్రాణం ఉన్నంతవరకే అమ్మా, నాన్నా, గురువు లాంటి హోదాల్లో మన్ననలు పొందేది.

ఛాందోగ్యంలోనే ఇంకో సందర్భంలో ప్రాణం ఒక్కటే శుద్ధమనీ, తక్కిన అన్ని అంగాలు అశుద్ధంతో కలిసి ఉంటాయనీ వస్తుంది. ఒకతను మంచివాడనో, దొంగ అనో ముద్ర అతని ఇంద్రియాల మీద ఆధారపడి ఉంటుంది కాని, ప్రాణం మీద కాదు. ఇద్దరిలోనూ ప్రాణం సమానంగానే ఉంటుంది. అందుకే ప్రాణాన్ని **'జ్యేష్టంచ శ్రేష్ఠంచ'** అంది. అందువల్ల ప్రాణం శుద్ధం. అంతేకాదు, ప్రాణమే సూక్ష్మశరీరాన్ని ఒక స్థూల శరీరంలో ఉంచుతుంది. మరణం అప్పుడు ఉదానప్రాణం సూక్ష్మశరీరాన్ని తీసుకు

వెళ్తుంది. మనం జీవించి ఉండగా, ఉదానం శక్తివంతంగా ఉండదు. తక్కిన ప్రాణాలు పనిచేస్తాయి. కాని మరణించేటప్పుడు తక్కిన ప్రాణాలు శక్తి కోల్పోతాయి. ఉదానం శక్తి పుంజుకుంటుంది.

**ఊర్ధ్వం నయతి ఇతి ఉదానః**

సూక్ష్మశరీరాన్ని ఉదానప్రాణం పైకి తీసుకుపోతుంది. అందుకే మరణించినప్పుడు సూక్ష్మశరీరం పోయింది అనము. ప్రాణం పోయింది అంటాము. అంటే సూక్ష్మశరీరం ప్రాణం ఉంటే ఉంటుంది, లేకపోతే లేదు. అందువల్ల సూక్ష్మశరీరం ప్రాణం ఆధీనంలో ఉంది.

అంతేకాదు, ఆత్మ ఉనికి కూడా ప్రాణం వల్లే తెలుస్తుంది. ఎలా? ప్రాణం వల్లే సూక్ష్మశరీరం స్థూలశరీరంలో ఉంటుందని చూశాము కదా! సూక్ష్మశరీరంలోని మనస్సు వల్లే సర్వవ్యాపకమైన చైతన్యం ప్రతిబింబించబడి, చిదాభాసగా ప్రకటితమవుతుంది. అందువల్ల సూక్ష్మశరీరం, దానిలోని మనస్సు వెళ్ళిపోతే దానితోపాటు చిదాభాస వెళ్ళిపోతే సర్వవ్యాపకమైన ఆత్మను ప్రతిబింబించే మాధ్యమం లేకపోవటం వల్ల, అది ప్రకటితమవదు. ఇవన్నీ దేనివల్ల వెళుతున్నాయి? ప్రాణం వల్ల!

ఏది ఉంటే నేను ఉన్నట్లు ప్రకటితమవుతాను అనుకుని ప్రాణం వల్ల అని తెలుసుకుని ఆత్మ మొదట ప్రాణాన్ని సృష్టించిందట – ప్రశ్న

అందుకని ఆత్మ ప్రతినిధి ప్రాణం అనవచ్చు. అందుకని ప్రాణం లేకపోతే, ఆత్మ గురించి మాట్లాడలేము. అందుకే ప్రాణాన్ని తరచు ఆత్మతో సమానంగా వ్యవహరిస్తారు. జీవాత్మ వెళ్లిపోయింది అంటే జీవాత్మ ఎవరు? ప్రాణమే! అందుకని ప్రాణాన్ని బ్రహ్మ ఉపాసనకు అత్యంత శక్తివంతమైన ప్రతీకగా అభివర్ణిస్తాడు సనత్కుమారుడు. దానికి కొన్ని ఉదాహరణలు కూడా ఇస్తాడు. అన్వయ వ్యతిరేక న్యాయం ఉపయోగిస్తే, ప్రాణం ఉంటేనే ఒక వ్యక్తిని అందరూ గౌరవిస్తారు. ప్రాణం పోతే ఆ వ్యక్తి శరీరాన్ని అశుద్ధంగా పరిగణిస్తారు.

**ప్రాణసత్వే ఆదరః ప్రాణ అభావే ఆధారాభావః.**

రెండో మంత్రంలో అన్వయ వ్యాప్తి వస్తే మూడో మంత్రంలో వ్యతిరేకం వస్తుంది.

**మంత్రం-2** ప్రాణ స్తుతి కొనసాగుతున్నది. మనం మన తల్లిదండ్రులను కాని, తక్కినవాళ్ళను కాని గౌరవిస్తున్నామంటే, ఆ గౌరవం నిజంగా ప్రాణానికే వెళ్తుంది. అలాగే ఎవరినన్నా అగౌరవపరిస్తే, ఆ అగౌరవం ప్రాణతత్త్వానికి చూపినట్టవుతుంది. ప్రాణతత్త్వాన్ని అగౌరవపరిస్తే, వాళ్ళను చంపినంత నేరమవుతుంది.

**స యది పితరం వా మాతరం వా భ్రాతరం వా స్వసారం వాఽఽచార్యం వా బ్రాహ్మణం వా** – ఎవరైతే తండ్రిని కాని, తల్లిని కాని, అన్నను కాని, చెల్లిని కాని, ఆచార్యుని కాని, బ్రాహ్మణుని కాని –

**కించిద్భృశమివ ప్రత్యాహ** – ఏ కొంచెమైనా తగని మాటలు మాట్లాడితే;

**ధిక్త్వాఽస్త్విత్యేవైనమాహుః** – అతనిని ఉద్దేశించి పెద్దలు ఖచ్చితంగా ఇలా అంటారు. సిగ్గుచేటు! అలాంటి చెడు మాటలు మాట్లాడుతున్నావు. అలాంటి మాటలతో నువ్వు వాళ్ళను హత్య చేసిన వాడవు అవుతున్నావు. అది హత్య చేసినంత నేరము అంటారు. ఎవరిని? మళ్ళీ ఆ పట్టిక వస్తుంది. తల్లి దండ్రులను, సోదర సోదరీమణులను, గురువును, బ్రాహ్మణుడిని.

ఇక్కడ ఉపనిషత్తు అతిశయోక్తి వాడుతున్నది. ఎందుకు? ప్రాణతత్త్వాన్ని స్తుతించటానికి. అందుకని ఎవరైనా తప్పుగా మాట్లాడితే కాదు, మాట్లాడినట్టుగా అనిపిస్తేనే, పెద్దలు తిడతారు. వాళ్ళను చంపినట్టుగా చేస్తున్నావు అంటున్నారు.

**మంత్రం-3** ఇప్పుడు వ్యతిరేకం.

**అథ** – దానికి భిన్నంగా.

**యద్యప్యేనానుత్క్రాన్త ప్రాణాన్**– పైన చెప్పిన ఆరుగురిలో– తల్లి, తండ్రి, అన్న, చెల్లి, గురువు, బ్రాహ్మణుడు – ఎవరిలోనన్నా ప్రాణం పోతే, శరీరాన్ని కూడా గౌరవంగా చూడరు. అంతకు ముందు వాళ్ళను శారీరకంగా హింసపెట్టటం కాదు, కేవలం కొన్ని మాటలు అగౌరవంగా మాట్లాడితేనే చంపినంత నేరం కింద చూస్తారంతా. ఇప్పుడు శరీరాన్ని అగౌరవంగా చూసినా, ఎవరూ తప్పు పట్టుకోరు. వాళ్ళల్లో ఎవరైనా బ్రతికి ఉండగా, ఎండవేడిమి తట్టుకోలేరని ఏసి వేస్తాము. వేయటం మర్చిపోతే సంజాయిషీ ఇస్తాము. అదే వ్యక్తిని మరణించాక అగ్నితో కాలుస్తాము. అంతిమ క్రియలు చేసేటప్పుడు చేసే పనులేవీ తప్పుగా తోచవు.

ఉపనిషత్తు ఒక అత్యంత దారుణమైన పరిస్థితిని ఊహిస్తున్నది. ఒకవేళ ఏ భూకంపంలోనో, సునామీలోనో అనేకమంది ఒక్కసారిగా మరణిస్తే ఆ శరీరాలను దగ్గరకు చేర్చటానికో, విడదీయటానికో శూలం వాడినా ఎవరూ ఏమీ అనరు.

**శూలేన సమాసం–** శూలంతో దగ్గరకు చేర్చి,

**వ్యతిసందహేత్ –**దేహాన్ని విడదీసి తగులబెడతారు.

**ఏవైనం బ్రూయుః పితృహాఽసీతి న భ్రాతృహాఽసీతి న స్వసృహాఽసీతి నాచార్యహాఽసీతి న బ్రాహ్మణహాఽసీతి –** అయినా కూడా ఇతనిని తండ్రిని, తల్లిని, అన్నని, చెల్లిని, గురువును, బ్రాహ్మణుడిని చంపినవాడివి అవుతున్నావు అని ఎవరూ అననే అనరు. అందువల్ల అసలు గౌరవం దేనికి? ప్రాణానికే వెళుతుంది.

**రాజా కుల వధూర్ విప్రామంత్రినాశ్చ పయోధరాః।**
**స్థానభ్రష్ట న శోభంతే దంతా కేశా నరా నఖాః।। – హితోపదేశం**

ప్రాణం పోయాక మాత్రమే కాదు, ప్రాణం ఉండగా కూడా మన శరీరంలోని కొన్ని అంశాలు వాటి స్థానంలో ఉన్నంతవరకే గౌరవం పొందుతాయి. రెండో పాదంలో చూడండి

**దంతాః–**పళ్ళు. శరీరంలో ఉన్నంతవరకే వాటికి విలువ. అవి ఊడితే, అశౌచం అయిపోతుంది. దాన్ని ముట్టుకుంటే స్నానం చేయాలి.

**నఖాః–** గోళ్ళు. అవి కూడా శరీరం మీద ఉన్నంతవరకూ వాటికి సేవలు చేస్తాము. అవి ఊడాక ధర్మశాస్త్రం ప్రకారం, వాటిని ముట్టుకుంటే స్నానం చేయాలి.

**కేశః–** కేశాలు. అవి ఉన్నంతవరకూ బోలెడు శ్రద్ధ తీసుకుంటాము.

**నరాః –** మనిషి. మనిషి పరిస్థితి కూడా అంతే. ఉద్యోగంలో ఉన్నంతవరకే అతనికి గౌరవం. అందుకే ఉద్యోగానంతరము చూడవలెనమ్మ ఆ అయ్య సౌభాగ్యముల్ అంటారు. అలాంటిది ప్రాణం పోతే ఎలా ఉంటుందో వేరే చెప్పాలా?

**మంత్రం–4** అందువల్ల, ఈ అన్వయ వ్యతిరేక వాదన వల్ల, ప్రాణమే అన్ని జీవాలకూ ఆధారం అని అర్థమైంది. ఆత్యంతిక ఆధారం కాదు. సాపేక్షిక ఆధారం. సమష్టిస్థాయిలో హిరణ్యగర్భ అని చూశాము. హిరణ్యగర్భే

సృష్టి,స్థితి, లయ కారణం. హిరణ్యగర్భను సూత్రాత్మ అని కూడా అంటారు. సూత్రం అంటే దారం. ఎలాగైతే ఒక దారం ముత్యాలన్నింటినీ కలిపి ఒక మాలగా నిలిపి ఉంచుతుందో అలాగే ఈ సూత్రాత్మ ఈ జగత్తుకు ఆధారం.

అందుకే ఆలయాలలో కూడా ఒక విగ్రహాన్ని తెచ్చి, దేవునిగా కొలిచే ముందు చేసే పూజను ప్రాణప్రతిష్ఠ అంటారు. ఆత్మప్రతిష్ఠ అనరు.

**ప్రాణో హ్యేవైతాని సర్వాణి భవతి–** సర్వ వ్యాపకమైన ప్రాణతత్త్వమే (తల్లి, తండ్రి ఇత్యాది) ప్రాణాల్లో ఉంది. అంతా సూత్రాత్మచేత కలపబడిన ఏక ప్రాణమే. అందుకే ఎవరైతే ఈ ప్రాణాన్ని అర్థం చేసుకుని, ప్రాణ ఉపాసన చేస్తారో, వాళ్ళు అత్యంత గొప్పవాళ్ళు. ఇప్పటివరకూ చూసిన నామబ్రహ్మ ఉపాసన, వాక్‌బ్రహ్మ ఉపాసన, మనోబ్రహ్మ ఉపాసన వగైరాలకన్నా ప్రాణబ్రహ్మ ఉపాసకుడు గొప్ప. ప్రాణజ్ఞాని, ప్రాణ ఉపాసకుడు, ప్రాణ వాది అత్యంత గొప్పవాడు.

**అతివాదీ భవతి–** ఇంతవరకూ చెప్పిన 14 ఉపాసకులకూ ఇవ్వని బిరుదు, ప్రాణ బ్రహ్మ ఉపాసకునికి ఇస్తుంది ఉపనిషత్తు. ఏమిటది? **అతివాది**. వాది అంటే మాట్లాడేవాడు; అతి అంటే గొప్ప. అతివాది అంటే గొప్పగా మాట్లాడేవాడు. ఎందుకు? అతను అన్నిటికన్నా గొప్పదైన ప్రాణం గురించి గొప్పగా మాట్లాడుతాడు కాబట్టి. అందువల్ల గొప్ప అనే విశేషణం అతనికి కాదు, అతను చెప్పే ప్రాణానికి చెందుతుంది.

**స వా ఏష ఏవం పశ్యన్ –** ఎవరైతే ఈ సత్యాన్ని దర్శనం చేస్తాడో అంటే తన శరీరంలో ఉన్న ప్రాణమే జగత్తంతా హిరణ్యగర్భ తత్త్వంగా ఉందని గ్రహిస్తాడో అతను అంటే ప్రాణం గొప్పతనం తెలిసినవాడు; ప్రాణం అంత గొప్పది కాబట్టే సూర్యనమస్కారాలు చేసేది. ప్రాణశక్తి సూర్యుని నుంచి వస్తుంది. అంతేకాదు, ఇప్పటి జీవనవిధానంలో సూర్యరశ్మి సోకకపోవటం వల్ల, చాలా మందిలో విటమిన్ – డి లోపం వచ్చి, అనారోగ్యం వస్తోంది. పశ్యన్ అంటే ఎవరైతే దర్శనం చేస్తాడో; ఎలా?

**ఏవం మన్వానః –** ప్రాణం గొప్పతనం గురించి బాగా మననం చేస్తాడు. ఇంచుమించు ప్రతి ఉపనిషత్తులోనూ ప్రాణం గురించి గొప్పగా వస్తుంది. ఇందులోనే అనేక ప్రాణ ఉపాసనలు వచ్చాయని చూశాము.

**ఏవం విజానన్ –** విజానన్ అంటే నిశ్చయ జ్ఞానం. నిశ్చయజ్ఞానం కలుగుతుంది.

**అతివాదీ భవతి–** అతన్ని అతివాది అంటారని చూశాము. అతన్ని ప్రాణం గురించి మాట్లాడనిస్తే, మాట్లాడుతూనే ఉంటాడు. అతీత ప్రాణవాది, అతివాది అంతేకాదు, ఎవరైనా ఈ ప్రాణ ఉపాసకునికి అతివాదీ బిరుదు ఇచ్చినా అతను అది అందుకోవటానికి సంకోచించనవసరం లేదు అంటుంది ఉపనిషత్తు.

**తం చేద్బ్రూయురతి వాద్యసీత్యతి –** అతనిని ఉద్దేశించి ఎవరైనా; **అతివాద అసి ఇతి–** నువ్వు అతివాదివి అవుతున్నావు అని అంటే;

**అతి వాద్యస్మీతి బ్రూయాన్నాపహ్నువీత – అతివాదీ అస్మి** అంటే అవును నేను అతివాదిని అవుతున్నాను; **ఇతి బ్రూయాత్ –** అని చెప్పాలి, **న అపహ్నువీత –** దాచిపెట్టకూడదు.

అతనికి ఆ బిరుదు సరియైనదే. అందుకని అతను వద్దనకూడదు. పైగా కాదంటే, ప్రాణానికి అగౌరవం చూపించినట్టవుతుంది. దీని సారాంశం, ప్రాణమే అత్యంత గొప్ప సత్యం.

దీనితో వరుసగా చెప్పుకొచ్చిన ఉపాసనలు ముగిశాయి. ప్రాణం చివరిది. ప్రాణాన్ని సాక్షాత్ ఆత్మగా పరిచయం చేసి, ఆత్మ లక్షణాలను ప్రాణానికి అన్వయించటం జరిగింది.

ఇక్కడితో ఉపాసనలు ముగిశాయి.

**15. ప్రాణబ్రహ్మ ఉపాసన లేదా హిరణ్యగర్భ బ్రహ్మ ఉపాసన.**

ప్రాణం అంటే సమష్టి ప్రపంచంలో హిరణ్యగర్భ లేదా సూత్రాత్మ అని చూశాము. అందుకని ప్రాణ బ్రహ్మ ఉపాసన అంటే హిరణ్యగర్భ బ్రహ్మ ఉపాసనగా తీసుకోవాలి. హిరణ్యగర్భకూ నిర్గుణ బ్రహ్మకూ చాలా అంశాల్లో పోలికలు ఉన్నాయి.

నిర్గుణ బ్రహ్మ సృష్టి, స్థితి,లయ కారణం అంటాము. హిరణ్యగర్భ కూడా విరాట్ ప్రపంచ సృష్టి, స్థితి లయ కారకుడు. అందుకే ప్రాణ ఉపాసనను ముగిస్తూ సనత్కుమారుడు ప్రాణో హ్యేవైతాని సర్వాణి భవతి అన్నాడు. అందువల్ల నారదుడు, ప్రాణమే ఆత్యంతిక కారణం అనుకున్నాడు.కాని అది సాపేక్షిక కారణం మాత్రమే. హిరణ్యగర్భ

మాయాసహిత ఈశ్వరుని నుంచి పుట్టాడు.

**బ్రహ్మాదేవానాం ప్రథమః సంబభూవ**
**విశ్వస్య కర్తా భువనస్య గోప్తా** **ముండక 1-1-1**

బ్రహ్మ అంటే హిరణ్యగర్భ.

నారదుడు ప్రాణమే ఆత్మ అని పొరబడటానికి ఇంకో కారణం కూడా ఉంది. ప్రాణం గురించి మాట్లాడే వ్యక్తిని **అతివాదీ- సర్వ అతీత ప్రాణవాదీ-** అంది. అందుకని అదే ఆత్మ అనుకున్నాడు.

నారదుడు కూడ సంతోషించాడు. దీనితో ఆత్మబోధ అయిపో యిందనుకున్నాడు. ఆత్మ అంటే ప్రాణం అనుకున్నాడు. ప్రాణం పోతే, ఆత్మ పోతుంది! నారదుడు తృప్తి చెందాడని ఎలా తెలుసు? మిగతా ఉపాసనలు చెప్పినప్పుడు దానికన్నా గొప్పది ఉందా అని అడిగి, అది ఉందని సనత్కుమారుడు అనగానే అయితే అది నాకు చెప్పు అంటూ వచ్చాడు. ఇక్కడ ఇంక ఆ ప్రశ్న రాలేదు. కాని నారదుడు అడగకపోయినా, సనత్కుమారుడు ఇంకా చెప్పటానికి సిద్ధంగా ఉన్నాడు.

దీన్ని బట్టి ఒక విషయం అర్థమవుతున్నది. శిష్యుడు గనుక అర్హత ఉన్న శిష్యుడైతే, అతనికి ప్రశ్న ఎలా అడగాలో తెలియకపోయినా, సరియైన ప్రశ్న అడగకపోయినా, గురువు అతనికి బోధ చేయాలి. మామూలు నియమం శిష్యుడు అడగందే, బోధ చేయకూడదు. కాని అసాధారణ పరిస్థితుల్లో శిష్యుడు అడుగకపోయినా, అతనికి అర్హత ఉంటే, గురువు తనంతట తాను చెప్పితీరాలి. అందుకని సనత్కుమారుడు తనంత తాను చెప్పటానికి సిద్ధపడతాడు.

ఆ మాటకొస్తే భగవద్గీతలో కూడా అర్జునుడు నాకు ఆత్మ విద్య చెప్పు లేదా బ్రహ్మవిద్య చెప్పు అని శ్రీకృష్ణభగవానుని కోరలేదు.

**న హి ప్రపశ్యామి మమాపనుద్యాత్**
**యచ్ఛోకముచ్ఛోషణమింద్రియాణామ్**
**అవాప్యభూమావసపత్నమృద్ధం**
**రాజ్యం సురాణామపి చాధిపత్యమ్** **గీత 2-8**

'ఈ శోకం నన్ను దహించి వేస్తున్నది. ఈ శోకం దాటే ఉపాయం చెప్పు' అన్నాడు. **తరతి శోకమాత్మవిత్** అని ఈ ఉపనిషత్తులో ఈ అధ్యాయంలోనే చూశాము. అందుకే శ్రీకృష్ణభగవానుడు కేవలం ధర్మశాస్త్రం

చెప్పి ఊరుకోకుండా, బ్రహ్మ విద్య తనంతట తానుగా చెప్పాడు. అలాగే సనత్కుమారుడు కూడా తనంతట తానుగా చెప్పటానికి పూనుకున్నాడు.

**షోడశః ఖణ్డః (16)**

**ఏష తు వా అతివదతి యస్సత్యేనాతివదతి సోఽహం భగవః సత్యేనాతివదానీతి సత్యం త్వేవ విజిజ్ఞాసితవ్యమితి సత్యం భగవో విజిజ్ఞాస ఇతి॥ 1॥**

**మంత్రం-1** ఓ నారదా ఇది విను.

**ఏషతు వా అతివదతి-** తు అంటే కాని లేదా నిజం చెప్పాలంటే. అందువల్ల, నిజం చెప్పాలంటే, అతివాది అని ఎవరిని అంటారంటే,

**యస్సత్యేనాతివదతి-** ఎవరైతే జగత్కారణం బ్రహ్మ, సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ గురించి చెప్తారో అతనినే అసలైన అతివాది అంటారు. అంతకుముందు అతివాది ఎవరు? హిరణ్యగర్భవాది. వాది అంటే దేని గురించైనా తెలుసుకుని, మాట్లాడేవాడు. అందుకని వాది అంటే జ్ఞాని అనవచ్చు. అందువల్ల అంతకుముందు హిరణ్యగర్భ జ్ఞానిని అతివాది అంటారు అని చూశాము. ఇప్పుడు సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మజ్ఞానే అసలైన అతివాది అని చెపుతున్నాడు.

హిరణ్యగర్భ గురించి చెప్పే అతను ఆపేక్షిక అతివాది అయితే, బ్రహ్మగురించి చెప్పే వ్యక్తి ఆత్యంతిక అతివాది. ఏష అంటే బ్రహ్మజ్ఞాని. ఏ బ్రహ్మ? నిర్గుణ బ్రహ్మ. హిరణ్యగర్భ బ్రహ్మ అంటే సగుణబ్రహ్మ లేదా చతుర్ముఖ బ్రహ్మ. నిర్గుణ బ్రహ్మ గురించి చెప్పే వ్యక్తే సత్యేన అతివాది. ఎందుకంటే నిర్గుణబ్రహ్మ మాత్రమే సత్యం. అందువల్ల నిర్గుణబ్రహ్మ వాదే సత్యవాది. సత్యవాదే అతివాది. వాది బదులు జ్ఞాని పెడితే, నిర్గుణ బ్రహ్మజ్ఞానే **సత్యజ్ఞాని. సత్యజ్ఞానే అతివాది.**

దీన్నుంచి రెండో సందేశం కూడా వస్తుంది. ఏమిటది? నిర్గుణబ్రహ్మ వాది మాత్రమే సత్యవాది అవటం వల్ల నిర్గుణ బ్రహ్మ మాత్రమే సత్యం అని చెపుతున్నాడు. నిర్గుణబ్రహ్మ మాత్రమే సత్యం అవటం వల్ల అంతకుముందు చెప్పిన 15 ఉపాసనలూ మిథ్య అని చెప్పకనే చెప్పినట్టవుతుంది. ఇద్దరు పిల్లల్లో పెద్దవాడు తెలివైనవాడు అని చెప్పటంలో రెండోవాడు కాదని చెప్పకనే

చెప్పినట్టు. అందువల్ల తక్కినవన్నింటినీ ఒక్క వాక్యంతో కొట్టి పారేసినట్టయింది. ప్రాణం, ఆశ, స్మరణం, ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, పృథ్వి, బలం, విజ్ఞానం, చిత్తం, సంకల్పం, మనస్సు, వాక్కు, నామం అన్నీ మిథ్య అయిపోతాయి. **జగత్ మిథ్య, బ్రహ్మ సత్యం. సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ.** అందువల్ల బ్రహ్మవాది సత్యవాది అవుతాడు.

దీనితో నారదునిలో కుతూహలం పెరుగుతుంది. ఇంతవరకు అతను ప్రాణవాది లేదా ఆపేక్షిక అతివాది మాత్రమే. ఇప్పుడు సత్యవాది అవాలి. అందుకని అడుగుతాడు.

**సోఽహం భగవస్సత్యేనాతి వదానీతి –** ఓ భగవాన్, అహం సత్యేన అతివదాని– నేను సత్యంతో అతివాదిని అవాలని ఉంది. అతివదాని అంటే అతివాదిని అవుదును గాక! ఇంక నాకు ప్రాణం మీద కుతూహలం లేదు. ఇప్పుడు నిర్గుణ బ్రహ్మ గురించి తెలుసుకోవాలని ఉంది.

దీనికి సనత్కుమారుడు జవాబు చెప్తున్నాడు. ఏమని?

**సత్యం త్వేవ విజిజ్ఞాసితవ్యమితి–** అద్భుతం, ఇప్పుడు నీకు నువ్వు అసలైన అతివాదివి అవ్వాలంటే సత్యబ్రహ్మ వాదివి అవాలి, అంటే సత్యం బ్రహ్మ గురించి తెలుసుకోవాలి. **సత్యం తు ఏవ –** నిర్గుణం సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ; **విజిజ్ఞాసితవ్యమ్–** తెలుసుకుతీరాలి. **ఇతి–** ఇంతవరకూ సనత్కుమారుని మాటలు. మళ్ళీ నారదుడు చెప్తున్నాడు. ఏమని?

**సత్యం భగవో విజిజ్ఞాస ఇతి –** నాకు సత్యం బ్రహ్మ గురించి తెలుసుకోవాలని ఉంది. అథాతో బ్రహ్మ జిజ్ఞాస. తర్వాత ఖండం నుంచి, సనత్కుమారుని జవాబు.

### సప్తదశః ఖణ్డః (17)

**యదా వై విజానాత్యథ సత్యం వదతి నావిజానన్ సత్యం వదతి విజానన్నేవ సత్యం వదతి। విజ్ఞానం త్వేవ విజిజ్ఞాసితవ్యమితి విజ్ఞానం భగవో విజిజ్ఞాస ఇతి ॥1॥**

### అష్టాదశః ఖణ్డః (18)

**యదా వై మనుతేఽథ విజానాతి నామత్వా విజానాతి మత్వైవ విజానాతి మతిస్త్వేవ విజిజ్ఞాసితవ్యేతి। మతిం భగవో విజిజ్ఞాస ఇతి ॥1॥**

**ఏకోనవింశః ఖణ్డః (19)**

**యదా వై శ్రద్ధధాత్యథ మనుతే నాశ్రద్ధధన్ మనుతే శ్రద్ధధదేవ మనుతే శ్రద్ధాత్వేవ విజిజ్ఞాసితవ్యేతి। శ్రద్ధాం భగవో విజిజ్ఞాస ఇతి ॥1॥**

**వింశః ఖణ్డః (20)**

**యదా వై నిస్తిష్ఠత్యథ శ్రద్ధధాతి నానిస్తిష్ఠఞ్ఛ్రద్దధాతి నిస్తిష్ఠన్నేవ శ్రద్ధధాతి నిష్ఠా త్వేవ విజిజ్ఞాసితవ్యేతి। నిష్ఠాం భగవో విజిజ్ఞాస ఇతి ॥1॥**

**ఏకవింశః ఖణ్డః (21)**

**యదా వై కరోత్యథ నిస్తిష్ఠతి నాకృత్వా నిస్తిష్ఠతి కృత్త్వైవ నిస్తిష్ఠతి కృతిస్త్వేవ విజిజ్ఞాసితవ్యేతి। కృతిం భగవో విజిజ్ఞాసా ఇతి ॥1॥**

**ద్వావింశః ఖణ్డః (22)**

**యదా వై సుఖం లభతేఽథ కరోతి నాసుఖం లబ్ధ్వా కరోతి సుఖమేవ లబ్ధ్వా కరోతి॥ సుఖం త్వేవ విజిజ్ఞాసితవ్యమితి। సుఖం భగవో విజిజ్ఞాస ఇతి॥1॥**

నారదుడు సత్యవాది అవాలనుకుంటాడు. సత్యవాది బిరుదు పొందటానికి అనేక దశలు దాటి రావాలి. ఆ దశలేమిటో రాబోయే ఖండాల్లో వస్తుంది. అందుకని కొన్ని ఖండాలు సాధన ఖండాలు. దాని తర్వాత బ్రహ్మ నిర్వచనం వస్తుంది.

ఆ సాధనలేమిటో ముందు టూకీగా చూద్దాము. అత్యున్నత స్థాయి నుంచి దానికింద స్థాయికి వెళుతూ వస్తుంది. ముందే 15 ఉపాసనలు కింది స్థాయి నుంచి పై స్థాయికి చూశాము. అంటే ఆరోహణక్రమం. ఇప్పుడు వ్యతిరేక దిశలో వెళ్తున్నాము. అంటే అవరోహణక్రమం.

నిర్గుణ ఉపాసన చేయాలంటే విశ్వరూప ఉపాసన చేయాలి. విశ్వరూప ఉపాసన చేయాలంటే ఏకరూప ఉపాసన చేయాలి. ఏకరూప ఉపాసన చేయాలంటే కర్మయోగం చేయాలి. అలా సాగుతుంది ఆరుదశలు.

అసలైన అతివాది అవ్వాలంటే ఏం కావాలి? సత్యవాది అవాలి. సత్యవాది అంటే సత్యం బ్రహ్మ గురించి మాట్లాడేవ్యక్తి. సత్యవాది అవాలంటే ఏం చేయాలి?

**1. సత్యవిజ్ఞానం–** సత్యవిజ్ఞానం కావాలి. నిజమే కదా! నేను బ్రహ్మ గురించి ఎప్పుడు మాట్లాడగలను? బ్రహ్మ గురించిన జ్ఞానం ఉంటేనే. అందువల్ల సత్యవాదికి ముందు దశ సత్యవిజ్ఞానం.

**2. సత్యమననం–** సత్యవిజ్ఞానం ఎప్పుడు పొందగలను? సత్యమననం ఉంటే. మననం అంటే సత్యబ్రహ్మ గురించిన విచారణ. విచారణ జ్ఞానాన్ని కలుగజేస్తుంది. జ్ఞానం సత్యం గురించి మాట్లాడేలాగా చేస్తుంది. సత్యమననాన్ని ఉపనిషత్తు **మతి** అంటున్నది. సత్యబ్రహ్మ గురించిన విచారణ చేయాలంటే శాస్త్ర ప్రమాణం లేదా ఉపనిషత్తు ప్రమాణం తీసుకోవాలి. ఎందుకంటే కేవలం ఉపనిషత్తే బ్రహ్మ గురించి చెప్తుంది. వేద పూర్వభాగం కూడా చెప్పదు. అందువల్ల సత్యవిజ్ఞానం కావాలంటే శాస్త్ర ప్రమాణం తీసుకోవాలి.

**3. శ్రద్ధ –** శాస్త్ర ప్రమాణం తీసుకోవాలంటే శ్రద్ధ ఉండాలి. శ్రద్ధ అంటే నమ్మకం. శాస్త్రం మీదే కాదు. గురువు మీద కూడా. అందువల్ల మతి కావాలంటే శ్రద్ధ ఉండాలి.

**గురు వేదాంత వాక్యేషు విశ్వాసః శ్రద్ధా – తత్త్వబోధ**

**4. నిష్ఠ –** గురువుమీద, శాస్త్రం మీద శ్రద్ధ ఉండాలంటే, నిష్ఠ ఉండాలి. నిష్ఠ అంటే ఏమిటి? శంకరాచార్యులు నిష్ఠను గురుశాస్త్ర సేవ లేదా శుశ్రూష అంటున్నారు. గురువుకు, శాస్త్రానికీ కూడా సేవ చేయాలి. సేవ చేసిన కొద్దీ శ్రద్ధాభక్తులు పెరుగుతాయి.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా – గీత 4-34**

శాస్త్రానికి సేవ ఎలా చేస్తాము? పారాయణం చేయటం ద్వారా. గీతా పారాయణం లేదా ఉపనిషత్తు పారాయణం. వాటి అర్థం తెలియక పోయినా, పారాయణం చేయటం వల్ల వాటి మీద గౌరవం పెరుగుతుంది. గురు శుశ్రూష అంటే గురువుకు సేవ చేయటం. పూర్వం శిష్యులు అంతేవాసులుగా ఉండి,గురువుకు సేవ చేసేవారు.

**5. కృతి –** సేవ చేయాలంటే కృతి ఉండాలి.

**ఇంద్రియ సంయమః చిత్తైకాగ్రతాకరణం చ।**

కృతి అంటే ఇంద్రియ నిగ్రహం, చిత్త ఏకాగ్రత అంటున్నారు శంకరాచార్యులు. ఎందుకంటే ఒక శిష్యుడు గురుకులంలో ఉండి, గురువుకు కొంతకాలంపాటు శుశ్రూష చేయాలనుకుంటే ఇంద్రియ నిగ్రహం, చిత్త ఏకాగ్రత ఉండాలి.

చాలామందికి ఏకాగ్రత కుదరదు. వాళ్ళు కుదురుగా ఒకచోట ఎక్కువసేపు కూర్చోలేరు. గురుకులంలో విద్యనభ్యసించటానికి కావాల్సిన వసరులన్నీ ఉంటాయి. పుస్తకాలు, బట్టలు, వసతి సౌకర్యం, భోజనం, వైద్యసదుపాయం అన్నీ ఉంటాయి. కేవలం విద్యనభ్యసించటం, దాన్ని జీర్ణించుకోవటమే చేయాలి. కాని ఎక్కువరోజులు అక్కడ ఉండలేరు. కొంత మంది ఉండలేక, వెనక్కి వచ్చేస్తారు.

అంతదాకా ఎందుకు? హృషీకేశ్‌లో ఏడురోజుల జ్ఞానయజ్ఞానికి వెళతారు కొంతమంది. వాళ్ళు దానికే అంకితమవ్వాలి. కాని అది వదిలేసి గీతాభవన్‌కో, హరిద్వార్‌కో, గంగాహరతికో, షాపింగ్‌కో వెళ్ళిపోతారు.

చిన్మయానంద స్వామి శిష్యులతో గట్టిగా చెప్పేవారుట, 'సాయం కాలాలు ఒకచోటికి వెళ్ళి, అక్కడ ఒంటరిగా కూర్చుని, పొద్దున్న నేర్చుకున్న పాఠాన్ని మననం చేసుకోండి.' అయినా రహస్యంగా ఫలానా చెట్టు కిందకి రా, అక్కడ కలుసుకుందామని ఒకరికొకరు చెప్పుకుని, అక్కడచేరి కబుర్లు చెప్పుకునేవారుట. అందుకే మనోనిగ్రహం అంత కష్టం అని చెపుతారు. మనోనిగ్రహంలో శమాది షట్కసంపత్తి వస్తుంది. కృతి అంటే ఇంద్రియ నిగ్రహం, ఏకాగ్రత. అది ఉంటే పై దశలు సాధ్యమవుతాయి.

**6. ఆనందం –** కృతి ఉండాలంటే ఆనందం ఉండాలి. ఇన్ని దశలు దాటి, బ్రహ్మ జ్ఞానం పొందాలంటే, ఒక్క షరతు మీదే అది సాధ్యం. ఏమిటది? అతివాది అయితే అనంతమైన ఆనందం పొందుతాము అని అతనికి తెలియాలి. అందువల్ల, ఆఖరి దశ ఏమిటి? అతివాదినయితే, అనంతమైన ఆనందం పొందుతామన్న ఎఱుక. అంటే ఆనంద ప్రాప్తి జ్ఞానం ఉండాలి. కృతి, నిష్ఠ, శ్రద్ధ, మతి, విజ్ఞానం దశలన్నీ కష్టపడి ఎందుకు దాటుతూ వెళతాడు? ఆనందం కోసం. అందువల్ల ఆనందప్రాప్తి జ్ఞానమే పై నుంచి చివరి దశ.

ఈ ఆనందం కూడా ఎటువంటి ఆనందం? మామూలు పరిమి తమైన విషయ ఆనందం కాదు. బ్రహ్మానందం. ఈ దశను సుఖ జ్ఞానం అంటారు. అవి 17వ ఖండం నుంచి 22వ ఖండం వరకూ వస్తాయి. ఇప్పుడు 17వ ఖండం చూద్దాము. వీటిల్లో ఒక్కొక్క మంత్రమే ఉంటుంది.

## ఖండం-17

**1. సత్యవిజ్ఞానం - యదా వై విజానాత్యథ సత్యం వదతి -** ఎప్పుడైతే నిశ్చయంగా బ్రహ్మజ్ఞానాన్ని లేదా సత్యజ్ఞానాన్ని పొందుతున్నాడో, అప్పుడే ఆ వ్యక్తి సత్యం పలుకుతాడు. సత్యవాది అవటం వల్ల అతివాది అవుతాడు.
**నా విజానన్ సత్యం వదతి -** సత్యబ్రహ్మను తెలియని వ్యక్తి, సత్యబ్రహ్మ గురించి చెప్పలేడు.
**విజానన్నేవ సత్యం వదతి-** అందువల్ల బ్రహ్మజ్ఞానం పొందాకే సత్యబ్రహ్మగురించి చెప్పగలడు.
**విజ్ఞానం త్వేవ విజిజ్ఞాసితవ్యమితి-** అందుకని సనత్కుమారుడు, నారదునితో చెపుతున్నాడు. విజ్ఞానం అంటే బ్రహ్మ విజ్ఞానం లేదా సత్యవిజ్ఞానం. సత్యం అన్నా, బ్రహ్మ అన్నాఒకటే. విజినాసితవ్యం- తెలుసుకోవలసినది.
**విజ్ఞానం భగవో విజిజ్ఞాస ఇతి-** వెంటనే నారదుడు, ఓ భగవాన్, నేను విజ్ఞానం గురించి తెలుసుకోవాలనుకుంటున్నాను అంటాడు.

## ఖండం-18

**2. సత్యమననం** విజ్ఞానం ఒక వస్తువైతే, అది ఒక చోట పెట్టి తీర్థమో, ప్రసాదమో పంచినట్టు పంచవచ్చు. కాని అది అలా పంచే వస్తువు కాదు. విజ్ఞానం వేదాంత విచారం వల్లే సాధ్యం. శాస్త్రం నేర్చుకోవాలి.
**యదావై మనుతేऽథ విజానాతి-** శాస్త్ర విచారణ చేస్తేనే, విజ్ఞానం పొందుతాడు. ఎందుకు శాస్త్ర విచారాన్ని అంతగట్టిగా చెపుతున్నది? ఎందుకంటే, బ్రహ్మ వేరే ఏ ప్రమాణానికి అందదు. ఒక్క శాస్త్ర ప్రమాణానికే అందుతుంది. అప్పుడే, జ్ఞానం వస్తుంది.
**నామత్వా విజానాతి మత్వైవ విజానాతి-** అమత్వ అంటే విచారణ లేకుండా, అంటే శాస్త్ర విచారణ లేకుండా, ఎన్నటికీ తెలుసుకోలేవు.

ఈ అంశాలన్నీ చాలా ముఖ్యమైన అంశాలు. ధ్యానంతో జ్ఞానం రాదు అని చెప్పకనే చెప్పినట్టవుతున్నది. ధ్యానంలో విచారణ ఏమీ చేయటం లేదు, కేవలం మనసులో ఆలోచనలు లేకుండా చేస్తున్నాము. అందుకని ధ్యానం వల్ల జ్ఞానం పొందలేము. మత్వా ఏవ విజానాతి - వేదాంత శ్రవణ,మననం వల్లే జ్ఞానం పొందుతాము. దీనిని ఉపనిషత్తు మతి అంటున్నది. అందువల్ల మీ లక్ష్యం ఎలా ఉండాలి?

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్**
**సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥    ముండక 1-2-12**

ఇప్పుడు నారదుడు చెపుతున్నాడు.

**మతిం భగవో విజిజ్ఞాస ఇతి- ఓ భగవాన్!** నేను మతి గురించి తెలుసుకోవాలని అనుకుంటున్నాను.

**ఖండం-19**

**3.శ్రద్ధ: -** వేదాంత విచారణ చేయాలంటే, ముందు వేదాంతమే ఆత్మ జ్ఞానాన్ని కలిగించే ప్రత్యక్షమార్గం. వేదాంతవే నిఖార్సైన ప్రమాణం అని తెలుసుకోవటమే శ్రద్ధ.

**యదా వై శ్రద్దధాత్యథ మనుతే-** ఎప్పుడైతే శ్రద్ధ ఉంటుందో, అప్పుడే మననం చేస్తాడు. మీ కళ్ళు ఎంత సూదంటురాయిలా తీక్షణంగా చూడగలిగినా, వాటిని చూసుకోవటానికి ఒక్కటే మార్గం ఉంది. ఏమిటది? అద్దం. అలాగే వేదాంత వాక్యం ఒక్కటే అద్దం ఆత్మజ్ఞానం పొందటానికి.

కొంతమంది బ్రహ్మజ్ఞానం వేదాంత విద్య ద్వారా పొందలేమంటారు. ఉపనిషత్తు బాహ్యంగా ఉంది. బాహ్యవస్తువు నీ అంతర్గతం గురించి ఎలా చెపుతుంది? ఆత్మ నీలో ఉంది. అందుకని కళ్ళు మూసుకుని నీలోకి తొంగిచూడు అంటారు. కాని అది సాధ్యం కాదు. నీలోకి తొంగిచూస్తే దొరికేది ఆత్మ కాదు. రాగద్వేష, కామక్రోధాలు. అందుకే చాలామందికి వేదాంత విచారణ యొక్క విలువ తెలియదు.

**నాశ్రద్ధదన్మనుతే-** శ్రద్ధ లేనివాడు మననం చేయడు. అంటే శాస్త్ర విచారణ చేయడు.

**శ్రద్ధధదేవ మనుతే -** శ్రద్ధ ఉన్న వ్యక్తి మాత్రమే మననం చేస్తాడు.

**శ్రద్ధా త్వేవ విజిజ్ఞాసితవ్యేతి -** అందుకని శ్రద్ధ పెంచుకోవాలి.

**విజిజ్ఞాసితవ్య -** అంటే తెలుసుకోదగినది.

అందుకే మనకు శ్రద్ధాసూక్తం కూడా ఉంది. బ్రహ్మచారి వేదాధ్యయనం మొదలుపెట్టేముందు శ్రద్ధాసూక్తం చదువుతాడు.

**శ్రద్ధాం భగవో విజిజ్ఞాస ఇతి-** ఓ భగవాన్, నేను శ్రద్ధ గురించి తెలుసుకోవాలని అనుకుంటున్నాను.

## ఖండం- 20

**4.నిష్ఠ:- యదా వై నిస్తిష్ఠత్యథ శ్రద్ధధాతి-** ఎప్పుడు నిష్ఠ ఉంటుందో, అప్పుడు శ్రద్ధ కలుగుతుంది.

**నిష్ఠా గురు శుశ్రూషాఉ ఉ దిః తత్పరత్వం బ్రహ్మవిజ్ఞానాయ -** నిష్ఠ అంటే బ్రహ్మ విజ్ఞానం కోసం తత్పరుడై (అదే పరమలక్ష్యంగా ఉండి) గురువును సేవించటం.తపస్సు లాంటి అనుష్ఠానం చేయటం అని శంకరాచార్యులు చెప్తున్నారు.

**అమానిత్వమదంభిత్వమ్ అహింసా క్షాంతిరార్జవమ్।**
**ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః॥** **గీత 13-7**

శ్రీకృష్ణపరమాత్ముడు విలువలను పేర్కొంటూ అందులో ఒకటిగా ఆచార్యోపాసనం అన్నాడు. ఆచార్యులకు సేవ చేయటం. ఏదైనా కాయికంగా చేస్తే, మనస్సు కూడా దానిమీద గౌరవం పెంచుకుంటుంది.దీన్ని పూజ్యస్వామీజీ **ఫేక్ ఇట్ అండ్ మేక్ ఇట్** అంటారు. అంటే పిల్లల చేత పెద్దలకు నమస్కారం పెట్టించామనుకోండి. ముందు వాళ్ళకు దాని విలువ తెలియకపోయినా, మనం చెప్పాము కాబట్టి యాంత్రికంగా చేస్తారు. చేయగా, చేయగా, దాని విలువ తెలిసి, వాళ్ళే సహజంగా చేస్తారు.

అలాగే మొదట్లో గురువుకు శుశ్రూష చేస్తాడు శిష్యుడు. అప్పుడతనికి శాస్త్రం విలువ ఏమిటో తెలియకపోవచ్చు. అప్పుడు గురువు చెప్తాడు, 'నాకీ గౌరవం ఎందుకు వచ్చిందనుకుంటున్నావు? నా జ్ఞానం వల్ల. నాకు జ్ఞానం ఎక్కడ్నుంచి వచ్చింది? శాస్త్ర అధ్యయనం చేయటం వల్ల. అందువల్ల నువ్వు కూడా శాస్త్ర అధ్యయనం చేయి.నేను నేర్పిస్తాను.'

అందువల్ల గురువు మీద, శాస్త్రం మీద శ్రద్ధ శుశ్రూష వల్లే వస్తుంది. శుశ్రూష అంటే పెద్దగా సేవ చేయనవసరం లేదు. ఒక చిన్న నమస్కారం పెట్టినా చాలు. ఈ సేవను నిష్ఠ అంది ఉపనిషత్తు.

**నానిస్తిష్ఠఞ్ఛ్రద్దధాతి-** నిష్ఠలేని వ్యక్తికి శ్రద్ధ ఉండదు.

**నిస్తిష్ఠన్నేవ శ్రద్దధాతి-** నిష్ఠ ఉన్న వ్యక్తికి మాత్రమే శ్రద్ధ ఉంటుంది.

**నిష్ఠాత్వేవ విజిజ్ఞాసితవ్యేతి-** నిష్ఠే నిశ్చయంగా తెలుసుకోవలసినది.

**నిష్ఠాం భగవో విజిజ్ఞాస ఇతి-** ఓ భగవాన్, నేను నిష్ఠ గురించి తెలుసుకోవాలని అనుకుంటున్నాను.

## ఖండం–21

**5. యదా వై కరోత్యథ –** ఎప్పుడైతే కృతి చేస్తాడో, అప్పుడు నిష్ఠను కలిగి ఉంటాడు.

**కృతిః ఇంద్రియ సంయమః చిత్తైకాగ్రతాకరణం చ** కృతి (చేయటం) అంటే ఇంద్రియ నిగ్రహం, చిత్త ఏకాగ్రత కలిగి ఉండటం. చిత్త ఏకాగ్రత అంటే పంచజ్ఞానేంద్రియాలను, పంచ కర్మేంద్రియాలను, చత్వారి అంతః కరణలను ఏకీకృతం చేయటం. పతంజలి ఋషిచెప్పిన అష్టాంగ యోగం దీనికి సరిపోతుంది. అష్టాంగ యోగం పంచకోశాలను ఏకీకృతం చేస్తుంది. యోగం అంటే కలవటం. స్వామి చిన్మయానంద దీన్ని **'ఆర్కెస్ట్రైజేషన్ ఆఫ్ ది పర్సనాలిటీ,'** అంటారు.

ఆర్కెస్ట్రాలో చూడండి, అనేక వయోలీన్లు ఉంటాయి. క్లారినెట్లు, సాక్సోఫోన్లు, మాండలీన్లు – అలా అనేక వాయిద్యాలు ఉంటాయి. అయినా అన్నీ ఒక్క శృతిలో పాటను వాయిస్తాయి. ఏమాత్రం ఎందులో అపశృతి దొర్లినా, తెలిసి పోతుంది. అలా నా శరీరంలోని అంగాలన్నీ ఒక్కటే శృతిలో సాగాలి. అప్పుడే నా శరీరం అదుపులో ఉంటుంది. దాన్నే కరోతి (కృతి) అంటారు.

కృతి ఉంటే గురువు దగ్గరకు వెళ్ళి వేదాధ్యయనశ్రవణం చేయగలుగుతారు. శ్రవణం అంటే ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా కొన్నేళ్ళపాటు ఒక సమర్థమైన గురువు దగ్గర విద్య నేర్చుకోవటం.

**నాకృత్వా నిస్తిష్ఠతి–** ఇంద్రియ నిగ్రహం లేకపోతే, గురు శుశ్రూష చేయలేడు. అంటే నిష్ఠగా ఉండలేడు.

**కృత్వైవ నిస్తిష్ఠతి –** అందువల్ల ఇంద్రియ నిగ్రహం ఉంటేనే, నిష్ఠ ఉంటుంది.

**కృతిస్త్వేవ విజిజ్ఞాసితవ్యేతి –** అందువల్ల కృతియే నిశ్చయంగా తెలుసుకోవాల్సినది. ఇదే సాధన చతుష్టయ సంపత్తిలో శమాది షట్కసంపత్తి.

**కృతిం భగవో విజిజ్ఞాస ఇతి–** ఓ భగవాన్, నేను కృతి గురించి తెలుసుకోవాలని అనుకుంటున్నాను.

## ఖండం-22

**6. ఆనందం - యదా వై సుఖం లభతేఽథ కరోతి-** ఎప్పుడైతే సాధకుడు ఆనందం దొరికే అవకాశముందని గ్రహిస్తాడో, అప్పుడే కృతి చేస్తాడు. ఇన్ని దశలు దాటుకుంటూ ఎందుకు వెళతాడు? ఆనందం దొరుకుతుందన్న ఆశతో! ఎవరికైనా కావాల్సింది ఆనందమే కదా! అందుకని అతనికి చూపే ఎర ఏమిటి? ఆనందం! 'నీకు ఇంద్రియనిగ్రహం ఉంటే, గురు శుశ్రూష చేయగలవు. గురు శుశ్రూష చేస్తే శ్రద్ధ కలుగుతుంది. శ్రద్ధ కలిగితే, శాస్త్ర విచారణ చేయగలవు. శాస్త్ర విచారణ చేస్తే విజ్ఞానం పొందుతావు. విజ్ఞానం పొందితే నువ్వు సత్యవాదివి అవుతావు. సత్యవాది అంటే అతివాదివి అవుతావు. నువ్వు అతివాదివి అయితే, నీకు శాశ్వతమైన ఆనందం దొరుకుతుంది.' అంటే ఆ శాశ్వతమైన ఆనందం కోసం ఈ దశలన్నింటిని దాటటానికి సిద్ధపడతాడు. అందువల్ల చివరికి కావాల్సింది ఏమిటి? సుఖజ్ఞానం.

ఈ సాధనల వల్ల సుఖం దొరుకుతుందని తెలియాలి.

సుఖం లభతే - దీన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. వాచ్యార్థం తీసుకుంటే సాధకుడు సుఖం పొందినప్పుడు అని వస్తుంది. కాని అసలు అర్థం తాను సాధన చేస్తే, దాని అంతిమ గమ్యంగా సుఖం పొందుతాడు అని తెలిస్తే, కృతి చేస్తాడు. ఎందుకు? ఇక్కడే సుఖం దొరికేటట్టయితే, ఎందుకంత కష్టపడతాడు? అందుకే అది అతని ప్రయాణం యొక్క అంతిమ గమ్యం. ఏ ప్రయాణం? ఇప్పుడు చూసిన దశలవారీ ప్రయాణం.

**నాసుఖం లబ్ధ్వా కరోతి -** అందులో సుఖం లేదనుకుంటే, అతను ఈ సాధనలు ఎన్నడూ చేయడు. అందుకని అసుఖం లబ్ధ్వా న కరోతి.

**సుఖమేవ లబ్ధ్వా కరోతి-** సుఖం దొరుకుతుందని తెలిస్తేనే చేస్తాడు. అది కూడా పరిమితమైన ఆనందం అనుకుంటే, ఆ శ్రమ కూడా పెట్టడు. ఎందుకు? అలాంటి పరిమితమైన ఆనందం ఒక చిన్న మసాలా దోశ తింటేనే వస్తుంది. అందుకని 'అల్పసుఖప్రాప్తి' అవసరం లేదు. అది అనేక విధాలుగా వస్తుంది. అనంతమైన ఆనందం కావాలి. అప్పుడే దానికోసం బాగా కష్టపడతాడు. అందుకని సుఖం అంటే ఏమిటో ముందు తెలియాలి.

**సుఖం త్వేవ విజిజ్ఞాసితవ్యమితి-** సుఖం గురించే నిశ్చయంగా తెలుసుకోవాలి.

**సుఖం భగవో విజిజ్ఞాస ఇతి** – ఓ భగవాన్ నేను సుఖం (ఆనందం) గురించి తెలుసుకోవాలని అనుకుంటున్నాను.

**త్రయోవింశః ఖణ్డః (23)**

**యో వై భూమా తత్సుఖం నాల్పే సుఖమస్తి భూమైవ సుఖం భూమా త్వేవ విజిజ్ఞాసితవ్య ఇతి। భూమానం భగవో విజిజ్ఞాస ఇతి ॥1॥**

ఈ అధ్యాయంలోనే నిజానికి భూమ విద్య మొదలవుతుంది. 22వ ఖండం వరకు ఉపాసనలు, సాధనలూ వచ్చాయి. ఇక్కడ్నుంచి 26వ ఖండం వరకూ భూమ విద్య వస్తుంది. అంటే ఈ నాలుగు ఖండాల్లోనే అసలు బోధ వస్తుంది.

**యో వై భూమా తత్సుఖం–** ముందు ఖండంలో సుఖం విజిజ్ఞాసితవ్యమితి– అన్నాడు నారదుడు. చాలా ముఖ్యమైన ప్రశ్న అది. దానికి సనత్కుమారుడు ఇస్తున్న జవాబు – యోవై భూమా తత్సుఖం.

భూమా అంటే అనంతం. భూమ అంటే బ్రహ్మ. రెండింటి అర్థం ఒకటే. రెండూ అనంతాన్ని సూచిస్తాయి.

ఇప్పుడు సనత్కుమారుని బోధకు వస్తే అనంతమైన భూమయే సుఖం లేదా ఆనందం.

> **ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్। ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। ఆనందేన జాతాని జీవన్తి। ఆనందం ప్రయంత్యభిసంవిశంతీతి।     – తైత్తిరీయం**

ఇదే భావన ఇక్కడ కూడా. బ్రహ్మ ఆనందం. ఇక్కడ జాగ్రత్తగా ఉండాలి. బ్రహ్మ ఆనందంగా ఉన్నాడు అనకూడదు. బ్రహ్మ అంటే ఆనందం.

**నాల్పేసుఖమస్తి** – అల్పే సుఖం న అస్తి అని అర్థం చేసుకోవాలి. అల్పవిషయాల్లో ఆనందం లేదు. సృష్టిలో పరిమితి ఉన్న ఏ వస్తువులోనూ ఆనందం లేదు. అశాశ్వతమైన వస్తువులో ఆనందం లేదు. అశాశ్వతమైన మనస్సులో ఆనందం లేదు. అశాశ్వతమైన శరీరంలో ఆనందం లేదు. అశాశ్వతమైన ఆలోచనల్లో కూడా ఆనందం లేదు. ఆనందం అశాశ్వతమైన వస్తువుల్లో దొరకదు. దీన్నుంచే చైతన్యంకు మనం చెప్పుకునే ఐదు నిర్వచనాలను ఆనందంకు కూడా వర్తించుకోవాలి.

1. ఆనందం ఈ సృష్టిలో దేనికీ ఒక భాగం కాని, లక్షణం కాని కాదు. దేన్నుంచీ ఉత్పత్తి కూడా చెందలేదు. ఎలా చెప్పగలము?

ఆనందం ప్రపంచంలోను, శరీరంలోనూ, మనస్సులోనూ ఆలోచనలోనూ లేదు అంటున్నది ఉపనిషత్తు . అల్పే సుఖం న అస్తి. మనస్సు అల్పమా, అనల్పమా? సందేహం ఎందుకు? అల్పమే. మనస్సులో కూడా ఆనందం లేదు. కాబట్టి ఆనందం దేనికీ ఒక భాగం కాదు అంటున్నాము.

2.ఆనందం స్వతంత్రమైనది. అది కొన్ని సమయాల్లో, కొన్ని మనస్సుల్లో వ్యాపించి, ప్రతిబింబ ఆనందంగా వ్యక్తమవుతుంది. కొన్ని సమయాల్లో, కొన్ని మనస్సుల్లోనే ఎందుకు? ఎవరు ఎప్పుడు, ఏక్షణంలో ఆనందంగా ఉంటే, ఆ వ్యక్తిలో, ఆ మనస్సులో ఆనందం ప్రతిబింబిస్తుంది. అది మనస్సుకు చెందినది కాదు. దానికి భిన్నంగా ఉంది. పౌర్ణమి రాత్రి చంద్రుని వెన్నెల చంద్రునిది కాదు, చంద్రుని మీద సూర్యకాంతి ప్రతిబింబిస్తున్నట్టుగా, ఆనందపు ఘడియల్లో అనంతమైన ఆనందం, అల్పమైన మనస్సుల్లో ప్రకటితమవుతుంది. కాని అది మనస్సుకు చెందినది కాదు.

**తస్య ప్రియమేవ శిరః మోదో దక్షిణః పక్షః**

**ప్రమోద ఉత్తరః పక్షః। ఆనంద ఆత్మా – తైత్తిరీయం**

మనస్సులో ప్రియ, మోద, ప్రమోద వృత్తులు ఏర్పడుతుంటాయి అప్పుడప్పుడూ. అలాంటప్పుడు మనస్సులో అనంతమైన ఆనందం ప్రతిబింబిస్తుంది కాని అది స్వతంత్రమైనది.

3. ఆనందం మనస్సు సరిహద్దులకే పరిమితమవలేదు. ఆనందం మనస్సు, ఆలోచనలను దాటి ఉంది. చైతన్యం సర్వవ్యాపకమైనట్టే, ఆనందం కూడా సర్వ వ్యాపకం.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్–** 6వ అధ్యాయం.

సత్,చిత్ ఎలా సర్వవ్యాపకమో, అలాగే ఆనందం కూడా సర్వవ్యాపకం. శరీరం, మనస్సులకే పరిమితమవదు.

4. ఆనందపుటాలోచన ముగింపుకు వచ్చినప్పుడు, ఆలోచన మాత్రమే ముగుస్తుంది. ఆనందపు టాలోచన మాత్రమే ముగుస్తుంది. ఆనందపు టాలోచన పోయినా, ఆనందం పోదు. ఇందాక చూసిన ప్రియ, మోద,ప్రమోద వృత్తులు పోయినా కూడా ఆత్మానందం కొనసాగుతుంది.

మరి ఏమి ముగిసింది? ప్రతిబింబ ఆనందం ముగిసింది.
**స యశ్చాయం పురుషే। యశ్చాసావాదిత్యే । స ఏకః।**
**స య ఏవం విత్। అస్మాల్లోకాత్ప్రేత్య।** **– తైత్తిరీయం**
మళ్ళీ అందులోనే ఇంకోచోట ఇలా వస్తుంది.
**రసోవై సః। రసగ్గ్ం హేవాయం లబ్ధ్వాఽఽనందీ భవతి।**
**కోహ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్। యదేష ఆకాశ ఆనందో న స్యాత్**
**– తైత్తిరీయం**

ఆనందాన్ని ఇక్కడ రసం అంది. రసం అంటే బింబానందం, శుద్ధమైన ఆనందం. విషయానందం పోయి, మనసు విచారంగా ఉన్నా, బింబానందం పోదు.

5. మనస్సులో ఆనందపుటాలోచన ముగిసినా, బింబానందం ఉంటుంది కాని అది వ్యక్తమవదు. ఎలాగైతే ప్రతిబింబింపచేసే శరీరం లేకపోతే చైతన్యం వ్యక్తమవదో అలాగే ప్రతిబింబింప చేసే ఆనందపుటాలోచన లేదు కాబట్టి బింబానందం కూడా వ్యక్తమవదు. ఈ శుద్ధమైన బింబానందమే భూమ.

ప్రపంచంలో ఆనందం లేదు. ఎవరైనా 'అలా ఎలా అంటారు, నాకు సంగీతం నుంచి, నాట్యం నుంచి, మంచి ఆహారం నుంచి ఆనందం వస్తుంది,' అని వాదిస్తే 'అవి నిజంగా ఆనందాన్నివవ్వవు. కేవలం బింబానందాన్ని ప్రతిబింబింపజేసేందుకు అనువైన అవకాశాన్ని కలుగజేస్తాయి తప్పితే వాటంతట అవి ఆనందాన్నివ్వవు,' అంటాము మనము.

దానికి ఉదాహరణ కుక్క, ఎముక. ఈ ఉదాహరణను ఎన్నడూ మర్చిపోకూడదు. కుక్క ఎముకని కొరికి తింటున్నప్పుడు, రక్తం కారితే, కుక్క ఆ రక్తం ఎముక వల్ల వచ్చింది అనుకుంటుంది. కాని తనలోనే ఉన్న రక్తాన్ని ఎముక బయటకు తెచ్చిందని గ్రహించలేదు. అది తెలుసుకుని, దాన్ని చూసి మనం నవ్వుతాము కాని, మనం చేసేది కూడా అదే. సంగీతం, నాట్యం అన్నీ ఎముకలాంటివి. అందులో లేశమాత్రం కూడా ఆనందం లేదు.

మొత్తం సృష్టిలో ఆనందానికి మూలం ఒక్కటే ఉంది. ఏమిటది? భూమ. అల్పే సుఖం న అస్తి. అల్పే జగత్. అల్పంలో విషయవస్తువులు,

మన కుటుంబ సభ్యులు. మన శరీరం, మన మనస్సు అన్నీ వస్తాయి.
**భూమైవ సుఖం –** అందుకని భూమలోనే ఆనందం ఉంది.
**భూమాత్వేవ విజిజ్ఞాసితవ్య ఇతి–** అందుకని భూమ విద్య తెలుసుకో. ఆనందం పొందు.
**భూమానం భగవో విజిజ్ఞాస ఇతి –** ఓ భగవాన్, నేను భూమ విద్య గురించి తెలుసుకోవాలను కుంటున్నాను.

**చతుర్వింశః ఖణ్డః (24)**

**యత్ర నాన్యత్పశ్యతి నాన్యచ్ఛృణోతి నాన్యద్విజానాతి స భూమా। అథ యత్రాన్యత్పశ్యత్యన్యచ్ఛృణోత్యన్యద్విజానాతి తదల్పం యో వై భూమాతదమృతమథ యదల్పం తన్మర్త్యమ్। స భగవః కస్మిన్ ప్రతిష్ఠిత ఇతి। స్వే మహిమ్ని యది వా న మహిమ్నీతి ॥1॥ గో అశ్వమిహ మహిమేత్యాచక్షతే హస్తిహిరణ్యం దాసభార్యం క్షేత్రాణ్యాయతనానీతి నాహమేవం బ్రవీమి బ్రవీమీతి హోవాచాన్యో హ్యన్యస్మిన్ ప్రతిష్ఠిత ఇతి ॥2॥**

**భూమ నిర్వచనం**

ఈ అధ్యాయం మొత్తంలో ఇది చాలా ముఖ్యమైన ఖండం. ఎందుకంటే ఇందులో భూమ నిర్వచనం వస్తుంది.
**మంత్రం–1 యత్ర (బ్రహ్మ శుద్ధసత్)** సత్ ఇక్కడ ప్రత్యేకంగా చెప్పలేదు. కాని మనం ఆరో అధ్యాయం నుంచి ఇక్కడికి తెచ్చుకోవాలి.

సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్

శుద్ధ బ్రహ్మ అంటే నేను వేరు, వస్తువు వేరు అనే ద్వైతభావన ఉండదు. ఏకమేవా ద్వితీయం బ్రహ్మ. ఉన్నది ఒకటే బ్రహ్మ. బ్రహ్మకు భిన్నంగా ఇంకో వస్తువు లేదు. నేను, వస్తువు; చూసేవాడు, చూడబడేది; అనుభవించేవాడు, అనుభవించబడే వస్తువు; అలా ప్రతీది రెండుగా విభజించబడేది ద్వైతం. ఉపనిషత్తే దానికి కొన్ని ఉదాహరణలనిస్తోంది.
**నాన్యత్పశ్యతి–** వీటి మధ్య భేదం లేదు. ఇంకో విధంగా చెప్పాలంటే చూసే వ్యక్తి, చూడబడే వస్తువు అని రెండు లేవు. ఉన్నదొకటే బ్రహ్మ.
**నాన్యచ్ఛృణోతి –** అలాగే వినేవాడు,వినబడే వస్తువు అంటూ భిన్నంగా లేవు.

**నాన్యద్విజానాతి –** తెలుసుకునే వ్యక్తి, తెలుసుకోబడే వస్తువు అంటూ రెండు భిన్నంగా లేవు.

**స భూమా –** భూమ అందుకే అద్వైత వస్తువు అయింది. అద్వైతం అంటే చూసే వ్యక్తి – చూడబడే వస్తువు అనే ద్వైతభావన లేనిది.

ఇంకో విధంగా చెప్పాలంటే, అద్వైతంలో త్రిపుటి లేదు.

ప్రమాతా, ప్రమాణం, ప్రమేయం అనే మూడు వస్తువులు లేవు. అందువల్ల ద్వైతం లేదు, నానాత్వం లేదు. బ్రహ్మ అద్వైత సత్తా.

అయితే, బ్రహ్మను తెలుసుకోవటం ఎలా? ప్రపంచంలో ఉనికిని తీసుకోండి. ఉనికి 'ఎక్కడ ఉంది?' ఈ ప్రశ్నకు జవాబు చెప్పకూడదు. 'ఎక్కడ లేదు?' అని తిరిగి ప్రశ్నించాలి. ఇంగ్లీషులో వాల్ ఈజ్, ఛెయిర్ ఈజ్, టేబుల్ ఈజ్, మైక్ ఈజ్– అలా చెప్పుకుంటూ పోవచ్చు. ఈ పదాల్లో నామరూపాలను తీసివేస్తే మిగిలింది ఏమిటి? ఈజ్,ఈజ్,ఈజ్. ఈ ఈజ్‌నెస్సే శుద్ధసత్తా. శుద్ధసత్తానే బ్రహ్మ. లేదా భూమ లేదా ఆనందం అంటారు.

ఇలా నామరూపాలను తీసేస్తూ వచ్చి శుద్ధసత్తాను చూడటం అనేది ద్వైత నిషేధవాక్యం. ద్వైతాన్ని కాదనే వాక్యం. జగత్తంతా ద్వైతంలో నిండి ఉంది కాబట్టి, మొత్తం జగత్తునే నిషేధిస్తాము. అందువల్ల ఇది ప్రపంచ నిషేధ వాక్యం అయింది. మిగిలింది ఏమిటి? శుద్ధ సత్తా.

**నేహ నానాస్తి కించన – కేన**

**న భూమిరాపో న చ వహ్నిరస్తి నచానిలో మేఽస్తి**

**న చాంబరం చ – కైవల్యం**

**నాన్తః ప్రజ్ఞం న బహిః ప్రజ్ఞః నోభయతః ప్రజ్ఞ న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞం నాప్రజ్ఞమ్। ...**

**ప్రపంచోపశమం శాన్తం శివమ్ అద్వైతం చతుర్థం మన్యన్తే స ఆత్మా స విజ్ఞేయః॥ – మాండూక్యం**

**నేతి, నేతి – బృహదారణ్యకం**

ఈ వాక్యాలన్నీ నిషేదవాక్యాలు. ఈ నిషేద వాక్యాలు అద్వైతం నేర్చుకునే విద్యార్థికి చాలా ముఖ్యమైన వాక్యాలు. వాటిద్వారా రెండు ముఖ్యమైన సూత్రాలు తెలుస్తాయి.

1. ఉనికి ఉన్నదాన్ని త్రోసిపుచ్చలేము. ఎందుకు? దానికి ఉనికి ఉంది కాబట్టి.
2. ఉనికి లేనిదాన్ని త్రోసిపుచ్చనవసరం లేదు. ఎందుకు? ఉనికి లేనిదానికి మళ్ళీ ఉనికి లేదని చెప్పటం ఎందుకు?

అందువల్ల ఉనికి ఉన్నదాన్ని త్రోసివేయలేము. లేనిదాన్ని త్రోసివేయనవసరం లేదు. అయితే దేన్ని కొట్టివేయగలము? ఈ రెండింటికీ భిన్నంగా ఉన్నదాన్ని. వేదాంత పరిభాషలో దీన్ని సదాసత్ విలక్షణం అంటారు. సత్ అంటే ఉనికి ఉన్నది; అసత్ అంటే ఉనికి లేనిది; విలక్షణం అంటే వీటికి భిన్నంగా ఉన్నది. సదాసత్ విలక్షణం అంటే ఉనికి ఉండీ లేనట్టు ఉన్నది. దాన్ని మిథ్య అంటారు.

**సద్ అసద్భ్యామ్, అనిర్వచనీయం మిథ్యా**

ఉండీ లేనిది అంటే ఉన్నట్టుగా అనిపించేది- అలా జగత్తును లేదనటం వల్ల జగత్తు ఉండీ లేనట్టన్నమాట. అంటే జగత్ మిథ్య, బ్రహ్మ సత్యం. ఇంకో విధంగా చెప్పాలంటే భూమలో ద్వైతం ఉన్నట్టుగా అనిపిస్తుంది కాని నిజంగా లేదు. ఇంకో విధంగా చెప్పాలంటే బ్రహ్మ ద్వైతంగా కనిపిస్తున్న ఈ జగత్తుకు అధిష్ఠానంగా ఉండి, దానికి ఉనికిని ఇస్తున్నది.

బింబ చైతన్యం = బింబానందం

చిదేవ ఆనందః, ఆనందః ఏవ చిత్.

అంతేకాదు బింబసత్ కూడా బింబ చైతన్యమే.

సదేవ చిత్; చిత్తేవ ఆనందః

సత్ చిత్ ఆనందః అనేవి ఒకటే బ్రహ్మకు మూడు పదాలు.

సత్,చిత్,ఆనందాలు ఒకటే. జడవస్తువులో బ్రహ్మలోని సత్ అంశం మాత్రమే ఉంటుంది. చిత్ అంశం, ఆనంద అంశం అందులో ప్రకటితమవవు. అదే స్థూలశరీరం ఉన్న జీవుల్లో సత్ అంశంగా,చిత్ అంశంగా కూడా ప్రకటితమవుతుంది. అందువల్ల బ్రహ్మ సత్,చిత్,ఆనందంగా ప్రకటితమవుతుంది. అందువల్ల తేడా బ్రహ్మలో లేదు. తేడా బ్రహ్మను ప్రతిబింబింపజేసే మాధ్యమంలో ఉంది. మాధ్యమాన్ని బట్టి బ్రహ్మను సత్‌గానో చిత్‌గానో ఆనందంగానో వర్ణిస్తాము.

ఈ మూడే జగత్తులో ప్రతిబింబించినప్పుడు ప్రతిబింబ సత్తా అనీ,

ప్రతిబింబ చైతన్యం అనీ, ప్రతిబింబ ఆనందం అనీ అంటాము. ఇంకో విధంగా చెప్పాలంటే, సదాభాస, చిదాభాస, ఆనంద ఆభాస. సదాభాస, చిదాభాస, ఆనంద ఆభాసలను అనుభవించగలము. కాని శుద్ధ సత్ చిత్ ఆనందాలను అనుభవించలేము. ఈ సత్‌చిత్ ఆనందమే సత్యం జ్ఞానం అనంతం, ఇదే బ్రహ్మ. ఇదే భూమ.

బ్రహ్మను ఆనందంగా నిర్వచించటం రెండు చోట్లే చూస్తాము. ఇక్కడ ఒకచోట. తర్వాత బృహదారణ్యకంలో (3-9-28). అక్కడ ఆనందం పదం వాడింది. బ్రహ్మను **విజ్ఞాన ఆనందం బ్రహ్మ** అంది. ఇక్కడ **సుఖం** పదం వాడింది. ఈ రెండు సందర్భాలలోనూ శంకరాచార్యులు ప్రత్యేకమైన భాష్యం రాశారు. అందులోంచి కొన్ని ముఖ్య అంశాలు చూద్దాము ఇక్కడ.

**1. అద్వైత అవస్థ లేదు -** అద్వైతాన్ని అద్వైత అవస్థగా తీసుకోకూడదు. అద్వైత బ్రహ్మ అన్ని కాలాల్లోనూ ఉంది. అవస్థ అంటే మామూలుగా మనం చూసే జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలు. అవేకాక మూర్ఛావస్థ, మరణం, ప్రళయం కూడా వస్తాయి. ఏ అసవ్థ తీసుకున్నా అది ద్వైత అవస్థ మాత్రమే. అద్వైత అవస్థ అంటూ లేదు. కాకపోతే కొన్ని అవస్థల్లో ద్వైతం వ్యక్తంగా ఉంటే, కొన్ని అవస్థల్లో అవ్యక్తంగా ఉంటుంది.

ఉదాహరణకు జాగ్రదావస్థలోనూ, స్వప్నావస్థలోనూ ద్వైతం వ్యక్తంగా ఉండి తెలుస్తుంది. అదే సుషుప్తి దగ్గరకు వచ్చేసరికి ద్వైతం లేదు అనుకుంటాము. కాని అది పొరపాటు. సుషుప్తి లో కూడా ద్వైతం ఉంది. కాకపోతే అవ్యక్తంగా, అప్రకటితంగా ఉంది. సమాధి స్థితిలో, మూర్ఛలో, మరణంలో, ప్రళయంలో కూడా అంతే. ద్వైతం అవ్యక్తంగా ఉంది. అద్వైత అవస్థ అంటూ లేదు. అది బాగా గుర్తుంచుకోవాలి. దీన్ని శ్రుతి, యుక్తి, అనుభవాల ద్వారా నిరూపించవచ్చు.

**అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత**
**అవ్యక్తనిధానాన్యేవ తత్ర కా పరిదేవనా - గీత 2 - 28**

వ్యక్తద్వైతం నుంచి అవ్యక్తద్వైతంకు; అవ్యక్త ద్వైతం నుంచి వ్యక్త ద్వైతంకు వస్తావు. అందుకని శ్రుతి ప్రమాణం అద్వైత అవస్థ అనేది లేదు అంటున్నది.

**యుక్తి -** తర్కం కూడా పదార్థాన్ని సృష్టించలేము, నాశనం చేయలేము

అంటుంది కదా; అందుకని మనం ఏ అవస్థలో ఉన్నా కూడా ద్వైత ప్రపంచం ఉంటూనే ఉంటుంది. కాకపోతే కొన్ని అవస్థల్లో అవ్యక్తరూపంలో ఉంటుంది. **అనుభవం–** అనుభవం కూడా ద్వైతాన్నే నిరూపిస్తుంది. సుషుప్తిలో ద్వైతం ఉందని ఎలా చెప్పగలము? సుషుప్తిలో ద్వైతం లేకపోతే శరీరం, ఇల్లు, మనస్సు అన్నీ నాశనమవాలి. మనం ఎన్నటికీ లేవలేము! సుషుప్తిలో శరీరం నాశనమవుతుందంటే అసలు నిద్రపోతామా? కంట్లో కారం కొట్టుకుని అన్నా మేలుకునే ఉంటాము. నిర్వికల్ప సమాధి కూడా ద్వైత అవస్థే. ఎలా తెలుసు? అది అవగానే మన మనస్సు మేలుకుంటుంది. ఆలోచనలు తిరిగివస్తాయి. లేస్తాము. అలాగే ప్రళయంలో కూడా ద్వైత అవస్థ ఉంటుంది. ఎలా తెలుసు? తర్వాతి సృష్టి వస్తుంది.

అందువల్ల మొదటి ముఖ్యమైన విషయం. అద్వైత అవస్థ అంటూ లేనే లేదు.

**2.అద్వైత అవస్థ ఉన్నా లాభం లేదు –** అద్వైత అవస్థ లేదు కదా, అద్వైత బ్రహ్మజ్ఞానం ఏ అవస్థలో పొందాలి? ద్వైత, జాగ్రదావస్థలోనే పొందాలి.

అద్వైత అవస్థ లేదని ఇప్పుడే నిరూపించాము. అయినా వాదన కోసం, అద్వైత అవస్థ ఉందనుకుందాము. నిర్వికల్ప సమాధిలో అద్వైత అవస్థ ఉందనుకుందాము. లేదని మనకు తెలుసు. అయినా, ఒకవేళ ఉంటే ఏమిటి పరిస్థితి అని సమీక్షిస్తున్నాము. సరే నిర్వికల్ప సమాధిలో అద్వైత అవస్థ ఉంటే ఏముంటుంది? ఆ ప్రశ్నకు తావే లేదు. అద్వైత అవస్థ అంటేనే రెండో వస్తువు లేదు. ఉన్నదొకటే. ఏమిటా ఒక్కటి? ఆత్మ.

ఇప్పుడు అలాంటి స్థితిని ఊహించుకుందాం. శరీరం లేదు, మనస్సు లేదు. బుద్ధి పనిచేయదు, ఆలోచనలు రావు. శాస్త్రం లేదు, గురువు లేదు. ఆత్మ మాత్రమే ఉంది. అటువంటి అవస్థ వల్ల ఏమిటి లాభం? ఆత్మ అద్వైతం కాబట్టి అప్రమాత. ప్రమాతా, ప్రమేయం విభజన లేదు. అందుకని ఆత్మ నేర్చుకోలేదు.

ఆత్మ అద్వైతం కాబట్టి, అవ్యవహారి. వ్యవహారం నడపలేదు. నేర్చుకోవటం కూడా వ్యవహారం నడవటం కిందకే వస్తుంది. కాబట్టి ఆత్మ నేర్చుకోలేదు.

అందువల్ల రెండో ముఖ్యమైన విషయం, ఒకవేళ అద్వైత అవస్థ ఉన్నా లాభం లేదు.

**3. ఆత్మ నేర్చుకున్నా లాభం లేదు** –అద్వైత అవస్థ లేదు, ఉన్నా ఆత్మ నేర్చుకోలేదు అని పై రెండు విషయాల్లో చూశాము కదా! కాని వాదన కోసం అద్వైత అవస్థ ఉంది. ఆ అవస్థలో ఆత్మ నేర్చుకుంది అని అనుకుందాం. ఆత్మ తాను జ్ఞాని అయిందే అనుకుందాం. అప్పుడూ మనకు లాభం లేదు. ఎందుకు? మనకున్న సమస్యలన్నీ మనస్సులోనూ, బుద్ధిలోనూ ఉన్నాయి. సమస్య అన్మాతలో ఉన్నప్పుడు ఆత్మపోయి జ్ఞానం పొందితే ఏమిటి లాభం? సమస్య సమస్యగానే మిగిలిపోతుంది. ఆత్మ ఎక్కడ జ్ఞానం పొందుతుంది? నిర్వికల్ప సమాధిలో. ఎప్పుడు? అద్వైత అవస్థలో (ఇవన్నీ అనుకుంటున్నాము). అప్పుడు మనస్సు ఉండదు. అందువల్ల మనస్సులోని అజ్ఞానం అలాగే చెక్కుచెదరకుండా ఉంటుంది.

అందువల్ల మూడో ముఖ్యమైన విషయం, ఒకవేళ ఆత్మ నేర్చుకున్నా లాభం లేదు.

వీటివల్ల తేలిందేమిటి? అద్వైత ఆత్మ గురించి ద్వైత అవస్థలోనే అది కూడా జాగ్రదావస్థలోనే నేర్చుకోవాలి. ద్వైత అవస్థ స్వప్నంలో కూడా ఉంది కదా, స్వప్నంలో ఎందుకు నేర్చుకోకూడదు అనకూడదు. ఎందుకంటే స్వప్నంలో బుద్ధి పనిచేయదు. వాసనలు మాత్రమే పనిచేస్తాయి. నిశ్చయాత్మక బుద్ధి పనిచేయనప్పుడు ఎలా నేర్చుకుంటాము? జాగ్రదావస్థలో బుద్ధి పనిచేస్తున్నప్పుడే ఆత్మ స్వరూపం అర్థం చేసుకోవటం కష్టం. దానికి చాలా పదునైన బుద్ధి కావాలి. అలాంటప్పుడు స్వప్నం గురించి వేరే చెప్పాలా?

అందువల్ల ఈ మంత్రం అద్వైత అవస్థను వివరించటం లేదు. అది అద్వైత బ్రహ్మను వివరిస్తున్నది. అద్వైత బ్రహ్మను ద్వైత అవస్థలో, అందులోనూ జాగ్రదావస్థలోనే తెలుసుకోవాలి. అది కూడా గురుశాస్త్ర ఉపదేశం ద్వారా తెలుసుకుని, బ్రహ్మ నిష్ఠలో ఉండాలి.

**అద్వైత బ్రహ్మను ద్వైత అవస్థలో తెలుసుకోవటమెలా?**ద్వైత అసవ్థలో ద్వైతం తెలుస్తుంది కాని అద్వైతం ఎలా తెలుస్తుంది? అద్వైత బ్రహ్మను ద్వైత అవస్థలో తెలుసుకోవటమెలా? దానికి జవాబు– ద్వైత అవస్థలో ఉంటూ, ద్వైత భావనను అనుభవిస్తూ కూడా, శాస్త్ర ప్రమాణం ద్వారా, మనం అనుభవిస్తున్న ద్వైతం

మిథ్య, బ్రహ్మ సత్యం అని తెలుసుకోవచ్చు. ద్వైతప్రపంచం వ్యవహారిక సత్యంలోకి వస్తుంది. అద్వైత బ్రహ్మ దానికన్నా ఉన్నతమైన పారమార్థిక సత్యంలోకి వస్తుంది. అందువల్ల ద్వైత ప్రపంచానికి విలువ లేదు.

ఉదాహరణకు, నా ముందు అద్దం పెట్టుకున్నాను. అద్దంలో ఒక ముఖం ఉంది. నేను నవ్వితే, ఆ ముఖం నవ్వుతుంది. నేను ఉరిమి చూస్తే అది కూడా ఉరిమి చూస్తుంది. అంటే ద్వైతం ఉన్నట్టు ఉందా, లేదా? ద్వైతం అంటే నేను ఒకటి, అద్దంలో ముఖం– నా ప్రతిబింబం రెండు. కాని అక్కడ ఇద్దరు ఉన్నారు అంటానా? లేదే. ఒక్కడే ఉన్నాడు. అది నా ప్రతిబింబమే అంటాము. అంటే **ద్వైత అనుభవం ఉంది. కాని అద్వైత జ్ఞానం కలిగింది.**

అదే విధంగా, ద్వైత అనుభవాన్ని పొందుతూ, ద్వైత అవస్థలో ఉంటూ, జాగ్రదావస్థలో ఉంటూ గురుశాస్త్ర ప్రమాణం ద్వారా, అద్వైత బ్రహ్మ ఉంది అనే నేర్చుకోగలము. ఈ ఖండంలో, ఈ మొదటి మంత్రంలో ఉద్దేశం అదే– **ద్వైత జాగ్రదావస్థలో అద్వైత బ్రహ్మ జ్ఞానం.**

**యత్ర నాన్యత్ పశ్యతి –** మనకు ద్వైత అనుభవం అవుతున్నా కూడా, ఆ బ్రహ్మలో ద్వైత అనుభవం లేదు. ఒక ముఖ్యమైన విషయం ఇక్కడ గుర్తుపెట్టుకోవాలి. అనుభవం జ్ఞానాన్ని ఎన్నడూ సవాలు చేయలేదు. నిఖార్సైన జ్ఞానాన్ని దానికి భిన్నమైన అనుభవం ప్రశ్నించలేదు.

దానికి గొప్ప ఉదాహరణ సూర్యోదయం. సూర్యోదయాన్ని చూస్తూనే ఉన్నా, అది వైజ్ఞానిక శాస్త్రం చెప్పిన సత్యాన్ని (సూర్యుడు భూమి చుట్టూ తిరగడు) నిరాకరించలేదు. భూమి నలుచదరంగా కనిపించినా, భూమి గుండ్రంగా లేదనలేము. భూమి నిలకడగా ఉన్నట్టుగా ఉన్నా, గుండ్రంగా తిరగటం లేదనలేము. నక్షత్రం చాలా చిన్నగా కనిపించినా, అది భూమికన్నా చాలా పెద్దది కాదనలేము. అలాంటిదే ఇది కూడా. ప్రపంచం ద్వైతంగా కనిపించినా, అద్వైత జ్ఞానం ప్రకారం ఉన్నదొకటే బ్రహ్మ అనే జ్ఞానాన్ని కాదనకూడదు. వైజ్ఞానిక శాస్త్రాన్ని, అనుభవానికి విరుద్ధంగా ఉన్నా, ఎట్లా కాదనటం లేదో, అలాగే అద్వైత శాస్త్రాన్ని, అనుభవానికి విరుద్ధంగా ఉన్నా కొట్టివేయకూడదు. ఇది తెలుసుకోవటానికి ధ్యానంలోకో, నిర్వికల్ప సమాధిలోకో వెళ్ళనవసరం లేదు. కళ్ళు తెరుచుకునే జాగ్రదావస్థలోనే, అద్వైత బ్రహ్మను తెలుసుకోవచ్చు.

**స భూమా –** ఈ అద్వైత ఆనందాన్ని భూమ అంటారు.

**అథ యత్రాన్యత్పశ్యత్యన్యచ్ఛృణోత్యన్యద్విజానాతి తదల్పం –** యత్ర అంటే వ్యావహారిక క్షేత్రం. అన్యత్పశ్యతి– చూసే వ్యక్తి వేరు, చూడబడే వస్తువు వేరు. అన్యత్ శృణోతి– వినేవ్యక్తి వేరు, వినబడే శబ్దం వేరు, అన్యత్ విజానాతి – నేర్చుకునే వ్యక్తి వేరు, నేర్చుకోబడే వస్తువు వేరు.

ఇంతకుముందే చూశాం అనంతం మాత్రమే సుఖం. అంటే పరిమితమైనదాన్లో ఇసుమంత కూడా సుఖం లేదు. ప్రమాతా – ప్రమాణంలో సుఖం లేదు. ప్రమాతా–ప్రమేయంలో సుఖం లేదు.

మరి వ్యవహారిక ప్రపంచంలో సుఖం లేకపోతే, నాకు సంగీతనాట్యాలలో, అన్నంలో, టీవీలో ఆనందం ఎలా కలుగుతోంది?

**యది అత్ర సుఖం నాస్తి, కథమ్ అల్ప విషయేభ్యః అహం సుఖం అనుభవామి?**

దీనికి జవాబు ముందే చూశాము. ఆ సుఖం వాటిలో లేదు. అవి ఆత్మానందాన్ని లేదా బ్రహ్మానందాన్ని ప్రతిబింబించే ప్రతిబింబ ఆనందాలు మాత్రమే. అంతకుముందు దీనికి ఉదాహరణ కుక్క ఎముకని తినటం చూశాము. ఇప్పుడు వేరే చూద్దాము.

మీ చేతిలో ఒక అద్దం ఉందనుకుందాము. అద్దంలో మూడు అంశాలు కనిపిస్తున్నాయి. ఫ్రేము,అద్దం, అందమైన మీ మొహం. వాటిలో అద్దానికి చెందినవేమిటి? రెండే– ఫ్రేము, అద్దం. అందమైన లతలతో చెక్కిన ఫ్రేము, స్పష్టంగా కనపడే బెల్జియమ్ గ్లాసు. మొహం అద్దంలో దానికి దగ్గరగా కనబడినా అద్దానిది కాదు. ఎందుకు? అది అద్దానిదైతే ఫ్రేము, అద్దంలాగా అది అందులోనే ఉండిపోవాలి. అలా ఉంటే నేను చూసినప్పుడు, నా మొహం కనిపిస్తుంది. బాగానే ఉంది. కాని ఇంకో వ్యక్తి అదే అద్దంలో చూసినప్పుడు అతనికి రెండు మొహాలు కనిపించాలి. నా మొహం అతని మొహం. అవునా, కాదా? అందువల్ల అద్దంలో మూడు అంశాలు ఉన్నట్టుగా అనిపించినా, అద్దానికి చెందినవి రెండే. మూడోది నా మొహం. నాభుజాల మీదే ఉంది.

అలాగే మనం ఒక వస్తువులో ఆనందాన్ని పొందుతున్నప్పుడు మూడు విషయాలను అనుభవిస్తున్నాము. అవి నామం, రూపం, ఆనందం. ఇప్పుడు దీన్ని అద్దం ఉదాహరణతో అన్వయిస్తే, విషయం తేలిగ్గా అర్థమవుతుంది. నామం,రూపం మాత్రమే వస్తువుకు చెందుతుంది. ఆనందం నాకు

చెందుతుంది. ఆనందం వస్తువులో ఉన్నట్టు కనబడినా(మొహం అద్దంలో ఉన్నట్టు కనబడినా) ఆనందం నాది. అంటే వ్యవహారిక ప్రపంచంలో అనుభవించే ఆనందం వ్యవహారికప్రపంచానికి సంబంధించినది కాదు. అది వ్యవహారిక విషయంలో ప్రతిబింబిస్తున్న పారమార్థిక బ్రహ్మానందం. అందుకే తదల్పం అన్నాడు సనత్కుమారుడు.

**అస్తి భాతి ప్రియం రూపం నామ చేత్యంచపఞ్చకం**
**ఆద్యత్రయం బ్రహ్మరూపం జగద్రూపం తతోద్వయం।**
**– దృగ్దృశ్యవివేకము**

దృగ్దృశ్యవివేకములో మనం ఐదు విషయాలు ఎప్పుడూ అనుభవిస్తామని వస్తుంది. ఏమిటవి? సత్,చిత్,ఆనందం, నామం, రూపం. వీటిలో నామం, రూపం మాత్రమే వస్తువుకు చెందుతాయి. సత్,చిత్,ఆనందాలు భూమకు చెందుతాయి. అందుకే తదల్పం. వ్యావహారిక ప్రపంచంలో ప్రతీదీ అల్పం. అందువల్ల సుఖం లేదు.

**యో వై భూమా తదమృతమ్ –** ఏదైతే భూమయో అది నిశ్చయంగా అమృతం. అమృతం అంటే అనంతం. మరణం లేనిది.

అదే ఆనందం, మనసులో ప్రతిబింబించినప్పుడు శాశ్వతం కాదు. ఎందుకు? ప్రతిబింబ ఆనందం ప్రతిబింబించే మాధ్యమం ఉన్నంతవరకే కనిపిస్తుంది. నా మొహం అద్దంలో ప్రతిబింబ మవుతుంది. ఎప్పుడు? నేను అద్దం తీసి, నా ముందు పెట్టుకున్నప్పుడే. మళ్ళీ నా ముందు నుంచి తీసేస్తే, ప్రతిబింబం కూడా పోతుంది.

అలాగే ప్రియ, మోద, ప్రమోదాల వృత్తులు నా మనస్సులో ఉన్నప్పుడే ఆనందం, అది కూడా హెచ్చుతగ్గుస్థాయిల్లో, బాహ్యంగా ప్రకటితమవుతుంది. మంచి వార్త వింటే, మొహం వెలుగుతుంది, దుర్వార్త వింటే మొహం మాడిపోతుంది. ఆనందం, సుఖం, ఆనందం, దుఃఖాల మధ్య కొట్టుమిట్టాడుతూ ఉంటుంది ప్రతిబింబానందం. అందువల్ల అది అమృతం కాలేదు.

**యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవతే।**
**ఆద్యంతవంతః కౌంతేయ న తేషు రమతే బుధః॥** గీత **5-22**

ప్రతిబింబ ఆనందంతో లయమవకూడదు. అది వస్తే ఆనందించు,

కాని దానితో మమేకం చెందకు. ఇందాక చూసినట్టుగా ప్రతిబింబ ఆనందంలో స్థాయి బేధాలుంటాయి. ప్రియం, మోదం, ప్రమోదం– ఆనందం, ఆనందతరం, ఆనందతమం. అదే భూమానందంలో లేదా బ్రహ్మానందంలో ఈ స్థాయీ బేధాలు ఉండవు. కాకపోతే భూమానందం అనుభవంలోకి రాదు. అనుభవంలోకి వచ్చేది ప్రతిబింబానందం.

అందుకని భూమానందాన్ని ఎలా అనుభవించాలి అని ఎన్నడూ అడుగకూడదు. ఆ ప్రశ్నే పెద్ద తప్పు. మీ అసలైన మొహాన్ని ఎన్నడూ ఎలా చూసుకోలేరో, మీ అసలైన ఆనందాన్ని కూడా ఎన్నడూ అనుభవించలేరు. అసలైన ఆనందం అనుభవించేది కాదు. స్వీకరించేది.

ఎవరైనా నేను నిర్వికల్ప సమాధిలో బ్రహ్మానందాన్ని పొందాను అంటే అది అత్యంత పెద్ద పొరపాటు. అతను ఆనందం అనుభవించి ఉండవచ్చు. అంతవరకూ ఏం సందేహం లేదు. కాని దాన్ని బ్రహ్మానందం అనుకోవటంలోనే ఉంది పొరపాటంతా. అది ప్రతిబింబ ఆనందం మాత్రమే.

**అథ యదల్పం తన్మర్త్యమ్–** భూమకు భిన్నంగా, ఏదైతే అల్పంగా ఉందో అది శాశ్వతం కాదు.

అయితే ప్రతిబింబ ఆనందాన్ని అనుభవించాలా, వద్దా? తప్పకుండా అనుభవించండి కాని ఆనందం వస్తువులో లేదు. నాలో ఉంది. అని గ్రహించుకుని మరీ అనుభవించండి. అప్పుడు ఆ వస్తువు దూరమైనా, మీకు వచ్చిన ఆనందం పోదు. అసలైన మాస్టర్ కాపీ మీ దగ్గరే ఉంది. అందుకే భార్యా,పిల్లలు, వస్తువులు,అనుబంధాలు ఉన్నా లేకపోయినా, మీ మాస్టర్ కాపీ అయిన బ్రహ్మానందం మిమ్మల్ని విడిచిపోదు. ఇక్కడితో భూమ నిర్వచనం అయింది.

**ఏది భూమయో అది నిశ్చయంగా అమృతం.**

**భూమకు భిన్నంగా ఏది ఉందో అది అశాశ్వతం.**

ఇది నిర్వచనం.

**స భగవః కస్మిన్ ప్రతిష్ఠిత ఇతి –** ఓ భగవాన్, ఈ బ్రహ్మానందం దేనిలో ప్రతిష్ఠితమై ఉంది? అంటే ఎక్కడ ఉంది?

విషయానందం తీసుకుంటే దానికొక ఆధారం ఉంది. 'అది వస్తువులో ఉంది,' అంటాం లేదా 'నీ మనస్సులో ఉంది,' అంటాం. లోపల కానీ,

బయట కానీ ఉంది అనుభవంలోకి వచ్చే ఆనందం, ప్రతిబింబ ఆనందం. ప్రతిబింబ అంటేనే దాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమం ఒకటి ఉండి తీరాలి.

ప్రతిబింబ ఆనందస్య ఆశ్రయః వర్తతే;

బింబ ఆనందస్య కశ్చిత్ రూపస్య భూమ్నః బ్రహ్మణః ఆశ్రయః

కః? ప్రతిష్ఠితాకా? దానికి ఆధారం ఏమిటి?

**స్వే మహిమ్ని (ప్రతిష్ఠితః)** – దాని మహిమలోనే ప్రతిష్ఠితమై ఉంది.

**యది వా న మహిమ్నీతి** – లేదా, అది దేనిమీదా ఆధారపడిలేదు. దానికి ఆధారం ఏదీ లేదు.

రెండు జవాబులు చెపుతాడు సనత్కుమారుడు. ఒకటి మామూలు జవాబు. బ్రహ్మ తన మహిమ మీదే ఆధారపడి ఉంది రెండోది మెరుగుపరచిన జవాబు. 'బ్రహ్మ దేనిమీదా ఆధారపడి లేదు.'

సనత్కుమారుడే రెండింటినీ వివరిస్తాడు తర్వాత వచ్చే మంత్రంలో.

**మంత్రం-2** ఈ మంత్రం అంతకుముందు మంత్రానికి వ్యాఖ్యానం.

**స్వేమహిమ్ని యది వాన మహిమ్నీతి** – ముందు భూమ తన మహిమ మీదే ఆధారపడి ఉంది అని చెప్పి, మళ్ళీ కాదు, భూమ దేనిమీదనూ ఆధారపడి లేదు అన్నాడు. ఎందుకలా చెప్తాడు?

మామూలుగా ఒక వ్యక్తి మహిమ అతనికున్న వస్తువుల వల్ల వస్తుంది. అందువల్ల వస్తువులను మహిమగా కీర్తిస్తారు. ఇప్పుడు ఎవరికైనా మహిమ ఉంది అంటే అతనికి కొన్ని వస్తువులున్నాయి, దానివల్ల గొప్పవాడయ్యాడు అని అర్థం. అంటే అతను వేరు, అతని వస్తువులు వేరు. అందువల్ల భూమ తన మహిమ మీద ఆధారపడి ఉంది అంటే భూమకు కొన్ని వస్తువులు ఉన్నాయి, భూమ వేరు, వస్తువులు వేరు అనుకుంటే ద్వైతం వస్తుంది.

అందుకని సనత్కుమారుడు తన జవాబుని మార్చాడు. ఈ మంత్రంలో మహిమకు మామూలుగా ఇచ్చే అర్థం ఇస్తున్నాడు.

**ఇహ మహిమేత్యాచక్ష్యతే** – ఇహ అంటే ఈ ప్రపంచంలో, ఇక్కడ, మామూలుగా–ఈ క్రింది వస్తువులను మహిమ అంటారు.

**గో అశ్వమ్** – గోవులను, గుఱ్ఱాలను; **హస్తి–** ఏనుగు, **హిరణ్యం–** బంగారం, **దాస** – సేవకులు; **భార్యమ్–** భార్య; **క్షేత్రాణ్యాయతనానీతి** – పొలాలు, ఇళ్ళు. వాటన్నింటికీ **మహిమేత్యాచక్షతే** కలుపుకోవాలి.

వీటన్నింటినీ మహిమ అని అంటారు. ఇవి ఉన్నంతవరకూ అతను గొప్పవాడు. అవి పోగానే అతని విలువ కూడా పోతుంది. కాని ఇలాంటి మహిమలు బ్రహ్మకు వర్తించవు.

**యత్రాన్యత్పశ్యత్యన్యచ్ఛృణోత్యన్యద్విజానాతి**

అందువల్ల బ్రహ్మకు మహిమను కూర్చే వస్తువులు ఉంటాయనుకోకూడదు.

**నాహమేవం బ్రవీమి–** నేను బ్రహ్మ దాని మహిమ మీదే ఆధారపడి ఉంది అని చెప్పినప్పుడు ఇలా తనకంటే భిన్నమైన వాటిని ఆశ్రయించి ఉందని చెప్పటం లేదు. ఎందుకంటే అలా చెపితే ద్వైత భావన వస్తుంది.

**అన్యో హ్యన్యస్మిన్ ప్రతిష్ఠిత ఇతి –** ఇక్కడ వాక్యాల వరుసను మారుస్తున్నాము. **నాహమేవం బ్రవీమి** తర్వాత **అన్యోహ్యన్యస్మిన్ ప్రతిష్ఠితః ఇతి** కలుపుకోవాలి. నేను ఈ అర్థం చెప్పటం లేదు. ఎందుకంటే, అలా చెపితే ద్వైతం వస్తుంది.

అయితే బ్రహ్మ తన మహిమ మీద ఆధారపడి లేదు అంటే ఏమిటి అర్థం అని నారదుడు అడిగినట్టుగా తీసుకోవాలి. దానికి సనత్కుమారుని జవాబు, వదిలేసిన భాగంలోంచి,ఇప్పుడు తీసుకోవాలి.

**బ్రవీమీతి హోవాచ –** దీనికి ఏవం కలుపుకోవాలి. అప్పుడు ఏవం బ్రవీమి ఇతి హోవాచ అవుతుంది. నేను మార్చిన నిర్వచనం ద్వారా చెప్పాలని అనుకున్నది ఈ క్రింది నిర్వచనం. అది 25లో వస్తుంది. దాని సారాంశం బ్రహ్మకు ఏదీ ఆధారం కాదు.

**పంచవింశః ఖణ్డః (25)**

**స ఏవాధస్తాత్స ఉపరిష్టాత్స పశ్చాత్స పురస్తాత్స దక్షిణతస్స ఉత్తరతస్స ఏవేదగ్ం సర్వమితి॥ అథాతోఽహంకారాదేశ ఏవాహమేవాధస్తాదహముపరిష్టాదహం పశ్చాదహం పురస్తాదహం దక్షిణతోఽహముత్తరతోఽహమేవేదగ్ం సర్వమితి ॥1॥ అథాత ఆత్మాదేశ ఏవ ఆత్మైవాధస్తాదాత్మోపరిష్టాదాత్మా పశ్చాదాత్మా పురస్తాదాత్మా దక్షిణత ఆత్మోత్తరత ఆత్మైవేదగ్ం సర్వమితి । స వా ఏష పశ్యన్నేవం మన్వాన ఏవం విజానన్నాత్మరతిరాత్మక్రీడ ఆత్మమిథున ఆత్మానన్దస్స స్వరాడ్ భవతి తస్య సర్వేషు లోకేషు కామచారో భవతి। అథ యేఽన్యథాఽతో విదురన్యరాజానస్తే క్షయ్యలోకా భవన్తి తేషాగ్ం సర్వేషు లోకేష్వకామచారో భవతి ॥2॥**

**మంత్రం-1** ఉన్నదొకటే బ్రహ్మ. బ్రహ్మకు ఏ వస్తువులూ లేవు అంటే ఈ జగత్తు మాటేమిటి? జగత్తు బ్రహ్మ స్వంతం కాదా, జగత్తు బ్రహ్మకు ఆధారం కాదా అనే ప్రశ్న సహజంగా ఉత్పత్తి అవుతుంది. దానికి జవాబు ఈ మంత్రంలో వస్తుంది.

బ్రహ్మకు స్వంతమైన వస్తువు వేరే లేదు. ఎందుకంటే ఈ జగత్తంతా బ్రహ్మే. ఈ జగత్తు బ్రహ్మది కాదు. జగత్తే బ్రహ్మ. అనేక నామరూపాలతో బ్రహ్మే జగత్తుగా భాసిల్లుతున్నది. జగత్తుగా చూస్తున్నది బ్రహ్మనే! జగత్తులో ఎటుచూసినా ఉన్నది బ్రహ్మే. అనేకంగా కనిపిస్తున్న జగత్తు, అనేక నామరూపాలున్న జగత్తు - ఏకంగా ఉన్న బ్రహ్మ.

'అల నీటికి ఆధారం' అనగలరా? లేదు. ఎందుకంటే, నీటికి భిన్నంగా అలే లేదు. అలాగే సముద్రం నీటికి ఆధారం అవలేదు. నీటికి భిన్నంగా సముద్రం లేదు. అందుకని రెండో వస్తువు లేదు.

**సర్వం బ్రహ్మమయం జగత్**

ఇది చాలా ముఖ్యమైన మంత్రం. బాధా సామానాధికరణ్య మంత్రం అంటారు దీన్ని. ఎందుకంటే ఇందులో జగత్తును మిథ్యగా తీసివేసి, బ్రహ్మను అద్వైత బ్రహ్మగా నిరూపిస్తాము. ముండకంలో ఇలాంటి మంత్రమే ఉంది.

**బ్రహ్మైవేదమమృతం పురస్తాద్**
**బ్రహ్మ పశ్చాద్ బ్రహ్మ దక్షిణశ్చోత్తరేణ।**
**అథ శ్చోర్ధ్వంచ ప్రసృతం**
**బ్రహ్మైవేదం విశ్వమిదం వరిష్టమ్॥ - ముండక 2-2-12**

**స ఏవాధస్తాత్ -** సః అంటే భూమ. భూమ క్రింద ఉంది; **స ఉపరిష్టాద్-** పైన ఉంది. **స పశ్చాత్-** వెనక ఉంది; **స పురస్తాత్-** ముందు ఉంది; **స దక్షిణతః -** కుడివైపు ఉంది; **స ఉత్తరతః -** ఎడమవైపు ఉంది. ఒక్కముక్కలో చెప్పాలంటే నాలుగుదిక్కులలో + పైన, కింద అంతా భూమయే ఉంది.

మరి అయితే జగత్తు మాటేమిటి? బ్రహ్మను సరిగ్గా అర్థం చేసుకోకపోతే అది జగత్తు. మరి బ్రహ్మ ఏమిటి? సరిగ్గా అర్థం చేసుకున్న జగత్తు బ్రహ్మ. రజ్జుసర్పభ్రాంతి లాంటిదే ఇది. తాడును సరిగ్గా అర్థం చేసుకోకపోతే అది పాము. సరిగ్గా అర్థం చేసుకున్న పాము తాడు. అందుకే

జ్ఞాని జగత్తును బ్రహ్మగా చూస్తే, అజ్ఞాని బ్రహ్మను జగత్తుగా చూస్తాడు.

**యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ। గీత 2-69**

బ్రహ్మను తెలుసుకోవటానికి కళ్ళు మూసుకోనవవసరం లేదు.

**ఏవేదగ్ం సర్వమితి - సః భూమా** కలుపుకుంటే సః భూమా ఏవ ఇదం సర్వం అని వస్తుంది. ఉన్నదంతా భూమ తప్ప ఏదీ కాదు.

ఇంతా చెప్పినా మళ్ళీ సనత్కుమారునికి ఒక అనుమానం పట్టుకుంది. ఆ భూమ సత్, ఆ భూమ చిత్, ఆ భూమ ఆనందం అని చెప్పుకుంటూ పోతే. 'ఆ' భూమ ఏదో వస్తువు అయిపోతుంది. అప్పుడు భూమ లేదా బ్రహ్మ గొప్ప అని తెలుసుకుని లాభం లేదు. పైపెచ్చు ఇంకా బాధపడతాను. అందుకని 'సః' పదం ఉన్నచోట అది తీసి, 'అహం' పదం పెట్టాలి అంటున్నాడు సనత్కుమారుడు. అది బ్రహ్మ అంటే నా జీవత్వం పోదు. అహం బ్రహ్మ అస్మి అంటేనే నా జీవత్వం, బ్రహ్మత్వంగా మారుతుంది.

ఒక అల, 'అలలన్నీ నీరు, సముద్రం నీరు, బుడగ నీరు, అంతా నీరు,' అని చెబితే చాలదు. అలా చెపితే 'నీ సంగతి ఏమిటి?' అంటే 'నేను అలనే' అంటుంది. దానివల్ల లాభం లేదు. అందుకని, అల, 'అలలన్నింటి వెనుకా, సముద్రం వెనుకా, బుడగ వెనుకా ఉన్న నీటిని నేనే,' అని చెప్పగలగాలి. అందుకే సః ని అహంగా మార్చి చెప్పాలి. అందుకే **తత్త్వమసి** మహావాక్యం వచ్చింది.

**అథాతః -** అది బ్రహ్మ అని చెప్పాక, నేను బ్రహ్మ అని చెప్పాలి.

**అహంకారాదేశ ఏవ-** ఇక్కడ అహంకారాన్ని చత్వారి అంతఃకరణలలోని అహంకారంగా (ఈగోగా) తీసుకోకూడదు. అహమ్ అనే శబ్దాన్ని భూమస్థానంలో

ఉపయోగించటం. సఃను అహంతో మార్చి అదే వాక్యం చెప్పటం. అంటే నేనే క్రింద ఉన్నాను, పైన ఉన్నాను వగైరా. అంతటా నేనే ఉన్నాను అనేది అసలు అర్థం. ఇది చెప్పకపోతే నేను జీవిని అది జగత్తు. ఓ దేవా, నన్ను రక్షించు అనే త్రిపుటి బుద్ధిలోనే ఉంటాము. అది పోవాలి.

ఇది చాలా ముఖ్యమైన, అందమైన మంత్రం.

**అహంకారాదేశ ఏవాహమేవాధస్తాత్ -** నేనే కింద ఉన్నాను; **అహముపరిష్టాద్-** నేను పైన ఉన్నాను. **అహం పశ్చాద్ -** నేను వెనుక; **అహం పురస్తాద్ -**

నేను ముందు, **అహం దక్షిణతః** – నేను కుడివైపు; **అహముత్తరతః**– నేను ఎడమవైపు; **అహమేవేదగ్ం సర్వమితి** – అంతటా నేనే ఉన్నాను.

మొదటిభాగం – రెండో భాగం కలిపితే మహావాక్యం.

**స ఏవ భూమా అధస్తాత్= అహంకారాదేశ ఏవాహమేవాధస్తాత్**

**అహమన్న-మహమన్న – మహమన్నమ్।**

**అహమన్నాదో3౽ హమన్నాదో3౽ హమన్నాదః॥ – తైత్తిరీయం**

**యః సాక్షాత్ కురుతే ప్రబోధసమయే, స్వ ఆత్మానమ్ ఏవ అద్వయం– దక్షిణామూర్తిస్తోత్రం**

ఇవి మరి కొన్ని ఉదాహరణలు. కేవలం బ్రహ్మ లక్షణం చెపితే అది మహా వాక్యం అవదు.

**యత్రాన్యత్పశ్యత్యన్యచ్ఛృణోత్యన్యద్విజానాతి**

ఇది బ్రహ్మ లక్షణ మంత్రం. దీన్ని అవాంతర వాక్యమంత్రం అంటారు. ఐక్యాన్ని చెప్పేదాన్నే మహావాక్యమంత్రం అంటారు. భూమ = నేను అని వచ్చింది కాబట్టి ఇది మహా వాక్య మంత్రం.

**మంత్రం–2** ముందు సనత్కుమారుడు అంతటా ఉన్నది భూమయే అన్నాడు. మళ్ళీ అలా చెపితే బ్రహ్మను బాహ్యవస్తువుగా చూపించినట్టవుతుందనీ, అది పరోక్షజ్ఞానం అవుతుందనీ, దానివల్ల ఏమీ లాభం లేదనీ అనుకున్నాడు. అక్కడ 'అహం' పదం వేసి, దాన్ని అపరోక్ష జ్ఞానం చేయాలి. అహం బ్రహ్మ అస్మి చెప్పాలి. మళ్ళీ సనత్కుమారుడు ఖంగారుపడ్డాడు. ఎందుకు?

**అహం బ్రహ్మ అస్మి** అనగానే సరిపోదు. అహం అంటే ఏమిటో సరిగ్గా తెలియాలి. అహం శబ్దానికి వాచ్యార్థం తీసుకోకూడదు. లక్ష్యార్థం తీసుకోవాలి. 'అహం' వాచ్యార్థం ఏమిటి? అహంకారం. స్థూల,సూక్ష్మ, కారణ శరీరాలు, చిదాభాస ఉన్న వ్యష్టి. ఒక్కముక్కలో చెప్పాలంటే పరిమితమైన అహం. కాని అహం బ్రహ్మ అస్మిలో అహం అంటే బింబ చైతన్యం లేదా సాక్షి చైతన్యం. శరీరం నుంచి ఉత్పత్తి చెందింది కూడా కాదు అనే చైతన్య లక్షణాలను గుర్తు తెచ్చుకోవాలి. అది తెలుసుకుంటే, ఏమాత్రం సంశయం లేకుండా చెప్పగలరు.

**మయ్యేవ సకలం జాతం మయి ప్రతిష్ఠితమ్।**

**మయి సర్వం లయం యాతి – కైవల్యం**

అందుకని ఇక్కడ అహం అంటే అహం పద లక్ష్యార్థం తీసుకోవాలి.

త్రిపుటి బుద్ధి నుంచి ద్విపుటికి రావాలి. త్రిపుటి బుద్ధిలో ఉంటే దాసోహం అంటాము. ద్విపుటి బుద్ధిలో ఉంటే సోహం అంటాము, సోహమే మోక్షం. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**అథాత ఆత్మాదేశ ఏవ ... ఆత్మోత్తర తః** అంటే అహం పద లక్ష్యార్థం తీసుకున్నాక అని అర్థం. కేవలం ఆత్మ వాడితే మళ్ళీ ఆత్మ వేరు, నేను వేరు, నేను బాధాతప్త జీవి అని అనుకుంటాము. అందుకని ఆత్మ అంటే అసలు నేను. అసలు నేనే పైన ఉన్నాను, కింద ఉన్నాను.

**ఆత్మైవేదగ్ం సర్వమితి –** అసలు నేను అంతటా ఉన్నాను.

అయితే జీవి 'నేను' మాటేమిటి? అది నేను వేసుకున్న తాత్కాలిక వేషం. ఎందుకు? ఆనందం కోసం. స్వప్న దృష్టాంతం తీసుకుంటే విషయం బాగా అర్థమవుతుంది. నేను స్వప్న శరీరంతో మమేకం అయినప్పుడు, స్వప్న ప్రపంచంలో ఒక జీవిని. కాని నేను లేచి, జాగ్రద్ శరీరంతో మమేకం చెందినప్పుడు, స్వప్న ప్రపంచంలోని జీవిని కాను, ఆ స్వప్న ప్రపంచాన్ని సృష్టించిన సృష్టికర్తను! అలాగే స్థూల శరీరంతో మమేకం చెందితే నేను జీవిని. సాక్షి చైతన్యంతో మమేకం చెందితే సృష్టికర్తను. నేను జీవిని అనుకోవటం మాని పరమాత్మను అనుకోవాలి. దాసోహం అనటం మాని సోహం అనాలి. ఆత్మ ఏవ ఇదగ్ం సర్వం అంటే అర్థం అదీ!

**భూమ–** ఆత్మ ఐక్యజ్ఞానం కలిగితే ఫలం ఏమిటి? అది తర్వాత వచ్చే భాగంలో వస్తుంది.

**స వా ఏషః –** అందుకని ఆ వ్యక్తి;

**పశ్యన్నేవం మన్వాన ఏవం విజానన్ –** శ్రవణమనన నిధిధ్యాసనలు చేశాక, పశ్యన్– శ్రవణం, మన్వాన్– మననం, విజానన్– నిదిధ్యాసనం, నిష్ఠ. అతనికి కలిగే ఫలం ఏమిటి?

**ఆత్మరతిరాత్మక్రీడ ఆత్మమిధున ఆత్మానన్దః –** అతనికి ఒక్క సారిగా, అన్నిరకాల ఆనందాలు దొరుకుతాయి.

**సోఽశ్నుతే సర్వాన్ కామాన్సహ బ్రహ్మణా విపశ్చితేతి**

ఇందులోనే ఇంకోటి కూడా ఉంది.

**తే యే శతం మానుషా ఆనందాః।**
**స ఏకో మనుష్యగంధర్వాణామానందః।**
**శ్రోత్రియస్య చాకామహతస్య।**

జ్ఞాని ప్రపంచంలోని ఆనందాలన్నింటినీ ఒక్కసారిగా పొందుతాడు. ప్రాపంచిక ఆనందాలు అతనివి ఎలా అవుతాయి? దానికి కారణం ఇది. ప్రపంచంలో ఎవరే ఆనందం అనుభవించినా, ఆ ఆనందాలన్నీ ఒక్క ఆనందం యొక్క ప్రతిబింబం అని తెలుసుకుంటాడు అతను. ఆ ఒక్క ఆనందం ఏమిటి?అతని స్వంత ఆనందం. ఆనందాలన్నీ తన ప్రతిబింబం అనుకుంటాడు. ఆ ఆనందాలేమిటో కొన్ని ఉదహరించింది ఉపనిషత్తు.

ఆత్మరతిః– రతిః అంటే తీపి జ్ఞాపకాలను నెమరువేసుకోవటం లేదా భవిష్యత్తు గురించి బంగారు కలలు కనటం. అంటే బాహ్యమైన వస్తువు లేదు. నాలోనే ఉన్న ఊహా ప్రపంచం. అది ఆత్మరతిః

ఆత్మక్రీడాః – క్రీడ అంటే బాహ్యమైన వస్తువుల ద్వారా పొందే ఆనందం.

**బాహ్య సాధన నిరపేక్ష రతిః**
**బాహ్యసాధనా సాపేక్ష క్రీడ**

తనలోనే రమించటం రతిః, బాహ్యసాధనలతో వినోదం పొందటం క్రీడ. కాని జ్ఞానికి రెండూ ఒకటే.

**యో వై భూమా తత్సుఖం నాల్పే సుఖమస్తి భూమైవ సుఖమ్ 7-23-1**

అశాశ్వతమైన వస్తువుల్లో అణువంత కూడా సుఖం లేదు. ప్రారబ్ధపుణ్యం వల్ల ఏదైనా ఆనందం పొందితే పొందవచ్చు. ఉదాహరణకు ఏదో రుచికరమైన వంటకం తిని ఆనందం పొందినా, ఆ ఆనందం ఆ పదార్థంలోనో, తన నాలుకమీదో లేదు. తనలోనే ఉందని గ్రహిస్తాడు. తినటం ముగిస్తే, ఆనందం పోదు. ప్రతిబింబ ఆనందం మాత్రమే పోతుంది. బింబ ఆనందం, మాస్టర్‌కాపీ అలాగే ఉంటుంది. అందుకని పుణ్యం వల్ల వచ్చే సుఖం వచ్చినా పొంగిపోడు. పోయినా కృంగిపోడు. అందుకే అతనికి రతిః ఆత్మానందమే, క్రీడ కూడా ఆత్మానందమే.

ఆత్మమిథునః– అనుబంధాల వల్ల కలిగే ఆనందం. క్రీడ అంటే వస్తువుల వల్ల కలిగే ఆనందం. మిథునం అంటే మనుష్యుల వల్ల కలిగే ఆనందం. చాలామంది అనుబంధాలు లేకపోతే ఆనందం లేదు అనుకుంటారు. అందుకే

మనస్సుకు దగ్గరైన వాళ్ళు దూరమైతే బాధపడతారు. కాని మిథున ఆనందం కూడా ఆత్మానందమే. ఆత్మ మిథునః అంటే మిథున ఆనందం కూడా అతనికి ఆత్మానందమే.

ఒక్కమాటలో చెప్పాలంటే, ప్రతిదీ ఆత్మానందమే. బింబ ఆనందం లేదా ప్రతిబింబ ఆనందం. ఎదురుగా అద్దం ఉంటే మీ ప్రతిబింబం వస్తుంది. అద్దం లేకపోతే ప్రతిబింబం పోతుంది. మీ మొహం అలానే ఉంటుంది. అందువల్ల ప్రతిబింబం వచ్చిందా సంతోషం. రాలేదా నష్టమేమీ లేదు. ప్రతిబింబ ఆనందం మీద మక్కువా లేదు, ద్వేషమూ లేదు. ఈ ఆత్మానందమే భూమ విద్య యొక్క ఫలం.

ముందేమో సర్వం బ్రహ్మ అంది. తర్వాత ఆత్మ సర్వం అంది. ఈ రెండూ కలిపితే బ్రహ్మ = ఆత్మ. బ్రహ్మ, ఆత్మల ఐక్యం పరోక్షంగా చెప్పబడింది. ఆరో అధ్యాయంలో తత్త్వమసి శ్వేతకేతో వాక్యం ద్వారా ప్రత్యక్షంగా చెప్పింది. ఇక్కడ పరోక్షంగా చెప్పింది. సాధారణంగా ఐక్యం సత్ రూపం ద్వారానో, చిత్ రూపం ద్వారానో చూపిస్తుంది. కాని ఇక్కడ ఐక్యం ఆనంద రూపంలో చూపిస్తున్నది. కాని ఆత్మ అంటే స్థూల, సూక్ష్మ, కారణ శరీరాల్లో ఏదీ కాదు, సాక్షిచైతన్యం అని మర్చిపోకూడదు. దీనికి ఫలం ఏమిటి? నేను సుఖ స్వరూపుడిని అని అర్థం చేసుకోవటం.

ఈ విధంగా ఆనందానికి నాలుగు పదాలు వాడింది ఇక్కడ – రతి, క్రీడ, మిథునం, ఆనందం – ఇవన్నీ హెచ్చుతగ్గులున్న ఆనందాలు. వీటినే తైత్తిరీయంలో ప్రియ, మోద, ప్రమోదాలు అంది. ప్రతిబింబ ఆనందానికే హెచ్చుతగ్గులు ఉంటాయి కాని బింబ ఆనందానికి ఉండవు.

బాహ్య ప్రపంచపు సుఖాల వెంట పరుగులు తీయకపోవటాన్ని జీవన్ముక్తి అంటారు. నా మొహాన్ని నేను ప్రత్యక్షంగా చూడలేనట్టే, ఆత్మానందాన్ని ప్రత్యక్షంగా పొందలేను. ఆత్మానందాన్ని స్వీకరించాలి గాని అనుభవించలేము. ప్రతిబింబ ఆనందం నా ఆధీనంలో లేదు. అది అనేక అంశాల మీద ఆధారపడి ఉంది. ఆఖరికి కర్మమీద కూడా. అందుకని జ్ఞాని నేను ఆనందాన్ని అని చెప్తాడు. ఇది జీవన్ముక్తి.

**స స్వరాడ్ భవతి –** ప్రారబ్ధకర్మ ముగిశాక, విదేహ ముక్తి పొందుతాడు. సంచితకర్మలు జ్ఞానాగ్నిలో దగ్ధమవుతాయి. ఆగామి కర్మలు అంటవు.

ప్రారబ్ధకర్మ ముగియగానే కర్మ క్షయం అయిపోతుంది. అందుకని అతనికి పునర్జన్మ లేదు. నిరుపాధిక ఆత్మగా మిగిలిపోతాడు. అతనికి ఉపాధి ఉండదు. విదేహముక్తి పొందిన జ్ఞాని ఎక్కడ ఉంటాడు?

**తస్య సర్వేషు లోకేషు కామచారో భవతి –** సర్వేషు లోకేషు– 14 లోకాల్లో ఎక్కడైనా దొరుకుతాడు. కామచారః – యథేచ్ఛగా ఉంటాడు. ఏ రూపంలో ఉంటాడు? సత్తాగా ఉండవచ్చు. చిత్‌గా అందరిలో ఉండవచ్చు. ఆనందరూపంగా ఉండవచ్చు.

**సచ్చిదానంద రూపేణ జ్ఞాని సర్వత్ర వర్తతే**
**విదేహముక్తః సర్వత్ర వర్తతే**

బ్రహ్మజ్ఞానం కలుగకపోతే, అతనికి జరిగే నష్టం ఏమిటి?

**అథ యేఽ న్యథాఽ తో విదుః –** అథ అంటే, ఇలా కాకుండా ఇంకో విధంగా అనుకుంటే, ఇంకో విధంగా అంటే ఐక్యం తెలియకపోతే అని అర్థం. ఐక్యం తెలియకపోతే జీవ ఈశ్వర భేదం మాత్రమే ఉంటుంది. జీవ ఈశ్వర భేదంలో ఉంటే నాకు జరిగే నష్టమేమిటి? నేను కర్తను అవుతాను. కర్మఫలం అనుభవించాల్సి ఉంటుంది. ఐక్యం తెలిస్తే నేను స్వామిని, భేదంలో ఉంటే దాసుడను. నేను దాసుడను అంటే భగవాన్ నా దశలను చూడాల్సి ఉంటుంది. రాహుదశ, కేతుదశ,శనిదశ వగైరా. అంటే నేను జీవుడను అయితే, నా జాతకం చూడాలి ఈశ్వరుడు. ఈశ్వరునికి మనను కాపాడాలని ఉన్నా, ఆయన మనకు కర్మఫలదాత. అందుకని మన కర్మలకు తగ్గ ఫలం ఇవ్వాల్సి ఉంటుంది. అక్కడితో అవలేదు. మరణం కూడా మన సంసార బంధానికి ముగింపు పలకలేదు. భగవానుడు, మన పాత ఫైలు తిరగేసి, అందులో భద్రంగా దాచిపెట్టుకున్న సంచిత కర్మలను క్రోఢీకరించి దానికి తగ్గ శరీరాన్ని మనకు కర్మఫల దానంగా ఇవ్వాలి. అందువల్ల ఐక్యజ్ఞానం కాక ఏ జ్ఞానమైనా కూడా బంధమే.

**అన్యరాజానస్తే భవన్తి –** వాళ్ళకు రాజు వేరే ఉన్నాడు. వాళ్ళు ఎవరు? ద్వైతభావనలో ఉన్నవారు. వాళ్ళకు అన్యరాజు ఎవరు? భగవానుడు. కర్మ ఫల దాత భగవానుడు.

సరే చెడుకర్మలు చేస్తేనే కదా భగవంతుడు శిక్షించేది మంచి కర్మలు చేస్తే సమస్య ఉండదు కదా! అలా తప్పించుకోవటానికి లేదు. అవి కూడా

ఒకరోజు ముగిసిపోతాయి కదా!

**క్షీణే పుణ్యే మర్త్యలోకం విషంతి గీత- 9-2-1**

**క్షయ్యలోకా భవంతి -** అందువల్ల వాళ్ళు కర్మఫలాలతో కూడి ఉంటారు. క్షయ అంటే క్షయమయ్యేది, నాశనమయ్యేది. లోకా అంటే కర్మఫలం. వారు సంసారవృత్తం నుంచి తప్పించుకోలేరు.

**తేషాగ్ం సర్వేషు లోకేష్వకామచారో భవతి -** వాళ్ళు ఏ లోకానికి వెళ్లినా కూడా, యథేచ్ఛగా తిరగలేరు. ఎందుకంటే కర్మకు బందీలు వాళ్ళు. దురదృష్ట వశాత్తూ, మనం యుద్ధం చేయాల్సింది అదృష్టకర్మతో. అందుకని దానితో యుద్ధం చేసి గెలవలేము.

నేను కళ్ళకు గంతలు కట్టుకుని, ఒక యోధునితో మల్లయుద్ధం చేయాల్సి ఉంటే, నా పరిస్థితి ఎలా ఉంటుంది?అతను నాకు కనబడడు, కాని నేను అతనికి చక్కగా కనబడతాను. నేను ఒకవైపు చూస్తుంటే, ఇంకోవైపు నుంచి వచ్చి నన్ను గుద్దుతాడు. మొహం పచ్చడి చేస్తాడు. నేను నిస్సహాయంగా నిల్చోవాల్సిందే.

అజ్ఞాని జీవనం కూడా అలాగే ఉంటుంది. అదృష్టకర్మతో యుద్ధం చేయాలి. ఒక్కరోజు కాదు, ఎప్పుడూ. రేపొద్దున్న నేను ఎలా లేస్తానో నాకే తెలీదు. ఇలాంటి సంసారంలో పడి కొట్టు మిట్టాడాలనుకుంటున్నారా? లేదు బయటకు రావాలనుకుంటున్నారా? మీ చేతిలో ఉంది. అహం జీవోస్మి అనుకుంటారా, అహం బ్రహ్మ అస్మి అనుకుంటారా? రెండింటి ఫలం చూశారు కదా! నిర్ణయం మీ చేతిలో ఉంది. ఇక్కడితో భూమ విద్య ముగిసింది.

### షడ్వింశః ఖణ్డః (26)

**తస్య హ వా ఏతస్యైవం పశ్యత ఏవం మన్వానస్యైవం విజానత ఆత్మతః ప్రాణ ఆత్మత ఆశాఽఽత్మతస్స్మర ఆత్మత ఆకాశ ఆత్మతస్తేజ ఆత్మత ఆప ఆత్మత ఆవిర్భావతిరోభావావాత్మతోఽన్నమాత్మతో బలమాత్మతో విజ్ఞానమాత్మతో ధ్యానమాత్మతశ్చిత్తమాత్మతస్సంకల్ప ఆత్మతో మన ఆత్మతో వాగాత్మతో నామాత్మతో మన్త్రా ఆత్మతః కర్మాణ్యాత్మత ఏవేదగ్ం సర్వమితి॥1॥ తదేష శ్లోకో న పశ్యో మృత్యుం పశ్యతి న రోగం నోత దుఃఖతాగ్ం సర్వగ్ం హ పశ్యః పశ్యతి సర్వమాప్నోతి సర్వశ ఇతి ॥2॥ స ఏకధా భవతి త్రిధా భవతి పఞ్చధా సప్తధా నవధా చైవ పునశ్చైకాదశస్స్మృతశ్శతం చ దశ**

**చైకశ్చ సహస్రాణి చ విగ్ంశతిః ॥3॥ ఆహారశుద్ధౌ సత్త్వశుద్ధిస్సత్త్వశుద్ధౌ ధ్రువా స్మృతిః స్మృతిలవ్భే సర్వగ్రన్థీనాం విప్రమోక్షః॥ తస్మై మృదితకషాయాయ తమసస్పారం దర్శయతి భగవాన్ సనత్కుమారస్తగ్ం స్కన్ద ఇత్యాచక్షతే తగ్ం స్కన్ద ఇత్యాచక్షతే ॥4॥**

**మంత్రం-1** ఇప్పటి వరకూ చెప్పిన బోధను ముగుస్తున్నది ఇక్కడ. ముందు సనత్కుమారుడు 15 ఉపాసనలను చెప్పాడు. వ్యష్టిపరంగా కొన్ని, సమష్టి పరంగా మరికొన్ని. చిత్తవైశాల్యం కోసం ఆ ఉపాసనలు చేయాలి. ఆకాశం మీద ఉపాసన చేసినప్పుడు, నా పరిస్థితి ఏమిటి? ఆకాశం సర్వవ్యాపకం. అనంతమైన ఆకాశంలో మూలగా ఉన్న ఒక చిన్న చుక్కను నేను. ఇప్పుడు మొత్తం పరిస్థితే మారిపోయింది.

జ్ఞానం పొందాక, నేను ధ్యానం చేసినవన్నీ పంచ భూతాలతో సహా, నాలోనే ఉన్నాయి అంటాడు జ్ఞాని. అవి నాలోనే ఉన్నాయి, నా నుంచే వచ్చాయి.

**మయ్యేవ సకలం జాతం మయి ప్రతిష్ఠితమ్।**
**మయి సర్వం లయం యాతి - కైవల్యం**

ముందేమో నేను ప్రపంచంలో ఉన్నాను అన్నాను.

ఇప్పుడేమో ప్రపంచం నాలో ఉంది అంటున్నాను.

ఒక చిన్న తేడా. నేను ప్రపంచంలో ఉన్నాను అనే వాక్యంలో నేను కార్యపరంగా సంఘాత అయిన శరీరాన్ని. రెండో వాక్యంలో ప్రపంచం నాలో ఉంది. నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని. ఇది అర్థం చేసుకోవటానికి, స్వప్నదృష్టాంతాన్ని గుర్తుంచుకోవాలి. స్వప్నంలో ఉండగా స్వప్నప్రపంచం విశాలమైంది. నేను అందులో ఒక వ్యక్తిని మాత్రమే. కాని లేచాక నేను అందులో వ్యక్తిని కాను, నాలో స్వప్నం ఉంది.

కాకపోతే స్వప్నం నుంచి లేచాక, స్వప్న ప్రపంచం మాయమవుతుంది. కాని జ్ఞానం ద్వారా లేచాక, జాగృత్ ప్రపంచం మాయమవదు. ఈ ప్రపంచాన్ని చూస్తూ, ఈ శరీరాన్ని చూస్తూ, నేను ఈ జగత్తుకు అధిష్టానాన్ని అనాలి.

**తస్య హ వా ఏతస్యైవం పశ్యత ఏవం మన్వానస్యైవం విజానతి -** ఎవరైతే

శ్రవణ, మనన, నిధి ధ్యాసనల ద్వారా జ్ఞానం పొందుతారో, అతను ఈ పదిహేనూ నా నుంచే పుట్టాయి అంటాడు. ఇప్పుడు వాటిని **ఆత్మతః ప్రాణః... నామః** వెనుకనుంచి చెప్పుకొస్తున్నాడు.

అవి ప్రాణం, ఆశ, స్మరణం, ఆకాశం, తేజస్సు, జలములు, అన్నం, బలం, విజ్ఞానం,ధ్యానం, చిత్తం, సంకల్పం, మనస్సు, వాక్కు, నామం.

అందుకే ప్రపంచం నుంచి పారిపోవటానికి ప్రయత్నించకూడదు. సరిగ్గా అర్థం చేసుకోండి. **మోక్షం అంటే ప్రపంచం నుంచి పారిపోవటం కాదు.** నేను ప్రపంచానికి అధిష్ఠానం అయినప్పుడు, ప్రపంచం నుంచి ఎందుకు పారిపోవాలి? నామరూప ప్రపంచం నన్నేమీ చేయలేదు.అయితే మోక్షం అంటే ఏమిటి? నా గురించి నాకున్న అజ్ఞానాన్ని తొలగించుకోవటం.

**ఆవిర్భావతిరోభావావాత్మా–** ఆత్మ నుంచి ప్రకటితమవుతుంది. అంతర్ధానమవుతుంది. ఈ మాటలు కొత్తగా కలిశాయి. స్వప్న ప్రపంచం నా నుంచి ప్రకటితమయి, నాలో అంతర్ధానమయినట్టుగా, ఈ ప్రపంచం కూడా నా నుంచి వచ్చి, నాలో లయమవుతుంది.

**ఆత్మతో మన్త్రాః –** మంత్రాలు అంటే వేదాలు కూడా నా నుంచే పుట్టాయి.

**ఆత్మతః కర్మాణి–** అన్ని కర్మలూ నానుంచే పుట్టాయి.

**ఆత్మత ఏవేదగ్ం సర్వమితి–** ఇంత పెద్ద పట్టిక ఇచ్చి అలసిపోయాక, సనత్కుమారుడు ఈ సర్వం ఆత్మనుంచే వచ్చింది అంటాడు.

తమిళంలో 'ఆళ్' అంటే వ్యక్తి. ఇంగ్లీషులో 'ఆల్' అంటే అంతా. మనం తమిళ ఆళ్ నుంచి ఇంగ్లీషు ఆల్‌కు ఎదగాలి. ఇది జ్ఞానం.

**మంత్రం–2 తదేష శ్లోకః –** ఈ విషయం గురించి ఈ మంత్రం ఉంది. ఇది సామవేదానికి చెందిన ఉపనిషత్తు. ఇది ఋగ్వేద మంత్రాన్ని చెపుతున్నది. ముందు చివరి భాగం చూద్దాము.

**సర్వమాప్నోతి సర్వశః –** జ్ఞానం పొందాక, జ్ఞాని అంతటా వ్యాపిస్తాడు. జ్ఞానం పొందకముందు, తనను శరీరంగా భావిస్తాడు. ఒకచోట పరిమితమైన వ్యక్తిగా భావిస్తాడు. కాని జ్ఞానం పొందాక, నేను శరీరం కాదు, చైతన్యం అని గ్రహిస్తాడు. ఎప్పుడైతే అతని దృష్టి శరీరం నుంచి చైతన్యానికి మారిందో, అప్పుడే అతను, 'నేను ఈ శరీరంలోనే కాదు, అన్ని శరీరాలలో ఉన్న సర్వవ్యాపకమైన చైతన్యాన్ని,' అని చెప్పగలుగుతాడు.

అందువల్ల, జ్ఞాని ఎక్కడ ఉన్నాడు? సర్వవ్యాపకంగా ఉన్నాడు. సర్వం సర్వశః ఆప్నోతి. సత్‌రూపేణ, చిత్‌రూపేణ సర్వం ఆప్నోతి. దీని వల్ల జ్ఞాని ఏం చేస్తాడు?

**సర్వగ్ం (ఆత్మత్వేన) హ పశ్యః పశ్యతి –** ఆత్మత్వేన మనం కలుపుకోవాలి. అంతా తానుగానే చూస్తాడు. అల ఉదాహరణ గుర్తు తెచ్చుకోవాలి. అల నామరూపాలతో మమేకం చెందితే అల మాత్రమే. కాని 'నేను నీటిని,' అనుకుంటే 'నేను నీరుగా ఈ ఒక్క అలలోనే కాదు, అన్ని అలల్లోనూ ఉన్నాను. నిజానికి అన్ని అలలలోనూ కాదు, సముద్రం అంతటా ఉన్నాను,' అనగలదు. ఇంకొక అడుగు ముందుకు వెళ్ళాక, 'నిజానికి నేను కాకుండా (నీరు కాకుండా) సముద్రమే లేదు' అంటుంది. కేవలం దృక్కోణంలో ఒక చిన్నమార్పు! నామరూపాల్నుంచి అధిష్ఠానంకు, పెద్ద మార్పు వస్తుంది. ఆ విధంగా జ్ఞాని తాను సర్వవ్యాపకం అనుకుంటాడు.

ఇప్పుడు మొదటి వాక్యం చూద్దాము.

**న పశ్యో మృత్యుం పశ్యతి న రోగం నోత దుఃఖతాగ్ం (పశ్యతి)–** అటువంటి జ్ఞాని పుట్టుక, వృద్ధాప్యం లాంటి సంసారచక్రాన్ని తనలో చూడడు. మృత్యుం– మరణం; రోగం– అనారోగ్యం; దుఃఖతాగ్ం– దుఃఖభావాలను చూడడు. అశాశ్వతత్వం అలకు చెందినది. నీటికి కాదు.

ఒక్కముక్కలో చెప్పాలంటే, వికారం లేదా మార్పు వల్ల కలిగే బాధలకు చలించడు. తనను ముక్తునిగా భావిస్తాడు. ఇంతవరకూ ఋగ్వేద మంత్రం.

ఇప్పుడు మొదటి మంత్రంలో చెప్పిన భావనకు ఉపనిషత్తు ముక్తాయింపు పలుకుతున్నది. జ్ఞాని తాను జగత్‌కారణ బ్రహ్మ అనుకుంటాడు. అతనే జగత్తుగా పెరుగుతూ వస్తాడు. అనేక సంఖ్యల ద్వారా ఈ విషయం చెపుతున్నది. 'అనేకంగా అవుతాడు,' అని ఒక్క ముక్కలో చెప్పి ఉండవచ్చు, కాని అదే ఉపనిషత్తు ప్రత్యేకత.

**మంత్రం–3 స ఏకధా భవతి–** ముందు, అంటే సృష్టిపూర్వం అతను అద్వైత బ్రహ్మగా ఉన్నాడు. సుషుప్తి దశను గుర్తు తెచ్చుకుంటే, అక్కడ ఒకటిగా ఉంటాడు.

**త్రిధా భవతి–** లేచాక, మూడుగా అవుతాడు.

**పఞ్చదా సప్తధా నవధాచైవ–** సంఖ్యలు చెప్పటానికి ప్రత్యేకమైన కారణమంటూ లేదు. ఐదుగా, ఏడుగా,తొమ్మిదిగా అవుతాడు.

**పునశ్చైకాదశస్మృతశ్శతం చ దశ చైకశ్చ సహస్రాణి చ విగ్ంశతిః –**

ఏకాదశ–11, శతం– 100, దశ–10, సహస్రాణి–1000, విగ్ంశతి– 20

ఆ విధంగా జ్ఞాని అనేకంగా అవుతాడు.

నేనే అంతా. మళ్ళీ ప్రళయకాలంలో ఒకటిగా మిగులుతున్నాడు.

ఏకః – మూడో పాదంలో మళ్ళీ వచ్చింది ఈ పదం. అంటే ప్రళయంలో 1000 నుంచి తగ్గుతూ వస్తుంది. 1000,100,9,7,5,3....

**పునః ఏకః భవతి–** మళ్ళీ అద్వైత బ్రహ్మ అవుతాడు.

**సహస్రాణి చ విగ్ం శతిః –** మాయాశక్తితో, మళ్ళీ పెరుగుతూ వస్తాడు. సృష్టి, ప్రళయం జరుగుతూ ఉంటుంది. అది నిజంగా జరిగితే బాధ పెట్టవచ్చేమో కాని అది సత్యం కాదు, మిథ్యని తెలిస్తే బాధవేయదు. స్వప్నకాలంలో అయినట్టే అవుతుంది. స్వప్నంలో నేను మంచం మీద ఒక్కడిగా ఉన్నాను. కలలో అనేకంగా అవుతాను. మళ్ళీ ఏకంగా మారుతాను.నా ఏకత్వం ఈ కల వల్ల చెక్కుచెదరదు.

మరి అయితే సృష్టి ఎందుకు? కేవలం వినోదం కోసం! ఈ మాయ, ఈ జగత్తు లేకపోతే బ్రహ్మ, నేను బ్రహ్మను అని చెప్పలేదు. తాను బ్రహ్మ అని చెప్పటానికి మాయ కావాలి. నేను అద్వైత సచ్చిదానంద బ్రహ్మ అని బ్రహ్మ చెప్పటానికి మాయ కావాలి. అందుకే మాయ సహాయంతోనే వినోదం సాధ్యం. వేదాంతంలో ఐదవ సూత్రం గుర్తుపెట్టుకోవాలి.

> **నా అసలు స్వరూపాన్ని నేను మర్చిపోయి, నా జీవితాన్ని భారంగా చేసుకుంటున్నాను. నా స్వరూప నిష్ఠలో ఉండి, జీవితాన్ని ఒక ఆటగా మలచుకుంటాను.**

సనత్కుమారుడు తన బోధ అర్థమయ్యే ఉంటుంది అనుకుని కూడా, అది అర్థం కాని కొంతమందిని దృష్టిలో పెట్టుకుని వాళ్ళ సాధన ఎల్కేజీ నుంచి మొదలుపెట్టాలని చెపుతున్నాడు. ఏమేమి చేయలో చెపుతున్నాడు.

**మంత్రం–4 ఆహారశుద్ధౌ సత్త్వశుద్ధిః –** మనస్సును శుద్ధి చేసుకోవాలంటే ముందు ఆహారం మీద అదుపు ఉండాలి. ఆహారః అంటే నాలుక; అన్ని

ఇంద్రియాలనూ తీసుకోవాలి. అంటే ఇంద్రియ నిగ్రహం వల్ల చిత్తశుద్ధి ఏర్పడుతుంది. ఇది కర్మయోగం.

**ఆహార శుద్ధౌ సత్త్వశుద్ధిః = కర్మయోగం**

**సత్త్వశుద్ధౌ ధ్రువాస్మృతిః –** స్మృతి అంటే జ్ఞానం, ధ్రువ అంటే ధ్రుఢమైన; ధ్రువస్మృతి అంటే ధ్రుడమైన జ్ఞానం పొందాలి. అంటే జ్ఞానయోగం.

**సత్త్వశుద్ధౌ ధ్రువాస్మృతి = జ్ఞానయోగం.** దీని తర్వాత ఫలం – **స్మృతిలమ్భే సర్వాగ్రంథీనాం విప్రమోక్షః –** జ్ఞానం రాగానే హృదయగ్రంథులన్నీ విడివడుతాయి. గ్రంథి అంటే ముడి. అజ్ఞానంతో వేసుకున్న ముడి.

**అవిద్యా కామ కర్మాణామ్ విప్రమోక్షః॥**

దీనితో సాధనలు ముగిశాయి. ఇప్పుడు ఉపనిషత్తు చెపుతున్నది. **తస్మై మృదితకషాయాయ తమసస్పారం దర్శయతి–** పూజనీయుడైన సనత్కుమారుడు నారదుడిని అజ్ఞానపు ఆవల తీరానికి చేర్చాడు. తమసః అంటే అజ్ఞానం లేదా సంసారం. మృదితకషాయాయ – అంటే శుద్ధమైన అంతఃకరణం కల నారదుడు.

**తగ్ం స్కన్ద ఇత్యాచక్షతే –** ఈ సనత్కుమారుడు మామూలు వ్యక్తి కాదు; ఆయనను స్కందుడని చెపుతున్నారు. స్కందుడంటే సుబ్రహ్మణ్యస్వామి. సాక్షాత్తూ సుబ్రహ్మణ్యస్వామే ఆచార్య సనత్కుమారునిగా దిగివచ్చాడు. అందువల్ల నారదుడినీ, మననూ సంసారమనే ఆవల తీరానికి తీసుకువెళ్ళినందుకు నమస్కరిస్తున్నాము.

**తగ్ం స్కన్ద ఇత్యాచక్షతే–** మళ్ళీ ఇంకోసారి చెప్పటంలో ఉద్దేశం ఇక్కడితో ఈ అధ్యాయం ముగిసిందని. భూమ విద్య కూడా ముగిసింది.

# అధ్యాయం 7 సారాంశం

దీన్ని భూమ విద్యా ప్రకరణం అంటారు.

**1-15 ఖండాలు:**-సనత్కుమారుడు, నారదుల వారికి బ్రహ్మ ఉపాసన గురించి చెప్పాడు. దాన్ని నామ ఉపాసన నుంచి మొదలుపెట్టి ప్రాణ బ్రహ్మ ఉపాసన వరకూ చెప్పాడు. ఒకదానికన్నా ఒకటి ఎక్కువ. అవి వరుసగా - నామం, వాక్కు, మనస్సు, సంకల్పం, చిత్తం, ధ్యానం, విజ్ఞానం, బలం, అన్నం, జలం, అగ్ని, ఆకాశం, స్మరణం, ఆశ, ప్రాణం.

**16-22 ఖండాలు:**- అసలైన సత్యవాది అవ్వాలంటే అనేక దశలు దాటి రావాలి. ఆ దశలను అవరోహణ క్రమంలో చూస్తాము. అవి వరుసగా- సత్యవిజ్ఞానం, సత్యమననం, శ్రద్ధ, నిష్ఠ, కృతి, ఆనందం.

**23-26 ఖండాలు:**- భూమ విద్య. అల్పవిషయాల్లో సుఖం లేదు. ఆనందం అశాశ్వతమైన వస్తువుల్లో దొరకదు. సత్, చిత్ ఎలా సర్వవ్యాపకమో, అలాగే ఆనందం కూడా సర్వవ్యాపకం.

ఈ అధ్యాయం ఎలా మొదలయిందో అలా ముగిసింది.

**తం భగవాఞ్ఛోకస్య పారం తారయత్వితి** - మీరు నన్ను శోకం యొక్క ఆవలి తీరానికి తీసుకువెళ్ళండి అని నారదుల వారు కోరారు.

**తమసస్పారం దర్శయతి భగవాన్ సనత్కుమారః** - భగవాన్ సనత్కుమారుడు అజ్ఞానపు ఆవలి తీరానికి తీసుకువెళ్ళాడు.

# ॥ ఛాందోగ్యోపనిషత్తు ॥

# అధ్యాయం - 8

ఆరవ అధ్యాయం బ్రహ్మను సత్‌రూప బ్రహ్మగానూ, ఏడవ అధ్యాయం బ్రహ్మను ఆనంద రూపబ్రహ్మగానూ వర్ణించింది. ఇప్పుడు చిత్‌రూప బ్రహ్మగానిర్వచనం వస్తుంది. అవస్థాత్రయ సాక్షి రూపమైన బ్రహ్మను చూస్తాము. ఈ విధంగా 6,7,8 అధ్యాయాలు బ్రహ్మయొక్క సచ్చిదానంద స్వరూపాన్ని వర్ణించాయి.

ఎనిమిదో అధ్యాయంలో 15 ఖండాలు ఉన్నాయి.

1-6 ఖండాలు - సగుణ బ్రహ్మ ఉపాసన

7-12 ఖండాలు - నిర్గుణ బ్రహ్మ ఉపాసన

13-15 ఖండాలు- కొన్ని అధ్యాత్మిక సాధనలు

సగుణబ్రహ్మ ఉపాసనకు ఆలంబనం మన హృదయంలో ఉండే ఆకాశం. హృదయంలో ఉండే ఖాళీ ప్రదేశాన్ని హృదయాకాశం అనీ దహరాకాశం అనీ అంటారు. హృదయంలో ఉండే ఆ పరిమితమైన ఆ దహర ఆకాశంలో సగుణ ఈశ్వర ధ్యానం చేయాలి. అందుకే ఈ ఉపాసనను దహర విద్య అంటారు. మన హృదయంలో చేసే ఈశ్వర ధ్యానం కాబట్టి ఈ ఉపాసన చాలా ప్రఖ్యాతి చెందింది. బ్రహ్మసూత్రాల్లో **దహరాధికరణం** అనే ఒక అధికరణంలో ఈ దహర విద్యను విపులంగా చర్చించటం జరిగింది.

ఈ ఉపాసనలో మన శరీరం ఆలయంగానూ; హృదయం గర్భగుడిగాను, హృదయంలో వున్న చైతన్యం ఈశ్వరునిగానూ అభివర్ణించబడ్డాయి. ఈశ్వరుని బాహ్యంగా ధ్యానిస్తే భేద ఉపాసన అవుతుంది. ఇక్కడ హృదయంలో ధ్యానిస్తున్నాం కాబట్టి అభేద ఉపాసన అవుతుంది. కర్మకాండలో ఈశ్వరుడిని బాహ్యంగా చూస్తాము. ఉపాసనకాండలో ఈశ్వరుడిని మనలో ఉన్నట్టుగా ఊహించుకుని అభేద ఉపాసన చేస్తాము. జ్ఞానకాండలో ఈశ్వరుడికీ, మనకూ బేధం లేదని నేర్చుకుని అభేద జ్ఞానం

పొందుతాము. అలా భేద జ్ఞానం నుంచి అభేద ఉపాసనకు వచ్చి అక్కడనుంచి అభేద జ్ఞానానికి వెళతాము. ఇది మన ప్రయాణం. అందుకని ఈ ఉపాసన చాలా ముఖ్యమైనది.

ఈ నేపథ్యంతో మొదటి ఖండంలోకి అడుగుపెడదాము.

**ప్రథమః ఖణ్డః (1)**

**ఓం। అథ యదిదమస్మిన్బ్రహ్మపురే దహరం పుణ్డరీకం వేశ్మ దహరోఽస్మిన్నన్తరాకాశస్తస్మిన్యదన్తస్తదన్వేష్టవ్యం తద్వావ విజిజ్ఞాసితవ్యమితి ॥1॥ తం చేద్ బ్రూయుర్యదిదమస్మిన్బ్రహ్మపురే దహరం పుణ్డరీకం వేశ్మ దహరోఽస్మిన్నన్తరాకాశః కిం తదత్ర విద్యతే యదన్వేష్టవ్యం యద్వావ విజిజ్ఞాసితవ్యమితి స బ్రూయాత్॥2॥ యావాన్వా అయమాకాశ స్తావా నేషోఽన్తర్హృదయ ఆకాశ ఉభే అస్మిన్ ద్యావాపృథివీ అన్తరేవ సమాహితే ఉభావగ్నిశ్చ వాయుశ్చ సూర్యాచన్ద్రమసావుభౌ విద్యున్నక్షత్రాణి యచ్చాస్యేహాస్తి యచ్చ నాస్తి సర్వం తదస్మిన్సమాహితమితి ॥3॥ తం చేద్ బ్రూయురస్మిగ్ం శ్చేదిదం బ్రహ్మపురే సర్వగ్ం సమాహితగ్ం సర్వాణి చ భూతాని సర్వే చ కామా యదైతజ్జరా వాఽఽప్నోతి ప్రధ్వగ్ంసతే వా కిం తతోఽతిశిష్యత ఇతి ॥4॥ స బ్రూయాన్నాస్య జరయైతజ్జీర్యతి న వధేనాస్య హన్యత ఏతత్సత్యం బ్రహ్మపురమస్మిన్కామాః సమాహితా ఏష ఆత్మాఽపహతపాప్మా విజరో విమృత్యుర్విశోకో విజిఘత్సో ఽపిపాసః సత్యకామః సత్యసఙ్కల్పః। యథా హ్యేవేహ ప్రజా అన్వావిశన్తి యథాఽనుశాసనం యం యమన్తమభికామా భవన్తి యం జనపదం యం క్షేత్రభాగం తం తమేవోపజీవన్తి ॥5॥ తద్యథేహ కర్మజితో లోకః క్షీయత ఏవమేవాముత్ర పుణ్యజితో లోకః క్షీయతే । తద్య ఇహాత్మానమననువిద్య వ్రజన్త్యేతాగ్ంశ్చ సత్యాన్ కామాగ్ంస్తేషాగ్ం సర్వేషు లోకేష్వకామచారో భవతి । అథ య ఇహాత్మానమనువిద్య వ్రజన్త్యేతాగ్ంశ్చ సత్యాన్ కామాగ్ంస్తేషాగ్ం సర్వేషు లోకేషు కామచారో భవతి ॥6॥**

ముందే చూసినట్టుగా మొదటి ఆరు ఖండాలూ సగుణబ్రహ్మ ఉపాసన గురించి చెప్తాయి. ఇక్కడ ప్రత్యేకత, గురుశిష్యుల పేర్లు రావు. ఉపనిషత్తే గురు,శిష్యుల సంవాదం ఊహించుకుని, సగుణ బ్రహ్మ ఉపాసనను వారి సంవాదం ద్వారా ప్రవేశపెడుతున్నది.

**మంత్రం-1 ఓమ్, అథ యదిదమస్మిన్బ్రహ్మపురే -** మనకందరికీ స్థూల శరీరం ఉంది. స్థూల శరీరాన్ని బ్రహ్మపురం అంటారు. పురం అంటే నగరం. బ్రహ్మ అంటే సగుణ బ్రహ్మ లేదా ఈశ్వరుడు. ఈ శరీరాన్ని బ్రహ్మపురం అని ఎందుకందంటే, ఈ పురంలో బ్రహ్మ అనే రాజు నివసిస్తున్నాడు.

ఈ వాక్యం చాలా ముఖ్యం. ఎందుకంటే వేదాంతంలో ఎంతసేపూ శరీరాన్ని చిన్నచూపు చూస్తాము. విదేహముక్తి కోరేటప్పుడు కూడా నేను మళ్ళీ స్థూలశరీరాన్ని పొందకూడదు అని ప్రార్థిస్తాము. నైష్కర్మ్య సిద్ధిలో శరీరాన్ని అశుద్ధంగా వర్ణిస్తాము. ఇక్కడేమో అదే శరీరాన్ని బ్రహ్మపురం అంటున్నాము. ఎందుకంటే ఇందులో సాక్షాత్తూ సగుణ బ్రహ్మ నివసిస్తాడు. ఈ శరీరంలో గర్భగుడి ఉంది. ఏమిటది?

**దహరం పుణ్డరీకం వేశ్మ -** అందులో చిన్న ఇల్లు ఉంది. వేశ్మ అంటే మామూలుగా ఇల్లు. ఇక్కడ రాజసౌధంగా చెప్తారు. మరి సాక్షాత్తూ బ్రహ్మే అందులో నివసించాలంటే అది మామూలు ఇల్లు అవలేదు కదా. అందుకని వేశ్మ అంటే రాజసౌధం. ఏమిటది? హృదయ పుండరీకం.పుండరీకం అంటే తామరమొగ్గ.హృదయం తలక్రిందులుగా ఉన్న తామరమొగ్గలా ఉంటుంది. అందువల్ల, బ్రహ్మపురంలో తామరమొగ్గ ఆకారంలో ఉన్న హృదయమనే రాజసౌధం ఉంది. ఆ హృదయం పరిమాణం ఎంత? దహరం. దహరం అంటే చాలా చిన్నది. ఎందుకు? శరీరమే చిన్నది, దానిలో కలువ మొగ్గ అంత హృదయం ఇంకా చిన్నది.

**దహరోఽస్మిన్నన్తరాకాశః -** అందులో లోపల చిన్న ఆకాశం ఉంది. అస్మిన్ అంటే తామర మొగ్గలాంటి హృదయంలో. దహర ఆకాశః - చిన్న, సూక్ష్మమైన ఆకాశం ఉంది. ఏమిటా ఆకాశం? ఇది చివరికి సగుణ బ్రహ్మ లేదా ఈశ్వరుడిని సూచిస్తుంది. దహరాకాశం చిదాకాశం లేదా సగుణ బ్రహ్మను ఎలా సూచిస్తుంది? దీని వెనుకనున్న తర్కాన్ని అర్థం చేసుకోవాలి.

శాస్త్రం ప్రకారం మనస్సు హృదయంలో ఉంది. వైజ్ఞానిక శాస్త్రం ప్రకారం మనస్సు మెదడులో ఉంది. హృదయానికి ఆపరేషను చేసేటప్పుడు డాక్టర్లు రక్తాన్ని ప్రసరింపజేసే హృదయాన్నే చూడగలరు, అందులో ఉన్న మనసును చూడలేరు. ఎందుకు? హృదయం స్థూలశరీరానికి సంబంధించినది, కాని మనసు సూక్ష్మశరీరానికి సంబంధించినది.

అందువల్ల చిన్న హృదయం, ఇంకా చిన్న మనస్సు ఉంది. ఆ మనస్సులో అనేక ఆలోచనలు ఉదయిస్తాయి. అంటే ఏమిటి అర్థం? అంటే హృదయంలో కొంత సూక్ష్మమైన ఆకాశం ఉంది అని. ఈ ఆలోచనలు తెలుస్తున్నాయా లేదా? తెలియకపోతే బాగుండేది కాని చక్కగా తెలుస్తున్నాయి. అంటే హృదయంలో మనస్సు ఉంది. మనస్సులో ఆలోచనలు పుడుతున్నాయి. ఆ ఆలోచనలను తెలుసుకుంటున్న ఒక సాక్షి చైతన్యం ఉంది. ఆ సాక్షి చైతన్యమే మనకు ఆ ఆలోచనలను తెలియ జేస్తున్నది. ఈ సాక్షి చైతన్యాన్ని చిదాకాశం అంటారు.

హృదయంలో రెండు ఆకాశాలు ఉన్నాయి.ఒకటి భూతాకాశం (పంచభూతాలకు చెందినది). రెండోది చిదాకాశం. దీని వల్లే ఆలోచనలు తెలుస్తున్నాయి. ఈ చిదాకాశాన్ని దహరాకాశం అనికూడా అంటారు. అందుకే ఉపనిషత్తు చెపుతున్నది. హృదయంలో దహరాకాశం ఉంది, అదే చిదాకాశం. అదే బ్రహ్మ, అదే ఈశ్వరుడు.

ఈ చిదాకాశాన్ని ఈశ్వరునిగా అర్థం చేసుకుంటే అది జ్ఞానం కాని ఇక్కడ జీవాత్మ పరమాత్మ ఐక్యం గురించి చెప్పటం లేదు. ఇక్కడ ఉపాసన చేయి అంటున్నది. ఐక్యాన్ని ఊహించుకుంటే, అది ఉపాసన. ఐక్యాన్ని అర్థం చేసుకుంటే, అది జ్ఞానం.

లలితాసహస్రనామంలో దహరాకాశ రూపిణి అని వస్తుంది. **తస్మిన్** అంటే దహరాకాశ రూప సగుణ ఈశ్వరునిలో;

**యదన్తస్తదన్వేష్టవ్యం –** ఆ అంతర్గత ఈశ్వరునిలో ఏంఉన్నాయో అన్వేషించి తెలుసుకో. ఊరికే అన్వేషిస్తే చాలదు;

**తద్వావ విజిజ్ఞాసితవ్యమితి –** అంతేకాదు, ఆ అంతర్గత ఈశ్వరుని గురించి తెలుసుకో. దీనికి జవాబు తర్వాత వస్తుంది. లోపల ఉన్న ఈశ్వరుడు చిన్నగా అనిపించినా, ఆయన –

**విశ్వాధారం గగన సదృశం**

ఈశ్వరుడు నీలోనే లేడు, నీలోనూ, బాహ్యంగానూ ఉన్నాడు. ఇదీ రాబోయే సారాంశం.

**మంత్రం–2** ఉపనిషత్తు కొనసాగుతున్నది. ఒకవేళ ఒక గురువు అలాంటి మాట చెబితే అంటున్నది. ఎటువంటి మాట? నీ హృదయంలో ఈశ్వరుడు

ఉన్నాడు. ఆ ఈశ్వరునిలో ఏం ఉందో తెలుసుకో. గురువు ఇలా చెపితే, శిష్యుడు తిరిగి ప్రశ్న వేసే అవకాశం ఉంది.

**తం చేద్ బ్రూయుః –** తం అంటే అటువంటి గురువు. బ్రూయుః అంటే గురువును శిష్యుడు ఈ క్రింది విధంగా ప్రశ్నించవచ్చు. ఏమని? అటువంటి ఈశ్వరుని గురించి తెలుసుకుని లాభం ఏమిటి? శరీరమే చిన్నది. అందులో హృదయం ఇంకా చిన్నది. అందులో ఈశ్వరుడిని దహరాకాశం అంటున్నారు. (దహరం అంటే అల్పం); అంత అల్పమైన ఈశ్వరునిలో ఏం ఉంటుంది? ఏం ఉంటుంది అంటే ఏమీ ఉండదు అని అర్థం. ఒకవేళ ఏమైనా ఉన్నా దానికి పెద్దగా విలువ ఉండదు. కాబట్టి దానిమీద నేను చేసే అన్వేషణ ఏం ఉంటుంది? విద్యార్థి గురువు చెప్పిన మాటలనే మళ్ళీ చెప్పి ఈ ప్రశ్న అడుగుతున్నాడు.

**యదిదమస్మిన్బ్రహ్మపురే–** సరే, శరీరం బ్రహ్మపురం అనుకున్నా;

**దహరం పుణ్డరీకం వేశ్మ –** అందులో చిన్న ఇల్లు ఉంది అనుకున్నా;

**దహరోఽ స్మిన్నన్తరాకాశః –** అందులో లోపల చిన్న ఆకాశం ఉంది అనుకున్నా;

**కిం తదత్ర విద్యతే –** అంత చిన్న ఈశ్వరునిలో ఏం ఉంటుంది? అందులో ఏం పుడుతుంది?

**యదన్వేష్టవ్యవం –** అందులో ఏం ఉన్నాయో నేను అన్వేషణచేసి తెలుసుకోవాల్సినంత విలువైనది ఏం ఉంటుంది?

**యద్వావ విజిజ్ఞాసితవ్యమితి –** అంతేకాదు, ఆ అంతర్గత ఈశ్వరుని గురించి కూడా తెలుసు కునేందుకు ఏమంది? ఇతి– ఈ విధంగా శిష్యుడు ప్రశ్నించవచ్చు.

**స బ్రూయాత్ –** సః అంటే గురువు. మొదటి మంత్రంలో ఈ వాక్యం చెప్పిన గురువు దీనికి జవాబివ్వాలి. ఏమని? ఈశ్వరుడు నీ హృదయంలో ఉన్నాడంటే ఈశ్వరుడు నీ హృదయంలోనే లేడు. ఈ గదిలో ఆకాశం ఉంది అంటే గదిలోనే ఉందనికాదు. ఆకాశం గదిలోపలా, బయట కూడా ఉంది. అలాగే ఈశ్వరుడు నీలోనూ, బయట కూడానూ ఉన్నాడు.

బింబ చైతన్యం వ్యష్టిలో మూడు పేర్లతోనూ, సమష్టిలో మూడు పేర్లతోనూ ప్రతిబింబ మవుతుందని తత్త్వబోధలో చూశాము.

| వ్యష్టి | సమష్టి |
|---|---|
| కారణ శరీరం - ప్రాజ్ఞ | కారణప్రపంచం- ఈశ్వరుడు |
| సూక్ష్మ శరీరం - తైజస | సూక్ష్మ ప్రపంచం- హిరణ్యగర్భ |
| స్థూల శరీరం - విశ్వ | స్థూల ప్రపంచం- విరాట్ |

ఈ ప్రతిబింబాలన్నీ బింబ చైతన్యం నుంచి వచ్చినవే.

**అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః**

సర్వవ్యాపకమైన ఈశ్వరుడు నీలోనూ ఉన్నాడు. ముందుగా ఈశ్వరునికి పూజ బాహ్యంగా చేయాలి. తర్వాత నీలోనే ఉన్నాడని ఊహించుకోవాలి. సగుణ ఈశ్వర ఉపాసన అంటే ప్రాజ్ఞ-ఈశ్వర ఐక్యం. నిర్గుణ జ్ఞానం అంటే తురీయ-బ్రహ్మ ఐక్యం. మొదటి ఆరు ఖండాలూ ప్రాజ్ఞ ఈశ్వర ఐక్యం గురించి చెపితే, తర్వాతి ఆరు ఖండాలు తురీయ-బ్రహ్మ ఐక్యం గురించి చెప్తాయి. ఇప్పుడదే చెప్పబోతున్నాడు గురువు.

**మంత్రం-3** ఇప్పుడు గురువు జవాబు. చైతన్యం శరీరంలో ఉన్నట్టు గుర్తించగలిగినా, చైతన్యం శరీరానికి మాత్రమే పరిమితమవలేదు. చైతన్యంకున్న ఐదు లక్షణాలలో మూడో లక్షణం ఈ అంశం చెపుతుంది.

చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు. సర్వవ్యాపకం. సర్వ వ్యాపకమైన చైతన్యాన్నే ఈశ్వరుడు అంటారు.

**యావాన్వా అయమాకాశస్తావానేషోఽన్తర్హృదయ ఆకాశః -** ఈ ఆకాశం ఎంతగా వ్యాపించి ఉందో, అంతగానూ హృదయ ఆకాశం వ్యాపించి ఉంది.

యావాన్ అంటే ఆకాశం ఎంత మేరకు ఉంటే; తావాన్- అంత మేరకు; అంతర్హృదయ ఆకాశ- హృదయ ఆకాశం ఉంది. హృదయంలో సాక్షిచైతన్యంగా ఉన్నా, చైతన్యం సర్వవ్యాపకం. మొదటి ఆకాశం భూతాకాశం, అంతర్హృదయ ఆకాశం చిదాకాశం. భూతాకాశం జడం; చిదాకాశం చైతన్యం. రెండింటికీ ఆకాశం పదం వాడింది ఉపనిషత్తు. చైతన్యం సర్వవ్యాపకం.

**ఉభే అస్మిన్ ద్యావాపృథివీ అన్తరేవ సమాహితే -** ఈ ద్యులోకం, పృథివీ రెండూ అందులోనే ఇమిడి ఉన్నాయి. అస్మిన్ అంటే సర్వవ్యాపకమైన చైతన్యం

లేదా ఈశ్వరుడు. ఆ చైతన్యంలోనే ద్యావా అంటే స్వర్గలోకం; పృథివీ అంటే భూలోకం ఇమిడి ఉన్నాయి.

గుర్తుంచుకోండి. ఇక్కడ నిర్గుణ చైతన్యం గురించి మాట్లాడటం లేదు. అలా మాట్లాడితే అది నిర్గుణబ్రహ్మ జ్ఞానం అవుతుంది. ఇప్పుడు చెప్పేది సగుణ బ్రహ్మ గురించి. ఆ బ్రహ్మ సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు. అందులో భూలోక, సువర్లోకాలు ప్రతిష్ఠితమై ఉన్నాయి. అంతేకాదు –

**ఉభావగ్నిశ్చ వాయుశ్చ –** అగ్ని, వాయువులు రెండూ;

**సూర్యాచన్ద్రమసావుభౌ –** సూర్యచంద్రులిద్దరూ;

**విద్యున్నక్షత్రాణి –** మెరుపులు, నక్షత్రాలూ;

సమాహితే కలుపుకోవాలి. ఇవన్నీ కూడా బ్రహ్మలోనే ప్రతిష్ఠితమై ఉన్నాయి.

**యచ్చాస్యేహాస్తి యచ్చ నాస్తి–** అంతేకాదు ఇప్పుడు ఏం ఉన్నాయో, ఏమి లేవో

**సర్వం తదస్మిన్సమాహితమితి–** అన్నీ కూడా ఇందులోనే ఇమిడి ఉన్నాయి అని గురువు చెప్పాలి.

ఈ ఉపాసన గురించి వింటే మనకు అంతకు ముందు ఈశ్వరుని గురించి ఉన్న సిద్ధాంతం మారుతుంది. దీనికి రాకముందు, భగవంతుడు ఎక్కడో ఉన్నాడనుకున్నాం. విష్ణుమూర్తిగా భగవంతుని ధ్యానిస్తే, విష్ణుమూర్తి అల వైకుంఠపురంలో, ఆ మూల సౌధంబు దాపల ఉన్నాడనుకుంటాము.

శివుడిని ధ్యానిస్తే కైలాసంలో ఉన్నాడనుకుంటాము. అంటే భగవంతుడిని ఒక వ్యక్తిగా ఊహించు కుంటాము. దాని తర్వాతి స్థాయి భగవంతుడిని కారణంగా ఊహించుకోవాలి. జగత్తు కార్యం, బ్రహ్మ కారణం.కార్యజగత్తు అంతటా కారణ బ్రహ్మ సర్వవ్యాపకంగా ఉన్నట్టుగా ఊహించుకోవాలి ఉపాసనలో. తర్వాత బ్రహ్మ కారణం కూడా కాదు. కార్యకారణ విలక్షణం బ్రహ్మ అని నేర్చుకోవాలి. అది నిర్గుణబ్రహ్మ విద్య అవుతుంది. కారణ ఈశ్వరుడు సగుణ బ్రహ్మ, అకారణ ఈశ్వరుడు నిర్గుణ బ్రహ్మ.

కారణ ఈశ్వరుడిని హృదయంలో ఉన్నట్టుగా ఎందుకు ఊహించుకోవాలి? దానికి రెండు కారణాలు.

1. ఈశ్వరుడు హృదయంలో కూడా ఉన్నాడు.

2. ఈశ్వరుడు హృదయంలోనే చైతన్యంగా ప్రకటితమవుతున్నాడు. బాహ్య ప్రపంచంలో కూడా ఈశ్వరుడు ఉన్నాడు. కాని చైతన్యంగా ప్రకటితమవడం లేదు. ఈశ్వరుడు సర్వ వ్యాపకమైనా కూడా ఆలయానికి ప్రత్యేకంగా ఎందుకు వెళతాము అంటే ఇందుకే. ప్రతిష్ఠచేసే మంత్రాలు చదివి భగవంతుడిని అక్కడ ప్రాణప్రతిష్ఠ చేశారు కాబట్టి అక్కడ చైతన్యంగా ప్రకటితమవు తున్నాడు.

ఇక్కడ శంకరాచార్యులు ఇంకో విషయం కూడా చెపుతున్నారు.

ఈశ్వరుడు హృదయంలోనే చైతన్యంగా ప్రకటితమవుతున్నాడు అనే వాక్యానికి ముఖ్యంగా ఉపాసకుని హృదయంలో అని కలుపుకోవాలిట. అతని ధ్యాన నిష్ఠ, అతని చిత్తశుద్ధి, అతను చేసే నిరంతర నామ జపం దీనికి కారణం. దీనివల్ల అతనికి అనేక సిద్ధులు కూడా వస్తాయి. అందుకే మీ మనసులో ఏముందో చదవగలిగే శక్తి వస్తుంది. మరి మామూలు మనుష్యుల మాటేమిటి? వాళ్ళలోనూ ఈశ్వరుడు ఉంటాడు. కాని వారిలో ఉన్న అనేక మలినాలు ఈశ్వరుడిని కప్పివేస్తాయి.

ఒక్కముక్కలో ఈ మంత్రం అర్థం - జగత్తు మొత్తం సగుణ ఈశ్వరునిలో ఉంది. ఆ సర్వవ్యాపక ఈశ్వరుడు నీ హృదయంలో ఉన్నాడు.

**అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః।**
**అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ॥ - గీత 10-20**

అందరి హృదయంలోనూ చైతన్యరూపంలో ఉన్నది నేనే! గీతలో ఎనిమిదో అధ్యాయానికి మూలం ఈ దహరావిద్యే!

**మంత్రం - 4** ఉపనిషత్తు గురుశిష్యుల సంవాదాన్ని ఊహించుకుని చెపుతున్నది చూశాము. ఇక్కడ శిష్యుడు అడుగబోయే ఇంకో ప్రశ్నను ఊహించుకుని అడుగుతున్నది. ఏమిటది? ఈశ్వరుడు హృదయం లోపల ఉంటే, శరీరం మరణిస్తే ఈశ్వరుడు కూడా మరణించడా? ఈశ్వరుడు మరణిస్తే, జగత్తంతా కూడా నాశనమయిపోదా? ఎందుకు వస్తుంది ఈ సందేహం? ఈశ్వరుడు శరీరం లోపల ఉంటే, శరీరం, హృదయం గిన్నెలు అవుతాయి. అందులో పదార్థం కూడా నాశనమవుతుంది కదా! కుండ నిండా పాలు ఉన్నాయనుకుందాం. కుండ బద్దలయితే, పాలు

ఒలికిపోతాయా లేదా? ఇప్పుడు మంత్రం చూద్దాము.
**తం చేద్ బ్రూయుః** – ఆయనను ఉద్దేశించి శిష్యులు ఇలా పలికితే–
**అస్మిగ్ంశ్చేదిదం బ్రహ్మపురే సర్వగ్ం సమాహితగ్ం** – ఒకవేళ ఈ బ్రహ్మపురంలో అన్నీ ఇమిడి ఉంటే; ఏమిటవి?
**సర్వాణి చ భూతాని సర్వే చ కామా–** అన్ని ప్రాణులూ, అన్ని కోరికలూ;
**యదైతజ్జరా వాఽఽప్నోతి–** ఎప్పుడైతే ఈ దేహానికి వృద్ధాప్యం వస్తుందో లేక; **ప్రధ్వగ్ంసతే వా** – శరీరం నశిస్తుందో;
**కిం తతోఽతి శిష్యత ఇతి** – ఏం మిగిలి ఉంటుంది?

అతని ఉద్దేశం ఏం మిగిలి ఉండదని! ఎందుకంటే ఈశ్వరుడు హృదయం లోపల ఉన్నాడనే విషయాన్ని అతను వాచ్యార్థంగా తీసుకున్నాడు. అందుకని మన శరీరానికి అవస్థలు వస్తే ఈశ్వరుడు కూడా అవస్థ పడతాడా అనే అనుమానం వస్తుంది.

దీనికి గురువు జవాబు ఏం ఉంటుంది? శరీరానికి ఏం జరిగినా,తైజస (సూక్ష్మశరీర ప్రతిబింబ చైతన్యం)కు ఏమీ అవదు. తైజసకే ఏమీ అవదంటే, ప్రాజ్ఞ సంగతి వేరే చెప్పాలా? ప్రాజ్ఞ ఎవరు? అంతటా ఉన్న ఈశ్వరుడే శరీరంలో ప్రాజ్ఞగా ఉన్నాడు. శరీరం పోతే, ప్రాజ్ఞ ఈశ్వరునిలో ఐక్యం అవుతుంది. ఒక గదిలో ఆకాశం ఉంది. ఆ గది గోడలు తీసేస్తే ఏమవుతుంది? ఆకాశం ఎక్కడికీ పోదు. అది అంతటా ఉన్న ఆకాశంతో కలిసిపోతుంది. అందువల్ల శరీరం పోయినా ఈశ్వరునికి ఏమీ అవదు. ప్రాజ్ఞ ఈశ్వరునితో ఐక్యం అవుతుంది.ఇదే మార్పు. అంతే.

ఈశ్వరుడు అంటే మాయాసహిత బ్రహ్మ. బ్రహ్మ+మాయ= ఈశ్వరుడు. ఈశ్వరుడు జగత్ కారణం కాబట్టి జగత్తుకన్నా సూక్ష్మంగా ఉంటాడు. కారణం ఎప్పుడూ కార్యం కన్నా సూక్ష్మంగా ఉంటుంది. పంచభూతాల్లో అన్నిటికన్నా సూక్ష్మమైంది ఆకాశం. ఆకాశమే సూక్ష్మమైతే ఆకాశాన్ని సృష్టించిన ఈశ్వరుడు, ఆకాశానికన్నా సూక్ష్మం. అందుకే అంత సూక్ష్మమైన ఈశ్వరుడిని ఒక ఆలంబనం మీద ఆవాహన చేస్తాము. ఆకాశాన్ని ఒక ఆలంబనగా చేస్తాము. ఆకాశం అంటే బాహ్యంగా ఉంది కాబట్టి ఆకాశం వేరు, నేను వేరు అవుతాము. ఆ భిన్నత్వాన్ని కూడా లేకుండా చేయాలనుకుంది శాస్త్రం. అందుకే బాహ్య ఆకాశాన్ని తీసుకోకుండా, ఒక అడుగు ముందుకు

వేసి, అంతర ఆకాశాన్ని తీసుకుంది. ఈ అంతర ఆకాశాన్ని హృదయ ఆకాశం లేదా దహర ఆకాశం అంటారు. ఆ దహర ఆకాశం మీద బ్రహ్మను ఆవాహన చేయండి అంటున్నది.

ఈశ్వరుడు ఎంత పెద్దగా ఉన్నాడు? అతను విశ్వాధారుడు. ఆకాశానికి కూడా ఆధారం ఈశ్వరుడే. కారణం కార్యంకన్నా పెద్దదిగా ఉండాలి. సముద్రంలో లేచిన అలకన్నా సముద్రం ఎక్కువ వ్యాప్తి చెంది ఉండాలి. అందుకని అంతటికీ ఆధారమైన ఈశ్వరుని హృదయంలో ధ్యానించు.

**మంత్రం-5** గురువు సమాధానం ఈ మంత్రంలో వస్తుంది. ఈశ్వరుడు శరీరంలో ఇమిడి ఉన్నాడు అంటే ఈశ్వరుడు శరీరం మీద ఆధారపడి ఉన్నాడని కాదు అర్థం. ఈశ్వరుడు తన ఉనికికి శరీరం మీద ఆధారపడి లేడు. ఉన్నాడు అంటే ఆధారపడ్డాడు అని కాదు. కుండ నిండా పాలు ఉన్నప్పుడు, కుండ బద్దలయితే పాలు ఒలికిపోతాయా లేదా అనే ప్రశ్న ఇంతకుముందు చూశాము. నిజమే, పాలు ఒలికిపోతాయి కాని ఆ ఉదాహరణ తప్పు. కుండలో ఆకాశం కూడా ఉంది. ఆకాశం కుండలోనూ ఉంది, బయటా ఉంది. కుండలో ఆకాశాన్ని ఘటాకాశమనీ, బయట ఉన్న ఆకాశాన్ని మహదాకాశమనీ అంటారు. కుండ పగిలిపోతే ఘటాకాశానికేమీ అవదు. అది బయట ఉన్న మహదాకాశంలో లయమయిపోతుంది. అంతే. అందువల్ల కుండలో ఉన్న ఆకాశం కుండలో ఉంది కాని కుండ మీద ఆధారపడి లేదు.

అలాగే ఈశ్వరుడు శరీరంలో ఉన్నాడు కాని, శరీరం మీద ఆధారపడి లేడు. అందుకని శరీరాలన్నీ నాశనమయినా, లోకాలన్నీ నాశనమయినా, ఈశ్వరుడు ఉంటాడు. స బ్రూయాత్- ఒకవేళ శిష్యుడు, నాలుగో మంత్రంలో చెప్పిన సందేహం వెలిబుచ్చితే, గురువు ఇలా జవాబు చెప్పాలి.

ఇది కొత్త పద్ధతిగా ఉంది. ఉపనిషత్తు గురుశిష్యుల మధ్య ఇలాంటి సంభాషణను ఊహించుకుంటున్నది. అందుకని ఈ భాగం ఉపనిషత్తు చెబుతున్నది.

**సబ్రూయాన్నాస్య జరయైతజ్జీర్యతి-** సబ్రూయాత్ అంటే గురువు ఇలా చెప్పాలి అని చూశాము కదా.

ఈ దేహం యొక్క వృద్ధాప్యం వల్ల బ్రహ్మ నాశనం కాదు. ఏతత్ అంటే బ్రహ్మ.

**న వధేనాస్య హన్యత –** శరీరం నశించినా, ఈశ్వరుడు నశించదు;

**ఏతత్సత్యం బ్రహ్మపురం –** ఈ ఈశ్వరుడిని బ్రహ్మపురం అంటారు. ఏతత్సత్యం అంటే ఈశ్వరుడు.

ఉపనిషత్తు మనను ఆడిస్తున్నది. మొదటి మంత్రంలో ఏమంది? శరీరం బ్రహ్మపురం ఉంది. ఇప్పుడు? ఈశ్వరుడే బ్రహ్మపురం అంటున్నది. అదెలా? అంటే ఈ ఈశ్వరుడే సమస్త జగత్తుకూ ఆధారమైన బ్రహ్మ. ముందు మంత్రంలో బ్రహ్మపురం అంటే బ్రహ్మ యొక్క పురం అని అర్థం తీసుకోవాలి. ఇక్కడ బ్రహ్మపురం అంటే ఈ బ్రహ్మ, పురంగా అందరికీ ఉన్నది అని తీసుకోవాలి.

బ్రహ్మపురం– బ్రహ్మయొక్క పురం

బ్రహ్మపురం– బ్రహ్మేపురం

ఈ క్రింది ఉదాహరణ చూస్తే ఈ విషయం బాగా అర్థమవుతుంది. మూడు దశల్లో దీన్ని వివరిస్తాము.

1. ఈ గదిలో ఆకాశం ఉంది.

2. ఆకాశం ఈ గదిలోనే కాదు, బయట కూడా ఉంది.

ఈ గది గోడలు తీసేసామనుకోండి. అప్పుడు ఏమవుతుంది. గదిలో ఆకాశం (మటాకాశం) బయటనున్న ఆకాశం (మహదాకాశం) కలిసిపోతాయి. ఇప్పుడు అలా రెండూ కలిసిన చోట మళ్లీ గదిగోడలు పెట్టామనుకోండి (ఇదంతా ఊహించుకోవాలి). ఏమవుతుంది? మహదాకాశంలో మటాకాశం వచ్చిందా లేదా? అప్పుడేమనాలి?

3. నిజానికి ఆకాశం గదిలో లేదు, ఆకాశంలోనే గది ఉంది.

ఈ గదే కాదు, అన్ని గదులూ ఆకాశంలోనే ఉన్నాయి. అంటే గదిలో ఆకాశం ఉంది అన్న దశ నుంచీ ఆకాశంలో గదులు ఉన్నాయి అన్న దశకు వచ్చాము.

ఇప్పుడు దీన్నే శరీరానికీ, బ్రహ్మకూ అన్వయిద్దాము. శరీరం గది, బ్రహ్మ ఆకాశం.

1. శరీరంలో బ్రహ్మ ఉంది.

2. బ్రహ్మ ఈ శరీరంలోనే కాదు, బయట కూడా ఉంది.

ఈ శరీరం పడిపోతే, ఇందులో ఉన్న ప్రాజ్ఞ, బయట ఉన్న ఈశ్వరునితో కలిసిపోతుంది. (ఘటాకాశం మహదాకాశంలో కలిసిపోయినట్టు). ఇప్పుడు ఇంకో జీవి వచ్చిందనుకోండి. ఆ జీవితో పాటు ప్రాజ్ఞ వచ్చిందా లేదా? అప్పుడేమనాలి?

3. నిజానికి బ్రహ్మ శరీరంలో లేదు. బ్రహ్మలోనే శరీరం ఉంది.

ఈ శరీరమే కాదు, అన్ని శరీరాలూ బ్రహ్మలోనే ఉన్నాయి. మొదటి దశలో బ్రహ్మ పురంలో ఉంది అన్నాము. చివరిదశలో బ్రహ్మ అనే పురంలో అన్నీ ఉన్నాయి అంటున్నాము.

**అస్మిన్కామాః సమాహితా –** ఈ బ్రహ్మలోనే అన్ని వస్తువులూ ఇమిడి ఉన్నాయి. ఇక్కడ కామాః అంటే కోరికలు అని కాకుండా, కోరుకున్న వస్తువులు అని తీసుకోవాలి. ఆలోచనలు కావు, వస్తువులు.

ఇక్కడ్నుంచి ఉపనిషత్తు సగుణబ్రహ్మ నిర్వచనం ఇవ్వబోతున్నది. అందుకే ఈ భాగాన్ని **అష్ట గుణ విశిష్ట ఈశ్వర లక్షణం** లేదా అష్టగుణ విశిష్ట ఈశ్వర వర్ణన అంటారు. ఇది ఎలా సాగుతుందో ముందు చూద్దాము.

ఈ అష్టగుణ విశిష్ట ఈశ్వర ఉపాసన చేసిన వ్యక్తి, ఈశ్వరునిలో లయమౌతాడు.

**తస్మాత్ సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ।**
**మయ్యర్పితమనోబుద్ధిః మామేవైష్యస్యసంశయమ్॥ – గీత 8-7**

అతను ఎన్నటికీ ఈశ్వర చింతనంలోనే ఉంటాడు కాబట్టి మరణకాలంలోకూడా ఈశ్వరుడినే స్మరిస్తాడు. ఈ అధ్యాయంలో ఆరు ఖండాల సారాంశం గీతలో ఎనిమిదో అధ్యాయంలో వస్తుంది.

సగుణ ఉపాసన చేసిన ఫలంగా, ఉపాసకుడు, మరణం తర్వాత, శుక్లగతి ద్వారా బ్రహ్మలోకం వెళ్ళి క్రమముక్తి పొందుతాడు. కాని క్రమముక్తి పొందేముందు, బ్రహ్మలోకంలో చాలా శక్తులు పొందుతాడు. అవి ఈశ్వరశక్తులకు చాలా దగ్గరగా ఉంటాయి. ఇప్పుడు మనం ఈశ్వరునికి చూడబోయే 8 లక్షణాలను అతను కూడా పొందుతాడు. అంటే సగుణ ఈశ్వర ఉపాసకుడు.బ్రహ్మలోకంలో చిన్నసైజు (ఆకారంలో కాదు, లక్షణాలలో)

ఈశ్వరుడు/బ్రహ్మగా అనేక సిద్ధులు కలిగి ఉంటాడు. సంకల్ప మాత్రం చేతనే అతను కోరుకున్న వస్తువులు పొందుతాడు. కోరుకున్న లోకాలకు వెళతాడు. అందువల్ల ఈశ్వర ఉపాసన అతనికి ఇహలోక సుఖం, పరలోక సుఖం,క్రమముక్తి ఇస్తుంది. అందువల్ల దహరాకాశ ఉపాసన చేయమంటున్నది ఉపనిషత్తు.

**ఏష ఆత్మా–** ఇక్కడ ఆత్మ అంటే పరమాత్మ. అది కూడా సగుణ పరమాత్మ లేదా మాయాసహిత పరమాత్మ అంటే ఈశ్వరుడు. ఆయన స్తుతి వస్తున్నది ఇప్పుడు.

**1. అపహత పాప్మా–** కర్మఫలం అంటదు. పాప్మ అంటే మామూలుగా పాపం. కాని పుణ్యం, పాపం రెండూ తీసుకోవాలి. ఈశ్వరునికి పుణ్యాపాపకర్మల ఫలం అంటదు. ఎందుకు అంటదు? ఆయన సంసారి కాదుకాబట్టి. ఎందుకు సంసారి కాదు? కర్తృత్వ భావన ఉండదు కాబట్టి. కర్తృత్వ భావన ఎందుకు ఉండదు? అహంకారం ఉండదు కాబట్టి. అజ్ఞాని జీవి అజ్ఞానం వల్ల అహంకారంతో నేను చేస్తున్నాననే కర్తృత్వ భావన తన మీద వేసుకుని, సంసారంలో కొట్టుమిట్టాడుతూ, అనేక పుణ్య, పాప కర్మలను చేస్తూ, వాటికి తగ్గ పుణ్య,పాప ఫలాలను అనుభవిస్తాడు. జ్ఞాని జ్ఞానం పొందటం వల్ల కర్తృత్వభావన పోగొట్టుకుంటాడు. అందువల్ల అతనికి జ్ఞానం పొందాక, పుణ్యపాపాల కర్మఫలం అంటదు, జాగ్రత్తగా గమనించండి, జ్ఞానికి జ్ఞానం పొందాక, పుణ్యపాపాల కర్మఫలం అంటదు.

కర్మ ఈశ్వరునికి ఎప్పుడూ అంటదు. ఆయన జ్ఞానం పొందాల్సిన అవసరం ఏమిటి? ఆయనే సర్వజ్ఞుడు. సంచిత కర్మలు లేవు. ప్రారబ్ధకర్మలు లేవు. ఆగామి కర్మలు రావు. అందుకని పుణ్యాపాపరహితుడు. సృష్టిస్థితిలయ కారకుడు. ఏదో పనిచేస్తూనే ఉంటాడు కాని ఆయన పాపరహితుడు.

**2. విజరః –** వృద్ధాప్యం ఉండదు. జర అంటే వృద్ధాప్యం. విజరః అంటే వృద్ధాప్యం ఉండదు. అది కూడా కర్మ వల్లే వస్తుంది.

**3. విమృత్యు:–** మరణం లేదు. ఈశ్వరుడు కారణం కాబట్టి మరణం లేదు. ఈశ్వరుడు కూడా మరణిస్తే తర్వాతి సృష్టి రాదు కదా!

**4. విశోకః –** శోకం లేదు. ఎందుకు? జ్ఞాని కాబట్టి; భగవంతునికి జ్ఞానం లేకపోతే అత్యంత ఎక్కువ దుఃఖం ఆయనకే ఉంటుంది. లక్షలాది ప్రజలు

ఇహలోకంలో, పరలోకంలో బాధలు పడటం చూస్తూనే ఉంటాడు. వాళ్ళ అవస్థ చూస్తూ తట్టుకుంటున్నాడంటే దానికి కారణం జ్ఞానం.

**5. విజిఘత్సః –** ఆకలి లేదు. ఆకలి కూడా కర్మజన్యమే.

**6. అపిపాసః –** దాహం వేయదు.

**7. సత్యకామః –** సత్యమైన కోరికలు ఉన్నవాడు. అంతేకాదు, ఆయన కోరికలు వృధాపోవు. కోరికలన్నీ తీరుతాయి.

**8. సత్యసఙ్కల్పః–** కోరికలు తీరటానికి ప్రయత్నం చేయనవసరం లేదు. మనిషికి కోరికలు తీరాలంటే సంకల్పం ఉంటే చాలదు. ప్రయత్నం కూడా చేయాలి. బ్రహ్మసూత్రాల్లో **సంకల్పాధికరణం** అనే ఒక అధికరణం ఉంది. అందులో బ్రహ్మలోకంలో ఉపాసకుడు పొందే సిద్ధుల గురించిన చర్చ విపులంగా వస్తుంది.

ఇవీ ఈశ్వరుడికి ఉన్న ఎనిమిది గుణాలు. ఉపాసన సూత్రం ఒకటి ఉంది శాస్త్రంలో.

**యథా యథా ఉపాస్తే, తదేవ భవతి॥**

అందువల్ల ఈశ్వర ఉపాసకుడు ఈశ్వరునికున్న సత్యకామ, సత్యసంకల్ప గుణాల మీద ఉపాసన చేస్తే, అతనికి కూడా ఈ గుణాలు వస్తాయి. ఇక్కడ కాదు; బ్రహ్మలోకంలో. కాకపోతే ఈశ్వరునికి ఇవి అనంతంగా ఉంటాయి. ఉపాసకునికి తక్కువస్థాయిలో ఉంటాయి. లేకపోతే ఈశ్వరుడినే సవాలు చేస్తాడు.

ఇప్పుడు ఉపనిషత్తు ఉపాసన గురించి, ఉపాసనఫలం గురించీ చెప్పబోతున్నది. ఉపాసకునికి హద్దులు, పరిమితులు ఏమీ ఉండవు. కాని అతని స్వేచ్ఛ గురించి చెప్పటానికి ఉపనిషత్తు ఒకపద్ధతి ఎన్నుకుంది. ఇక్కడ భూమ్మీద ఉండే వ్యక్తితో బ్రహ్మలోకానికి వెళ్ళేవ్యక్తిని పోల్చింది. ఇక్కడ మన పరిస్థితి దారుణంగా ఉందని తెలిస్తే, ఈ ఉపాసన చేస్తే, మనకు సిద్ధులు వస్తాయని తెలిస్తే, ఈ ఉపాసన మీద దానంతట అదే శ్రద్ధా పుడుతుందా, లేదా? అందువల్ల భూలోక జీవుడిని వర్ణిస్తున్నది ముందు.

**యథా హ్యేవేహ ప్రజా అన్వావిశన్తి –** సత్యసంకల్పః తర్వాత విషయం హఠాత్తుగా మారిపోయింది. ఈశ్వరుని నుంచి దుఃఖపూరిత జీవుని దగ్గరకు వచ్చింది. ఇక్కడ ఈ భూలోకంలో ప్రజలు కర్మఫలం పొందుతారు. ఇహ

అంటే ఈ భూలోకంలో; ప్రజాః అంటే ప్రజలు; అన్వావిశన్తి – పొందుతారు; ఏం పొందుతారు? కర్మఫలాలు అని కలుపుకోవాలి. అనేక ఐహిక లాభాలు పొందుతారు. ఎలా పొందుతారు?

**యథానుశాసనం–** భూలోక రాజు రాసిన శాసనం ప్రకారం పొందుతారు. ఉద్యోగికి జీతం నిర్ణయించేది అతని యజమాని. యజమానికి ఇష్టం లేకపోతే ఉద్యోగం నుంచి కూడా తీసివేయవచ్చు. ఎన్ని లాభాలు ఇస్తే అన్నే అనుభవించగలడు. అందువల్ల మొదటి పరిమితి– వస్తు పరిమితి

**యం యమన్తమభికామా భవన్తి–** అభితం అంటే ప్రదేశం. ప్రదేశం అంటే ఇల్లు లేదా భూమి. అంతమేరకే వాళ్ళు దాన్ని అనుభవించగలరు.

**యం జనపదం యం క్షేత్రభాగం తం తమేవోపజీవన్తి–** వాళ్ళు ఏం కోరుకుంటే, ఒక రాజ్యం కానీ, ఒక ద్వీపం కానీ, ఒక రాష్ట్రం కానీ– అంతమేరకే వాళ్ళు దాన్ని అనుభవించగలరు. జనపథం అంటే పెద్ద రాష్ట్రం; క్షేత్రభాగం అంటే చిన్న ప్రదేశం. అంటే పెద్ద రాజ్యమైనా, చిన్న ప్రదేశమైనా దానికి పరిమితులు ఉన్నాయి. హద్దులు ఉన్నాయి. అందువల్ల రెండో పరిమితి– దేశ పరిమితి. అదే ఉపాసకుడు పెద్ద భవంతి కావాలనుకుంటే (బ్రహ్మలోకంలో) భవంతి అతని కళ్ళముందు ఉంటుంది. సంకల్పమాత్రం చేత; రేపు ఇది వద్దు చిన్న ఇల్లు చాలు అనుకుంటే అది ఉంటుంది.

**మంత్రం–6** ఇంకా పరిమితి విషయమే కొనసాగుతోంది. వస్తుపరిమితి అయింది, దేశపరిమితి అయింది. ఇప్పుడు కాలపరిమితి గురించి చెపుతున్నది. తను చేసిన కర్మల ఫలితంగా వచ్చిన కర్మఫలాన్ని శాశ్వతంగా అనుభవించలేడు. కర్మే అశాశ్వతం కాబట్టి, దానివల్ల వచ్చే కర్మఫలం కూడా అశాశ్వతమే. కర్మ వల్ల స్వర్గలోకానికి వెళ్ళినా, దాని కాలం తీరగానే వెనక్కి రావాల్సిందే. ఆ వెళ్ళేది కూడా శుక్లగతి ద్వారా వెళ్ళడు. కృష్ణగతి ద్వారా, స్వర్గలోకానికి మాత్రమే వెళతాడు. వెళ్ళి తిరిగివస్తాడు.

**తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం**
**క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి। – గీత 9–21**

దానికి వ్యతిరేకంగా, ఉపాసకుడు శుక్లగతి ద్వారా బ్రహ్మలోకానికి వెళతాడు. తిరిగి రాడు. అక్కడ్నుంచి క్రమముక్తి పొందుతాడు. అందువల్ల మూడో పరిమితి– కాలపరిమితి.

అందువల్ల కర్మ, ఉపాసనల్లో ఏది గొప్పది? జ్ఞానం అనకండి. ఇక్కడ జ్ఞానం ప్రసక్తి రాలేదు. అందుకే శ్రీకృష్ణ పరమాత్మ కూడా ఎనిమిదో అధ్యాయంలో, 'అర్జునా, కర్మ కన్నా ఉపాసన గొప్పది,' అన్నాడు. మళ్ళీ శ్రీకృష్ణ పరమాత్మ తొమ్మిదో అధ్యాయంలో 'జ్ఞానం ఉపాసనకన్నా గొప్పది,' అన్నాడు. ఇక్కడ కూడా అంతే. మొదటి ఆరు అధ్యాయాల్లో ఉపాసన గొప్పది అంటున్నది ఉపనిషత్తు. తర్వాత ఉపాసనకన్నా కూడా జ్ఞానం గొప్పది అంటుంది. ఈ విధంగా కొనసాగుతుంది ఈ అధ్యాయం.

**తద్యథే హ కర్మజితో లోకః క్షీయతే–** కర్మ వల్ల పొందిన ఫలాలు మన కళ్ళముందే క్షీణిస్తాయి. కర్మఫలం ఏ రూపంలోనన్నా ఉండవచ్చు. మనుష్యులు, వస్తువులు, అనుకూల పరిస్థితులు– ఏదైనా అవచ్చు. జితాః అంటే కర్మ ద్వారా పొందినవి. క్షీయతే – అవి నశిస్తాయి. పుట్టుట గిట్టుట కొరకే. పుట్టిన ప్రతిదానికీ మరణం ఉంటుంది. ఉపనిషత్తు దాన్ని ప్రత్యక్ష ప్రమాణం ద్వారా చెపుతున్నది.

ఇదే సూత్రం స్వర్గలోకానికి కూడా వర్తిస్తుంది. కాని ఇక్కడ ప్రత్యక్ష ప్రమాణం ఇవ్వలేము.ఎందుకు? స్వర్గం ప్రత్యక్షం కాదు కాబట్టి. అందుకని ఉపనిషత్తు అనుమాన ప్రమాణం ఇస్తున్నది.

**యత్ యత్ కర్మఫలం తత్ తత్ అనిత్యం।**
**స్వర్గసుఖం అనిత్యం కర్మఫలత్వాత్॥**

**ఏవమేవ–** అనుమాన ప్రమాణం వల్ల;

**అముత్ర పుణ్యజితో లోకః క్షీయతే–** అముత్ర అంటే పరలోకం. పుణ్యకర్మల వల్ల పొందిన పరలోక ఫలం కూడా నశిస్తుంది. అందుకని కర్మలు వదిలేసి ఉపాసనకు రండి అంటున్నది. ఏమిటా ఉపాసన? ఈశ్వర ఉపాసన! ఏ ఈశ్వరుడు? అష్టగుణ విశిష్ట ఈశ్వరుడు.

అష్టగుణ విశిష్ట ఈశ్వర ఉపాసన చేసిన ఉపాసకుడు బ్రహ్మలోకంలో అసాధారణమైన శక్తులను పొందుతాడు. అతను కూడా సత్యకాముడు, సత్యసంకల్పుడు అవుతాడు. గీత ఎనిమిదో అధ్యాయంలో ఈ సిద్ధుల గురించి శ్రీకృష్ణ భగవానుడు ప్రస్తావించలేదు, కాని ఇందులో అదనంగా వస్తాయి. ఇప్పుడు ఉపాసకుడు అనుభవించబోయే అనేక అసాధారణ ఫలాల గురించి చెప్పబోతున్నది.

ఉపాసనా ఫలాన్ని స్తుతించటం కోసం ఉపనిషత్తు కర్మఫలం లోని పరిమితుల గురించి చెపుతున్నది. కర్మకన్నా ఉపాసన గొప్పదని తద్వారా చెప్తుంది. ఇంకా నిర్గుణ బ్రహ్మజ్ఞానంలోకి రాలేదు.

**తద్యథేహ కర్మజితో లోకః క్షీయతే॥**

ఇదొక అక్షరలక్షల విలువ చేసే వాక్యం. శంకరాచార్యుల వారు తరచూ దీని గురించి చెపుతూ ఉంటారు. కర్మజితో లోకః అంటే కర్మ వల్ల పొందిన ఫలం. కర్మ చేసిన వ్యక్తి స్వర్గలోకానికి వెళ్ళవచ్చు. అక్కడ స్వర్గసుఖాలను అనుభవించవచ్చు. కాని ఎన్నాళ్ళు? పుణ్యకర్మఫలం అయిపోయేవరకే. అదే శ్రీకృష్ణభగవానుడు కూడా చెప్పాడు.

**తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం**
**క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి।      - గీత 9-21**

**తద్య ఇహాత్మాన మననువిద్య ప్రజన్త్యేతాగ్ంశ్చ సత్యాన్ కామాగ్ం -** ఎవరైతే, అష్టగుణ విశిష్ట ఈశ్వర ఉపాసన చేయకుండా, కేవలం కర్మలు మాత్రమే చేసి మరణిస్తారో, ఎవరైతే విశ్వరూప ఉపాసన చేయరో వారు పొందే ఫలం ఏమిటి?

**తేషాగ్ం సర్వేషు లోకేష్వకామచారో భవతి-** వారు సత్యకామ, సత్యసంకల్ప సిద్ధులు పొందలేరు. ఒక్కముక్కలో చెప్పాలంటే ఈశ్వరునికుండే సిద్ధులు పొందలేరు.

అకామచారః భవతి, పరతంత్రః భవతి, పరిచ్ఛిన్న భవతి
కాని కొందరు తెలివైన వాళ్ళు ఈశ్వర ఉపాసన చేస్తారు.

**అథయ ఇహాత్మామనువిద్య వ్రజన్త్యేతాగ్ంశ్చ సత్యాన్ కామాగ్ం-**

దీనికి భిన్నంగా ఎవరైతే ఈ భూలోకంలో అష్టగుణ విశిష్ఠ ఈశ్వర ఉపాసనను, విశ్వరూప ఉపాసనను చేస్తారో వారు;

**తేషాగ్ం సర్వేషు లోకేషుకామ మచారో భవతి -** ఇక్కడ సిద్ధులు పొందుతారు కాని, అవి పరిమితి ఉన్నవి. బ్రహ్మలోకంలో ఇంకా ఎక్కువ సిద్ధులు పొంది, దాదాపు ఈశ్వరుడంతటివాడు అవుతాడు.

**సత్యాన్ కామాగ్ం -** ఈశ్వర ఉపాసన ఈశ్వరునికే పరిమితమవదు. ఈశ్వరునిలో ఉన్న సర్వం జగత్తు వస్తుంది.

ఇక్కడితో దహర ఉపాసన యొక్క లౌకిక ఫలం వచ్చేసింది. క్రమముక్తి గురించి తర్వాత వస్తుంది. ముందు అతనికి వచ్చే సిద్ధుల గురించి చెప్పబోతున్నది.

**ద్వితీయః ఖణ్డః (2)**

**స యది పితృలోకకామో భవతి సంకల్పాదేవాస్య పితరః సముత్తిష్ఠన్తి తేన పితృలోకేన సమ్పన్నో మహీయతే ॥1॥ అథ యది మాతృలోకకామో భవతి సంకల్పాదేవాస్య మాతరః సముత్తిష్ఠన్తి తేన మాతృలోకేన సమ్పన్నో మహీయతే ॥2॥ అథ యది భ్రాతృలోకకామో భవతి సంకల్పాదేవాస్య భ్రాతరః సముత్తిష్ఠన్తి తేన భ్రాతృలోకేన సమ్పన్నో మహీయతే ॥3॥ అథ యది స్వసృలోకకామో భవతి సంకల్పాదేవాస్య స్వసారః సముత్తిష్ఠన్తి తేన స్వసృలోకేన సమ్పన్నో మహీయతే ॥4॥ అథ యది సఖిలోకకామో భవతి సంకల్పాదేవాస్య సఖాయః సముత్తిష్ఠన్తి తేన సఖిలోకేన సమ్పన్నో మహీయతే ॥5॥ అథ యది గన్ధమాల్యలోకకామో భవతి సంకల్పాదేవాస్య గన్ధమాల్యే సముత్తిష్ఠతస్తేన గన్ధమాల్యలోకేన సమ్పన్నో మహీయతే ॥6॥ అథ యద్యన్నపాన లోకకామో భవతి సంకల్పాదేవాస్యాన్నపానే సముత్తిష్ఠతస్తేనాన్నపానలోకేన సమ్పన్నో మహీయతే ॥7॥ అథ యది గీతవాదిత్రలోకకామో భవతి సంకల్పాదేవాస్య గీతవాదిత్రే సముత్తిష్ఠస్తేన గీతవాదిత్రలోకేన సమ్పన్నో మహీయతే ॥8॥ అథ యది స్త్రీలోకకామో భవతి సంకల్పాదేవాస్య స్త్రియః సముత్తిష్ఠన్తి తేన స్త్రీలోకేన సమ్బన్నో మహీయతే ॥9॥ యం యమన్తమభికామో భవతి యం కామం కామయతే సోఽస్య సఙ్కల్పాదేవ సముత్తిష్ఠతి తేన సమ్పన్నో మహీయతే ॥10॥**

ఈ ఖండంలో ఉపాసకుడు సత్యకాముడు, సత్యసంకల్పుడు ఎలా అవుతాడో వివరంగా వస్తుంది.

**మంత్రం-1 స యది పితృలోకకామో భవతి–** లోకం అంటే అక్షరాలా లోకం కాదు; లోకం అంటే భోగ విషయం. ఒకవేళ ఉపాసకుడు తన తాత ముత్తాతలను కాని, తండ్రిని కాని, పూర్వీకులను కానీ చూడాలనుకుంటే; **సంకల్పాదేవాస్య పితరఃసముత్తిష్ఠన్తి –** సంకల్పం మాత్రం చేతనే తన పూర్వీకులందరినీ తన మానసిక తెరపై చూడగలడు. అతను వారితో

మాట్లాడగలడు. వారి సాన్నిహిత్యాన్ని ఆనందించగలడు. అది అక్షరాలా స్వప్న ప్రపంచం లాగా ఉంటుంది. కాని తేడా ఏమిటంటే, కల మనం కోరుకున్నట్టు రాదు. అలా మనం కోరుకున్నట్టు వస్తే ఎంత బాగుంటుంది! స్వప్నంతో పోలిక ఎంత మేరకు అంటే, ఇది కూడా అతని మనస్సు నుంచో, లేదా ఆలోచన నుంచో వస్తుంది. తేడా, ఇక్కడ అతని ఇష్టప్రకారం వస్తుంది. కలలో కనబడ్డ వారితో మాట్లాడి కష్టసుఖాలననుభవించినట్టే, ఇతనూ వారితో మాట్లాడి, సుఖాన్ని అనుభవించగలడు.

అంతేకాదు, ఈ రెండింటి మధ్య ఇంకో వ్యత్యాసం కూడా ఉంది. కల కొన్ని క్షణాలు ఉండి కరిగిపోతుంది. ఇది అలా కాదు అతను కోరుకున్నంతసేపు ఉంటుంది.

**తేన పితృలోకేన సంపన్నో మహీయతే–** పితృదేవతలతో సంభాషణ జరపటం వల్ల పితృలోక అనుభవాన్ని పొంది, మహిమను పొందుతాడు.

**మంత్రం–2** ముందు మంత్రంలో ఉన్నమాటలే ఇందులో కూడా అక్షరాలా అవే వస్తాయి. కాకపోతే పితృ బదులు మాతృ వస్తుంది. అంతే తేడా.

**తేన మాతృలోకేన సంపన్నో మహీయతే–** అతను తల్లిని కాని, అమ్మమ్మను కాని చూడాలనుకుంటే సంకల్పమాత్రం చేత ఆ మాతృదేవతలను చూడవచ్చు.

**మంత్రం–3 నుంచి మంత్రం–8 వరకు**

మంత్రం ఒకటిలో ఉన్న మాటలే వీటిలో అక్షరాలా అవే వస్తాయి. కోరికలు మారుతాయి అంతే. అవి వరుసగా, అన్నను, చెల్లిని, మిత్రులను, సుగంధాలను, ఆభరణాలను(గంధమాల్య); అన్నపానాలను, గీత వాద్యాలను చూడవచ్చు. ఏమైనా ప్రయత్నం చేయాలా? అవసరం లేదు.

**సంకల్పాదేవ–** సంకల్పం మాత్రం చేతనే అనుభవించగలడు. మనకు మామూలుగా మంచి సంకల్పం ఉన్నంత మాత్రాన అవి తేలిగ్గా నెరవేరవు. అది చాలా శ్రమ, ఖర్చుతో కూడినది. ఎంతో కాలయాపన అవుతుంది. ఒక్కోసారి అది వృథాప్రయాసగా మిగిలిపోవచ్చు. కోరిక తీరకుండానే మన తనువు చాలించాల్సి రావచ్చు. కాని ఈ ఉపాసకునికి శ్రమ, ఖర్చులు లేవు కదా, కోరినంత మాత్రాన, కోరిన తక్షణమే కోరిక తీరుతుంది.

**సంకల్పాదేవ తు తత్ సూత్రేః** – బ్రహ్మసూత్రాలు

ఈ విషయాన్ని బ్రహ్మసూత్రాల్లో చాలా వివరంగా విశ్లేషిస్తారు.

**మంత్రం- 9** భూలోకంలో స్త్రీలు, పురుషులు, పిల్లలు అందరూ కలిసి ఉంటారు. ఒకవేళ ఉపాసకునికి కేవలం స్త్రీలే ఉండాలనో, లేదా కేవలం పురుషులే ఉండాలనో, లేదా పిల్లలే ఉండాలనో ఉన్నా కూడా ఆ కోరిక కూడా నెరవేరుతుంది. ఇక్కడ స్త్రీలోకాన్ని పేర్కొంది కాని దాన్ని పురుషలోకానికి లేదా శిశులోకానికి కూడా అన్వయించుకోవచ్చు.

**మంత్రం-10** ఇంత పెద్ద పట్టిక చెప్పీ, చెప్పీ అలసిపోయింది ఉపనిషత్తు. అందుకని దాన్ని ఈ మంత్రంతో ముగిస్తున్నది.

**యం యమన్త మభికామో భవతి యం కామం కామయతే** - ఒక్కముక్కలో చెప్పాలంటే, అతను ఏది కోరుకుంటే అది తీరుతుంది.

ఇక్కడితో సిద్ధుల గురించిన మంత్రాలు అయిపోయాయి. ఇది ప్రత్యేకమైన ఖండం. ఎందుకంటే వీటి గురించిన ప్రస్తావన వేరే ఏ ఉపనిషత్తులోనూ రాదు. ముండకలో కేవలం ప్రస్తావించి వదిలేస్తుంది.

**యం యం లోకం మనసా సంవిభాతి**
**విశుద్ధసత్త్వః కామయతే యాంశ్చ కామాన్॥ - ముండక 3-1-10**

ఈ ఉపాసన ఫలం గొప్పదనం అది. సంకల్పమాత్రం చేత 14 లోకాల్లో ఏది కోరుకుంటే అది పొందవచ్చు. సమయం, శ్రమ, ఖర్చు వృధా కాకుండా, ఇంతకుమించిన లౌకిక సుఖం వేరే ఏదీ కోరలేము. శారీరక శ్రమ ద్వారా అన్నీ ఎన్నడూ పొందలేము.

ప్రపంచ యాత్ర చేసి వచ్చినా ఏదో కోరిక మిగిలిపోతుంది. పనిగట్టుకుని తాజ్‌మహల్ చూద్దామని వెళితే, ఆ రోజు సెలవ కావచ్చు. మళ్ళీ ఎప్పటికి వెళతామో, అసలు మళ్ళీ వెళ్ళగలమో లేదో తెలియదు. కన్యాకుమారిలో సూర్యోదయం బాగుంటుందని పొద్దున్నే లేచి వెళ్ళి చూస్తే, మేఘాలు అడ్డువచ్చో, వాన కురిసో చూడలేకపోవచ్చు. పోనీ ఇక్కడ ఏదో అదృష్టం బాగుండి అన్నీ చూడగలిగినా స్వర్గలోకానికి వెళ్ళి రంభ, ఊర్వశి, మేనకల నృత్యాలు చూడగలమని ఖచ్చితంగా చెప్పలేము. కాని ఈ ఉపాసకుడు భూలోకంలోనే కాదు, 14 లోకాల్లోనూ ఏది కావాలనుకున్నా పొందగలడు. లేదు, కుదరదు, సాధ్యం కాదు పదాలు అతని నిఘంటువులో ఉండవు. అవి కూడా ఎలా పొందగలడు?

**సంకల్పాదేవ సముత్తిష్ఠన్తి** - సంకల్పం మాత్రం చేతనే పొందగలడు.

**తేన సమ్పన్నో మహీయతే –** ఈ అనుభవాల వల్ల అతను సంపన్నుడవుతాడు. మహిమ పొందిన వాడవుతాడు.

ఇవన్నీ దహరాకాశః ఉపాసన ఫలం. అది కూడా సకామ ఉపాసన ఫలం.

**తృతీయః ఖణ్డః (3)**

**త ఇమే సత్యాః కామా అనృతాపిధానాస్తేషాగ్ం సత్యానాగ్ం సతామనృతమపిధానమ్॥ యో యో హ్యస్యేతః ప్రైతి న తమిహ దర్శనాయ లభతే ॥1॥ అథ యే చాస్యేహ జీవా యే చ ప్రేతా యచ్చాన్యదిచ్ఛన్న లభతే సర్వం తదత్ర గత్వా విన్దతేఽత్ర హ్యస్యైతే సత్యాః కామా అనృతాపిధానాః। తద్యథాఽపి హిరణ్యనిధిం నిహితమక్షేత్రజ్ఞా ఉపర్యుపరి సంచరన్తో న విన్దేయురేవమేవేమాః సర్వాః ప్రజాః అహరహర్గచ్ఛన్త్య ఏతం బ్రహ్మలోకం న విన్దన్త్యనృతేన హి ప్రత్యూఢాః ॥2॥ స వా ఏష ఆత్మాహృది తస్యైతదేవ నిరుక్తగ్ం హృద్యయమితి తస్మాద్ధృదయమ్ । అహరహర్వా ఏవంవిత్స్వర్గం లోకమేతి ॥3॥ అథ య ఏష సమ్ప్రసాదోఽస్మాచ్ఛరీరాత్సముత్థాయ పరంజ్యోతిరుపసమ్పద్య స్వేన రూపేణాభినిష్పద్యత ఏష ఆత్మేతి హోవాచైతదమృతమభయమేతద్బ్రహ్మేతి । తస్య హ వా ఏతస్య బ్రహ్మణో నామ సత్యమితి ॥4॥ తాని హ వా ఏతాని త్రీణ్యక్షరాణి సతీయమితి తద్యత్సత్తదమృతమథ యత్తి తన్మర్త్యమథ యద్యం తేనోభే యచ్ఛతి యదనేనోభే యచ్ఛతి తస్మాద్యమహరహర్వా ఏవంవిత్స్వర్గం లోకమేతి ॥5॥**

సకామ ఉపాసన వల్ల ఉపాసకుడు పొందగలిగే లౌకిక ఫలాల గురించి ఇంకా చెపుతున్నది. మొదటి ఖండం ఈశ్వర ఉపాసన గురించి చెపితే, రెండో ఖండం ఈశ్వర ఉపాసన ఫలం గురించి చెప్పింది. ఇప్పుడు ఈశ్వర ఉపాసన ఫల స్తుతి వస్తున్నది.

ఎవరైనా కోరుకునేది ఏమిటి? ప్రాపంచిక సుఖాలు. అవన్నీ పొందటానికి చాలా శ్రమపడతాడు. కాని అవి నీలోనే, నీ హృదయంలోనే ఉన్నాయి. నువ్వు వాటిని సత్యకామంతోనూ, సత్య సంకల్పంతోనూ తీసుకురాగలవు అంటున్నది ఉపనిషత్తు. కాని ఎవరూ దాన్ని పొందటానికి ప్రయత్నించటం లేదు. ప్రయత్నం చేయకపోగా, బాహ్యంగా వెతుకుతున్నారు.

ఏ లౌకిక సుఖాలకైతే నువ్వు బాహ్యంగా పరుగులు తీస్తున్నావో అవి నీలోనే ఉన్నాయి సుమా అని చెపుతున్నది ఈ మంత్రం.

ఉపనిషత్తు మన స్థాయికి దిగివచ్చి చెపుతున్నది; 'పోనీలే, నీకు మోక్షం పొందాలన్న కోరిక లేకపోయినా ఫర్వాలేదు. నీకు ఐహిక సుఖాల మీదే మక్కువ ఉన్నా, దానికొక దగ్గర మార్గం ఉంది చూసుకో. అవి నీ హృదయంలోనే ఉన్నాయని తెలుసుకో!'

**త ఇమే సత్యాః కామాః–** సత్యాః కామా అంటే లౌకిక సుఖాలు. సత్యం అంటే వ్యావహారిక సత్యం. కామా అంటే సుఖాలు. ఈ బాహ్యప్రపంచంలో ఉన్నాయనుకునే సుఖాలు, ఎక్కడ ఉన్నాయి? ఆత్మా నిశ్చితః – ఈ పదాలు మనం కలుపుకోవాలి. అవి నీ హృదయంలోనే ఉన్నాయి.

**అనృతాపిధానాః –** కాని అవి అసత్యంతో కప్పివేయబడి ఉన్నాయి. అనృతం అంటే ఇక్కడ అపోహ. ఐహిక సుఖాలు బాహ్యప్రపంచంలో దొరుకుతాయన్న అపోహ కప్పేసింది. అవి నిజానికి లోపలే ఉన్నాయి.

మీరు బాహ్యంగా నృత్యగీతాలను అనుభవిస్తున్నట్టు కనిపించినా, నిజానికి అవి బాహ్యంగా లేవు. మీ మనస్సులోకి అవి ఆలోచనల రూపంలో ప్రవేశించాయి. అందువల్ల మీరు అనుభవిస్తున్నది మీ ఆలోచనల రూపంలోనే. ఏమిటి నిదర్శనం? ఆ సంగీతం మీ ఆలోచనల్లోకి చొరబడకపోతే, మీ ఎదురుగా సంగీతం మ్రోగుతున్నా మీకు ఆనందం లభించదు. అందుకని ఎప్పటికీ మీరు అనుభవిస్తున్నది మీ మనస్సులో లభించే ప్రపంచాన్నే.

ఒక మామాలు వ్యక్తి సంగీతాన్ని బాహ్యంగా విని, దాన్నుంచి ఆలోచన ద్వారా దాన్ని అనుభవిస్తాడు. ఉపాసకుడు తనలోంచే దహరాకాశంలోంచే సంగీతాన్ని సృష్టిస్తాడు. ఈ రెండింటిలో ఏది చవక? ఉపాసన ఫలమే చవక. ప్రపంచ యాత్ర చేయటం చవకా, ఇంట్లోనే కూర్చుని వరల్డ్‌ట్రావెల్ అనే టీవీ ఛానెల్ చూడటం చవకా? బయటకి వెళ్ళి, అవస్థపడి, ఇబ్బందులు ఎదుర్కొని అసంతృప్తితో తిరిగిరావాలి.

ఐహిక సుఖాలు చవగ్గా దొరికే మార్గాన్ని ఎన్నుకోడు మనిషి అని జాలి చూపుతున్నది ఉపనిషత్తు.

**తేషాగ్ం సత్యానాగ్ం సతామ్ –** ఉపాసకుడు అంతర్గతంగా పొందే ఆనందం బాహ్య ఆనందం అంత సత్యమైనదే అంటున్నది ఉపనిషత్తు. ఎందుకు?

బాహ్యవస్తువులను మనం ఆలోచనల వల్లనే అనుభవించగలము, ఉపాసకుడు కూడా ఆలోచనల వల్లనే అనుభవిస్తాడు.

ఉదాహరణకు టీవీలో టెస్ట్‌మ్యాచ్ చూపిస్తున్నారనుకోండి. మీరు ఆ మ్యాచ్ పొద్దున్న చూడలేదు. మ్యాచ్ గురించి ఏమీ తెలియదు. అది లైవ్‌షోనా, రీప్లేనా అన్నది మీకు తెలియదు. అలాగే మనస్సు కూడా టీవీలాంటిది. బాహ్యప్రపంచం నుంచి వచ్చినా, మీలోని సంకల్పంలోంచి వచ్చినా ఆలోచనా ప్రపంచం ఒకటే. అంటే రెండు లోకాలూ ఒకటే.

**అనృతమపిధానమ్–** కాని అతని దృష్టి బాహ్యప్రపంచం మీద ఉండటం వల్ల లోపల ఉన్న శక్తి గురించి తెలియటం లేదు. దూరంగా ఉన్న వాళ్ళను చూడాలనిపిస్తుంది, వాళ్ళు రారు.

**యో యో హ్యస్యేతః ప్రైతి న తమిహ దర్శనాయ లభతే–** అంతేకాదు, పోయిన వాళ్ళ మీద దుఃఖం తీరదు. వాళ్లను చూడాలని చాలా అనిపిస్తుంది. వాళ్ళను కనీసం కలలోనైనా చూడగలమా అని తపిస్తూ ఉంటాము. కాని కల మన చేతిలో లేదు కదా! అందుకని కోరిక ఉన్నా ఆ కోరిక నెరవేరదు.

ఉపాసకునికి ఆ కోరిక తీరుతుంది. ఎందుకు? అతని హృదయాకాశం ఈశ్వరుడు. ఈశ్వరుడు విశ్వాధారం. అందుకని జగత్తు మొత్తం అతని హృదయంలోనే ఉంది. అందుకే సంకల్పమాత్రం చేత కోరిక తీరుతుంది. అందరికీ హృదయాకాశంలో జగత్తు ఉన్నా ఉపాసకునికే ప్రత్యేక శక్తి ఉంటుంది, అతను చేసే ఉపాసన వల్ల అతనికి కూడా ఈ రెండు లక్షణాలు వస్తాయి. దానివల్ల సత్యసంకల్ప వృత్తి ఏర్పడి, అతను ఏమనుకుంటే అది నెరవేరుతుంది. అది అందరికీ అవదు. ఈ ఉపాసకునికి మాత్రమే అవుతుంది. దీనివల్ల అతను కర్మఫలం కూడా అనుభవిస్తాడు.

నేను సృష్టించుకున్న దానినుంచి నాకెలా ఆనందం వస్తుంది? దీనికి జవాబు స్వప్న ప్రపంచమే. నేను సృష్టించుకున్న స్వప్నప్రపంచం నాకు సుఖదుఃఖాల అనుభవం ఇస్తుంది. స్వప్నంలో ఉన్నంతసేపూ అది నిజమే. స్వప్నం కాదు. అది నేను సృష్టించుకున్నదే అవవచ్చు. కాని నాకు ఆనందాన్ని, దుఃఖాన్ని ఇస్తుంది. అలాగే ఉపాసకుడు తనకేం కావాలంటే అది సృష్టించుకోగలడు. స్వప్నం ప్రారబ్ధ సిద్ధం అయితే ఉపాసకునికి ప్రపంచం సంకల్పసిద్ధం.

ఈ శక్తిని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవచ్చు అంటున్నది ఉపనిషత్తు. దీని వల్ల లాభం ఏమిటి? మీరు ప్రపంచం తిరిగి రానవసరం లేదు. పాస్‌పోర్ట్, వీసాల ప్రసక్తి లేదు. అంతా మీలోనే ఉంది. కాని మీరు గుర్తించటం లేదు. బాహ్యాముఖంగా చూస్తున్నారు. మీలో ఉన్న నిక్షిప్త శక్తిని గుర్తించటం లేదని ఉపనిషత్తు బాధపడుతున్నది. ఇక్కడ ఉపనిషత్తు నిర్గుణ బ్రహ్మ జ్ఞానం గురించీ, మోక్షం గురించీ మాట్లాడటం లేదు. అది తర్వాత వస్తుంది. అది సగుణ ఈశ్వర ఉపాసన గురించీ, సత్యసంకల్పాది సిద్ధుల గురించీ మాట్లాడుతున్నది.

**మంత్రం- 2 అథ యే చాస్యేహ... అనృతాపిధానాః -** ఇంతవరకూ ఒక భావన కింద తీసుకోవచ్చు. మనకు ఎంతో ఇష్టమైన వాళ్ళు మన కళ్ళముందు ఉండరు. ఇంద్రియాల శక్తి చాలా పరిమితమైనది. నేను ఒక వైపు తిరిగితే, రెండోవైపు ఏం జరుగుతుందో నాకు తెలియదు. అందుకే కోరినవన్నీ నెరవేరవు.

| | |
|---|---|
| **అథయే చాస్యేహ జీవా** | - బ్రతికి ఉన్న వాళ్ళను చూడాలనుకున్నా; |
| **యే చ ప్రేతాః** | - మరణించి ఉన్నవాళ్ళను చూడాలనుకున్నా; |
| **యచ్చాన్యదిచ్ఛన్** | - ఇష్టమైన వస్తువులు కావాలనుకున్నా; |
| **న లభతే** | - అవి దొరకవు. |

కాని ఉపాసకునికి ఈ పరిమితులు లేవు. ఉపాసక అనే పదం కలుపుకోవాలి.

**సర్వం తదత్ర గత్వా విన్దతే-** ఈ సర్వాన్నీ ఈశ్వరుని ఉపాసించటం వల్ల పొందుతాడు. ఎలా పొందగలడు?

**అత్ర హ్యస్యైతే సత్యాః కామాః -** హృదయాకాశంలో వ్యావహారిక సత్య ప్రపంచం ఉంది కాబట్టి. ఇక్కడ సత్యం అంటే పారమార్థిక సత్యం కాదు, వ్యావహారిక సత్యం. కామాః అంటే మనిషి కోరేవన్నీ. అత్ర- అన్నీ అతని హృదయంలోనే ఉన్నాయి.

**అనృతా పిధానాః -** కాని అతను బాహ్యాముఖంగా ఉండటం వల్ల అవి కప్పివేయబడ్డాయి.

**తద్యథాఽపి హిరణ్యనిధిం నిహితమక్షేత్రజ్ఞా ఉపర్యుపరి సంచరంతో న విన్దేయుః -** ఉపనిషత్తు ఒక ఉదాహరణనిస్తున్నది. ఒక బంజరు భూమి

ఉన్న ఒక పేదవాడు ఎలా ధనం సంపాదించాలి అని చాలా బాధపడుతుంటాడు. అతని ఇంటికిందే ఒక పెద్ద బంగారు నిధి ఉండి, అతనికి ఆ విషయం తెలియలేదనుకోండి, ఏమవుతుంది అప్పుడు? ఏముంది, అతను అంత నిధి ఉన్నా, అజ్ఞానం వల్ల దాని పైనే తిరుగుతున్న పేదవానిగానే జీవితాన్ని కొనసాగిస్తాడు. ఇదీ ఉదాహరణ.

**ఏవమేవేమాఃసర్వాః ప్రజాఃఅహరహర్గచ్ఛన్త్య ఏతం బ్రహ్మలోకం –** అదే విధంగా ఈ మనుష్యులకు వాళ్ళలోనే ఒక బంగారు నిధి ఉందని తెలియదు. ప్రతిరోజూ వాళ్ళు హృదయాకాశంకు వెళుతున్నారు. సుషుప్తిలో జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, అంతఃకరణాలు– అన్నీ హృదయాకాశంలో లయమవుతాయి. అందుకే మనం ప్రతిరోజూ ఆ నిధి దగ్గరకు వెళ్ళివస్తున్నా, మనకు తెలియటం లేదు.

**సతా సోమ్య తదా సంపన్నో భవతి స్వమపితో భవతి తస్మాదేవగ్ం**
**స్వపితీత్యాచక్షతే స్వగ్ం హ్యపీతోభవతి – ఛాందోగ్యం 6-8**

అందుకే ప్రతిరోజూ బ్రహ్మలోకం వెళతారు అంటున్నది. ఇక్కడ బ్రహ్మలోకం అంటే బ్రహ్మ చైతన్యం. బ్రహ్మచైతన్యం అంటే సగుణ ఈశ్వరుడు ఇంకా చెప్పాలంటే అష్టగుణ విశిష్ట సర్వాధార ఈశ్వరుడు. ఎక్కడున్నాడు ఈశ్వరుడు? హృదయాకాశంలో. అజ్ఞాన తిమిరాంధస్యంలో ఉండటం వల్ల మనకు తెలియటం లేదు.

ఏతం బ్రహ్మలోకం = హృదయాకాశం; హృదయాకాశం = సగుణ ఈశ్వరుడు; సగుణ ఈశ్వరుడు = ప్రాజ్ఞ; ఈ ప్రాజ్ఞ – ఈశ్వర ఐక్యాన్ని మనం ప్రతిరోజూ అనుభవిస్తున్నాం.

**న విన్దన్తి** – కాని తెలియటం లేదు. ఎవరికి?

**సర్వాప్రజాః –** మనుష్యులెవరికీ తెలియటం లేదు. ఎందుకు తెలియటం లేదు? **అనృతేన హి ప్రత్యూఢాః** ఇక్కడ అనృతం అంటే అజ్ఞానం. అంతకు ముందు అనృతం అంటే బాహ్యముఖంగా చూడటం వల్ల అన్నాము. సుషుప్తిలో బాహ్యముఖంగా చూడదు కాబట్టి, అజ్ఞానం అని తీసుకోవాలి.

**మంత్రం-3** ఈశ్వరుడు నిధిలాగా మన హృదయంలో ఉండటం వల్ల ఈశ్వరునికి ఒక నిర్వచనాన్ని ఇస్తున్నది ఉపనిషత్తు. అది హృద్యయం. హృద్యయం అంటే మామూలుగా గుండె. కాని ఇక్కడ దాన్ని ఈశ్వర నామాల్లో

ఒకటిగా వ్యవహరిస్తున్నది. ఎందుకంటే ఆయన హృది + అయమ = హృద్యయ్యమ్, హృదయంలో లభ్యమయ్యే పరమాత్మ. అందువల్ల హృద్యయం అనే పేరు నిర్వచనాన్ని బట్టి కూడా హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు అని తెలుస్తున్నది.

**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేஉర్జున తిష్ఠతి।**
**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥ గీత**

మనం పూజ చేసేటప్పుడు సాలిగ్రామం మీదో పసుపు ముద్ద మీదో దేవుని ఆవాహనం చేస్తూ, 'ఆవాహితో భవ, స్థాపితో భవ' అంటూ మంత్రాలు చదువుతాము. అక్కడ ప్రతిష్ఠించి పూజ చేసి, పూజంతా అయ్యాక, ఉద్యాపనలో మళ్ళీ వెనక్కి పంపిస్తాము. యథా ప్రతిష్ఠితాపయామి అంటాము. యథాస్థానం ఏది భగవానునికి? వైకుంఠమా, కైలాసమా?

ఏదీ కాదు, మన హృదయమే. అభిషేకం కోసం బయటకు తెస్తాము, మళ్ళీ లోపలకు పంపిస్తాము. లేకపోతే మన మీదే పంచామృతాలు పోసుకోవాలి. వీలుకోసం, అలా చేస్తాము.

**స వా ఏష ఆత్మా–** ఈ ఆత్మ; అంటే అంతకుముందు వివరించిన పరమాత్మ.
**హృది–** సర్వాధార అష్టగుణ విశిష్ట పరమాత్మ హృదయంలో ఉన్నాడు.
**తస్యైతదేవ నిరుక్తగ్ం –** తస్య అంటే ఆ పరమాత్మకు, ఈ క్రింది నిర్వచనం ఉంది. ఏమిటది?
**హృద్యయమితి–** దీన్ని హృది+ అయమ్+ఇతిగా విడదీసుకోవాలి. హృద్యయమ్ పదే పదే అంటే హృదయం అవుతుంది.

**యస్మాత్ హృది అయమ్ వర్తతే, తస్మాత్ హృద్యయం భవతి**

ఆ భగవానుని హృదయం అంటారు.

**అహరహర్వా ఏవం విత్స్వర్గం లోకమేతి–** ఈ దహరాకాశ ఉపాసకుడు లేదా హృదయాకాశ ఉపాసకుడు, పరమాత్మతో ప్రతిరోజూ లయమవుతున్నాడు. ఇక్కడ స్వర్గలోకం అంటే హృదయంలో ఉన్న పరమాత్మ. ఎందుకు ఆయన్ను స్వర్గం అన్నారు? స్వర్గం ఆనందహేతువు. ఆనందాన్నిచ్చేదాన్ని స్వర్గం అంటారు. హృదయాకాశంలో ఉండే పరమాత్మ ఆనందాన్నిస్తాడు. లోకం అని ఎందుకందంటే పరమాత్మ అనుభవం పొందుతున్నాడు కాబట్టి.

ఈ పరమాత్మతో ఈ ఉపాసకుడు ప్రతిరోజూ లయమవుతున్నాడు. ఎప్పుడు? సుషుప్తిలో. అజ్ఞాని కూడా (ఉపాసన చేయని వ్యక్తి కూడా) పరమాత్మలో లయం అవుతున్నాడు కదా అంటే, 'అతనికి పరమాత్మలో లయం అవుతున్నాను,' అని తెలియదు కాని ఉపాసకునికి తెలుసు. అందుకని ఉపాసకుడు సుషుప్తిని పవిత్రమైన అవస్థగా, అద్వైత అవస్థగా భావిస్తాడు.

**ఆత్మా త్వం గిరిజామతిః సహచరాః ప్రాణాః శరీరం గృహం।**
**పూజా తే విషయోపభోగరచనా నిద్రా సమాధి స్థితిః॥**

ఈ విషయం బృహదారణ్యకంలో స్వయంజ్యోతి బ్రాహ్మణంలో చాలా విపులంగా చర్చించబడింది.

**మంత్రం-4** ఇది చాలా ముఖ్యమైన మంత్రం. సుషుప్తిలో జీవాత్మ పరమాత్మలో లయమయి, జాగ్రదావస్థలో మళ్ళీ వెనక్కి వస్తుంది అనేసరికి, జీవాత్మ వేరు, పరమాత్మ వేరు, ఆ పరమాత్మలో జీవాత్మ లయమవుతున్నది అనుకుంటున్నాము. నిజానికి, మన స్వరూపమే పరమాత్మ. అయితే జీవాత్మ ఏమిటి? అది మనం వేసుకున్న తాత్కాలిక వేషం. అందుకే సుషుప్తిలో జీవాత్మ తన స్వస్వరూపంలో లయమవుతుంది అంటున్నది ఉపనిషత్తు. అందువల్ల పరమాత్మ ఆబ్జెక్టు కాదు, మన స్వస్వరూపం. ఈ జగత్తులో నాటకం ఆడటానికి, ఆ జగన్నాటక సూత్రధారి ఇచ్చిన వేషం; మన పాత్రను ఎలా నిర్ణయిస్తాడు? మన ప్రారబ్ధకర్మను బట్టి. కాని వచ్చిన చిక్కేమిటంటే ఈ వేషాన్నే మన స్వస్వరూపం అనుకుంటున్నాము మనము!

సుషుప్తిలో తన స్వస్వరూపంలో లయమయ్యే జీవాత్మ
**సమ్యక్ ప్రసీదతి స్వస్య స్వరూపే ఇతి సంప్రసాదః॥**

ప్రాజ్ఞ జీవుడిని సంప్రసాదః అంటారు. తర్వాత విశ్వ, తైజసకు కూడా అన్వయించబడుతుంది.

మన దేహ అభిమానం కొద్దీ జాగ్రత్-స్వప్నావస్థలో పరమాత్మకు దూరం అవుతాము. ఎప్పుడైతే దేహ అభిమానం పడిపోతుందో, అప్పుడే జీవాత్మ పరమాత్మలో ఐక్యం అవుతున్నది. ఈ ఐక్యం రెండు సందర్భాలలో అవుతుంది. ఒక ఐక్యం, జాగ్రదావస్థలో ఐక్యజ్ఞానం కలిగినప్పుడు అవుతుంది. ఐక్యజ్ఞానం అంటే నేను దేహేంద్రియ మనోబుద్ధులను కాను, నేను చైతన్యస్వరూపాన్ని అని అర్థం చేసుకోవటం.

ఈ ఐక్యజ్ఞానం పొందకుండానే, ప్రతిరోజూ జీవుడు పరమాత్మతో ఐక్యం అవుతున్నాడు అని ఉపనిషత్తు చెపుతున్నది. 'అవుతున్నాడు' అనే పదం సరిగా అర్థం చేసుకోవాలి. నిజానికి మనం, ఎల్లవేళలా పరమాత్మ స్వరూపమే. కాని అది సుషుప్తిలో జరిగినట్టుగా అనిపిస్తుంది. మన దేహేంద్రియ మనోబుద్ధులను మర్చిపోయి, సుషుప్తిలోకి జారుకున్నప్పుడు ఐక్యం జరుగుతున్నది. దీన్ని బట్టి పరమాత్మే జీవాత్మ స్వస్వరూపం అని అర్థమవుతున్నది. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**అథ య ఏష సమ్ప్రసాదః–** సంప్రసాదః అంటే స్థూల సూక్ష్మ శరీరాల నుంచి విడివడిన ప్రాజ్ఞ జీవుడు. అతను తాత్కాలికంగా జీవత్వం కోల్పోయి, ప్రశాంతంగా ఉంటాడు. ఏం చేస్తాడు ఈ ప్రాజ్ఞ జీవుడు?

**అస్మాచ్ఛ రీతాత్సముత్థాయ–** ప్రాజ్ఞజీవుడు ఈ రెండు శరీరాలను వదిలి, బయటకు వెళ్తాడు. బయటకు వెళ్తాడు అంటే అక్షరాలా వెళ్ళడు, వీటిలో తాదాత్మ్యం చెందడు. ఏమిటి దానికి నిదర్శనం? స్థూల శరీరంతో తాదాత్మ్యం చెందితే, జాగ్రద్ ప్రపంచ అనుభవం కలుగుతుంది, సూక్ష్మ శరీరంతో తాదాత్మ్యం చెందితే, సూక్ష్మ శరీరంలోని వాసనల ద్వారా స్వప్న ప్రపంచం వచ్చి ఉండేది.

**స్వేన రూపేణ–** ఈ జీవాత్మ తన స్వస్వరూపాన్ని పొందింది. సుషుప్తిలో కాల పరిమితి, దేశ పరిమితి లేదు. అహంకారం లయమయింది. చిదాభాస కూడా లయమయింది. ఏమిటి దానికి నిదర్శనం? మనస్సు పనిచేస్తుంటేనే చిదాభాస కూడా పనిచేస్తుంది. మనస్సు సుషుప్తిలో లయమయితే, చిదాభాస కూడా లయమవుతుంది. ఇది శాశ్వతం కాదు, కాని లయమయింది.

ఆ విధంగా స్థూల శరీర అభిమానం, సూక్ష్మ శరీర అభిమానం, చిదాభాస , జీవాత్మ ఏవీ తెలియవు. జాగ్రద్ స్వప్నావస్థలో నేను **చిదాభాస ప్రధాన జీవుడిని.** సుషుప్తిలో చిదాభాస లేదు' అనకూడదు, అది అవ్యక్తరూపంలో ఉంది. లయమయింది కాబట్టి ఉన్నా లేనట్టే. అందుకని నేను సుషుప్తిలో **సాక్షిప్రధాన జీవుడిని.**

**స్వేన రూపేణాభినిష్పద్యతే–** ఈ జీవుడు తన స్వస్వరూపమైన సాక్షి స్వరూపంలో నిలిచి ఉంటాడు.

ఇంతకు ముందు చూసినట్టుగా ఏది వేషమో దాన్ని నిజం అంటున్నాము. ఏది నిజమో దాన్ని వేషం అనుకుంటున్నాము. చిన్నమార్పే కాని పెద్ద సమస్యను తెచ్చిపెడుతున్నది. అందువల్ల స్వేనరూపేణ అంటే సాక్షి స్వరూపేణ, అభి నిష్పద్యతే. సాక్షిలో నేను నిర్వికల్ప రూపంలో ఉన్నాను. సుషుప్తిలో నేను అద్వైత నిర్వికల్పక సాక్షి స్వరూపాన్ని అనుభవిస్తాను. ద్వైతం లేదు అక్కడ.

అందుకే దయానంద సరస్వతి స్వామి పదే పదే చెప్తారు, 'మనకు అద్వైత అనుభవం లేకపోలేదు. ప్రతిరోజూ అద్వైత అనుభవాన్ని పొందుతున్నాము.'

అందువల్ల సమస్య ఏమిటంటే, అద్వైత అనుభవం లేకపోవటం కాదు, అద్వైత జ్ఞానం పొందకపోవటం. దురదృష్టవశాత్తూ, అద్వైత అనుభవం పొందినప్పుడు అద్వైత జ్ఞానం పొందలేము. ఎందుకు? అద్వైత అనుభవకాలంలో మనసు లయం చెందుతుంది. మనస్సు లేకుండా జ్ఞానం ఎలా పొందుతాము? అందువల్ల, అద్వైత అనుభవకాలంలో, అద్వైత జ్ఞానం పొందలేము. పోనీ ద్వైత అనుభవ కాలంలో అద్వైత జ్ఞానం పొందగలమా? పొందగలము. ఎందుకంటే మనం ద్వైత అనుభవంలో ఉన్నాము. అందుకని, ద్వైత అనుభవకాలంలోనే మనం గురువు ద్వారా శాస్త్ర అధ్యయనం చేసి, సుషుప్తిలో పొందే అద్వైత అనుభవమే నా స్వస్వరూపం అని అర్థం చేసుకోవాలి. ద్వైత అనుభవం ఉంటేనే గురువు, శాస్త్రం లభ్యమవుతారు.

అందువల్ల అందరికీ **స్వేనరూపేణ, అద్వైత రూపేణ, నిర్వికల్ప రూపేణ సాక్షి రూపేణ – అభినిష్పద్యతే–** నిలిచి ఉంటారు. పరంజ్యోతిరుప సంపద్య – ఆ సమయంలో జీవాత్మ పరంజ్యోతి అయిన పరమాత్మలో లయమవుతుంది. అందువల్ల సుషుప్తిలో రెండు అంశాలు–

1. నేను నా స్వస్వరూపమైన సాక్షికి వస్తాను.
2. నేను పరమాత్మతో లయమవుతాను.

దీన్నే వివరంగా బృహదారణ్యక ఉపనిషత్తులో, స్వయంజ్యోతి బ్రాహ్మణంలో విశ్లేషిస్తారు. సుషుప్తిని మోక్షంతో పోలుస్తారు. నిజంగా మోక్షం కాదు. ఎందుకంటే మనం లేవగానే, మన సమస్యలు మనను చుట్టుముట్టుతాయి.

**ఏష ఆత్మేతి హోవాచ–** ఏష అంటే ప్రాజ్ఞజీవుడు. అనాత్మ ఉపాధి నుంచి విడివడిన అసలు ఆత్మ, అసలు నేను.

**ఏతదమృతమభయమేతద్బ్రహ్మేతి–** అంతేకాదు, ఆ అసలు నేను అమృతం. సుషుప్తిలో దేశకాలాలు తెలియవు. కాలం తెలియకపోతే అమృతమే కదా. **ఏతదభయం –** అభయం అంటే భద్రత. ఈ జీవాత్మకు భయం లేదు. **ఏతద్బ్రహ్మ –** నిజానికి, సుషుప్తిలో ఉన్న ఈ జీవాత్మ లేదా సాక్షే, బ్రహ్మ!

పంచదశి, 8వ అధ్యాయంలో విద్యారణ్యుల వారు ఒక అందమైన ఉదాహరణనిస్తారు. పగటివేళ, ఒక గోడమీద సూర్యకాంతి పడుతున్నదనుకోండి. గోడంతా ఆ కాంతితో ప్రకాశవంతమవుతుంది. దాన్ని సామాన్య సూర్యప్రకాశం అంటారు. ఇప్పుడు, ఎవరైనా అద్దం తెచ్చి, ఆ గోడ మీద ఒకచోట సూర్యకాంతి ప్రతిబింబించేలా చేశారనుకోండి. ఆ చోట కాంతి మరింత ప్రకాశ వంతంగా ఉంటుంది. ఇప్పుడు ఆ ప్రతిబింబ సూర్యకాంతి ఉన్నచోట, సామాన్య సూర్య ప్రకాశం ఉందా, లేదా? ఖచ్చితంగా ఉంది, కాకపోతే ప్రతిబింబ సూర్యుడు, బింబ సూర్యుడిని అధిగమిస్తున్నాడు. బింబ సూర్యుడిని మీరు అనుభవించాలంటే ఏం చేయాలి? అద్దం తీసేయాలి. మెరిసే కాంతి పోయి, మామూలుగా ఉన్న కాంతి మిగులుతుంది.

ఇప్పుడు ఈ ఉదాహరణను మనకు అన్వయించుకోవాలి. సుషుప్తిలో సాక్షి చైతన్యం అంటే సామాన్య చైతన్యం ఉంది. జాగ్రద్ అవస్థలోనూ సామాన్య చైతన్యం ఉంది కాని, దానిపైన చిదాభాస మరింత ప్రకాశవంతంగా ఉంది. మనం చిదాభాసతో మమేకం చెంది సాక్షిని తెలుసుకోలేక పోతున్నాము. సాక్షిని తెలుసుకోవాలంటే ఏం చేయాలి? అద్దంలాంటి చిదాభాసను తొలగించాలి. అది తొలగిస్తున్నాము కాని ఎప్పుడు? సుషుప్తిలో. అప్పుడు మిగిలిన సాక్షే బ్రహ్మ. అందువల్ల మనకు సాక్షి అనుభవం ఉంది; బ్రహ్మ, ఆత్మ ఐక్య అనుభవమూ ఉంది. కాని అదే మన స్వస్వరూపం అని అర్థం చేసుకోలేము. అందుకే ఏతదమృతమభయమేతద్బ్రహ్మేతి అంది.

ఈ ఉపాసకుడు ఇక్కడ నేర్చుకోడు. ఆ బ్రహ్మ తన స్వస్వరూపం అని తెలుసుకోడు. అతను బ్రహ్మలోకానికి వెళ్ళి చతుర్ముఖ బ్రహ్మ ద్వారా బ్రహ్మజ్ఞానం పొందుతాడు. ఇప్పుడు దహరాకాశంలో ఉన్న బ్రహ్మను ఉపాసన చేస్తాడు. ఆ బ్రహ్మను స్తుతించబోతున్నది ఉపనిషత్తు.

**తస్య హ వా–** ఇక్కడ్నుంచి బ్రహ్మస్తుతి మొదలవబోతున్నది. బ్రహ్మ గొప్పదనం ఏమిటి?

**తస్య హ వా ఏతస్య బ్రహ్మణః –** ఈ భాగాల్లో ఉపనిషత్తు బ్రహ్మపదాన్ని ఇటు సగుణ బ్రహ్మకు, అటు నిర్గుణ బ్రహ్మకు కూడా వాడుతున్నది.

**అపహతపాప్మా, విజరః, విమృత్యుః** లాంటి గుణాలు నిర్గుణ బ్రహ్మకు కూడా వర్తిస్తాయి.

**సత్యకామ, సత్యసంకల్పలాంటి గుణాలు–** సగుణ బ్రహ్మకు కూడా వర్తిస్తాయి.

ఆ బ్రహ్మకు, ఆ పరమాత్మకు ఒక పేరు ఉంది. ఏమిటది?

**సత్యమితి నామ–** సత్యం అని పేరు ఉంది. ఉపనిషత్తులలో సత్యం పేరును రకరకాలుగా విశ్లేషిస్తారు.

**సత్+తృత్** అని విడదీస్తారు బృహదారణ్యకంలో. కాని ఇక్కడ వేరే విధంగా వస్తుంది. అదెలాగో తర్వాత వచ్చే మంత్రంలో చూద్దాము. పదాల గారడీలు చూస్తాము ఇక్కడ.

**మంత్రం–5** ఈ పదాల గారడీలను ప్రత్యేకించి ఛాందోగ్యంలోనూ, బృహదారణ్యకంలోనూ మాత్రమే చూస్తాము.

**తాని హ వా ఏతాని త్రీణ్యక్షరాణి–** సత్యం పదాన్ని తీసుకుంటే దానికి మూడు అక్షరాలు ఉన్నాయి. ఏమిటవి?

**సతీయమితి – స+తీ+యమ్.** మధ్యలో ఉన్న అక్షరం 'త'ను సగం పలకలేము కాబట్టి, దాన్ని ఉపనిషత్తే 'తీ' చేసింది. వాటి అర్థాలను ఉపనిషత్తే ఇచ్చింది.

**తద్యత్సత్తదమృతమ్ –** స అనే అక్షరం సత్‌ను, అంటే అమృతాన్ని సూచిస్తుంది. సత్ అంటే శుద్ధ సత్తా. అది శాశ్వతం. యత్ సత్, తద్ అమృతం– ఏదైతే సకారమో, అది అమృతమైన సత్ రూపం.

**అథయత్తి తన్మర్త్యమ్ –** తర్వాత ఏది తి, అంటే తకారం గలదో, అది వినాశి. మర్త్యంలో కూడా 'త' శబ్దం ఉంది.

**అథ యద్యం తేనోభే యచ్ఛతి –** యమ్ అనే అక్షరం, అమృతం, మర్త్యం అనే పైన చెప్పిన రెండు అక్షరాలను నియమిస్తుంది. అందువల్ల సత్యం అంతిమ అర్థం. ఆ పరమాత్మ శాశ్వతతత్త్వాన్ని, అశాశ్వతత్త్వాన్ని నియమించేవాడు. బ్రహ్మ తత్త్వం ద్వారా అమృతత్వం, మాయా తత్త్వం ద్వారా అశాశ్వతత్త్వంకు చిహ్నం పరమాత్మ. అందువల్ల పరమాత్మ అమృతం, మర్త్యం

రెండింటికీ నియామకుడు. అందుకే అజ్ఞాని జీవులకు పునరపి జననం, పునరపి మరణం ఇస్తే, అదే పరమాత్మ జ్ఞాని జీవికి మోక్షం ఇస్తున్నాడు.

ఆ విధంగా పరమాత్మకు రెండు జేబులు ఉన్నాయి. శ్రేయస్సు, ప్రేయస్సు. ఎవరేది కోరితే అది ఇస్తాడు. అందుకని పరమాత్మను సత్యం అంటారు. **యదనేనోభౌ యచ్ఛతి –** పరమాత్మ రెండింటినీ ఇస్తాడు కాబట్టి 'యమ్' పదం పరమాత్మను సూచిస్తుంది.

**యః ఏవం విత్–** ఎవరైతే సత్త్వగుణ విశిష్ట పరమాత్మ ఉపాసన చేస్తారో, ఆ ఉపాసకుడు, **స్వర్గం లోకమేతి–** స్వర్గలోకానికి వెళ్తాడు అంటే పరమాత్మతో ఐక్యం అవుతాడు. జీవించి ఉండగా, ప్రతిరోజూ సుషుప్తిలో పరమాత్మ ఐక్యం చవిచూస్తాడు. మరణించాక క్రమముక్తి పొంది పరమాత్మలో ఐక్యం అవుతాడు. అందువల్ల **తస్మాద్యమ అహరహర్వా ఏవం విత్స్వర్గం లోకమేతి.**

సుషుప్తిలో ప్రతిజీవి పరమాత్మలో ఐక్యం అవుతాడు కదా? కేవలం ఉపాసకుడే అవుతాడని ఎందుకు చెప్తున్నారు? ఎందుకంటే తక్కిన వాళ్ళకు ఈ విషయం తెలియదు. ఉపాసకునికి మాత్రం నిద్ర సమాధి స్థితి అని తెలుస్తుంది.

### చతుర్థః ఖణ్డః (4)

**అథ య ఆత్మా స సేతుర్విధృతిరేషాం లోకానామసమ్భేదాయ॥ నైతగ్ం సేతుమహోరాత్రే తరతో న జరా న మృత్యుర్న శోకో న సుకృతం న దుష్కృతగ్ం సర్వే పాప్మానోఽతో నివర్తన్తేఽపహతపాప్మా హ్యేష బ్రహ్మలోకః ॥1॥ తస్మాద్వా ఏతగ్ం సేతుం తీర్త్వాఽన్ధః సన్ననన్ధో భవతి విద్ధః సన్నవిద్ధో భవత్యుపతాపీ సన్ననుపతాపీ భవతి। తస్మాద్వా ఏతగ్ం సేతుం తీర్త్వాఽపి నక్తమహరేవాభినిష్పద్యతే సకృద్విభాతో హ్యేవైష బ్రహ్మలోకః ॥2॥ తద్య ఏవైతం బ్రహ్మలోకం బ్రహ్మచర్యేణానువిన్దన్తి తేషామేవైష బ్రహ్మలోకస్తేషాగ్ం సర్వేషు లోకేషు కామచారో భవతి ॥3॥**

**మంత్రం– 1** శాస్త్రంలో ఒక ఆచారం ఉంది.ఏదైనా ఒక ఉపాసనను సూచించినప్పుడు, ఆ ఉపాసనను లేదా ఉపాస్య దేవతను స్తుతించాలి ముందు. శీక్షావల్లిలో ఓంకార ఉపాసన గురించి ఒక వాక్యంలో వస్తుంది. 'ఓమితి బ్రహ్మ' కాని ఓంకారాన్ని స్తుతిస్తూ చాలా వివరణ ఉంటుంది.

**ఓమితిబ్రహ్మ । ఓమితి సర్వం । ... బ్రహ్మావాప్నోతి ।**

ఇక్కడ కూడా అసలు ఉపాసన ఒక వాక్యమే –

**దహరాకాశే పరమాత్మానామ్ ఉపాసీత** కాని పరమాత్మను అనేక విధాలుగా స్తుతిస్తున్నది. ముందు అష్టగుణ విశిష్ట పరమాత్మను వర్ణించింది; తర్వాత హృద్యయం, తర్వాత సత్యం పదాలను వాడింది. ఇప్పుడు సేతువు వాడుతున్నది. **అథయ ఆత్మా స సేతుర్విధృతి –** సేతువు– సేతువు అంటే పొలాలకు రక్షణ కోసం కట్టే దడిలాంటిది. నీరు దాటి వెళ్ళకుండా గండి కడతారు. సేతువుకు ఇంకో అర్థం కూడా  ఉంది. వంతెన అని కూడా అంటారు. ఇక్కడ అర్థం వంతెన కాదు, కాపాడేది అని.

విశ్వాన్ని నియంత్రించే వాడు లేదా రక్షించేవాడు; సూర్యచంద్రులు తమ నియమానుసారం పనిచేసేలా చూసేవాడు.

బృహదారణ్యకంలో వస్తుంది, 'నదులు చక్కగా ప్రవహిస్తున్నాయంటే, ఋతువులు క్రమం తప్పకుండా వస్తున్నాయంటే, దానికి కారణం ప్రకృతి నియమాలు.' అవే కాదు,నైతిక విలువలు, ఆరోగ్య విలువలను కాపాడటానికి కూడా నియమాలు ఉన్నాయి. ఆ ధర్మాన్ని కూడా పరమాత్మే నిలబెడతాడు.

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే॥   గీత 4–8**

ఈ నియమాలను కాపాడే ఈశ్వరుడు సేతువు. ఏం చేస్తాడు సేతువు?

**విధృతిః –** ధృతిః అంటే ఏదీ నియమం తప్పకుండా రక్షించటం. విధృతిః అంటే రక్షించేవాడు. ఎందుకు రక్షించాలి పరమాత్మ?

**ఏషాం లోకానామమ్భేదాయ–** సమ్భేదః అంటే నశించటం. అసమ్భేదః అంటే నశించక పోవటం– అంటే ఒక నియమం ఉండటం. ప్రకృతిలో అన్నీ ఒక నియమం ప్రకారం నడుస్తున్నాయి. ఆ నియమం కాపాడేవాడు సేతువు లేదా విధృతిః

ఈ పరమాత్మ గొప్పదనం ఏమిటి?

కాలాతీతః – కాలానికి అతీతుడు. ఎలా?

**నైతగ్ం సేతుమహోరాత్రే తరతః –** ఈ సేతువును రాత్రి పగళ్ళు చేరవు. **న జరా న మృత్యుర్న శోకో –** పరమాత్మను కాలతత్త్వం బాధించలేదు

కాబట్టి, వృద్ధాప్యం, మృత్యువు శోకం అంటవు.
**న సుకృతం, న దుష్కృతగ్ం –** పుణ్యపాపాలు కూడా అంటవు.

**అన్యత్ర ధర్మాదన్యత్రాధర్మాత్ – కఠ 1-2-14**

**సర్వేపాప్మానోఽ తో నివర్తంతే –** అందువల్ల ఏ పాపాలూ అంటవు.

అంటే సంచిత కర్మలు, ప్రారబ్ధకర్మలు, ఆగామి కర్మలు అంటవు. అతః అంటే ఈ పరమాత్మ నుంచి, నివర్తంతే – దూరంగా ఉంటాయి.

పరమాత్మ ఎవరిని అటకాయించమని ఆజ్ఞలు జారీ చేస్తాడో తెలుసుకోవటానికి పరమాత్మ దగ్గరకు వెళ్తాయే కాని, పరమాత్మను అటకాయించలేవు. అందుకని పరమాత్మకు ఒక బిరుదు ఉంది – అపహతపాప్మ.

**అపహతపాప్మా హ్యేష బ్రహ్మలోకః –** ఇక్కడ లోకం అంటే చైతన్యం. ఏషః బ్రహ్మ లోకః అంటే ఈ బ్రహ్మ చైతన్యం పాపాలకు అతీతం. అందువల్ల ఈ బ్రహ్మ ఉపాసన చేస్తే క్రమముక్తి పొంది, బ్రహ్మలో ఐక్యం అవుతారు.

**మంత్రం-2** పరమాత్మ అహోరాత్రి, జరామృత్యు, సుకృతం, దుష్కృతాలకు అతీతం కాబట్టి, ఎవరైతే పరమాత్మలో ఐక్యం అవుతారో అతను కూడా వీటన్నింటికీ అతీతంగా ఉంటాడు

**తస్మాద్వా ఏతగ్ం సేతుం తీర్త్వా–** అందువల్ల పరమాత్మ ఐక్యం పొందాక; పరమాత్మ ఐక్యం ఎలా పొందుతారు? 'అహం పరమాత్మ అస్మి' అనే జ్ఞానం పొందటం ద్వారా పొందవచ్చు. అలా జ్ఞానం ద్వారా పొందితే ఇక్కడే, ఇప్పుడే జీవన్ముక్తి పొందుతాడు.

ఇంకోమార్గం ఏమిటి? అదే ఇక్కడ వస్తున్నది. ఉపాసన చేసి, బ్రహ్మలోకం వెళ్ళి, క్రమముక్తి పొంది, ఐక్యం పొందవచ్చు. కేవలం ఉపాసన వల్ల ఐక్యం పొందలేదు. ఈ రెండింటిలో ఏ విధంగా ఐక్యం పొందినా జ్ఞాని ఏం చేస్తాడో చెపుతున్నది ఇక్కడ.

**అన్ధః సంపన్నసన్ధో భవతి–** అతని ఇంద్రియాలు పనిచేయక పోయినా, తను గుడ్డివాడిననుకోడు. తను ఆత్మ, అనాత్మను ప్రకాశింపజేసే సాక్షి. అందువల్ల గుడ్డితనం అంటదు.

**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్, గచ్ఛన్, స్వపన్ శ్వసన్**
**నైవ కించిత్ కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ –గీత 5-8**

ఇవన్నీ చేస్తూ కూడా ఏమీ చేయటం లేదంటాడు.

**విద్ధఃసన్నవిద్ధో భవతి–** అలాగే దెబ్బతగిలినా, దెబ్బ తగలలేదు అంటాడు.

**ఉపతాపీ సన్ననుపతాపీ భవతి–** ఉపతాపః అంటే భావోద్రేకాలు. భావోద్రేకాలు ఆత్మకు చెందుతాయా, అనాత్మకు చెందుతాయా? ప్రాథమిక ప్రశ్న. భావోద్రేకాలు మనస్సుకు సంబంధించినవి. మనస్సు అనాత్మ, మనస్సు మిథ్య. నాకూ మనస్సుకూ ఏమీ సంబంధం లేదు. అందువల్ల మనస్సుకు ఏదైనా బాధ కలిగినా, నాకేం కలగదు

**తస్మాద్వా ఏతగ్ం సేతుం తీర్త్వా –** అందువల్ల పరమాత్మ ఐక్యం పొందాక;

**అపి నక్త మహారేవాభి నిష్పద్యతే–** సాపేక్షిక వెలుగు నీడలను అధిగమిస్తాడు. సాపేక్షిక వెలుగు, నీడలు భిన్నమైనవి. వెలుగు, ఉన్నచోట చీకటి పారిపోతుంది. చీకటిగా ఉంది అంటే అక్కడ వెలుగు లేనట్టు అర్థం! అందువల్ల చీకటిని కూడా ప్రకాశింపజేసే కాంతి ఏమిటి? అదే చైతన్యం. అది జ్యోతిషాం జ్యోతి. నక్తం అపి – ఆత్మ విషయంలో చీకటి కూడా చీకటి కాదు.

అహరేవాఽభినిష్పద్యతే– అది కూడా పగలు అవుతుంది. సూర్యభగవానునికి రాత్రి పగలు లేనట్టే ఆత్మ కూడా కాలాతీతం.

**సకృద్విభాతో హ్యేవైష బ్రహ్మలోకః –** సకృద్విభాతః అంటే నిత్య ప్రకాశ రూపం. ఇక్కడ బ్రహ్మలోకం అంటే నిజంగా బ్రహ్మలోకం కాదు. ఇక్కడ చైతన్యం. అందువల్ల బ్రహ్మచైతన్యం నిత్యప్రకాశకం.

**మంత్రం– 3** ఈ పరమాత్మ లేదా బ్రహ్మను రెండు పద్ధతుల్లో పొందవచ్చు.

1. జీవించి ఉన్నన్నాళ్ళు సగుణ బ్రహ్మ ఉపాసన చేసి బ్రహ్మలోకం వెళ్ళి, అక్కడ బ్రహ్మ ద్వారా నిర్గుణ బ్రహ్మజ్ఞానం పొంది తర్వాత ముక్తి పొందటం. దాన్ని ఉపాసన పద్ధతి లేదా **క్రమముక్తి పద్ధతి** అంటారు.

2. కొన్నాళ్ళు సగుణ బ్రహ్మ ఉపాసన చేసి, ఈ జన్మలోనే నిర్గుణ బ్రహ్మ జ్ఞానానికి మారి, వేదాంత శ్రవణ, మనన నిధి ధ్యాసనల ద్వారా నిర్గుణ బ్రహ్మ జ్ఞానం పొందటం. ఈ జ్ఞానం వల్ల జీవాత్మ, పరమాత్మ ఐక్యం ఇప్పుడే, ఇక్కడే పొందవచ్చు. దీన్ని జ్ఞానమార్గం లేదా **సద్యోముక్తి పద్ధతి** అంటారు. మార్గం ఏదైనా, రెండింటికీ అంటే క్రమ ముక్తికీ, సద్యోముక్తికీ అధికారత్వం పొందాలి. రెండింటికీ సాధన చతుష్టయ సంపన్నుడై ఉండాలి. రెండింటికీ సాధన ఒకటే అయితే, భేదం ఎక్కడ ఉంది?

శ్రవణ, మనన, నిధి ధ్యాసనల్లో ఉంది. క్రమముక్తిలో శ్రవణ, మనన, నిధి ధ్యాసనలు ఇక్కడ ఈ జన్మలో చేయకుండా బ్రహ్మలోకానికి వెళ్ళిచేస్తారు. సద్యోముక్తికి మాత్రం ఇక్కడే,ఇప్పుడే చేయాలి. రెండింటికీ సాధన చతుష్టయ సంపత్తితో పాటు కొన్ని విలువలను కూడా ఇక్కడ పాటించాలి. అవి గీతలో చెప్పబడిన అమానిత్వం, అహింస లాంటి విలువలు. కాని ఇక్కడ, ఉపనిషత్తు ఒక్క విలువను కీర్తిస్తున్నది. అది **బ్రహ్మచర్యం.**

తర్వాత వచ్చే ఖండంలో బ్రహ్మచర్య సాధనను స్తుతిస్తున్నది. గీతలో కూడా ఈ సాధన గురించి చూస్తాము.

**యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి**
**తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే॥ గీత 8-11**

**తద్య ఏవైతం బ్రహ్మలోకం అను విన్దన్తి –** ఈ ఉపాసకులు మాత్రమే బ్రహ్మలోకాన్ని పొందుతారు. ఇక్కడ కూడా బ్రహ్మలోకం అంటే బ్రహ్మచైతన్యం లేదా పరమాత్మ ఐక్యం. ఎలా పొందుతాడు? ముందే చూసినట్టుగా ఉపాసకుడు, క్రమముక్తి ద్వారా పొందుతాడు. దానికి సాధన ఏమిటి? ఉపాసన ముఖ్య సాధన. అదికాక, దానికి సమానంగా ముఖ్యసాధన.

**బ్రహ్మచర్యేణ–** బ్రహ్మచర్యం పాటించాలి.

**తేషామేవైష బ్రహ్మలోకః –** ఎవరైతే ఉపాసన+ బ్రహ్మచర్యం పాటిస్తారో, వాళ్ళకు మాత్రమే పరమాత్మ ప్రాప్తి.

**తేషాగ్ం సర్వేషు లోకేషు కామచారో భవతి –** ఈ ఉపాసకులు అన్ని లోకాలకు యథేచ్ఛగా వెళ్ళగలరు. అక్కడ వాళ్ళు సిద్ధులను పొందుతారు. అందువల్ల క్రమముక్తి పొందాల్సిన ఉపాసకుడు పాటించాల్సిన బ్రహ్మచర్యం గురించి ఇక్కడ ప్రస్తావించింది ఉపనిషత్తు. తర్వాత వచ్చే ఖండంలో బ్రహ్మచర్య ప్రశంస వస్తుంది.

## పంచమః ఖణ్డః (5)

**అథ యద్యజ్ఞ ఇత్యాచక్షతే బ్రహ్మచర్యమేవ తద్॥ బ్రహ్మచర్యేణ హ్యేవ యో జ్ఞాతా తం విన్దతే। అథ యదిష్టమిత్యాచక్షతే బ్రహ్మచర్యమేవ తద్బ్రహ్మచర్యేణ హ్యేవేష్ట్వాऽऽత్మానమనువిన్దతే ॥1॥ అథ యత్సత్త్రాయణమిత్యాచక్షతే బ్రహ్మచర్యమేవ తద్బ్రహ్మచర్యేణ హ్యేవ సత ఆత్మనస్త్రాణం విందతేథ యన్మౌనమిత్యాచక్షతే బ్రహ్మచర్యమేవ తద్బ్రహ్మచర్యేణ హ్యేవాత్మానమనువిద్య**

**మనుతే ॥2॥ అథ యదనాశకాయనమిత్యాచక్షతే బ్రహ్మచర్యమేవ తదేష హ్యాత్మా న నశ్యతి యం బ్రహ్మచర్యేణానువిన్దతే ౭ థ యదరణ్యాయనమిత్యాచక్షతే బ్రహ్మచర్యమేవ తత్తదరశ్చ హ వై ణ్యశ్చార్ణవౌ బ్రహ్మలోకే తృతీయస్యామితో దివి తదైరమ్మదీయగ్ం సరస్తదశ్వత్థః సోమసవనస్తదపరాజితా పూర్బ్రహ్మణః ప్రభువిమితగ్ం హిరణ్మయమ్ ॥3॥ తద్య ఏవైతావరం చ ణ్యం చార్ణవౌ బ్రహ్మలోకే బ్రహ్మచర్యేణానువిన్దన్తి తేషామేవైష బ్రహ్మలోకస్తేషాగ్ం సర్వేషు లోకేషు కామచారో భవతి ॥4॥**

**మంత్రం-1** బ్రహ్మచర్యాన్ని కీర్తించటానికి,ఇక్కడ ఒక పద్ధతిని ఉపయోగించింది ఉపనిషత్తు. తక్కిన అన్ని సాధనలనూ బ్రహ్మచర్యంలో కలిపివేసింది. ఆ విధంగా, బ్రహ్మచర్యం = యజ్ఞం; బ్రహ్మచర్యం = ఉపవాసం; బ్రహ్మచర్యం = మౌనం; ఒక్కముక్కలో చెప్పాలంటే, బ్రహ్మచర్యం పాటిస్తే చాలు, తక్కిన సాధనలన్నీ ఇందులోకి వచ్చేస్తాయి. కాని ఈ పద్ధతిని తక్కిన సాధనలను కీర్తించేటప్పుడు కూడా చూస్తాము. ఉదాహరణకు మహానారాయణో పనిషత్తులో తపస్సుకి స్తుతి చూస్తాము.

**ఋతం తపః సత్యం తపః శృతం తపః శాంతం తపోదమస్తపః**
**శమస్తపో దానం తపో యజ్ఞం తపో భూర్భువః సువర్బ్రహ్మ ఏతద్**
**ఉపాస్వై తప తపః**

అలాగే స్వాధ్యాయం, ప్రవచనం స్తుతింపబడుతాయి తైత్తరీయంలో

**ఋతం చ స్వాధ్యాయ ప్రవచనే చ**
**సత్యం చ స్వాధ్యాయ ప్రవచనే చ**
**తపశ్చ స్వాధ్యాయ ప్రవచనే చ**
**దమశ్చ స్వాధ్యాయ ప్రవచనే చ**

ముండకోపనిషత్తులో సత్యం కీర్తించబడుతుంది.

**సత్యమేవ జయతే నానృతమ్ సత్యేన పంథా వితతో దేవయాన**

అందువల్ల జాగ్రత్తగా ఉండాలి మనం. ఒకటి సాధన చేసి తక్కినవి వదిలేయకూడదు. ఉపనిషత్తు ఉద్దేశం అది కాదు. ఒక్కో సందర్భంలో ఒక్కో దాన్ని ప్రశంసిస్తుంది. అన్నీ ముఖ్యమే. ఇక్కడ బ్రహ్మచర్యం ముఖ్యం. దాన్ని ఎక్కువగా చూపటానికి, అతిశయోక్తి వాడుతుంది. అందుకని బ్రహ్మచర్యం

పాటిస్తే కొన్ని సాధ్యాలను పాటించినట్టే అంటున్నది. అంతేకాదు, అది చెప్పటానికి కొన్ని పదాల గారడీలను కూడా చేస్తున్నది. అవి కూడా ముందు, ముందు చూస్తాము. ఏయే సాధనలను చెప్పిందో చూద్దాము.

**1. అథ యద్యజ్ఞ ఇత్యాచక్షతే బ్రహ్మచర్యమేవ తద్–** దేనినైతే యజ్ఞం అని చెపుతున్నారో అది బ్రహ్మచర్యమే.

**బ్రహ్మచర్యేణ హ్యేవ యో జ్ఞాతా తం విన్దతే–** అందువల్ల, ఈ సగుణ ఉపాసకుడు, బ్రహ్మచర్య ఉపాసన చేయటం వల్ల ఆ పరమాత్మను పొందుతాడు. కాకపోతే, క్రమముక్తి ద్వారా (ఈ విషయం మర్చిపోకూడదు)

**యో జ్ఞాతా–** ఇక్కడ పదాల గారడీ యోజ్ఞాతా పదానికి చూస్తాము.

యో జ్ఞాతా పదాన్ని గబగబా కొన్నిసార్లు చదివితే – యోజ్ఞాతా, యోజ్ఞాతా, యోజ్ఞాతా, యోజ్ఞాతా – యజ్ఞః శబ్దం వస్తుంది.

**2. అథ యదిష్టమిత్యాచక్షతే బ్రహ్మచర్యమేవ–** ఇష్టం కూడా ఒక రకమైన యజ్ఞమే. అది కూడా బ్రహ్మచర్యమే.

**ఇష్టాపూర్తం మన్యమానా వరిష్ఠం నాన్యచ్ఛ్రేయో వేదయన్తే ప్రమూఢాః।**
**ముండక 1–2–10**

సాధకుడు బ్రహ్మచర్య దీక్షలో ఉంటే, ఈ యజ్ఞాలను చేయక పోయినా, వాటివల్ల వచ్చే ఫలాలను పొందుతాడు. బ్రహ్మచర్యంలో లాగే – వానప్రస్థ ఆశ్రమంలో, సన్యాసి ఆశ్రమంలో యజ్ఞాలు చేయరు. అక్కడ కూడా బ్రహ్మచర్య దీక్ష ముఖ్యం.

బ్రహ్మచర్యంలో, వానప్రస్థంలో, సన్యాసాశ్రమంలో యజ్ఞాలు చేయలేరు, దానాలు చేయలేరు. అందుకని వాళ్ళకు ఒకటే మార్గం– బ్రహ్మచర్యం.

**తద్బ్రహ్మచర్యేణ హ్యేవేష్ట్వాఽఽత్మానమనువిన్దతే –** అందుకే బ్రహ్మచర్యంతోనే పరమాత్మ ఐక్యాన్ని పొందుతారు (క్రమముక్తి రూపంలో)

**మంత్రం–2** ఇక్కడ ఇంకోపెద్ద యజ్ఞం తీసుకోబడింది. దాని పేరు **సత్రాయణం** – సత్రం+ఆయనం = సత్రాయణం. సత్రం అంటే ఒక పెద్ద యజ్ఞం. దీనికి ఒక యజమానే ఉండడు. అనేకమంది కలిసి చేస్తారు. బహుయజమాన కర్మను సత్రం అంటారు. అతిరుద్ర మహారుద్రం లాంటిది. అయనం అంటే ఒక సంవత్సరమో అంతకన్నా ఎక్కువ కాలమో చేసే యజ్ఞం. ఇప్పుడ రెండూ

కలిపి సత్రాయణం అంటే ఎందరో యజమానులు కలిసి ఎంతోకాలం పాటు చేసే యజ్ఞం. ఇప్పుడు ఇలాంటి యజ్ఞాలే లేవు.

**3. అథ యత్సత్రాయణమిత్యాచక్షతే బ్రహ్మచర్యమేవ** – దేన్ని సత్రాయణం అంటారో, అది బ్రహ్మచర్యమే, సత్రాయణ కర్మ చేస్తే, వచ్చే ఫలం బ్రహ్మచర్యం పాటిస్తేనే వస్తుంది. కాకపోతే ఈ పదంతో కూడా గారడీ చేస్తున్నది ఉపనిషత్తు. దీన్ని వేరేగా విడదీస్తున్నది.

**సత్రాయణం – సత్+ త్రాయణం.** సత్ అంటే సత్‌బ్రహ్మ

**సదేవ సోమ్యేదమగ్రమాసీదేకమేవాద్వితీయమ్ – ఛాందోగ్యం**

త్రాయణం – రక్షణ.

సత్+త్రాయణం విందతే అంటే పరమాత్మ నుంచి రక్షణ పొందుతాడు.

**తద్బ్రహ్మచర్యేణ హ్యేవ సత ఆత్మనస్త్రాణం విన్దతే** – బ్రహ్మచర్యం పెద్దయజ్ఞంతో సమానం.

**4. అథయన్మౌనమిత్యాచక్షతే బ్రహ్మచర్యమేవ** – మౌనం పాటించటం చాలా కష్టం. అందుకని మౌనాన్ని ఒక ముఖ్యసాధనగా పరిగణిస్తారు.

దేనినైతే మౌనంగా చెప్తున్నారో అది కూడా బ్రహ్మచర్యమే.

ఇక్కడ కూడా మౌనం పదంతో ఆటాడుతున్నది ఉపనిషత్తు.

**తద్బ్రహ్మచర్యేణ హ్యేవాత్మానమనువిద్య మనుతే** – మౌనం అంటే నిజానికి నిశ్శబ్దంగా ఉండటం. మౌనం ఇంకో అర్థం ఉపాసన. ఉపాసనలో కూడా మౌనం పాటించాలి కదా! అందువల్ల రెండూ ఒకటే.

మౌనం = ఉపాసన

అందువల్ల బ్రహ్మచర్య వ్రతం పాటించటం వల్ల, ఈ సాధకుడు సగుణ బ్రహ్మ ఉపాసన చేస్తాడు.

బ్రహ్మచర్యం = మౌన సాధన.

**మంత్రం-3** ఇంకో పదం **అనాశకాయనం,** అనాశకాయనం అంటే అసలు అర్థం ఉపవాస వ్రతం. అనాశకాయనం అంటే అనేక రకాల ఉపవాసాలు చేయటం. వాటిలో రకాలు క్రచ్ఛమ్, చాంద్రాయణం. క్రచ్ఛమ్‌లోనే అనేక రకాల ఉపవాసాలున్నాయి.

ఉదాహరణకు ఒకరకమైన చాంద్రాయణం వ్రతం ఎలా చేయాలో

చూద్దాము. చంద్రుడు పెరుగుతూ తరుగుతూ వస్తున్నట్టుగా, మన ఆహారం కూడా పెరుగుతూ తరుగుతూ రావాలి. ఉదాహరణకు మీరు 15 దోశెలు తినగలరనుకుందాము. (ఇది కేవలం లెఖ్ఖపెట్టటానికి వీలు కోసం చెప్పబడింది) అమావాస్య రోజు ఏమీ తినకూడదు. మర్నాటినుంచి మొదలుపెట్టి రోజుకొకటి చెప్పున పెంచుకుంటూ రావాలి. అంటే మొదటిరోజు ఒకటి, రెండో రోజు రెండు, మూడోరోజు మూడు... అలా పదిహేనో రోజు (పౌర్ణమి రోజు) పదిహేను తింటారు. మళ్ళీ పౌర్ణమి నాటి నుంచి అమావాస్య వరకూ తగ్గించుకుంటూ రావాలి. 14,13,12.... అమావాస్య రోజు ఏమీ తినకూడదు. దీన్ని చాంద్రాయణ ఉపవాస వ్రతం అంటారు.

క్రచ్ఛమ్ అంటే అసలు అర్థం కోరి శరీరానికి కొంత అసౌకర్యం కలిగించటం. దాని ఉద్దేశం కొంత ఇంద్రియ నిగ్రహం అలవరచుకోవటం. **శరీరపీడనం తపః** – అలాగని శరీరాన్ని మరీ హింసించకూడదు. చెప్పులు లేకుండా నడవటం, ఫ్యాను లేకుండా పడుకోవటం లాంటివి కూడా ఈ రకమైన తపస్సు కిందకి వస్తాయి. అనారోగ్యంతో బాధపడేవారు ఈ రకమైన ఉపవాసం చేయలేరు. అందుకని శాస్త్రం దాని బదులుగా బ్రాహ్మణునికి దక్షిణ ఇమ్మని చెపుతుంది. (డబ్బు ఇవ్వటం కూడా బాధే కొంతమందికి).

**కృచ్ఛార్థం తుభ్యం అహం సంప్రదత్తే**

కృచ్ఛం చేయలేక నేను ధనం ఇస్తున్నాను అని అర్థం.

**అనాశకాయనం= న + ఆశక+ అయనం=** న+ ఆశక అంటే తినకపోవటం, ఉపవాసం ఉండటం. అయనం అంటే నిగ్రహం ఉండటం. ఉపవాసవ్రతం చేయటం. ఇది అసలు అర్థం.

**5. అథ యదనాశకాయనమిత్యాచక్షతే బ్రహ్మచర్యమేవ తత్–** దేనినైతే అనాశకాయనం అంటారో, అది బ్రహ్మచర్యమే. కాకపోతే ఇక్కడ కూడా ఉపనిషత్తు ఈ పదంతో గారడీ చేస్తున్నది.

అ+నాశకా+అయనం– అంతకుముందు ఆశకం అంటే తినటం అని చూశాము. ఇప్పుడు దీన్ని నాశకంగా విడదీస్తున్నాము. నాశకం అంటే వినాశం. అనాశకం అంటే వినాశ్యం లేనిది. అయనం అంటే పొందటం లేదా చేరటం.

అందువల్ల అనాశకాయనం అంటే బ్రహ్మచర్యం సాధకుడిని వినాశనం లేనిదానికి తీసుకువెళుతుంది.

**ఏష హ్యాత్మా న నశ్యతి – న నశ్యతి అంటే అ+నాశకః –** రెండో అర్థం తీసుకోవాలి.

**యం బ్రహ్మచర్యేణానువిన్దతే–** వినాశనం లేని ఆ ఆత్మను బ్రహ్మచర్యం ద్వారా పొందుతాడు.

**6. అథ యదరణ్యాయనమిత్యాచక్షతే బ్రహ్మచర్యమేవ తత్ –** అరణ్యాయనం అంటే అరణ్యవాసం లేదా వానప్రస్థాశ్రమం. మన శాస్త్రం ప్రకారం మూడుసాధనలు, నాలుగు ఆశ్రమ ధర్మాలు ఉన్నాయి.

సాధనలు – కర్మయోగం, ఉపాసనాయోగం, జ్ఞానయోగం.

వర్ణాశ్రమ ధర్మాలు– బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం, వానప్రస్థం, సన్యాసం

బ్రహ్మచర్యంలో జ్ఞానసముపార్జన చేస్తారు. తక్కిన మూడు ఆశ్రమాల్లో తను నేర్చుకున్నదాన్ని పాటిస్తారు.

**గృహస్థాశ్రమం** – కర్మయోగం పాటించటానికి అనువుగా ఉంటుంది.

**వానప్రస్థం** – ఉపాసనకు అనువుగా ఉంటుంది.

**సన్యాసం** – జ్ఞానయోగానికి అనువుగా ఉంటుంది.

ఇక్కడ మన అంశం– సగుణ ఈశ్వర ఉపాసన– దానికి అనువైన ఆశ్రమం.

వానప్రస్థం అంటే అరణ్యం + అయనం. అరణ్యంలో ఉండటం– ఇది ఒక అర్థం. అందుకని వానప్రస్థంలో చేసే ఉపాసనా ఫలం బ్రహ్మచర్యం పాటిస్తే వస్తుంది. దీనికి కూడా గారడీ చేస్తున్నది ఉపనిషత్తు.

అరణ్యం– అర+ణ్య = బ్రహ్మలోకం. అరణ్యయనం అంటే బ్రహ్మలోక ప్రాప్తి. అరణ్యం బ్రహ్మలోకప్రాప్తి ఎలా అవుతుంది?

**అరశ్చ హ వై ణ్యశ్చార్ణవౌ బ్రహ్మలోకే–** ఆర్ణవః అంటే సముద్రాలు. బ్రహ్మలోకంలో రెండు సముద్రాలు ఉన్నాయి. అరము, ణ్యం అనే పేర్లు గల సముద్రాలు ఉన్నాయి. అందువల్ల అరణ్యాయనం అంటే అరం, ణ్యం అనే సముద్రాలు ఉన్న బ్రహ్మలోకాన్ని పొందుతాడు అని అర్థం.

రెండు అర్థాలు కలిపితే వానప్రస్థంలో ఉపాసన చేస్తే వచ్చే ఫలాన్ని బ్రహ్మచర్యం పాటిస్తే పొందుతాడు.

బ్రహ్మలోకం వర్ణన రావటంతో బ్రహ్మలోక వర్ణన మరికొంత వస్తుంది. బ్రహ్మలోకం, కైలాసం, వైకుంఠం అన్ని పదాలూ ఒక్కటే. అక్కడికెళ్ళిన ఉపాసకులు క్రమముక్తి పొందుతారు. బ్రహ్మలోకం ఎక్కడ ఉంది?

**తృతీయస్యామితో దివిః –** ఈ భూలోకం నుంచి మూడోది అయిన స్వర్గంలో ఉంది. భూలోక, భువర్లోక, సువర్లోకాలు తీసుకుంటే సువర్లోకం మూడోస్థానంలో ఉంది. సువర్లోకంలో అనేక లోకాలు ఉన్నాయి. మహర్లోకం, జనలోకం, తపోలోకం, సత్యలోకం. మూడోలోకమైన సువర్లోకంలో అత్యంత పైస్థాయిలో బ్రహ్మలోకం ఉంది. సత్యలోకం అంటే బ్రహ్మలోకం.

**తదైర మ్మదీయగ్ం సరః –** బ్రహ్మలోకంలో ఇరం, మదీయం అనే అద్భుతమైన రసాలు సమృద్ధిగా ఉన్నాయి. ఒక సరస్సు ఉన్నట్టుగా ఉన్నాయి.

**అదశ్వత్థఃసోమ సవనః –** అక్కడ అశ్వత్థ వృక్షం ఉంది. మన భూలోకంలో ఉండే అశ్వత్థవృక్షం లాంటిది కాదు. అది కూడా సోమరసమనే అద్భుతమైన రసాన్ని ఇస్తుంది.

**పూర్బ్రహ్మణః–** బ్రహ్మపురం. బ్రహ్మ అంటే నిర్గుణ బ్రహ్మ కాదు, సగుణ బ్రహ్మ.

**ప్రభువిమితగ్ం–** బ్రహ్మదేవుడే స్వయంగా నిర్మించిన పురమది– సాక్షాత్తూ బ్రహ్మ ఉండే పురం ఎలా ఉంటుందో వేరే చెప్పాలా!

**హిరణ్మయమ్ –** ఆ లోకమంతా బంగారుమయం. అది ఎటువంటి లోకం?

**అపరాజితా –** తక్కినవాళ్ళ చేత పొందలేనిది. తక్కిన వాళ్ళంటే ఎవరు? ఇక్కడ అంశం ఈశ్వర ఉపాసన. అందుకని ఈశ్వర ఉపాసన చేయని వాళ్ళు. అందువల్ల ఈ బ్రహ్మలోకాన్ని దహరాకాశ ఉపాసన చేసిన వ్యక్తి, అది కూడా బ్రహ్మచర్యాదీక్షతో కలిపి చేసిన వ్యక్తి మాత్రమే పొందుతాడు. బ్రహ్మచర్య వ్రతం బ్రహ్మలోకాన్ని పొందటానికి మార్గం కాబట్టి దీన్ని అరణ్యఅయనం అన్నారు. అందువల్ల ఈ మంత్రాల్లో బ్రహ్మచర్య వ్రతాన్ని కీర్తించింది ఉపనిషత్తు.

**మంత్రం – 4** ఉపాసన + బ్రహ్మచర్యం కలిపి చేస్తే వచ్చే ఫలం.

**తద్య ఏవైతా బ్రహ్మచర్యేణాను విన్దన్తి –** దహర ఉపాసనతో పాటు బ్రహ్మచర్యం పాటించిన వాళ్ళు పొందుతారు. ఎప్పుడు చేయాలి? గుర్తుంచుకోండి.

ఇప్పుడు కాదు. ఈ ఉపాసనను జీవితాంతం చేయాలి. జీవితమంతా కాదు, అంతంలో కూడా చేయాలి!

**ప్రయాణకాలే మనసాచలేన భక్త్యా యుక్తో యోగబలేన చైవ।**
**భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్ స తం పరం పురుషముపైతి దివ్యమ్॥** గీత 8-10

క్రమముక్తి అంత తేలిగ్గా వచ్చేది కాదు. వేదాంతం నేర్చుకోవటం కన్నా తేలిక అనుకుంటే కాదంటున్నది గీత. ఉపాసన జీవితకాలం చేయాలి. మరణం సమయంలో కూడా. సుషుమ్నానాడి నుంచి ప్రాణం పోవాలి. **అరం చణ్యం చార్ణవే బ్రహ్మలోకే –** ఒకవేళ ఇవన్నీ జరిగి బ్రహ్మలోకం వెళితే ఆ బ్రహ్మలోకం ఎలా ఉంటుందో ఇప్పుడే చూశాము. అరం, ణ్యం అనే సముద్రాలు ఉన్నాయి. ఐరం, మదీయం అనే రసాలు ఉన్నాయి అంతకుముందు ఖండాల్లో చూసిన సిద్ధులు పొందుతారు.

**యం యమంతిమభికామో భాసతే ... సంకల్పాదేవ సముతిష్ఠతి**
**తేషామేవైష బ్రహ్మలోకస్తేషాగ్ం సర్వేషు లోకేషు కామచారో భవతి**

ఏ లోకం కావాలంటే ఆ లోకం సృష్టించవచ్చు, లేదా ఆ లోకానికి తాను యథేచ్ఛగా వెళ్ళవచ్చు. తనను తాను అనేకంగా విభజించుకోవచ్చు.
**సర్వేషు లోకేషు కామచారోభవతి – ఫలం.**

ఇక్కడ శంకరాచార్యులు లోతుగా విశ్లేషిస్తారు. లోకాన్ని సృష్టిస్తాడు. అంటే ఆ లోకం భౌతిక ప్రపంచమా లేకా మానస ప్రపంచమా? అది భౌతిక ప్రపంచం కాదు. తన మనస్సులోంచి సృష్టించే, తనకు మాత్రమే కనిపించే మానస ప్రపంచం. కాకపోతే అతను అనుభవించటానికి వీలుగా స్పష్టంగా ఉంటుంది. ఇది కోరి సృష్టించే మానసిక వికారం. మామూలు మానసిక వికారం తెలిసి చేసేది కాదు. దానంతట అది జరుగుతుంది. కాని ఇక్కడ అతను కోరి సృష్టిస్తాడు.

పోనీ కల అందామా? కల కూడా కాదు. కల ప్రారబ్ధకర్మ నుంచి పుట్టింది. మనం ఫలానా కల కావాలని కోరి కనలేము. కాని ఉపాసకుడు కోరి, తనకిష్టమైన ప్రపంచాన్ని, తనకిష్టమైనంతసేపు సృష్టించగలడు. కల మనకి చెప్పిరాదు, మనకు కావాల్సినంత సేపు ఉండదు.

### షష్ఠః ఖణ్డః (6)

అథ యా ఏతా హృదయస్య నాడ్యస్తాః పిఙ్గలస్యాణిమ్నస్తిష్ఠన్తి శుక్లస్య నీలస్య పీతస్య లోహితస్యేత్యసౌ వా ఆదిత్యః పిఙ్గల ఏష శుక్ల ఏష నీల ఏష పీత ఏష లోహితః ॥1॥ తద్యథా మహాపథ ఆతత ఉభౌ గ్రామౌ గచ్ఛతీమఞ్చాముఞ్చైవమేవైతా ఆదిత్యస్య రశ్మయ ఉభౌ లోకౌ గచ్ఛన్తీమం చాముం చాముష్మాదాదిత్యాత్ప్రాతాయంతే తా ఆసు నాడీషు సృప్తా ఆభ్యో నాడీభ్యః ప్రతాయంతే తే ఽముష్మిన్నాదిత్యే సృప్తాః ॥2॥ తద్యత్రైతత్సుప్తః సమస్తః సంప్రసన్నః స్వప్నం న విజానాత్యాసుతదా నాడీషు సృప్తో భవతి తం న కశ్చన పాప్మా స్పృశతి తేజసా హి తదా సంపన్నో భవతి ॥3॥ అథ యత్రైతదబలిమానం నీతో భవతి తమభిత ఆసీనా ఆహుర్జానాసి మాం జానాసి మామితి స యావదస్మాచ్ఛరీరాదనుత్క్రాన్తో భవతి తావజ్జానాతి ॥4॥ అథ యత్రైతదస్మాచ్ఛరీరాదుత్క్రామత్యథైతైరేవ రశ్మిభిరూర్ధ్వమాక్రమతే । స ఓమితి వాహోద్వా మీయతే। స యావత్ క్షిప్యేన్మనస్తావదాదిత్యం గచ్ఛతి । ఏతద్వై ఖలు లోకద్వారం విదుషాం ప్రపదనం నిరోధోఽవిదుషామ్ ॥5॥ తదేష శ్లోకః । శతం చైకా చ హృదయస్య నాడ్యస్తాసాం మూర్ధానమభినిఃసృతైకా। తయోర్ధ్వమాయన్నమృతత్వమేతి విష్వఙ్ఙన్యా ఉత్క్రమణే భవన్త్యుత్క్రమణే భవన్తి॥6॥

**మంత్రం–1** ఈ భాగాన్ని నాడీఖండం అంటారు. ఈ నాడులు హృదయం నుంచి బయలుదేరి శరీరం అంతటా వ్యాపిస్తాయి. ఈ నాడుల గురించి అనేక ఉపనిషత్తులలో ప్రస్తావన వస్తుంది. ఉపాసకుని, ప్రాణం సుషుమ్న నాడి నుంచి బ్రహ్మలోకానికి వెళుతుంది అని వస్తుంది.

**ఏతా హృదయస్య నాడ్యస్తాః –** హృదయం అంటే మన శరీరంలో ఎడమవైపు ఉందని చెప్పే హృదయమే. హృదయం అంటే మాంస పిండం. ఆ హృదయం నుంచి అనేక నాడులు వస్తాయి. ఆ నాడుల్లో రంగులతో కూడిన రసం ఉంది. ఆ రసాన్ని నాడీ రసం అంటారు. ఆ రంగులు ఏమిటి?

**పిఙ్గలస్యాణిమ్నస్తిష్ఠన్తి శుక్లస్య నీలస్య పీతస్య లోహితస్య ఇతి –**
పింగళం– బంగారు రంగు; శుక్లం– తెలుపు; నీలం – నీలం; పీతం – పసుపు; లోహితం – ఎరుపు; నాడులే చిన్నవి కాబట్టి ఇవి అణువంత

సూక్ష్మంగా ప్రవహిస్తున్నాయి. ఇన్ని రంగులున్నాయి కాబట్టి ఇవి రక్తనాళాలు కావు. రక్తం ఎరుపురంగులో ఉంటుంది. ఇలా రంగులు ఎందుకు ఉన్నాయి? ఉపనిషత్తే కారణం ఇస్తున్నది.

**అసౌ వా ఆదిత్యః పిఙ్గల ఏష శుక్ల ఏష నీల ఏష పీత ఏష లోహితః –** ఆదిత్యుడు, సూర్యభగవానుడు, ఇంద్రధనస్సు రంగులతో ప్రకాశిస్తాడు. ఈ సూర్యకిరణాలు భూమ్మీద ప్రసరించినప్పుడు, మనుష్యుల మీద కూడా ప్రసరించి, నాడీల్లోకి చొచ్చుకుపోతాయి. 'నేను చూడలేదు' అంటే, 'అందుకే నేను చెప్తున్నాను,' అంటున్నది శాస్త్రం. మనం చూడలేని విషయాలను శాస్త్రం బోధించాలి. అందువల్ల సూర్యుని కిరణాలలోని ఏడు రంగులు నాడుల్లోకి వ్యాపిస్తాయి. ఎవరి నాడుల్లో? అందరి నాడుల్లోనూ.

ఈ సూర్యరశ్మి నాడుల్లోనే లేదు, బయటకు కూడా వెళుతుంది. ఎంతవరకు? సూర్యమండలం వరకు. ఈ సూర్యరశ్మి హృదయాన్నీ, సూర్యమండలాన్ని కలిపే రహదారి. శరీరంలో నాడుల ద్వారా హృదయం వరకూ వెళుతుంది.

మరణం అప్పుడు, ఉపాసకుని సూక్ష్మశరీరం హృదయం నుంచి మొదలయి, నాడిద్వారా సూర్యరశ్మితోపాటు ప్రయాణిస్తుంది.

**తం నయన్త్యేతాః – సూర్యస్యరశ్మయో**
**యత్ర దేవానామ్ పతిరేకోఽధివాసః**
**ఏహ్యేహీతి తమాహుతయః సువర్చసః**
**సూర్యస్య రశ్మిభిర్యజమానం వహన్తి – ముండక 1-2- 5,6**

ఈ సూర్య రశ్మి ద్వారా ఉపాసకుడు సూర్యమండలానికి వెళతాడు. అక్కడ్నుంచి బ్రహ్మలోకానికి వెళతాడు.

ఈ ఉపాసనకు ఫలం క్రమముక్తి కాబట్టి, ఉపాసకుని గతి గురించి కూడా వివరంగా చెపుతున్నది ఉపనిషత్తు.

**మంత్రం-2 తద్యథా మహాపథ ఆతత–** ఈ సూర్యరశ్మి ఒక రహదారిలాగా పనిచేస్తుంది. దానికొక ఉదాహరణని చూస్తాము. ఎంతోదూరం వరకూ ఉన్న రహదారిలాగా ఉంది.

**ఉభౌగ్రామౌ గచ్ఛతీమఞ్చాముఞ్చ –** ఆ రహదారి రెండు గ్రామాలను లేదా రెండు పట్టణాలను కలిపే రహదారి లాంటిది. **ఏవమేవ –** ఈ విధంగానే;

**ఏతా ఆదిత్యస్యరశ్మయ ఉభౌ లోకే గచ్ఛన్తీమఞ్చాముఞ్చః** – ఆదిత్యుని కిరణాలు రెండు లోకాలను కలిపే రహదారిలాగా ఉంది. ఏమిటవి? ఈ లోకం, బ్రహ్మలోకం.

**అముష్మాదాదిత్యాత్ప్రతాయంతే** – ఆదిత్యుని నుంచి వచ్చే కిరణాలు;

**తా ఆసు నాడీషు సృప్తా** – మన నాడులలో ప్రసరిస్తున్నాయి.

**ఆభ్యో నాడీభ్యః ప్రతాయంతే తేஉ ముష్మిన్నాదిత్యే సృప్తాః** – నాడుల నుంచి ఆదిత్య మండలం వరకూ వెళుతున్నాయి.

**హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపితం ముఖమ్।**
**తత్త్వం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టయే॥** ఈశావాస్య

ఉపాసకుడు ప్రార్థిస్తున్నాడు, 'నా కోసం సూర్యమండలం ద్వారం తెరిచి ఉంచు, నేను దాని ద్వారా బ్రహ్మలోకానికి చేరుకోవాలి.'

ఇప్పుడు, ఈ మంత్రం ద్వారా మార్గం సిద్ధంగా ఉంది. ఉపాసకుడు ప్రయాణించాలి.

**మంత్రం–3** ఈ జీవుడు నాడుల్లో ప్రయాణిస్తాడు. మరణం అప్పుడే కాదు, నిరంతరం ప్రయాణిస్తాడు. మూడు అవస్థల్లోనూ ప్రయాణిస్తాడు. జాగ్రదావస్థలో హృదయం నుంచి బయటకు వచ్చి వ్యవహారం నడుపుతాడు. సుషుప్తి అవస్థలో హృదయంలో విశ్రాంతి తీసుకుంటాడు. హృదయంలోకి ఎలా వస్తాడు? నాడుల ద్వారా. స్వప్నావస్థలో నాడుల్లోనే తిరుగుతాడు. అందువల్ల నాడుల్లో ప్రయాణం నిరంతరం ఉంటుంది.

**తద్యత్రైతత్సుప్తఃసమస్తః సంప్రసన్నః స్వప్నం న విజానాతి** –

ఎప్పుడైతే సమస్త ఇంద్రియాలు, మనస్సు ఉపసంహరించబడుతాయో, అప్పుడు అతను గాఢనిద్రపోతున్నాడు. స్వప్నాన్ని కూడా చూడడు.

**ఆసు తదా నాడీషు సృప్తో భవతి** – ఆ జీవి ఈ నాడుల ద్వారా ప్రయాణిస్తాడు. ప్రయాణించి హృదయంలో నిద్రిస్తాడు. అది మనం కలుపుకోవాలి. హృదయాకాశంలో ఎవరున్నారు? పరమాత్మ. అందువల్ల జీవాత్మ హృదయంలో నిదురించినప్పుడు, జీవాత్మ పరమాత్మతో ఐక్యం చెందుతుంది. అందువల్ల ఆనంద స్థితిలో ఉంటాడు.

**తం న కశ్చన పాప్మా స్పృశతి** – జీవికి అప్పుడు పుణ్యపాపాలు అంటవు. అయితే ఎందుకు లేస్తాడు? ఆగిన పుణ్యపాపాలు మళ్ళీ ముందుకు వస్తాయి.

పడుకుంది చాలు, లే అని కొరడాతో కొడతాయి. తం అంటే సుషుప్తిలో ఉన్న జీవుడు. సుషుప్తి తాత్కాలికంగా మోక్షాన్ని అనుభవింపజేస్తుంది. మనమందరం సుషుప్తిలో అద్వైత ఆనందాన్ని అనుభవిస్తాము.

**తేజసా హి తదా సంపన్నో భవతి–** తేజస్సుకు అనేక అర్థాలు ఉన్నాయి. ఒక అర్థం పరమాత్మ చైతన్యం లేదా బ్రహ్మచైతన్యం. బ్రహ్మచైతన్యంలో జీవాత్మ లయమవుతుంది. ఈ బ్రహ్మైక్యం ఒక్క ఉపాసకునికే కాదు అందరికీ అవుతుంది.

**మంత్రం–4** ఈ నాడులలో జీవుడు ఎప్పుడూ ప్రయాణిస్తూనే ఉంటాడు. సుషుప్తిలో నాడుల ద్వారా ప్రయాణించి హృదయం చేరుకుంటాడు. స్వప్నావస్థలో నాడుల్లో ఉండి, స్వప్న ప్రపంచాన్ని చూస్తాడు. జాగ్రదావస్థలో, నాడుల ద్వారా, హృదయం నుంచి బయటకు వచ్చి, శరీరం అంచులదాకా వచ్చి, జాగ్రదావస్థను అనుభవిస్తాడు. అలా అన్ని అవస్థల్లోనూ నాడులలో తిరుగుతూ ఉంటాడు. అలా అవస్థాత్రయ కాలంలోనే కాక, మరణకాలంలో కూడా నాడుల వినియోగం ఉంటుంది అని చెపుతున్నది ఉపనిషత్తు. ఉపాసకుని పరిస్థితి ఏమిటో తర్వాత వస్తుంది. ఇక్కడ తక్కినవాళ్ళ పరిస్థితి చెపుతున్నది. ముందు మంత్రంలో జీవించి ఉన్నప్పటి పరిస్థితి చెప్తే మరణకాలంలో పరిస్థితి వివరిస్తున్నది ఇక్కడ.

**అథ యత్రైతదబలిమానం నీతో భవతి–** అథ అంటే ఈ శరీరాన్ని 70 లేదా 100 సంవత్సరాల వరకూ వినియోగించాక; మరణకాలంలో ఈ జీవాత్మ క్రమేపీ నీరసించిపోతుంది. ఒక్కొక్క అంగం పనితీరు తగ్గిపోతుంది. చూపు సరిగ్గా ఆనదు. పళ్ళు ఊడిపోతాయి. జీర్ణక్రియ, విసర్జన క్రియలు సరిగ్గా పనిచేయవు. అబలిమానం అంటే బలహీనం. ఊపిరి కూడా సరిగ్గా తీసుకోలేకపోతాడు.

**తమభిత ఆసీనా ఆహుః –** దూరదేశాల నుంచి వచ్చిన చుట్టాలు గుమికూడతారు. వాళ్ళు అడుగుతారు. ఏమని?

**జానాసి మాం జానాసి మామితి–** నన్ను గుర్తుపట్టావా, నన్ను గుర్తుపట్టావా, నేను ఫలానా అని అడుగుతారు.

**స యావదస్మాచ్ఛరీరాదనుత్క్రాన్తో భవతి తావజ్జానాతి –** శరీరం నుంచి జీవాత్మ వదిలి వెళ్ళనంతవరకూ, జీవుడు కొంత మేరకన్నా గుర్తుపట్టగలడు.

నిజానికి మనం తెలుసుకోవాల్సింది ఉపాసకుడు క్రమముక్తి పొందటానికి, మరణించాక, వెళ్ళే మార్గం. కాని వాని ముందు ఎవరికైనా మరణకాలం ఎలా ఉంటుందో వివరిస్తున్నది ఉపనిషత్తు.

**మంత్రం-5 అథయత్రైతదస్మాచ్ఛరీరాదుత్క్రామతి –** అథ అంటే తర్వాత. దేని తర్వాత? ప్రారబ్ధకర్మ ముగిసాక. అప్పుడు జీవుడు స్థూలశరీరాన్ని వదిలి బయటకు వస్తాడు. అది కూడా నాడి ద్వారానే. మరణించేటప్పుడు జీవాత్మ హృదయానికి వస్తుంది. ఎవరైనా ఇల్లు మారేటప్పుడు అన్నీ సర్దుకుని ఎలా బయటకు వెళ్తారో, అలా మరణ సమయంలో అన్నీ (ఇంద్రియాలు, మనస్సు,ప్రాణం) హృదయంలోకి చేరుకుంటాయి. హృదయం నుంచి అనేక నాడులు ఉన్నాయి. 72000 నాడులు ఉన్నాయని ప్రశ్నోపనిషత్తులో వస్తుంది. వాటిలో 101 నాడులు ముఖ్యమైన నాడులు. జీవాత్మ (తాను చేసుకున్న పాపపుణ్యాల కనుగుణంగా) ఏదో ఒక నాడి నుంచి బయటకు వస్తుంది. అప్పుడు చుట్టూ ఉన్న వాళ్ళు జానాసి మామ్, జానాసి మామ్ అంటే జవాబు ఉండదు. శరీరం ఉంటుంది కాని శరీరంలో ఉండే జీవి లేదు.

**ఉత్క్రామతి –** జీవుడు వెళ్ళిపోయాడు. ఇప్పటివరకు అందరి పరిస్థితి గురించిన వర్ణన వచ్చింది.

**అథ –** ఇక్కడ్నుంచి ఉపాసకుని నిష్క్రమణ వస్తుంది.

**ఏతైరేవ రశ్మిభిరూర్ధ్వమాక్రమతే –** ఉపాసకుడు ఏదో ఒక నాడినుంచి వెళ్ళడు. అతనికి ప్రయాణం ప్రత్యేకమైన నాడి నుంచి ఉంది. దాన్ని సుషుమ్న నాడి అంటారు. తైత్తిరీయంలో దాన్ని ఇంద్రయోని అన్నారు.

> **సయ ఏషోఽన్తర హృదయ ఆకాశః। తస్మిన్నయం పురుషో మనోమయః । అమృతో హిరణ్మయః। అంతరేణ తాలుకే। య ఏషస్తన ఇవావలంబతే। సేంద్రయోనిః। – తైత్తిరీయం**

సుషుమ్నానాడికే ఇంకోపేరు ఇంద్రయోని. అది మెడ మధ్య భాగం నుంచి, తల మధ్యభాగం ద్వారా వెళ్ళి తలపైన ఉన్న బ్రహ్మరంధ్రం ద్వారా తెరుచుకుంటుంది. ఈ నాడుల్లో సూర్యరశ్మి ఉందని చూశాము కదా. అంటే సుషుమ్న నాడిలో కూడా సూర్యరశ్మి ఉంది. అందువల్ల ఉపాసక జీవుడు, సూర్యరశ్మి ద్వారా శరీరాన్ని వదిలి, శుక్లగతి ద్వారా ప్రయాణిస్తాడు.

ఉపాసకుడు మాత్రమే ఊర్ధ్వభాగం నుంచి వెళతాడు.
తక్కినవాళ్ళు పక్కనాడుల నుంచి వెళతారు.
**తస్మాత్ సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ।** గీత 8-7
**అంతకాలేచ మామేవ స్మరన్ ముక్త్వా కలేవరమ్।** గీత 8-5

ఈ శ్లోకాలు ఇక్కడనుంచి స్వీకరించబడ్డాయి. దహరవిద్యను ఆధారంగా తీసుకున్నాడు కృష్ణపరమాత్మ. మరణకాలంలో కూడా నన్నే తలచుకో అంటే ఎప్పుడూ తలచుకుంటూ ఉంటేనే అది సాధ్యం.

**స ఓమితి వా హోద్వా మీయతే-** ఓంకారం జపిస్తూ మరణిస్తాడు. అతను ఊర్ధ్వభాగం నుంచి వెళతాడు. ఎక్కడికి వెళతాడు?

**స యావత్ క్షిప్యేన్మనస్తావదాదిత్యం గచ్ఛతి-** స్థూలశరీరం నుంచి, మనసుతో కూడిన సూక్ష్మశరీరం బయటపడిన వెంటనే, తక్షణమే ఆదిత్య మండలం జేరుకుంటాడు.

**ఏతద్వై ఖలు లోకద్వారం-** ఆదిత్యమండలం ఉపాసకుని బ్రహ్మలోకానికి ద్వారం. ఇక్కడ టోల్‌గేట్‌లాగా అక్కడ ఆదిత్యమండలం టోల్‌గేటు లాంటిది.

**విదుషాం ప్రపదనం -** అతను ఉపాసకుడో కాదో చూస్తాడు సూర్యుడు. విదుషాం అంటే ఉపాసకుడు. ప్రపదనం- ద్వారం. ఉపాసకునికి ద్వారం తెరుస్తాడు. ఉపాసకుడు కాని వాడు ఎవరైనా రావటానికి ప్రయత్నిస్తే ఏమవుతుంది?

**నిరోధోఽ విదుషామ్ -** ఉపాసకుడు కానివాడిని నిరోధిస్తాడు. ఎక్కడ నిరోధిస్తాడు? సుషుమ్న నాడి దగ్గరే. ఉపాసకునికి సుషుమ్ననాడి దానంతట అదే తెరచుకుంటుంది. ఉపాసకుడు కానివాడికి సూర్యతేజస్సు తలుపు మూసేస్తుంది. వేరే మార్గం ద్వారా వెళ్ళాల్సిందే. బ్రహ్మసూత్రాల్లో వీటి గురించిన చర్చ విపులంగా వస్తుంది.

**మంత్రం-6 తదేష శ్లోకః -** జీవుని నిష్క్రమణం గురించి, ఒక ఋగ్వేద మంత్రం ఉంది. ఏమని?

**శతం చైకా చ హృదయస్య నాడ్యః -** హృదయం నుంచి 101 నాడులు వస్తాయి.

**తాసాం మూర్ధానమభి నిః సృతైకా -** వాటిలోంచి సుషుమ్నానాడి ఒకటి బయటకు వస్తుంది. ఎలా? మధ్యభాగం నుంచి. అదే బ్రహ్మరంధ్రం.

**తయోర్ధ్వమాయన్ –** ఉపాసక జీవుడు సుషుమ్నానాడి నుంచి, బ్రహ్మరంధ్రం నుంచి బయటకు వస్తాడు.
**అమృతత్వమేతి–** అతను క్రమముక్తి పొందుతాడు. (బ్రహ్మలోకప్రాప్తి ద్వారా అని మనం కలుపుకోవాలి). తక్కిన వాళ్ళ మాట ఏమిటి?
**విష్వఙ్ జన్యా ఉత్క్రమణే భవన్త్యుత్క్రమణే భవన్తి –** ఉపాసకుడు కాని వారందరూ, సుషుమ్నానాడి కాకుండా తక్కిన నాడుల ద్వారా, అనేక మార్గాల ద్వారా బయటకు వస్తారు. విశ్వం అంటే అనేక మార్గాలు.

దహర ఉపాసకుడు క్రమముక్తి పొందుతాడు. దీనితో సగుణ బ్రహ్మ ఉపాసన ముగిసింది. ఇక 7–12 వరకూ నిర్గుణ బ్రహ్మ జ్ఞానం వస్తుంది.

**సప్తమః ఖణ్డః (7)**

**య ఆత్మాఽపహతపాప్మా విజరో విమృత్యుర్విశోకో విజిఘత్సోఽపిపాసస్సత్యకామస్సత్యసఙ్కల్పస్సోఽన్వేష్టవ్యస్స విజిజ్ఞాసితవ్యః। స సర్వాగ్ంశ్చ లోకానాప్నోతి సర్వాగ్ంశ్చ కామాన్యస్తమాత్మానమనువిద్య విజానాతీతి హ ప్రజాపతిరువాచ ॥1॥ తద్ధోభయే దేవాసురా అనుబుబుధిరే। తేహోచుర్హన్త తమాత్మానమన్విచ్ఛామో యమాత్మానమన్విష్య సర్వాగ్ంశ్చ లోకానాప్నోతి సర్వాగ్ంశ్చ కామానితీంద్రో హైవ దేవానామభిప్రవవ్రాజ । విరోచనోఽసురాణాం తౌ హాసంవిదానావేవ సమిత్పాణీ ప్రజాపతిసకాశమాజగ్మతుః ॥2॥ తౌ హ ద్వాత్రిగ్ంశతం వర్షాణి బ్రహ్మచర్యమూషతుస్తౌ హ ప్రజాపతిరువాచ కిమిచ్ఛంతావవాస్తమితి తౌ హోచతుర్య ఆత్మాఽపహతపాప్మా విజరో విమృత్యుర్విశోకో విజిఘత్సోఽపిపాసస్సత్యకామః సత్యసఙ్కల్పస్సోఽన్వేష్టవ్యస్స విజిజ్ఞాసితవ్యస్స సర్వాగ్ంశ్చ లోకానాప్నోతి సర్వాగ్ంశ్చ కామాన్ యస్తమాత్మానమనువిద్య విజానాతీతి భగవతో వచో వేదయన్తే మిచ్ఛంతావవాస్తమితి॥3॥ తౌ హ ప్రజాపతిరువాచ య ఏషోఽక్షిణి పురుషో దృశ్యత ఏష ఆత్మేతి హోవాచైతదమృతమభయమేతద్బ్రహ్మేత్యథ యోఽయం భగవోఽప్సు పరిఖ్యాయతే యశ్చాయమాదర్శే కతమ ఏష ఇతి॥ ఏష ఉ ఏవైషు సర్వేష్వన్తేషు పరిఖ్యాయత ఇతి హోవాచ ॥4॥**

ఇక్కడ నుంచి నిర్గుణ బ్రహ్మజ్ఞానం కాబట్టి ఒక కథ ద్వారా గురుశిష్యులను పరిచయం చేస్తున్నది ఉపనిషత్తు. గురువు సాక్షాత్తూ సృష్టికర్త బ్రహ్మ. శిష్యులు ఇంద్రుడు, విరోచనుడు. ఇంద్రుడు దేవతలకు రాజైతే, విరోచనుడు రాక్షసులకు రాజు.

**మంత్రం-1 ప్రజాపతిరువాచ-** ఒకానొకప్పుడు ప్రజాపతి లేదా బ్రహ్మ ఒక పెద్ద చాటింపు వేయిస్తాడు. ఏమని?

**య ఆత్మాఽపహతపాప్మా విజరో విమృత్యుర్విశోకో విజిఘత్సోఽపిపాసస్సత్యకామస్సత్య సఙ్కల్పః -** ఒక పరమాత్మ ఉన్నాడు. ఆయన అష్టగుణ విశిష్ట పరమాత్మ. ఏమిటా ఎనిమిది గుణాలు?

**అపహతపాప్మా, విజరః విమృత్యుః, విశోకః, విజిగిత్సః, అపిపాసః,** సత్యకామః, సత్యసంకల్పః. ఈ అష్టగుణ విశిష్ట పరమాత్మను ఈ అధ్యాయం మొదట్లో దహరాకాశ ఉపాసనలో చూశాము. (8.1.5) వీటి అర్థాలు వరుసగా-

పుణ్యపాపాలకు అతీతుడు; వృద్ధాప్యం లేదు. మరణం లేదు. శోకం లేదు, ఆకలి లేదు, దాహం లేదు, సత్యములైన కోరికలు ఉన్నాయి, సత్యములైన సంకల్పాలు ఉన్నాయి.

ఇక్కడ ఒక సందేహం రావచ్చు. ఇక్కడ్నుంచీ నిర్గుణ బ్రహ్మజ్ఞానం గురించి వస్తుందని చూశాము కాని ప్రజాపతి సగుణ బ్రహ్మ లక్షణాలనే వివరిస్తున్నాడు. సత్యకామ,సత్యసంకల్ప పదాలు నిర్గుణ బ్రహ్మకు వర్తించవు. అదెలా సాధ్యం అంటే సగుణ ఈశ్వరుని లక్ష్యార్థం చూస్తాము ఇప్పుడు. ఒకే పరమాత్మ సగుణ బ్రహ్మ+నిర్గుణ బ్రహ్మ. నిర్గుణ బ్రహ్మ ఆయన ఉన్నత స్థితి. అంతకు ముందు ఖండాల్లో తత్ పద వాచ్యార్థం చూశాము. ఇప్పుడు తత్ పద లక్ష్యార్థం చూస్తాము. ప్రస్తుతం ఈ వర్ణన సగుణబ్రహ్మదే.

అందుకే కృష్ణ భగవానుడు అంటాడు- నా సగుణ స్వరూపం గురించి తెలుసుకుంటే అది జ్ఞానం; నా నిర్గుణ స్వరూపం గురించి తెలుసుకుంటే అది విజ్ఞానం. పరమాత్మ అంటే సగుణ బ్రహ్మ అవచ్చు, నిర్గుణ బ్రహ్మ అవచ్చు. సందర్భం బట్టి తెలుసుకోవాలి.

**సః అన్వేష్టవ్యస్స విజాజ్ఞాసితవ్యః -** ఆ పరమాత్మ గురించి అన్వేషించాలి. తెలుసుకోవాలి.

సగుణ నిర్గుణ బ్రహ్మ గురించి తెలుసుకుంటే కలిగే ఫలమేమిటి? **ససర్వాగ్ంశ్చ లోకానాప్నోతి–** వెంటనే 14 లోకాలను పొందుతాడు. ఎలా పొందుతాడు?ఆత్మ జ్ఞానం పొందటంద్వారా. జగత్కారణ పరమాత్మను నేనే.

**మయ్యేవ సకలం జాతం మయి ప్రతిష్ఠితమ్।**
**మయి సర్వం లయం యాతి॥**

నేనే సృష్టిస్థితి లయ కారకుడిని.

**సర్వాగ్ంశ్చ కామాన్యస్తమాత్మానమనువిద్య విజానాతీతిహ ప్రజాపతిరువాచ –** అన్ని కోరికలూ తీరతాయి. తను అల్పజీవి అనుకుంటే కోరికలు అతనికి బాహ్యంగా ఉన్నాయి. కారు కావాలంటే వెళ్ళి, బుక్ చేసుకుని, తీసుకుని రావాలి. బ్రహ్మజ్ఞానం పొందాక, కార్లన్నీ నాలోనే ఉన్నాయి అని తెలుసుకుంటాడు. వస్తువుకూ, నాకూ మధ్య దూరం లేదు. అందువల్ల ఈ జ్ఞానం వల్ల ఫలం – పూర్ణత్వం.

**సోఽశ్నుతే సర్వాన్ కామాన్సహ – తైత్తిరీయం**

అన్ని కోరికలూ ఒక్కసారిగా తీరుతాయి.

ఈ ఫలం ఎవరికి? ఆత్మజ్ఞానం పొందేవారికి. ఎలా? శ్రవణ, మనన, నిధి ధ్యాసనల ద్వారా. ఆత్మ జ్ఞానం పొందాలనుకున్నవారు రండి అని బ్రహ్మ చాటింపు వేయించాడు.

**మంత్రం–2 తత్–** బ్రహ్మ వేయించిన ఆ చాటింపును

**ఉభయే దేవాసురా అనుబుబుధిరే–** దేవతలు, అసురులు యిద్దరూ కర్ణాకర్ణిగా తెలుసుకున్నారు.

**తేహోచుః –** వాళ్ళలో వాళ్ళు చర్చించుకున్నారు.

**హన్త తమాత్మానమన్విచ్ఛామో యమాత్మానమన్విష్య సర్వాగ్ంశ్చ లోకానాప్నోతి సర్వాగ్ంశ్చ కామాన్ –** మన కోరికలన్నింటినీ తీరుస్తుంది కాబట్టి,లోకాలన్నీ పొందవచ్చు కాబట్టి, ఈ ఆత్మ గురించి తెలుసుకోవాలి.

**ఇతి –** ఇలా అనుకున్నారు రెండు లోకాల్లోనూ. దేవరాజ సభలోనూ, అసుర రాజ సభలోనూ విడివిడిగా చర్చలు, సంప్రదింపులు చేసుకుని, ఆత్మగురించి తెలుసుకోవాలి అనుకున్నారు. అందరూ వెళితే వాళ్ళ లోకాలకు ముప్పు కలుగుతుందని భయపడి, వాళ్ళ తరుపున ఒక్కొక్క ప్రతినిధిని ఎన్నుకున్నారు. సహజంగా, ఆ ప్రతినిధి తెలివైన వాడై ఉండాలి. తాను నేర్చుకోవటమే గాక,

వెనక్కి వచ్చి తక్కిన వాళ్ళకు బోధించాలి. అందుకని వాళ్ళ వాళ్ళ రాజులను ఎన్నుకున్నారు.

**ఇంద్రో హైవ దేవానామభిప్రవవ్రాజ –** దేవతల్లో, ఇంద్రుడిని విద్యార్థిగా ఎన్నుకున్నారు.

**విరోచనోఽసురాణాం –** అసురులలో విరోచనుడిని, వాళ్ళ రాజును, ఎన్నుకున్నారు. ఇద్దరూ కూడా ప్రజాపతినే రమ్మని కబురు పంపలేదు. వాళు ్ళ వాళ్ళ రాజ్యాలకు ప్రభువులైనా కూడా వాళ్ళే గురువు దగ్గరికి బయలుదేరారు.

**తద్విజ్ఞానార్థం సగురుమేవాభిగచ్ఛతే – ముండక**

అది కూడా ఎలా వెళ్ళాలి? పెళ్ళికి వెళ్తున్నట్టు సర్వాలంకార భూషితులై వెళ్ళకూడదు. అందుకని, ఇంద్రుడు తన నగలన్నీ తీసి, సన్యాసిలాగా వెళ్ళాడు. ప్రవవ్రాజ పదం అందుకే వాడింది ఉపనిషత్తు. ప్రవవ్రాజ అంటే సన్యాసి. అలాగే విరోచనుడు కూడా బయలుదేరాడు.

**తౌ హాసంవిదానావేవ –** ఇద్దరికీ, రెండోవ్యక్తి వస్తున్నట్టు తెలియదు. ఇద్దరూ బద్ధశత్రువులు కదా! అందుకని ఒకరు వస్తున్నట్టు ఇంకొకరికి తెలియదు.

**సమిత్పాణీ –** కాని ఇద్దరికీ గురువు దగ్గరకు ఎలా వెళ్ళాలో తెలుసు. సమిధలు తీసుకుని వెళ్ళారు. సమిధ అంటే ఎండుగడ్డి. సమిధాధానంకు వాడతారు దాన్ని. అలా తీసుకువెళ్ళటంలో శ్రద్ధా, భక్తి కనిపిస్తుంది. అంతేకాదు, కాస్త నిప్పురవ్వ సోకితే సమిధ ఎలా వెంటనే భగ్గుమంటుందో, అలా గురువు బోధించగానే,శిష్యుడు జ్ఞానంతో అలా వెలగాలి. అంటే అతని బుద్ధిలో చప్పున ఒక మెరుపు మెరవాలి. మూడు రకాల శిష్యులు ఉంటారు.

**1. కర్పూర బుద్ధి –** కర్పూరం ఇలా వెలిగిస్తే అలా వెలుగుతుంది. అంత చటుక్కున విషయాన్ని పట్టుకుంటాడు, ఇటువంటి శిష్యుడు. సూక్ష్మబుద్ధి ఉంటుంది.

**2. బొగ్గు బుద్ధి –** బొగ్గు త్వరగా వెలగదు. దాన్ని విసరగా, విసరగా ఒక మూల కాస్త మంట కనబడుతుంది. అలాగే ఈ రకం శిష్యులకు స్థూల బుద్ధి ఉంటుంది. విషయం ఒక పట్టాన అర్థం కాదు.

**3. అరటిపండు బుద్ధి –** అరటిపండును మంట దగ్గరకు తీసుకువెళితే, అది వెలగదు సరికదా, మంటను కూడా ఆర్పివేస్తుంది. అలాగే ఈ శిష్యుడు తను నేర్చుకోక పోగా, గురువుకొచ్చిన జ్ఞానాన్ని కూడా మర్చిపోయేలా చేస్తాడు.

**ప్రజాపతిసకాశమాజగ్మతుః –** ఇద్దరూ సమిధలు తీసుకుని ప్రజాపతి దగ్గరకు వెళ్ళారు.

**మంత్రం–3** ప్రజాపతి దగ్గరకు వచ్చాక, మీ దగ్గర నేర్చుకోవటానికి వచ్చామని వాళ్ళు చెప్పి ఉండవచ్చు. (ఇది మనం కలుపుకోవాలి) ప్రజాపతి కూడా ఎందుకు వచ్చారని అడగలేదు. మీరు నా దగ్గర 32 సంవత్సరాలు ఉండి అంతఃకరణ శుద్ధి పొందాలి అన్నాడు. ఇంద్రుడు, విరోచనుడు రాజులు. సేవించబడటమే కాని, సేవ చేయటం ఎరుగని వారు. ప్రజాపతి ఆశ్రమంలో ఉండి సేవచేయాలనగానే, పల్లెత్తుమాట అనలేదు. ఇది సాంప్రదాయం. గురువుకు వాళ్ళు శుశ్రూష చేయాలి. గురువు వాళ్ళు విద్య నేర్చుకోవటానికి అర్హులో కాదో పరీక్షిస్తాడు.

**తౌ హ ద్వాత్రిగ్ంశతం వర్షాణి బ్రహ్మచర్యమూషతుః –** తౌ అంటే ఇంద్రుడు, విరోచనుడూ ఇద్దరూ, 32 సంవత్సరాలు బ్రహ్మచర్యం పాటించారు. బ్రహ్మచర్యదీక్షలో ఇంద్రియ నిగ్రహం, మనో నిగ్రహం, వాక్‌నిగ్రహం, గురుశుశ్రూషలాంటి నిష్ఠలు వస్తాయి. ఉషతే అంటే జీవించారు. ఎలా? బ్రహ్మచారులుగా.

**తౌ హ ప్రజాపతిరువాచ–** 32 సంవత్సరాల దీక్ష అయిపోయినట్టుగా ఊహించుకోవాలి. ప్రజాపతి వాళ్ళను అడిగాడు. ఏమని?

**కిమిచ్ఛంతావవాస్తమితి –** ఏ విద్యకోరి మీరు ఇలా బ్రహ్మచర్య దీక్ష చేపట్టారు?

**తౌ హోచతుః –** ఇద్దరూ జవాబు చెప్పారు. ఏమని? తేలిగ్గా మీ చాటింపు విన్నాము, వచ్చాము అని చెప్పి ఉండవచ్చు. కాని వాళ్ళు ప్రజాపతి వేయించిన చాటింపు మొత్తాన్ని కూడా అక్షరం పొల్లుపోకుండా తిరిగి చెప్పారు.

**య ఆత్మాఽపహత పాప్మా... విజానాతీతి** ఒక్కముక్కలో చెప్పాలంటే అష్టగుణ విశిష్ట బ్రహ్మ గురించి తెలుసుకోకుంటే, అన్ని లోకాలూ తిరగవచ్చు, అన్ని కోరికలూ తీర్చుకోవచ్చు అని మీరు చెప్పారు.

**భగవతో వచో వేదయన్తే మిచ్ఛంతావవాస్తమితి–** ఆ జ్ఞానం భగవాన్ ప్రజాపతి నుంచి పొందటానికి వచ్చాము. మీ దగ్గర నుంచి అనేకన్నా భగవాన్ ప్రజాపతి అంటే గౌరవసూచకంగా ఉంటుంది. ఆ సగుణ నిర్గుణ పరమాత్మ విద్య నేర్చుకోవటానికి వచ్చాము. ఈ జిజ్ఞాసతోనే 32 సంవత్సరాలు మీకు శుశ్రూష చేస్తూ గడిపాము.

ప్రశ్నోపనిషత్తులో కూడా పిప్పలాద ఋషి దగ్గరకు ఆరుగురు శిష్యులు మీ దగ్గర విద్య నేర్చుకోవటానికి వచ్చామంటే, ఏడాదిపాటు నా దగ్గర శుశ్రూష చేయండి, అప్పుడు మీరు ప్రశ్నలు అడగవచ్చు. వాటికి నాకు జవాబులు తెలిస్తే, చెప్తానన్నాడు. ఇక్కడ కూడా బ్రహ్మదేవుడు వాళ్ళకు నేర్పుతానని హామీ ఇవ్వలేదు. ఈ విషయాలు చూస్తే, సాధకుడికి ఎంత తీవ్ర ముముక్షుత్వం ఉండాలో తెలుస్తుంది. అప్పటి సాంప్రదాయం అది. గురువు ఏది చెప్తే అది శిష్యుడు చేసి తీరాలి.

**మంత్రం-4** ఇక్కడ ఒక విషయం గమనించాలి. ప్రజాపతి వాళ్ళిద్దరూ కలిసి వచ్చారని అనుకుంటున్నాడు. అందుకే ఇద్దర్నీ కలిపి సంబోధిస్తున్నాడు. వాళ్ళు కూడా మా మధ్య శతృత్వం ఉంది, అతనితో కలిపి నాకు చెప్పకండి అనలేదు. గురువు సమక్షంలో, శిష్యులు అలా వాళ్ళ మధ్య ఉన్న వైరాన్ని మర్చిపోతారని అర్థం చేసుకోవాలి. ఇద్దరూ కలిసే మాట్లాడుతున్నారు. 'తౌ' పదం సూచిస్తుంది అది.

ఇప్పటివరకూ కథ. ఈ మంత్రం నుంచీ ప్రజాపతి బోధ మొదలవుతుంది. ఏమిటా బోధ? పరమాత్మ అంటే ఎవరో కాదు చైతన్యం. అందుకని చైతన్య స్వరూప పరమాత్మ బోధ వస్తుంది. చైతన్యం కున్న ఐదు లక్షణాలను మళ్ళీ ఒకసారి గుర్తు తెచ్చుకుందాం.

1. చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని కాదు. శరీరాన్నించి ఉత్పత్తి చెందింది కూడా కాదు.
2. చైతన్యం స్వతంత్రమైనది. అది శరీరం అంతటా వ్యాపించి, శరీరాన్ని ప్రకాశింప చేస్తుంది.
3. చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
4. చైతన్యం శరీరం నాశనమయితే నాశనమవదు. అలా శరీరం పతనం చెందాక కూడా చైతన్యం ఉంటుంది.
5. చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది. కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపజేసే శరీరం లేదు కాబట్టి అది కనిపించదు. అంత మాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

ఇవీ చైతన్యం లక్షణాలు. ఈ చైతన్యాన్ని పరమాత్మ అంటారు.

ఈ చైతన్యం ప్రకటించబడే విభిన్న మాధ్యమాల వల్ల , దానికి విభిన్న పేర్లు వస్తాయి.

**జాగ్రద్ ప్రపంచాన్ని స్థూలశరీరం ద్వారా అనుభవించే చిదాభాస - విశ్వ**
**స్వప్న ప్రపంచాన్ని సూక్ష్మ శరీరం ద్వారా అనుభవించే చిదాభాస - తైజస**
**సుషుప్తి అవస్థను కారణ శరీరం ద్వారా అనుభవించే చిదాభాస- ప్రాజ్ఞ**

ఒకే వ్యక్తి తండ్రిగా, భర్తగా, యజమానిగా చలామణి అవుతున్నట్టుగా ఒకే చైతన్యం ఉపాధి భేదం వల్ల మూడు పేర్లు పొందింది. విశ్వ, తైజస, ప్రాజ్ఞ- జాగ్రద్ పురుషుడు, స్వప్న పురుషుడు, సుషుప్తి పురుషుడు.

కాని చైతన్యాన్ని ఈ మూడు పేర్లలో దేనితోనూ పిలవలేము. దానికి ఇంకోపేరు ఉంది. అది తురీయం. ఈ నాలుగుపేర్లనూ మాండూక్య ఉపనిషత్తులో చూస్తాము.

**చతుర్థం మన్యంతే స ఆత్మా॥ - మాండూక్య 7**

ఈ నాలుగింటిలో విశ్వ, తైజస,ప్రాజ్ఞలు మిథ్య. తురీయం ఒక్కటే సత్యం. తురీయానికి ప్రమాతృ ప్రమాణః ప్రమేయ త్రిపుటి లేదు. దేశకాల వస్తు పరిమితులు లేవు.

ఇవేవీ లేని ఆత్యంతిక చైతన్యమే పరమాత్మ. ఇదే బ్రహ్మ బోధించబోతున్నాడు. కాకపోతే మనకు తెలిసిన విశ్వ, తైజస, ప్రాజ్ఞ తురీయం పదాలను వాడకుండా, వేరే నాలుగు పదాలను వాడబోతున్నాడు. పదాలు మాత్రమే తేడా, భావం ఒకటే.

| | |
|---|---|
| **విశ్వ** | **- అక్షి పురుషః** |
| **తైజస** | **- స్వప్న పురుషః** |
| **ప్రాజ్ఞ** | **- సుప్త పురుషః** |
| **తురీయం** | **- ఉత్తమ పురుషః** |

పురుషః అంటే పురుషుడు కాదు. పురుషః అంటే చైతన్యం లేదా ఆత్మ .

తన బోధలో మొట్టమొదటి అంశంగా అక్షి పురుషుడిని ప్రవేశపెట్టబోతున్నాడు. విశ్వను అక్షి పురుషుడని ఎందుకనాలి? ఎందుకంటే జాగ్రదావస్థలో, విశ్వ నడిపే వ్యవహారమంతా కన్నుల ముందే జరుగుతుంది. కంటిచూపుతో వ్యవహారాన్ని నడుపవచ్చు. ఆమాటకొస్తే జాగ్రద్ ప్రపంచం మొదలయ్యేదే కళ్ళు తెరవటంతో! కన్నుకు ఎందుకు అంత ప్రాముఖ్యం?

కన్నును కన్ను చేసేపనికి మాత్రమే వాడము. భోజనం చేయాలంటే నోరు– రసనేంద్రియం వాడతాము. చేతులు – కర్మేంద్రియం– వాడతాము; నాలుక– జ్ఞానేంద్రియం వాడతాము చేతులు, నాలుకే అసలు పని చేస్తున్నా కన్నుకూడా కావాలి. కంటితో ఆహారాన్నిచూడాలి. అంటే చక్షురింద్రియం అన్నింటికీ సమానంగా కావాలి. అంటే తక్కిన 9 ఇంద్రియాలు కన్ను సహాయం లేనిదే సరిగ్గా పనిచేయలేవు. నడుస్తున్నా, కన్ను నేలకేసి చూసి, నేల బాగుందో లేదో చెప్పాలి.

బృహదారణ్యకంలో స్వయంజ్యోతి బ్రాహ్మణంలో కళ్ళ గురించి చాలా అందంగా చెప్పబడింది. జాగ్రద్ వ్యవహారమంతా కాంతి సమక్షంలో జరుగుతుంది. అందుకే మనం లేవగానే, లైట్ స్విచ్ వేస్తాము. కాని లైటు కాంతి కనపడాలంటే, కన్ను బాగా పనిచేయాలి. అందుకని, మొత్తం జాగ్రదావస్థ, జాగ్రద్ వ్యవహారాలకు కంటి దీవెన ఉండాలి. అందుకే కన్ను అంత ముఖ్యమైన భాగం అయింది. అందువల్ల జాగ్రద్ ప్రపంచంలో వ్యవహరించే విశ్వకు అక్షి (కన్ను) చాలా ముఖ్యమైన అంగం. అందుకే సాధారణంగా విశ్వ కళ్ళలో ఉంది అంటారు. విశ్వ శరీరం అంతటా వ్యాపించి ఉండే చైతన్యం, కాని, కంటి ప్రాముఖ్యత చూపటం కోసం విశ్వను **అక్షి పురుషః** అంటారు.

'మాండూక్య కారికల్లో, కుడికన్ను ఇంకా పవిత్రమైనదని, విశ్వ కుడికన్నులో ఉందనీ వస్తుంది. అందువల్ల జాగ్రదావస్థలో ఉన్న చిదాభాస పేరేమిటి? **అక్షి పురుషుడు.** అదే ఇక్కడ చెప్పబడింది.

**తౌ హ ప్రజాపతిరువాచ–** ఆ ఇద్దరు శిష్యులతో ప్రజాపతి ఇలా చెప్పాడు.
**య ఏషోఽక్షిణి పురుషో దృశ్యత ఏష ఆత్మేతి–** ఏ చైతన్యమైతే మొత్తం స్థూలశరీరం అంతటా వ్యాపించి ఉందో, ఏదైతే జాగ్రద్ వ్యవహారం నడుపుతోందో, ఏదైతే ప్రముఖంగా కంటి వెనుక ఉందో, అది అక్షిపురుషుడు. కన్నుమూసిన మరుక్షణం వ్యవహారం ఆగిపోతుంది. ఏదైనా రాయాలన్నా కన్ను పనిచేయాలి.

**శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనో**
**యద్వాచో హ వాచం స ఉ ప్రాణస్య ప్రాణః।**

**చక్షుషశ్చక్షురతిముచ్య ధీరాః**
**ప్రేత్యాస్మాల్లోకాదమృతా భవన్తి॥** **కేన 1 - 2**

అది అక్షి పురుషుడు. ఈ చైతన్యాన్నే ఆత్మ అనీ, పరమాత్మ అనీ అంటారు.

**ఇతి హ ఉవాచ** ఇది ప్రజాపతి చేసిన బోధ.

**ఏతదమృతమభయమేతద్బ్రహ్మేతి** - ఈ ఆత్మ శాశ్వతం.

కంటి చూపు మందగించవచ్చు లేదా పూర్తిగా పనిచేయటం ఆగిపోవచ్చు. కాని మాధ్యమం పడిపోయినా చైతన్యం నాశనమవదు. అది అమృతం. అది అభయం. శరీరం, మనస్సు ఇంద్రియాలు ఏదో ఒక అనారోగ్యానికి గురి కావచ్చు. అందువల్ల అభద్రతాభావానికి లోనవుతాయి అవి. కాని చైతన్యానికి భయం లేదు, అభద్రత లేదు.

ఏతద్ బ్రహ్మ – దేశ కాల వస్తు పరిచ్ఛేద శూన్యం. పరిమితులు లేని చైతన్యాన్ని బ్రహ్మ అంటారు.

ప్రజాపతి చెప్పింది ఒకటి, ఇంద్రుడు, విరోచనుడు అర్థం చేసుకున్నది ఇంకోటి. గురువు చెప్పింది శిష్యుడు సరిగ్గా అర్థం చేసుకోకపోవటం సర్వసాధారణంగా జరిగేదే.

గురువు చెప్పిందేమిటి? కన్ను వెనుక నున్న చైతన్యం, కంటికి చైతన్యాన్ని ఇచ్చిన చైతన్యం ఆత్మ.

శిష్యులు అర్థం చేసుకున్నది ఏమిటి? కన్ను అద్దంలా ఉండి ప్రతిబింబ మాధ్యమంలా పనిచేస్తుంది. కాబట్టి కంటి ముందు కనబడే శరీరం కంట్లో ప్రతిబింబిస్తుంది. అద్దంలాంటి కంట్లో ప్రతిబింబించే ఈ స్థూలశరీరాన్ని ఛాయాపురుషుడు అంటారు. ఛాయ అంటే ప్రతిబింబం, నీడ. దేని నీడ? స్థూల శరీరం యొక్క నీడ. స్థూల శరీర ప్రతిబింబం కంట్లో ( నా కంట్లో కాదు) కనిపిస్తుంది. నేను ఎవ్వరి ముందు నిలుచుంటే వారి కంట్లో. కంట్లో కనపడే ఈ స్థూల శరీర ప్రతిబింబాన్ని ఛాయాపురుషుడు అంటారు.

ఇంద్రుడు, విరోచనుడు ఈ ఛాయా శరీరాన్ని ఆత్మగా తీసుకున్నారు. మామూలుగా స్థూలశరీరాన్ని ఆత్మగా భావిస్తారు. అదే పెద్ద తప్పు. వీళ్ళు ఇంకా పెద్ద తప్పు చేస్తున్నారు. స్థూల శరీరపు ప్రతిబింబాన్ని ఆత్మగా తీసుకుంటున్నారు. ప్రతిబింబం ఎక్కడ పడుతున్నది? కంట్లో. దానికి

వాళ్ళు మురిసిపోయారు. ఆత్మ గురించి మాకు బాగా అర్థమయిపోయింది అనుకున్నారు. ఆత్మ అంటే ఛాయా శరీరం. అదే విషయాన్ని గురువు దగ్గర నిర్ధారించుకోవాలనుకున్నారు. అందుకని మరికొన్ని ప్రతిబింబ మాధ్యమాలు తీసుకున్నారు. అన్నింటిలో ప్రతిబింబం ఏర్పడింది. అందుకని ఒక ప్రశ్న అడిగారు గురువును - అథ నుంచి ఇంద్రుడు, విరోచనుల ప్రశ్న మొదలవుతుంది. ఏమడిగారు?

**అథయోఽయం భగవోఽప్సు పరిఖ్యాయతే–** ఓ భగవాన్, నీళ్ళలో కూడా మేము మా ప్రతిబింబాన్ని చూస్తున్నాము.

**యశ్చాయమాదర్శే (పురుషః)–** అద్దంలో కూడా ఛాయాశరీరం ఏర్పడుతోంది; అక్షిలో కూడా ఛాయాశరీరం ఏర్పడుతుంది.

ఇప్పుడు మూడు ఛాయాపురుషులు ఉన్నారు. అక్షి పురుషుడు, జలపురుషుడు, ఆదర్శపురుషుడు.

**కతమ ఏష ఇతి–** ఈ మూడింటిలో ఆత్మ ఏది?

గురువు 'ఎంత వెర్రి ఆలోచన!' అని ఖండించి ఉండాలి. కాని గురువు సాధారణంగా శిష్యులను విమర్శించడు. అందుకని ప్రజాపతి ఏం చేశాడు?

**ఏష ఉ ఏవైషు సర్వేష్వన్తేషు పరిఖ్యాయతి ఇతి హోవాచ –** అవును అక్షి పురుషుని గురించి మీరు సరిగ్గానే అర్థం చేసుకున్నారు.

ఛాయాపురుషుడే అక్షి పురుషుడు. అక్షి పురుషుడే అక్షిలోనూ, జలంలోనూ, ఆదర్శంలోనూ ఉన్నాడు. మీరు చెప్పింది నిజమే అన్నాడు.

ఒక విధంగా ప్రజాపతి చెప్పింది కూడా నిజమే. అక్షి పురుషుడంటే చైతన్యం. చైతన్యం సర్వవ్యాపకం. అందువల్ల ఆ చైతన్యం జలంలోనూ, ఆదర్శంలోనూ ఉంది.

వాళ్ళు చెప్పింది నిజమేనని ఒప్పుకున్నా కూడా, ప్రజాపతి వాళ్ళ అభిప్రాయాన్ని కొంచెంగా  సరిదిద్దాలనుకున్నాడు. కాని ఆ సరిదిద్దటం ప్రత్యక్షంగా చేయకుండా, పరోక్షంగా చేయాలనుకున్నాడు. ముఖాముఖి మీరు తప్పు అని చెపితే రాజుల గర్వం భంగపడవచ్చని, ఒక ప్రయోగం ద్వారా విశదీకరించాలనుకున్నాడు.

**అష్టమః ఖణ్డః (8)**

**ఉదశరావ ఆత్మానమవేక్ష్య యదాత్మనో న విజానీథస్తన్మే ప్రబ్రూతమితి। తౌ హోదశరావేఽవేక్షాఞ్చక్రాతే తౌ హ ప్రజాపతిరువాచ కిం పశ్యథ ఇతి తౌ హోచతుః సర్వమేవేదమావాం భగవ ఆత్మానం పశ్యావ ఆ లోమభ్య ఆ నఖేభ్యః ప్రతిరూపమితి ॥1॥ తౌ హ ప్రజాపతిరువాచ సాధ్వలంకృతౌ సువసనౌ పరిష్కృతౌ భూత్వోదశరావేఽవేక్షేథామితి తౌ హ సాధ్వలఙ్కృతౌసువసనౌ పరిష్కృతౌ భూత్వోదశరావేఽవేక్షాంచక్రాతే తౌ హ ప్రజాపతిరువాచ కిం పశ్యథ ఇతి ॥2॥ తౌ హోచతుర్యథైవేదమావాం భగవస్సాధ్వంలకృతౌ సువసనౌ పరిష్కృతౌ స్వ ఏవమేవేమౌ భగవః సాధ్వలంకృతౌ సువసనౌ పరిష్కృతావిత్యేష ఆత్మేతి హోవాచైత దమృతమభయమేతద్బ్రహ్మేతి । తౌ హ శాన్తహృదయౌ ప్రవవ్రజతుః ॥3॥ తౌ హాన్వీక్ష్య ప్రజాపతిరువాచా నుపలభ్యాత్మానమననువిద్య వ్రజతో యతర ఏతదుపనిషదో భవిష్యన్తి దేవా వాఽ సురా వా తే పరాభవిష్యన్తీతి । స హ శాన్తహృదయ ఏవ విరోచనోఽసురాఞ్జగామ తేభ్యో హైతాముపనిషదం ప్రోవాచాత్మైవేహ మహయ్య ఆత్మా పరిచర్య ఆత్మానమేవేహ మహయన్నాత్మానం పరిచరన్నుభౌ లోకావవాప్నోతీమం చాముం చేతి ॥4॥ తస్మాదప్యద్యేహా దదానమశ్రద్ధధానమయజమానమాహురాసురో బతేత్యసురాణాగ్ం హ్యేషోపనిషత్ప్రేతస్య శరీరం భిక్షయా వసనే నాలంకారేణేతి సగ్ంస్కుర్వన్త్యేతేన హ్యముం లోకం జేష్యన్తో మన్యన్తే ॥5॥**

ప్రజాపతి వాళ్ళకొక ప్రయోగం చేసి చూపించబోతున్నాడు. నీళ్ళు నిండుగా ఉన్న ఒక పెద్ద పాత్రను తెప్పించాడు. ముందు ఆ ప్రయోగం సారాంశం చూద్దాము.

ప్రజాపతి వాళ్ళను ముందు నీటిలో వాళ్ళ ప్రతిబింబం చూసుకోమన్నాడు. అప్పుడు వాళ్ళ ఛాయాశరీరాన్ని చూశారు. అది అక్షిపురుషుడు, అదే ఆత్మ అన్నారు. ఇప్పుడు వాళ్ళను రాచరికపు దుస్తులు వేసుకుని, గడ్డం, గోళ్ళు తీయించి, మళ్ళీ నీళ్ళలో చూడమన్నాడు. ఇప్పుడూ ప్రతిబింబం కనిపిస్తోంది, కాని మొదటి ప్రతిబింబానికీ, ఇప్పటి ప్రతిబింబానికీ తేడా ఉంది. అందువల్ల ప్రతిబింబ శరీరం సవికారం అని తెలుసుకుంటారు. సవికారం అంటే మార్పు చెందేది. ఆత్మ నిర్వచనం ఏం చెప్పాడు?

**ఏతదమృతమభయమేతద్బ్రహ్మేతి**
**య ఏషోఽక్షిణి పురుషో దృశ్యత ఏష ఆత్మేతి**
అన్నాడు ముందు వాక్యంలో. ఇది ఒక మహా వాక్యం.
**ఏతద్ ఆత్మ = ఏతద్ బ్రహ్మ**
**అక్షి పురుషుడు = నిర్వికారి, అమృతబ్రహ్మ**

ఛాయాశరీరం సవికారం, అక్షిపురుషుడు నిర్వికారం అని ఈ ప్రయోగం ద్వారా తెలుసుకుంటారని ఆశించాడు ప్రజాపతి. కాని ఇంద్రుడు, విరోచనుడు అది గ్రహించలేదు. శరీరమే ఆత్మ అనుకున్నారు. ఈ ప్రయోగం తాత్పర్యం ఇది. ఇది సంభాషణల పరంపరగా ఇవ్వబడింది.

**మంత్రం-1** ఇప్పుడు మంత్రాలు చూద్దాము. ఇప్పుడు ప్రజాపతి ఇంద్రుడిని, విరోచనుడిని సంబోధిస్తున్నాడు. నీరున్న ఒక పెద్ద పళ్ళెం వాళ్ళముందు పెట్టబడి ఉన్నట్టుగా ఊహించుకోవాలి.

**ఉదశరావ ఆత్మానమవేక్ష్య-** ఓ ఇంద్రా! విరోచనా, అక్షి పురుష ఆత్మను ఈ నీటి పళ్ళెంలో చూచుదురు గాక!

**యదాత్మనో న విజానీథ-** చూశాక, ఒకవేళ మీకు ఏమైనా సందేహముంటే;

**తన్మే ప్రబ్రూతమితి-** నాకు మీ సందేహం చెప్పండి. ఇంద్రుడు, విరోచనుడు ఏం చేశారు?

**తౌ హోదశరావేఽవేక్షాఞ్చక్రాతే -** నీటిలో చూశారు, వాళ్ళ ప్రతిబింబం కనబడింది. ఛాయాశరీరం ఆత్మ అనే నిశ్చయానికి మళ్ళీ వచ్చారు. వాళ్ళకేం సందేహం రాలేదు.

**తౌ హ ప్రజాపతిరువాచ-** వాళ్ళేం సందేహం చూపకపోయేసరికి, ప్రజాపతే వాళ్ళిద్దరినీ అడిగాడు. ఏమని?

**కిం పశ్యథ ఇతి-** ఏం చూస్తున్నారు?

**తౌ హోచతుః -** వాళ్ళిద్దరూ జవాబు చెప్పారు. ఏమని?

**సర్వమేవేదమావాం భగవ ఆత్మానం పశ్యావ ఆ లోమభ్య ఆ నఖేభ్యః ప్రతిరూపమ్ -** ప్రతిరూపం చూస్తున్నాము. దేని ప్రతిరూపం? మొత్తం నా శరీరం, రెండో అతని శరీరం కూడా చూస్తున్నాము. ఆ ప్రతిరూపం ఎంత స్పష్టంగా ఉందంటే, తల మీద ఉన్న జుట్టు నుంచి, చేతివేళ్ళ గోళ్ళ వరకూ కనిపిస్తోంది. (కాళ్ళు చెప్పలేదు ఎందుకంటే అది నీటి పళ్ళెం మాత్రమే.

కొంతభాగమే కనిపిస్తుంది). ఆ ప్రతిబింబం ఎలా ఉంది?
యథ ఆత్మానం పశ్యావ- అక్షరాలా మా శరీరం ఎలా ఉందో, అలా ఉంది. తథా ప్రతిరూపం పశ్యావ- అంటే ప్రతిబింబ శరీరం, బింబ శరీరంలా ఉంది. ఇక్కడ ఆత్మ అంటే ఆత్మకాదు, బింబ శరీరం.
**ఇతి-** ఈ విధంగా జవాబు చెప్పారు. వాళ్ళ అవగాహన ఏమిటి? ప్రతిబింబ శరీరం ఆత్మ. ప్రయోగం కొనసాగుతున్నది.
**మంత్రం-2 తౌ హ ప్రజాపతిరువాచ -** వాళ్ళిద్దరితో ప్రజాపతి అన్నాడు. **తసాధ్వలంకృతౌ సువసనౌ పరిష్కృతౌ భూత్వా -** మీరు చక్కగా అలంకరించుకుని, మంచి వస్త్రాలు ధరించి, జుట్టు గోళ్ళను తీయించి రండి.
**ఉద శరావేఽ వేక్షేథాఙ్కృతామితి -** మళ్ళీ నీటి పళ్ళెంలో చూడండి.
**తౌహ సాధ్వలఙ్కృతౌ సువసనౌ పరిష్కృతౌ భూత్వోదశరావేఽ వేక్షాంచక్రాతే-** వాళ్ళు అలాగే చేశారు అని తేలిగ్గా చెప్పి ఉండవచ్చు. కాని ఉపనిషత్తు పై మాటలన్నింటినీ మళ్ళీ తిరిగి చెప్పింది. వాళ్ళిద్దరూ అలాగే చక్కగా అలంకరించుకుని, మంచి వస్త్రాలు ధరించి, జుట్టు గోళ్ళు తీయించి వచ్చి, మళ్ళీ నీటి పళ్ళెంలో చూశారు.
**తౌ హ ప్రజాపతిరువాచ కిం పశ్యథ ఇతి -** మళ్ళీ వాళ్ళను ప్రజాపతి అడిగాడు. ఏం చూస్తున్నారు అని.ఏం చూశారో, తర్వాత వచ్చే మంత్రంలో వస్తుంది.
**మంత్రం-3 తౌ హోచతుః -** ఏం చూస్తున్నారు ప్రశ్నకు, వాళ్ళు జవాబు చెప్తున్నారు. ఏమని?
**యథైవేదమావాం భగవస్సాధ్వలంకృతౌ సువసనౌ పరిష్కృతౌ -** స్వ ఆవాం అంటే మేమిద్దరం. మేమిద్దరం ఎలాగైతే చక్కగా అలంకరించుకుని, మంచి వస్త్రాలు ధరించి, జుట్టు గోళ్ళు తీయించుకుని ఉన్నామో, **ఏవమేవేమౌ భగవః సాధ్వలంకృతౌ సువసనౌ పరిష్కృతా మితి** అక్షరాలా అలాగే మా ప్రతిబింబం కూడా చక్కగా అలంకరించబడి, మంచి వస్త్రాలు ధరించబడి, జుట్టు, గోళ్ళు తీయించబడినవిగా ఉన్నాయి.

ముందే చూసినట్టుగా, దీని బట్టి వాళ్ళకేమర్థమవాలి? ప్రతిబింబం మారుతున్నది, అది సవికార, ఛాయాశరీరం కాని వాళ్ళు నేర్చుకున్నది అక్షి పురుషుడు నిర్వికారం, అమృతం అని కదా! అందువల్ల ఛాయాశరీరం అక్షి పురుషుడు ఎలా అవుతుంది అనే సందేహం రావాలి. ఆ ప్రశ్నను గురువును

అడగాలి. కాని వాళ్ళకేం సందేహం రాలేదు. వాళ్ళు అంతకన్నా లోతుగా వెళ్ళేందుకు వాళ్ళ బుద్ధి సూక్ష్మంగా లేదు. అలాంటప్పుడు అప్పుడు వాళ్ళకు ఏదైనా చెప్పినా లాభం లేదు. వాళ్ళ మాయలో వాళ్ళను ఉండనీ అనుకున్నాడు ప్రజాపతి. అందుకని ప్రజాపతి వాళ్ళతో ఇదే ఆత్మ అన్నాడు.

**ఏష ఆత్మేతి హోవాచైతదమృతమభయమేతద్బ్రహ్మేతి–** ఏష అనే సర్వనామం అస్పష్టంగా వాడాడు ప్రజాపతి. ఆయన ఉద్దేశంలో అది అక్షిపురుషుడు, వాళ్ళ ఉద్దేశంలో ఛాయాశరీరం ఆత్మ. కాని తర్వాత వాళ్ళకు సందేహం వస్తుందిలే అనుకున్నాడు ప్రజాపతి.

**తౌ హ శాన్త హృదయౌ ప్రవవ్రజతుః –** ప్రజాపతి తృప్తి చెందలేదు కాని, ఇంద్రుడు, విరోచనుడు ఆత్మను అర్థం చేసుకున్నామన్న ఆనందంతో తిరుగుప్రయాణం పట్టారు. వాళ్ళ ఉద్దేశ్యంలో ఆత్మ ఏమిటి? ఛాయ, ప్రతిబింబం! ఎవరిలోకాలకు వాళ్ళు ప్రయాణమయ్యారు. కథ ఇంతటితో ముగియలేదు.

**మంత్రం – 4** ఇంద్రుడు, విరోచనుడు వాళ్ళు పొందిన మిడిమిడి జ్ఞానానికే మురిసిపోయి, ప్రజాపతిని వదిలి కొంతదూరం ప్రయాణించారు.

**తౌహాన్వీక్ష్య ప్రజాపతిరువాచ–** వాళ్ళను అల్లంతదూరంలో చూస్తూ, ప్రజాపతి స్వగతంలో బాధపడ్డాడు. ఏమని?

**అనుపలభ్యాత్మానమననువిద్య వ్రజతః–** వీళ్ళు ఆత్మను సరిగ్గా అర్థం చేసుకోకుండా, ఆత్మను పొందకుండా వెళ్ళిపోతున్నారు. దాని ఫలితమేమిటి? వాళ్ళు మోక్షాన్ని పొందలేరు. సంసారులుగానే ఉండిపోతారు.

**యతర ఏతదుపనిషదో భవిష్యన్తి దేవా వాఽసురా వా–** దేవతలు కాని, అసురులు కాని, ఏ జాతికి చెందిన వాళ్ళైనా ఇటువంటి ఆత్మ విద్యను పొందితే.

**తే పరాభవిష్యన్తీతి–** ఖచ్చితంగా వాళ్ళు జీవితంలో పరాభవాన్ని పొందుతారు. ఉపనిషత్తు అంటే ఇక్కడ ఆత్మవిద్య. వాళ్ళు నేర్చుకున్న తప్పుడు ఆత్మ విద్య తక్కిన వాళ్ళకు బోధించటం వల్ల వాళ్ళు కూడా అవస్థ పడతారు. అంటే మోక్షం పొందరు.

ప్రజాపతి ఇది స్వగతంగా అనుకున్నా, వాళ్ళిద్దరిలో ఎవరూ వినలేదు. ఎందుకంటే వాళ్ళు నేర్చేసుకున్నామనే ఉత్సాహంతో ఉవ్విళ్ళూరుతున్నారు.

అందుకని వాళ్ళు ముందుకే సాగిపోయారు. ఇక్కడ్నుంచి వాళ్ళ దారులు రెండుగా చీలుతాయి. ముందు విరోచనుడి పరిస్థితి చూస్తాము. ఏం చేశాడు అతను?

**సహ శాన్త హృదయ ఏవ విరోచనః –** ఇంతవరకూ ఇద్దరి గురించీ చూశాము– ఇప్పుడు ఒక్క విరోచనుడి గురించి చూస్తాము. సంతృప్తి చెందిన విరోచనుడు ఏం చేశాడు?

**అసురాఞ్జగామ తేభ్యో హైతాముషనిషదం ప్రోవాచ–** తన అసుర రాజ్యానికి తిరిగివెళ్ళాడు. కాకపోతే, దారి మధ్యలో తను నేర్చుకున్నదాన్ని తిరిగి ఆలోచించుకుని, తను అర్థం చేసుకున్నదాన్ని కొంచెం మార్చుకున్నాడు. ఏమని?

ప్రజాపతి వాళ్ళను మొదట నీళ్ళలో చూడమన్నాడు, మళ్ళీ రెండోసారి నగలు అవీ వేసుకుని చూడమన్నాడు, దాన్ని విరోచనుడు మళ్ళీ ఆలోచిస్తే అతనికి తట్టిన అద్భుతమైన ఆలోచన ఇది. ప్రజాపతి నీటిలో ప్రతిబింబాన్ని మార్చటానికి, నగలూ అవీ ప్రతిబింబానికి వేయమనలేదు కదా, బింబ శరీరానికి వేయమన్నాడు. అందువల్ల అసలు బింబ శరీరం ఎలా ఉంటే, ఛాయాశరీరం దానిలా ఉంటుంది. అంటే ఏమిటి? ఆత్మ ఛాయాశరీరం కాదు. ఆత్మ బింబ, స్థూల శరీరం. అతను చేసుకున్న మార్పు ఇదీ.

ఎక్కడ్నుంచీ ఎక్కడికి ఎదిగాడు? ఆత్మ స్థూల శరీర ప్రతిబింబం అనుకునే స్థాయి నుంచి **ఆత్మ స్థూల శరీరం** అనుకునేస్థాయికి ఎదిగాడు. అందువల్ల అసురుల రాజైన విరోచనుడు సూక్ష్మశరీరాన్ని, కారణ శరీరాన్ని నమ్మలేదు. ఆత్మ లేదా నేను అంటే శరీరం. అంతే! అందువల్ల శరీరం పడిపోతే, ఆత్మ కూడా పడిపోతుంది. ఆత్మ మరణం తర్వాత లేదు. దీన్ని **అసుర దర్శనం** అంటారు.

అసుర దర్శనం అంటే ఏమిటి? స్థూల శరీరమే ఆత్మ, పుణ్యపాపాలు అంటవు. మరణం తర్వాత ఏమీ మిగలదు. ఏమీ మిగలదు కాబట్టి ప్రయాణం లేదు, పునర్జన్మ లేదు. స్వర్గనరకాలు లేవు. శ్రాద్ధకర్మలు లేవు. ఇవన్నీ మరణం తర్వాత ఆత్మ ఉంది అనేవాళ్ళకు. కాని అసురులు దాన్ని నమ్మరు. ఆ విధంగా విరోచనుడు దేహాత్మ వాది అయ్యాడు. ఇటువంటి జ్ఞానంతో తన లోకం చేరుకున్నాడు.

అతని జ్ఞానం ఏమిటి? – స్థూలశరీరం ఆత్మ.

విరోచనుడు ప్రజాపతి దగ్గరకు ఏ ఉద్దేశంతో వెళ్ళాడు? తను, తన అసురులందరి తరుపున నేర్చుకుని, వెనక్కి వెళ్ళి వాళ్ళకు నేర్పించాలి. తనే సరిగ్గా అర్థం చేసుకోలేదు. ఆ తప్పుగా అర్థం చేసుకున్నదాన్నే వాళ్ళకు కూడా నేర్పించాడు.

తేభ్యో హైతాముపనిషదం ప్రోవాచ– అతను అతని ఉపనిషత్తును బోధించాడు. ఏమిటది? **దేహాత్మవాదన లేదా చారువాక దర్శనం.**

**ఆత్మైవేహ మహయ్య –** ఈ శరీరమే ఆత్మ. అందుకని ఇది చాలా అపురూపమైనది. దీన్ని భగవానునిగా కొలవాలి.

**ఆత్మా పరిచర్య ఆత్మానమేవేహమ్–** అందుకని ఆత్మకు పరిచర్యలు చేయాలి. ఆత్మయే సేవించదగనది. ఆత్మ అంటే ఇక్కడ సచ్చిదానంద ఆత్మ కాదు. శరీరం అనే విషయం మర్చిపోకూడదు. (ఇదంతా విరోచనుడి బోధ)

**మహయన్నాత్మానం పరిచరన్నుభౌ లోకావవాప్నోతీమం చాముం చేతి –** ఎవరైతే ఆత్మను పూజించి, ఆత్మను సేవిస్తాడో, అతను ఇహలోక, పరలోక సుఖాలు పొందుతాడు. ఇమం అంటే ఈ లోకంలో. శరీరాన్ని ఆత్మగా కొలుస్తాడు కాబట్టి ఇక్కడ ఆనందంగా ఉంటాడు. అముంచ అంటే పరలోకం. అసురులు పరలోకాన్ని నమ్మరు. ఒకవేళ ఉంటే, అందులో కూడా ఆనందంగా ఉంటాడు అని బోధించాడు.

**మంత్రం–5 తస్మాదప్యద్యేహాత్** ఎప్పుడైతే ఒక వ్యక్తి మరణం తర్వాత ఆత్మ ఉంది, సూక్ష్మశరీరంతో పాటు అది ప్రయాణిస్తుంది అని నమ్మడో,సహజంగానే అతనికి వైదిక కర్మలు, పితృతర్పణాలు, శ్రాద్ధకర్మలు అనవసరంగా అనిపిస్తాయి. పితృదేవతలు ఉన్నారో లేదో; ఉన్నారో లేదో తెలియని వారి మీద ఖర్చుపెట్టే బదులు ఏ అనాథాశ్రమంలో డబ్బులు ఇవ్వచ్చు కదా లాంటి వాదనలు తరచూ వినబడుతూ ఉంటాయి. ఇలాంటి వాళ్ళు వేద పూర్వభాగాన్ని నమ్మరు. ఏం చేస్తున్నారు వారు?

**అశ్రద్దధానమ్ –** వాళ్ళకు వేదాల మీద శ్రద్ధ లేదు. వేదాల మీద శ్రద్ధతో చేసినదాన్ని శ్రాద్ధ కర్మ అంటారు.

**అయజమానమ్ –** వాళ్ళకు శ్రాద్ధకర్మల మీద నమ్మకం లేదు కాబట్టి, యజ్ఞాలు చేయరు. యజ్ఞాలు చేసేవారిని యజమాని అంటారు.

**అదదానమ్ –** దక్షిణ కూడా ఇవ్వరు. బ్రాహ్మణులకు దక్షిణ ఇచ్చే బదులు వేరే ఎవరికన్నా ఇవ్వచ్చు అంటారు. వీళ్ళకు మంచితనం ఉంటుంది, తోటివారికి సహాయపడతారు. కాని శ్రాద్ధకర్మలు చేయరు. వేదాలను నమ్మరు, ఇలాంటి వారిని ఏమంటున్నది ఉపనిషత్తు?

**ఆహురాసురోబతేతి –** అసురులు అంటారు. ఎందుకంటే వీళ్ళు విరోచనుడి పరంపరలోకి వస్తారు. బత అంటే దురదృష్టం! ఇటువంటి అసురులు ఎంత దురదృష్టవంతులు!

**అసత్యమప్రతిష్ఠం తే జగదాహురనీశ్వరమ్।**
**అపరస్పరసంభూతం కిమన్యత్ కామహైతుకమ్॥**
**ఏతాం దృష్టిమవష్టభ్య నష్టాత్మానోఽల్పబుద్ధయః।**
**ప్రభవంత్యుగ్రకర్మాణః క్షయాయ జగతోఽహితాః॥ – గీత**

ఆసురీ బుద్ధి ఉన్న వాళ్ళను విమర్శిస్తూ అనేక శ్లోకాలు ఉన్నాయి. వాటికి అధారం ఈ మంత్రమే.

**త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః।**
**కామః క్రోధస్తథా లోభః తస్మాదేతత్త్రయం త్యజేత్॥** గీత **16-21**

ఈ అసురులు సరాసరి నరకానికి పోతారు. మధ్యలో కూడా ఎక్కడా ఆగరు.

**అసురాణాగ్ం హ్యేషోపనిషత్–** ఈ వ్యావహారిక సిద్ధాంతాన్ని అసుర ఉపనిషత్తు అంటారు. ఇది కూడా ఒక ఉపనిషత్తు.

వాళ్ళు స్థూలశరీరమే ముఖ్యం అనుకుంటారు కాబట్టి, మరణానంతర ప్రయాణం లేదనుకుంటారు కాబట్టి, వాళ్ళు ఒక వ్యక్తి చనిపోయినప్పుడు అతని శరీరానికి అలంకరణ చేస్తారు.

**ప్రేతస్య శరీరం భిక్షయా–** ఎవరైనా చనిపోతే, అప్పుడు శరీరానికి ప్రాముఖ్యతనిస్తూ, ఆర్భాటం చేస్తారు. భిక్ష అంటే అన్నం కాదు. సుగంధాలు చల్లి మాలలతో అలంకరిస్తారు.

**వసనేనాలంకారేణేతి సగ్ంస్కుర్వన్తి–** అసాధారణమైన వస్త్రాలు వేసి, అలంకారాలు చేస్తారు. ఇవన్నీ ప్రాణం లేని స్థూలశరీరానికి. ఎందుకలా చేస్తారు?

**ఏతేన హ్యముం లోకం జేష్యన్తో మన్యన్తే-** ఇక్కడ జాగ్రత్తగా ఉండాలి. ఈ మాటలు అక్షరాలా తీసుకుంటే, 'జీవుడు, ఊర్ధ్వలోకాలకు వెళతాడు'. కాని అసురులు ఊర్ధ్వలోకాలను నమ్మరు. అందుకని 'వెళ్ళినట్టుగా' అని అర్థం తీసుకోవాలి. అముంలోకం. అంటే మరణించిన జీవికి ఈ మర్యాదలు చేస్తే, అతను ఉన్నతిని పొందుతాడు, అని అనుకుంటారు వాళ్ళు.
దీనితో విరోచనుడు కథ ముగిసింది. ఇప్పుడు ఇంద్రుని పరిస్థితి చూస్తాము.

**నవమః ఖణ్డః (9)**

**అథ హేన్ద్రోఽప్రాప్యైవ దేవానేతద్భయం దదర్శ యథైవ ఖల్వయమస్మిఞ్ఛరీరే సాధ్వలంకృతే సాధ్వలంకృతో భవతి సువసనే సువసనః పరిష్కృతే పరిష్కృత ఏవమేవాయమస్మిన్నంధేఽన్ధో భవతి స్రామే స్రామః పరివృక్ణే పరివృక్ణోఽస్యైవ శరీరస్య నాశమన్వేష నశ్యతి। నాహమత్రభోగ్యం పశ్యామీతి ॥1॥ స సమిత్పాణిః పునరేయాయ తగ్ంహ ప్రజాపతిరువాచ। మఘవన్ యచ్ఛాన్తహృదయః ప్రావ్రాజీస్సార్ధం విరోచనేన కిమిచ్ఛన్ పునరాగమ ఇతి స హోవాచ యథైవ ఖల్వయం భగవోఽస్మిఞ్ఛరీరే సాధ్వలంకృతే సాధ్వలంకృతో భవతి సువసనే సువసనః పరిష్కృతే పరిష్కృతః ఏవమేవాయమస్మిన్నంధేఽన్ధో భవతి స్రామే స్రామః పరివృక్ణే పరివృక్ణోఽస్యైవ శరీరస్య నాశమన్వేష నశ్యతి నాహమత్ర భోగ్యం పశ్యామీతి ॥2॥ ఏవమేవైష మఘవన్నితి హోవాచైతం త్వేవ తే భూయోఽనువ్యాఖ్యాస్యామి। వసాపరాణి ద్వాత్రిగ్ంశతం వర్షాణీతి। స హాపరాణి ద్వాత్రిగ్ంశతం వర్షాణ్యువాస తస్మై హోవాచ ॥3॥**

**మంత్రం-1 అథ హేన్ద్రః -** విరోచనుడి తర్వాత ఇంద్రుడి గురించి చెపుతున్నది. **అప్రాప్యైవ దేవానేతద్భయం దదర్శ -** అతను ఇంద్రలోకం చేరకుండానే, తను నేర్చుకున్న విషయాన్ని సింహావలోకనం చేసుకున్నాడు. అందులో అతనికి దోషం కనబడింది. భయం అంటే ఇక్కడ దోషం. అతని విశ్లేషణ ఈ విధంగా సాగింది.

ప్రతిబింబ శరీరమే ఆత్మ అనుకున్నాడు తను! ఏమిటా ప్రతిబింబం? తను నీళ్ళలో చూసిన ప్రతిబింబం. ఒకసారి చూస్తే ఒకలా ఉంది, ఇంకోసారి చూస్తే పూర్తిగా మారిపోయింది. అలంకారాలతో శుభ్రంగా ఉంది. అలా

అయితే, మార్పులకు లోనయ్యే ప్రతిబింబ శరీరం, మారని ఆత్మ ఎలా అవుతుంది? ఆత్మ గురించి ప్రజాపతి ఏం చెప్పాడు?

**య ఏషోఽక్షిణి పురుషో దృశ్యత ఏష ఆత్మేతి హోవాచైతదమృ తమభయమేతద్బ్రహ్మేతి (8-7-4)**

అలాంటప్పుడు సవికార ప్రతిబింబ శరీరం నిర్వికార ఆత్మ ఎలా కాగలదు? నేనెలా ప్రతిబింబ శరీరం ఆత్మ అనుకున్నాను? ప్రతిబింబాన్ని మరింతగా విశ్లేషించాడు.

**యథైవ ఖల్వయమస్మిఞ్ఛరీరే సాధ్వలంకృతే సాధ్వాలంకృతో భవతి–** ఈ శరీరాన్ని చక్కగా అలంకరించుకుంటే, అది కూడా చక్కగా అలంకరించినట్టుగా కనిపించింది.

**సువసనే సువసనః –** మంచి వస్త్రాలు వేసుకుంటే, దానిక్కూడా మంచి వస్త్రాలు ఉన్నాయి.

**పరిష్కృతే పరిష్కృతః –** ఈ శరీరానికి జుట్టు, గోళ్ళు తీసివేస్తే, ప్రతిబింబానికి కూడా జుట్టు, గోళ్ళు తీసివేసినట్టుగా ఉంది.

ఎందుకు ప్రతి పదమూ రెండుసార్లు వాడబడింది? మొదటి పదం బింబ శరీరానికి; రెండో పదం ప్రతిబింబ శరీరానికి. దానివల్ల తేలిందేమిటి? ప్రతిబింబ శరీరం మార్పులకు లోనవుతుంది. అంతేకాదు **ఏవమేవాయమస్మిన్నంధేఽన్ధో భవతి –** అదే విధంగా, ఈ శరీరం గుడ్డిది అయితే ప్రతిబింబం కూడా గుడ్డిది అవుతుంది.

**స్రామే స్రామః –** ఒక కన్నులో దోషం ఉంటే, ప్రతిబింబానికి కూడా ఒక కన్నులో దోషం ఉంటుంది.

**పరివృక్ణే పరివృక్ణః –** శరీరానికి దెబ్బతగిలితే, ప్రతిబింబానికి కూడా దెబ్బ తగులుతుంది.

**అస్యైవ శరీరస్య నాశమన్వేష నశ్యతి –** చివరికి, బింబ శరీరం నాశనమయితే, ప్రతిబింబం కూడా నశిస్తుంది. ఆత్మ లక్షణమేమిటి?

అమృతం, అభయం. అలాంటప్పుడు ఇంత చిన్న విషయం తనెలా అర్థం చేసుకోలేకపోయాడు? దానితో తన తప్పు గ్రహించాడు.

**నాహమత్ర భోగ్యం పశ్యామీతి–** ఇటువంటి ఆత్మవిద్యలో నాకేం లాభం కనపడటం లేదు. భోగ్యం అంటే ప్రయోజనం లేదా ఫలం. అతను పొందిన

ఆత్మవిద్య ఏమిటి? **ప్రతిబింబ శరీరం ఆత్మ.** ఇది లాభం లేదు.

ఇక్కడ గొప్ప విషయం ఏమిటంటే, ఇంద్రుడు ప్రజాపతిని నిందించలేరు. తనే సరిగ్గా అర్థం చేసుకోలేదు అనుకున్నాడు. అందుకని ప్రజాపతి దగ్గరకు మళ్లీ వెళ్ళి, మళ్ళీ ఆత్మవిద్య బోధించమని అడుగుతాననుకున్నాడు. దీన్నే శ్రద్ధ అంటారు. ఏదైనా సరిగ్గా అర్థం కాకపోతే శాస్త్రాన్నో, దాన్ని నేర్పించిన గురువునో నిందించకుండా నేనే పొరపాటుగా అర్థం చేసుకున్నాను అనుకోగలగటమే శ్రద్ధ. నాకు సరిగ్గా అర్థం కాకపోతే ఒకసారి కాదు, రెండుసార్లు కాదు, మూడుసార్లు కాదు, ఎన్నిసార్లైనా నేర్చుకుంటాను. మళ్ళీ మళ్ళీ శ్రవణం చేస్తాను. శాస్త్రం చెప్పింది నాకు నిస్సంశయ జ్ఞానం కలిగించే వరకూ నేర్చుకుంటాను అనుకోవాలి. అటువంటి శ్రద్ధను ఇంద్రునిలో చూస్తాము ఇక్కడ. మళ్ళీ ప్రజాపతి దగ్గరకు వెళ్ళాడు.
**మంత్రం-2 స సమిత్పాణిః –** న అంటే ఆ ఇంద్రుడు. తను తప్పుగా అర్థం చేసుకున్నానని అర్థం చేసుకున్నవాడు. తప్పుగా అర్థం చేసుకున్నానని అర్థం చేసుకోవటమే సరిగ్గా అర్థం చేసుకోవటం. మళ్ళీ సమిధలు తీసుకుని వెళ్ళాడు. ఎక్కడికి?
**పునరేయాయ–** ప్రజాపతి దగ్గరకు మళ్ళీ వచ్చాడు. ప్రజాపతికి చాలా ఆనందం వేసింది. వాళ్ళు సరిగ్గా అర్థం చేసుకోకుండా వెళ్ళిపోతున్నప్పుడు, ప్రజాపతి బాధపడ్డాడు కదా! వాళ్ళు అలా అర్థం చేసుకుంటే అవస్థ పడతారు, మోక్షం రాదు అనికూడా అనుకున్నాడు! అందుకని ఒక్కరన్నా తిరిగి వచ్చాడని సంతోషించాడు. కాని ఎందుకు వచ్చాడో, అతని నోటి నుంచి తెలుసుకునేదాకా ఆగాలనుకున్నాడు.
**తగ్ం హ ప్రజాపతిరువాచ మఘవన్ యచ్ఛాన్తహృదయః ప్రావ్రాజీస్సార్ధం విరోచనేన కిమిచ్ఛన్ పునరాగమ ఇతి –** మఘవన్ అంటే ఇంద్రుడు. ప్రజాపతి ఇంద్రుడిని ప్రశ్నించాడు, 'ఓ మఘవన్, నువ్వూ, విరోచనుడూ పూర్తిగా తృప్తి చెంది వెళ్ళారు కదా, ఇప్పుడు మళ్ళీ ఎందుకు తిరిగివచ్చావు?' ఈ విధంగా ప్రజాపతి ఇంద్రుడిని ప్రశ్నించాడు.
**సహోవాచ–** ఇంద్రుడేం చెప్పాడు?
**యథైవ ఖల్వయం.... పశ్యామీతి–** తాను వెనక్కి తిరిగి వెళ్తున్నప్పుడు తనలో కలిగిన విశ్లేషణను మళ్ళీ అక్షరం పొల్లుపోకుండా వివరించాడు.

ఇదంతా మొదటి మంత్రంలో చూశాము. దీని సారాంశం ఏమిటి?

ప్రతిబింబ శరీరం ఆత్మ కాదు. బింబ శరీరం మారినప్పుడల్లా ప్రతిబింబ శరీరం మారుతున్నది. సవికార ప్రతిబింబ శరీరం నిర్వికార ఆత్మ కాదు. అదే సూత్రాన్ని బింబ శరీరానికి కూడా వర్తింపజేస్తే బింబ శరీరం కూడా వికారాలు చెందుతున్నది. ఒక కన్ను పోవచ్చు, రెండు కళ్ళు పోవచ్చు, శరీరానికి దెబ్బ తగలవచ్చు, శరీరం చివరికి రాలిపోవచ్చు. ఇలా మార్పులు చెందే, అశాశ్వతమైన శరీరం ఆత్మ కాదు.

ప్రతిబింబ శరీరం ఆత్మ కాదు
బింబ శరీరం కూడా ఆత్మ కాదు
అక్షి పురుషుడు శరీరం కాదు

అక్షి పురుషుని అసలు స్వరూపం నాకు అర్థం కాలేదు అన్నాడు.

అక్షి పురుషుని అసలు స్వరూపం - సర్వవ్యాపకం, శాశ్వతం, అసంగం అయిన చైతన్యం. వేరేగా చెప్పాలంటే విశ్వ. విశ్వ వాచ్యార్థం జీవాత్మ, లక్ష్యార్థం పరమాత్మ. అందువల్ల వాచార్థ్య విశ్వద్వారా, లక్ష్యార్థ పరమాత్మను బోధించాడు ప్రజాపతి. కాని ఇంద్రుడు దాన్ని అందు కోలేకపోయాడు. అందుకే దానిలో నాకేం ఫలం కనబడలేదు అన్నాడు. ప్రజాపతి అలాగే చెప్తానన్నాడు. ఇప్పుడు విశ్వగా చెప్పడు, తైజసగా చెప్తాడు.

**మంత్రం-3 ఏవమేవైష మఘవన్నితిహోవాచ-** నువ్వు అర్థం చేసుకున్నది నిజమే. అంటే నువ్వు తప్పుగా అర్థం చేసుకున్నావని అర్థం చేసుకున్నది నిజమే.

ఛాయశరీరం (ప్రతిబింబ శరీరం) ఆత్మ కాదు.
బింబ శరీరం కూడా ఆత్మ కాదు.
అక్షిపురుషుడు కూడా ఆత్మ కాదు.

ఆరవ అధ్యాయంలో గురువు 'తత్త్వమసి' అని చెప్పినప్పుడు కూడా,నువ్వు అంటే స్థూల శరీరం కాదు. అంతేకాదు సూక్ష్మ, కారణ శరీరాలు కూడా కాదు. నువ్వు అంటే శరీరత్రయమంతటా వ్యాపించిన చైతన్యం.

**ఏతం త్వేవ తే భూయోనువ్యాఖ్యాస్యామి -** నేను ఈ ఆత్మ గురించి మళ్ళీ చెప్తాను. కాని ఒక షరతు!

**వసాపరాణి ద్వాత్రిగ్ం శతం వర్షాణీతి-** మళ్ళీ నువ్వొక 32 సంవత్సరాలు

నాదగ్గర ఉండి, శుశ్రూష చేయాలి. మళ్ళీ అని ఎందుకన్నాడు? మొదటిసారి వెళ్లగానే ఇంద్రుడు, విరోచనుడు 32 సంవత్సరాలు ప్రజాపతి దగ్గర ఉన్నారు. ఇంద్రుడేం చేశాడు? వేరే మార్గం లేదు.

**స హాపరాణి ద్వాత్రిగ్ంశతం వర్షణ్యువాస-** అలాగే 32 సంవత్సరాలు ఉన్నాడు.

**తస్మై హోవాచ-** ఆ ఇంద్రునితో ప్రజాపతి చెప్పాడు. ఇక్కడిదాకా మొదటిపాదం అయింది.

**అక్షిపురుషుడు ఆత్మ**

ఇప్పుడు రెండోపాదంలోకి అడుగుపెడుతున్నాడు.

**దశమః ఖణ్డః (10)**

**య ఏష స్వప్నే మహీయమానశ్చరత్యేష ఆత్మేతి హోవాచైతదమృత మభయమేతద్బ్రమేతి స హ శాంతహృదయః ప్రవవ్రాజ స హాప్రాప్యైవ దేవానేతద్భయం దదర్శ తద్యద్యపీదగ్ం శరీరమన్ధం భవత్యనంధస్స భవతి యది స్రామమస్రామో నైవైషోఽస్య దోషేణ దుష్యతి॥1॥ న వధేనాస్య హన్యతే నాస్య స్రామ్యేణ స్రామో ఘ్నంతి త్వేవైనం విచ్ఛాదయన్తీవాప్రియవేత్తేవ భవత్యపి రోదితీవ నాహమత్ర భోగ్యం పశ్యామీతి॥2॥ స సమిత్పాణిః పునరేయాయ తగ్ంహ ప్రజాపతిరువాచ మఘవన్ యచ్ఛాంతహృదయః ప్రావ్రాజీః కిమిచ్ఛన్ పునరాగమ ఇతి స హోవాచ తద్యద్యపీదం భగవశ్శరీరమంధం భవత్యనంధస్స భవతి యది స్రామమస్రామో నైవైషోఽస్య దోషేణ దుష్యతి॥3॥ న వధేనాస్య హన్యతే నాస్య స్రామ్యేణ స్రామో ఘ్నంతి త్వేవైనం విచ్ఛాదయన్తీవాప్రియవేత్తేవ భవత్యపి రోదితీవ నాహమత్ర భోగ్యం పశ్యామీతి॥ ఏవమేవైష మఘవన్నితి హోవాచైతం త్వేవ తే భూయోఽనువ్యాఖ్యాస్యామి వసాపరాణి ద్వాత్రిగ్ంశతం వర్షాణీతి స హాపరాణి ద్వాత్రిగ్ంశతం వర్షాణ్యువాస తస్మై హోవాచ॥4॥**

ఇప్పుడు రెండోపాదంలో, రెండో నిర్వచనం వస్తుంది.

**స్వప్నపురుషుడు ఆత్మ.** అక్షి పురుషుడంటే, విశ్వ అని చూశాము. స్వప్న పురుషుడంటే తైజస.

ఈ తైజసే ఆ విశ్వ.

**విశ్వ= తైజస = బ్రహ్మ**

జాగ్రద్ పురుషుడూ, స్వప్నపురుషుడూ ఒకరెలా అవుతారు? వ్యావహారికంగా వాళ్ళు వేరు, వాళ్ళ అనుభవాలు వేరు. కాని శరీరాలపరంగా కాకుండా, ఆ రెండింటి వెనుక ఉన్న చైతన్యాన్ని తీసుకుంటే రెండూ ఒకటే. ఉంగరం, గొలుసు ఒకటేనా కాదా? వాటి నామరూపాలు చూస్తే అవి రెండూ వేరు వేరు. వాటి అధిష్ఠానమైన బంగారం పరంగా చూస్తే ఒకటే. అలాగే జాగ్రద్ పురుషుడూ, స్వప్న పురుషుడూ వాటి అధిష్ఠానమైన చైతన్యం పరంగా చూస్తే రెండూ ఒకటే.

**మంత్రం – 1 – య ఏష స్వప్నే మహీయమానశ్చరత్యేష ఆత్మేతి హోవాచ–** ఈ లక్ష్యార్థాన్ని మనసులో పెట్టుకుని, ప్రజాపతి ఇలా చెప్పాడు. అంతకుముందు స్థూలశరీరంలో ఉన్న ఈ ఆత్మే, ఇప్పుడు స్వప్న శరీరంలో ఉంది. మనం బయటకు వెళితే దుస్తులు మార్చుకున్నట్టుగా, జాగ్రద్ ప్రపంచానికి ఒక బాహ్యమైన వస్త్రం ఉంది. అది స్థూలశరీరం. అలాగే స్వప్న ప్రపంచానికి ఇంకో వస్త్రం ఉంది. అది వాసనామయ స్వప్నశరీరం. ఇది ఆలోచనల వల్ల ఏర్పడిన శరీరం. భౌతిక శరీరం కాదు, వృత్తిమయ శరీరం.

అందువల్ల అదే చైతన్యం ఇప్పుడు స్వప్నశరీరంలో, స్వప్న ప్రపంచంలో ప్రవేశించింది.

**మహీయమానశ్చరతి–** అక్కడ స్వాప్నికుడు తన మహిమను చూపుతాడు. సంకల్ప మాత్రం చేత ఒక స్వప్న ప్రపంచాన్ని సృష్టిస్తాడు. దానికి వాసనలు తోడవుతాయి.

> **జాగ్రదవస్థాయాం యద్దృష్టం యత్ శ్రుతమ్ తజ్జనిత వాసనాయ నిద్రాసమయే యః ప్రపంచః ప్రతీయతే స్వప్నావస్థా.**
> **సూక్ష్మశరీరాభిమానీ ఆత్మతైజస ఇత్యుచ్యతే – తత్త్వబోధ**

కేవలం వాసనల వల్ల స్వప్న ప్రపంచం సృష్టింపబడుతుంది. స్వప్న ప్రపంచం అతనిలోంచి వచ్చిందా, బాహ్యంగా ఉందా? అతను ఒక చిన్న మంచం మీద పడుకుని విశాల ప్రపంచాన్ని దర్శిస్తాడు. అందుకని, అది అతని లోంచే వచ్చింది. స్వప్న శరీరం ద్వారా పనిచేస్తున్న ఈ చైతన్యమే ఆత్మ.

ఈ చైతన్యం స్వప్న శరీరంలో ఒక భాగం కాదు. స్వప్నశరీరం లేకపోయినా చైతన్యం ఉంటుంది. కాకపోతే మాధ్యమం ఉండదు కాబట్టి చైతన్యం తెలియదు. అందుకే ఈ చైతన్యాన్ని అదే చైతన్యం అని చూపటానికి అంతకు ముందు వాడిన మాటలే వాడాడు.

**ఏతదమృతమభయమేతద్బ్రహ్మేతి।**

ఇంద్రుడు ఏమనుకున్నాడు? స్వప్న పురుషుడు ఆత్మ. తైజస – ఆత్మ అనుకున్నాడు.

**సహ శాంతహృదయః ప్రవవ్రాజ–** ఇంద్రుడు శాంతమైన హృదయం కలవాడై వెళ్ళిపోయాడు.

ప్రజాపతి మొదట ఆత్మను అక్షిపురుషునిగా పరిచయం చేశాడు. అక్షిపురుషుడు అనే చైతన్యం, స్థూలశరీరం అనే పాత్రలో ఉంది. చైతన్యం స్థూలశరీరం ద్వారా పనిచేస్తుంది. చైతన్యం వల్లే జాగ్రద్ పురుషుడు వ్యవహారం నడపగలుగుతున్నాడు. అందుకని, శిష్యులు స్థూల శరీరం అనే పాత్రను వదిలేసి, అందులో ఉన్న చైతన్యం అనే పదార్థాన్ని పట్టుకుంటారని ఆశించాడు. కాని ఎప్పుడైతే దాన్ని స్థూలశరీరంతో ముడిపెట్టటం జరిగిందో, స్థూలశరీరమే చైతన్యంగా అపోహపడటం జరిగింది. పాత్రతో తీసుకుంటే చైతన్యానికి పరిమితి వస్తుంది. ప్రజాపతి, వాళ్ళు పాత్రని వదిలి, వస్తువుకు వస్తారనుకున్నాడు కాని వాళ్ళు పాత్ర దగ్గర ఆగిపోయారు.

చిన్మయానంద స్వామి దీని గురించి ఒక ఉదాహరణ ఇస్తారు. గురువు, నాకు ఎక్కిళ్ళు వస్తున్నాయి, నీళ్ళు తీసుకురమ్మని శిష్యుడికి పురమాయిస్తాడు. శిష్యుడు సహజంగా, ఒక గ్లాసులో నీళ్ళను తీసుకువెళతాడు. గురువు కోపంగా, 'నేను అడిగిందేమిటి, నువ్వు చేసిందేమిటి? నీళ్ళు తెమ్మంటే గ్లాసు తెస్తావా?' అన్నాడు. గురువుకేమైంది హఠాత్తుగా అని శిష్యుడు వాపోతాడు. అందువల్ల నీరు కావాలంటే పాత్రలోనే తేవాలి. ఇక్కడ భాగత్యాగ లక్షణం ఉపయోగించి, గ్లాసును పట్టించుకోకుండా, నీటిని మాత్రమే చూడాలి. గ్లాసును తాగము కదా గ్లాసెందుకు అనకూడదు. నీరు గ్లాసులోనే తేవాలి, అడిగిన వ్యక్తి గ్లాసును పట్టించుకోకుండా నీటినే తీసుకోవాలి.

ఇదే సూత్రం చైతన్యానికి కూడా వర్తిస్తుంది. గురువు, ఇదుగో ఇదీ చైతన్యం అని చేతిలో పట్టుకుని చూపించలేదు. అందుకని గురువేం చేయాలి?

గ్లాసులాంటి పాత్రను తీసుకోవాలి. అదే స్థూలశరీరం. అందులో చైతన్యం ఉందా, లేదా? మిమ్మల్ని మీరు గిల్లి చూసుకోండి, మీకే తెలుస్తుంది.

అందువల్ల గురువు చైతన్యాన్ని అక్షిపురుషుడు పేరుతో, స్థూలశరీరంతో చూపాడు. అతనేం చేయాలి? గ్లాసును వదిలి నీటిని చూసినట్టుగా జాగ్రద్ శరీరాన్ని వదిలి, దాన్నినడిపే చైతన్యాన్ని చూడాలి. కాని శిష్యుడేం చేస్తున్నాడు? శరీరాన్ని తీసుకుని, చైతన్యాన్ని వదులుతున్నాడు. దానితో ఆత్మ పరిణామాలకు లోనయ్యేది అయింది.

శిష్యుడికి అర్థం కాలేదని గురువుకు అర్థం అయింది. అందుకని, ఇప్పుడు పాత్రని మార్చి చూపించటానికి ప్రయత్నిస్తున్నాడు. ముందు పాత్ర ఏమిటి? స్థూలశరీరం. ఇప్పటి పాత్ర ఏమిటి? వాసనామయ స్వప్న శరీరం. ఈ శరీరం పాత్రనా, వస్తువా? పాత్రే! ఈ పాత్రలో ఉన్న చైతన్యం పేరేమిటి? స్వప్న పురుషుడు. ఇప్పుడు స్వప్న పురుషుడు అని చెప్పటం ద్వారా శిష్యుడికి రెండు చూపిస్తున్నాడు. స్వప్న శరీరం, చైతన్యం. రెండు చూపించినా శిష్యుడేం చేయాలనుకుంటున్నాడు?

రెండురకాల ఐస్‌క్రీములు ఉన్నాయి. కప్పులో ఐస్‌క్రీమ్ కొంటే ఐస్‌క్రీమ్ తిని కప్పు పారేయాలి. అదే కోన్ ఐస్‌క్రీమ్ కొంటే, కోన్, ఐస్‌క్రీమ్ రెండూ తినాలి. మొదటి ఐస్‌క్రీమ్‌లా చూడాలి. కాని శిష్యుడు ఏం చేస్తున్నాడు? రెండో ఐస్‌క్రీమ్‌లా తీసుకున్నాడు. అక్షిపురుషుడంటే స్థూలశరీరం అనుకున్నాడు; అలాగే స్వప్నపురుషుడంటే స్వప్న శరీరం అనుకున్నాడు. అందువల్ల అనేక స్థాయిలు దాటుకుంటూ రావాలి శిష్యుడు. ఇప్పుడు రెండోస్థాయిలో ఉన్నాడు.

గ్లాసులో నీరు తెస్తే ఏం చేస్తాము? గ్లాసును కూడా పెదవి దాకా తీసుకువెళ్తాము. గ్లాసు, నీరు రెండూ వెళ్తాయి పెదవిదాకా. కాని భాగత్యాగ లక్షణం ద్వారా, గ్లాసును తాగకుండా, నీటిని మాత్రమే తాగుతాము.

అలాగే స్వప్నంలో కూడా చైతన్యం ఉంది. ఆ చైతన్యమే ఆత్మ, ఎటువంటి ఆత్మ? మహీయమానశ్చరతి – మహిమాన్వితమైనది. అంతేకాదు, ఏతదమృత మభయమే తద్బ్రహ్మేతి– అది శాశ్వతం, నిర్వికారం.

కాని ఇంద్రుడు **స్వప్నశరీరమే ఆత్మ** అనుకున్నాడు. శాంతహృదయుడై వెళ్ళిపోయాడు. ఆత్మను, అనాత్మను కలిపాడు. అది మూల అవిద్య వల్ల

జరిగింది. ఆ సంబంధాన్ని విడగొట్టాలి. ఇంద్రుడికి ప్రస్తుతం తెలియదు.
**స హా ప్రాప్యైవ దేవానేతద్భయం దదర్శ–** కాని కథ మళ్ళీ మొదటికి వచ్చింది. తన రాజ్యానికి చేరకుండానే తను నేర్చుకున్న దానిలో తప్పు కనబడింది. భయం అంటే ఇక్కడ దోషం. మళ్ళీ తనలో తాను విమర్శించుకుంటే, ఈ లోపం కనబడింది. ఏమిటది?

ఖచ్చితంగా ఒక లాభం అయితే ఉంది. స్థూలశరీరానికి ఏం జరిగినా, స్వప్నపురుషునికి ఏమీ అవటం లేదు. దోమలు శరీరంమీద స్వైర విహారం చేస్తున్నా, స్వప్నంలో ఉన్న అతనికి తెలియదు. దానికి ఉదాహరణలు కూడా ఊహించుకున్నాడు.
**తద్యద్యపీదగ్ం శరీరమన్ధం భవత్యనంధస్స భవతి –** స్థూలశరీరంలో కళ్ళు హఠాత్తుగా పనిచేయటం మానేసినా (గుడ్డివాడిగా మారినా) స్వప్నంలో అతను గుడ్డివాడవడు. అక్కడ రంగులు, రూపాలు చూస్తాడు.
**యది స్రామమస్రామః –** శరీరానికి ఒక కన్నే ఉన్నా, స్వప్నశరీరానికి ఒక కన్నే ఉండటం లేదు.
**నైవైషోఽస్యదోషేణ దుష్యతి–** ఈ జాగ్రద్దేహానికి జరిగే దోషాలు స్వప్నదేహానికి జరగటం లేదు. అంతవరకూ బాగానే ఉంది. అందువల్ల–

**స్వప్న పురుషుడు ఆత్మ**

కాని ఇందులో కూడా ఒక దోషం ఉంది. ఏమిటది? స్వప్నపురుషుడిని జాగ్రద్‌శరీరం వల్ల బాధించకపోయినా, స్వప్న ప్రపంచం బాధిస్తుంది! ఈ అనుమానం ప్రజాపతి ఎదురుకుండా రాలేదు! దీని అర్థం ఏమిటి? ఒక్కోసారి సమస్య వెంటనే అర్థం కాదు. అతను ఇప్పుడు సమస్యను ఊహించుకుంటున్నాడు.
**మంత్రం–2 న వధేనాస్య హన్యతే–** ఈ స్థూలశరీరాన్ని వధిస్తే స్వప్నపురుషునికేమీ అవటం లేదు. వధను బాధగా తీసుకోవాలి. దోమలు బాధిస్తున్నా స్వప్నపురుషుని కేమీ అవటం లేదు.
**నాస్య స్రామ్యేణ స్రామో ఘ్నంతి –** అంతకుముందు మంత్రంలోదే మళ్ళీ చెప్తున్నాడు. ఒక కన్ను ఉన్నా, స్వప్నపురుషునికి ఒక కన్నే ఉండదు. కాని సమస్య ఏమిటి?
**ఘ్నంతి త్వేవైనం –** అంతేకాదు

**విచ్ఛాదయన్తీవ –** స్వప్నపురుషుడు స్వప్న శరీరాన్ని అనుభవిస్తాడు. విచ్ఛాదయంతి అంటే వెంటాడటం. స్వప్నంలో వీధికుక్కలు తరుముకొస్తాయి; పరుగులు పెట్టిస్తాయి.

**అప్రియవేత్తేవ భవత్యపి –** కలలో కూడా అప్రియమైన సంఘటనలు జరుగుతాయి. వాటికి అతను ఏడుస్తాడు. జాగ్రద్‌పురుషునికి అది కల, కాని స్వప్న పురుషునికి అది నిజం. దురదృష్టవశాత్తూ, ఒక వ్యక్తికి తను కలగంటున్నప్పుడు,కల, కల అని తెలియదు;

**రోదితీవ –** అందుకని ఏడుస్తాడు.

**నాహమత్ర భోగ్యం పశ్యామీతి–** స్వప్నపురుషుని గురించి తెలుసుకోవటం వల్ల నాకేం ఫలం కనబడటం లేదు అనుకున్నాడు ఇంద్రుడు.

అక్షి పురుషుడు ఆత్మకాదు
స్వప్నపురుషుడు కూడా ఆత్మ కాదు.
అందుకని, మళ్ళీ వెనక్కి వెళ్ళాడు.

**మంత్రం–3** మళ్ళీ అవే వివరాలు, అవే మాటలు.సమిధలు తీసుకుని, ఇంద్రుడు మళ్ళీ వెళ్ళాడు. శాంత హృదయుడవై వెళ్ళావు కదా, మళ్ళీ ఎందుకు వచ్చావన్నాడు. ఇంద్రుడు తనలో కలిగిన భావపరంపరంతా చెప్పుకొచ్చాడు. స్థూలశరీరానికి ఏదైనా అయితే,స్వప్న పురుషునికి ఏమీ కావటం లేదు. అంతవరకూ బాగానే ఉంది. కాని స్వప్నపురుషుని పని ఎలా ఉంది? స్వప్నంలో ఏదో వెంటాడుతున్నది. అప్రియమైనవి జరుగుతున్నాయి. ఏడిపిస్తున్నాయి. అమృతం, అభయం ఎక్కడ ఉన్నాయి?

స్వప్నం మన చేతిలో లేదు. అది వాసనల వల్ల వస్తుంది కాని, పురుష ప్రయత్నం వల్ల రాదు. ఆఖరికి జ్ఞాని కూడా నా కల ఇలాగే రావాలి అని నిర్దేశించలేడు. పురుష ప్రయత్నం వల్ల కాకపోతే, కలను ఎవరు నిర్దేశిస్తారు? భగవంతుడా? కాదు. భగవంతుడు నిర్దేశిస్తే, అతను పక్షపాతం చూపించినట్టవుతుంది. అందువల్ల ఒకవేళ భగవంతుడే నిర్దేశిస్తాడనుకున్నా, మన ప్రారబ్ధకర్మను బట్టి నిర్దేశిస్తాడు. అందువల్ల మన ప్రారబ్ధకర్మల వల్ల కూడా స్వప్నం నిర్దేశింపబడుతుంది. కొంతమేరకు, మనం అదుపులో పెట్టగలము. రాత్రి పడుకునే ముందు, భీతిగొల్పే సినిమా చూస్తే, రాత్రి స్వప్నంలో ఆ సన్నివేశాలు వచ్చే అవకాశం ఉంది. అందుకని వాసనలను

కొంతమేరకు తగ్గించవచ్చు. కాని ఎప్పట్నుంచో ఉన్న వాసనలను మనమేమీ చేయలేము. అందువల్ల స్వప్న పురుషుడు కూడా ప్రారబ్ధకర్మను, సంసారాన్ని తప్పించుకోలేడని ఇంద్రుడు గ్రహించాడు అందుకే దీనివల్ల నాకేం ఫలం కనబడటం లేదన్నాడు.

**మంత్రం-4 ఏవమేవైష మఘవన్నితి హోవాచ-** నువ్వు చెప్పింది నిజమే.నీకు అర్థం కాలేదని చెప్పింది నిజమని అర్థం. స్వప్న పురుషుడిని చైతన్యంగా అర్థం చేసుకుని ఉంటే, స్వప్నపురుషుడు ముక్తపురుషుడు అయి ఉండేవాడు. కాని ఇంద్రుడు వాచ్యార్థం తీసుకున్నాడు. అందుకని అతనికి అర్థం కాలేదు. స్వప్నపురుషుడిని శరీరంతో పాటు తీసుకున్నాడు. అందువల్ల ఈ స్వప్న పురుషుడు సంసారి అవుతాడు.

మళ్ళీ ఇందాకటి మాటలే వస్తాయి. నేను మళ్ళీ చెప్తాను కాని ఇంకో 32 సంవత్సరాలు నా దగ్గర ఉండి శుశ్రూష చేయి అన్నాడు. ఇంద్రుడు అలాగే చేశాడు. చిన్న పిల్లల వ్యవహారం లాగా ఉంది. వాళ్ళకు పాలు ఒక కప్పులో ఇస్తే, నాకు ఇది వద్దు ఫలానిదాంట్లో కావాలి అని పేచీ పెట్టుకుంటారు. తల్లికి కావాల్సింది వాళ్ళు పాలు త్రాగటం, పాత్రముఖ్యం కాదు. పిల్లలకు కావాల్సింది పాత్ర మాత్రమే. వాళ్ళను చూసి మనం నవ్వుకుంటున్నాం కాని మనం కూడా పాత్రనే చూస్తున్నాము. అందులో ఉన్న వస్తువును చూడటం లేదు.

ఇప్పుడు మూడో పాదం చెప్పబోతున్నాడు ప్రజాపతి.

## ఏకాదశః ఖణ్డః (11)

**తద్యత్రైతత్సుప్తస్సమస్తస్సంప్రసన్నస్స్వప్నం న విజానాత్యేష ఆత్మేతి హోవాచైత దమృత మభయమేతద్బ్రహ్మేతి స హ శాంతహృదయః ప్రవవ్రాజ స హాప్రా ప్యైవ దేవానేతద్భయం దదర్శ నాహ ఖల్వయమేవగ్ం సంప్రత్యాత్మానం జానాత్యయమహమస్మీతి నో ఏవేమాని భూతాని వినాశమేవాపీతో భవతి నాహమత్ర భోగ్యం పశ్యామీతి ॥1॥ స సమిత్పాణిః పునరేయాయ తగ్ంహ ప్రజాపతిరువాచ మఘవన్ యచ్ఛాంతహృదయః ప్రావ్రాజీః కిమిచ్ఛన్ పునరాగమ ఇతి స హోవాచ నాహ ఖల్వయం భగవ ఏవగ్ం సంప్రత్యాత్మానం జానాత్యయమహస్మీతి నో ఏవేమాని భూతాని వినాశమేవాపీతో భవతి నాహమత్ర భోగ్యం పశ్యామీతి ॥2॥ఏవమేవైష**

**మఘవన్నితి హోవాచైతం త్వేవ తే భూయోఽ నువ్యాఖ్యాస్యామి నో ఏవాన్యత్రైతస్మాద్వసాపరాణి పంచ వర్షాణీతి స హాపరాణి పంచ వర్షాణ్యువాస తాన్యేకశతగ్ం సంపేదురేతత్తద్యదాహురేకశతగ్ం హ వై వర్షాణి మఘవన్ ప్రజాపతౌ బ్రహ్మచర్యమువాసతస్మై హోవాచ ॥3॥**

**అక్షి పురుషుడు ఆత్మ**

**స్వప్న పురుషుడు ఆత్మ**

ఈ రెండు సందర్భాలలోనూ ఇంద్రుడు ఏం చేశాడు. పాత్రను తీసుకుని, వస్తువును వదిలేశాడు. పాత్ర ఇస్తే పాత్రలో మునిగిపోతున్నాడు కాబట్టి, ఇప్పుడు పాత్ర లేకుండా కేవలం చైతన్యం గురించి చెపుదామనుకున్నాడు ప్రజాపతి. సుషుప్తిలో పాత్ర కనబడదు. శరీరం పనిచేయదు. ఇంద్రియాలు పనిచేయవు. మనస్సు కూడా పనిచేయదు. కేవలం శుద్ధ చైతన్యం మాత్రమే ఉంటుంది. సుషుప్తిలో వ్యష్టిశరీరం లేదని ఎలా తెలుసు? శరీర అనుభవం వచ్చిందంటేనే ఒక ప్రదేశానికి పరిమితమైనట్టు లెఖ్ఖ. సుషుప్తిలో దేశకాల పరిమితులు లేవు. కేవలం నేను అనే చైతన్యం మాత్రమే ఉంటాను. అందువల్ల ఇప్పుడు మూడో దశను ప్రవేశపెడదామనుకుంటున్నాడు ప్రజాపతి.

**సుప్తపురుషుడు ఆత్మ**

సుప్త పురుషుడు అంటే సుషుప్తిలో ఉండే శుద్ధ చైతన్యం. స్థూలశరీరం, సూక్ష్మ శరీరం అవ్యక్తంగా ఉంటాయి. కారణ శరీరం ఉంటుంది కాని అది కూడా అవ్యక్తంగానే ఉంటుంది. నేను నిద్రపోయినప్పుడు అన్నీ అవ్యక్తరూపంలో ఉంటాయి. నేను నిద్రలేచాక, అన్నీ వ్యక్తరూపంలోకి వస్తాయి. అవి అవ్యక్త రూపంలో ఉండకపోతే, లేచాక వెనక్కిరావు. అందుకని సుషుప్తిలో నేను కారణ శరీరంలో ఉన్నానని తెలియదు. అందువల్ల చైతన్యానికి దేశకాల పరిమితులు లేవు. అందువల్ల అది అమృతం, అభయం అని చెప్పవచ్చు అనుకున్నాడు ప్రజాపతి.

**మంత్రం - 1 - తద్యత్రైతత్సుప్తస్సమస్తస్సంప్రసన్నః -** సుప్త పురుషుని గురించి చెప్తున్నాడు. సమస్త అనే విశేషణాన్ని వాడుతున్నాడు సుప్తపురుషునికి. **స్వప్నం న విజానాతి-** స్వప్న పురుషుడు కూడా నిద్రపోతాడు కాని అతని నిద్ర గాఢనిద్ర కాదు. మనోబుద్ధి చిత్తాహంకారాలలో చిత్తం మేలుకుని

ఉంటుంది. అది అందులో నిక్షిప్తమై ఉన్న వాసనలను బయటకు వదులుతుంది. అందుకని సుప్త పురుషుడు గాఢనిద్రపోతున్నాడు. స్వప్నం చూడడు అని ప్రత్యేకించి చెప్తున్నాడు. గాఢనిద్రపోతున్నాడు కాబట్టి, సంప్రసన్నుడుగా ఉన్నాడు. అంటే ప్రశాంతంగా ఉన్నాడు. రాగద్వేషాలు, కామక్రోధాలు రాజ్యమేలవు అప్పుడు. నేను, ఆనంద ఆత్మను, సుషుప్తిలో ఉన్నాను.

**ఏష ఆత్మేతి హెూవాచ–** సుషుప్తిలో, ఆలోచనలు లేని మనస్సును సాక్షీభూతంగా చూసే ఆత్మే బ్రహ్మ. దానివల్లే మనస్సు శూన్యంగా ఉంది అని తెలుస్తుంది. నిద్రలేచాక నాకేమీ తెలియలేదని చెప్పగలుగుతున్నాడు. శూన్యం ఉంది అనుకుంటాం కాని అది శూన్యం కాదు. శూన్యం ఉందని తెలియజెప్పే ఆత్మచైతన్యం అది. కాని చైతన్యం ఉంది అనకుండా, ఏమీ లేదు అనేస్తున్నాను.

పంచదశిలో విద్యారణ్య ఈ విషయాన్నే నాటకదీప ప్రకరణంలో ప్రస్తావిస్తారు. నాటకం వేసి ముగిశాక, అందరు పాత్రధారులూ, లోపలికి వెళ్లిపోయాక 'స్టేజీ మీద ఏముంది?' అని ఎవరినన్నా అడిగితే, 'ఏమీ లేదు,' అనేస్తారు. కాని నిజానికి స్టేజీమీద కాంతి ఉంది. కాంతి ఉందని ఎలా తెలుసు? కాంతి ఉంది కాబట్టి, ఏమీ లేదని తెలుస్తున్నది. కాంతి ఎప్పుడూ ఉండటం వల్ల మనం కాంతిని పట్టించుకోవటం లేదు.

అలాగే సుషుప్తిలో సాక్షి చైతన్యం అనే నేను ఉన్నాను. ఈ చైతన్యమే బ్రహ్మ. **ఏతదమృతమభయమేతద్బ్రహ్మేతి –** ఇది అమృతం, అభయం. సుషుప్తిని సుప్తపురుషుడు అన్నాడు ప్రజాపతి. దాన్నే ప్రాజ్ఞ అంటారు తత్త్వబోధలో. ఇప్పుడు మూడోదశ బోధ ఏమిటి?

**సుప్త పురుషుడు ఆత్మ**

**సహ శాంత హృదయః ప్రవవ్రాజ సహాప్రాప్యైవ దేవానేతద్భయం దదర్శ –** మళ్ళీ అంతా అంతకుముందులాగే సాగుతున్నది. ఈ బోధతో తృప్తి చెందినవాడై ఇంద్రుడు వెళ్ళాడుకాని ఇంకా దేవలోకం చేయకుండానే తను అర్థం చేసుకోవటంలో మళ్ళీ ఏదో లోపం ఉందనుకున్నాడు.

**నాహ ఖల్వయమేవగ్ం సంప్రత్యాత్మానం జానాతి–** జాగ్రదావస్థలో నేను నా గురించి మాట్లాడగలను. 'నేను ఫలానా,' 'నేను ఇక్కడ ఉన్నాను,' వగైరా.

అక్షి పురుషునిగా నేను నా గురించి మాట్లాడగలను.

స్వప్నపురుషునిగా నేను నా గురించి మాట్లాడగలను.

కాని సుప్త పురుషునిగా నేను సుప్తపురుషుడిని అని చెప్పలేను.

సుషుప్తిలో నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని అని చెప్పలేను. ఎందుకు? సుషుప్తిలో అన్నీ పడుకుంటాయి. నేను నా గురించి మాట్లాడలేను. నేను నా గురించి ఆలోచించలేను. నేను నా గురించి మాట్లాడగలిగితేనూ, ఆలోచించగలిగితేనూ అది సుషుప్తి అవదు. అందువల్ల సుప్త పురుషునిగా నేను నా గురించి మాట్లాడలేను. అందువల్ల సుషుప్తిలో నేను లేను, శూన్యమే ఉంది అనుకుంటారు అందరూ. మరణానంతర విషయం లాంటిదే ఇది కూడా. మరణం తర్వాత కూడా ఆత్మ ఉంది. (చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది, మాధ్యమం లేదు కాబట్టి తెలియదు), కాని ఎవరూ ఒప్పుకోరు.

అందువల్ల సుషుప్తిలో, 'నేను ఆత్మను' అని చెప్పుకోలేను. అక్కడ నేను లేను. శూన్యమే ఉంది. అందుకే, సంప్రతి ఇవ ఆత్మానం ఖల్వయం న జానాతి – అనుకున్నాడు ఇంద్రుడు. ఇప్పుడు (జాగ్రదావస్థలో) నా గురించి నేను మాట్లాడగలిగినట్టుగా, సుప్తపురుషుడు, తన గురించి చెప్పలేడు.

**అయమహమస్మీతి–** 'నేను చైతన్యాన్ని' అని సుప్త పురుషుడు చెప్పలేడు. నా గురించీ నేను చెప్పలేను, ప్రపంచం గురించీ చెప్పలేను. సబ్జెక్టు లేదు, ఆబ్జెక్టు లేదు. కేవలం శూన్యం ఉంది అంతే.

**సుప్తపురుషుడు –** శూన్యపురుషుడు (ప్రజాపతి బోధ కాదు). ఈ నిర్ణయానికి ఇంద్రుడు వచ్చాడు.

**వినాశమేవాపీతో భవతి–** నాకీ జ్ఞానం వద్దు, నేను అనే వ్యక్తి లేడు, నాకొక వ్యక్తిత్వం లేదు, అసలు నాకు ఉనికే ఉన్నట్టు లేదు.

**నాహమత్రభోగ్యం పశ్యామీతి –** అందువల్ల, ఈ బోధలో నాకేం ఫలం కనబడటం లేదు. శుద్ధ చైతన్యం వ్యవహారం నడపలేదు. శుద్ధచైతన్యం, 'నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని; నాకు పరిమితి లేదు; నేను నిత్యశుద్ధ బుద్ధ ఆత్మను,' అని చెప్పలేదు. ఎందుకంటే అలా చెప్పాలంటే పరికరాలు కావాలి. మనస్సు, ఇంద్రియాలు కావాలి. నేను ఆత్మను అని చెప్పలేని ఆత్మ ఉంది సుషుప్తిలో. నేను ఫలానా అని చెప్పగలిగిన అహంకారం పడుకుంది సుషుప్తిలో. జాగ్రద్, స్వప్నావస్థలో నేను అహంకారం అనుకుని పొరపాటు పడుతున్నాను. అహంకారం పడుకుంటే, నేను ఉన్నానని తెలియటం లేదు. ఇంద్రుడు చేసిన పొరపాటు ఇదే. అహంకారం పడుకునే సరికి నేను లేను

అనుకున్నాడు. సుషుప్తిలో వ్యవహారం నడపని ఆత్మ ఉన్నా తెలియదు. అందుకని ఇంద్రుడు 'నేను లేను,' అనుకున్నాడు. ఇంత పెద్దసాధన చేసేది నేను లేను అని తెలుసుకోవటానికా! ఉన్నది శూన్యం అని తెలుసుకోవటానికా! దీనివల్ల నేను పొందే ప్రయోజనం ఏమాత్రం కనబడటం లేదు అనుకున్నాడు ఇంద్రుడు.

అందుకే చాలా మంది, విదేహముక్తి వల్ల లాభమేమిటి అంటారు. ఎందుకంటే విదేహముక్తిలో శరీరం, మనస్సు ఉండవు. శరీరం, మనస్సు పనిచేయకపోతే, 'నేను విదేహముక్తుడను, నేను సర్వవ్యాపకమైన బ్రహ్మను,' అని చెప్పుకోలేను. సుషుప్తిలాగే ఏమీ పనిచేయదు. అలాంటి ముక్తి ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే అనే అపోహ ఉంటుంది.

ఇంద్రుడు తన సందేహం తీర్చుకోవటానికి ప్రజాపతి దగ్గరకు మళ్ళీ వెనక్కి వెళ్ళాడు.

**మంత్రం-2** ఇదంతా అంతకు ముందు వచ్చిన మాటలే. మళ్ళీ సమిధలు తీసుకునివెళ్ళాడు. ఎందుకు వచ్చావన్నాడు. తనకు దోవలో కలిగిన ఆలోచనలన్నీ పూసగుచ్చినట్టు మళ్ళీ చెప్పాడు.

సుప్తపురుషుడు ఆత్మ- ప్రజాపతి చెప్పాడు.

**సుప్తపురుషుడు = శూన్యపురుషుడు**- ఇంద్రుడు అనుకున్నాడు.

ఒక చీకటి గది ఉందనుకుందాము. ఆ చీకటి గదిలో ఎవరూ లేరు అని చెప్పే మీరు ఉన్నారు. ఎవరూలేరు అని చెప్పాలంటే ఒకరు ఉండాలి కదా!

ఎవరూ లేరు = ఎవరూ లేరని గమనించేవారు. కొత్తసూత్రం ఏమిటి? ఎవరూ లేరు అంటే ఎవరో ఉన్నారు. ఎవరూ లేరని గమనించేవారొకరున్నారు.

అలాగే సుషుప్తిలో శూన్యం ఉంది అంటే శూన్యాన్ని చూసే చైతన్యం ఒకటి ఉంది.

**శూన్యం = చైతన్యం**

కాని ఇంద్రుడేం చేశాడు? భావరూప చైతన్యం తను అని తెలుసుకోకుండా అభావరూప శూన్యం తను అనుకున్నాడు.

**మంత్రం - 3 ఏవమేవైష మఘవన్నితి హోవాచ-** నువ్వు చెప్పింది నిజమే, ప్రజాపతి ఇంతవరకూ చెప్పిన బోధ మూడు దశల్లో ఉంది అది

**అక్షి పురుషుడు ఆత్మ**
**స్వప్న పురుషుడు ఆత్మ**
**సుప్త పురుషుడు ఆత్మ**

మూడింటిలోనూ ప్రజాపతి ఉద్దేశం చైతన్యం గురించి చెప్పటమే. విద్యుచ్ఛక్తి గురించి చెప్పటానికి ఒకసారి బల్బును, ఒకసారి ఫాన్‌ను, ఒకసారి మైకును ఎవరైనా చూపినట్టుగా, చైతన్యం గురించి చెప్పటానికి బ్రహ్మ మూడు ప్రయత్నాలు చేశాడు. కాని విద్యుచ్ఛక్తి బదులుగా బల్బును, మైకును చూసే విద్యార్థిలాగా, ఇంద్రుడు కూడా స్థూల శరీరాన్ని, సూక్ష్మశరీరాన్ని ముందు తీసుకున్నాడు. శరీరం చూపకుండా చెపితే అసలు నేను ఉన్నాననే తెలియటం లేదు అన్నాడు. అలా మూడు బోధల్లోనూ విషయం గ్రహించలేదు.

ఇంక మిగిలింది తురీయం. జాగ్రద్, స్వప్న, సుషుప్తి అవస్థల్లో మూడింటిలోనూ ఉంది, మూడింటికీ అతీతంగా ఉంటుంది. ఆత్మ నిర్వచనం–

**అవస్థాత్రయసాక్షి**

సాక్షికి ఇంకో పేరు తురీయం

**నో ఏవాన్యత్రైతస్మాత్ – ఏతం త్వేవ తే భూయోఽ ను వ్యాఖ్యాస్యామి –** అదే చైతన్యం గురించి నీకు మళ్ళీ చెప్తాను. దీనికంటే ఇతరమైన ఆత్మ కాదు. కాని ఒక షరతు మీద.

వస **అపరాణి పంచ వర్షాణీతి –** మళ్ళీ నా దగ్గర కొన్నాళ్ళు ఉండాలి. కాకపోతే ఈసారి తగ్గించాడు. ఐదు సంవత్సరాలు ఉండు. ఇంద్రుడికి మరో మార్గం లేదు.

**స హాపరాణి పంచ వర్షాణ్యువాస–** ఇంద్రుడు అలాగే ఐదు సంవత్సరాలు ప్రజాపతి దగ్గర ఉండి శుశ్రూష చేశాడు.

**తాన్యేకశతగ్ం సంపేతుః –** ఉపనిషత్తే చెపుతున్నది, అలా అతను 101 సంవత్సరాలు ఉన్నాడు. 32 సంవత్సరాలు చొప్పున మూడుసార్లు, అది 96 సంవత్సరాలు అయింది. ఇప్పుడు 5 కలిపితే 101 అయింది.

**ఏతత్తద్యదాహురేకశతగ్ం హ వై వర్షాణి మఘవన్ ప్రజాపతౌ బ్రహ్మచర్యమువాస–** ప్రజలందరూ, అలా ప్రజాపతి దగ్గర ఇంద్రుడు 101 సంవత్సరాలు ఉన్నాడు అని చెప్పుకుంటారు. అలా విద్య నేర్చుకోవటం కోసం బ్రహ్మచర్యం పాటించటాన్ని బ్రహ్మ విద్యాంగ బ్రహ్మచర్యం అంటారు.

ఇప్పుడు గురుశిష్యులిద్దరూ నాలుగో పాదంకి సిద్ధంగా ఉన్నారు. దీన్ని మాండ్యూక ఉపనిషత్తులో **చతుర్థ పాదః** అంటారు. దీన్ని తురీయం అంటారని చూశాము.

ఏతస్మై హెూవాచ - ఇప్పుడు రాబోయే ఖండం (ఖండం-12) మొత్తం ఎనిమిదవ అధ్యాయంలో చాలా ముఖ్యమైనది. ఎందుకంటే వేదాంతబోధ ఇందులో వస్తుంది. దీన్ని బ్రహ్మసూత్రాల్లో వివరంగా చర్చించారు.

**ద్వాదశః ఖణ్డః (12)**

**మఘవన్ మర్త్యం వా ఇదం శరీరమాత్తం మృత్యునా తదస్యా మృతస్యాశరీరస్యాత్మనోఽధిష్ఠానమాత్తో వై సశరీరః ప్రియాప్రియాభ్యాం న వై సశరీరస్య సతః ప్రియాప్రియయోరపహతిరస్త్య శరీరం వావ సంతం న ప్రియాప్రియే స్పృశతః॥1॥ అశరీరో వాయురభ్రం విద్యుత్ స్తనయిత్ను రశరీరా ణ్యేతాని తద్యథైతాన్యముష్మాదాకాశాత్సముత్థాయ పరం జ్యోతిరుపసమ్పద్య స్వేన రూపేణాభినిష్పద్యన్తే ॥2॥ ఏవమేవైష సంప్రసాదోస్మాచ్ఛ రీరాత్సముత్థాయ పరం జ్యోతిరుపసమ్పద్య స్వేన రూపేణాభినిష్పద్యతే స ఉత్తమపురుషస్స తత్ర పర్యేతి జక్షత్ క్రీడన్ రమమాణః స్త్రీభిర్వా యానైర్వా జ్ఞాతిభిర్వా నోపజనగ్ం స్మరన్నిదగ్ం శరీరమ్॥ స యథా ప్రయోగ్య ఆచరణే యుక్త ఏవమేవాయమస్మిన్ శరీరే ప్రాణో యుక్తః ॥3॥ అథ యత్రైతదాకాశ మనువిషణ్ణం చక్షుస్స చాక్షుషః పురుషో దర్శనాయ చక్షురథ యో వేదేదం జిఘ్రాణీతి స ఆత్మా గన్ధాయ ఘ్రాణమథ యో వేదేదమభివ్యాహరాణీతి స ఆత్మాఽభివ్యాహారాయ వాగథ యో వేదేదగ్ం శృణవానీతి సాత్మా శ్రవణాయ శ్రోత్రమ్ ॥4॥ అథ యో వేదేదం మన్వానీతి స ఆత్మా మనోఽస్య దైవం చక్షుస్స వా ఏష ఏతేన దైవేన చక్షుషా మనసైతాన్కామాన్పశ్యన్రమతే॥ య ఏతే బ్రహ్మలోకే ॥5॥ తం వా ఏతం దేవా ఆత్మానముపాసతే తస్మాత్తేషాగ్ం సర్వే చ లోకా ఆత్తాస్సర్వే చ కామాః॥ స సర్వాగ్ంశ్చ లోకానాప్నోతి సర్వాగ్ంశ్చ కామాన్ యస్తమాత్మానమనువిద్య విజానాతీతి హ ప్రజాపతిరువాచ ప్రజాపతిరువాచ ॥6॥**

**మంత్రం-1** చాలా ముఖ్యమైన మంత్రం.

**మఘవన్ -** ప్రజాపతి ఇంద్రుడిని మఘవన్ అని సంబోధిస్తున్నాడు.

**మర్త్యం వా ఇదం శరీరమ్ –** పాంచభౌతికమైన ఈ శరీరం షడ్వికారాలకు లోనవుతుంది. **అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి.**

శరీరం జడం. దానికంటూ స్వంతంగా చైతన్యం లేదు. చైతన్యం శరీరంలో ఒక భాగం కాదు. ఒక లక్షణం కాదు. దానినుంచి ఉత్పత్తి చెందినది కాదు అని చైతన్య లక్షణాలలో మొదటి లక్షణంగా చూశాము. శరీరంతో పాటు మనస్సును కూడా తీసుకోవాలి. మనస్సు కూడా జడమే. దానికీ స్వంతంగా చైతన్యం లేదు. అలాగే మనస్సులో రేగే ఆలోచన కూడా జడమే. అందువల్ల శరీరం, మనస్సు, ఆలోచన అన్నీ జడం.

ఇదం శరీరం అంటే– స్థూల సూక్ష్మ శరీరాలు రెండూ కలిపి వస్తాయి.

**అత్తం మృత్యునా –** మృత్యుదేవత కోరల్లో చిక్కుకుని ఉంది ఈ స్థూల శరీరం. యమధర్మరాజు ఎప్పుడో మన కాలం తీరినప్పుడు వస్తాడనుకుంటాము మనం. కాని మనం ఎప్పుడూ మృత్యుదేవత కోరల్లో అంటే కాలతత్త్వంలో చిక్కుకుని ఉన్నాము.

**తదస్యామృతస్యాశరీరస్యాత్మనోఽధిష్ఠానమ్–** ఈ నశించే శరీరం, నాశనం లేని ఆత్మకు అధిష్ఠానం. ఇక్కడ అధిష్ఠానం అంటే భోగ ఆయతనం. ఎటువంటి ఆత్మకు? అది చాలా ముఖ్యం.

అశరీరస్య– చైతన్యానికి శరీరంతో సంబంధం లేదు. కాంతి ఉదాహరణను గుర్తుంచుకోండి. నా చేతి మీద కాంతి ఉంది. కాని అది నా చేతికి బంధింపబడికాని, దానికి కట్టుబడి కాని, దానితో సంబంధం ఉన్నది కాని కాదు. ఒకవేళ నా చేతితో సంబంధం ఉంటే ఏమవుతుంది? నా చేయి కదిలినప్పుడల్లా కాంతి కూడా కదులుతుంది. కాని అలా కదలటం లేదు. అందువల్ల కాంతి అక్కడ వ్యక్తమవుతున్నది. కాని దానితో సంబంధం లేదు. అలాగే చైతన్యం శరీరంలో వ్యక్తమవుతున్నది కాని, శరీరంతో సంబంధం లేదు. ఆత్మ శరీరమా? అశరీరమా? ఆత్మ అశరీరం. శరీరం మరణించాకే, ఆత్మకు శరీరం ఉండదని అపోహ పడతాము కాని, నిజానికి శరీరం ఉండగా కూడా నేననే చైతన్యానికి శరీరంతో సంబంధం లేదు. శరీరానికి వృద్ధాప్యం వస్తే, నాకు రాదు. శరీరానికి అనారోగ్యం వస్తే నాకు రాదు. అందుకని నేను సదేహం కాదు విదేహం. ఎప్పటికీ విదేహమే.

అందుకే జనకునికి ఇంకోపేరు విదేహుడు. అందువల్ల ఈ మంత్రంలో **అశరీరస్య** పదం చాలా ముఖ్యమైప పదం. చైతన్యానికి శరీరంతో సంబంధం లేదు. చైతన్యం పదాన్ని నేనుతో మార్చి, 'నేను చైతన్యాన్ని, నాకు శరీరంతో సంబంధం లేదు. నేను అశరీరాన్ని,' అని సాధన చేయాలి.

అమృతస్య – ఇది ఇంకో ముఖ్య పదం. చైతన్యం నాలుగవ సూత్రం గుర్తుంచుకోవాలి. శరీరం మరణించినా, చైతన్యం ఉంటుంది. మళ్ళీ అలాగే, 'నేను చైతన్యాన్ని, నాకు శరీరంతో సంబంధం లేదు. శరీరం రాలిపోయినా, నేను ఉంటాను. నేను సర్వవ్యాపకమైన, శాశ్వతమైన చైతన్యాన్ని. నాలోనే అన్ని వ్యవహారాలూ జరుగుతాయి. కాని నేను అవ్యవహారిని. నాకు శరీరంతో సంబంధం లేదు; మనస్సుతో సంబంధం లేదు. రాగద్వేషాలతో సంబంధం లేదు. నేను నిత్యముక్త, అసంగ ఆత్మను,' అని అర్థం చేసుకోవాలి.

**స శరీరః –** నేను జీవుడు అనుకుంటే ఎప్పటికీ ముక్తి పొందలేను. నేను ఆత్మను అని తెలుసుకుంటే ఎప్పటికీ ముక్తుడినే. సశరీరం అంటే దేహ సంబంధం లేదా మనస్సంబంధం ఉంటే, ఎప్పటికీ జీవితంలో ఒడిదుడుకులు ఉంటూనే ఉంటాయి.

**స శరీరః ప్రియాప్రియాభ్యాం అపహతిః –** శరీరం, మనస్సులతో సంబంధం పెంచుకుంటే ఎప్పటికీ ప్రియమో, అప్రియమో జరుగుతూనే ఉంటాయి. శరీరానికి, మనస్సుకూ ప్రారబ్ధకర్మ తప్పదు.

**స శరీరస్య సతః** శరీరంతో సంబంధం పెట్టుకున్న వ్యక్తిని జీవుడు అంటారు.అతను ప్రియ, అప్రియమైన విషయాలనుంచి తప్పించుకోలేడు. దీనికి పరిష్కారం ఏమిటి? ప్రియ, అప్రియాల నుంచి స్వేచ్ఛ కావాలంటే శరీరం, మనస్సుల కతీతంగా ఎదగాలి.

**అస్యశరీరం వావ సంతం న ప్రియాప్రియే స్పృశత –** దేహేంద్రియ మనో బుద్ధులనుంచి విడివడిన వ్యక్తి – జ్ఞాని–ప్రియ, అప్రియాలకు చలించడు. అతను తను సాక్షిని అని, తను మనస్సు కాదని తెలుసుకుంటాడు. తను మనస్సు కానప్పుడు, మనస్సును పట్టి పీడించే రాగద్వేషాలు ఎలా అంటుతాయి అతనిని? ఆత్మ అసంగం కాబట్టి దేనికీ చలించదు.

అసంగుడు అంటే నాకు దేనితోనూ సంబంధం లేదు, నేను దేనికీ యజమానిని కాదు అని తెలుసుకోవటం. దీనినే ఆంతర సన్యాసం అంటారు. నేను మనస్సు కాదు, నేను మనస్సుకు యజమానిని కూడా కాదు. అలా అనుకోకపోతే, ఏమవుతుంది? 'నాకు ఏమీ సమస్య లేదు, నా మనస్సుకే సమస్య ఉంది' అనుకుంటాము. అంటే కేవలం భాష మారింది అంతే. అంతకు ముందు ఏమన్నాము? 'నాకు సమస్య ఉంది!' ఇప్పుడేమంటు న్నాము? 'నా మనస్సుకు సమస్య ఉంది.' అందుకని వేదాంతం చెపుతున్నది, 'నేను మనస్సును కాదు, నేను మనస్సుకు యజమానిని కూడ కాదు అని అర్థం చేసుకోండి!' శరీరాన్ని, మనస్సునూ విశ్వరూప భగవానునికి అప్ప చెప్పేయండి! 'సరే, శరీరాన్ని, మనస్సును అప్పచెప్పేస్తాను, కాని పిల్లల గురించి తలచుకోవచ్చా?' నా శరీరాన్నే నేను కాదన్నప్పుడు నా కుటుంబ సభ్యులను నా వాళ్ళుగా ఎలా అంటాను? నిర్దాక్షిణ్యంగా ఆంతర సన్యాసుల మవ్వాలి. ఆంతర సన్యాసం లేనిదే, మోక్షం సాధ్యం కాదు. వేరే మార్గం ఉంది అని మీరు భావిస్తే, సరే ప్రయత్నించి రండి అంటుంది వేదాంతం. అందువల్ల అశరీరం వావ సంతం.

నేను అశరీరంగా ఎలా అవుతాను? దానికి ఆత్మహత్య చేసుకోనవసరం లేదు. త్రిపుటి నుంచి ద్విపుటికి రావాలి. త్రిపుటి అంటే నేను, జగత్తు, ఈశ్వరుడు. మనం మామూలుగా ఉండేది త్రిపుటిలో. జగత్తు నన్ను బాధపెడుతున్నది. అందుకని ఈశ్వరుడిని వేడుకుంటాను ఇందులో. ద్విపుటిలో రెండే ఉన్నాయి. ఆత్మ, అనాత్మ. చైతన్యం ఆత్మ; శరీరం, మనస్సు అనాత్మ.

నేను ఆత్మను అని నా సస్వరూపం తెలుసుకుంటే, అనాత్మ ప్రపంచంలో జరిగేవేవీ నన్ను బాధించవు. అనాత్మ అనుకుంటే, అహంకారం, మమకారాలకు లోనవుతాను. ఇది వేదాంత సూత్రాల్లో ఐదవ సూత్రం.

జీవుడుగా నేను ఎన్నటికీ మోక్షం పొందలేను.

ఆత్మగా నేను నిత్యముక్తుడను.

మోక్షం అనేది భవిష్యత్తులో జరుగబోయే సంఘటన కాదు.

జీవుడు ఎన్నటికీ మోక్షం పొందలేడు.

ఆత్మ ఎన్నటికీ మోక్షం పొందనవసరం లేదు.

అందుకని నేను జీవుడు భావన నుంచి నేను ఆత్మను అనే నిజానికి రండి. త్రిపుటి నుంచి ద్విపుటికి రండి.

బ్రహ్మసూత్రాల్లో **తత్తు సమన్వయాత్** చాలా ముఖ్యమైన సూత్రం.

అందులో శంకరాచార్యులు అశరీరం వావ సంతం భావాన్ని విశదీకరిస్తారు.

పూర్వపక్షి ఒక వాదన లేవదీస్తాడు. ఏమిటది? అశరీర ఆత్మ ముక్తి పొందింది అంటుంది ఉపనిషత్తు. అశరీరం అంటే శరీరం లేని జ్ఞాని మాత్రమే ముక్తి పొందుతాడు అని కదా! అంటే మోక్షం పొందాలంటే శరీరం ఉండకూడదు. కాని ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకూ శరీరం ఉంటుంది. అలాంటప్పుడు, శరీరం ఉండగా, ఇప్పుడే, ఇక్కడే జీవన్ముక్తి ఎలా పొందుతాడు? విదేహముక్తిలోనే శరీరం పడిపోతుంది కదా! ఇదీ ప్రశ్న.

దీనికి జవాబు– విదేహ ముక్తిలోనే శరీరం నుంచి విముక్తి పొందుతాము అనేది అపోహ. జీవన్ముక్తిలో కూడా, ప్రారబ్ధకర్మ వల్ల శరీరం ఉండగా కూడా, శరీరం అవస్థలు పడుతుండగా కూడా జ్ఞాని నేను శరీరాన్ని కాదు, ఆత్మను అని తెలుసుకుంటాడు కాబట్టి అతనికి శరీరం లేనట్టే. శరీరం ఉండగానే ఇప్పుడే, ఇక్కడే జీవన్ముక్తి పొందుతాడు, అతను అసంగుడు అని తెలుసుకుంటాడు కాబట్టి.

దీనికి ఉదాహరణ సినిమా తెర. సినిమా నుంచి తెర ఎప్పుడు భిన్నంగా ఉంది అంటే విశ్రాంతి సమయంలో అనకూడదు. సినిమా నడుస్తున్నా తెర దానికి భిన్నంగానే ఉంది. సినిమాలో రక్తం ఏరులై ప్రవహించినా, వర్షం కుండపోతగా కురిసినా, అగ్ని అడవులను దహించినా తెరకు ఏమీ అంటదు. తెర అసంగం. అలాగే అసంగ ఆత్మనైన నేను ప్రపంచం నుంచి ఎప్పటికీ ముక్తుడినే, ప్రపంచం ఎప్పుడూ నాలోనే ఉన్నా!

'అయితే నేను మోక్షం పొందటానికి ఏం చేయాలి?' ఈ ప్రశ్న అడిగితే, ఈ కంఠశోష అంతా వృథా. ఎందుకంటే నేను నిత్యముక్తుడను.

అందువల్ల అశరీరం అంటే గుర్తుంచుకోండి – శరీరం అంతటా వ్యాపించి ఉన్నా, శరీరంతో సంబంధం లేనిది. అందుకే చైతన్యం 5 సూత్రాలు చెప్పేటప్పుడు– చైతన్యం శరీరంలో ఒక భాగం కాదు. ఒక లక్షణం కాదు. దానినుంచి ఉత్పత్తి చెందలేదు. అది స్వతంత్రమైనది. శరీరం సరిహద్దులకే

పరిమితమవలేదు అన్నాము. ఇంత పెద్ద వివరణను సంస్కృతంలో అశరీరః అనే ఒక్కముక్కతో చెప్పేసింది ఉపనిషత్తు.

తమాషా ఏమిటంటే, 'నేను అశరీరాన్ని' అని చెప్పటానికి, నేను శరీరాన్ని వాడుతున్నాను. అది శరీరంలో ఉన్నప్పుడు సశరీరంగా కనిపిస్తుంటుంది. కాని, నిజానికి అన్నివేళలా చైతన్యం అశరీరమే. సశరీరంగా కనిపించటం వల్ల, ఉపాధికున్న పరిమితులను, ఇంద్రుడు చైతన్యానికి మార్చాడు. పరిమితులు విధిస్తే, దాన్ని విశ్వ, తైజస, ప్రాజ్ఞ అంటాము. పరిమితులు తీసేస్తే విశ్వ= తురీయం; తైజస = తురీయం; ప్రాజ్ఞ = తురీయం. కాని ఇంద్రునికి అర్థం కాలేదు. అందుకని ఈసారి ప్రజాపతి ప్రత్యక్షంగా, స్పష్టంగా చెప్పాడు.

**ఆత్మ అశరీరం**

ఎవరైతే నేను ఆత్మను అని తెలుసుకుంటాడో అతను అశరీరుడు.

ఎవరైతే నేను శరీరాన్ని అని అపోహపడతాడో అతను సశరీరుడు.

జ్ఞాని అశరీరుడు; అజ్ఞాని సశరీరుడు. అశరీరునికే మోక్షం సాధ్యం. సశరీరుడు త్రిపుటిలో ఉంటాడు. 'నేను బాధాతప్త జీవిని. జగత్తు నన్ను బాధపెడుతున్నది. ఈశ్వరుడు మాత్రమే నన్ను కాపాడగలడు' అనుకుంటూ ఉంటాడు.

ఎప్పుడైతే నేను అశరీరుడిని అనుకుంటాడో అప్పుడు జగత్తును చూసి, 'నువ్వు నన్నేమీ చేయలేవు,' అని ధీమాగా అనగలడు. గుర్తుంచుకోండి,నన్ను అంటే అశరీర ఆత్మను. ఈ మాట మీరు చెబుతున్నప్పుడు, మీరు దగ్గుతూ ఉండి ఉండవచ్చుగాక, కాని మిమ్మల్ని జగత్తు ఏమీ చేయలేదు. అందువల్ల మీరు బాధాతప్త హృదయులు కారు. జగత్తు మిమ్మల్ని ఏమీ చేయలేదు. ఈశ్వరుని నుంచి రక్షణ కోరుతూ, మీరు ప్రాయశ్చిత్త కర్మలు చేయనవసరం లేదు. ఎవరంటున్నారు ఈ మాట? ప్రజాపతి. అశరీరం వావ సంతం. ఎవరైతే ద్విపుటికి వస్తారో, వాళ్ళు నేను ఆత్మను; శరీరం, జగత్తు అనాత్మ అని తెలుసుకుంటారు.

మోక్షం పొందటానికి నేను ఎంత ప్రారబ్ధకర్మను క్షయం చేయాలి? ద్విపుటికి వస్తే ప్రారబ్ధకర్మ కూడా నన్నేం చేయలేదు. ప్రారబ్ధం శరీరానికి; శరీరం అనాత్మ ప్రపంచానికి చెందింది. నాకు సంచిత, ఆగామి, ప్రారబ్ధకర్మలు

లేవు. నేను నిత్యముక్త ఆత్మను. అందుకని ప్రియం, అప్రియం అంటదు.

మళ్ళీ ఇక్కడ ఒక సందేహం. అప్రియం అంటదు అంటే బాగానే ఉంది. ప్రియం కూడా అంటదు అంటే ఎలా? మోక్షం పేరుతో నేను ఐహిక సుఖాలు కోల్పోవాలి అంటే, మోక్షం కోరుకోవాలో, వద్దో ఒక్క క్షణం ఆలోచించుకోవాలి అనుకోవచ్చు.

తైత్తిరీయంలో కోశానందం, ఆత్మానందం గురించి వివరంగా వస్తుంది. కోశానందం అంటే ప్రతిబింబ ఆనందం. అందులో తారతమ్యాలు ఉంటాయి. ప్రియం, మోదం, ప్రమోదం అనే స్థాయీ బేధాలు ఉంటాయి. కాని ఆత్మానందంలో ఈ స్థాయీ బేధాలు ఉండవు. నేను ఆనంద స్వరూపుడిని. ఎలాగైతే శుద్ధ చైతన్యాన్ని, శుద్ధ సత్‌ను అనుభవించలేమో, అలాగే శుద్ధ ఆనందాన్ని కూడా అనుభవించలేము. మనం పొందే ప్రతి ఆనందం కూడా బింబానందం యొక్క ప్రతిబింబమే. జ్ఞానం పొందితే, ఈ ప్రియ మోదాలు వదిలేసి నేను బింబానందాన్ని అని తెలుసుకుంటాము.

ఉదాహరణకు అద్దంలో మీ మొహం యొక్క ప్రతిబింబాన్నే చూస్తారు. తర్వాత మీ ముందు నుంచి అద్దాన్ని తీసేస్తే, 'అయ్యో, అందమైన, నా ప్రతిబింబం మాయమయిందే' అని కూర్చుని ఏడవరు. మీ ప్రతిబింబం ఉన్నా, పోయినా, మీ (బింబ) మొహం మాత్రం ఎప్పుడూ మీ భుజాలమీదే ఉంటుంది. అది రాకపోకలకు అతీతం. అలాగే నేను ఆత్మ స్వరూపం అని తెలుసుకుంటే, మీరేమీ నష్టపోరు.

**మంత్రం-2** ముందు మంత్రంతో నాలుగు దశలూ అయిపోయాయి. విశ్వ, తైజస, ప్రాజ్ఞ, తురీయం. అవస్థాత్రయ వివేకం జరిగింది.

**అవస్థాత్రయ సాక్షి ఆత్మ**

ఈ బోధ జరిగింది. దీని సారాంశం ఏమిటి? ముందేమో చైతన్యాన్ని శరీరం యొక్క విశేషణంగానో, లక్షణంగానో భావించటం జరిగింది. ఇప్పుడు, వేదాంత విచారణ ద్వారా, బుద్ధిలో శరీరం వేరు, ఆత్మవేరు అని విడదీసి చూడగలగటం వచ్చింది. మళ్ళీ చెయ్యి - కాంతి ఉదాహరణ చూద్దాము. ఇది మూడు దశల్లో జరుగుతుంది.

1. ఇక్కడేముంది అంటే, ముందు చెయ్యి ఉందనే చెప్తాము.
2. కాంతి చేతిమీద పడి, చేతిని ప్రకాశింపజేస్తున్నది. అంటే కాంతి,

చెయ్యి రెండు ఉన్నాయి.

3. కాంతి చేతి మీద ఆధారపడి లేదు. చెయ్యి ఉన్నా లేకపోయినా కాంతి ఉంది.

ఇక్కడేముంది అంటే కాంతి ఉందని చెప్పగలగాలి.

కాంతి, చెయ్యి రెండూ కలిసి ఉంటాయి కాని వాటిని మీరు విడివిడిగా చూడాలి.

ఇప్పుడు ఇదే సూత్రాన్ని ఆత్మ–శరీరాలకు అన్వయించి చూద్దాము.

1. నేను ఎవరు అంటే, నేను శరీరాన్ని అనుకుంటాము.

2. చైతన్యం శరీరం అంతటా వ్యాపించి, శరీరాన్ని ప్రకాశింపజేస్తున్నది. అంటే శరీరం, చైతన్యం రెండు ఉన్నాయి.

3. చైతన్యం శరీరం మీద ఆధారపడి లేదు. శరీరం అనాత్మ. శరీరం ఉన్నా లేకపోయినా, ఆత్మ ఉందని చెప్పగలగాలి.

అలాగే శరీరం, ఆత్మ రెండూ కలిసి ఉంటాయి. శరీరం ఒకటే ఉంటే నేను జడంగా ఉండేవాడిని. చైతన్యం ఒకటే ఉంటే 'నేను చైతన్యాన్ని', అని నేను చెప్పలేను. అందువల్ల నేను, 'నేను' అని చెపితే, నేను ఆకారం ఉన్న శరీరం + ఆకారం లేని చైతన్యాన్ని. ఈ రెండింటి కలయిక నుంచి, లోతైన వేదాంత విచారణ ద్వారా, నా బుద్ధిలో చైతన్యాన్ని, శరీరం నుంచి విడదీసి చూడటం నేర్చుకున్నాను.

నేను శరీరాన్ని, నాలో చైతన్యం ఉంది.

ఇది మొదటి దశ.

చైతన్యం నాలోనూ ఉంది, బయటా ఉంది.

ఇది రెండవ దశ.

నేను చైతన్యాన్ని. నాలో అన్ని శరీరాలు ఉన్నాయి.

ఇది మూడవ దశ.

శరీరం జడం, పాంచభౌతికం. శరీరం నాకొక ఉపాధి మాత్రమే. ఈ శరీరం పోతే, ఇంకో శరీరాన్ని తీసుకుంటాను. అలా నా వేదాంత విచారణ సశరీరం నుంచి అశరీరానికి సాగాలి. అది బాహ్య ప్రయాణం కాదు. అంతః ప్రయాణం. ఈ ప్రయాణం అర్థమవటానికి ఉపనిషత్తు ఒక ఉదహరణనిస్తున్నది.

ఆకాశంలో వాయువు, మేఘం, మెరుపు, ఉరుము నాలుగు ఉన్నాయి. అవి ఆత్మ. వాటికి శరీరం లేదు. మేఘాలకు రూపాలున్నట్టు కనిపిస్తాయి కదా అంటే వాటికి మనిషిలాగా అంగాలు లేవు. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు లేవు. సర్వవ్యాపకమైన ఆకాశం శరీరంతో పోల్చబడింది. వాన కురిసి వెలిశాక, ఆకాశం నిర్మలంగా ఉంది. వాయువు, మేఘం, మెరుపు, ఉరుములు ఏమయ్యాయి? అన్నీ అశరీరం అయిపోయాయి. అంటే అన్నీ ఆకాశంలో కలిసిపోయాయి. అన్నీ శరీరంలో కలిసిపోయాయి.

ఇది అజ్ఞాని అవస్థలాగా ఉంది. అజ్ఞాని అవస్థ అంటే ఏమిటి? అతనికి ఆత్మ గురించి విడిగా తెలీదు. ఆత్మ శరీరంలో కలిసిపోయింది.

| | |
|---|---|
| వాయువు, మేఘం, ఉరుము, మెరుపులు | – ఆత్మ |
| ఆకాశం | – శరీరం |
| నిర్మల ఆకాశం (రెండూ కలిసిపోవటం | – అజ్ఞాన అవస్థ) |

అజ్ఞానికి ఆత్మ–అనాత్మ వివేకం లేదు.

వాన కురవటానికి కారణం ఎవరు? సూర్యభగవానుడు. సూర్యుని వేడికి సముద్రం నుండి నీరు ఆవిరి అయి, కారుమేఘాలు ఏర్పడి, వాన కురుస్తుంది. వాన కురిసినప్పుడు, మేఘాలు, ఉరుములు, మెరుపులు వస్తాయి. ఈ మూడూ ఆత్మ అనుకున్నాం. ఈ మూడూ అనాత్మ అయిన శరీరం నుండి విడివడతాయి. ఇదే ఆత్మ–అనాత్మ వివేకం.

ముందేమో, వాన కురవకముందు, అన్నీ కలిసిపోయాయి. వానాకాలంలో ఆకాశం నుంచి వాయువు విడిగా, మేఘాలు విడిగా, ఉరుములు విడిగా, మెరుపులు విడిగా వస్తాయి. ఇవన్నీ ఆత్మ, ఆకాశం అనాత్మ! సూర్యభగవానుడు, వాన ద్వారా ఆత్మ–అనాత్మ వివేకం చూపాడు.

ఇప్పుడు దీన్ని శరీరానికీ, ఆత్మకు అన్వయిద్దాము. అజ్ఞానంలో ఉన్నప్పుడు (జ్ఞానం కలుగకముందు) ఆత్మ, అనాత్మ కలిసిపోయాయి. చైతన్యం ఆత్మ, శరీరం, అనాత్మ! జ్ఞానసూర్యుడు, గురువుద్వారా, ఆత్మ–అనాత్మ వివేకం చూపాడు. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**అశరీరో వాయురభ్రం విద్యుత్ స్తనయిత్నురశరీరాణ్యేతాని –** వాయువు అశరీరం. ఆత్మలాంటిది. అభ్రం–మేఘం; విద్యుత్–మెరుపు; స్తనయితు–ఉరుము; ఏతాని అశరీరాణి– ఇవన్నీ శరీరం లేనివి. వర్షం లేనప్పుడు ఇవి

ఆకాశంలో కలిసిపోతాయి. వానాకాలంలో ఏమవుతుంది?
**తద్యథైతాన్యముష్మాదాకాశాత్సముత్థాయ–** వేరే కాలంలో ఆకాశంలో కలిసిపోయిన ఇవి, వర్షాకాలంలో ఆకాశం నుంచి విడివడతాయి. ఎందువల్ల?
**పరం జ్యోతిరుపసమ్పద్య–** సూర్యభగవానునితో కలవటం వల్ల;
**అభినిష్పద్యన్తే–** అన్నీ బయటకు విడిగా వస్తాయి. ఎలా?
**స్వేనరూపేణ –** వాటి స్వస్వరూపంతో వస్తాయి–వాయువు, మేఘం, ఉరుము, మెరుపుగా!

ఇవన్నీ ఇంతకుముందు ఆకాశరూపంలో దాగి ఉన్నాయి.

అదే విధంగా, 'నేను' అసలు అర్థం చైతన్యం. కాని నేను అజ్ఞానంలో ఉన్నంతవరకూ నేను చైతన్యంగా కాక, స్థూల, సూక్ష్మ, కారణ శరీరరూపంలో ఉంటాను. జ్ఞానం పొందాకే, నేను శరీరం కాదు అని తెలుసుకుంటాను. ఇక్కడ పరంజ్యోతి – జ్ఞానం! అదే తర్వాత వచ్చే మంత్రంలో వస్తుంది.
**మంత్రం–3 ఏవమేవైష సంప్రసాదోస్మాచ్ఛరీరాత్సముత్థాయ –** ఇదే విధంగా, ఈ జీవాత్మ, ఈ సాధకుడు శాస్త్రం పదే పదే అధ్యయనం చేయటం వల్ల ఆత్మను శరీరం నుంచి విడదీయటం నేర్చుకుంటాడు. ఇక్కడ శరీరం అంటే శరీరత్రయం. స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు. నేను ఆత్మను, సంసారం నుంచి విముక్తి పొందాను అని తెలుసుకుంటాడు. కాని అది అంత తేలిగ్గా అంగీకరించలేడు. ఇక్కడ కూడా, 'నేను ఆత్మను అని బాగా అర్థమైంది; కాని నాకింకా కొన్ని విపరీతభావనలు పోలేదు. రాగద్వేషాలు, కామక్రోధాలు పూర్తిగా పోలేదు. వాటిని పూర్తిగా తొలగిస్తే కాని నేను ముక్తుడిని కాదు,' అంటాడు.

రెండు భిన్న వాక్యాలు – గుక్కతిప్పుకోకుండా, ఆలోచించుకోకుండా చెప్తున్నాడు.

నేను ఆత్మను
నాకు రాగద్వేషాలు ఉన్నాయి
అలా చెప్పితే ఆత్మస్థాయి నుంచి, అనాత్మ స్థాయికి దిగిపోతున్నాడు.
ఆత్మకు రాగద్వేషాలు లేవు. వాసనలు లేవు. నేను నిత్య శుద్ధుడిని.

మనసుకు రాగద్వేషాలు ఉన్నాయి, వాసనలు ఉన్నాయి.

మనసు నిత్య అశుద్ధం. మనసు అనాత్మ.

అందువల్ల **వాసనాక్షయానంతరం ముక్తోభవామి** అనుకుంటే శ్రవణం సరిగ్గా చేయనట్టు లెఖ్ఖ. అనాత్మస్థాయిలో అశుద్ధం ఉన్నా కూడా, ఆత్మగా నేను నిత్య శుద్ధుడను. అనాత్మ లక్షణాలు, ఆత్మనైన నాకు వర్తించవు. మనస్సును శుద్ధం చేసుకోవాలంటే, మీ సరదా కోసం చేసుకోండి. కాని, 'మనస్సు శుద్ధం అయ్యాకే నాకు మోక్షం వస్తుంది,' అని మాత్రం ఎన్నడూ అనకండి. అంటే వేదాంతం అర్థం కానట్టే.

నేను ముక్తుడను. ముక్తపురుషునిగా మనశ్శరీరాలు శుద్ధం చేసుకోవటం చూసి ఆనందిస్తాను. నేను శుద్ధం చేయను. నా సమక్షంలో, ఈ కార్యక్రమాలు కొనసాగనీ; కానీ ఎన్నడూ మనశ్శరీరాల స్థితితో మోక్షానికి లంకెపెట్టను.

గుర్తుంచుకోండి, మొదట్లో మోక్షాన్ని అనేక పరిస్థితులతో ముడి పెడతాము; కాని వేదాంత విచారణ చేశాక, మోక్షం బేషరతుగా వస్తుంది. దీన్నే సమత్థానం అంటారు. సమత్థానం అంటే మనస్సుకు సంబంధించిన అశుద్ధం నుంచి కూడా విడివడటం. 'నాకేం సంబంధం లేదు, నేను అశరీరుడిని,' అని చెప్పగలగాలి. 'నేను నిత్యముక్తుడిని,' అని చెప్పగలగటమే జ్ఞాననిష్ఠ. మనస్సు స్థాయిలో సాధ్యం కాదు కూడా. ఎంత చక్కగా స్నానం చేసినా, మూడు గంటలవగానే, శరీరం మళ్ళీ వాసన వేస్తుంది. అలాగే మనస్సు కూడా. ఎంతగా రాగద్వేషాలు పారద్రోలాలని చూసినా, మళ్ళీ మేమున్నామని దూసుకొస్తాయి. అందువల్ల మనస్సును స్వచ్ఛంగా చేయటం కోసం ఆగి, తర్వాత మోక్షం గురించి ఆలోచిస్తాను అనుకుంటే మాత్రం, మోక్షం గురించి మర్చిపోవచ్చు. అది ఎన్నటికీ సాధ్యం కాదు.

నేను నిత్యముక్తుడిని అంటున్నారు కదా, అయితే రేపటినుంచీ నేను స్నానం చేయను అంటే మీ పక్కన కూర్చునేవారు పారిపోతారు. నేను రాగద్వేషాలను పారద్రోలను అంటే మిమ్మల్ని పారద్రోలుతారు తక్కిన వాళ్ళు. అందుకని లోకసంగ్రహార్థం శరీరం, మనస్సులను శుద్ధంగా ఉంచటానికి ప్రయత్నం చేస్తూనే ఉండాలి. మోక్షార్థం ఏం చేయాలి? నేను ఆత్మను, తక్కినదంతా అనాత్మ అని జీర్ణించుకుంటే చాలు.

**పరంజ్యోతిరుపసమ్పద్య-** పరంజ్యోతి అంటే ఇక్కడ జ్ఞానం అని చూశాము. అహం బ్రహ్మ అస్మి లాంటి మహావాక్యాల జ్ఞానంతో సంబంధం కలగటం. **స్వేన రూపేణాభినిష్పద్యన్తే-** ఈ జ్ఞాని తన స్వస్వరూపంలో ప్రకటిత మవుతాడు.ఏ విధంగా? నిత్యముక్త ఆత్మగా.

తమాషా ఏమిటంటే, 'అయితే ఎప్పుడు నిత్యముక్తి వస్తుంది?' అంటారు కొందరు. అంటే పదాలను అర్థం చేసుకోకుండా, వాడేస్తూ ఉంటారు.

నేను ఆత్మను, నాకు రాగద్వేషాలు ఉన్నాయి.

ఈ వాక్యం ఎంత తప్పో, అలాంటిదే పై వాక్యం కూడా.

నేను నిత్యముక్తుడను. నాకు నిత్యముక్తి ఎప్పుడొస్తుంది?

వాల్మీకి రామాయణం ఎవరు రాశారు అని అడిగితే, ఎవరో అరగంటసేపు ఆలోచించి కంబన్ రాశాడు అన్నాడుట. అలా ఉంది ఇది కూడా.

నిత్యముక్తి రాదు. మోక్షం ఎప్పుడో భవిష్యత్తులో వస్తుంది అనే భావనే పోవాలి. అదే మోక్షం.

'సరే అయితే మోక్షం రావాలని కోరుకోకపోతే, మోక్షం వస్తుందా?'

ఇంకో అర్థం లేని ప్రశ్న. లౌకిక విద్య వేరు, ఆత్మవిద్య వేరు. లౌకిక విద్యలో ముందు ఒక వస్తువు గురించి నేర్చుకుంటాము, తర్వాత దాన్ని అనుభవిస్తాము. ముందు కాశీ గురించి వింటాము, తర్వాత వెళ్ళి చూస్తాము. ఆత్మ విద్యలో అలాకాదు. ఆత్మను అనుభవిస్తాము. కాని ఆత్మను అనుభవిస్తున్నట్టు తెలియదు. వేదాంతం ఆత్మ అనుభవాన్ని ఇవ్వదు, నువ్వు ఆత్మవు, నువు నిత్యముక్తుడవు అని తార్కికంగా విడమర్చి చెప్తుంది. అందువల్ల జ్ఞాని, స్వేన రూపేణాభినిష్పద్యతే అంటే స్వస్వరూపంలో ప్రకటితమవుతాడు.

ఈ తురీయ ఆత్మకు కూడా ఒక పేరు ఇవ్వాలి. ఇంతవరకు మూడుపేర్లు చూశాము. అక్షి పురుషుడు, స్వప్నపురుషుడు, సుప్త పురుషుడు. ఇప్పుడు తురీయ ఆత్మకు పేరు **ఉత్తమపురుషుడు.** గీతలో కూడా (15వ అధ్యాయంలో) ఈ పేరు చూస్తాము.

**ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ।**
**క్షరః సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే॥**

**ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః।**
**యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః॥గీత 15-16,17**

**స ఉత్తమ పురుషః -** తురీయ ఆత్మను ఉత్తమ పురుషుడు అనటమే కాదు, ఉత్తమ పురుష ఆత్మతో ఐక్యం పొందిన జ్ఞానిని కూడా ఉత్తమ పురుషుడు అంటున్నది ఉపనిషత్తు. ఇక్కడితో బోధ అయిపోయింది.

ఇక్కడ్నుంచి ఫలం వస్తుంది. ఫలం- జీవన్ముక్తి, విదేహముక్తి. పరంజ్యోతిరుపసమ్పద్య - ఎప్పుడైతే నేను శరీరం కాదు అని శరీరం నుంచి విడివడతానో, అప్పుడే శరీరం కున్న పరిమితులను 'నాకు' అపాదించుకోను. ఉపసంపద్య అంటే ఐక్యం పొందటం. దేనితో, చైతన్యంతో.

**శరీరాత్సముత్థాయ-** త్వం పద లక్ష్యార్థం

**పరంజ్యోతిరుపసమ్పద్య-** తత్ పద లక్ష్యార్థం

**అహం బ్రహ్మ అస్మి- ఐక్యం-** వచ్చింది కాబట్టి ఇదొక మహావాక్యం. స్వేనరూపేణ - బ్రహ్మలో ఉండటం అంటే బ్రహ్మనిష్ఠ. బ్రహ్మనిష్ఠ లేదా బ్రహ్మ ఐక్యం అంటే ఇంకో ఉన్నతస్థాయికి వెళ్ళటం కాదు. ఎందుకు? బ్రహ్మనిష్ఠ అంటే ఇంకో స్థాయికి వెళ్ళటం అంటే, అది కాలపరిమితిలోకి వస్తుంది. అలాగే ఉన్నతస్థాయికి వెళతారు అంటే దానికొక శుభారంభం ఉన్నట్టు లెక్క. ఆరంభం ఉన్న ప్రతిదీ అంతం కావాల్సిందే.

అందువల్ల మోక్షం, నేను పొందే ఒక స్థితి కాదు. మోక్షం అక్షరాలా నా స్వరూపం. అందువల్ల మోక్షం అంటే నా స్వస్వరూపాన్ని తెలుసుకోవటం. మరి పొందటం లేకపోతే మోక్షప్రాప్తి అని ఎందుకు అంటారు? అది లక్ష్యార్థంగా వాడబడింది. నేను బద్ధుడను అనే అపోహను తొలగించుకోవటమే, మోక్షం పొందటం. నిజానికి నేను మోక్షాన్ని పొందలేను;మోక్షాన్ని పొందనవసరం లేదు కూడాను.

**స్వేన రూపేణాభినిష్పద్యతే-** స్వస్వరూపం వచ్చినట్టుగా ఉంటుంది.

**సః-** అటువంటి జ్ఞాని, అక్షి పురుషుడు- (విరాట్) కాదు; స్వప్న పురుషుడు - (తైజస) కాదు; సుప్త పురుషుడు (ప్రాజ్ఞ) కాదు. అతను ఉత్తమ పురుషుడు.

ఇప్పుడు ఫలం. జ్ఞాని ఏ ఆశ్రమంలో ఉన్నా- బ్రహ్మచారి, గృహస్థ, వానప్రస్థ, సన్యాసి - ఏ వర్ణానికి చెందినా- బ్రాహ్మణుడు, క్షత్రియుడు,

వైశ్యుడు, శూద్రుడు – తన వర్ణాశ్రమ ధర్మాలను పాటిస్తాడు. సంఘం నుంచి పారిపోడు.

**సః –** ఈ ఉత్తమ పురుష జ్ఞాని,

**తత్ర –** బ్రహ్మలో; తన స్వస్వరూపంలో ఉంటాడు. స్వస్వరూపంలో నిలిచి ఉంటాడు; అంటే తన స్వరూపాన్ని మర్చిపోడు. వేదాంతం ఐదు సూత్రాలను ఎప్పుడూ గుర్తుంచుకుంటాడు.

పర్యేతి – యథేచ్ఛగా తిరుగుతాడు. ఆనందం పొందుతాడు.

సః తత్ర పర్యేతి– జీవన్ముక్తి పొందిన జ్ఞాని అంతటా తిరుగుతాడు. ఆత్మ అయిన నేను శరీరంలో ఉండటం కాదు; అన్ని శరీరాలూ ఆత్మ అయిన నాలో ఉన్నాయి అని అర్థం చేసుకుంటాడు. అందుకని ఎవరన్నా 'నువ్వు ఎక్కడ ఉన్నావు?' అంటే 'ఎక్కడ లేను' అని ఎదురుప్రశ్నిస్తాడు. ఇంద్ర శరీరంలోని చైతన్యం కూడా నేనే. ఇంద్రుడు రంభా, ఊర్వశుల నృత్యం చూసి ఆనందిస్తే ఆ ఆనందం ఎవరు పొందుతున్నారు?నేనే! నా ఆనందమే అనేక శరీరాల్లో ప్రకటితమవుతున్నది.

జీవన్ముక్తి లాభం ఏమిటి? జ్ఞాని ఒక వ్యక్తిగా ఆనందాల వెంట పరుగులు తీయదు. అందరూ ఆనందిస్తుంటే, అది తన ఆనందంగా భావిస్తాడు. ఉదాహరణకు తాతయ్య, బామ్మ ఇంటికి పిల్లలూ, మనవళ్ళు, మనవరాళ్ళు కొండకొచో ముని మనవళ్ళు, ముని మనవరాళ్ళు వస్తే, వాళ్ళందరినీ కళ్ళారా చూసే ఆనందిస్తారు.వాళ్ళతో కలిసి క్రికెట్టు ఆడలేరు, వాళ్ళతో కలిసి కరకరలాడేవి తినలేరు. ఒక్కోసారి వాళ్ళ మాట సరిగ్గా వినబడదు, కంటిచూపు ఆనదు. కాని వాళ్ళ కళ్ళనిండా ఆనందమే ఆనందం! ఇల్లంతా పెద్దలు సందడిగా తిరుగుతుంటే, పిల్లలు కేరింతలు కొడుతుంటే, వాళ్ళ వాళ్ళ మధ్య కూర్చుని మనసారా ఆనందిస్తారు. ఇంతకన్నా గొప్ప ఆనందం జ్ఞానిది! ఎందుకు? అతని కుటుంబం చిన్నది కాదు. వసుధైక కుటుంబం. అందుకని ఏదీ లోటు ఉండదు అతనికి.

**సోఽశ్నుతే సర్వాన్ కామాన్సహ। – తైత్తిరీయం**

ఆనందం వస్తువులో లేదు, నాలో ఉంది. అన్ని ఆనందాలు నావే అనుకుంటాడు జ్ఞాని. దీన్నే జీవన్ముక్తి అంటారు. అలా ఆలోచనలో మార్పు వచ్చినా కూడా, శరీరపరంగా అనుభవం ఎక్కడికీ పోదు. ఆకలి ఉంటుంది.

దాహం వేస్తుంది. ఇవి ప్రారబ్ధకర్మ మీద ఆధారపడి ఉంటాయి. దాన్ని ఎవరూ తప్పించుకోలేరు. సూర్యుడు ఉదయించడు, భూమి సూర్యునిచుట్టూ తిరగటం వల్ల సూర్యోదయమయినట్టుగా ఉంటుంది అని శాస్త్రపరంగా తెలిసినా కూడా, సూర్యోదయం, సూర్యాస్తమయం చూస్తూనే ఉంటాము. దాని ప్రకారం తిథులు లెఖ్ఖలు వేస్తారు కూడా. కాని మన బుద్ధిలో ఆలోచన మారుతుంది. ఒక ముఖ్యమైన సూత్రాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలి.

ఒక నిజాన్ని, మన అనుభవానికి భిన్నంగా ఉందని ఎన్నడూ త్రోసిపుచ్చకూడదు.

ఖచ్చితమైన నిజం – సూర్యుడు ఉదయించడు.

భిన్న అనుభవం – సూర్యోదయం అవుతుంది.

కాని నిజం తెలుసుకాబట్టి, నేను సూర్యోదయాన్ని చూస్తున్నా కూడా, సూర్యుడు ఉదయించడు అంటాను. అదే సూత్రం ఇక్కడ వర్తిస్తుంది.

ఖచ్చితమైన నిజం – నేను శరీరం కాదు, నెప్పి శరీరానికి సంబంధించినది.

భిన్న అనుభవం– శరీరం నెప్పి వేస్తుంది.

ఈ అనుభవాన్ని ఆపలేను. కాని అది నన్ను బాధించదు. నాకు నిజం తెలుసు కాబట్టి, నేను నెప్పిని అనుభవిస్తున్నా కూడా, నాకు బాధ లేదు అంటాను. నెప్పి శరీరానిది, బాధ మనస్సుది. ఇంకా మాట్లాడితే బాధ మనస్సు ద్వారా కోరి తెచ్చుకున్నది. నాకే ఎందుకు వచ్చింది, నేనేం నేరం చేశాను లాంటి ప్రశ్నలతో కుమిలిపోవటం ఉండదు. శరీరం నాది కాదు, మనస్సు కూడా నాది కాదు,అవి అనాత్మ అని తెలుసుకుంటాను. 'నెప్పిని అనుభవించే నేను, నెప్పికి యజమానిని కాను,' దాన్నే శరీరాత్ సముత్థాయ అంటారు.

అందుకని, గుర్తుంచుకోండి, ఆధ్యాత్మిక జ్ఞానం వల్ల శారీరక బాధలు కాని అనుభవాలు కాని ఆపలేరు. అందుకని, ఆధ్యాత్మిక బోధ అయ్యాక, గుండు సూదితో గుచ్చుకుని చూసుకోకండి. నెప్పి లేకపోతే జ్ఞానం వచ్చినట్టు, నెప్పి ఉంటే జ్ఞానం రానట్టు లాంటి అర్థంలేని అపోహలు పెట్టుకోకండి. నిజానికి నెప్పి లేకపోతే జ్ఞానం రావటం మాట దేవుడెరుగు, మీకేదో చర్మవ్యాధి వచ్చినట్టు గ్రహించి, డాక్టరు దగ్గరికి పరిగెత్తాలి.

అది జీవన్ముక్తి మాత్రం కాదు.

**జక్షద్ –** పంచభక్ష్య పరమాన్నాలను తినటం. నేనే అందరి రూపంలో తింటున్నాను;

**క్రీడన్–** నేనే అందరి రూపంలో ఆడుతున్నాను;

**రమమాణః–** నేనే అన్ని వస్తువులను, అన్ని అనుబంధాలను అనుభవిస్తున్నాను.

**స్త్రీభిర్వా యానైర్వా జ్ఞాతిభిర్వా–** గృహస్థులు వాళ్ళ భార్యలతో ఆనందిస్తున్నా, వాహనాలతో, బంధువులతో ఆనందిస్తున్నా, నేనే అనుభవిస్తున్నాను అనుకుంటాడు. ఎవరైనా బెంజి కారులో వెళ్తుంటే తనకు సైకిల్ మాత్రమే ఉన్నా బాధపడడు. తనే వెళ్తున్నట్టుగా ఆనందిస్తాడు.

ఒక్కముక్కలో చెప్పాలంటే జీవితంలో ఏదీ లేదనుకోడు. ఒంటరితనం బాధించదు. సంసారంలో ఒక దశలో ఈ ఒంటరితనం, బాగా పట్టి పీడిస్తుంది. కాని జ్ఞానికి ఈ బాధ ఉండదు.

**ఆత్మన్యేవ చ సంతుష్టః తస్య కార్యం న విద్యతే॥ –గీత 3–17**

జగత్తంతా నాలో ఉంది అనే జ్ఞానికి ఒంటరితనం ఎక్కడిది?

**నోపజనగ్ం స్మరన్నిదగ్ం శరీరమ్–** ఈ స్థూల శరీరాన్ని స్మరించదు. ఉదాహరణకు వ్యక్తిగా నాకు శారీరక బాధలేవో ఉన్నా, కుటుంబంలో ఏదో వేడుక అవుతుంటే, నా వ్యక్తిగత బాధను మర్చిపోతాను. అలాగే జ్ఞాని సమష్టిపరంగా ఎదిగినప్పుడు, వ్యష్టిపరంగా బాధ తెలియదు. అందుకే మరణం గురించి కూడా బాధపడడు. మరణం శరీరానికి కాని, తనకు కాదు అని తెలుసుకుంటాడు.

శరీరం మీద రెండు రకాల అభిమానాలు ఉంటాయి.

**1. సామాన్య అభిమానం –** ప్రారబ్దకర్మ వల్ల ఏర్పడిన ఈ శరీరంతో మమేకం చెందటం సామాన్య అభిమానం. ఇది ఈశ్వర సృష్టి. ఈ అనుబంధం ప్రారబ్ధం ఉన్నంతవరకూ కొనసాగుతుంది. ఇది ఏమీ బాధను సృష్టించదు. ఆకలివేస్తే అన్నం పెడతాను. వాసనవేస్తే, స్నానం చేస్తాను. శరీరానికి చేయాల్సిన ధర్మాలు చేస్తాను. ఇది ప్రారబ్ద అభిమానం.

**2. విశేష అభిమానం –** నా అజ్ఞానం వల్ల ఈ శరీరంతో మమేకం చెందటం విశేష అభిమానం. ఇది జీవసృష్టి. అంతకుముందు చూసినట్టు నాకే ఎందుకు వచ్చింది అని రకరకాలుగా వాపోవటం. నెప్పి అనేది ఒక

చిన్న చుక్క. అది ప్రారబ్ధ జన్యం. దాని చుట్టూ మనం అనేక వలయాలు గీసుకుంటాం. నాకే ఎందుకు వచ్చింది– ఒక వలయం; ఇన్ని పూజలు చేస్తున్నాను, దేవునికి నామీద దయలేదా ఇంకో వలయం; దీనివల్ల నేను ఎందుకూ కొరగాకుండా పోతాను – మరో వలయం; దీనితో నా జీవితం ముగిసిపోయినట్టే – మరింత పెద్ద వలయం; ఇదంతా అజ్ఞానం వల్ల కోరి తెచ్చుకున్న బాధ; ఇది అజ్ఞాన జన్య అభిమానం. జ్ఞానికి ఈ రెండో అభిమానం ఉండదు.

ఉపజనం శరీరం – స్త్రీపురుష సంయోగం వల్ల జన్మించిన ఈ శరీరం మీద జ్ఞానికి అభిమానం ఉండదు. అందుకని అతన్ని జీవన్ముక్తుడు అంటారు. జీవితం నడపటానికి అవసరమైన వ్యక్తిత్వం ఉంటుంది; కాని బంధకత్వం ఏర్పరచేటంత గట్టి వ్యక్తిత్వం ఉండదు. ఇది వర్ణించటానికి శాస్త్రం ఒక అద్భుతమైన ఉదాహరణనిస్తుంది. వేయించిన గింజ. ఒక గింజను వేయించినా అది చూడటానికి పచ్చిగింజలాగానే ఉంటుంది. పచ్చిగింజ నుంచి మొలకలు వస్తాయి కాని వేయించిన గింజ నుంచి మొలకలు రావు.

అలాగే జ్ఞానికి కూడా అహంకారం కొనసాగుతుంది. ఈ విషయం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. జ్ఞానికి కూడా అహంకారం ఉంటుంది. ఆకలి వేస్తే పోయి, 'భవతీ భిక్షాందేహీ' అంటాడు. తన శరీరాన్ని తక్కిన శరీరాల నుంచి విడదీసి చూడగలిగేటంతమేరకు అహంకారం ఉంది. అది కూడా లేకపోతే, ఆహారం తీసుకు వెళ్ళి ఎదుటివారి నోట్లో పెడతాడు; అందువల్ల ఇది నా శరీరం, ఇది నీ శరీరం అనే చిన్న తేడా తెలుసు! కాకపోతే జ్ఞాని అహంకారం వేయించిన గింజలాంటిది. అందువల్ల జ్ఞాని కర్మ చేసినా, పుణ్య పాపాలనే మొలక మొలవదు. కాని అజ్ఞాని కర్మ చేస్తే ఆగామి పుణ్యపాపాలు మొలక మొలిచి, చెట్టుగా వస్తాయి.

ఇక్కడ్నుంచి ప్రజాపతి ఈ తురీయ చైతన్యమే తక్కిన పురుషులు కూడా అని చెప్తాడు. అంతకుముందు తన బోధను అక్షి పురుషునితో మొదలుపెట్టి, ఉత్తమపురుషునితో ముగించాడు. ఇప్పుడు వెనుకనుంచి ముందుకు వెళుతున్నాడు. ఈ ఉత్తమ పురుషుడే సుప్తపురుషుడుగా, స్వప్నపురుషుడుగా, అక్షిపురుషుడుగా శరీరంలో సంచరిస్తున్నాడు అని చెప్తున్నాడు. అంటే ఈ నాలుగు ఒకటే అని నిరూపించాలి. ఒకే నటుడు

నాలుగు భిన్న పాత్రలను ధరించినట్టుగా ఈ తురీయమే విశ్వ, తైజస, ప్రాజ్ఞగా వ్యవహరిస్తోంది. ఎక్కడ? శరీరంలో. అందుకే ఉపనిషత్తు శరీర వర్ణననిస్తోంది. ఏమిటా శరీరం?

**అస్మిన్ శరీరే ప్రాణోయుక్తః –** మనకున్న ప్రారబ్ధకర్మ ప్రకారం, ఈశ్వరుడు ఈ శరీరాన్ని సృష్టించాడు. శరీరం సృష్టించాక, భగవంతుడు ఏం చేశాడు? శరీరంలో ప్రాణాన్ని ప్రవేశపెట్టాడు. కేవలం స్థూల శరీరం వ్యవహారం నడపలేదు. దానికి సూక్ష్మశరీరం కావాలి. స్థూలశరీరం ఒక కారు అనుకుంటే, సూక్ష్మ శరీరం దానికొక ఇంజను. సూక్ష్మశరీరం అంటే ప్రాణం. సూక్ష్మశరీరం కూడా జడమే. అందువల్ల మనస్సు, శరీరాలను నడటానికి చైతన్య స్వరూపం ప్రవేశపెట్టబడింది. చైతన్యమే అనుభవించే నేను. శరీరం, ప్రాణాల వెనుక ఆత్మ ఉంది. ఎలా ఉంది? అక్షిపురుషుడు వగైరాలలాగా.

అది తర్వాత వచ్చే మంత్రంలో వస్తుంది. ఇది దానికి ఉపోద్ఘాతం. ఈ భావాన్ని తెలియ చేయటానికి, ఉపనిషత్తు ఒక ఉదాహరణనిస్తున్నది.

**స యథా ప్రయోగ్య ఆచరణే యుక్తః –** ఒక బండికి కట్టిన ఒక గుర్రంలాగా ఉంది. స్థూల శరీరం బండి; సూక్ష్మ శరీరం గుర్రం. ఈ రెండూ కలుపబడి ఉన్నాయి; వాహనం సిద్ధంగా ఉంది; కాని దాన్ని నడిపే యజమాని దానిమీద వచ్చి కూర్చుంటేనే అది నడుస్తుంది. అలాగే స్థూల శరీరం అనే బండి ఉంది; సూక్ష్మ శరీరం అనే ప్రాణం ఉంది. దానికి రథసారథి లేదా యజమాని ఆత్మ. కాని ఆ ఆత్మే అక్షిపురుషుడు లేదా జాగ్రద్‌పురుషుడు లేదా విశ్వగా ఉంది. నేను అన్నప్పుడల్లా నేను ఉత్తమపురుషుడిని, కాని నేను శరీరం, ఇంద్రియాల వెనుక ఉన్నాను. అదే తర్వాత వచ్చే మంత్రంలో వస్తుంది.

**మంత్రం – 4** ఇక్కడ ఒక అపోహను తొలగిస్తున్నది ఉపనిషత్తు. ఏమిటది?

విశ్వ జాగ్రదావస్థలో, తైజస స్వప్నావస్థలో, ప్రాజ్ఞ సుషుప్తి అవస్థల్లో అందుబాటులో ఉంటే, తురీయం తురీయావస్థలో అందుబాటులో ఉంటుందా? తురీయాన్ని అనుభవించటానికి నిర్వికల్ప సమాధిలాంటి ఉన్నతస్థాయికి వెళ్ళాలా?

అది అవసరం లేదు అంటున్నది ఉపనిషత్తు. అదే తురీయం జాగ్రదావస్థలోనూ ఉంది. విశ్వ, తురీయం లక్ష్యార్థం ఒక్కటే. సర్వవ్యాపకమైన ఆకాశమే ఈ గదిలోనూ ఉంది.

బయట ఉన్న ఆకాశం శుద్ధమైనది, హాలులోనిది శుద్ధం కాదు అనే భావన ఉంటే అది తప్పు.

శుద్ధ తురీయమే జాగ్రదావస్థలో కూడా ఉంది.వెంటనే ఇంకో సందేహం! జాగ్రదావస్థలో మనస్సు రాగద్వేషాలనే అశుద్ధంతో నిండి ఉంటుంది. అందుకని ఆ మనస్సుకు అతీతంగా ఎదగాలా? అవసరం లేదంటున్నది ఉపనిషత్తు! చైతన్యం మనసంతా వ్యాపించినా, మనస్సుకున్న మలినాలేవీ చైతన్యానికి అంటవు. అందుకని మనస్సు నిండా రాగద్వేషాలు ఉన్నా కూడా, నేను రాగద్వేష కామక్రోధాలకు అతీతుడిని అని చెప్పవచ్చు. ఎందుకంటే అనాత్మ అయిన మనస్సు అశుద్ధం, ఆత్మ అయిన నన్ను అంటలేవు.

తర్వాత వ్యవహారం నడపటానికి మనస్సును శుద్ధి పరచు కోవాలంటే, పరచుకోవచ్చు కాని, మోక్షం కోసం అవసరం లేదు. మోక్షం అనేది ఎప్పుడో భవిష్యత్తులో జరిగే సంఘటన కాదు. మనస్సు అల్లకల్లోలంగా ఉన్నా కూడా 'అహం శాంతః అస్మి.' ఎందుకంటే మనస్సు స్థితి నన్నేం చేయలేదు. జాగ్రదావస్థలో కూడా నేను తురీయమే. అదే అజ్ఞానికైతే జాగ్రదావస్థలో తను విశ్వ, స్వప్నావస్థలో తైజస, కాని నాకు కాదు. నేను తురీయాన్ని ఎప్పుడు అనుభవిస్తాను అంటే నిర్వికల్ప సమాధిలో అనకూడదు. అది నిజం కాదు. ఎప్పుడు అనుభవించటం లేదు అని ప్రశ్నించ గలగాలి! సినిమా తెర సినిమా జరుగుతున్నప్పుడు కూడా ఎలా అసంగమో, అలా నేను అన్ని అవస్థల్లోనూ అసంగంగా, తురీయ చైతన్యంగా ఉన్నాను. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**అథ యత్రైదకాశ మనుషణ్ణం చక్షుస్స చాక్షుసః పురుషః –** చాక్షుస పురుషః అంటే అక్షిపురుషుడు. అక్షి పురుషుడంటే జాగ్రదావస్థలో విశ్వ. చైతన్యం 5 లక్షణాల్లో రెండవది ఏమిటి?

**చైతన్యం స్వతంత్రమైనది. శరీరమంతా వ్యాపించి శరీరాన్ని చైతన్యవంతం చేస్తుంది. కాని శరీరం వల్ల అశుద్ధమవదు.**

**అనువిషణ్ణం చక్షుః –** ఈ చైతన్యం కన్నులో ఉంది. ఇక్కడ చక్షుః అంటే చక్షురింద్రియం. ఆ కన్ను ఎక్కడ ఉంది? ఆకాశః – ఆకాశంలో. ఇక్కడ ఆకాశం అంటే కనుగుడ్డు. కనుగుడ్డును గోళకం అనీ, కంటిచూపు ఇంద్రియం అనీ అంటారు. గోళకంలో ఇంద్రియం ఉంది. ఇంద్రియంలో చైతన్యం

వ్యాపించి ఉంది. ఆ చైతన్యాన్ని నేనే. దాని పేరేమిటి? తురీయం. జ్ఞాని తురీయం అంటే, తక్కిన వాళ్ళు అక్షి పురుషుడు అంటారు. నిజానికి అది తురీయమే.

ఇవన్నీ చూస్తే, మనకు ఎప్పుడూ తురీయ అనుభవం ఉంటూనే ఉంది. ఇది చాలా ముఖ్యం. మామూలుగా మనమేమనుకుంటాము? 'నాకు తురీయం గురించి జ్ఞానం ఉంది, కాని దాని గురించిన అనుభవం లేదు!' కాని ఉపనిషత్తు అంటుంది, తురీయ అనుభవం ఎప్పుడూ ఉంది. నేను నిన్ను చూస్తున్నాను అంటే ఆ నేను ఎవరు? గోళకం, ఇంద్రియాల వెనుకనున్న తురీయాన్ని, స చక్షుసః పురుషః– ఎక్కడ కన్నులుంటే అక్కడ తురీయం ఉంటుంది. కన్నులేమిటి?

దర్శనాయ చక్షుః – కన్ను ద్వారా నేను రంగులు, రూపాలను అనుభవిస్తాను. ఎలా అనుభవిస్తాను? దాని గురించి ఏమీ పని చేయను. కేవలం చూస్తేనే రంగులూ, రూపాలూ తెలుస్తున్నాయి. అందుకని చూసేవి కళ్ళు. ఒకవేళ నేను కళ్ళు మూసుకుంటే ఏమవుతుంది? రంగులు, రూపం మాయమవుతాయి; కాని నేను, వాటిని చూసే నేను, మాయమవను. ఇదే సూత్రం ఘ్రాణ ఇంద్రియానికి కూడా వర్తిస్తుంది.

**అథ యో వేదేదం జిఘ్రాణీతి స ఆత్మాగన్ధాయ ఘ్రాణమ్–** ఏదైతే నేను ఆఘ్రాణిస్తున్నాను అని తెలుస్తున్నదో అది ఆత్మ. ఘ్రాణేంద్రియం తురీయ ఆత్మ వల్ల పనిచేస్తుంది.

**ప్రతిబోధ విదితం మతం – కేన 2–4**

అంతకుముందే చూసినట్టుగా లౌకిక విద్యలో జ్ఞానం ముందు పొందాక, అనుభవం తర్వాత వస్తుంది. ఆత్మజ్ఞానం విషయంలో అలా కాదు. అనుభవం ఎప్పుడూ ఉంటుంది. జ్ఞానం తర్వాత వస్తుంది. అనుభవం ముందే ఉంటుంది కాబట్టి, జ్ఞానం పొందాక, మళ్ళీ అనుభవం కోసం ప్రయత్నించనవసరం లేదు.

**నేను నిత్యతురీయ చైతన్యాన్ని**

అందువల్ల తురీయ ఆత్మ ప్రతి ఇంద్రియం వెనుకా ఉంది. తురీయ ఆత్మనైన నేను ప్రతి ఇంద్రియం వెనుకా ఉన్నాను. నేను తురీయం అని అర్థం చేసుకోగలగాలి.

నేను తురీయం అని ఒప్పుకోవటం జ్ఞానం. జ్ఞానం పొందటానికి గురువు కావాలి. అనుభవం పొందటానికి ఏదీ అఖ్ఖరలేదు. ఎందుకంటే అనుభవం ఎప్పుడూ ఉంటుంది.

**యో వేదేదమభివ్యాహరాణీతి స ఆత్మాభివ్యాహారాయ వాక్ –** ఏదైతే నేను ఈ మాటలను పలుకుతున్నాను అంటుందో అది తురీయం; వాక్కు తురీయం వల్లే పనిచేస్తుంది.

**అథ యో వేదేదగ్ం శృణవానీతి సాత్మా శ్రవణాయ శ్రోత్రమ్–** ఏదైతే నేను వింటున్నాను అంటుందో అది చెవి. చెవి తురీయం వల్లే పనిచేస్తోంది.

నేను చూస్తున్నాను; నేను ఆఘ్రాణిస్తున్నాను; నేను మాట్లాడుతున్నాను; నేను వింటున్నాను; ఈ మాటలన్నింటిలోనూ నేను చేస్తున్నాను అన్నది నిరంతరం ఉంది. ఏమిటి చేస్తున్నానో మారుతుంది. మారని చైతన్యం మారే ప్రతి అనుభవం వెనుకా ఉంది. ఇంద్రియాలతో వ్యవహారం నడిపేది విశ్వ. ఇంద్రియాలు తీసేస్తే మిగలే శుద్ధ చైతన్యం తురీయం.

అందుకే తురీయం ఎప్పుడు అనుభవిస్తాము అంటే తురీయ అవస్థలో అనకూడదు. మూడు అవస్థల్లోనూ అనుభవిస్తాము. శరీరంకున్న పరిమితులను చైతన్యానికి ఆపాదిస్తున్నాము. అందుకని నేను చేస్తున్నాను – అంటే అది తురీయం.

**మంత్రం–5** అదే భావన కొనసాగుతున్నది – జాగ్రదావస్థలో కూడా ఉన్నది తురీయమే. ఇంద్రియాలు, గోళకాల ద్వారా తురీయం ప్రపంచాన్ని చూస్తున్నది. అదేమీ చర్య చేయటం లేదు. దీనికి ఒక ఉదాహరణ చూద్దాము.

అగ్నిలో వేలుపెడితే (నిజంగా చేయకండి, ఇది ఉదాహరణ మాత్రమే) అగ్ని నా వేలును కాల్చింది అంటాము. ఈ వాక్యం పలికితే, ఎలా అర్థం వస్తుందంటే, నేను అగ్నిలో వేలు పెడితే, అగ్ని నా చేతిని కాల్చటమనే పనిని చేయటం మొదలుపెట్టింది; వేలు అగ్నిలో ఉన్నంతసేపూ కాలుస్తున్నది; నేను వేలును తీసేస్తే, కాల్చటం ఆపేసింది అని. అంటే అగ్ని కాల్చే పనిని చేస్తోందన్న అర్థం వస్తుంది. కాని నిజానికి అగ్ని ఏమీ చేయదు. దాని స్వభావం ఉష్ణం (వేడి). ఏదైనా చర్య చేయటం అంటూ జరిగితే, అది వేలు చేసింది. అగ్నిలో పెట్టే చర్య, అగ్నిలోంచి తీసే చర్య వేలు చేసింది. అగ్నిపరంగా చూస్తే, అది ముందెలా ఉందో, ఇప్పుడూ అలాగే ఉంది. అగ్ని ఫలానా సమయంలో

ఫలానా పని అంటూ ఏమీ చేయలేదు. అగ్ని ఏమీ చేయకుండానే, 'అగ్ని నా వేలు కాల్చింది' అంటాము.

చైతన్యం విషయంలోనూ అంతే. చైతన్యం ఏమీ చర్య చేయకుండానే, బాహ్య ప్రపంచాన్ని అనుభవిస్తుంది. కళ్ళు తెరిచి ఉంచితే, చైతన్యం అనుభవించే చర్య ఏమీ చేయదు. జరిగేదేమిటంటే, రూప ప్రపంచం చైతన్యం పరిధిలో పడి, చైతన్యం ఎఱుకలోకి వస్తుంది. అలా చర్య చేయని తురీయం జాగ్రదావస్థలో కూడా ఉంది. ఇంద్రియాల ద్వారా జగత్తును అనుభవి స్తున్నట్టుగా ఉంది.

ఇదే సూత్రం మనస్సుకు కూడా వర్తిస్తుంది. మనస్సులో ఆలోచనలు కలుగుతుంటే, అవి మనస్సుకు చెందినవి. కాని చైతన్యమైన నేను ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షీభూతంగా చూస్తాను. కాని మనమేమంటాం? 'నేను ఆలోచిస్తున్నాను, నాకు కోపంగా ఉంది' అంటాము. నిజానికి అవి కూడా చర్యలు కాదు అంటున్నది ఉపనిషత్తు. మనస్సు సమక్షంలో తురీయం ఆలోచించే వాడు అవుతుంది. అందువల్ల శ్రోత, ద్రష్ట, ఘ్రాత అందరూ తురీయమే. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**అథ –** అదేవిధంగా. అంతకు ముందు మంత్రంలో ఇంద్రియాల పనితీరు గురించి వచ్చింది. ఇప్పుడు మానసిక వ్యాపారం గురించి వస్తున్నది. ఇంతకుముందు బాహ్యకారణాలు అయితే, ఇప్పుడు అంతఃకారణాలు.

**యో వేదేదం మన్వానీతి స ఆత్మా–** జాగ్రద్ పురుషుడు అయిన విశ్వ నేను ఆలోచిస్తున్నాను అంటే, ఆ ఆలోచించే వాడు తురీయం. మనస్సు పాత్ర ఏమిటి?

**మనోఽస్య దైవం చక్షుః –** తురీయ ఆత్మకు మనస్సు ఇంకో విధమైన కన్ను. ఎటువంటి కన్ను? ప్రమాత ప్రమేయాన్ని చూడటానికి వాడే ప్రమాణం కన్ను. మనస్సును దివ్యచక్షువు అని ఎందుకన్నారు? కన్ను అనే ఇంద్రియంతో ఎదురుగుండా ఉండే వస్తువులనూ, ఎదురుకుండా జరిగే సంఘటనలను మాత్రమే చూడగలము. గతంలో జరిగింది కాని, భవిష్యత్తులో జరగబోయేది కాని చూడలేము. అలా చూడగలిగితే, మీ ముత్తాతను చూసి ఉండేది. కాని మనస్సు అలా కాదు; అది గతాన్ని అర్థం చేసుకోగలదు; భవిష్యత్తును దర్శించగలదు.

అందుకని మనస్సు త్రికాలదర్శిని అయింది. అందుకని దివ్యచక్షువైంది.

**స వా ఏష ఏతేన దైవేన చక్షుసా మనసా –** ఆత్మ ఒకటే కాని మనస్సులు అనేకం. అందువల్ల జ్ఞాని చెపుతాడు. 'నేను మొత్తం జగత్తును అనుభవి స్తున్నాను. ఒక్క మనస్సుతో కాదు, ఒక్క మనస్సు జగత్తు మొత్తాన్ని అనుభవించలేదు. అందుకని అందరి మనస్సులద్వారా నేనే జగత్తు మొత్తాన్ని అనుభవిస్తున్నాను.

**ఏతాన్కామాన్పశ్యన్రమతే–** అన్ని భోగాలను మనస్సులోనే ఆనందిస్తున్నాడు. కామం అంటే ఇక్కడ కోరిక కాదు. కామ అంటే ఇంద్రియ భోగాలు లేదా విషయాలు. వాటిని ఒక్క మనస్సు కాదు, అన్ని మనస్సులతో అనుభవిస్తున్నాడు. ఈ ఇంద్రియ భోగాలు ఎక్కడున్నాయి?

**య ఏతే బ్రహ్మలోకే –** బ్రహ్మలోకంలో. బ్రహ్మలోకం అంటే ఇక్కడ బ్రహ్మలోకం కాదు. బ్రహ్మలోకం అంటే బ్రహ్మ చైతన్యం. సర్వగత బ్రహ్మ చైతన్యం! అన్నీ బ్రహ్మ చైతన్యంలో ఉన్నాయి.

జ్ఞాని 'అన్నీ బ్రహ్మ చైతన్యంలో ఉన్నాయి,' అనడు. ఎందుకంటే అన్నీ బ్రహ్మచైతన్యంలో ఉన్నాయి కాని తను దుఃఖంలో ఉన్నట్టు అవుతుంది. అందుకని 'అన్ని భోగాలూ నాలో ఉన్నాయి,' అంటాడు. ఎలాగైతే స్వప్న ప్రపంచ భోగాలు జాగ్రద్ పురుషునిలో ఉన్నాయో అలాగే జాగ్రద్ ప్రపంచ భోగాలు నాలో, బ్రహ్మ చైతన్యంలో ఉన్నాయి. అందుకని జ్ఞాని జీవితం ఆనందమే ఆనందం.

గుర్తుంచుకోండి. అతని శరీరం కూడా వృద్ధాప్యానికి లోనవుతుంది; అనారోగ్యం పాలవుతుంది కాని అతను ఈ ఒక్క శరీరం మీద దృష్టి నిలపడు. అన్ని శరీరాలు అతనిలోనే ఉన్నప్పుడు, సమష్టిలో కొన్ని శరీరాలు బాధపడినా, ఆ శాతం చాలా తక్కువ అవుతుంది. అందువల్ల అతనికి జగత్తు అంటే బాధామయం కాదు, సుందరమయం. జగత్తు విశ్వరూప అనాత్మ అని తెలుసుకుంటాడు.

**మంత్రం–6** ఇక్కడ ఉపనిషత్తు దహరవిద్యను ముగించబోతున్నది. ఈ అధ్యాయం మొదట్లో 1–6 ఖండాల వరకూ సగుణ బ్రహ్మరూపంలో దహరవిద్యను చూశాము. 7–12 ఖండాల వరకూ, అదే దహరవిద్య నిర్గుణ

బ్రహ్మ విద్య ద్వారా చూశాము. శిష్యులుగా ఇంద్రుడు, విరోచనుడు మొదట వచ్చినా, ఇంద్రుడే చివరిదాకా మిగిలాడు. ఈ మంత్రం ఫలశ్రుతిని చెపుతున్నది.

**తం వా ఏతం దేవా ఆత్మానముపాసతే –** ఇంద్రుడు, ఇంద్రుని ద్వారా తక్కిన దేవతలు, ఈ తురీయ ఆత్మను గురించి నేర్చుకున్నారు. తురీయ ఆత్మే విశ్వ, తైజస, ప్రాజ్ఞ రూపంలో ఉంది. ఉపాసతే అంటే నిదిధ్యాసనం చేస్తున్నారు. నిదిధ్యాసనం చేస్తున్నారు అంటే శ్రవణ, మననాలు కూడా చేశారని అర్థం. శ్రవణ, మననలు చేయనిదే నిధి ధ్యాసనంకు రాలేరు.దీని ఫలం ఏమిటి?

**తస్మాత్తేషాగ్ం సర్వేచ లోకా అత్తాః –** ఈ జ్ఞానయోగం వల్ల సర్వలోకాలనూ పొందారు. అన్ని లోకాలూ నా నుంచే పుట్టాయి. నాలోనే ఉంటాయి. నాలోనే లయమవుతాయి.

**మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితం – కైవల్యం**

అలలు సముద్రానికి భిన్నంగా లేనట్టుగా, జగత్తు నాకు భిన్నంగా లేదు. ఈ జ్ఞానం పొందితే, అన్నీ పొందినట్టే. నాలుగు పురుషార్థాలూ పొందుతారు. ధర్మార్థకామాలు పొందితే మోక్షం పొందరు. కాని మోక్షం పొందితే ధర్మార్థకామాలు కూడా పొందుతారు.

**సర్వే చ కామాః (అత్తాః) –** అన్ని భోగాలూ పొందుతాడు.

ప్రజాపతి చాటింపు వేయించినప్పుడు ఈ రెండు ఫలాలూ దక్కుతాయని చెప్పాడు.

**స సర్వాగ్ంశ్చ లోకానాప్నోతి సర్వాగ్ంశ్చ కామాన్ యస్తమాత్మానమనువిద్య విజానాతీతి హ ప్రజాపతిరువాచ – 8 – 7 – 1**

దేవతలు పొందారు అని ముగిస్తే దేవతలే జ్ఞానం పొందగలరు కాబోలు, ఈ కలియుగంలో కుదరదు అనుకునే ప్రమాదం ఉంది. అందుకే ఎవరు ఈ జ్ఞానం పొందితే, వాళ్ళు పూర్ణత్వం పొందుతారు అని చెపుతున్నది.

**స సర్వాగ్ంశ్చ లోకానాప్నోతి సర్వాగ్ంశ్చ కామాన్ యస్తమాత్మానమనువిద్య విజానాతీతి హ ప్రజాపతిరువాచ ప్రజాపతిరువాచ**

అందుకే ప్రజాపతి ఎలా చాటింపు వేయించాడో, అదే పదాలతో ముగించింది ఉపనిషత్తు. రెండుసార్లు ప్రజాపతిరువాచ అని చెప్పటంతో ఈ దహరవిద్య కూడా ముగిసిందని అర్థం.

కాని ముందుకు సాగేముందు, తురీయం గురించిన ఒక ముఖ్యమైన అంశాన్ని గమనించాలి.

**చతుర్థం మన్యంతే స ఆత్మా॥ - మాండూక్య 7**

మాండూక్యోపనిషత్తులో ఈ మంత్రంలోనే తురీయం విశ్వ, తైజస, ప్రాజ్ఞలకు భిన్నమైనది అని వస్తుంది.

**నాన్తః ప్రజ్ఞం న బహిఃప్రజ్ఞః నోభయతః ప్రజ్ఞ న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞం నాప్రజ్ఞం - - మాండూక్య 7**

కాని ఇక్కడ ఛాందోగ్యంలో నాలుగవ మంత్రంలో తురీయమే విశ్వ, తైజస, ప్రాజ్ఞగా ఉంది అని వస్తున్నది. అందువల్ల ఏది నిజం? తురీయం ఈ మూడింటికన్నా భిన్నమైనదా, ఈ మూడింటికీ చెందినదా?

మీ ఫొటో మీదేనా, మీకు భిన్నంగా ఉందా? మీరు జాగ్రత్తగా గమనిస్తే, రెండు రకాలుగానూ భావిస్తాము మనము. ఉదాహరణకు మన పూజ గది లో, మన గురువుగారి ఫొటో పెట్టుకుంటాము కదా! అద్వైత వేదాంతానికి మన కాలంలో తొలి గురువు దయానంద సరస్వతీ స్వామీజీ. ఎవరైనా వచ్చి మీ గురువు ఎవరు అని అడిగితే, ఆయన ఫొటో చూపిస్తాము. వాళ్ళు కూడా భక్తిగా ఫొటో దగ్గరకు వచ్చి, ఆయనకు నమస్కారం పెట్టుకుంటారు. అంటే అక్కడ ప్రతిబింబాన్ని, బింబానికి భిన్నంగా చూడలేదు. రెండూ ఒకటే. భేద అభేద విలక్షణం అంటారు దీన్ని.

ఇదే జవాబు తురీయం విషయంలో కూడా. తురీయం బింబం. విశ్వ, తైజస, ప్రాజ్ఞలు ప్రతిబింబాలు. అంటే తురీయం అవతారాలు అవి– వీటిని కూడా గౌరవిస్తాము. రాముడు, కృష్ణుడు అవతారాలు అయినా వాళ్ళను విష్ణుమూర్తి అంశాలుగా కొలుస్తాము.

అద్దంలో మీ ప్రతిబింబం కనిపిస్తుంది కదా! మీరు బొట్టు పెట్టుకోవాలనుకుంటే మీ ముఖానికి (బింబానికి) పెడతారా, ప్రతిబింబానికి పెడతారా? బింబ ముఖానికే పెడతారు. రెండూ ఒకటే అనీ గ్రహిస్తారు, అద్దంలో కనబడేది ప్రతిబింబం అనీ తెలుసుకుంటారు.

శుద్ధమైన తురీయాన్ని అనుభవించాలని నాకు ఉంది అనలేరు. ఎందుకంటే శుద్ధ తురీయం అవ్యవహారి. అందుకని తురీయం కోసం ఎక్కడో వెతకకండి.

జాగ్రద్ స్వప్న సుషుప్తి అవస్థల్లో విశ్వ, తైజస,ప్రాజ్ఞగా ప్రకటితమవుతున్నదని తెలుసుకోండి.

**త్రయోదశః ఖణ్డః (13)**

**శ్యామాచ్ఛబలం ప్రపద్యే శబలాచ్ఛ్యామం ప్రపద్యే। అశ్వ ఇవ రోమాణి విధూయ పాపం చన్ద్ర ఇవ రాహోర్ముఖాత్ప్రముచ్య ధూత్వా శరీరమకృతం కృతాత్మా బ్రహ్మలోకమభిసమ్భవామీత్యభిసమ్భవామీతి ॥1॥**

ఇక్కడ్నుంచి కొన్ని చెదురుమదురు భావాలను చెపుతున్నది ఉపనిషత్తు. వేదాంత శాస్త్రంలో వీటిని ఖిలఖండాలు అంటారు. ఈ ఖండంలో సగుణ బ్రహ్మ ఉపాసకుడు చేసే ప్రార్థన, ముఖ్యంగా మరణ సమయంలో చేసే ప్రార్థన, వస్తుంది. మరణ సమయంలోనే చేయాలని కాదు, ఎల్లప్పుడూ చేయవచ్చు.

**హిరణ్మయేన ప్రాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్।**
**తత్త్వం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టేు। - ఈశావాస్య**

ఈశావాస్యలో కూడా ఉపాసకుడు చేసే అందమైన ప్రార్థన ఇది.

దహరవిద్యలో, ఉపాసకుడు అష్టగుణ బ్రహ్మ ఉపాసన చేస్తే, శుక్లగతి ద్వారా బ్రహ్మలోకానికి వెళతాడు అని చూశాము.

**శ్యామాచ్ఛ బలం ప్రపద్యే–** శ్యామః అనేది ఒక ప్రత్యేకమైన పదం. మామూలుగా శ్యామ అంటే నలుపు లేదా చీకటి. కాని ఇక్కడ శ్యామ అంటే బ్రహ్మ. హృదయాకాశంలో ఉన్న సగుణ బ్రహ్మ. ఆ బ్రహ్మను శ్యామ అంటున్నది ఉపనిషత్తు. బ్రహ్మను చీకటితో ఎలా పోలుస్తాము? శంకరాచార్యులు లేకపోతే (దాన్ని వివరించే పరమార్థానంద స్వామి గురువుగా లేకపోతే) ఉపనిషత్తులను అర్థం చేసుకోవటం కష్టం. బ్రహ్మను చీకటితో ఎందుకు పోల్చారంటే, మనుష్యులకు బ్రహ్మ ఉన్నట్టే తెలియదు. బ్రహ్మ గురించి తెలియదు. అందుకని బ్రహ్మ చీకటితో సమానం!

**యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ।**
**యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః॥ గీత-2- 69**

అక్కడ నిష పదం వాడితే, ఇక్కడ శ్యామ పదం వచ్చింది. ఎంతసేపూ

బాహ్యంగా పరుగులు తీసే మనుష్యులకు హృదయంలో బ్రహ్మ ఉన్నట్టు తెలియదు. అందుకని చీకటి.

నేను బ్రహ్మలోకం నుంచి మనుష్యజన్మను పొంది, ఈ లోకం వచ్చాను. ఇక్కడ బ్రహ్మ నా హృదయాకాశంలో ఉన్నాడు. ఈ హృదయాకాశం నుంచి నేను మళ్ళీ బ్రహ్మలోకానికి వెళ్ళాలి. శబలం అంటే అంతకు ముందు బ్రహ్మలోకంలో ఉన్న వాటి వర్ణన చూశాము కదా! అవి. బ్రహ్మలోకానికి వెళ్ళి క్రమముక్తి పొందాలి.

**శబలాచ్ఛ్యామం ప్రపద్యే –** శబలాత్ అంటే బ్రహ్మలోకం. శ్యామం ప్రపద్యే అంటే హార్థం బ్రహ్మకు (హృదయంలో ఉన్న బ్రహ్మకు) వచ్చాను. బ్రహ్మలోకం నుంచి మనుష్యజన్మకు వచ్చాను కాబట్టి, ఇప్పుడు మళ్ళీ మనుష్య జన్మ నుంచి వెనక్కి బ్రహ్మలోకానికి వెళ్ళాలనుకుంటున్నాను. నేను బ్రహ్మలోకం నుంచే వచ్చాను, అక్కడికే వెళతాను.

అది ఎలా సాధిస్తాను? ఉపాసన చేయటం ద్వారా పుణ్యం పొంది, పాపాన్ని తగ్గించుకుంటాను. పాపాన్ని తగ్గించుకునే మార్గానికి రెండు ఉదాహరణలను చూస్తాము.

**అశ్వ ఇవ రోమాణి విధూయ పాపం –** గుర్రం ఒక్కసారిగా రోమాలను విదిలించి, దుమ్ము దులుపుకున్నట్టుగా, నేను నా పాపాలనే దుమ్ము దులుపుకుంటాను. ఎలా? ఉపాసన అనే సాధన ద్వారా.

**చన్ద్ర ఇవ రాహోర్ముఖాత్ప్రముచ్య –** చంద్రుడు రాహువు కోరల నుంచి తప్పించుకున్నట్టుగా, నేను కూడా పాపాలనే రాహువు కోరల నుంచి తప్పించుకుంటాను.

**ధూత్వా శరీరమకృతం కృతాత్మా –** నా ప్రారబ్ధకర్మ ముగిశాక, ఈ శరీరం నుంచి విడివడ్డాక, నేను కృతాత్మను అవుతాను. అంటే ఉపాసన వల్ల శుద్ధ ఆత్మను అవుతాను. ఆత్మ శుద్ధి చెందదు, ఆత్మ నిత్య శుద్ధం. అంతఃకరణ శుద్ధి చెందుతుంది. అందుకని ఇక్కడ ఆత్మ అంటే మనస్సు, సూక్ష్మ శరీరం.

**(అకృతం) బ్రహ్మలోకమభిసమ్భవామీత్యభిసమ్భవామీతి–** అకృతమైన బ్రహ్మలోకానికి వెళ్ళాలి నేను. కృతం అంటే కార్యం. అకృతం అంటే అకార్యం. అకార్యం అంటే కారణం. నేను సర్వ జగత్తుకూ కారణమైన బ్రహ్మలోకానికి వెళ్ళాలి. దానితో ఉపాసకుని ప్రార్థన ముగిసింది.

## చతుర్దశః ఖణ్డః (14)

**ఆకాశో వై నామ నామరూమయోర్నిర్వహితా తే యదన్తరా తద్బ్రహ్మ తదమృతగ్ం స ఆత్మా। ప్రజాపతేస్సభాం వేశ్మ ప్రపద్యే యశోఽహం భవామి బ్రాహ్మణానాం యశో రాజ్ఞాం యశో విశాం యశోఽహమనుప్రాపత్సి స హాహం యశసాం యశః। శ్యేతమదత్కమదత్కగ్ం శ్యేతం లిన్దు మాభిగాం లిన్దు మాభిగామ్॥1॥**

ఈ మంత్రాలను అర్థం చేసుకోవటం చాలా కష్టం. నిఘంటువులో దొరికే అర్థాలు వీటికి వర్తించవు. శంకరభాష్యం లేనిదే అర్థం చేసుకోవటం కష్టం. (దాన్ని విడమర్చి చెప్పే పరమార్థానంద స్వామి బోధ లేకపోయినా కష్టమే). ఈ మంత్రం కూడా ఉపాసకుని ప్రార్థనే.

ఉపాసకుడు సగుణ బ్రహ్మ ఉపాసన దహరాకాశంలో చేశాడు. కారణ బ్రహ్మ మీద ఉపాసన చేశాడు. అందుకని ఉపనిషత్తు ముందు కారణ బ్రహ్మ నిర్వచనం ఇస్తున్నది.

**ఆకాశో వై నామ –** ఉపనిషత్తు బ్రహ్మను ఆకాశం అనేసింది ఇక్కడ. ఆకాశం బ్రహ్మ ఎలా అవుతుంది. లక్ష్యార్థం ద్వారా.

**ఆసమన్తాత్ కాశతే ప్రకాశతే ఇతి ఆకాశః॥**

ప్రకాశించేది ఆకాశం. అందువల్ల, అంటే ప్రకాశరూపం వల్ల, బ్రహ్మను ఆకాశం అంది.

**నామరూపయోర్నిర్వహితా –** నిర్వహిత అంటే సృష్టికర్త. నామరూపాత్మక ప్రపంచానికి సృష్టికర్త. పంచభూతాల్లో వచ్చే ఆకాశం కార్యం. ఇక్కడ సృష్టికర్త అంటున్నది ఉపనిషత్తు. ఇక్కడ ఆకాశాన్ని కారణ ఆకాశం అంటున్నది. కారణ ఆకాశం వేరు, కార్య ఆకాశం (భూత ఆకాశం) వేరు. ఈ కారణ ఆకాశాన్ని చిదాకాశం అంటారు.

**తే యదన్తరా తద్బ్రహ్మ–** అంతేకాదు, ఈ కారణ బ్రహ్మ స్థితికర్త కూడా. తే యదంతరా అంటే స్థితికర్త.

**తదమృతగ్ం స ఆత్మా–** భూతాకాశం కార్యం, అశాశ్వతం. కాని ఇక్కడ ఉపనిషత్తు ఈ ఆకాశం అమృతం అంటున్నది. అందువల్ల ఇక్కడ ఆకాశం అంటే బ్రహ్మ. స ఆత్మా అంటే కారణం బ్రహ్మే అన్ని జీవాలలో ఉంది. అది

సహజమే కదా! కార్యం అంతటా కారణం ఉంటుంది. ఇంతవరకూ కారణం బ్రహ్మనిర్వచనం వచ్చింది. కారణ బ్రహ్మ ఉపాసన జీవితాంతం చేసిన ఉపాసకుని ప్రార్థన వస్తుంది ఇప్పుడు. తన జీవిత చరమాంకంలో మళ్ళీ కారణ బ్రహ్మకు ప్రార్థన చేస్తున్నాడు. ఎందుకు? క్రమముక్తి కోసం! ఏమని ప్రార్థిస్తున్నాడు?

**ప్రజాపతేస్సభాం వేశ్మ ప్రపద్యే–** నేను బ్రహ్మలోకానికీ, రాజసౌధం లాంటి సభాప్రాంగణంలోకి వెళ్ళుదును గాక!

**యశోఽ హం భవామి బ్రాహ్మణానాం యశోరాజ్ఞాం యశో విశాం యశోఽ హ మను ప్రాపత్సి–** అక్కడికి వెళ్ళి బ్రహ్మజ్ఞానం పొంది, బ్రహ్మతో ఐక్యం పొందాలి.

ఇక్కడ ఇంకో కష్టమైన పదం యశః– యశః అంటే ఇక్కడ ఆత్మ. వేదమంత్రాల్లో ఒకచోట ఆత్మను యశస్సుగా వర్ణిస్తారు. యశస్సు అంటే కీర్తి. ఎవరికైనా కీర్తి ఎందువల్ల వస్తుంది? ఆత్మ లేదా బ్రహ్మ వల్లే.

ఎక్కడ కీర్తి ఉంటే, అది ఆత్మ వల్లే.

అందువల్ల ఆత్మకు యశః అనే బిరుదు వచ్చింది.

**తస్యనామ మహద్ యశః – మహానారాయణోపనిషత్తు**

అందుకని, ఈ మంత్రంలో ఈ ఉపాసకుడు నేను ఆత్మను అవుగాక (అవుగాక లక్ష్యార్థం తీసుకోవాలి) అంటున్నాడు. అంటే జ్ఞానం ద్వారా నేను ఆత్మను అని తెలుసుకోవాలి. ఎవరి ఆత్మ?

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, అన్ని జీవరాశులు. నేను ఈ స్థితిని పొందుగాక.

**స హాహం యశసాం యశః –** నేను కీర్తిమంతులలో కీర్తిమంతుడిని అవుగాక. జ్యోతిషాం జ్యోతి అని ముండకలో వస్తుంది.

## పంచదశః ఖణ్డః (15)

**తద్ధైతద్బ్రహ్మా ప్రజాపతయ ఉవాచ ప్రజాపతిర్మనవే మనుః ప్రజాభ్యః। ఆచార్యకులాద్వేదమధీత్య యథావిధానం గురోః కర్మాతి శేషేణాభిసమా వృత్య కుటుమ్బే శుచౌ దేశే స్వాధ్యాయమధీయానో ధార్మికాన్విదధదాత్మని సర్వేన్ద్రియాణి సంప్రతిష్ఠాప్యాహిగ్ం సన్సర్వభూతాన్యన్యత్ర తీర్థేభ్యస్స ఖల్వేవం**

**వర్తయన్యావదాయుషం బ్రహ్మలోకమభిసమ్పద్యతే న చ పునరావర్తతే న చ పునరావర్తతే ॥1॥**

అందమైన, ముగింపు మంత్రం. ఈ బోధ సాక్షాత్తూ భగవానుని నుంచే గురుశిష్య పరంపరగా వచ్చింది. ఇందులో రెండు సాధనలు ఉన్నాయి.

1.సగుణ బ్రహ్మ ఉపాసన- ఫలం క్రమముక్తి.

2. నిర్గుణ బ్రహ్మ జ్ఞానం- ఫలం సద్యోముక్తి, విదేహ ముక్తి.

ఈ అధ్యాయంలోనే ఈ రెండూ వచ్చాయి. ఏది ఎన్నుకోవాలో నిర్ణయం మీ చేతులలో ఉంది.

ఈ రెండు సాధనలూ పాటించటానికి అనువైన ఆశ్రమ ధర్మాలను విధించింది వేదం. ఈ ఆశ్రమ ధర్మాలు దశలవారీగా వస్తుంది. ఇవి క్రమముక్తికి కాని, విదేహ ముక్తికి కాని సోపానాలు. ఈ రెండూ చూస్తాము ఈ మంత్రంలో.

**తద్ధైతద్బ్రహ్మ ప్రజాపతయ ఉవాచ –** సగుణ బ్రహ్మ ఉపాసన, నిర్గుణ బ్రహ్మ జ్ఞానం – రెండూ బ్రహ్మ ప్రజాపతికి చెప్పాడు. 14 ప్రజాపతులు ఉన్నారు సృష్టి మొదట్లో.

**ప్రజాపతిర్మనవే –** ప్రజాపతి మనువుకు చెప్పాడు. మనమంతా మనుపుత్రులం అందుకే మానవులం అయ్యాము.

**ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్।**

**వివస్వాన్ మనవే ప్రాహ మనురిక్ష్వాకవేఽ బ్రవీత్ గీత 4-1**

**మనుః ప్రజాభ్య-** మనువు తన పిల్లలకు, తన శిష్యులకు చెప్పాడు. వారి ద్వారా మొత్తం మానవాళికి వచ్చింది.

ఇంతవరకూ గురుశిష్యుల పరంపర వచ్చింది. ఇప్పుడు ఇంత ప్రాచీన విద్యను ఎలా నేర్చుకోవాలో వస్తుంది.

**ఆచార్యకులాద్వేదమధీత్య –** గురుకులంకి వెళ్ళి వేద విద్యనభ్యసించాలి. గురుకులంలో లౌకిక విద్య, ఆధ్యాత్మికవిద్య – రెండూ నేర్పుతారు. గురుకులం గొప్పతనం అది. ఇది మొదటి దశ. దీన్ని బ్రహ్మచర్య ఆశ్రమం అంటారు. (ఇది మనం కలుపుకోవాలి)- వేద విద్యను ఎలా నేర్చుకోవాలి?

**యథా విధానం-** బ్రహ్మచర్యం నిష్ఠగా పాటిస్తూ నేర్చుకోవాలి.

**కాకచేష్టాబకోధ్యానం, శ్వాననిద్రా తథైవచ।**
**అల్పాహారీ గృహత్యాగీ, విద్యార్థీ పంచలక్షణమ్॥**

**గురోః కర్మాతిశేషేణ –** అంతేకాదు, దానితో సమాంతర రేఖలా, గురువుకు శుశ్రూష కూడా చేయాలి. అతి శేషేణ– మిగిలిన సమయంలో విద్యనేర్చుకోవాలి. వేదం అధీత్య అంటే వేదం నేర్చుకోవాలి. వేదం అంటే వేదాలు, వేదభాష్యం, పురుషార్థాలు అన్నీ నేర్చుకుంటారు. ఇక్కడిదాకా బ్రహ్మచర్య ఆశ్రమం గురించి వచ్చింది.

**అభిసమావృత్య కుటుబ్దే –** 12,15 సంవత్సరాల వేద అధ్యయనం తర్వాత సమావర్తనం చేస్తారు. రెండో ఆశ్రమంలోకి అడుగుపెడతారు. అది గృహస్థాశ్రమం. కుటుంబే అంటే గృహస్థాశ్రమం. గృహస్థాశ్రమంలోనే కర్మయోగం, పంచమహా యజ్ఞాలు సాధ్యమవుతాయి.

**శుచౌదేశే స్వాధ్యాయమధీయానః –** గృహస్థాశ్రమంలోకి అడుగుపెట్టాక, బాధ్యతలు, ధర్మాలు పెరిగిపోయి స్వాధ్యాయనంకు ఖాళీ సమయం దొరకదు. శుభ్రమైన ప్రదేశంలో కూర్చుని స్వాధ్యాయనం చేయాలి.

ఊరికే తిని, తాగి, కుటుంబాన్ని పోషించటమంటే జంతువులు కూడా చేస్తాయి. మనుష్య జన్మనెత్తినందుకు ధర్మం, మోక్షం కోసం పాటుపడాలి. దానికి సత్సంగం ఉండాలి.

**సత్సంగత్వే నిస్సంగత్వం – భజగోవిందం**

**ధార్మికాన్విదధత్–** దానితో సమానంగా పుత్రులను కని, వాళ్ళను ధర్మానికి కట్టుబడి ఉండేలా పెంచాలి. ఇది ఒక్క గృహస్థుడే చేయగలడు. నిజానికి గృహస్థాశ్రమం ఉద్దేశమే అది. ముందు తరానికి బాట వేయటం. ఇంతవరకూ గృహస్థాశ్రమం.

**ఆత్మని సర్వేన్ద్రియాణి సంప్రతిష్ఠాప్య–** ఇక్కడ్నుంచీ వానప్రస్థాశ్రమం. ఇంటినుంచి వనానికి వెళ్ళేవారు పూర్వం. ఇప్పుడు ఇంటిలోనే ఉన్నాకూడా, కర్మయోగం తగ్గించుకుని, ఉపాసనాయోగం, జ్ఞానయోగం వైపు దృష్టి మళ్ళించాలి. బాహ్యదృష్టిని అంతర దృష్టిగా మలచుకోవాలి. తినే ఆహారాన్ని భిక్షగా స్వీకరించాలి. అంటే ఆహారంలో రుచులు తప్పు పట్టకూడదు. ఇది వానప్రస్థాశ్రమం, సన్యాసాశ్రమానికి కూడా వర్తిస్తుంది. బాహ్యంగా

సన్యసించనఖ్ఖరలేదు; ఆంతర సన్యాసం స్వీకరించవచ్చు.
**అహిగ్‌సన్ససర్వభూతాని–** ఈ ఆశ్రమాలన్నింటిలో, ఏ ఆశ్రమంలో ఉన్నా కూడా. శాస్త్రంలో చెప్పిన విలువలను (అమానిత్వం, అదంభిత్వం, అహింస లాంటివి) పాటించాలి.
**అన్యత్ర తీర్థేభ్యః –** తీర్థం అంటే శాస్త్రం కొన్ని చోట్ల హింస చేయటానికి అనుజ్ఞ ఇచ్చింది. దీన్ని శాస్త్ర అనుజ్ఞత హింస అంటారు. ఉదాహరణకు ధర్మయుద్ధం. అలాంటిచోట తప్ప,మిగతా చోట అంతా అహింస పాటించాలి.
**సఖల్వేవం వర్తయన్ యావదాయుషం –** ఒక వ్యక్తి ఈ ఆశ్రమ నియమాలను పాటించి, సాధనలు చేసి, ఉపాసన చేసో, జ్ఞానం పొందితేనో ఏమవుతుంది? ఫలమేమిటి?
**బ్రహ్మలోమభిసమ్పద్యతే–** బ్రహ్మలోకానికి వెళ్తాడు. దీనికి రెండు అర్థాలు ఉన్నాయి.
సగుణ బ్రహ్మ ఉపాసన చేస్తే బ్రహ్మలోకానికి వెళ్ళి, క్రమముక్తి పొందుతాడు.
నిర్గుణ బ్రహ్మ జ్ఞానం పొందితే బ్రహ్మ చైతన్యంతో ఐక్యం పొంది– సద్యోముక్తి, విదేహముక్తి పొందుతాడు.
**న చ పునరావర్తతే –** ఏ విధంగా చూసినా బ్రహ్మలో ఐక్యం అవుతాడు. అందుకని వీళ్ళు జనన మరణవృత్తంలో పడి తిరగరు. మళ్ళీ తిరిగి రాడు.
**న చ పునరావర్తతే –** మళ్ళీ రెండోసారి చెప్పటం ఉద్దేశం ఇక్కడితో ఈ మంత్రం ముగిసింది. ఈ ఖండం ముగిసింది. ఈ అధ్యాయం ముగిసింది. పూర్తిగా ఈ ఉపనిషత్తే ముగిసింది.

## ఛాందోగ్యోపనిషత్తు సమాప్తం

# అధ్యాయం - 8 సారాంశం

**1-6 ఖండాలు** -సగుణ బ్రహ్మ ఉపాసన గురించి చెపుతాయి. సగుణ బ్రహ్మను అష్టగుణ విశిష్ట ఈశ్వరునిగా వర్ణించింది ఉపనిషత్తు. ఆ గుణాలు- అపహత పాప్మా, విజరః, విమృత్యుః, విశోకః, విజిఘత్సః, అపిపాసః, సత్యకామః, సత్యసఙ్కల్పః.

**7-12 ఖండాలు** - నిర్గుణబ్రహ్మ జ్ఞానాన్ని బోధిస్తాయి. దీన్నే దహరవిద్య అని కూడా అంటారు.

సగుణబ్రహ్మ నిర్గుణ బ్రహ్మ జ్ఞానాన్ని ఇంద్రునికీ, విరోచనునికీ బోధిస్తాడు. విరోచనుడు మొదటి దశలోనే ఆగిపోతాడు. ఇంద్రుడు నాలుగు దశల్లో నేర్చుకుంటాడు. అవి- అక్షిపురుషుడు, స్వప్నపురుషుడు, సుప్తపురుషుడు, ఉత్తమ పురుషుడు.
ఉత్తమ పురుషునికి ఇంకో పేరు తురీయం.

ఆత్మ = తురీయం.

ఈ అధ్యాయం ఎలా మొదలయిందో అలా ముగిసింది.

**స సర్వాగ్ంశ్చ లోకానాప్నోతి సర్వాగ్ంశ్చ కామాన్ యస్తమాత్మానమనువిద్య విజానాతీతి హ ప్రజాపతిరువాచ॥ 8 - 7 - 1**

సగుణబ్రహ్మ ఎవరైతే ఆత్మవిద్యపొందుతారో, వారు అన్ని లోకాలను, అన్ని కోరికలను పొందుతారు అని చాటింపు వేయించాడు. ఇంద్రుడు జ్ఞానం పొందాక, ఇవే పదాలను ఉపనిషత్తు వాడింది, జ్ఞాన ఫలం చెప్పటానికి.

**స సర్వాగ్ంశ్చ లోకానాప్నోతి సర్వాగ్ంశ్చ కామాన్ యస్తమాత్మానమనువిద్య విజానాతీతి హ ప్రజాపతిరువాచ ప్రజాపతిరువాచ॥ 8 - 12 - 6**

**13-15 ఖండాలను** ఖిలఖండాలు అంటారు. వాటిలో కొన్ని ఆధ్యాత్మిక సాధనలు వస్తాయి.

# శాంతిపాఠం

**ఓం ఆప్యాయన్తు మమాంగాని వాక్ప్రాణశ్చక్షుః శ్రోత్రమథో బలమింద్రియాణి చ సర్వాణి। సర్వం బ్రహ్మోపనిషదం మాఽహం బ్రహ్మ నిరాకుర్యాం। మా మా బ్రహ్మ నిరాకరోదనిరాకరణమస్త్వనిరాకరణం మేఽస్తు। తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సన్తు తే మయి సన్తు॥**

**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

ఛాందోగ్యోపనిషత్తు అధ్యయనం మొదలుపెట్టేముందు విఘ్నాలు లేకుండా చేయమని శాంతి పాఠం పఠిస్తాము. ఇప్పుడు అధ్యయనం నిరాటంకంగా సాగినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ మళ్ళీ శాంతి పాఠాన్ని పఠిస్తాము.

## - సర్వం శ్రీపరమేశ్వరార్పణమస్తు -

# అలవోకగా అద్వైతం

అద్వైతం అంటే ఏమిటి?

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా। జీవో బ్రహ్మైవ నా పరః॥**

ఈ విషయం తేలిగ్గా అర్థమయ్యేటట్టు రాబోయే మా **అలవోకగా అద్వైతం** అనే పుస్తకములో చెప్పబడింది.

అద్వైతంలో దేవుడూ, జీవుడూ ఒకటే అనగానే అహంకారం, గర్వం కలుగుతుందనే అపోహ ఉంటుంది. అద్వైతంలో ప్రవేశిస్తే విగ్రహారాధన చేయకూడదనుకోవటం, భక్తికి దూరమవుతాం అనుకోవటం లాంటి అపోహలెన్నో ఉన్నాయి. వీటన్నిటినీ తొలగిస్తూ అద్వైత ఆనందాన్ని ఇక్కడే, ఇప్పుడే అనుభవించడం ఎలాగో **అలవోకగా అద్వైతం** చెపుతుంది.

భక్తి పరాకాష్ఠే అద్వైతం. అంతటా దైవమే ఉన్నాడని నొక్కి మరీ చెపుతుంది **అలవోకగా అద్వైతం**. ఇది సమానత్వాన్ని, సర్వాత్మ భావాన్ని, ప్రేమతత్త్వాన్ని మరింతగా పెంపొందిస్తుంది.

జ్ఞానాదేవ కైవల్యం. మోక్షానికి అద్వైతమొక్కటే మార్గం. మరో దారి లేదు. దీనికి శాస్త్రమే ప్రమాణం. ప్రత్యక్షప్రమాణాలు, అనుమాన ప్రమాణాలకు అందదు అద్వైతం. అందుకని శాస్త్రానికి రావటానికి జంకుతారు కొందరు. కాని అద్వైతంలోని ముఖ్య సిద్ధాంతాలు అర్థమైతే దీనంత తేలికైనది మరొకటి లేదు.

కుండ – మట్టి, బంగారం – ఆభరణాలు, అల – సముద్రం లాంటి ఉదాహరణలతో వేదాంతాన్ని అందిస్తుంది శాస్త్రం. ఈ వేదాంతాన్ని గోరుముద్దలు చేసి **అలవోకగా అద్వైతం** పేరిట త్వరలో పుస్తకరూపంలో మీ ముందుకు తీసుకు రాబోతున్నాము.

అదెలా ఉంటుందో మీరు చదివి ఆస్వాదించాలని కోరుతూ ఒక అంశం ఇందులో చొప్పించాము. ముందు ముందు చదివి ఆనందించండి.

# కుండ - మట్టి

ఆరోజు నా జీవితంలో మరపురాని సుదినం. ఋషీకేశ్‌లో దయానందులు తనదైన శైలిలో హావభావాలతో మధ్య మధ్య హాస్యం మేళవిస్తూ, ఆసువుగా, అలవోకగా వేదాంతం బోధిస్తున్నారు. చేతిలోకి పక్కనే ఉన్న కుండని తీసుకున్నారు. దానికేసి ఎంతో తన్మయత్వంతో చూశారు. స్వామిజీ విశ్లేషణ నా జీవితాన్నే మార్చి వేసింది.

అంతకు ముందు అనేకమంది చేసిన వేదాంత బోధలు విన్నాను. అనేక పుస్తకాలు చదివాను. స్వామిజీ చక్కగా కుండను తీసుకుని చెపుతుంటే విషయం చాలా బాగా బోధపడింది. నా ఆనందానికి అవధులు లేవు. అటువంటి చతురత, చాకచక్యం స్వామిజీకే చెల్లింది. వారు అనన్య గురువులు. శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులు. అందుకే వారికి ప్రపంచమంతా శిష్యులయ్యారు.

వారు చెప్పింది నా బాషలో మీకు చెప్పటానికి ప్రయత్నం చేస్తాను. కుండ, మట్టి గురించిన విశ్లేషణ.

ఈ కుండ బరువు అరకిలో ఉందనుకుందాము. ఈ బరువు కుండదా? మట్టిదా? కుండది అంటే సరికాదు. మట్టి బరువే కుండ బరువు.

కుండ ఆకారం మట్టి నుంచి వచ్చిందా? కుండ నుంచి వచ్చిందా? కుండ నుంచే వచ్చిందంటే, మట్టి లేకుండా కుండేది? కుండకు ఆకారం ఏది? కాబట్టి మట్టి నుంచే దానికి ఆ ఆకారం వచ్చింది. అంటే బరువు కుండది కాదు! ఆకారం కుండది కాదు!!

ఇదిగో ఇది ఎర్రకుండ. సరే ఈ ఎర్రరంగు కుండదా? మట్టిదా? కుండది కానేకాదు. ఎర్రమట్టితో చేస్తే ఎర్రకుండ, నల్లమట్టితో చేస్తే నల్లకుండ

తయారవుతాయి. అంటే బరువు కుండది కాదు! ఆకారం కుండది కాదు!! రంగూ కుండది కాదు!!!

పోనీ నేను ముట్టుకుంటున్నది కుండేనా? మట్టిని ముట్టుకోకుండా కుండని ఎలా ముట్టుకుంటారండి? తమాషా చూడండి! మట్టిని ముట్టుకుని మీరు అదే కుండ అంటున్నారు. కానీ మీరు స్పృశించేది మట్టిని మాత్రమే!

మరి నేను చూసేదైనా కుండంటారా? నేనో ప్రశ్న అడుగుతాను సూటిగా సమాధానం చెప్పండి. మట్టిని చూడకుండా కుండని చూడగలరా? చూడలేరు. అంటే మీరు మట్టిని చూస్తూ కుండ అంటున్నారు. అది తప్పుకదా! ఇప్పుడు మీరు స్పృశించేది మట్టి! చూసేదీ మట్టే!!

ఇందులో, ఈ కుండలో నీరుపోసుకుని తాగుదాం. ఈ నీటి రుచి కుండదా? సారీ, అదీ మట్టినుంచి వచ్చింది. కొంచెం మట్టి రుచి కలిసింది. ఆ మట్టి వాసనే మీరు పీల్చేది. ఇప్పుడు మీరు స్పృశించేది మట్టి! చూసేదీ మట్టే!! రుచి చూసేదీ మట్టే!!! వాసనా మట్టిదే!!!!

పోనీ ఈ శబ్దం కుండదని అందమా? మీరు కుండ మీద కొట్టాననుకుంటున్నారు. మట్టిమీదే శబ్దం చేశారు. శబ్దం కూడా మట్టిదే. మీరు స్పృశించేది మట్టే! చూసేదీ మట్టే!! వాసన చూసేదీ మట్టే!!! రుచి చూసేది మట్టే!!!! శబ్దం వింటున్నదీ మట్టి నుంచే!!!!!

అంటే **కుండ స్పర్శ, రూపం, రసం, గంధం, శబ్దం అన్నీ మట్టివే.** మరి కుండ, కుండ అంటున్నారు కదా అదెక్కడుంది? అది మనో కల్పితమే. నామమాత్రమే. పదార్థంగా కుండలేదు! యథార్థంగా కుండలేదు. మట్టికి ఒక ఆకారాన్ని, ప్రయోజనాన్ని కల్పించి, ఆ మట్టికే మనం తగిలించిన పేరు కుండ. మన పంచజ్ఞానేంద్రియాలు మట్టినే చూపిస్తున్నాయి.

కుండ, మట్టి అని రెండు లేవు. కాదంటారా? సరే, అయితే మట్టిని ఇక్కడ వదిలేసి మీ కుండని మీరు తీసుకెళ్ళండి. మట్టి లేకుండా కుండను తీసుకు వెళ్ళడం వీలుకాలేదా? అంటే కుండ, మట్టి అని రెండు పదార్థాలు లేనట్టేగా!!!! ఉన్న మట్టే కుండలా కనిపిస్తున్నది.

ఈశ్వరుడే జగత్తు, ఈశ్వరుడే జీవుడు కూడా. ఎలా మట్టి కుండలా కనిపిస్తున్నదో, అలానే ఈశ్వరుడు జగత్తులాగా, జీవుడులాగ భాసిస్తున్నాడు. అన్నిటికి అధిష్ఠానంగా ఈశ్వరుడే ఉన్నాడు.

**వాచాఽఽరమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యం** అని దీన్నే ఛాందోగ్యంలో ఉద్దాలకుడు, శ్వేతకేతుకు వివరిస్తాడు. మన నోటినుంచి జాలువారిన ఒక పదమే కుండ. వాస్తవానికి కుండ లేదు. ఉన్నది మట్టి మాత్రమే.

ఈ విధంగానే ఇక్కడున్నదంతా ఈశ్వరుడే. ఈశ్వరుడు వినా అన్యం మరొకటిలేదు. ఈ సందర్భంలో ఈశ్వరుడు అంటే కైలాసవాసి అని కాదు. పరమాత్మ అని లేదా నిర్గుణ పరబ్రహ్మమే అని ఇక్కడ తీసుకోవాలి.

**దేశమంటే మట్టికాదోయ్**
**దేశమంటే మనుజులోయ్**

అన్నారు అలనాడు గురజాడవారు. కాని వేదాంతులు

**కుండంటే మట్టేనోయ్**
**మట్టి లేక కుండేలేదోయ్**

అంటారు. నిర్గుణ పరబ్రహ్మమే సత్తాగా ఈ జగత్తు అంతా ఉన్నాడు. పరబ్రహ్మ జగత్సారం. నామరూపాత్మక మైన జగత్తు నిస్సారమైనది.

**ఈశా వాస్యమిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్ ।**
**తేన త్యక్తేన భుఞ్జీథా మాగృధః కస్య స్విద్ ధనమ్ ॥**

దీనిని బాగా చింతన చేయండి. ఇక్కడ ఉన్న సమస్తము దైవమే అనే భావంతో చూడడం వల్ల మనకి అవ్యాజమైన ప్రేమతత్త్వం అలవడుతుంది.

వస్తుభేదం లేదు. అంటే జీవ – జీవ భేదం లేదు; జీవ – జగత్తు బేధం లేదు; జీవ – ఈశ్వర భేదం కూడా లేదు.

**సర్వం బ్రహ్మమయం జగత్।**
**ఏకమేవ అద్వితీయం బ్రహ్మ॥**

ప్రపంచం – నామరూపాత్మకంగా,కాల్పనికంగా అనేకం
ప్రపంచం – స్వరూపతః నిర్గుణ పరబ్రహ్మగా ఏకం

**యస్మిన్సర్వాణి భూతాన్యాత్మైవాభూద్విజానతః।**
**తత్ర కో మోహః కః శోక ఏకత్వమనుపశ్యతః॥**
**– ఈశావాస్యోపనిషత్తు**

**ప్రయోజనం –**

ఈ రకమైన సత్యమైన ఏకత్వభావన వల్ల భేద బుద్ధి తొలిగి, తారతమ్యాలు తొలిగి, సర్వత్ర సమదర్శనం ఏర్పడుతుంది.

****